# HISTORY OF INDIA
# (1526 TO 1761 A.D.)
## (DH21)
## (MA-HISTORY)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | భారతదేశము - ప్రజలు | 1.1 - 1.9 |
| 2. | ప్రాచీన భారతదేశ చరిత్ర ఆధారాలు | 2.1 - 2.6 |
| 3. | చరిత్ర పూర్వ యుగం | 3.1 - 3.7 |
| 4. | సింధు నాగరికత | 4.1 - 4.12 |
| 5. | ఆర్యుల నాగరికత | 5.1 - 5.13 |
| 6. | క్రీస్తు పూర్వము ఆరవ శతాబ్దము | 6.1 - 6.8 |
| 7. | జైన బౌద్ధమతాలు | 7.1 - 7.13 |
| 8. | విదేశీ దండయాత్రలు | 8.1 - 8.5 |
| 9. | మౌర్య సామ్రాజ్యం | 9.1 - 9.11 |
| 10. | అశోకుడు | 10.1 - 10.10 |
| 11. | కడపటి మౌర్యులు - సామ్రాజ్య పతనం | 11.1 - 11.7 |
| 12. | మౌర్యుల పరిపాలనా - సంస్కృతి | 12.1 - 12.13 |
| 13. | స్వదేశీ విదేశీ రాజవంశాలు | 13.1 - 13.13 |
| 14. | శాతవాహనులు | 14.1 - 14.9 |
| 15. | గుప్తుల యుగం | 15.1 - 15.8 |
| 16. | గుప్త సామ్రాజ్య విస్తరణ | 16.1-16.12 |
| 17. | చివరి గుప్తరాజుల - పతనం | 17.1 - 17.7 |
| 18. | గుప్తుల పరిపాలనా - సాంస్కృతిక ఆర్థిక పరిస్థితులు | 18.1 - 18.20 |
| 19. | దక్షిణాదిలో శాతవాహనానంతర రాజవంశాలు | 19.1 - 19.12 |
| 20. | పల్లవులు | 20.1 - 20.7 |
| 21. | పుష్యభూతి వంశము - హర్షవర్ధనుడు | 21.1. - 21.10 |
| 22. | ఉత్తర భారత రాజవంశాలు | 22.1 - 22.9 |
| 23. | దక్షిణ భారతదేశ రాజవంశాలు | 23.1 - 23.21 |
| 24. | మహమ్మదీయ దండయాత్రలు - ఫలితములు | 24.1 - 24.17 |

**ఖండిక - 1**

## పాఠం - 1

# భారతదేశము - ప్రజలు

### 1.0 లక్ష్యం :

భారతదేశ భౌగోళిక పరిస్థితులు, భారతీయులపై వాటి ప్రభావాన్ని తెలియచేయడం, భారత సంస్కృతి విభిన్న జాతులను ఎటుల ఐకమత్యంలో ఉంచగలిగిందో తెలుపుటయే ఈ పాఠం లక్ష్యం.

### విషయక్రమము :


1.1 ఉపోద్ఘాతము
1.2 పేరు
1.3 విస్తీర్ణత
1.4 భౌగోళికవిభాగాలు
1.5 హిమాలయ పర్వతశ్రేణులు
1.6 గంగా - సింధు మైదానము
1.7 దక్కను పీఠభూమి
1.8 తీరమైదానాలు
1.9 భారతదేశంపై భౌగోళిక పరిస్థితులప్రభావం
1.10 పర్వత శ్రేణులు - వాటి ప్రభావము
1.11 నదులు - వాటి ప్రభావము
1.12 సముద్రతీరము - దాని ప్రభావము
1.13 శీతోష్ణస్థితి
1.14 భారతప్రజలు - భిన్నత్వంలో ఏకత్వం
1.15 భిన్నత్వంలో ఏకత్వం
1.16 జాతులు - విభిన్నత - ఐక్యత
1.17 భాషాభిన్నత్వం - ఐక్యత
1.18 మతభిన్నత్వం - ఐక్యత
1.19 రాజకీయ భిన్నత్వం - ఐక్యత
1.20 సాంఘిక, సాంస్కృతిక భిన్నత్వం - ఐక్యత
1.21 ముగింపు
1.22 సారాంశం

## 1.1 ఉపోద్ఘాతం :

చరిత్రకు అనేకరాకాలైన నిర్వచనాలు కలవు. స్థూలంగా చరిత్ర మానవుడు పుట్టినప్పటి నుంచి అతని ప్రతి పనిని, ప్రతి ఆలోచనను పరిశీలిస్తుంది. మానవుని ప్రతి ముఖ్యమైన పురోగతిని, తిరోగతిని లిఖిస్తుంది. శాస్త్ర, కళ, సాహిత్య, తత్త్వ, వాస్తు శాస్త్ర సాంఘిక, రాజకీయ, యుద్ధ, మత, న్యాయ రంగాలలో సంభవించిన పరిణామాలన్నింటిని మూల్యాంకనము చేయటానికి ప్రయత్నిస్తుంది. ప్రత్యక్షంగానూ, పరోక్షంగా మానవుడిని ప్రభావితం చేసిన ప్రతి విషయాన్ని వీలైనంత పరిపూర్ణంగా చిత్రీకరిస్తుంది.

ఒకదేశ చరిత్రకు భౌగోళిక పరిస్థితులకు అవినాభావ సంబంధము ఉంటుంది. చరిత్రపై భౌగోళిక పరిస్థితుల ప్రభావము ఎలా ఉంటుంది. మానవుడు పరిసరాల వల్ల ఎంతగానో ప్రభావితుడౌతాడు. అతని ఆకారము, క్రియలు, మానసిక వికాసము, భౌగోళిక ప్రభావం వలన చెప్పుకోదగినంత మేరకు ఆధారపడతాయి. భూమి ఉపరితలము నిరంతరము మారుతూనే ఉంటుంది. అట్లాగే మానవుని సాధారణ స్వభావం రూపొందుతూనే ఉంటుంది. భౌగోళికమైన ఉనికి, శీతోష్ణస్థితి కారకాలు నాగరికత వికాసంలో ప్రముఖపాత్ర వహిస్తాయి. ఒకదేశం అభివృద్ధి చెందాలన్నా మరియు అభివృద్ధి చెందకపోవటానికి ఆయా దేశ భౌగోళిక పరిస్థితులే కారణాలు కావచ్చును. ఈ సందర్భంలో రిచర్డ్ హక్లియత్ "సృష్టికి సూర్యచంద్రులు ఎట్టివారో, మానవునికి నేత్రములెట్టివో చరిత్రకు భూగోళ శాస్త్రము, కాల వివరణ శాస్త్రము అట్టివి" అని వివరించాడు. అందువలన భారతదేశ చరిత్రను పఠింపగోరే మనం ముందుగా భారతదేశ భౌగోళిక పరిస్థితులను గురించి తెలుసుకొనవలయును.

## 1.2 పేరు:

ఇండియా అను పేరు సింధు లేక ఇండస్ నది నుంచి ఏర్పడింది. ప్రాచీన చైనీయులకు ఇండియా షీన్-తు లేక సింధు అని తెలుసు. ఋగ్వేదంలో ఈ దేశం సప్త సింధుగా సంభోదించబడినది. డరయస్ చక్రవర్తి శాసనాలలో సింధు దాని ఉపనదులు ప్రవహించే ప్రదేశాన్ని హి(మ్)దు అనడం జరిగింది. ప్రసిద్ధ ఇతిహాస గ్రంథమైన మహాభారతం ప్రకారం భరతవర్షం అనేపేరు భరతుడు అనే రాజు భారతదేశాన్ని పరిపాలించడం వలన వచ్చినది అని చెబుతుంది.

గ్రీకు ఉచ్ఛారణలో హింద్ ఇండ్‌గా మారింది. మధ్యయుగంలో అరబ్, పారశీక దేశాలకు చెందిన మహ్మదీయ చరిత్రకారులు ఈ దేశాన్ని హిందుస్తాన్‌గా వ్యవహరించినారు. ఆధునిక యుగంలో బ్రిటీష్ పరిపాలనా ఫలితంగా ఉమ్మడి భారతదేశం ఆగస్టు 15, 1947 క్రీస్తు శకంలో భారతదేశం, పాకిస్తాన్ అను రెండు స్వాతంత్ర్య దేశాలుగా ఏర్పడినాయి. మరల పాకిస్తాన్ నుండి తూర్పు పాకిస్తాన్ విడిపోయి బంగ్లాదేశ్ అను స్వతంత్ర్య దేశం ఏర్పడింది.

## 1.3 విస్తీరనత :

దక్షిణాసియా భూభాగం మధ్య నుంచి హిందూ మహాసముద్రంలోకి చొచ్చుకొని వ్యాపించిన ఉపఖండం భారతదేశం. 3200 కి.మీ. తూర్పు పడమరలుగా 3000 కి.మీ. పొడవు, వెడల్పు భూభాగం గల దేశం. సుమారు 18 లక్షల చ. మైళ్ళు భారతదేశం సుమారు $8^0.37^0$ ఉత్తర అక్షాంశమున మధ్యను $67^0$ - $97^0$ తూర్పు రేఖాంశముల మధ్య ఉన్నది.

ఈ ఉపఖండమునకు ఎల్లలు ఉత్తరాన పెట్టని కోటలుగా హిమాలయ పర్వత శ్రేణులు, దక్షిణాన హిందూ మహాసముద్రము, తూర్పున అరేబియా సముద్రము, పడమర బంగాళాఖాతం. భారతదేశం ఆసియా ఖండంలో దక్షిణ మధ్యగా ఉన్నందువలన తూర్పు పశ్చిమ ఆసియా దేశాలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొనుటకు వీలుకలిగినది. అందువలననే ఐరోపా రాజ్యాల వారు వలస రాజ్యాలను ఏర్పాటు చేసుకొనుటకు భారతదేశాన్ని కేంద్రంగా ఏర్పాటు చేసుకున్నారు.

## 1.4 భౌగోళిక విభాగాలు:

భౌగోళిక స్వరూపాన్ని బట్టి భారతదేశాన్ని నాలుగు సహజ మండలాలుగా విభజించవచ్చు. 1) హిమాలయ పర్వత ప్రాంతము 2) ఆర్యావర్తము లేదా గంగా, సింధు మైదానము 3) దక్కన్ పీఠభూమి 4) తీర మైదానము.

## 1.5 హిమాలయ పర్వత శ్రేణులు :

మన దేశమునకు ఉత్తర సరిహద్దు నున్న పర్వత శ్రేణులు ఎల్లప్పుడు హిమము కప్పబడి ఉండుటచేత దానిని హిమాలయాలు అందురు. హిమాలయ పర్వత శ్రేణులు మనకు ఉత్తరమున పెట్టని గోడలు వలే విస్తరించి మనకెంతయో మేలు చేయుచున్నవి. హిమాలయాలు పశ్చిమాన బెల్జిస్తాన్ నుండి తూర్పున అస్సాం వరకు అర్ధచంద్రాకారంగా వ్యాపించినాయి. హిమాలయాలు మధ్య ఆసియా నుండి వచ్చు అతి శీతల వాయువులను అడ్డగించి భారతదేశమునకు సమశీతోష్ణస్థితిని యిచ్చుచున్నవి. హిమాలయాలు ప్రపంచంలో కెల్లా ఎత్తైన పర్వత శ్రేణులు. సుమారు 1500 మైళ్ళు పొడవు, 250 మైళ్ళు వెడల్పులలో వ్యాపించియున్నవి. యిందులో ప్రపంచంలో కెల్లా ఎత్తైన ఎవరెస్టు శిఖరం (8848మీ.) కలదు. ఈ పర్వత శ్రేణులు వాయువ్య భాగంలో హిందూకుష్, సులేమాన్, కీర్తార్ పర్వతాలు ఈశాన్య ప్రాంతంలో ఖాశీ, జయంతియా, పట్‌కామ్, తోషామ్, నాగా పర్వతాలు ఈ హిమాలయ శాఖలు.

కాశ్మీర్, హిమాచల ప్రదేశ్, సిక్కిం, అస్సాం, భూటాన్, నేపాల్ ప్రాంతాలు ఈ హిమాలయాల ప్రాంతాలలోనివి. ఈ ఎత్తైన పర్వత శ్రేణులు విదేశ దాడుల నుండి మన దేశమును చాలావరకు రక్షించినవి. ఈ పర్వతాలు దుర్భేద్యములని మన పూర్వీకులు ఉత్తర సరిహద్దు దేశం పట్ల శ్రద్ధ వహించలేదు.

సహజ సౌందర్యము కలిగిన హిమాలయములు చూసిన పూర్వపు కవులు, కళాకారులు ఉత్తేజితులైనారు. మహాకవి కాళిదాసు, హిమాలయములు దేవతల ఆత్మ సదృశ్యములు అని చెప్పినాడు. అటులనే భగవద్గీత యందు శ్రీకృష్ణుడు పర్వత శ్రేణులలో హిమాలయ అంతటి వాడని అతని ఔన్నత్యాన్ని చాటెను. యిందులో కైలాసగిరి, మానవ సరోవరం, బధరీనాధ్, కేదార్‌నాద్, జ్వాలాముఖి, హరిద్వార్ మున్నగు పుణ్యక్షేత్రాలెన్నియో కలవు.

## 1.6 గంగ - సింధు మైదానము :

ఉత్తర భారతదేశం లేక ఆర్యావర్తమని పిలువబడే భూభాగంలోని జీవ నదులు గంగా, సింధు, బ్రహ్మపుత్రలు. హిమాలయ పర్వతాల నుండి దక్షిణాన వింధ్య పర్వతముల వరకు విస్తరించిన మైదాన ప్రాంతాన్ని గంగా - సింధు మైదానం అంటారు. ఈ నదీ లోయలలోనే ప్రాచీన సంస్కృతులు పుట్టి పెరిగాయి. ఈ ప్రాంతము అంతా సారవంతమైనది. కావున ఇచ్చట జనసాంద్రత ఎక్కువేకాక ఐశ్వర్యవంతమైనది కూడ. గంగా - సింధు మైదానము భారతదేశ సంస్కృతిని, రాజకీయ పరిస్థితులను నిర్దేశిస్తాయి. ఈ భూభాగాన్ని ఆక్రమించిన రాజులు చరిత్రలో చక్రవర్తులుగా నిలిచిపోయినారు. ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకున్న తర్వాతే తురుష్కులు గాని, ఆంగ్లేయులు గాని దేశానికి సార్వభౌములయినారు.

## 1.7 దక్కను పీఠభూమి :

వింధ్య పర్వతాలకు దక్షిణంగా తూర్పు పశ్చిమ కనుమలకు మధ్యనున్న కృష్ణా, గోదావరి, కావేరి, తపతి, నర్మద మొదలగు నదుల పరివాహక ప్రాంతమే దక్కను పీఠభూమి. ఈ పీఠభూమి ప్రాంతము కఠిన శిలలతోను, ఎగుడుదిగుడుగా ఉండుటచేత వర్షపాతం తక్కువ. అందుచేత ఈ ప్రాంతము వ్యవసాయమునకు అనుకూలమైనది కాదు. ఈ ప్రాంత ప్రజల అలవాట్లు, సాంప్రదాయాలు, ఉత్తరభారతదేశ ప్రజల అలవాట్లు, సాంప్రదాయాలకు భిన్నంగా ఉంటాయి.

## 1.8 తీర మైదానాలు:

ఈ తీర మైదాన ప్రాంతాలు దక్షిణ భారత దేశమునకు సరిహద్దులు నిర్ణయిస్తాయి. తూర్పు, పశ్చిమ కనుమలకు, సముద్ర తీరమునకు మధ్య వున్న యిరుకైన మైదానములు ఈ తీరమైదానములు. ఈ మైదానములు సారవంతమైనవి. ఈ తీర మైదానములు తూర్పువైపు కృష్ణ , గోదావరి, కావేరి నదుల ముఖద్వారాలు కలవు. అందువలన పశ్చిమ తీర మైదానము కంటే తూర్పు తీర మైదానము మిగుల సారవంతమైనది.

## 1.9 భారతదేశంపై భౌగోళిక పరిస్థితుల ప్రభావం :

పైన చెప్పబడిన భారతదేశ భౌగోళిక అంశాలు భారత చరిత్రపైన ప్రజల జీవిత విధానంపైన ఉన్న ప్రభావాన్ని పరిశీలించుదాము. మనదేశ భౌగోళిక పరిమాణము ప్రపంచంలో ఏడవది. మరియు అగ్రరాజ్యమైన బ్రిటన్ కంటే 20 రెట్లు పెద్దది. సువిశాలమైన దేశము కాబట్టి మన దేశమును పరిపాలించిన చక్రవర్తులలో కనిష్కుడు, రాజేంద్రచోళునకు తప్ప మిగతా వారికి పర రాజ్యాలను ఆక్రమించాలను రాజ్యకాంక్ష లేదు.

## 1.10 పర్వతశ్రేణులు వాటి ప్రభావము :

భారతదేశంలో వున్న పర్వత శ్రేణులు భారతదేశ చరిత్ర గతిని నిర్దేశిస్తాయి. ముఖ్యంగా ఉత్తరాన హిమాలయ పర్వత శ్రేణులు, వాయువ్యమున హిందుకుష్ పర్వత శ్రేణులు, ఈశాన్య సరిహద్దు హిమాలయ పర్వత శ్రేణులు, వింధ్య పర్వతాలు మరియు తూర్పు పశ్చిమ కనుమలు. ఉత్తరాన వున్న హిమాలయాలు తూర్పు పడమరల దాదాపు 2400 కి.మీ. పొడవున వ్యాపించి ప్రపంచంలో కెల్లా అతి పొడవైన పర్వతశ్రేణులుగా గుర్తించబడ్డాయి. కీర్తార్, సునాయాన్, హిందూకుష్, కారాఖోరం పర్వతాలు కలిగిన ఈ పర్వతాల తోరణంలో ప్రపంచంలో కెల్లా ఎత్తైన శిఖరంగా పేరుపొందిన ఎవరెస్టు శిఖరం ఒక కలికితురాయి.

ఈ పర్వతాలు విదేశీ దండయాత్రల నుండి దేశాన్ని రక్షించుటయే గాక ఉత్తర దిశ నుంచి వీచే ఎడారి గాలుల నుంచి ఉత్తర భారతాన్ని రక్షిస్తున్నాయి. ఈ పర్వత శ్రేణులు ఎల్లప్పుడు మంచుచేత కప్పబడి ఉండుటచేత ఈ పర్వతాలలో పుట్టి ప్రవహించే గంగా, సింధు, బ్రహ్మపుత్ర నదులవలన ఉత్తర భారతదేశం సారవంతమైనదిగా, సస్యశ్యామలమైనదిగా, ఐశ్వర్యవంతమైనదిగా గుర్తించబడినది. హిమాలయములు ఆది మానవులకు ఆటపట్టు. ఇప్పటికి ఆదిమ జాతి వారు నివసించుచున్నారు. ఉదా : ఘుర్కులు అనే జాతి వారు దృఢకాయులు. ఈ ప్రాంతాలలో గల అడవులలో అపారమైన ఖనిజ, వృక్ష, జంతు సంపద కలదు. యిందులో అతివిలువైన టేకు, ఫర్, ఫైన్ వృక్షములు కలవు. ఫర్, ఫైన్ వృక్షముల నుండి మెత్తని కలప లభించును. ఇన్ని విధాల దేశ సౌభాగ్యానికి కారణాలైన ఈ హిమాలయ పర్వతాల పట్ల ప్రాచీనులు వాటిని తమ భాగ్యదేవతల నివాసాలుగా భావించి ఆరాధించుటలో అతిశయోక్తి లేదు.

భారతదేశానికి వాయువ్య సరిహద్దున హిందూకుష్, సులేమాన్ పర్వత శ్రేణులు కలవు. యిందున్న కైబర్, బోలాన్, హోంచి, గోమర్, ముల్లా మొదలగు కనుమలు వాణిజ్య రహదారులుగా ఏర్పడినాయి. కాని అవే కాలక్రమేణా విదేశీయులు వీటి ద్వారా భారతదేశంపై దాడిచేసి సామ్రాజ్యాలు ఏర్పాటు చేసుకొనుటకు దోహదపడినాయి. వీటి ప్రభావం వలన భారతదేశ చరిత్ర గతిని మార్చిన జీలం, స్థానేశ్వరం, పానిపట్టు యుద్ధాలు జరిగినాయి. ఈ రహదారుల ద్వారా జరిగిన విదేశీ వ్యాపారం వల్ల జరిగిన లాభం కంటే భారతదేశానికి ఎక్కువ నష్టం ఏర్పడినది. సిరి సంపదలతో తులతూగుతున్న భారతదేశ సంపదను ఈ రహదారుల ద్వారానే తరలించబడినది. వీటికంటే ఈశాన్య సరిహద్దున వున్న హిమాలయ పర్వత శ్రేణులు దుర్భేద్యమైనవి. ఈ శ్రేణులలోని చిన్న చిన్న కనుముల ద్వారా మన సంస్కృతి తూర్పు రాజ్యాలకు విస్తరించెను.

భారతదేశాన్ని భౌగోళిక పరంగా ఉత్తర భారతదేశమునకు, దక్షిణ భారతదేశమునకు సరిహద్దుగా నిలిచినవి వింధ్య పర్వతములు. ఈ పర్వత శ్రేణులు ఎత్తును కలిగి దట్టమైన అడవుల చేత నిండివున్నవి. వీటివలన భారత సంస్కృతి ఉత్తర భారతదేశ సంస్కృతి,

దక్షిణ భారతదేశ సంస్కృతి అను రెండు విభిన్న సంస్కృతులుగా నెలకొల్పబడినాయి. ఆనాడు సరియైన రహదారులు లేకపోవుట చేత ఉత్తర భారతదేశ సంస్కృతికి, సామ్రాజ్యాల విస్తరణకు వింధ్య పర్వతములు అడ్డుగా వుండుటచేత దక్షిణ భారతదేశంలోని ద్రావిడ సంస్కృతి కొన్ని శతాబ్దాలుగా సురక్షితంగా వున్నది. అంతేగాక సువిశాలమైన దక్షిణ దేశ సామ్రాజ్యాలు ఏర్పడుటములోను తూర్పు కనుమల కంటే పడమటి కనుమలకే చరిత్రలో ప్రాధాన్యత కల్పిస్తుంది. ఈ ప్రదేశములో వున్న దట్టమైన అడవులు, లోతైన లోయలు, వేగంగా ప్రవహించే నదులు ఆనాటి ప్రజలను శత్రువుల నుండి కాపాడే రక్షక కోటలైనాయి. వీటి ఆధారంగానే మొగలు సామ్రాజ్య ప్రభావం నుండి శివాజి హైందవ సంస్కృతిని కాపాడి మధ్యయుగ చరిత్రలో ప్రముఖపాత్ర వహించినాడు. కె.యం. ఫణిక్కర్ "గంగానదీ ప్రాంతము విదేశీయుల పాలనలో హైందవ సంస్కృతి ప్రమాదం ఏర్పడినపుడు దక్షిణమున హైందవ సంస్కృతి బాగా చొచ్చుకొని యున్నది. హైందవ సంస్కృతి ఉత్తరమున ప్రమాదము ఏర్పడినపుడు దక్షిణమున త్రిమతాచార్యులు, విద్యారణ్య స్వామి, శివాజి మొదలగు వారు హైందవ సంస్కృతిని పునరుద్దరించుటకు కంకణము కట్టుకొనుట చారిత్రాక అంశము" అని అభిప్రాయపడినాడు.

## 1.11 నదులు వాటి ప్రభావము :

భారతదేశంలో ప్రవహించే నదులకు చారిత్రక ప్రాధాన్యం కలదు. ఉత్తర భారతదేశంలో నున్న సింధు, గంగ, బ్రహ్మపుత్ర నదులు చాలా ముఖ్యమైనవి. భారతదేశ తొలి నాగరికత అయిన మొహంజొదారో, హరప్పాలు సింధునదీ పరివాహక ప్రాంతాలలో ఉద్భవించినాయి. అలాగే వేద కాలపు నాగరికతలో ఈ సింధు, గంగా మైదాన ప్రాంతాలలో ఆర్యులు తమ సంస్కృతిని విస్తరింపచేసినారు. ఈ నదుల పరివాహక ప్రాంతము సారవంతమగుట చేత ఈ ప్రాంతమును పరిపాలించిన మౌర్యులు, గుప్తులు, పుష్యభూతి వంశాలు, ప్రజలకు భోగభాగ్యాలు, సిరిసంపదలను, మంచి పరిపాలనను అందించగలిగినారు. గొప్ప గొప్ప పట్టణాలను నిర్మించారు. ఉదా: ఢిల్లీ, ఆగ్రా, పాటలీపుత్రము, కాశీ, అలహాబాదు మొదలగునవి. విశేష సిరిసంపదలతో తులతూగుతున్న ఈ ప్రాంతములు విదేశీయుల దండయాత్రలకు గురిఅయినాయి. మహమ్మదీయులు, ఆంగ్లేయులు భారతదేశాన్ని జయించి పరిపాలన చేసినారు.

గోదావరి, కృష్ణ, కావేరి దక్షిణభారతదేశంలో ప్రవహించే ముఖ్యనదులు. ఈ నదులు దక్షిణ భారతదేశమును నాలుగు ముక్కలుగా విభజించుటచేత దక్షిణ భారతదేశము రాజకీయ ఐక్యతకు నోచుకొనలేదు. దక్షిణ భారతంపై ఆధిపత్యంకై బహమనీలు, విజయనగర రాజులు నిరంతరము పోరు సల్పినారు. ప్రాచీన యుగంలో శాతవాహన, పల్లవ, చోళ, చాళుక్య సామ్రాజ్యాలు ఉదయించి తమతమ ఆధిక్యతను తెల్పుకుంటూ దక్షిణదేశ సంస్కృతిని కాపాడినారు.

## 1.12 సముద్రతీరము దాని ప్రభావము :

భారతదేశము ద్వీపకల్పము అని పిలుచుటకు ముఖ్య కారణము మూడు వైపుల సముద్రము ఒకవైపు భూమార్గము కలిగి ఉండుటమే. మూడువైపుల సుమారు 300 మైళ్ళ సముద్రతీరము కలదు. ప్రాచీన కాలము నుండి తూర్పు పశ్చిమ దేశాలతో నౌకామార్గాల ద్వారా వాణిజ్య సంబంధాలు కలవు. భారతదేశమును పరిపాలించిన రాజులలో విదేశాలపై దండయాత్ర చేయు ఆశ లేనందున ఈ సముద్ర మార్గమును కేవలము వ్యాపారమునకు మాత్రమే వినియోగించుకున్నారు. ఒక్క రాజేంద్ర చోళుడు మాత్రమే తన నౌకాదళంతో మలయ, జావా, సుమిత్ర దేశాల రాజులను జయించుట భారతదేశ చరిత్రలో ఒక విశేషము. ఈ సముద్ర తీరము దక్షిణాపథానికి దగ్గరగాను, ఉత్తరాపథానికి దూరంగా వున్నందున ప్రాచీన కాలము నుండి తీర ప్రాంతమంతా దక్షిణాపథ రాజుల ఆధీనంలోనే వున్నది. దక్షిణ ప్రాంత రాజులు నౌకాబలాన్ని అభివృద్ధి చేసుకొనకపోవుట చేత అనేక ప్రముఖ రాజ్యాలు పతనమైనాయి. ప్రపంచంలో అత్యధిక నౌకాబలం కలిగిన ఆంగ్లేయులు దీనిని ఆసరాగా భారతదేశాన్ని తమ నౌకాబలంతోనే వలస రాజ్యంగా చేసుకున్నారు.

## 1.13 శీతోష్ణస్థితి :

భారతదేశంలో విభిన్న శీతోష్ణస్థితులు కలవు. భౌగోళికంగా ఎక్కువ ప్రాంతము ఉష్ణమండలము, కొంత సమశీతోష్ణమండల ప్రాంతముంది. కొన్ని ప్రాంతాలలో ఎక్కువ వేసవి, ఉష్ణోగ్రత ఉంటే మరికొన్ని ప్రాంతాలలో చలి విపరీతంగా వుంటుంది. యిలాంటి

పరిస్థితులు వర్షపాతంలో కూడా కన్పించును. కొన్ని ప్రాంతాలలో ఎక్కువ వర్షపాతం, కొన్ని ప్రాంతాలలో తక్కువ వర్షపాతం ఈ ప్రభావం జనాభాపైన కూడా కన్పించుట చేత ఉష్ణమండల ప్రాంత ప్రజలు దుర్భరులు గాను, సన్నగాను ఉండిరి. మైదాన ప్రాంతాల ప్రజలు సుఖభోగపరాయణులుగా పర్వత ప్రాంత ప్రజలు కష్టజీవులుగా ధైర్యవంతులుగా వుందురు. దీనివలన అత్యధిక జనాభా కలిగిన భారతదేశం త్వరితగతిన అభివృద్ధి చెందలేక పోవుచున్నది.

ఈ విధంగా ప్రపంచంలోని మిగతా దేశాల వలే భారతదేశంపై కూడా భౌగోళిక ప్రభావం విస్తృతంగా వున్నది. దేశ ప్రజల ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, జీవన విధానం, ఆచారపు అలవాట్లను భౌగోళిక పరిస్థితులు నిర్దేశిస్తున్నాయని చెప్పినప్పటికి కొన్ని పరిమితులు కలవు. దేశ చరిత్రను పునర్నిర్మించుకొనుటకు భౌగోళిక పరిస్థితులు ఒక కారకాలుగానే తీసుకొనవలెను.

## భారత ప్రజలు - భిన్నత్వంలో ఏకత్వం

### 1.14 ఉపోద్ఘాతం :

భారతదేశం ఒక సువిశాలమైన ద్వీపకల్పం. ఉత్తర దక్షిణాలు షుమారు 3,200 కి.మీ పొడవు, తూర్పు పడమరలు 3,000 కి.మీ వెడల్పు కలిగి 33 మిలియన్ల చ.కి.మీ వ్యాపించి ఉంది. ప్రపంచ దేశాలలో అత్యధిక జనాభా గల దేశంగా మన భారతదేశం రెండవ స్థానాన్ని ఆక్రమించి ఉంది. భారతదేశాన్ని 'ఇండియా' అని 'హిందూ దేశం' అని కూడా వ్యవహరిస్తారు. భారతదేశానికి ఈ రెండు పేర్లు కూడా సింధు అన్న పదానికి రూపాంతరాలే.

### 1.15 భిన్నత్వంలో ఏకత్వం :

భారత దేశంలో వివిధ జాతుల మధ్య కనిపించే భిన్నత్వం ఒక ప్రత్యేక లక్షణంగా చెప్పు కొనవచ్చును. భారత దేశం అత్యధిక జనాభా, విశాలమైన భూభాగము కలిగినది కావటం చేత భౌగోళిక, సాంస్కృతిక విభిన్నతలను కలిగి ఉన్నది. కాని వివిధ మతాల, జాతుల సమ్మేళనం కలిగిన భారత దేశాన్ని చిన్న ప్రపంచంగా ఊహించవచ్చును.

**ఎ) భిన్నత్వం :-** భిన్నత్వం అన్నది భారత దేశంలో స్పష్టంగా భౌగోళిక పరిస్థితులలోను శీతోష్ణస్థితి పరిస్థితులలోను జాతి, భాష మతాల యందు, సాంఘిక రంగాలలోను కనిపించును.

**బి) ఏకత్వం :-** పైన చెప్పిన విధంగా భారతదేశంలో ఎన్నో భిన్న దృకృధాలు ఉన్నప్పటికి సమైక్యతా భావం అనేది భారత దేశంలో ప్రబలంగా నాటుకొని ఉంది. అనాదిగా అనేక జాతుల వారు వచ్చి కలిసి మెలిసి జీవించుట హిమాలయాల నుండి కన్యాకుమారి వరకు ప్రజల భౌగోళిక , రాజకీయ, సాంస్కృతిక, మత, భాషా సమైక్యతను సాటి చెప్పటం విశిష్టమైన లక్షణం

**భౌగోళిక అంశాల - భిన్నత్వం - ఐక్యత :-** భారత దేశ భౌగోళిక అంశాలు క్షుణ్ణంగా గమనించినట్లయితే మనకు పూర్తిగా వైరుద్యం గల అంశాలు కూడా కనిపిస్తాయి. ప్రపంచలో గల ఎత్తైనవీ సంవత్సరమంతా కూడా మంచుతో కప్పబడి ఉండే హిమాలయ పర్వతాలు, అడవులు, లోయలు, ఎడారులు, సారవంతమైనటువంటి మైదానాలు, విభిన్న శీతోష్ణస్థితులు మొ॥న భౌగోళికాంశాలు అన్ని ఒక్క భారత దేశంలోనే చూడగలం. అందువలన భారత ఉపఖండం ప్రపంచ సంగ్రహ రూపం అని ప్రసిద్ది కెక్కినది.

విభిన్న భౌగోళికాంశాలు ఉన్న భారతదేశం భౌగోళిక ఐక్యతను సాధించినది. మనకు ఉన్న సహజ సిద్దమైన ఎల్లలు భారత దేశాన్ని ఆసియా ఖండం నుండి వేరుచేసి ద్వీపకల్పంగా పిలువబడుట చేత భారతదేశంలో నివశించు ప్రజలు భారత దేశాన్ని కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు భారత దేశం అనే భావనతో ఉన్నారు.

## 1.16 జాతులు - విభిన్నత - ఐక్యత :

భారత దేశాన్ని వివిధ జాతుల ప్రదర్శనశాలగా అభివర్ణించారు. డా॥ బి.యస్ - గుహ అనే చరిత్రకారుడు భారతదేశ ప్రజలను ఆరు ప్రధాన జాతులుగా విభజించినాడు. అవేవనగా 1. నీగ్రోలు 2. ప్రోటో - ఆస్ట్రోలాయిండులు 3. మంగోలులు 4. ద్రావిడులు 5. పశ్చిమ -బ్రాకీ సెఫల్‌లు 6. నార్డిక్ జాతులు. వివిధ జాతులకు చెందిన ఈ ప్రజల శరీర అవయవాలలోగాని, ఆహారపు అలవాట్లలో గాని, ఎంతో భిన్నత్వం కలదు. ఉదా :- కాశ్మీరు ప్రజలు ఆజానుబాహులుగాను ఎరుపుగాను, అస్సాం ప్రజలు పొట్టిగాను పసుపు రంగు తోను ఉంటారు.

భారత దేశంలోనికి ఇండో ఆర్యులు, గ్రీకులు, సిధియన్‌లు, హూణులు, తురుష్కులు, కుషాణులు, మహమ్మదీయులు మొ॥గు వారు వచ్చి స్థిరపడినారు. ఒక్కొక్క జాతి ప్రజలు భారతీయ సాంఘిక పరిపక్వతకు వికాసమునకు తోడ్పడినారు. అంతేగాక భారతీయ సాంస్కృతిక పురోభివృద్ధికి, భాషాభివృద్ధికెంతో తోడ్పడినారు.

## 1.17 భాషా - భిన్నత్వం - ఐక్యత :

గీర్సన్ ప్రకారం ఇండియాలో 179 భాషలు, 544 మాండలికాలు ఉన్నాయి. భారత రాజ్యాంగంలోని 8 వ షెడ్యూలు 15 భాషలను గుర్తించింది. వాటిలో ముఖ్యమైనవి హిందీ, తెలుగు, కన్నడం, బెంగాలి, తమిళం, మళయాళం, గుజరాతి మొ॥నవి. దేవ నాగరి లిపి నుంచి రూపొందిన హిందీ భాషను అధికార భాషగా గుర్తించారు.

భారతీయ భాషా సముదాయాన్ని పరిశీలిస్తే వాటిలో ఒక క్రమ పద్ధతిలో కూడా ఏకత్వం అగుపిస్తుంది. భాషా సమైక్యత దేశ సమైక్యతకు ఎంతగానో దోహదం చేస్తుంది. అందువలన ప్రాచీన కాలం నుండి నేటి వరకు పరిపాలించిన రాజులు భాషా సమైక్యత ద్వారా దేశ సమైక్యతను సాధించినారు. అశోకుడు ప్రాకృత భాషను, గుప్తులు సంస్కృత భాషను, ముస్లింలు పారశీక భాషను, ఆంగ్లేయులు ఇంగ్లీషు భాషను రాజభాషలుగా చేసి భాషా సమైక్యతకు కృషి చేసినారు. అందువలననే భారత ప్రభుత్వం భాషా సమైక్యతను పెంపొందించుటకు హిందీ భాషను అధికార భాషగా చేసినది.

## 1.18 మత భిన్నత్వం - ఏకత్వం - ఐక్యత :

భారత దేశంలో హిందూ, ఇస్లాం, క్రైస్తవ మతాలు ప్రధానమైనవి. వీటితో పాటు బౌద్ధమతం , జైనమతం, జొరాష్ట్రియన్, శిక్కుమతాలు కూడా మనుగడ సాగిస్తున్నాయి. అంతేకాక ప్రతి మతం నందు ఎన్నో శాఖోపశాఖలు కలవు. ఉదా: హిందూ మతంలో శైవులు, వైష్ణవులు, జైనమతంలో శ్వేతాంబరులు, దిగంబరులు, బౌద్ధమతంలో హీనయానులు, మహాయానులు, క్రైస్తవ మతంలో కేథలిక్‌లు, ప్రొటస్టంట్‌లు మొ॥నవి. దేశం జనాభాలో 83% హిందువులు అయినప్పటికి భారతదేశాన్ని ఒకే మతానికి చెందిన దేశంగా పరిగణించబడుటలేదు.

భిన్న మతాలతో నివశిస్తున్న భారత ప్రజలు మతాలన్నింటి సారాంశం ప్రకారం భగవంతుడు ఒక్కడే. ఆయన సాన్నిధ్యము పొందుటయే మోక్షము అని తెలుసుకొని మత సామరస్యంతో, పరమత సహనాన్ని పాటించి జీవిస్తున్నారు. ఈ సామరస్య సాధనకే అశోకుని ధర్మం, అక్బరు దీన్-ఇ-ఇల్లాహి, స్వతంత్ర భారత రాజ్యాంగం కృషి చేయుట గమనార్హము.

## 1.19 రాజకీయ భిన్నత్వం - ఐక్యత :

భారతదేశంలో భౌగోళిక భిన్నత్వం ఉన్నందువలన రాజకీయ భిన్నత్వం కూడా ఏర్పడినది. ప్రాచీన మధ్య యుగాలలో భారతదేశంలో భౌగోళికాంశాలను బట్టి సామ్రాజ్యాలు చిన్నచిన్న రాజ్యాలు వెలిసినవి. మౌర్య చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు అక్బర్, మొ॥గు వారు

రాజకీయ పరంగా భారతదేశాన్ని సమైక్యత పరుచుటకు కృషిచేసినారు. అయితే దేశ ప్రజలలో అంతర్గత కలహాలు ఉండుట చేత మనలోని వారే భారతదేశాన్ని విదేశీయుల పాలనకు గురి చేసినారు ఉదా :- అలెగ్జాండర్ దాడిలో అంబిరాజు, గోరీ దండయాత్రలో జయచంద్రుడు మొ॥గు వారు. అంతేకాక వివిద వంశాల మధ్య అధికారం కోసం యుద్ధాలు జరిగినవి ఇలా ప్రతి రాజ్య వంశాల చరిత్రలను క్షుణ్ణంగా పరిశీలిస్తే వంశాల మధ్య, రాజ్యాల మధ్య రాజకీయ భిన్నత్వం కన్పిస్తుంది.

భారతదేశం ప్రాచీన కాలం నుంచి ఆధునిక యుగం వరకు వివిధ రాజ వంశాల పరిపాలనలో పరిపాలించబడినప్పటికి రాజకీయ సమైక్యత, జాతీయతా భావం భారతీయులకు తెలియనిది కాదు. ఉదా:- ఇతిహాస కాలంలో రాజకీయ ఐక్యతకు ధర్మరాజు చేసిన అశ్వమేధయాగాలు, మౌర్యుల కాలంలో చాణుక్యుడు చేసిన రాజనీతి, సముద్రగుప్తుడు చేసిన దండయాత్రలు. అక్బర్ చేసిన పరిపాలన విధానము మొ॥నవి రాజకీయ ఐక్యతకు ఉదాహరణలు.

## 1.20 సాంఘిక, సాంస్కృతిక భిన్నత్వం ఐక్యత :

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నివశిస్తున్న ప్రజల వేషములలో, ఆచార వ్యవహారములలో ఒక ప్రాంతానికి వేరొక ప్రాంతానికి ఎంతో తేడా కలదు. భారత ప్రజల సాంఘిక వ్యవస్థలో ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య మరియు ఉత్తరాది మరియు దక్షిణాదిలోని వివిధ రాష్ట్రాల మధ్య వేర్వేరుగా ఉంటాయి. ఆచార, సాంప్రదాయ వ్యవహారాల యందు ఒక ప్రాంతానికి మరొక ప్రాంతానికి వైరుధ్యం కనపడుతుంది. అలాగే సాంస్కృతిక విషయాలలో కూడా వ్యత్యాసాలు ఉన్నాయి.

వివిధ ఆచార సాంప్రదాయాలు ఉన్నప్పటికి భారతదేశంలో ఒక ప్రాంతం వారు వేరొక ప్రాంతపు వాసుల ఆచార సాంప్రదాయాలను గౌరవించడం భారతీయుల లక్షణం. అలాగే వివిధ సంస్కృతుల సమ్మేళనమే హిందూ మతం. హైందవ సంస్కృతి భారతీయులు ఎచ్చట ఉన్నా వారు భారతీయులేనని వారి ఆచార సాంప్రదాయాలు ఒకటేనని తెలుపుతుంది. భారతదేశం గర్వించ దగ్గ రామాయణ, మహాభారతాలు ఈనాటికి దేశంలోని ప్రతి మారు మూల పల్లెలలోని ప్రతి ఇంటిలోను భక్తి, శ్రద్ధలతో పఠిస్తారు. ఇవి భారతీయ సమైక్యతకు దోహదం చేసిన మహాకావ్యాలు. భారతీయ ఏకత భారతీయ సంగీతంలో కన్పిస్తుంది.

ప్రపంచంలో ఏ దేశంలోను లేనన్ని సంగీత పద్దతులు భారత దేశంలో కనిపిస్తాయి. మత, సాంఘిక, కళా జీవితాలలో సంగీతం ఈ దేశంలో ప్రధాన పాత్ర వహిస్తుంది.

## 1.21 ముగింపు :

భారతదేశంలో వివిధ రంగాలలో గల వైవిధ్యం మధ్య ఉన్న ఏకత్వాన్ని గురించి వివరించటమైనది. భౌగోళిక సాంఘిక, మత, భాష మతం, ఆచారం మొ॥గు వివిధ విషయాలలో ఎన్ని వైరుధ్యాలు కనిపించినప్పటికి సునిశితంగా పరిశీలించినట్లయితే హిమాలయాలు నుండి కన్యాకుమారి వరకు గల ప్రజల జీవన విధానంలో ఉన్న అంతర్లీనత భారతీయ భావం. దీనిని విడగొట్టి చూడలేము. ఇదే మన సోదరభావమునకు స్నేహశీలతకు నిదర్శనం.

## 1.21 సారాంశం :

భారతదేశ భౌగోళిక పరిస్థితులు, సహజమైన వనరులు, నదులు, సారవంతమైన, భూములు భారత ప్రజలపై ఎనలేని ప్రభావాన్ని చూపుతున్నాయి. భారతదేశం విభిన్న జాతులు, మతలు, భాషలకు నిలయమైనా భారత సంస్కృతి, సంప్రదాయాలు, భారతీయులను ఐకమత్యంతో మెలుగుటకు దోహదపడుతుంది.

## 1.23 మాదిరి ప్రశ్నలు

1. భారతదేశము యొక్క లక్షణాలను వివరించుము ?
2. భారతదేశంలోని భౌగోళిక విభాగాలు గురించి వ్రాయుము ?
3. భారతదేశమున పర్వతశ్రేణులు వాటి ప్రభావములు గురించి వ్రాయుము ?
4. ఇండియాలోని భిన్నత్వంలో ఏకత్వం గురించి చర్చించండి ?
5. భారతదేశములో గల నదులు వాటి ప్రభావము గురించి వివరించుము ?

## సంక్షిప్త ప్రశ్నలు

1. ఇండియాకు ఆ పేరు ఎలా వచ్చింది ?
2. దక్కను పీఠభూమి గురించి క్లుప్తంగా వ్రాయుము ?
3. హిమాలయ పర్వతశ్రేణులు గురించి వ్రాయుము ?
4. భాషాభిన్నత్వం, మత భిన్నత్వం - దాని ప్రభావము ?

**డా॥ కె. అజయ్ కుమార్**

### పాఠం - 2

# ప్రాచీన భారత దేశ చరిత్ర - ఆధారాలు

## 2.0. లక్ష్యం :

ప్రాచీన భారతదేశ చరిత్రను దేశ చరిత్రను పునర్నిర్మించటానికి గల స్వదేశీ విదేశీ ఆధారాలను వివరించి, వాటి ప్రాముఖ్యాన్ని తెలియచెప్పటమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం

## విషయక్రమం


2.1 ఉపోద్ఘాతం

2.2 ఆధారాల వర్గీకరణ

2.3 పురావస్తు ఆధారాలు

2.4 వాఙ్మయ లేక లిఖిత ఆధారాలు

2.5 విదేశీరచనలు

2.6 సారాంశం


## 2.1 ఉపోద్ఘాతం :

ఏదేశ చరిత్రనైనను పునర్మిర్మింప వలెనన్న లేక వ్రాయవలెనన్న ఆధారాలు ముఖ్యం. చరిత్ర అనేది ఒక విజ్ఞాన శాస్త్రం. అంతేగాని కేవలం ఊహలతో అల్లిన కట్టుకథ చరిత్ర కాదు. అసలు చరిత్ర అంటే ఏమిటి ? చరిత్రను చదవడానికి, వ్రాయడానికి, ప్రాచీన భారతదేశ చరిత్రకు గల ఆధారాలు ఏమిటి, ఆ ఆధారాలు అనేవి ఏ విధంగా విశదీకరించబడినాయి, చరిత్ర రచనకు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి అనేవి ఈ పాఠం యొక్క ముఖ్య అంశాలు. దురదృష్టవశాత్తు మన పూర్వికులకు చారిత్రక జ్ఞానం లోపించటం వలన సమగ్రమై నటువంటి భారత దేశ చరిత్ర కల్గిన గ్రంథాల్ని అందించలేక పోయినారు. దీనికి అనేకమైన కారణాలు కలవు. అందుకనే ఆల్‌బెరూనీ అనే మహ్మదీయ చరిత్రకారుడు "హిందువులు చారిత్రక విషయాలు యందు తగు శ్రద్ద వహింపరని, ఎవరు రాజ్య పాలకులైనను వారు కాలాను క్రమాన్ని వివరించటంలో నిర్లక్ష్యంగానే ఉంటారు" అని పేర్కొనెను.

(The Hindus do not pay much attention to the historical order of things and they are very careless in relating to the chornological succession of kings -Alberuni)

"చరిత్ర రచన పట్ల నిర్లక్ష్యమే మన సంస్కృతికి గొప్ప లోపమని" ఆర్.సి ముజుందార్ వర్ణించారు.

(One of the greatest defects of Indian culture is the aversion of Indians to writing history.- R.C. Mazumdar)

## 2.2 ఆధారాల వర్గీకరణ :

సరియైన చరిత్రకారులు ప్రాచీన కాలం నుండి లేకపోవటం వలన సువిశాలమైన భారతదేశ చరిత్రను ప్రపంచ నాగరికతలకు సరి సమాన మైనటువంటి భారతదేశ చరిత్రను పునర్నిర్మింప వలెనన్న అనేక రకాలైన ఆధారాలను సేకరించి పరిశీలించి క్రమబద్దీకరణ చేయవలెను. అందుకనే అనేకమంది చరిత్రకారులు ప్రాచీన భారతదేశ చరిత్ర ఆధారాలను రెండు భాగాలుగా విభజించినారు.

అవి : 1. పురావస్తు ఆధారాలు (Archaeological Sources) 2. లిఖిత లేక వాఙ్మయ ఆధారాలు (Literary Sources)

## 2.3. పురావస్తు ఆధారాలు :- (Archaeological Sources)

పురావస్తు శాస్త్రం అనగా పురాతనమైనటు వంటి వస్తువులను గురించి విశదీకరించే శాస్త్రం. రాతి పనిముట్లు, మట్టి పాత్రలు, లోహపరికరాలు, శాసనాలు, నాణేలు, శిల్పాలు, శిలాజాలు, శిధిలాలు మొదలగు వాటిని భౌతిక అవశేషాలు గా పేర్కొనవచ్చును. ఇవి భూమి పొరలలో కప్పబడి వుండి. యాధిచ్చికంగా గాని, త్రవ్వకాలు ద్వారా గాని బయట పడవచ్చు. ఇలా బయటపడిన పురావస్తు ఆధారాలను బట్టి, పురావస్తు శాస్త్రన్ని రెండు భాగాలుగా చేయవచ్చును.

1. చరిత్ర పూర్వ యుగపు పురావస్తుశాస్త్రం 2. చారిత్రక యుగపు పురావస్తు శాస్త్రం. చరిత్ర పూర్వ యుగానికి పురావస్తువులు మాత్రమే ఆధారం ఎందుకు అనగా ఈ యుగంలో మానవునికి చదవడం, వ్రాయటం తెలియదు. కాబట్టి వారు వాడి వదిలి పెట్టిన వస్తు సామగ్రియే మనకు ఆధారాలు. శిలాయుగం నాటి మానవ అవశేషాలను మినహాయించి చారిత్రక యుగానికి సంబంధించిన విషయాలను తెలియచేసేటటువంటి శాస్త్రం చారిత్రక యుగ పురావస్తు శాస్త్రం. ఈ యుగంలో మానవునికి చదవడం, వ్రాయడం తెలియును. ఈ శాస్త్ర పరిధిలోనికి శాసనాలు, నాణేలు, దేవాయాలు, కోటలు, భవనాలు, శిల్పాలు వస్తాయి. పైన చెప్పబడిన అంశాల ద్వారా లభ్యమయ్యే ఆధారాలు ద్వారా భారతదేశ చరిత్రను పునర్నిర్మించు కొనవచ్చును. కనుకనే భారతదేశ చరిత్రకు పురావస్తు శాస్త్రం పునాది అయినది. లిఖిత ఆధారాలలో మార్పులు చేర్పులు చేసుకోవడానికి ఎక్కువ అవకాశం ఉన్నది. కాని పురావస్తు ఆధారాలలో అట్టి మార్పులకు వీలుండదు. అందువలననే " వాఙ్మయ ఆధారాలు కంటే పురావస్తు ఆధారాలే అత్యంత విశ్వాసయోగ్యములు". (It is superior in authenticity to many written records -prof. .K.A.N. sastri) అని నీలకంఠశాస్త్రి వక్కాణించారు.

చరిత్ర రచనకు అత్యంత ప్రధానమైన పురావస్తు ఆధారాలను శాసనాలు, నాణేలు, భవన శిధిలాలుగా విభజించారు.

**2.3.1 శాసనాలు** :- ప్రాచీన భారతదేశ చరిత్ర పునర్నిర్మాణానికి శాసనాలు ముఖ్య ఆధారాలు. ఈ శాసనాలు కొండ రాళ్ళ మీద, శిలాస్తంభాల మీద ఇనుపస్తంభాల మీద, కొండ గుహలలో, దేవాలయ గోడల మీద, రాగి, కంచు, బంగారం రేకుల మీద వ్రాయడం జరిగినది.

భారతదేశంలో మొట్టమొదటి శాసనాలు వేయించిన ఘనత అశోకునికి చెందుతుంది. ఈ శాసనాలు అతని జీవిత పరిపాలనా విశేషాలు, అతని సామ్రాజ్య సరిహద్దులు, పొరుగు రాజ్యాలతో ఉన్న సంబంధ బాంధవ్యాలు తెలియచేస్తాయి. కాలక్రమేణ భారతదేశాన్ని పరిపాలించిన రాజులు ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, అనేక రకాలైన శాసనాలను వేయించినారు. మనకు లభ్యమయ్యే శాసనాలను చరిత్రకారులు పది రకాలుగా విభజించినారు. అవి ఏమనగా :- 1. పరిపాలనా శాసనాలు (Administrative) 2. ప్రశస్తి శాసనాలు (Eulogistic) 3. అంకిత శాసనాలు (Dedicative) 4. స్మృతి శాసనాలు (Commomarative) 5. దాన శాసనాలు (Donative) 6. వ్యాపార శాసనాలు (Commercial) 7. మంత్ర శాసనాలు (Magical) 8. మత శాసనాలు (Religions) 9.సాహిత్య శాసనాలు (literary) 10. విదేశీ శాసనాలు (Foreign)

ఈ శాసనాలు వివిధ లిపిలలో భాషలలో వ్రాయబడ్డాయి. ముఖ్యంగా, బ్రహ్మలిపి, ఖరోష్ఠి లిపి, దేవనాగరి, తెలుగు, కన్నడ, తమిళ లిపులలోను, సంస్కృతం, తమిళం, తెలుగు మొ॥గు భాషలలో వ్రాయబడినవి. రాప్సన్ పండితుడు చెప్పినట్లు " ఈ శాసనములు ఏ దేశమునకు ఏ కాలమునకు చెందినవో ఆ దేశ, ఆకాలము నాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులను తెలిసి కొనుటకు అవి అమూల్యమైన ఆధారములు (They supply most valuabl evidences to the political social and economic conditions of the period and the country to which they belong -Rapson)

ఉదాహరణకు పరిపాలనా శాసనాలు అయిన అశోకుని 14 వ రాతి పలక శాసనం, సోహగౌర, తామ్ర శాసనం, రుద్రదాముని జునాఘడ్ శాసనాలు రాజ ధర్మాలను, ప్రజాహిత చర్యలను, పరిపాలనను గురించి తెలియచెప్తాయి. ప్రశస్తి శాసనాలలో చక్రవర్తి జీవిత విశేషాలు, ద్విగ్విజయ యాత్రలు వర్ణించబడి ఉంటాయి. ఉదా:- ఖారవేలుని హాతిగుంఫా శాసనం, బాలశ్రీ నాసిక్ శాసనం, రెండవ పులకేశి ఐహోలు శాసనం మొ॥నవి. అంకిత శాసనాలలో దేవాలయ నిర్మాణాలు గురించి విగ్రహాల ప్రతిష్ఠాపన గురించి వివరిస్తాయి. స్మృతి శాసనాలు జనన మరణ విషయాలు తెలియజేస్తాయి. కల్యాణీ చాళుక్యులు, రాష్ట్రకూటులు, యాదవులు ఇలాంటి శాసనాలు వేయించినారు. మనకు లభించే శాసనాలలో ఎక్కువ భాగం దాన శాసనాలే. రాజులు పండితులకు, కవులకు, కళాకారులకు ఇచ్చే దానాలను ఇవి తెలియచేస్తాయి. అలాగే మిగతా శాసనాల ఆధారాలు లభ్యమయిన లిఖిత ఆధారాలు తోటి పోల్చి చూసినపుడు రాజ్య సరిహద్దులను నిర్ణయించడంలోగాని కాల నిర్ణయాలు చేయడంలో గాని రాత చరిత్రలో లేని రాజులు చరిత్ర మనుగడ చరిత్ర కాలగర్భాలలో కలిసి పోవటానికి అవకాశం ఉండదు.

**విదేశీ శాసనాలు :** విదేశాలలో లభ్యమైన శాసనాల వల్ల కూడా కొన్ని సందర్భాలలో భారతదేశానికి సంబంధించిన వివరణ ఉండవచ్చు. భోగజ్ కోయ్ శాసనంలో ఆర్యదేవతలైన ఇంద్ర, వరుణ, మిత్ర, అశ్వనీ దేవతల పేర్లు ఉన్నాయి. దీని వలన ఆర్యుల నివాసం గురించి కొంత సమాచారం తెలుస్తుంది.

**2.3.2 నాణేలు :** ప్రాచీన చరిత్రకు నాణేలు ముఖ్య ఆధారాలు. నాణేలు చరిత్ర మానవ చరిత్రతోనే ముడిపడి యున్నది. నాణేల చరిత్ర తెలుసుకోవడానికి పూర్వం మానవుడు తన ఆర్థిక అవసరాలను తీర్చుకొనుటకు వస్తువుల మార్పిడి పద్ధతి పై ఆధారపడ్డాడు. దీనినే వస్తు మార్పిడి విధానం లేక బార్టర్ సిస్టమ్ (Barter system) అంటారు. వేదకాలం నాటి ఆర్యులు గోవును ప్రమాణంగా పెట్టుకొనే వారు. ఈ పద్ధతి ఎంతో కాలంగా అమలు జరుపలేక పోయారు . ఆవుకంటే తక్కువ విలువగల వస్తువులు కొనవలసి వచ్చినప్పుడు సమస్యలు ఎదురయ్యాయి. ఇలాంటి పరిస్థితులలో నిష్క అనే బంగారు నాణేన్ని ఋగ్వేద కాలంలోను, మలివేద కాలంలో నిష్క, శతమాన, కార్షపణ అనే బంగారు నాణేలు వాడారు. ముఖ్యంగా ఇండో-బాక్ట్రీనియన్ గ్రీకురాజుల పరిపాలన కాలంలో నాణేల ముద్రణ బాగా అభివృద్ధి చెంది చక్కని నాణేలను ఉత్పత్తి చేయడం ప్రారంభమైనది. నాణేలను ముద్రించుటకు ప్రత్యేక టంకశాలలు ఉండేవి. మన దేశాన్ని పరిపాలించిన రాజులు బంగారం, వెండి, సీసము, ప్రోటీన్ మొ॥న లోహలతో నాణేలను ముద్రించి చెలామణి చేసినారు. వివిధ ప్రాంతాలలో జరిగిన పురావస్తు త్రవ్వకాలలో వివిధ రకాలైన నాణేలు లభించినాయి. ఈ నాణేలు చారిత్రక విషయాలును తెలియ చేయుటయే గాక ఒక క్రమ పద్ధతిలో చరిత్రను పునర్మిర్మించుటకు దోహదపడుతున్నాయి. ఒక ప్రాంతంలో దొరికిన నిధి, నిక్షేపాలను బట్టి ఆ రాజ్య సరిహద్దులు ఎంత వరకు వ్యాపించినవో చెప్పవచ్చును. నాణేల పైన చెక్కిన ప్రతిమలు, లాంఛనాలు, చిహ్నాలను బట్టి ఆయా కాలం నాటి మత పరిస్థితులును చెప్పవచ్చును. నాణెముల పై ఉన్న భాష, లిపిని బట్టి వివిధ కాలములు నిర్ణయించుట వీలగును. ప్రాచీన కాలంలో పరిపాలించిన రాజుల వ్యక్తిత్వంను, మనస్తత్వాన్ని తెలుసుకొనుటకు నాణెములే ముఖ్య ఆధారాలు. ఉదాహరణకు గుప్తుల కాలంలో సముద్రగుప్తుడు వేయించిన బంగారు నాణేలు పైన అశ్వమేధ, గజ, వీణ, గొడ్డలి మొ॥గు ప్రతిమలతో రాజు కలడు. కొన్ని నాణెముల వలన ఆయా దేశాల ఆర్థిక పరిస్థితులను విదేశ వ్యాపారాన్ని గురించి తెలుసుకొన వచ్చును. గుప్తుల కాలం స్వర్ణయుగం అని, దక్షిణ దేశమున దొరికిన రోమన్ నాణెముల వలన మన దేశమునకు రోమ్ దేశమునకు వర్తక వ్యాపారాలు జరుగుతున్నవి అని తెలియు చున్నది.

**2.3.3 నిర్మాణాలు లేక చిహ్నాలు :** చరిత్ర పూర్వయుగానికి, చారిత్రక యుగానికి ఆధారాలు అయిన పనిముట్లు మృణ్మయ పాత్రలు, ఆయుధాలు, శిల్పాలు, భవనశిధిలాలు, చిత్ర లేఖనం మొ॥నవి చరిత్రరచనకు ఎంతగానో ఉపయోగపడతాయి. బ్రిటిషు పరిపాలన కాలంలో 1906 లో లార్డు కర్జన్ కాలములో పురావస్తు సంపదను వెలికి తీయుటకు పురావస్తు శాఖ ఏర్పడినది. ఈ శాఖయే నాటి నుండి నేటి వరకు అనేక అన్వేషణలు, త్రవ్వకాలు జరిపి చరిత్రలో నూతన అధ్యాయాలను సృష్టించినది. ఉదాహరణకు 1922 లో సర్ జాన్ మార్షల్ ఆధ్వర్యంలో హరప్పా, మొహంజదారోల వద్ద త్రవ్వకాలు జరిపిన ఫలితంగా భారత దేశ చరిత్ర తిరిగి వ్రాయబడినది. మన దేశ నాగరికత వేదకాలపు నాగరికతతో గాక సింధులోయ నాగరికతతో ప్రారంభమయినట్లు తెలుస్తుంది. తక్షశిల, లోథాల్, నలంద, సారనాథ్, పాటలీ పుత్రం, హస్తినాపురం, నాగార్జున కొండ మొ॥న ప్రాంతాలలో జరిగిన త్రవ్వకాలు ఫలితంగా బయటపడిన అవశేషాలు ప్రాచీన చరిత్రను విశిదపరుస్తున్నాయి. అలాగే సాంచి, సారనాథ్, అజంతా, అమరావతి, దేవగిరి, మహాబలిపురం అలంపురి మొ॥గు ప్రదేశాలలో బయల్పడిన, స్తూపాలు, ఆలయాలు, కుడ్యవర్ణ చిత్రాలు ఆయాకాలాల నాటి మత, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు వివరించుచున్నాయి.

## 2.4 వాఙ్మయ లేక లిఖిత ఆధారాలు :

సమగ్రమైనటు వంటి ప్రాచీన భారతదేశ చరిత్రకు ముఖ్య ఆధారం వాఙ్మయ ఆధారాలు ఈ వాఙ్మయ లేక లిఖిత ఆధారాలను స్వదేశీయ, విదేశీ ఆధారాలు అని రెండు రకాలుగా విభజించవచ్చును. స్వదేశీయ ఆధారాలను తిరిగి మత పరమైన ఆధారాలు మతేతర ఆధారాలు అని రెండు రకాలుగా విభజించవచ్చును. ప్రాచీన భారతదేశంలో వెల్లివిరిసిన మతాలైన బ్రాహ్మణ లేక వైదిక మత గ్రంధాలు, జైనమత గ్రంధాలు, బౌద్ధమత గ్రంధాలను మతపరమైన గ్రంధ ఆధారాలు. మతేతర గ్రంధాలు రాజకీయ, ఆర్ధిక, సారస్వతమైన గ్రంధాలుగా పేర్కొన వచ్చును. విదేశీ ఆధారాలు, విదేశయాత్రికులు కవులు, మన దేశాన్ని సందర్శించి మన దేశమును గురించి వ్రాసిన గ్రంధాలను విదేశీ రచనలు అంటారు.

### 2.4.1 స్వదేశీ రచనలు :

**1) మత గ్రంధాలు - బ్రాహ్మణ మత గ్రంధాలు :** బ్రాహ్మణ మత గ్రంధాలలో ముఖ్యమైనవి వేదములు. ఋగ్వేదము, సామవేదం, యజుర్వేదం, అధర్వణ వేదం. ఋగ్వేదం నాలుగు వేదాలలో మొదటిది ప్రాచీనమైనది. ఆర్యుల తొలి చరిత్రను తెలుసుకొనుటకు ముఖ్య ఆధారం. తదుపరి రాయబడిన వేదాలు బ్రాహ్మణాలు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు ఆర్యుల సంస్కృతిలో రాజకీయ, సాంఘిక, ఆర్ధిక, మత పరిస్థితులు తెలియచేస్తు వారు ఎట్లా విస్తరించినారో మనకు వివరిస్తున్నవి.

సుప్రసిద్ధ ఇతిహాసములైన మహా భారతం, రామాయణం చరిత్రకు చాలా విలువైనవి. మహాభారతం కౌరవ పాండవుల మధ్య జరిగిన సంఘర్షణలను వివరిస్తూ ఆనాటి రాచరిక పరిస్థితులను తెలియచేయును. రామాయణం ప్రాచీన కాలం నాటి సాంఘిక వ్యవస్థకు ఆయువు పట్టు. అలాగే అష్టాదశ పురాణాలు ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు ముఖ్య ఆధారాలు. ఈ 18 పురాణాలలో విష్ణు పురాణం మౌర్యుల గురించి, మత్స్య పురాణం ఆంధ్ర శాతవాహనుల గురించి, వాయు పురాణము గుప్తుల గురించి వివరిస్తున్నాయి. ఇలా ఈ పురాణాలను చరిత్రకారుడు చరిత్రను సమగ్రమైనటు వంటి రచన చేయడానికి ఉపయోగించుకుంటాడు.

**2.4.2 బౌద్ధ మత గ్రంధాలు :-** క్రీ॥ పూ॥ 6 వ శతాబ్దంలో జరిగిన మత పరిస్థితుల ప్రభావం వలన భారత దేశంలో బౌద్ధ, జైన మతాలు ఉద్భవించినాయి. బౌద్ధమత స్థాపకుడు గౌతమ బుద్ధుడు. బౌద్ధమత ప్రామాణిక గ్రంధాలలో త్రిపీటకములు ముఖ్యమైనవి. అవి వినయ, స్తుత, అభిధమ్మ పిటకములు. అట్లే బుద్ధుని జీవిత విశేషాలను తెలియ జేసే 549 జాతక కధలు రూపొందించబడ్డాయి. బౌద్ధమతానికి సంబంధించిన గ్రంధాలు, జాతక కధలు ప్రాచీన భారతంలోని క్రీ॥పూ 6,5, శతాబ్దం కాలం నాటి రాజకీయ, సాంఘిక, మత పరిస్థితులు తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. అట్లాగే మిళిందపన్హ అను గ్రంధము (బాక్ట్రియన్ రాజగు మినాండర్‌కు,

బౌద్ధాచార్యుడగు నాగసేనునకు జరిగిన సంభాషణ) అశోకుని తరువాత కాలం నాటి రాజకీయ మత విషయాలను గూర్చి తెలియ చేయును. ప్రసిద్ధ బౌద్ధమతాచార్యులైన వసుమిత్రుడు, అశ్వఘోషుడు, ఆచార్య నాగార్జునుడు వ్రాసిన గ్రంధాలైన మహావిభాష శాస్త్రం, బుద్ధ చరిత్ర, సుహృ ల్లేఖ మొ॥న గ్రంధాలు ప్రాచీన భారత దేశ చరిత్ర రచనకు ఉపయోగపడతాయి.

**2.4.3 జైన మత గ్రంధాలు :-** జైనమతం బౌద్ధ మతం కంటే ప్రాచీనమైనది అని జైనుల విశ్వాసం జైన మత గురువులను తీర్థంకరులు అంటారు మొదటి వాడు ఋషభ నాధుడు 23 వ తీర్థంకరుడు పార్శ్వనాధుడు 24 వ తీర్థంకరుడు వర్థమాన మహావీరుడు. మొత్తం తీర్థంకరులు 24 మంది కలరు. జైనమత ప్రామాణిక గ్రంథాలను ద్వాదశాంగాలు అంటారు. ఈ ద్వాదశాంగాలు జైన మత సిద్దాంతాలను, మహావీరుని బోధనలను, మహావీరుని కాలంనాటి సామాజిక పరిస్థితులను, రాజ్యాలను గురించి తెలియజేయును. అలాగే భద్ర బాహుని కల్ప సూత్రాలు మరియు ఆవశ్యక సూత్రాలు క్రీ.పూ 4 వ శతాబ్దం నాటి రాజకీయ, మత, పరిస్థితులను, శకుల దండయాత్రలను గురించి వివరిస్తాయి.

**2.4.4 మతేతర గ్రంధాలు :-** ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు ఆధారాలైన మతేతర గ్రంధాలను చారిత్రక లేక రాజకీయ గ్రంధాలు అని (Historical works) 2. చారిత్రేతర లేక సారస్వత గ్రంధములని (Non Historical works) రెండుగా విభజించవచ్చును. చారిత్రక గ్రంధాలు ఎక్కువగా రాజుల జీవిత చరిత్రలను వారి కాలం నాటి సాంఘిక, ఆర్థిక స్థితిగతులను వివరించుచున్నవి. ఇలా చారిత్రక విలువ గల గ్రంధాలలో ముఖ్యమైనది కౌటిల్యుడు వ్రాసిన అర్ధశాస్త్రము. ఇది రాజనీతి శాస్త్రము. ఇది మౌర్య చంద్రగుప్తుని కాలంనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులను తెలియజేయును. కల్హణుడు వ్రాసిన రాజతరంగిణి కాశ్మీర్ రాజుల చరిత్రను తెలుసుకోవడానికి ఎంతో దోహదపడుతుంది. అలాగే రాజుల జీవిత చరిత్రలను కూడా వివరించు గ్రంధాలు అనేకం కలవు. ఉదా:- బాణుని హర్ష చరిత్ర జయసింహుని కుమార పాల చరిత్ర, బిల్హాణుని విక్రమాంక దేవ చరిత్ర, వాక్పతి గౌడవహో, చాంద్‌బర్దాయ్ పృధ్వీరాజరాసో మొ॥నవి. హాలుని గాధా సప్తశతి, గుణాఢ్యుని బృహత్కథ, సంగమ వాఙ్మయం ఆళ్వారులు, నాయనారులు రచించిన రచనలు ప్రాచీన భారత దేశ చరిత్ర రచనకు మిక్కిలి సహాయపడును. చారిత్రేతర లేక సారస్వత గ్రంధాలుగా గుర్తించబడిన పాణిని, అష్టాధ్యాయి, పతంజలి, మహాభాష్యం, గార్గి, సంహిత మొ॥గు వ్యాకరణ గ్రంధాలతో పాటు ఆనాటి ప్రాచీన కవులు, రాజులు మతాచార్యులు అయిన బాణుడు, కాళిదాసు, విశాఖదత్తుడు, శూద్రకుడు, దండి, అశ్వఘోషుడు, హర్షుడు, మొ॥గ వారు రచించిన రచనలు కూడా చరిత్ర రచనకు ఉపయోగపడతాయి.

## 2.5 విదేశీ రచనలు :

భారతదేశాన్ని సందర్శించిన విదేశీయులు ఆయా కాలం నాటి సాంఘిక, ఆర్ధిక, రాజకీయ, మత పరిస్థితులను మరియు తమ అనుభవాలను తమ రచనల యందు పొందు పరిచినారు. అలాంటి వాటిలో ముఖ్యమైనవి 1. గ్రీకు రోమన్ రచనలు 2. చైనీయుల రచనలు, 3. అరబ్బు రచనలు

**2.5.1 గ్రీకు రోమన్ రచనలు :** పశ్చిమ దేశాలకు భారతదేశాన్ని గురించి మొదటిసారిగా తెలియచేసినవారు గ్రీకు రోమన్ చరిత్ర కారులైన హిరోడోటస్ (Herodotus) స్కైలాక్స్ (Scylax) టెసియస్ (Ctesias) మొ॥గు వారు. హిరోడోటస్ గ్రంధం హిస్టరీస్ (Histories) పర్షియా - గ్రీకు దండయాత్రను వివరిస్తున్నది. అలెగ్జాండర్ భారతదేశ దండయాత్రలను గూర్చి ఆరియన్ '(Arriam) స్ట్రాబో (Strabo) ప్లినీ (Pliny) తమ రచనలందు పేర్కొనిరి. అజ్ఞాత రచయిత రచన ఎర్రసముద్రపుదైరి (The periplus of the Erythrian sea) ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు ఎంతో ఉపయోగపడును. భారతదేశ చరిత్రలోని మౌర్యుల కాలంనాటి సాంఘిక, ఆర్థిక రాజకీయ పరిస్థితులను తెలుసు కొనుటకు మెగస్తనీసు వ్రాసిన గ్రంధం ఇండికా ఒక్కటే ఆధారం. గ్రీకు సేనాని సెల్యూకస్ నికెటార్ మౌర్య చంద్రగుప్తుని దర్బారుకు రాయబారిగా పంపినవాడే మెగస్తనీస్

**2.5.2. చైనీయుల రచనలు :-** బౌద్ధ మతానికి పుట్టినిల్లు అయిన భారత దేశాన్ని సందర్శించుటకు బౌద్ధ గ్రంధాలను సేకరించుటకు పాహియాన్, హుయాన్‌త్సాంగ్, ఇత్‌సింగ్ మొ॥న చైనా యాత్రికులు మన దేశానికి వచ్చిరి. బౌద్ధ యాత్రికులైన వీరు భారతదేశాన్ని సందర్శించి వారి యొక్క అనుభవాలను గ్రంధ రూపంలో పొందుపరిచినారు. చైనా యాత్రికులలో మొదటి వాడు అయిన పాహియాన్ క్రీ॥ శ॥ 399 -414 మధ్య తన భారతదేశ ప్రయాణ అనుభవాలు ఆనాటి గుప్త సామ్రాజ్య రాజు అయిన చంద్రగుప్త విక్రమాదిత్యుని మత, సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను 'ఫో -కువో- కీ' లో పొందుపరిచినాడు. ఉత్తర భారతదేశ చరిత్రలో ప్రశంసనీయమైన చరిత్ర కల్గిన చంద్రగుప్త విక్రమాదిత్యుని కాలాన్ని గురించి తెలుసుకొనుటకు ముఖ్య ఆధారాలలో ఇది ఒక్కటి. హుయాన్ త్సాంగ్ క్రీ॥శ 639 -645 మధ్య భారత దేశంలో సంచరించినాడు. చైనా దేశస్థుడు అయిన ఇతడు బౌద్ధ గ్రంధాలు తృప్తి నీయక పోవటంతో బుద్ధుని జన్మభూమి అయిన భారతదేశాన్ని సందర్శించి 657 బౌద్ధ గ్రంధాలను, సుమారు 150 బుద్ధుని ధాతువులను సేకరించి భారతదేశంలో తాను చూసినవి విన్నవి సి.యూ.కి గ్రంధంగా రచించినాడు. ఈ గ్రంధం ఆనాటి హర్షచక్రవర్తిని గూర్చే గాక భారతదేశ రాజకీయ సాంఘిక, మత సాంస్కృతిక పరిస్థితులును తెలుసుకొనుటకు బహుప్రయోజనాకారి. ఇత్‌సింగ్ చైనా యాత్రికులలో చివరివాడిగా చెప్తారు. ఇతడు క్రీ॥శ 671-695 మధ్య భారతదేశ పరిస్థితులు వివరించినాడు.

**2.5.3 అరబ్బు లేదా ముస్లిం రచనలు :** క్రీ.శ 8 వ శతాబ్దం నుండి లభ్యమవుతున్న కొన్ని అరబ్బుల రచనలు ప్రాచీన భారతదేశ చరిత్రకు ఆధారాలుగా ఉపయోగపడతాయి. అరబ్బు రచయితలలో మేటి 'ఆల్‌బెరూనీ'. ఇతడు అరబ్బీ సంస్కృత భాషలలో దిట్ట. ఆల్‌బెరూనీ రచనల ద్వారా భారత దేశ శాస్త్రములు, సాంఘిక మత విషయములలోను, మహమ్మదీయ దండయాత్రలకు సంబంధించిన సమాచారం విపులంగా లభిస్తుంది. అతని గ్రంధమైన 'కితాబ్ - ఉల్ - హింద్ అత్యంత విశ్వసనీయమైనది. ఆల్ -మసూది (క్రీ.శ. 850) కనూజ్ పాలకుడైన మిహిరభోజుని పరిపాలనను వర్ణిస్తున్నాడు. ఫిర్‌దౌశి అనుకవి తన 'షానామా'లో అలెగ్జాండర్, మౌర్యచంద్రగుప్తుల వివరము తెలియజేసెను.

## 2.6 సారాంశం :

ప్రాచీన భారతదేశ చరిత్ర పునర్మించడానికి ఆధారాలు ఎన్నోకలవు. వాటిలో మత పరమైన, సాహిత్యపరమైన చరిత్రాత్మక గ్రంథాలు, స్వదేశ విదేశ వక్తలతో వ్రాయబడి భారత చరిత్ర సమగ్రంగా తెలియచెప్పటానికి తోడ్పడుతున్నాయి. అంతేకాక వివిధ రాజుల కాలాలలో యివ్వబడిన శాసనాలు, నాణాలు, భవన నిర్మాణాలు భారత చరిత్ర రచనకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

## 2.7 మాదిరి ప్రశ్నలు

1. ప్రాచీన భారతదేశ చరిత్రను ఎన్ని భాగాలుగా విభజించినారు ? వాటి గురించి వ్రాయుము ?
2. భారతదేశములోని శాసనాలను గూర్చి వివరింపుము ?
3. భారతదేశ చరిత్రను తెలియపరిచె, స్వదేశీ, విదేశీ రచనల గురించి వ్రాయుము ?

## సంక్షిప్త ప్రశ్నలు :

1. పురావస్తు ఆధారాల గురించి క్లుప్తంగా వ్రాయుము ?
2. స్వదేశీ రచనల గురించి వ్రాయుము ?
3. విదేశీ రచనల గురించి వ్రాయుము ?
4. భారతదేశపు నిర్మాణాల గురించి వ్రాయుము ?

## పాఠం - 3

# చరిత్ర పూర్వయుగం

### 3.0. లక్ష్యం :

భారతదేశ చరిత్ర పూర్వయుగంలో ఆదిమ మానవుడు వివిధ రకములైన జీవన విధానాలను కల్గియున్నాడు. ఈ యుగాన్ని పునర్నిర్మించడం, ఆ కాలంలో వివిధ ప్రాంతాలలో విలసిల్లిన వాని ఆవాసాలు గుర్తించి ఆకాలం నాటి ప్రజా జీవనాన్ని పునర్నిర్మించడం ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

### విషయక్రమం :

3.1 ఉపోద్ఘాతం

3.2 చరిత్ర పూర్వయుగం - దాని భాగాలు

3.3 శిలాయుగం

3.4 మధ్య ప్రాచీన శిలాయుగం

3.5 ఉత్తర ప్రాచీన శిలాయుగం

3.6 మధ్య శిలాయుగం లేక సూక్ష్మ శిలాయుగం

3.7 నవీన శిలాయుగం

3.8 తామ్ర శిలాయుగం

3.9 సారాంశం

### 3.1 ఉపోద్ఘాతం :

చరిత్రను రెండు భాగాలుగా విభజించవచ్చును 1. చరిత్ర పూర్వయుగం 2. చారిత్రక యుగం. చరిత్ర పూర్వయుగం అనగా మానవునికి చదవటం రాయటం తెలిసిన కాలాన్ని చారిత్రక యుగమని పిలిచెదరు. చరిత్ర పూర్వయుగానికి ముఖ్య ఆధారాలు ఆదిమ మానవుడు ఉపయోగించిన పనిముట్లు. వాటి ఆధారంగా ఆనాటి ప్రజల జీవన విధానం తెలుసుకొన వచ్చును దీనినే ప్రాక్ చరిత్ర అని కూడా అంటారు.

భారతదేశంలో మానవుడు ఎప్పుడు అవతరించినాడో స్పష్టంగా చెప్పలేము. బహుశ ఐదు లక్షల యేండ్ల క్రితం అంటే ప్లీస్టోసీన్ (Pleistocene) అనే హిమయుగంలో ఉష్ణ అంతర్దశల కాలంలో భారతదేశంలో మానవుడు జీవించి ఉంటాడు. ఆదిమ మానవుడు నదీతీరాలలో, పర్వత ప్రాంతాలలో జీవనం సాగించేవాడు. ఆయాప్రాంతాలలో క్షుణ్ణంగా పరిశీలిస్తే ఆదిమానవులు వదిలిపెట్టిన పనిముట్లు కనిపిస్తాయి. చరిత్రకు అందని ఈ కాలపు మానవుడు పశుప్రాయుడు. జంతువుల వలె జంతువులను వేటాడి పచ్చి మాంసాన్ని, పండ్లును. దుంపలను భుజించేవాడు. తర్వాత సుఖప్రద జీవనం పై ఆసక్తి గలవాడై తనకు లభ్యమైన సాధనాలతో తన పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకొన్నాడు. దీనితో మానవ నాగరితలో పురోగమనం ప్రారంభమయినది.

## 3.2 చరిత్ర పూర్వయుగం - దాని భాగాలు :

ప్రాచీన మానవుడు వాడిన పనిముట్లను బట్టి ఆపనిముట్ల తయారీకి ఉపయోగించిన పదార్థాన్ని బట్టి ప్రాచీన యుగాన్ని 4 భాగాలుగా విభజించవచ్చును.

1. శిలాయుగం (Stone Age)

2. తామ్ర -శిలాయుగం (Chalcolithic-Age)

3. కాంస్య -యుగం (Bronze -Age)

4. ఇనుప -యుగం (Iron Age)

## 3.3 శిలా యుగం :

శిలాయుగ ముఖ్య ఉద్దేశ్యం ఆది మానవుని చరిత్రను పునర్నిర్మించటం శిలాయుగపు ప్రజలు గురించి విపులంగా తెలుసుకొనుటకు శిలాయుగాన్ని మూడు దశలుగా విభజించ వచ్చు 1. ప్రాచీన శిలాయుగం (palaeolithic -Age) 2. సూక్ష్మరాతి లేక మధ్య శిలాయుగం (Microlithic or Mesolithic-Age) 3. నవీన శిలాయుగం (Neolithic-Age)

తొలిమానవుని పనిముట్లు, ఆహార సేకరణ పద్దతులను బట్టి ప్రాచీన శిలాయుగాన్ని మరల మూడు భాగాలుగా విభజించవచ్చును అవి

1) పూర్వ ప్రాచీన శిలాయుగం (Lower palaeolithic Culture)

2) మధ్య ప్రాచీన శిలాయుగం(Middle palaeolithic Culture)

3) ఉత్తర ప్రాచీన శిలాయుగం (Upper palaeolithic Culture)

**3.3.1 పూర్వ ప్రాచీన శిలాయుగం** :- భారతదేశంలో ఐరోపా దేశాలు కంటే ఆలస్యంగా శిలాయుగపు పరిశోధనలు జరిగినాయి. మొట్టమొదటి సారిగా 1862 లో తమిళనాడులోని పల్లవరం వద్ద రాబర్ట్ బ్రూస్ ఫ్రూట్ ప్రాచీన శిలాయుగపు గొడ్డళ్ళను కనిపెట్టినాడు. అందుకనే అతనిని భారత ప్రాక్ చరిత్ర పితామహుడు అని పిలిచినారు. తర్వాత కాలంలో అనేక మంది శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపారు. దాని ఫలితంగా ఈ యుగానికి చెందిన మానవుడు సారవంతమైనటు వంటి నదీ లోయలలో ఇంచుమించు భారతదేశం అంతా సంచరించాడు అని తెలుస్తుంది.

**3.3.2. ప్రాచీన శిలా యుగ పనిముట్లు** :- పూర్వ ప్రాచీన శిలాయుగానికి చెందిన మానవులు వాడిన పనిముట్లు గులక రాతి పనిముట్లు, ఏకముఖఛేదాకాలు (choopper) ద్విముఖ చేదకాలు (chopping tools) చేతిగొడ్డళ్ళు (Hand -Axe) గండ్ర గొడ్డళ్ళు (cleavers) చక్రాలు (Discoids) గీకుడు రాళ్ళు (scrapers). ఈ యుగపు పనిముట్లను తయారు చేయుటకు దాగలి పద్దతి (Black on block or Anvil technique) రాతి సుత్తి పద్దతి (Stone Hammer technique) స్థూపాకార సుత్తి పద్దతి (Cylinder Hammer technique) లను అనుసరించడం జరిగింది.

ఈ పనిముట్ల ఆకృతులు, వాటిని తయారు చేసిన పద్ధతులను బట్టి వాటిని చెల్లియన్ (Chellian) అబ్బివిలియన్ (Abbevillian) అషూలియన్ (Acheulian) అనే సంస్కృతులకు చెందినవిగా గుర్తించవచ్చు. ఈ మూడు సంస్కృతుల చేతి గొడ్డళ్ళు ఫ్రాన్స్ దేశంలోని వివిధ ప్రదేశాలలో అనగా చెల్లీస్, అబివిల్లి, సెయింట్ అషూల్ అనే గ్రామాలలో లభ్యమైన పనిముట్లను బట్టి పిలిచిన విధంగా మన దేశంలో కూడా దొరికిన చేతి గొడ్డళ్ళను ఆయా సంస్కృతులతో పోల్చారు. అబ్బివిల్లియన్ సంస్కృతిలో అటు మొరటుగాను లేకుండా ఇటు నునుపుగాను లేకుండా మధ్యస్థంలో ఉండే చేతిగొడ్డళ్ళు అషూలియన్ సంస్కృతిలో నునుపుగాను ఆకర్షణీయంగాను ఉండే చేత గొడ్డళ్ళు తయారు చేయబడినాయి.

మన దేశంలో దొరికిన u లేదాv అక్షరాలలో పోలి ఉన్న గండ్ర గొడ్డళ్ళుకు ఓల్డ్‌వాయ్ గార్జ్ దగ్గర దొరికిన గండ్ర గొడ్డళ్ళకు పోలికలలో దగ్గర సంబంధం ఉన్నది.

**3.3.3. ప్రాచీన శిలాయుగపు ప్రజల జీవన విధానం :-** జంతువులకు నిలయమైన అడవులు, రాతి పరికరాలకు అవసరమైన పర్వత ప్రాంతాలు సం॥ము పొడవున పారే నదుల మొ॥నవి నాటి శిలా యుగపు మానవుని మనుగడకు తోడ్పడినాయి. జంతువులను వేటాడి పచ్చి మాంసాన్ని తింటూ ఈ కాలంలో మానవుడు జీవనాన్ని సాగించినాడు.

**3.3.4. భారతదేశంలోని పూర్వ ప్రాచీన శిలాయుగపు స్థావరాలు :-** ఈ శిలాయుగపు సంస్కృతికి సంబంధించిన పనిముట్లు ముఖ్యంగా తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, మరియు ఆంధ్రప్రదేశ్ మొ॥న రాష్ట్రాలలో దొరికినాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో దాదాపు అన్ని జిల్లాలలోను ఈ యుగపు పనిముట్లను కనుగొన్నారు. 'రాబర్ట్ బ్రూస్ ఫూట్" కర్నూలు, కడప అనంతపురం ప్రకాశం మొ॥గు జిల్లాలలో ప్రాచీన శిలాయుగపు పనిముట్లు కనుగొన్నాడు. తర్వాత కామియాడ్, బర్కిట్, మాన్లీ, కృష్ణస్వామి, సౌందర్య రాజన్ H.D శంకాయాలి, K. తిమ్మారెడ్డి మొ॥గు వారు ఆంధ్రప్రదేశ్‌లో నలుమూలల పరిశోధనలు గావించి ఈ యుగపు అవశేషాలను వెలుగులోనికి తీసుకొని వచ్చినారు.

## 3.4 మధ్య ప్రాచీన శిలాయుగం :

మధ్య ప్రాచీన శిలాయుగం పూర్వ ప్రాచీన శిలాయుగానికి ఉత్తర ప్రాచీన శిలాయుగానికి మధ్యఉన్న దశ. ఈ యుగంలో ఎక్కువగా గీకుడు రాళ్ళు, మొనలు, చిద్రకాలు అనే పనిముట్లు పెచ్చులుతో తయారుచేయబడినవి. అందుకనే ఈ యుగాన్ని పెచ్చుల పరిశ్రమ అంటారు.

ఈ యుగంలో మానవుడు పెద్ద పెద్ద రాళ్ళను వినియోగించకుండా చిన్నచిన్న రాళ్ళతో తనకు కావలసినటు వంటి ఆయుధాలను తయారు చేసుకొనటం మొదలు పెట్టినాడు అనగా ముడిసరుకు పరిణామాన్ని తగ్గించుకొన్నాడు. ఈ యుగపు పనిముట్లు తయారు చేసుకొనుటకు రాతి సుత్తి పద్దతి, స్తూపాకార సుత్తి పద్దతి అనుసరించడం జరిగినది.

**3.4.1 మధ్య ప్రాచీన శిలాయుగపు పనిముట్లు :-** గీకుడు రాళ్ళ, సూచికలు, చిద్రకాలు, చేదకాలు చేతి గొడ్డళ్ళు, చిన్నచిన్న హృదయాకారపు చేతిగొడ్డళ్ళు, గండ్ర గొడ్డళ్ళు, చక్రాలు మొ॥నవి.

**3.4.2 మధ్య ప్రాచీన శిలాయుగపు ప్రజల జీవన విధానము :-** ఈ కాలంలో కూడా మానవుడు సంచార జీవిగానే ఉన్నాడు. జంతువులు నుండి పచ్చిమాంసాన్ని తింటూ గుహలలో నివశిస్తూ ఉన్నాడు. గుహలు అందుబాటులో లేనప్పుడు చర్మంతో కప్పిన చిన్న పాకలలో నివశించేవాడని రష్యా దేశంలో లభించిన ఆధారాలను బట్టి తెలుస్తుంది ఈ కాలంలో నిప్పును ఉపయోగించినట్లు తెలుస్తుంది. ఈ యుగంలో దొరికిన శిలాజాలను బట్టి బొచ్చు ఖడ్గమృగం, మామత్, ఎద్దు ఎలుగుబంటి మొ॥గు జంతువులను ఆహారంగా ఉపయోగించినాడని తెలుస్తుంది.

**3.4.3 భారతదేశంలోని మధ్య ప్రాచీన శిలా యుగపు స్థావరాలు :-** ఇటీవలి పరిశోధనల వలన భారతదేశంలో తమిళనాడు, మైసూరు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ బీహార్, బెంగాల్, ఒరిస్సా మొ॥గు రాష్ట్రాలలో ఈ అవశేషాలు విరివిగా కనబడుచున్నవి.

ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లాలోని కృష్ణ లోయలోని నాగార్జున కొండ, మద్దూరు, ప్రకాశం జిల్లాలోని సగిలేరు, గుండ్లకమ్మ పాలేరు, కడప జిల్లాలోని సగిలేరులోయలలో చిత్తూరు జిల్లా రేణిగుంట, ఆదిలాబాద్ జిల్లాలోని మార్లవాయి, కేశవ్‌పూర్ మొ॥గు ప్రాంతాలలో ఈ యుగానికి సంబందించిన పనిముట్లు, అవశేషాలు బయటపడినాయి.

పైన దొరికిన ఆధారాలను కార్బన్ -14 పద్ధతి ప్రకారం పరిశీలించి చూస్తే ఈ పరిశ్రమ క్రీ.పూ 55,000 నుంచి 35,000 సం॥రాల వరకు అభివృద్ధి చెందినది అని తెలుస్తున్నది.

## 3.5 ఉత్తర ప్రాచీన శిలాయుగం :

మానవుడి వేట లేదా ఆహార సేకరణ దశలో చివరి దశ ఉత్తర ప్రాచీన శిలాయుగం. ఈ యుగంలో మానవుడు మధ్య ప్రాచీన యుగంలో వాడిన పనిముట్ల కంటే శ్రేష్ఠమైన వాటిని చేసుకొన్నాడు. ముడి సరుకును కూడా తగ్గించుకొనుటయే గాకుండా చర్ట్, జాస్పర్, చాల్స్‌డోని అనే చెకుముకి రాళ్ళ పైన మౌస్టీరియన్, లెవలోషియన్ పద్ధతులు ద్వారా పెచ్చులు తీసిన వాటితో పనిముట్లు తయారుచేసుకొన్నాడు. నాటి మానవుడు రాతితోనే గాకుండా ఎముకలతో కూడా అనేక రకాల పరికరాలను తయారుచేయడం ఈ కాలపు ప్రత్యేక లక్షణం. ఈ కాలంలో ఎక్కువగా బ్లేడులు, బ్యూరిన్‌లు వాడినట్లు తెలుస్తుంది.

**3.5.1 పనిముట్లు :-** బ్లేడులు, బ్యూరిన్‌లు, చిరుకత్తులు మొద్దుపరిచిన పక్క అంచుమొనలు, మొనలు, చిద్రకాలు గోకుడు రాళ్ళు, త్రిభుజాలు, చతుర్భజాలు మొ॥నవి ఈ కాలంలో వాడిన పరికరాలు పెచ్చులుతో తయారు చేసినవి. అయితే ప్రతి బ్లేడు ఒక పెచ్చే కాని అన్ని బ్లేడులు పెచ్చులు కావు.

**3.5.2 ఉత్తర ప్రాచీన శిలాయుగపు ప్రజల జీవన విధానం :-** ఈ కాలంలో మానవుడు వేట మీద ఆధారపడిన జీవన విధానానికి చివరిదశ. ఈ యుగంలోను మానవుడు గుహలలో నివశించినాడు కాకపోతే దైనందిన జీవితంలో మార్పులు కనిపిస్తున్నాయి. ఆసియా, యూరప్ ఖండాలలోని గుహలలో వారు చిత్రీకరించిన వర్ణ చిత్రాలు, రాతి మీద ఎముకల మీద చెక్కిన శిల్పాలు వారి కళానైపుణ్యానికి నిదర్శనాలు అలాగే మృతదేహాన్ని సమాధి చేసేవాడు. జంతువుల చర్మాన్ని దుస్తులుగా కూడా వినియోగించినారు. ఈ యుగంలో జంతువులను, జంతు శిలాజాలాన్ని బట్టి దుప్పి, కణితి, అడవి పంది మొ॥గు జంతువులను తన ఆహారంగా ఉపయోగించినట్లు తెలుస్తుంది. ఉత్తర ప్రాచీన శిలాయుగంలో లభించిన అవశేషాల కాలనిర్ణయ పద్ధతి ప్రకారం క్రీ॥పూ 20.000 నుండి 10,000 మధ్య కాలంలో ఈ యుగపు వాసులు ఉండి ఉండవచ్చు.

భారత దేశంలో ఉత్తర ప్రాచీన శిలాయుగపు స్థావరాలు :- ఈ సంస్కృతి యూరప్, ఉత్తర అమెరికా, పశ్చిమ, ఆసియాలకు మాత్రమే పరిమితమై ఉన్నదని చాలా మంది ప్రాక్ చరిత్రకారులు అభిప్రాయ పడినారు కాని ఈ మధ్య భారత దేశంలో జరిగిన పరిశోధనలు బట్టి ఉత్తర ప్రాచీన శిలాయుగపు సంస్కృతి భారతదేశంలో కూడా ఉన్నట్లుతెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లాలోని బేతంచెర్ల, రేణిగంట, ఎర్రగొండపాలెం మొ॥గు ప్రాంతాలలో ఈ పరిశ్రమకు చెందిన అవశేషాలు బయట పడినాయి.

## 3.6 మధ్య శిలాయుగం లేక సూక్ష్మ శిలాయుగం :

అల్ప పరిమాణం కల్గిన పరికరాలను ఉపయోగించిన కాలాన్ని సూక్ష్మశిలాయుగం లేక మధ్య శిలాయుగం అని పిలుస్తారు. మానవులు ఆహార సేకరణ నుండి ఆహార ఉత్పత్తి చేయడంలోని మొదటి దశను ఈ మధ్య శిలాయుగంలో చూస్తాం. అంటే కేవలం

మానవుడు వేట మీద ఆధారపడకుండా మానవుడు పంటలు పండించే విధానం కనుగొన్నాడు. ఈ యుగంలో మానవునిలో ఆలోచన నేర్పు కల్గి ఉండును. క్లిష్టమైనటు వంటి పనిముట్లును తయారుచేయుటకు క్యార్ట్జ అనే రాయిని వాడి సున్నితమైన పదునైన పరికరాలను తయారు చేయుటకు చెర్ట్, చాల్సిడోనీ, జాస్పర్ మొ॥గు రాళ్ళను వాడినారు యూరప్, ఆసియాఖండాలలో మధ్యయుగపు పనిముట్లు దొరికిన ప్రాంతాలలో కొడవలి ఆకారంలో ఉన్న కర్రకు ఈ అల్పప్రమాణ పరికరాలను అమర్చిన ఆధారాలు కనిపిస్తున్నాయి. బహుశ వీటిని పంటను కోయడానికి ఉపయోగించుకొని ఉండవచ్చును ఈ అల్ప పరిమాణం కల్గిన పరికరాలు ఎక్కువగా కొండ గుట్టల మీద, కొండ దిగువ భాగంలోను, నదీ వేదికలపైన, ఇసుక దిన్నెల మీద కనపించును. వీటిని అన్వేషించుట కష్ట సాధ్యమైన విషయం.

**3.6.1 పనిముట్లు :-** ఈ యుగపు పనిముట్లను రెండు వర్గాలుగా విభజించవచ్చు. 1. నియతాకృతులు 2. అనియతాకృతులు. చతుర్భుజాలు అర్ధచంద్రాకారాలు మొ॥నవి నియతాకృతులు. ఇవి బ్లేడులతో తయారు చేయబడినాయి. వివిధ రూపాల గీకుడురాళ్ళు, మొనలు, చిద్రకాలు మొ॥నవి అనియతాకృతులు. ఇవి ఎక్కువగా పెచ్చులుతో తయారు చేయబడినాయి.

**3.6.2 సూక్ష్మ శిలా యుగ ప్రజల జీవన విధానం :** ఈ యుగంలోని మానవులు జంతువులను, చేపలను వేటాడి ఆహారాన్ని సంపాదించుకునేవారు. లభ్యమైన జంతు అవశేషాలును బట్టి వీరు ఖడ్గమృగం, దుప్పి, పంది, ముంగీస, ఎలుకలు, పశువులను ఆహారంగా వినియోగించినారు. ఈ యుగం చివరిలో పంటలు పండించినట్లు, కుండలు చేసినట్లు ఆధారాలు లభిస్తున్నాయి. గవ్వలతోను, పూసలతోను తయారైన ఆభరణాలను ధరించినారు. చనిపోయిన వారిని పాతిపట్టే ఆచారం ఉంది. దొరికిన పనిముట్లు కార్బన్ -14 పద్ధతి ప్రకారం చూస్తే వీరి కాలం మన దేశంలో క్రీ.పూ 8000 -6000.

**3.6.3 భారత దేశంలో సూక్ష్మ శిలా యుగ స్థావరాలు :-** ఈ యుగ అవశేషాలు దేశమంతటా దొరికినాయి. గుజరాత్‌లో లాంగ్ నాజ్, మధ్య ప్రదేశ్‌లో పంచ్‌మర్హి, ఆదంఘర్, మీర్జాపూర్, పశ్చిమ బెంగాల్‌లో భీర్‌బాన్‌పూర్, తమిళనాడులో టెరి, కర్ణాటకలో రాయచూర్, బళ్ళారి జిల్లాలలో, ఆంధ్రప్రదేశ్‌లో గిద్దలూరు, నాగార్జున కొండ ప్రాంతాలు ప్రముఖంగా పేర్కొన దగ్గవి. ఇటీవల రాజస్థాన్‌లో కూడా ఈ యుగ అవశేషాలు బయటపడ్డాయి.

## 3.7 నవీన శిలా యుగం :

ప్రాచీన మానవుని చరిత్రలో నవీన శిలాయుగానికి ఒక ప్రత్యేకత ఉన్నది తన సంచార జీవనానికి స్వస్తిచెప్పి స్థిర జీవనం సాగించినాడు. ఈ యుగంలో మానవుడు సరి క్రొత్త రాతిముట్లును తయారు చేయుటమే గాక అతని జీవిత విధానంలో కూడా మార్పులు చేసుకొన్నాడు. ఆహార సేకరణ దశ నుంచి ఆహారోత్పత్తి దశకు మానవుడు ఎదిగినాడు. వ్యవసాయం, పశుపోషణ మొ॥న విధానాలు ద్వారా ఆహారోత్పత్తిని సాధించినాడు. వేటాడటం, చేపలు పట్టడం, కాయలు, దుంపలు సేకరించడం మొ॥న విధానాలు నుంచి వ్యవసాయం, పశుపోషణ మొ॥న విధానాలకు మారిపోయిన ఈ దశను గార్డెన్ చైల్డ్ నవీన శిలాయుగపు విప్లవం అన్నాడు.

**పనిముట్లు :-** నవీన శిలాయుగంలో ప్రాముఖ్యం వహించిన రాతి పనిముట్లును నునుపురాతి పనిముట్లు అంటారు. బసాల్ట్, డోలరైట్, గ్రానైట్ మొ॥గు ముడి పదార్థాలతో ఈ నునుపు రాతి పనిముట్లును తయారు చేస్తారు. ఈనునుపు రాతి పనిముట్లలో - నునుపైన గొడ్డళ్ళు, బాడిసలు, ఉలులు, షోల్డర్డ్ పరికరాలు, మధ్య రంధ్రమున్న పరికరాలు, నూరుడు రాళ్ళు, వడిశెల రాళ్ళు, కలువాలున్నాయి. ఈనునుపైన రాతి పనిముట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తే వీటిని 3 లేదా 4 దశలలో అంచెలు అంచెలుగా తయారు చేసినట్లు తెలుస్తున్నది.

**3.7.1 నవీన శిలాయుగపు ప్రజల జీవన విధానం :-** మానవుడు ఈ యుగంలో సంచార జీవితాన్ని వదిలి స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు. వేట అనేది మానకుండా వ్యవసాయం, పశుపోషణ మొదలు పెట్టినారు. ఈ నవీన శిలా యుగపు సంస్కృతి లక్షణాలలో స్థిర నివాసాలు, జంతువులను మచ్చిక చేయటం. ధాన్యపు మొక్కలను పెంచడం, నునుపు చేసిన రాతి పరికరాలను

తయారు చేయడం కుండలను చేయడం అనేవి వివిధ దశలలో మనకు కన్పిస్తాయి. నవీన శిలాయుగపు మొదటిదశలో ప్రజలు ఇండ్లను కట్టుకొని నివశించినారు. రెండవ దశలో బంక మట్టితోను, ఇటుకలతోను, చెట్లతోను గృహ నిర్మాణాలు చేసుకొన్నారు. చనిపోయిన వారిని అండాకృతి గోతులలో సమాధి చేసేవారు. కొన్నిచోట్ల చనిపోయిన వ్యక్తితో పాటు అతని పెంపుడు కుక్కలను కూడా సమాధి చేసేవారు.

మొదటి దశలో ముతక బూడిద లేక నలుపు రంగు కల్గిన మట్టి పాత్రలు తర్వాత ముతక ఎరుపు రంగు మట్టి పాత్రలను వాడినట్లు తెలుస్తున్నది. అలాగే వీరు పశువుల బొమ్మలను మట్టితో చేయడయే గాక కొండ రాళ్ళ మీద చిత్రీకరించినారు. వ్యవసాయ అవసరాలు దృష్ట్యా నూతన వృత్తులు ఈ యుగంలో జనించి, ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు దోహదం చేసెను. కుండలు చేయడం, నూలు వడకడం, బట్టలు నేయడం, అల్లడం మొ॥గు వృత్తులు అభివృద్ధి చెందినాయి. చక్రం కనుగొనబడి ఈ చక్రం నుండియే సారె పరిశ్రమ వృద్ధి చెందిననది.

**3.7.2 భారత దేశంలో నవీన శిలాయుగపు స్థావరాలు :-** భారతదేశంలో నవీన శిలాయుగపు పనిముట్లు అస్సాం, బీహార్, కాశ్మీర్, ఆంధ్రప్రదేశ్, మైసూర్ మొ॥గు ప్రాంతాలలో లభ్యమయినాయి. లభ్యమైన ఆధారాల స్వభావాన్ని, సంస్కృతులను బట్టి భారతదేశంలోని నవీన శిలాయుగాన్ని 3 భాగాలుగా విభజించవచ్చు. 1. ఉత్తర భారత నవీన శిలాయుగం 2. దక్షిణ భారత నవీన శిలాయుగం 3. తూర్పు భారత నవీన శిలాయుగం. ఆంధ్రప్రదేశ్‌లోని నవీన శిలాయుగ స్థావరాలలో ముఖ్యమైనవి ఏమనగా వడ్డమాను, అమరావతి, చేబ్రోలు, నాగార్జున కొండ, ఉట్నూరు (గుంటూరు జిల్లా) వేమవరం, కురిచేడు, కనిగిరి, పూసలపాడుదర్శి, బొబ్బేపల్లి, ద్రోణాదుల (ప్రకాశం జిల్లా) పాలవాయి (అనంతపురం జిల్లా) పాతపాడు, బస్తిపాడు (కర్నూలు జిల్లా) ఇటీవల బి. డేవిడ్ రాజు కోస్తా ఆంధ్రలో 80 నవీన శిలాయుగ స్థావరాలను కనుగొన్నట్లు తెలియజేశారు.

## 3.8 తామ్ర - శిలాయుగం :

రాతి పనిముట్లతో పాటు రాగి పనిముట్లు కూడా వాడుకలోనికి రావడాన్ని తామ్ర శిలాయుగం అంటారు. అనగా లోహయుగ ప్రారంభదశ తామ్ర శిలాయుగం. మానవుడు మొదటి సారిగా ఉపయోగించినలోహం రాగి. తర్వాత బంగారం, కంచు లోహాలను ఉపయోగించినాడు. తామ్ర శిలాయుగానికి చెందినదే సింధు నాగరికత. సింధు నాగరికత పూర్వకాలం నాటి స్థావరాలు రాజస్థాన్, బెలూచిస్థాన్, సింధు రాష్ట్రాలలో ఉన్నాయి. హరప్పా, మొహంజిదారో కాలిబంగన్‌లలో బయటపడిన అవశేషాలు అనగా ఇటుకలు, బొమ్మలులిపి కల్గిన ముద్రలు సింధు నాగరికత ప్రారంభఉచ్చదశలను తెలియజేస్తాయి. గంగా మైదానంలో లభించిన గొడ్డళ్ళు, కత్తులు, చాకులు ఇతర తామ్ర పరికరాలు సింధు నాగరిగత చివరి దశను సూచిస్తాయి. ఆహర్, మాళ్వా, జోర్వే, తామ్ర - నిక్షేప సంస్కృతులు సింధు నాగరికత తర్వాత కాలానికి చెందిన సంస్కృతులు. ఈ సంస్కృతులలో కొన్ని ప్రాంతీయ ప్రత్యేకతలు ఉండుట చేత వీటిని ఆయా ప్రాంతాల పేర్లతోనే పిలవటం జరుగుతున్నది.

## 3.9 సారాంశము :

భారత చరిత్ర పూర్వయుగాన్ని ప్రాచీన శిలాయుగము, మిధ్యప్రాచీన శిలాయుగము, ఉత్తర ప్రాచీన శిలాయుగము, సూక్ష్మయుగము, నవీన శిలాయుగము, తామ్ర శిలాయుగములుగా విభజించవచ్చును. ప్రతీయుగంలో ఆది మానవుడు కాలానుగుణంగా తనకు కావలసిన పనిముట్లు తయారు చేసుకొని, తనదైన శైలిలో జీవనం సాగించాడు. లోహ ఉత్పత్తిలో మానవ జీవన విధానంలో గణనీయమైన మార్పులు గోచరిస్తాయి.

## 3.10 మాదిరి ప్రశ్నలు

1. చరిత్ర పూర్వయుగం, దాని భాగాలను గూర్చి వ్రాయుము ?
2. శిలాయుగాన్ని గూర్చి వ్రాయుము ?

## సంక్షిప్త ప్రశ్నలు

1. ప్రాచీన శిలాయుగం గూర్చి వ్రాయుము ?
2. సూక్ష్మరాతి యుగం గూర్చి వ్రాయుము ?
3. నవీన శిలాయుగం గూర్చి వ్రాయుము ?
4. తామ్ర శిలాయుగం గూర్చి వ్రాయుము ?

**డా॥ కె. అజయ్ కుమార్**

## పాఠం - 4

# సింధు నాగరికత

### 4.0 లక్ష్యం :

సింధూ నాగరికత పుట్టుక, వ్యాప్తిని వివరించి, నాగరికతా లక్షణాలు, పతనానికి గల కారణాలను వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

### విషయక్రమం


4.1 పరిచయం

4.2 నాగరికతా వ్యాప్తి

4.3 కాలం

4.4 పేరు

4.5 నాగరికత ఆవిర్భావము

4.6 నాగరికతా నిర్మాతలు

4.7 సింధు నాగరికత లక్షణాలు నగర నిర్మాణం

4.8 సాంఘిక పరిస్థితులు

4.9 ఆర్థిక పరిస్థితి

4.10 కళలు

4.11 మత విశ్వాసాలు

4.12 లిపి

4.13 మృత సంస్కారాలు

4.14 సింధు నాగరికత పతనం - కారణాలు

4.15 సారాంశం

4.16 మాదిరి ప్రశ్నలు


### 4.1 పరిచయం :

సింధు నాగరికత క్రీ.పూ. 3500 సం॥ల పూర్వమే వాయవ్య భారతదేశం, పాకిస్తాన్, లోని సువిశాల భూభాగంలో విస్తరించింది. ఈ నాగరికత అవశేషాలను మొట్టమొదట 1826 C. మాసన్ హరప్పా వద్ద కనుగొన్నాడు. అలెగ్జాండరు కన్నింగ్‌హాం 1853, లోను 1856 లోను రెండుసార్లు హరప్పాలో పరిశోధనలు, త్రవ్వకాలు జరిపి కొన్ని ముద్రికలు, మృణ్మయ పాత్రలు, హరప్పా స్థల రేఖాచిత్రాలతో తన

పరిశోధనా ఫలితాలను ప్రచురించాడు. అయితే తాను ఒక నూతన నాగరికతావశేషాలను కనుగొన్నట్లు కన్నింగ్‌హామ్‌కు తెలియదు. హరప్పాలో లభించిన ముద్రికలను అప్పటివరకు తెలియని ఏదో విదేశీ సంస్కృతికి చెందిన అవశేషాలుగా కన్నింగ్‌హామ్ తన నివేదికలో పేర్కొన్నాడు. 1886 లో M.L. డేమ్స్, 1912 J.F. ఫ్లీట్ మరికొన్ని హరప్పా ముద్రికల వివరాలను ప్రచురించారు.

1920 లో బ్రిటీష్ పాలకులు సింధు ప్రాంతంలో నూతన రైలు మార్గ నిర్మాణం జరుపుతున్న సమయములో యాధృచ్ఛికంగా సింధు నాగరికతా అవశేషాలను కనుగొన్నారు. హరప్పా, మొహంజోదారో లో కనుగొన్న శిథిలాలు అతి ప్రాచీన కాలం నాటి నాగరికతా చిహ్నాలుగా గుర్తించారు. ఫలితంగా ఆర్యుల రాకతోనే భారతదేశంలో నాగరికత ప్రారంభమైనదనే భావన పోయి 5000 సం॥ల క్రితమే భారతదేశంలో ఉజ్వలమైన నాగరికత విలసిల్లినదని ప్రపంచానికి తెలిసింది.

1921 - 22 సం॥లలో అప్పటి పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ అయిన సర్ జాన్ మార్షల్ ఆధ్వర్యంలో హరప్పాలో దయారాం సాహ్ని, మొహంజోదారోలో R.D. బెనర్జీలు త్రవ్వకాలను జరిపి సింధు నాగరికతా విశేషాలను వెలుగులోకి తెచ్చారు.

అప్పటి నుండి జరిగిన పురావస్తు పరిశోధనలు హరప్పా, మొహంజోదారోల వంటి పెద్ద నగరాలు గుజరాత్‌లోని ధోలవీరాలోను, పాకిస్తాన్‌లోని గనెరివాలాలోను బయల్పడ్డాయి. ఈ పరిశోధనల వలన సింధు నదీ పరివాహక ప్రాంతంలోనేకాక ఘగ్గర్ - హాక్రా నదీ ప్రాంతంలోను గుజరాత్, ఉత్తర ప్రదేశ్, హర్యానా, మహరాష్ట్ర మొదలగు ప్రాంతాలలో ఇప్పటి వరకు దాదాపు 1500 సింధు నాగరికతా ప్రదేశాలను కనుగొన్నారు.

## 4.2 సింధు నాగరికతా వ్యాప్తి :

పురావస్తు త్రవ్వకాలు, పరిశోధనల వలన సింధు నాగరికత సింధునదీ లోయలకు మాత్రమే పరిమితం కాలేదని తెలుస్తున్నది. ఈ నాగరికత కేంద్ర స్థానాలు సింధునదీ లోయలోని సింధు, పంజాబ్ రాష్ట్రాలలో ఉన్నప్పటికి ఈ నాగరికత పశ్చిమదిశలోని బెలూచిస్తాన్, తూర్పు దక్షిణ దిశలలోని హర్యానా, గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్, ఉత్తర మహరాష్ట్ర ప్రాంతాల వరకు విస్తరించింది. ఖచ్చితంగా చెప్పాలంటే ఈ నాగరికతా పశ్చిమాన దక్షిణ బెలూచిస్తాన్‌లో మకరాన్ తీరంలో ఉన్న సుక్తజెన్‌దార్ నుండి తూర్పున పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని గంగా యమున అంతర్వేదిలోని ఆలంగీర్‌పూర్ వరకు ఉత్తరాన కాశ్మీర్‌లోని మందానుండి దక్షిణాన నర్మదా నదీ తీరంలోని భగత్రావ్ వరకు విస్తరించింది. 1974 వ సం॥లో ప్రవర నదీ తీరములో ఉన్న దైమాబాద్ వద్ద లభించిన కాంస్య ప్రతిమలు దక్కన్‌లో సింధు నాగరికతా విస్తృతిని సూచిస్తున్నవి. ఈ నాగరికత దాదాపు 1,299,600 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. ఇంత సువిశాల ప్రాంతంలో ప్రాచీన కాలపు ఏ నాగరికతా కూడా వ్యాపించలేదు. ప్రపంచ నాగరికతలలోనే ఈ నాగరికత విస్తీర్ణములో అతిపెద్దది. ఈ నాగరికత ఉత్తర దిశ నుండి దక్షిణ దిక్కు వరకున్న దూరం 1100. కి.మీ కాగా తూర్పు నుండి పశ్చిమానకు 1550 కి.మీ. దూరం విస్తరించి ఉన్నది.

## 4.3 కాలం :

సింధు నాగరికత కాలాన్ని గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. మొహంజోదారోలో త్రవ్వకాలు నిర్వహించిన సర్‌జాన్ మార్షల్ మొహంజోదారోలో క్రీ.పూ 3250 నుండి 2750 మధ్య కాలంలో ప్రజలు నివసించారని తెలియచేశాడు.

తరువాత కాలంలో మొహంజోదారోలో త్రవ్వకాలు జరిపిన మాకె క్రీ.పూ 2800 - 2500 మధ్య కాలం సింధు నాగరికత ఉజ్వల దశగా వర్ణించాడు. హరప్పాలో త్రవ్వకాలు చేపట్టిన .M.S. వాట్స్ హరప్పాలో మొహంజోదారో కంటే పూర్వమే సింధు నాగరికత ప్రారంభమైనదని హరప్పాలో సింధు నాగరికతా కాలము క్రీ.పూ. 3500 - 2500 మధ్య అని నిర్ణయించాడు. మెసపొటేమియా నాగరికతా పరిశోధకుడు C.J. గడ్డ్స్ (C.J. Gadds) ఊర్‌లో లభించిన సింధు ముద్రికల ఆధారంగా ఈ నాగరికత క్రీ.పూ. 2370 - 1700 మధ్య కాలానికి చెందినదని

ప్రకటించాడు. ఈ కాలనిర్ణయాన్ని సమీక్షించిన ప్రముఖ పురావస్తు శాస్త్ర పరిశోధకులైన స్టువర్ట్ పిగ్గట్, మార్టిమర్ వీలర్లు, మెసపొటేమియా నుండి సింధు ప్రజలు దిగుమతి చేసుకొన్న కార్నీలియన్ పూసలు, ఇతర గృహోపకరణాలను బట్టి, అటువంటి వస్తువులుపయోగించిన ఇరాక్‌లోని నాగరికతా కేంద్రాల కాలాన్ని ఆధారంగా చేసుకొని సింధు నాగరికతా కాలాన్ని క్రీ.పూ. 2500 - 1500 గా భావించాడు. వీలర్ అభిప్రాయంలో క్రీ.పూ. 1700 లో సింధు నాగరికత అంతమైనది.

రాబర్ట్. హెచ్. బ్రున్స్‌విగ్ మెసొపొటేమియా, పర్షియా దేశాలతో సింధు ప్రజలకున్న వ్యాపార సంబంధాలను, ఐదు సింధు నాగరికతా ప్రదేశాలలో లభ్యమయిన C. 14 కాలాన్ని బట్టి సింధు నాగరికతలో మూడు దశలున్నాయని అవి క్రీ.పూ. 2800 - 2500 మధ్య కాలం నాగరికత ప్రారంభదశగాను, క్రీ.పూ. 2500 - 2200 మధ్యకాలం నాగరికతా ఉజ్వల దశగాను, క్రీ.పూ. 2200 - 2000 సం॥ల మధ్యకాలం తరువాత దశగాను, క్రీ.పూ. 2000 సం॥ల తరువాత సింధు సంస్కృతి క్రమముగా అంతరించిందని అభిప్రాయపడినాడు. రఫిక్ ముఘల్ అను పురావస్తు పరిశోధకుడు సింధు నాగరికతా ప్రదేశాలలో విస్తృతంగా పరిశోధించి సింధు నాగరికతలోని తొలి యగంలో రెండు దశలున్నట్లు మొదటి దశ క్రీ.పూ. 3500 - 3400 సం॥లకు చెందినదని రెండవ దశ క్రీ.పూ. 3000 - 2900 సం॥లకు చెందినదని నిర్ణయించాడు.

## 4.4 పేరు :

సింధు నదీ పరివాహక ప్రాంతంలో వర్ధిల్లిన ఈ నాగరికతకు 'సింధులోయ నాగరికత' అని సర్‌జాన్ మార్షల్ పేరు పెట్టాడు. ఈ ప్రాచీన నాగరికతా శిథిలాలు బయల్పడిన మొహంజోదారో పాకిస్తాన్‌లోని లార్ఖానా జిల్లాలో ఉన్నది. మొహంజోదారో అంటే సింధీ భాషలో మృతులపురం / దిబ్బ అని అర్థం. మొట్టమొదట ఈ నాగరికతా అవశేషాలు పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలోని మాంట్‌గోమరి జిల్లాలోని హరప్పా వద్ద లభించాయి. అందువలననే ఈ నాగరికతను హరప్పా సంస్కృతి అని పిలిచారు. తరువాత కాలంలో జరిగిన పురావస్తు పరిశోధనలవలన ఉత్తర ప్రదేశ్‌లోని ఆలంగీర్‌పూర్ వద్దను గుజరాత్‌లోని, లోథాల్, రొజ్‌డి, ధోళవీర, రంగపూర్‌లలోను, పంజాబ్‌లోని రూపార్‌లోను బెలూచిస్తాన్‌లోని సుక్తజెన్‌దార్‌లోను, నర్మదా నదీ తీరంలోని భగత్రావ్ వద్ద, ఢిల్లీ సమీపంలోని రాఖీగర్ మొదలగు సింధు నదీలోయ దూర ప్రాంతాలలో కూడ ఈ నాగరికత శిథిలాలు బయల్పడ్డాయి. దాదాపు ఉత్తర వాయవ్య భారతదేశంలో సువిశాల భూభాగంలో ఈ నాగరికత విస్తరించి ఉన్నందువలన దీనిని మూల భారతీయ నాగరికత (Proto - Indian Civilization) అని గాని, 'హరప్పా తరహా నాగరికత' అని గాని పిలవటం సమంజసం అని కొందరు చరిత్రకారులు అభిప్రాయ పడుతున్నారు. మరికొంత మంది చరిత్రకారుల అభిప్రాయంలో ఈ నాగరికత తామ్ర శిలాయుగ దశకు చెందినది. కాని తామ్ర శిలాయుగ దశలో గ్రామీణ వ్యవసాయ తెగలు రాతి పనిముట్లతో బాటు మొదటి సారిగా రాగి పనిముట్లు ఉపయోగించారు. సాంకేతికంగా చూసినట్లయితే పూర్వ హరప్పా సంస్కృతుల (Pre - Harappan Cultures) లోను, హరప్పా తరువాత సంస్కృతుల (Post Harappan Cultures) లోను, తామ్ర శిలాయుగ లక్షణాలు కనిపిస్తాయి. తామ్ర శిలాయుగ లక్షణాలకు భిన్నమైన పట్టణ నాగరికతతోను, కంచును ఎక్కువగాను ఉపయోగించుట వలన సింధు నాగరికతలో కాంస్యయుగ నాగరికత ఛాయలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## 4.5 నాగరికత ఆవిర్భావము :

సింధు నాగరికత ఆవిర్భావము గురించి ఇప్పటికి అనేక రకాల అభిప్రాయాలున్నాయి. క్రీ.పూ. 3000 సం॥ల ప్రాంతంలో సింధు మైదానంలో సింధు నాగరికత ఆవిర్భవించిందని 1950 వరకు చరిత్రకారులు విశ్వసించారు. పశ్చిమ ఆసియా, మెసపొటేమియా రాజ్యాలకు చెందినవారు ఇక్కడ ఈ నాగరికతకు నిర్మాతలను భావము ప్రచారంలో ఉన్నది. ఆ తరువాత కాలంలో జరిగిన పరిశోధనలవలన ఈ అభిప్రాయంలో మార్పు వచ్చింది. A. ఘోష్ అనే భారతీయ పురావస్తు పరిశోధకుడు 1950 - 51 సంవత్సరాలలో ఘగ్గర్, దృశద్వతి (చౌటంగ్) నదీలోయలలో జరిపిన పరిశోధనల ఫలితంగా పూర్వ హరప్పా (Pre Harappan) యుగానికి చెందిన మృణ్మయ పాత్రలు కనుగొనబడ్డాయి. ఇటువంటి పాత్రలే కాలీబంగన్‌లోని పూర్వ హరప్పా సంస్కృతీ దశలో లభించాయి. ఈ దశకు ఘోష్, సోథీ సంస్కృతి అని పేరు పెట్టాడు. ఇటువంటి పూర్వ హరప్పా దశ అవశేషాలు గుజరాత్, రాజస్థాన్, సింధు, పంజాబ్, బెలూచిస్తాన్‌లో కనుగొన్నారు. ఈ

పరిశోధనలే కాక బోలాన్ నదీలోయలో మెహర్‌గర్ వద్ద 1975 లో ఫ్రెంచి పురావస్తు శాస్త్రవేత్త జరిపిన త్రవ్వకాల వలన క్రీ.పూ. 7000 సంవత్సరాల నుండి క్రీ.పూ. 2800 వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగిన మానవ ఆవాసాలు కనుగొనబడ్డాయి. వేట, ఆహార సేకరణ దశ నుండి మానవుడు పశువులను మచ్చిక చేసి పంటలు పండించే దశ వరకు మానవ సంస్కృతీ పురోగతికి అనుకూల వాతావరణం మెహర్‌గర్ కల్పించింది. పచ్చి ఇటుకలతో నిర్మించబడిన చతురస్రాకారపు గదులున్న నివాస గృహాలు ఈ త్రవ్వకాలలో బయల్పడ్డాయి. రాతి బ్లేడ్ పరిశ్రమ, కలువాలు, పాత్రాలు (Grinding stones), ఎముకలతో చేసిన పనిముట్లు, ఎముకలతో చేసిన సూదులు, రాతి బ్లేడ్‌లు అమర్చిన కొడవళ్ళు, రాతి, గవ్వలతో చేసిన పూసలు, ధాన్యాన్ని నిలువ చేయుటకు ప్రత్యేకముగా నిర్మించిన గదులు కూడ ఈ త్రవ్వకాలలో బయల్పడ్డాయి. బార్లీ, గోధుమ ధాన్యపు గింజలు దాదాపు 6000 ఈ త్రవ్వకాలలో లభించాయి. ఈ ధాన్యపు గింజలు అడవి మొక్కలనుండి కృత్రిమంగా పండించే దశకు మారే దశలో ఉన్నాయి. వీటితో బాటు స్థానికమైన ద్రాక్ష, ఖర్జూరపు విత్తనాలు దొరకటం కూడ ఈ ప్రదేశంలో వ్యవసాయ అభివృద్ధిని సూచిస్తున్నది. క్రీ.పూ. 3500 తరువాత ఇక్కడ చిన్న టెర్రకోటా మట్టితో తయారు చేసిన మాతృదేవతల బొమ్మలు, రకరకాలైన చిత్రాలంకృత మృణ్మయ పాత్రలు లభించాయి. ఇవన్నీ వ్యవసాయంతో ముడిపడిన గ్రామ సముదాయాలు క్రమముగా విస్తరించటంలో జరగిన పరిణామాన్ని సూచిస్తున్నవి.

కాలక్రమేనా జనాభా పెరుగుదల, వ్యవసాయాభివృద్ధి వలన, ఈ వ్యవసాయ గ్రామాల పెరుగుదల విస్తృతి వలన సింధు మైదానములో చిన్న చిన్న పట్టణాలు ఏర్పడటం ప్రారంభమయ్యింది. ఇటువంటి పట్టణాల తొలిదశల ఆనవాళ్ళు మనకు రాహమాన్ ధేరీలో కనిపిస్తున్నాయి. ఇక్కడ ప్రణాళికా బద్ధంగా చతురస్రాకారంలో నిర్మించిన వీధులు తొలిసారిగా కనిపిస్తున్నాయి. ఇండ్లను పచ్చి ఇటుకలతో నిర్మించారు. పట్టణం చుట్టూ ఈ దశలోనే నిర్మించిన దక్షిణ ప్రాకారం కూడ బయల్పడింది. ఇటువంటి చిన్న చిన్న పట్టణాలు సింధు నదీ తీరాన గుమ్లావద్ద, బన్ను లోయలోని లెవాన్, పోత్వార్ పీఠభూమిలోని సరాయ్‌ఖోలా, రావితీరాన ఉన్న జలీల్‌పూర్‌లలో కూడ బయల్పడ్డాయి.

బెలూచిస్తాన్ లోని క్వెట్టాలోయకు చెందిన కిలిగుల్ మహమ్మద్, లోరాలాయి నదీలోయ ప్రాంతంలోని రనఘుండాయి, సుర్ జంగల్, మధ్య బెలూచిస్తాన్‌లో అంజీరా, సియా - డాంబ్, కలాట్, ఆగ్నేయ ఆఫ్ఘనిస్తాన్‌లోని ముండిగాక్, జోబ్ నదీలోయలోని పెరియానఘుండాయి, దక్షిణ బెలూచిస్తాన్‌కు చెందిన నాల్, కుల్లి, సింధునది డెల్టా ప్రాంతంలోని అమిడి, కొట్‌జి, మొదలగు ప్రదేశాలలో లభించిన పురావస్తు అవశేషాలు అక్కడి నవీన శిలాయుగ ప్రారంభ దశ నుండి తామ్ర శిలాయుగ సంస్కృతి వరకు అనగా పూర్వ హరప్పా సంస్కృతి దశకు చెందిన పరిణామ దశలను సూచిస్తున్నాయి.

సింధు నదీలోయలో దక్షణ ప్రాంతంలోని కొర్ధివా వద్ద బయల్పడిన నవీన శిలాయుగ స్థావరాలలో చివరి దశలో వరి ధాన్యపు గింజలు లభించాయి. ఈ నవీన శిలాయుగ చివరి దశ C. 14 ప్రకారం క్రీ.పూ. 5440 - 4530 సం॥ల కాలానికి చెందినదని తెలుస్తున్నది. అక్కడ లభించిన మృణ్మయ పాత్రలను మట్టితో పాటు వరి పొట్టునుపయోగించి తయారుచేశారు.

ఈ వివరాల ప్రకారం బెలూచిస్తాన్, క్వెట్టా, బోలాన్, లోయల్లోని అనేక ప్రదేశాలలో సింధు నదీలోయలోని కొన్ని ప్రాంతాలలో క్రీ.పూ. 7000 సం॥ల నుండి అవిచ్ఛిన్నంగా సాంస్కృతీ పురోగతి జరిగి కాలక్రమేణ సింధు సంస్కృతి ఆవిర్భావానికి దోహదపడినట్లు తెలుస్తున్నది. క్రీ.పూ. 5000 సం॥ల నాటికి అరేబియా దేశ తీర ప్రాంతంతోను, మధ్య ఆసియాలతో వాణిజ్య సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ స్థావరాలలో క్రీ.పూ. 4000 సంవత్సరాల నాటికి రాగి పనిముట్ల వాడకం ప్రారంభమైనది. క్రీ.పూ. 3500 సంవత్సరాల నాటికి సింధు నది దాని ఉపనదులయిన జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్, నదీలోయల్లో అనేక ప్రదేశాలలో జనావాసాలు ఏర్పడడం మొదలయి తరువాత కాలంలో సింధు సంస్కృతి ఆవిర్భవించింది.

ఈ పరిశోధనలు సింధు నాగరికత సింధు లోయ, బెలూచిస్తాన్, తదితర ప్రాంతాలలో స్థానికంగా అభివృద్ధి చెంది రూపొందినదే కాని ఇతర దేశాల నుండి వచ్చినది కాదని తెలుస్తున్నది.

## 4.6 నాగరికతా నిర్మాతలు :

సింధు సంస్కృతీ ప్రజలు ఎవరనే అంశం కూడ వివాదగ్రస్తమైన విషయమే. సింధునాగరికతా నిర్మాతలను గురించి తెలుసుకొనుటకు మనకు లభ్యమౌతున్న ఆధారాలు సింధు నాగరికతా స్థావరాలలో లభించిన అస్తిపంజరాలు, కపాలాలు మాత్రమే. ఈ అస్తిపంజరాలు సింధు నాగరికతా నిర్మాతలు ఏదో ఒక జాతికి చెందిన వారుగాక వివిధ జాతుల మిశ్రమాన్ని సూచిస్తున్నాయి. ఈ అస్తిపంజరాలు ప్రోటో ఆస్ట్రలాయిడ్, మెడిటరేనియన్, ఆల్పినాయిడ్. (ఆర్మెనాయి శాఖ) మంగోలాయిడ్ జాతులకు చెందినవి ఉన్నాయి. అయితే వీరిలో అధిక సంఖ్యాకులు మెడిటరేనియన్ (ద్రావిడ) జాతికి చెందినవారు. దీనిని బట్టి సింధు నాగరికతా నిర్మాతలు ఆర్యేతరులని తెలుస్తున్నది. ఇప్పటికి సింధు నాగరికతా నిర్మాతలు ఆర్యులని కొందరు, ద్రావిడులను మరికొందరు చరిత్రకారులు వాదోపవాదాలు చేస్తూనే ఉన్నారు. K.N. దీక్షిత్, నీలకంఠ శాస్త్రి మొదలగు వారు సింధు నాగరికతా నిర్మాతలు ద్రావిడులని వీరు బెలూచిస్తాన్ ప్రాంతం నుండి సింధు ప్రాంతానికి వచ్చి ఉంటారని భావిస్తున్నారు. A.D. పుసల్కర్, G. వెంకటేశ్వర్, మొదలగువారు సింధు నాగరికతా నిర్మాతలు ఆర్యులేనని వాదిస్తున్నారు.

## 4.7 సింధు నాగరికత లక్షణాలు : నగర నిర్మాణం :

మొహంజోదారో, హరప్పాలలో శిథిలాలను పరిశీలిస్తే నాటి నాగరికత పట్టణ నాగరికత అని చెప్పవచ్చును. మొహంజోదారో, హరప్పా, పట్టణాలు సింధు ప్రజల నగర భవన నైపుణ్యాన్ని చాటి చెప్తున్నాయి. మొహంజోదారో కంటే హరప్పా పెద్ద నగరం రూపార్, లోథాల్ నగరాలు చిన్నవి. ఈ సింధు నగరాలు వాస్తు విద్యలో నిర్దుష్టమైన సూత్రాలను అనుసరించినట్లుగా తెలుస్తుంది. మొహంజోదారో హరప్పా నగరాలలో రెండు ప్రధాన భాగాలు కనిపిస్తున్నాయి. పశ్చిమాన మెరక ప్రాంతంలో దుర్గం, తూర్పు పల్లపు ప్రాంతాలు పౌర నివాసాలు ఉన్నట్లు తెలుస్తున్నది. మెరక ప్రాంతాలపైన నిర్మించిన దుర్గానికి అష్టముఖ ద్వారాలు, చుట్టూ కందకం, మధ్యలో ఎత్తైన వేదికను నిర్మించినారు. ఈ ప్రాంతంలో బహుశ రాజుల నివాసాలు, ప్రభుత్వ భవనాలు, ఇతర ముఖ్య కట్టడాలు ఉండి ఉండవచ్చును. తూర్పున పల్లపు ప్రాంతాలలో పౌర నగరంలోని ప్రధాన వీధులు ఉత్తర దక్షిణాలు గాను ఉపవీధులు తూర్పు పడమరలు గాను బారులు తీర్చినట్లు ఉన్నాయి. ప్రతి వీధికి బావులు, దీపపు స్తంభములు అక్కడ చెత్త కుండీలు ఉండేవి. నగరంలోని మురుగునీరు బయటకు వెళ్ళుటకు భూగర్భమున ఇటుకలతో కట్టిన డ్రైనేజ్ కాలువ ఏర్పాటు చేయబడినది.

**4.7.1 భవనాలు :** ఈ నగరాలలోని భవనాలను 1) నివాస గృహాలుగాను, 2) పెద్ద భవనాలుగాను, 3) పౌర నిర్మాణాలు గాను విభజించవచ్చును. సంపన్నుల ఇళ్ళు 5, 6 గదులతో విశాలంగా ఉండేవి. సామన్యులవి చిన్న ఇళ్ళు అన్ని ఒకే విధంగా నిర్మితమైనవి. ఇళ్ళకు కాల్చిన ఇటుకలు వాడేవారు. గోడలు మందంగా ఉండేవి. పెద్ద ఇండ్లలో వంటకు, స్నానానికి, పడకకు, అలంకరణకు ప్రత్యేక గదులు ఉండేవి. ప్రతి ఇంటికి బావులు కలవు ఇంటి మురుగు నీరు కాలువలు వీధి మురుగు కాలువలుతో కలసి ఉండేవి. హరప్పాలో కూలీల ఇండ్ల వరుసలు బయట పడినాయి. ఈ కూలీల ఇండ్లు అన్నిటికి కలిపి ఒకే బావి ఉన్నది.

**4.7.2 ప్రజాహిత కట్టడాలు :** సింధు ప్రజల నిర్మాణ కౌశల్యం వారి పౌర నిర్మాణాలలో కన్పిస్తున్నది. మొహంజోదారోలో బయట పడిన స్నానవాటిక చాలా క్లిష్టమైన నిర్మాణం. 11.7 మీ. పొడవు 6.9 మీ. వెడల్పు. 2.2.మీ.లు ఉన్న కొలనులో ఉత్తర, దక్షిణ దిక్కులలో మెట్ల వరుసలు, నైఋతి మూల తూము, కొలను చుట్టూ గదులు కలవు. ఒక గదిలో ఏర్పాటు చేసిన బావి నుంచి కొలనులోనికి నీటిని పంపేవారు. వేడి నీటిని పంపటానికి కూడా ఏర్పాట్లు ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ స్నాన వాటిక సింధు ప్రజల నిర్మాణ కౌశల్యానికి గీటు రాయి. ఇంకా పెద్ద పెద్ద మండపాలు, సభా భవనాలు బయట పడినాయి. స్నాన వాటిక సమీపంలో ఒక ధాన్యాగారం ఉంది. దీని పొడవు 150 అడుగులు, వెడల్పు 80 అడుగులు. దీనిలో ధాన్యపు కొట్లు ఉన్నాయి. ఈ విధంగానే హరప్పాలో బయల్పడిన ధాన్యాగారం కూడా ఒక విశిష్టమైన నిర్మాణం.

**4.7.3 మురుగు నీటి కాలువలు :** సింధు నగరాలలో వీధి వీధికి మధ్య భూగర్భంలో ఇటుకలతో కట్టిన మురుగు నీటి కాలువలు ఉన్నాయి. ఇండ్ల నుండి మురుగు నీరు మట్టి గొట్టాల ద్వారా ఈ కాలువలలోనికి ప్రవహించేది. కాల్వలును శుభ్రం చేయడానికి అక్కడక్కడ మనిషి దూరగల కన్నాలు ఉండేవి. ఈ మురుగు నీరు అంతా నగరానికి బయట నదిలో కలిసేవి. ఇలాంటి మురుగు నీటి పారుదల సౌకర్యాలు క్రీ.పూ. నాటి ఈజిప్టు, మొసపొటేమియా నాగరికతలకు చెందిన ఏ ప్రాచీన నగరంలో సైతం కనిపించలేదని పురావస్తు శాస్త్రవేత్తలు ఖచ్చితంగా చెప్పినారు.

## 4.8 సాంఘిక పరిస్థితులు :

సింధు ప్రజలు కేవలం పట్టణాలలోని గాక గ్రామాలలో కూడా నివశించేవారు. గ్రామాలలో కేవలం మట్టితో నిర్మించబడిన ఇళ్ళ వలన గ్రామాలు నామరూపాలు లేకుండా పోయినాయి. నాటి ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయము. ఈ నాగరికత విస్తరించిన ప్రాంతం అంతా ఆ రోజులలో సస్యశ్యామలం. పంటలు పుష్కలంగా పండేవి. గోధుమ, బార్లీ, ధాన్యం పండిస్తుండేవారు.

**ఎ) ఆహారం :** సింధు ప్రజలు శాకాహారులు, మరియు మాంసాహారులు. పాలు కూరగాయలు, ఖర్జూర పండ్లు, గోధుమలు, యవలు, గొర్రె, కోడి, సీమ పంది, ఎద్దు మొ॥న జంతువుల మాంసాలు చేపలు గ్రుడ్లు మొ॥నవి సింధు ప్రజల ఆహారాలు.

**బి) మచ్చిక చేయబడిన జంతువులు :**ఎద్దు, గేదె, ఒంటె, పంది, కుక్క, ఆవు మొదలగు జంతువులను వీరు మచ్చిక చేసి పెంచారు. వన్య మృగాలైన ఖడ్గ మృగము, పెద్దపులి, వానరము, ఎలుగుబంటు మొదలగు జంతువులు తెలుసు. ఇవి అన్నియు మట్టితో చేసిన పిల్లల ఆట వస్తువులలో మనకు కనిపిస్తాయి. గుర్రము వీరికి తెలుసా, లేదా అన్న విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మేకె ( MAKAY) అనే పండితుడు సింధు ప్రజలకు గుఱ్ఱము తెలుసు అని అంటాడు.

**సి) లోహములు :** సింధు ప్రజలకు ఇనుము తప్ప మిగిలిన లోహాలన్నీ తెలుసు. అనగా బంగారము, వెండి, రాగి, సీసము, కంచు, తగరము మొదలగునవి.

**డి) దుస్తులు :**సింధు ప్రజలు నూలు, ఉన్నితో తయారు చేసిన దుస్తులను ధరించేవారు. పురుషులు ధోవతి ఉత్తరీయము, స్త్రీలు రెండు రకాలైన వస్త్రాలంటే పై వస్త్రము, క్రింది వస్త్రము ధరించేవారు.

**ఇ) శిరోజాలంకరణ :**సింధు ప్రజలు అలంకార ప్రియులు. శిరోజాలంకరణలో స్త్రీ పురుషులు తీరు వేరు వేరుగా ఉంటుంది. కొందరు పురుషులు జుట్టు మీసం తీసేసి గడ్డం మాత్రమే పెంచుకొనేవారు. మరికొందరు జుట్టు పొడవుగా పెంచుకొని ముడివేసుకొనేవారు. స్త్రీలు జడలు, ముడులు వేసుకొనేవారు.

**యఫ్) ఆభరణాలు :**స్త్రీ పురుషులు తమ తాహతుకి తగినట్లుగా ఆభరణాలు ధరిస్తుండేవారు. బంగారము, వెండి, రాగి, దంతాలతో తయారు చేసిన ఆభరణాలను మరియు శిరో పట్టాలను ధరించేవారు. వీటిల్లో ముఖ్యమైనవి కంఠాభరణాలు, ఉంగరాలు, చెవి పోగులు, కడియాలు మొదలగునవి స్త్రీ పురుషులు ధరిస్తే స్త్రీ ప్రత్యేకముగా దుద్దులు ముక్కుపుడకలు, వడ్రాణాలు ధరించేవారు.

**జి) సౌందర్య పోషణ :** సింధు లోయ పరిసర ప్రాంతంలోని త్రవ్వకాలలో బయటపడిన ముస్తాబు భరిణిలవలన సింధు ప్రజలు సౌందర్య పోషణకు ప్రత్యేక శ్రద్ధ వహించినారని తెలుస్తుంది. ఈ ముస్తాబు భరిణిలు దంతాలతోను లోహాలతోను, శిలతోను మట్టితోను చేసేవారు. మొహంజోదారో స్త్రీలకు కాటుక, మైపూతలు తెలుసు. అధరాలకు రంగు వేసే పరికరాలు చన్హుదారో శిథిలాలలో లభించాయి. అలంకరణకవసరమైన మేజాలు, కంచు, అద్దాలు, దంతపు దువ్వెనలు లభించినాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని “అలంకార ప్రియత్వములో సింధు ప్రాంత స్త్రీలు నేటి సోదరీమణులకు ఏ మాత్రం తీసిపోరని” R.C. మజుందార్ అన్నాడు.

**హెచ్) ఆయుధాలు :** సింధు ప్రజలు ఉపయోగించిన యుద్ధాలలో వేటలలో ఉపయోగించే కత్తులు, బాకులు, ఈటెలు మొదలైనవి దొరికినవి. యుద్ధాలలో ఉపయోగించే కవచధారణ వీరికి తెలిసినట్లు లేదు. ఈ ఆయుధాలన్నీ రాగి, కంచుతో తయారు చేయబడినాయి.

**ఐ) గృహ పరికరాలు :**కుమ్మరిసారెపై చేయబడిన రకరకాలైన పాత్రాలు, రాయి, దంతము, మట్టి, లోహాలతో తయారు చేసిన రక రకాల పాత్రలు వీరు వాడినారు. కుర్చీలు, మంచాలు, చిన్న బల్లలు అందుకోసం ఉన్న ప్రత్యేక గదులలో ఇవి ఉన్నాయి. దారుశయ్యలు, రెల్లు చాపలు, రాగి లేద మట్టి దీపపు సెమ్మెలున్నాయి.

**జె) వినోదాలు :**ప్రజల వినోదాలకు సంబంధించి చంద్ర శిలలు, బంతులు, చదరంగపు పాచికలు లభించాయి. దీనిని బట్టి వీరికి సంగీతము, నాట్యము, వేట, పాచికలాట, చదరంగము లన్న అత్యంత ఆసక్తి అని తెలియుచున్నది. మృగయా వినోదము ప్రజలకు తెలుసు. వాహనాలు, గొఱ్ఱె పోతులు, స్త్రీ పురుష ప్రతిమలు, ఈలలు, గిలకలు వివిధ భంగిమలలో కదిలించే మృగాల బొమ్మలు పిల్లల ఆట వస్తువులు.

## 4.9 ఆర్థిక పరిస్థితి :

సింధు ప్రజల ముఖ్య వృత్తులు వ్యవసాయము, వర్తక వాణిజ్యము, వీరు పండించిన ధాన్యము, నూలు వస్త్రాలు, దంతపు దువ్వెనలు మొదలగునవి ఎగుమతి చేసి అలంకార సామగ్రి రాగి, తగరాలను దిగుమతి చేసికొన్నారు. ఎద్దుల బండి, పడవ వీరి ప్రయాణ సాధనాలు. వస్త్రాలు తయారు చేయడం వీరి ముఖ్య పరిశ్రమ. వీరు కొనుగోలు చేయుటలో తూకపు పద్ధతిని అంటే త్రాసులను, తూకపు రాళ్లను ఉపయోగించారు. కొలతలు దశాంశ పద్ధతిలో ఉండేవి. వీరికి మధ్యాసియా, మెసపుటేమియా, ఈజిప్టు మొదలగు దేశాలతో వ్యాపార సంబంధాలు ఉండేవి. గుజరాత్‌లోని లోథాల్ వీరి ముఖ్య రేవు పట్టణము.

## 4.10 కళలు :

సింధులోయ ప్రాంతాలలో బయటపడిన పాత్రలపై చెక్కిన బొమ్మలు, చిత్ర లేఖనాలు ఆనాటి సింధు ప్రజల శిల్ప కళా దృష్టికి, చిత్రా కళా నైపుణ్యానికి నిదర్శనాలు. గృహాలలోను, కట్టడాలలోను అలంకరణ ఏమాత్రము లేదు. సింధు నాగరికతలో బయల్పడిన విగ్రహాలే భారతీయ శిల్పకళకు నాంది అనవచ్చును. దీనికి ఉదాహరణ మొహంజోదారోలో లభ్యమైన నగ్నముగా ఉన్న నాట్యగత్తె కాంశ్య ప్రతిమ వీరి లోహ శిల్పకళకు మచ్చుతునక. అలాగే యోగముద్రలో ఉన్న పురుష విగ్రహము, హరప్పాలో లభించిన రెండు విగ్రహాలను బట్టి అవయవాలను విడి, విడిగా చేసి బిగించే పద్ధతి ఈ కాలపు శిల్పులకు తెలుసునని తెలుస్తుంది. వీటిలో ఒక మొండెము నాట్య భంగిములో ఉంది. మట్టితో చేసిన.(Terracottas) జంతువుల బొమ్మలు, మనుషుల బొమ్మలు సింధు లోయ త్రవ్వకాల్లో బయటపడినాయి. జంతువుల బొమ్మలలో పెద్దపులి, ఖడ్గ మృగము, వానరము, పిల్లి, శునకము, ఎలుగుబంటు, గాడిద, డేగ, ముంగిస, ఉడత, చిలుక, నెమలి మొదలగునవి ఉన్నాయి. ఇవి అన్ని పిల్లల ఆట వస్తువులై యుండవచ్చును. సింధు ప్రజల చిత్ర కళాకౌశల్యానికి నిదర్శనమైన మట్టిపాత్రలపై వారుచిత్రించిన చిత్ర లేఖనాలు అయిన జంతువులు, పక్షులు, సర్పాలు, చేపలు, లతలు, వృక్షాలు మొదలగునవి అద్భుతమైనవి.

## 4.11 మత విశ్వాసాలు :

సింధు ప్రజల ముద్రికలు, ప్రతిమలు, శిలావిగ్రహాలు వారి మతాన్ని తెలియచేస్తాయి. వీటిని బట్టి వారు బహు విధమత విశ్వాసాలు, ఆచారాలు పాటించినట్లు తెలుస్తున్నది. వీరు స్త్రీ పురుష దేవతలను, వృక్షాలను, జంతువులను, సర్పాలను పూజించారు. ఎక్కువ స్త్రీ ప్రతిమల విగ్రహాలు లభించినాయి. కాబట్టి వీరు ప్రధానముగా దేవీ ఆరాధకులని తెలియుచున్నది. కొన్ని ప్రతిమలలో దేవి నిలబడి నగ్నమై బరువైన శిరోవేష్టనము, వివిధ ఆభరణాలు ధరించి యున్నది. వీటిని బట్టి ఈ రూపము అమ్మ తల్లిగాని, ప్రకృతి రూపముగాని అయి ఉంటుంది. ఇటువంటి ప్రతిమలు పశ్చిమాసియ, గ్రీసు, ఇరాన్ దేశాలలో లభించినాయి. జాతర సమయంలో దేవిని

ఆరాధించుటకు జంతుబలులు, నరబలులు ఇచ్చినారనుటకు సాక్షంగా కొన్ని ముద్రికలు దొరికాయి. తాయత్తులను నమ్మేవారు. వీరు పూజించే పురుష దేవతలలో ఒక ముద్రికపైన మూడు ముఖాలతో పద్మాసీనుడై ఉన్నాడు. ఆసనంక్రింద లేడి ఉన్నది దేవునికి కంఠాభరణాలు, కంకణాలు, రెండు కొమ్ములున్న కిరీటము ఉన్నాయి. చుట్టూ ఏనుగు, పెద్ద పులి, ఖడ్గమృగము ఉన్నాయి. అందుకనే సర్‌జాన్ మార్షల్ ఈ మూర్తిని పశుపతి (శివుడు) అని అభిప్రాయ పడినాడు.

## 4.12 లిపి :

సింధు ప్రజలు లిపిని ఉపయోగించారు. ముద్రికల మీద ఉన్న ఈ లిపిని ఇంతవరకు ఎవరూ చదవలేకపోయారు. ఈ లిపికి ఉపయోగించిన భాష గురించి కూడ భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు సింధు ప్రజల భాష ఇండో - ఆర్యుల కుటుంబానికి చెందినదని వాదించగా మరికొందరు అది ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదని వాదిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు వందమందికి పైగా పరిశోధకులు సింధు లిపిని చదవడానికి ఎన్నో విధాలుగా ప్రయత్నించారు. కాని వీరిలో ఏ ఇద్దరు కూడ ఒకే విధమైన అభిప్రాయానికి రాలేదు. ఈ పరిశోధనలు సింధు లిపిని చదవటంలో మరిన్ని సమస్యలను ఈ సమస్యకు అనుబంధంగా చేరుస్తున్నాయి.

సింధు లిపిని చదవటానికి ప్రయత్నించిన ప్రముఖ ఫిన్‌లాండ్ పరిశోధకుడు పార్పోలా సింధు లిపి, భాషలు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదని భావించాడు. ఈ అభిప్రాయాన్నే మార్షల్, హంటర్, మహదేవన్ మొదలగువారు కూడా వ్యక్తంచేశారు. బెలూచిస్తాన్ పర్వత ప్రాంతాలలో నివసించే సంచార జాతి వారైన బ్రాహుయి తెగ మాట్లాడే భాష ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది కావటం, ఆర్యులు భారతదేశంలో ప్రవేశించటానికి ముందే ఉన్న నాగరికత సింధు నాగరికత కావటంచేత వీరు సింధు ప్రజల భాషను ద్రావిడ భాషాకుటుంబానికి చెందినదనే అభిప్రాయాన్ని సమర్థిస్తున్నారు.

S.R. రావు మొదలగు వారు సింధు ప్రజల భాష సంస్కృతమని వాదిస్తున్నారు. సింధు లిపినుండే బ్రాహ్మీ లిపి ఉద్భవించిందని S.R. రావు, ప్రొఫెసర్ లాంగ్డన్ మొదలగు వారి అభిప్రాయం. కాని దీనిని ఋజువు చేసే సాక్ష్యాధారాలు లేవు.

సింధు ముద్రికలపై నున్న లిపి చాలా వరకు సాంకేతికమైనది. వీటిలో కొన్ని మత్స్య, మానవ, పక్షి ఆకృతులలో ఉన్నాయి. ఇప్పటి వరకు లభించిన ముద్రికలపై ఉన్న ఈ చిహ్నాల సంఖ్య గురించి కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. G.R. హంటర్ 149 చిహ్నాలున్నాయని భావించగా, A.H. దాని ఈ చిహ్నాలు 537 అని, పార్పోలా 396 అని, మహదేవన్ 417 అని, ఫెయిర్ సర్వీస్ 419 అని రకరకాలుగా వివరిస్తున్నారు. ఈ లిపిని కుడినుండి ఎడమకు వ్రాశారు. ఈ లిపికి సమాకాలిక. నాగరికతలైన ఈజిప్ట్, సుమేరియా లిపులకు ఎటువంటి సంబంధము లేదు. ఇప్పటివరకు లభ్యమయిన ముద్రికలపై ఉన్న శాసనాలు చాలా చిన్నవి. వీటిలో అతి పెద్ద శాసనంలో 17 చిహ్నాలు మాత్రమే ఉన్నవి.

## 4.13 మృత సంస్కారాలు :

సింధు ప్రజలు అనేకరకాల మృత సంస్కారాలను అనుసరించారు. మార్టిమర్ వీలర్ హరప్పాలోని 67 సమాధులున్న శ్మశానాన్ని కనుగొన్నప్పుడు శవాన్ని పూడ్చి పెట్టడం సాధారణమైన మృత సంస్కారము కాగా శవాన్ని సమాధి చేసే పద్ధతి ప్రదేశాలను బట్టి వివిధ రకాలుగా ఉన్నట్లు తెలియ వచ్చింది. మొహంజోదారోలో మూడు రకాలైన సమాధులను కనుగొన్నారు. మొదటి పద్ధతిలో శవాన్ని వివిధ పద్ధతులతో కర్మ కాండ జరిపి అనేకరకాల గృహోపకరణ సామగ్రితోను, కానుకలతోను పూడ్చిపెట్టేవారు. ఇటువంటి సమాధులు 30 వరకు ఉన్నాయి. రెండవ పద్ధతిలో మృతదేహాన్ని మృగాలకు, పక్షులకు వదలి తరువాత శవం అస్థికలను మృణ్మయ పాత్రలలో ఉంచి భూస్థాపితం చేయటం. ఇటువంటి ఐదు సమాధులు మొహంజోదారోలో బయల్పడ్డాయి. ఒక సమాధిలో ఎముకలతో పాటు అనేక మృణ్మయ పాత్రలు, పూసలు, శంఖంతో చేసిన గరిటె, దంతపు సామాగ్రి లభించాయి. ఇక మూడవ పద్ధతిలో పెద్ద మూతిగల మృణ్మయ పేటికలలో గొఱ్ఱె, మేక మొదలగు జంతువులు ఎముకలు, పక్షి, మత్స్యాల అవశేషాలతోను, పూసలు, గాజులు, మట్టి బొమ్మలతోను,

చనిపోయిన వ్యక్తి చితాభస్మముంచి గృహంలోకాని, గృహసమీపంలో కాని భూస్థాపితం చేసేవారు. దాదాపుగా అన్ని సింధు నాగరికతా నగరాలలో ఇటువంటి మృత సంస్కారాలనే పాటించినట్లు త్రవ్వకాలలో బయల్పడిన సమాధుల వలన తెలుస్తున్నది. కొన్ని సందర్భాలలో కుటుంబంలోని రెండు మృత దేహాలకు ఒకే సమాధిని ఏర్పాటు చేసే ఆచారమున్నట్లు లోథాల్‌లో బయల్పడిన సమాధి వలన తెలుస్తున్నది.

## 4.14 సింధు నాగరికత పతనం - కారణాలు :

క్రీ.పూ. 2000 - 1700 సం॥ల మధ్య కాలంలో సింధు నాగరికత క్షీణించి పతనం కావటం ప్రారంభమైంది. ఈ నాగరికత పతనం ప్రతికూల వాతావరణం, అంటువ్యాధులు, ఆర్యుల దండయాత్రలు, వరదలు మొదలగు కారణాల వలన జరిగి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. క్రీ.పూ. 1700 తరువాత సింధు నాగరికత ప్రధాన కేంద్రాలయిన హరప్పా, మొహంజోదారోలను ప్రజలు పూర్తిగా విడిచిపెట్టారు. అయితే సింధు నాగరికతా పతనం కొన్ని వందల సవంత్సరాలు పట్టింది. మొహంజోదారో లోని చివరి దశలో అంతకు పూర్వం గృహాలకు వాడిన ఇటుకలనే తిరిగి గృహనిర్మాణంలో ఉపయోగించారు. ఈ నిర్మాణాలు కూడ పూర్వపు దశలో ఉన్నట్లుగా కాక చాల హీనమైన రీతిలో నిర్మించబడ్డాయి. వీధులను, బహిరంగ ప్రదేశాలను ఆక్రమించి గృహనిర్మాణాలు నిర్మించటం, కుమ్మరి ఆములను నివాస స్థలాలో ఏర్పరచడం వంటి అంశాలు సింధు నాగరికతా పతనదశను సూచిస్తున్నాయి.

**4.14.1 ఆర్యుల దండయాత్ర :** మార్టిమర్ వీలర్ అభిప్రాయంలో ఆర్యుల దండయాత్ర వలన సింధు నాగరికత ధ్వంసమయ్యింది. మొహంజోదారోలో చివరి దశలో వీధుల్లో, గృహాల్లో పురుషులు, స్త్రీలు, పిల్లలు అనే తేడాలేకుండా ఎంతోమందిని క్రూరంగా చంపిన ఆనవాళ్ళున్నాయిని, ఒక గదిలో 13 మంది స్త్రీ, పురుషుల, ఒక బాలుడి అస్థిపంజరాలు లభించాయి. వీరందరిని ఒకేసారి చంపారని, వీరిలో ఒక పుఱ్ఱెపై కత్తితో గాయమైన చిహ్నం ఉన్నందువలన మొహంజోదారోలో చివరి దశలో వీధుల్లోను, ఇండ్లల్లోను, ఎంతోమంది స్త్రీ పురుషులను పిల్లలను అతిదారుణంగా వధించినట్లు, వారి శవాలకు ఎటువంటి మృత సంస్కారాలు జరుపకపోవటం ఈ విషయాన్ని ధృవ పరుస్తున్నట్లు" వీలర్ పేర్కొన్నాడు. ఈ ఆధారాల వలన ఆర్యుల ప్రధాన సేనాని ఇంద్రుడు ఈ వినాశనానికి కారణమని వీలర్ అభిప్రాయం. ఋగ్వేద ఆర్యుల ప్రధాన దైవమైన ఇంద్రునకు పురందరడనే పేరుకూడ ఉన్నది. పురందరుడు అనగా నగరాలను నాశనం చేసినవాడని అర్థం. హరప్పా, మొహంజోదారో, మొదలైన నగరాలను ఇంద్రుడు నిర్మూలించాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. అంతేకాక ఋగ్వేదంలో 'హరియూపీయము' వద్ద ఆర్యులు వృచీవంతులను జయించినట్లు వర్ణించబడింది. 'హరియూపీయము' ను హరప్పా నగరముగా గుర్తిస్తున్నారు. ఇక "బ్రాహ్మణాల' లో వినష్టగ్రామము అని అర్థము వచ్చె 'అర్మ', 'అర్మక' అనే పదాలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. ఇటువంటి అంశాలను ఆధారంగా సింధు నగరాలపై క్రీ.పూ. 1200 సంవత్సరాల ప్రాంతంలో దండయాత్ర చేసి ఆ నగరాలను ధ్వంసం చేసి సింధు నాగరికతా పతనానికి ఆర్యులు కారకులయ్యారని కొంతమంది చరిత్రకారులు భావిస్తున్నారు.

**4.14.2 సింధునది వరదలు :** సర్‌జాన్ మార్షల్, E.J.H. మాకే మొదలగువారి అభిప్రాయం ప్రకారం సింధు నాగరికత పతనం చెందడానికి ప్రధానకారణం హఠాత్తుగా వస్తున్న సింధునది వరదలే. సింధు నాగరికతాభివృద్ధికి సింధునది ఎంతగా దోహదపడిందో అదే విధంగా ఆ నాగరికత పతనం కావటానికి, సింధు నగరాలు నిర్జనమై శిధిలాలు కావటానికి కూడా కారణమయ్యిందని మార్షల్ పేర్కొంటున్నాడు. కాని ఈ సిద్ధాంతాన్ని వ్యతిరేకించేవారు లేకపోలేదు. లోథాల్, మొహంజోదారోలలో మాత్రమే వరదలు వచ్చిన చిహ్నాలు కనిపిస్తున్నాయి కాని కాలీబంగన్ మొదలగు ఇతర నగరాలలో ఇటువంటి ఆనవాళ్ళు కనిపించటంలేదు.

ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సింధు నదికి తరుచుగా వస్తున్న వరదలు, ఈ నాగరికత నిర్మూలనానికి కారణాలు అని ప్రముఖ భారత పురావస్తు శాస్త్రవేత్త అయిన B.K. థాపర్ అభిప్రాయం.

**4.14.3 పర్యావరణంలో వచ్చిన మార్పులు :** ఇటీవల కాలంలో అనేక మంది పురావస్తుశాస్త్రజ్ఞులు పర్యావరణంలో వచ్చిన మార్పులు సింధు నాగరికత పతనానికి కారణాలుగా అభిప్రాయ పడుతున్నారు. B.K. థాపర్, రఫీక్ ముఘల్ మొదలగు వారి సిద్ధాంతం ప్రకారం

హిమాలయ పర్వత ప్రాంతంలో అడవులను విచక్షణా రహితంగా నరికివేయడం వలన భూమి కోతకు గురికావటంతో పాటు, నదీజలాలు కాలుష్యమైనాయని, ఈ కారణాలతో పాటు ఘగ్గర్ - హాక్రా నదులు ఎండిపోయి వ్యవసాయము జరగనందున సింధు నాగరికత పతనమయ్యింది. K.A.R. కెన్నడి, W.A. ఫెయిర్ సర్వీస్, విష్ణు మిత్రే మొదలగు వారి అభిప్రాయం ప్రకారం విపరీతంగా అడవులను నరకడం వల్లను, భూమిలో క్షారగుణం ఎక్కువై భూసారం తగ్గి ఎడారి పెరగడం వలన, నదీ జలాలు ఎండిపోయి సింధు ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన కారణంగా సింధు నాగరికత క్షీణించి పతనమయ్యింది.

సింధు ప్రజలు తమ వ్యవసాయానికి ప్రధానంగా సింధు నది, ఘగ్గర్ - సరస్వతికి వచ్చే వరదల ద్వారా వచ్చు నీటిపైన, క్రమము లేకుండా వచ్చు వర్షాలపైనా ఆధారపడినారు. నదీజలాలు అడుగంటి, వర్షాలు సక్రమంగా పడనందున వ్యవసాయానికి అవసరమైన నీరు లభ్యం కానందున సింధు ప్రజలు కాలువల ద్వారా నీటిని పొలాలకు మళ్ళించి వ్యవసాయాన్ని కొనసాగించారు. సింధు నాగరికతా ప్రదేశాలలో అధిక భాగం ఘగ్గర్ - హక్రా నదులపైన కేంద్రీకరించబడి ఉన్నాయి. అంటే ఈ ప్రదేశాలు ఘగ్గర్ - హక్రా నదీ జలాలపై ఆధారపడి వ్యవసాయం సాగిసున్నారు. కాని హక్రా నది సింధు ప్రజల అవసరాలు తీర్చేంత నీటిని సరఫరా చేయలేక పోయింది. హక్రా నది క్రీ.పూ. 2500 నాటికి ఎండిపోవటం చేత సింధు నాగరికత క్షీణత ప్రారంభమయ్యింది. ఫలితంగా ఈ ప్రాంతాలలో నివసించే ప్రజలు శీతాకాలంలో కురిసే వర్షాలపైనా, బావుల పైనా ఆధారపడవలసి వచ్చింది. నీటి వనరుల సౌకర్యం తగ్గడం, భూసారం తగ్గడం కారణాలవలన వ్యవసాయోత్పత్తులు పెరిగిన జనాభాకు చాలినంతగా లభించనందున సింధు ప్రజలు తమ నివాసాలను వదిలి ఇతర ప్రాంతాలకు వివిధ దశల్లో వెళ్ళటం వలన ఈ నాగరికత క్షీణించి పతనమయ్యింది.

మనకు లభ్యమవుతున్న ఆధారాల ప్రకారం క్రీ.పూ. 3000 సంవత్సరాల నాటికే ఈ కాంస్య యుగ నాగరికత ప్రారంభమైనది. సింధు ప్రజలు ఉపయోగించే రాగి, కంచు సామాగ్రి తయారు చేయటానికి అవసరమైన కలప కోసం, గృహనిర్మాణాల కోసం ఎన్నో అడవులను నరకవలసి వచ్చింది. ఉదాహరణకు ఇరువై గొడ్డళ్ళను తయారు చేయటానికి 700 కిలోల వంట చెరుకు అవసరం. ఫెయన్సి (Faience) తో తయారు చేసే ఆభరణాలతయారీకి కూడ ఎంతో కలప అవసరం. అలాగే గృహ నిర్మాణంలో వాడిన ఇటుకలను కాల్చడానికి, కుండలను కాల్చడానికి కూడా విస్తృతంగా కలపను ఉపయోగించారు. మెసొపొటేమియాకు సింధు ప్రజలు పడవలను, కలపతో తయారు చేసిన గృహోపకరణాలను విరివిరిగా ఎగుమతి చేశారు. వీటి నిర్మాణానికి కూడా ఎంతో కలప అవసరమయ్యింది. ఇటువంటి అవసరాల కోసం విచక్షణారహితంగా అడవులను నరికివేయడం వలన పర్యావరణ సమతౌల్యానికి భంగం కలిగిన ఫలితంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడి ఈ నాగరికత నశించిందనే వాదన కూడా ఉన్నది.

స్టువర్ట్ పిగ్గట్ అభిప్రాయంలో సింధు ప్రజల సంప్రదాయ ప్రియత్యము అభివృద్ధి నిరోధకమై సింధు నాగరికత పతనమయ్యింది.

సింధు నాగరికత ఏవిధంగా పతనమైనప్పటికి సింధు ప్రజలు ప్రారంభించిన సంస్కృతీ సంప్రదాయాలు కొన్ని ఈ నాటికి భారతీయ సమాజంలో సజీవంగా ఉండటం ఆ సంస్కృతి ఔన్నత్యానికి నిదర్శనము.

## 4.15 సారాంశం :

ప్రపంచంలో అతిపెద్దది, అతిపురాతనమైన నాగరికతలలో మూడవదీనైన సింధూ నాగరికత వివిధరకములైన శీతోష్ణపరిస్థితులలో దాదాపు వేయిసంవత్సరములు భారత ఖండంలో విలసిల్లినది. పట్టణ నాగరికతా లక్షణాలు కల్గివున్న సింధూ నాగరికతలో అతిప్రాచీనమైన సాంఘీక, సామాజిక వ్యవస్థలు కన్పిస్తాయి. భవన నిర్మాణాలు, లిపి, మత విశ్వాసాలు, వర్తక వ్యాపారాలకు సంబంధించిన పలువిధములైన అవశేషాలు సింధూ నాగరికతలో కన్పిస్తాయి.

## REFERENCES


1. Allchin . R. & Bridget Allchin : The Rise of Civilization in India and Pakistan, Cambridge. 1982

2. Allchin . R. & Bridget : The Birth of Indian Civilization, Harmonds sworth 1993.

3. Khatri . J.S. etal : A New Indus - Saraswati Site, Puratatva Vol ; 25, 1995

4. Lal . B.B. : Indles Valley Civilization, New Delhi 1998.

5. Possehl . G.L. : 'The Indus Valley Civilization'. Man and Environment. Vol : 19. No 1 - 2. 1994.

6. Wheeler . M. : Indus Valley Civilization. Oxford. 19.


Dr. V.V. Madhusuhana Rao

## 4.16 మాదిరి ప్రశ్నలు

1. సింధు నాగరికతా వ్యాప్తి గురించి వ్రాయుము ?

2. సింధు నాగరికత లక్షణాలు గురించి వ్రాయుము ?

3. సింధు నాగరికత పతనాలు గురించి వ్రాయుము ?

## సంక్షిప్త ప్రశ్నలు

1. సిందు లిపిని గూర్చి వ్రాయుము ?

2. సింధు నాగరికతకు హరప్పా సంస్కృతి అన్న పేరు ఎలా వచ్చింది ?

3. పర్యావరణలో వచ్చిన మార్పులు సింధు నాగరికత పతనానికి ఎలా కారణమయ్యాయి ?

## SUGGESTED READINGS


1. Allchin. B. and Allchin. R : 'The Birth of Indian Civilization', Harmonds worth 1968

2. Allchin. B. and Allchin. R : 'The Rise of Civilization in India and Pakistan', Cambridge. 1982

3. Allchin.B. and Allchin, R:, The Pre history and Early Archaeology of South Asia', New Delhi 1997.

4. Bisht. R.S : "Dholavira : New Horizones of the Indus Civilization', Puratatva No : 20 (1989-90)

5. The cultural Heritage of India of India, Ramakrishna Mission, Vol : I, Calcutta, 1970

6. Ghosh, A.K. (ed) : 'An Encyclopedia of Indian Archaeology' (2 vols), New Delhi. 1989

7. Gupta, S.P (ed) : The 'host' Saraswati and the Indus civilization, Jodhpur, 1995

8. Kanningham. A : 'Harappa', Varanasi, 1966 (Reprint)

9. Lal. B.B. : 'The Earliest Civilization of South Asia' :, New Delhi, 1997

10. Makay, E. : Early Indus civilization, Delhi, 1976 (Reprint)

10A. Marshall, Sir John : Mohen Jodaro and Indus Valley civilization, Delhi

11. Parpotla. A : 'Decephering the Indus Script', Cambridge, 1994

12. Possehl. Gregory. L. (ed) : 'Harappan civilization : A contemporary perspective', New Delhi. 1982

13. Rao. S.R. : 'The Decipherment of the Indus Script', Bombay 1982

14. Rao. S.R. : 'Lothal' : Delhi. 1985

15. Sankalia. H.D. : Prehistory and Proto History of India and Pakistan', Pune. 1974.

16. Thaper, Romilla : History of India Vol : I, New Delhi 1966 (Reprint)

17. Vats. M.S. : Excavations at Harappa, (2 Vols) Delhi 1940

18. Wheeler. R.E.M. : 'Civilizations of the Indus Valley and Beyond London. 1966

**ఖండిక - 2**

## పాఠం - 5

# ఆర్యుల నాగరికత

## 5.0 లక్ష్యం

ఆర్యుల జన్మస్థలం, సంస్కృతి, వాఙ్మయాలు, రాజకీయ, ఆర్థిక సాంఘీక సామాజిక మతపరమైన విషయాలు తెలియ చేయుటే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయక్రమం :

5.1 ఉపోద్ఘాతం

5.2 ఆర్యుల జన్మస్థలం

5.3 ఇండో - యూరోపియన్ భాషా సంభందాలు

5.4 ఋగ్వేద రచనాకాలం

5.5 పురావస్తు సాక్ష్యాధారాలు

5.6 ఆర్యుల జన్మస్థలం - స్వదేశీ సిద్ధాంతం

5.7 వైదిక వాఙ్మయం

5.8 ఋగ్వేదకాలంనాటి ఆర్యుల నాగరికత

5.9 మలివేదకాలపు ఆర్యుల నాగరికత.

5.10 ఇతిహాస యుగం

5.11 సారాంశం

## 5.1 ఉపోద్ఘాతం :

భారతదేశ చరిత్రలో ఆర్యులకు సముచితమైన స్థానం ఉన్నది. వీరి కాలంలో వ్రాయబడిన కూర్పబడిన సాహిత్యం ఆధారంగా భారత సంస్కృతి, సాంప్రదాయం స్థిరత్వాన్ని సంపాదించుకొన్నది. చరిత్రకారుల అభిప్రాయ బేదాలవలన ఆర్యుల జన్మస్థానం గుర్తించడం కష్టమైన సమస్యగా మిగిలి ఉంది. వేదాలను పవిత్రగ్రంధాలుగా ఉపయోగించిన వారు, సంస్కృత భాషను మొట్టమొదటగా మాట్లాడినవారు ఆర్యులు. వీరు సంచార జీవులు, పశుపోషకులు కాబట్టి పట్టణాల శిధిలాలుగాని, పనిముట్లు లాంటి అవశేషాలుగాని లభ్యము కాలేదు. పురావస్తు పరిశోధనలు ద్వారా వీరి చరిత్రను అధ్యయనం చేయడం కష్టం. అయితే హస్తినాపురం, అత్రంజిఖీర (ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతము) త్రవ్వకాలలో బయల్పడ్డ కొన్ని అవశేషాలు కొంతవరకు ఆర్యులకు సంబంధించిన సమాచారాన్ని అందించాయి.

## 5.2 ఆర్యుల జన్మస్థలం :

'ఆర్యన్' అనే పదానికి 'ఉత్తమజన్మ' అని అర్థం. కాని ఈ పదం భాష, జాతి రెండింటిని సూచిస్తుంది. తత్వశాస్త్రం, భాషాశాస్త్రం, పురావస్తుశాస్త్రం, మానవశాస్త్రం, వంటి విభిన్న ఆధారాలను పరిశీలనలోకి తీసుకొని చరిత్రకారులు ఆర్యుల జన్మస్థానాన్ని గురించి విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేసారు. అయితే నేటికిని ఈ సమస్య అపరిష్కృతంగా మిగిలిపోయినది.

## 5.3 ఇండో - యూరోపియన్ భాషా సంబంధాలు :

క్రీ॥శ॥ 16వశతాబ్దంలో ఇటలీ దేశస్థుడైన "పిలిప్పోగుసెత్తి" వివిధ భాషలకు సంబందించి తులనాత్మక అధ్యయనం చేసి సంస్కృతభాషకు, గ్రీకు, లాటిన్, గోతిక్ (ట్యూటానికి లేదా జర్మానిక్), సెల్టిక్ (ఇంగ్లీషు) వంటి యూరోపియన్ భాషలకు, పర్షియన్‌కు మధ్య కొన్ని సన్నిహిత సంబంధాలను కనుగొన్నాడు. ఉదాహరణకు ఇంగ్లీషులోని 'మదర్' అనే పదం సంస్కృతంలో 'మాతృ' గాను, పర్షియన్‌లో 'మథర్' గాను గ్రీకులో 'మెథర్' గాను, లాటిన్‌లో 'మాథర్' గాను, జర్మన్‌లో 'ముత్తర్' గాను కనిపిస్తుంది. అదే విధంగా ఇంగ్లీషులోని 'ఫాదర్' అనుపదం, సంస్కృతంలో 'పితృ' గాను, పర్షియన్‌లో 'పితర్' గాను, గ్రీకులో 'పాతర్' గాను, లాటిన్‌లో 'ఫ్రాతర్' గాను, జర్మన్‌లో 'వాతర్' గాను కనిపిస్తుంది. ఈ రకమైన పోలికలున్న పదాలను ఉపయోగించడం ద్వారా తమ పూర్వీకులు ఒకటిగా కలిసి జీవించి ఉన్నట్లు తెలుస్తుంది.

క్రీ.శ. 1786వ సం॥లో 'విలియమ్ జోన్స్' ఈ పోలికలు, సంబంధాలు ద్వారా మనకు తెలియని ఒక మాతృ భాషనుంచి ఇవి జనించి ఉండవచ్చు ననెను. ఆ భాషలను 'ఇండో-యూరోపియన్' భాషలని పేర్కొనెను. 'మాక్స్‌ముల్లర్' అభిప్రాయం ప్రకారం ఈ భాషలు ఆర్య భాషలని, 'ఆర్యన్' అనే పదానికి అర్థం భాషేకాని, జాతికాదని పేర్కొనెను. 'పెంకా' (penca) అనే జర్మన్ పండితుడు ఆర్యన్ అనే పదం భాషలేదా జాతిని సూచిస్తుందా లేదా రెండింటిని సూచిస్తుందా అనే ముగింపులేని వివాదానికి స్వస్తి పలుకుతూ జాతితో భాషను ఏకం చేశాడు.

## 5.4 ఋగ్వేద రచనాకాలం :

భాషా పరమైన ఆధారాలను బట్టి క్రీ.పూ. 1500-1000 సం॥ల మధ్య ఋగ్వేదాన్ని రచించి ఉండవచ్చు. ఋగ్వేద సంస్కృత భాషకు 'జెంద్ అవెస్తా' (పాత పర్షియన్) భాష చాలా సన్నిహితంగా ఉంది. వేద సంస్కృతికి ప్రాచీన ఇరాన్ ఆర్య సంస్కృతితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇవిరెండూ ఇండో-ఇరానియన్ సంస్కృతి అనబడే సంస్కృతి నుంచి ఉత్పన్నమైనట్టు తోస్తుంది.

## 5.5 పురావస్తు సాక్ష్యాధారాలు :

భారతీయ పురావస్తు సాక్ష్యాధారాలను బట్టి ఆర్యులు క్రీ.పూ. 1500 సం॥లో వాయువ్య భారతదేశంలోనికి ప్రవేశించారని భావించఢమైనది. మానవశాస్త్ర ఆధారంతో చరిత్రకారులు ఆర్యుల జన్మస్థానాన్ని గుర్తించడానికి ప్రయత్నించారు. ఆర్యులు పొడుగుగా, తెల్లని చర్మముతో ప్రకాశమైన వర్ణముతో, మంచి జుట్టుతో ఉండేవారని వేదాలు వర్ణించాయి. అయితే ప్రాచీన కాలంనాటి ఆర్యుల అస్తిపంజర అవశేషాలు లభించలేదు. కాబట్టి జాతిపరమైన లక్షణాలును చూపి వారి జన్మస్థానాన్ని నిర్ణయించడం వీలుకాదు.

## 5.6 ఆర్యుల జన్మస్థలం - స్వదేశీ సిద్ధాంతం :

కొంతమంది భారతీయ చరిత్రకారులు ముఖ్యంగా ఆర్యులు భారతదేశంలో నివశించి ఇక్కడనుంచి ప్రపంచంలోని మిగతా ప్రాంతాలకు వలసపోయారని వాదించారు. ఆర్యుల నివాసస్థానం బ్రహ్మర్షి దేశమని 'జగన్నాధ్‌ఝా', ముల్తాన్‌లోని దేవికానది ప్రాంతమని డి.ఎస్.త్రివేది, కాశ్మీర్‌తో పాటు హిమాలయ ప్రాంతమని ఎల్.డి.కళ వాదించారు వీరి అభిప్రాయములు ఈ విధముగా తెలియజేసిరి (1)

ఆర్యులు స్వదేశీయులని, సప్త సింధునది ప్రాంతం (సింధు, జీలం, చీనాబ్, రావి, సట్లెజ్, బియాస్, సరస్వతి) వారి ఆదిమ నివాస స్థానమని పేర్కొనిరి. (2) ఆర్యులు మనదేశానికి దండెత్తి రాలేదని, ఆర్యులు దాసదస్యుల వైరము కేవలం మతపరమైనది. (3) భారతదేశంనుండియే ఆర్యులు బెలూచిస్థాన్, పశ్చిమ ఆసియా ప్రాంతాలకు, అచటనుండి ఐరోపాకు వలస వెళ్ళిరి (4) ఋగ్వేదమందలి భౌగోళిక ప్రజ్ఞానం సప్త సింధు ప్రాంతమునకే పరిమితమైనది (5) సంస్కృతానికి, ఇతర ఇండో-యూరోపియన్ భాషలకు మధ్యగల భాషాపరమైన సంబంధాలు ఆర్యులు భారతదేశానికి వలసవచ్చారనే విషయాన్ని రుజువు చేయవు.

అయితే పైన పేర్కొన్న సిద్ధాంతాలను అనేక మంది పండితులు తీవ్రంగా వ్యతిరేకించిరి. వారి అభిప్రాయం ప్రకారం, ఆర్యులు భారతదేశానికి వలస వచ్చిన తరువాత కొన్ని శతాబ్దాలకు ఋగ్వేదాన్ని కూర్చి ఉండవచ్చు. అందులోని భౌగోళిక వాతావరణం సహజంగానే భారతదేశాన్ని సూచించి ఉండవచ్చు. వాస్తవానికి ఋగ్వేదంలోని 'రుక్కులను' సప్తసింధు ప్రాంతంలో కూడ్చడం జరిగింది. భారతదేశానికి వచ్చేముందు వీరు అనాగరికులు, పశుపాలక వృత్తిలో ఉండేవారు. అందువలన తన మాతృదేశంలో వేద సాహిత్యం లాంటి సాహిత్యాన్ని సృష్టించి ఉండకపోవచ్చు. భారతదేశంలో స్థిరనివాసం ఏర్పరచుకున్న తర్వాత వీరు మరింత నాగరికులై వేద సాహిత్యాన్ని సృష్టించారు. ఋగ్వేదమున దాసదస్యుల నిర్మూలనను కోరుతూ ఆర్యులు తమ ఇష్టదేవుడైన ఇంద్రుని ప్రార్థించటం ద్వారా వారు మనదేశంపై దండెత్తి వచ్చిన విదేశీయులని తెలియుచున్నది.

ఆర్యుల జన్మస్థానం భారతదేశమే అయి ఉన్నట్లయితే వారు మొత్తం ఉపఖండాన్నే ఆర్యీకరణం చేసేవారు. దక్షిణ భారతదేశంలోను, ఉత్తర భారతదేశంలోనూ కొన్ని ప్రాంతాలలో ఆర్యేతర భాషలు ప్రబలంగా ఉండటమనేది భారతదేశం ఆర్యుల జన్మస్థానం అనే సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఉన్న వాదము. పైగా సంస్కృత భాషలో ఇండో యూరోపియన్ భాషకు చెందని పెక్కు పదజాలములు ముఖ్యముగా ఆస్ట్రిక్, ద్రావిడ పరమైనవి పెక్కుగలవు. వీటన్నింటిని బట్టి ఆర్యులు స్వదేశీయులు అనుట హాస్యాస్పదం. ఏది ఎట్లున్నను ఇండో యూరోపియన్ భాషలు మాట్లాడు ప్రజలు కొంతకాలం ఒక చోట నివసించి, తదుపరి శాఖోపశాఖలుగా చీలి వివిధ ప్రాంతములకు వలస వెళ్లారు. ఇట్టి ఇండో-యూరోపియన్ భాషలోని సంస్కృత భాష మాట్లాడేవారే ఆర్యులు.

**5.6.1 ఆర్యుల జన్మస్థలం - విదేశీ సిద్ధాంతం :** చాలామంది పండితులు ఆర్యుల జన్మస్థానం ఆర్కిటిక్ ప్రాంతం, జర్మనీ, మధ్య ఆసియా, దక్షిణ రష్యా, ఐరోపా, హంగేరీ మొదలగు వివిధ ప్రాంతాలను గుర్తించారు.

**(1) ఆర్కిటిక్ ప్రాంతం :** ఆర్కిటిక్ తీరము ఆర్యుల జన్మస్థలమని, బాల గంగాధర్ తిలక్ నుడివెను. ఇతని అభిప్రాయం ప్రకారం వేద సాహిత్యంలో కనిపించే ఖగోళ శాస్త్ర వివరాల ఆధారంగా హిమానీ నద విరామయుగం ఆర్యుల జన్మస్థానం అని ప్రకటించెను. కాని నేడు ఈ సిద్ధాంతం మరుగున పడినది. ఈ సిద్ధాంతంను సమర్ధించువారు లేరు.

**(2) మధ్య ఆసియా ప్రాంతం :** రోడ్స్, లాసెన్, మాక్స్‌ముల్లర్, కీత్ మొదలగు పండతులు ఆర్యుల జన్మస్థానం మధ్య ఆసియాగా పేర్కొనిరి. వీరి అభిప్రాయం ప్రకారం సంస్కృత భాష యూరోపియన్ భాషలకంటే ప్రాచీనమైది. ఆసియా భాషలకు, ఆర్యుల మాతృభాషకు పెద్ద వ్యత్యాసములు లేవు. దీనిని బట్టి ఆసియా భాషలు మాట్లాడు ప్రజలు ఆర్యుల పరిసర ప్రాంతములో నివసించినట్లు చెప్పవచ్చు. కనుక మధ్య ఆసియాలోని ఏదో ఒక ప్రాంతము ఆర్యుల జన్మభూమియై ఉండవచ్చు. ఈ సిద్ధాంతం కూడా తీవ్ర విమర్శకు గురైనది. కేవలం సంస్కృత భాషపై ఆధారపడిన సిద్ధాంతం కాబట్టి ఎక్కువ మంది శాస్త్రవేత్తలు దీనిని అంగీకరించలేదు. జాతుల గమనం ఎల్లప్పుడు తూర్పునుండి పశ్చిమానికి అనునది కేవలము ఊహాపరమయినది. దానికి ఎట్టి శాస్త్రీయపరమైన నిబంధనలు లేవు. మధ్య ఆసియా ఆర్యుల జన్మభూమి అని చెప్పిన చరిత్రకారులలో అసలు ఆర్యుల జన్మ స్థలిని గూర్చి భిన్నాభిప్రాయములు కలవు.

**(3) ఐరోపాఖండం :** యూరప్‌లోని జర్మానిక్ ప్రాంతాలే ఆర్యుల జన్మస్థలమని నిర్ధారించడానికి కొంతమంది ప్రయత్నం చేసారు. పెంకా, జి.కొస్సినా, హెచ్. హర్త్ లాంటి అనేక మంది పండితులు జర్మానిక్ ప్రాంతాలు ఆర్యులకు కేంద్ర ప్రాంతాలుగా

,

ఉన్నాయని ఆ ప్రాంతాలనుంచే వారు ఇతర ప్రాంతాలకు విస్తరించారని వాదించిరి. ఇండో-యూరోపియన్ భాషలలో సంస్కృత భాషకు ఆర్యుల మాతృ భాషకంటే లిథూనియన్ భాషకు అత్యంత సాన్నిహిత్యముకలదు. ఇండో - యూరోపియన్ భాషలోని పెక్కు భాషలు పరిమిత ప్రదేశము కలిగిన ఐరోపా ఖండమందే మాట్లాడెదరు. ఆసియాలో ఈ భాషలు మాట్లాడువారు స్వల్పం. అంతేగాక ఐరోపాలోని ప్రాంతం ఆర్యులచే జయింపబడినట్లు ఎచ్చటా కానరాదు. కపడోషియాలోని భోగజ్ కోయ్ శాసనములు ఆర్యుల ఆసియా వలసకు నిదర్శనములు. దీని ఆధారంగా ఐరోపాఖండము ఆర్యుల జన్మభూమియని తలచిరి. మరల వీరిలో కొందరు ఐరోపాఖండము లోని ఏ ప్రాంతం ఆర్యుల జన్మభూమియను వివాదము తలెత్తెను. కొందరు జర్మనీయని, మరికొందరు స్కాండినేవియా అని, దక్షిణ రష్యా అని, బాల్టిక్ తీరమని భిన్న అభిప్రాయములు తెలియజేసిరి.

**(4) హంగేరి మైదానము :** ఐరోపా వాసులతో నేడు బహుజన ఆమోదం పొందిన సిద్ధాంతం ఐరోపాలోని హంగేరి మైదానం ఆర్యుల జన్మభూమి. గైల్స్, బ్రాన్‌డన్ స్టీన్ మొదలుగువారు ఈ సిద్ధాంతాన్ని ప్రభోదించిరి. ఇండో-యూరోపియన్ భాషలలోని సమానములైన శబ్దములను పరిశీలించి హంగేరీ మైదానము ఆర్యుల జన్మభూమి యని నిర్ధారణకు వచ్చిరి. ఇండో-యూరోపియన్ భాషలలో బీచ్ వృక్షమును గూర్చి విపులంగా పేర్కొనిరి. అందువలన ఆర్యులు ఈ బీచ్ చెట్టు విస్తారముగా పెరుగు ప్రాంతమున అనగా హంగేరీ ప్రాంతమున నివశించియుండవచ్చును. ఆర్యులకు ఆవు, ఎద్దు, గుఱ్ఱము, గొర్రె, కుక్క, పంది మొ॥లగు జంతువులు తెలుసునని ఇండో-యూరోపియన్ భాషలోని పదజాలమును బట్టి తెలుస్తుంది. ఒంటె, గాడిద, పెద్దపులి, ఏనుగు లాంటి జంతువులు తెలియవు. అందువలన ఆర్యులు మనదేశమునకు వచ్చినపుడు ఒంటె గాడిద, ఏనుగు లాంటి జంతువులను చూసి విస్తుపోయిరని ఋగ్వేదం చాటుచున్నది.

ఈనాడు యూరప్‌లోను, భారత ఉపఖండములోని ఎక్కువ భాగములోను మారిపోయిన రూపములో ఉపయోగిస్తున్న ఇండో-యూరోపియన్ భాషలను ఆర్యులు మాట్టాడేవారు. దక్షిణ రష్యానుంచి, మధ్య ఆసియా వరకు విస్తరించి ఉన్న స్టెప్పీలలో ఎక్కడో ఆర్యులు మొదట నివసించి యుండవచ్చు. ఆప్రాంతం నుంచి ఆర్యులు ఆసియా, యూరప్ లోని వివిధ ప్రాంతాలకు తరలిపోయారు. ఆర్యుల ప్రారంభజీవితం పశుపాలకులగానే ఉన్నట్లు అనిపిస్తుంది. వ్యవసాయం వారి రెండోవృత్తి మాత్రమే. ఆర్యులు స్థిరమైన జీవితాన్ని జీవించలేదు. అందుచేత వారు తాము నివసించిన ప్రాంతాలలో గట్టి సాక్ష్యాధారాలను వదలి వెళ్ళలేదు. ఆర్యుల జీవితంలో గుఱ్ఱము ప్రధాన పాత్రను నిర్వహించింది. క్రీ.పూ.2000 నాటి నుంచి గుఱ్ఱము ద్వారా పశ్చిమాసియా దేశాలమీద దండయాత్రలు చేయడానికి దోహదం చేసింది.

**5.6.2 భారతదేశంలో ఆర్యుల ప్రవేశం :** ఆర్యులు భారతదేశానికి వస్తూ మొదటసారిగా ఇరాన్‌లో కనిపిస్తారు. ఇచట ఇరానియన్‌లతో కలిసి మెలిసి ఉండిరి. అందు వలననే పారశీకుల మతగ్రంథమైన జెండ్ అవెస్తాకు, ఆర్యుల ఋగ్వేదానకు చాలా పోలికలు గలవు. క్రీ.పూ1500 కాస్తముందుగా ఆర్యులు హిందూ కుష్ పర్వత శ్రేణులు దాటి భారతదేశంలోకి వచ్చారు. ఆర్యులు భారతదేశానికి అలలు అలలుగా వచ్చారు. క్రీ.పూ1500 ప్రాంతంలో వచ్చిన ఋగ్వేద ఆర్యులది మొదటి అల. వీరు ఆ ప్రాంతంలో నివాసమున్న దాసులతో లేదా దస్యులతో సంఘర్షణ పడవలసి వచ్చింది. భరత తెగకు నాయకుడైన దివోదాసు చేతులో శంబరుడన్న వ్యక్తి ఓడిపోవడాన్ని ఋగ్వేదం వర్ణిస్తుంది. ఇక్కడ దివోదాసు అన్న పేరుల్లో 'దాసు' అన్నమాట ఋగ్వేదంలో కన్పించే దస్యులు ఈ దేశంలోని ఆదిమ నివాసులు కావచ్చు. వారిని ఓడించిన ఆర్యనాయకుని పేరు 'త్రాసదస్యు' ఈ విధముగా తొలిఆర్యులు సప్త సింధునది ప్రాంతంలో తమ స్థావరాలను ఏర్పరుచుకొనిరి.

## 5.7 వైదిక వాఙ్మయము

ఆర్యుల చరిత్రకు ముఖ్య ఆధారములు వైదిక వాఙ్మయము. వేద అను పదము సంస్కృత భాషలోని 'విద్' అను ధాతువు నుండి ఉద్భవించినది. 'విద్' అంటే తెలుసుకొనుట అని అర్థం. వేదమనగా జ్ఞానమని అర్థం. వేదములు అపౌరహేషేయములు. వేదసాహిత్యంలో

నాలుగు భాగాలున్నాయి. అవి ఋక్, యజుర్, సామ, అధర్వణ వేదములు. ప్రతివేదమునందు సంహితలు, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు అను నాలుగు భాగములు కలవు. ఈ వేదములు తరువాత సూత్ర వాఙ్మయము తయారైనది. ఇందులోని భాగములే వేదాంగములు. శ్రౌత, గృహ్య, ధర్మ సూత్రములు, ఉపవేదములు ఇతిహాస గ్రంధములైన భారత, రామాయణములు ముఖ్యమైన వైదిక వాఙ్మయములు.

**5.7.1 ఋగ్వేదం :** ఋగ్వేదం సంహిత అత్యంత ప్రాచీనమైన వైదిక గ్రంధము. దీని ఆధారంగానే తొలి వేద యుగాన్ని తెలుసుకోవచ్చు. ఇందులో ఋక్కులను ప్రార్థనా శ్లోకములు కలవు. ఇది పది మండలములుగా విభజింపబడినది. ఇందులో 1017 ఋక్కులు గలవు. వీటివలన ఆర్యుల తొలి రాజకీయ, సాంఘిక, ఆర్థిక మత జీవన విధానము తెలుసుకోనవచ్చును.

**5.7.2 సామవేదము :** గానం కోసం ఋగ్వేద మంత్రాలకు స్వరాన్ని అమర్చారు. ఈ క్రొత్త సంకలనానికి సామవేద సంహిత అని పేరు. ఇందులో 1549 ఋక్కులు గలవు. ఈ ఋక్కులు శ్రావ్యమైన స్వరసంకలనం కలిగియున్నవి వీనిని యజ్ఞక్రతువులందు పాడెదరు.

**5.7.3 యజుర్వేదము:** యజుర్వేదము మంత్రాలు మాత్రమే కాకుండా అవి చదివేటప్పుడు అనుసరించాల్సిన నియమాలను కర్మకాండలను గురించిన విశేషాలను తెలుపుతాయి. ఈ కర్మకాండలకు సంబంధించిన ఆచారాలు, అవి ఆవిర్భవించిన సామాజిక, రాజకీయ వాతావరణానికి అద్దం పడతాయి. ఇది పద్య, గద్య సంకలనము.

**5.7.4 అధర్వణవేదము :** అధర్వణ వేదములో 731 ఋక్కులు గలవు. ఇది 20 భాగములుగా విభజింపబడినది. ఇందు భూత, పిశాచములను పారద్రోలు మంత్ర, తంత్రములు గలవు. అధర్వణవేదంలో చెడును, వ్యాధులను దూరం చేసుకోవడానికి పనికి వచ్చే తాంత్రిక ప్రక్రియలు ఉన్నాయి. అధర్వణ వేదములోని విషయం అనార్యుల నమ్మకాలను గురించి, ఆచారాలను గురించి తెలియజేస్తుంది.

**5.7.5 బ్రాహ్మణములు :** వీటినిండా కర్మకాండ సూత్రములున్నవి. ఆ సూత్రాలు, కర్మ కాండల వెనుకనున్న సామాజిక, మత విషయములను వివరిస్తాయి. ఇందులో యజ్ఞముల ప్రశస్తి అవి ఎట్లు నిర్వహింపబడునో తెలియజేయు విధము విపులంగా చెప్పబడినది. అనార్యులు ఆర్యసంఘములో చేర్చుకొను విధము, కర్మమార్గమున మోక్షమును పొందు విధము తెలుపును. బ్రాహ్మణములలో ఋగ్వేదమునకు ఐతరేయ, కౌస్తిక బ్రాహ్మణములు, సామవేదమునకు తాండ్య, జైమినీయ బ్రాహ్మణములు, యజుర్వేదమునకు తైతరేయ, శతపథ బ్రాహ్మణములు, అధర్వణ వేదమునకు గోపథ బ్రాహ్మణము ముఖ్యమైనవి.

**5.7.6 అరణ్యకములు :** ఇవి ఆర్యుల జీవితములో మతపరమైన తంతులలో ప్రాధాన్యము వహించిన యజ్ఞ యాగాది వైదిక కర్మలు పాటించటం పట్ల గాఢమైన వ్యతిరేకత కనపరుస్తాయి. ఆర్యులు వృద్ధాప్యములో అడవులకు వెళ్ళి తపోమార్గమును అవలంబించి మోక్షము పొందు విధము ఇందులో చర్చింపబడెను. బ్రాహ్మణములోని కర్మమార్గమునకు, ఉపనిషత్తులలోని జ్ఞానమార్గమునకు ఈ ఆరణ్యకములు సంధాన కర్తలు. ఆరణ్యకములలో ఐలరేయ, తైత్తరీయ ఆరణ్యకములు ముఖ్యమైనవి.

**5.7.7 పనిషత్తులు :** గురు శిష్యుల మధ్య ఆధ్యాత్మిక విషయమును గూర్చి జరిగిన చర్చలే ఉపనిషత్తులు. వీటిలో విశ్వాత్మ, పరమభావన, వ్యక్తి ఆత్మ ప్రపంచం పుట్టుక, ప్రకృతి రహస్యాలు మొ॥ వాటిని వివరించడం జరిగింది. భక్తి, జ్ఞాన, వైరాగ్యమార్గమును గురించిన చర్చలు ఇందులో కలవు. భారతీయ ఆధ్యాత్మిక చింతన ఉపనిషత్తులలో పరాకాష్టను పొందినవి. ఉపనిషత్తులు 300 లకు పైన కలవు. అందు ఈశా, కేన, కథా, చాందోగ్య, బృహదారణ్యక, ముండక, మాండూక్య, మైత్రేయిని ఉపనిషత్తులు ముఖ్యమైనవి.

**5.7.8 వేదాంగములు :** వేదంగాలు ఆరు. అవి. 1. శిక్ష (ఉచ్చారణ) 2. కల్ప (క్రతువులు), 3. వ్యాకరణము, 4. నిరుక్త (శబ్ద ఉత్పత్తి శాస్త్రం), 5. ఛందస్సు (గణ విభజన), 6. జ్యోతిష్యం. ఇవన్నీ వేదాలను సరిగా అధ్యయనం చేసేందుకు, అర్థం చేసుకొనేందుకు,

బలి, కర్మాది క్రియలలో వాటిని వినియోగించేందుకు ఉపయోగపడే విషయాలను బోధిస్తాయి. వేదాంగాలు సూత్రాల రూపంలో ఉంటాయి. జ్ఞాపకం ఉంచుకోవటానికి వీలుగా క్లుప్తీకరించిన వచన వాక్యాలే సూత్రాలు.

సూత్ర గ్రంధాలలో కల్పసూత్రం అందుబాటులో ఉంది. వీటిని మరల 3 తరగతులుగా విభజించడమైనది. అవి. 1. శ్రుత సూత్రాలు, అగ్నికి, సోముడికి సంబంధించిన యజ్ఞయాగాదులను వివరిస్తుంది. 2. గృహ్యసూత్రాలు; ఇళ్ళలో చేయాల్సిన, క్రతువులు, ఇంటి యజమాని నిర్వహించాల్సిన క్రతువుల వివరాలు తెలియజేస్తుంది. 3. ధర్మసూత్రాలు; మనుస్మృతి వంటి ధర్మశాస్త్రాలు పుట్టుటకు ఇదే మూలం.

**5.7.9 ఉపవేదాలు :** ఉపవేదములు శాస్త్రీయ గ్రంధములు. ఇందు మంత్ర ప్రసక్తి కనిపించదు. ఇందు ధనుర్వేదము యుద్ధతంత్రమునకు సంబందించిన విద్య గురించి, ఆయుర్వేదము ఔషధముల గురించి, గాంధర్వ వేదము సంగీత శాస్త్రముల గురించి. శిల్పవేదము శిల్ప కళ గురించి వివరించును.

**5.7.10 ఇతిహాసములు :** భారత, రామాయణములు ఇతిహాసములు. ఆర్య గణముల మధ్య ఉత్తరదేశ సార్వభౌమత్వమునకు జరిగిన పోరాటమును గూర్చి మహాభారతము వివరించును. దక్షిణ భారతదేశమునకు ఆర్య సంస్కృతి విస్తరించిన విధమును గురించి రామాయణము వివరించును. ఇవి ప్రాచీన గ్రందములైనప్పటికి ఒకే యుగములో తయారైనవి కావు. ఇతిహాసములు కాలగమనములో అనేక అంశములు ప్రక్షిప్తించబడినందున ఇవి ఉద్గ్రందములైనవి. వీని ద్వారా అనేక చారిత్రాత్మక విషయములు తెలియును.

## 5.8 ఋగ్వేద కాలం లేదా తొలివేదకాలం (క్రీ॥పూ॥ 1500 - 1000) :

**5.8.1 రాజకీయ వ్యవస్థ :** ఆర్యులు సప్త సింధులోయలోకి వచ్చినపుడు సంచార జీవితాన్ని గడుపుతూ ఉండేవారు. ఇంకా జనయుగాన్నుంచి, గణతంత్రం నుంచి బయటపడలేదు.

**5.8.2 గణరాజ్యం :** ఆర్యులది గణ వ్యవస్థగల సామాన్య వ్యవస్థ. వీరిది పితృస్వామకం. ఋగ్వేదపు ఆర్యుల్లో వర్ణవ్యవస్థ లేదు. కుటుంబం నాటికి, నేటికి సమాజ నిర్మాణానికి గ్రామ ఆవిర్భావానికి పునాది. కొన్ని కుటుంబములు గ్రామములుగను, కొన్ని గ్రామములు 'విశ్' లుగను వ్యవహరించారు. విశ్ అంటే ప్రజలు. ఈ విశ్‌లు జనపదములు (Janapada) గ ఏర్పడెను. ఇట్టి జనపద రాజ్యమే లేదా గణ రాజ్యము, ఋగ్వేద రాజ్యము. ఋగ్వేదపు గణాలు ఐదు. ద్రుష్యు, యదు, తుర్వశ, పురు, భరత మున్నగునవి. ప్రతిగణం ఒక నాయకుడుని ఎన్నుకొన్నది. ఇలా ఎన్నుకోబడిన వారి ముఖ్య ధర్మం గణరక్షణ. ఇతడే గణ పెద్ద లేదా రాజన్. సామ్రాట్, స్వరాట్ శాన, ఈశాన్య, భూపతి, ఏలి అని కూడా అంటారు. అప్పుడప్పుడు ఈ రాజ్యముల మధ్య తగవులుత్పన్నమయ్యేడివి. దశ రాజగణ యుద్దము (Battle of Ten Kings). లో యదు, పురు, తుర్వస మొ॥ గణముల రాజులు భరత వంశాధీశుడైన సుధామునితో పోరాడి పరాజితులైరి. ఈ యుద్ధం పరుష్ణీ నదీ తీరంలో (ఆధునిక రావీనది) జరిగింది.

ఈ యుద్ధంలో సుదాసు జయించి భరతుల ఆదిపత్యాన్ని స్థాపించాడు . ఓడిపోయిన తెగలలో ప్రధానమైన తెగపేరు 'పురు.' కాలక్రమేణ, భరతులు పురులతో చేయికలిపి 'కురు' అన్న పాలక తెగను స్థాపించారు. 'కురు' తెగకు చెందిన వీరు పాంచాల తెగకు చెందిన వారితో కలిసి ఉత్తర గంగా మైదానములో, తమ పరిపాలన స్థాపించి వేద యుగం చివరి దశలో గొప్ప పాత్రను వహించారు. రాజరికం వంశపారంపర్యం, కొన్ని తెగలయందు రాజులను ఎన్నకొను ఆచారం కలదు. ఈ విధముగా ఎన్ను కొన్న రాజులు 'గణపతి' అంటారు. ప్రజాస్వామ్యం శిష్టుల రాజ్యం (OLIGARCHY) మొ॥ ప్రభుత్వంలు ఆర్యగణమునందు కలవు.

**5.8.3 రాజు :** తెగల అత్యున్నత అధికారి రాజు. అతని అధికారం తెగలకు మాత్రమే పరిమితము. ఋగ్వేదం చివరి కాలంలో రాజరికం, వారసత్వమైనది. ప్రజల యొక్క క్షేమసమాచారమును కాంక్షిస్తూ రాజు దేవతారాధనలు, యజ్ఞ యాగాదులు, క్రతువులు,

నిర్వహించును. పరిపాలనా కార్యక్రమములో రాజుకు పురోహితుడు, సేనాని, ఇంకా కుటుంబపెద్దలు, తెగల యుద్ధనాయకులు తోడ్పడేవారు. ప్రధానమైన విషయమేదైనా చర్చించవలసి వచ్చినపుడు రాజు తన సకల గణసభ్యుల అభిప్రాయాన్ని స్వీకరంచేవాడు. గణ సభ్యులు రాజుకు బలి (పన్ను) అను దానిని చెల్లించే వారు. గ్రామణి గ్రామమునకు పెద్ద. గూడచారి వ్యవస్థ కూడా కలదు.

**5.8.4 ప్రజా సభలు :** రాజు సర్వాధికారి యైనను నిరంకుశడు కాదు. అతడు ప్రజారంజకుడు. వైదిక గ్రంధాలు మూడు రకాల ప్రజాసభలను పేర్కొన్నవి. అవి:1. సభ, 2. సమితి, 3. విదాత అనేవి ప్రధాన సంస్థలు. అవి రాజు యొక్క కార్యక్రమాలను అదుపులో ఉంచును. సైనిక, ధార్మిక కార్యకలాపాలను కూడా నిర్వహించేవి. సభ, తెగలోని అనుభవజ్ఞులైన వృద్ధులతో కూడిన సంస్థ. సభ కొంత విస్తృతమైనది. బహుశ దానిలో స్త్రీలు కూడా పాల్గొనెడి వారు. సభ, సమితి న్యాయ సంబంధమైన, రాజకీయ సంబంధమైన కార్యకలాపాలను నిర్వహించడం గుర్తించ దగినది. సమితి అంటే చిన్న సభ అని అర్థం. ఇది దేశానికి సంబంధించిన అంశాలను చర్చించును. ఈ సభ, సమితికి రాజే అధ్యక్షత వహించేవాడు రాజ్యాంగ బద్దమైన రాజరిక వ్యవస్థ ఆనాడున్నదని చెప్పవచ్చు. ఈ సభల మధ్య సమన్వయాన్ని గూర్చి ఋగ్వేదం చెప్పుచున్నది.

**5.8.5 న్యాయపాలన :** రాజ్యమున అత్యున్నత న్యాయాధికారి రాజు. పురోహితుడు న్యాయపాలనలో రాజుకు ముఖ్య సలహాదారుగా వ్యవహారించును. దొంగతనం, దారిదోపిడి, బందిపోటు, మోసం, గోగ్రహణం, సర్వసాధారణమైన నేరాలు. శిక్షలుకూడా కఠినంగా ఉండేవి. యుద్ధంలో చేజిక్కన సంపదను వైదిక సమావేశాలలో పంచేవారు. న్యాయ నిర్ణేతల తీర్పు (Trial By Jury), దివ్య పరీక్షల ద్వారా తీర్పు (Trial By ordeal), చెప్పెడివారు. క్రిమినల్ నేరములకు 'రక్తపు పైకమును' అనగా హతుని కుటుంబమునకు నష్టపరిహారము చెల్లించుట. అను విశిష్టమైన శిక్ష గలదు. అంగ చేదనము, దేశ బహిష్కరణ లాంటి శిక్షలు కూడా కలవు.

**5.8.6 సాంఘిక వ్యవస్థ :** కుటుంబానికి తండ్రి పెద్ద. విపులంగా చెప్పాలంటే కుటుంబంలోని అందరికన్నా వృద్ధుడైన పురుషుడు కుటుంబ పెద్దగా వ్యవహారించును. కుటుంబ పెత్తనం యావత్తూ అతని మీదే ఆధారపడి వుంటుంది. కుటుంబంలోని వారందరికి ఆయన మాట శిరోధార్యము. ఋగ్వేదములో తండ్రిమాట లెక్కజేయని పుత్రుని కండ్లు పీకించినట్లు తెలుస్తుంది. సర్వసాధారణంగా ఏకపత్నీ వ్రతం ఆచారం. రాజకుటుంబంలందు బహు భార్యాత్వము కలదు. వివాహములు పవిత్రభందములుగా నెంచబడెను. గృహ యజమాని మత సంభంధ ఉత్సవాలను భార్యతో కలిపి నిర్వహించేవాడు.

**5.8.7 సమాజంలో స్త్రీ స్థానం :** గృహానికి సంబంధించినంత వరకు స్త్రీకి గృహిణిగా ఉన్నతస్థానముండేది. మత సంబంధమైన కర్మకాండలలో స్త్రీ పాల్గొనేది. సంఘ సభ్యురాలిగా సభ, సమితుల యందు సభ్యురాలుగా స్త్రీకి సంఘమునందు గౌరవ స్థానం కలదు. బాల్యవివాహాలు, సతీసహగమనం, పరదా పద్దతి లేక ఘోషా పద్దతి ఆనాడు లేవు. వితంతు వివాహాలు నిషేధింపబడలేదు. బాలికలు, యుక్తవయసు వచ్చిన తరువాత వివాహాలు జరిగేవి. స్త్రీలకు వరున్ని ఎన్నుకొనుటలో పూర్తి స్వేచ్ఛగలదు. స్త్రీలయందు నైతిక ప్రమాణములు హెచ్చు. వారిలో గొప్ప విద్యావేత్తలు గూడా కలరు. విశ్వవర, ఘోషా, అపాళ గొప్ప విద్యావేత్తలు. వీరు ఋగ్వేదములోని కొన్నిప్రార్థనా శ్లోకములను సంతరించిరి.

**5.8.8 ఆహార పద్దతి :** పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, మొ॥ వాటిని ఆర్యులు ఎక్కువగా ఉపయోగించెడివారు. ధాన్యాలలో, గోధుమలు, యవలు (బార్లీ), కాయగూరలు, పండ్లు, మాంసము, చేపలు వారి ముఖ్య ఆహారం. ఋగ్వేదంలో యవలను (బార్లీ) గురించి ఎక్కువగా చెప్పడం జరిగింది. అడవిరేగు, బేరికాయ , నేరేడు, సీతాఫలం, మామిడి, మొ॥ పండ్లు ఎండబెట్టుకొని ఇతర సమయాలలో తినేవారు. పానీయాలలో సోమపానం ఆర్యులకు అత్యంత ప్రియమైనది. దీనిని గురించి ఋగ్వేదంలో 9వ మండలములో అనేక శ్లోకాలు చెప్పబడ్డాయి. సోమాన్నితాగి సాయంకాలం నృత్యం చేసేవారు. 'సుర' అనే మత్తుపానీయం కూడా ఆ కాలంలో కలదు. 'మధు' (తేనె) కూడా వాడుకలో కలదు.

**5.8.9 దుస్తులు మరియు ఆభరణములు :** వస్త్రధారణలో హరప్పా ప్రజలకు, ఆర్యులకు మధ్య అట్టే తేడాలేదు. పైన ఉత్తరీయం (అధివస) కప్పుకునేవారు. క్రింద ధోవతీ (వస) ధరించే వారు. తలపాగా ధరించడం కూడా వాడుకలో ఉంది. నూలు, ఉన్ని, చర్మపు దుస్తులు ధరించడం వారికి ఇష్టం. బట్టలపై బుట్టాలు కుట్టడం, వివిధ రంగుల వాడకం, ఆకర్షణీయమైన వస్త్రధారణ వారికి తెలుసు. యజ్ఞయాగాదుల క్రతువులందు పట్టుబట్టలు ధరించెడి వారు. జుట్టును అలంకరించుకోవడం వారికి తెలుసు.

ఆర్యులకు ఆభరణాలంటే ప్రీతి. స్త్రీ పురుషులిరువురు ఆభరణాలు ధరించేవారు. చెవులకు 'కర్ణశోభన' అనెడి ఆభరణాన్ని ధరించెడి వారు. స్త్రీలు చేతిగాజులు, మురుగులు, కంఠాభరణాలు ధరించేవారు. బంగారముతోగాని, తదితరలోహాలతో తయారైన ఆభరణాలు ధరించేవారు. వెండి ఉన్నప్పటికీ వాడకం తక్కువ. స్త్రీలకు శిరోజాలంకరణ ప్రత్యేక కళ. ఆర్య పురుషులు కూడా స్త్రీలవలే పొడవైన జుట్టు పెంచుకొనెడి వారు.

**5.8.10 వినోదములు :** ఆర్యులు ఉల్లాసవంతమైన జీవితమును గడిపినట్లు తెలుస్తుంది. సంగీతము, నృత్యము పాచికలాట, చదరంగము, వేట, గుఱ్ఱపు పందెములు, రథ పందెములు వారి ముఖ్య వినోదములు. సప్త సింధు ఆర్యులలో జూదమాడుట ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. రథాల పందాలు ఆర్యుల అభిమాన వినోదం. అంగీరస, సవ్యఋషి నృత్యాన్ని పేర్కొన్నాడు. సంగీతములో గాత్రము, వాయిద్యాలు రెండూ ఉండేవి. వేణువు, వీణ, మద్దెల వారి ముఖ్య వాయిద్యాలు.

**5.8.11 కుల వ్యవస్థ :** నాడు వర్ణ వ్యవస్థ లేద కుల వ్యవస్థ లేదు, చరిత్రకారులు కులవ్యవస్థ మీద అనేక అభిప్రాయములను తెలియజేసారు. సమాజములో ఆర్యులు, ఆర్యేతరులు లేక దస్యులు అను రెండు జాతులు కలవు. ఋగ్వేదంలోని పదవ మండలములోని పురుష సూక్తంలో ఉన్న శ్లోకాన్ని అనుసరించి సృష్టికర్త నుదుటనుండి బ్రాహ్మణుడు, భుజ స్కంధములనుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదముల నుండి శూద్రులు ఉద్భవించినారు. ఈ పురుష సూక్తం ఋగ్వేదమందు లేదని తరువాత ఇది చేర్చబడినదని చరిత్రకారుల అభిప్రాయము. కేవలం శ్రమ విభజన మీద ఆధారపడి చేసిన విభాగాలు. ఇందులో పురోహితులు, విద్యావంతులు బ్రాహ్మణులు. యుద్ధము చేయువారు క్షత్రియులు. రైతు లేక వ్యాపారి వైశ్యులు. సేద్యపు బానిసలుగా శూద్రులను చూపించడం జరిగింది. తదుపరి యుగమున ఇది చతుర్వర్ణ వ్యవస్థగా రూపుదిద్దుకుంది. చివరి వర్గం శరీర శ్రమచేసే శ్రామికులతో కూడుకున్న వర్గం. ఐతే వీరు నిరాదరణకు గురికాలేదు. వర్ణాంతర వివాహములు, సహపంక్తి భోజనములు నిషేదింపబడలేదు.

**ఆర్థిక వ్యవస్థ:** ఆర్యులది గ్రామీణ జీవితం. స్వయం సమృద్ధి ద్వారా వారియొక్క అవసరాలను తీర్చుకొనేవారు. నిత్య అవసరాలను తీర్చుకొనుటకు ఎవరిమీదా ఆధారపడేవారు కాదు.

**5.8.12 వ్యవసాయం :** ఆర్యులకు పూర్వమే నాగరికతలో పొలం దున్ని, విత్తనం వేసి, పంటకోసి, కడుపు నింపుకోవడం తెలుసు. యుద్ధాల ఫలితంగా పొలాలు, పంటలు, నగరాలు ధ్వంసమయ్యేవి. ఋగ్వేద సాహిత్యంలో కృషీవల (రైతు) శబ్దాన్ని బట్టి ఆర్యులు వ్యవసాయం చేసినట్లు స్పష్టమవుతుంది. వీరు మొదట పశుపాలకులు. తరువాత కాలంలో వ్యవసాయం వీరి ప్రధాన వృత్తి అయినది. నాగలితో భూమిని ఎద్దులు, సహాయంతో దున్నెడివారు. వ్యవసాయానికి నీటిపారుదల సౌకర్యాలుండేవని తెలుస్తుంది. యవలు, గోధుమలు, వీరి ముఖ్యమైన పంటలు. వరి గురించి మలివేదకాలమువరకు వారికి తెలియదు. వ్యవసాయభూమిని 'ఉరవర' లేదా 'క్షేత్ర' అని పిలిచెడివారు. సమాజంపై పెత్తనం చేసే యంత్రాంగం మారినప్పటికీ రైతాంగం శ్రమించి అదనపు సంపదను ఉత్పత్తి చేయడం ఆగలేదు.

**5.8.13 పశుపోషణ :** ఆర్యులు పశువులను ముఖ్యమైన ఆస్తిగా భావించెడివారు. ఒకవ్యక్తి వద్ద ఉన్న ఆవులు, ఎద్దుల సంఖ్యను బట్టి అతని ఆర్థిక స్థాయిని అంచనావేయడం జరిగేది. పశువులను అందరు గోమాతగా ధనముగా నెంచెడివారు. క్రతు దక్షిణ సాధారణంగా గోవు రూపములో ఉండేది. ఆవులు రోజుకు మూడు సార్లు పాలిచ్చేవి. యజ్ఞ యాగాలలో ఆవును బలి ఇచ్చెడి వారు. ఎద్దు, ఆవు, గుఱ్ఱము, గొర్రె, కుక్క, గాడిద, గేదె, మేక, మొ॥ జంతువులను మచ్చిక చేసేడి వారు.

**5.8.14 వర్తక, వ్యాపారములు :** వైదిక సాహిత్యం ఆర్యుల యొక్క వర్తక, వాణిజ్యం గురించి వివరించింది. ఆనాడు వర్తక, వ్యాపార కార్యక్రమములు ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతమునకు నిర్వహించుచుండెడివారు. వాణిజ్యం ఆనాడు 'ఫణి' అను అనార్య జాతులలో నుండెడిది. ఆర్యులకు బాబిలోన్, పశ్చిమాసియా దేశములతో వాణిజ్య సంబంధాలుండినట్లు తెలుస్తున్నది. ప్రధానంగా వస్తుమార్పిడి విధానము అమలులో ఉండేది. వస్తువు మూల్యాన్ని నిర్ణయించుటకు యూనిట్టు విలువగా సగటు ఆకృతులో ఉన్న గోవును ఉపయోగించేవారు. ఇంకా వెండి నాణెములు, నిష్కయను బంగారు నాణెములు మారక ద్రవ్యముగా నెంచెడివారు.

**5.8.15 ఇతర వృత్తులు :** వృత్తిపరమైన ప్రత్యేకీకరణ కనిపిస్తుంది. వడ్రంగులు, నేత పనివాండ్రు, అల్లిక పనివారు, కుమ్మరి వారు, బంగారు పనివారు, జాలరులు, తోళ్ళ పనివారు, కంసాలి, మొ॥ వృత్తులపనివారున్నారు. కుటీర పరిశ్రమలు కూడా కలవు. నాట్యకారులు, క్షురక వృత్తులు కలవు. పురోహితులకు, సంఘములో గౌరవస్థానము కలదు.

ఆర్యులు యుద్ధప్రియులు. కాబట్టి వారికి అవసరమైన రథములు, విల్లంబులు, గొడ్డళ్ళు, ఈటెలు, కత్తులు, విషపూరిత బాణములు కూడా తయారు చేసెడివారు. రక్షణాయుధాలైన డాలు, కవచము, శిరస్త్రాణము వంటి రక్షణాయుధములను కూడా ధరించెడివారు.

**5.8.16 మతము :** ఋగ్వేదములో ఆర్యులు పితృస్వామికులు. కాబట్టి వీరి దేవతలంతా పురుషులే. అయితే ఋగ్వేదములో ఆర్యులు ప్రకృతి శక్తులకు దైవత్వము ఆపాదించి ఆరాధించిరి. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పృధ్వివాయువు, నదులు, పర్వతాలు ఇత్యాదిక ప్రకృతి శక్తుల్ని ఆర్యులు పూజించేవారు. అధితి, పృధ్వి అను స్త్రీ దేవతలు కూడా కలరు. జ్యూపిటర్‌కు సమానమైన 'ద్యూష్' అనే ఆకాశ దేవతను ఆర్యులు కొలిచారు. 'ఉషా' దేవతను ఆరాధించారు. అందరిలో ఎక్కువ ప్రాధాన్యం కలవాడు ఇంద్రుడు. ఇతడు తన వజ్రాయుధంతో దాశ దస్యులను నిర్మూలించి ఆర్యులకు సిరిసంపదలు చేకూర్చిన యుద్ధాధినేతని వారి విశ్వాసము.

దేవతలుకూడా మానవులవలే ఆకలిదప్పులు, కామ క్రోధములు, ఆగ్రహ అనుగ్రహములు ఉండునని వారి నమ్మకం. దేవతలును సంతృప్తిపరచుటకు యజ్ఞములు, బలి సమర్పణ జరిగేది. యజ్ఞములో పాలు, ధాన్యాలు. నెయ్యి, లాంటివే కాకుండా మేక, గుఱ్ఱం, ఆవు, ఎద్దు, పెద్ద జంతువులను ఇంకా మాంసం, సోమరసం లాంటివి దేవతలకు నైవేద్యముగా సమర్పించేవారు. నర బలులుకూడా ఆచారములో ఉండేవి. మరణించిన వారిని దహనము చేయడం, పూడ్చిపెట్టడం ఆ కాలమునందు ఆచారము.

గణంలోని జనం యొక్క ప్రార్థనల్ని పురోహితుడు దేవతలకు నివేదిస్తాడని, పురోహితుల నోటివెంట వెలువడే గణ విన్నపాలను దేవతలు ఆలకించి వాటిని తీరుస్తారని ఆర్యప్రజల విశ్వాసం. పురోహితుడు దేవతలకు, మనుషులకు మధ్య దేవుని ప్రతినిధిగా రూపొందాడు. అందుచేత సమాజంలో పురోహిత వర్గం సహజంగా శక్తి సంపన్నమైనది.

## 5.9 మలివేద కాలపు నాగరికత (క్రీ.పూ. 1000-600).

మలివేదయుగం చరిత్ర ప్రధానముగా ఋగ్వేదం. తరువాత సంకలనము చేయబడిన వేద గ్రంధాలపై ఆధారపడి ఉంది. అవి యజర్, సామ, అధర్వణ వేదములు, ఉపనిషత్తులు, సూత్ర వాఙ్మయములు. క్రీ.పూ. 1000-600 సం॥ల మధ్య మలివేద నాగరికత ఉన్నదని చరిత్రకారుల అభిప్రాయం. ఈ మలివేద యుగ గ్రంధాలన్నీ గంగా మైదానములో సంకలనం చేయబడ్డాయి. ఆర్యులు ఋగ్వేద అనంతర కాలమునాటికి సప్త సింధు ప్రాంతము నుండి ఉత్తరాపథమున తూర్పు, దక్షిణదిశలకు విస్తరించినవి. ఈ సందర్భములో మనదేశములో ఉన్న ఆర్యేతరులతో ఆర్యులు సంబంధం ఏర్పరచుకొని వారియొక్క సంస్కృతి ప్రభావానికి లోనైరి.

**5.9.1 రాజకీయ వ్యవస్థ :** :ఋగ్వేదము కాలమునాటికి ఉన్న జాతులు, తెగల మధ్య నిరంతర యుద్ధాల వలన కొన్ని నశించి మరి కొన్ని బలపడినాయి. ఋగ్వేద అనంతరం ప్రవేశించిన ఇనుము ఉపయోగం ఆధారంగా ఆర్థిక, భౌతికాభివృద్ధి జరిగింది. ఈ కారణంగా రాజకీయంగా అనేక మార్పులు జరిగినవి. ఈ క్రమములో రాజరిక వ్యవస్థ స్పష్టత సంతరించుకొన్నది. అనేక గణరాజ్యములు నశించి సువిశాల సామ్రాజ్యములు ఏర్పడెను. అవి కురు, పాంచాల కోసల విదేహ మొ॥. విశాలమైన రాజ్యాలు ఏర్పడడము చేత నాయకుడుకి

లేదా రాజుకు అధికారాలు పెరిగాయి. రాజులు పట్టాభిషేక మహోత్సవాలు, దిగ్విజయ యాత్రలు సందర్భముగా యజ్ఞాలు, రాజసూయ, అశ్వమేధ, వాజపేయ మొ॥ యాగాలను బ్రాహ్మణుల సహాయంతో నిర్వహించెడివారు. ఇవన్నీ తమ అధికారాలను ద్రువపరచుకోవడానికి చేసినవే. రాజు, మహారాజ, ఏకరాట్, సామ్రాట్, సార్వభౌమ, రాజాధిరాజ లాంటి బిరుదులను ధరించాడు. రాజ్యరక్షణ, ప్రజా రక్షణ, రాజు యొక్క ముఖ్యమైన భాధ్యతలు. ఐతే కొన్ని సందర్భాలలో రక్షణ బాధ్యత పేర ప్రజలను భక్షించిన విధానం కనిపిస్తూంది. ఋగ్వేద కాలమందు వలే మలివేద కాలమునందు రాజరికము వంశపారంపర్యం. కొన్ని గ్రంధాలులో రాజును ఎన్నుకొన్నట్లు సాక్ష్యాధారాలు కనిపిస్తాయి. శతపథ బ్రాహ్మణము రాజు ధర్మపాలన చేయవలెనని చెప్పుచున్నది.

రాజు సర్వాధికారియైనను అతని అధికారముపై కొన్ని హద్దులు కలవు. ఋగ్వేద కాలమునుంచి కొనసాగుతూ వచ్చిన సభ, సమితి, మొదలగు పురాతన సంస్థలు వాటి అధికారాలు విస్మరింపబడి క్షీణ దిశగా ప్రయాణించాయి. అయిన్పటికీ ఈ ప్రజాసంస్థలకు, రాజుకు ఏకాభిప్రాయం ఉండవలెనని ఆనాటి ప్రతీక. బ్రాహ్మణులు రాజుపై మిగుల అధికారము చెలాయించిరి. పట్టాభిషేక మహోత్సవము లందు బ్రాహ్మణులను గౌరవించి వారి యొక్క ఆశీర్వాదం తీసుకొని,సింహాసనం అధిష్టించెడివారు.

సామ్రాజ్యపరిధి పెరగడంతో పరిపాలన యంత్రంగాన్ని కూడా విస్తృత పరచటం తప్పనిసరి అయినది. ఋగ్వేదం కాలంనాటి సేనాని, పురోహిత, గ్రామణిలతో పాటు భాగదుఘ(పన్నుల వసూలు అధికారి), యువరాజ, పట్టమహిషి (QUEEN) , సంగ్రహిత (TREASURER) సంధి విగ్రహ ( విదేశ వ్యవహారాలు), సూత, అక్షవాప (ఆటపాటలను పర్యవేక్షించువాడు). ఇంకా క్షత్రి, గోవికర్తన, వార్తావహ, స్తపతి వంటి ఉద్యోగుల పేర్లు నాటి వాఙ్మయములో పేర్కొనడం జరిగింది. రాజు తన చుట్టూ పాలనాయంత్రాంగం పేరుతో ఒక ప్రత్యేకమైన వర్గాన్ని మద్దతుదారులుగా ఏర్పరచుకున్నాడు, ఈ విధముగా తన గౌరవాన్ని, అధికారాన్ని విస్తృత పరచుకున్నాడు,

పరిపాలనా సౌలభ్యం కొరకు రాజ్యాన్ని అనేక భాగములుగా విభజించినట్లు తెలుస్తున్నది. స్తపతి లేక శతపతి లాంటి ఉద్యోగుల పేర్లద్వారా వీరు రాష్ట్రాధికారులై ఉండవచ్చని తెలుస్తున్నది. గ్రామాలలో గ్రామణి ముఖ్య అధికారి. అధికృత యను మరియొక ఉద్యోగి కూడా గ్రామపాలనలో ప్రముఖపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తున్నది. స్థానిక పరిపాలన గ్రామ సభలు నిర్వహించేవి. రాజే ఉన్నత న్యాయాధికారి. కొన్ని సందర్భాలలో ఈ కార్యక్రమాన్ని రాజన్యుడు అను ఉద్యోగి ద్వారా నిర్వహించేవారు. రాజద్రోహము, వ్యభిచారము, గర్భస్రావము, హత్య, దొంగతనం, పెద్ద నేరాలు. రాజద్రోహానికి శిక్ష మరణమే. గ్రామాలలో గ్రామణి అను ఉద్యోగి నేర విచారణ చేసి నిందితులను శిక్షించేవాడు. దివ్యపరీక్షల ద్వారా తీర్పులు చెప్పడం కూడా ఆ కాలంలో కలదు. మొత్తం మీద శిక్షలు కఠినం,

**5.9.2 సామాజిక వ్యవస్థ :** దేశంలో సామాజిక నిర్మాణము వర్ణ వ్యవస్థ రూపంలో జరిగింది. ఋగ్వేదం చివరి మండలమైన పురుషసూక్తం మొదటిసారిగా వర్ణవ్యవస్థను ప్రస్తావిస్తుంది. ఇది విరాట పురుషుని ముఖము నుంచి బ్రాహ్మణులు, భుజాలనుంచి క్షత్రియులు, తొడలనుంచి వైశ్యులు, పాదాలనుంచి శూద్రులు జన్మించారని తెలుపుచున్నది. ఐతే నాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను బట్టి వర్ణ విభజన జరిగినదని చాలామంది చరిత్రకారుల అభిప్రాయము. వీరిలో బ్రహ్మణ, క్షత్రియులు అగ్రవర్ణాలు వారు. బ్రాహ్మణుడు ఆశ్రమ ధర్మాలు అనగా బ్రహ్మచర్యము, గృహస్థ, వానప్రస్థ, సన్యాసం లాంటివి ఆచరించేవారు. దేవతారాధన, విద్యాబోధన, బ్రాహ్మణుల కర్తవ్యం. దేశరక్షణ, ప్రజాపాలన వంటి కార్యక్రమాలు క్షత్రియులు నిర్వహించిరి. వైశ్యులు సాధారణ ప్రజలు. వీరు వ్యవసాయం, పశు పోషణ లాంటి ఉత్పత్తి కార్యక్రమాలను నిర్వహించిరి. వీరిలో కొందరు చేతి వృత్తులు కూడా అనుసరించారు. వేద యుగ చివర దశలో వ్యాపారంలోకి ప్రవేశించారు.

ఈ మూడు వర్ణాలే గాక ఆర్యులకు లొంగిపోయిన ఆర్యేతరులు (దాసులు, ఇతర ఆటవికులు) శూద్ర వర్ణముగా మారారు. దాసుడు మొదట అనగా ఋగ్వేద కాలమునాడు ఆర్యేతరుడుగా గుర్తింపబడి మలివేదకాలములో శూద్రుడై పైనున్న వర్గాలవారికి సేవలందించే వాడుగా మార్చబడ్డాడు. ఈ వృత్తులే తదుపరి వంశపరాగతమైనవి. ఈ యుగాంతమునకు వర్ణములు బాగుగా బలపడి వర్ణాంతరం వివాహం, సహపంక్తి భోజనము పూర్తిగా తగ్గి వర్ణ వైషమ్యములు చెలరేగుట ప్రారంభమయ్యేను.

సమాజంలో స్త్రీ స్థానం క్షీణించినది. ఋగ్వేదకాలంన స్త్రీలకు గల గౌరవ మర్యాదలు, స్వేచ్ఛాస్వాతంత్ర్యములు పూర్తిగా క్షీణించినవి. ఋగ్వేదకాలము నాటి పితృస్వామ్యక కుటుంబవ్యవస్థ కొనసాగి ఆడ సంతానం కంటే మగసంతానానికి సామాజిక స్థాయి, విలువ పెరిగింది. ఆడ శిశువు పుట్టుక దుఃఖ కారణముగా పరిగణించబడింది. సభ,సమితి యందు వారికి సభ్యత్వము లేదు. వివాహసంబందములు కఠిన తరము చేయబడినవి. క్షత్రియులలో తప్ప మిగిలిన వారిలో స్త్రీల వివాహములను తల్లిదండ్రులే నిర్ణయించిరి. సమాజములో వరకట్నములు, సతీసహగమనములు, బాల్య వివాహములు లాంటి సాంఘిక దురాచారములు ఆచారములోకి వచ్చెను. బహు భార్యాత్వము పెరిగింది స్త్రీలకు ఆస్తిలో హక్కులేదు. అయినప్పటికీ స్త్రీ విద్య కొంత వరకు కొనసాగించబడినది. ఆకాలంలో గార్గి, మైత్రేయి అను స్త్రీలు గొప్ప విద్యావేత్తలుగా పేరు గాంచిరి.

మలివేద కాలములో ఆహారము, దుస్తులు, వినోదములు లాంటి కార్యక్రమములలో కొన్ని మార్పులు చేర్పులు కనిపించును. సోమ, సురపానీయాలను సేవించుట, మాంసాన్ని భుజించుట. పాపకార్యములుగా నెంచబడెను. నటన, వాయిద్య సంగీతము వినోదములందు క్రొత్తగా చేర్చబడెను.

**5.9.3 ఆర్థిక పరిస్థితులు :** మలివేద కాలపు ప్రజలకు జీవనాధారం వ్యవసాయం. కొన్ని మలి యుగపు వేదగ్రంధాలు ఆరు, ఎనిమిది, పన్నెండు, ఇరవై నాలుగు ఎద్దులను పూన్చిన నాగళ్ళను గూర్చి వర్ణించాయి. బహుశ ఇది అతిశయోక్తి గావచ్చు. కర్ర నాగలితో భూమిని దున్నేవారు. వ్యవసాయము విస్తృతముగా అమలులో ఉన్నా పాతపద్దతులలో మాత్రమే జరిగేది. వేదకాలపు ప్రజలు బార్లీ పండించటం కొనసాగించారు. వరి, గోధుమ వారి ప్రధాన పంటలు. పంజాబ్, పశ్చిమ ఉత్తర ప్రదేశములలోని ప్రజలకు గోధుమ ప్రధాన ఆహారమైనది. మలివేదకాలపు ప్రజలు మొదటి సారిగా గంగా మైదానములోని వరి పంటను గురించి తెలుసుకున్నారు. మలివేద కాలమలో అనేక కళలు చేతివృత్తులు అభివృద్ధి చెందాయి. బట్టలు నేయటం, స్రీలకు మాత్రమే పరిమితంగా ఉన్నా విస్తృత పరిధిలో జరిగేది. చర్మకార వృత్తి, కమ్మరి, వడ్రంగి, లాంటి వృత్తులు బాగా అభివృద్ధి చెందాయి.

వర్తక, వ్యాపారములందు గణనీయమైన అభివృద్ధి సాదించారు. 'పనిజులు' అను ప్రత్యేక తరగతి దేశీయ, విదేశీయ వ్యాపారములను నిర్వహించుచుండెను. వ్యాపారములలో వస్తుమార్పిడి విధానము తగ్గి కర్షాపణము, శతమాన్ననిష్క, యను బంగారు నాణెములు వాడుకలోకి వచ్చెను. దేశం సిరిసంపదలతో తులతూగుచున్నదని తెలియడానికి ఈ బంగారు నాణెములు కారణంగా చెప్పవచ్చు. పరిశ్రమలకు, వాణిజ్యాలకు ఆనాడు కౌశాంబి, కాంపిల్య, తక్షశిల, హస్తినాపురం మొ॥ నగరములు ముఖ్యమైనవి.

**5.9.4 మతం :** ఋగ్వేద కాలములో వరుణుడికి వ్యతిరేకంగా ప్రాముఖ్యత పొందిన ఇంద్రుని ఆరాధన తగ్గినది. మలివేద కాలములో సృష్టి కర్తయయిన ప్రజాపతికి అత్యున్నత స్థానం ఇవ్వబడినది. విష్ణువు అతని ప్రతిరూపాలైన కృష్ణుడు, లాంటి దేవతల ఆరాధన జరిగింది. సృష్టి, స్థితి, లయములకు ముఖ్యకారకులయిన త్రిమూర్తుల (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను) ఆరాధింపసాగిరి. నాటి భిన్న సంస్కృతి, స్రవంతులకు నిలయమైన, బహుముఖ దృక్పధము గలిగిన హిందూమతమునకు లేక భారతీయ సంస్కృతికి పునాదులు వేయబడెను. సమాజములో యజ్ఞయాగాది క్రతువులు, కర్మకాండలు, విపరీతముగా పెరిగెను. సామాన్య ప్రజలకు అదిక వ్యయప్రయాసలతో కూడిన ఈ క్రతువులు అందుబాటులో లేకుండెను. దీని ద్వారా సమాజములో బ్రాహ్మణుల ఆధిక్యత, సామాన్య ప్రజల ఆధ్యాత్మిక అశాంతికి దారితీసెను.

మలివేద కాలములో హింస ప్రధానముగా కొనసాగుతున్న వైదిక కర్మకాండ, పురోహిత బ్రాహ్మణ వర్గ ఆధిక్యత తారాస్థాయికి చేరుకున్నది. ఈ హింసాయుత కర్మకాండలపై, పత్యామ్నాయంగా జ్ఞాన మార్గలైన కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలు ఉపనిషత్తులలో కనిపిస్తాయి. వేదములో భాగములు ఉపనిషత్తులు. అందుచేత ఇందు చెప్పబడిన జ్ఞానమార్గము వేదాంతంగా ఖ్యాతిచెందెను ఆత్మ , విశ్వాత్మలో లీనమగుటయే మోక్షము. ఈ జ్ఞాన మార్గములో జాతి, మత, వర్ణ బేధములు కృత్రిమములని, మానవులందరు సమానమని నూతన సాంఘిక వికాసము ప్రజ్వరిల్లెను.

పైథాగరస్, థీల్స్, లాంటి గ్రీకు తత్వవేత్తలందరూ విద్యాలయాలు, అకాడమీలు, పరిశోధనాలయాలు స్థాపించి సంవత్సరాల తరబడి బాహ్యప్రపంచంతో సంబంధం లేకుండా తదేక ధ్యానంతో తాత్విక పరిశోధన చేసి క్రొత్త సత్యాలను వెలువరించిరి. భారతీయ ఉపనిషత్ కార్యకర్తలు అడవులకు వెళ్ళి యజ్ఞ యాగాదుల కర్మకాండలను నిరసించినారేగాని రాజకీయ, సామాజిక సమస్యల జోలికి పోలేదు.

## 5.10 ఇతిహాసయుగం

భారత, రామాయణ కాలాల చరిత్రను కొందరు చరిత్రకారులు ఇతిహాసయుగముగా పేర్కొన్నారు. భారత, రామాయణములు ఎప్పుడు వ్రాయబడెనో చెప్పుట కష్టము. వీని మూలకథలు చాలా ప్రాచీనములైనప్పటికి గుప్తుల కాలమువరకు అనగా క్రీ.శ. 4 వ శతాబ్దమువరకు అనేక అంశములను చేర్చుకుంటూ ఇవి ఉద్గ్రంధములుగా రూపొందబడినవి.

ఉత్తరాపధములో స్థిరపడిన ఆర్యులు, దక్షిణాపధము మీదికి తన దృష్టిని సారించారు. మద్యదేశములో వింధ్యాద్రులు ఉన్నందువలన ఆర్య విస్తరణ దక్షిణాపధములో నిదానంగా సాగింది. ఋగ్వేదానికి చెందిన ఐతిరేయ బ్రాహ్మణం వింధ్యాద్రులకు దక్షిణమున ఏర్పడిన ఆర్య రాజ్యమైన విదర్భ ప్రశక్తి ఉంది. ఈ విదర్భ ఆర్య విస్తరణకు కేంద్రమైనదని చెప్పవచ్చు. అదే బ్రాహ్మణములో ఉన్నటువంటి శునశ్శేపుని కథ ద్వారా తండ్రి విశ్వామిత్రునిచే శపింపబడిన అతని 50 మంది కుమారులు ఆర్యావర్తము పొలిమేరల కవతల దాస దస్యులుతో కలిసిపోయినారని వారే ఆంధ్ర, శబర, మూతిబ, పులింద మొ॥ జాతులు అని ఈ కథనుబట్టి తెలుస్తుంది.

ఆర్యులు దక్షిణాపధముపై పొందిన ఇతోదిక పరిజ్ఞానం ఇతిహాసాలు, పురాణాలు ద్వారా తెలుస్తుంది. భారత, రామాయణమయులు ఇతిహాసములు. ఇవి చాలా ప్రాచీనమైనవి. ఇందలి పాత్రలు, అంశములు, సమాజముపై ఎక్కువ ప్రభావాన్ని కలిగి ఉన్నవి. మన దేశమున సారస్వత గ్రంధములకాధారము ఇతిహాసములే. "హోమర్ రచనలు గ్రీసుదేశమునకు ఎలాంటివో భారత, రామాయణములు భారతదేశమునకు అలాంటివి." అని స్మిత్ పండితుడు చెప్పెను. మహాభారతములోని శ్రీకృష్ణుడు, రామాయణమందలి శ్రీరాముడు, భారతప్రజలకు ఆరాధ్యదైవములు.

భారతమును వ్యాసమహర్షి, రామాయణమును వాల్మీకి రచించిరని ప్రతీతి. భారత గ్రంధమునందు 18 పర్వములు, లక్ష శ్లోకములు కలవు. రామాయణమునందు 24,000 శ్లోకములు కలవు. భారతము ద్వాపర యుగమునకు, రామాయణము త్రేతాయుగమునకు చెందినవని గ్రంధకర్తల అభిప్రాయము.

మహాభారతము, రామాయణాలలో మహాభారత సంఘటన ముందు జరిగింది. ఇది క్రీస్తు పూర్వము 900 సం॥లో జరిగి ఉండవచ్చని 'రోమిల్లా థాపర్' అభిప్రాయము. మహాభారత యుద్ధము ఆర్యగణములైన పురు శాఖలైన కురు, పాండవులమద్య ఉత్తరదేశ సార్వభౌమత్వంనకు జరిగిన యుద్ధం. రామాయణమునందలి రామ, రావణయుద్ధం ఆర్యులకు, ఆర్యేతురులకు జరిగెను. ఆర్యసంస్కృతి దక్షిణాపధమునకు ఎట్లు విస్తరించెనో తెలుపును.

ఆర్య మహర్షులు దక్షిణాపధానికి వచ్చి ఆశ్రమాలు నెలకొల్పి, ఆర్య భాషా సంస్కృతులను ప్రచారము చేసెను. ఐతే ఈ సందర్భములో వీరికి దక్షిణా పధములో అనార్య జాతుల నుంచి ఇబ్బందులు ఎదురైనవి. ఈ అనార్య జాతులనుంచి రక్షించడానికి కోసలాధీశుడైన శ్రీరాముడు దక్షిణదేశానికి వచ్చాడు. ఆర్య అధికార సంస్కృతికి, విస్తరణకు రాముడు తోడ్పడినందువలన రాముడ్ని అవతార పురుషుడుగా ఆరాధించారు.

## 5.11 సారాంశము :

ఆర్యుల జన్మస్థానం, భారతదేశంలో ఆర్య సంస్కృతి విస్తరణ పై వివిధ వాదనలు ఉన్నప్పటికీ, ఆర్యుల సంస్కృతి, భారత ప్రజల పై విశేషమైన ప్రభావాన్ని కలిగివుంది. ముఖ్యంగా ఆర్యుల నాగరికతా కాలంలో ప్రవేశపెట్టబడిన, సామాజిక, సాంఘీక, మతపరమైన అంశాలు భారత నాగరికతలో ప్రధానమైన పాత్రను పోషించుతున్నాయి.

## 5.12 మాదిరి ప్రశ్నలు :

1. ఆర్యుల జన్మస్థలం, విదేశీ సిద్ధాంతం గూర్చి వ్రాయుము ?
2. ఆర్యుల చరిత్రకు ముఖ్య ఆధారములు వైదిక వాఙ్మయము అని ఏ విధంగా చెప్పవచ్చును ?
3. ఋగ్వేద కాలం నాటి ఆర్యుల నాగరికత ఏ విధంగా ఉండేది ?
4. మలివేద కాలపు ఆర్యుల నాగరికత గూర్చి వివరించండి ?

## సంక్షిప్త ప్రశ్నలు :

1. ఇండో యూరోపియన్ భాషా సంబంధాల గూర్చి వ్రాయము ?
2. భారతదేశంలోని ఆర్యులు ఎలా ప్రవేశించారు ?
3. ఆర్యుల జన్మస్థలం, స్వదేశీ సిద్ధాంతం గూర్చి వ్రాయుము ?
4. ఇతిహాస యుగం గూర్చి వ్రాయుము ?

Written by Dr. G. Soma Sekharao

# వైదిక వాఙ్మయము ( వేదసాహిత్యం)

ఆర్యుల చరిత్రకు ముఖ్య ఆధారములు వైదిక వాఙ్మయము వేద అను పదము సంస్కృత భాషలోని 'విద్' అను పదము నుండి ఉద్భవించినది. 'విద్' అంటే తెలుసుకొనుట అని అర్థం. వేదమనగా జ్ఞానమని అర్థం. వేదములు అపౌరుషేయములు. వేదసాహిత్యంలో నాలుగు భాగాలున్నాయి. అవి ఋక్, యజుర్, సామ, అధర్వణ వేదములు. ప్రతివేదమునందు సంహితములు, బ్రాహ్మణములు, అరణ్యకములు, ఉపనిషత్తులు అను నాలుగు భాగములు కలవు. ఈ వేదములు తరువాత సూత్ర వాఙ్మయము తయారైనది. ఇందులోని భాగములే వేదాంగములు, శ్రౌత, గృహ్య, ధర్మ సూత్రములు, ఉపవేదములు ఇతిహాస గ్రంథములైన భారత, రామాయణములు ముఖ్యమైన వైదిక వాఙ్మయములు.

**1. ఋగ్వేద సంహిత:-**

ఋగ్వేద సంహిత అత్యంత ప్రాచీనమైన వైదిక గ్రంథము. దీని ఆధారంగానే తొలి వేద యుగాన్ని తెలుసుకోవచ్చు. ఇందులో ఋక్కులను ప్రార్థనా శ్లోకములు కలవవు. ఇది పది మండలముగా విభజింపబడినది. ఇందులో 1017 ఋక్కులు గలవు. వీటివలన ఆర్యులు యొక్క తొలి రాజకీయ, సాంఘిక, ఆర్థిక మత జీవన విధానము తెలుసుకొనవచ్చును.

**2. సామవేద సంహిత:-**

గానం కోసం ఋగ్వేద మంత్రాలకు స్వరాన్ని అమర్చారు. ఈ క్రొత్త సంకలనానికి సామవేద సంహిత అని పేరు. ఇందులో 1549 ఋక్కులు గలవు. ఈ ఋక్కులు శ్రావ్యమైన స్వరసంకలనం కలిగియున్నవి వీనిని యజ్ఞక్రతువు లందు పాడెదరు.

**3. యజుర్వేదము:-**

యజుర్వేదము మంత్రాలు మాత్రమే కాకుండా అవి చదివేటప్పుడు అనుసరించాల్సిన నియమాలను కర్మకాండలను గురించిన విశేషాలను తెలుపుతాయి. ఈ కర్మకాండలకు సంబంధించిన ఆచారాలు, అవి ఆవిర్భవించిన సామాజిక, రాజకీయ వాతావరణానికి అద్దం పడతాయి. ఇది పద్య, గద్య సంకలనము.

**4. అధర్వణవేదము:-**

అదర్వణ వేదములో 731 ఋక్కులు గలవు. ఇది 20 భాగములుగా విభజింపబడినది. ఇందు భూత పిశాచములు పారద్రోలు మంత్ర, తంత్రములు గలవు. అధర్వణవేదంలో చెడును, వ్యాధులను దూరం చేసుకోవడానికి పనికి వచ్చే తాంత్రిక ప్రక్రియలు ఉన్నాయి.అధర్వణ వేదములోని విషయం అనార్యుల నమ్మకాలను గురించి, ఆచారాలను గురించి తెలియజేస్తుంది.

**బ్రాహ్మణములు:-**

వీటినిండా కర్మకాండ సూత్రములున్నవి. ఆ సూత్రాలు, కర్మ కాండల వెనుకనున్న సామాజిక, మత విషయములను వివరిస్తాయి. ఇందులో యజ్ఞముల ప్రశస్తి అవి ఎట్లు నిర్వహింపబడునో తెలియజేయు విధము విపులంగా చెప్పబడినవి. అనార్యులు ఆర్యసంఘములో చేర్చుకొను విధము, కర్మమార్గమున మోక్షమును పొందు విధము తెలుపును. బ్రాహ్మణములలో ఋగ్వేదమునకు ఐతరేయ, కౌస్తిక బ్రాహ్మణములు, సామవేదమునకు తాండ్య, జైమినీయ బ్రాహ్మణములు, యజుర్వేదమునకు తైతరేయ, శతపథ బ్రాహ్మణములు, అధర్వణ వేదమునకు గోపద బ్రాహ్మణము ముఖ్యమైనవి.

**అరణ్యకములు:- (FOREST TEXTS):-**

ఇవి ఆటవిక పుస్తకములు. ఇవి ఆర్యుల జీవితములో మతపరమైన తంతులలో ప్రాధాన్యము వహించిన యజ్ఞ యాగాది వైదిక కర్మలు పాటించటం పట్ల గాఢమైన వ్యతిరేకత కనపరుస్తాయి. ఆర్యులు వృద్ధాప్యములో అడవులకు వెళ్ళి తపోమార్గమును అవలంబించి మోక్షము పొందు విధము ఇందులో చర్చింపబడెను. బ్రాహ్మణములోని కర్మమార్గమునకు, ఉపనిషత్తులలోని జ్ఞానమార్గమునకు ఈ అరణ్యకములు సంధాన కర్తలు. అరణ్యకములలో ఐతిరేయ, తైతరేయ అరణ్యకములు ముఖ్యమైనవి.

**ఉపనిషత్తులు:-**

గురు శిష్యుల మధ్య ఆధ్యాత్మిక విషయమును గూర్చి జరిగిన చర్చలే ఉపనిషత్తులు. వీటిలో విశ్వాత్మ, పరమభావన, వ్యక్తి ఆత్మ ప్రపంచం పుట్టుక, ప్రకృతి రహస్యాలు మొ॥ వీటిని వివరించడం జరిగింది. భక్తి, జ్ఞాన, వైరాగ్యమార్గమును గురించిన చర్చలు ఇందులో కలవు. భారతీయ ఆధ్యాత్మిక చింతన ఉపనిషత్తులలో పరాకాష్టను పొందినవి. ఉపనిషత్తులు 300 లకు పైన కలవు. అందు ఈశా, ఖేన, కథా, చాందోగ్య, బృహదారణ్యక, ముండక, మౌండిక్య, మైత్రేయిని ఉపనిషత్తులు ముఖ్యమైనవి.

**వేదాంగములు:-**

వేదంగాలు ఆరు. అవి. 1. శిక్ష (ఉచ్ఛారణ) 2. కల్ప (క్రతువులు), 3. వ్యాకరణము (గ్రామర్), 4. నిరుక్త (శబ్ద ఉత్పత్తి

శాస్త్రం), 5. ఛందస్సు (ఘన విభజన), 6. జ్యోతిష్యం (ఖగోళశాస్త్రం). ఇవన్నీ వేదాలను సరిగా అధ్యాయనం చేసేందుకు, అర్థం చేసుకొనేందుకు, బలి, కర్మాది క్రియలలో వాటిని వినియోగించేందుకు ఉపయోగపడే విషయాలను బోధిస్తాయి. వేదాంగాలు సూత్రాలు రూపంలో ఉంటాయి. జ్ఞాపకం ఉంచుకోవటానికి వీలుగా క్లుప్తీకరించిన వచన వాక్యాలే సూత్రాలు.

సూత్ర గ్రంధాలలో కల్పసూత్రం అందుబాటులో ఉంది. వీటిని మరల 3 తరగతులుగా విభజించడమైనది. అవి. 1. శ్రుత సూత్రాలు, అగ్నికి, సోముడికి సంబందించిన యజ్ఞయాగాదులను వివరిస్తుంది. 2. గ్రహ్యసూత్రాలు; ఇళ్ళలో చేయాల్సిన, క్రతువులు, ఇంటి యజమాని నిర్వహించాల్సిన క్రతువుల వివరాలు తెలియజేస్తుంది. 3. ధర్మసూత్రాలు; మను స్మృతి వంటి ధర్మశాస్త్రాలు పుట్టుటకు ఇదే మూలం.

**ఉపవేదాలు:-**

ఉపవేదములు శాస్త్రీయ గ్రంధములు. ఇందు మంత్ర ప్రశక్తి కనిపించదు. ఇందు ధనుర్వేదము యుద్ధతంత్రమునకు సంబందించిన విద్య గురించి, ఆయుర్వేదము ఔషధముల గురించి, గాంధర్వ వేదము సంగీత శాస్త్రముల గురించి. శిల్పవేదము శిల్ప కళ గురించి వివరించును.

**ఇతిహాసములు:-**

భారత, రామాయణములు ఇతిహాసములు. ఆర్య గణముల మధ్య ఉత్తరదేశ సార్వభౌమత్వమునకు జరిగిన పోరాటమును గూర్చి మహాభారతము వివరించును. దక్షిణా భారతదేశమునకు ఆర్య సంస్కృతిని విస్తరించిన విధమును గురించి రామాయణము వివరించును. ఇవి ప్రాచీన గ్రందములైనప్పటికి ఒకే యుగములో తయారైనవి కావు. ఇతిహాసములు కాలగమనములో అనేక అంశములు ప్రస్తావించబడినందున ఇవి ఉద్గ్రందములైనవి. వీని ద్వారా అనేక చారిత్రాత్మక విషయములు తెలియును.

**ఋగ్వేద కాలం లేదా తొలివేదకాలం**

**(క్రీ॥పూ॥ 1500 - 1000)**

ఆర్యుల రాకతో మనదేశమున చారిత్రక యుగము ప్రారంభమైనది. ఆర్యులయొక్క జన్మస్థానం, కాలము, వివాదాస్పదమైన అంశములు. వీరి యొక్క దేశీయత మీద చరిత్రకారులు అనేక అభిప్రాయాలను తెలియజేసిరి. ఎక్కువ మంది చరిత్రకారులు వీరిని విదేశీయులుగా గుర్తించిరి. వీరియొక్క జన్మస్థానం ఐరోపాలోని హంగేరి, జకోస్లోవేకియా మైదానము అయి వుండవచ్చునని గుర్తించడం జరిగింది. క్రీ॥పూ॥ 1500 సం॥లో వీరి జన్మస్థానము నుండి శాఖోపశాఖలుగా చీలి అందొక శాఖ ఆసియా మైనర్, బెలుచిస్థాన్ గుండా భారతదేశమునకు వచ్చిరి.

వారి రాకకు సంబంధించిన స్పష్టమైన, నిశ్చితమైన పురాతత్వ ఆధారాలు లభించలేదు. ఐతే ఆర్యనాగరికతకు మూలాధారం, వేద వాజ్మయం. తొలి ఆర్యులు తూర్పు ఆఫ్ఘనిస్థాన్, పంజాబ్, పశ్చిము ఉత్తర ప్రదేశ్ల మధ్య ఉన్న భౌగోళిక ప్రాంతంలో నివసించారు. ఆర్యులు భారతదేశంలో మొదటిసారిగా నివాసం ఏర్పరచుకున్న ప్రాంతాన్ని సప్తసింధు ప్రాంతం అంటారు. సప్త సింధు అనగా సింధు, జౌలం, చీనాబ్, రావి, సట్లేజ్, బియాస్, సరస్వతి నదుల పరీవాహక ప్రాంతం. ఆర్యులు భారతదేశానికి అలలు అలలుగా వచ్చారు. క్రీ॥పూ॥1500 ప్రాంతంలో వచ్చిన ఋగ్వేద ఆర్యులు మొదటి అల. వీరి యొక్క నాగరికత తెలుసుకోవడానికి ఋగ్వేదం ముఖ్య ఆధారం. ఇది ప్రాచీన గ్రంథం. క్రీ॥పూ॥ 1200 సం॥న సంకలనం చేయబడినది.

**రాజకీయ వ్యవస్థ:-**

ఆర్యులు సప్త సింధూ లోయలోకి వచ్చినపుడు సంచార జీవితాన్ని గడుపుతూ ఉండేవారు. ఇంకా జనయుగాన్నుంచి, గణతంత్రం నుంచి బయటపడలేదు.

**1. గణరాజ్యం:- (TRIBAL KING DOM):-**

ఆర్యులది గణ వ్యవస్థగల సామాన్య వ్యవస్థ. వీరిది పితృస్వామకం. ఋగ్వేదపు ఆర్యుల్లో వర్ణవ్యవస్థ లేదు. కుటుంబం నాటికి, నేటికి సమాజ నిర్మాణానికి గ్రామ ఆవిర్భావానికి పునాది. కొన్న కుటుంబములు గ్రామములుగను, కొన్ని గ్రామములు 'విశ్' లుగను వ్యవహరించారు. విశ్ అంటే ప్రజలు. ఈ విశ్లును జనపదములు (Janapada) గ ఏర్పడెను. ఇట్టి .జనపద రాజ్యమే లేదా గణ రాజ్యము, ఋగ్వేద రాజ్యము. ఋగ్వేదపు గణాలు ఐదు. ద్రుష్యు, యదు, తుర్వశ, పురు, భారత మున్నగునవి. ప్రతిగణం ఒక నాయకుడుని ఎన్నుకొన్నది. ఇలా ఎన్నుకోబడిన వారి ముఖ్య ధర్మం గణరక్షణ.ఇతడనే గణ పెద్ద లేదా రాజన్. సామ్రాట్, స్వరాట్ శాన, ఈశాన్య భూపతి, ఏలి అని కూడా అంటారు. అప్పుడప్పుడు ఈ రాజ్యముల మధ్య తగవులుత్పన్నమయ్యేడిది. దశ రాజగణ యుద్దము (Battle of Ten Kings). ఇందు యదు, పురు, పుర్వస మొ॥ గణముల రాజులు భారత వంశీదీశుడైన సుధామునిలో పోరాడి పరాజిత్తులైరి. ఈ యుద్ధం పరుష్ణో నదీ తీరంలో (ఆదునిక రావీనది) జరిగింది

ఈ యుద్దంలో సుదాసు జయించి భరతుల ఆదిపత్యాన్ని స్థాపించాడు . ఓడిపోయిన తెగలలో ప్రధానమైన తెగపేరు

'పురు.' కాలక్రమేణ, భరతులు పురులతో చేయికలిపి 'కురు' అన్న పాలక తెగను స్థాపించారు. 'కురు' తెగకు చెందిన వీరు పాంచాల తెగకు చెందిన వారితో కలిసి ఉత్తర గంగా మైదానములో, తమ పరిపాలన స్థాపించి వేద యుగం చివర దశలో గొప్ప పాత్రను వహించారు. రాజరికం వంశపారంపర్యం, కొన్ని తెగలయందు రాజులను ఎన్నుకొను ఆచారం కలదు. ఈ విధముగా ఎన్ను కొన్న రాజులు 'గణపతి' అంటారు. ప్రజాస్వామ్యం శిష్టుల రాజ్యం (OLIGARCHY) మొ॥ ప్రభుత్వంలు ఆర్యగణము నందు కలవు.

**2. రాజు:-**

తెగల అత్యున్నత అధికారి రాజు. అతని అధికారం తెగలకు మాత్రమే పరిమితము. ఋగ్వేదం చివరి కాలంలో రాజరికం, వారసత్వమైనది. ప్రజల యొక్క క్షేమసమాచారమును కాంక్షిస్తూ రాజు దేవతారాదనలు, యజ్ఞ యాగాదుల, క్రతువులు, నిర్వహించును. పరిపాలనా కార్యక్రమములో రాజుకు పురోహితుడు, సేనాని, ఇంకా కుటుంబపెద్దలు, తెగల యుద్ధచాయకులు తోడ్పడువారు. ప్రధానమైన విషయమేదైన చర్చించవలసి వచ్చినపుడు రాజు తన సకల గణసభ్యుల అభిప్రాయాన్ని స్వీకరంచేవాడు. గణ సభ్యులు రాజుకు బలి (పన్ను) అను దానిని చెల్లించే వారు. గ్రామణి గ్రామమునకు పెద్ద. గూడచారి వ్యవస్థ కూడా కలదు.

**3. ప్రజా సభలు (POPULAR ASSEMBLIES):-**

రాజు సర్వాధికారి యైనను నిరంకుశడు కాదు. అతడు ప్రజారంజకుడు. వైదిక గ్రంధాలు మూడు రకాల అసెంబ్లీలను పేర్కొన్నవి. అవి:1. సభ, 2. సమితి, 3. విదాత. అనేవి ప్రధాన సంస్థలు. అవి రాజు యొక్క కార్యక్రమాలను అదుపులో ఉంచును. సైనిక, ధార్మిక కార్యకలాపాలను కూడా నిర్వహించేవి. సభ, తెగలోని అనుభవజ్ఞులైన వృద్ధులతో కూడిన సంస్థ. సభ కొంత విస్తృతమైనది. బహుశ దానిలో స్త్రీలు కూడా పాల్గొనిడి వారు. సభా, సమితి న్యాయ సంబంధమైన, రాజకీయ సంబంధమైన కార్యకలాపాలను నిర్వహించడం గుర్తించ దగినది. సమితి అంటే చిన్న సభ అని అర్థం. ఇది దేశానికి సంబందించిన అంశాలను చర్చించును. ఈ సభా, సమితికి రాజే అద్యక్షత వహించేవాడు రాజ్యాంగ బద్దమైన రాజరిక వ్యవస్థ ఆనాడున్నదని చెప్పవచ్చు ఈ సభల మధ్య సమన్వయాన్ని గూర్చి ఋగ్వేదం చెప్పుచున్నది.

**4. న్యాయపాలన:-**

రాజ్యమున అత్యున్నత న్యాయాదికారి రాజు. పురోహితుడు న్యాయపాలనలో రాజుకు ముఖ్య సలహాదారుగా వ్యవహరించును. దొంగతనం, దారిదోపిడి, బందిపోటు, మోసం, గోగ్రహణం, సర్వసాధారణమైన నేరాలు. శిక్షలుకూడా కఠినంగా ఉండేవి. యుద్దంలో చేజిక్కన సంపదను వైదిక సమావేశాలలో పంచేవారు. న్యాయ నిర్ణేతల తీర్పు (Trial By Jury), దివ్య పరీక్షల ద్వారా తీర్పు (Trial By ordeal) చెప్పెడివారు. క్రిమినల్ నేరములకు 'రక్తపు పైకమును' అనగా హతుని కుటుంబమునకు నష్టపరిహారము చెల్లించుట. అను విశిష్టమైన శిక్ష గలదు. అంగ విక్షదము, దేశ బహిష్కరణ లాంటి శిక్షలు కూడా కలవు.

**సాంఘిక వ్యవస్థ:-**

కుటుంబానికి తండ్రి పెద్ద. విపులంగా చెప్పాలంటే కుటుంబంలోని అందరికన్నా వృద్ధుడైన పురుషుడు కుటుంబ పెద్దగా వ్యవహరించును. కుటుంబ పెత్తనం యావత్తూ అతని మీదే ఆధారపడి వుంటుంది. కుటుంబంలోని వారందరికి ఆయన మాట శిరోధార్యము. ఋగ్వేదములో తండ్రిమాట లెక్కజేయని పుత్రుని కండ్లు పీకించినట్లు తెలుస్తుంది. సర్వసాధారణంగా ఏకపత్నీ వ్రతం ఆచారం. రాజకుటుంబంలందు బహు భార్యా తత్వము కలదు. వివాహములు పవిత్ర భందములుగా నెంచబడెను. గృహ యజమాని మత సంభంధ ఉత్సవాలలో భార్యతో కలిపి నిర్వహించేవాడు.

**1. సమాజంలో స్త్రీ స్థానం:-**

గృహానికి సంబందించినంత వరకు స్త్రీకి గృహిణిగా ఉన్నతస్థానముండేది. మత సంబందమైన కర్మ కాండలలో స్త్రీ పాల్గొనేది. సంఘ సభ్యురాలిగా సభ, సమితుల యందు సభ్యురాలుగా స్త్రీకి సంఘమునందు గౌరవ స్థానం కలదు. బాల్యవివాహాలు, సతీసహగమనం, పరదా పద్దతి లేక ఘోషా పద్దతి ఆనాడు లేవు. వితంతు వివాహాలు నిషేదింపబడలేదు. బాలికలు, యుక్తవయసు వచ్చిన తరువాత వివాహాలు జరిగేవి. స్త్రీలకు వరున్ని ఎన్నుకొనుటలో పూర్తి స్వేచ్ఛగలదు. స్త్రీలయందు నైతిక ప్రమాణములు హెచ్చు. వారిలో గొప్ప విద్యావేత్తలు గూడా కలరు. విశ్వవర, ఘోషా, అపాళ గొప్ప విద్యావేత్తలు. వీరు ఋగ్వేదములోను కొన్నిప్రార్థనా శ్లోకములను సంతరించిరి.

**2. ఆహార పద్దతి:-**

పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, మొ॥ వాటిని ఆర్యులు ఎక్కువగా ఉపయోగించెడివారు. ధాన్యాలులో, గోధుములు, యవలు (బార్లీ ), కాయగూరలు, పండ్లు, మాంసము, చేపలు వారి ముఖ్య ఆహారం. ఋగ్వేదంలో యవలను (బార్లీ) గురించి ఎక్కువగా చెప్పడం జరిగింది. అడవిరేగు, బేరికాయ , నేరేడు, సీతాఫలం, మామిడి, మొ॥ పండ్లు ఎండబెట్టుకొని ఇతర సమయాలలో తినేవారు. పానీయాలలో సోమపానం ఆర్యులకు అంత్యంత ప్రియమైనది. దీనిని గురించి ఋగ్వేదంలో 9వ మండలములో అనేక శ్లోకాలు

చెప్పబడ్డాయి. సోమాన్నితాగి సాయంకాలం నృత్యం చేసేవారు. 'సుర' అనే మత్తుపానీయం కూడా ఆ కాలంలో కలదు. 'మధు' (తేనె) కూడా వాడుకలో కలదు.

**5.8.9 దుస్తులు మరియు ఆభరణములు:-**

వస్త్రధారణలో హరప్పా ప్రజలకు, ఆర్యులకు మధ్య అట్టే తేడాలేదు. పైన ఉత్తరీయం (అధివస) కప్పుకునేవారు. క్రింద ధోవతీ (వస) ధరించే వారు. తలపాగా ధరించడం కూడా వాడుకలో ఉంది. నూలు, ఉన్ని, చర్మపు దుస్తులు ధరించడం వారికి ఇష్టం. బట్టలపై బుట్టాలు కుట్టడం, వివిధ రంగుల వాడకం, ఆకర్షణీయమైన వస్త్రధారణ వారికి తెలుసు. యజ్ఞయాగాదుల క్రతువులందు పట్టుబట్టలు ధరించెడి వారు. జుట్టును అలంకరించుకోవడం వారికి తెలుసు.

ఆర్యులకు ఆభరణాలంటే ప్రీతి. స్త్రీ పురుషులిరువురు ఆభరణాలు ధరించేవారు. చెవులకు 'కర్ణశోభన' అనెడి ఆభరణాన్ని ధరించెడి వారు. స్త్రీలు చేతిగాజులు, మురుగులు, కంఠాభరణాలు ధరించేవారు. బంగారముతోగాని, తదితరలోహాలతో తయారైన ఆభరణాలు ధరించేవారు. వెండి ఉన్నప్పటికీ వాడకం తక్కువ. స్త్రీలకు శిరోజాలంకరణ ప్రత్యేక కళ. ఆర్య పురుషులు కూడా స్త్రీలవలే పొడవైన జుట్టు పెంచుకొనెడి వారు.

**5.8.10 వినోదములు:-**

ఆర్యులు ఉల్లాసవంతమైన జీవితమును గడిపినట్లు తెలుస్తుంది. సంగీతము, నృత్యము పాచికలాట, చదరంగము, వేట, గుఱ్ఱపు పందెములు, రథ పందెములు వారి ముఖ్య వినోదములు. సప్త సింధు ఆర్యులలో జూదమాడుట ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. రథాల పందాలు ఆర్యుల అభిమాన వినోదం. అంగీరస, సవ్యఋషి నృత్యాన్ని పేర్కొన్నాడు. సంగీతములో గాత్రము, వాయిద్యాలు రెండూ ఉండేవి. వేణువు, వీణ, మద్దెల వారి ముఖ్య వాయిద్యాలు.

**5.8.11 కుల వ్యవస్థ:-**

నాడు వర్ణ వ్యవస్థ లేదా కుల వ్యవస్థ లేదు, చరిత్రకారులు కులవ్యవస్థ మీద అనేక అభిప్రాయములను తెలియజేసారు. సమాజములో ఆర్యులు, ఆర్యేతరులు లేక దస్యులు అను రెండు జాతులు కలవు. ఋగ్వేదంలోని పదవ మండలములోని పురుష సూక్తిలో ఉన్న శ్లోకాన్ని అనుసరించి సృష్టికర్త నుదుటనుండి బ్రాహ్మణుడు, భుజ స్కంధములనుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదముల నుండి శూద్రులు ఉద్భవించినారు. ఈ పురుష సూక్తం ఋగ్వేదమందు లేదని తరువాత ఇది చేర్చబడినదని చరిత్రకారుల అభిప్రాయము. కేవలం శ్రమ విభజన మీద ఆధారపడి చేసిన విభాగాలు. ఇందులో పురోహితులు, విద్యావంతులు బ్రాహ్మణులు. యుద్ధము చేయువారు క్షత్రియులు. రైతు లేక వ్యాపారి వైశ్యులు. సేద్యపు బానిసలుగా శూద్రులను చూపించడం జరిగింది. తదుపరి యుగమున ఇది చతుర్వర్ణ వ్యవస్థగా రూపుదిద్దుకుంది. చివరి వర్గం శరీర శ్రమచేసే శ్రామికులతో కూడుకున్న వర్గం. ఐతే వీరు నిరాదరణకు గురికాలేదు. వర్ణాంతర వివాహములు, సహపంక్తి భోజనములు నిషేదింపబడలేదు.

**(C) ఆర్థిక వ్యవస్థ:-**

ఆర్యులది గ్రామీణ జీవితం. స్వయం సమృద్ధి ద్వారా వారియొక్క అవసరాలను తీర్చుకొనేవారు. నిత్య అవసరాలను తీర్చుకొనుటకు ఎవరిమీదా ఆధారపడేవారు కాదు.

**5.8.12 వ్యవసాయం:-**

ఆర్యులకు పూర్వమే నాగరికతలో పొలం దున్ని, విత్తనం వేసి, పంటకోసి, కడుపు నింపుకోవడం తెలుసు. యుద్ధాల ఫలితంగా పొలాలు, పంటలు, నగరాలు ధ్వంసమయ్యేవి. ఋగ్వేద సాహిత్యంలో కృషీవల (రైతు) శబ్దాన్ని బట్టి ఆర్యులు వ్యవసాయం చేసినట్లు స్పష్టమవుతుంది. వీరు మొదట పశుపాలకులు. తరువాత కాలంలో వ్యవసాయం వీరి ప్రధాన వృత్తి అయినది. నాగలితో భూమిని ఎద్దులు సహాయంతో దున్నెడివారు వ్యవసాయానికి నీటిపారుదల సౌకర్యాలుండేవని తెలుస్తుంది. యవలు, గోధుమలు, వీరి ముఖ్యమైన పంటలు. వరి గురించి మలివేదకాలమువరకు వారికి తెలియదు. వ్యవసాయభూమిని 'ఉరవర' లేదా 'క్షేత్ర' అని పిలిచెడివారు. సమాజంపై పెత్తనం చేసే యంత్రాంగం మారినప్పటికీ రైతాంగం శ్రమించి అదనపు సంపదను ఉత్పత్తి చేయడం ఆగలేదు.

**5.8.13 పశుపోషణ:-**

ఆర్యులు పశువులను ముఖ్యమైన ఆస్తిగా భావించెడివారు. ఒకవ్యక్తి వద్ద ఉన్న ఆవులు, ఎద్దుల సంఖ్యను బట్టి అతని ఆర్థిక స్థాయిని అంచనావేయడం జరిగేది. పశువులను అందరు గోమాతగా ధనముగా నెంచెడివారు. క్రతు దక్షిణ సాధారణంగా గోవు రూపములో ఉండేది. ఆవులు రోజుకు మూడు సార్లు పాలిచ్చేవి. యజ్ఞ యాగాలలో ఆవును బలి ఇచ్చెడి వారు. ఎద్దు, ఆవు, గుఱ్ఱము, గొర్రె, కుక్క, గాడిద, గేదె, మేక, మొ॥ జంతువులను మచ్చిక చేసేడి వారు.

**5.8.14 వర్తక, వ్యాపారములు:-**

వైదిక సాహిత్యం ఆర్యుల యొక్క వర్తక, వాణిజ్యం గురించి వివరించింది. ఆనాడు వర్తక, వ్యాపార కార్యక్రమములు ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతమునకు నిర్వహించుచుండెడివారు. వాణిజ్యం ఆనాడు 'ఫణి' అను అనార్య జాతులలో నుండెడిది. ఆర్యులకు బాబిలోన్, పశ్చిమాసియా దేశములతో వాణిజ్య సంబంధాలుండినట్లు తెలుస్తున్నది. ప్రధానంగా వస్తుమార్పిడి విధానము అమలులో ఉండేది. వస్తువు మూల్యాన్ని నిర్ణయించుటకు యూనిట్టు విలువగా సగటు ఆకృతులో ఉన్న గోవును ఉపయోగించేవారు. ఇంకా వెండి నాణెములు, నిష్కయను బంగారు నాణెములు మారక ద్రవ్యముగా నెంచెడివారు.

**5.8.15 ఇతర వృత్తులు:-**

వృత్తిపరమైన ప్రత్యేకీకరణ కనిపిస్తుంది. వడ్రంగులు, నేత పనివాండ్రు, అల్లిక పనివారు, కుమ్మరి వారు, బంగారు పనివారు, జాలరులు, తోళ్ళ పనివారు, కంసాలి, మొ॥ వృత్తుల పనివారున్నారు. కుటీర పరిశ్రమలు కూడా కలవు. నాట్యకారులు, క్షురక వృత్తులు కలవు. పురోహితులకు, సంఘములో గౌరవస్థానము కలదు.

ఆర్యులు యుద్ధప్రియులు. కాబట్టి వారికి అవసరమైన రథములు, విల్లంబులు, గొడ్డళ్ళు, ఈటెలు, కత్తులు, విషపూరిత బాణములు కూడా తయారు చేసెడివారు. రక్షణాయుధాలైన డాలు, కవచము, శిరస్త్రాణము వంటి రక్షణాయుదములను కూడా ధరించెడివారు.

**5.8.16 మతము:-**

ఋగ్వేదములో ఆర్యులు పితృస్వామికులు. కాబట్టి వీరి దేవతలంతా పురుషులే. అయితే ఋగ్వేదములో ఆర్యులు ప్రకృతి శక్తులకు దైవత్వము ఆపాదించి ఆరాధించిరి. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పృధ్వివాయువు, నదులు, పర్వతాలు ఇత్యాదిక ప్రకృతి శక్తుల్ని ఆర్యులు పూజించేవారు. అధితి, పృధ్వి అను స్త్రీ దేవతలు కూడా కలరు. జ్యుపిటర్‌కు సమానమైన 'ద్యూష్' అనే ఆకాశ దేవతను ఆర్యులు కొలిచారు. 'ఉష' దేవతను ఆరాధించారు. అందరిలో ఎక్కువ ప్రాధాన్యం కలవాడు ఇంద్రుడు. ఇతడు తన వజ్రాయుధంతో దాశ దస్యులను నిర్మూలించి ఆర్యులకు సిరిసంపదలు చేకూర్చిన యుద్ధాధినేతని వారి విశ్వాసము.

దేవతలుకూడా మానవులవలే ఆకలిదప్పులు, కామ క్రోధములు, ఆగ్రహ అనుగ్రహములు ఉండునని వారి నమ్మకం. దేవతలును సంతృప్తిపరచుటకు యజ్ఞములు, బలి సమర్పణ జరిగేది. యజ్ఞములో పాలు, ధాన్యాలు. నెయ్యి, లాంటివే కాకుండా మేక, గుఱ్ఱం, ఆవు, ఎద్దు, వంటి పెద్ద జంతువులను, ఇంకా మాంసం, సోమరసం లాంటివి దేవతలకు నైవేద్యముగా సమర్పించేవారు. నర బలులుకూడా ఆచారములో ఉండేవి. మరణించిన వారిని దహనము చేయడం, పూడ్చిపెట్టడం ఆ కాలమునందు ఆచారము.

గణంలోని జనం యొక్క ప్రార్థనల్ని పురోహితుడు దేవతలకు నివేదిస్తాడని, పురోహితుల నోటివెంట వెలువడే గణ విన్నపాలను దేవతలు ఆలకించి వాటిని తీరుస్తారని ఆర్యప్రజల విశ్వాసం. పురోహితుడు దేవతలకు, మనుషులకు మధ్య దేవుని ప్రతినిధిగా రూపొందాడు. అందుచేత సమాజంలో పురోహిత వర్గం సహజంగా శక్తి సంపన్నమైనది.

## 5.9 మలివేద కాలపు నాగరికత (క్రీ.పూ. 1000-600).

మలివేదయుగం చరిత్ర ప్రధానముగా ఋగ్వేదం. తరువాత సైంకలనము చేయబడిన వేద గ్రంధాలపై ఆధారపడి ఉంది. అవి యజర్, సామ, అధర్వణ వేదములు, ఉపనిషత్తులు, సూత్ర వాజ్ఞయములు. క్రీ.పూ. 1000-600 సం॥ల మధ్య మలివేద నాగరికత ఉన్నదని చరిత్రకారుల అభిప్రాయం. ఈ మలివేద యుగ గ్రంధాలన్నీ గంగా మైదానములో సంకలనం చేయబడ్డాయి. ఆర్యులు ఋగ్వేద అనంతర కాలమునాటికి సప్త సింధు ప్రాంతము నుండి ఉత్తరాపథమున తూర్పు, దక్షిణదిశలకు విస్తరించిరి. ఈ సందర్భములో మనదేశములో ఉన్న ఆర్యేతరులతో ఆర్యులు సంబంధం ఏర్పరచుకొని వారియొక్క సంస్కృతి ప్రభావానికి లోనైరి.

**5.9.1 రాజకీయ వ్యవస్థ:-**

ఋగ్వేదము కాలమునాటికి ఉన్న జాతులు, తెగల మధ్య నిరంతర యుద్దాల వలన కొన్ని నశించి మరి కొన్ని బలపడినాయి. ఋగ్వేద అనంతరం ప్రవేశించిన ఇనుము ఉపయోగం ఆధారంగా ఆర్థిక, భౌతికాభివృద్ధి జరిగింది. ఈ కారణంగా రాజకీయంగా అనేక మార్పులు జరిగినవి. ఈ క్రమములో రాజరిక వ్యవస్థ స్పష్టత సంతరించుకొన్నది. అనేక గణరాజ్యములు నశించి సువిశాల సామ్రాజ్యములు ఏర్పడెను. అవి కురు, పాంచాల కోసల విదేహ మొ॥. విశాలమైన రాజ్యాలు ఏర్పడడము చేత నాయకుడుకి లేదా రాజుకు అధికారాలు పెరిగాయి. రాజులు పట్టాభిషేక మహోత్సవాలు, దిగ్విజయ యాత్రలు సందర్భముగా యజ్ఞాలు, రాజసూయ, అశ్వమేధ, వాజపేయ మొ॥ యాగాలను బ్రాహ్మణుల సహాయంతో నిర్వహించెడివారు. ఇవన్నీ తమ అదికారాలను ధ్రువపరచుకోవడానికి చేసినవే. రాజు, మహారాజ, ఏకరాట్, సామ్రాట్, సార్వభౌమ, రాజాధిరాజ లాంటి బిరుదులను ధరించాడు. రాజ్యరక్షణ, ప్రజా రక్షణ, రాజు యొక్క ముఖ్యమైన భాధ్యతలు. ఐతే కొన్ని సందర్భాలలో రక్షణ బాధ్యత పేర ప్రజలను భక్షించిన విధానం కనిపిస్తూంది. ఋగ్వేద కాలమందు వలే మలివేద కాలమునందు రాజరికము వంశపారంపర్యం. కొన్ని గ్రంధాలులో రాజును ఎన్నుకొన్నట్లు సాక్ష్యాధారాలు కనిపిస్తాయి. శతపథ బ్రాహ్మణము, రాజు ధర్మపాలన చేయవలెనని చెప్పుచున్నది.

రాజు సర్వాధికారియైనను అతని అధికారముపై కొన్ని హద్దులు కలవు. ఋగ్వేద కాలమునుంచి కొనసాగుతూ వచ్చిన సభ, సమితి, మొదలగు పురాతన సంస్థలు వాటి అధికారాలు విస్మరింపబడి క్షీణింప దిశగా ప్రయాణించాయి. అయినప్పటికీ ఈ ప్రజాసంస్థలకు, రాజుకు ఏకాభిప్రాయం ఉండవలెనని ఆనాటి ప్రతీక. బ్రాహ్మణులు రాజుపై మిగుల అధికారము చెలాయించిరి. పట్టాభిషేక మహోత్సవము లందు బ్రాహ్మణులను గౌరవించి వారి యొక్క ఆశీర్వాదం తీసుకొని,సింహాసనం అధిష్టించెడివారు.

సామ్రాజ్యపరిధి పెరగడంతో పరిపాలన యంత్రంగాన్ని కూడా విస్తృత పరచటం తప్పనిసరి అయినది. ఋగ్వేదం కాలంనాటి సేనాని, పురోహిత, గ్రామణిలతో పాటు భాగధుఘ (పన్నుల వసూలు అధికారి), యువరాజ, పట్టమహిషి (QUEEN) , సంగ్రహిత (TREASURER) సంధి విగ్రహ (విదేశ వ్యవహారాలు), సూత, అక్షవాప (ఆటపాటలను పర్యవేక్షించువాడు). ఇంకా క్షత్రి, గోవికర్తన, వార్తావహ, స్తపతి వంటి ఉద్యోగుల పేర్లు నాటి వాఙ్మయములో పేర్కొనడం జరిగింది. రాజు తన చుట్టూ పాలనాయంత్రాంగం పేరుతో ఒక ప్రత్యేకమైన వర్గాన్ని మద్దతుదారులుగా ఏర్పరచుకున్నాడు, ఈ విధముగా తన గౌరవాన్ని, అధికారాన్ని విస్తృత పరచుకున్నాడు,

పరిపాలనా సౌలభ్యం కొరకు రాజ్యాన్ని అనేక భాగములుగా విభజించినట్లు తెలుస్తున్నది. స్తపతి లేక శతపతి లాంటి ఉద్యోగుల పేర్లద్వారా వీరు రాష్ట్రాధికారులై ఉండవచ్చని తెలుస్తున్నది. గ్రామాలలో గ్రామణి ముఖ్య అధికారి. అధికృత యను మరియొక ఉద్యోగి కూడా గ్రామపాలనలో ప్రముఖపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తున్నది. స్థానిక పరిపాలన గ్రామ సభలు నిర్వహించేవి. రాజే ఉన్నత న్యాయాధికారి. కొన్ని సందర్భాలలో ఈ కార్యక్రమాన్ని రాజన్యుడు అను ఉద్యోగి ద్వారా నిర్వహించేవారు. రాజద్రోహము, వ్యభిచారము, గర్భస్రావము, హత్య, దొంగతనం, పెద్ద నేరాలు. రాజద్రోహానికి శిక్ష మరణమే. గ్రామాలలో గ్రామణి అను ఉద్యోగి నేర విచారణ చేసి నిందితులను శిక్షించేవాడు. దివ్యపరీక్షల ద్వారా తీర్పులు చెప్పడం కూడా ఆ కాలంలో కలదు. మొత్తం మీద శిక్షలు కఠినం.

**5.9.2 సామాజిక వ్యవస్థ:-**

దేశంలో సామాజిక నిర్మాణము వర్ణ వ్యవస్థ రూపంలో జరిగింది. ఋగ్వేదం చివరి మండలమైన పురుషసూక్తం మొదటిసారిగా వర్ణవ్యవస్థను ప్రస్తావిస్తుంది. ఇది విరాట పురుషుని ముఖము నుంచి బ్రాహ్మణులు, భుజాలనుంచి క్షత్రియులు, తొడలనుంచి వైశ్యులు, పాదాలనుంచి శూద్రులు జన్మించారని తెలుపుచున్నది. ఐతే నాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను బట్టి వర్ణ విభజన జరిగినదని చాలామంది చరిత్రకారుల అభిప్రాయము. వీరిలో బ్రహ్మణ, క్షత్రియులు అగ్రవర్ణాలు వారు. బ్రాహ్మణుడు ఆశ్రమ ధర్మాలు అనగా బ్రహ్మచర్యము, గృహస్థ, వానప్రస్థ, సన్యాసం లాంటివి ఆచరించేవారు. దేవతారాధన, విద్యాబోధన, బ్రాహ్మణుల కర్తవ్యం. దేశరక్షణ, ప్రజాపాలన వంటి కార్యక్రమాలు క్షత్రియులు నిర్వహించిరి. వైశ్యులు సాధారణ ప్రజలు. వీరు వ్యవసాయం, పశు పోషణ లాంటి ఉత్పత్తి కార్యక్రమాలను నిర్వహించిరి. వీరిలో కొందరు చేతి వృత్తులు కూడా అనుసరించారు. వేద యుగ చివర దశలో వ్యాపారంలోకి ప్రవేశించారు.

ఈ మూడు వర్ణాలే గాక ఆర్యులకు లొంగిపోయిన ఆర్యేతరులు (దాసులు, ఇతర ఆటవికులు) శూద్ర వర్ణముగా మారారు. దాసుడు మొదట అనగా ఋగ్వేద కాలమునాడు ఆర్యేతరుడుగా గుర్తింపబడి మలివేదకాలములో శూద్రుడై పైనున్న వర్గాలవారికి సేవలందించే వాడుగా మార్చబడ్డాడు. ఈ వృత్తులే తదుపరి వంశపరాగతమైనవి. ఈ యుగాంతమునకు వర్ణములు బాగుగా బలపడి వర్ణాంతర వివాహం, సహపంక్తి భోజనము పూర్తిగా తగ్గి వర్ణ వైషమ్యములు చెలరేగుట ప్రారంభమయ్యెను.

సమాజంలో స్త్రీ స్థానం క్షీణించినది. ఋగ్వేదకాలంన స్త్రీలకు గల గౌరవ మర్యాదలు, స్వేచ్ఛాస్వాతంత్ర్యములు పూర్తిగా క్షీణించినవి. ఋగ్వేదకాలము నాటి పితృస్వామ్యక కుటుంబవ్యవస్థ కొనసాగి ఆడ సంతానం కంటే మగసంతానానికి సామాజిక స్థాయి, విలువ పెరిగింది. ఆడ శిశువు పుట్టుక దు:ఖ కారణముగా పరిగణించబడింది. సభ,సమితి యందు వారికి సభ్యత్వము లేదు. వివాహసంబందములు కఠిన తరము చేయబడినవి. క్షత్రియులలో తప్ప మిగిలిన వారిలో స్త్రీల వివాహములను తల్లిదండ్రులే నిర్ణయించిరి. సమాజములో వరకట్నములు, సతీసహగమనములు, బాల్య వివాహములు లాంటి సాంఘిక దురాచారములు ఆచారములోకి వచ్చెను. బహు భార్యాత్వము పెరిగింది స్త్రీలకు ఆస్తిలో హక్కులేదు. అయినప్పటికీ స్త్రీ విద్య కొంత వరకు కొనసాగించబడినది. ఆకాలంలో గార్గి, మైత్రే అను స్త్రీలు గొప్ప విద్యావేత్తలుగా పేరు గాంచిరి.

మలివేద కాలములో ఆహారము, దుస్తులు, వినోదములు లాంటి కార్యక్రమములలో కొన్ని మార్పులు చేర్పులు కనిపించును. సోమ, సురపానీయాలను సేవించుట, మాంసాన్ని భుజించుట. పాపకార్యములుగా నెంచబడెను. నటన, వాయిద్య సంగీతము వినోదములందు క్రొత్తగా చేర్చబడెను.

**5.9.3 ఆర్థిక పరిస్థితులు:-**

మలివేద కాలపు ప్రజలకు జీవనాధారం వ్యవసాయం. కొన్ని మలి వేదగ్రంధాలు ఆరు, ఎనిమిది, పన్నెండు, ఇరవై నాలుగు ఎద్దులను పూన్చిన నాగళ్ళను గూర్చి వర్ణించాయి. బహుశ ఇది అతిశయోక్తి గావచ్చు. కర్ర నాగలితో భూమిని దున్నేవారు. వ్యవసాయము విస్తృతముగా అమలులో ఉన్నా పాతపద్దతులలో మాత్రమే జరిగేది. వేదకాలపు ప్రజలు బార్లీ పండించటం కొనసాగించారు.

వరి, గోధుమ వారి ప్రధాన పంటలు. పంజాబ్, పశ్చిమ ఉత్తర ప్రదేశములలోని ప్రజలకు గోధుమ ప్రధాన ఆహారమైనది. మలివేదకాలపు ప్రజలు మొదటి సారిగా గంగా మైదానములోని వరి పంటను గురించి తెలుసుకున్నారు. మలివేద కాలమలో అనేక కళలు, చేతివృత్తులు అభివృద్ధి చెందాయి. బట్టలు నేయటం, స్త్రీలకు మాత్రమే పరిమితంగా ఉన్నా విస్తృత పరిధిలో జరిగేది. చర్మకార వృత్తి, కమ్మరి, వడ్రంగం, లాంటి వృత్తులు బాగా అభివృద్ధి చెందాయి.

వర్తక, వ్యాపారములందు గణనీయమైన అభివృద్ధి సాధించారు. 'పనిజులు' అను ప్రత్యేక తరగతి దేశీయ, విదేశీయ వ్యాపారములను నిర్వహించుచుండెను.వ్యాపారములలో వస్తుమార్పిడి విధానము తగ్గి కర్షాపణము, శతమాన్ననిష్కయను బంగారు నాణెములు వాడుకలోకి వచ్చెను. దేశం సిరిసంపదలతో తులతూగుచున్నదని తెలియడానికి ఈ బంగారు నాణెములు కారణంగా చెప్పవచ్చు. పరిశ్రమలకు, వాణిజ్యాలకు ఆనాడు కౌశాంబి, కాంపిల్య, తక్షశిల, హస్తినాపురం మొ॥ నగరములు ముఖ్యమైనవి.

**5.9.4 మతం:-**

ఋగ్వేద కాలములో వరుణుడికి వ్యతిరేకంగా ప్రాముఖ్యత పొందిన ఇంద్రుని ఆరాధన తగ్గినది. మలివేద కాలములో సృష్టి కర్తయయిన ప్రజాపతికి అత్యున్నత స్థానం ఇవ్వబడినది. విష్ణువు అతని ప్రతిరూపాలైన కృష్ణుడు, లాంటి దేవతల ఆరాధన జరిగింది. సృష్టి, స్థితి, లయములకు ముఖ్యకారకులయిన త్రిమూర్తుల (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను) ఆరాధింపసాగిరి. నాటి భిన్న సంస్కృతి, స్రవంతులకు నిలయమైన, బహుముఖ దృక్పధము గలిగిన హిందూమతమునకు లేక భారతీయ సంస్కృతికి పునాదులు వేయబడెను. సమాజములో యజ్ఞయాగాది క్రతువులు, కర్మకాండలు, విపరీతముగా పెరిగెను. సామాన్యప్రజలకు అధిక వ్యయప్రయాసలతో కూడిన ఈ క్రతువులు అందుబాటులో లేకుండెను. దీని ద్వారా సమాజములో బ్రాహ్మణుల ఆధిక్యత, సామాన్య ప్రజల ఆధ్యాత్మిక అశాంతికి దారితీసెను.

మలివేద కాలములో హింస ప్రధానముగా కొనసాగుతున్న వైదిక కర్మకాండ, పురోహిత బ్రాహ్మణ వర్గ ఆధిక్యత తారాస్థాయికి చేరుకున్నది. ఈ హింసాయుత కర్మకాండలపై, పత్యామ్నాయంగా జ్ఞాన మార్గలైన కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలు ఉపనిషత్తులలో కనిపిస్తాయి. వేదములో భాగములు ఉపనిషత్తులు. అందుచేత ఇందు చెప్పబడిన జ్ఞానమార్గము వేదాంతంగా ఖ్యాతిచెందెను. ఆత్మ, విశ్వాత్మలో లీనమగుటయే మోక్షము. ఈ జ్ఞాన మార్గములో జాతి, మత, వర్ణ బేధములు కృత్రిమములని, మానవులందరు సమానమని నూతన సాంఘిక వికాసము ప్రజ్వరిల్లెను.

పైథాగరస్, థీల్స్, లాంటి గ్రీకు తత్వవేత్తలందరూ విద్యాలయాలు, అకాడమీలు, పరిశోధనాలయాలు స్థాపించి సంవత్సరాల తరబడి బాహ్యప్రపంచంతో సంబంధం లేకుండా తదేక ధ్యానంతో తాత్విక పరిశోధన చేసి క్రొత్త సత్యాలను వెలువరించిరి. భారతీయ ఉపనిషత్ కార్యకర్తలు అడవులకు వెళ్ళి యజ్ఞ యాగాదుల కర్మకాండలను నిరసించినారేగాని రాజకీయ, సామాజిక సమస్యల జోలికి పోలేదు.

## 5.10 ఇతిహాసయుగం

భారత, రామాయణ కాలాల చరిత్రను కొందరు చరిత్రకారులు ఇతిహాసయుగముగా పేర్కొన్నారు. భారత, రామాయణములు ఎప్పుడు వ్రాయబడెనో చెప్పుట కష్టము. వీని మూలకథలు చాలా ప్రాచీనములైనప్పటికి గుప్తుల కాలమువరకు అనగా క్రీ.శ. 4 వ శతాబ్దమువరకు అనేక అంశములను చేర్చుకుంటూ ఇవి ఉద్గ్రంధములుగా రూపొందబడినవి.

ఉత్తరాపథములో స్థిరపడిన ఆర్యులు, దక్షిణాపథము మీదికి తన దృష్టిని సారించారు. మద్యదేశములో వింధ్యాద్రులు ఉన్నందువలన ఆర్య విస్తరణ దక్షిణాపథములో నిదానంగా సాగింది. ఋగ్వేదానికి చెందిన ఐతిరేయ బ్రాహ్మణం వింధ్యాద్రులకు దక్షిణమున ఏర్పడిన ఆర్య రాజ్యమైన విదర్భ ప్రసక్తి ఉంది. ఈ విదర్భ ఆర్య విస్తరణకు కేంద్రమైనదని చెప్పవచ్చు. అదే బ్రాహ్మణములో ఉన్నటువంటి శునశ్శేపుని కథ ద్వారా తండ్రి విశ్వామిత్రునిచే శపింపబడిన అతని 50 మంది కుమారులు ఆర్యావర్తము పొలిమేరల కవతల దాస దస్యులుతో కలిసిపోయినారని వారే ఆంధ్ర, శబర, మూతిబ, పులింద మొ॥ జాతులు అని ఈ కథనుబట్టి తెలుస్తుంది.

ఆర్యులు దక్షిణాపథముపై పొందిన ఇతోధిక పరిజ్ఞానం ఇతిహాసాలు, పురాణాలు ద్వారా తెలుస్తుంది. భారత, రామాయణములు ఇతిహాసములు. ఇవి చాలా ప్రాచీనమైనవి. ఇందలి పాత్రలు, అంశములు, సమాజముపై ఎక్కువ ప్రభావాన్ని కలిగి ఉన్నవి. మన దేశమున సారస్వత గ్రంధములకాధారము ఇతిహాసములే. "హోమర్ రచనలు గ్రీసుదేశమునకు ఎలాంటివో భారత, రామాయణములు భారతదేశమునకు అలాంటివి." అని స్మిత్ పండితుడు చెప్పెను. మహాభారతములోని శ్రీకృష్ణుడు, రామాయణమందలి శ్రీరాముడు, భారతప్రజలకు ఆరాధ్యదైవములు.

భారతమును వ్యాసమహర్షి, రామాయణమును వాల్మీకి రచించిరని ప్రతీతి. భారత గ్రంధమునందు 18 పర్వములు, లక్ష శ్లోకములు కలవు. రామాయణమునందు 24,000 శ్లోకములు కలవు. భారతము ద్వాపర యుగమునకు, రామాయణము త్రేతాయుగమునకు చెందినవని గ్రంధకర్తల అభిప్రాయము.

మహాభారతము, రామాయణాలలో మహాభారత సంఘటన ముందు జరిగింది. ఇది క్రీస్తు పూర్వము 900 సం॥లో జరిగి

ఉండవచ్చని 'రోమిల్లా థాపర్' అభిప్రాయము. మహాభారత యుద్ధము ఆర్యగణములైన పురు శాఖలైన కురు, పాండవులమధ్య ఉత్తరదేశ సార్వభౌమత్వంనకు జరిగిన యుద్ధం. రామాయణమునందలి రామ, రావణయుద్ధం ఆర్యులకు, ఆర్యేతురులకు జరిగెను. ఆర్యసంస్కృతి దక్షిణాపథమునకు ఎట్లు విస్తరించెనో తెలుపును.

ఆర్య మహర్షులు దక్షిణాపథానికి వచ్చి ఆశ్రమాలు నెలకొల్పి, ఆర్య భాషా సంస్కృతులను ప్రచారము చేసెను. ఐతే ఈ సందర్భములో వీరికి దక్షిణా పదములో అనార్య జాతుల నుంచి ఇబ్బందులు ఎదురైనవి. ఈ అనార్య జాతులనుంచి రక్షించడానికి కోసలాధీశుడైన శ్రీరాముడు దక్షిణదేశానికి వచ్చాడు. ఆర్య అధికార సంస్కృతికి, విస్తరణకు రాముడు తోడ్పడినందువలన రామున్ని అవతార పురుషుడుగా ఆరాధించారు.

## (క్రీ॥పూ॥ ఆరవ శతాబ్ద ప్రాముఖ్యం- జైన, బౌద్ధ మతాలు):-

క్రీ॥ పూ॥ ఆరో శతాబ్దం ప్రపంచ చరిత్రలో గొప్ప విశిష్టత కలిగివుంది. ఈ శతాబ్దిలో జనించిన నూతన ఆధ్యాత్మిక, సాంఘిక, రాజకీయ వాదులు నాటి ప్రపంచమునే పునాదులతో కదల్చివేసెను. మత విలువలపైన, ఆచార వ్యవహారములపైన, వ్యవస్థపైన, విశ్వాసాలపైన, తీవ్రమయిన అసంతృప్తి వ్యక్తమయింది. అలాంటిపరిస్థితులలో ఐహిక సుఖాలపై క్రొత్త ఆలోచనలు బయలుదేరి సమాజములో ఉన్న నాటి మూఢ విశ్వాసాలపై, ఆచార సాంప్రదాయాలపై తిరుగుబాటుచేసిరి. నూతన విలువలకోసం అన్వేషణ ప్రారంభమయ్యెను. సమాజంలో తలెత్తిన ఆధ్యాత్మిక అశాంతిని, అసంతృప్తిని రూపుమాపి నూతన తాత్విక విచారం కోసం ఎందరో మహనీయులు గణనీయమైన కృషి చేశారు.

ఈ శతాబ్దం నందే చైనాలో లావ్సే (LAO-TSE), కన్‌ఫ్యూషియన్(CONFUCIOUS) వేదాంత బోధనలు చేసి జీవితాశయమేమిటో ప్రజలకు తెలిపారు. గ్రీకు ద్వీపాలైన అమోనియాలో హెరాక్లిటస్ (Hearaclitus) నూతన సిద్ధాంతాలను ప్రబోధించెను. సాంఘిక, మత విషయాలలో చైతన్యం కలిగించడానికి పిరమైడ్స్ (Permaids), ఎంపెడోక్లిస్ (Empedocles) కృషి చేశారు. పాలస్తీనా యందలి యూదులు సైతం ఆధ్యాత్మిక ప్రభావమునకు గురియైరి. గ్రీస్‌లో సోక్రటీస్ విప్లవాత్మకమైన సంస్కరణలను ప్రభోదించాడు. పర్షియా (ఐరాన్) లో నాటి మతమూఢవిశ్వాసాలను జోరోస్టర్ ((Zoroaster)నిశితంగా విమర్శించాడు. అతని బోదనలే జోరోస్ట్రయన్ మతంగా ప్రచారము అయింది. భారతదేశంలో మహావీరుడు, బుద్ధుడు, జన్మించి తమ హేతావాద, సామాజిక దృక్పథములో చిరకాలముగా వచ్చు మూఢ విశ్వాసములను, ఆచార సాంప్రదాయములను దుయ్యబట్టి నూతన భావోద్యములను ప్రారంభించిరి. ఆధునిక యాగారంభమున ఐరోపా చరిత్రలో వచ్చిన ప్రొటస్టెంటు ఉద్యమము వలె, బౌద్ధ,జైన మతములు వైదిక మతమున జనించినవి.

**రాజకీయ పరిస్థితులు:-**

రాజకీయ అనైక్యత, ఆధ్యాత్మిక అశాంతి, సాంఘిక విభేదములు క్రీ॥ పూ॥ ఆరవ శతాబ్దం నాటి ముఖ్య లక్షణములు. భారతదేశంలో క్రీ॥పూ॥ ఆరో శతాబ్దం రాజకీయ అనైక్యతకు, షోడశ మహజన పదాలకు ప్రసిద్ధి వహించింది. ఉత్తర భారతదేశంలో **16** మహాజన పదాలు ఉన్నట్లు తెలుస్తుంది. అందులో **14** రాచరిక వ్యవస్థ ఉన్న జనపదాలు, రెండు (మల్లి, వత్స) గణతంత్ర వ్యవస్థ ఉన్న జనపదాలు.

**మహాజన పదాలు:**

**1.** అంగరాజ్యం:- నేటి బీహార్‌లోని భాగల్ పూర్, మాంఘీర జిల్లాలలో కూడుకున్నది అంగరాజ్యం. దీని రాజధానియైన చంపానగరం గంగా- చంపానదుల కూడలి యందు నర్మించబడినది. ఇది ఒక గొప్ప వ్యాపార కేంద్రము. సిరిసంపదలలో తులతూగుటలో నాటి ప్రధాన నగరములలో ఒకటిగా పేరుగాంచినది. అంగ, మగధ రాజ్యములమధ్య నిరంతరము యుద్ధము జరుగుచుండెడిది. మగధ రాజైన బింబిసారుడు క్రీ॥పూ॥ ఆరవ శతాబ్ధంలో అంగరాజ్యాన్ని జయించి, మగధ రాజ్యంలో విలీనం చేసెను.

**2. కాశీ:-**

కాశీ రాజ్యం వరుణ, అశి నదుల సంగమ స్థానమున నిర్మింపబడినది. అందుచేతనే కాశ నగరం వారణాసిగా పేరు పొందింది. ఇది చాలా ఐశ్వర్యవంతమైన ప్రఖ్యాతి వహించిన రాజ్యం. ప్రాచీన విద్యాకేంద్రంగా ప్రసిద్ధి చెందింది. కోసల, అంగ, మగధ రాజ్యములలో కాశీ రాజ్యమునకు విరోదము కలదు. బుద్ధుని కాలమునాటికి కోసలాధిపతి కాశీరాజ్యమును జయించి ఆక్రమించెను.

**3. కోసల:-**

ఇది ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య (oudh)ప్రాంతమునకు చెందినది. ఈ రాజ్యాన్ని సరయూనది రెండు భాగాలుగా విభజించింది. ఉత్తర కోసలకు శ్రావస్త, దక్షిణ కోసలకు కుశావతి రాజధానులు. కోసలరాజైన మహాకోసలుడు కాశీరాజ్యమును జయించెను. అతని కుమారుడైన ప్రసేనజిత్తు మగధ రాజైన అజాతశత్రవుతో పోరాటము సల్పెను.

**4.** మగధ:-

ఈనాటి బీహారులోని పాట్నా, గయ జిల్లాల ప్రాంతం. ఇది నాటి మహాజనపదములలో బలీయమైన రాజ్యం. గిరివ్రజపురం దీని రాజధాని. తరువాత రాజగ్రహం, తదనంతరం పాటలీపుత్రం రాజధానులుగా ఉన్నాయి. దీనికి రాజు హర్యంక వంశస్థుడైన బింబిసారుడు, గంగా-శోణే నదులు కూడలి యందే పాటలీ పుత్రం నిర్మించబడింది.

**5.** చేది:-

D.R. భండార్కర్ అభిప్రాయం ప్రకారం నేటి బుందేవ్‌ఖండ్ ప్రాంతమే చేది రాజ్యము. దీని రాజధాని శుక్తిమతి. చేది వంశంలోని ఒక శాఖ కళింగ రాజ్యంలో రాజవంశాన్ని స్థాపించింది.

**6.** వత్స:-

ఇది యమునా నదీ తీరాన ఉన్న రాజ్యం. మహాజన పదములలో ప్రసిద్ధమైనది, ఐశ్వర్యవంతమైనది. అలహాబాదుకు 38మైళ్ళ దూరముగల కేశంబి దీని రాజధాని. దీనికి ఉదయనుడు రాజు. ఇతడు బౌధమతాన్ని స్వీకరించాడు. అవంతి రాజైన ప్రద్యోతనునకు, ఉదయనకు బద్ధ వైరము కలదు. ప్రద్యోతనుని కుమార్తెయైన వాసవదత్తును ఉదయనుడు వివాహము ఆడడం ద్వారా వారి వైరము మైత్రిగా మారెను. ఈ కథనే బాస మహకవి " స్వప్న వాసవ దత్త'' నాటకముగా రచించెను.

**7.** కురు:-

ఇది నాటి ఢిల్లీ, మీరట్ జిల్లాల ప్రాంతము. దీని రాజధాని ఇంద్రప్రస్థము. ఇది మహాభారత యుద్ధ రంగ స్థలము.

**8.** పాంచాల:- ఇది నేటి ఉత్తరప్రదేశ్‌లోని బడాయున్, ఫరూకాబాద్ జిల్లాలతో కూడిన ప్రాంతము. గంగానది ఈ రాజ్యమును, ఉత్తర దక్షిణ భాగములుగా విభజించెను. ఉత్తర పాంచాలకి రాజధాని అహిచ్ఛత్రం, దక్షిణ పాంచాలకి కౌండిల్య రాజధాని. మొదట రాజరిక వ్యవస్థయున్ననూ క్రీ॥ పూ॥ ఆరవ శతాబ్దికి గణరాజ్యమయ్యెను.

**9.** మత్స్య:-

ఇది నేటి రాజస్థాన్‌లోని జయపూర్ ప్రాంతమే. దీనికి రాజధాని విరాటనగరము. మత్స్య రాజులలో ఒక శాఖవారు విశాఖపట్నం ప్రాంతంలో రాజ్యం చేశారు.

**10.** శూరసేన:-

ఇది ఢిల్లీ, ఆగ్రాల మధ్య యమునా నదిపైనున్న రాజ్యము. దీని రాజధాని మధుర. దీనికి రాజు అవంతీ పుత్రుడు. యదు నాయకుడైన వాసుదేవకృష్ణుని ప్రియతమ నగరము ఈ మధురా నగరము. ఇతడు బుద్ధుని ప్రధమ శిష్య గణంలోని వాడు. వృషులు, అంధకులూ తదితరులు ఒక సంఘంగా రూపొందారు.

**11.** అశ్మిక:-

ఇది దక్షిణా పదంలో ఉన్న రాజ్యం. అశ్మిక రాజ్యానికి, మూలక రాజ్యానికి మధ్య గోదావరి నది ప్రవహిస్తున్నది. దీని రాజధాని బోధన. నేటి నిజామబాద్‌లోని బోధన పట్టణమే నాటి పూతన. బుద్ధుని కాలములో దీనిని సుజాతకుడను రాజు పాలించుచుండెను. "సత్తని పాత వ్యాఖ్యానం'' ననుసరించి ఈ రెండు ప్రాంతాలు అంధకుల లేదా ఆంధ్రుల భూభాగాలుగా పేర్కొనడం జరిగింది.

**12.** అవంతి:-

నేటి మధ్యప్రదేశ్‌లోని మాళ్వాప్రాంతం. వేత్రవతి నది ఈ రాజ్యాన్ని ఉత్తర, దక్షిణాలుగా విభజించింది. దీనికి మొదట మహ్మతి, తదుపరి ఉజ్జయినీ రాజధానులు. అవంతి రాజ్యము కొరకు మగధ, కోసలాధీశుల రాజ్యములకు మధ్య దీర్ఘ పోరాటము జరిగెను. బుద్ధుని కాలంలో ఉజ్జయిని రాజధాని రాజు చండప్రద్యోతనుడు. అవంతి ఒక ముఖ్యమైన బౌద్ధ కేంద్రం.

**13.** గాంధార:-

ఈనాటి పాకిస్థాన్‌లోని రావుల్ పింది, పెషావర్ జిల్లాలలో కూడిన ప్రాంతం. దీని రాజధాని తక్షశిల. ఇది ప్రాచీన వర్తక,విద్యా కేంద్రంగా ప్రసిద్ది పొందింది. గాంధార రాజైన పుష్కరశరిన మగధ రాజైన బింబిసారుడు సమకాలకుడు.

**14.** కాంభోజ:-

భారత దేశంలో మధ్య సరిహద్దు రాష్ట్రంలోని హజరా జిల్లా ప్రాంతము. దీనికి రాజధాని రాజపురము.

# గణతంత్ర రాజ్యములు

**15.** వజ్జీ గణ రాజ్య సమాఖ్య:-

వజ్జీ ఎనిమిది తెగలున్న గణ రాజ్యముల సమాఖ్య. వీటిలో విదేహ, లిచ్ఛని, జ్ఞాత్రిక, వజ్జీ తెగలు ముఖ్యమైనవి. దీనిలో ప్రతి తెగకు ప్రత్యేకమగ ఒక ప్రభుత్వము, ఒక రాజధాని కలదు. వీరందరిలోను లిచ్ఛవులు బల సంపన్నులు. రాజధాని వైశాలి, విదేహలకు రాజధాని మిధిలా నగరము. విదేహ రాజైన జనకుడు గొప్ప వేదాంతి. జ్ఞాత్రికుల రాజధాని కుండ్ర గ్రామము. కోసల,

మల్ల రాజ్యాలతో స్నేహపూర్వకంగా వున్నారు. బద్ధ శత్రువు మగధ రాజ్యము. వర్ధమాన మహావీరుని తల్లి లిచ్ఛలీ రాకుమార్తె. వైశాలి ప్రభువైన చేతకరాజు తన కుమార్తెయైన చల్లనను బింబిసారునికిచ్చి వివాహవము జరిపించెను.

**16. మల్ల గణ రాజ్య సమాఖ్య:-**

తూర్పు దేశములోని ఒక బలమైన జాతి. ఇది కూడా ఎనిమిది లేక తొమ్మిది తెగలున్న గణతంత్ర సమాఖ్య. ఇది వైశాలకి ఉత్తరమున ఉన్నది. ఈ తెగలలో కుశి నగరము, పావా రాజధానులుగా ఉన్నవి. బలవంతమైనవి. బుద్ధుని నిర్యాణాంతరం మల్ల సమాఖ్య మగధలో కలిసిపోయెను.

ఈ షోడశ మహజన పదాలు క్రీ॥ పూ॥ 550 నాటికి ఉన్నట్లు తెలుస్తుంది. ఈ రాజ్యాలు సార్వభౌమ్యాధి పత్యము కోసం నిరంతరం కలహయించు కుండా వుండేవి. ఇందులో మగద సామ్రాజ్యం విజృంభించి జనపదాలుపై ఆదిపత్యము సాధించి సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించింది.

**పరాపాలనా విధానము:-** నాటి షోడశ మహాజనపదాలులో రాజరిక ప్రభుత్వం, గణ తంత్ర ప్రభుత్వాలు నెలకొని ఉన్నాయి. రాజరిక వ్యవస్థలో రాజరికం, సాధారణంగా వంశపారంపర్యం ఉండేది. రాజు సర్వోన్నతాధికారి. ఉన్నతమైన జీవితం అనుభవిస్తున్నప్పటికి ప్రజల క్షేమాన్ని కాంక్షించి పరిపాలన చేసేవాడు. పరపాలన వ్యవస్థలో సహాయపడుటకు ఒక మంత్రి వర్గం ఉండేది. పురోహిత్, సేనాధిపతి ముఖ్యులు. ఇంకనూ సర్వాధికులు, వ్యవహారికులు, సేనాధికారులు లాంటి ప్రభుత్వ ఉద్యోగులు వివిధ శాఖలను నిర్వహించెడివారు.

పరిపాలనా సౌలభ్యం కొరకు రాజ్యాన్ని రాష్ట్రములుగాను, ఆహారములుగను (ప్రాదేశములుగను), గ్రామములుగాను విభజింపబడెను. గ్రామపాలన గ్రామభోజకులచే నిర్వహించబడేది. గ్రామంలో శాంతి భద్రతలను కాపాడటం, సంక్షేమ కార్యక్రమములు నిర్వహించుట, భూమిశిస్తు వసూలు చేయుట గ్రమ భోజకుని విధి.

గణతంత్ర వ్యవస్థలో రాజును గణ సభ ఎన్నుకొనేది. ఇందులో కుటుంబ పెద్దలు సభ్యులు. గణ సభ గణరాజ్యాధి నేతను ఎన్నుకొనుట, తరచుగా సమావేశమై రాజ్యసమస్యలను గురించి చర్చించి తగిన నిర్ణయాలను చేస్తూ ఉండేది. రాజే ప్రధాన న్యాయమూర్తి.

రాజు ఆస్థానమే మహోన్నత న్యాయస్థానం. వివిధ స్థాయిలందు న్యాయస్థానములు కలవు. నాటి ఆచార సాంప్రదాయములే న్యాయ శాసనములు. ఈ జనపదాల మధ్య ఆధిపత్యం కోసం నిరంతరం సంఘర్షణలు జరుగుతూ ఉండేవి. అందువలన ప్రతి జనపదము చతురంగ బలములను పోషించెను.

**సాంఘిక పరిస్థితులు:-** మలి వేద కాలం నాటి కుటుంబ జీవనం దాదాపుగా ఈ కాలంలో కొనసాగింది. సమిష్టి కుటుంబం నాటి ఆచారం. కుటుంబంలోని పెద్దవాడే గృహయజమాని. కుటుంబం బాధ్యత అంతా అతనిపై ఆధరపడి వుండేది. సామాన్య ప్రజల జీవన విధానము మామూలుగా ఉండేది. పట్టణాలు, నగరాలు తక్కువ. అంతఃపుర జీవితము చాలా బాగుండేది. రాజ భవనాలు విశాలంగాను అందంగాను ఉండేవి. బౌద్ధ గ్రంధాలు ఏడంతస్తుల భవనాలు ఉన్నట్లు తెలుపుతున్నాయి.

సంఘమున స్త్రీకి గౌరవము లేదు. సతీసహగమనము, బహు భార్య తత్వము, బాల్య వివాహాలు కలవు. పరదా విధనము అమలులో లేదు. స్త్రీకి ఆస్తి హక్కు లేదు. స్త్రీ అబలగా యెంచబడెను. బుద్ధుడే స్వయముగా స్త్రీలను బౌద్ధ సంఘాలలో చేర్చుకొనడానికి తొలుత నిరాకరించాడు. ఉన్నత వర్గాలకు చెందిన కొందరు స్త్రీలు మాత్రము విద్యాధికారులు. సుప్రసిద్ధమైన నాటి మహిళలో జయింతి, ఈమే మహావీరుని వోడించింది. ఖేమ (Khemn) ప్రసిద్ధుడైన ప్రసేనజిత్ రాజును తన పాండిత్యంతో ఓడించింది.

సంఘమున వర్ణ వ్యవస్థ క్లిష్టతరమైనది. సహపంక్తి భోజనాలు అమలులో ఉండేవి. కులానికి సంఘంలో ప్రాధాన్యం హెచ్చింది. వర్ణాంతర వివాహములు రాచరిక, ఉన్నత వర్గాలలో కొంతవరకు ఉండేవి. క్షత్రియులు, బ్రాహ్మణుల ఆధిక్యం తగ్గి వైశ్యుల పరిస్థితి మెరుగు పడింది. దీనికి కారణం వారి ఐశ్వర్యమే. సూద్రుల పరిస్థితి చాలా దిగజారీ పోయింది. వీరు పంచములుగా గ్రామముల వెలుపల నివసించెడి వారు. వీరి ముఖ్యవృత్తి వేట, చేపలు పట్టటము. వీరు చాలా హీనమైన జీవితము గడుపుతూ ఉండేవారు. నాటి ప్రజలు జీవహింసను పాపముగా పరిగణించి, గోవును పవిత్రముగా చూచెడి వారు.

ప్రజల జీవన విధానము సాధారణముగా ఉండేది. ప్రజలు. కాటన్, సిల్క్, ఉన్ని వస్త్రాలను ధరించేవారు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో, పండుగ సందర్భాలలో మత్తు పదార్థాలను సేవించేవారు. స్త్రీ, పురుష లిరువురు ఆభరణాలు ధరించేవారు. నృత్యం, గానం, కళామందిరాలు, ప్రజా వినోదాలు, రథం, గుఱ్ఱపు పందేలు ఉండేవి. వారణాసి, తక్షశిల, ఉన్నత విద్యాకేంద్రాలు, కళలు, శాస్త్రాలు, వ్యాకరణం తదితర విద్యలను విద్యార్థులు అభ్యసించేడి వారు.

**ఆర్థిక పరిస్థితులు:-** అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు గ్రామాలలో వ్యవసాయం, పశుపోషణ చేసేవారు. గ్రామం స్వయంపోషకమై విరాజిల్లినది. నాటి ముఖ్యమైన పంటలు వరి, బార్లీ, చెరకు, మొ॥ నవి. ఉత్పత్తిని బట్టి పంటలు 1/6 వంతు నుండి 1/12 వరకు పన్నుగా ప్రభుత్వమునకు చెల్లించెడివారు. ప్రతి గ్రామములో పశువుల మేతకై కొన్ని బీడు భూములను గ్రామభోజకుడు నిర్ణయించేవాడు.

గ్రామికులు శ్రమించి జలాశయాలను, నీటిపారుదల కాల్వలను, రోడ్లను, కంచెలను నిర్మించుకునే వారు. ఇలాంటి కార్యక్రమాలలో స్త్రీలు కూడా పాల్గొనేవారు. గ్రామాలలో ప్రజల జీవితం నిరాడంబరంగా ఉండేది.

ఈ కాలంలో అనేక పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. వడ్రంగి, కమ్మర, కుమ్మరి తదితర వృత్తులవారు శ్రేణులుగా ఏర్పడి ఆర్థిక అభివృద్ధికి దోహదపడేవారు. ఇట్టి శ్రేణులు 18 ఉన్నట్లు బౌద్ధ జాతక కథలవల్ల తెలుస్తుంది. శ్రేణికి అధిపతి శ్రేష్ఠ. దేశీయ, విదేశీయ వాణిజ్యములు విరివిగా సాగెను. అనేక పట్టణములు వాణిజ్య కేంద్రములుగా వెలిసినవి. రాజగృహ, నలంద, కౌశింబి, శ్రావస్తి, మధుర, బెనారస్, తక్షశిల, పాటలీపుతుము మున్నగు నగరములు నాటి ముఖ్య వాణిజ్య కేంద్రములు, ముఖ్యమైన వాణిజ్య, పారిశ్రామిక కేంద్రాలను కలుపుతూ మార్గలు వేశారు. విదేశ వ్యాపారానికి పశ్చిమ తీరాన బరుకచ్చము, సోపార, తూర్పుతీరమున దంతపురి (కళింగ) నాటి పెద్ద రేవు పట్టణములు. సిలోన్, బర్మా, మలియా, జావా, సుమత్రా, అరేబియా తదితర దేశాలలో వాణిజ్య సంబందం ఉండేది. పట్టుబట్టలు, వెండి, బంగారం అభరణాలు. సుగంధ ద్రవ్యాలు, మందులు మొదలైన వాటితో విదేశీయ వ్యాపారము జరిగింది. వాణిజ్యమున వస్తు మార్పిడి విధాన మంతరించి 'కార్షాపణ' అను బంగారు నాణెము వాడుకలోనికి వచ్చింది భాగస్వామ్య వ్యాపార విధానము, వడ్డీ వ్యాపారము వాడుకలో నున్నవి.

**మతపరిస్థితులు:-**

వైదిక మతమందలి లోపము వలన భారతీయ ఆధ్యాత్మిక రంగంలో తీవ్రమైన అశాంతి, సంచలనం కలిగింది. ఈ కాలంలో వర్గ వైషమ్యాలు ప్రజలలో బాగా చోటు చేసుకున్నాయి. ఇలాంటి సమయంలో కొన్ని నూతన మతములు బయలుదేరినవి. జైన, బౌద్ధమతములు తూర్పు ఇండియాలోనూ, దక్షిణా పథమునందు బాగుగా వ్యాపించినవి. శైవ, వైష్ణవ మతములు మధ్య, ఉత్తర ఇండియాలందు బహుళ ప్రచారములో నున్నవి. బ్రాహ్మణ, క్షత్రియల మధ్య ఆధిపత్యం కోసం చిరకాలంగా పోరాటం కొనసాగుతుంది. రాజ్యాధిపత్యంలో సహా, ఆధ్యాత్మిక రంగంలో కూడా బ్రాహ్మణుల ఆధిక్యత కోసం కృషి జరిగింది. అగ్రవర్ణాల అధికారాన్ని వైశ్య, శూద్ర వర్ణాలు తీవ్రంగా నిరసించాయి. ఇలాంటి సమయంలో జైన, బౌద్ధ మతాలు స్థాపన జరిగింది.

వైదిక మతంలో ఉన్న బ్రాహ్మణులు కర్మకాండలలో, ఆచారాలలో ప్రజలను ఇబ్బంది పెట్టినారు. సామాన్య మానవులకు ఇవి అందుబాటులో లేవు. ఎందువలనంటే యజ్ఞయాగాదులు చేయటం అధిక ధన ప్రయాసతో కూడుకొన్నవని ఇలాంటి కర్మకాండలమీద, యజ్ఞయాగాదుల మీద, అవి నిర్వహించే బ్రహ్మణుల ఆదిపత్యంపైన ఒక ఉద్యమం లేచింది. ఈ ఉద్యమము కుల వ్యత్యాసాలను నిరసించింది. విగ్రహ ఆరాధన ప్రచారములోనికి వచ్చెను. ఉపనిషత్తులు కూడా యజ్ఞయాగాదులను నిరసించాయి. ప్రజలకు నూతన చైతన్యాన్ని ప్రసాదించి సులభమైన మార్గాలద్వారా ప్రజలలో తాత్విక చింతన కలిగించి దీనికి అనేకమంది తాత్వికులు ఆధ్యాత్మిక రంగంలో ప్రవేశించారు. వీరిలో క్షత్రియులైన మహవీరుడు, గౌతమ బుద్ధుడు ముఖ్యులు.

**జైన, బౌద్ధమతాలు ఆవిర్భవించుటకు కారణములు:-**

క్రీ॥పూ॥ ఆరవ శతాబ్దంలో ప్రపంచ చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం అయినది. ప్రపంచమున మహాప్రవక్తలుద్భవించి, సమాజములో తరతరాలుగా వచ్చుచున్న ఆచార సాంప్రదాయములపై, విశ్వాసములపై, పాత విలువలపై ధ్వజమెత్తి నూతన భావములకు, నూతన సిద్ధాంతములను సృష్టించి తీవ్రమైన ఆధ్యాత్మిక, సాంఘిక సంచలనము గావించిరి.

**ఆధ్యాత్మిక అశాంతికి గల కారణములు:**

**1) కర్మ కాండలు:** భారతదేశంలో నాటికి వైదిక మతంలో సహచర్యం, పవిత్రత తీసుకవచ్చారు. యజ్ఞముల పేరుతో నిర్వహించు జంతు బలులు, ఆడంబరాలు, ఆచారాలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేవు. ఫలితంగా వైదిక కర్మకాండలను సమూలంగా నిరసించి, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చారు.

**మంత్రాలపై విశ్వాసము:-**

వేద మంత్రస్థానములో వచ్చిన ఇతర మంత్రాలు పఠించటం వలన రాజ్యము అభివృద్ధి చెందుతుందని, రోగాలు తొలగి పోతాయని, శత్రు వినాశనము జరుగుతుందని, పంటలు బాగా పండుతాయని ప్రజలలో ప్రగాఢ విశ్వాసము. ఇవి సామాన్య ప్రజలకు అందుబాటులో లేవు. ఇవి వారి శక్తికి మించినవి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు తమకు సులభముగా అర్ధమయ్యే నైతిక విలువలకై వేచియుండిరి.

**బలులు:-**

బలి విధానాన్ని ఆర్యసమాజములో బ్రాహ్మణ పూజారులు అతిగా అమలు జరిపేవారు. ఇది ప్రజలకు భరించరాని ఖర్చుగాను అర్థరహితమైన ఈ కర్మకాండలకు ప్రజలు ఖర్చుపెట్టే స్థితిలో లేరు. ప్రజలు జంతుబలిని, నరబలిని ఇచ్చే ఆచారాలను ఏవగించుకున్నారు. అశ్వమేధము, తదితర యజ్ఞయాగాదుల వలన రాజ్య ధనాగారము ఖాళీ అయ్యేది. బ్రాహణులకు గృహాలలో జరిగే కార్యక్రమాలకు, కర్మకాండలకు,ఉత్సవాలకు విశేషమైన ధనం ఇవ్వడం జరిగేది. ప్రజలు వీరిని వీరియొక్క కర్మకాండలను నిరసించారు. బలులను అన్ని వర్గాలవారు, ఆక్షేపించారు. ఉపనిషత్తులు కూడా వీరిని నిరసించాయి.

**ఆద్యాత్మిక రంగంలో అయోమయ పరిస్థితి:-**

ఈ కాలంలో వచ్చిన తత్వవేత్తలు అనేక వేదాంత సిద్ధాంతాలను. రహస్యాలను, పూజా విధానాలను ప్రజలకు ప్రభోదించారు. అయితే వీరి మధ్య వచ్చిన సిద్ధాంత విభేదాలు, అనేక తాత్విక వాదనలు, వాదోపవాదలతో ఆధ్యాత్మిక రంగంలో అయోమయ పరిస్థితి ఏర్పడింది. ఆధ్యాత్మిక రంగంలో వ్యక్తి, ఆత్మ, ప్రపంచం, మానసిక స్వాతంత్ర్యం భగవంతుని ఔన్నిత్యం, ఆధిక్యతను గురించి అనేక సిద్దాంతాలు బయలుదేరినాయి. కొంతమంది మహర్షులు భోగ భోగ్యాలను త్యజించి, తాత్విక చింతన చేసారు.

**కర్మ, జ్ఞాన, తపస్సు మార్గాలు:-**

ప్రజలలో నిరాస, నిస్పృహ బయలుదేరింది. జనన, మరణాల నుండి ఆత్మను ఎలా రక్షించుకోవాలో జీవిత సమస్యల నుండి ఎలా బయటపడాలో వారికి తెలియలేదు. జన్మరాహిత్యం పొంది, ఆత్మ బంధ విముక్తి వారి యొక్క ముఖ్య ఉద్దేశ్యం. దీనికి బ్రహ్మణ పూజారి వర్గము కొన్ని మార్గాలను సూచించింది. అనేకమైన ఉత్సవాలు, సంస్కారాల వలన మోక్షము లభిస్తుందని పేర్కొన్నారు. జన్మరాహిత్యమే మోక్షము. దీనిని కర్మ మార్గమని చెప్పారు. కాని కర్మమార్గాలు మాత్రమే సాధన కాదని తపస్సు ద్వారా తన గురించి తాను తెలుసుకోవాలని కొన్ని సిద్దాంతాలు బయలుదేరినవి. దీని ద్వారా సామాన్య ప్రజలకు కర్మ, తపస్సు మార్గాలపై విశ్వాసము పెరిగింది. అయితే విధ్యాధికులు మాత్రము మోక్షం జ్ఞాన మార్గము ద్వారానే పొందవచ్చని విశ్వసించారు.

**కులవ్యవస్థ:-**

కుల వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. నిర్దిష్టమైన కులవ్యవస్ద ఏర్పడటం వలన ఒక కులం నుండి వేరొక కులంకు మారటం అసాధ్యముగా ఉండేది. క్రింది తరగతులైన సూద్రులు అనేక కష్టనష్టాలకు గురైనారు. వారు తమ జీవన విధానములలో మార్పు తెచ్చే మతం కోసం ఎదురు చూడసాగారు.

**బ్రాహ్మణుల ఆధిక్యం:-**

వైదిక మతం బ్రాహ్మణులకు సంఘములో మహోన్నతమైన స్థానమును, కొన్ని ప్రత్యేక హక్కులను కల్పించినది. కర్మకాండలను జరిపే అధికారము బ్రాహ్మణుల గుత్తాది పత్యమైనది. మానవుడు పుట్టినప్పటి నుండి మరణించే వరకు జరిగే కార్యక్రమాలపై బ్రాహ్మణ ఆధిపత్యం కొనసాగింది.

పరిపాలనాకు సంబందించిన విషయాలలో కూడ బ్రాహ్మణులు భాగస్వాములైనారు. క్షత్రియ యువరాజులకు రాజ గురువులుగా ఉంటూ అవకాశం దొరికినపుడు అధికారాన్ని సంపాదించి సమాజంలోని మిగతా వర్గాలవారి కంటె అధికులమని భావించారు. పైన ఉదహరించిన కారణాల వలన ప్రజలకు ఏర్పడిన నిరాశ, నిష్పృహలు రూపుమాపి సులభమైన మార్గాల ద్వారా దు:ఖమయ జీవితాన్ని విడనాడి సత్యాన్వేషనకై ముందుకు నడవడమే ఆనాటి ప్రజలు కోరిక. బాధలనుండి జీవితాన్ని విముక్తిచేసి మోక్షాన్ని పొందాలని ప్రజలు ఆదుర్దాగా ఉన్నారు. క్రొత్త ఆలోచనలు అవభిప్రాయాలు తాత్విక చింతనలలో అనేకమైన మత సంబంధమైన తెగలు, సంస్థలు రూపొందాయి. వాటిలో జైన, బౌద్ధ మతాలు మాత్రమే నిలచిపోయాయి.

## క్రొత్త మతాల ఆవిర్భావం:-

మారుతున్న సామాజిక, ఆర్థిక, జీవనంలో నగరాల పెరుగుదల, వృత్తి పనివారి విస్తరణ, వ్యపార వాణిజ్యాల త్వరిత వికాసము లాంటి మార్పులు, పరిణామాలు వేరొక రంగంలోని మార్పులతో సన్నిహితంగా పెనవేసుకున్నాయి. అదే మత తాత్వికరంగం. పాతుకుపోయిన మూఢాచారాలకు, సాంప్రదాయవాదానికి పట్టణాలలో తలెత్తిన వర్గాల అకాంక్షలకు మధ్య పుట్టిన వైరుధ్యం; మత తాత్విక రంగాలలో పరిణామ క్రమాన్ని త్వరితం చేసింది. రాబోయే శతాబ్దాలు కూడా అధిగమించ లేనంతటి మహోత్తర భావ వికాసం క్రీ॥పూ॥ ఆరవ శతాబ్దంలో ప్రారంభమైనది.

అజీవకులు, చార్వకులు లాంటి అనేక నాస్తిక వాదులు బయలుదేరారు. ఇందులో చార్వకులు పూర్తిగా భౌతిక వాదులు, వీరి యొక్క సిద్ధాంతము మనిషి మట్టి నుండి జన్మించి అందులోనే కలిసి పోతాడు. అర్దం పర్దంలేని కర్మకాండమంతా వీరు వ్యతిరేకించారు. తమ బ్రతుకు తెరువు కోసం పురోహితులు ఈ కర్మకాండనుపయోగిస్తున్నారని, వీరు ప్రచారము చేసారు. అయితే అజీవకుల, చార్వకుల వారి యొక్క సిద్ధంతాలు కాలగమనములో నిలవలేకపోయాయి. ఇలాంటి పరిస్థితులలో జైన, బౌద్ధమతాలు ప్రజలు యొక్క ఆదరణపొందాయి

**జైన మతము:-**

జైన మతము, వైదిక మతమంతటి ప్రాచీన మైనదని జైనుల విశ్వాసము. జైన మతస్థాపన ఎపుడు జరిగిందో సరాగ్గా మనకు తెలియదు. జైన మత స్థాపకుడైన వృషబుడు, అరిష్టనేమి తీర్థంకరుల ప్రస్తావన ఋగ్వేద మంత్రాలలో కనిపిస్తుంది ఇతిహాస, విష్ణు, భాగవతము పురాణాలలో నారాయణుని యొక్క అవతారముగా వృషభుడని పేర్కొన్నారు. వీటి ద్వారా జైన మతం చాలా

ప్రాచీన కాలమునుండి ఉన్నదని తెలుస్తుంది. జైన మత గురువులను తీర్థంకరులు అందరున తీర్థంకరులనగా జీవన ప్రవంతి దాటుటకు వారధిని నిర్మించువారని, లేక మార్గమును చూపేవారని అర్థము. జైన మతములో 24 మంది తీర్థంకరులు ఉన్నారని, వారందరు క్షత్రియులని జైన అనుసృతి వలన తెలుస్తున్నది. వీరిలో ఇరవై రెండు మంది పౌరాణిక పురుషులు, ఇరవైమూడువ తీర్థంకురుడైన పార్శ్వనాథుడు, ఇరవై నాల్గవ తీర్థంకురుడైన మహావీరుడు చారిత్రక పురుషులు. వీరిలో పార్శ్వనాథుడు చారిత్రకంగా జైన మత స్థాపకుడు.

**పార్శ్వనాథుడు:-**

పార్శ్వనాథుడు క్రీ॥ పూ॥ 8 వ శతాబ్దికి చెందినవాడు. ఇతడు కాశీరాజైన అశ్వసేనునకు, రాణి వామలకు జన్మించెను. ఇతడు 30 సంవత్సరముల వయసు వరకు గృహస్థాశ్రమం గడిపి తరువాత సన్యసించాడు. ఐహిక సుఖములను త్యజించి 84 దినములు కఠోర తపస్సుచేసి జ్ఞానాన్ని సంపాదించెను. ఇతడు వంద సంత్సరాలు జీవించి జైన మతాన్ని ఒక చక్కని సంస్థగా రూపొందించి చివరకు బెంగాలులో నిర్యాణం పొందాడు. ఆయన నమ్మిన సూత్రంలే జైన మతమునకు మూల సిద్ధాంతములు.

**సిద్ధాంతాలు:-**

మానవుని జీవితాశయం మోక్షం పొందడం, దానికి చక్కని నియమాలు పాటించడం వలన అవి చెడు కర్మలను తోలగిస్తాయని పార్శ్వనాథుని ప్రగాఢ విశ్వాసము. దీనిని సాధించడానికి తపస్సును మార్గముగా పార్శ్వనాథుడు సూచించాడు. ఇతడు నాలుగు సిద్ధాంతాలు ప్రవచించాడు.

సత్యం ; అసత్యమాడరాదు. ఎల్లప్పుడు సత్యమే పలకవలెను.

అహింస ; హింసామార్గాన్ని విడనాడాలి. అంటే మాటలద్వారాగాని,ఆలోచనలద్వారా గాని, చేతలద్వారాగాని జీవహింస చేయరాదు.

అపరిగ్రహం; దొంగతనం చేయరాదు.

ఆస్తేయం; ఆస్తి, పాస్తులు ఉండరాదు. ఏ వస్తువుపైన కోరిక ఉండరాదు.

# వర్ద మాన మహావీరుడు: (క్రీ॥పూ॥ 599-527)

వర్ధమాన మహావీరుడు వైశాలి నగరానికి దగ్గరలో ఉన్న కుంద గ్రామంలో సంపన్నమైన క్షత్రియ కుటుంబంలో క్రీ॥పూ॥ 599 లో జన్మించాడు. ఇతని తండ్రి సుప్రసిద్ధ క్షత్రియనాయకుడైన సిద్ధార్ధుడు. తల్లి పేరు త్రిశాల. ఈమె లిచ్ఛవి రాజైన చేతకుని చెల్లెలు, అతని కూతురు బింబిసారుని భార్య. ఈ విధముగా మహావీరుని కుటుంబానికి, మగద రాజ కుటుంబానికి దగ్గర చుట్టరికం ఉండేది. వీరు జ్ఞాత్రిక తెగకు చెందిన వారు. చిన్న వయసు నందే మహావీరుడు క్షత్రియోచిత విద్యను అభ్యసించి యశోదయను రాజమార్తెను వివాహమాడెను. కొంతకాలము సఖభోగములను అనుభవించెను. వారికి ప్రియదర్శిని (అణోజ్ఞి) యను పుత్రిక జన్మించెను. ఆమెను తన మేనల్లుడైన జామాలె కిచ్చి మహా వీరుడు వివాహము చేసెను. తన తల్లిదండ్రుల మరణానంతరము రాజభోగములు, వైవాహిక జీవిత సౌఖ్యములు వర్ధమానునికి మనఃశ్శాంతి నొసంగలేదు. 30 సం॥ల వయసులో సత్యాన్వేషణ కోసం సన్యాసిగా మారిపోయాడు. సత్యాన్వేషణలో 12 సం॥లు కఠోర తపస్సు చేసి కొంతకాలం అన్నపానాదులు, చివరకు కట్టుబట్టలు కూడా విసర్జించి రుజుపాలక నదీ తీరాన జృంబిక గ్రామ సమీపంలో పాలవృక్షం క్రింద జీనత్వం పొందాడు. అదే జ్ఞానోదయం. 'జిన' అనగా జయించిన వాడని అర్థం. ఇతడు 42 వ యేట ధైర్య సాహసములతో తపస్సు సాగించి మహావీరుడనియు, మహాజ్ఞాని యైనందున 'కేవళి' అనియు సకల బంధములు తెంచుకొన్నందున 'నిర్గ్రందుడని' కొనియాడారు మహావీరుడు 30 ఏళ్ళ పాటు ప్రచారం చేసాడు. ప్రజలకు తన సిద్దాంతాలను బోధిస్తూ చంపా, వైశాలి, రాజగ్రహం, మిధిల, శ్రావస్తి మొదలైన రాజ్యాలకు వెళ్ళాడు. రాజగృహంలో మగధ చక్రవర్తియైన బింబిసారుడు, మహావీరుని గౌరవించినట్లు తెలుస్తుంది, 72 సంవత్సరముల ప్రాయములో మహావీరుడు పాట్నా జిల్లాలో పావాపురిలో హిస్తిపాలుడని, రాజగృహంలో నిర్యాణం పొందాడు.

**జైన మత సిద్ధాంతాలు:-**

మమావీరుడు వేదాల ఆధిక్యాన్ని వైదిక కర్మకాండలను, బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని తిరస్కరించాడు. మానవుడు మోక్షం పొందడానికి పవిత్రమైన జీవనము గడుపుతూ సన్యాసిగా కఠోరతపస్సు చేయాలని బోధించాడు. జాతి, మత, కుల, వర్గ, లింగ భేదం లేక అందరికి జైన మతంలో ప్రవేశం కల్పించాడు. పార్శ్వనాథుడు భోదించిన నాల్గు సూత్రములకు మహావీరుడు బ్రహ్మణచర్యం చేర్చి పంచ వ్రతాలను చేశాడు. బ్రహ్మచర్యమంటే ఇంద్రియాలను, కోరికలను అదుపులో ఉంచుకొనడం. మహావీరుడు వర్ణవ్యవస్థను తిరస్కరించలేదు.

హిందూ కర్మ, పునర్జన్మ సిద్ధాంతములను మహావీరుడు అంగీకరించెను క్రిత జన్మలో చేసిన పాపపుణ్యములు ఈ జన్మలోని సుఖ దుఃఖములును, ఈ జన్మలో చేయు పాపపుణ్యములు పునర్జన్మను నిర్ణయించును. ఈ పునర్జన్మ లేకుండుట, లేక సంసార బంధమునుండి విముక్తి పొందుటే మోక్షము. మానవుడు కర్మాను సారముగ పునర్జన్మ పొందును. కర్మను అంతము

చేయవలెనన్న ఈ ప్రాపంచిక బంధముల నుండి వేరుచేయవలెను. అనగా ఐహిక భోగములు విసర్జించి అహింస, సత్యము, భూతదయ, బ్రహ్మచర్యము మొదలగు సద్గుణ శీలములు కలిగి యుండవలెను.

మోక్షమనేది దుఃఖం లేని అనంత సౌఖ్యం. దీనిని సత్యశీల అని కేవలావస్థ అని అందురు. మోక్షమును పొందవలెనన్న ప్రతి ఒక్కడు మూడు సూత్రములను పాటింప వలెను. 1. సరియైన విశ్వాసం (Right Faith) తీర్థంకురుల బోధనలో శ్రద్ధ, విశ్వాసము కలిగి యుండటం. 2. సరియైన జ్ఞానము (Right Knowledge) తీర్థంకరుల బోధనలోని సత్యమును గ్రహించుట, 3. సరియైన నడవడి (Right Action and Right conduct ) అనగా జైన పంచ వ్రతముల నాచరించుట. వీనినే త్రి రత్నము(Three Jewels) అంటారు.

మహావీరుడు ప్రకృతిలోని ప్రాణులనేగాక ప్రతి జడ పదార్థమునకు ఆత్మకలదని చెప్పెను. అందువలన జైనులు అహింసా వ్రతమును నిష్టతో పాటింతురు. జైన మతం స్థాపించినప్పటినుంచి క్రీ॥పూ॥ 4 లేదా 3 వ శతాబ్దం వరకు భద్రబాహు రచించిన 'జైన కల్ప సూత్రం' జైన మతం యొక్క చరిత్రను తెలుపుతున్నది.

**జైన పరిషత్తు:-**

క్రీ॥పూ॥ 300 సం॥లో జైనుల తొలి సమావేశం పాటలీపుత్రుంలో జరిగింది. ఈ సమావేశంలో 12 అంగాలను క్రోడీకరించిరి ఆర్యరక్షిత వీరభద్ర లాంటి అంగాలు తరువాత కాలంలో వచ్చాయి. వీటిపై వ్యాఖ్యానాలు కూడా వచ్చాయి. వీటిని 'నిర్యుక్తులు' అని అంటారు. క్రీ॥ పూ॥ 4 వ శతాబ్ది చివరికాలంలో బీహార్‌లో భయంకరమైన కరువు ఏర్పడింది. ఈ కరువు 12 సం॥ ల కాలము కొనసాగింది. భద్రబాహు యొక్క నాయకత్వంలో కొంతమంది జైనులు దక్షిణ మైసూరు ప్రాంతానికి తరలి వెళ్ళారు. స్థలబాహు నాయకత్వంలోని జైనులు మగధలోనే ఉండిపోయారు. పాటలీపుత్రంలో ఇతని నాయకత్వంలో జైన పరిషత్ సమావేశమయి కొన్ని నిర్ణయాలను తీసుకుంది.

కరువు తరువాత వలస వెళ్ళిన జైనులు మగధకు తిరిగి వచారు. ఆ సదస్సు తీర్మానాలను బహిష్కరించారు. ఆనాటినుంచి దోఇణాది జైను లన్న దిగంబరులని, మగధ జైనుల్ని శ్వేతాంబరులని పేర్కొనడం ప్రారంబమైంది.

**జైనమత విస్తరణ:-**

శాసనాలు, సాహిత్య ఆదారాలు తొలి దశలో జైనమయత వ్యాప్తిని లెలుపుతున్నాయి. మహావీరుడు అతని అనుచరులు సంస్కృతానికి బదులుగా ప్రాంతీయ భాషను ఉపమోగించటం, రాజ పోషణవల్ల, జైన మతాచార్యుల కార్యక్రమాలవల్ల చాలావ్యాప్తి జరిగింది. మహావీరుడు నిర్యానం చెందేనాటికి జైన మతం ఒక నిర్దిష్టమైన సంఘంగా రూపొందింది. క్రమంగా మహావీరుని అనుచరులు ఈ మతాన్ని భారతదేశ మంతట వ్యాపింపచేశారు. క్రీ॥పూ॥ నాల్గవ శతాబ్ది చివరినాటికి భద్ర బాహు ఆధ్వర్యంలో కొంతముది జైన సన్యాసులు దక్షిణ ప్రాంతానికి తరలి వెళ్ళి, 'మైసూరు ప్రాంతంలో శ్రావణ బెళగోళ'ను కేంద్రస్థానంగా ఏర్పాటు చేసుకొని, దక్షిణాదిలో జైన మతాన్ని వ్యాప్తిలోకి తెచ్చారు.

దేవాలయ నిర్మాణం, మఠాల స్థాపన, జైన విగ్రహాలను పూజించటం, పండగలు జరుపుకొనటం మొదలైనవి జైన మత పోషణలోకి వచ్చాయి. రాజరిక పోషణ జైన మతానికి లభించకముందే సుప్రసిద్ధ మౌర్య చక్రవర్తి చంద్రగుప్త మౌర్యుడు జైన మత భక్తుడు. ఇతడు భద్రబాహునితో అతని శిష్యుడిగా దక్షిణ దేశానికి వచ్చాడు. క్రీ॥పూ॥ రెండవ శతాబ్దంలో కళింగ రాజైన ఖారవేలుడు జైన మతం స్వీకరించి జైన విగ్రహాలను, ప్ర ఈ ప్రాంతంలో వ్యాపార కార్యక్రమాలలో నిమగ్నులై ఉన్న జైనులు చాలా మంది ఉన్నారు.

**జైన మతం ప్రాధాన్యత:-**

మొట్ట మొదటి సారిగా వర్ణ వ్యవస్థలోనూ, వైదిక కర్మకాండలలోనూ ఉన్నచెడును తగ్గించడానికి జైన మతం కృషి చేసినది. జైనులు బ్రాహ్మణులు పోషించిన సంస్కృత భాషను తిరస్కరించి సామాన్యప్రజల భాషయైన ప్రాకృతాన్ని స్వీకరించి దాని ద్వారా తమ భావాలను ప్రచారం చేసినారు. జైనమత సాహిత్యం అర్ధమాగధలో రచింపబడింది. క్రీ॥పూ॥ ఆరవ శతాబ్దిలో గుజరాత్‌లోని గొప్ప విద్యా కేంద్రమయిన వలంభిలో ఈ గ్రంధాలు సకలనం చేయబడ్డాయి. ప్రాకృత భాషా, దాని సాహిత్యం అభివృద్ధి చెందాయి. ప్రాకృత భాషనుంచి ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెందాయి వీరు కన్నడ భాష అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

మొదట బౌద్ధులు లాగే జైనులు కూడా విగ్రహారాధకులు కారు. తరువాత కాలంలో వారు మహావీరుణ్ణి, ఇరవై మూడవ తీర్దంకరుల్ని పూజించటం ప్రారంభించారు. అందమైన, సమున్నతమైన రాతి విగ్రహాలను పూజకోసం చెక్కారు. ఇది ఎక్కువగా కర్నాటక, గుజరాత్, రజస్థాన్‌లలో జరిగింది. జైన కళ, బౌద్ధకళంత సంపన్నంగా లేక పోయినా కళకుజైనులు చేసిన దోహదం-ముఖ్యంగా మధ్యయుగాల్లో గొప్పదని చెప్పుకోవాలి.

## బౌద్ధమతం:-

క్రీ॥పూ॥ ఆరో శతాబ్దం భరతదేశ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంతరించుకున్నది. ఈ కాలంలో చాలామంది తాత్వికులు ప్రజలకు మోక్షమార్గాన్ని భోదించడానికి బయలుదేరారు. కోసల, మగధ రాజ్యాలు మహావీరుని, బుద్ధుని కార్యక్రమాలకు నిలయమయ్యాయి. బౌద్దమతం సనాతన బ్రాహ్మణ మతాభివృద్ధిని నిరోదించింది. బుద్దుని జీవిత చరిత్రకు సంబంధించిన విషయాలు ప్రాచీన బౌద్ధ గ్రంధాలలో ఇతర గ్రంధాలలో లభిస్థాయి.

బుద్ధుని జీవితాన్ని గురించి షత్తని పదము, పూర్వస్తుతములు, దీపవంశ, మహవంశ, బౌద్దమతగ్రంధాలయిన 'త్రిపిటకాలు', మహావస్తు, లలితవిస్తరం, అశ్వఘొషుని బుద్దచరితం, నిదన కథ, అభినిష్క్రమణ సూత్రం, జాతక కథలు, ధీఘని కాయం కొన్ని సంస్కృత, పాళీ గ్రంధాలు తెలుపుతాయి.

గౌతమ బుద్ధుడు లేదా సిద్ధార్దుడు మహావీరుని సమకాలకుడు ప్రపంచములో విలసిల్లిన, గుర్తించిన పదకొండు మతాలలో బౌద్దమతం ఒకటి. దీనిని గౌతమ బుద్ధుడు స్థాపించాడు. బుద్ధునికి సిద్ధార్దుడని, అంగీరసుడని, శాక్యజ్ఞాని, తథాగతుడని, శాక్యముని అనే పేర్లున్నాయి. బుద్దుడు అంటే జ్ఞాని అనర్ధం. 'తధాగి' అంటే సత్యాన్ని తెలుసు కొన్నవాడని అర్ధం.

గౌతమ బుద్ధుడు నేపాల్ పర్వత పాదాల చెంత ఉన్న కపిలదస్త పట్టణానికి సమీపమున ఉన్న లుంబినీ వనము అనగా రుమిందై గ్రామమున క్రీ॥పూ॥ 563లో జన్మించెను. కపిలదస్తునేలు శాక్య వంశీయుడైన శుద్దోదనుడు అతని తండ్రి. సిద్ధార్ధుని తల్లి మాయాదేవి కోసల రాజు పుత్రిక. అతని తల్లిదండ్రులతనికి పెట్టినపేరు సిద్దార్ధుడు. ఇతడు జన్మించిన ఏడు రోజుల తర్వాత మహామాయ మరణించింది. ఆమె సోదరి, సవతితల్లి మహ ప్రజాపతి గౌతిమి నేతృత్వంలో అతడు పెరిగాడు. బుద్దుడు జన్మించినపుడు అనేక అద్భుతమైన సంఘటనలు జరిగాయని బౌద్ధ గ్రంధాలు తెలుపు తున్నాయి. ఇతడు గౌతమ గోత్రమునకు చెందిన వాడగుటచే గౌతమముడని వ్యవహరించెను.

సిద్ధార్దుడు తన 19వ యేట వివిధమైన క్షేత్ర విద్యలలోను, విద్య వాఙ్మయంలోను అనేక పోటీలను ఎదుర్కొని తన ప్రజ్ఞను, సామర్ధ్యాన్ని ప్రదర్శించాడు. కాని ఐహిక సుఖము పట్ల విముఖతకు, జీవిత సమస్యల పట్ల ఆలోచనలను, భూతదయను కల్గియుండుటచే తన కుమారుడు సన్యాసి యగునే మోయని శుద్దోదనుడు భయపడెను. అయితే సుప్రభుద్దుడు అనే శాక్య వంశ క్షత్రియుడు తన కుమార్తె అయిన యశోదరను సిద్దార్ధునికిచ్చి 19వ యేట వివాహం చేసెను. ఈ యువ దంపతులకు "రాహులుడను" పుత్రుడు కూడు జన్మించెను. రాజ భోగములు గాని, దాంపత్య సుఖముగాని సిద్దార్ధునకు సంతృప్తి నీయలేదు.

సిద్ధార్దుడు సన్యసించగలడనే జోష్యంతో వ్యాకుల పడిన శుద్దోధనుడు అతను ఎటువంటి కష్టాలను, దు:ఖాలను కలిగించే పరిస్థితులను సంభవించకుండా, విరక్తి కలిగించే సంఘటనలూ కంటపడకుండా కట్టుదిట్టాలు చేసాడు. అయినప్పటికి సిద్దార్దుడు పురవీధులలో విహారం చేయ తలపెట్టాడు. తన ఉద్యానవనానికి వెళ్ళే దారిలో ఒక వృద్దుడిని, అడుగులు వేయటం కూడా సాద్యం కాని దుర్బలుడిని చూచి నివ్వెరపడ్డాడు. అదే విదంగా వరసగా "ఒకరోగిని", మృతదేహము చూచి సిదార్ధుడు వ్యాకులం చెందడం నాలుగోసారి. సిద్దార్దుడు ఒక'సన్యాసిని' చూచి, అతడు భౌతిక విషయాల పట్ల వ్యామోహాన్ని వదులుకొని మనో నిగ్రహాన్ని పాటించేది సన్యాసి అని తెలుసుకున్నాడు. అంతట శాశ్వతమైన, నిశ్చలమైన స్థితిని సంపాదించే జ్ఞానాన్ని పొందాలనే ఆశయం కలిగింది. ఈ విధంగా ప్రపంచంలోని బాధలను, జరామరణాలను గుర్తించి, నివారించడానికి, మానవాళికి ప్రాపంచిక జీవితంలోని దు:ఖాన్ని నిర్మూలించి విముక్తిని ప్రసాదించడానికి సిద్దార్దుడు సన్యసించినట్లు బౌద్దవాఙ్మయం వివరిస్తుంది. తన 29వ ఏట ఒక అర్ధరాత్రి సమయమున భార్యా పుత్రులు నిద్రించు చుండగా వారిని వీడి 'చెన్న'యను రధసారధి సాయముతో అడవుల కేగి సన్యసించెను. దీనినే 'మహాభి నష్క్రమణం' అంటారు.

**సత్యాన్వేషణ:-**

సన్యసించి ఇల్లు వదలిన సిద్దార్దుడు చాలా గ్రామాలు ప్రయాణం చేసి, వైశాలి నగరానికి చేరాడు. అక్కడ 'అలారకలామ' లనే పేరుగల గురువు దగ్గర గొప్ప పాండిత్యము సంపాదించాడు. కాని సత్యాన్వేషి అయిన బుద్ధునికి తాను సంపాదించిన సాంఖ్య దర్శన విజ్ఞానం తృప్తి నివ్వలేదు. తరువాత అతడు రాజ గ్రహనగారాన్ని చేరి అచ్చట"ఉద్దకరామ పుత్రుడు' (రుద్రక రామపుత్ర) బ్రాహ్మణుని వద్ద వేదాధ్యయనం చేశాడు. మహారాజ బింబిసారుడు అతని వద్దకు వెళ్ళి, ప్రపంచ సుఖ భోగంతాలను త్యజించడానికి కారణం తెలుసుకొని, అతనిని ఆ మార్గం నుంచి మళ్ళించడానికి యత్నించాడు. ఆ రాజు తన రాజ్యాన్ని కూడా సన్యాసికి ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. కాని సన్యాసియైన సిద్దార్దుడు దానిని తిరస్కరించాడు.

రాజ గృహంనుండి బయలుదేరి సిద్దార్దుడు ఉరువేల అనే వనం లేదా అరణ్యాన్ని చేరి తీవ్ర నియమ నిష్టలలో అన్న పానీయాలను విసర్జించి, సత్యాన్వేషణకై కఠిన తపఃశ్చర్యను అవలంభించాడు, కాని జ్ఞానోదయం కాలేదు. తుదకు'గయ'చేరి ఒక 'పిపల్' చెట్టు ( pipal tree) క్రింద 39 రోజులు ధ్యాన నిమగ్నుడై యుండగా అతనికి జ్ఞానోదయం కల్గెను. దీనినే "సంబోధ" అందురు. పిపవ వృక్షము భోది వృక్షమయ్యెను. గయ బుద్ధగయగా ప్రసిద్ది కెక్కెను. బుద్ద గయ నుండి బుద్ధుడు వారనాసిచేరి అక్కడ సారనాద్ లోని మృగదావనంలో (జింకతోట - ( deer park) తన పూర్వ సహచరులైన ఐదుగురు బ్రాహ్మణ సన్యాసులకు

ప్రప్రథమముగా జ్ఞానోపదేశం చేశాడు. ఇదే 'ధర్మ చక్ర ప్రవర్తనం' గా పేరుపొందెను. వారే బుద్ధునికి తొలి శిష్యులు.వారిలో ఒక బుద్ధుడు ఒక సంఘం స్థాపించాడు. కాశీ, మగధ, వైశాలి, కపిలవస్తు మొదలగు ప్రాంతములందు సందర్శించుచూ, సుమారు 45 సంవత్సరములు ప్రభువులు, పండితులు, పామరులు అను బేదము లేకుండా తన ధర్మమును బోధించి వ్యాప్తి చేసెను.

బుద్ధుడు చరమకాలాన్ని మల్ల రాజ్యంలోని కుసినార (కుశి నగరము)లో గడిపాడు. తన 80 వ ఏట బుద్ధుడు మహాపరి నిర్యాణమును లేక మోక్షమును పొందెను. (క్రీ॥పూ॥ 483).

**బుద్ధుని బోధనలు:-**

ఆనాటి జీవిత వాస్తవాలను గుర్తించిన సంస్కర్తగా బుద్ధుడు మనకు కనబడతాడు. ఆనాడు ఆత్మను గురించి, బ్రహ్మను గురించి ప్రచారంలో ఉన్న నిష్ఫలమైన వివాదాల్లోకి అతడు ప్రవేశించలేదు. అయితే ప్రజలకు సులభమైన మార్గంలో ధార్మిక చింతన ప్రసాదించాడు. వేదాలను, యజ్ఞయాగాదులను, వైదిక కర్మకాండలను తిరస్కరించాడు. బుద్ధుడు జీవితంలోని దుఃఖాన్ని చూసా, దానిని నివారించడానికి ప్రయత్నించాడు. ఆప్రయత్నంక్ష అతడు సఫలుడయ్యాడు. ప్రపంచం దుఃఖమయమనీ, మనవులు కోరికల కారణంగా దుఃఖాలు అనుభవిస్తున్నారని బావించాడు. కోరికల్ని జయిస్తే నిర్యాణం సాధ్యమవుతుందన్నాడా. నార్యాణమంటే జనన మరణాలు నుంచి విముక్తి అన్నమాట. మానవుడు తన స్వయం కృషి చేతనే లక్ష్య సిద్ధిని పొందవచ్చు. భగవంతునితో మనకు నిమిత్తం లేదని బుద్ధుడు భోదించాడు. బుద్ధుడు నాలుగు ఆర్య సత్యాలను (Four noble fruths) ప్రదర్శిచాడు.

అవి:

1. ప్రపంచ మంతయు దు:ఖ భరితము, జీవితమే దుఃఖమయము

2. ఈ దుఃఖం ఆశ లేక కొరిక వల్ల కలుగుతుంది. కొరిక పునర్జన్మకు దారితీస్తుంది. కోరికలున్న మానవుడు ఆ కోరికలను దీర్చుకోవడానికి జన్మ ఎత్తవలసి వస్తుంది.

3. ప్రపంచములోని దుఃఖాన్ని అనగా జీవితంలో దుఃఖాన్ని నిరోదించడం సాధ్యం, అది కోరికలను, ఇతర మానసిక వికారాలను నిరోదవించటం వలన సాధ్యమవుతుంది.

4.బుద్ధుడు దు:ఖాలను తొలగించడానికి అష్టాంగ మార్గాన్ని సూచించాడు.

## అష్టాంగ మార్గం (Eight fold path) :-

బుద్ధుడు నీతినిభోదించుటయే ప్రదాన లక్ష్యంగా పెట్టుకొన్నాడు. ఒక ప్రక్క కఠిన నియమాలతో, వ్రతాలతో శరీరాన్ని శుష్కింప చేయటం, మరొక వంక సుఖ భోగాలతో జీవితాన్ని గడపడం, ఈ రెండును నిష్ప్రయోజనమే. ఈ రెండు విపరీత ప్రవృత్తులకు మధ్య మార్గమైన ఆర్య అష్టాంగ మార్గాన్ని బుద్ధుడు ప్రతిపాదించాడు.

(a)సమ్యర్ దృష్టి (Right faith): సమ్యర్ దృష్టి అన సరి అయిన దృక్పధం. సారనాధ్‌లో ప్రచించిన నాల్గు ఆర్య సత్యాలు అర్ధం చేసుకొనటానికి అవసరమైన జ్ఞాన దృష్టి.

(b)సమ్యక ఆలోచన (Right mindness) : సుఖాలను త్యజించటం. ఇతరులను గురించి చెడుగా ఊహించకుండా ఉండటం.

(c) సమ్యక వాక్కు (Right speech) : మానవులకు తన భాషపై అదుపు కలిగి ఉండటం. సవ్యమైనది, కఠినం కానిది, వ్యర్ధ ప్రతాపం కానిది.

(d) సమ్యక క్రియ (Right Action) : దొంగతనం చేయకూడదు. నియమ బద్ధమైన దినచర్యలో సత్ప్రవర్తన కలిగి ఉండటం.

(e) సమ్యక జీవనం (Right livelehood): నియామాలకు విరుద్ధంగా జీవనం గడపరాదు. పాప కృత్యాల నుండి మనస్సు మళ్లించాలి.

(f) సమ్యక శ్రమ (Right Effost): చెడు ఆలోచనలు.

(g) సమ్యక నిశ్చయం (Right Resolution) : మంచి మనస్సు.

(h) సమ్యక ధ్యానం (Right meditation): వీటి సాధనల వల్ల పరిపూర్ణత సిద్ధించి, దు:ఖ నిర్మూలన జరిగి, నిర్మాణం పొందవచ్చునని బుద్ధుడు చెప్పాడు.

వీనిని ఆచరించుట ద్వారా వ్యక్తి శీలాన్ని, సమాధిని మరియు ప్రజ్ఞలను సొందును. జ్ఞానియైన వానికి పునర్జన్య వుండదు. మోక్షము లేక నిర్వాణము అనగా పునర్జన్మ లేకపోవుటయే. జనన మరణముల నుండి విముక్తి కలిగి మోక్షము ప్రాప్తించును. అతిభోగములనుగాని, వ్రత కాఠిన్యమునకు గాని చెందకుండుటచే దీనిని మధ్యేమార్గమనిరి.

మోక్షమునకు అర్హతను సంపాదించుటకు బుద్ధుడు మానవునికి ఒక నీతినియమావలిని సూచించెను. అవి అహింసా, దయ,

భోగ విసర్జన, సత్యము, ప్రేమ, మొదలగునవి. వ్యక్తి యొక్క సుఖ దు:ఖములకు అతని చర్యలే కారణము కాని భగవంతుడు కాదనెను. హిందూమతము నందలి కర్మ, పునర్జన్మ, మోక్ష సిద్ధాంతములను సమర్థించి వ్యక్తి జన్మలో చేసిన పాప పుణ్యములే అతని పునర్జన్మ నిర్ణయించునని, పునర్జన్మ లేకుండుచే మోక్షము. అహింసా సిద్ధాంతాన్ని పాటించి, విశ్వ మానవ ప్రేమను, సౌభ్రాతృత్వాన్ని చాటించి, తాను చెప్పినది ఆచరించి ప్రజలకు మార్గ దర్శకుడై, విశ్వ మానవ కళ్యాణానికి దోహద పడ్డాడు.

## బౌద్ధమతం - మహాసభలు - శాఖలు :-

బుద్ధుడు తన జీవిత కాలం అంతా అనేక జనపదాలు, నగరాలు పృటించి ధర్మ ప్రచారం చేశాడు. ఆసంధర్భంగా ఆయన అసంఖ్యాకంగా ప్రబోదాలు చేశాడు. విసృతంగా బౌద్ధధర్మం ప్రజాదరణ పొంది, సంఘం విస్తరించింది. కాల క్రమేన ఆ సంఘం గ్రామాలలోని బిక్షుకులలో బౌద్ధ ధర్మాన్ని గూర్చి అనేక దృక్పధాలు ఏర్పడసాగాయి. బుద్ధుని మహాపరి నిర్వాణంతరము సంఘా రామాలలో క్రమ శిక్షణను కాపాడేందుకు, బుద్ధుని ప్రపచశాలను స్పష్టంగా వివరించేందుకు బిక్షువులు ఒక సమావేశాన్ని జరపడం జరపడం అవసరమని భావించినట్లు తెలుస్తుంది. వీటిని "బౌద్ధ సంఘ సమావేశాలు" అంటారు.

**(1) మొదటి బౌద్ధమత సంగీతి :-**

బుద్ధుని మహాపరి నిర్వాణం అనంతరం అజాత శత్రువు యొక్క పర్యవేక్షణలో బౌద్ధ మహాసభ రాజగ్రహములో సమావేశమయినది. దీనిని ప్రథమ సంగీతి (FIRST BUDDHIST COUNES) అందురు. దీనికి బుద్ధుని శిష్యుడైన మహా కౌశ్యపుడు ఈ సభకు అధ్యక్షత వహించెను. ఆనందుడు బుద్ధుడు చేసిన ధర్మోపదేశాలను సభలో పఠించాడు. ఉపాలి వినయము (నీతి) గురించి బుద్ధుని ఉపదేశములను పఠించాడు. ఈ సమావేశాలందే బుద్ధుని ఉపదేశములను 'వినయ', 'సుత్త', 'అభిదమ్మ' పీఠికలుగా దూపొందించారు. ఈ త్రిపీఠికాలనే బౌద్ధ వాఙ్మయములో తొలిసాహిత్యంగా చెప్పవచ్చును.

**(2)రెండవ బౌద్ధ మహా సంగీతి :**

ఇది బుద్ధుని మహాపరి నిర్వాణం అనంతరం ఒక శతాబ్దం తరువాత జరిగెనని బౌద్ధ వాఙ్మయం చెప్పుచున్నది. ఈ రెండవ బౌద్ధ మహాసంగీతి వైశాలి నగరమందు జరిగెను. ఈ సంగీతి నాటికి బౌద్ధమతము విశేష ప్రజాధరణ పొందుట వలన బౌద్ధ బిక్షవుల ఆచార, వ్యవహారములలో విబేధములు పొడచూపెను. తూర్పు దేశాలైన వైశాలి, పాటలీ పుత్రల వారికి, పశ్చిమ దేశాలైన కౌశంబి, అవంతి దేశీయులకు ఒక వివాదం ఏర్పడింది. ఈ సమయమున మగదను పరిపాలిస్తున్న కాకవర్ణి లేదా కాల సోకుడనే రాజు ఈ మహాసభ నిర్వహణకు అన్నివిధాలా సహాయపడినట్లు బౌద్ధ వాఙ్మయం వివరిస్తుంది. వైశాలి బిక్షవుల ఆచారములు బుద్ధుని భోదలకు విరుద్ధముగా ఉన్నవని, వానియందు మార్పు తీసుకురావాలని ఈ రెండవ సంగీతిలో కోరిరి. కాని వైశాలి బిక్షవులు రెండవ సంగీతి ఆదేశములను తిరస్కరించుటచే బౌద్ధ సంఘం రెండుగా చీలినది. మార్పు కావలెనన్న వారు మహా సాంగికులుగాను, మార్పుకు ఇష్టపడని వారు తేరవాదులుగా విడిపోయిరి.

**(3) మూడవ బౌద్ధ మహా సంగీతి :-**

మౌర్య చక్రవర్తి అశోకుని పర్యవేక్షణలో పాటలీపుత్రంలో తృతీయ బౌద్ధ మహా సంగీతి జరిగెను. దీనికి మొగ్గలిపుత్త తిస్స అధ్యక్షత వహించెను. చీలికలను తొలగించి బౌద్ధ సంఘం సమైక్యతను సాధింపనెంచి జరిగిన ఈ సంగీతి భేదములు మాత్రం సమసిపోలేదు. ఈ సంగీతి యందే త్రిపీఠికాలంలో మూడవదైన 'అబిదమ్మ' రూపొందించబడింది. బౌద్ధ మతము వివిధ దేశములందు వ్యాప్తి చేయుటకు తగు చర్యలు తీసుకొనెను. అశోకుడు తన కొడుకైన మహేంద్రుని తేరవాద సిద్ధాంతాన్ని వ్యాప్తి చేయుటకు సింహళ దేశానికి పంపాడు. ఇంకా అశోకుడు బౌద్ధ ప్రచార సంఘాలను పశ్చిమ ఆసియాకు, గ్రీకు రాజ్యాలకు, ఉత్తర ఆఫ్రికాకు, తూర్పు యూరపు ప్రాంతాలకు పంపాడు.

**(4) నాల్గవ బౌద్ధ మహీ సంగీతి :-**

కుషాణుల రాజైన కనిష్కుడు బౌద్ధమతాన్ని స్వీకరించి దానిని పోషించాడు. ఇతడు బౌద్ధ మతంలో ఏర్పడిన శాఖోపశాఖలను గమనించి, వాటిని సరిచేయడానికి కాశ్మీరులోని 'కుందలవనం' లో 'వసుమిత్రుని' అధ్యక్షతన ఒక మహాసభ ఏర్పాటు చేసాడు. ఈ సభకు 'అశ్వఘోషుడు' ఉపాధ్యక్షునిగా వ్యవహరించెను. ఈ సభయందే బౌద్ధమతం హీనాయాన, మహాయాన యను రెండు ప్రధాన శాఖలుగా చీలిపోయెను. హీనయానస్థులు బుద్ధుని అష్టాంగా మార్గము ద్వారా మోక్షము పొందవచ్చని విశ్వసించిరి. మహా యానస్థులు బుద్ధిని దేవునిగా పూజింపసాగిరి. మహాయనం ప్రపంచ వ్యాప్తమైనది.

## బౌద్ధమత వ్యాప్తికి కారణాలు:-

భారతదేశంలో, విదేశాలలో కూడా బౌద్ధమతం వ్యాపించింది. భారతదేశమున ఆధాత్మిక అశాంతి ప్రబలిన తరుణంలో బౌద్ధ మతము వెలసినది. ముఖ్యముగా బుద్ధుడు ఆనాటి ప్రజలకు తరుణోపాయాన్ని, సులభ మార్గాలను చూపించాడు. వీనిని

ఎవరైనా అనుసరించవచ్చు. బౌద్ధమత సూత్రములు నిరాడంబరమైనవి. ఇవి వ్యయ ప్రయాసలతో కూడిన వైదిక యజ్ఞయాగాదులకు గాని, జైన మతమందలి కఠిన నియమాలకు గాని చెందక ఆచరణ యోగ్యమైన సుఖమైన మద్యేమార్గమునకు చెందినవి. బౌద్ధమతములో ప్రజలకు చాలా స్వేచ్ఛయుండేది. కుల వ్యత్యాసాలను బౌద్ధమతం నిరసించింది. దీని వలన క్రింది తరగతులవారిని బుద్ధుడు ఉద్ధరించి సమాజంలో వారికి స్వేచ్ఛను ప్రసాదించాడు. మోక్షమునకు అందరు అర్హులని ఉద్ఘాటించెను. ఈ మతం సులభంగా, ప్రజల అవసరాలకు తగినట్లుగా ఉన్నది. అందువలననే అది భారతదేశపు సరిహద్దులను దాటి, ప్రపంచంలో ప్రవేశించింది.

బౌద్ధమతం ప్రజలు లేక సామాన్య ప్రజలు అర్థం చేసుకున్న భాషలో అనగా పాళీ భాషలో, సులభ శైలిలో ప్రచారం చేయబడింది. ప్రజలు మాట్లాడే భాష, దార్మిక గ్రంధాల భాష ఒకే భాష. అదే పాళీ భాష. ఈ భాషలో ఉన్న త్రిపిఠికాలు కూడా ప్రజలకు అందుబాటులో ఉండేవి. వాటిని ప్రజలు సులభంగా చదువుకుని అర్థం చేసుకొనేవారు. విజ్ఞుల భాషయైన సంస్కృతము నందు ప్రచారము చేయలేదు. అందువలన ఎక్కువ మంది యీ సిద్ధాంతమును తెలుసుకుని స్వీకరించిరి.

బౌద్ధమత సూత్రముల కంటె బుద్ధుని వ్యక్తిత్వమే బౌద్ధ మత వ్యాప్తికి ఎక్కువగా దోహదపడినదని 'కీత్' (Keith) పండితుడు నుడివెను. బుద్ధుని యొక్క ఉన్నత వ్యక్తిత్వం ప్రజల హృదయాలను చూరగొన్నది. అతని పవిత్రమైన జీవితం, ధార్మి చింతన, సత్ ప్రవర్తన, ఆదర్శ జీవనం, ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బుద్ధుడు మొదట తాను చెప్పిన సత్యమును త్రికరణ సుద్ధిగా ఆచరించెడివాడు. బుద్ధుని యందలి త్యాగశీలత, అసాధారణ జ్ఞానం, జీవకారుణ్యం, బోధనా శక్తి ప్రజలను ముగ్ధులను చేసి బౌదమతంనకు ఆకర్షింపచేసెను. బుద్ధుడు గొప్ప పండితుడు. అసాధారణ వాదనా పటిమ గలవాడు. తన దర్మ ప్రాసస్థమును గురించి విజ్ఞులతో వాదించి వారిచే అంగీకరింపచేసి దీని ఔన్నత్యమును చాటెడివాడు. బుద్ధుని వలె ఆయన శిష్యులు కూడా ఆనందుడు, యశ, మహా కశ్యపుడు మొ॥ వారి కృషి వలన కూడా బౌద్ధమతము వ్యాప్తి చెందింది. బ్రాహ్మణ వర్గం నుండి బౌద్ధ మతం స్వీకరించిన వారిలో ముఖ్యులు మహా కాశ్యపుడు, సారిపుత్రమొగ్గ, ముఖ్యులు.

బౌధమత వ్యాప్తికి ప్రముఖ కారణము విశేష రాజాధరణ. బింబిసారుని కాలంనుండి హర్షవర్దనుని కాలం వరకు అనేకమంది చక్రవర్తులు బౌద్ధమతమును పోషించి ఆదరించిరి. బుద్ధుని కాలమున మగధ, కోశల, కౌశంబి మొ॥ రాజులు, మల్ల, శాక్య, వజ్జి మొ॥ గణతంత్ర రాజ్యంలు బౌద్ధ మతమును ఆదరించెను.

అశోకుడు, కనిష్కుడు బౌద్ధమతం భారతదేశంలోనే కాకుండా విదేశాలలో కూడా వ్యాపింప చేయడానికి చాలా కృషి చేసారు. అశోకుడు తన కొడుకు మహేంద్రుని, కూతురు సంగమిత్రను బౌద్ధమత ప్రచారకులుగా సింహళ దేశానికి పంపాడు. ఉత్తర, షోనలను బర్మా దేశానికి పంపెను. కనిష్కుడు కూడా బౌద్ధమత వ్యాప్తికి కృషి చేసెను. కశ్య, మాతంగునిచే చైనా నందు బౌద్ధమతం ప్రవేశ పెట్టెను. మధ్య ఆసియా, ఆగేయ, ఆసియా రాజ్యములందును బౌద్ధమతము ప్రచారము చేయబడెను. హర్షుడు, మీనాండర్ (మిలిందుడు - శకరాజు) కూడా బౌద్ధమత ప్రచారము చేసిరి.

రాజుల కృషికి తోడుగా బౌద్ధ సంగారామాలు, బౌద్ధమత ప్రచార సంఘాలు బౌద్ధమత వ్యాప్తికి చాలా కృషి చేశాయి. బుద్ధుడు తన శిష్యులను ధర్మసంఘముగా చేర్చి ఒక నియమావళిని రూపొందించెను. ఈ సంఘమునకు బుద్ధుడు, ధర్మము, సంఘము అను త్రిరత్నములు శరణ్యము. సంఘము నందు చేరినవారు శిక్షణానంతరము బౌద్ధ మత సూత్రములను ప్రచారము చేయుచు నిష్కలంక జీవితమును గడిపెడివారు. ఈ విధముగా బౌద్ధమతాన్ని ప్రజలలో బాగా వ్యాపింప చేసారు. ధనికులు, పేదవారు, పురుషులు,స్త్రీలు, ఉన్నతులు, కులీనులు, పెద్ద, చిన్న భేదము లేకుండా అందరికి ధర్మోపదేశము చేసేవారు.

బౌద్ధమతములో గొప్ప పండితులు, తాత్వికులు, వేదాంతులు అనేకమంది ఉండేవారు. వారు మత సంబంధమైన గ్రంధాలను వ్రాసారు. వారిలో నాగశేనుడు, బుదదత్త, బుద్ధఘోష, దమ్మపాల, నాగార్జున దివాకర మిత్ర ముఖ్యులు. నలంద, వల్లభి, జగదల, ఆద్దంతిపూర్, విక్రమశీల ముఖ్యమైన నాటి బౌద్ధ విశ్వవిద్యాలయాలు. ఇవి ఉన్నత విద్యా ప్రమాణాలతో గొప్ప ఉపాధ్యాయులను, మతాచార్యులను, సన్యాసిలను, పండితులను తయారు చేసినవి.

బౌద్ధ సంగీతులు కూడా బౌద్ధమత వ్యాప్తికి తోడ్పడెను. ఈ సంగీతిలలో బౌద్ధమత ప్రచారమునకు, బౌద్ధమత సమగ్రతకు అనేక చర్యలు తీసుకొనబడెను. బౌద్ధమత మందలి పరమత సహనము, ఇతర మతస్థుల నుండి మన్నలను పొందెను.

## బౌద్ధమత పతనానికి కారణాలు

క్రీ॥శ॥ 12వ శతాబ్దానికి భారతదేశంలో బౌద్ధమతం లేకుండా పోయింది. బీహార్‌లోను, బెంగాల్‌లోనూ, ఒకరకమయిన మారిపోయిన రూపములో కొనసాగిన బౌద్ధమతం, క్రీ॥శ॥ 12వ శతాబ్దం తరువాత భారతదేశం నుండి పూరిగా అదృశ్యమైపోయినది. దీనికి అనేక కారణాలు కలవు.

రాజాదరణ కోల్పోవుట, బౌద్ధమత క్షీణతకు ప్రధాన కారణం. భారతదేశమును పరిపాలించిన మౌర్యులు, కుషానులు, అనంతరము వచ్చిన రాజవంశములలో బౌద్ధమతమును ఎవరు పోషించలేదు. బ్రాహ్మణ రాజైన పుశ్య మిత్ర శుంగుడు బౌద్ధులను

హింసించాడని చెపుతారు. క్రీ॥శ॥ 6,7 శతాబ్దములో బౌద్దుల మీద జరిగిన హింసలకు అనేక నిదర్శనాలు కనిపిస్తాయి. శుంగులు, కణ్వులు, గుప్తులు హిందూ మతమును పునరుద్దరించిరి. శివారాధకుడైన హుణరాజు, మిషిరకులుడు వందలాది బౌద్దలను చంపాడు. శైవుడైన, శశాంక గౌడుడు బుద్ద గయలోని బోధివృక్షాన్ని నరికి వేసాడు. ఈ విధంగా రాజాధరణ కోల్పోవడంతో బౌద్దమతం క్షీణ దశకు చేరుకున్నది.

బౌద్ధమత ప్రజలనుండి గొప్ప ఆదరాభిమానాలను చూరగొన్నదిగాని, హిందూమతాన్ని మాత్రం తొలగించలేకపోయింది. దీనికి ప్రధాన కారణం బౌద్దమతం మతములో ఉన్న దుష్ట సాంప్రదాయాలకు వ్యతిరేకంగా మొదట పోరాడిందో వాటికే బౌద్దమతం చివరకు లోబడిపోయింది. కుమారిలబట్టు, శంకరాచార్యుడు హిందూ మతోద్దరణకు కృషి చేసినారు. బౌద్ద, జైన మత మందలి లోపములను ఎత్తిచూపుతూ హిందూ మతాన్ని సంస్కరించిరి. పశు సంపదను రక్షించుకోవలసిన అవసరాన్ని గురించి వారు కూడా నొక్కి చెప్పడం ప్రారంభించారు. స్త్రీలను, సూద్రులకు, స్వర్గానికి వెళ్ళే అవకాశాన్ని కల్పించారు.

హున, మహమ్మదీయ లాంటి విదేశ దండయాత్రలు కూడా బౌద్దమత పతనానికి కారణమయ్యెను. హున నాయకుడైన తోరమాణుడు తక్షిశిలా విశ్వవిద్యాలయమును నాశనము చేసేను. ఇంకా వీరు అనేక బౌద్దాలయాలను, బౌద్దారామాలను ధ్వంశం చేసిరి. అరబ్బుల దండయాత్ర వలన కూడా బౌద్ద సంఘారామాలు, బౌద్ద చైత్యాలు నాశనమయ్యాయి. వారు అనేక బౌద్దులను వదించారు. మహ్మద్-ఘోర్ సేనాధిపతియగు మహ్మద్-బిన్-భక్తియార్ జగత్ విఖ్యాతి గాంచిన నలందా విశ్వ విద్యాలయమును సమ్మూలంగా నాశనం చేసెను.

బౌద్ధమతం సామాన్యులకు అందుబాటులో ఉండేది. కాని దానిలోని కఠినమైన క్రమశిక్షణ మతమువారికి కష్టముగా ఉండేది. బౌద్ద మతములోని నాస్తిక వాదం ఆ మతాన్ని ప్రజలకు దూరం చేసింది. కాని కొంత కాలమయిన తరువాత మహాయాన శాఖ బలపడిన తరువాత బుద్దున్ని పూజించడం మొదలు పెట్టారు. బౌద్ద సంఘారామాలలో అయోగ్యులైన వ్యక్తులు ప్రవేశించి సాంఘిక నియమాలను సడలించుకొని ఎన్నో నీచమైన పనులు చేస్తుండేవారు. అవి బౌద్ద మత సిద్దాంతాలకు వ్యతిరేకంగా ఉండేవి. వజ్రాయన బౌద్దమతం (తాంత్రిక బౌద్ధ మతం) బౌద్ధ మతంలో ఒక శాఖగా రూపొందింది. వీరు బుద్దుడు భోదించిన ధర్మాన్ని పాటించలేదు.

బౌద్దారామాలలో పుష్కలంగా ఉన్న సంపదతో అక్కడే నివసిస్తున్న స్రీలు మరింత పతనానికి దారి చూపాయి. బౌద్దులు స్త్రీలను కాముక దృష్టితో చూడటం ప్రారంభించారు. బుద్దుడు అతని ప్రయ శిష్యుడైన ఆనందునితో "స్త్రీలను, ఆరామాలలోనికి అనుమతించకుండా ఉంటే బౌద్దమతం మరో వెయ్యేళ్ళు బ్రతికేది. అనుమతించాం కాబట్టి 200 ఏళ్ళు మాత్రమే బ్రతుకుతుంది". అని అన్నాడని చెపుతారు.

బౌద్ద మత పతనానికి ముఖ్య కారణం సనాతన బ్రహ్మణ మత పునరుద్దరణ. గుప్తరాజులు బ్రాహ్మణ మతాన్ని పోషించి, బౌద్ద మతాన్ని ద్వేషించారు. 8వ శతాబ్దం నుండి 11వ శతాబ్దం వరకు ఉత్తర భారతదేశాన్ని పరిపాలించిన రాజపుత్ర రాజులు బౌద్ద మతానికి అనుకూలంగా లేరు. వారికి అహింసా సిద్ధాంతం పైన నమ్మకం లేదు. వారు హిందూ మతంలోని శక్తిని పూజించారు. దీనివలన హిందూ మతం అభివృద్ధి చెంది బౌద్ద మతం క్రమక్రమముగా పతనమయినది.

**జైన, బౌద్ద మతాల మధ్య పోలికలు :-**

బౌద్ద, జైన మతములు రెండూ సమాజంలో నాటి కర్మ కాండలతో నిండిన వైదిక మతముపై తిరుగుబాటుగా ఆవిర్భవించుట వలన ఈ రెండింటికి మధ్య కొన్ని సామ్యములు ఏర్పడెను.

(1) వైదిక మతంలోని యజ్ఞయాగాదులను, కర్మకాండలను, బలులను, మూఢాచారాలను జైన, బౌద్ద మతాలు వ్యతిరేకించాయి.

(2) ఈ రెండు మతములు అహింసా, సత్యము, భూతదయ, మొదలగు అంశములను మానవుడు పాటించుట ద్వారా ఆత్మసంస్కారం, జ్ఞాన సముపార్జన, జీవకారుణ్యం సాధించి మోక్షము పొందునని తెలియజేసెను.

(3) ఈ రెండు మతాలు సమాజంలోని కుల వర్గాలను నిరసించాయి. సమానత సిద్ధాంతాన్ని విశ్వసించాయి. వీరి కృషి వలన వర్ణ వ్యవస్థలో కొంత సడలింపు వచ్చింది.

(4) రెండునూ వేదములు ప్రమాణ గ్రంథములు కావని, ప్రజల భాషలో రెండు మతాల వారు బోధనలు చేసారు. ఫలితంగా సంస్కృత భాష ప్రాధాన్యతను కోల్పోవడం ప్రారంభించింది.

(5) రెండు మతాలు సమాజంలోని బ్రాహ్మణుల యొక్క ఆధిక్యతను వ్యతిరేకించాయి.

(6) ఉపనిషత్తులలోని కర్మ, పునర్జన్మ, మోక్ష సిద్దాంతములను రెండు మతాలు అంగీకరించినవి. ఈ జన్మలో చేసిన పాప పుణ్యాలపై మానవుని పునర్జన్మ ఆధారపడి ఉండునని చెప్పినవి.

(7) వర్ధమాన మహావీరుడు, గౌతమ బుద్దుడు ఇద్దరూ క్షత్రియులే. సుఖ సంతోషాలును, రాజ భోగాలును విడిచి,

సన్యాసులై, జ్ఞానులై నూతనత్వాన్ని ప్రజలకు బోధించాడు.

(8) రెండు మతములకు దేవునిపై విశ్వాసం లేదు. కనుక కపటముతో, వ్యయ ప్రయాసలతో కూడిన పూజా పునస్కారములు వీరిలో లేవు.

(9) రెండూ ఉత్తర భారతదేశంలో ఆవిర్భవించాయి. రెండు మతాలలో కాలక్రమములో చీలికలు ఏర్పడ్డాయి.

నాటి ఆధ్యాత్మిక రంగంలో నెలకొని ఉన్న అశాంతిని తొలగించి సామాన్య మానవునికి తరుణోపాయం చూపడం ఈ రెండు మతాలు ఉద్దేశ్యం. మోక్షం పొందడానికి కుల, మత వ్యత్యాసం లేదని అందరూ మోక్షం పొందపొందడానికి అర్హులేనని రెండు మతాలు చెప్పాయి.

## జైన, బౌద్ద మతాల మధ్య విబేధాలు :-

(1) జైన మతం ప్రతీ ప్రాణికే గాక, ప్రతి జడ పదార్ధమునకు కూడా ఆత్మ కలదని విశ్వసించెను. ఆత్మను గురించి బుద్ధునికి అభిప్రాయం లేదు. అతని అభిప్రాయం ప్రకారం ఆత్మ, కోరికల సమిష్టి రూపం.

(2) జైన మతంలో శ్వేతాంబర శాఖ వారు తెల్లని వస్త్రంలను ధరించిరి. దిగంబరులు నగ్నముగా ఉండెడివారు. కఠోరమైన అహింసా వ్రతం, ముక్కుపై గుడ్డ వేసుకొని గాలి పీల్చుట, దీపములు వెలిగింపగకుండుట ఇందులో కలవు. ఇలాంటి కఠోర నియమాలు బౌద్ద మతంలో లేవు.

(3) బౌద్ధులు అహింసా సిద్ధాంతాన్ని జైనుల వలె ఆచరించలేదు. జైన అహింసా సిదాంథతం కఠోరమైన ఆచరణోగ్యము కానిది.

(4) జైన మతములో తీవ్ర ఉపవాసాలు, సల్లేఖనం వంటి కఠిన నియమాలుండేవి. వీటి వలన మోక్షం పొందవచ్చు. కాని బౌద్ద మతంలో అతిభోగములకు, వ్రతకాఠిన్యములకు చెందని "మధ్యేమార్గం" లేక "అష్టాంగ మార్గం" ద్వారా మోక్షం పొందవచ్చని చెప్పారు.

(5) జైన సంఘం బలహీనముగా ఉండేది. వ్యవస్థాపరమైన విధానం లోపించింది. బౌద్ద సంఘం చాలా బలమైనదిగా ఉండేది. ప్రచార సంఘాలు కూడా ఉండేవి. చక్కని వ్యవస్థలతో కూడుకున్నవి.

(6) జైన మతము వైదికమతంతో సన్నిహితంగా వ్యవహరించగా బౌద్దమతానికి, వైదికమతానికి మధ్య చాలా వ్యత్యాసాలున్నాయి.

(7) బౌద్ద మతానికి ఉన్నంత రాజాదరణ, పోషన, జైన మతానికి లేదు. అందువలన అది విదేశాలకు వ్యాపించలేదు. కాని స్వదేశంలో నిలిచింది. బౌద్ద మతానికి విశేష రాజాధరణ ఉన్నందున విధేశాలకు కూడా వ్యాపించింది. స్వదేశంలో అదృశ్యమై, విధేశాలకు విస్తరించి ప్రపంచ మతం అయినది.

(8) బౌద్ద సంఘమందు ఐహిక ప్రపంచం, భోగములను విసర్జించిన వారే సభ్యులు అగుటకు అర్హులు. జైన సంఘం నందు సంసార జీవితమును అనుభవించు వారు కూడా సభ్యులగుటకు అర్హులు.

**మగధ రాజ్య విజృంభన :-**

క్రీ॥పూ॥ ఆరవ శతాబ్ధిలో షోడశ మహజన పదములలో ఉన్న మగద క్రమంగా బలపడి, విజృంభించి, ఇతర రాజ్యములపై తన ఆధిపత్యం నెలకొల్పి మనదేశ చరిత్రలో ప్రధమ సువిశాల సామ్రాజ్యాన్ని రూపొందించింది. దీనికి భౌగోళిక పరిస్థితులు కొంత వరకు దోహద పడ్డాయి. శోన్, గండక్, గోగ్రా నదులు సహజ రక్షణ శ్రేణులై చక్కని రహదారులుగా కూడు ఉపకరించాయి. ఇంకా మగద రాజ్యము వాయువ్య భారతానికి చాలా దూరముగా ఉండటము చేత విదేశ దండయాత్రల ప్రమాదానికి కూడా దూరముగా ఉంది. ఇతిహాస కాలమున మగధను బార్హద్రద వంశము పాలించినది. జరాసంధుడు ఈ వంశీయుడే. రాజధానియైన గిరి వజ్రం లేదా రాజ గ్రహం చుట్టూ పర్వతాలు పెట్టని కోటవలె ఉన్నాయి. దీనికి గంగా, సోన్ నదుల కూడలి నుంచి జల దుర్గము వలె సురక్షితముగా ఉన్న పాటలీ పుత్రము రెండవ రాజధాని.

పురాణాలు, జైన బౌద్ద వాఙ్మయాలు నుంచి, గ్రీకు రచనలు మగద వంశానికి సంబందించిన చరిత్రలు తెలియజేస్తాయి. హర్యంక రాజైన బింబిసారుని కాలమునుండి మగధ అసలు చరిత్ర ప్రారంభమైనది. బార్హద్రద వంశములో చివరివాడైన రిపుంజెయుని తుద ముట్టించి హర్యంక వంశస్తుడైన బింబిసారుడు క్రీ॥పూ॥ 544లో మగధ సింహాసనాన్ని అధిష్టించెను.

**మగధ సామ్రాజ్య ఉన్నతి - పతనం :-**

బింబిసారుని నాయకత్వంలో మగధ సామ్రాజ్యంలో ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఇతడు హర్యంక వంశానికి చెందినవాడు. బుద్ధుని సమకాలికుడు. గిరి వ్రజం రాజధానిగా (క్రీ॥పూ॥ 544 - 493) సుమారు అర్ధ శతాబ్దం రాజ్యాన్ని పరిపాలించాడు. ఇతడు సామ్రాజ్య విస్తరణ కోసం అనేక యుద్దాలు చేసాడు. ఇతడు గొప్ప యోధుడు. రాజనీతి చతురుడు.

వివాహ సంబందాల ద్వారా కూడా రాజ్యాన్ని విస్తరించాడు. కోశల, లిచ్ఛవి, మద్ర, విదేహ రాజకన్యలను వివాహమాడి హర్యంకుల బలాన్ని, రాజ్యాన్ని విస్తరింప జేసాడు. ఇందులో మొదట ప్రసేన జిత్తు చెల్లెలు, కోసల రాకుమారిని వివాహమాడి కట్నంగా సాలీనా లక్ష సువర్ణాల ఆదాయాన్ని గల 'కాశీ' గ్రామాన్ని పొందాడు. ఈ వివాహంతో కోసల రాజ్యం మెత్తబడింది. వైశాలికి చెందిన లిచ్ఛలి రాజకుమారి చెల్లనను రెండవ భార్యగా వివాహమాడాడు. మూడవ భార్యగా పంజాబుకి చెందిన మద్ర తెగ నాయకుని కుమార్తెను వివాహమాడాడు. ఈ వివాహం అతని రాజకీయ ప్రతిష్టకు చాలా గొప్ప కారణమైనది. నాల్గవ భార్యగా విదేహ రాకుమార్తెన వాసవిని వివాహ మాడినాడు. ఈ వివాహ సంబంధముల ద్వారా బింబిసారుడు తన పలుకుబడిని పశ్చిమమున పంజాబు నుండి తూర్పున బెంగాలు వరకు విస్తరింప జేసెను.

అంగరాజైన బ్రహ్మదత్తుని ఓడించి ఆ రాజ్యాన్ని ఆక్రమించినాడు. తన కుమారుడైన అజాత శత్రువును అంగరాజ్య రాజధాని చంపా నగరంలో తన ప్రతినిధిగా నియమించాడు. మగదకు ప్రధాన శత్రువు ఉజ్జయినీ రాజధాని అయిన అవంతీ రాజ్యం ఆ దేశపు రాజైన చండ ప్రద్యోత మహాసేనుడు బింబిసారుని ఎదిరించినప్పటికి ఇద్దరు రజీ చేసుకున్నారు. గాంధార రాజు కూడా బింబిసారుని వద్దకు రాయబారిని, లేఖను పంపి సంధి చేసుకున్నాడు. ఇట్టి ఆక్రమణలతో బింబిసారుని రాజ్యము 80 వేల గ్రామములు గల రాజ్యముగా విస్తరించెను.

బింబిసారుడు జైనుడనే జైన గ్రంధాలు, బౌద్ధడనే బౌద్ధ గ్రంధాలు చెప్తున్నాయి. బింబిసారుడు బుద్ధని రెండుసార్లు తానే స్వయముగా కలిసినట్లు 'వేలువన విహారము' బౌద్ధ సంఘంనకు దానము చేసినట్లు బౌద్ధ గ్రంధములు చెప్పుచున్నవి.

## అజాత శత్రువు (క్రీ॥పూ॥ 493 - 462) :

బుద్ధ ద్వేషి,బుద్ధుని జ్ఞాతి అయిన దేవదత్తుని చేత ప్రేరేపికుడై అజాత శత్రువు తండ్రిని చంపి సింహాసనమును ఆక్రమించినాడని బౌద్ధ అనుశ్రతి చెప్పుచున్నది. అజాత శత్రువు 31 సం॥లు కాలము రాజ్యాన్ని పాలించాడు. ఇతని కాలంలో హర్యంక వంశం కీర్తి ప్రతిష్టలు అత్యున్నత స్థాయిని చేరెను. అనేక యుద్ధములు చేసి సామ్రాజ్యాన్ని విస్తరింప జేసాడు.

ప్రదమములో కోశల రాజ్యముతో పోరాటము జరిపెను. దీనికి ప్రధాన కారణము కోశల దేవి మరణానంతరము ప్రసేన జిత్తు కాశీ పట్టణమును తిరిగి ఆక్రమించెను. అజాత శత్రువు ప్రసేన జిత్తును ఓడించి అతని కుమార్తె అయిన వజీరాను వివాహమాడి కాశీ పట్టణము తిరిగి పొందెను. తూర్పు ప్రాంతంలోని గణరాజ్య సమితితో అజాత శత్రువు పోరాటం సల్పి విజయం సాధించాడు. ఈ సమితిలో 36 రాజ్యములుండేవట. వీటిలో ముఖ్యమైనది 'లిచ్ఛవి' రాజ్యం. అజాత శత్రువు గంగా, సోన్ నదుల మధ్య పాటలీ పుత్ర దుర్గాన్ని నిర్మించి దానిని సైనిక కేంద్రముగా చేసుకొనెను. మంత్రి యగు వత్స కారుని సాయముతో వైశాలి కోటను విచ్ఛిన్నము చేసి లిచ్ఛవేల దర్పము అణచెను. బింబిసారుని వలె అజాత శత్రువు కూడా తన బలాన్ని వైవాహిక సంబందాల ద్వారా పెంపొందింప జేసారు. సింధు, సౌవీర,అవంతి, వత్స రాజకుమార్తెలను వివాహమాడినాడు.

బింబిసారుని వలె అజాత శత్రువు జైనుడని జైన గ్రంధములు, బుద్ధుడని బౌద్ధ గ్రంధములు చెప్పుచున్నవి. అజాత శత్రువు అంతఃపుర రాణులతో కలిపి సపరివారముగా మహావీరుని దర్శనము కోసం వెళ్ళేవాడు. అదే విధముగా బౌద్ధ మతం పట్ల అజాత శత్రువుకు ప్రత్యేక అభిమానం కలదు. తండ్రిని చంపినందుకు అజాత శత్రువు పశ్చాత్తాపం చెంది, క్షమింపవలసినదిగా బుద్ధుని కోరినట్లు బౌద్ధ గ్రంధాలు చెప్తున్నాయి. బుద్ధుని దర్శనం కోసం అజాత శత్రువు రాక బార్హుత్ (క్రీ॥పూ॥ 2వ శతాబ్దం) శిల్పాలతో చిత్రించబడింది. మొదటి బౌద్ధ సంగీతి రాజగ్రహమునందు అజాత శత్రువు కాలములో జరిగెను. పైగా బుద్ధుని ధాతువులు సంపాదించి వానిపై స్థూపములు రాజగ్రహము చుట్టూ నిర్మించినట్లు తెలియుచున్నది.

**ఉదయనుడు :-**

అజాత శత్రువు తరువాత వరుసగా నలుగురు రాజులు రాజ్యాన్ని పాలించిరి. బౌద్ధ అనుశ్రుతి ప్రకారం వీరందరూ పితృ హంతకులే. వీరిలో అజాత శత్రువు తరువాత ఉదయనుడు రాజైనాడు. పాట్నా వద్ద గంగా, సోన్ నదుల సంఘమ స్థానాలలో కోటను నిర్మించటం, రాజధానిని పాటలీ పుత్రమునకు మార్చడం జరిగింది. మగద సామ్రాజ్యం ఇతని కాలమున ఉత్తరమున హిమాలయము నుండి దక్షిణాన చోటా నాగపూర్ కొండలవరకు విస్తరించి యున్నది. ఉదయనుని తరువాత వరుసగా అనిరుద్ధుడు, ముండ రాజు, నాగాదాసకుడు మగద రాజ్యాన్ని పాలించిరి. చివరి రాజు నాగదాసకుడు పురాణాలలోని దర్శకుడు యితడే. బాణుని స్వప్న వాసవదత్తలోని ఉదయనునికి ఇతను సమకాలికుడు. ఈ నలుగురి రాజుల పరిపాలనతో విసిరి వేసారిన ప్రజలు మంత్రి శిశునాగుని రాజుగా ప్రకటించిరి.

**శైశు నాగ వంశము :**

శిశు నాగుడే శైశు వంశ స్థాపకుడు. ఇతడు రాజధానిని గిరి వ్రజానికి తరలించాడు. ఉజ్జయినీ రాజధానిగా ఉన్న అవంతి రాజ్యాన్ని ధ్వంశం చేయడము, ఇతడు సాధించిన ఘన కార్యం. అంతటితో మగధ - అవంతీ రాజ్యాల మధ్య వంద సం॥లు

కొనసాగిన వైరము ముగిసినది. అవంతీ పాలకుడైన ప్రద్యోతనుడుని ఇతడు నిర్మూలించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. ఇంకా కోశల, వత్స, రాజ్యంలను జయించి మగధలో విలీనం చేసినాడు. శిశు నాగుని తర్వాత అతని కుమారుడైన కాళశోకుడు రాజ్యమునకు వచ్చెను. ఇతని కాలంలో వైశాలి యందు'రెండవ బౌద్ధ సంగీతి'' జరిగెను. ఈ కాళశోకుని, అతని పది మంది కుమారులను మహా పద్మనందుడు వధించి మగధను ఆక్రమించి నందవంశము స్థాపించెను.

**నంద వంశము:-**

శిశునాగులు తరువాత నందులు మగదలో అధికారానికి వచ్చారు. మగదను పాలించిన అత్యంత బలమైన రాజులుగా వారిని పేర్కొనవచ్చు. మహా పద్మనందుడ్ని సూద్రుడని పురాణాలు, అజ్ఞాన కులజుడని బౌద్ధ గ్రంధాలు, హీనజాతి వాడని గ్రీకు రచనలు వర్ణిస్తున్నాయి నంద వంశ స్థాపకుడు మహా పద్మనందుడని పురాణాలు, ఉగ్రసేనుడని మహా బోధి వంశం పేర్కొంటున్నాయి. నందులు అసాధారణ సంపన్నులని, అసమాన్యమైన బలవంతులని, వీరిని రెండు లక్షల కాలభలం, 60 వేల అశ్వక దళం, 6 వేల ఏనుగులు కలవని తెలుస్తున్నది.

మహా పద్మనందుడు, పరశురాముని వలె ఈ భూమండలములోని క్షత్రియులందరినీ నిర్మూలించాడని పురాణాలు పేర్కొనుచున్నవి. పాంచాల, కురు, మిధిల, కళింగ, కాశీ, ఆశ్మిక, మొ॥లగు రాజ్యములు జయించి ఉత్తరమున సట్లెజ్ నది నుండి దక్షిణమున గోదావరి వరకు మగధ రాజ్యాన్ని విస్తరింప జేసెను. దక్షిణ భారతదేశంలోని ఖారవేలుని హతి గుంఫ శాసనము, కళింగను మహా పద్మనందుడు జయించినట్లు చెప్పుచున్నది. తాను ఇతర రాజులందర్నీ నిర్మూలించిన ''ఏకరాట్''అని ప్రకటించుకున్నాడు. మొదటి భారత సామ్రాజ్య నిర్మాతగా మహా పద్మనందుడు ప్రసిద్ధి కెక్కాడు.

మొత్తం నందరాజుల సంఖ్య 9. పురాణాలలో వీరు నందుడు, అతని ఎనమండుగురు కుమారులుగా చెప్పబడింది. బౌద్ధ గ్రంధాలలో నవ నందులు సోదరులని ఉంది. అయితే మహా పద్మనందుని తరువాత కడపటి నందరాజు కాలము వరకు నంద రాజుల చరిత్ర తెలియదు. కడపటి రాజు గ్రీకు రచయితలు చెప్పిన 'అగ్రిమిన్' అలెగ్జాండర్‌కు సమ కాలికుడు. ఇతడు ప్రబలుడై పాటలీపుత్రము రాజధానిగా బియాస్ నదికి అవతల గంగానదిని ప్రాశదేశానికి మధ్య గల ప్రాంతాన్ని ప్రజాకంటకముగా పాలించాడు. ధననందుని నిరంకుశ పాలన, చాణుక్యుని అవమానం, అధిక పన్నుల భారము ప్రజలలో తీవ్రమైన అంసంతృప్తి రేకెత్తింది. చంద్ర గుప్త మౌర్యుడు, చాణుక్యుని సహాయముతో ధననందుని ఓడించి మౌర్య సామ్రాజ్యమును స్థాపించెను. నందులు జైన మతాన్ని అభిమానించిరి.

# ఇరానియన్, మాసిడోనియన్ దండ యాత్రలు :-

భారత దేశంలోని ఈశాన్య భాగంలో చిన్న చిన్న సామంత రాజ్యాలు, స్వతంత్ర రాజ్యాలు మగధ సామ్రాజ్యంలో విలీనమైనాయి. వాయువ్య భారతదేశం విదేశ దండ యాత్రలకు గురి అయ్యెను. ఇందులో మొదటిది పారశీక దండయాత్ర. పర్షియా రాజైన కైరస్ (cyrus) బాహ్లిక, గాంధార రాజ్యములను జయించి ఆక్రమించెను.

మగధ రాజులలోని కాలములోనే తమ సామ్రాజ్యాన్ని విస్తరింప జేసిన ఇరాన్‌కు చెందిన అకిమేనియన్ రాజులు వాయువ్య భారతదేశంలోని రాజకీయ అనైక్యతను అవకాశంగా తీసుకున్నారు. క్రీ.పూ. 516లో ఇరాన్ రాజు మొదటి డేరియస్ సైలాక్సు అను గ్రీకు సేనాని నాయకత్వములో సైన్యాన్ని భారతదేశమునకు పంపెను. ఇతను వాయువ్య ప్రాంతంలోనికి ప్రవేశించి పంజాబ్‌ను, సింధూ నది పశ్చిమ ప్రాంతాన్ని, సింధును ఆక్రమించుకున్నాడు. ఆ ప్రాంతాన్ని 29వ శత్రపి (రాష్ట్రం) రాష్ట్రంగా చేసుకొనెను. ఈ విధముగా పారశీక సామ్రాజ్యములో సింధు అంతర్భాగమై ఏటా కొన్ని మనుగుల బంగారం (360 టాలెంట్లు) కప్పముగా చెల్లించెడిదట. ఆసియా ప్రాంతాల నుంచి ఇరానియన్ సామ్రాజ్యానికి లాభముగా ఆదాయములో ఇది మూడో భాగముగా ఉండేది. పారశీకులు సింధు ప్రజలను సైన్యములో చేర్చుకుని వారిని విదేశ యుద్ధములందు వాడుకొనిరి. డేరియస్ తరువాత ఇరాన్ సామ్రాజ్యానికి చక్రవర్తియైన జెక్సిస్. గ్రీకులతో జరిగిన యుద్దములో భారత సైనికులును ఉపయోగించాడు. సింధు ప్రాంతర అలెగ్జాండరు దండయాత్ర వరకు ఇరానియన్ సామ్రాజ్యములో భాగముగా ఉండెను.

భారత, ఇరాన్‌ల మధ్య సంబంధాలు రెండు సం॥లు కొనసాగినవి. ధీని ఫలితంగా వ్యాపార సంబంధాలు ప్రారంభమయినాయి. సంస్కృతి జీవన విధానముపై ఎక్కువ ప్రభావాన్ని చూపాయి. ఇరానియన్ లేఖికులు కరోష్టి అను లిపిని భరతదేశమున ప్రవేశపెట్టిరి మధ్య ఆసియా రాజ్యములకు, గ్రీసు మొ॥ పాశ్చాత్యరాజ్యములకు, భారతదేశమునకు మధ్య వర్తక సంబంధములేర్పడెను. పారశీకులు కప్పము రూపమున అపార ధనరాశులను, సిరిసంపదలను, మన దేశమునుండి తీసుకు వెళ్లాయి. సత్రపి యను పారశీక పదమును రాష్ట్రములకు వాడుట ఆచరామైనది. కొన్ని పారశీక ఆచార సాంప్రదాయాలను మౌర్యులు అనుసరించిరి. ఉదాహరణకు మంత్రివర్గ సమావేశములకు ఆరంభమున అఖండ జ్యోతిని వెలిగించుట, మొ॥ భారతీయులు పారశిక వాస్తు శిల్ప శాస్త్రములను అనుసరించిరి. అశోకుని శాసనాలలో ఉన్న ఉపోధ్ఘాతాలలోనూ, వాటిలో ఉపయోగించిన కొన్ని పదాలలోను

ఇరానియన్ ప్రభావం కనిపిస్తుంది.

## అలెగ్జాండర్ దండయాత్రలు - ఫలితాలు:

చరిత్రలో విశ్వవిజేతగా పేరుగాంచిన వ్యక్తి అలెగ్జాండరు. గ్రీకు తత్వవేత్తయగు అరిస్టాటిల్ శిష్యుడు. క్రీ.పూ. 4 వ శతాబ్దంలో గ్రీకులు, ఇరానియన్‌లు ప్రపంచాధిపత్యం కోసం పోరాడుకున్నారు. మాసిడోనియాకు చెందిన అలెగ్జాండరు నాయకత్యంలో గ్రీకులు చిట్టచివరకు ఇరానియన్ సామ్రాజ్యాన్ని ధ్వంశం చేసారు. అలెగ్జండర్ తన తండ్రి ఫిలిఫ్ మరణానంతరం తన 20 వ యేట క్రీ.పూ. 330లో మాసిడోనియా సింహాసనం అధిష్టించి, గ్రీకు, పర్షియా, ఆసియా మైనర్, ఈజిప్టులను జయించెను. క్రీ.పూ. 330లో పారశీక రాజ్యముపై దండెత్తి 3వ డేరియస్‌ను అర్బేలా (Arbella) యుద్ధంలో ఓడించి అతని రాజధానియైన పెర్సిపోలిస్‌ను దగ్ధమార్చెను. ప్రపంచ విజేత కావాలన్న కోరికతో తన దండయాత్రలను తూర్పు, ఈశాన్య ప్రాంతాలకు విస్తరించే క్రమములో కాందహార్, అలెగ్జాండ్రియా, కొరటాన్ ప్రాంతాలను జయించినాడు.

భారతదేశంలోని అశేషధనసంపద ఆకర్షించడం వలన భాంతదేశాన్ని జయింప నిశ్చయించుకున్నాడు. ఇరాన్ నుంచి భారతదేశం మీదకు తన సైన్యాన్ని నడిపించాడు. ఇంకా చరిత్రపిత హెరిడోటస్, ఇతర గ్రీకు రచయితలు భారతదేశాన్ని అద్భుత దేశంగా చిత్రించారు. ఈ వర్ణనలు అలెగ్జాండర్ భారతదేశం మీదకు దండెత్తిరావడానికి ప్రోత్సహించాయి. భారతదేశంపై అలెగ్జాండర్ చేసిన దండయాత్రల వివరాలను తెలుసుకోవడానికి ముఖ్యమైన ఆదారాలు గ్రీకు రచనలు. అవి స్ట్రాబో (STRABA), ఎరియన్ (ARRIAN), ప్లూటార్చ్ ((PLUTARCH) కర్టియస్ ((CURTAUS) ఎరియన్ 'అణాబేషిస్ ఆఫ్ అలెగ్జాండర్' (ANABASIS OFF ALEXANDER) అనే తన గ్రంధములో భారతదేశముపై అలెగ్జాండరు చేసిన దండయాత్ర ఎంతో గొప్పగా వర్ణించాడు. నియర్‌బిస్ కూడా అలెగ్జాండరు దండయాత్ర గురించి వ్రాసాడు. ఒనిసిక్రిటస్ (ONESICRITUS) తన రచనలో అలెగ్జాండరు జీవిత చరిత్రను వర్ణిచాడు, అంతేగాక అలెగ్జాండరుతో భారతదేశానికి వచ్చిన శాస్త్రవేత్తలు, సైనికాధికారులు తమ రచనలలో అలెగ్జాండరు చేసిన ప్రతి యుద్ధం గురించి వివరించారు.

వాయువ్య భారతదేశంలోని రాజకీయ పరిస్థితి అలెగ్జాండరు ప్రణాళికకు అనుకూలంగా ఉంది. ఆ ప్రాంతాన్ని చిన్న గణ తంత్ర రాజ్యాలుగా, గిరిజన రాజ్యాలుగా విభజింపబడి ఉన్నాయి. వారికి ఆ ప్రాంతాలమీద, రాజ్యలమీద అపారమైన భక్తి ఉంది. పరస్పర కలహములుండుట వలన రాజకీయ అనైక్యత ప్రబలెను. ఆ ప్రాంతాలలో ఇద్దరు ప్రసిద్ధరాజులు గలరు. వారు తక్షశిల రాజైన అంబి, జీలం-చీనాబ్ నదుల మధ్య ఉన్న ప్రాంతానికి రాజైన పోరస్. వీరిద్దరు ఏకమై ఉంటే అలెగ్జాండరును నిరోధించగలిగేవారు. కాని వీరు కలిసి ఉండలేదు. ఇంకా దక్షిణ పంజాబ్‌లో శిబి, మాళవ, క్షుద్రక, అంబస్త మొ॥ రాజ్యములుండేవి. ఇవి నిరంతరము కలహించుకుంటూ ఉండేవి. పై కారణాల వలన వీరు సరిహద్దు రచన పట్ల అజాగ్రత్త వహించడం జరిగింది. ఫలితంగా విదేశ దండయాత్రను ఎదుర్కోవలసి వచ్చెను. తక్షశిల, పౌరవరాజ్యాల మధ్య ఎప్పుడు బద్దవైరం ఉండేది.

క్రీ.పూ. 327 మే లో అలెగ్జాండరు హిందూకుష్ పర్వతాలు దాటి ప్రకృతి పరముగా ఏర్పడిన ఖైబర్, బోలన్ కనుమల గుండా భారతదేశంలో ప్రవేశించెను. ఇతను భారతదేశములో ప్రవేశించే ముందు బెలూచిస్థాన్, ఖైబర్ కనుమల దారిలో కొండజాతులు, ఆటవిక జాతులకు సంబందించిన స్వాట్, బుజేరి తెగలతో పోరాడి వారిని అణిచివేసెను.

బెలూచిస్థాన్‌లోని స్వాట్, బుజేరి కొండజాతులను అణచిన అలెగ్జాండరు తన సైన్యాన్ని రెండు భాగాలుగా విభజించి, కొంత భాగమును హిఫిస్టియన్ (HAPHAESTIAN), పెర్టికాన్ (PERDICIS) సేనాధిపతుల నాయకత్వములో కాబూల్‌నది, దక్షణతీరాన కైబర్ కనుమల గుండా సింధూనది వరకు పోయి పెషవర్ మైదానం చేరే ఏర్పాట్లు చేయమని ఆదేశించాడు. ఆ విధంగా ఆ సైన్యం శశిగుప్తుడనే దేశద్రోహి సాయంతో పుష్కలావతిని ఆక్రమించి సింధూనదిని చేరింది.

రెండవ భాగమునకు అలెగ్జాండర్ తాను నాయకత్వం వహించి హిందూకుష్ పర్వతములమీదుగా కూనార్, సంజికారా, స్వాట్ లోయలను ఆక్రమించి కొండజాతివారగు అస్సాసియో (ASSASSIO), అస్సఖినాయ్ (ASSAKENOI) ల ఓడించెను. ఈ ప్రాంతానికి నికోబార్‌ను పాలకునిగా నియమించి అక్కడనుండి సిధూనది ప్రాంతంలో తెపాయిసన్, ఫెర్డికాన్ నాయకత్వంలోని సైన్యాతన్ని చేరాడు, ఈ వార్త విన్నంతనే తక్షిశిల అంబి, అభిషార రాజ్యాధినేతలు అలెగ్జాండరుకు కానుకలు అర్పించి దాసోహమనిరి. అంతేగాక అంబిక గ్రీకు సైన్యానికి తన రాజ్యంలో కొంత కాలం విశ్రాంతి కల్పించాడు. పౌరవరాజ్యపాలకుడైన పురుషోత్తమునిపై దండయాత్రకు అంబి అలెగ్జాండరుకు సైనిక సహాయం చేయడానికి సమ్మతించాడు. ఈ విషయం తెలుసుకున్న పురుషోత్తముడు తన రాజ్యాన్ని కాపాడుకోవడానికి అలెగ్జాండరును ఎదిరించడానికి నిశ్చయించాడు.

## జీలం యుద్ధం-లేక హైడాస్పస్ యుద్ధం (క్రీ.పూ, 326):

జీలం నది ఉబయ పాశ్వాలలో గ్రీకు, హిందూ సైన్యాలు యుద్ధ సన్నాహాలు ప్రారంబించాయి. అందులో జీలంనదికి

తూర్పున పురుషోత్తముడు 30 వేల కాల్బలం, 40 వేల అశ్వకదళం, 300 రథాలు, 200 ఏనుగులతో యుద్ధానికి సన్నద్ధమైనాడు. జీలంనదికి ఆవలఉన్న అలెగ్జాండర్ తన సైన్యంతో నదికి దాటే ప్రయత్నం చేసాడు. జీలం నది వరదలతో ఉండటంవలన అలెగ్జాండర్ ఒక అర్ధరాత్రివేళ 16మైళ్ళ యెగువకు వెళ్ళి జీలం నదిని దాటి వెనుక నుండి పురుషోత్తమునిపై అకస్మాత్తుగా దాడి చేసాడు. పురుషోత్తముడు తన సైన్యముతో గ్రీకు సైనికులతో వీరోచితముగా పోరాడాడు. చివరకు అలెగ్జాండర్ పోరస్‌ను ఓడించి బందీ చేసెను. కానీ అలెగ్జాండర్ అతని ధైర్య సాహసాలను చూసి ఎంతో మెచ్చుకొని అతని రాజ్యాన్ని అతనికి తిరిగి ఇచ్చివేసాడు. తరువాత రావి, చీనాబ్ నదిని దాటి అలెగ్జాండర్ పురుషోత్తముని బంధువుకు చిన పురుషోత్తముని లోబరుచుకొనెను.

చీనాబ్ నుండి బియాస్ నదీ తీరమునకు చేరుకొని మార్గమధ్యమున కథుల నోడించి వారి ముఖ్య పట్టణమగు సంగాలను నాశనము చేసెను. బియాస్ నది తూర్పు భాగమున అపారమైన సైనిక బలము ఉన్న బలమైన నంద రాజ్యము గురించి విన్న గ్రీకు సైనికులు ముందుకు పోవడానికి నిరాకరించారు. అంతే గాక విపరీతమైన వర్షాలు కారణంగా పొంగి ప్రవహిస్తున్న నదులను చూసి గ్రీకు సైనికులు ముందుకు పోవడానికి నిరాకరించినట్లు తెలుస్తుంది. అదియును గాక యుద్ధ అలసట, స్వదేశమునకు పోయి భార్యా బిడ్డలను చూసుకుపోవాలనే తపన వారిని ముందు సాగనివ్వలేదని చరిత్ర కారుల అభిప్రాయము.

అలెగ్జాండరు తన సైనికులకు తలవంచి స్వదేశానికి పయణం కట్టాడు. తిరుగు ప్రయాణంలో జీలం, చీనాబ్ నదుల సంగమ స్థానమునగల మల్ల, శిబి, క్షుద్రక జాతుల నాయకత్వంలో గణ రాజ్యాల కూటమి అలెగ్జాండరుతో తలపడి ఓడిపోయినది. అలోగ్జాండరు సైన్యంలోని ఎక్కువ భాగం బోలన్ కనుమల ద్వారా స్వదేశానికి తిరిగిపోగా మరి కొంత సైన్యం సింధూ నది దిగువన కరాచీ ప్రాంతానికి చేరి అరేబియా సముద్రం మీదుగా నౌకలలో తిరిగి వెళ్ళారు. భూ మార్గం గుండా అలెగ్జాండరు క్రీ.పూ. 324లో స్వదేశానికి బయలుదేరి సుసా పట్టణం మీదుగా బాబిలోన్ చేరి క్రీ.పూ 323లో మరణించెను.

**ఫలితాలు:-**

అలెగ్జాండరు దండయాత్రను అపూర్వ చరిత్రగా గ్రీకు చరిత్రకారుల పేర్కొనిరి. కాని భారతీయ చరిత్రకారులు దానిని త్రోసి పుచ్చిరి. అలెగ్జాండరు సరిహద్దు ప్రాంతాలలోని చిన్న చిన్న రాజ్యాలను మాత్రమే జయించెను. బలమైన సైనిక సంపత్తి కలిగిన మగధ లాంటి పెద్ద రాజ్యాలతో తలపడ లేదు. కాబట్టి అతని విజయాన్ని గ్రీకు, భారతీయ సైనికుల బలాబలాలకు నిదర్శనం అనలేము.

(1) అలెగ్జాండరు భారతదేశంలో తాను జయించిన భూప్రాంతాన్ని ఐదు రాష్ట్రాలుగా విభజించి తనకు విశ్వాస పాత్రులు, గ్రీకు దేశం నుండి తనతో వచ్చిన సెల్యూకస్, నికోనార్ మొ॥ వారిని తన ప్రతినిధులుగా నియమించెను.

(2) గ్రీకుదండ యాత్రతో పశ్చిమోత్తరమున ఉన్న రాజ్యములు బలహీనపడినవి. ఫలితముగా చంద్ర గుప్త మౌర్యునిచే సులభంగా జయించబడి సువిశాల సామ్రాజ్యం ఏర్పాటుకు దోహదం చేసెను.

(3) భారతదేశానికి పశ్చిమాసియా, ఐరోపా దేశములతో రహదారులు, సాంస్కృతిక సంబంధములు ఏర్పడినవి.

(4) భారతదేశములో వాడుకలో ఉండి నిర్దిష్టమైన ఆకారం లేని పంచ్ మార్క్ నాణెము గ్రీకు దండయాత్రల మూలంగా ఏర్పడిన అభివృద్ధి క్రమములో ఒక నిర్దిష్టమైన ఆకారాన్ని రూపొందించుకున్నది.

(5) గ్రీకు వలసవాదులు వాణిజ్య పంటలును రష్యాలోని తురుకిస్థాన్ నుండి భారతదేశానికి వ్యాపింపచేశారు.

(6) భారతదేశ ఉపనిషత్తుల, ఆధ్యాత్మిక చింతన గ్రీకులను ముగ్దులను చేసెను. గ్రీకుల ఖగోళ శాస్త్రలలో, యుద్ధ రీతులుభారతీయులను ఆకర్షించినవి.

7. అన్నింటి కంటే ప్రధానమైన అంశం శిల్పనిర్మాణ రీతిలో భారతీయ, గ్రీకుల లక్షణాల సమ్మేళనం జరిగింది. దీనిని కనిష్కుని కాలంలో గాంధార శిల్పమని వ్యవహరించిరి.

(8) భారతదేశమునకు సంబంధించిన అంశములను గురించి గ్రీకులు వ్రాసిన విషయాలు ఆనాటి చరిత్ర పునర్నిర్మాణమునకు ఉపయోగపడుచున్నవి.

(9) అలెగ్జాండర్ దండయాత్రతో భారతదేశానికి కాబూల్, బెలూచిస్థాన్, గెడ్రోషియా భూ మార్గాల ద్వారా వాణిజ్య సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ భూమార్గాలే గాక మక్రాన్ నది ద్వారా సముద్ర మార్గం కూడా ఏర్పడినది. వ్యాపార బృందాలు, ఓడలు, మధ్యదరా సముద్ర ప్రాంతానికి, మధ్య ఆఫ్రికాకు, అరేబియాకు, సుగంధ ద్రవ్యాలు, అత్తరులు, మందులు, దంతాలు, ఆభరణాలు మొ॥ వస్తువుల్ని భారతదేశం నుంచి సరఫరా చేసినవి.

(10) గ్రీకు దండ యాత్రల వలన శాశ్వత రాజకీయ ఫలితాలు లేకపోయినా సాంస్కృతికంగా గ్రీకు, భారతదేశాలు సన్నిహిత మయ్యాయి.

పాఠం - 6

# క్రీస్తు పూర్వము ఆరవ శతాబ్దము రాజకీయ పరిస్థితులు - మగధ రాజ్య విజృంభణ

## 6.0 లక్ష్యం :

క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో జరిగిన రాజకీయ పరిణామాలు పదహారు జనపధాలు, మగధరాజ్య విజృంభణ మొదలగు అంశాలను విశదీకరించడమే ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం

## విషయక్రమం :


6.1 ఉపోద్ఘాతం

6.2 రాజకీయ పరిస్థితులు

6.3 పరిపాలనా విధానము

6.4 మగధ రాజ్య విజృంభణ

6.5 సారాంశము


## 6.1 ఉపోద్ఘాతము :

క్రీ॥ పూ॥ ఆరో శతాబ్దం ప్రపంచ చరిత్రలో గొప్ప విశిష్టత కలిగివుంది. ఈ శతాబ్దిలో జనించిన నూతన ఆధ్యాత్మిక, సాంఘిక, రాజకీయ వాదులు నాటి ప్రపంచమునే పునాదులతో కదల్చివేశారు. మత విలువలపైన, ఆచార వ్యవహారములపైన, వ్యవస్థపైన, విశ్వాసాలపైన, తీవ్రమయిన అసంతృప్తి వ్యక్తమయింది. అలాంటిపరిస్థితులలో ఐహిక సుఖాలపై క్రొత్త ఆలోచనలు బయలుదేరి సమాజములో ఉన్న నాటి మూఢ విశ్వాసాలపై, ఆచార సాంప్రదాయాలపై తిరుగుబాటుచేసిరి. నూతన విలువలకోసం అన్వేషణ ప్రారంభమయ్యెను. సమాజంలో తలెత్తిన ఆధ్యాత్మిక అశాంతిని, అసంతృప్తిని రూపుమాపి నూతన తాత్విక విచారం కోసం ఎందరో మహనీయులు గణనీయమైన కృషి చేశారు.

ఈ శతాబ్దంనందే చైనాలో లాత్స్ (LAO-TSE), కన్‌ఫ్యూషియస్ (CONFUCIOUS) వేదాంత బోధనలు చేసి జీవితాశయమేమిటో ప్రజలకు తెలిపారు. గ్రీకు ద్వీపాలైన అమోనియాలో హెరాక్లిటస్ (Hearaclitus) నూతన సిద్ధాంతాలను ప్రబోధించెను. సాంఘిక, మత విషయాలలో చైతన్యం కలిగించడానికి పిరమైడ్స్ (Permaids), ఎంపెడోక్లిస్ (Empedocles) కృషి చేశారు. పాలస్తీనా యందలి యూదులు సైతం ఆధ్యాత్మిక ప్రభావమునకు గురియైరి. గ్రీస్‌లో సోక్రటీస్ విప్లవాత్మకమైన సంస్కరణలను ప్రభోదించాడు. పర్షియా (ఇరాన్) లో నాటి మతమూఢవిశ్వాసాలను జోరోస్టర్ (Zoroaster)నిశితంగా విమర్శించాడు. అతని బోదనలే జోరోస్ట్రియన్ మతంగా ప్రచారము అయింది. భారతదేశంలో మహావీరుడు, బుద్ధుడు, జన్మించి తమ హేతువాద, సామాజిక దృక్పధములో చిరకాలముగా వచ్చు మూఢ విశ్వాసములను, ఆచార సాంప్రదాయములను దుయ్యబట్టి నూతన భావోద్యములను ప్రారంభించిరి. ఆధునిక యాగారంభమున ఐరోపా చరిత్రలో వచ్చిన ప్రొటస్టెంటు ఉద్యమము వలె, బౌద్ధ,జైన మతములు వైదిక మతమున జనించినవి.

**6.2 రాజకీయ పరిస్థితులు :-** రాజకీయ అనైక్యత, ఆధ్యాత్మిక అశాంతి, సాంఘిక విభేదములు క్రీ॥ పూ॥ ఆరవ శతాబ్దం నాటి ముఖ్య లక్షణములు. భారతదేశంలో క్రీ॥పూ॥ ఆరో శతాబ్దం రాజకీయ అనైక్యతకు, షోడశ మహజన పదాలకు ప్రసిద్ధి వహించింది. ఉత్తర భారతదేశంలో 16 మహాజన పదాలు ఉన్నట్లు తెలుస్తుంది. అందులో 14 రాచరిక వ్యవస్థ ఉన్న జనపదాలు, రెండు (మల్ల, వత్స) గణతంత్ర వ్యవస్థ ఉన్న జనపదాలు.

**6.2.1 మహాజన పదాలు:**

**6.2.2 అంగరాజ్యం:-** నేటి బీహార్‌లోని భాగల్ పూర్, మాంఘీర జిల్లాలలో కూడుకున్నది అంగరాజ్యం. దీని రాజధానియైన చంపానగరం గంగా- చంపానదుల కూడలి యందు నర్మించబడినది. ఇది ఒక గొప్ప వ్యాపార కేంద్రము. సిరిసంపదలతో తులతూగుటలో నాటి ప్రధాన నగరములలో ఒకటిగా పేరుగాంచినది. అంగ, మగధ రాజ్యములమధ్య నిరంతరము యుద్ధము జరుగుచుండెడిది. మగధ రాజైన బింబిసారుడు క్రీ॥పూ॥ ఆరవ శతాబ్దంలో అంగరాజ్యాన్ని జయించి, మగధ రాజ్యంలో విలీనం చేసెను.

**6.2.3 కాశీ:-** కాశీ రాజ్యం వరుణ, అశి నదుల సంగమ స్థానమున నిర్మింపబడినది. అందుచేతనే కాశ నగరం వారణాసిగా పేరు పొందింది. ఇది చాలా ఐశ్వర్యవంతమైన ప్రఖ్యాతి వహించిన రాజ్యం. ప్రాచీన విద్యాకేంద్రంగా ప్రసిద్ధి చెందింది. కోసల, అంగ, మగధ రాజ్యములలో కాశీ రాజ్యమునకు విరోదము కలదు. బుద్ధుని కాలమునాటికి కోసలాధిపతి కాశీరాజ్యమును జయించి ఆక్రమించెను.

**6.2.4 కోసల :-** ఇది ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య (oudh) ప్రాంతమునకు చెందినది. ఈ రాజ్యాన్ని సరయూనది రెండు భాగాలుగా విభజించింది. ఉత్తర కోసలకు శ్రావస్తి, దక్షిణ కోసలకు కుశావతి రాజధానులు. కోసలరాజైన మహాకోసలుడు కాశీరాజ్యమును జయించెను. అతని కుమారుడైన ప్రసేనజిత్తు మగధ రాజైన అజాతశత్రువుతో పోరాటము సల్పెను.

**6.2.5 మగధ :-** ఈనాటి బీహారులోని పాట్నా, గయ జిల్లాల ప్రాంతం. ఇది నాటి మహాజనపదములలో బలీయమైన రాజ్యం. గిరివ్రజపురం దీని రాజధాని. తరువాత రాజగృహం, తదనంతరం పాటలీపుత్రం రాజధానులుగా ఉన్నాయి. దీనికి రాజు హర్యంక వంశస్థుడైన బింబిసారుడు, గంగా-శోణ్ నదుల కూడలి యందే పాటలీ పుత్రం నిర్మించబడింది.

**6.2.6 ఛేది :-** D.R. భండార్కర్ అభిప్రాయం ప్రకారం నేటి బుందేవ్‌ఖండ్ ప్రాంతమే చేది రాజ్యము. దీని రాజధాని శుక్తిమతి. ఛేది వంశంలోని ఒక శాఖ కళింగ రాజ్యంలో రాజవంశాన్ని స్థాపించింది.

**6.2.7 వత్స :-** ఇది యమునా నదీ తీరాన ఉన్న రాజ్యం. మహాజన పదములలో ప్రసిద్ధమైనది, ఐశ్వర్యవంతమైనది. అలహాబాదుకు 38మైళ్ళ దూరముగల కౌశాంబి దీని రాజధాని. దీనికి ఉదయనుడు రాజు. ఇతడు బౌద్ధమతాన్ని స్వీకరించాడు. అవంతి రాజైన ప్రద్యోతనునకు, ఉదయనకు బద్ధ వైరము కలదు. ప్రద్యోతనుని కుమార్తెయైన వాసవదత్తను ఉదయనుడు వివాహమాడడం ద్వారా వారి వైరము మైత్రిగా మారెను. ఈ కథనే భాస మహాకవి " స్వప్న వాసవ దత్త" నాటకముగా రచించెను.

**6.2.8 కురు :-** ఇది నేటి ఢిల్లీ, మీరట్ జిల్లాల ప్రాంతము. దీని రాజధాని ఇంద్రప్రస్థము. ఇది మహాభారత యుద్ధ రంగ స్థలము.

**6.2.9 పాంచాల :-** ఇది నేటి ఉత్తరప్రదేశ్‌లోని బడాయున్, ఫరూకాబాద్ జిల్లాలతో కూడిన ప్రాంతము. గంగానది ఈ రాజ్యమును, ఉత్తర దక్షిణ భాగములుగా విభజించెను. ఉత్తర పాంచాలకు రాజధాని అహిచ్ఛత్రం, దక్షిణ పాంచాలకు కాంపిల్య రాజధాని. మొదట రాజరిక వ్యవస్థయున్ననూ క్రీ॥ పూ॥ ఆరవ శతాబ్దికి గణ రాజ్యమయ్యెను.

**6.2.10 మత్స్య :-** ఇది నేటి రాజస్థాన్‌లోని జయపూర్ ప్రాంతము. దీనికి రాజధాని విరాటనగరము.

**6.2.11 శూరసేన:-** ఇది ఢిల్లీ, ఆగ్రాల మధ్య యమునా నదిపైనున్న రాజ్యము. దీని రాజధాని మధుర. దీనికి రాజు అవంతీపుత్రుడు. యదు నాయకుడైన వాసుదేవకృష్ణుని ప్రియతమ నగరము ఈ మధురా నగరము. అవంతీపుత్రుడు బుద్ధుని ప్రధమ శిష్య గణంలోని వాడు. వృష్ణులు, అంధకులు తదితరులు ఒక సంఘంగా రూపొందారు.

**6.2.12 అశ్మక :-** ఇది దక్షిణాపథంలో ఉన్న రాజ్యం. అశ్మక రాజ్యానికి, ములక రాజ్యానికి మధ్య గోదావరి నది ప్రవహిస్తున్నది. దీని రాజధాని బోధన. నేటి నిజామబాద్‌లోని బోధన పట్టణమే నాటి పూతన. బుద్ధుని కాలములో దీనిని సుజాతకుడను రాజు పాలించుచుండెను. "సుత్తనిపాత వ్యాఖ్యానం" ననుసరించి ఈ రెండు ప్రాంతాలు అంధకుల లేదా ఆంధ్రుల భూభాగాలుగా పేర్కొనడం జరిగింది.

**6.2.13 అవంతి :-** నేటి మధ్యప్రదేశ్‌లోని మాళ్వాప్రాంతం. వేత్రవతి నది ఈ రాజ్యాన్ని ఉత్తర, దక్షిణాలుగా విభజించింది. దీనికి మొదట మహిష్మతి, తదుపరి ఉజ్జయినీ రాజధానులు. అవంతి రాజ్యము కొరకు మగధ, కోసలాధీశుల రాజ్యములకు మధ్య దీర్ఘ పోరాటము జరిగెను. బుద్ధుని కాలంలో ఉజ్జయిని రాజధాని. రాజు చండప్రద్యోతనుడు. అవంతి ఒక ముఖ్యమైన బౌద్ధ కేంద్రం.

**6.2.14 గాంధార :-** ఈనాటి పాకిస్థాన్‌లోని రావల్పిండి, పెషావర్ జిల్లాలలో కూడిన ప్రాంతం. దీని రాజధాని తక్షశిల. ఇది ప్రాచీన వర్తక,విద్యా కేంద్రంగా ప్రసిద్ధి పొందింది. గాంధార రాజైన పుష్కరశరి మగధ రాజైన బింబిసారుడు సమకాలికులు.

**6.2.15 కాంభోజ :-** భారత దేశంలో వాయువ్య సరిహద్దు రాష్ట్రంలోని హజరా జిల్లా ప్రాంతము. దీనికి రాజధాని రాజపురము.

**6.2.16 వజ్జి గణ రాజ్య సమాఖ్య:-** వజ్జీ ఎనిమిది తెగలున్న గణ రాజ్యముల సమాఖ్య. వీటిలో విదేహ, లిచ్ఛవి, జ్ఞాత్రిక, వజ్జి తెగలు ముఖ్యమైనవి. దీనిలో ప్రతి తెగకు ప్రత్యేకమగ ఒక ప్రభుత్వము, ఒక రాజధాని కలదు. వీరందరిలోను లిచ్ఛవులు బల సంపన్నులు. రాజధాని వైశాలి, విదేహలకు రాజధాని మిధిలా నగరము. విదేహ రాజైన జనకుడు గొప్ప వేదాంతి. జ్ఞాత్రికుల రాజధాని కుండ్ర గ్రామము. కోసల, మల్ల రాజ్యాలతో స్నేహపూర్వకంగా వున్నారు. బద్ధ శత్రువు మగధ రాజ్యము. వర్ధమాన మహావీరుని తల్లి లిచ్ఛవీ రాకుమార్తె. వైశాలి ప్రభువైన చేతకరాజు తన కుమార్తెయైన చల్లనను బింబిసారునికిచ్చి వివాహము జరిపించెను.

**6.2.17 మల్ల గణ రాజ్య సమాఖ్య :-** తూర్పు దేశములోని ఒక బలమైన జాతి. ఇది కూడా ఎనిమిది లేక తొమ్మిది తెగలున్న గణతంత్ర సమాఖ్య. ఇది వైశాలకి ఉత్తరమున ఉన్నది. ఈ తెగలలో కుశి నగరము, పావా రాజధానులుగా ఉన్నవి. బలవంతమైనవి. బుద్ధుని నిర్యాణానంతరం మల్ల సమాఖ్య మగధలో కలిసిపోయెను.

ఈ షోడశ మహాజనపదాలు క్రీ॥ పూ॥ 550 నాటికి ఉన్నట్లు తెలుస్తుంది. ఈ రాజ్యాలు సార్వభౌమ్యాధిపత్యము కోసం నిరంతరం కలహయించు కుండా వుండేవి. ఇందులో మగద సామ్రాజ్యం విజృంభించి జనపదాలపై ఆధిపత్యము సాధించి సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించింది.

## 6.3 పరిపాలనా విధానము :

నాటి షోడశ మహాజనపదాలలో రాజరిక ప్రభుత్వం, గణ తంత్ర ప్రభుత్వాలు నెలకొని ఉన్నాయి. రాజరిక వ్యవస్థలో రాజరికం, సాధారణంగా వంశపారంపర్యం ఉండేది. రాజు సర్వోన్నతాధికారి. ఉన్నతమైన జీవితం అనుభవిస్తున్నప్పటికి ప్రజల క్షేమాన్ని కాంక్షించి పరిపాలన చేసేవాడు. పరిపాలన వ్యవస్థలో సహాయపడుటకు ఒక మంత్రి వర్గం ఉండేది. పురోహిత, సేనాధిపతి ముఖ్యులు. ఇంకనూ సర్వరధికులు, వ్యవహారికులు, సేనాధికారులు లాంటి ప్రభుత్వ ఉద్యోగులు వివిధ శాఖలను నిర్వహించెడివారు.

పరిపాలనా సౌలభ్యం కొరకు రాజ్యాన్ని రాష్ట్రములుగాను, ఆహారములుగను (ప్రదేశములుగను), గ్రామములుగాను విభజింపబడెను. గ్రామపాలన గ్రామభోజకులచే నిర్వహించబడేది. గ్రామంలో శాంతి భద్రతలను కాపాడటం, సంక్షేమ కార్యక్రమములు నిర్వహించుట, భూమిశిస్తు వసూలు చేయుట గ్రామ భోజకుని విధి.

గణతంత్ర వ్యవస్థలో రాజును గణ సభ ఎన్నుకొనేది. ఇందులో కుటుంబ పెద్దలు సభ్యులు. గణ సభ గణరాజ్యాధి నేతను ఎన్నుకొనుట, తరచుగా సమావేశమై రాజ్యసమస్యలను గురించి చర్చించి తగిన నిర్ణయాలను చేస్తూ ఉండేది. రాజే ప్రధాన న్యాయమూర్తి. రాజు ఆస్థానమే మహోన్నత న్యాయస్థానం. వివిధ స్థాయిలందు న్యాయస్థానములు కలవు. నాటి ఆచార సాంప్రదాయములే న్యాయ శాసనములు. ఈ జనపదాల మధ్య ఆధిపత్యం కోసం నిరంతరం సంఘర్షణలు జరుగుతూ ఉండేవి. అందువలన ప్రతి జనపదము చతురంగ బలములను పోషించెను.

**6.3.1 సాంఘిక పరిస్థితులు:-** మలి వేద కాలం నాటి కుటుంబ జీవనం దాదాపుగా ఈ కాలంలోనూ కొనసాగింది. సమిష్టి కుటుంబం నాటి ఆచారం. కుటుంబంలోని పెద్దవాడే గృహయజమాని. కుటుంబం బాధ్యత అంతా అతనిపై ఆధారపడి వుండేది. సామాన్య ప్రజల జీవన విధానము మామూలుగా ఉండేది. పట్టణాలు, నగరాలు తక్కువ. అంతఃపుర జీవితము చాలా బాగుండేది. రాజ భవనాలు విశాలంగాను అందంగాను ఉండేవి. బౌద్ధ గ్రంథాలు ఏడంతస్తుల భవనాలు ఉన్నట్లు తెలుపుతున్నాయి.

సంఘమున స్త్రీకి గౌరవము లేదు. సతీసహగమనము, బహు భార్య తత్వము, బాల్య వివాహాలు కలవు. పరదా విధనము అమలులో లేదు. స్త్రీకి ఆస్తి హక్కు లేదు. స్త్రీ అబలగా యెంచబడెను. బుద్ధుడే స్వయముగా స్త్రీలను బౌద్ధ సంఘాలలో చేర్చుకొనడానికి తొలుత నిరాకరించాడు. ఉన్నత వర్గాలకు చెందిన కొందరు స్త్రీలు మాత్రము విద్యాధికాకులు. సుప్రసిద్ధమైన నాటి మహిళ జయింతి, ఈమే మహావీరుని వోడించింది. ఖేమ (Khemn) ప్రసిద్దుడైన ప్రసేనజిత్ రాజును తన పాండిత్యంతో ఓడించింది.

సంఘమున వర్ణ వ్యవస్థ క్లిష్టతరమైనది. సహపంక్తి భోజనాలు అమలులో ఉండేవి. కులానికి సంఘంలో ప్రాధాన్యం హెచ్చింది. వర్ణాంతర వివాహములు రాచరిక, ఉన్నత వర్గాలలో కొంతవరకు ఉండేవి. క్షత్రియుల, బ్రాహ్మణుల ఆధిక్యం తగ్గి వైశ్యుల పరిస్థితి మెరుగు పడింది. దీనికి కారణం వారి ఐశ్వర్యమే. సూద్రుల పరిస్థితి చాలా దిగజారి పోయింది. వీరు పంచములుగా గ్రామముల వెలుపల నివసించెడి వారు. వీరి ముఖ్యవృత్తి వేట, చేపలు పట్టటము. వీరు చాలా హీనమైన జీవితము గడుపుతూ ఉండేవారు. నాటి ప్రజలు జీవహింసను పాపముగా పరిగణించి, గోవును పవిత్రముగా చూచెడి వారు.

ప్రజల జీవన విధానము సాధారణముగా ఉండేది. ప్రజలు. నూలు, పట్టు, ఉన్ని వస్త్రాలను ధరించేవారు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో, పండుగ సందర్భాలలో మత్తు పదార్థాలను సేవించేవారు. స్త్రీ, పురుషులిరువురు ఆభరణాలు ధరించేవారు. నృత్యం, గానం, కళామందిరాలు, ప్రజా వినోదాలు, రథం, గుఱ్ఱపు పందేలు ఉండేవి. వారణాసి, తక్షశిల, ఉన్నత విద్యాకేంద్రాలు, కళలు, శాస్త్రాలు, వ్యాకరణం తదితర విద్యలను విద్యార్థులు అభ్యసించేడి వారు.

**6.3.2 ఆర్థిక పరిస్థితులు:-** అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు గ్రామాలలో వ్యవసాయం, పశుపోషణ చేసేవారు. గ్రామం స్వయంపోషకమై విరాజిల్లినది. నాటి ముఖ్యమైన పంటలు వరి, బార్లీ, చెరకు, మొ॥ నవి. ఉత్పత్తిని బట్టి పంటలో 1/6 వంతు నుండి 1/12 వరకు పన్నుగా ప్రభుత్వమునకు చెల్లించెడివారు. ప్రతి గ్రామములో పశువుల మేతకై కొన్ని బీడు భూములను గ్రామభోజకుడు నిర్ణయించేవాడు. గ్రామికులు శ్రమించి జలాశయాలను, నీటిపారుదల కాల్వలను, రోడ్లను, కంచెలను నిర్మించుకునే వారు. ఇలాంటి కార్యక్రమాలలో స్త్రీలు కూడా పాల్గొనేవారు. గ్రామాలలో ప్రజల జీవితం నిరాడంబరంగా ఉండేది.

ఈ కాలంలో అనేక పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. వడ్రంగి, కమ్మర, కుమ్మరి తదితర వృత్తులవారు శ్రేణులుగా ఏర్పడి ఆర్థిక అభివృద్ధికి దోహదపడేవారు. ఇట్టి శ్రేణులు 18 ఉన్నట్లు బౌద్ధ జాతక కథలవల్ల తెలుస్తుంది. శ్రేణికి అధిపతి శ్రేష్ఠి దేశీయ, విదేశీయ వాణిజ్యములు విరివిగా సాగెను. అనేక పట్టణములు వాణిజ్య కేంద్రములుగా వెలిసినవి. రాజగృహ, నలంద, కౌశాంబి, శ్రావస్తి, మధుర, బెనారస్, తక్షశిల, పాటలీపుత్రము మున్నగు నగరములు నాటి ముఖ్య వాణిజ్య కేంద్రములు, ముఖ్యమైన వాణిజ్య, పారిశ్రామిక కేంద్రాలను కలుపుతూ మార్గాలు వేశారు. విదేశ వ్యాపారానికి పశ్చిమ తీరాన బరుకచ్చము, సోపార, తూర్పుతీరమున దంతపురం (కళింగ) నాటి

పెద్ద రేవు పట్టణములు. సిలోన్, బర్మా, మలయా, జావా, సుమత్రా, అరేబియా తదితర దేశాలతో వాణిజ్య సంబంధం ఉండేది. పట్టుబట్టలు, వెండి, బంగారం అభరణాలు. సుగంధ ద్రవ్యాలు, మందులు మొదలైన వాటితో విదేశీయ వ్యాపారము జరిగింది. వాణిజ్యమున వస్తు మార్పిడి విధానమంతరించి 'కార్షపణ' అను బంగారు నాణెము వాడుకలోనికి వచ్చింది భాగస్వామ్య వ్యాపార విధానము, వడ్డీ వ్యాపారము వాడుకలో నున్నవి.

**6.3.3 మతపరిస్థితులు :-** వైదిక మతమందలి లోపము వలన భారతీయ ఆధ్యాత్మిక రంగంలో తీవ్రమైన అశాంతి, సంచలనం కలిగింది. ఈ కాలంలో వర్గ వైషమ్యాలు ప్రజలలో బాగా చోటు చేసుకున్నాయి. ఇలాంటి సమయంలో కొన్ని నూతన మతములు బయలుదేరినవి. జైన, బౌద్ధమతములు తూర్పు ఇండియాలోనూ, దక్షిణాపథమునందు బాగుగా వ్యాపించినవి. శైవ, వైష్ణవ మతములు మధ్య, ఉత్తర ఇండియాలందు బహుళ ప్రచారములో నున్నవి. బ్రాహ్మణ, క్షత్రియల మధ్య ఆధిపత్యం కోసం చిరకాలంగా పోరాటం కొనసాగుతుంది. రాజ్యాధిపత్యంలో సహా, ఆధ్యాత్మిక రంగంలో కూడా బ్రాహ్మణుల ఆధిక్యత కోసం కృషి జరిగింది. అగ్రవర్ణాల అధికారాన్ని వైశ్య, శూద్ర వర్ణాలు తీవ్రంగా నిరసించాయి. ఇలాంటి సమయంలో జైన, బౌద్ధ మతాలు స్థాపన జరిగింది.

వైదిక మతంలో ఉన్న బ్రాహ్మణులు కర్మకాండలతో, ఆచారాలతో ప్రజలను ఇబ్బంది పెట్టినారు. సామాన్య మానవులకు ఇవి అందుబాటులో లేవు. ఎందువలనంటే యజ్ఞయాగాదులు చేయటం అధిక ధన వ్యయం ప్రయాసతో కూడుకొన్నవని ఇలాంటి కర్మకాండలమీద, యజ్ఞయాగాదుల మీద, అవి నిర్వహించే బ్రహ్మణుల ఆదిపత్యంపైన ఒక ఉద్యమం లేచింది. ఈ ఉద్యమము కుల వ్యత్యాసాలను నిరసించింది. విగ్రహారాధన ప్రచారములోనికి వచ్చెను. ఉపనిషత్తులు కూడా యజ్ఞయాగాదులను నిరసించాయి. ప్రజలకు నూతన చైతన్యాన్ని ప్రసాదించి సులభమైన మార్గాలద్వారా ప్రజలలో తాత్విక చింతన కలిగించి దీనికి అనేకమంది తాత్త్వికులు ఆధ్యాత్మిక రంగంలో ప్రవేశించారు. వీరిలో క్షత్రియులైన మహావీరుడు, గౌతమ బుద్దుడు ముఖ్యులు.

## 6.4 మగధ రాజ్య విజృంభన :-

క్రీ॥పూ॥ ఆరవ శతాబ్దిలో షోడశ మహాజనపదములలో మగధ క్రమంగా బలపడి, విజృంభించి, ఇతర రాజ్యములపై తన ఆధిపత్యం నెలకొల్పి మనదేశ చరిత్రలో ప్రథమ సువిశాల సామ్రాజ్యాన్ని రూపొందించింది. దీనికి భౌగోళిక పరిస్థితులు కొంత వరకు దోహద పడ్డాయి. శోన్, గండక్, గోగ్రా నదులు సహజ రక్షణ శ్రేనులై చక్కని రహదారులుగా కూడు ఉపకరించాయి. ఇంకా మగద రాజ్యము వాయువ్య భారతానికి చాలా దూరముగా ఉండటము చేత విదేశ దండయాత్రల ప్రమాదానికి కూడా దూరముగా ఉంది. ఇతిహాస కాలమున మగధను బార్హద్రథ వంశము పాలించినది. జరాసంధుడు ఈ వంశీయుడే. రాజధానియైన గిరి వజ్రం లేదా రాజ గృహం చుట్టూ పర్వతాలు పెట్టని కోటవలె ఉన్నాయి. దీనికి గంగా, సోన్ నదుల కూడలి నుంచి జల దుర్గము వలె సురక్షితముగా ఉన్న పాటలీ పుత్రము రెండవ రాజధాని.

పురాణాలు, జైన బౌద్ధ వాఙ్మయాలు గ్రీకు రచనలు మగఈ వంశానికి సంబందించిన చరిత్రను తెలియజేస్తాయి. హర్యంక రాజైన బింబిసారుని కాలమునుండి మగధ అసలు చరిత్ర ప్రారంభమైనది. బార్హద్రథ వంశములో చివరివాడైన రిపుంజయుని తుద ముట్టించి హర్యంక వంశస్థుడైన బింబిసారుడు క్రీ॥పూ॥ 544లో మగధ సింహసనాన్ని అధిష్టించెను.

**6.4.1 హర్యంక వంశము - బింబిసారుడు :-** బింబిసారుని నాయకత్వంలో మగధ సామ్రాజ్యంలో ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఇతడు హర్యంక వంశానికి చెందినవాడు. బుద్దుని సమకాలికుడు. గిరివ్రజం రాజధానిగా (క్రీ॥పూ॥ 544 - 493) సుమారు అర్థ శతాబ్దం రాజ్యాన్ని పరిపాలించాడు. ఇతడు సామ్రాజ్య విస్తరణ కోసం అనేక యుద్ధాలు చేసాడు. ఇతడు గొప్ప యోధుడు. రాజనీతి చతురుడు. వివాహ సంబందాల ద్వారా కూడా రాజ్యాన్ని విస్తరించాడు. కోసల, లిచ్ఛవి, మద్ర, విదేహ రాజకన్యలను వివాహమాడి హర్యంకుల బలాన్ని, రాజ్యాన్ని విస్తరింప జేసాడు. ఇందులో మొదట ప్రసేనజిత్తు చెల్లెలు, కోసల రాకుమారిని వివాహమాడి కట్నంగా

సాలీనా లక్ష సువర్ణాల ఆదాయాన్ని గల 'కాశీ' గ్రామాన్ని పొందాడు. ఈ వివాహంతో కోసల రాజ్యం మెత్తబడింది. వైశాలికి చెందిన లిచ్ఛవి రాజకుమారి చెల్లనను రెండవ భార్యగా వివాహమాడాడు. మూడవ భార్యగా పంజాబుకి చెందిన మద్ర తెగ నాయకుని కుమార్తెను వివాహమాడాడు. ఈ వివాహం అతని రాజకీయ ప్రతిష్టకు చాలా గొప్ప కారణమైనది. నాల్గవ భార్యగా విదేహ రాకుమార్తైన వాసవిని వివాహమాడినాడు. ఈ వివాహ సంబంధముల ద్వారా బింబిసారుడు తన పలుకుబడిని పశ్చిమమున పంజాబు నుండి తూర్పున బెంగాలు వరకు విస్తరింప జేసెను.

అంగరాజైన బ్రహ్మదత్తుని ఓడించి ఆ రాజ్యాన్ని ఆక్రమించినాడు. తన కుమారుడైన అజాత శత్రువును అంగరాజ్య రాజధాని చంపానగరంలో తన ప్రతినిధిగా నియమించాడు. మగదకు ప్రధాన శత్రువు ఉజ్జయినీ రాజధాని అయిన అవంతీ రాజ్యం ఆ దేశపు రాజైన ఛండ ప్రద్యోత మహాసేనుడు బింబిసారుని ఎదిరించినప్పటికి ఇద్దరు రాజీ చేసుకున్నారు. గాంధార రాజు కూడా బింబిసారుని వద్దకు రాయబారిని, లేఖను పంపి సంధి చేసుకున్నాడు. ఇట్టి ఆక్రమణలతో బింబిసారుని రాజ్యము 80 వేల గ్రామములు గల రాజ్యముగా విస్తరించెను.

బింబిసారుడు జైనుడని జైన గ్రంధాలు, బౌద్ధడని బౌద్ధ గ్రంధాలు చెప్పున్నాయి. బింబిసారుడు బుద్ధుని రెండుసార్లు తానే స్వయముగా కలిసినట్లు వేలువన విహారము' బౌద్ధ సంఘంనకు దానము చేసినట్లు బౌద్ధ గ్రంధములు చెప్పుచున్నవి.

**6.4.2 అజాత శత్రువు (క్రీ॥పూ॥ 493 - 462) :** బుద్ధ ద్వేషిబుద్ధుని జ్ఞాతి అయిన దేవదత్తుని చేత ప్రేరేపితుడై అజాత శత్రువు తండ్రిని చంపి సింహాసనమును ఆక్రమించినాడని బౌద్ధ అనుప్రతి చెప్పుచున్నది. అజాత శత్రువు 31 సం॥లు కాలము రాజ్యాన్ని పాలించాడు. ఇతని కాలంలో హర్యంక వంశం కీర్తి ప్రతిష్టలు అత్యున్నత స్థాయిని చేరెను. అనేక యుద్ధములు చేసి సామ్రాజ్యాన్ని విస్తరింప జేసాడు.

ప్రధమములో కోసల రాజ్యముతో పోరాటము జరిపెను. దీనికి ప్రధాన కారణము కోశల దేవి మరణానంతరము ప్రసేన జిత్తు కాశీ పట్టణమును తిరిగి ఆక్రమించెను. అజాత శత్రువు ప్రసేన జిత్తును ఓడించి అతని కుమార్తె అయిన వజీరాను వివాహమాడి కాశీ పట్టణము తిరిగి పొందెను. తూర్పు ప్రాంతంలోని గణరాజ్య సమితితో అజాత శత్రువు పోరాటం సల్పి విజయం సాధించాడు. ఈ సమితిలో 36 రాజ్యములుండేవట. వీటిలో ముఖ్యమైనది 'లిచ్ఛవి' రాజ్యం. అజాత శత్రువు గంగా, సోన్ నదుల మధ్య పాటలీ పుత్ర దుర్గాన్ని నిర్మించి దానిని సైనిక కేంద్రముగా చేసుకొనెను. మంత్రి యగు వత్సకారుని సాయముతో వైశాలి కోటను విచ్ఛిన్నము చేసి లిచ్ఛవుల దర్పము అణచెను. బింబిసారుని వలె అజాత శత్రువు కూడా తన బలాన్ని వైవాహిక సంబందాల ద్వారా పెంపొందింప జేసాడు. సింధు, సౌవీర, అవంతి, వత్స రాజకుమార్తెలను వివాహమాడినాడు.

బింబిసారుని వలె అజాత శత్రువు జైనుడని జైన గ్రంధములు, బుద్దుడని బౌద్ధ గ్రంధములు చెప్పుచున్నవి. అజాత శత్రువు అంతఃపుర రాణులతో కలిపి సపరివారముగా మహావీరుని దర్శనము కోసం వెళ్ళేవాడు. అదే విధముగా బౌద్ధ మతం పట్ల అజాత శత్రువుకు ప్రత్యేక అభిమానం కలదు. తండ్రిని చంపినందుకు అజాత శత్రువు పశ్చాత్తాపం చెంది, క్షమింపవలసినదిగా బుద్ధుని కోరినట్లు బౌద్ధ గ్రంధాలు చెప్పున్నాయి. బుద్ధుని దర్శనం కోసం అజాత శత్రువు రాక బార్హుత్ (క్రీ॥పూ॥ 2వ శతాబ్దం) శిల్పాలతో చిత్రించబడింది. మొదటి బౌద్ధ సంగీతి రాజగ్రహమునందు అజాత శత్రువు కాలములో జరిగెను. పైగా బుద్ధుని ధాతువులు సంపాదించి వానిపై స్థూపములు రాజగ్రహము చుట్టూ నిర్మించినట్లు తెలియుచున్నది.

**6.4.3 ఉదయనుడు :-** అజాత శత్రువు తరువాత వరుసగా నలుగురు రాజులు రాజ్యాన్ని పాలించిరి. బౌద్ధ అనుశ్రుతి ప్రకారం వీరందరూ పితృ హంతకులే. వీరిలో అజాత శత్రువు తరువాత ఉదయనుడు రాజైనాడు. పాట్నా వద్ద గంగా, సోన్ నదుల సంగమ స్థానాలలో కోటను నిర్మించటం, రాజధానిని పాటలీ పుత్రమునకు మార్చడం జరిగింది. మగధ సామ్రాజ్యం ఇతని కాలమున ఉత్తరమున

హిమాలయము నుండి దక్షిణాన చోటా నాగపూర్ కొండలవరకు విస్తరించియున్నది. ఉదయనుని తరువాత వరుసగా అనిరుద్ధుడు, ముండరాజు, నాగదాసకుడు మగద రాజ్యాన్ని పాలించిరి. చివరి రాజు నాగదాసకుడు. పురాణాలలోని దర్శకుడు యితడే. బాణుని స్వప్న వాసవదత్తలోని ఉదయనునికి ఇతను సమకాలికుడు. ఈ నలుగురి రాజుల పరిపాలనతో విసిగి వేసారిన ప్రజలు మంత్రి శిశునాగుని రాజుగా ప్రకటించిరి.

**6.4.4 శైశు నాగ వంశము :** శిశు నాగుడే శైశు వంశ స్థాపకుడు. ఇతడు రాజధానిని గిరి వ్రజానికి తరలించాడు. ఉజ్జయినీ రాజధానిగా ఉన్న అవంతి రాజ్యాన్ని ధ్వంసం చేయడము, ఇతడు సాధించిన ఘన కార్యం. అంతటితో మగధ - అవంతీ రాజ్యాల మధ్య వంద సం॥లు కొనసాగిన వైరము ముగిసినది. అవంతీ పాలకుడైన ప్రద్యోతనుడిని ఇతడు నిర్మూలించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. ఇంకా కోసల, వత్స, రాజ్యాలను జయించి మగధలో విలీనం చేసినాడు. శిశు నాగుని తర్వాత అతని కుమారుడైన కాలాశోకుడు రాజ్యమునకు వచ్చెను. ఇతని కాలంలో వైశాలి యందు'రెండవ బౌద్ధ సంగీతి'' జరిగెను. ఈ కాలాశోకుని, అతని పది మంది కుమారులను మహా పద్మనందుడు వధించి మగధను ఆక్రమించి నందవంశము స్థాపించెను.

**6.4.5 నంద వంశము :-** శిశునాగులు తరువాత నందులు మగధలో అధికారానికి వచ్చారు. మగధను పాలించిన అత్యంత బలమైన రాజులుగా వారిని పేర్కొనవచ్చు. మహా పద్మనందుడ్ని శూద్రుడని పురాణాలు, అజ్ఞాత కులజుడని బౌద్ధ గ్రంధాలు, హీనజాతి వాడని గ్రీకు రచనలు వర్ణిస్తున్నాయి నంద వంశ స్థాపకుడు మహా పద్మనందుడని పురాణాలు, ఉగ్రసేనుడని మహా బోధి వంశం పేర్కొంటున్నాయి. నందులు అసాధారణ సంపన్నులని, అసామాన్యమైన బలవంతులకి, వీరికి రెండు లక్షల కాల్బలం, 60 వేల అశ్వక దళం, 6 వేల ఏనుగులు కలవని తెలుస్తున్నది.

మహా పద్మనందుడు, పరశురాముని వలె ఈ భూమండలములోని క్షత్రియులందరినీ నిర్మూలించాడని పురాణాలు పేర్కొనుచున్నవి. పాంచాల, కురు, మిధిల, కళింగ, కాశీ, ఆశ్మిక, మొ॥లగు రాజ్యములు జయించి ఉత్తరమున సట్లెజ్ నది నుండి దక్షిణమున గోదావరి వరకు మగధ రాజ్యాన్ని విస్తరింప జేసెను. దక్షిణ భారతదేశంలోని ఖారవేలుని హతి గుంఫ శాసనము, కళింగను మహా పద్మనందుడు జయించినట్లు చెప్పుచున్నది. తాను ఇతర రాజులందర్నీ నిర్మూలించిన "ఏకరాట్"అని ప్రకటించుకున్నాడు. మొదటి భారత సామ్రాజ్య నిర్మాతగా మహా పద్మనందుడు ప్రసిద్ధి కెక్కాడు.

మొత్తం నందరాజుల సంఖ్య 9. పురాణాలలో వీరు నందుడు, అతని ఎనమండుగురు కుమారులుగా చెప్పబడింది. బౌద్ధ గ్రంధాలలో నవ నందులు సోదరులని ఉంది. అయితే మహా పద్మనందుని తరువాత కడపటి నందరాజు కాలము వరకు నంద రాజుల చరిత్ర తెలియదు. కడపటి రాజు గ్రీకు రచయితలు చెప్పిన 'అగ్రిమిన్' అలెగ్జాండర్‌కు సమకాలికుడు. ఇతడు ప్రబలుడై పాటలీపుత్రము రాజధానిగా బియాస్ నదికి అవతల గంగానదిని ప్రాశ్చదేశానికి మధ్య గల ప్రాంతాన్ని ప్రజాకంటకముగా పాలించాడు. ధననందుని నిరంకుశ పాలన, చాణుక్యుని అవమానం, అధిక పన్నుల భారము ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి రేకెత్తింది. చంద్ర గుప్త మౌర్యుడు, చాణుక్యుని సహాయముతో ధననందుని ఓడించి మౌర్య సామ్రాజ్యమును స్థాపించెను. నందులు జైన మతాన్ని అభిమానించిరి.

## 6.5 సారాంశము :

భారతదేశ చరిత్రలో 6 వ శతాబ్దానికి విశేషమైన రాజకీయ ప్రాముఖ్యం కలదు. ఈ కాలంలోనే 16 షోదశ రాజ్యాలు వెలసినవి. వాటిలో అత్యధికమైనవి రాజరిక వ్యవస్థకు శ్రీకారం చుట్టగా, కొన్ని రాజ్యాలు ప్రజాతంత్ర వ్యవస్థకు నాంది పలికినవి. కాలానుక్రమంగా ఈ రాజ్యాల మధ్య జరిగిన యుద్ధముల వలనను, వారసత్వ యుద్ధముల వలనను ఈ రాజ్యాలు బలహీనపడి చివరిగా మగధ రాజ్య విజృంభణకు దారి తీసింది. మగధ రాజ్యం అనేక అటుపోట్లను, విదేశీదండయాత్రలను ఎదుర్కొని మౌర్య సామ్రాజ్య స్థాపన వరకు భారతదేశంలో సుస్థిర పరిపాలను అందించింది.

## 6.6 మాదిరి ప్రశ్నలు

1. క్రీ.పూ ఆరవ శతాబ్దం - రాజకీయ పరిస్థితులు ఏ విధంగా ఉండేవి ?
2. క్రీ.పూ. ఆరవ శతాబ్దం - పరిపాలనా విధానం ఏ విధంగా ఉండేది ?
3. మగధ రాజ్య విజృంభణకు గల కారణాలు ?

## సంక్షిప్త ప్రశ్నలు

1. బింబిసారుని నాయకత్వంలో మగధ రాజ్యం ఏ విధంగా ప్రాధాన్యతను సంతరించుకున్నది. ?
2. ఉదయనుడు, శైశు నాగవంశము, నందవంశము గూర్చి వ్రాయుము ?
3. ఏవైనా 10 మహాజన పదాల గూర్చి వ్రాయుము ?
4. ఆరవ శతాబ్దపు సాంఘిక పరిస్థితుల గూర్చి వ్రాయుము ?

## పాఠం - 7

# జైన బౌద్ధమతాలు

## 7.0 లక్ష్యం :

6 వ శతాబ్దంలో బౌద్ధ మతాల ఆవిర్భావము, వాటి మత సిద్ధాంతాలు, విస్తరణ, ప్రాధాన్యతలు, వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం :

7.1 జైనబౌద్ధమతాలు ఆవిర్భవించటకు కారణములు

7.2 క్రొత్త మతాల ఆవిర్భావం

7.3 బైద్ధమతం

7.4 జైన - బౌద్ధమతాల మధ్యపోలికలు

7.5 జైన - బౌద్ధమతాల మధ్య భేదాలు

7.6 సారాంశము

## 7.1 జైన బౌద్ధమతాలు ఆవిర్భవించుటకు కారణములు :

క్రీ॥పూ॥ ఆరవ శతాబ్దంలో ప్రపంచ చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం అయినది. ప్రపంచమున మహాప్రవక్తలుద్భవించి, సమాజములో తరతరాలుగా వచ్చుచున్న ఆచార సాంప్రదాయములపై, విశ్వాసములపై, పాత విలువలపై ధ్వజమెత్తి నూతన భావములను, నూతన సిద్ధాంతములను సృష్టించి తీవ్రమైన ఆధ్యాత్మిక, సాంఘిక సంచలనము గావించిరి.

### 7.1.1 ఆధ్యాత్మిక అశాంతికి గల కారణములు :

**ఎ) కర్మ కాండలు:** భారతదేశంలో నాటికి వైదిక మతంలో సహచర్యం, పవిత్రత తీసుకవచ్చారు. యజ్ఞముల పేరుతో నిర్వహించు జంతు బలులు, ఆడంబరాలు, ఆచారాలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేవు. ఫలితంగా వైదిక కర్మకాండలను సమూలంగా నిరసించి, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చారు.

**బి) మంత్రాలపై విశ్వాసము:-** వేద మంత్రస్థానములో వచ్చిన ఇతర మంత్రాలు పఠించటం వలన రాజ్యము అభివృద్ధి చెందుతుందని, రోగాలు తొలగి పోతాయని, శత్రు వినాశనము జరుగుతుందని, పంటలు బాగా పండుతాయని ప్రజలలో ప్రగాఢ విశ్వాసము. ఇవి సామాన్య ప్రజలకు అందుబాటులో లేవు. ఇవి వారి శక్తికి మించినవి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు తమకు సులభముగా అర్ధమయ్యే నైతిక విలువలకై వేచియుండిరి.

**సి) బలులు:-** బలి విధానాన్ని ఆర్యసమాజములో బ్రాహ్మణ పూజారులు అతిగా అమలు జరిపేవారు. ఇది ప్రజలకు భరించరాని ఖర్చుగాను అర్థరహితమైన ఈ కర్మకాండలకు ప్రజలు ఖర్చుపెట్టే స్థితిలో లేరు. ప్రజలు జంతుబలిని, నరబలిని ఇచ్చే ఆచారాలను

ఏవగించుకున్నారు. అశ్వమేధము, తదితర యజ్ఞయాగాదుల వలన రాజ్య ధనాగారము ఖాళీ అయ్యేది. బ్రాహణులకు గృహాలలో జరిగే కార్యక్రమాలకు, కర్మకాండలకు,ఉత్సవాలకు విశేషమైన ధనం ఇవ్వడం జరిగేది. ప్రజలు వీరిని వీరియొక్క కర్మకాండలను నిరసించారు. బలులను అన్ని వర్గాలవారు, ఆక్షేపించారు. ఉపనిషత్తులు కూడా వీటిని నిరసించాయి.

**7.1.2 ఆధ్యాత్మిక రంగంలో అయోమయ పరిస్థితి:-** ఈ కాలంలో వచ్చిన తత్వవేత్తలు అనేక వేదాంత సిద్ధాంతాలను. రహస్యాలను, పూజా విధానాలను ప్రజలకు ప్రభోదించారు. అయితే వీరి మధ్య వచ్చిన సిద్ధాంత విభేదాలు, అనేక తాత్విక వాదనలు, వాదోపవాదలతో ఆధ్యాత్మిక రంగంలో అయోమయ పరిస్థితి ఏర్పడింది. ఆధ్యాత్మిక రంగంలో వ్యక్తి, ఆత్మ, ప్రపంచం, మానసిక స్వాతంత్ర్యం భగవంతుని ఔన్నిత్యం, ఆధిక్యతను గురించి అనేక సిద్ధాంతాలు బయలుదేరినాయి. కొంతమంది మహర్షులు భోగ భోగ్యాలను త్యజించి, తాత్విక చింతన చేసారు.

**7.1.3 కర్మ, జ్ఞాన, తపస్సు మార్గాలు:-** ప్రజలలో నిరాస, నిస్పృహ బయలుదేరింది. జనన, మరణాల నుండి ఆత్మను ఎలా రక్షించుకోవాలో జీవిత సమస్యల నుండి ఎలా బయటపడాలో వారికి తెలియలేదు. జన్మరాహిత్యం పొంది, ఆత్మ బంధ విముక్తి వారి యొక్క ముఖ్య ఉద్దేశ్యం. దీనికి బ్రాహ్మణ పూజారి వర్గము కొన్ని మార్గాలను సూచించింది. అనేకమైన ఉత్సవాలు, సంస్కారాల వలన మోక్షము లభిస్తుందని పేర్కొన్నారు. జన్మరాహిత్యమే మోక్షము, దీనిని కర్మ మార్గమని చెప్పారు. కాని కర్మమార్గాలు మాత్రమే సాధన కాదని తపస్సు ద్వారా తన గురించి తాను తెలుసుకోవాలనే కొన్ని సిద్ధాంతాలు బయలుదేరినవి. దీని ద్వారా సామాన్య ప్రజలకు కర్మ, తపస్సు మార్గాలపై విశ్వాసము పెరిగింది. అయితే విధ్యాధికులు మాత్రము మోక్షం జ్ఞాన మార్గము ద్వారానే పొందవచ్చని విశ్వసించారు.

**7.1.4 కులవ్యవస్థ :** కుల వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. నిర్దిష్టమైన కులవ్యవస్థ ఏర్పడటం వలన ఒక కులం నుండి వేరొక కులంకు మారటం అసాధ్యముగా ఉండేది. క్రింది తరగతులైన శూద్రులు అనేక కష్టనష్టాలకు గురైనారు. వారు తమ జీవన విధానములలో మార్పు తెచ్చే మతం కోసం ఎదురు చూడసాగారు.

**7.1.5 బ్రాహ్మణుల ఆధిక్యం :** వైదిక మతం బ్రాహ్మణులకు సంఘములో మహోన్నతమైన స్థానమును, కొన్ని ప్రత్యేక హక్కులను కల్పించినది. కర్మకాండలను జరిపే అధికారము బ్రాహ్మణుల గుత్తాది పత్యమైనది. మానవుడు పుట్టినప్పటి నుండి మరణించే వరకు జరిగే కార్యక్రమాలపై బ్రాహ్మణ ఆధిపత్యం కొనసాగింది.

పరిపాలనాకు సంబంధించిన విషయాలలో కూడ బ్రాహ్మణులు భాగస్వాములైనారు. క్షత్రియ యువరాజులకు రాజ గురువులుగా ఉంటూ అవకాశం దొరికినపుడు అధికారాన్ని సంపాదించి సమాజంలోని మిగతా వర్గాలవారి కంటె అధికులమని భావించారు. పైన ఉదహరించిన కారణాల వలన ప్రజలకు ఏర్పడిన నిరాశ, నిస్పృహలు రూపుమాపి సులభమైన మార్గాల ద్వారా దు:ఖమయ జీవితాన్ని విడనాడి సత్యాన్వేషణకై ముందుకు నడవడమే ఆనాటి ప్రజలు కోరిక. బాధలనుండి జీవితాన్ని విముక్తిచేసి మోక్షాన్ని పొందాలని ప్రజలు ఆదుర్దాగా ఉన్నారు. క్రొత్త ఆలోచనలు అభిప్రాయాలు తాత్విక చింతనలతో అనేకమైన మత సంబంధమైన తెగలు, సంస్థలు రూపొందాయి. వాటిలో జైన, బౌద్ధ మతాలు మాత్రమే నిలచిపోయాయి.

## 7.2 క్రొత్త మతాల ఆవిర్భావం :

మారుతున్న సామాజిక, ఆర్థిక, జీవనంలో నగరాల పెరుగుదల, వృత్తి పనివారి విస్తరణ, వ్యాపార వాణిజ్యాల త్వరిత వికాసము లాంటి మార్పులు, పరిణామాలు వేరొక రంగంలోని మార్పులతో సన్నిహితంగా పెనవేసుకున్నాయి. అదే మత తాత్వికరంగంలో. పాతుకుపోయిన మూఢాచారాలకు, సాంప్రదాయవాదానికి పట్టణాలలో తలెత్తిన వర్గాల ఆకాంక్షలకు మధ్య పుట్టిన వైరుధ్యం; మత తాత్విక రంగాలలో పరిణామ క్రమాన్ని త్వరితం చేసింది. రాబోయే శతాబ్దాలు కూడా అధిగమించలేనంతటి మహోన్నత భావ వికాసం క్రీ॥పూ॥ ఆరవ శతాబ్దంలో ప్రారంభమైనది.

అజీవకులు, చార్వకులు లాంటి అనేక నాస్తిక వాదులు బయలుదేరారు. ఇందులో చార్వాకులు పూర్తిగా భౌతిక వాదులు. వీరి యొక్క సిద్ధాంతము మనిషి మట్టి నుండి జన్మించి అందులోనే కలిసి పోతాడు. అర్ధం పర్దంలేని కర్మకాండమంతా వీరు వ్యతిరేకించారు. తమ బ్రతుకు తెరువు కోసం పురోహితులు ఈ కర్మకాండనుపయోగిస్తున్నారని, వీరు ప్రచారము చేసారు. అయితే ఆజీవకుల, చార్వకుల యొక్క సిద్దంతాలు కాలగమనములో నిలవలేకపోయాయి. ఇలాంటి పరిస్థితులలో జైన, బౌద్ధమతాలు ప్రజల యెక్క ఆదరణపొందాయి

**7.2.1 జైన మతము:-** జైన మతము, వైదిక మతమంతటి ప్రాచీన మైనదని జైనుల విశ్వాసము. జైన మతస్థాపన ఎపుడు జరిగిందో సరిగ్గా మనకు తెలియదు. జైన మత స్థాపకుడైన వృషభుడు, అరిష్టనేమి తీర్థంకరుల ప్రస్తావన ఋగ్వేద మంత్రాలలో కనిపిస్తుంది. ఇతిహాస, విష్ణు, భాగవతపురాణాలలో నారాయణుని యొక్క అవతారము వృషభుడని పేర్కొన్నారు. వీటి ద్వారా జైన మతం చాలా ప్రాచీన కాలమునుండి ఉన్నదని తెలుస్తుంది. జైన మత గురువులను తీర్థంకరులు అందురు. తీర్థంకరులనగా జీవన స్రవంతి దాటుటకు వారధిని నిర్మించువారని, లేక మార్గమును చూపేవారని అర్థము. జైన మతములో 24 మంది తీర్థంకరులు ఉన్నారని, వారందరు క్షత్రియులని జైన అనుస్మృతి వలన తెలుస్తున్నది. వీరిలో ఇరవై రెండు మంది పౌరాణిక పురుషులు, ఇరవైమూడువ తీర్థంకరుడైన పార్శ్వనాధుడు, ఇరవై నాల్గవ తీర్థంకరుడైన మహావీరుడు చారిత్రక పురుషులు. వీరిలో పార్శ్వనాధుడు చారిత్రకంగా జైన మత స్థాపకుడు.

**7.2.2 పార్శ్వనాధుడు:-** పార్శ్వనాధుడు కాశీరాజైన అశ్వసేనునకు, రాణి వామలకు జన్మించెను. ఇతడు 30 సంవత్సరముల వయసు వరకు గృహస్థాశ్రమం గడిపి తరువాత సన్యసించాడు. ఐహిక సుఖములను త్యజించి 84 దినములు కఠోర తపస్సుచేసి జ్ఞానాన్ని సంపాదించెను. ఇతడు వంద సంత్సరాలు జీవించి జైన మతాన్ని ఒక చక్కని సంస్థగా రూపొందించి చివరకు బెంగాలులో నిర్యాణం పొందాడు. ఆయన నమ్మిన సూత్రాలే జైన మతమునకు మూల సిద్ధాంతములు.

**7.2.3 సిద్దాంతాలు:-**మానవుని జీవితాశయం మోక్షం పొందడం, దానికి చక్కని నియమాలు పాటించడం వలన అవి చెడు కర్మలను తొలగిస్తాయని పార్శ్వనాధుని ప్రగాఢ విశ్వాసము. దీనిని సాధించడానికి తపస్సును మార్గముగా పార్శ్వనాధుడు సూచించాడు. ఇతడు నాలుగు సిద్దాంతాలు ప్రవచించాడు.

సత్యం ; అసత్యమాడరాదు. ఎల్లపుడు సత్యమే పలకవలెను.

అహింస ; హింసామార్గాన్ని విడనాడాలి. అంటే మాటలద్వారాగాని,ఆలోచనలద్వారా గాని, చేతలద్వారాగాని జీవహింస చేయరాదు.

అపరిగ్రహం; దొంగతనం చేయరాదు.

అస్తేయం; ఆస్తి, పాస్తులు ఉండరాదు. ఏ వస్తువుపైన కోరిక ఉండరాదు.

**7.2.4 వర్ధ మాన మహావీరుడు: (క్రీ॥పూ॥ 599-527) :** వర్ధమాన మహావీరుడు వైశాలి నగరానికి దగ్గరలో ఉన్న కుంద గ్రామంలో సంపన్నమైన క్షత్రియ కుటుంబంలో క్రీ॥పూ॥ 599 లో జన్మించాడు. ఇతని తండ్రి సుప్రసిద్ధ క్షత్రియనాయకుడైన సిద్ధార్దుడు. తల్లి పేరు త్రిశల. ఈమె లిచ్ఛవి రాజైన చేతకుని చెల్లెలు, అతని కూతురు బింబిసారుని భార్య. ఈ విధముగా మహావీరుని కుటుంబానికి, మగద రాజ కుటుంబానికి దగ్గర చుట్టరికం ఉండేది. వీరు జ్ఞాత్రిక తెగకు చెందిన వారు. చిన్న వయసు నందే మహావీరుడు క్షత్రియోచిత విద్యను అభ్యసించి యశోదయను రాజమార్తెను వివాహమాడెను. కొంతకాలము సుఖభోగములను అనుభవించెను. వారికి ప్రియదర్శిని (అణోజ్ఞి) యను పుత్రిక జన్మించెను. ఆమెను తన మేనల్లుడైన జామాలి కిచ్చి మహా వీరుడు వివాహము చేసెను. తన తల్లిదండ్రుల మరణానంతరము రాజభోగములు, వైవాహిక జీవిత సౌఖ్యములు వర్ధమానునికి మనఃశ్శాంతి నొసంగలేదు. 30 సం॥ల వయసులో సత్యాన్వేషణ కోసం సన్యాసిగా మారిపోయాడు. సత్యానేషణలో 12 సం॥లు కఠోర తపస్సు చేసి కొంతకాలం అన్నపానాదులు, చివరకు కట్టుబట్టలు కూడా విసర్జించి రుజుపాలక నదీ తీరాన జృంభిక గ్రామ సమీపంలో సాలవృక్షం క్రింద జినత్వం పొందాడు. అదే జ్ఞానోదయం. 'జిన' అనగా జయించిన వాడని అర్థం.

ఇతడు అరిషడ్వర్గాలను జయించినందున మహావీరుడనియు, మహాజ్ఞాని యైనందున 'కేవలి' అనియు, సకల బంధములు తెంచుకొన్నందున 'నిర్గ్రంధుడని' కొనియాడారు మహావీరుడు 30 ఏళ్ళ పాటు ప్రచారం చేసాడు. ప్రజలకు తన సిద్ధాంతాలను బోధిస్తూ చంపా, వైశాలి, రాజగ్రహం, మిథిల, శ్రావస్తి మొదలైన రాజ్యాలకు వెళ్ళాడు. రాజగృహంలో మగధ చక్రవర్తియైన బింబిసారుడు, మహావీరుని గౌరవించినట్లు తెలుస్తుంది, 72 సంవత్సరముల ప్రాయములో మహావీరుడు పాట్నా జిల్లాలో పావాపురిలో హస్తిపాలుడనే, రాజుగృహంలో నిర్యాణం పొందాడు.

**7.2.5 జైన మత సిద్ధాంతాలు:-** మహావీరుడు వేదాల ఆధిక్యాన్ని, వైదిక కర్మకాండలను, బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని తిరస్కరించాడు. మానవుడు మోక్షం పొందడానికి పవిత్రమైన జీవనము గడుపుతూ సన్యాసిగా కఠోరతపస్సు చేయాలని బోధించాడు. జాతి, మత, కుల, వర్గ, లింగ భేదం లేక అందరికి జైన మతంలో ప్రవేశం కల్పించాడు. పార్శ్వనాధుడు భోదించిన నాల్గు సూత్రములకు మహావీరుడు బ్రహ్మచర్యం చేర్చి పంచవ్రతాలను చేశాడు. బ్రహ్మచర్యమంటే ఇంద్రియాలను, కోరికలను అదుపులో ఉంచుకొనడం. మహావీరుడు వర్ణవ్యవస్థను తిరస్కరించలేదు.

హిందూ కర్మ, పునర్జన్మ సిద్ధాంతములను మహావీరుడు అంగీకరించెను. క్రిత జన్మలో చేసిన పాపపుణ్యములు ఈ జన్మలోని సుఖ దుఃఖములును, ఈ జన్మలో చేయు పాపపుణ్యములు పునర్జన్మను నిర్ణయించును. ఈ పునర్జన్మ లేకుండుట, లేక సంసార బంధమునుండి విముక్తి పొందుటే మోక్షము. మానవుడు కర్మాను సారముగ పునర్జన్మ పొందును. కర్మను అంతము చేయవలెనన్న ఈ ప్రాపంచిక బంధముల నుండి విముక్తి పొందవలెను. అనగా ఐహిక భోగములు విసర్జించి అహింస, సత్యము, భూతదయ, బ్రహ్మచర్యము మొదలగు సద్గుణ శీలములు కలిగి యుండవలెను.

మోక్షమనేది దుఃఖం లేని అనంత సౌఖ్యం. దీనిని శుద్ధశీల అని కేవలావస్థ అని అందురు. మోక్షమును పొందవలెనన్న ప్రతి ఒక్కడు మూడు సూత్రములను పాటింప వలెను. 1. సరియైన విశ్వాసం (Right Faith) తీర్థంకురుల బోధనలో శ్రద్ధ, విశ్వాసము కలిగి యుండటం. 2. సరియైన జ్ఞానము (Right Knowledge) తీర్థంకరుల బోధనలోని సత్యమును గ్రహించుట, 3. సరియైన నడవడి (Right Action and Right conduct ) అనగా పంచ వ్రతముల నాచరించుట. వీనినే త్రి రత్నము(Three Jewels) అంటారు.

మహావీరుడు ప్రకృతిలోని ప్రాణులనేగాక ప్రతి జడ పదార్ధమునకు ఆత్మకలదని చెప్పెను. అందువలన జైనులు అహింసా వ్రతమును నిష్ఠతో పాటింతురు. జైన మతం స్థాపించినప్పటినుంచి క్రీ॥పూ॥ 4 లేదా 3 వ శతాబ్దం వరకు భద్రబాహు రచించిన 'జైన కల్ప సూత్రం' జైన మతం యొక్క చరిత్రను తెలుపుతున్నది.

**7.2.6 జైన పరిషత్తు :** క్రీ॥పూ॥ 300 సం॥లో జైనుల తొలి సమావేశం పాటలీపుత్రంలో జరిగింది. ఈ సమావేశంలో 12 అంగాలను క్రోడీకరించిరి ఆర్యరక్షిత వీరభద్ర లాంటి అంగాలు తరువాత కాలంలో వచ్చాయి. వీటిపై వ్యాఖ్యానాలు కూడా వచ్చాయి. వీటిని 'నిర్యుక్తులు' అని అంటారు. క్రీ॥ పూ॥ 4 వ శతాబ్ది చివరికాలంలో బీహార్‌లో భయంకరమైన కరువు ఏర్పడింది. ఈ కరువు 12 సం॥ ల కాలము కొనసాగింది. భద్రబాహు యొక్క నాయకత్వంలో కొంతమంది జైనులు దక్షిణ మైసూరు ప్రాంతానికి తరలి వెళ్ళారు. స్థూలబాహు నాయకత్వంలోని జైనులు మగధలోనే ఉండిపోయారు. పాటలీపుత్రంలో ఇతని నాయకత్వంలో జైన పరిషత్ సమావేశమయి కొన్ని నిర్ణయాలను తీసుకుంది.

కరువు తరువాత వలస వెళ్ళిన జైనులు మగధకు తిరిగి వచ్చారు. ఆ సదస్సు తీర్మానాలను బహిష్కరించారు. ఆనాటినుంచి దక్షిణాది జైనులను దిగంబరులని, మగధ జైనుల్ని శ్వేతాంబరులని పేర్కొనడం ప్రారంభమైంది.

**7.2.7 జైనమత విస్తరణ :-** శాసనాలు, సాహిత్య ఆదారాలు తొలి దశలో జైనమత వ్యాప్తిని తెలుపుతున్నాయి. మహావీరుడు అతని అనుచరులు సంస్కృతానికి బదులుగా ప్రాంతీయ భాషను ఉపమోగించటం, రాజ పోషణవల్ల, జైన మతాచార్యుల కార్యక్రమాలవల్ల జైనమతవ్యాప్తి జరిగింది. మహావీరుడు నిర్యాణం చెందేనాటికి జైన మతం ఒక నిర్దిష్టమైన సంఘంగా రూపొందింది. క్రమంగా మహావీరుని అనుచరులు ఈ మతాన్ని భారతదేశమంతట వ్యాపింపచేశారు. క్రీ॥పూ॥ నాల్గవ శతాబ్ది చివరినాటికి భద్ర బాహు ఆధ్వర్యంలో కొంతమంది జైన సన్యాసులు

దక్షిణ ప్రాంతానికి తరలి వెళ్ళి, మైసూరు ప్రాంతంలో శ్రావణ బెళగోళను కేంద్రస్థానంగా ఏర్పాటు చేసుకొని, దక్షిణాదిలో జైన మతాన్ని వ్యాప్తిలోకి తెచ్చారు.

దేవాలయ నిర్మాణం, మఠాల స్థాపన, జైన విగ్రహాలను పూజించటం, పండగలు జరుపుకొనటం మొదలైనవి జైన మత పోషణలోకి వచ్చాయి. రాజరిక పోషణ జైన మతానికి లభించకముందే సుప్రసిద్ధ మౌర్య చక్రవర్తి చంద్రగుప్త మౌర్యుడు జైన మత భక్తుడు. ఇతడు భద్రబాహునితో అతని శిష్యుడిగా దక్షిణ దేశానికి వచ్చాడు. క్రీ॥పూ॥ రెండవ శతాబ్దంలో కళింగ రాజైన ఖారవేలుడు జైన మతం స్వీకరించి జైన విగ్రహాలను,ప్రతిష్ఠించి, సుప్రసిద్ధ భక్తుడు, పోషకుడయ్యాడు. కుషాణుల కాలంలో మధురలో ఈ మతం అభివృద్ధి దశలో ఉంది. మర్నుని కాలంలో తూర్పు భారత దేశంలోనూ, ఉత్తరంలో మధుర, దక్షిణంలో శ్రావణ బెళగొళ బైన మత కేంద్రాలుగా విలసిల్లాయి. గుప్తుల కాలంలో జైన మత ప్రాబల్యం తగ్గిపోయింది. తరువాత కాలంలో జైన మతం మాళ్వా, గుజరాత్, రాజస్థాన్‌లలో ప్రవేశించింది. ఈ నాటికి ఈ ప్రాంతంలో వ్యాపార కార్యక్రమాలలో నిమగ్నులై ఉన్న జైనులు చాలా మంది ఉన్నారు.

**7.2.8 జైన మతం ప్రాధాన్యత :** మొట్ట మొదటి సారిగా వర్ణ వ్యవస్థలోనూ, వైదిక కర్మకాండలలోనూ ఉన్నచెడును తగ్గించడానికి జైన మతం కృషి చేసినది. జైనులు బ్రాహ్మణులు పోషించిన సంస్కృత భాషను తిరస్కరించి సామాన్యప్రజల భాషయైన ప్రాకృతాన్ని స్వీకరించి దాని ద్వారా తమ భావాలను ప్రచారం చేసినారు. జైనమత సాహిత్యం అర్థమాగధిలో రచింపబడింది. క్రీ॥పూ॥ ఆరవ శతాబ్దిలో గుజరాత్‌లోని గొప్ప విద్యా కేంద్రమయిన వలభిలో ఈ గ్రంధాలు సంకలనం చేయబడ్డాయి. ప్రాకృత భాషా, దాని సాహిత్యం అభివృద్ధి చెందాయి. ప్రాకృత భాషనుంచి ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెందాయి వీరు కన్నడ భాష అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

మొదట బౌద్ధులులాగే జైనులు కూడా విగ్రహారాధకులు కారు. తరువాత కాలంలో వారు మహావీరుణ్ణీ, ఇతర తీర్థంకరుల్ని పూజించటం ప్రారంభించారు. అందమైన, సమున్నతమైన రాతి విగ్రహాలను పూజకోసం చెక్కారు. ఇది ఎక్కువగా కర్నాటక, గుజరాత్, రాజస్థాన్‌లలో జరిగింది. జైన కళ, బౌద్ధకళంత సంపన్నంగా లేక పోయినా కళకు జైనులు చేసిన దోహదం-ముఖ్యంగా మధ్యయుగాల్లో గొప్పదని చెప్పుకోవాలి.

## 7.3 బౌద్ధమతం :

క్రీ॥పూ॥ ఆరో శతాబ్దం భారతదేశ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంతరించుకున్నది. ఈ కాలంలో చాలామంది తాత్వికులు ప్రజలకు మోక్షమార్గాన్ని భోదించడానికి బయలుదేరారు. కోసల, మగధ రాజ్యాలు మహావీరుని, బుద్ధుని కార్యక్రమాలకు నిలయమయ్యాయి. బౌద్ధమతం సనాతన బ్రాహ్మణ మతాభివృద్ధిని నిరోధించింది. బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన విషయాలు ప్రాచీన బౌద్ధ గ్రంధాలలో, ఇతర గ్రంధాలలో లభిస్థాయి.

బుద్ధుని జీవితాన్ని గురించి బౌద్ధమతగ్రంధాలయిన దీపవంశ, మహావంశ, 'త్రిపీటకాలు', కథావస్తు, లలితవిస్తరం, అశ్వఘోషుని బుద్ధచరితం, మహాపరినిర్వాణ సూత్రం, జాతక కథలు, ధీఘనికాయం మొదలగు సంస్కృత, పాళీ గ్రంధాలు తెలుపుతున్నాయి.

గౌతమ బుద్ధుడు లేదా సిద్ధార్థుడు మహావీరుని సమకాలికుడు. ప్రపంచములో విలసిల్లిన, గుర్తించిన పదకొండు మతాలలో బౌద్ధమతం ఒకటి. దీనిని గౌతమ బుద్ధుడు స్థాపించాడు. బుద్ధునికి సిద్ధార్థుడని, అంగీరసుడని, శాక్యజ్ఞాని, తథాగతుడని, శాక్యముని అనే పేర్లున్నాయి. బుద్ధుడు అంటే జ్ఞాని అనర్థం. 'తధాగత' అంటే సత్యాన్ని తెలుసుకొన్నవాడని అర్థం.

**7.3.1 గౌతమ బుద్ధుడు :** గౌతమ బుద్ధుడు నేపాల్ పర్వత పాదాల చెంత ఉన్న కపిలవస్తు పట్టణానికి సమీపమున ఉన్న లుంబినీ వనము అనగా రుమ్మిందై గ్రామమున క్రీ॥పూ॥ **563**లో జన్మించెను. కపిలవస్తునేలు శాక్య వంశీయుడైన శుద్ధోదనుడు అతని తండ్రి. సిద్ధార్థుని తల్లి మాయాదేవి కోసల రాజు పుత్రిక. అతని తల్లిదండ్రులతనికి పెట్టినపేరు సిద్ధార్థుడు. ఇతడు జన్మించిన ఏడు రోజుల తర్వాత మహామాయ మరణించింది. ఆమె సోదరి, సవతితల్లి మహ ప్రజాపతి గౌతమి నేతృత్వంలో అతడు పెరిగాడు. బుద్ధుడు జన్మించినపుడు అనేక అద్భుతమైన

సంఘటనలు జరిగాయని బౌద్ధ గ్రంధాలు తెలుపుతున్నాయి. ఇతడు గౌతమ గోత్రమునకు చెందిన వాడగుటచే గౌ త వం వు డ ని వ్యవహరించబడినాడు.

సిద్ధార్థుడు తన 19వ యేట వివిదక్షత్రియ విద్యలలోను, విద్య వాఙ్మయంలోను అనేక పోటీలను ఎదుర్కొని తన ప్రజ్ఞను, సామర్ధ్యాన్ని ప్రదర్శించాడు. కాని ఐహిక సుఖము పట్ల విముఖతకు, జీవిత సమస్యల పట్ల ఆలోచనలను, భూతదయను కల్గియుండుటచే తన కుమారుడు సన్యాసి యగునేమోయని శుద్దోదనుడు భయపడెను. అయితే సుప్రభుద్దుడు అనే శాక్య వంశ క్షత్రియుడు తన కుమార్తె అయిన యశోధరను సిద్ధార్థునికిచ్చి 19వ యేట వివాహం చేసెను. ఈ యువ దంపతులకు "రాహులుడను" పుత్రుడు కూడు జన్మించెను. రాజ భోగములు గాని, దాంపత్య సుఖముగాని సిద్ధార్థునకు సంతృప్తి నీయలేదు.

సిద్ధార్థుడు సన్యసించగలడనే జోష్యంతో వ్యాకుల పడిన శుద్ధోధనుడు అతడికి ఎటువంటి కష్టాలను, దు:ఖాలను కలిగించే పరిస్థితులను సంభవించకుండా, విరక్తి కలిగించే సంఘటనలూ కంటపడకుండా కట్టుదిట్టాలు చేసాడు. అయినప్పటికి సిద్ధార్థుడు పురవీధులలో విహారం చేయతలపెట్టాడు. తన ఉద్యానవనానికి వెళ్ళే దారిలో ఒక వృద్ధుడిని, అడుగులు వేయటం కూడా సాధ్యం కాని దుర్భలుడిని చూచి నివ్వెరపడ్డాడు. అదే విధంగా వరసగా "ఒకరోగిని", మృతదేహము చూచి సిదార్రుడు వ్యాకులం చెందడం నాలుగోసారి. సిద్ధార్థుడు ఒక'సన్యాసిని' చూచి, అతడు భౌతిక విషయాల పట్ల వ్యామోహాన్ని వదులుకొని మనో నిగ్రహాన్ని పాటించేది సన్యాసి అని తెలుసుకున్నాడు. అంతట శాశ్వతమైన, నిశ్చలమైన స్థితిని సంపాదించే జ్ఞానాన్ని పొందాలనే ఆశయం కలిగింది. ఈ విధంగా ప్రపంచంలోని బాధలను, జరామరణాలను గుర్తించి, నివారించడానికి, మానవాళికి ప్రాపంచిక జీవితంలోని దు:ఖాన్ని నిర్మూలించి విముక్తిని ప్రసాదించడానికి సిద్ధార్థుడు సన్యసించినట్లు బౌద్దవాఙ్మయం వివరిస్తుంది. తన 29వ ఏట ఒక అర్ధరాత్రి సమయమున భార్యా పుత్రులు నిద్రించు చుండగా వారిని వీడి 'చెన్న'యను రధసారధి సాయముతో అడవుల కేగి సన్యసించెను. దీనినే 'మహాభినిష్క్రమణం' అంటారు.

**7.3.2 సత్యాన్వేషణ:-** సన్యసించి ఇల్లు వదలిన సిద్ధార్థుడు చాలా గ్రామాలు ప్రయాణం చేసి, వైశాలి నగరానికి చేరాడు. అక్కడ 'అలారకలామ' లనే పేరుగల గురువు దగ్గర గొప్ప పాండిత్యము సంపాదించాడు. కాని సత్యాన్వేషి అయిన బుద్ధునికి తాను సంపాదించిన సాంఖ్య దర్శన విజ్ఞానం తృప్తి నివ్వలేదు. తరువాత అతడు రాజగరహనగారాన్ని చేరి అచ్చట"ఉద్దకరామ పుత్రుడు' (రుద్రక రామపుత్ర) బ్రాహ్మణుని వద్ద వేదాద్యయనం చేశాడు. మహారాజు బింబిసారుడు అతని వద్దకు వెళ్ళి, ప్రపంచ సుఖ భోగాలను త్యజించడానికి కారణం తెలుసుకొని, అతనిని ఆ మార్గం నుంచి మళ్ళించడానికి యత్నించాడు. ఆ రాజు తన రాజ్యాన్ని కూడా సన్యాసికి ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. కాని సన్యాసియైన సిద్ధార్థుడు దానిని తిరస్కరించాడు.

రాజ గృహంనుండి బయలుదేరి సిద్ధార్థుడు ఉరువేల అనే వనం లేదా అరణ్యాన్ని చేరి తీవ్ర నియమ నిష్టలతో అన్న పానీయాలను విసర్జించి, సత్యాన్వేషణకై కఠిన తపఃశ్చర్యను అవలంభించాడు, కాని జ్ఞానోదయం కాలేదు. తుదకు'గయ'చేరి ఒక అశ్వత్థ వృక్షం చెట్టు (pipal tree) క్రింద 40 రోజులు ధ్యాన నిమగ్నుడై యుండగా అతనికి జ్ఞానోదయం కల్గెను. దీనినే "సంబోది" అందురు. వృక్షము భోది వృక్షమయ్యెను. గయ బుద్ధగయగా ప్రసిద్ధి కెక్కెను. బుద్ద గయ నుండి బుద్ధుడు వారణాసిచేరి అక్కడ సారనాద్ లోని మృగదావనంలో (deer park) తన పూర్వ సహచరులైన ఐదుగురు బ్రాహ్మణ సన్యాసులకు ప్రప్రధమముగా జ్ఞానోపదేశం చేశాడు. ఇదే 'ధర్మ చక్ర ప్రవర్తనం' గా పేరుపొందెను. వారే బుద్ధునికి తొలి శిష్యులు. వారితో ఒక బుద్ధుడు ఒక సంఘం స్థాపించాడు. కాశీ, మగధ, వైశాలి, కపిలవస్తు మొదలగు ప్రాంతములను సందర్శించుచూ, సుమారు 45 సంవత్సరములు ప్రభువులు, పండితులు, పామరులు అను బేదము లేకుండా తన ధర్మమును బోదించి వ్యాప్తి చేసెను.

బుద్ధుడు చరమకాలాన్ని మల్ల రాజ్యంలోని కుసినార (కుశి నగరము)లో గడిపాడు. తన 80 వ ఏట బుద్ధుడు మహాపరి నిర్యాణమును లేక మోక్షమును పొందెను.

**7.3.3 బుద్ధుని బోధనలు :** ఆనాటి జీవిత వాస్తవాలను గుర్తించిన సంస్కర్తగా బుద్ధుడు మనకు కనబడతాడు. ఆనాడు ఆత్మను గురించి, బ్రహ్మను గురించి ప్రచారంలో ఉన్న నిష్ఫలమైన వివాదాల్లోకి అతడు ప్రవేశించలేదు. అయితే ప్రజలకు సులభమైన మార్గంలో ధార్మిక చింతన ప్రసాదించాడు. వేదాలను, యజ్ఞయాగాదులను, వైదిక కర్మకాండలను తిరస్కరించాడు. బుద్ధుడు జీవితంలోని దుఃఖాన్ని చూసా, దానిని నివారించడానికి ప్రయత్నించాడు. ఆప్రయత్నంలక్ష అతడు సఫలుడయ్యాడు. ప్రపంచం దుఃఖమయమనీ, మనవులు కోరికల కారణంగా దుఃఖాలు అనుభవిస్తున్నారని బావించాడు. కోరికల్ని జయిస్తే నిర్వాణం సాధ్యమవుతుందన్నాడా. నార్వాణమంటే జనన మరణాలు నుంచి విముక్తి అన్నమాట. మానవుడు తన స్వయం కృషి చేతనే లక్ష్య సిద్ధిని పొందవచ్చు. భగవంతునితో మనకు నిమిత్తం లేదని బుద్ధుడు భోదించాడు. బుద్ధుడు నాలుగు ఆర్య సత్యాలను (Four noble fruths) ప్రదర్శిచాడు.

అవి:

1. ప్రపంచ మంతయు దుఃఖ భరితము, జీవితమే దుఃఖమయము

2. ఈ దుఃఖం ఆశ లేక కొరిక వల్ల కలుగుతుంది. కొరిక పునర్జన్మకు దారితీస్తుంది. కొరికలున్న మానవుడు ఆ కోరికలను దీర్చుకోవడానికి జన్మ ఎత్తవలసి వస్తుంది.

3. ప్రపంచములోని దుఃఖాన్ని అనగా జీవితంలో దుఃఖాన్ని నిరోదించడం సాధ్యం, అది కోరికలను, ఇతర మానసిక వికారాలను నిరోదవించటం వలన సాధ్యమవుతుంది.

4.బుద్ధుడు దుఃఖాలను తొలగించడానికి అష్టాంగ మార్గాన్ని సూచించాడు.

**7.3.5 అష్టాంగ మార్గం** (Eight fold path) :-

బుద్ధుడు నీతినిభోదించుటయే ప్రదాన లక్ష్యంగా పెట్టుకొన్నాడు. ఒక ప్రక్క కఠిన నియమాలతో, వ్రతాలతో శరీరాన్ని శుష్కింప చేయటం, మరొక వంక సుఖ భోగాలతో జీవితాన్ని గడపడం, ఈ రెండును నిష్ప్రయోజనమే. ఈ రెండు విపరీత ప్రవృత్తులకు మధ్య మార్గమైన ఆర్య అష్టాంగ మార్గాన్ని బుద్ధుడు ప్రతిపాదించాడు.

(a) సమ్యర్ దృష్టి (Right faith): సమ్యర్ దృష్టి అన సరి అయిన దృక్పధం. సారనాథ్‌లో ప్రచించిన నాల్గు ఆర్య సత్యాలు అర్థం చేసుకొనటానికి అవసరమైన జ్ఞాన దృష్టి.

(b) సమ్యక ఆలోచన (Right mindness) : సుఖాలను త్యజించటం. ఇతరులను గురించి చెడుగా ఊహించకుండా ఉండటం.

(c) సమ్యక వాక్కు (Right speech) : మానవులకు తన భాషపై అదుపు కలిగి ఉండటం. సవ్యమైనది, కఠినం కానిది, వ్యర్ధ ప్రతాపం కానిది.

(d) సమ్యక క్రియ (Right Action) : దొంగతనం చేయకూడదు. నియమ బద్ధమైన దినచర్యలో సత్ప్రవర్తన కలిగి ఉండటం.

(e) సమ్యక జీవినం (Right livelehood): నియామాలకు విరుద్దంగా జీవనం గడపరాదు. పాప కృత్యాల నుండి మనస్సు మల్లించాలి.

(f) సమ్యక శ్రమ (Right Effost): చెడు ఆలోచనలు.

(g) సమ్యక నిశ్చయం (Right Resolution) : మంచి మనస్సు.

(h) సమ్యక ధ్యానం (Right meditation): వీటి సాధనల వల్ల పరిపూర్ణత సిద్ధించి, దు:ఖ నిర్మూలన జరిగి, నిర్మూణం పొందవచ్చునని బుద్ధుడు చెప్పాడు.

వీనిని ఆచరించుట ద్వారా వ్యక్తి శీలాన్ని, సమాధిని మరియు ప్రజ్ఞలను సొందును. జ్ఞానియైన వానికి పునర్జన్య వుండదు. మోక్షము లేక నిర్వాణము అనగా పునర్జన్మ లేకపోవుటయే. జనన మరణముల నుండి విముక్తి కలిగి మోక్షము ప్రాప్తించును. అతిభోగములనుగాని, వ్రత కాఠిన్యమునకు గాని చెందకుండుటచే దీనిని మధ్యేమార్గమనిరి.

మోక్షమునకు అర్హతను సంపాదించుటకు బుద్ధుడు మానవునికి ఒక నీతినియమావలిని సూచించెను. అవి అహింసా, దయ, భోగ విసర్జన, సత్యము, ప్రేమ, మొదలగునవి. వ్యక్తి యొక్క సుఖ దు:ఖములకు అతని చర్యలే కారణము కాని భగవంతుడు కాదనెను. హిందూమతము నందలి కర్మ, పునర్జన్మ, మోక్ష సిద్ధాంతములను సమర్ధించి వ్యక్తి జన్మలో చేసిన పాప పుణ్యములే అతని పునర్జన్మ నిర్ణయించునని, పునర్జన్మ లేకుండుచే మోక్షము. అహింసా సిద్ధాంతాన్ని పాటించి, విశ్వ మానవ ప్రేమను, సౌభ్రాత్రత్వాన్ని చాటించి, తాను చెప్పినది ఆచరించి ప్రజలకు మార్గ దర్శకుడై, విశ్వ మానవ కళ్యాణానికి దోహద పడ్డాడు.

**7.3.6 బౌద్ధమతం - మహాసభలు - శాఖలు :-** బుద్ధుడు తన జీవిత కాలం అంతా అనేక జనపదాలు, నగరాలు ప్యటించి ధర్మ ప్రచారం చేశాడు. ఆసంధర్భంగా ఆయన అసంఖ్యాకంగా ప్రబోదాలు చేశాడు. విస్తృతంగా బౌద్ధధర్మం ప్రజాదరణ పొంది, సంఘం విస్తరించింది. కాల క్రమేన ఆ సంఘ గ్రామాలలోని భిక్షువులలో బౌద్ధ ధర్మాన్ని గూర్చి అనేక దృక్పధాలు ఏర్పడసాగాయి. బుద్ధుని మహాపరి నిర్వాణంతరము సంఘారామాలలో క్రమశిక్షణను కాపాడేందుకు, బుద్ధుని ప్రవచనాలను స్పష్టంగా వివరించేందుకు బిక్షువులు ఒక సమావేశాన్ని జరపడం అవసరమని భావించినట్లు తెలుస్తుంది. వీటిని "బౌద్ధ సంఘ సమావేశాలు" అంటారు.

**7.3.7 మొదటి బౌద్ధ సంగీతి :-** బుద్ధుని మహాపరి నిర్వాణం అనంతరం అజాత శత్రువు పర్యవేక్షణలో బౌద్ధ మహాసభ రాజగృహములో సమావేశమయినది. దీనిని ప్రథమ సంగీతి (FIRST BUDDHIST COUNSE) అందురు. బుద్ధుని శిష్యుడైన మహా కాశ్యపుడు ఈ సభకు అధ్యక్షత వహించెను. ఆనందుడు బుద్ధుడు చేసిన ధర్మోపదేశాలను సభలో పఠించాడు. ఉపాలి వినయము (నీతి) గురించి బుద్ధుని ఉపదేశములను పఠించాడు. ఈ సమావేశాలందే బుద్ధుని ఉపదేశములను 'వినయ', 'సుత్త', పీటకముగా దూపొందించారు.

**7.3.8 రెండవ బౌద్ధ సంగీతి :** ఇది బుద్ధుని మహాపరి నిర్యాణం అనంతరం ఒక శతాబ్దం తరువాత జరిగెనని బౌద్ధ వాఙ్మయం చెప్పుచున్నది. ఈ రెండవ బౌద్ధ మహాసంగీతి వైశాలి నగరమందు జరిగెను. ఈ సంగీతి నాటికి బౌద్ధమతము విశేష ప్రజాధరణ పొందుట వలన బౌద్ధ బిక్షువుల ఆచార, వ్యవహారములలో విబేధములు పొడచూపెను. తూర్పు దేశాలైన వైశాలి, పాటలీపుత్రం వారికి, పశ్చిమ దేశాలైన కౌశాంబి, అవంతి దేశీయులకు ఒక వివాదం ఏర్పడింది. ఈ సమయమున మగధను పరిపాలిస్తున్న కాకవర్ణి లేదా కాలశోకుడనే రాజు ఈ మహాసభ నిర్వహణకు అన్నివిధాలా సహాయపడినట్లు బౌద్ధ వాఙ్మయం వివరిస్తుంది. వైశాలి బిక్షవుల ఆచారములు బుద్ధుని భోదలకు విరుద్ధముగా ఉన్నవని, వానియందు మార్పు తీసుకురావాలని ఈ రెండవ సంగీతిలో కోరిరి. కాని వైశాలి బిక్షువులు రెండవ సంగీతి ఆదేశములను తిరస్కరించుటచే బౌద్ధ సంఘం రెండుగా చీలినది. మార్పు కావలెనన్న వారు మహా సాంగికులుగాను, మార్పుకు ఇష్టపడనివారు థేరవాదులుగా విడిపోయిరి.

**7.3.9 మూడవ బౌద్ధ సంగీతి :-** మౌర్య చక్రవర్తి అశోకుని పర్యవేక్షణలో పాటలీపుత్రంలో తృతీయ బౌద్ధ సంగీతి జరిగెను. దీనికి మొగ్గలిపుత్త తిస్స అధ్యక్షత వహించెను. చీలికలను తొలగించి బౌద్ధ సంఘం సమైక్యతను సాధింపనెంచి జరిగిన ఈ సంగీతితో భేదములు మాత్రం సమసిపోలేదు. ఈ సంగీతి యందే త్రిపీటకాలంలో మూడవదైన 'అభిదమ్మ' రూపొందించబడింది. బౌద్ధ మతము వివిధ దేశములందు

వ్యాప్తి చేయుటకు తగు చర్యలు తీసుకొన్నారు. అశోకుడు తన కొడుకైన మహేంద్రుని థేరవాద సిద్ధాంతాన్ని వ్యాప్తి చేయుటకు సింహళ దేశానికి పంపాడు. ఇంకా అశోకుడు బౌద్ధ ప్రచార సంఘాలను పశ్చిమ ఆసియాకు, గ్రీకు రాజ్యాలకు, ఉత్తర ఆఫ్రికాకు, తూర్పు యూరపు ప్రాంతాలకు పంపాడు.

**7.3.10 నాల్గవ బౌద్ధ సంగీతి :-** కుషాణుల రాజైన కనిష్కుడు బౌద్ధమతాన్ని స్వీకరించి దానిని పోషించాడు. ఇతడు బౌద్ధ మతంలో ఏర్పడిన శాఖోపశాఖలను గమనించి, వాటిని సరిచేయడానికి కాశ్మీరులోని 'కుందలవనం' లో 'వసుమిత్రుని' అధ్యక్షతన ఒక మహాసభ ఏర్పాటు చేసాడు. ఈ సభకు 'అశ్వఘోషుడు' ఉపాధ్యక్షునిగా వ్యవహరించెను. ఈ సభయందే బౌద్ధమతం హీనయాన, మహాయాన యను రెండు ప్రధాన శాఖలుగా చీలిపోయెను. హీనయానులు బుద్ధుని అష్టాంగ మార్గము ద్వారా మోక్షము పొందవచ్చని విశ్వసించిరి. మహాయానులు బుద్ధుడిని దేవునిగా పూజింపసాగిరి. మహాయనం ప్రపంచ వ్యాప్తమైనది.

**7.3.11 బౌద్ధమత వ్యాప్తికి కారణాలు :-** భారతదేశంలో, విదేశాలలో కూడా బౌద్ధమతం వ్యాపించింది. భారతదేశమున ఆధ్యాత్మిక అశాంతి ప్రబలిన తరుణంలో బౌద్ధ మతము వెలసినది. ముఖ్యముగా బుద్ధుడు ఆనాటి ప్రజలకు తరుణోపాయాన్ని, సులభ మార్గాలను చూపించాడు. వీనిని ఎవరైనా అనుసరించవచ్చు. బౌద్ధమత సూత్రములు నిరాడంబరమైనవి. ఇవి వ్యయ ప్రయాసలతో కూడిన వైదిక యజ్ఞయాగాదులకు గాని, జైన మతమందలి కఠిన నియమాలకు గాని చెందక ఆచరణ యోగ్యమైన సుఖమైన మధ్యేమార్గమునకు చెందినవి. బౌద్ధమతములో ప్రజలకు చాలా స్వేచ్ఛయుండేది. కుల వ్యత్యాసాలను బౌద్ధమతం నిరసించింది. దీని వలన క్రింది తరగతులవారిని బుద్ధుడు ఉద్ధరించి సమాజంలో వారికి స్వేచ్ఛను ప్రసాదించాడు. మోక్షమునకు అందరు అర్హులని ఉద్ఘాటించెను. ఈ మతం సులభంగా, ప్రజల అవసరాలకు తగినట్లుగా ఉన్నది. అందువలననే అది భారతదేశపు సరిహద్దులను దాటి, ప్రపంచంలో ప్రవేశించింది.

ఎ) మతప్రచారము : బౌద్ధమతం మతప్రచారము సామాన్య ప్రజలు అర్థం చేసుకునే భాషలో అనగా పాళీ భాషలో, సులభ శైలిలో ప్రచారం చేయబడింది. ప్రజలు మాట్లాడే భాష, బౌద్ధధార్మిక గ్రంధాల భాష ఒకే భాష. అదే పాళీ భాష. ఈ భాషలో ఉన్న త్రిపీటకాలు కూడా ప్రజలకు అందుబాటులో ఉండేవి. వాటిని ప్రజలు సులభంగా చదువుకుని అర్థం చేసుకొనేవారు. విజ్ఞుల భాషయైన సంస్కృతము నందు ప్రచారము చేయలేదు. అందువలన ఎక్కువ మంది యీ సిద్ధాంతమును తెలుసుకుని స్వీకరించిరి.

బి) బుద్ధుని వ్యక్తిత్వము : బౌద్ధమత సూత్రముల కంటె బుద్ధుని వ్యక్తిత్వమే బౌద్ధ మత వ్యాప్తికి ఎక్కువగా దోహదపడినదని 'కీత్' (Keith) పండితుడు నుడివెను. బుద్ధుని యొక్క ఉన్నత వ్యక్తిత్వం ప్రజల హృదయాలను చూరగొన్నది. అతని పవిత్రమైన జీవితం, ధార్మిక చింతన, సత్ ప్రవర్తన, ఆదర్శ జీవనం, ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బుద్ధుడు మొదట తాను చెప్పిన సత్యమును త్రికరణ శుద్ధిగా ఆచరించెడివాడు. బుద్ధుని యందలి త్యాగశీలత, అసాధారణ జ్ఞానం, జీవకారుణ్యం, బోధనా శక్తి ప్రజలను ముగ్దులను చేసి బౌద్ధమతంనకు ఆకర్షింపచేసెను. బుద్ధుడు గొప్ప పండితుడు. అసాధారణ వాదనా పటిమ గలవాడు. తన దర్మ ప్రాశస్త్యమును గురించి విజ్ఞులతో వాదించి వారిచే అంగీకరింపచేసి దీని ఔన్నత్యమును చాటెడివాడు. బుద్ధుని వలె ఆయన శిష్యులు ఆనందుడు, యశ, మహా కాశ్యపుడు మొ॥ వారి కృషి వలన కూడా బౌద్ధమతము వ్యాప్తి చెందింది. బ్రాహ్మణ వర్గం నుండి బౌద్ధ మతం స్వీకరించిన వారిలో ముఖ్యులు మహా కాశ్యపుడు, సారిపుత్రమొగ్గ, ముఖ్యులు.

సి) రాజాదరణ : బౌద్ధమత వ్యాప్తికి ప్రముఖ కారణము విశేష రాజాదరణ. బింబిసారుని కాలంనుండి హర్షవర్ధనుని కాలం వరకు అనేకమంది చక్రవర్తులు బౌద్ధమతమును పోషించి ఆదరించిరి. బుద్ధుని కాలమున మగధ, కోసల, కౌశాంబి మొ॥ రాజులు, మల్ల, శాక్య, వజ్జి మొ॥ గణతంత్ర రాజ్యాలు బౌద్ధమతమును ఆదరించెను.

అశోకుడు, కనిష్కుడు బౌద్ధమతం భారతదేశంలోనే కాకుండా విదేశాలలో కూడా వ్యాపింప చేయడానికి చాలా కృషి చేసారు. అశోకుడు తన కొడుకు మహేంద్రుడిని, కూతురు సంఘమిత్రను బౌద్ధమత ప్రచారకులుగా సింహళ దేశానికి పంపాడు. ఉత్తర, షోనలను బర్మా

దేశానికి పంపెను. కనిష్కుడు కూడా బౌద్ధమత వ్యాప్తికి కృషి చేసెను. కశ్య, మాతంగునిచే చైనా నందు బౌద్ధమతం ప్రవేశ పెట్టెను. మధ్య ఆసియా, ఆగేయ, ఆసియా రాజ్యములందును బౌద్ధమతము ప్రచారము చేయబడెను. హర్షుడు, మీనాండర్ (మిళిందుడు - శకరాజు) కూడా బౌద్ధమత ప్రచారము చేసిరి.

డి) బౌద్ధ సంఘారామాలు : రాజుల కృషికి తోడుగా బౌద్ధ సంఘరామాలు, బౌద్ధమత ప్రచార సంఘాలు బౌద్ధమత వ్యాప్తికి చాలా కృషి చేశాయి. బుద్ధుడు తన శిష్యులను ధర్మసంఘముగా చేర్చి ఒక నియమావళిని రూపొందించెను. ఈ సంఘమునకు బుద్ధుడు, ధర్మము, సంఘము, అను త్రిరత్నములు శరణ్యము. సంఘము నందు చేరినవారు శిక్షణానంతరము బౌద్ధ మత సూత్రములను ప్రచారము చేయుచు నిష్కళంక జీవితమును గడిపెడివారు. ఈ విధముగా బౌద్ధమతాన్ని ప్రజలలో బాగా వ్యాపింప చేసారు. ధనికులు, పేదవారు, పురుషులు,స్త్రీలు, ఉన్నతులు, కులీనులు, పెద్ద, చిన్న భేదము లేకుండా అందరికి ధర్మోపదేశము చేసేవారు.

ఇ) మతగ్రంధాలు : బౌద్ధమతములో గొప్ప పండితులు, తాత్వికులు, వేదాంతులు అనేకమంది ఉండేవారు. వారు మత సంబంధమైన గ్రంధాలను వ్రాసారు. వారిలో నాగసేనుడు, బుద్ధదత్త, బుద్ధఘోష, దమ్మపాల, నాగార్జున, దివాకర మిత్ర ముఖ్యులు. నలంద, వల్లభి, జగదల, ఉద్దంతపూర, విక్రమశిల ముఖ్యమైన నాటి బౌద్ధ విశ్వవిద్యాలయాలు. ఇవి ఉన్నత విద్యా ప్రమాణాలతో గొప్ప ఉపాధ్యాయులను, మతాచార్యులను, సన్యాసిలను, పండితులను తయారు చేసినవి.

బౌద్ధ సంగీతులు కూడా బౌద్ధమత వ్యాప్తికి తోడ్పడెను. ఈ సంగీతిలలో బౌద్ధమత ప్రచారమునకు, బౌద్ధమత సమగ్రతకు అనేక చర్యలు తీసుకొనబడెను. బౌద్ధమత మండలి పరమత సహనము, ఇతర మతస్థుల నుండి మన్నలను పొందెను.

**7.3.12 బౌద్ధమత పతనానికి కారణాలు :** క్రీ॥శ॥ 12వ శతాబ్దానికి భారతదేశంలో బౌద్ధమతం లేకుండా పోయింది. బీహార్‌లోను, బెంగాల్‌లోనూ, కొనసాగిన బౌద్ధమతం, క్రీ॥శ॥ 12వ శతాబ్దం తరువాత భారతదేశం నుండి పూర్తిగా అదృశ్యమైపోయినది. దీనికి అనేక కారణాలు కలవు.

ఎ) రాజాదరణ కోల్పోవుట : రాజాదరణ కోల్పోవుట, బౌద్ధమత క్షీణతకు ప్రధాన కారణం. భారతదేశమును పరిపాలించిన మౌర్యులు, కుషానులు, అనంతరము వచ్చిన రాజవంశములలో బౌద్ధమతమును ఎవరు పోషించలేదు. బ్రాహ్మణ రాజైన పుశ్యమిత్ర శుంగుడు బౌద్ధులను హింసించాడని చెపుతారు. క్రీ॥శ॥ 6,7 శతాబ్దములో బౌద్ధుల మీద జరిగిన హింసలకు అనేక నిదర్శనాలు కనిపిస్తాయి. శుంగులు, కణ్వులు, గుప్తులు హిందూ మతమును పునరుద్దరించిరి. శివారాధకుడైన హుణరాజు, మిషిరకులుడు వందలాది బౌద్దలను చంపాడు. శైవుడైన, శశాంక గౌడుడు బుద్ధ గయలోని బోధివృక్షాన్ని నరికి వేసాడు. ఈ విధంగా రాజాధరణ కోల్పోవడంతో బౌద్ధమతం క్షీణ దశకు చేరుకున్నది.

బి) హిందూమత విజృంభణ : బౌద్ధమతం ప్రజలనుండి గొప్ప ఆదరాభిమానాలను చూరగొన్నదిగాని, హిందూమతాన్ని మాత్రం తొలగించలేకపోయింది. దీనికి ప్రధాన కారణం బౌద్ధమతం మతములో ఉన్న ఏ దుష్ట సాంప్రదాయాలకు వ్యతిరేకంగా మొదట పోరాడిందో వాటికే బౌద్ధమతం చివరకు లోబడిపోయింది. కుమారిలభట్టు, శంకరాచార్యుడు హిందూ మతోద్ధరణకు కృషి చేసినారు. బౌద్ధ, జైన మత మండలి లోపములను ఎత్తిచూపుతూ హిందూ మతాన్ని సంస్కరించిరి. పశు సంపదను రక్షించుకోవలసిన అవసరాన్ని గురించి వారు కూడా నొక్కి చెప్పడం ప్రారంభించారు. స్త్రీలను, శూద్రులకు, స్వర్గానికి వెళ్ళే అవకాశాన్ని కల్పించారు.

సి) విదేశ దండయాత్రలు : హుణ, మహమ్మదీయులవంటి విదేశ దండయాత్రలు కూడా బౌద్ధమత పతనానికి కారణమయ్యెను. హూణ నాయకుడైన తోరమాణుడు తక్షశిలా విశ్వవిద్యాలయమును నాశనము చేసెను. ఇంకా వీరు అనేక బౌద్ధాలయాలను, బౌద్ధారామాలను ధ్వంసం చేసిరి. అరబ్బుల దండయాత్ర వలన కూడా బౌద్ధ సంఘారామాలు, బౌద్ధ చైత్యాలు నాశనమయ్యాయి. వారు అనేక మంది బౌద్ధులను వధించారు. మహ్మద్‌ఘోర్ సేనాధిపతియగు మహ్మద్-బిన్-భక్తియార్ జగత్ విఖ్యాతి గాంచిన నలందా విశ్వ విద్యాలయమును సమూలంగా నాశనం చేసెను.

డి) బౌద్ధారామాల్లో అవినీతి : బౌద్ధమతం సామాన్యులకు అందుబాటులో ఉండేది. కాని దానిలోని కఠినమైన క్రమశిక్షణ ఆ మతమువారికి కష్టముగా ఉండేది. బౌద్ధ మతములోని నాస్తిక వాదం ఆ మతాన్ని ప్రజలకు దూరం చేసింది. కాని కొంత కాలమయిన తరువాత మహాయాన శాఖ బలపడిన తరువాత బుద్ధున్ని పూజించడం మొదలు పెట్టారు. బౌద్ధ సంఘారామాలలో అయోగ్యులైన వ్యక్తులు ప్రవేశించి సాంఘిక నియమాలను సడలించుకొని ఎన్నో నీచమైన పనులు చేస్తుండేవారు. అవి బౌద్ధమత సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉండేవి. వజ్రాయన బౌద్ధమతం (తాంత్రిక బౌద్ధ మతం) బౌద్ధ మతంలో ఒక శాఖగా రూపొందింది. వీరు బుద్ధుడు భోదించిన ధర్మాన్ని పాటించలేదు.

బౌద్ధారామాలలో పుష్కలంగా ఉన్న సంపదతో అక్కడే నివసిస్తున్న స్రీలు మరింత పతనానికి దారి చూపారు. బౌద్ధులు స్త్రీలను కాముక దృష్టితో చూడటం ప్రారంభించారు. బుద్ధుడు అతని ప్రియ శిష్యుడైన ఆనందునితో "స్త్రీలను, ఆరామాలలోనికి అనుమతించకుండా ఉంటే బౌద్ధమతం మరో వెయ్యేళ్ళు బ్రతికేది. అనుమతించాం కాబట్టి 200 ఏళ్ళు మాత్రమే బ్రతుకుతుంది''. అని అన్నాడని చెపుతారు.

ఇ) హిందూమత పునరుద్ధరణ : బౌద్ధ మత పతనానికి ముఖ్య కారణం సనాతన బ్రహ్మణ మత పునరుద్ధరణ. గుప్తరాజులు బ్రాహ్మణ మతాన్ని ఆదరించారు. 8వ శతాబ్దం నుండి 11వ శతాబ్దం వరకు ఉత్తర భారతదేశాన్ని పరిపాలించిన రాజపుత్ర రాజులు బౌద్ధ మతానికి అనుకూలంగా లేరు. వారికి అహింసా సిద్ధాంతం పైన నమ్మకం లేదు. వారు హిందూ మతంలోని శక్తిని పూజించారు. దీనివలన హిందూ మతం అభివృద్ధి చెంది బౌద్ధ మతం క్రమక్రమముగా పతనమయినది.

## 7.4 జైన, బౌద్ధ మతాల మధ్య పోలికలు :-

బౌద్ధ, జైన మతములు రెండూ సమాజంలో నాటి కర్మ కాండలతో నిండిన వైదిక మతముపై తిరుగుబాటుగా ఆవిర్భవించుట వలన ఈ రెండింటికి మధ్య కొన్ని సామ్యములు ఏర్పడెను.

(1) వైదిక మతంలోని యజ్ఞయాగాదులను, కర్మకాండలను, బలులను, మూఢాచారాలను జైన, బౌద్ధ మతాలు వ్యతిరేకించాయి.

(2) ఈ రెండు మతములు అహింసా, సత్యము, భూతదయ, మొదలగు అంశములను మానవుడు పాటించుట ద్వారా ఆత్మసంస్కారం, జ్ఞాన సముపార్జన, జీవకారుణ్యం సాధించి మోక్షము పొందవచ్చని తెలియజేసెను.

(3) ఈ రెండు మతాలు సమాజంలోని కుల వర్గాలను నిరసించాయి. సమానత సిద్ధాంతాన్ని విశ్వసించాయి. వీరి కృషి వలన వర్ణ వ్యవస్థలో కొంత సడలింపు వచ్చింది.

(4) రెండునూ వేదములు ప్రమాణ గ్రంధములు కావని, ప్రజల భాషలో రెండు మతాల వారు బోధనలు చేసారు.

(5) రెండు మతాలు సమాజంలోని బ్రాహ్మణుల యొక్క ఆధిక్యతను వ్యతిరేకించాయి.

(6) ఉపనిషత్తులలోని కర్మ, పునర్జన్మ, మోక్ష సిద్ధాంతములను రెండు మతాలు అంగీకరించినవి. ఈ జన్మలో చేసిన పాపపుణ్యాలపై మానవుని పునర్జన్మ ఆధారపడి ఉండునని చెప్పినవి.

(7) వర్ధమాన మహావీరుడు, గౌతమ బుద్ధుడు ఇద్దరూ క్షత్రియులే. సుఖ సంతోషాలను, రాజ భోగాలను విడిచి, సన్యాసులై, జ్ఞానులై నూతనత్వాన్ని ప్రజలకు బోధించాడు.

(8) రెండు మతములకు దేవునిపై విశ్వాసం లేదు. కనుక కపటముతో, వ్యయ ప్రయాసలతో కూడిన పూజా పునస్కారములు వీరిలో లేవు.

(9) రెండూ ఉత్తర భారతదేశంలో ఆవిర్భవించాయి. రెండు మతాలలో కాలక్రమములో చీలికలు ఏర్పడ్డాయి.

నాటి ఆధ్యాత్మిక రంగంలో నెలకొని ఉన్న అశాంతిని తొలగించి సామాన్య మానవునికి తరుణోపాయం చూపడం ఈ రెండు మతాల ఉద్దేశ్యం. మోక్షం పొందడానికి కుల, మత వ్యత్యాసం లేదని అందరూ మోక్షం పొందడానికి అర్హులేనని రెండు మతాలు చెప్పాయి.

## 7.5 జైన, బౌద్ధ మతాల మధ్య భేదాలు :-

(1) జైన మతం ప్రతీ ప్రాణికే గాక, ప్రతి జడ పదార్థమునకు కూడా ఆత్మ కలదని విశ్వసించెను. ఆత్మను గురించి బుద్ధునికి అభిప్రాయం లేదు. అతని అభిప్రాయం ప్రకారం ఆత్మ, కోరికల సమిష్టి రూపం.

(2) జైన మతంలో శ్వేతాంబర శాఖ వారు తెల్లని వస్త్రంలను ధరించిరి. దిగంబరులు నగ్నముగా ఉండెడివారు. కఠోరమైన అహింసా వ్రతం, ముక్కుపై గుడ్డ వేసుకొని గాలి పీల్చుట, దీపములు వెలిగింపగకుండుట ఇందులో కలవు. ఇలాంటి కఠోర నియమాలు బౌద్ధ మతంలో లేవు.

(3) బౌద్ధులు అహింసా సిద్ధాంతాన్ని జైనుల వలె ఆచరించలేదు. జైన అహింసా సిద్ధాంతం కఠోరమైన ఆచరణోగ్యము కానిది.

(4) జైన మతములో తీవ్ర ఉపవాసాలు, సల్లేఖనం వంటి కఠిన నియమాలుండేవి. వీటి వలన మోక్షం పొందవచ్చు. కాని బౌద్ధ మతంలో అతిభోగములకు, వ్రతకాఠిన్యములకు చెందని "మధ్యేమార్గం" లేక "అష్టాంగ మార్గం" ద్వారా మోక్షం పొందవచ్చని చెప్పారు.

(5) జైన సంఘం బలహీనముగా ఉండేది. వ్యవస్థాపరమైన విధానం లోపించింది. బౌద్ధ సంఘం చాలా బలమైనదిగా ఉండేది. ప్రచార సంఘాలు కూడా ఉండేవి. చక్కని వ్యవస్థలతో కూడుకున్నది.

(6) జైన మతము వైదికమతంతో సన్నిహితంగా వ్యవహరించగా బౌద్ధమతానికి, వైదికమతానికి మధ్య చాలా వ్యత్యాసాలున్నాయి.

(7) బౌద్ధ మతానికి ఉన్నంత రాజాదరణ, పోషణ, జైన మతానికి లేదు. అందువలన అది విదేశాలకు వ్యాపించలేదు. కాని స్వదేశంలో నిలిచింది. బౌద్ధ మతానికి విశేష రాజాధరణ ఉన్నందున విదేశాలకు కూడా వ్యాపించింది. స్వదేశంలో అదృశ్యమై, విదేశాలకు విస్తరించి ప్రపంచ మతం అయినది.

(8) బౌద్ధ సంఘమందు ఐహిక ప్రపంచం, భోగములను విసర్జించిన వారే సభ్యులు అగుటకు అర్హులు. జైన సంఘం నందు సంసార జీవితమును అనుభవించు వారు కూడా సభ్యులగుటకు అర్హులు.

## 7.6 సారాంశము :

క్రీ.పూ. 6 వ శతాబ్దంలో ఉద్భవించిన బౌద్ధ, జైన మతాలు భారత దేశపు సాంఘీక, సామాజిక, మత వ్యవస్థలపై విశేష ప్రభావాన్ని చూపాయి. ఈ మతాలు భారత దేశంలో వివిధ ప్రాంతాలకు విస్తరించడమేకాక విదేశాలలో కూడ వ్యాప్తి చెందాయి. ముఖ్యంగా బౌద్ధమతము అజ్షేసియా దేశాలలో విరివిగా వ్యాప్తి చెంది అక్కడి ప్రజాజీవితాన్ని విపరీతంగా ప్రభావితం చేసింది.

## 7.7 మాదిరి ప్రశ్నలు

1. జైన బౌద్ధమతాలు ఆవిర్భవించుటకు గల కారణాలు వ్రాయుము ?

2. క్రొత్త మతాల ఆవిర్భావం ఎలా జరిగింది ?

3. బౌద్ధమతం గూర్చి, మతంలోని మహాసభలు, శాఖలు గూర్చి క్షుణ్ణంగా వ్రాయుము?

4. బౌద్ధమత పతనానికి గల కారణాలు తెలుపుము ?

5. జైన - బౌద్ధ మతాల మధ్యగలపోలికలు, భేదాలు వివరింపుము ?

## సంక్షిప్త ప్రశ్నలు

1. బౌద్ధమతం గురించి వ్రాయుము ?

2. గౌతమ బుద్ధుని బోధనలు గూర్చి వ్రాయుము ?

3. బౌద్ధశాఖల గురించి క్లుప్తంగా వ్రాయుము ?

4. జైన మతం గురించి వ్రాయుము ?

పాఠం - 8

# విదేశీ దండయాత్రలు

## 8.0 లక్ష్యం :

భారతదేశంపై తొలి విదేశ దండయాత్రలైన పారశీక, గ్రీకు దండయాత్రలు, వాటి గమనము, ఫలితాలు వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం :


8.1 ఉపోద్ఘాతం

8.2 పారశీక దండయాత్రలు

8.3 అలెగ్జాండర్ దండయాత్రలు

8.4 భారతదేశ రాజకీయ పరిస్థితి

8.5 తొలి విజయాలు

8.6 జీలం యుద్ధం (క్రీ.పూ. 326)

8.7 సారాంశము

8.8 మాదిరి ప్రశ్నలు


## 8.1 ఉపోద్ఘాతము :

భారత దేశంలోని ఈశాన్య భాగంలో చిన్న చిన్న సామంత రాజ్యాలు, స్వతంత్ర రాజ్యాలు మగధ సామ్రాజ్యంలో విలీనమైనాయి. వాయువ్య భారతదేశం విదేశ దండ యాత్రలకు గురి అయ్యెను. ఇందులో మొదటిది పారశీక దండయాత్ర. పర్షియా రాజైన సైరస్ (cyrus) బాహ్లిక, గాంధార రాజ్యములను జయించి ఆక్రమించెను.

## 8.2 పారశీక దండయాత్రలు :

మగధ రాజులలోని కాలములోనే తమ సామ్రాజ్యాన్ని విస్తరింప జేసిన ఇరాన్‌కు చెందిన అకిమేనియన్ రాజులు వాయువ్య భారతదేశంలోని రాజకీయ అనైక్యతను అవకాశంగా తీసుకున్నారు. క్రీ.పూ. 516లో ఇరాన్ రాజు మొదటి డేరియస్ సైలాక్సు అను గ్రీకు సేనాని నాయకత్వములో సైన్యాన్ని భారతదేశమునకు పంపెను. ఇతను వాయువ్య ప్రాంతంలోనికి ప్రవేశించి పంజాబ్‌ను, సింధూ నది పశ్చిమ ప్రాంతాన్ని, సింధును ఆక్రమించుకున్నాడు. ఆ ప్రాంతాన్ని 29వ శత్రపి (రాష్ట్రం) రాష్ట్రంగా చేసుకొనెను. ఈ విధముగా పారశీక సామ్రాజ్యములో సింధు అంతర్భాగమై ఏటా కొన్ని మణుగుల బంగారం (360 టాలెంట్లు) కప్పముగా చెల్లించెడిదట. ఆసియా ప్రాంతాల నుంచి ఇరానియన్ సామ్రాజ్యానికి లాభముగా ఆదాయములో ఇది మూడో భాగముగా ఉండేది. పారశీకులు సింధు ప్రజలను సైన్యములో చేర్చుకుని వారిని విదేశ యుద్ధములందు వాడుకొనిరి. డేరియస్ తరువాత ఇరాన్ సామ్రాజ్యానికి చక్రవర్తియైన జెక్సిస్.

గ్రీకులతో జరిగిన యుద్దములో భారత సైనికులును ఉపయోగించాడు. సింధు ప్రాంతం అలెగ్జాండరు దండయాత్ర వరకు ఇరానియన్ సామ్రాజ్యములో భాగముగా ఉండెను.

**8.2.1 దండయాత్ర ఫలితాలు :** భారత, ఇరాన్‌ల మధ్య సంబంధాలు రెండు సం॥లు కొనసాగినవి. దీని ఫలితంగా వ్యాపార సంబంధాలు ప్రారంభమయినాయి. సంస్కృతి జీవన విధానముపై ఎక్కువ ప్రభావాన్ని చూపాయి. ఇరానియన్ లేఖకులు కరోష్టి అను లిపిని భారతదేశమున ప్రవేశపెట్టిరి. మధ్య ఆసియా రాజ్యములకు, గ్రీసు మొ॥ పాశ్చాత్యరాజ్యములకు, భారతదేశమునకు మధ్య వర్తక సంబంధములేర్పడెను. పారశీకులు కప్పము రూపమున అపార ధనరాశులను, సిరిసంపదలను, మన దేశమునుండి తీసుకు వెళ్లారు. సత్రపి యను పారశీక పదమును రాష్ట్రములకు వాడుట ఆచరామైనది. కొన్ని పారశీక ఆచార సాంప్రదాయాలను మౌర్యులు అనుసరించిరి. ఉదాహరణకు మంత్రివర్గ సమావేశములకు ఆరంభమున అఖండ జ్యోతిని వెలిగించుట, మొ॥ భారతీయులు పారశీక వాస్తు శిల్ప శాస్త్రములను అనుసరించిరి. అశోకుని శాసనాలలో ఉన్న ఉపోద్ఘాతాలలోనూ, వాటిలో ఉపయోగించిన కొన్ని పదాలలోను ఇరానియన్ ప్రభావం కనిపిస్తుంది.

## 8.3 అలెగ్జాండర్ దండయాత్రలు :

**8.3.1 పశ్చిమాసియా విజయాలు :** చరిత్రలో విశ్వవిజేతగా పేరుగాంచిన వ్యక్తి అలెగ్జాండరు. గ్రీకు తత్వవేత్తయగు అరిస్టాటిల్ శిష్యుడు. క్రీ.పూ. 4 వ శతాబ్దంలో గ్రీకులు, ఇరానియన్‌లు ప్రపంచాధిపత్యం కోసం పోరాడుకున్నారు. మాసిడోనియాకు చెందిన అలెగ్జాండరు నాయకత్యంలో గ్రీకులు చిట్టచివరకు ఇరానియన్ సామ్రాజ్యాన్ని ధ్వంశం చేసారు. అలెగ్జాండర్ తన తండ్రి ఫిలిఫ్ మరణానంతరం తన 20 వ యేట క్రీ.పూ. 330లో మాసిడోనియా సింహాసనం అధిష్టించి, గ్రీకు, పర్షియా, ఆసియా మైనర్, ఈజిప్టులను జయించెను. క్రీ.పూ. 330లో పారశీక రాజ్యముపై దండెత్తి 3వ డేరియస్‌ను అర్బేలా (Arbella) యుద్దంలో ఓడించి అతని రాజధానియైన పెర్సీపోలిస్‌ను దగ్ధమార్చెను. ప్రపంచ విజేత కావాలన్న కోరికతో తన దండయాత్రలను తూర్పు, ఈశాన్య ప్రాంతాలకు విస్తరించే క్రమములో కాందహార్, అలెగ్జాండ్రియా, కొరటాన్ ప్రాంతాలను జయించినాడు.

భారతదేశంలోని అశేషధనసంపద ఆకర్షించడం వలన భారతదేశాన్ని జయింప నిశ్చయించుకున్నాడు. ఇరాన్ నుంచి భారతదేశం మీదకు తన సైన్యాన్ని నడిపించాడు. ఇంకా చరిత్రపిత హెరిడోటస్, ఇతర గ్రీకు రచయితలు భారతదేశాన్ని అద్భుత దేశంగా చిత్రించారు. ఈ వర్ణనలు అలెగ్జాండర్ భారతదేశం మీదకు దండెత్తిరావడానికి ప్రోత్సహించాయి. భారతదేశంపై అలెగ్జాండర్ చేసిన దండయాత్రల వివరాలను తెలుసుకోవడానికి ముఖ్యమైన ఆధారాలు గ్రీకు రచనలు. అవి స్ట్రాబో (STRABA), ఎరియన్ (ARRIAN), ప్లూటార్చ్ ((PLUTARCH) కర్టియస్ (CURTAUS). ఎరియన్ 'అణాబేషిస్ ఆఫ్ అలెగ్జాండర్' (ANABASIS OF ALEXANDER) అనే తన గ్రంథములో భారతదేశముపై అలెగ్జాండరు చేసిన దండయాత్ర ఎంతో గొప్పగా వర్ణించాడు. నియర్‌బిస్ కూడా అలెగ్జాండరు దండయాత్ర గురించి వ్రాసాడు. ఒనిసిక్రిటస్ (ONESICRITUS) తన రచనలో అలెగ్జాండరు జీవిత చరిత్రను వర్ణిచాడు, అంతేగాక అలెగ్జాండరుతో భారతదేశానికి వచ్చిన శాస్త్రవేత్తలు, సైనికాధికారులు తమ రచనలలో అలెగ్జాండరు చేసిన ప్రతి యుద్దం గురించి వివరించారు.

## 8.4 భారతదేశ రాజకీయ పరిస్థితి :

వాయువ్య భారతదేశంలోని రాజకీయ పరిస్థితి అలెగ్జాండరు ప్రణాళికకు అనుకూలంగా ఉంది. ఆ ప్రాంతం చిన్న గణ తంత్ర రాజ్యాలుగా, గిరిజన రాజ్యాలుగా విభజింపబడి ఉన్నది. వారికి ఆ ప్రాంతాలమీద, రాజ్యలమీద అపారమైన భక్తి ఉంది. పరస్పర కలహములుండుట వలన రాజకీయ అనైక్యత ప్రబలెను. ఆ ప్రాంతాలలో ఇద్దరు ప్రసిద్దరాజులు గలరు. వారు తక్షశిల రాజైన అంబి, జీలం-చీనాబ్ నదుల మధ్య ఉన్న ప్రాంతానికి రాజైన పోరస్. వీరిద్దరు ఏకమై ఉంటే అలెగ్జాండరును నిరోధించగలిగేవారు. కాని వీరు

కలిసి ఉండలేదు. ఇంకా దక్షిణ పంజాబ్‌లో శిబి, మాళవ, క్షుద్రక, అంబస్త మొ॥ రాజ్యములుండేవి. ఇవి నిరంతరము కలహించుకుంటూ ఉండేవి. పై కారణాల వలన వీరు సరిహద్దు రక్షణ పట్ల అజాగ్రత్త వహించడం జరిగింది. ఫలితంగా విదేశ దండయాత్రను ఎదుర్కోవలసి వచ్చెను. తక్షశిల, పౌరవరాజ్యాల మధ్య ఎప్పుడు బద్దవైరం ఉండేది.

క్రీ.పూ. 327 మే లో అలెగ్జాండరు హిందూకుష్ పర్వతాలు దాటి ప్రకృతి పరముగా ఏర్పడిన ఖైబర్, బోలన్ కనుమల గుండా భారతదేశంలో ప్రవేశించెను. ఇతను భారతదేశములో ప్రవేశించే ముందు బెలూచిస్థాన్, ఖైబర్ కనుమల దారిలో కొండజాతులు, ఆటవిక జాతులకు సంబందించిన స్వాట్, బుజేరి తెగలతో పోరాడి వారిని అణిచివేసెను.

## 8.5 తొలి విజయాలు :

బెలూచిస్థాన్‌లోని స్వాట్, బుజేరి కొండజాతులను అణచిన అలెగ్జాండరు తన సైన్యాన్ని రెండు భాగాలుగా విభజించి, కొంత భాగమును హఫిస్టియన్ (HAPHAESTIAN), పెర్టికాన్ (PERDICIS) సేనాధిపతుల నాయకత్వములో కాబూల్‌నది, దక్షణతీరాన కైబర్ కనుమల గుండా సింధునది వరకు పోయి ఫెషావర్ మైదానం చేరే ఏర్పాట్లు చేయమని ఆదేశించాడు. ఆ విధంగా ఆ సైన్యం శశిగుప్తుడనే దేశద్రోహి సాయంతో పుష్కలావతిని ఆక్రమించి సింధు నదిని చేరింది.

రెండవ భాగమునకు అలెగ్జాండర్ తాను నాయకత్వం వహించి హిందూకుష్ పర్వతములమీదుగా కూనార్, సంజికారా, స్వాట్ లోయలను ఆక్రమించి కొండజాతివారగు అస్సాసియో (ASSASSIO), అస్సఖినాయ్ (ASSAKENOI) ల ఓడించెను. ఈ ప్రాంతానికి నికెనార్‌ను పాలకునిగా నియమించి అక్కడనుండి సింధూనది ప్రాంతంలో తెపాయిసన్, ఫెర్డికాన్ నాయకత్వంలోని సైన్యాతన్ని చేరాడు, ఈ వార్త విన్నంతనే తక్షిశిల అంభి, అభిసార రాజ్యాధినేతలు అలెగ్జాండరుకు కానుకలు అర్పించి దాసోహమనిరి. అంతేగాక అంబి గ్రీకు సైన్యానికి తన రాజ్యంలో కొంత కాలం విశ్రాంతి కల్పించాడు. పౌరవరాజ్యపాలకుడైన పురుషోత్తమునిపై దండయాత్రకు అంబి అలెగ్జాండరుకు సైనిక సహాయం చేయడానికి సమ్మతించాడు. ఈ విషయం తెలుసుకున్న పురుషోత్తముడు తన రాజ్యాన్ని కాపాడుకోవడానికి అలెగ్జాండరును ఎదిరించడానికి నిశ్చయించాడు.

## 8.6 జీలం యుద్ధం (క్రీ.పూ. 326):

జీలం నది ఉభయ పాశ్వాలలో గ్రీకు, హిందూ సైన్యాలు యుద్ధ సన్నాహాలు ప్రారంభించాయి. అందులో జీలంనదికి తూర్పున పురుషోత్తముడు 30 వేల కాల్బలం, 40 వేల అశ్వకదళం, 300 రథాలు, 200 ఏనుగులతో యుద్ధానికి సన్నద్ధమైనాడు. జీలంనదికి ఆవలఉన్న అలెగ్జాండర్ తన సైన్యంతో నదికి దాటే ప్రయత్నం చేసాడు. జీలం నది వరదలతో ఉండటంవలన అలెగ్జాండర్ ఒక అర్ధరాత్రివేళ 16మైళ్ళ యెగువకు వెళ్ళి జీలం నదిని దాటి వెనుక నుండి పురుషోత్తమునిపై అకస్మాత్తుగా దాడి చేసాడు. పురుషోత్తముడు తన సైన్యముతో గ్రీకు సైనికులతో వీరోచితముగా పోరాడాడు. చివరకు అలెగ్జాండర్ పోరస్‌ను ఓడించి బందీ చేసెను. కానీ అలెగ్జాండర్ అతని ధైర్య సాహసాలను చూసి ఎంతో మెచ్చుకొని అతని రాజ్యాన్ని అతనికి తిరిగి ఇచ్చివేసాడు. తరువాత రావి, చీనాబ్ నదిని దాటి అలెగ్జాండర్ పురుషోత్తముని బంధువగు చిన పురుషోత్తముని లోబరుచుకొనెను.

చీనాబ్ నుండి బియాస్ నదీ తీరమునకు చేరుకొని మార్గమధ్యమున కథుల నోడించి వారి ముఖ్య పట్టణమగు సంగాలను నాశనము చేసెను. బియాస్ నది తూర్పు భాగమున అపారమైన సైనిక బలము ఉన్న బలమైన నంద రాజ్యము గురించి విన్న గ్రీకు సైనికులు ముందుకు పోవడానికి నిరాకరించారు. అంతే గాక విపరీతమైన వర్షాలు కారణంగా పొంగి ప్రవహిస్తున్న నదులను చూసి గ్రీకు సైనికులు ముందుకు పోవడానికి నిరాకరించినట్లు తెలుస్తుంది. అదియును గాక యుద్ధ అలసట, స్వదేశమునకు పోయి భార్యా బిడ్డలను చూసుకుపోవాలనే తపన వారిని ముందు సాగనివ్వలేదని చరిత్రకారుల అభిప్రాయము.

అలెగ్జాండరు తన సైనికులకు తలవంచి స్వదేశానికి పయనం కట్టాడు. తిరుగు ప్రయాణంలో జీలం, చీనాబ్ నదుల సంగమ స్థానమునగల మల్ల, శిబి, క్షుద్రక జాతుల నాయకత్వంలో గణ రాజ్యాల కూటమి అలెగ్జాండరుతో తలపడి ఓడిపోయినది. అలోగ్జాండరు సైన్యంలోని ఎక్కువ భాగం బోలన్ కనుమల ద్వారా స్వదేశానికి తిరిగిపోగా మరి కొంత సైన్యం సింధూ నది దిగువన కరాచీ ప్రాంతానికి చేరి అరేబియా సముద్రం మీదుగా నౌకలలో తిరిగి వెళ్ళారు. భూ మార్గం గుండా అలెగ్జాండరు క్రీ.పూ. 324లో స్వదేశానికి బయలుదేరి సుసా పట్టణం మీదుగా బాబిలోన్ చేరి క్రీ.పూ 323లో మరణించెను.

**8.6.1 ఫలితాలు :-** అలెగ్జాండరు దండయాత్రను అపూర్వ చరిత్రగా గ్రీకు చరిత్రకారుల పేర్కొనిరి. కాని భారతీయ చరిత్రకారులు దానిని త్రోసి పుచ్చిరి. అలెగ్జాండరు సరిహద్దు ప్రాంతాలలోని చిన్న చిన్న రాజ్యాలను మాత్రమే జయించెను. బలమైన సైనిక సంపత్తి కలిగిన మగధ లాంటి పెద్ద రాజ్యాలతో తలపడ లేదు. కాబట్టి అతని విజయాన్ని గ్రీకు, భారతీయ సైనికుల బలాబలాలకు నిదర్శనం అనలేము.

(1) అలెగ్జాండరు భారతదేశంలో తాను జయించిన భూప్రాంతాన్ని ఐదు రాష్ట్రాలుగా విభజించి తనకు విశ్వాస పాత్రులు, గ్రీకు దేశం నుండి తనతో వచ్చిన సెల్యుకస్, నికోనార్ మొ॥ వారిని తన ప్రతినిధులుగా నియమించెను.

(2) గ్రీకుదండ యాత్రతో పశ్చిమోత్తరమున ఉన్న రాజ్యములు బలహీనపడినవి. ఫలితముగా చంద్ర గుప్త మౌర్యునిచే సులభంగా జయించబడి సువిశాల సామ్రాజ్యం ఏర్పాటుకు దోహదం చేసెను.

(3) భారతదేశానికి పశ్చిమాసియా, ఐరోపా దేశములతో రహదారులు, సాంస్కృతిక సంబంధములు ఏర్పడినవి.

(4) భారతదేశములో వాడుకలో ఉండి నిర్దిష్టమైన ఆకారం లేని పంచ్ మార్క్ నాణెము గ్రీకు దండయాత్రల మూలంగా ఏర్పడిన అభివృద్ధి క్రమములో ఒక నిర్దిష్టమైన ఆకారాన్ని రూపొందించుకున్నది.

(5) గ్రీకు వలసవాదులు వాణిజ్య పంటలను రష్యాలోని తురుకిస్థాన్ నుండి భారతదేశానికి వ్యాపింపచేశారు.

(6) భారతదేశ ఉపనిషత్తుల, ఆధ్యాత్మిక చింతన గ్రీకులను ముగ్ధులను చేసెను. గ్రీకుల ఖగోళ శాస్త్రలలో, యుద్ధ రీతులు భారతీయులను ఆకర్షించినవి.

(7) అన్నింటి కంటే ప్రధానమైన అంశం శిల్పనిర్మాణ రీతిలో భారతీయ, గ్రీకుల లక్షణాల సమ్మేళనం జరిగింది. దీనిని కనిష్కుని కాలంలో గాంధార శిల్పమని వ్యవహరించిరి.

(8) భారతదేశమునకు సంబంధించిన అంశములను గురించి గ్రీకులు వ్రాసిన విషయాలు ఆనాటి చరిత్ర పునర్నిర్మాణమునకు ఉపయోగపడుచున్నవి.

(9) అలెగ్జాండర్ దండయాత్రతో భారతదేశానికి కాబూల్, బెలూచిస్థాన్, గెడ్రోషియా భూ మార్గాల ద్వారా వాణిజ్య సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ భూమార్గాలే గాక మక్రాన్ నది ద్వారా సముద్ర మార్గం కూడా ఏర్పడినది. వ్యాపార బృందాలు, ఓడలు, మధ్యదరా సముద్ర ప్రాంతానికి, మధ్య ఆఫ్రికాకు, అరేబియాకు, సుగంధ ద్రవ్యాలు, అత్తరులు, మందులు, దంతాలు, ఆభరణాలు మొ॥ వస్తువుల్ని భారతదేశం నుంచి సరఫరా చేసినవి.

(10) గ్రీకు దండ యాత్రల వలన శాశ్వత రాజకీయ ఫలితాలు లేకపోయినా సాంస్కృతికంగా గ్రీకు, భారతదేశాలు సన్నిహిత మయ్యాయి.

## 8.7 సారాంశము :

పర్షియన్, గ్రీకు దండయాత్రలు భారతీయ వాస్తు, శిల్పకళ సంస్కృతులపై విశేష ప్రభావాన్ని చూపాయి. గాంధార శిల్ప పద్ధతిలో విదేశ పోకడలు కొట్టివచ్చినట్లు కన్పడుతున్నాయి. అంతేకాక తరువాతి కాలంలో వచ్చిన మౌర్యుల సామ్రాజ్యానికి ముందుబాటలు వేశాయి.

### SUGGESTED READINGS


1. All chin. B and R. Allchin : 'The Birth of Indian Civilization', Harmondsorts 1968
2. Barth. A : 'The Religions of India', New Delhi 1978 (Repriut)
3. Bhasham, A.L. : 'The Wonder that was India.
4. The Cultural Heritage of India, Vol. I, Ramakrishna Mission, Calcutta 1970
5. Ghosh. A. (ed) : 'An Encyclopedia of Indian Archaeology', New Delhi. 1982
6. Kochher, Rajesh : 'The Vedic People', Hyderabad 2000
7. Kosambi. D.D : 'An Introduction to the study of Indian History' Bombay 1975.
8. Mecrindle, John. W : 'Ancient India as Described in clessical Literature', patna 1987.
9. Majumdar. R.C (ed) '' : 'The Age of Imperial Unity', Bombay 1980
10. Majumdar. R.C. (ed) : 'The vedic Age', Bombay 1992 (Reprint)
11. Majumdar. R.C. : H.C. Raychavdhuri & A.K. Datta : 'An Advanced History of India'. London. 1960
12. Mukheji. R.K : 'Hindu Civilization', Bombay 1963
13. Nilakantha Sastry K.A. (ed) : 'The Age of the Nandas and Mauryas' Delhi, 1988
14. Sarma. R.S. : 'Looking for the Aryans' Chennai 1994
15. Sarma, R.S : 'Advent of the Aryans', Delhi. 1999
16. Thaper, Romilla : Hisotry of India Vol - I, New Delhi, 1966 (Reprint)


## 8.8 మాదిరి ప్రశ్నలు

1. పారశీక దండయాత్రలు, వాటి ఫలితముల గూర్చి వ్రాయుము.
2. అలెగ్జాండరు దండయాత్రలు, విజయాల గూర్చి వ్రాయుము ?
3. భారత రాజకీయ పరిస్థితులు, తొలి విజయాలను గూర్చి వ్రాయుము ?
4. జీలం యుద్ధం, వాటి ఫలితాల గూర్చి వ్రాయుము ?

**ఖండిక 3**

## పాఠం : 9

# మౌర్యసామ్రాజ్యం

**విషయక్రమం :**


9.1 ఉపోద్ఘాతం

9.2 ఆధారాలు

9.3 చంద్రగుప్తమౌర్యుడు

9.4 బిందుసారుడు

9.5 సారాంశం


## 9.1 ఉపోద్ఘాతం :

వాయవ్య భారతదేశంలోని గ్రీకు శాత్రపీలను జయించి విదేశీ పాలనను అంతము చేయుటయేకాక ప్రజలను హింసిస్తూ వారిని అనేక బాధలకు గురిచేస్తున్న నందరాజుల నిరంకుశ పాలన నుండి మగధ ప్రజలను విముక్తము చేసి నందరాజ్య శిధిలాలపై మన దేశ చరిత్రలోనే మొట్ట మొదటి సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించిన వాడు చంద్రగుప్త మౌర్యుడు. ఇతడు స్థాపించిన మౌర్య సామ్రాజ్యము ఉత్తరాన హిమాలయాలు, ఆక్సస్‌నది నుండి దక్షిణాన తుంగభద్రనది వరకు విస్తరించింది. దాదాపు భారత దేశాన్నంతా ఏకఛత్రాధిపత్యం క్రిందకు తెచ్చిన ఘనత చంద్రగుప్తునకు దక్కుతుంది. పురాణాలలో చెప్పబడిన ప్రకారం మౌర్యులు 187 సంవత్సరాలు పరిపాలించారు.

## 9.2 ఆధారాలు:

మౌర్యుల చరిత్ర రచనకు అవసరమైన ఆధారాలు సమకాలిక రచనల్లోను, మౌర్యుల తరువాత కాలం నాటి రచనల్లోను అపారంగా లభ్యమౌతున్నాయి. ఈ ఆధారాలలో శాసనాలు, వాఙ్మయ ఆధారాలు. (స్వదేశీ, విదేశీ రచనలు), భౌతిక అవశేషాలు (నాణేలు, మృణ్మయ పాత్రలు, శిల్ప అవశేషాలు ) ప్రధానమైనవి.

**9.2.1 శాసనాలు:** మౌర్యయుగ చరిత్రను తెలుసుకోవటానికి ఉపయోగపడే శాసనాలలో అశోకుని శాసనాలు, సోహ్‌గౌరా తామ్రశాసనం, మహాస్థాన్ శాసనం, దశరధుని నాగార్జునికొండ శాసనం, రుద్రదాముని జునాగడ్ శాసనము మొదలగునవి ప్రధానమైనవి.

భారతదేశ చరిత్రలో మొట్ట మొదటిసారిగ శాసనాలను జారీ చేసిన చక్రవర్తి అశోకుడు. అశోకుని శాసనాలను పధ్నాలుగు ముఖ్య శిలా శాసనాలు(Rock Edicts), స్తంభ శాసనాలు, (Pillar Edicts), లఘుధర్మలిపులు (శాసనాలు) (Minor Rock Edicts) అని మూడు రకాలుగా చరిత్రకారులు విభజించారు.

A. **అశోకుని పధ్నాలుగు ముఖ్య శిలా శాసనాలు లభ్యమయిన ప్రదేశాలు** : 1. ఎఱ్ఱగుడి (ఆంధ్ర ప్రదేశ్), 2. గిరినార్ (గుజరాత్) 3. కల్సి (ఉత్తర ప్రదేశ్), 4.కాందహార్ (ఆఫ్ఘనిస్తాన్) 5. మన్‌షెహ) 6. షాహబాజ్ గర్హి (పాకిస్తాన్) 7. సోపార (మహారాష్ట్ర) 8. జేగడ 9. ధేలి

(ఒరిస్సా).

B. లఘు ధర్మలిపులు లభించిన ప్రదేశాలు : 1. అహ్రౌర (ఉత్తర ప్రదేశ్), 2. బహపూర్ (ఢిల్లీ), 3. బైరాట్ (రాజస్థాన్), 4. గావిమఠ్, 5. పాల్కి గుండు, 6. మస్కి, 7. బ్రహ్మగిరి, 8. జతింగరామేశ్వర్, 9. సిద్ధపుర (కర్ణాటక), 10. గుజర్రా, 11. రూపనాధ్ (మధ్య ప్రదేశ్), 12. సహ్రామ్ (బీహార్), 13. ఎఱ్ఱగుడి 14. రాజుల మందగిరి (ఆంధ్ర ప్రదేశ్).

C. స్తంభ శాసనాలు లభించిన ప్రదేశాలు: 1. అలహాబాద్ (ఉత్తర ప్రదేశ్), 2. ఢిల్లీ-తోప్రా (హర్యానా) 3. ఢిల్లీ-మీరట్ (ఉత్తర ప్రదేశ్), 4. నిగలి సాగర్ (నేపాల్), 5. లౌరియనందనగర్, 6. లౌరియ అరరాజ, 7. రామపూర్వ (బీహార్), 8. అమరావతి (ఆంధ్ర ప్రదేశ్), 9. సాంచి (మధ్య ప్రదేశ్) 10. సారనాధ్ (ఉత్తర ప్రదేశ్).

అశోకుని శాసనాల వలన అతని చరిత్రతో బాటు, కళింగయుద్ధము తరువాత అతనిలో వచ్చిన మార్పు, బౌద్ధమత వ్యాప్తికి అశోకుడు చేసిన కృషి, ప్రజా సంక్షేమానికి అతడు చేపట్టిన కార్యక్రమాలు, ప్రజలను ధర్మానువర్తనులుగా చేయటానికి అశోకుడు చేపట్టిన చర్యలు వివరంగా తెలుస్తున్నాయి. ఈ శాసనాలు ప్రాకృత, గ్రీకు, అరమిక్ భాషలలోను, అరమిక్, గ్రీకు, ఖరోష్టి, బ్రాహ్మి లిపులలోను వ్రాయబడ్డాయి.

D. **బరాబర్ గుహ శాసనాలు:** బీహార్‌లో గయకు ఉత్తర దిశలోని ప్రాచీన కాలంలో "ఖ్కలతిక" పర్వతమని పిలువబడిన బరాబర్ కొండలలోని నాలుగు గుహలలో మూడు గుహలను ఆజీవకుల కొరకు అశోకుడు దానమిచ్చాడు. ఈ కొండలలోని నాగార్జుని పర్వతములో అశోకుని మనుమడైన దశరధుడు ఆజీవకులకు మూడు గుహలను దానంగా ఇచ్చినట్లు శాసనాలున్నాయి. బరాబర్ గుహశాసనాలు అశోకుడు బౌద్ధ మతంతో పాటు ఆజీవకులను కూడ ఆదరించినట్లు తెలుపుతున్నాయి.

E. **ఇతర శాసనాలు :** ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లాలో లభించిన సోహ్‌గౌరా తామ్ర శాసనం, బెంగాల్‌లోని గోగ్రా జిల్లాలోని మహాస్థాన్ శాసనాలు క్రీ. పూ. మూడవ శతాబ్దము నాటి బ్రాహ్మి లిపిలో ఉన్నాయి. భాష అశోక ప్రాకృతం. అందువలన ఈ శాసనాలు మౌర్య యుగారంభం నాటివని, బహుశా చంద్రగుప్తుని పాలనా కాలానికి చెందినవని భావిస్తున్నారు. సోహ్‌గౌరా తామ్ర శాసనంపై నున్న చిహ్నాలు మౌర్య వంశంలోని మొదటి రాజుల విద్దాంక నాణేల పై ఉన్న చిహ్నాలతో సరిపోతున్నాయి. ఈ శాసనాలు క్షామం సంభవించినపుడు తీసుకోవాల్సిన నివారణోపాయాలను వివరిస్తున్నవి.

మౌర్యుల తరువాతి కాలం నాటి శాసనాలలో మౌర్య చరిత్రకు ఉపయోగపడే శాసనాలలో జునాగఢ్ శాసనం ముఖ్యమైనది. మాళవ రాజ్యాన్ని పరిపాలించిన శక క్షాత్రపుడైన రుద్రదాముడు క్రీ.శ. 150 ప్రాంతంలో జారీ చేసిన జునాగఢ్ శాసనం సౌరాష్ట్రం మౌర్య చంద్ర గుప్తుని సామ్రాజ్యంలో ఒక రాష్ట్రమని తెలియజేస్తున్నది. ఈ శాసనంలోని వివరాలను బట్టి పుష్యగుప్తుడు మౌర్య సామ్రాజ్యంలోని సౌరాష్ట్ర పాలకుడని (రాష్ట్రీయ), అతడు వ్యవసాయాభివృద్ధికి, నీటి పారుదల సౌకర్యాన్ని కల్పించుటకు సుదర్శన తటాకాన్ని త్రవ్వించినట్లు తెలుస్తున్నది. అశోకుని కాలములో అనార్త, సౌరాష్ట్రాలు కలసి ఒక రాష్ట్రమని దాని పై రాష్ట్ర పాలకునిగా యవనరాజు తుషాస్ప ఉన్నట్లు ఈ శాసనం పేర్కొంటున్నది.

**9.2.2 మతవాఙ్మయం :** మతవాఙ్మయ ఆధారాలలో బౌద్ధ, జైన గ్రంధాలు, పురాణాలు మౌర్యుల చరిత్రను తెలుసుకోవటానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

A. **బౌద్ధవాఙ్మయం :** మతవాఙ్మయ ఆధారాలలో బౌద్ధ వాఙ్మయం మౌర్యుల గురించి ముఖ్యమైన సమాచారాన్ని తెలియజేస్తున్నది. బుద్ధుని పూర్వజన్మల గురించి వ్రాయబడిన జాతక కధల వలన బౌద్ధ యుగము నుండి మౌర్యుల కాలము వరకు

అవిచ్ఛిన్నముగా కొనసాగిన సాంఘిక ఆర్థిక పరిస్థితులు, వాణిజ్య సంఘాలు, ప్రజల ఆచారాలు, మత విశ్వాసాలు మొదలగు అంశాలు తెలుస్తున్నాయి.

అశోకావదాన, దివ్యావదాన గ్రంధాలు అశోకుని గురించిన ఎన్నో వివరాలను, అతని చుట్టూ అల్లుకొన్న ఎన్నో గాధలను వివరిస్తున్నాయి. దివ్యావదానము చంద్ర గుప్తుని కుమారుడైన బిందుసారుడు క్షత్రియుడని వర్ణిస్తున్నది. ఈ గ్రంధాలు బిందుసారుని గురించి, అశోకుడు తక్షశిలకు రాజప్రతినిధిగా వెళ్ళి అక్కడ తిరుగుబాటును అణచిన విశేషాలను, అశోకుని బౌద్ధ మత స్వీకరణ గురించి వివరిస్తున్నాయి.

సింహళ దేశ బౌద్ధ గ్రంధాలైన దీపవంశము, మహావంశం, వీటికివ్యాఖ్యానాలుగా వ్రాయబడిన మహావంశటీక, దీపవంశటీకలు అశోకుడు సింహళానికి బౌద్ధ మత ప్రచారకులను పంపిన అంశాలు. మౌర్య వంశాన్ని గురించిన అనేక విషయాలను విపులంగా ప్రస్తావిస్తున్నాయి. మహాయాన బౌద్ధగ్రంధమైన 'మంజుశ్రీ మూలకల్పం' కూడ మౌర్యుల గురించి, నందుల గురించిన ఎన్నో ముఖ్యమైన వివరాలను మనకు అందిస్తున్నది.

**B. జైన గ్రంధాలు :** జైన గ్రంధాలలో హేమచంద్రుని 'స్థవిరవలి చరిత్ర' లేక 'పరిశిష్ట పర్వం' అనే గ్రంధం చంద్రగుప్తమౌర్యుని గురించి, అతడు మగధను ఆక్రమించటం, తన జీవిత చివరి కాలంలో జైన మతాన్ని స్వీకరించడం మొదలగు ఎన్నో అంశాలను పేర్కొంటున్నది. ఈ గ్రంధం ప్రకారం మయూర పోషణమే జీవనముగానున్న ఒక గ్రామ పెద్ద కుమార్తె చంద్ర గుప్తుని తల్లి. చంద్ర గుప్తుని తండ్రి గురించి కాని, చంద్ర గుప్తుని బాల్యం గురించిన ఎటువంటి వివరాలను జైన గ్రంధాలు తెలియజేయటం లేదు.

**C. పురాణాలు :** పురాణాలలో మౌర్య చక్రవర్తులకు సంబంధించిన కొంత సమాచారము లభ్యమౌతున్నది. పురాణాలు హిందూ మత శాఖల మత బోధనలతోను, ఆయాశాఖల ప్రాబల్యాన్ని ప్రచారం చేసేందుకు ఉద్దేశించబడిన గాథా సంపుటాలయినప్పటికి వాటిలో అతి ప్రాచీన చారిత్రకాధారాలున్నాయి. ఈ పురాణాల సంకలనం క్రీ.శ. నాల్గవ శతాబ్దం నుండి ప్రారంభమైనది. తరువాత కాలంలో జరిగిన ప్రతిలేఖనాలు, ప్రక్షిప్తాలవలన పురాణాలలోని మౌర్యుల పట్టికలలో, రాజుల వరుసక్రమం మారి మౌర్యుల కాలనిర్ణయంలో వివిధ పురాణాలలో భిన్నమైన వివరాలు కన్పిస్తున్నాయి. విష్ణుపురాణం ద్వారా మగధలో నందరాజుల అధికారస్థాపన, తరువాత వారిని కౌటిల్యుని సహాయముతో చంద్రగుప్తుడు ఓడించి రాజ్యాధికారం స్వీకరించడం వంటి వివరాలు తెలుస్తున్నాయి.

**9.2.3 లౌకిక వాఙ్మయం :** లౌకిక సాహిత్య ఆధారాలలో అతిప్రధానమైన ఏకైక ఆధారము అర్ధశాస్త్రం. చంద్రగుప్త మౌర్యుని ప్రధాన మంత్రి లేదా ఉపద్రేష్ట అయిన కౌటిల్యుడు అర్ధశాస్త్ర రచయిత. అయితే ఈ గ్రంధం క్రీ.శ. మూడవ శతాబ్దం తరువాత కాలం నాటిది కాబట్టి మౌర్యుల చరిత్రకు ఆధారంగా అంగీకరించ కూడదని కొందరు చరిత్రకారుల వాదన. మౌలికంగా అర్ధశాస్త్రం మౌర్యుల కాలానికి చెందినదేనని విశ్వసించటానికి అనేక ఆధారాలున్నాయి. అర్ధశాస్త్రం తరువాతి శతాబ్దాలలో తరచు ప్రతి లేఖనానికి గురైనది. అనేక సార్లు ఈ గ్రంధాన్ని సంకలనం చేశారు. అయినా కూడ ఈ గ్రంధంలోని మౌలికాంశాలు, మొదటి అధ్యాయాలు మాత్రం చంద్ర గుప్త మౌర్యుని కాలానికో లేదా అతని సమీప కాలానికో చెందినవని ఖచ్చితంగా చెప్ప వచ్చును. అర్ధశాస్త్రంలోని పదాలకు అశోకుని శాసనాలలో కనిపించే పదాలకు మధ్య కనిపించే సామ్యము మౌర్య చక్రవర్తులకు అర్ధశాస్త్రంతో వున్న పరిచయాన్ని స్పష్టం చేస్తున్నది. ఆ కాలంలో అమలులో ఉన్న రాజకీయ ఆర్థిక భావాలను విశ్లేషించి వివరించటంలోను, వాటిని సమకాలిక పరిస్థితులకు అన్వయించటంలోను అర్ధశాస్త్రవిశిష్టత బోధపడుతుంది. ఈ అన్వయానికి అశోకుని పాలనా విధానానికి, ఆలోచనలకు మధ్య ఎంతో సామ్యం ఉంది. ఈ కారణాల వలన అర్ధ శాస్త్రాన్ని మౌర్యుల కాలంనాటి రాజ్యాంగ పద్ధతిని , ఆర్థిక పరిస్థితులను, ఇతర వివరాలకు ప్రధాన ఆధారంగా గ్రహించ వచ్చును.

ఇతర సారస్వత ఆధారాలలో క్రీ.శ. 4 వ శతాబ్దానికి చెందిన విశాఖదత్తుని ముద్రారాక్షసం అనే సంస్కృత నాటకం, చాణక్యుని సహాయంతో చంద్రగుప్తుడు నందరాజ్యాన్ని కూలద్రోసిన విషయాన్ని వివరిస్తున్నది. కల్హణుని రాజతరంగిణి అశోకుని తరువాత కాశ్మీరులో

జలౌకుడు అతని తరువాత దామోదరుడు రాజయినట్లు పేర్కొంటున్నది. సోమదేవుని కథాసరిత్సాగరం, క్షేమేంద్రుని బృహత్కథా మంజరిలలో మౌర్యులకు సంబంధించిన ఐతిహ్యాలు కొన్ని ఉన్నాయి.

**9.2.4 విదేశీ రచనలు:**అలెగ్జాండర్ భారతదేశ దండయాత్రల పర్యవసానంగా ఎంతో మంది గ్రీకులు భారత దేశాన్ని సందర్శించారు. భారతదేశాన్ని గురించిన ఖచ్చితమైన అవగాహన లేకపోయినా మొట్ట మొదటి సారిగ బయటి ప్రపంచానికి భారత దేశాన్ని గురించి తెలియజేసింది వీరే. అలెగ్జాండర్ దండయాత్రలలో అతనితో పాటుగా వచ్చిన నియార్చస్ (Nearchus) సింధు నది నుండి పర్షియన్ గల్ఫ్ వరకు గల ప్రాంతాన్ని పరిశోధించాడు. ఒనిసిక్రిటస్ (Onesicritus) నియార్చస్‌తో పాటు సింధునది పరిశోధనలో పాల్గొని సింధునది పరిశోధన, భారతదేశాన్ని గురించి ఒక గ్రంధము వ్రాశాడు. భారతదేశంలో కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం కోసం అలెగ్జాండర్‌చే నియుక్తుడైన అరిస్టోబులస్ (Aristobulus) తన రచనల్లో భారతదేశాన్ని గురించిన ఎన్నో వివరాలను పేర్కొన్నాడు.

వీరి తరువాత హెలెనిష్టిక్ రాజ్యాల నుండి మౌర్య సామ్రాజ్యానికి రాయబారులుగా వచ్చిన వారిలో సెల్యూకస్ నికెటార్ రాయబారిగ చంద్రగుప్త మౌర్యుని ఆస్థానంలో ఉన్న మెగస్తనీస్ ప్రముఖుడు. అతని తరువాత రాయబారులుగా వచ్చిన వారిలో బిందుసారుని ఆస్థానంలో చాలా కాలం రాయబారిగా ఉన్న డెమాచుస్ (Deimachus), సెల్యూకస్ నౌకాదళ ఉద్యోగి అయిన పాట్రోక్లస్ (Patrocles), టాలమీ పిలడెల్ఫస్ నౌకాదళ ముఖ్యఉద్యోగి అయిన తిమోస్తనీస్ (Timosthenes), డియోనిసియస్ (Dionysius) మొదలగు వారు ముఖ్యులు. కాని మెగస్తనీస్ భారతదేశాన్ని గురించి అందించిన వివరాలకంటే భిన్నమైనవి, కొత్త సమాచారమేదీ వీరి రచనల నుండి లభించటం లేదు. దురదృష్టవశాత్తు మెగస్తనీస్ భారత దేశ విశేషాలను పొందుపరచిన ' ఇండికా' గ్రంధము ఉపలభ్యం కావటం లేదు. కాని అతని తరువాత కాలంలోని గ్రీకు రచయితలు తమ గ్రంధాలలో మెగస్తనీస్ ' ఇండికా' లోని కొన్ని విశేషాలను ఉల్లేఖించారు. అటువంటి వారిలో ముఖ్యులు :

1. స్ట్రాబో (c 64 BC - 19 A.D) : ఇతడు తన గ్రంధంలోని మొదటి అధ్యాయాలలో అలెగ్జాండర్ అనుయాయుల రచనల నుండి, మెగస్తనీస్ ఇండికా నుండి గ్రహించిన వివరాలను పేర్కొన్నాడు. ఇతడు సెల్యూకస్ నికెటార్ చంద్రగుప్తమౌర్యుల మధ్య జరిగిన వివాహ సంబంధం గురించి, చంద్రగుప్తుని స్త్రీ అంగరక్షక దళం గురించిన వివరాలు తెలియజేశాడు.

2. డియోడోరస్ (క్రీ.పూ. మొదటి శతాబ్దం) క్రీ..పూ 36 వరకు జీవించిన ఇతడు మెగస్తనీస్ ఇండికా నుండి కొంత సమాచారాన్ని తనగ్రంధంలో పొందుపరిచాడు.

3. ప్లినీ (క్రీ.శ. మొదటి శతాబ్దం) : 'నేచురల్ హిస్టరీ' అనే తన విజ్ఞాన సర్వస్వంలో గ్రీకు రచయితల నుండి, పశ్చిమ దేశాల వర్తకుల నుండి భారతదేశాన్ని గురించి గ్రహించిన వివరాలను వర్ణించాడు.

4. ఎరియన్ (Arrian) (C 130 - 172 A.D) : ఇతడు అలెగ్జాండర్ దండయాత్రల గురించి, భారత దేశ భౌగోళిక పరిస్థితులు, సాంఘిక జీవనము, భారతీయ సమాజం మొదలగు విషయాలను నియారచస్, మెగస్తనీస్, ఎరాటోస్తనీస్ (276 - 195 B.C నాటి గ్రీకు భౌగోళిక శాస్త్రవేత్త) రచనల ఆధారంగా విలువైన అంశాలను తన గ్రంధంలో ప్రస్తావించాడు.

5. ప్లూటార్క్ (45 - 125 A.D) : ఇతడు అలెగ్జాండర్ జీవితం, భారతదేశాన్ని గురించిన సాధారణ వివరాలతోబాటు చంద్రుగుప్తుడి ఆంధ్ర కోట్టస్‌గా పేర్కొని, చంద్రగుప్తుడు అలెగ్జాండర్‌ను కలిసిన విషయాన్ని, చంద్ర గుప్తుడు మగధను ఆక్రమించిన తరువాత ఆరు లక్షల సైన్యముతో భారతదేశాన్నంతా జయించినట్లు తెలియజేస్తున్నాడు.

6. జస్టిన్ (క్రీ.శ. 2వ శతాబ్దం) : ఇతడు అలెగ్జాండర్ దండయాత్రలు, చంద్రగుప్త మౌర్యుని అధికార స్థాపన, సామ్రాజ్య విస్తరణ గురించి క్రీ.పూ. మొదటి శతాబ్దము నాటి గ్రీకు రచయితల రచనలాధారముగ వివరించాడు. వాయవ్య భారతదేశంలో గ్రీకుల పాలన అంతం చేయటంలో చంద్రగుప్తుడు సాధించిన విజయాన్ని వివరించాడు.

ఈ ఆధారాలే కాకుండా చైనా యాత్రికులైన పాహియాన్, హుయాన్‌త్సాంగ్‌లు తమ భారత దేశ పర్యటన సమయములో మౌర్యుల కాలంలో నిర్మించబడిన అనేక నిర్మాణాలను గురించి ముఖ్యంగా బౌద్ధ కట్టడాలను గురించిన సమగ్ర సమాచారాన్ని తమ తమ గ్రంథాలలో పొందుపరిచారు.

**9.2.5 భౌతిక అవశేషాలు :** పురావస్తు త్రవ్వకాలలో లభ్యమయిన నాణేలు, మృణ్మయ పాత్రలు, శిల్పాలు, పూసలు, జేగురు రంగు మట్టి బొమ్మలు, ఇతర వస్తు సామాగ్రి మౌర్యుల చరిత్ర రచనకు ఉపయోగపడుతున్నాయి.

A.**నాణేలు :** మౌర్యుల కాలం నాటి నాణేలలో విద్ధాంక నాణేలు, రజిత శలాక నాణేలు అని రెండు రకాలున్నాయి. భారతదేశంపై బాక్ట్రియన్ గ్రీకులు దండెత్తి వాయవ్య భారతదేశంలో రాజ్యాన్ని ఏర్పరచుకొని నాణేల ముద్రణలో మార్పులు ప్రవేశ పెట్టేంత వరకు ఈ నాణేలు చలామణీలో ఉన్నాయి. పురాపస్తు త్రవ్వకాల వలన ఈ నాణేలు వాయవ్య భారతదేశంలోను, గంగా మైదానంలోను, దక్కన్ పీఠభూమి ప్రాంతములోను లభించాయి. ఈ నాణేలు భారతదేశంలో లభించిన నాణేలన్నింటిలోను ప్రాచీనమైనవి. ఈ నాణేల పై ముద్రించిన చిహ్నాలు మౌర్యుల అధికార లాంఛనాలు.

B. **మృణ్మయపాత్రలు :**కౌశాంబి, రాజగృహం, పాటలీపుత్రం, హస్తినాపురం, తక్షశిల మొదలగు చోట్ల జరిగిన పురావస్తు త్రవ్వకాలలో లభించిన మౌర్యుల కాలం నాటి మృణ్మయ పాత్రలు ఒక ప్రత్యేక అంశాన్ని సూచిస్తున్నాయి. మౌర్య సామ్రాజ్య ప్రాంతాలలోని పట్టణాలన్నింటిలోను ఉత్తరాది నల్ల మెరుగు ఉన్న మృణ్మయ పాత్రలు (Northern Black Polished ware) దొరికాయి.

C. **శిల్పఅవశేషాలు :**కుమ్రహార్, పాట్నా సమీపంలోని బులందిబాగ్ వద్ద జరిపిన పురావస్తు త్రవ్వకాలలో బయల్పడిన మౌర్యుల రాజప్రాసాదము పారశీకుల పెర్సి పోలిస్ రాజభవన నమూనాతో నిర్మించబడింది. ఇది మౌర్యుల కాలం నాటి వాస్తు పద్ధతులను తెలియజేస్తున్నది.

శిల్ప అవశేషాలలో అశోకుని స్తంభాలు ముఖ్యమైనవి. వీటిలో కొన్ని శాసనాలు లేకుండా జంతు శిల్పంతో కిరీటాలు మాత్రమే కలిగిన స్తంభాలున్నాయి. రాంపూర్వా, బస్రాలలో శాసనాలులేని ఇటువంటి స్తంభాలున్నాయి. రాంపూర్వాలో ఒక స్తంభం పై ఏక సింహ కిరీటం ఉన్నది. సాంచి సారనాథ్‌లలో నాలుగు సింహాలున్న స్తంభ కిరీటాలున్నాయి. ఈ స్తంభాల కిరీటాలలో మూడు భాగాలున్నాయి. స్తంభకాండము పైనున్న కిరీటములో మొదట అధోముఖ పద్మము, దాని పైన ఫలకము, ఫలకముపైన సింహము లేదా వృషభ శిల్పము. వీటి వలన మౌర్యుల కాలం నాటి శిల్ప సంప్రదాయరీతులను తెల్సుకొన వచ్చును.

## 9.3 చంద్ర గుప్త మౌర్యుడు.

**ఉపోద్ఘాతము :** వాయవ్య భారతదేశంపై అలెగ్జాండర్ దండయాత్ర జరిగిన కొద్ది కాలము తరువాత చంద్ర గుప్తమౌర్యుడు క్రీ.పూ **324**లో మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించటం భారతదేశ చరిత్రలో ఒక మహోజ్వల సంఘటన అలెగ్జాండర్ జయించిన వాయవ్య భారత భూభాగాలపై అతని ప్రతినిధులుగా నియమించబడిన శాత్రపీల పాలన కొనసాగుతుండగా, తూర్పు భారతదేశం పాటలీపుత్రం రాజధానిగ నందవంశరాజైన ధననందుని పాలనలో ఉన్నది. ప్రజాకంటకులు, నిరంకుశులు అయిన నందరాజులలో చివరివాడు ధననందుడు. ఇతడు అధిక పన్నులు, సుంకాలను విధించి ప్రజలను పీడించి వసూలు చేసి ఎంతో ధనాన్ని కూడబెట్టినందున ఇతనికి ధననందుడను పేరు వచ్చింది. పురాణాలు ఇతడిని మహాపద్మనందుడు లేదా మహా పద్మపతి అని వ్యవహరించగా గ్రీకు రచయితలు ఇతడిని అగ్రమెస్ అని పేర్కొన్నారు. ధననందుని అసలు పేరు ఉగ్రసేనుడని, అది రూపాంతరం చెంది గ్రీకుల ఉచ్ఛారణలో అగ్రమెస్‌గా మారినట్లు కొందరు చరిత్రకారులు భావిస్తున్నారు.

బౌద్ధ ఆధారాలు, ముద్రారాక్షసం చెబుతున్న కథనం ప్రకారం చివరి నందరాజు ఆస్థానంలో ఉద్యోగి అయిన చాణుక్యుడిని నందరాజు అవమానపరచినపుడు చాణుక్యుడు నందవంశసమూల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశాడని, తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనుటకు చంద్ర

గుప్తుడిని చేరదీసి సకల విద్యలు నేర్పి అతనిచే నంద వంశాన్ని నిర్మూలింపచేయటంతోబాటు వాయవ్య భారత దేశంలోని గ్రీకుల పాలనను అంతం చేయించాడు.

**9.3.1 తొలిజీవితం** : చంద్రగుప్తుని పుట్టు పూర్వోత్తరాలు, అతని తల్లి దండ్రుల గురించిన అంశాలపై సరిఅయిన ఆధారాలు లేవు. ఇప్పటి వరకు లభ్యమైన ఆధారాలను పరిశీలించినట్లయితే భిన్నాభిప్రాయాలతో కూడిన ఐతిహ్యాలు కనిపిస్తున్నాయి.

పరిశిష్ట పర్వమనే జైన గ్రంధం చంద్రగుప్తుని తల్లి మయూర పోషణమే జీవనముగా ఉన్న ఒక గ్రామ పెద్ద కుమార్తె అనే కథనాన్ని తెలియచేస్తున్నది. చంద్రగుప్తుని తండ్రి గురించి గాని అతని బాల్యం గురించి గాని ఎటువంటి వివరాలను ప్రస్తావించటం లేదు.

విష్ణుపురాణం మౌర్య పదం మురా అనే పదం నుండి వచ్చినదని, మురా అనే శూద్రస్త్రీ ఒక నందరాజు భార్య అని, ఆమె చంద్రగుప్తుని తల్లి లేదా మాతామహి అని, ఆమె పేరు మీద ఈ వంశం మౌర్యవంశంగా పిలువబడినట్లు వర్ణిస్తున్నది. అయితే ఇదే వాస్తవమైనట్లయితే మురా సంతానాన్ని మౌరేయులని పిలవాలే కాని మౌర్యులని గాదు.

విశాఖదత్తుని ముద్రారాక్షసం నాటకంలో చంద్రగుప్తుడు వృషలుడని, కులహీనుడని సంభోదించబడినాడు. వృషలుడు అనే పదానికి కొందరు శూద్రుడని, మరికొందరు రాజులలో శ్రేష్ఠుడని వ్యాఖ్యానించారు.

బౌద్ధ గ్రంధమైన మహావంశంలో చంద్రగుప్తుడు నేపాలు తరాయి రుమ్మిండై గోరఖ్‌పూర్ జిల్లాలోని కాసియా మధ్య ఉన్న పిప్పల వన గణరాజ్యాన్ని పాలిస్తున్న 'మోరియ' అనే క్షత్రియ తెగకు చెందిన వాడని చెబుతున్నది. మోరియక్షత్రియగణం బుద్ధుని కాలం నుండి ఉన్నట్లు మహా పరి నిర్వాణ సూత్రం పేర్కొంటున్నది. మోరియ శబ్దం నుండి మౌర్య పదము ఉత్పన్నమైనదనే సిద్ధాంతాన్ని అనేక మంది చరిత్రకారులు అంగీకరిస్తున్నారు.

బౌద్ధ వాఙ్మయం ప్రకారం మోరియ క్షత్రియ తెగకు చెందిన చంద్రగుప్తుని తండ్రి ఒకానొక సరిహద్దు వివాద సందర్భంగా జరిగిన పోరాటంలో మరణించాడని, గర్భవతిగా ఉన్న అతని భార్య రక్షణ కోసం పుష్పపురానికి (కుసుమపురం / పాటలీపుత్రం) వలసరాగా అక్కడ చంద్రగుప్తుడు జన్మించాడు. పేదరికంలో ఉన్న చంద్రగుప్తుడ్ని మొదట ఒక పశువుల కాపరి, తరువాత ఒక వేటగాడు చేరదీశాడు. బాల్యంలో చంద్రగుప్తుడు తోటి గ్రామ బాలకులతో ఆటలలో రాజు పాత్రను నిర్వహించేవాడు. నందరాజుచే అవమానింపబడి తన జన్మస్థలమైన తక్షశిలకు వెళ్తున్న చాణక్యుడు సాటి బాలకులతో రాజు పాత్రను పోషిస్తున్న చంద్రగుప్తుడి ప్రజ్ఞా పాటవాన్ని గమనించి తన లక్ష్య సాధనకు చంద్రగుప్తుడే తగిన వాడని తలచి చాణక్యుడు చంద్రగుప్తుడ్ని తనతో తక్షశిలకు తీసుకొని వెళ్ళి అతడికి సకల విద్యలను నేర్పినాడు.

**9.3.2 వాయవ్య భారత విముక్తి :** చంద్రగుప్తుడు తన లక్ష్య సాధనలో భాగంగా నంద వంశంపై తిరుగుబాటు సాగిస్తూనే క్రీ.పూ. 326 - 325 లో అలెగ్జాండర్‌ను కలిసినట్లు గ్రీకు రచనల వలన తెలుస్తున్నది. ఈ సమావేశంలో చంద్రగుప్తుడి ప్రవర్తన అలెగ్జాండర్‌కు ఆగ్రహం కలిగించినందున అలెగ్జాండర్ అతడిని వధించమని ఆజ్ఞాపించినట్లు కాని ఎట్లో చంద్రగుప్తుడు తప్పించుకున్నట్లు గ్రీకు రచయితలు వివరిస్తున్నారు.

చంద్ర గుప్తుడు ఏ ప్రాంతంలో ఉంటూ సైన్య సమీకరణను, యుద్ధ ప్రయత్నాలు చేసి తన లక్ష్యాలను సాధించాడో చెప్పడానికి స్పష్టమయిన ఆధారాలు లభించటం లేదు. ఏ రాజు కూడ తన రాజ్యంలో ఇతరులు సైనిక కార్యకలాపాలను నిర్వర్తించటానికి ఖచ్చితంగా అంగీకరించరు. అలా అనుమతించినట్లయితే అది అతని అధికారానికే ప్రమాదం కలిగించే అవకాశం ఉన్నది. అందుచేత చంద్రగుప్తునికి తనదంటూ ఒక రాజ్యముండాలి. లేదా నందుల శతృరాజుఎవరైనా అతనికి తన రాజ్యంలో ఆశ్రయం కల్పించి వుండాలి. కాని మనకు ఇప్పటి వరకు లభ్యమయిన ఆధారాలలో ఇటువంటి సూచన లేదు. చాణక్య చంద్ర గుప్తులు వివిధ ప్రాంతాల నుండి సైనిక సమీకరణ

చేసి పెద్ద సైన్యాన్ని ఏర్పరచుకున్నట్లు మహావంశం చెబుతున్నది. ముఖ్యంగా పంజాబ్, సింధు ప్రాంతంలో అలెగ్జాండర్ దండయాత్రల సమయంలో అతడిని ఎదిరించిన గణరాజ్యాల సైనికులు తమ రాజ్యాలు ఓటమిని పొందటంతో, స్వతంత్ర్యాభిలాషులైన వీరు చంద్రగుప్తుడి సైన్యంలో చేరి వుండటానికి అవకాశమున్నది. ఈ విధంగా ఏర్పడ్డ సైన్యాన్ని గ్రీకు రచయిత జస్టిన్ 'దోపిడి దొంగలని' వర్ణించాడు. అర్థశాస్త్రం ఐదు వర్గాల నుండి సైన్య సమీకరణ చేయవచ్చునని చెబుతున్నది. అవి. 1 చోరులు 2. కిరాతకులు మొదలగు మ్లేచ్ఛులు 3. దారి దోపిడి దొంగలు 4. ఆటవికులు 5. శస్త్రోపజీవి శ్రేణులు. అర్థ శాస్త్రం చెప్పిన ప్రకారమే చంద్రగుప్తుడు సైన్య సమీకరణ చేసి ఉండవచ్చును.

చాణక్య, చంద్ర గుప్తులు సాధించ వలసిన ఘనకార్యాలు రెండు. అవి గ్రీకుల పాలనలో ఉన్న వాయవ్య భారత దేశాన్ని విముక్తం చేయటం. నందరాజుల నిరంకుశత్వాన్ని నిర్మూలించి మగధను ఆక్రమించడం. తమ లక్ష్య సాధనకు అవసరమైన సైన్యాన్ని పంజాబ్ సింధు ప్రాంతంలో యుద్ధ విద్యలలో ఆరితేరి ధైర్య సాహసాలకు పేరుపొందిన జాతులవారి నుండి సమీకరించాడు. జైన, గ్రీకు ఆధారాలను అనుసరించి చంద్రగుప్తుడు మొదట వాయవ్య భారతంలోని గ్రీకుల పాలనను అంతం చేసి ఆ ప్రాంతాన్ని ఆక్రమించాడు. అందుకు వాయవ్య భారత దేశంలోని ఆనాటి రాజకీయ పరిస్థితులు చంద్రగుప్తునికి అనుకూలించాయి. భారతదేశ దండయాత్రల తరువాత స్వదేశానికి మరలి వెళ్తున్న అలెగ్జాండర్ మార్గమధ్యంలో అనారోగ్యంతో బాబిలోనియా నగరములో క్రీ.పూ. 323 లో మరణించాడు. సింధు ప్రాంతంపై అలెగ్జాండర్ ప్రతినిధిగ నియమింపబడిన ఫిలిప్పస్ క్రీ. పూ.324 లోనే హత్యగురైనాడు. అలెగ్జాండరు మరణంతో సింధునది పరివాహక ప్రాంతంలోని గ్రీకు ఆక్రమిత రాజ్యాలలో వారి అధికారం నామమాత్రముగ కొనసాగింది.

వాయవ్య భారతదేశంలో గ్రీకుల పాలన పట్ల ప్రజలలో అసంతృప్తి ప్రజ్వరిల్లుట ప్రారంభమైనది. కాందహార్‌లో వీరిపాలనకు వ్యతిరేకముగ ఒక భారతీయుని నాయకత్వంలో తిరుగుబాటు జరిగినది. గ్రీకు శాత్రపి నికనార్ (Nicanor) ను అస్సకనోయి చంపాడు. ఇటువంటి రాజకీయ అశాంతికి, ఘర్షణలకు మాసిడోనియన్లకు ఇతర గ్రీకులకు వున్న విద్వేషాలే కారణం.

ఇటువంటి పరిస్థితులలో ఆ ప్రాంతంలోని రాజ్యాల రాజులైన అంభి, పురుషోత్తముడు, శశిగుప్తుడు మొదలగు వారు తాము గతంలో ఎదుర్కొన్న సమస్యల అనుభవంతో తగిన విధంగా తమరాజ్యాల పటిష్టతకు ఎటువంటి కృషిచేయలేదు. తత్ఫలితంగా ఈ రాజ్యాలు క్రమముగా విచ్చినమౌతున్నందున ఈ ప్రాంతాన్ని ఎవరైనా సులభంగా జయించటానికి అవకాశం ఏర్పడింది. దీనికి తోడు అలెగ్జాండరుకు వారసులు లేనందున అతని సామ్రాజ్యం కోసం అతని సేనానులు కలహించుకొంటున్న కారణంగా భారత దేశంలోని గ్రీకు ఆక్రమిత ప్రాంతాలపై ఎవరూ ప్రత్యేక శ్రద్ధ వహించటానికి వీలుకలుగ లేదు. అంతేకాకుండా అలెగ్జాండరు పంజాబ్, సింధు ప్రాంతంలో ఉన్నప్పుడే ఆ ప్రాంత ప్రజలలో విదేశీయులైన గ్రీకు పాలనపై ప్రజ్వరిల్లుతున్న ద్వేషము ఈ సమయానికి పెచ్చు పెరిగింది. ఇటువంటి అనుకూల పరిస్థితిని చంద్రగుప్తుడు చక్కగా వినియోగించుకొని వాయవ్య భారతదేశంలోని గ్రీకులను ఓడించి వారిని తరిమివేసి పంజాబ్, సింధు ప్రాంతాలను తన స్వాధీనంలోకి తెచ్చుకొన్నాడు. ఆ తరువాత దక్షిణంగా మధ్య భారతం వరకు తన రాజ్యాన్ని విస్తరింపచేసుకొన్న చంద్రగుప్తుడు క్రీ. పూ 313 నాటికి అవంతిని ఆక్రమించాడు. జైన వాఙ్మయ ఆధారాలు కూడ చంద్రగుప్తుని పాలన మగధలోకాక పంజాబ్, అవంతీలలో ప్రారంభమైనట్లు ధృవీకరస్తున్నాయి.

**9.3.3 మగధ ఆక్రమణ :** వాయవ్య భారతదేశాన్ని గ్రీకు పాలన నుండి విముక్తం చేసిన తరువాత చంద్రగుప్తుడు నందరాజు ధననందుడిని ఓడించి మగధను ఆక్రమించుటకు పూనుకున్నాడు. దురదృష్టవశాత్తు చంద్రగుప్తుని మగధ ఆక్రమణ గురించిన స్పష్టమైన వివరాలు తెయటం లేదు. జైన గ్రంధమైన పరిశిష్ట పర్వం చంద్రగుప్తుడు హిమాలయ పర్వత ప్రాంత రాజైన పర్వతకుని మైత్రిని, సైనిక సహాయాన్ని చాణుక్యుని ద్వారా పొంది మగధపై దండయాత్రకు ఉపక్రమించాడు. సరిహద్దు గ్రామాలను, పట్టణాలను ఆక్రమించటంతో చంద్ర గుప్తుని మగధ రాజ్య ఆక్రమణ ప్రారంభమయ్యింది. బౌద్ధ జైన ఐతిహ్యాలను అనుసరించి మగధను ఆక్రమించుటకు చంద్రగుప్తుడు రెండు పర్యాయాలు దండెత్త వలసి వచ్చినట్లు తెలియవస్తున్నది. మొదటి దండయాత్రలో సంపూర్ణ విజయం లభించనందున రెండవ దండయాత్ర చేసి మగధను జయించాడు. పరిశిష్ట పర్వం నందరాజును చంద్రగుప్తుడు ప్రాణాలతో వదలినట్లు పేర్కొంటుండగా మిళిందపన్హా మొదలగునవి నందరాజు యుద్ధంలో మరణించినట్లు చెబుతున్నాయి. ఈ ఐతిహ్యాలు పరస్పర విరుద్ధమైన సమాచారం

ఇస్తున్నా మనకు తెలుస్తున్న స్పష్టమైన ఫలితం మగధలో నందవంశ పరిపాలన అంతమొందటంతో చంద్రగుప్తుడు మగధ సింహాసనాన్ని అధిష్ఠించాడు. పాటలీపుత్రంలో మౌర్య వంశపాలన ప్రారంభమైనది.

**9.3.4 సెల్యూకస్ దండయాత్ర :** అలెగ్జాండరు మరణించిన తరువాత అతని సేనానులు క్రీ.పూ 321 సంవత్సరంలో 'త్రిపరడిసస్' (Tripardisus) లో సమావేశమై అతని సామ్రాజ్యాన్ని పంచుకొన్నారు. ఈ సామ్రాజ్య పంపిణీలో పశ్చిమాసియా ప్రాంతం సెల్యూకస్ నికెటార్‌కు దక్కినది. బాబిలోనియాలో సింహాసన మధిష్ఠించిన సెల్యూకస్ నికెటార్ భారతదేశంలో అలెగ్జాండరు జయించిన సింధు, పంజాబ్ తదితర ప్రాంతాలను చంద్ర గుప్తుడు ఆక్రమించినందున ఆ ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని తలచాడు. క్రీ.పూ 305 లో భారత దేశంపై దండెత్తి మార్గ మధ్యంలో బాక్ట్రియన్‌లను జయించి, సింధునదిని దాటి చంద్రగుప్తుడ్ని ఎదుర్కొనుటకు సిద్ధమైనాడు. కాని అదే సమయములో సెల్యూకస్ మిత్రులయిన కాస్సాండర్ (Cassandar), లిసిమాచస్ (Lysimachus), టాలెమి (Ptolemy)లు ఒక కూటమిగ ఏర్పడి ఆంటిగోనస్ (Antigonus) తో యుద్ధం చేస్తూ సెల్యూకస్ సహాయమర్థించినందున సెల్యూకస్ ఈ దండయాత్రను పూర్తి చేయకుండా అర్ధాంతరముగా వెనుతిరిగి వెళ్ళ వలసి వచ్చింది. ఈ కారణము వలన చంద్ర గుప్తునితో యుద్ధముమాని సంధి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినది. ఫలితముగా పరోపనిసదె (కాబూల్), ఏరియా (హీరట్), గెడ్రోషియా (బెలూచిస్తాన్), అరకోషియా (కాందహార్) ప్రాంతాలను చంద్ర గుప్తునికి ఇచ్చి దానికి ప్రతిగా అంటిగోనస్‌తో యుద్ధంలో ఉపయోగించుటకు 500 గజ బలాన్ని సెల్యూకస్ తీసుకొని సంధి చేసుకొన్నాడు. అంతేకాకుండా అపియన్ పేర్కొంటున్న వివరాల ప్రకారం తమ రెండు సామ్రాజ్యాల మధ్య స్నేహ సంబంధాలు మరింత పటిష్టపరచుటకు సెల్యూకస్ చంద్రగుప్తునికి తన కుమార్తెనిచ్చి వివాహం చేశాడు. ఈ వివాహ ఫలితంగా గ్రీకు రాకుమార్తె తన పరివారంతో మౌర్య అంత: పురానికి వచ్చింది. సెల్యూకస్ తన రాయబారిగ మెగస్తనీస్‌ను పాటలీపుత్రం పంపాడు. మెగస్తనీస్ తరువాత కూడ గ్రీకు - మౌర్య రాజ్యాల మధ్య మరికొన్ని రాయబారాలు కూడ నడిచాయి. మౌర్య సామ్రాజ్యంలోని విదేశీయుల సంక్షేమాన్ని చూడటం కోసం పాటలీపుత్ర నగర పాలక సంఘంలో ఒక పంచాయతీ ప్రత్యేకముగా ఉండేది. ఆ కాలములో పాటలీపుత్రానికి విదేశీయులు గణనీయ సంఖ్యలో వస్తుండే వారనే విషయాన్ని ఈ పంచాయితీ సూచిస్తున్నది. మెగస్తనీస్ పాటలీపుత్రంలో రాయబారిగా ఉన్నకాలంలో భారత దేశంలో తాను చూసిన విన్న విశేషాలతో 'ఇండికా' అనే గ్రంథాన్ని రచించాడు. అయితే ప్రస్తుతం ఇండికా గ్రంథం పూర్తిగా లభ్యం కావటం లేదు. అందులో కొన్ని భాగాలు మాత్రమే తరవాత కాలంలోని గ్రీకు రచయితల రచనల్లో ఉల్లేఖించబడినవి.

**9.3.5 దక్షిణ భారత దండయాత్రలు :** చంద్ర గుప్తుడు మగధలో తన అధికారం పటిష్టం చేసుకొన్న తరువాత దిగ్విజయ యాత్రలు చేసి తన సామ్రాజ్యాన్ని దక్షిణాన కర్ణాటక వరకు విస్తరింపజేశాడు. గ్రీకు చరిత్రకారుడు ప్లూటార్క్, చంద్ర గుప్తుడు ఆరులక్షల సైన్యముతో భారత దేశాన్ని జయించాడని వర్ణించాడు. చంద్రగుప్తునికి 600000 కాల్బలము, 30000 అశ్వికబలం, 9000 గజదళం, ఎన్నో వేల రథాలతో కూడిన అపార సైనిక బలం ఉన్నట్లు మెగస్తనీస్ ఇండికాలో పేర్కొన్నాడు. చంద్రగుప్తుని మనుమడైన అశోకుని శాసనాలున్న ప్రదేశాలను పరిశీలించి నట్లయితే అతని సామ్రాజ్యము దక్షిణభారత దేశంలో కర్ణాటకలోని సిద్ధపురం వరకు వ్యాపించినట్లు తెలుస్తున్నది. అశోకుడు తన శాసనాలలో చోళ, పాండ్య, సతియపుత్ర, కేరళపుత్ర రాజ్యాలను సరిహద్దు రాజ్యాలుగా పేర్కొన్నాడు. అశోకుడు సింహాసన మధిష్ఠించిన తరువాత కళింగ రాజ్యంపైనే దండెత్తి ఆ రాజ్యాన్ని జయించాడు. అందువలన మిగిలిన సామ్రాజ్యం అంతా అతనికి వారసత్వంగా సంక్రమించిందేనని స్పష్టమౌతుంది. అశోకుని తండ్రి బిందుసారుడు యుద్ధాలు చేసి ఏ ప్రాంతాన్ని ఆక్రమించిన దాఖలాలు లేవు. కాబట్టి అశోకునికి వారసత్వంగా వచ్చిన సామ్రాజ్యాన్ని నిర్మించిన వాడు చంద్రగుప్తుడే అనుటలో ఎటువంటి సందేహం లేదు.

చంద్రగుప్తుని దక్షిణాపథ దండయాత్రలకు సంబంధించిన సూచన తమిళ వాఙ్మయంలో కన్పిస్తుంది. అహనానూరు, పురనానూరు అనే తమిళ కావ్యాల వలన మౌర్యులు మెహర్ రాజును జయించి కొంకణం నుండి కన్ననూరు మండలం దాటి కొడుగు రాజ్యం మీదుగా తిరునల్వేలి జిల్లాలో పోదియిల్ కొండల ప్రాంతం వరకు తమ రాజ్యాన్ని విస్తరింపజేశారని వర్ణిస్తున్నవి.

మాళవరాజ్యపాలకుడైన శక క్షాత్రపుడు రుద్రదాముని క్రీ.శ. 150 సంవత్సరాల నాటి జునాగడ్ శాసనం సౌరాష్ట్రం చంద్రగుప్త మౌర్యని సామ్రాజ్యములో ఒక రాష్ట్రమని తెలియజేస్తుంది. ఈ శాసనం ప్రకారం చంద్రగుప్తమౌర్యుని రాష్ట్ర పాలకుడైన (రాష్ట్రీయ) పుష్యగుప్తుడు నీటి పారుదల సౌకర్యాన్ని పెంపొందించుటకు జునాగడ్‌లో సుదర్శన సరోవరాన్ని తవ్వించాడని తెలుస్తున్నది.

ఈ విజయాల వలన చంద్రగుప్తుని సామ్రాజ్యం పశ్చిమాన ఆక్సస్‌నది నుండి తూర్పున బెంగాల్ వరకు ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణాన కర్ణాటక వరకు విస్తరించింది.

చంద్రగుప్తుడు సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించుటయేగాక, ఈ సామ్రాజ్య స్థాపనలో అసాధారణ బుద్ధి కుశలతలతో తోడ్పడిన చాణుక్యుని సహాయంతో సమర్ధవంతమైన పాలనా యంత్రాగాన్ని రూపొందించాడు.

**9.3.6 చివరి దశ :** చంద్రగుప్తుడు తన పరిపాలనా చివరి కాలంలో జైన మతం స్వీకరించినట్లు పరిశిష్టపర్వం ద్వారా తెలుస్తున్నది. ఈ గ్రంథం మగధలో పన్నెండు సంవత్సరాల పాటు క్షామం సంభవించినట్లు పేర్కొంటున్నది. క్షామనివారణోపాయాలను వివరిస్తున్న సోహగేగౌరా, మహాస్థాన్ శాసనాలు ఈ క్షామాన్ని ధృవీకరిస్తున్నాయి. క్షామం సంభవించటంతో తన కుమారుడైన బిందుసారునికి రాజ్యం అప్పగించి జైనమతాచార్యుడు, తన మత గురువు అయిన భద్రబాహుతో కలసి కర్ణాటకలోని శ్రావణ బెళగొళకు వెళ్ళాడు. శ్రావళ బెళగొళలో చంద్ర గుప్తుడున్న కొండను చంద్రగిరి అని, అక్కడున్న జైనదేవాలయాన్ని చంద్రగుప్తబసది అని నేటికి పిలుస్తున్నారు. సనాతన సంప్రదాయం ప్రకారం సల్లేఖనం ద్వారా చంద్రగుప్తుడు మరణించినట్లు జైన గ్రంధాల వలన తెలుస్తున్నది.

**9.3.7 పరిపాలనా కాలం :** చంద్రగుప్తుడు సింహాసన మధిష్టించిన సంవత్సరం గురించి, అతడు రాజ్యపాలనా కాలపరిమితి గురించి చరిత్రకారులలో అనేక అభిప్రాయ భేదాలున్నాయి. మౌర్య వంశంపై పరిశోధన చేసిన రొమిల్లా థాపర్ అభిప్రాయం ప్రకారం చంద్రగుప్తుడు క్రీ.పూ 321 లో రాజ్యాధికారం చేపట్టి 24 సంవత్సరాలు పాలించి క్రీ.పూ 297 లో మరణించాడు.

## 9.4 బిందుసారుడు

చంద్రగుప్తుడు జైనమత దీక్ష స్వీకరించి రాజ్యత్యాగం చేయటంతో అతని కుమారుడైన బిందుసారుడు క్రీ.పూ297 లో మగధ సింహాసనమధిష్టించాడు. జైన గ్రంధాలలో ఇతని తల్లి దుర్ధర అని చెప్పబడింది. పురాణాలు ఇతడిని బిందుసారుడని, 'రాజావళీ' కథ అను జైన గ్రంధం ఇతడిని సింహసేనుడని వ్యవహరిస్తున్నది. గ్రీకు రచయితలు ఇతడిని 'అమిత్ర ఖేట్స్' అని పేర్కొన్నారు. అమిత్రఖేట్స్ అనేది అమిత్రఖాద (శత్రుభక్షకుడు) లేక అమిత్ర ఘాత (శత్రు విధ్వంసకుడు) అనే సంస్కృత పదానికి గ్రీకు రూపం.

**9.4.1 పరిపలనాకాలం :** బిందుసారుడు 25 సంవత్సరాలు పరిపాలించాడని పురాణాలు చెబుతుండగా, బర్మాదేశ బౌద్ధ గ్రంధాలు 27 సంవత్సరాలని, సింహళదేశ బౌద్ధ గ్రంధాలు 28 సంవత్సరాలు పాలనా కాలం అని పేర్కొంటున్నవి. చరిత్రకారులలో ఎక్కువ మంది బిందుసారుడు క్రీ.పూ 297 నుండి క్రీ.పూ 272 వరకు 25 సంవత్సరాలు పరిపాలించాడని అంగీకరిస్తున్నారు.

కౌటిల్యుడు కొంత కాలం బిందుసారునికి అగ్రామాత్యునిగా (ప్రధాన మంత్రి) వుండి బిందుసారునికి సామ్రాజ్య రక్షణలో తోడ్పడినట్లు టిబెట్ చరిత్రకారుడు తారానాధ్ రచన వల్ల తెలుస్తుంది. కౌటిల్యుని తరువాత ఖల్లాటకుడు కొంత కాలం బిందుసారునికి ప్రధాన మంత్రిగా ఉన్నాడని ఆ తరువాత రాధాగుప్తుడు ప్రధాన మంత్రియైనట్లు దివ్యావదానం పేర్కొంటున్నది.

బిందుసారుడు తాను పరిపాలించిన 25 సంవత్సరాల కాలంలో అతడు సాధించిన విజయాలు కాని, సామ్రాజ్య విస్తరణకు చేపట్టిన చర్యల గురించి ఎటువంటి వివరాలు లభించడం లేదు.

**9.4.2 తక్షశిల తిరుగుబాటు :** బిందుసారుడు తన కుమారులలో సుసీముడిని తక్షశిలలో రాజప్రతినిధిగాను, అశోకుడిని ఉజ్జయినిలో రాజప్రతినిధిగాను నియమించాడు. సుసీముడు రాజప్రతినిధిగ ఉన్న సమయంలో తక్షశిలలో ప్రజలు తిరుగుబాటు చేశారు. ఆ తిరుగుబాటును అణచుటకు బిందుసారుడు ఉజ్జయినిలో రాజప్రతినిధిగా ఉన్న అశోకుడిని తక్షశిలకు రాజప్రతినిధిగా పంపాడు. సైన్య సమేతుడైన అశోకుడు తక్షశిల నగరంలో ప్రవేశించక ముందే ప్రజలు అతనిని కలిసి తాము రాజప్రతినిధికి గాని, బిందుసారునకు గాని వ్యతిరేకంగా తిరుగుబాటు చేయలేదని ప్రజలను అవమానించి బాధిస్తున్న దుష్ట అమాత్యులకు వ్యతిరేకంగా మాత్రమే తిరుగుబాటు చేశామని మనవి చేసుకొన్నట్లు అశోకావదానం, దివ్యావదానం వలన తెలుస్తున్నది. అశోకుడు తక్షశిలలో పరిస్థితులను చక్కదిద్ది శాంతిని నెలకొల్పి రాజప్రతినిధిగ కొనసాగాడు. తక్షశిలలో రాజప్రతినిధిగా ఉన్నకాలంలో ' ఖశ' రాజ్యాన్ని జయించాడు.

**9.4.3 విదేశాంగ విధానం :** బిందుసారుడు తనకు వారసత్వంగా సంక్రమించిన సామ్రాజ్యాన్ని కాపాడుకొనుటయేకాక తన తండ్రియైన చంద్రగుప్తుని విదేశాంగ విధానాన్నే అనుసరించాడు. స్ట్రాబో అందిస్తున్న సమాచారం ప్రకారం శాండ్రకోట్టోస్ కుమారుడైన అమిత్రఖేట్స్ ఆస్థానానికి సిరియా రాజైన మొదటి ఆంటియోకస్ సోతర్ తన రాయబారిగా డిమేఖస్ (Deimachos) ను, ఈజిప్టు రాజైన రెండవ టాలమీ ఫిలడెల్ఫస్ తన రాయబారిగా డియోనిసియస్ (Dionysios) ను పంపినట్లు తెలుస్తున్నది.

క్రీ.శ. మూడవ శతాబ్దానికి చెందిన ఎథీనియన్ అను గ్రీకు రచయిత హెగేసాండర్ (Hegesander) రచన ఆధారంగా బిందుసారుడు సిరియా రాజైన మొదటి ఆంటియోకస్ సోతర్‌కు మధువును, అత్తిపండ్లు, సోఫిష్ట్‌ను పంపమని కోరగా దానికి ఆంటియోకస్ మధువును, అత్తి పండ్లను పంపుతానని, తమ దేశంలో సోఫిష్టులను అమ్మడం, కోనడం చట్టవిరుద్ధమని బదులిచ్చినట్లు వ్రాశాడు.

**9.4.4 మతం :** బౌద్ధగ్రంథాలలో బిందుసారుని గురించిన ప్రస్తావన ఎక్కువగా కనిపించదు. దానికి కారణం అతడికి బౌద్ధం పట్ల ఎక్కువ ఆసక్తి లేకపోవడమే. దివ్యావదానం బిందుసారుని ఆస్థానములో పింగళి వత్స అనే ఆజీవక పరివ్రాజకుడు ప్రముఖ స్థానాన్ని సంపాదించినట్లు చెబుతున్నది. ఈ ఆజీవకదైవజ్ఞుడే అశోకుడు జన్మించినపుడు చక్రవర్తి అవుతాడని జోస్యం చెప్పాడు.

**9.4.5 వారసులు :** అశోకుని ఐదవ ముఖ్యశిలాశాసనం ప్రకారం అశోకునకు చాలమంది సోదరీ సోదరులున్నట్లు తెలుస్తుంది. దివ్యావదానం సుసీముడు, విగతాశోకుడు అను ఇద్దరి సోదరుల పేర్లు మాత్రమే పేర్కొంటున్నది. వీరినే సింహళ బౌద్ధ గ్రంధాలు సుమన, తిష్య అని చెబుతున్నది. వీరిలో సుసీముడు అశోకునికి అగ్రజుడు, సవతి తల్లి కుమారుడు.

క్రీ.పూ 272 లో బిందుసారుడు మరణించిన తరువాత అతని కుమారుల మధ్య సామ్రాజ్యాధికారం కోసం నాలుగు సంవత్సరాల పాటు వారసత్వ యుద్ధం జరిగింది. వారసత్వ యుద్ధంలో విజయం సాధించిన అశోకుడు క్రీ.పూ. 269 - 68 లో బిందుసారుని వారసునిగా పాటలీపుత్రంలో రాజ్యాధికారాన్ని చేపట్టాడు.

## 9.5 సారాంశము :

## 9.6. మాదిరి ప్రశ్నలు :

1. చంద్రగుప్త జీవిత విశేషాలు గూర్చి వ్రాయుము ?
2. వాయువ్య భారత విముక్తికి చంద్రగుప్తుడు ఏ విధంగా పాటుపడ్డాడు ?
3. చంద్రగుప్తుడు భారత్‌లో జరిపిన దండయాత్రల గూర్చి వ్రాయుము ?

4. బిందుసారుడు గురించి వివరింపుము ?

## సంక్షిప్త ప్రశ్నలు

1. మగధ ఆక్రమణ గూర్చి వ్రాయుము

2. సెల్యూకస్ దండయాత్ర గూర్చి వ్రాయుము ?

3. చంద్రగుప్తుని చివరి దశను గూర్చి వ్రాయుము ?

## పాఠం 10

# అశోకుడు

### 10.0 లక్ష్యం :

అశోకుని సామ్రాజ్య నిర్మాణం, కళింగయుద్ధం, బౌద్ధమత స్వీకరణ, వ్యాప్తి, అశోకుని ధమ్మవిధానం మొదలగు అంశాలు వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### విషయక్రమం :


10.0 లక్ష్యం

10.1 ఉపోద్ఘాతం

10.2 అశోకుని పేర్లు, బిరుదులు

10.3 అశోకుని ధమ్మ విధానము

10.4 సారాంశం


### 10.1 ఉపోద్ఘాతం :

క్రీ.పూ. 272 సంవత్సరంలో బిందుసారుడు మరణించిన తరువాత జరిగిన వారసత్వ యుద్ధంలో విజయం సాధించిన అశోకుడు క్రీ.పూ. 269 - 68 లో మగధ సింహాసనమధిష్టించాడు.

భారతదేశాన్ని పరిపాలించిన చక్రవర్తులలోనేకాక ప్రపంచ ప్రసిద్ధి పొందిన వారిలో అశోకుడు సుప్రసిద్ధుడు. అశోకుడు దిగ్విజయయాత్రలు చేసి సామ్రాజ్యం విస్తరింపజేసినందువల్లనే ప్రసిద్ధుడు కాలేదు. అశోకుడు ఒకే ఒక యుద్ధం కళింగ యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో విజయం సాధించి కూడ యుద్ధ విముఖతను ప్రకటించిన మహామనిషి అశోకుడు. ప్రజా శ్రేయస్సుకు ధమ్మ విధానాన్ని రూపొందించి తన పాలనా కాలమంతా ప్రజలను ధర్మానువర్తనులుగా చేసి వారి సంక్షేమం కోసం పాటుపడిన మానవతావాది అశోకుడు. అశోకుని ఘనతకు అతని అత్యుత్తమ ఆదర్శాలు, సర్వమానవ సంక్షేమానికి అతడనుసరించిన విధానాలు మాత్రమే కారణాలు.

భారతదేశ చరిత్రలో మొట్ట మొదటి శాసనాలను జారీ చేసిన ప్రథమ భారతీయ చక్రవర్తి అశోకుడు. ఈ శాసనాలు బ్రాహ్మి ఖరోష్టి, గ్రీకు, అరమిక్ లిపులలో ఉన్నాయి. అశోకుని శాసనాలు, భారతదేశ బౌద్ధ గ్రంథాలు, సింహళదేశ గ్రంథాలు అశోకుని చరిత్రను తెలుసుకోవటానికి ఆధారాలు.

### 10.2 పేర్లు, బిరుదులు :

అశోకుని శాసనాలు దేవానాంప్రియ అని, ప్రియదర్శి అనే అతని బిరుదులను పేర్కొంటున్నాయి. మస్కీ శాసనంలో మాత్రమే 'దేవానాంప్రియ అశోక' అని గుజర్ర శాసనంలో 'ప్రియదర్శిరాజా అశోక' అని ఉంది. అశోకుని పూర్తి బిరుదు దేవానాంప్రియ ప్రియదర్శి రాజా

అశోక. దేవానాం ప్రియ బిరుదుకు దేవతలకు ప్రియమైన వాడు అని ప్రియదర్శి అనగా సుందర రూపం గలవాడు ధర్మనీయుడు అని అర్థము. అశోకుడు తన ఎనిమిదవ శిలాశాసనంలో తనకు పూర్వం పరిపాలించిన రాజులకు దేవానాం ప్రియ బిరుదున్నట్లు ప్రస్తావించాడు. చంద్రగుప్తునకు, అశోకుని మనుమడైన దశరధుడికి కూడ దేవానాం ప్రియ బిరుదున్నది. పురాణాలు అశోకవర్దనుడని ఇతడిని వ్యవహరిస్తున్నాయి. అందువలన అశోక అనేది పేరు అని ప్రియదర్శి పట్టాభిషేక సమయంలో వాడిన బిరుదుగాను దేవానాం ప్రియ అనేది మౌర్యులు సర్వసాధారణంగా వాడిన రాజబిరుదని తెలుస్తున్నది.

**10.2.1 కాలనిర్ణయము :** బిందుసారుడు మరణించిన తరువాత అతని కుమారుల మధ్య మగధ రాజ్య సింహాసనానికై వారసత్వయుద్ధం నాలుగు సంవత్సరాలపాటు జరిగింది. ఈ వారసత్వ యుద్ధంలో అశోకుడు విజయాన్ని సాధించి పట్టాభిషేకం చేసుకొన్నాడు. వారసత్వ యుద్ధం గురించి, నాలుగు సంవత్సరాల అరాచకత్వాన్ని గురించి సింహళ గ్రంధాలు వివరిస్తుండగా పురాణాలు ఎటువంటి సమాచారాన్ని ఇవ్వటం లేదు. మహావంశం "రాజ్యాధిపత్యాన్ని సాధించిన నాలుగు సంవత్సరాలకు అశోకుడు పాటలీపుత్ర నగరానికి చక్రవర్తిగా పట్టాభిషేకం జరుపుకొన్నాడు" అని పేర్కొంటున్నది. బౌద్ధ గ్రంధాలు అశోకుని రాజ్యాభిషేకము బుద్ధుని మహాపరినిర్వాణానంతరం 218 సంవత్సరాలకు జరిగినట్లు చెబుతున్నాయి. అశోకుని పదమూడవ శిలాశాసనంలో లభిస్తున్న సాక్ష్యం అశోకుని కాలనిర్ణయానికి ముఖ్యమైన ఆధారం ఈ శాసనంలో అశోకుని సమకాలికులైన ఐదుగురు గ్రీకు రాజు అంతియోక, తులమయి, అంతికిని, మాగలు పేర్లు ప్రస్తావించబడినవి. వీరిలో అంతియోకస్ సెల్యూకస్ నికెటార్ మనుమడు సిరియా రాజైన రెండవ యాంటియోకస్ థియోస్ (క్రీ.పూ. 261 - 246), తులమయి ఈజిప్ట్ రాజయిన రెండవ టాలెమి ఫిలడెల్ఫస్ (క్రీ. పూ. 285 - 247), మూడవ రాజు అంతికిని మాసిడోనియా పాలకుడైన యాంటిగోనస్ గొనతాస్ (క్రీ.పూ 276 - 239) గను, నాల్గవ రాజు మాగను సైరీన్ రాజైన మగస్ ( క్రీ. పూ 300 - 250), గాను గుర్తిస్తున్నారు. ఇక చివరి రాజైన అలక సుందరుడు కొరింత్ పాలకుడైన అలెగ్జాండర్ (క్రీ.పూ. 252 -244) లేదా ఎపిరస్ రాజైన అలెగ్జాండర్ (క్రీ.పూ 275 - 255) కావచ్చునను అభిప్రాయాలున్నాయి. శాసన శైలిని బట్టి అందులోని అంశాల ప్రకారం పదమూడవ శిలాశాసనాన్ని అశోకుడు తన 14 వ రాజ్య సంవత్సరంలో జారీ చేసినట్లు చరిత్రకారులు నిర్ణయిస్తున్నారు. గ్రీకు రాజుల పరిపాలనా కాలాన్ని బట్టి, అశోకుని 14 వ శిలా శాసనము జారీ చేసినది క్రీ.పూ 254లో అని ఈ శాసన ఆధారంగాలో అశోకుడు క్రీ.పూ. 268 లో పట్టాభిషేకం చేసుకోన్నట్లు చరిత్ర కారులు నిర్ణయించారు. బిందుసారుడు క్రీ.పూ 272 లో మరణించిన తరువాత జరిగిన నాలుగు సంవత్సరాల వారసత్వ యుద్ధంలో విజయం సాధించి అశోకుడు పట్టాభిషేకం చేసుకొన్నాడు.

**10.2.2 రాజప్రతినిధి - తక్షశిల తిరుగుబాటు :** అశోకుడు అవంతీ రాష్ట్ర రాజప్రతినిధిగ కొంత కాలం ఉజ్జయినిలో ఉన్నాడు. రాజప్రతినిధిగ సమర్దుడైన సైన్యాధిపతి అని, రాజనీతిజ్ఞుడని, పరిపాలనాదక్షుడని ఋజువు చేసుకొన్నాడు. అశోకుడు ఉజ్జయినిలో రాజప్రతినిధిగ ఉన్న సమయంలో తక్షిశిల పౌరులు దుష్టామాత్యుల దుర్మార్గాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. తక్షశిలలో రాజప్రతినిధిగా ఉన్న సుసీముడు ఆ తిరుగుబాటును అణచలేక పోయాడు. అందువలన బిందుసారుడు అశోకుడ్ని తక్ష శిల తిరుగుబాటు అణచుటకు తక్షశిల రాజప్రతినిధిగ నియమించి సైన్యసమేతంగా పంపినట్లు అశోకావదానం తెలుపుతుంది. తక్షశిల తిరుగుబాటును అణచడంలోను, ఉజ్జయినిలో రాజప్రతినిధి పదవిని సమర్ధవంతముగా వ్యవహరించటంలో తన శక్తి సామార్ధ్యాలపై అశోకునికి నమ్మకం కలిగింది. ఈ ఆత్మ విశ్వాసమే అశోకుడిని రాజ్యాన్ని ఆక్రమించే ప్రయత్నానికి ప్రేరేపించి ఉంటుంది. అశోకుడు మౌర్య సింహాసనానికి వారసుడు కాదు. బిందు సారుని జ్యేష్ఠ కుమారుడైన సుసీముడే వారసుడు. ఆ విషయము దివ్యావదానంలో స్పష్టంగా చెప్పబడింది. పింగళ వత్స అనే ఆజీవిక మహర్షి బిందుసారునికి అతని కుమారులలో అశోకుడే సమర్ధుడని, అతడే మౌర్య సింహాసనాన్ని ఆక్రమించటంలో విజయాన్ని సాధించగలడని జోష్యం చెప్పినట్లు దివ్యావదానం వివరిస్తున్నది.

**10.2.3 వారసత్వయుద్ధం - పట్టాభిషేకం :** బిందుసారుడు తన మరణకాలంలో సుసీముడే రాజుగా నిర్ణయించాడని కాని మంత్రులు దానికి విరుద్ధంగా అశోకుడ్ని రాజుగా చేసినట్లు, ఈ ప్రయత్నంలో బిందుసారుని ప్రధాన మంత్రి రాధాగుప్తుడు ఎక్కువ సహాయ పడినట్లు దివ్యావదాన చెబుతుంది. సింహళ దేశ బౌద్ధగ్రంధాలైన దీపవంశం, మహావంశాలు అశోకుడు తన 99 మంది సోదరులను వధించి రాజ్యాధికారం

చేపట్టాడని పేర్కొంటున్నాయి. కాని అశోకుడు జరిపిన ఈ హత్యాకాండకు ఇతర సాక్ష్యాలేవీ లేవు. అంతేకాక అశోకుడు తరువాత కాలంలో జారీ చేసిన తన శాసనాలలో తన సోదరీ సోదరులను, వారి కుటుంబాల పట్ల ఎంతో బంధుభావాన్ని వ్యక్తపరచాడు అందువలన అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించిన తరువాత అతనిలో వచ్చిన పరివర్తనకు కారణం బౌద్ధ మతం గొప్పతనమేనని ప్రచారం చేయటానికి బౌద్ధగ్రంథాలు ఇటువంటి కథను సృష్టించినట్లు చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. అందువలన 99 మంది సోదరుల హత్యాకాండను ఊహాకల్పితమని త్రోసిపుచ్చ వచ్చును. ఈ కథనం ప్రకారం బిందుసారుని మరణం తరువాత సింహాసనం కోసం జరిగిన వారసత్వ యుద్ధంలో అశోకుడు తన అన్న సుసీమునితో బాటు ఇతర సోదరులను వధించి ఉండటానికి అవకాశం ఉన్నది. బౌద్ధ మత స్వీకారానికి అశోకుడు నీతి నియమాలు లేని దుష్టునిగా చిత్రించడమే ఆ వాఙ్మయ లక్ష్యమై నందున బౌద్ధ గ్రంథాలలో అశోకుని సోదరుల సంఖ్యను గురించిన అతిశయోక్తి చోటు చేసుకుంది.

**10.2.4 కళింగ యుద్ధం :-** అశోకుని పరిపాలనా కాలంలో జరిగిన ముఖ్య సంఘటన అశోకుని కళింగ యుద్ధము, కళింగ దేశ ఆక్రమణ. అశోకుని 9 వ రాజ్య పాలనా సంవత్సరంలో అనగా క్రీ.పూ. 260 లో కళింగ యుద్ధం జరిగినట్లు అశోకుని 13 వ శిలా శాసనం పేర్కొంటున్నది. అశోకుడు కళింగ రాజ్యం పై దాడి చేయటానికి ప్రత్యేక కారణాలున్నాయి. అశోకుడు సింహాసనమధిష్టించే నాటికి మౌర్య సామ్రాజ్యము దక్షిణాన కర్ణాటకలోని సిద్ధాపురం వరకు వ్యాపించింది. కళింగ రాజ్యము స్వతంత్ర రాజ్యముగానే ఉన్నది. సామ్రాజ్య తూర్పు తీరం నుండి సింహళం, బర్మా, ఆగ్నేయాసియా దేశాలకు వాణిజ్యం విస్తృతంగా జరుగుతుండేది. మహానది, గోదావరి నదుల మధ్య కళింగ దేశం కీలక స్థానంలో వ్యాపించి ఉండడం వల్ల కళింగ రాజ్యము దక్షిణ దేశాల మధ్య నున్న వాణిజ్యాన్నే కాక సముద్రం ద్వారా జరిగే విదేశీ వాణిజ్యాన్ని కూడ హస్తగతం చేసుకొన్నది. ఉత్తర దక్షిణాపథాల మధ్య ఉన్న భూమార్గాలు నదీలోయలను అనుసరించి కళింగ రాజ్యం నుండి వెళ్తున్నాయి. కళింగ శతృవుల చేతిలో ఉన్నట్లయితే ఈ మార్గాలకు ఆటంకం ఏర్పడుతుంది. ఇటువంటి కీలక ప్రాంతంలో ఉన్న కళింగ రాజ్యాన్ని మౌర్య సామ్రాజ్య ఆర్థిక వాణిజ్యాభివృద్ధి ప్రయోజనాన్ని ఆశించి కళింగ పై దండయాత్రకు పూనుకొన్నాడు.

**10.2.5 పశ్చాత్తాపము - యుద్ధవిముఖత :** అశోకుడు కళింగ యుద్ధంలో విజయం సాధించాడు. కాని యుద్ధం వలన జరిగిన అపార ప్రాణనష్టము, ప్రజలు పడిన బాధలు గమనించిన అశోకుడు 13 వ శిలా శాసనంలోనే తన విచారాన్ని, పశ్చాత్తాపాన్ని ప్రకటించాడు. క్షణికమైన భావోద్వేగంతో జరిగిన స్వయంకృతాపరాధాన్ని గుర్తించిన అశోకుడు పడిన పశ్చాత్తాపము అర్థవంతము, గాఢమైన అనుతాపము ఆ శాసనంలో ధ్వనిస్తుంది.

"ఈ కళింగ యుద్ధములో లక్షాయాభై వేల మంది బందీలైనారు. లక్షకుపైగా సైనికులు మరణించారు. అంతకంటే ఎన్నో రెట్లు ప్రజలు నశించారు. ఈ మారణహోమం జరిగిన తరువాత కళింగను తన సామ్రాజ్యంలో కలుపుకోవడం జరిగింది. కళింగ యుద్ధంలో జరిగిన ప్రాణ నష్టానికి దేవానాంప్రియుడు పశ్చాత్తప్తుడైనాడు. యుద్ధము, ఆ కారణముగా సంభవించు మారణహోమములు, దు:ఖము, జన సంక్షోభం, బందీలైన వారి ఆర్తనాదాలు విన్న దేవానాంప్రియుని మనస్సు వేదనతో నిండిపోయింది. ఆ రాజ్యంలో నివసిస్తున్న సాధారణ ప్రజలు, బ్రాహ్మణ, శ్రమణులు, ఇతర మతాల వారు, తల్లి దండ్రులు, గురువులకు శుశ్రూష చేస్తూ, బంధు మిత్ర, సహచర, దాస, భృత్యుల పట్ల వాత్సల్యముతో ప్రవర్తించే గృహస్తులు కూడ హింసకు, దుర్మరణానికి గురికావడం దేవానాంప్రియునకు మరింత దు:ఖం కలిగింది. పైశాచికమైన యుద్ధ ప్రభావాన్ని తప్పించుకొన్న అదృష్టవంతులలో కూడ ప్రేమాభిమానాలు క్షీణించాయి. మిత్రులకు, సహచరులకు, బంధువులకు కలిగిన బాధలకు వారు కూడ దు:ఖిస్తున్నారు. ఈ విధంగా ప్రజలంతా అనుభవిస్తున్న దు:ఖం దేవానాంప్రియుని మనోవేదనను పెంచింది."

ఈ మనోవేదన ఫలితంగా అశోకునిలో కలిగిన వినూత్న భావాలను కళింగ ప్రజానీకానికి తన శాసనం ద్వారా తెలియ పరిచాడు " ఇక ముందెప్పుడూ యుద్ధాలు చేయను, ఆటవికులతో సహా సమస్త ప్రజలతో సామరస్యంగా మెలుగుతాను. నాసామ్రాజ్యములోనేగాక ప్రపంచమందంతటా ప్రజలు సత్క్రియలు చేయడానికి ప్రోత్సహించబడే ధర్మాన్ని వ్యాపింపజేయడమే నా జీవిత పరమావధి, దీని ఫలితంగా ప్రజలందరు అహింసాపరులు, స్వార్థరహితులు అయి సత్ప్రవర్తనను, నమ్రతను పాటించి సుఖిస్తారని నా విశ్వాసము."

తన ఈ వినూత్న భావాలను ఆచరణలో పెట్టుటకు అశోకుడు తన జీవితకాలమంతా కృషి చేశాడు. యుద్ధాల ద్వారా లభించే విజయాలను విస్మరించి ధర్మబోధనల ద్వారా సాధించే ధర్మ విజయాలను జీవిత లక్ష్యంగా నిర్ణయించుకొన్నాడు. తన పుత్రులు, పౌత్రులుకూడా ఈ ఆశయాలను లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని పరిపాలన చేయాలని, తమ జీవన విధానాన్ని రూపొందించుకోవాలని ఉద్బోధించాడు.

**10.2.6 బౌద్ధ మత స్వీకరణ :-** కళింగ యుద్ధానంతరం అశాంతితోను, ఆవేదనతోను ఉన్న అశోకునికి బౌద్ధం ఉపశమనం కలిగించింది. కళింగయుద్ధం ముగిసిన అనతికాలానికే అశోకుడు ఉపగుప్తుడనే బౌద్ధాచార్యుని వద్ద బౌద్ధ మత దీక్ష స్వీకరించాడు. అశోకుడు తన జీవితంలో కొంతకాలం పాటు యదార్థంగా బౌద్ధ బిక్షువైనాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. మరికొందరభిప్రాయంలో అతడిది 'భిక్కుగటిక' దశ అనగా ఉపాసక, భిక్కు దశలకు మధ్య దశ, గృహస్థాశ్రమంలో ఉంటూ కొన్ని సమయాలలో భిక్కుగటిక విహారాలలో ఉంటూండేవాడు. కొందరు అశోకుడు బౌద్ధుడుకాదని బ్రాహ్మణ మతస్థుడైన హిందువేనని వాదిస్తున్నారు. కాని అశోకుని శాసనాల నుండి లభ్యమయ్యే ఆధారాల వలన అతడు బౌద్ధ మతం స్వీకరించినట్లు స్పష్టమౌతుంది.

**10.2.7 భౌద్ధమత వ్యాప్తి :** అశోకుని మొదటి లఘుశాసనము (Minor Rock Edict) లో అశోకుడే స్వయముగా ఆ శాసనము వేసినప్పటికి అశోకుడు రెండు సంవత్సరాలక్రితం ఉపాసకుడైనాడని, మొదటి సంవత్సర కాలం బౌద్ధ ధర్మాచరణమునకుగాని, వ్యాప్తికిగాని తగిన విధముగా పాటుపడలేదని, సంఘములో ప్రవేశించి, బౌద్ధ ధర్మమును పాటించి సంవత్సరము పైగా అయినట్లు చెప్పుకొన్నాడు, బాబ్రా శాసనములో బుద్ధుడు, ధర్మము, సంఘములలో తన విశ్వాసాన్ని ప్రకటించి, బౌద్ధ ధర్మాన్ని తాను అంగీకరించినట్లు అశోకుడు పేర్కొన్నాడు. బౌద్ధ మత స్వీకరణ తరువాత అశోకుడు బౌద్ధ మత వ్యాప్తికి, అభివృద్ధికి కృషిచేయడమేకాక తాను స్వయంగా రూపొందించిన ధమ్మ విధానాన్ని కూడ తన సామ్రాజ్యములోను, పొరుగున ఉన్న ఇతర రాజ్యాలలోను ప్రచారం చేశాడు. తన ధమ్మ శాసనాలను దేశమంతా అనేక ప్రాంతాలలో ముఖ్యంగా జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో, బౌద్ధక్షేత్రాలలో, ప్రధాన రహదారుల కూడలి ప్రదేశాలలోను నెలకొల్పాడు. బౌద్ధ మత వ్యాప్తికి. ధమ్మ ప్రచారానికి ఎన్నో విధాలుగా కృషి చేశాడు. అశోకుడు దేశంలో వివిధ ప్రాంతాలలో 84000 స్తూప, విహారాలు నిర్మించినట్లు బౌద్ధగ్రంధాలు తెలుపుతున్నాయి.

అశోకుడు పట్టాభిషేకానంతరం పది సంవత్సరాలకు అంటే క్రీ.పూ. 259 -258 లో గయకు వెళ్ళి బోధి వృక్షాన్ని దర్శించాడు. ఆ తరువాత క్రీ.పూ. 257 - 256 సం॥లలో 256 రోజులు ధర్మయాత్ర చేసి తన సామ్రాజ్యం అంతటా పర్యటించి పుణ్యక్షేత్రాలు దర్శించి తన పర్యటనలో తటస్థపడిన ముఖ్య ప్రదేశాలన్నింటిలోను తన ధర్మయాత్రలకు సంబంధించిన శాసనాల ప్రతులను వేయించాడు.

బౌద్ధ మత వ్యాప్తికి, తన ధమ్మ విధానం ప్రచారానికి భారతదేశంలోను, విదేశాలలోను అశోకుడు ప్రచారక సంఘాలను నెలకొల్పాడు. తాను స్వయంగా తన సామ్రాజ్యంలో పర్యటించి ధమ్మ ప్రచారం చేసి, బ్రాహ్మణులకు, ఇతర మతాల వారికి దానాలు చేసి గ్రామీణ ప్రజలను బౌద్ధ ధమ్మ విషయంలో చైతన్యవంతులను చేశాడు. ధర్మ బోధనే ముఖ్య బాధ్యతగా విధించి ధర్మ మహామాత్రులనే ఉద్యోగులను నియమించాడు. వీరితో బాటు ప్రాదేశికులు, రాజుకులు, యుక్తులు మొదలగు ఉద్యోగులు మూడు లేదా ఐదు సంవత్సరాలకొక సారి సామ్రాజ్యమంతటా పర్యటించి ధమ్మ సందేశాన్ని సామ్రాజ్యం నలుమూలల వ్యాపింపచేయాలని అశోకుడు శాసించాడు. మతం పేరు మీదుగా జరిగే జంతు బలులను అటువంటి బలులకు కారణమైన జాతర్లను, హింసాయుతమైన వినోదాలను నిషేధించాడు.

**10.2.8 మూడవ బౌద్ధ సంగీతి :-** అశోకుని పట్టాభిషేకం జరిగిన 18 సంవత్సరాలకు బౌద్ధ విహారాలలో అధార్మిక మత శాఖలు ప్రవేశించడం వలన బౌద్ధ విశ్వాసాలలోను, ఆచారాలలోను ధర్మ శైథిల్యం ఏర్పడినట్లు దీపవంశం పేర్కొంటున్నది. అశోకుని శాసనాల వలన బౌద్ధ మత శాఖలకు ఇతర మతశాఖలకు మధ్య తరచు సమావేశాలను అతడు ప్రోత్సహించాడని తెలుస్తున్నది. బౌద్ధ విహారాలలో ఆజీవికులు నిర్గ్రంధులు నివశించి వారి మధ్య స్నేహపూర్వక చర్చలు జరిగి తద్వారా తన సామ్రాజ్యంలో మత సామరస్యాన్ని సాధించాలని అశోకుడు ఆశించాడు. ఇలా ఒకే ప్రదేశంలోని వివిధ మతశాఖల మధ్య వాదోపవాదాలు తీవ్రంగా జరిగి ఏదో ఒక సమయంలో ఘర్షణలు కూడ జరిగేందుకు అవకాశం ఉన్నది. ఫలితంగా సంఘ ప్రక్షాళనకు అశోకుడు పూనుకొన్నాడు. సంఘ సమైక్యాన్ని గురించి, విరుద్ధ భావాలు గల పరివ్రాజకుల, తపస్వినుల సంఘ బహిష్కారము గురించి అశోకుడి శాసనాలు ప్రస్తావిస్తున్నాయి.

ఈ సంఘ ప్రక్షాళన పూర్తయి, సంఘ సమైక్యము పునరుద్ధరించబడిందని అశోకుని అలహాబాద్ స్తంభశాసనాలలోని విభేద శాసనం సూచిస్తున్నది. ఈ శాసనంలో సంఘవిచ్ఛిన్నానికి ప్రయత్నించే భిక్షువులు, తపస్వినులు కాషాయవస్త్రాలు వదలి శ్వేతాంబరాలు ధరించి సంఘం నుండి వెళ్ళాలని అశోకుడు హెచ్చరించాడు. బౌద్ధ ధర్మ ఆచార్యుడైన మొగ్గలి పుత్త తిస్సకు ఆదేశాలు పంపి పాటలీపుత్రంలోని అశోకారామవిహారంలో బౌద్ధ బిక్షువులను సమావేశపరచాడు. ఈ సమావేశంలో విభాజ్య వాదాన్ని విశ్వసించిన వారినే యధార్ధ బౌద్ధులుగా నిర్ణయించి మిగిలిన వారిని సంఘం నుండి బహిష్కరించారు. ఈ సంఘ ప్రక్షాళన తరువాత బౌద్ధ ధర్మాని స్పష్టంగా నిర్వచించి, భిన్న బౌద్ధ శాఖల మధ్య శాంతిని నెలకొల్పడానికి అశోకుడు పాటలీపుత్రంలో మూడవ బౌద్ధ సంగీతిని ఏర్పాటు చేసినట్లు బౌద్ధ గ్రంధాలు వివరిస్తున్నాయి. ఈ పాళీ గ్రంధాలు బుద్ధుని మహాపరి నిర్వాణానంతరం **263** సంవత్సరాలకు సంఘ ప్రక్షాళన, బౌద్ధ సంఘ సమావేశము జరిగినట్లు వివరిస్తున్నాయి. క్రీ.పూ. **486** పరినిర్వాణము జరిగిందని భావించి దాని ప్రకారము గుణిస్తే అశోకుని **19** వ రాజ్య సంవత్సరంలో అంటే క్రీ.పూ **250** లో మూడవ బౌద్ధ సంగీతి పాటలీపుత్రంలో జరిగినట్లు తెలియవస్తున్నది. ఈ సంగీతికి మొగ్గలిపుత్త తిస్స అధ్యక్షుడు. ఈ సంగీతిలో భిన్న బౌద్ధ శాఖల మధ్య తీవ్రమైన వాదోపవాదాలు జరిగాయి. ఈ సంగీతిలో ఆంధ్ర బౌద్ధ బిక్షువులు కూడ ప్రముఖ పాత్ర వహించినట్లు బౌద్ధ గ్రంధాల వల్ల తెలుస్తున్నది. ఈ సంగీతిలో విభాజ్య వాదమే యధార్ధ ధర్మంగా ప్రకటించారు. త్రిపిటకాలలో మూడవదైన 'అభిదమ్మ పిటకము' ఈ సంగీతిలోనే రూపొందినది. ఈ సంగీతిలో జరిగిన వాదోపవాదాలను 'కథావత్తు' అనే పేర గ్రంధస్తం చేశారు.

మూడవ బౌద్ధ సంగీతి సమావేశము తరువాత దేశ విదేశాలలో బౌద్ధ మత ప్రచారానికి ప్రసిద్ధులైన బౌద్ధ బిక్షువులను అశోకుడు పంపాడు. కాశ్మీర్, గాంధారలకు మఝ్ఝంతికను, మహిషమండలానికి మహదేవను, బనవాసికి రక్షితను, అపరాంతకు యోన ధర్మ రక్షితను, మహారట్టకు మహాదర్మ రక్షితను సిరియా, ఈజిప్ట్ ,మాసిడోనియా, సైరీన్, ఎపిరస్ మొదలగు గ్రీకు రాజ్యలకు మహారక్షితను, హిమాలయ ప్రాంతానికి మఝ్ఝిమను, బర్మాదేశానికి సోణ, ఉత్తరలను, శ్రీలంకకు మహేంద్రను, సంఘమిత్రను పంపించాడు.

మూడవ బౌద్ధ సంఘ సమావేశం అశోకుని పోషణలో జరిగిందనే అనే అంశంలో చరిత్రకారులలో సందేహాలున్నాయి. అశోకుడే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉన్నట్లయితే ఈ అంశాన్ని తప్పకుండా తన శాసనాలలో ప్రస్తావించి ఉండేవాడే. బహుశ అశోకుని ప్రమేయం లేకుండానే మొగ్గలి పుత్త తిస్స పాటలీపుత్రంలో స్థానిక బౌద్ధ సంఘ సమావేశాన్ని ఏర్పరచి ఉండవచ్చని కొందరు భావిస్తున్నారు. అశోకుడు తన ధమ్మ ప్రచారానికి విదేశీరాజ్యాలకు రాయబార వర్గాలను పంపాడు. ఈ రాయబార బృందాలు బౌద్ధ మత ప్రచారకుల కంటే ఐదారు సంవత్సరాల ముందుగా వెళ్ళాయి. అశోకుని దౌత్యవర్గాలకు బౌద్ధ సంఘ ప్రచారకులకు ఎటువంటి సంబంధం లేదు. కాకపోతే ఈ రాయబార వర్గాలు బౌద్ధ మత ప్రచారకులకు ఎదో విధంగా సహాయపడి ఉండవచ్చు.

**10.2.9 మత సహనం :** అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించి ఆ మత ప్రచారానికి కృషి చేసి ఆదరించినా ఇతర మతాల పట్ల ద్వేషభావాన్ని వహించలేదు. అన్ని మతాల వారిని సమభావముతో చూడాలని శాసనాలలో ఆదేశించాడు. అశోకుడు తన శాసనాలలో 'ఎల్లవేళల ఇతర మతస్థుల పట్ల అభిమానము చూపుట అత్యవసరం. ఎవ్వరైతే తన మతమే శ్రేష్టమైనదని, అందువలననే తాను ఆ మతమును అవలంబించానని పలుకుతూ పరమత దూషణ చేయునో అటువంటి వ్యక్తి తన మతపతనమునకే కారకుడౌతాడు.' మాటలలో సంయమనము వలన ఒక మతం వారిపై మరొక మతం వారికి గౌరవాభిమానాలు పెరిగి ధర్మచింతనకు దోహద పడుతుందని స్పష్టంగా మత సామరస్యాన్ని గురించి ప్రబోధించాడు. బౌద్ధులకే గాక ఆజీవికులకు దానాలను చేశాడు. తన **12,19** రాజ్యపాలనా సంవత్సరాలలో ఆజీవికులకు బారాబర్ కొండలలో మూడు గుహలను తొలిపించి దానంగా ఇచ్చాడు.

**10.2.10 బౌద్ధక్షేత్రాల సందర్శనం :** అశోకుడు క్రీ.పూ **256 - 255** సంవత్సరంలో బుద్ధుని జన్మస్థలమైన లుంబినీ వనాన్ని (రుమ్మిండై) దర్శించి అక్కడ పూజలు జరిపాడు. లుంబినీలో ఒక శిల్పాశ్వాన్ని, శాసనము చెక్కించిన శిలాస్తంభాన్ని ప్రతిష్టించాడు. ఈ సమయంలోనే నిగలి సాగర్ సమీపంలోని కనకముని స్తూపాన్ని దర్శించి దానిని మరమ్మత్తులు చేసి అక్కడ ఒక స్తంభ శాసనాన్ని నెలకొల్పాడు.

**10.2.11 చివరికాలం :** ఈ స్తంభ శాసనాలతోబాటు తన **27**వ రాజ్యపాలనా సంవత్సరాలలో స్తంభశాసనాలను అశోకుడు జారీ చేశాడు. తన ధమ్మప్రచారం వలన జరిగిన ధర్మవికాసాన్ని సమీక్షిస్తూ అశోకుడు తన **28** వ రాజ్యాపాలనా సంవత్సరం చివరి స్తంభ శాసనం

చెక్కించాడు. ఈ శాసనం తరువాత అశోకుడు. క్రీ.పూ 232 లో మరణించే వరకు అతని శాసనాలు ఏమీ కన్పించటం లేదు. అతని చివరి పది సంవత్సరాల కాలంలో అతని గురించిన శాసనాధారాలు ఏమీ లేవు. అయితే బౌద్ధ గ్రంధాలు మాత్రం అతని చివరి పాలనా కాలంలో ప్రభుత్వం అతని వశం తప్పిందని చెబుతున్నాయి. అశోకుని 29 వ పాలన సంవత్సరంలో పట్టమహిషి అసంధిమిత్ర మరణించింది. ఆ తరువాత క్రీ.పూ 234 లో తిస్సరక్ష్మను పట్టమహిషినిగా చేశాడు.

ఈ కాలంలోనే అశోకుని అధికారం క్షీణించటమేకాక ఉద్యోగుల దౌర్జన్యం మితిమీరిందని, రాకుమారులు సామ్రాజ్య పాలనను సమర్ధవంతంగా నిర్వహించ లేకపోయారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఫలితంగా అశోకుడు పాలనా బాధ్యతను తన వారసునికి, తన విధానాలను వ్యతిరేకించిన మంత్రులకు అప్పగించి వృద్ధాప్యంలో రాజ్యాధికార బాధ్యత నుండి తొలగినాడని మరికొందరు చరిత్రకారుల ఉద్దేశము.

**10.2.12 ముగింపు :** క్రీ.పూ. మూడవ శతాబ్దం నాటి సంక్లిష్టమైన సాంస్కృతిక పరిస్థితులలో ధమ్మాన్ని రూపొందించి, నిర్వచించి ప్రభోదించుటలో అశోకుడు చాల తెగువ చూపాడు. మత గ్రంధాలు చెప్పిన మతం పట్ల, తమ పూర్వీకుల సంప్రదాయాల పట్ల మనిషికి గల బాధ్యతల కంటే అశోకుడు సాటి మానవుని పట్ల మనిషికి కల బాధ్యతను తన ధమ్మ విధానంలో భాగంగా శాసనస్థం చేశాడు. అశోకుడు తన సంస్కృతిని, మారుతున్న సామాజికావసరాలను గ్రహించి తన స్వయంకృషితో తన ఆదర్శాలను తన సామ్రాజ్యమంతటా వ్యాప్తం చేయటానికి కృషి చేశాడు. 'సమకాలిక పరిస్థితులతో ప్రయోగం చేయటానికి, వాటికి అపూర్వమైన పరిష్కారం సూచించే ధైర్యము ఉండటమే అశోకుని ఘనతకు కారణం' అని రోమిల్లాథాపర్ అభిప్రాయం.

## 10.3 అశోకుని ధమ్మ విధానము

**ఉపోద్ఘాతము :** అశోకుడు ప్రవేశ పెట్టిన ధమ్మ స్వభావాన్ని అర్ధం చేసుకోవటానికి ముందు, ఆ నూతన విధానం ప్రవేశపెట్టుటకు కారణమైన పరిస్థితులను గురించిన అవగాహన అవసరం. నందుల పాలనలో మహా పద్మనందుని అధికారంలో కేంద్రీకృత సామ్రాజ్య నిర్మాణానికి జరిగిన ప్రయత్నం విఫలమయ్యింది. దానికి కారణం నందరాజులు కేంద్రీకృత సామ్రాజ్య పాలనను అర్ధం చేసుకోలేక పోవడమే. నందవంశాన్ని కూలద్రోసి మగధను ఆక్రమించిన చంద్రగుప్తమౌర్యుడు కేంద్రీకృత అధికార విధానాన్ని ప్రవేశ పెట్టడంలో విజయం సాధించాడు. సమర్ధవంతమైన కేంద్ర ఉద్యోగులు, దేశ వ్యాప్తమైన రవాణా సౌకర్యాలతోను, సమర్ధుడైన చక్రవర్తి అదుపులో ఉన్న సామ్రాజ్యము ఆనాటి పరిస్థితులలో కేంద్రీకృత పాలనా వ్యవస్థ కలిగినదని చెప్పవచ్చును. ఈ మూడు లక్షణాలు మౌర్య సామ్రాజ్యానికి ఉన్నట్లు అర్ధ శాస్త్రం ద్వారా గ్రహించవచ్చును. ఐతే చక్రవర్తి తన కేంద్రాధికారాన్ని ఏ విధంగా పరిరక్షించుకోవాలనేది ప్రధాన సమస్య. దీనిని అధిగమించడానికి రెండు విధానాలున్నాయి. 1. సైనిక బలం ద్వారా ప్రజలను నిర్దాక్షిణ్యంగా అణచి అదుపులో ఉంచడం. చక్రవర్తి తాను దైవ స్వరూపుడని ప్రకటించడం మొదలగునవి. 2. ప్రజలలో బాగా వ్యాప్తమైన ఒక నూతన సిద్ధాంతానికి కాని, సమదృష్టితో భిన్న వర్గాల నుండి సేకరించిన భావాల పట్ల కాని తన అనుకూలతను ప్రకటించడం, ఈ రెండవ పద్ధతి ద్వారా రాజ్యంలోని ఇతర వర్గాల ప్రాబల్యం క్షీణించి నశించటంతో బాటు చక్రవర్తి తన బలాన్ని, అధికారాన్ని పెంచుకొనుటకు వీలవుతుంది. ఉద్యోగుల ప్రచారం వల్ల పాలకుల భావాల పట్ల ప్రజలు గౌరవం కలిగి ఉంటారు. అశోకుడు ఈ పద్ధతినే అనుసరించి ధమ్మ విధానాన్ని ప్రవేశపెట్టాడు.

**10.3.1 ధమ్మ ఉద్దేశము :** 'బహుజన హితాయ బహుజన సుఖాయ' అనే బౌద్ధ సూక్తిని అనుసరించి అశోకుడు తన ధమ్మ విధానాన్ని రూపొందించుకున్నాడు. అశోక ధమ్మంలోని కొన్ని సూత్రాలను అశోకుడు హిందు, బౌద్ధ సిద్ధాంతాల నుండి గ్రహించి ఉండవచ్చును. అశోకుని ధమ్మలోని నీతి సూత్రాలకు దీర్ఘనికాయములో బుద్ధుడు శ్రీగాలునకు బోధించిన ఉపదేశాలకు ఎక్కువ పోలికలు కనిపిస్తున్నాయి. ప్రజలకు అనుకూలము ఆచరణీయము అయిన నైతిక సూత్రాలను, ఉన్నతమైన జీవన విధానాన్ని అందించటమే అశోకుని ధమ్మ ఉద్దేశము. అందువల్లనే అశోకుడు సామాన్య ప్రజలకు పరిచయమున్న స్వర్గలోక ప్రాప్తి ప్రసక్తిని తన శాసనాలలో ప్రస్తావించాడు. నైతిక జీవనం వలన, ధర్మాచరణ వల్ల స్వర్గలోక ప్రాప్తి ప్రతిఫలంగా కలుగుతుందనే భావనను ప్రచారం చేశాడు. ధర్మాపేక్ష, శ్రద్ధ, విధేయత, పాపభీతి, సామర్ధ్యము లేకపోతే ఇహపరలోక సుఖాలను పొందలేరని బోధించాడు.

**10.3.2 ధమ్మ నిర్వచనం :** అశోకుని దృష్టిలో ధమ్మం అనేది ఒక జీవిత విధానం. అశోకుడే తన శాసనంలో ధమ్మం అంటే ఏమిటి అనే ప్రశ్న వేశాడు (ధమ్మెసాధూ కియం చు ధమ్మేతి). దీనికి సమాధానంగా అశోకుడే తక్కువ దోషాలు ( అపాసినవె) ; ఎక్కువ పుణ్యకార్యాలు (బహు కయానె) చేయడమే ధమ్మం అని చెప్పాడు. ఈ రెండింటిని పాటించినట్లయితే ధమ్మాన్ని అనుసరించినట్లేనని అశోకుని భావన. మానవుడు తాను చేసే పాపాలు గుర్తించాలని, క్రూరత్వం, కాఠిన్యం, ఆగ్రహం, గర్వం, అసూయలు పాపహేతువులని వాటిని అధిగమించాలని శాసనాలలో బోధించాడు.

**10.3.3 ధమ్మప్రకటన :** ధమ్మం పట్ల ప్రజలలో ఏ విధంగా ఆసక్తిని కలిగించాలి, వారి చేత ఆ ధమ్మాన్ని ఏ విధంగా అనుసరింపచేయాలని ఆలోచించి అశోకుడు ప్రజలు ధర్మాను శాసనాలను వినేటట్లు, వారికి ధమ్మ పరిజ్ఞానం ప్రభోదించేటట్లు చేశాడు. ధమ్మ మార్గాన్ని విన్న ప్రజలు దానిని ఆమోదించి ఉన్నతిని పొంది ధమ్మంలో అధిక ప్రగతిని సాధిస్తారని ఆశించి అశోకుడు ధమ్మ ప్రకటనలు చేయించాడు. ధమ్మ శాసన ప్రకటనకు ఉద్యోగులను నియమించాడు. నాలుగు నెలల కొకసారి తిష్యా నక్షత్రం అష్టమ దినాన ధమ్మ శాసనాలను ప్రకటించాలని ఆజ్ఞాపించాడు. తిష్యా నక్షత్రాల మధ్య రోజులలో కూడ అప్పుడప్పుడు ఈ శాసనాలను ఒక్క మనిషి ఉన్నప్పటికి బిగ్గరగా చదవాలని ఆదేశించాడు.

**10.3.4 ధమ్మ సూత్రాలు :** సామాన్య ప్రజలు కూడ సులభంగా అర్ధం చేసుకొని తన ధమ్మ మార్గాన్ని అనుసరించటానికి అశోకుడు తన శాసనాలలోనే మార్గాన్ని వివరించాడు. అవి

సుసూసం (శుశ్రూష) : తల్లి దండ్రులు, పెద్దలు, గురువులు మొదలైన వ్యక్తుల పట్ల వినయ విధేయతలు కలిగి వుండటం.

అపచితి / అపచాయితవియె (అపిచితి /అపచాయితో) : గురువుల యెడల గౌరవం.

సంపటిపతి (సంప్రతి పత్తి): సన్యాసులను, బ్రాహ్మణులను, శ్రమణులను, బంధువులను, బానిసలను, సేవకులను, పేదలను, దీనులను, స్నేహితులను, మనపై ఆధారపడి ఉన్న వారిని దయతో సత్కరించవలెను.

దానం : బ్రాహ్మణులకు, శ్రమణులకు, స్నేహితులకు, బంధువులకు, వృద్ధులకు, బానిసలకు, సేవకులకు దానం చేయవలెను.

అనరంభె పానానం (అనారంభో ప్రాణానాం) : జంతు బలి నిషేధం.

అవిహిస భూతానాం ( అవిహింసాయె భూతానాం ) : జీవులను హింసించరాదు.

అపవయత - అపభడత ( అపవ్యయతా - అపభాండతా ) : మిత వ్యయము, మిత సంపాదన మాత్రమే చేయవలెను.

మార్దవం : సర్వ ప్రాణుల పట్ల దయ, కరుణ చూపవలెను.

సత్యం : ప్రతి వారు సత్యమునే పలుక వలెను.

ధమ్మరతి (ధర్మరతి) : ప్రతి వారు ధర్మమునే చాటవలెను.

భావ సుధి (భావ శుద్ది) : పవిత్రమైన మనస్సు, సౌశీల్యత కలిగి ఉండాలి.

**10.3.5 ధమ్మవ్యాప్తికి కృషి :** అశోకుడు తన సామ్రాజ్యంలో ధమ్మ వ్యాప్తి ఎన్నో విధాలుగా కృషి చేశాడు. ప్రజలు ధమ్మాన్ని అనుసరించి ఇహలోక సౌఖ్యాన్ని, స్వర్గప్రాప్తి పొందాలనే ఆశయంతో ధమ్మ సూత్రాలను గండ శిలలపైన, శిలా స్తంభాలపైన చెక్కించి జన సమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలోను, బౌద్ధ క్షేత్రాలలోను, ప్రధాన రహదారుల కూడలి ప్రదేశాలలోను ధమ్మ లిపులున్న శాసనాలను నెలకొల్పినాడు.

తిష్యా నక్షత్రం రోజున, సంవత్సరం మధ్య మధ్యన తరుచుగా, ముఖ్యమైన సందర్భాలలోను ఈ శాసనాలను గట్టిగా చదివి ప్రజలకు వినిపించాలని అశోకుడు ఆదేశించాడు.

**10.3.6 ధమ్మప్రచారం :** అశోకుడు ధమ్మ ప్రచారమే ముఖ్య విధిగా గల ధర్మ మహామాత్రులనే ఉద్యోగులను తన పధ్నాల్గవ రాజ్య సంవత్సరంలో నియమించాడు. అశోకునికి పూర్వం ధర్మమహామాత్రులనే రాజోద్యోగులు లేరు. అశోకుడే వీరిని మొట్ట మొదటి సారిగ నియమించాడు. ఈ ఉద్యోగుల ముఖ్య విధి వివిధ మతాలను అనుసరించే వారిలో ధమ్మ ప్రభోధము చేయడం, ధర్మ నిర్వహణ సక్రమముగా జరుగునట్లు చూడటం వీరి బాధ్యత. చక్రవర్తి ధర్మమహామాత్రులకు ప్రత్యేకాధికారాలు ఇచ్చాడు. రాజ కుటుంబ ప్రాసాదాలు, రాజ బంధువుల నివాసాలతో సహా అన్ని వర్గాల ఇళ్ళలో ప్రవేశించడానికి వీరికి అనుమతి ఉంది. అశోకుని రాజ్యంలోనే కాక పొరుగున ఉన్న యవన, కాంభోజ, గాంధార రాజ్యాలలో కూడ వీరు తమ విధులను నిర్వర్తించే వారు. ధమ్మ ప్రచారాన్ని ఎక్కువ వ్యాప్తిలోకి తీసుకొని రావడానికే ధర్మ మహామాత్రులకు ఎక్కువ అధికారాలనిచ్చాడు. స్త్రీ జనాల కోసం ప్రత్యేకంగా ఇధీజ్ఞక్క మహామాత్రులను నియమించాడు. ధర్మ మహామాత్రుల ద్వారా ప్రతి వ్యక్తికి ధమ్మం చేరాలని స్పష్టం చేశాడు. వీరు ఆర్యులు, బ్రాహ్మణులు, పాలకులు మొదలగువారి యోగక్షేమాలు చూచుటయే కాక దీనులు, అనాధలు, వృద్ధులైన వారి బాధలను గూడ నివారించుటకు పాటుపడాలి. వీరు శిక్షలననుభవిస్తున్న ఖైదీల సంసారములకు అవసరమైన ధన సహాయం చేయటం, ఇతరుల ప్రోద్భలముపై నేరములు చేసి శిక్షలు అనుభవిస్తున్న వారికి విముక్తి కలిగించడం, వయో వృద్ధులకు అవసరమైన సహాయము చేయటం వంటి బాధ్యతలను కూడ నిర్వర్తించాలని అశోకుడు ఆదేశించాడు. వీరే కాకుండా రాజుద్యోగులయిన రాజుకులు, ప్రాద్రేశికులు ప్రతి అయిదు సంవత్సరములకు ఒకసారి తమ పాలిత ప్రాంతమంతా ధమ్మ ప్రచారం చేయటానికి పర్యటించాలని కూడ అశోకుడు ఆజ్ఞాపించాడు. ఈ విధమైన కార్యాచరణ ఫలితంగా సమాజంలోని అన్ని స్థాయిలలోని ప్రజలలో వీరికి సాన్నిహిత్యమే ఏర్పడి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలలోకి ధమ్మ విధానం చొచ్చుకొని పోవటానికి ఉపయోగపడింది. ధమ్మమహామాత్రుల నియామకాన్ని ఉదారబుద్ధితో, ధమ్మ ప్రచారం కోసం ప్రారంభించినా నాడు అటువంటి ఉద్యోగుల అవసరం కూడ ఉన్నది. అన్ని స్థాయిలలో సంఘ సంక్షేమ కృషి జరుగుతున్ననాడే కేంద్రీకృత పాలనా విధానం ఎక్కువ సమర్ధవంతంగా పని చేస్తుంది. వీరి ద్వారా అశోకుడు తన లక్ష్యాన్ని సాధించగలిగాడు.

**10.3.7 ధమ్మయాత్రలు :** ధమ్మ ప్రచారానికి అశోకుడు చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా తన సామ్రాజ్యంలో ధమ్మయాత్రలు సాగించాడు. పట్టాభిషేకానంతరం పది సంవత్సరాలకు అశోకుడు గయలోని బోధివృక్షాన్ని దర్శించాడు. ఆ తరువాత 256 రోజులలో తన సామ్రాజ్యంలో అనేక ప్రదేశాలలో ధమ్మయాత్రలు చేశాడు. ఈ యాత్ర వలన కలిగే ప్రయోజనాలను అశోకుడే తన శాసనాలలో వివరించాడు. బ్రాహ్మణులను, శ్రమణులను దర్శించి వారికి దాన ధర్మాలు చేయడం, వృద్ధులకు బంగారం పంచి, వారికి భృతిని కల్పించటం, ఉదాత్తమైన నీతి సూత్రాలను బోధించి ప్రజల నైతిక ప్రవర్తన గురించి పరామర్శించటం, గ్రామీణ ప్రాంతాలలోని జానపదులను కలిసి వారితో ధమ్మ చర్చ జరిపి వారి సందేహాలను తీర్చి వారిని ధమ్మనిరతులను చేయటానికి ప్రయత్నించటం మొదలగునవి ఈ ధమ్మ యాత్రలలో అశోకుని ముఖ్య కార్యక్రమాలు. ఈ ధమ్మ యాత్రల ద్వారా ఆయా ప్రాంతాలలోని వేరు వేరు మత శాఖలను, రైతులను గ్రామస్తులను, వృద్ధులను కలసి ప్రజలతో తన సంబంధాలను పెంచుకొనేందుకు, ప్రజలలో అన్ని తరగతుల వారికి తన ధమ్మ విధానాన్ని ప్రబోధించేందుకు అశోకుడు ప్రయత్నించారు.

**10.3.8 ధమ్మ ప్రచార సాధనాలు :** తన సామ్రాజ్యములో రెండు సాధనాల ద్వారా ధర్మ ప్రచారం జరిగిందని అశోకుడు వివరించాడు. అందులో మొదటిది శాసనం, రెండవది ప్రోత్సాహం. అశోకుడు శాసనాల ద్వారా కొన్ని రకాల జంతు బలిని, జీవహింసకు కారణమైన జాతర్లను నిషేధించాడు. కాని దీనికంటే జంతు వధ, జీవహింస కూడదని చేసిన ప్రోత్సాహం ద్వారానే ప్రజలలో ధర్మానువర్తనం పెరిగింది. తాను బోధించిన ధమ్మాన్ని తానే ఆచరించుట ధమ్మవ్యాప్తికి ఎక్కువ దోహదకారి అవుతుందని భావించి రాజాంతఃపురంలో ఆహారం కొరకు ప్రతి దినము జరిగే వేలాది జంతువులకు వధకు బదులు రోజుకు ఒక జంతువు, రెండు పక్షులను మాత్రమే ఆహారం కోసం చంపేటట్లు నిర్ణయించి క్రమేణా అంతఃపురంలో జంతు వధను మాన్పించుటకు ప్రయత్నించాడు.

**10.3.9 ప్రజా సంక్షేమం :** ప్రజల అవసరాలను రాజుకు నివేదించే ఉద్యోగి బృందాన్ని అశోకుడు పటివేదకులని, మంత్రి పరిషత్తు అభిప్రాయాలను రాజుకు విన్నవించేవారిని మహామాత్రులని వ్యవహరించేవాడు. అశోకుడు తాను భోజనము చేయుచున్నప్పుడు గాని, అంతఃపురంలో ఉన్నప్పుడు

గాని, శయ్యాగృహములో ఉన్నప్పుడు కాని, వాహ్యాళికి వెళ్ళునప్పుడుగాని, వాహనాలలో ప్రయాణిస్తున్నప్పుడుగాని, జైత్రయాత్రలో ఉన్నప్పుడుకాని, వ్యక్తిగత కార్యక్రమాలలో ఉన్నప్పుడుగాని ఏ సమయములోనైనా ఈ ఉద్యోగులు తనను కలుసుకొని ప్రజల అవసరాలను నివేదించవచ్చని ఆరవ శిలా శాసనంలో తెలియచేశాడు.

ధమ్మ ఆచరణలో భాగంగా అశోకుడు ప్రవేశ పట్టిన ప్రజా సంక్షేమ కార్యాలు కొన్నింటిని రెండవ శిలా శాసనం పేర్కొంటున్నది. తన సామ్రాజ్యమంతట మనుషులకు, పశువులకు వైద్యశాలలు నిర్మించాడు. రహదారుల కిరువైపులా బాటసారుల మార్గాయాసము పోగొట్టుటకై నిడనిచ్చే మఱ్ఱి చెట్లు నాటించి, మామిడి తోటలు పెంచాడు. బావులు త్రవ్వించాడు. ఎనిమిది క్రోసులకు ఒకటి చొప్పున సత్రాలు నిర్మించి మానవులకు, పశువులకు సుఖము చేకూర్చాడు.

**10.3.10 ధమ్మవ్యాప్తి - వికాసం :** అశోకుడు చేపట్టిన ఈ వివిధ కార్యక్రమాల ద్వారా ధమ్మ వ్యాప్తి రాజ్యంలోని బ్రాహ్మణుల మొదలు మావటీల వరకు అన్ని సాంఘిక తరగతులలో జరిగింది. మొదటి స్తంభ శాసనంలో ధమ్మ వ్యాప్తిని సింహావలోకనం చేస్తూ సంవత్సరాలు గడిచిన కొద్ది ధమ్మం వికసించిందనే సంతృప్తిని అశోకుడు ప్రకటించాడు. సమాజంలోని అన్ని సమస్యలకు కొత్త పరిష్కార మార్గంగా ధమ్మ గుణాలను వర్ణించాడు. అంతకుపూర్వం సామాన్య సద్గుణాలు. ఉన్నత మనస్తత్వం గల సామాజిక నీతి ద్వారా పుణ్యం లభిస్తుందని విశ్వసించేవారు. కాని అశోకుని కాలానికి సామాజిక నీతి ధమ్మంపైనే ఆధారపడింది. తన ప్రబోధం ద్వారానే ధమ్మ వికాసం జరిగిందని అశోకుడు ఈ శాసనంలో చెప్పాడు. అశోకుని తొలి శాసనాలలో కనిపించే స్వీయ బాధ్యతాభావం క్రమంగా ఆజ్ఞలుగా మారి వ్యక్తి అభీష్టానికి అవకాశం తగ్గిపోయింది. వ్యక్తుల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా ధర్మ మహామాత్రులు అమలు చేసే నిర్దిష్టమైన ఆజ్ఞాపన రూపాన్ని ధమ్మం వహించినట్లు కనిపిస్తుంది. సర్వ సమస్యలకు ధమ్మం ఇంద్రజాలిక పరిష్కారంగా రూపుదిద్దుకొంది. ధమ్మ ప్రచారకులు ఒక మత వ్యవస్థగా రూపొంద సాగారు. ఈ శాసనంలో చివరి వాక్యాలైన “ఇది నా సిద్ధాంతం. ధమ్మం ద్వారా రక్షణ, ధమ్మ పరిపాలన, ధమ్మం ద్వారా ప్రజాసుఖం, ధమ్మం ద్వారా సామ్రాజ్య పరి రక్షణ” అనేవి ధమ్మోన్మాదానికి, అహంభావానికి నాందిగా కన్పిస్తున్నాయి.

రెండవ స్తంభ శాసనంలో కూడ అశోకుడు ఇటువంటి ధోరణినే వ్యక్తం చేశాడు. దయ, దాక్షిణ్యం, సత్యం, శౌచం అంటూ ధమ్మన్ని వర్ణించాడు. తాను అనేక విధాలుగ చక్షుదానం చేసినట్లు చెప్పుకొన్నాడు. ధమ్మ ఆచరణ వలన వ్యక్తి సంబంధాలు, సాంఘిక సంబంధాలు స్పష్టమై, సాంఘిక జీవితాన్ని, సత్కర్మల వల్ల లభించే పుణ్యాన్ని అవగాహన చేసుకోవటానికి వీలు కలిగించడమే ‘చక్షుదానం’ భావము. అశోకుడు తానే జ్ఞానాన్ని ప్రసాదించినట్లు చెప్పడానికి లేదా తానే మార్గదర్శకుడైనాడని చెప్పడానికి చక్షుదానం పదాన్ని వాడాడు. ఈ శాసనంలోనే మరొక చోటు మానవులకు, జంతువులకు అనేక వరాలను ప్రసాదించినట్లు, వాటికి ప్రాణ రక్షణ చేసినట్లు సత్కర్మలు చేసినట్లు కూడ చెప్పాడు. ఈ వాక్యాలను గమనించినట్లయితే అశోకునిలో స్వోత్కర్ష పెరుగుతున్నట్లు స్పష్టమౌతున్నది. దీని వలన స్వాతిశయం అధికమైన కారణంగా ప్రజాభిప్రాయంలో పూర్వం ఏర్పడిన పరిచయానికి ప్రతిబంధకం ఏర్పడుటకు అవకాశం కలిగింది. అయితే అశోకుడు ఈ దశలో కూడ ధమ్మం పట్ల అభిమానం ఎంతో పెరిగినా ధమ్మాన్ని నైతిక సూత్రంగా పరిగణించాడే కాని మత సిద్ధాంతంగా పరిగణించలేదు. ధమ్మ ప్రచారానికి అశోకుడు అవలంబించిన విధానాలు మత సంస్థలతో పోటీ పడ్డాయే కాని అతని బోధనలు మాత్రం మత స్వరూపాన్ని పొందలేదు.

**10.3.11 ధమ్మం - వ్యాఖ్యానం :** అశోకు ధమ్మాన్ని బౌద్ధ ధర్మంతో కాని, ధర్మమనే సాధారణంగా వ్యవహరించబడుచున్న ఏ ఇతర విధానంతోగాని కలిపి వేయడం సరి అయినది కాదు. అందుచేత ధమ్మాన్ని వ్యాఖ్యానించేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించడం అవసరం. ధమ్మ పదాన్ని వాడిన దెవరు, ఏ సందర్భంలో వాడారు అని విశ్లేషణాత్మక వివరణ చేసిన తరువాతనే నిజమయిన వ్యాఖ్యానం లభిస్తుంది. ప్రాచీన భారత సాహిత్యంలోను, వివిధ మతాలలోను కనిపించే ధర్మాలు, లేదా ధమ్మాలు అశోకుని ధమ్మం ఒకటేనని చెప్పడం మూర్ఖత్వమే అవుతుంది. అశోకుని ధమ్మం ఏమిటి అనే పశ్నకు ఇప్పుడు అపారమైన సారస్వతమున్న అశోకుని శాసనాలే సమాధానమిస్తున్నాయి.

**10.3.12 ముగింపు :** మౌర్యయుగ భారతదేశంలో న్యాయము, సాంఘిక విధానము అనే అర్థంలో ధర్మ సూత్రాన్ని ఉపయోగించడం సాధారణమైన విషయము. ధర్మాన్ని ప్రచారం ద్వారా సభ్యమైనదిగా చేయటానికి అశోకుడు ప్రయత్నించాడు. “ మత బోధకుల సంకుచిత

దృక్పధాన్ని సంస్కరించటానికి సామ్రాజ్యమంతటా సాంఘిక ప్రవర్తనా చైతన్యాన్ని కలిగించటానికి అశోకుడు ధమ్మ ప్రచారం ద్వారా ప్రయత్నించాడు.

అశోకుని మరణంతో అతని ధమ్మ విధానం కూడ అంతరించింది. అశోకుని తరువాత మగధ పాలకులైన మౌర్యులు ఎవరూ కూడ ధమ్మ విధానాన్ని అనుసరించలేదు. అశోకుని శాసనాలు జేమ్స్ ప్రిన్సెప్ 1837 లో చదివేంతవరకు అంటే సుమారు రెండు వేల సంవత్సరాల వరకు అతని ధమ్మ సంప్రదాయాన్ని స్మరించినవారు కాని, లక్ష్య పెట్టినవారు కాని లేరు.

## 10.4 సారాంశము :

అశోకుని కాలం భారతదేశచరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఇతనికాలంలో ఇవ్వబడిన శిలాశాసనాలు ఆధారంగా భారతీయులు అప్పటికీ భాషాకోవిధులని తెలియచెప్పటమేకాక భారత చరిత్రకు కాల నిర్ణయం చేయటానికి ఉపయోగపడుతున్నాయి. అశోకుని దమ్మపథం జాతిని సంఘటితపరచినది. అశోకుడు అవలంబించిన పద్దతులవల్ల విదేశాలలో కూడ బౌద్ధమతము విరివిగా వ్యాప్తి చెందింది. భారత దేశం శాంతికాముక దేశంగా విలసిల్లడానికి అశోకుని శాంతి ప్రవచనాలు ప్రామాణికంగా మారాయి.

## 10.5 మాదిరి ప్రశ్నలు :

1. ప్రజల సంక్షేమం కోసం అశోకుడు ఏ విధంగా పాటు పడ్డాడు?
2. అశోకుని కళింగ యుద్ధం గూర్చి వ్రాయుము ?
3. అశోకుని దమ్మవిధానం గూర్చి వ్రాయుము ? దాని ఫలితము గూర్చి వ్రాయుము.
4. మూడవ బౌద్ధసంగీతి గూర్చి వ్రాయుము ?

## సంక్షిప్త ప్రశ్నలు :

1. దమ్మవిధాన వ్యాప్తి గూర్చి వ్రాయుము ?
2. అశోకుని కాలనిర్ణయం గూర్చి వ్రాయుము ?
3. అశోకుని యొక్క బిరుదులు తెలుపుము ?
4. తక్షశిల తిరుగుబాటు గూర్చి వ్రాయుము ?
5. బౌద్ధమత వ్యాప్తి గూర్చి వ్రాయుము ?
6. అశోకుని చివరి దశను గూర్చి వివరింపుము ?

పాఠం - 11

# కడపటి మౌర్యులు - సామ్రాజ్యపతనం

## 11.0 లక్ష్యం :

కడపటి మౌర్య రాజుల చరిత్రను వివరించి మౌర్య సామ్రాజ్య పతనానికి గల కారణాలను వివరించడమే ఈపాఠం లక్ష్యం.

## విషయక్రమం :


11.1 ఉపోద్ఘాతం

11.2 పురాణాలు - కడపటి మౌర్యుల జాబితా

11.3 మౌర్య సామ్రాజ్యపతనము - కారణములు

11.4 సారాంశము


## 11.1 ఉపోద్ఘాతము :

అశోకుడు మరణించిన తరువాత 52 సంవత్సరాల పాటు అనగా క్రీ.పూ 187 వరకు మౌర్యులు పరిపాలించారు. కాని ఈ చివరి రాజుల కాలంలోనే మౌర్య సామ్రాజ్యం క్షీణించి తుదకు వారి అధికారం కేవలం మగధ పరిసర ప్రాంతాలకే పరిమితమయ్యింది. అశోకుని గురించి తెలుసుకోవటానికి ఎన్నో శాసనాలు, ఎంతో సారస్వత ఆధారాలున్నాయి. కాని అతని తరువాత మగధ సింహాసనమధిష్టించిన మౌర్యుల గురించిన ఆధారాలు చాలాస్వల్పం. ఈ ఆధారాలు కూడ అస్పష్టంగాను, సంశయాస్పదంగాను, క్రమరహితంగాను ఉన్నాయి. ఈ కారణం వలన చివరి మౌర్యుల చరిత్రను క్రమబద్ధంగా పునర్నిర్మించటానికి వీలుకాకపోవటమే కాక వారి చరిత్ర గురించి చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు.

పురాణాలు, జైన, బౌద్ధ సాహిత్యాలు తమ తమ గ్రంధాలలో చివరి మౌర్యులను గురించి విభిన్న కథనాలను వివరిస్తున్నాయి. ఈ ఆధారాల కంటే కొన్ని నూతన విషయాలతో కల్హణుని రాజతరంగిణి, టిబెట్ చరిత్ర కారుడు తారానాధ్‌లు, తమ రచనల్లో అశోకుని తరువాత మౌర్య రాజ్యాన్ని గురించి పేర్కొంటున్నారు.

## 11.2 పురాణాలు - కడపటి మౌర్యుల జాబితా :

అశోకుని శాసనాల ద్వారా మనకు తెలుస్తున్న అశోకుని కుమారుడు తీవరుడు. కాని అశోకుని తరువాత అతని ప్రసక్తి మౌర్య చరిత్రలో కనిపించదు. సారస్వతి ఆధారాలు మహేంద్రడు, కుణాలుడు, జలౌకుడు అనే ముగ్గురు కుమారులు అశోకున్నట్లు తెలుపుతున్నాయి. వాయు, బ్రహ్మాండ పురాణాలు అశోకుని తరువాత కుణాలుడు ఎనిమిది సంవత్సరాలు పరిపాలించాడని అతని తరువాత బందుపాలితుడు, ఇంద్రపాలితుడు, దేవవర్మ, శతధనుష్, బృహద్రధుడు మొత్తం ఆరుగురు రాజులు 48 సంవత్సరాలు పరిపాలించారని వివరిస్తున్నవి. మత్స్యపురాణం ప్రకారం అశోకుని తరువాత దశరధుడు, అతని తరువాత సంప్రతి, శతధన్వుడు, బృహద్రధుడు, 34 సంవత్సరాలు పరిపాలించినట్లు పేర్కొంటున్నది. విష్ణుపురాణం అశోకుని తరువాత ఏడుగురు రాజులు పరిపాలించారని

వారు సుయశ, దశరధ, సంగత, శాలిశుక, సోమవర్మ, శతధన్వ, బృహద్రధుడు అని చెబుతున్నది. ఈ పురాణాలలో ఇచ్చిన వివిధ పట్టికలలో జాబితాలను పోల్చడం వలన వచ్చిన పట్టిక ప్రకారం అశోకుని తరువాత కుణాలుడు, బంధుపాలిత, ఇంద్ర పాలిత, దశోన, దశరధ, సంప్రతి, శాలిశుక, దేవవర్మ, శతధన్వ, బృహద్రధుడు మొత్తము పదిమంది రాజులు 85 సంవత్సరాలు పరిపాలించినట్లు చివరి మౌర్యుల కాలక్రమము వస్తుంది.

కాని ఈ జాబితా మౌర్యుల కాలనిర్ణయం ప్రకారం అమోద యోగ్యము కాదు. చివరి మౌర్యులను గురించి పురాణాలలో విభిన్న సమాచారమున్నప్పటికి మొత్తం మౌర్య వంశం 137 సంవత్సరాలు పరిపాలించిందన్న అంశంలో పురాణాలన్ని ఏకాభిప్రాయంతో ఉన్నాయి. పురాణాలు ఇస్తున్న సమాచారం ప్రకారం మౌర్యులలో మొదటి ముగ్గురు చక్రవర్తులైన చంద్రగుప్త, బిందుసార, అశోకుడు మొత్తం 85 సంవత్సరాలు పరిపాలించారు. మిగిలిన 52 సంవత్సరాలు అశోకుని తరువాత మౌర్య సామ్రాజ్యాన్ని పరిపాలించిన మౌర్య రాజులందరి పాలనా సంవత్సరాలు. కాని పురాణాల వివిధ పట్టికలలోని జాబితాల ప్రకారం చివరి మౌర్యుల పాలనా సంవత్సరాలు 85 సంవత్సరాలు వస్తున్నాయి. కాని చివరి మౌర్యులు 85 సంవత్సరాలు పాలించారనడం పూర్తిగా అసమంజసమౌతుంది. అలాగే ఈ పురాణాల పట్టికలలో పాలనా సంవత్సరాలలో కూడా చాల తేడాలున్నాయి. చివరి మౌర్యుల పాలనా సంవత్సరాలు 52 సంవత్సరాల కంటే ఎక్కువగా గానీ తక్కువగా గానీ పేర్కొంటున్నాయి. ఈ పరిశీలన వలన పురాణాలు చెబుతున్న ఏ పట్టికా పూర్తి ప్రామాణికమని అంగీకరించడానికి వీలుగా లేదు.

**11.2.1 బౌద్ధ గ్రంధాలు - కడపటి మౌర్యుల జాబితా :** బౌద్ధ ఆధారాలలో అశోకావదానం చెబుతున్న వివరాల ప్రకారం అశోకుని తరువాత సంపది, వృహస్పతి, వృషసేన, పుష్యధర్మ, పుష్యమిత్రులు మగధను పరిపాలించారు. జైన గ్రంధాలు ఇస్తున్న సమాచారం ప్రకారం అశోకుని అనంతరం అతని మనుమడు కునాలుని పుత్రుడు అయిన సంప్రతి మౌర్య సామ్రాజ్యాధినేత అయినాడు. టిబెట్ చరిత్రకారుడు తారానాథ్ వివిధ బౌద్ధ గ్రంధాల ఆధారంగా ఇచ్చిన జాబితా ప్రకారం అశోకుని తరువాత విగతాశోక, వీరసేనులు మగధను పరిపాలించారు. కల్హణుడు తన రాజతరంగిణిలో మిగిలిన ఆధారాలలోలేని జలౌకుడు అశోకుని తరువాత కాశ్మీర్‌కు రాజైనట్లు అతని తరువాత దామోదరుడు పరిపాలించినట్లు తెలియజేశాడు.

**11.2.2 తీవరుడు :** అశోకుని అనంతరం అతని కుమారుడైన తీవరుడి సింహాసనం అధిష్టించే అవకాశం ఉన్నది. అశోకుని చివరి పాలనా కాలంలో వేసిన అలహాబాద్ స్తంభం పైనున్న మహారాణి శాసనంలో తల్లి కారవాకితో తీవరుడు ప్రస్తావించబడ్డాడు. కాని వాఙ్మయాధారాలలో ఎక్కడా తీవరుని ప్రస్తావన కన్పించదు. అశోకుని మరణం తరువాత తల్లి బారువాకి (తిస్సరఖ) తో సహా తీవరుని ప్రసక్తి మనకు ఏ సారస్వతి ఆధారాలలోనూ కన్పించదు.

**11.2.3 కునాలుడు :** బౌద్ధ గ్రంధాల కధనం ప్రకారం అశోకుని కుమారుడు కునాలుడు కొంతకాలం తక్షశిలలో రాజప్రతినిధిగా పదవిని నిర్వహించి తరువాత అతని వారసునిగా మౌర్య సామ్రాజ్యన్ని పరిపాలించినట్లు తెలుస్తున్నది. విష్ణు పురాణంలో లభ్యమౌతున్న సమాచారాన్ని బట్టి అశోకుని తరువాత సుయశ, అతని తరువాత దశరధుడు మౌర్య రాజ్యాధికారం చేపట్టారు. విష్ణుపురాణం ఒక్కటే సుయశను పేర్కొంటున్నది. చరిత్రకారులు కొంత మంది సుయశ అనేది రాజు అయిన తరువాత కునాలుడు ధరించిన బిరుదుగా భావిస్తున్నారు. దివ్యావదానం ఇతడికి ధర్మవివర్ధన అనే పేరును వాడింది.

**11.2.4 దశరధుడు :** మత్స్య పురాణం చెబుతున్న వివరాల ప్రకారం అశోకుడి తరువాత అతని పౌత్రుడు దశరధుడు మౌర్య సింహాసనమధిష్ఠించినట్లు తెలుస్తున్నది. అశోకుడి తరువాత వారసులుగా సారస్వత ఆధారాలు పేర్కొంటున్న వారిలో దశరధుడు ఒక్కడే శాసనాల ద్వారా తెలుస్తున్నాడు. ఇతడి శాసనాలు బరాబర్ పర్వతాలలోని నాగార్జుని కొండలో ఉన్నాయి. ఈ శాసనాలు దశరధుడు నాగార్జుని కొండలలోని గుహలను ఆజీవికులకు దానం చేసిన సందర్భంగా జారీ చేసినవి. దశరధుడు సింహాసనమెక్కిన వెంటనే ఆ గుహలను ఆజీవికులకు అంకితం చేస్తూ దేవానాంప్రియ దశరధుడు ఇచ్చిన ఆజ్ఞలే శాసనాలుగా చెక్కారు. శాసనలిపి అశోక లిపి,

అంతేకాకుండా శాసన శైలి, స్వభావాలు కూడ అశోకుని శాసనాలను పోలి ఉన్నవి. అందువలన అశోకుని తరువాత వెంటనే ఈ శాసనాలు జారీ అయినట్లు రోమిల్లా థాపర్ వంటి చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ శాసనాలలోని ' సూర్య చంద్రులున్నంత వరకు ఈ నివాసం నిలిచి ఉండాలన్న' దశరధునికి కోర్కెకు, ఏడవ స్తంభ శాసనంలోని ' ఆచంద్రార్కం ధర్మసూత్రాలను స్త్రీ పురుషులు అనుసరించాలి' అనే అశోకుని ఆకాంక్షకు దగ్గర సంబంధముంది. ఆజీవికులకు గుహలను అంకితం చేయడం, శాసనాలు వేయించటం, దేవానాంప్రియ బిరుదు ధరించటం మొదలగు అంశాలన్నీ దశరధుడు తన పితామహుడైన అశోకునికి సన్నిహితంగా మెలిగినట్లు సూచిస్తున్నాయి. అశోకుడు బౌద్ధ మతం స్వీకరించి కూడా తన మత సామరస్య సిద్ధాంతానుగుణంగా బరబర్ గుహలను తొలిపించి ఆజీవికులకు దానం చేశాడు. అటువంటి విధానాన్నే దశరధుడు అనుసరించాడు. ఈ శాసనాల వలన దశరధుడు ఆజీవీకుల యెడల ప్రత్యేక అభిమానాన్ని ప్రదర్శించాడని చెప్పవచ్చు కాని ఇతర మతాల పట్ల నిరాదరణ వహించాడని చెప్పడానికి ఎటువంటి సూచన ఈ శాసనంలో లేదు.

**11.2.5 సంప్రతి :** మత్స్య పురాణం దశరధుని తరువాత అతని కుమారుడు సంప్రతి రాజైనట్లు చెప్పగా, జైన బౌద్ధ గ్రంధాలు కుణాలుని కుమారుడిగా సంప్రతిని పేర్కొంటున్నాయి. అశోకుని పౌత్రుడైన సంప్రతిని జైన మత పోషకునిగా జైన గ్రంధాలు కీర్తిస్తున్నాయి. జినప్రభసూరి అందిస్తున్న సమాచారం ప్రకారం సుహస్తి అనే ఆచార్యుని వద్ద సంప్రతి జైన మత దీక్ష స్వీకరించాడు. అప్పటి నుండి పాలకుడిగా బౌద్ధ మత వ్యాప్తికి అశోకుడు చేసినంత కృషి జైన మత వ్యాప్తికి సంప్రతి చేసినట్లు, అతని ఆదేశంపైన జైన మతాచార్యులు దేశ విదేశాలలో జైన మత ప్రచారం చేసినట్లు జైనగ్రంధాలు వర్ణిస్తున్నాయి. అంతేకాకుండా సంప్రతి పాటలీపుత్రము నుండి, ఉజ్జయిని నుండి పరిపాలించినట్లు కూడ ఈ గ్రంధాలు వర్ణిస్తున్నాయి. అయితే ఈ అంశాలను బలపరచే శాసనాలు కాని ఇతర ఆధారాలు గాని ఇంత వరకు లభించలేదు.

**11.2.6 జలౌకుడు :** 12 వ శతాబ్దములో కల్హణుడు రచించిన రాజతరంగిణి కాశ్మీరు రాజ్యాన్ని పరిపాలించిన రాజుల చరిత్ర. ఈ చారిత్రక గ్రంధం ప్రకారం జలౌకుడు అశోకుని వారసునిగా కాశ్మీరును పరిపాలించాడు. జలౌకుడు తీవ్రమైన శైవమతాభిమాని. విజయగర్వంతో బలవంతులై ఉన్న బౌద్ధులను జలౌకుని గురువు ఓడించి అణచి వేశాడని రాజతరంగిణి వర్ణిస్తున్నది. దేశంపై దాడి చేసి పీడిస్తున్న మ్లేచ్ఛులను ఓడించి తరిమివేసి సమస్త భూమండలాన్ని జలౌకుడు జయించాడని రాజతరంగిణి ద్వారా తెలుస్తున్నది. కాని రాజతరంగిణిలో ప్రాచీన రాజుల గాధలు అస్తవ్యస్తంగా ఉన్నందున జలౌకుడు అశోకుని కుమారుడు కాదనే అభిప్రాయం కూడ చరిత్రకారులలో ఉన్నది.

**11.2.7 శుభగసేనుడు :** గ్రీకు రచయిత పోలిబియస్ పేర్కొన్న వివరాల ప్రకారం క్రీ.పూ 206 సంవత్సరంలో సిరియా రాజైన యాంటియోకస్ వాయవ్య భారతదేశ ప్రాంతంలో రాజైన సోఫగసేనస్ (శుభగసేన) ఆస్థానానికి యాండ్రోస్తనీస్‌ను రాయబారిగా నియమించి శుభగసేనుడిచ్చే ఏనుగులను, ధనాన్ని తీసుకురావాల్సిందిగా ఆజ్ఞాపించినట్లు తెలుస్తున్నది. ఈ అంశాల వలన శుభగసేనుడు యాంటియోకస్ సామంతుడని స్పష్టమౌతున్నది. బహుశా శుభగసేనుడు కాని అతని పూర్వీకులు కాని ఈ ప్రాంతంలో మౌర్యుల రాజప్రతినిధిగ ఉంటూ స్వాతంత్ర్యాన్ని ప్రకటించి ఉండవచ్చును. కాని శుభగసేనునికి మౌర్యులకు ఉన్న సంబంధాలు తెలియటం లేదు.

**11.2.8 శాలిశుకుడు, చివరి రాజులు :** శాలిశుకుడిని అశోకుని తరువాత నాల్గవ మౌర్య రాజుగా విష్ణు పురాణం పేర్కొంటున్నది. ఇతర వాఙ్మయాధారాలు కూడ దీనిని బలపరుస్తున్నాయి. గార్గి సంహిత శాలిశుకుడు దుష్టుడు, ప్రజాకంటకుడైన రాజుగా చెబుతున్నది. శాలిశుకుని పాలన ముగిసిన తరువాత యవనులు భారతదేశంపై దండెత్తి పాటలీపుత్రం వరకు పురోగమిస్తారని గార్గి సంహిత జోస్యం చెప్పినది. శాలిశుకుని తరువాత దేవవర్మ ఏడు సంవత్సరాలు పాటలీపుత్రాన్ని పరిపాలించినట్లు వాయు పురాణం పేర్కొంటున్నది. వాయు, మత్స్య, విష్ణుపురాణాలు చివరి ఇద్దరు మౌర్య రాజులైన శతధన్వ బృహద్రధుల గురించి ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. వీరిలో శతధన్వుని పాలనా కాలం ఎనిమిది సంవత్సరాలు కాగా బృహద్రధుడు ఏడేండ్లు పాలన చేశాడు. బృహద్రధుడ్ని అతని సేనాని పుష్య మిత్రుడు సర్వ సైన్య ప్రదర్శన అనే నెపముతో వధించినాడు.

**11.2.9 ముగింపు :** అశోకుని తరువాత పాలించిన మౌర్య రాజుల చరిత్రను నిశితంగా పరిశీలించిన రోమిల్లా థాపర్ విశ్లేషణ ప్రకారం అశోకుని మరణానంతరం క్రీ.పూ. 233 - 232 లో మౌర్య సామ్రాజ్యం తూర్పు పశ్చిమ విభాగాలుగా విభజించబడింది. తక్షశిల రాజధానిగా పశ్చిమ ప్రాంతాన్ని మొదట కునాలుడు ఆ తరువాత సంప్రతి కొద్దికాలం పాటు పాలించారు. సామ్రాజ్యం తూర్పు ప్రాంతంలో పాటలీపుత్రం రాజధానిగా దశరధుడు, సంప్రతి, శాలిశుక, దేవవర్మ, శతధన్వ, బృహద్రధులు, 52 సంవత్సరాల కాలం పరిపాలించారు. బృహద్రధుడి మరణంతో మౌర్యవంశం అంతరించింది.

## మౌర్య సామ్రాజ్య పతనము - కారణములు :

అశోకుడు మరణించిన తరువాత అర్ధ శతాబ్ది కాలం తరువాత మౌర్య సామ్రాజ్యం పతనమయ్యింది. మౌర్య రాజులలో చివరివాడైన బృహద్రధుడ్ని అతని సేనానీ, బ్రాహ్మణుడు అయిన పుష్యమిత్ర శుంగుడు క్రీ.పూ 187 ప్రాంతంలో వధించి మగధ రాజ్యాన్ని ఆక్రమించి శుంగ వంశ పాలన ప్రారంభించాడు. మౌర్య సామ్రాజ్య పతనానికి గల కారణాలపై చరిత్ర కారులలో భిన్నాభిప్రాయాలున్నాయి.

**11.3.1 అశోకుని మత విధానం :** మౌర్యసామ్రాజ్య పతనానికి అశోకుడు అనుసరించిన విధానాలే ప్రధాన కారణాలని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఈ ఆరోపణ రెండు ముఖ్య వాదాలపై ఆధారపడింది. మొదటి వాదం అశోకుడు బౌద్ధ మత విధానానికి, అతని తరువాత సంప్రతి మొదలగు వారి జైన మత అనుకూల విధానానికి వ్యతిరేకంగా బ్రాహ్మణ మతం విజృంభించి పుష్యమిత్ర శుంగుని నాయకత్వంలో తిరుగుబాటు చేసి మౌర్య సామ్రాజ్యాన్ని కూలద్రోసింది. బ్రాహ్మణులు యజ్ఞాలను నిర్వహిస్తు తద్వారా వారు దేవతలకు ప్రజలకు మధ్యవర్తులుగా ఉండేవారు. యజ్ఞాల వల్లనే బ్రాహ్మణుల అధికార, ప్రతిష్టలు పెరిగాయి. అశోకుడు జంతు బలులను నిషేదించటం, ప్రత్యక్షంగా బ్రాహ్మణులపై దెబ్బతీయడమేనని కొందరభిప్రాయం. అయితే నాటి బ్రాహ్మణ వాజ్మయం కూడ అహింసను సమర్ధిస్తూ కేవలం యజ్ఞాలు మాత్రమే చేస్తూ ఉండటం నిష్ప్రయోజనమని చాటుతున్నది. అందువలన జంతు బలి నిషేధం బ్రాహ్మణుల పట్ల అశోకుడు విరోధం వహించడం కాదని కొందరభిప్రాయం. అశోకుడు శాసనం వేసిన ప్రత్యేక స్థలంలోనే జంతువులను వధించరాదని, జంతు బలినే కాక ఆహారయోగ్యమైన జంతువులను కూడ కొన్నింటిని చంపరాదని శాసనాలలో వ్రాయించడం గమనించాల్సిన అంశం. అశోకుడు తన ధమ్మ విధానంలో భాగంగా జాతరలను నిషేధించడం ప్రజల తిరుగుబాటుకు ఒక కారణమనే వాదన ఉన్నది. జాతర్ల వేడుకలను, మాంసాహారాన్ని నిషేధించి అశోకుడు ప్రజాదరణ కోల్పోయాడు. కాని ఈ నిషేధం పూర్తిగ అమలు జరిగిందనడం అనుమానాస్పదం. అశోకుడు తన పాలనా కాలం చివరి సంవత్సరాలలో కొంత నిరంకుశంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఆ కాలంలో ప్రజలకు కష్టం కలిగించే చర్యలు అశోకుడు అమలు జరిపి ఉండవచ్చును. అయితే ఈ విధానాలనే తరువాత మౌర్య రాజులు అనుసరించారనే భావం పైనే ప్రజా విప్లవవాదం అధారపడి ఉన్నది. కాని తరువాత రాజులు అశోకుని విధానాలను తు.చ. తప్పకుండా అనుసరించ లేదు. మౌర్య రాజుల నిరంకుశత్వమే నిజమైనట్లయితే దానికి వ్యతిరేకంగా పుష్పమిత్రుడిని సమర్ధిస్తూ తిరుగుబాటు చేయటానికి ప్రజలలో తగిన సమైక్య జాతీయ చైతన్యము లేదు.

**11.3.2 బ్రాహ్మణుల అగ్రహం :** అశోకుడు న్యాయ విధానంలో నెలకొల్పిన వ్యవహార సమత, దండ సమతల వల్ల అంతకుపూర్వం నుండి బ్రాహ్మణులు అనుభవిస్తున్న ప్రత్యేక హక్కులు కోల్పోయారని, ఆ కారణంచేత బ్రాహ్మణులు తిరుగుబాటు చేశారనే అభిప్రాయం ఉన్నది. అశోకుని శాసనాలలో బ్రాహ్మణులను, శ్రమణులను గౌరవించాలని, వారికి దానాలు చేయాలని తరుచుగా విజ్ఞాపలు చేసినందున అశోకునికి బ్రాహ్మణ ద్వేషం లేదనే విషయం స్పష్టమౌతుంది.

అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించి ఆ మత ప్రచారానికి, మత వ్యాప్తికి ఎన్నో విధాల కృషి చేశాడని అందులో భాగంగానే 84000, స్థూప, విహారాలు మొదలగు బౌద్ధ నిర్మాణాలు చేపట్టాడని, బౌద్ధ మతాదరణ వలన ఇతర మతాల పట్ల ముఖ్యంగా బ్రాహ్మణ మతంపట్ల నిరాదరణ వహించాడని, ఆ కారణంగానే బ్రాహ్మణుడూ వైదిక మతాభిమాని అయిన పుష్యమిత్రశుంగుడు మౌర్యులపై

తిరుగుబాటు చేసి అశోకుడు నిర్మించిన బౌద్ధ నిర్మాణాలను ధ్వంసం చేయుటకు సంకల్పించాడని బౌద్ధ వాఙ్మయం వివరిస్తున్నది. అశోకుడు తన శాసనాలలో మత సామరస్యాన్ని, మత సహనాన్ని ప్రచారం చేయటమేకాక అన్ని మతాలను సమానంగా ఆదరించాలని పేర్కొన్నాడు. అంతే కాకుండా మౌర్య యుగానంతర వాస్తు శిల్పాలను పరిశీలించినట్లయితే ముఖ్యంగా సాంచీ, బార్హుత్ సూపాల విస్తరణకు కారకులు శుంగులే అని బోధపడుతుంది. అందువలన కేవలం అశోకుని బౌద్ధ మత స్వీకరణయే మౌర్యుల పతనానికి కారణం అనేది సరియైన భావం కాదు.

**11.3.3 రాజా స్థానకుట్ర :** చివరి మౌర్యుల కాలంలోని రాజులు తమను తామే రక్షించుకోలేని పరిస్థితులలో ఉన్న సమయంలో బృహద్రథుడ్ని పదభ్రష్టుడ్ని చేయటానికి పెద్ద విప్లవం అవసరం లేదు. బాణుని హర్ష చరిత్రలో బృహద్రథుడ్ని సైనిక పర్యవేక్షణ సమయంలో పుష్య మిత్రుడు వధించినట్లు చెప్పబడింది. ఈ సంఘటన ఒక పెద్ద విప్లవాన్ని కాక రాజాస్థానకుట్రను సూచిస్తున్నది. చివరి మౌర్యుల పాలనలో సమర్థమైన ప్రభుత్వాన్ని వాగ్దానం చేసే ఎవరినైనా రాజుగా అంగీకరించడానికి ఉద్యోగులు సిద్ధమైన దుస్థితికి ప్రభుత్వ యంత్రాంగం దిగజారి పోయింది. ఇది బ్రాహ్మణుల విప్లవమే అయినట్లయితే పొరుగు రాజ్యాల సహాయం పుష్యమిత్రుడికి లభించి ఉండేది.

**11.3.4 అశోకుని అహింసా విధానము - సైనిక బలహీనత :** అశోకుడు అవలంబించిన అహింసా విధానము వలన మౌర్యుల సైన్యం నిర్వీర్యమై తరువాత వచ్చిన గ్రీకుల దాడులను ఎదుర్కోలేకపోయాయనే విమర్శ ఉన్నది. ఈ కారణంగానే అశోకుని మరణానంతరం కొద్ది కాలంలోనే సామ్రాజ్యం పతనం అయ్యిందని, ఈ అహింసా విధానం వల్లనే సైనిక బలం క్షీణించటమేకాక, రాజ్యాధికారం బలహీనమై రాష్ట్రాల అధికారుల దౌర్జన్యాలు మితిమీరటం వలన తిరుగుబాటు జరిగింది అని రాయ్‌చౌధరి అభిప్రాయం. అశోకుని పాలనా విధానం, ప్రభుత్వ స్వభావం ఆ కాలపు సాంప్రదాయానికి విరుద్ధమైనదే. అతడు తన ధమ్మ విధానానికి అనుగుణంగా సాధ్యమైనంతవరకు తన పాలనా విధానాలను రూపొందించుకున్నాడు. అహింసా విధానంలో భాగంగా జంతువధ నిషేధంతోబాటు, జంతువుల పట్ల కరుణ ప్రదర్శించాలని తన శాసనాలలో ప్రకటిస్తూ వచ్చాడు. అయినా అతని అంతఃపురంలో కూడ ఆహారం కోసం జంతువులను వధిస్తూనే ఉన్నారు. అయితే వీటి సంఖ్య పూర్వము కంటే చాల తగ్గింది. సాధ్యమైనంత వరకు మాంసాహార వాడకం తగ్గింది కాని పూర్తిగా నిషేధించినట్లు ఎక్కడా ఆధారాలు లేవు. ఆహింసావాది అయిన అశోకుడు మరణశిక్షను రద్దు చేయకపోవడం గమనించాల్సిన అవసరం ఉంది. ఇతని అహింసా విధానము ప్రజలను ధర్మాను వర్తనులుగా చేసి సామ్రాజ్యము శాంతి సుస్థిరలతో విలసిల్లడానికుద్దేశించినది. అశోకుడు పాలనా వ్యవహారాలలో కఠినంగా వ్యవహరించిన తీరు అతని శాసనాలలోనే కన్పిస్తున్నది. కళింగను అశోకుడాక్రమించటంతో దాదాపు భారతదేశంలో అధిక భాగంలో మౌర్య సామ్రాజ్యం విస్తరించింది. దక్షణాన ఉన్న చోళ, పాండ్యాది రాజ్యాలు మౌర్యులకు ప్రమాదకారులు కాదు. పైగా ఆ రాజ్యాలు మౌర్యుల పట్ల విధేయులుగా ఉన్నందున వారిని జయించనవసరం లేదు. పశ్చిమ దిక్కున ఉన్న ఆంటియోకస్ పరిపాలిస్తున్న సిరియా సామ్రాజ్యం పై దాడి చేయడం అవివేకమని, ఆ రాజ్యలతో మైత్రి చంద్రగుప్తుని కాలం నుండే కొనసాగుతున్నది. ఈ కారణాల వలన అశోకుడు విజయ యాత్రలు కొనసాగించలేదు. అందువలన అశోకుడు తన కాలంలో అహింసా విధానం అనుసరించినంత మాత్రాన మౌర్య సామ్రాజ్యం బలహీనమై విచ్ఛిన్నం కాదు. తరువాత తరం వారు అసమర్థులైనందున, దండయాత్రలు చేసి ఆక్రమించాల్సిన రాజ్యాలు లేనందున సైనికంగా మౌర్య సామ్రాజ్యము క్షీణ దశకు చేరుకొన్నది.

**11.3.5 ఆర్థిక విధానం :** కడపటి మౌర్యుల కాలంలో మౌర్యుల ఆర్థిక విధానం పై అధిక భారం ఏర్పడిందని ఆ కారణం కూడ మౌర్యుల పతనానికి తోడ్పడిందనే ఆభిప్రాయమున్నది. ఆర్థికాభివృద్ధికి పన్నులను పెంచటానికి చర్యలు తీసుకొన్నారని దీనికి ఉదాహరణ. నటుల మీద, వేశ్యల మీద పన్నులు విధించటం. దీనికి తోడు తరువాతి మౌర్యుల విద్ధాంక నాణేలలో నకిలీ నాణేలు ఎన్నో ఉన్నాయని తెలుస్తున్నది. దేశ ఆదాయానికి పన్నులు ముఖ్య ఆధారమని గుర్తించిన మౌర్యులు దానికనుగుణంగా పన్నులను విధించే పద్ధతులను అనుసరించారు. వేశ్యా వృత్తి పైన పన్నులు విధించడం న్యాయబద్ధమేనని, వ్యవసాయదారులపై పన్నులు వంటివి సాధరణమైనవని, ఖజానా ఖాళీ అయిన సమయంలో తీసుకోవలసిన అత్యవసర చర్యలలో భాగంగా విధించాల్సిన పన్నుల జాబితాలో నట వేశ్యా వృత్తులపై పన్నుల వంటివి లేవు అని అర్థశాస్త్రం వలన తెలుస్తున్నది. ఆర్థిక విధానం పై భారం కారణంగానే నకిలీ నాణేలు తయారయ్యాయని కౌశాంబి అభిప్రాయపడ్డారు. ఇంటువంటి నాణేలు చివరి మౌర్యుల కాలంలో రాష్ట్రాలపై కేంద్రాధికారం అదుపు తప్పినందున ఆ

ప్రాంతాలు స్వతంత్రమైన కారణంగా ఆ ప్రాంతాలలో ఇవి చెలామణిలోకి వచ్చాయి. పురావస్తు త్రవ్వకాలలో లభ్యమయిన భౌతిక అవశేషాలు నాటి ఆర్థిక విధానం పైన ఒత్తిడిని సూచించడం లేదు. హస్తినాపురం, శిశుపాలఘర్ మొదలగు ప్రదేశాలలో త్రవ్వకాలలో బయల్పడ్డ సామాగ్రి నాటి ఆర్థిక విధానంలో ముఖ్యంగా వాడుకలో ఉన్న వస్తువుల గుణంలోను, సాంకేతిక విజ్ఞానంలోను పురోగతిని సూచిస్తున్నాయి. ఇటువంటి అభివృద్ధి మౌర్యుల తొలి దశ కంటే చివరి కాలంలో సామ్రాజ్యమంతటా సమంగా విస్తరించినట్లు ఈ ఆధారాల వల్ల తెలుస్తున్నది. పూసలు, ఉంగరాలు, జేగురు మట్టిబొమ్మల తయారీలో కూడ అభివృద్ధి కనిపిస్తుంది. దేశం సమైక్యం కావడం వలన రవాణా సౌకర్యాలు పెంపొందడం వలన, ఆంతరంగిక శాంతి భద్రతల కారణం వర్తకం అభివృద్ధి చెంది కొత్త వాణిజ్య శ్రేణులనేకం ఏర్పడి ఆర్థిక పురోగతిని మౌర్యయుగం సాధించకలిగింది. మౌర్య సామ్రాజ్యం క్షీణించే దశలో కూడా సామ్రాజ్యం సుసంపన్నంగానే ఉన్నది.

**11.3.6 పన్నుల భారం :** మౌర్యుల కాలంలో వ్యవసాయదారులపై విధించిన భూమిశిస్తు భారమే ప్రజలు చేసిన తిరుగుబాటుకు కారణము. గ్రీకు రచనల ప్రకారం మౌర్యుల కాలంలో పంటలో నాల్గవ వంతు భూమి శిస్తుగా విధించేవారు. కాని భూసారాన్ని బట్టి, నీటి వనరులనుబట్టి ప్రాంతానికి ప్రాంతానికీ మధ్య పన్నులలో వ్యత్యాసాలున్నాయి. మెగస్తనీస్ పంటలో నాల్గవంతు శిస్తుగా విధించేవారని ఇండికాలో పేర్కొన్నాడు. బహుశా అది పాటలీపుత్ర ప్రాంతముపై ఉంటుంది. ఈ ప్రాంతము సారవంతమైనదేకాక నీటి వనరులు కూడ పుష్కలంగా కలిగివున్న కారణంగా అక్కడ నాలుగోవంతు వంతుశిస్తుగా విధించి ఉండవచ్చును. రుమ్మిందై వంటి ప్రాంతాలలో శిస్తు ఆరో వంతు మాత్రమే ఉండేది. అత్యవసర పరిస్థితులలో శిస్తును నాల్గోవంతు లేదా మూడో వంతుకు పెంచవచ్చని అర్థ శాస్త్రం సూచిస్తునది.

**11.3.7 అసమర్థులైన వారసులు :** అశోకుని తరువాత బలహీనులైన రాజులు మౌర్య సామ్రాజ్యాన్ని పరిపాలించడం ఆ సామ్రాజ్య పతనానికి ముఖ్య కారణంగా పేర్కొంటున్నారు. వారసుల మధ్య జరిగిన సామ్రాజ్య విభజన కూడ సామ్రాజ్య పతనానికి కారణమయ్యింది. సామ్రాజ్యంలోని తూర్పు ప్రాంతానికి దశరధుడు రాజుగా, పశ్చిమ ప్రాంతానికి కునాలుడు రాజుగా సామ్రాజ్య విభజన జరిగింది. ఈ విభజన కారణంగా బలహీనమైన మౌర్య సామ్రాజ్యం వాయవ్య ప్రాంతంపై జరిగిన బాక్ట్రియన్ గ్రీకుల దండయాత్రను సమర్థవంతంగా ఎదుర్కొన లేకపోయింది. సామ్రాజ్య విభజన వలన పాలనా వ్యవస్థ కూడ బలహీన పడింది. తొలి మౌర్య చక్రవర్తులైన చంద్రగుప్త, అశోకుడు నిర్మించిన కేంద్రీకృత పాలనా వ్యవస్థ సక్రమంగా పని చేయడానికి కేంద్ర పర్యవేక్షణ అవసరం. సామ్రాజ్య విభజన తరువాత పాటలీపుత్రం రాజధానిగా గల తూర్పు ప్రాంతంలో కేంద్రీకృత మౌర్యుల పాలనా వ్యవస్థ కొనసాగింది. కాని పశ్చిమ ప్రాంతంలో తక్షశిల రాజధానిగా ఏర్పడిన ప్రాంతంలో ఆ రాజ్య పాలనను విస్తృతపరచి కేంద్రీకృత పాలనా వ్యవస్థకు అనుగుణంగా ఏర్పరచవలసి వచ్చింది. సరిగ్గా ఈ ప్రయత్నాలు జరుగుతున్న సమయంలోనే వాయవ్య ప్రాంతంపై గ్రీకు దండయాత్రలు ప్రారంభమయ్యాయి. అధికారాన్ని సుస్థిరం చేసుకొనక ముందే తమ రాజ్యానికి సమస్యగా తయారయిన ఈ గ్రీకు దండయాత్రలను అరికట్టి తమ రాజ్యాన్ని వాయవ్య ప్రాంతంలోని మౌర్యులు కాపాడుకోలేక పోయారు.

అశోకుని తరువాత రాజ్యాధికారం చేపట్టిన వారు అందరూ అసమర్థులే. అశోకుడు అనుసరించిన విధానాలు సంప్రదాయ సిద్ధమైనవి కావు. అతడనుసరించిన విధానాలనే కొనసాగించడమా లేక సాంప్రదాయ సిద్ధమైన పాలనా పద్ధతికి మారడమా అనేది అశోకుని తరువాత రాజులైన వారికి సమస్యగా మారింది. క్రీ.పూ 3వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యానికి ధమ్మం ఎందుకు అవసరమయ్యిందో, అశోకుడు ఆ విధానాన్ని ఎందుకు అనుసరించాడో తరువాతి మౌర్యులు అవగాహన చేసుకోలేకపోయారు. దశరధుడు మాత్రం అశోకునివలే ఆజీవిక శ్రమణులకు బరాబర్ కొండలలో గుహలను దానంగా ఇచ్చాడు. ఈ ఒక్క శాసనం తప్ప అశోకుని తరువాత మౌర్యుల శాసనాలు కన్పించకపోవడం అశోకుని విధానంలో వారికి గల అనాసక్తిని సూచిస్తున్నది. పురాణాలలో లభిస్తున్న సాక్ష్యాధారాల ప్రకారం చివరి మౌర్యుల పట్టికల పేర్లలో ఎన్నో వ్యత్యాసాలున్నట్లు తెలుస్తున్నది. దీని వలన రాజకుమారులేకాక, రాజ బంధువులు, దాయాదులు సింహాసనంపై తమకుగల హక్కులను ప్రకటించి అధికారం కోసం ప్రయత్నించినట్లు కన్పిస్తున్నది. మౌర్య వంశంలో రాజ్యాధికారం కోసం వారసత్వ యుద్ధాలు, అంతర్గత కలహాలు కొత్తగా వచ్చినవేమీ కాదు. అశోకుడే అధికారము కోసం సోదరులను వధించాడన్న విషయాన్ని

మనం మరవరాదు. అటువంటి ప్రయత్నమే అశోకుని తరువాత మౌర్యులలో కొందరు చేయడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇటువంటి వారిలో కొంత మంది రాష్ట్రాలలో స్వతంత్రాధికారాన్ని ప్రారంభించారు. అశోకుని తరువాత దాదాపు ఆరుగురు రాజులు యాభైరెండు సంవత్సరాల స్వల్ప కాలం పరిపాలించటం వారి రాజకీయ దుర్బలత్వాన్ని సూచిస్తున్నది. ఇటువంటి బలహీనులైన చక్రవర్తుల పాలనలో సామంత రాజులు, సరిహద్దు రాష్ట్రాల పాలకులు స్వాతంత్ర్యం కోసం ప్రయత్నించటం అసాధారణ విషయము కాదు. కేంద్రాధికారం బలహీనమైనందున ఆంధ్రులు, కళింగులు మొదలగు బలవంతులయిన సామంతులు ఇతర రాష్ట్ర పాలకులు, స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నారు.

**111.3.8 రాష్ట్ర పాలకుల దౌర్జన్యాలు :** చివరి మౌర్యుల కాలంలో రాష్ట్ర పాలకుల దౌర్జన్యాలు మితిమీరి ప్రజలు తిరుగుబాటు చేయటం వలన కూడ మౌర్య సామ్రాజ్యం పతనమయ్యింది. సమర్థులైన తొలి మౌర్యుల కాలంలోనే అమాత్యుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తక్షశిలలో ప్రజలు తిరుగుబాటు చేశారు. ఇక అసమర్థులైన చివరి మౌర్యుల కాలంలో ప్రబలిన రాష్ట్ర పాలకుల దౌర్జన్యాన్ని అదుపులో ఉంచే శక్తి వారికి లోపించింది.

**11.3.9 ముగింపు :** మౌర్య సామ్రాజ్య పతనానికి సైనిక బలహీనత, బ్రాహ్మణుల ఆగ్రహం, ప్రజల అసంతృప్తి, పన్నుల భారం, ఆర్థిక ఒత్తిడి మొదలగు కారణాలేకాక, పాలనా వ్యవస్థ స్వరూపము, జాతీయ ఐక్యత లోపించడం వంటివి ముఖ్య కారణాలైనాయి. మౌర్య పాలనా వ్యవస్థ కేంద్రీకృత విధానంపై ఆధారపడి రూపొందినది. సమర్థుడైన చక్రవర్తి ఈ విధానాన్ని తన శ్రేయస్సుకు ప్రజల శ్రేయస్సుకు, సామ్రాజ్య రక్షణకు ఉపయోగించుకోనగలడు, కాని అసమర్థులైన వారి పాలనలో కేంద్ర అధికారం దుర్బలమైనపుడు సామ్రాజ్యానికి అది ప్రమాదకరంగా పరిణమించి, అరాచక శక్తులు విజృంభించి సామ్రాజ్య విచ్ఛిన్నానికి అవకాశం కలుగుతుంది. మౌర్య సామ్రాజ్యంలో జాతీయ సమైక్యతా భావం లేదు. భారతీయులందరూ గ్రీకులను ద్వేషించారు. అయినా భారతీయులు సంఘటితంగా గ్రీకులను ఎదుర్కొనకపోవటానికి కారణం వారిలో జాతీయ ఐక్యత లేకపోవడం. అలెగ్జాండర్‌ను పురుషోత్తముడు ఎదుర్కొనప్పుడుగాని, ఆంటియోకస్‌కు సుభగసేనుడు లొంగిపోయినప్పుడు కాని స్థానిక పాలకులు మాత్రమే గ్రీకులను ఎదిరించి పోరాడారు కాని పాటలీపుత్రం నుండి వారికెటువంటి సహాయం లభించలేదు. కాబట్టి మౌర్య సామ్రాజ్య ప్రజల మధ్య మౌలికమైన రాజకీయ ఐక్యత లేనందున రాజకీయంగా మౌర్య సామ్రాజ్య విచ్ఛిన్నం అనివార్యమై ఆ సామ్రాజ్యం పతనమయ్యింది.

## 11.4 సారాంశం :

## 11.5 మాదిరి ప్రశ్నలు :

1. కడపటి మౌర్యుల జాబితాలను వివరింపుము ?

2. మౌర్య సామ్రాజ్యం పతనానికి గల కారణాలు వివరింపుము ?

## సంక్షిప్త ప్రశ్నలు :

1. అశోకుని అహింసా విధానం, ఏ విధంగా మౌర్య సామ్రాజ్య పతనానికి కారణమయ్యెను ?

### పాఠం - 12

# మౌర్యుల పరిపాలన - సంస్కృతి

## 12.0 లక్ష్యం :

మౌర్య పరిపాలనా లక్షణాలను, ఆకాలం నాటి ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక, మత లక్షణాలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం :


12.1 ఉపోద్ఘాతం

12.2 చక్రవర్తి

12.3 రాష్ట్రపాలన

12.4 సైనిక వ్యవస్థ

12.5 న్యాయ వ్యవస్థ

12.6 నీటిపారుదల - వ్యవసాయం

12.7 జనాభా లెక్కల సేకరణ

12.8 ముగింపు

12.9 మౌర్యయుగ సాంఘిక ఆర్థిక సాంస్కృతిక పరిస్థితులు

12.10 సారాంశము


## 12.1 ఉపోద్ఘాతము :

చంద్రగుప్త మౌర్యుడు తాను స్థాపించిన సువిశాల మౌర్యసామ్రాజ్యంలో తన ప్రధానమంత్రి అయిన చాణుక్యుని సహాయంతో పటిష్టమైన కేంద్రీకృత పాలనాయంత్రాంగాన్ని ఏర్పరచాడు. అశోకుడు, చంద్రగుప్తుడు ప్రవేశపెట్టిన పాలనా విధానాలకు మరికొన్ని నూతన పాలనా సంస్కరణలు ప్రవేశపెట్టి మౌర్యులకు పాలనా వ్యవస్థకు మరింత మెరుగులుదిద్దాడు. మౌర్యుల సువిశాల సామ్రాజ్యంలో మతంలోను, ఆచార వ్యవహారాలలోను, భాషలో వైవిధ్యము, వైరుధ్యము ఉన్న అనేక ప్రాంతాల ప్రజలు, జాతులు ఉన్నారు. వీరందరి సంక్షేమానికి, వారందరికి అనుకూలమైన పాలనా విధానాన్ని రూపొందించుటలో తొలి మౌర్య చక్రవర్తులు సఫలీకృతులైనారు. చంద్రగుప్త, అశోకులు రూపొందించిన విధానాలే తరువాత మౌర్యులు ఎటువంటి మార్పులు లేకనే అమలు జరిపారు. మౌర్యుల పరిపాలనా విధాన స్వరూపమును తెలుసుకొనుటకు కౌటిల్యుని "అర్థశాస్త్రం", మెగస్తనీస్ 'ఇండికా', అశోకుని శిలాశాసనాలు ముఖ్యమైన ఆధారాలు.

భారత సాంప్రదాయక రాజరిక విధానం ప్రకారం ప్రజల సాంఘిక స్థితిగతులను పరిరక్షించడమే చక్రవర్తి ప్రధాకర్తవ్యం ప్రజలు వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తూ, తమ వృత్తులను విద్యుక్త ధర్మాలను అనుసరించేటట్లు చేయటమే అతని భాధ్యతలలో ముఖ్యమైనది.

## 12.2 చక్రవర్తి :

సామ్రాజ్యంలోని అన్ని విభాగాల పాలనా విధాన నిర్దేశకుడు, శాసనాలు చేయటంలోనే న్యాయాధిపతిగా తీర్పులను ఇవ్వడంలోను, సైనిక వ్యవహారాలలోను కాక ప్రతి పాలనా విషయంలోను చక్రవర్తే అత్యున్నత అధికారి. పాలనా వ్యవహారాలలో తనకు తగిన సలహాలు ఇచ్చి సహాయపడు మంత్రులను, ఇతర ఉద్యోగులను తానే స్వయముగా నియమించుటయే కాక వారి కార్యకలాపాలను అదుపు చేస్తూ, ప్రణాళికా బద్ధమైన పర్యవేక్షణ, తనిఖీలతో ప్రజా శ్రేయస్సుకు నిర్విరామంగా కృషి చేస్తుండేవాడు.

అర్థశాస్త్రంలో కౌటిల్లుడు 'చక్రవర్తి ప్రజలకు ఉద్యోగులకు అన్ని సమయాలలో అందుబాటులో ఉండాలని సూచించారు. అలా తేనట్లయితే అసంతృప్తికి, సంకోభానికి కారణమై శతృవులకు చలికాక ఆప్పదని హెచ్చరించారు. ఈ సూచనను మౌర్యులు పాటించారనటకు అశోకుని ఆరవశిలా శాసనమే ఉదాహరణ ఆరవశిలా శాసనంలో తాను ఎక్కడ ఉన్నా, భోజనం చేస్తున్నా, అంతఃపురంలో ఉన్నా, విశ్రాంతి తీసుకుంటున్నా, నివేదకుల తనను దర్శింబవచ్చునని, అశోకుడు బాలా స్పష్టంగా పేర్కొన్నాడు. కౌటిల్యుని సిద్ధాంతం ప్రకారం పరిపాలన సమర్ధవంతంగా కోనసాగుటకు రాజు అనుసరించవలసిన పద్ధతులు మూడు. 1. పాలనలో అన్ని అంశాలకు సమాన ప్రాముఖ్యతను ఇవ్వడం. 2. అన్ని సమయాలలో అప్రమత్తుడై కార్యాచరణకు సన్నద్దుడై ఉండటం. 3. విధి నిర్వహణలో ఎటువంటి దాపుం కలుగకుండా చూడటం. చక్రవర్తి ఈ ఆదర్శాన్ని సాధించుటకు సామ్రాజ్యంలో సమర్ధులైన ఉద్యోగుల యాకం అత్యంత అవసరం.

**12.2.1 కేంద్ర ప్రభుత్వము :** విస్తృతమైన తమ సామ్రాజ్య పాలనకు మౌర్యులు కేంద్రీకృత పాలనా విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఇటువంటి కేంద్రీకృత పాలనా భాద్యతను సమర్ధవంతంగా నిర్వహించాలంటే వివిధ స్థాయిలలో సమర్థులైన అధికారులను, ఉద్యోగులను నియమించి వారు ప్రజాసంక్షేమానికి నిరంతరం కృషి చేయుటకు తగిన మార్గదర్శక సూత్రాలను రూపొందించాలి. మౌర్యులు తమ పాలనా యాంత్రాగాన్ని 1. చక్రవర్తి 2. రాజప్రతి నిధులు, 3. మంత్రులు, 4.వివిధ శాఖల అధిపతులు 5. పౌర విధుల నిర్వహణకు దిగువశ్రేణి ఉద్యోగులు. 6. గ్రామీణ స్థాయిలో అధికారులు, ఉద్యోగులతో రూపొందించారు.

**12.2.2 మంత్రి పరిషత్తు :** చక్రవర్తి పరిపాలనా వ్యవహారాలలో సలహాలిచ్చి సహాయపడుటకు వివిధ మంత్రులతో కూడిన మంత్రి పరిషత్తు ఉండేది. మంత్రి పరిషత్తులో ఎంత మంది సభ్యులుండాలి అనే నిషయంలో ఎటువంటి నియమ నిబంధనలు లేవు. మంత్రుల సంఖ్య అవసరాన్ని బట్టి మారుతుంది. బిందుసారుడు యాభై మంది మంత్రులతో మంత్రి పరిషత్‌ను ఏర్పాటు చేశాడు. ఈ మంత్రుల జీతం సంవత్సరానికి 48000 పణములు. మంత్రి పరిషత్తు సభ్యులను చక్రవర్తే స్వయముగా ఎన్నిక చేసేవాడు. అర్థశాస్త్రం 'కులీనత, బుద్ధికుశలత, న్యాయవర్తనలను మంత్రులకుండ వలసిన లక్షణాలని' పేర్కొంటూ వివిధ పద్ధతుల ద్వారా ఈ గుణాలను పరీక్షించాలని చెబుతున్నది. ఈ మంత్రులను తాను పేర్కొన్న ఏడువర్ణాలలో ఏడవ వర్ణం నుండి ఎన్నిక చేస్తారని ఇండికాలో మెగస్తనీస్ వ్రాశాడు. సాధారణంగా మంత్రులను బ్రాహ్మణుల నుండి ఉన్నత క్షత్రియుల నుండి ఎంపిక చేసేవారు,. మంత్రిపరిషత్తులో పురోహిత, సేనాపతి, యువరాజు, మరికొంత మంది మంత్రులు సభ్యులుగా ఉంటారు. మంత్రి పరిషత్తు కార్యదర్శిని మంత్రి పరిషాదాధ్యక్షుడని వ్యవహరించే వారని అర్థశాస్త్రం పేర్కొంటున్నది.

చక్రవర్తి మంత్రి పరిషత్తును సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలనే నియమనిబంధన లేమీ లేవు, కౌటిల్యుడు అర్థశాస్త్రములో 'సహాయరహితమైన రాజరికము అడుగు ముందుకు వేయలేని ఏక చక్రశకటము వంటిది" అని సూత్రీకరించాడు. అందువలన చక్రవర్తి మంత్రులను నియమించి వారితో సంప్రతించాలని సూచించాడు మంత్రి పరిషత్తు నుండి ప్రధాన మంత్రుతో బాటు ముగ్గురు లేదా నలుగురు సభ్యులతో చిన్న సంఘాన్ని ఎన్నిక చేసి చక్రవర్తి తన సన్నిహిత సలహాసంఘంగా నియమించేవాడు. చక్రవర్తి ఏదైనా అంశం గురించి ముగ్గురు లేదా నలుగురు మంత్రులను రహస్యంగా సమావేశపరచి సలహాలను స్వీకరించవచ్చును. లేదా చిన్న సలహాసంఘాన్ని సంప్రదించవచ్చును. చర్చించిన విషయాలను రహస్యంగా ఉంచటానికి ఇటువంటి చిన్న సమావేశాలు ఉపయోగపడతాయి.

అశోకుడు మంత్రి పరిషత్తును మూడవ, ఆరవ ముఖ్యశిలా శాసనాలలో ప్రస్తావించాడు. మూడవ ముఖ్యశిలాశాసనంలో అశోకుడు తాను నూతనంగా ప్రవేశ పెట్టిన కార్యక్రమాలను నమోదుచేసి ప్రజానీకానికి స్పష్టంగా వివరించ వలసినదిగా ఉద్యోగులను మంత్రి పరిషత్తు ఆదేశిస్తుందని పేర్కొన్నాడు ఆరవ ముఖ్య శాసనంలో మౌఖికంగా చెప్పిన శాసనాన్ని గురించి కాని, ఉద్యోగులకు ఆదేశించిన అత్యవసర విషయాల గురించి మంత్రి పరిషత్తులో చర్చించినపుడు వాటిపై ఏదైనా వివాదం వచ్చినట్లయితే దానిని తాను ఎక్కడున్నా వెంటనే నివేదించాలని ఆదేశించాడు. దీనిని బట్టి మంత్రి పరిషత్తు సలహాసంఘం మాత్రమేనని ఏవ్యవహారంలోనైనా అంతిమ నిర్ణయం చక్రవర్తి దేనని స్పష్టమౌతుంది. ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమాలను కొనసాగించడం, నూతన పథకాలను అమలు చేయడం, వివిధ ప్రభుత్వ సమన్వయం చేయటం కూడ మంత్రి పరిషత్తు బాధ్యతలలో ముఖ్యమైనవి. పరిపాలనా బాధ్యతలను సక్రమంగా కొనసాగడానికి అవసరమైన ఉద్యోగబృందాన్ని చక్రవర్తి స్వయంగా నియమించేవాడు. సన్నిధాత, సమాహర్త అక్షపటలాధ్యక్ష, సీతాధ్యక్ష, ఆకరాధ్యక్ష, లవణాధ్యక్ష, నవాధ్యక్ష, సులాధ్యక్ష్య, సురాధ్యక్ష్య, పౌతవాధ్యక్ష మొదలైన నేర్పరులయిన 32 మంది ఉన్నతోద్యోగులను కేంద్ర ప్రభుత్వంలో నియమించి వివిధ పాలనా శాఖలను ఏర్పరచి ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని పటిష్టంగా రూపొందించుకోవాలని కౌటిల్యుడు అర్థశాస్త్రంలో పేర్కొన్నాడు.

**12.2.3 ధర్మమహామాత్రులు :** అశోకుడు తన పదమూడవ రాజ్య పాలనా సంవత్సరంలో మెట్టమొదటి సారిగా ధర్మమహామాత్రులనే ఉద్యోగులను నియమించాడు. అంతకు పూర్వము ఇటువంటి ఉద్యోగులు మౌర్యప్రభుత్వములో లేరు. అర్థశాస్త్రం మహామాత్రులను మంత్రులనే అర్థంలో ఉపయోగించింది. అశోకుడు తనశాసనాలో ఈ పదవిని అనేక రకాల ఉద్యోగులకు వర్తించేటట్లువాడాడు. కొన్నిచోట్ల పాలనా యంత్రాంగానికి సంబంధించినట్లు సలహాసంఘానికి కూడ వాడాడు, ధర్మమహామాత్రులలో కొందరు సాధారణ పరిపాలనకు సంబంధించిన ఉద్యోగులుగా శాసనాలలో కన్పిస్తున్నారు. మొదటి ముఖ్య శిలాశాసనంలో ధర్మ మహామాత్రలను న్యాయాధికారులుగా ఉద్దేశించివాడాడు అంతేకాకుండా న్యాయాధికారుల చర్యలను తనిఖీ చేయడానికి సామ్రాజ్యంలో పర్యటించే ఉన్నతాధికారులకు కూడా ఇదే పదాన్ని ఉపయోగించారు. రాజకుటుంబీకుల అంతఃపురం, స్త్రీలకు సంబంధించిన శాఖలను పర్యవేక్షించి నిర్యహించడానికి ఇథీజ్ఞక మహామాత్రులను నియమించారు. అశోకుని శాసనాలను పరిశీలించినపుడు మహామాత్రులు చాలా బాధ్యతలు కలిగిన ఉద్యోగులని స్పష్టమౌతున్నది. నగరాలలో న్యాయవ్యవహారాలను పరిష్కరించడానికి మహామాత్రులను ప్రత్యేకంగా నియమించాడు. అంత మహామాత్రులనే ఉద్యోగులు సరిహద్దు ప్రాంతాలలో తమ భాధ్యతలను నిర్వర్తిస్తున్నట్లు అశోకుని శాసనాల వలన తెలుస్తున్నది. సరిహద్దు ప్రాంతాల ప్రజలకు అశోకుని ధమ్మ విధానాన్ని అందించటం అంత మహామాత్రల ప్రధాన కర్తవ్యం. స్త్రీ సంక్షేమం కోసం అశోకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నాడు. స్త్రీ సంక్షేమ కార్య కలాపాలను నిర్వహించటానికి ప్రత్యేక మహామాత్ర వర్గాన్ని నియమించాడు. అటువంటి అధికారులే ఇథీజ్ఞక మహామాత్రులు. కొందరు చరిత్ర కారుల అభిప్రాయంలో వీరికి గణికాధ్యక్షులకు సంబంధం ఉన్నది. ఈ మహామాత్రులు పాటలీపుత్రంలోను, ఇతర ప్రాంతాలలోని చక్రవర్తి కుటుంబం, ఇతర సమీప రాజబంధువుల అంతఃపుర నిర్వహనా, రాజకుటుంబ సభ్యులు దానధర్మాలు చేయటం, వారు ధమ్మమార్గాన్ని అనుసరించేటట్లు చూడటం వంటి వ్యవహారాలను నిర్వర్తించేవారు. వీరు కాకుండా నేత మొదలగు కుటీర పరిశ్రమలలో స్త్రీలకు ఉపాధి కల్పించటం, గణికలను అదుపులో ఉంచడం మొదలగు ఇతర స్త్రీ సంక్షేమ వ్యవహారాలకు దిగువశ్రేణి ఉద్యోగులుండేవారని అర్థశాస్త్రం వలన తెలుస్తున్నది.

తమ సువిశాల సామ్రాజ్యంలో కేంద్రం నుండే పరిపాలనను నిర్వహించటం అసాధ్యం కాబట్టి మౌర్యులు పాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని జనపదాలు (రాష్ట్రాలు) , ప్రదేశాలు, ఆహారాలు, విషయాలు అనే ప్రాదేశిక విభాగాలుగా విభజించారు.

## 12.3 రాష్ట్ర పాలన :

చంద్రగుప్తుని పరిపాలనా కాలంలో మౌర్య సామ్రాజ్యాన్ని ఎన్ని రాష్ట్రాలుగా విభజించారో తెలుసుకోవటానికి ఆధారాలు ఏమీలేవు. అశోకుని శాసనాల వలన అశోకుని పాలనలో మౌర్య సామ్రాజ్యము నాలుగు ప్రధాన రాష్ట్రాలుగా విభజించబడినట్లు తెలుస్తున్నది. అవి తక్షశిల రాజధానిగా ఉన్న వాయువ్య రాష్ట్రం, ఉజ్జయినీ రాజధానిగా ఉన్న అవంతీరాష్ట్రం, తోసలి రాజధానిగా ఉన్న కళింగ రాష్ట్రం,

సువర్ణగిరి రాజధానిగా ఉన్న దక్షిణాపథ రాష్ట్రం. సామ్రాజ్యంలో ప్రధాన పరిపాలనా విభాగాలైన ఈ రాష్ట్రాలపై రాజప్రతినిధులుగా రాజకుమారులను నియమించేవారు. రాజకుమారులను రాజప్రతినిధులుగా నియమించడంలో కొన్ని అనుకూలాలు, కొన్ని ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నది. రాజకుమారులుకు పరిపాలనలో శిక్షణ లభిస్తుంది. రాజకుమారుడు చక్రవర్తి అమలుపరచే శాసనాలకు, విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తాడు. రాజకుమారుడు చక్రవర్తి విధేయుడుగా ఉన్నప్పుడు ఆ రాష్ట్రాలలో తిరుగుబాట్లు వచ్చుటకు అవకాశం లేదు. ఇవి అనుకూల పరిస్థితులు. రాజకుమారులే రాజప్రతినిధులుగా ఉన్నప్పుడు వచ్చే ప్రమాదాలు కూడ కొన్ని ఉన్నాయి. అవిధేయుడైన రాజకుమారుడు రాజప్రతినిధిగా ఉన్నకాలంలో చక్రవర్తికి వ్యతిరేకంగా తన బలాన్ని పెంపొందించుకోవటానికి అవకాశం ఉన్నది. రాష్ట్రం పై సంపూర్ణాధికారం ఉన్నందున రాజకుమారుడు బాధ్యతారహితంగా ప్రవర్తింవచ్చును. రాజప్రతినిధులుగా ఉన్న సోదర రాజకుమారుల మధ్య సామ్రాజ్యాధికారం కోసం పోటీ ఏర్పడి వారసత్వ యుద్ధాలకు అవకాశం ఏర్పడుతుంది. ఇటువంటి వారసత్వ యుద్ధాలలో రాష్ట్రాల సైన్యాలను ఉపయాగించుకోవటానికి వీలవుతుంది.

సౌరాష్ట్ర, అనార్త వంటి చిన్న రాష్ట్రాలు కూడ ఉండేవని శాసనాల వలన తెలుస్తున్నది. చంద్ర గుప్తుని కాలంలో పుష్యగుపుడు సౌరాష్ట్రకు ప్రతినిధి (రాష్ట్రీయ ) కాగా అశోకుని పరిపాలనా కాలంలో యవనుడైన తుషాస్పుడు ప్రతినిధిగా ఉన్నాడు. కేంద్ర ప్రభుత్వంలో మంత్రి పరిషత్తువలే రాష్ట్రాలలో రాజప్రతినిధులకు పాలనలో సహాయకారిగ మంత్రిపరిషత్తులుండేవి. రాష్ట్ర మంత్రిపరిషత్తుకు నేరుగా చక్రవర్తితో సంబంధం కలిగి ఉండేది. రాజప్రతినిధుల అజమాయిషీలో మంత్రి, రాజుకులు, ఉపదేష్టి మొదలయిన అధికారులు పనిచేసేవారు. రాష్ట్రంలో పన్నులు వసూలు చేయటం, శాంతి భద్రతలు కాపాడటం వీరి ముఖ్య విధులు. అశోకుని పాలనలో వీరు మూడు సంవత్సరాలకిగాని, ఐదు సంవత్సరాలకుగాని తమ అధికారంలోని ప్రాంతాలలో పర్యటించి ధమ్మ ప్రచారము చేసి ప్రజలు ధర్మానువర్తనులుగా ఉన్నారో లేదో చూడటం వీరి అదనపు బాధ్యత అయినది.

**12.3.1 ప్రదేశ పాలన (మండల పాలన) :** పాలనా సౌలభ్యం కోసం మౌర్యచక్రవర్తులు ప్రతి రాష్ట్రాన్ని కొన్ని ప్రదేశాలుగా విభజించారు. మండల పాలన కొరకు ప్రత్యేకముగా ఒక ఉద్యోగి బృందముండేది. ఈ ఉద్యోగులలో ప్రాదేశిక, రాజుక, యుక్త అనే వారు ప్రధాన ఉద్యోగులు, వీరికి సహాయంగా ఇతర ఉద్యోగులు చాలా మంది ఉండేవారు. ప్రాదేశికుడు మండలం పై అధికారి, మండలంలో పర్యటించి మండల, గ్రామాధికారుల కార్యకలాపాలపై సమాహర్తకు నివేదికలు పంపించేవాడు. తీవ్రమైన నేరాలను ముగ్గురు ప్రాదేశికులు కలిసి విచారించే అధికారమున్నది. అధ్యక్షుల, చిన్న ఉద్యోగుల పనితీరును ప్రాదేశికుడు తనిఖీ చేయవలెను. ప్రాదేశికుని విధులలో ముఖ్యమైనవి మండలంలోని నగర, గ్రామీణ ప్రాంతాలలో రాజశాసనాలను అమలుచేయటం, శాంతి భద్రతల నిర్వహణ మొదలగునవి.

రాజుకులు ప్రాదేశికుని క్రింది ఉద్యోగులు. ప్రాదేశికుడు ఐదు సంవత్సరముల కొకసారి మండల పర్యటనకు వెళ్ళినపుడు రాజుకులు, యుక్తులు అతడిని అనుసరించి వెళ్ళేవారు. రాజుకులు రాజస్వ బాధ్యతలు నిర్వర్తిస్తూ న్యాయవిధులను కూడ చేపట్టారు. అశోకుని కాలంలోనే రాజుకులకు ఇటువంటి అదనపు విధులు ఇవ్వబడినవి. ఫలితంగా రాజుకులకు ఎక్కువ అధికారాలు సంక్రమించాయి.

పంట పొలాలను సర్వే చేసి పన్నులను విధించే బాధ్యత కూడ రాజుకులదే, భూమి విస్తీర్ణము, భూసారాన్ని బట్టి రాజుకులు భూమిశిస్తును నిర్ణయించేవారు. స్థానిక పాలనలో రాజుకులు కీలకమైన ఉద్యోగులైనందుచేత అశోకుడు రాజుకుల విధులను గురించి ఒక పూర్తి శాసనాన్ని వ్రాయించాడు. వివాదాలలో అధిక భాగం వ్యవసాయ సమస్యలకు సంబంధించి పన్నుల విధింపు, పన్నుల మినహాయింపు వివాదాలు , రైతులకు పాలకులకు మధ్య వచ్చే భూమి తగాదాలు, నీటి తగాదాలు, పచ్చికమేత తగాదాలు మొదలయిన వాటిని రాజుకులు పరిష్కరించే వారు. రాజుకుని అధికారాలు పెరిగినందున అతడు గ్రామీణ ప్రజలపట్ల నిరంకుశంగా ప్రవర్తించే ప్రమాద మేర్పడుతుంది. అందువలన అటువంటి ప్రమాదం కలుగుకుండా ఉండటానికి రాజుకుని కార్యకలాపాలను ప్రాదేశికుడు పర్యవేక్షించేవాడు.

ప్రాదేశికులు, రాజుకుల కంటే క్రింది స్థాయి ఉద్యోగులు యుక్తులు. వీరు గణాంక, కార్యనిర్వాహక విధులను నిర్వహించేవారు. ఉన్నతోద్యోగుల నిర్ణయాలను నమోదు చేసి వాటి ఆధారంగా మంత్రి పరిషత్తుకు, మంత్రులకు నివేదికలు అందించడానికి రాజుకులను, ప్రాదేశికులను అనుసరించి వెళ్ళేవారు.

**12.3.2 నగరపాలన :** మౌర్య సామ్రాజ్యములోని పాటలీపుత్రం, తక్షశిల, ఉజ్జయిని, కౌశాంబి, తోసలి, సమాప మొదలగు నగరాల పాలనకు, శాంతి భద్రతల రక్షణకు, న్యాయనిర్వహణకు నాగరకుడు అనే ఉద్యోగిని నియమించారు. నగరంలో ప్రవేశించిన కొత్త వ్యక్తులు తమ పేర్లను నాగరకుని వద్ద నమోదు చేసుకోవలెను. ప్రత్యేక అనుమతి ఉన్నవారు మినహా ఇతరులెవ్వరు రాత్రులలో నగరంలో సంచరించరాదని నిషేధం విధించేవారు. కరువు సంభవించినపుడు ధాన్యాగారాల నుండి ధాన్యాన్ని ప్రజలకు పంపిణీ చేసే బాధ్యత కూడ నాగరికునిదే. నగర పాలనలో నాగరకునికి సహాయముగా గోప, స్థానిక అనే ఉద్యోగులుండే వారు. గోపుడు పది, ఇరువై లేదా నలభై ఇండ్ల లెక్కలను సేకరించేవాడు. ప్రతి వ్యక్తి పేరు, కులం, వృత్తి, గోత్రము మొదలైనవి నమోదు చేసి ఉంచేవాడు. నగరంలోని వేరువేరు విభాగాల లెక్కలను సేకరించే బాధ్యత స్థానికునిది.

మెగస్తనీస్ ఇండికాలో పాటలీపుత్ర నగర పాలన గురించి వ్రాస్తూ నాగరకునికి 30 మంది సభ్యులు గల సంఘం నగర పాలనలో సహాయపడుతుండేదని తెలియజేశాడు. ఈ సంఘం ఐదుగురు సభ్యులు గల ఆరు పంచాయతీలుగా ఏర్పడి 1. పరిశ్రమలు, 2. విదేశీయుల సౌకర్యాలు, 3. జనన మరణ లెక్కలు, 4. వాణిజ్యవ్యాపారాలు, తూనికలు, కొలతలు., 6. వస్తు విక్రయం, 6. సుంకాల వసూలు అనే బాధ్యతలను నిర్వహిస్తుండేది.

**12.3.3 గ్రామ పాలన :-** సామ్రాజ్యంలో అతి చిన్న ప్రాదేశిక విభాగము గ్రామము. చాల వరకు గ్రామాలు స్వయంప్రతిపత్తిని అనుభవిస్తుండేవి. గ్రామ పెద్దల సహాయముతో గ్రామికుడు గ్రామపాలనా బాధ్యతలను నిర్వహించేవాడు. గ్రామంలో పన్ను వసూలు, క్రమశిక్షణ, శాంతి భద్రతల రక్షణ మొదలయిన గ్రామ సంబంధ వ్యవహారాలను పర్యవేక్షించే వాడు. పెద్ద గ్రామాలలో గ్రామికునకు సాక్షికోద్యోగులయిన గణక, లేఖక మొదలగు వారు పాలనా నిర్వహణలో సహాయపడుతుండేవారు. ఈ ఉద్యోగులకు పన్ను మినహాయింపు రూపంలో జీతాలు చెల్లించేవారు. పది గ్రామాలపై అధికారిగా గోపుడు ఉండేవాడు., గోపుని అధికారంలో గ్రామికులు తమ విధులను నిర్వర్తించేవారు. నూరుగ్రామాలపై అధికారి స్థానికుడు .

**12.3.4 ఆదాయ వ్యయాలు :-** కోశాగారాన్ని సర్వకాలాలలోను నిండుగా ఉంచడమే చక్రవర్తి ప్రధానమైన బాధ్యతల్లో ముఖ్యమైనదని, రాజ్యాభివృద్ధికి నిండైన కోశాగారమే ప్రధాన సాధనమని కౌటిల్యుడి సిద్ధాంతం. ప్రభుత్వ ఆదాయం అనేక రకాల మార్గాల ద్వారా వస్తుండేది. ఈ ఆదాయం ధన రూపంలోను ధాన్యరూపంలోను, వజ్రవైడూర్యాది రూపాలలో ఉండేది. ఈ విధంగా వచ్చిన ఆదాయాన్ని భద్రపరచి ఉంచాల్సిన బాధ్యత సన్నిధాత అనే ఉద్యోగిది. సమాహర్త అనే ఉద్యోగి సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలనుండి (రాజ్యాస్యాన్ని) వసూలు చేసేవాడు. గనులు, అడవులు, రహదారులు, వివిధ రకాల సుంకాలు, అపరాధ రుసుములు, అనుజ్ఞా పత్రాలు, ఉత్పాదక వస్తువులపై పన్నులు, వివిధ రకాల క్రయ విక్రయాల పై పన్నులు, వజ్ర వైఢూర్యాలు (రాజస్యానికి) మొదలగునవి ప్రభుత్వ ఆదాయానికి మార్గాలు. వ్యవసాయమే సామ్రాజ్యంలోని అధిక సంఖ్యాకుల వృత్తి కనుక ప్రభుత్వాదాయంలో అధిక భాగము భూమిశిస్తు ద్వారా లభించేది. భూమిశిస్తు పంటలో నాలుగో వంతుగా వసూలు చేసేవారు. కాల పరిస్థితులను అనుసరించి ఈ శిస్తు హెచ్చుతూ తగ్గుతూ ఉంటుంది. భూమి శిస్తును ధనరూపంలో గాని ధాన్యరూపంలోగాని చెల్లించవచ్చు. అయితే సాధరణంగా ధాన్యరూపంలోనే ఎక్కువగా భూమిశిస్తు వసూలయ్యేది. ఈ విధంగా వసూలు అయిన ధాన్యాన్ని భద్రపరచడానికి సామ్రాజ్యలో పెద్ద పెద్ద గిడ్డంగులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామాలలో జనాభాలెక్కలను ఇతర వివరాలను సేకరించడానికి నియుక్తుడయిన గోపుడనే అధికారే గ్రామాలలో భూమిశిస్తును వసూలు చేస్తుండేవాడు. ప్రధాన నగరాలలో స్థానికుడు అనే అధికారి పర్యవేక్షణలో కొందరు అధికారులు గ్రామ సమూహాల లెక్కలను సేకరిస్తూ భూమిశిస్తును కూడా వసూలు చేసేవారు. సామ్రాజ్య ఆదాయ వ్యయాలకు సంబంధించిన వ్యవహారాలలో ప్రథమ గణకుడు సమర్పించిన లెక్కలను సమాహర్త తనిఖీ చేస్తుండే వాడు.

సామ్రాజ్య ఆదాయంలో అధిక భాగం ఉద్యోగుల జీతాలకు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు, రాజాస్థానానికి, రాజకుటుంబానికి ఖర్చయ్యేది. ప్రజాసంక్షేమ కార్యక్రమాలలో రహదారులు, బావులు, సత్రాల నిర్మాణం, పోషణలు, సుదర్శన తటాకం వంటి ఆనకట్టల నిర్మాణం, మనుషులకు, పశువులకు వైద్యశాలలను నిర్మించటం, మూలికల మొక్కలు, చెట్లు నాటడం మొదలగు కార్యక్రమాలకు

ధనాన్ని కేటాయించేవారు. సైన్య పోషణ కూడ రాజ్య వ్యయంలో ప్రధానమైనది. మత సంస్థలకు, దానధర్మాలకు కూడ విరివిగా ధనాన్ని ఖర్చుచేసేవారు.

## 12.4 సైనిక వ్యవస్థ :

మౌర్య చక్రవర్తులు సుశిక్షితమైన, క్రమశిక్షణ కలిగిన పెద్ద సైన్యాన్ని పోషించారు. ఈ సైన్యం సంప్రదాయ సిద్ధమైన పద్ధతులలో నిర్మింబడినది. చక్రవర్తే సర్వసైన్యాధ్యక్షుడు. యుద్ధ సమయాలలో స్వయంగా సైన్యాన్ని పర్యవేక్షించేవాడు. చక్రవర్తి అస్తిత్వం సైన్యం పైనే ఆధారపడి ఉంది కాబట్టి తగిన జాగ్రత్తలతో సైన్యవ్యవహారాలను నిర్వహించేవారు. కౌటిల్యుడు, మెగస్తనీస్‌ల రచనల వలన సైన్యాలను మూడు ప్రధాన వర్గాలుగా విభజించినట్లు తెలుస్తున్నది. అవి వంశానుగత సైన్యాలు, కిరాయి సైన్యం, శ్రేణుల సైన్యం. మొదటి విభాగమైన వంశానుగత సైన్య చక్రవర్తి మూలబలం. సామ్రాజ్యంలో రైతుల తరువాత జనాభాలో సంఖ్యా బలం సైనికులదే. గ్రీకు రచనల్లో మౌర్యుల సైనిక బలాన్ని గురించిన వివరాలున్నాయి. చంద్రగుప్తుని సైన్యములో 9000 గజదళం, 30000, అశ్వికదళం, 600000 కాల్బలము ఉన్నట్లు ప్లినీ తెలుపగా 6000 గజదళం, 80000 అశ్వికదళం, 8000 రథబలం, రెండు లక్షల కాల్బలము ఉన్నటు ప్లూటార్క్ వివరించాడు. విస్తృతమైన ఈసైన్యపాలనా బాధ్యతను ముప్పయిమంది సభ్యులున్న పంచాయితీ నిర్వహిస్తుంది. ఈ పంచాయతి ఐదుగురు సభ్యులు గల ఆరు ఉపసంఘాలుగా ఏర్పడి సైనిక శాఖల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించేవి. మొదటి ఉపసంఘం నౌకాయుద్ధ నిర్వహణకు సంబంధించినది. నదులపై రవాణా, నదుల మీదుగా దండయాత్రలకు అనుకూలంగా ఉన్న ప్రదేశాలలో యుద్ధాలలో నౌకలను ఉపయోగించేవారు. రెండవ సంఘం సైన్యానికి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయటం, రవాణా కొరకు ఉపయోగించే ఎట్ల బండ్లను పర్యవేక్షిస్తుంది. మిగిలిన నాలుగు సంఘాలు రథ,గజ, అశ్విక, కాల్బల విభాగాల నిర్వహణా బాధ్యతను స్వీకరించాయి.

**12.4.1 గూఢచారి దళం :-** గూఢచారులను నియమించి రాజ్యం నలుమూలలనుండి సమాచారాన్ని సేకరించడం రాజరిక వ్యవస్థలో అనూచానంగా వస్తున్న సంప్రదాయం. గూఢచార వ్యవస్థ సమర్థవంతమైన పాలనా విధానంలో అంతర్భాగం. సమాజంలోని భిన్న వర్గాల నుండి అనాధ బాలలు, బ్రాహ్మణ వితంతువులు మొదలుకొని శూద్ర స్త్రీలు, వివిధరకాల ప్రభుత్వోద్యోగులు మొదలయిన వారి నుండి గూఢచారులను నియమించేవారు. గూఢచారి దళం చురుకుగాను, దక్షతతోను పనిచేస్తుండేది. ఏ వర్గం వారిపై గూఢచారి పని చేయాలో వారితో పూర్తిగా కలసి పోవడమే గూఢచారులు చేయవలసిన పని. అందువల్లనే కౌటిల్యుడు సన్యాసినులు, వ్యభిచారులు, గృహస్తులు, వర్తకులు, బైరాగులు, విద్యార్థులు, సర్వసంగ పరిత్యాగులు మొదలగు వేషాలలో గూఢచారులు పని చేయాలని సూచించాడు. ఈ విధంగా రకరకాల గూఢచారులున్నప్పుడే సమాజంలోని విభిన్న వర్గాలలో పనిచేయగలుగుతారు. గూఢచారి వ్యవస్థలోని అతి ముఖ్యమైన అంశం గూఢచారులెవరో ప్రజలకు తెలియకూడదు. అంతేకాకుండా గూఢచారులు పరస్పరం తెలిసి ఉండకూడదని అధికారులకు కూడ కార్య సాధకులైన గూఢచారులు తెలియకూడదని, తమ సూచనలను అధికారులు లిఖిత పూర్వకంగా గూఢాచారులకు అందచేయాలని కౌటిల్యుడు నిర్దేశించాడు. గూఢచారులను స్వదేశములో నేరపరిశోధనకు, ప్రజాభిప్రాయసేకరణకు ఉపయోగించు కోవడమేగాక విదేశాలకు పంపేవారు.

## 12.5 న్యాయ వ్యవస్థ :

మౌర్యుల న్యాయ విధానంలోనూ ఇతర నిరకుంశ రాజరికాలవలె రాజాస్థానమే ఉన్నత న్యాయస్థానం. రాజే ఉన్నత న్యాయాధీశుడు. ఆస్తి హక్కుతగాదాల విచారణకు ధర్మస్థేయ అని, అపరాధ విచారణ కోసం కంటక శోధన అనే ప్రత్యేక న్యాయ స్థానాలుండేవి. నగరాలలో న్యాయ పాలన కొరకు ప్రత్యేకంగా నియమింపబడిన మహామాత్రులు నిర్వహించే వారు. అశోకుడు తన శాసనాలలో న్యాయవర్తన, పక్షపాతరహిత తీర్పుల ప్రాముఖ్యన్ని, ఆగ్రహం, విసుగు, అసహనము, అలసత్యము మొదలగు బలహీనతలు న్యాయాధికారులకుండరాదని హెచ్చరించాడు. నగర న్యాయ శాఖలు ఎటువంటి అన్యాయాలు చేయకుండా చూడటానికి ఐదు

సంవత్సరాలకొకసారి ఈ న్యాయ శాఖలను తనిఖీలు చేస్తుండే వారు. వృత్తి పనివారు, వర్తకులు, ఇతర నగరవాసులకు సంబంధించిన సమస్యలను న్యాయ మహామాత్రులు విచారణ చేసేవారు. గ్రామాలలో రాజుకులు న్యాయ నిర్వహణ చేసేవారు. 'విచారణ క్రమంలో, శిక్షలలో సమత ఉండటం ఆపేక్షణీయమని' అశోకుడు తన శాసనాలో పేర్కొన్నారు. ఈ శాసనం నేరస్తుని సాంఘిక హోదా పట్లగల పక్షపాత బుద్ధితో శిక్షి విధించరాదని సూచిస్తున్నది. ఈ విధానము అప్పటి వరకు అమలులో ఉన్న సాంప్రదాయ న్యాయపద్ధతికి విరుద్ధంగా ఉన్నది. అర్ధశాస్త్రం సాంప్రదాయక న్యాయవిధానాన్ని స్పష్టంగా వివరిస్తున్నది. " వ్యక్తుల సాంఘిక హోదాను, నేరస్వభావాన్ని, నేర కారణాలను, నేరానికున్న పూర్వాపరాలను, కాలాన్ని, స్థలాన్ని, నేరస్తుల మధ్య ఉన్న విభేదాలు అనగా నేరస్తులు రాజకుటుంబానికి లేక ఉన్నత వర్గానికి చెందినవారా లేక సామాన్య ప్రజలా అన్న అంశం, అన్నీ పరిశీలించిన తరువాతనే న్యాయాధికారి అధమ మధ్యమ, ఉన్నత శిక్షలలో ఏది తగినదో నిర్ణయించాలి." వర్ణవ్యత్యాసాలను పాటించి నేరస్థుడు బ్రాహ్మణుడైతే తక్కువ శిక్ష, హీన వర్గానికి చెందిన వాడైతే కఠిన శిక్షలు విధించే వారని అర్ధశాస్త్రం నుండి తెలుస్తున్నది. అయితే అశోకుడు శిక్షలు విధించడంలో వర్ణవ్యత్యాసాలను, సాంఘిక హోదాను నిషేధించి నేరస్తులందరికి ఒకే రకం శిక్షలను విధించునట్లు ఆదేశించడం ద్వారా తన సామ్రాజ్యంలో చట్టం ముందు అందరూ సమానులే అనే భావనను, ఒకే విధమైన శిక్షా స్మృతిని, మొదటి సారిగా ప్రవేశ పెట్టిన వాడైనాడు.

నేరస్తులకు విధించే శిక్షలు సామాన్యముగా జరిమానా రూపంలో ఉండేవి. ఈ అపరాధ రుసుం చెల్లించలేని నేరస్తులు బానిసలుగా అమ్ముడుపోయి అపరాధ రుసుం చెల్లించడానికి అనుమతిని ఇచ్చేవారు. అశోకుడు అహింసా సిద్ధాంతానికి ప్రముఖ స్థానం ఇచ్చినప్పటికి మరణ శిక్షను రద్దు చెయ్యలేదు, కాని ఉరి శిక్ష పడిన నేరస్తునికి మూడు రోజుల కాల వ్యవధిని ఇచ్చారు. ఈ కాల వ్యవధిలో పునర్విచారణను కోరుతూ న్యాయాధికారులకు విజ్ఞాపన చేసుకోవచ్చును.

## 12.6 నీటి పారుదల - వ్యవసాయం :

సామ్రాజ్య ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ ప్రాముఖ్యతను గుర్తించిన మౌర్యులు నీటి పారుదల వనరులు, కాలువల నిర్వహణకు ప్రత్యేకముగా ఒక శాఖను ఏర్పాటు చేశారు. వ్యవసాయాభివృద్ధికి చెరువులు, బావులు, కాలువలు త్రవ్వించి నీటి వనరులు కల్పించారు. నీటి పారుదల వ్యవహారాలను రాజుకుల కార్యస్థానం నిర్వహిస్తుంది. ఈ ఉద్యోగులు నదులను, తూములను తనిఖీ చేసి రైతుల మధ్య జరిగే నీటి పంపిణీని పర్యవేక్షించే వారు. పరిసర గ్రామ ప్రాంత భూములకు నీటి వనరులను కల్పించేందుకు, చంద్రగుప్తుని కాలములో సౌరాష్ట్ర రాష్ట్ర పాలకుడైన పుష్యగుప్తుడు గిరినార్‌లో సుదర్శన తటాకాన్ని నిర్మించినట్లు రుద్ర దాముని జునాగడ్ శాసనం పేర్కొంటున్నది. ఈ శాసనమే అశోకుని కాలంలో సౌరాష్ట్ర, అనార్త రాష్ట్రాల పాలకుడైన తుషాస్ప ఈ సుదర్శన తటాకానికి అనుబంధంగా తూములను ఏర్పరచాడని చెబుతున్నది. క్షామం సంభవించినపుడు రైతులకు వ్యవసాయ పరికరాలు, ఎద్దులు, నారు విత్తనాలు అవసరమైనంతగా ప్రభుత్వం సరఫరా చేసి రైతుల సంక్షేమానికి తోడ్పడింది.

## 12.7 జనాభా లెక్కలు - సేకరణ :

మౌర్యుల పాలనా విధానంలో విశిష్టమైన విభాగము జనాభా లెక్కల సేకరణ విభాగము. మెగస్తనీస్ ఇండికా నుండి, కౌటిల్యుని అర్ధశాస్త్రము నుండి మౌర్య సామ్రాజ్యంలో జనాభా లెక్కల సేకరణకు ప్రత్యేకంగా ఒక విభాగమున్నట్లు తెలుస్తున్నది. సామ్రాజ్యములోని ప్రతి పౌరుని జనన మరణ వివరాలను వాటిని నమోదు చేయుటకు ఏర్పాటు చేసిన రిజిష్టర్‌లో నమోదు చేసేవారు. ప్రపంచంలోనే మొట్ట మొదటి జనాభా లెక్కల సేకరణను ప్రవేశ పెట్టినవారు మౌర్యులు. నగరాలలో జనాభా లెక్కలను నాగరికుడు స్థానికుడు, గోపుడు అనే ఉద్యోగుల సహాయముతో సేకరించేవాడు. నగరాలలో ప్రవేశించే విదేశీయులను, వలస వచ్చే ఇతర రాజ్యాల వారి వివరాలను, వర్తక వాణిజ్యాల కొరకు వచ్చే వ్యాపారులు, విద్యాభ్యాసం కొరకు వచ్చే విద్యార్థుల వివరాలు ఒక ప్రత్యేకమైన రిజిష్టర్‌లో పొందు పరచుటమే గాక వారికి అవసరమైన సదుపాయాలు కల్పించటం కూడ ఈ జనాభా లెక్కల విభాగము నిర్వహిస్తుంది. నగరాలలో ప్రవేశించిన క్రొత్త వారిలో అనుమానాస్పద ప్రవర్తన కలిగిన వారి జాబితా ప్రత్యేకంగా తయారు చేసి వారిపై గట్టి నిఘా ఉంచేవారు. గ్రామాలలో గోపులు గ్రామీణ ప్రజల సంఖ్య, వారికుల గోత్రాలు, జీవనోపాధి, వృత్తి వివరాలు, మతము, వారి ఆదాయము మొదలయిన పూర్తి వివరాలతో

జనాభా లెక్కలను సేకరించేవారు. ఈ జనాభా లెక్కల సేకరణ వలన సామ్రాజ్యంలోని అన్ని వర్గాల ప్రజల వివరాల తెలియటమే కాక వారిపై పన్నులు విధించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశ పెట్టుటలో తగిన మార్గదర్శ సూత్రాలను, ఇతర విధానాలను సక్రమంగా రూపొందించుకొనుటకు, అమలు జరుపుటకు ప్రభుత్వానికి అవకాశం కలిగుతున్నది.

## 12.8 ముగింపు :

సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించుటయేకాక తమ సామ్రాజ్యములో పటిష్టమైన కేంద్రీకృత పాలనా యంత్రాగాన్ని ప్రవేశ పెట్టిన వారు మౌర్యులు. వ్యవసాయ, పశు సంవర్ధక, వ్యాపార, వాణిజ్య, విద్య, సైనిక వ్యవస్థ మొదలగు అంశాలలో అనేక నూతన పాలనా పద్ధతులను తొలి సారిగా ప్రవేశ పెట్టారు. సమకాలీన ప్రపంచంలో సువిశాల సామ్రాజ్యాన్ని సుస్థిరత, శాంతి భద్రలతో పరిపాలించిన ఫలితంగానే సామ్రాజ్యంలో వాణిజ్యాభివృద్ధి జరిగి ఆర్ధిక వికాసానికి అవకాశం ఏర్పడింది. స్థానిక ప్రభుత్వాలకు తగినంత పాలనాధికారాలను కలుగజేసి సమర్ధవంతమైన కేంద్రీకృతపాలనను, ఉద్యోగ బృందాన్ని రూపొందించటంలో మౌర్యులు కృతకృత్యులయ్యారు. పాలనా లక్ష్యమైన ప్రజా శ్రేయస్సును సాధించారు. మౌర్య వంశం పతనమైన పాలనలో వారు ప్రారంభించిన విధానాలను పెద్దగా మార్పులు లేకుండా తరువాత కాలంలోని రాజ వంశాలు అనుసరించాయి.

## 12.9 మౌర్య యుగ సాంఘిక ఆర్ధిక సాంస్కృతిక పరిస్థితులు :

**12.9.1 సాంఘిక పరిస్థితులు ;-** వర్ణవ్యవస్థ మౌర్యుల పాలనలో భారత సమాజములో వర్ణ వ్యవస్థ పరిపూర్ణ రూపం ధరించింది. వర్ణాశ్రమ ధర్మ మాధారంగా రూపొందిన వ్యవస్థను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. అర్ధశాస్త్రము వర్ణాశ్రమ వ్యవస్థపై ధర్మ శాస్త్రాలకు భిన్నంగా వ్యవహరించలేదు. అయితే స్మృతి వాఙ్మయ నిబంధనలంత కఠినంగా కౌటిల్యుడు వర్ణ వ్యవస్థను అనుసరించ లేదు. అర్ధ శాస్త్రం అన్ని వర్ణాల ప్రజల నుండి సమర్ధులైన వారిని సైనికులగా నియమించమని చెప్పటం చాలా విశేషాంశం. అయితే అర్ధశాస్త్రంలో నాలుగు ప్రధాన వర్ణాలను పేర్కొని ఒక వర్ణం వారు మరొక వర్ణంవారి వృత్తిని చేపట్టరాదని ఆంక్షలు విధించింది. సమాజంలో బ్రాహ్మణులకు అధిక గౌరవం ఇచ్చేవారు. వారు అధ్యాపక, ఆధ్యాత్మిక వృత్తిని అనుసరించేవారు అయినప్పటికి పుష్యమిత్ర, శుంగుని వంటి కొందరు రాజోద్యోగాలను నిర్వహించేవారు. వ్యవసాయం, పశుపాలన, వాణిజ్యాలను వైశ్య శూద్ర కులాల వృత్తులని అర్ధశాస్త్రం పేర్కొంటున్నది. సమాజంలో కులాల సంఖ్య క్రమముగా పెరగటం ప్రారంభమయ్యింది.

గ్రీకు రచయితలు భారత సమాజంలోని కులవ్యవస్థ గురించి కొన్ని వివరాలను అందిస్తున్నారు. మెగస్తనీస్ అందిస్తున్న వివరాల ప్రకారం భారత సమాజంలో ఏడు కులాల వారున్నట్లు తెలుస్తున్నది. వారు బ్రాహ్మణులు, వ్యవసాయ దారులు, పశుపాలకులు, వృత్తి పని వర్తక జనులు, వేటగాళ్ళు, సైనికులు, ఆవేక్షకులు లేదా ఉద్యోగులు. మెగస్తనీస్ ఇచ్చిన సమాచారం బట్టి ప్రతి వృత్తి ఒక కులంగా మారడం మౌర్యయుగంలో ప్రారంభమైనట్లు తెలుస్తున్నది. అయినా కూడా సమాజంలో జైన బౌద్ధ మతాల ప్రభావం వలనను, అధిక సంఖ్యలో భారత దేశానికి విదేశీయులు వస్తుండటం వలననూ మౌర్యుల కాలంలో సమాజంలో వర్ణ భేదాలు పూర్తిగా పాటించబడలేదు. వివాహ సంబంధాలలో కూడ వర్ణ విభేదాలను అనుసరించ లేదు. మౌర్య చక్రవర్తి గ్రీకురాకుమార్తెను వివాహ మాడాడు. ఆశోకుని భార్యలలో క్షత్రిమేతరులున్నారు.

**12.9.2 వర్ణాశ్రమ ధర్మాలు :** ఆశ్రమ ధర్మాలను అగ్రవర్ణాల వారు మాత్రమే పాటించేవారు. సన్యాస ఆశ్రమాన్ని ఎక్కువ మంది స్వీకరిస్తుండే వారు. జైన బౌద్ధ, ఆజీవక మతాల ప్రభావమే దీనికి కారణం. మౌర్య సామ్రాజ్యంలో పరివ్రాజక సంఘాలు చాలా ఎక్కువ సంఖ్యలో ఉండేవి. చంద్రగుప్త మౌర్యుడు కూడ తన జీవిత చరమాంకంలో రాజ్య త్యాగంచేసి జైనమతాన్ని స్వీకరించాడు. అర్ధశాస్త్రము సన్యాశ్రమ స్వీకారానికి కొన్ని నిబంధనలు విధించింది. వృద్ధులు సన్యాస ఆశ్రమం స్వీకరించవచ్చును.

**12.9.3 కుటుంబ వ్యవస్థ :** నాటి కుటుంబాలు చాల వరకు ఉమ్మడి కుటుంబాలే. బాలికలకు పన్నెండు సంవత్సరాలు బాలురకు పదహారు సంవత్సరాల వయస్సును యుక్త వయస్సుగా అర్ధశాస్త్రం చెబుతున్నది. ఎనిమిది రకాల వివాహాలలో నాలుగు రకాల వివాహలు మాత్రమే సక్రమమైనవిగా కౌటిల్యుడు అర్థశాస్త్రంలో నిర్ణయించాడు. భార్యాభర్తలిద్దరి అంగీకారంతో కాని, వారిద్దరిలో ఎవరైన దీర్ఘకాలం సంసారం నుండి దూరమైనా కాని విడాకులు పొందవచ్చును. వివాహిత స్త్రీలకు స్త్రీధన రూపంలో ఆస్తి ఉండేది. మగ సంతానము లేనట్లయితే , మొదటి భార్యకు ఎటువంటి నష్ట పరిహారం చెల్లించకుండా భర్త రెండవ వివాహము చేసుకొనవచ్చును. వివాహ నిబంధనలు గురించి, భార్యా భర్తల సంబంధాల గురించి అర్ధశాస్త్రము మూడు అధ్యాయాలను కేటాయించింది. వితంతువులు స్వేచ్ఛాగా జీవించే వారని వారికి తగిన గౌరవం సమాజంలో లభించేదని, వారిని గూఢచారిణులుగా కూడ వినియోగిస్తున్నట్లు అర్ధశాస్త్రము వలన తెలుస్తున్నది.

**12.9.4 సమాజంలో స్త్రీ స్థానం :** సమాజంలో స్త్రీలకు ఉన్నత స్థానంకాని, గౌరవం కాని ఉండేది కాదు. స్త్రీలను విలాసవస్తువులుగా పరిగణించేవారు. ఇంటి నాలుగు గోడల మధ్యే వారి జీవితము పరిమితమైనది. పరదా పద్ధతి అమలులో ఉన్నది. స్త్రీలను చాల సులువుగా బేరమాడి కొనడం, అమ్మడం జరుగుతుండేదని మెగస్తనీస్ ఇండికాలో పేర్కొన్నాడు. వరకట్న సంప్రదాయం అమలులో ఉన్నది. స్త్రీలకు పునర్వివాహము చేసుకునేందుకు, విడాకులు తీసుకునేందుకు హక్కు కలదు. బౌద్ధ మతం స్వీకరించిన స్త్రీలు విద్యావంతులై బిక్షుకవృత్తిని అవలంబించేవారు. వివాహిత స్త్రీలకు మత గ్రంథాలు చదివే హక్కులేదు, అశోకుని శాసనాలు ఆనాడు స్త్రీలలో మూఢ విశ్వాసాలు నిరర్ధకమైన ఆచారాలు ఎక్కువని తెలియచేస్తున్నాయి. మెగస్తనీస్ ఇండికా నుండి చంద్రగుప్తునికి అంగరక్షకులుగా స్త్రీలుండేవారని తెలుస్తుంది. ఇటువంటి స్త్రీలను ప్రభుత్వం ఆ స్త్రీల తల్లిదండ్రుల వద్దనుండి కొనేది. భార్యకు భర్తతో పాటు మత కార్యక్రమాలలో పాల్గొనే అర్హత ఉన్నది. సతీ సహగమనం అమలులోకి వచ్చింది. ప్రభుత్వం గణికా వృత్తిని గుర్తించింది. వేశ్యా వాటికలు నగరాలలో ఉండేవి. మౌర్య ఉద్యోగులలో గణికాధ్యకు డొకడుండేవాడు.

**12.9.5 బానిస వ్యవస్థ :** బౌద్ధవాఙ్మయము, అశోకుని శాసనాల వలన మౌర్య యుగములో బానిస వ్యవస్థ ఉండేదని తెలుస్తున్నది. మెగస్తనీస్ ఇండికాలో భారతదేశంలో బానిసలు లేరని ప్రజలందరు స్వేచ్ఛా జీవులని రచించినట్లు తరువాత గ్రీకు రచయితలు ఉల్లేఖిస్తున్నారు. మెగస్తనీస్ మూల గ్రంథంలో బానిసత్వాన్ని ప్రస్తావించి ఉన్నప్పటికి తరువాత సంపాదకులు దానిని తొలగించి అదేయదార్ధమైన పాఠమని నమ్మిదానికి తమ స్వంత వ్యాఖ్యానాలు చేర్చి ఉంటారు. బానిసలలో మూడు రకాల వారున్నట్లు బౌద్ధ గ్రంథాలు పేర్కొంటున్నాయి. అవి. 1. తమ ఇంటిలో జన్మించిన వారు. 2. ధనమిచ్చి కొన్నవారు లేదా బహుమతిగా లభించిన వారు. 3. వారసత్వంగా తండ్రి నుండి సంక్రమించిన వారు. యుద్ధాలలో పట్టుబడ్డ సైనికులను బానిసలుగా చేసే ఆచారమున్నది. అర్ధశాస్త్రంలోను, జాతక కథలలోను దండదాసులనే బానిసల ప్రసక్తి కనిపిస్తుంది వీరు శిక్ష ఫలితంగా బానిసలైన వారు. అశోకుడు తన శాసనాలలో సేవకులకు బానిసలకు మధ్య తేడాను స్పష్టంగా చెప్పాడు. బానిసల యెడల దయతో మెలగాలని కూడ అశోకుడు తన శాసనాలో ప్రబోధించాడు. గ్రీకుదేశంలో వలె బానిసల స్థితి భారతదేశంలో కఠినంగా ఉండేది కాదు. సాధారణంగా బానిసల పట్ల మానవతా భావాన్ని ప్రదర్శించాలని అర్ధశాస్త్రము, జాతక కథలు సూచిస్తున్నాయి. బానిసగా అమ్ముడు పోయిన వ్యక్తి సంతానము బానిసలు కారు. బానిస సంపాదించిన ధనం అతనికే చెందుతుంది. యజమాని వలన స్త్రీ బానిసకు సంతానం కలిగితే మాత శిశువులిరువురు స్వతంత్రులవుతారు. బానిసల హక్కులను అలక్ష్యం చేసిన యజమానులను రాజు శిక్షించ వచ్చును.

**12.9.6 ఆర్థిక పరిస్థితులు :** ప్రజల మఖ్య వృత్తి వ్యవసాయమే అయినందున మౌర్య ప్రభుత్వం వ్యవసాయరంగ అభివృద్ధికి ఎన్నో చర్యలను చేపట్టినది. సామ్రాజ్యంలో నగరాలు, పట్టణాలు ఉన్నప్పటికి రాజ్య, సాంఘిక ఆర్థిక వ్యవస్థలకు గ్రామమే పునాది. వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం బావులు, చెరువులు, కాలువలు త్రవ్వించింది. కరువు సమయాలలో రైతులకు వ్యవసాయ పరికరాలు, ఎద్దులు, నారు విత్తనాలను అవసరమైనంతగా సరఫరా చేసి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పాటు పడింది. గ్రామాలలో భిన్న రకాల వరి, నూనె గింజలు, మిరియాలు, గోధుమ, చక్కెర, కూరగాయలు, అన్ని రకాల పండ్లను పండించే వారు. వ్యవసాయ భూములపై విధించే భూమిశిస్తు ప్రాంతాలను బట్టి మారుతుంటుంది. పండిన పంటలో నాల్గవ వంతునుండి ఆరవ వంతు వరకు శిస్తు వసూలు చేసేవారు.

వ్యవసాయంతో పాటు ఎన్నో రకాల పరిశ్రమలు కూడ మౌర్య యుగంలో అభివృద్ధి చెందాయి. భారత ప్రజలు అందమైన నగలను తయారు చేయటంలోను, ఉత్తమ తరగతికి చెందిన వస్త్రాలను నేయటంలోను సిద్ధహస్తులని మెగస్తనీస్ ఇండికాలో పేర్కొన్నాడు. వస్త్ర పరిశ్రమలో భారతదేశం అద్భుత ప్రగతిని సాధించింది. నూలు, ఉన్ని, పట్టు వస్త్రాల ఉత్పత్తి విరివిగా జరిగింది. కాశి, వత్స, మధుర, వంగ, అపరాంత మొదలగు ప్రదేశాలు వస్త్రోత్పత్తికి కేంద్రాలుగా ఉండేవి. మగధ, కాశి రాజ్యాలు జనుప నార పరిశ్రమకు కేంద్రాలుగా ఉండేవి. ఈ పరిశ్రమలే కాకుండా వడ్రంగము, పానీయాలను, యుద్ధ పరికరాలను తయారు చేయడం, నౌకా నిర్మాణంలోను ఆనాటి ప్రజలు సిద్ధహస్తులు.

**12.9.7 వర్తక వాణిజ్యాలు :** మౌర్య చక్రవర్తులు వర్తక వాణిజ్య అభివృద్ధికి శ్రద్ధాసక్తులను ప్రదర్శించి తగిన చర్యలను తీసుకొన్నారు. రవాణా సౌకర్యాలు సక్రమంగా లేనట్లయితే వాణిజ్యాభివృద్ధి జరగదని గ్రహించిన మౌర్య చక్రవర్తులు రహదారులను నిర్మించారు. దీని వలన సరుకులు ఒక ప్రాంతాన్నుండి మరొక ప్రాంతానికి సులభంగా రవాణా జరుగుటకు అవకాశం ఏర్పడింది. సామ్రాజ్యంలోని ప్రముఖ వాణిజ్య కేంద్రాలయిన పాటలీపుత్రం, కాశి, ఉజ్జయిని మొదలగు నగరాలను కలుపుతూ రహదారులు నిర్మించబడ్డాయి. ఉత్తరాపథ, దక్షిణాపథాల మధ్య రాకపోకలు ఎక్కువైయ్యాయి. ప్రభుత్వ అధికారులు ఈ రహదారులపై వివిధ ప్రదేశాల మధ్య గల దూరాన్ని తెలిపే మైలురాళ్ళను. కూడలి ప్రదేశాలలో వివిధ నగరాలకు వెళ్ళే మార్గాలను తెలిపే సూచికలను ఎర్పరచారు. రహదారులను నిర్వహణకు నియమింబడిన ప్రభుత్వధికారులను గురించి మెగస్తనీస్ ఇండికాలో పేర్కొన్నాడు.

**12.9.8 విదేశీ వాణిజ్యం :** అతి ప్రాచీన కాలం నుండి బాబిలోనియా మొదలగు పశ్చిమ ఆసియా దేశాలకు వెళ్ళే ముఖ్యమైన రహదార్లను ఎక్కువగా అభివృద్ధి చేశారు. ఈ మార్గం ద్వారా వెళ్ళే భారతీయ వర్తకులు టైగ్రీస్ నది తీరాన ఉన్న సెల్యూసియా నగరానికి చేరుకోని వాణిజ్యాన్ని సాగించేవారు. తూర్పు తీరంలోని తామ్లుక్ (తామ్రలిపి) పశ్చిమ తీరంలోని చరుకచ్చం, సోపార రేవుల ద్వారా విదేశీ వాణిజ్యము సముద్ర మార్గాన జరుగుతుండేది.

భూమార్గము ద్వారా కాని, సముద్ర మార్గం ద్వారా కాని విదేశాలతో వాణిజ్యము చేయు వర్తకులు తప్పని సరిగా అందుకు తగిన అనుమతి పత్రాలను ప్రభుత్వం నుండి పొందాలి, పాటలీపుత్ర నగరపాలనకు ఉద్దేశించబడిన నగర సభలోని ఆరు పంచాయతీలలో మూడు పంచాయతీలు వాణిజ్యం వ్యాపారాలు, వస్తువిక్రయం, పరిశ్రమల కొరకు, విదేశీయుల సౌకర్యాలకు ఏర్పాటు చేసినందున మౌర్య యుగంలో వాణిజ్య రంగంలో అభివృద్ధిని సాధించింది. పశ్చిమ ఆసియా రాజ్యాలకు ప్రధానంగా సిరియా, ఈజిప్ట్ రాజ్యాలకు నీలి మందు, వివిధ రకాల మందులు, నూలు వస్త్రాలు, పట్టు వస్త్రాలు ఎగుమతి చేసేవారు. విదేశాలనుండి పానీయాలు, విలాసవస్తువులు. చీనాంబరాలు దిగుమతి చేసుకోనేవారు. భారతదేశ. బాక్ట్రియాల మధ్య వాణిజ్యాభివృదికి సిరియా చక్రవర్తి మొదటి ఆంటియోకస్ భారత నాణేల ప్రమాణాలను అనుసరించి తన నాణేలను ముద్రించాడు.

**12.9.9 స్వదేశీ వాణిజ్యం :** దేశీయ వాణిజ్యంలో ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య వాణిజ్యానికి మంచి ప్రోత్సాహం లభించింది. దక్షిణ దేశం నుండి వజ్రాలు, ముత్యాలు, నూలువస్త్రాలు ఉత్తర భారదేశానికి ఎగుమతి చేసేవారు. ఉన్ని వస్త్రాలు, కంబళ్ళు, గుర్రాలను ఉత్తర భారతదేశం నుండి దక్షిణ భారతదేశానికి దిగుమతి చేసుకునే వారు. వర్తకులు సుసంఘటితమై శ్రేణులుగా ఏర్పడి వాణిజ్యాని సాగించేవారు. వడ్రంగము, లోహకారవృత్తి, నగల తయారీ మొదలగు పద్దెనిమిది రకాల చేతివృత్తుల వారు శ్రేణులనే వర్తక సంఘాలుగా ఏర్పడ్డారు. ప్రతి శ్రేణికి ప్రముఖ అనే పేరుతో అధ్యక్షుండేవాడు. శ్రేణి కార్యదర్శిని 'జెట్టక' అని పిలిచేవారు. ఈ వర్తక శ్రేణులు. బ్యాంకులవలె వ్యవహరించి తాము తీసుకోన్న నిధులపై 15 శాతం వరకు వడ్డీని ఇస్తుండేవి.

ప్రభుత్వము అన్ని రకాల వాణిజ్యాలను అదుపులో ఉంచి వ్యాపారం సక్రమంగా నిర్వహించుటకు ఉద్యోగులను నియమించింది. పణ్యాధ్యక్షుడు సరుకుల ధరలను నిర్ణయించేవాడు. దొంగరవాణా, కల్తీలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించేవారు. తూనికలలో, కొలతలలో మోసాలు జరగకుండా పౌతవాధ్యక్షుడనే అధికారి ఉండేవాడు. నగర ప్రవేశ ద్వారాల వద్దనే సరుకులపై సుంకాలను వసూలు చేసేవారు.

**12.9.10 మతము :-** మౌర్యయుగములో బౌద్ధజైన, వైదిక మతాలు ప్రధానమైన మతాలు. ఈ మతాలను అనుసరించి సామ్రాజ్యంలోని ప్రజలు బౌద్ధులు, జైనులు, హిందువులని మూడు ముఖ్యమైన తరగతులుగా విభజించబడ్డారు. వీరు గాక ఆ జీవకులు అనే మరొక మతం వారు కూడ ఉన్నారు.

**12.9.11 బౌద్ధమతము :** ఈ నాలుగు మతాలలోను మౌర్యయుగంలో బౌద్ధమతము విశేషంగా ఆదరించబడింది. అశోకుని పాలనలో బౌద్ధము ఇంచుమించు దేశమంతా వ్యాపించింది. అశోకుని బౌద్ధమత ఆదరణ వలన ఆ మతం విదేశాలలో కూడ ప్రచారమయ్యింది. బౌద్ధమత వ్యాప్తికి అశోకుడు ఎన్నో విధాల కృషిచేశాడు. తాను రూపొందిన ధమ్మ విధానాన్ని ప్రజలు అనుసరించేటట్లు చేయుటకు అనేక ప్రయత్నాలు చేశాడు. మౌర్యులనుసరించిన మత సహన విధానాల వలన సామ్రాజ్యంలో అన్ని మతాల వ్యాప్తికి అవకాశం కలిగింది.

**12.9.12 జైన మతం :** జైన మతం కూడ చక్రవర్తులు, వృత్తిపనివారు వర్తకుల పోషణ వల్ల సామ్రాజ్యమంతటా వ్యాపించింది. చంద్రగుప్త మౌర్యుడు తన పరిపాలనా చివరి సంవత్సరాలలో జైన మతాన్ని స్వీకరించాడు. సంప్రతి జైనమత వ్యాప్తికి కృషి చేశాడు. జైనమతానికి అయోధ్య, బీహార్, ఒరిస్సా ప్రాంతాలలో విశేషాదరణ లభించింది.

**12.9.13 వైదిక మతం :** బౌద్ధ, జైనమతాలు అమితంగా ఆదరించబడినా అతి ప్రాచీనమైన వైదికమతం పూర్తిగా నశించలేదు. మెగస్తనీస్ ఇండికా, కౌటిల్యుని అర్ధశాస్త్రాల వలన మౌర్య సామ్రాజ్యములో వైదిక మతావలంబికులు అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తున్నది. అశోకుడు అహింసా విధానాన్ని అనుసరించి జంతుబలులను నిషేధించినప్పటికి వైదిక క్రతువులు జరుగుతూనే ఉన్నాయి. అశోకుని మరణం తరువాత వైదికం మతం విజృంభించింది. అయితే జైన బౌద్ధమతాలతో పోటీని తట్టుకోవటానికి వైదిక మతంలో మౌర్యయుగంలోనే కొన్ని మార్పులు ప్రవేశించాయి. వైదిక క్రతువుల కంటే భక్తి మార్గము ద్వారా మోక్షసాధనకు అధిక ప్రాముఖ్యతను ఇచ్చారు. ఫలితంగా శైవ, వైష్ణవాలు ప్రచారమయ్యాయి. యదునాయకుడైన వాసుదేవ కృష్ణుని తత్యము వైష్ణవ మతానికి మూలమై 'వాసుదేవ మతం' గా రూపొందింది. ఈ మతానికి మధురా నగరం ప్రముఖ కేంద్రమయ్యింది. క్రమముగా ' వాసుదేవుడు ' 'విష్ణువు'కు నామాంతరమయ్యాడు. భక్తి మార్గ ప్రచారము వలన ప్రజలలో విగ్రహారాధన పట్ల ఆసక్తి పెరిగింది. శివ, విష్ణు, ఇంద్ర, స్కంధ, విశాఖాది దేవతల విగ్రహాలను పూజించటం ప్రారంభమయ్యింది.

**12.9.14 భాషా-సారస్వతాలు :** భాషా సారస్వత రంగాలలో మౌర్యయుగం ఎంతో పురోగతిని సాధించింది. తొలిసారిగా బ్రాహ్మి, ఖరోష్టి లిపులలో అశోకుడు తన శాసనాలను శిలలపై చెక్కించి సామ్రాజ్యమంతటా నెలకొల్పాడు. సామాన్య జనంలో వాడుకలో ఉన్న ప్రాకృత భాషలో అశోకుడు ఈ శాసనాలను చెక్కించాడు. సంస్కృత, ప్రాకృత భాషలలో మౌర్యుల కాలంలో విశేషమైన పరిశ్రమ జరిగింది. తక్షశిల, వారణాశి నగరాలు ఆనాటి ప్రసిద్ధ విద్యాకేంద్రాలు. ఈ విద్యాకేంద్రాలలో తర్కము, వ్యాకరణ, వార్త, రాజనీతి, ఇతిహాసం మొదలగు విద్యలను బోధించేవారు. మౌర్య యుగానంతరం పుష్యమిత్రుని సమకాలికుడైన పతంజలి మహాభాష్యంలో పాండురాజు ఇతిహాసాన్ని గురించిన ప్రసక్తి ఉన్నది. మహాభాష్యం ఇస్తున్న సమాచారాన్ని బట్టి ఆ కాలంలో కంసవధ, బలిబంధ నాటకాలు ప్రదర్శించేవారని మయాతి, వాసవదత్తల కథలు ప్రచారంలో ఉన్నాయని తెలుస్తున్నది. గ్రంధ రచనలో ప్రాకృతం, సంస్కృతం రెండు భాషలను ఉపయోగించారు. కౌటిల్యుని అర్ధశాస్త్రం, వైదిక వాఙ్మయ గ్రంధాలయిన ధర్మ సూత్రాలు, గృహ్యసూత్రాలు సంస్కృత భాషలో రచించారు. రామాయణ, మహాభారతాలలోని కొన్ని భాగాలను మౌర్య యుగంలోనే రచించారనే అభిప్రాయమున్నది. బౌద్ధ, జైనమత గ్రంధాలు ప్రాకృత బాషలో రచించబడ్డాయి. మౌర్యుల యుగంలో తయారయిన బౌద్ధ గ్రంధాలలో అభిదమ్మ పిటకము, కధావత్థు ముఖ్యమైనవి. జైన గ్రంధాలలో బద్రబాహుడు రచించిన కల్ప సూత్రాలు ప్రముఖమైనవి.

**12.9.15 వాస్తు శిల్పాలు :** మౌర్యుల పాలనా కాలంలో భారత దేశ వాస్తు శిల్ప కళాచరిత్రలో ఒక నూతన శకం ప్రారంభమయ్యింది. సింధునాగరకత పతనమైన తరువాత భారత ప్రజలు అనుసరించిన శిల్పకళా సంప్రదాయాలు మౌర్యుల కాలం వరకు కనిపించవు. కొంతమంది శిల్పకళావిమర్శకులు సింధు సంస్కృతీ సంప్రదాయాల సహజ పరిణామమే మౌర్యుల శిల్పంలో వ్యక్తమౌతున్నదని వాదిస్తున్నారు.

కాని ఈ వాదనకు స్పష్టమైన ఆధారాలు కనిపించవు. గ్రీకు, పారశీక శిల్పకళారీతుల ప్రభావ ఫలితంగా మౌర్యశిల్పము రూపుదిద్దుకోన్నదని విన్సెంట్ స్మిత్ మొదలగు వారి అభిప్రాయము. ప్రభావమెవ్వరిదైనప్పటికి భారత దేశ చారిత్రక యుగానికి సంభందించిన మొట్టమొదటి వాస్తుశిల్పాలు మౌర్యుల కాలం నుండే లభిస్తున్నాయి. మౌర్యులకు పూర్వము వాస్తుశిల్ప నిర్మాణంలో దారువును ఉపయోగించినందున అవి పూర్తిగా నశించాయి. వాస్తు నిర్మాణాలలో దారువు నుండి శిలకు మారడం మౌర్యుల కాలంలో ప్రారంభమయ్యింది. కుమాహర్ ప్రాంతంలో జరిగిన పురావస్తు త్రవ్వకాలలో చంద్రగుప్తుని రాజప్రాసాదం బయల్పడింది. ఈ ప్రాసాద నిర్మాణం పారశీక చక్రవర్తుల రాజప్రాసాదం పెర్సిపోలిస్ నమూనాగా నిర్మించబడింది.

**12.9.16 బౌద్ధ స్తూపాలు :** బౌద్ధ గ్రంధాలు అశోకుడు 84,000 స్తూపాలను నిర్మించినట్లు తెలియచేస్తున్నవి. వీటిలో సాంచీ, సారనాథ్, బార్హుత్ స్థూపాలు ప్రముఖమైనవి. ఈ నిర్మాణాలు భారతీయ శిల్పకళలో మౌర్యయుగ భారతీయులు సాధించి నైపుణ్యానికి నిదర్శనాలు.

**12.9.17 గుహాలయాలు :** అశోకుడు దశరథులు గుహలయాలను తొలపించారు వీరు తొలిపించిన గుహాలయాలు బీహారులోని గయ జిల్లాలో ఉన్న బరాబర్ కొండల్లో నాలుగు, నాగార్జుని కొండలో మూడు, సితామర్హిలో కొండలలో ఒకటి ఉన్నాయి. బరాబర్ పర్వతాలలో ఉన్న గుహాలయాలలో సుదామగుహాలయం, లోమస్రిషి గుహాలయాలు ప్రధానమైనవి.

**12.9.18 అశోక స్తంభాలు :** బౌద్ధ పుణ్యక్షేత్రాలలో అశోకుని ఏకశిలాస్తంభాలు మౌర్యుల కాలంనాటి శిల్పకళా వైభవానికి నిదర్శనాలు. ఈ స్తంభాలు 30 అడుగుల నుండి 40 అడుగుల ఎత్తైన కాండంతో ఉన్నాయి. ఈ స్తంభాలు లోహంతో చేసినట్లు నిగనిగలాడుతూ మెరుస్తున్నాయి. ఈ స్తంభాల పైన శీర్షిక అధోముఖ పద్మము, దానిపైన ఫలకము మీద జంతువు లేదా జంతు సముహాల శిల్పం ఉన్నాయి. అశోకుని స్తంభాలలో రాంపూర్వా, బఖీరా, లారియ నందనగర్, రుమ్మండై, సాంచి, సారనాధ్ స్తంభాలు ముఖ్యమైనవి. బఖీరాలోని స్తంభం పై పరిపూర్ణ దశకు చెందిన కాండం,చతురస్రాకార ఫలకము, సింహపు శిల్పం ఉన్నాయి. రాంపూర్వ స్తంభంపై వృషభశిల్పం, లారియ నందనగర్ స్తంభంపై సింహంశిల్పం ఉన్నాయి. సారనాధ్లో గల స్తంభంపైన గల ఫలకంపై నాలుగు వైపుల నాలుగు జంతువుల శిల్పాలు చెక్కిబడి ఉన్నాయి. ఫలకం పై నున్న జంతువుల మధ్య అశోకచక్రమున్నది. పై భాగాన నాలుగు సింహల శిల్పమున్నది. ఈ స్తంభాల నిర్మాణంపై పారశీకుల శిల్ప ప్రభావం కలదని విన్సెంట్స్మిత్ అభిప్రాయము.

## BIBLIOGRAPHY


1. Majumdar. R.C. (ed) : The Age of Imperial Unity Bombay 1980.

2. Majumdar. R.C., H.C. Rayach raychaudhuri and Kalinkar Datta : An Advanced History of India London 1960

3. Mukherji. R.K., : Asoka, Delhi 1962

4. Mukherji. R.K., : Chandragupta Maurya and His Times Delhi 1960.

5. Narain .A.K. : The Indo - Greeks,. Oxford 1962

6. Nikam. N. A and Richcrd Mckegn : The Edicts of Asoka Bombay 1962.

7. Nilakantha Sastry .K.A : Age of the Nandas and Mauryas, Delhi 1988

8. Ojha. K.C. : The History of Foreign Rule in Ancient India Allahabad. 1968.

9. Pargiter .F,E : The purana Text of the Dynasties of the Kali Age (with introduction and Notes) ; Varanasi. 1962 (Raprint)

10. Ray . N.R : Maurya and Sunga Art, Calcutta.1945.

11. Sircar. D.C : Some preoblems concerning the Kushanas. Dharward. 1971.

12. Sircar. D.C : Inscriptions of Asoka New Delhi 1998

13. సుబ్రహమణ్యం. రాయప్రోలు : అశోకుని ఎఱ్ఱగుడి శిలా శాసనములు, హైదరాబాద్. 1975

14. థాపర్ రోమిల్లా : అశోకుడు మౌర్యవంశక్షీణత (Tr,) B.S.L. హనుమంతురావు, హైదరాబాద్ 1989

15. Tripati, R.S : History of Ancient India, Delhi, 1960.

16. Woolner : Alfred : Asoka Text and Glossary, Delhi. 1993. (Reprint).

## 12.10 సారాంశం :

## 12.11 మాదిరి ప్రశ్నలు :

1. చక్రవర్తి యొక్కస్థానం, అధికారుల గూర్చి వివరింపుము ?
2. చక్రవర్తి యొక్క పాలనా వ్యవస్థ గూర్చి వివరింపుము ?
3. సైనిక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ గూర్చి వ్రాయుము ?
4. మౌర్య యుగ సాంఘీక, ఆర్థిక సాంస్కృతిక పరిస్థితులను గూర్చి వ్రాయుము ?

## సంక్షిప్త ప్రశ్నలు

1. సమర్థవంతమైన పరిపాలనకు రాజు అనుసరించవలసిన మూడు పద్ధతుల గూర్చి వ్రాయుము ?
2. ఆదాయ వ్యయాలు గూర్చి వ్రాయుము ?
3. వాణిజ్యాభివృద్ధి ఆర్థిక వికాసానికి ఎలా తోడ్పడింది. ?
4. మౌర్య యుగంలో ప్రధాన మతాలు గూర్చి వ్రాయుము ?
5. వాస్తు శిల్పాలను వివరింపుము ?
6. భాషా సారస్వత రంగాలలో మౌర్యయుగం సాధించిన పురోగతిని వివరింపుము ?

# పాఠం : 13

# స్వదేశీవిదేశీ రాజవంశాలు

## 13.0 లక్ష్యం :

మౌర్య సామ్రాజ్య పతనానంతరం ఉత్తర భారతావనిని స్వదేశ, విదేశ రాజవంశాలు పరిపాలిచాయి. శుంగవంశము, కాణ్వవంశము, మొదలగు స్వదేశరాజులు విదేశరాజవంశీయులైన ఇండోగ్రీకులు, శకులు, కుషాణులు వరుసక్రమంల ముఖ్యపాత్రను పోషించారు. వీరికాలంలో జరిగిన రాజకీయ, సాంఘీక, సామాజిక, మత విషయాలకు వివరించడమే ఈ పాఠం ముఖ్యలక్ష్యం.

## విషయక్రమం :


13.1 ఉపోద్ఘాతము

13.2 శుంగవంశము

13.3 కాణ్వవంశం

13.4 విదేశీరాజవంశాలు

13.5 శకులు

13.6 ఇండోపార్థియన్లు (పహ్లావులు)

13.7 కుషాణులు

13.8 సారాంశం


## 13.1 ఉపోద్ఘాతము :

మౌర్య సామ్రాజ్యము పతనమైన తరువాత క్రీ. శ. 4వ శతాబ్దములో గుప్తులు ఉత్తర భారతదేశములో తమ సామ్రాజ్యాన్ని స్థాపించేంతవరకు దాదాపు ఐదు శతాబ్దాలకాలం ఉత్తర భారతదేశాన్ని సమైక్యం చేసి సామ్రాజ్యాన్ని ఏర్పరచగల రాజవంశము ఆవిర్భవించలేదు. ఈ ఐదు శతాబ్దాల కాలంలో ఉత్తర భారతదేశం అనేక చిన్న చిన్న వంశాల పాలనను అనుభవించింది. ఇదే సమయంలో భారతదేశం ఇండోగ్రీకులు, పార్థియనులు, శకులు, కుషాణుల వంటి విదేశీయుల దాడులకు గురైనది. ఈ విదేశీ జాతులవారు వాయవ్య భారతదేశంలోను ఉత్తర భారతదేశంలోను రాజ్యాధికారాన్ని స్థాపించి, కాలక్రమేణా బౌద్ధ, హిందూ మతాలను స్వీకరించి స్థానిక రాజవంశాలతో వివాహ సంబంధాలను ఏర్పరచుకొని భారత సమాజంలో కలసిపోయి భారతీయ సంస్కృతిని సుసంపన్నం చేశారు. స్వదేశీ వంశాలలో మౌర్యులు తరువాత మగధలో రాజ్యాధికారం చేపట్టిన శుంగవంశం విదేశీదాడులను ఎదుర్కొనుటలో విజయం సాధించింది.

## 13.2 శుంగవంశము

దుర్బలుడైన చివరి మౌర్యచక్రవర్తి బృహద్రధుడిని అతని సేనాధిపతి పుష్యమిత్రుడు సైనిక పర్యవేక్షణ సందర్భములో వదిలించినట్లు మహాకవి బాణుడు రచించిన హర్షచరిత్ర వర్ణిస్తున్నది. పురాణాలు పుష్యమిత్రుడిని శుంగవంశానికి చెందినవాడని చెబుతున్నాయి. పాణిని తన 'అష్టాధ్యాయి'లో శుంగులు భారద్వాజగోత్ర బ్రాహ్మణులని పేర్కొన్నాడు. శుంగవంశస్థులు పాటలీపుత్రం రాజధానిగ క్రీ.

పూ. 185-నుండి 75 వరకు పరిపాలించారు. పురాణాలు శుంగులు 10 మంది రాజులని వారు 112 సంవత్సరాలు పరిపాలించినట్లు వివరిస్తున్నాయి.

## 13.2 పుష్యమిత్రుడు :

శుంగవంశ స్థాపకుడైన పుష్యమిత్రుడు శుంగరాజులందరిలో సుప్రసిద్ధుడు. ఇతడు క్రీ. పూ. 185 నుండి, క్రీ. పూ 148 వరకు 36 సంవత్సరాలు పరిపాలించాడు. సింహాసనమధిష్టించిన వెంటనే పతనావస్థలో ఉన్న మగధరాజ్యానికి పూర్వ వైభవాన్ని సమకూర్చుటకు పుష్యమిత్రుడు ఉపక్రమించాడు. కళింగులు, ఆంధ్రులు, మహారాష్ట్రులు, ఇతర సరిహద్దు ప్రాంతాలరాష్ట్రాలు స్వాతంత్ర్యం ప్రకటించినందున మగధరాజ్యం బలహీనపడింది.. ఇటువంటి స్థితిలో మగధరాజ్య పటిష్టతకు పుష్యమిత్రుడు కృషిచేశాడు. మొదట ప్రాచి, అకర, వత్స, అవంతి, కోసల ప్రాంతాలను జయించాడు. తరువాత రాజ్యంలో శాంతిభద్రతలు నెలకొల్పాడు. రాజ్యరాజధాని నగరానికి అవంతివంటి రాష్ట్రాలు దూరంగా ఉన్నందున వాటిని అదుపులో ఉంచటానికి విదిశ నగరాన్ని రెండవ రాజధానిగా చేసి అక్కడ తన కుమారుడైన అగ్నిమిత్రుడ్ని తన ప్రతినిధిగా నియమించాడు.

**13.2.1.1** విదర్భ ఆక్రమణ : పుష్యమిత్రుడి సామ్రాజ్య విస్తరణ సందర్భంగా విదర్భ రాజ్యంతో వైరం ఏర్పడింది. మౌర్యుల కాలంలో మగధ సామ్రాజ్యాంతర్భాగమైన విదర్భలో మౌర్య రాజ్య పతనాన్ని అరాచక పరిస్థితులను అవకాశంగా తీసుకొని యజ్ఞసేనుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నాడు. కాళిదాసు రచించిన మౌళికాగ్ని మిత్రం నాటకం వలన విదర్భరాకుమార్తె, మాళవిక, విదిశలో రాజప్రతినిధిగ ఉన్న అగ్నిమిత్రుల ప్రణయ కథ తెలుస్తున్నది. ఈ నాటకం వలన అగ్నిమిత్రుడు యజ్ఞసేనుని బంధువైన మాధవసేనుని సహాయంతో విదర్భను జయించినట్లు తెలుస్తుంది. ఈ విజయం తరువాత విదర్భను రెండుగా విభజించి ఒక భాగముపై యజ్ఞసేనుడిని, రెండవ భాగముపై మాధవసేనుడ్ని పాలకులుగా నియమించి విదర్భరాజ్యాన్ని మగధరాజ్యంలో పుష్యమిత్రుడు కలిపివేసుకున్నాడు.

**13.2.1.2** యవనుల దండయాత్ర : పుష్యమిత్రుని పరిపాలనా కాలంలో జరిగిన ముఖ్యసంఘటన భారతదేశంపై రెండుసార్లు జరిగిన యవనుల దండయాత్ర. యవనుల దండయాత్రను పుష్యమిత్రుడు విజయవంతంగా ఎదుర్కొన్నట్లు పతంజలి రచించిన మహాభాష్యం, గార్గి 'సంహిత,' మాళికాగ్నిమిత్రనాటకము ధృవపరుస్తున్నాయి. మౌర్య సామ్రాజ్యపతనం తరువాత భారతదేశంలోని అరాజక పరిస్థితులను అవకాశంగా తీసుకొన్న బాక్ట్రియన్ గ్రీకులు వాయవ్య భారతదేశంలోని ప్రాంతాలలో రాజ్యాన్ని స్థాపించారు. వీరిని భారతీయ సాహిత్యం యవనులని వ్యవహరిస్తుంది. అక్కడినుండి భారతదేశంలో తమ రాజ్య విస్తరణకు ప్రత్నించారు. మొదటి బాక్ట్రియన్ గ్రీకుల దండయాత్ర డెమిట్రియస్ ఆధ్వరంలో జరిగింది. అయోధ్య, మధుర, పాంచాల ప్రాంతాలను జయించి పాటలీపుత్రంపై దండెత్తివచ్చిన పుష్యమిత్రుడు డెమిట్రియస్‌ను ఓడించిపారద్రోలాడు. రెండవసారి మినాండర్ ఆధ్వర్యంలో జరిగిన యవన దండయాత్రను పుష్యమిత్రుని మనుమడైన వసుమిత్రుడు ఎదుర్కొని సింధునదీ తీరాన జరిగిన భీకర యుద్ధంలో యవనులను ఓడించినట్లు మాళవికాగ్నిమిత్రం తెలియజేస్తున్నది.

హతిగుంఫా శాసనంలో ఖారవేలుడు తాను రెండుసార్లు మగధపై దండెత్తి రాజైన బహసతిమిత్రుడ్ని ఓడించి మగధ రాజ్యాన్ని కొల్లగొట్టినట్లు చెప్పుకున్నాడు. ఈ శాసనంలో పేర్కొన్న బహసతిమిత్రుడు పుష్యమిత్రశుంగుడని స్మిత్ మొదలగు చరిత్రకారులు అభిప్రాయం. కాని ప్రాకృతంలోని బహసతిమిత్ర సంస్కృతీకరణలో బృహస్పతిమిత్ర అవుతుందే కాని పుష్యమిత్రకాదు. అందువలన స్మిత్ అభిప్రాయాన్ని చాలామంది చరిత్రకారులు వ్యతిరేకిస్తున్నారు.

విధర్భ ఆక్రమణ, యవనులపై విజయం సాధించిన తరువాత పుష్యమిత్రుడు తన విజయాలకు సూచనగా రెండు అశ్వమేధ యజ్ఞాలను చేశాడు. ధనదేవుని అయోధ్య శాసనం పుష్యమిత్రుడు రెండు అశ్వమేధ యాగాలు చేసినట్లు ధృవపరుస్తున్నది. ఈ యజ్ఞాలుచేసి పుష్యమిత్రుడు చక్రవర్తి బిరుదును ధరించాడు.

పుష్యమిత్రుని విజయాలవలన శుంగరాజ్యం పశ్చిమాన సింధునుండి తూర్పున బెంగాల్ వరకు దక్షిణాన నర్మదా వరకు విస్తరించింది.

**13.2.2 పుష్యమిత్రశుంగుని అనంతర రాజులు :** క్రీ. పూ. 148సం॥ ప్రాంతంలో పుష్యమిత్రుడు మరణించిన తరువాత అతని కుమారుడు అగ్నిమిత్రుడు రాజైనాడు. ఇతడు ఎనిమిది సంవత్సరాలు పరిపాలించాడు. విదిశలో రాజప్రతినిధిగా చాలాకాలం పనిచేసి పాలనానుభవం సంపాదించాడు. కాళిదాసుని సంస్కృత నాటకమైన మాళవికాగ్నిమిత్రము కథానాయకుడితడే. ఇతని తరువాత ఇతని కుమారుడు వసుజ్యేష్టుడను రాజు ఏడు సంవత్సరాలు మగధను పరిపాలించాడు. ఆ తరువాత వరుసగా వసుమిత్రుడి (10సం॥) అంధ్రక (2సంవత్సరాలు, ఇతడినే కొన్ని పురాణాలు అంతక అని, భద్రక అని, ఆర్ధక అని పేర్కొన్నాయి.) పుళింకుడు (3సం।) ఘోష (3సం॥) వజ్రమిత్ర లేదా విజయమిత్ర (9సం॥) భాగవతుడు (32సం॥) దేవభూమి లేదా దేవభూతి (10 సం॥లు) మగధరాజ్యాన్ని పాలించారు. కాని వీరిలో ఎవరు కూడ మగధరాజ్య వ్యాప్తికిగాని, తమ రాజ్యాన్ని సమర్ధవంతంగా కాపాడుకోవటానికి గాని ప్రయత్నించలేదు. వాస్తవానికి అగ్నిమిత్రుని మరణంతోనే శుంగరాజ్య పతనం ప్రారంభమైనది. భిల్సాలోని బెస్‌నగర్ శాసనంలో తక్షశిల వాస్తవ్యుడైన హిలియోడోరస్ అను యవనరాయబారి ఆంటియోల్కిడస్ తరపున భాగభద్రకాశీపుత్ర ఆస్థానానికి గ్రీకురాజైన అతని 14వ పాలనా సంవత్సరంలో వచ్చినట్లు, మరొక గరుడధ్వజ శాసనంలో భాగవతరాజు పన్నెండవ రాజ్యపాలనా సంవత్సరంలో హెలియోడోరస్ వాసుదేవునిమీద భక్తితో గరుడస్తంభాన్ని ప్రతిష్ఠించినట్లు ఉన్నది. ఈ రెండు శాసనాలలో పేర్కొన్న రాజు శుంగులలో తొమ్మిదవ రాజైన భాగవతుడిగా చరిత్రకారులు నిర్ధారించారు. ఈ వంశంలో చివరిరాజైన దేవభూతిని అతని మంత్రి వాసుదేవుడు క్రీ. పూ,75 సం॥లో చంపి శుంగుల పాలనను అంతం చేసి మగధలో కాణ్వవంశ పాలనను ప్రారంభించాడు.

మౌర్య వంశ పతనం తరువాత భారతదేశ సాహిత్య కళాభివృద్ధికి శుంగులు గణనీయమైన కృషిచేశారు. శుంగులు భారతదేశంపై దండెత్తి వచ్చిన యవనుల దండయాత్రను సమర్ధవంతంగా ఎదుర్కొని దేశాన్ని విదేశీ దాడులనుండి రక్షించారు. విదేశీ దండయాత్రను అరికట్టి దేశ సమగ్రతను స్వాతంత్ర్యాన్ని కాపాడారు. దీనికి మించి సాంస్కృతికరంగ పురోభివృద్ధికి ఎనలేని సేవచేశారు. మతంలోను, వాస్తుశిల్పంలోను, సాహిత్యంలోను, శుంగ వంశరాజులు నూతనమైన మార్పులు రావటానికి దోహదపడ్డారు. గుప్తులకాలంనాటి సాంస్కృతికాభ్యుదయానికి శుంగులు పునాది వేశారు.

**13.2.3 మతము :** శుంగవంశ రాజులందరు వైదిక మతాభిమానులే. అంతకు పూర్వం మౌర్యులకాలంలో విశేష ఆదరణపొంది ఇంచుమించు రాజ్యమతంగా దేశమంతా వ్యాప్తిచెందిన బౌద్ధమతం స్థానంలో బ్రాహ్మణమతోద్ధరణకు శుంగులు పాటుపడ్డారు. మౌర్యుల బౌద్ధమత అదరణకు వ్యతిరేకంగా పుష్యమిత్రుడు తిరుగుబాటు చేశాడనే భావనను కొందరు చరిత్రకారులు ప్రకటించడం గమనార్హం. శుంగుల కృషివలన ప్రజల మతవిశ్వాసాలలోఎన్నో మార్పులు వచ్చాయి. ప్రజలు కార్తికేయుడు మొదలగు దేవతల విగ్రహాలను పూజించడం ప్రారంభించారు. శుంగులు ప్రారంభించిన వైదిక మతోద్ధరణ గుప్తులకాలంనాటికి పరాకాష్టనందుకొన్నది. పుష్యమిత్రుడు రెండు అశ్వమేధ యజ్ఞాలను చేసి వైదిక మతంపట్ల తనకున్న గాఢాభిమానాన్ని చాటుకున్నాడు. అయినప్పటకి శుంగులు పరమతద్వేషాన్ని ప్రదర్శించలేదు. వీరు అనుసరించిన మతసహన విధాన ఫలితంగా సాంచీ, బార్హూత్‌లలోని బౌద్ధస్తూప, విహారాలకు శిలాతోరణాలు, ప్రాకారాలు నిర్మించబడ్డాయి.

**13.2.4 సాహిత్య పోషణ :** సాహిత్యరంగంలో కూడ శుంగుల పాత్ర శ్లాఘనీయమైనది. శుంగవంశరాజులు సాహిత్య, విద్యారంగాభివృద్ధికి తమ వంతుపాత్రను నిర్వహించారు. శుంగుల పాలనలోనే ప్రసిద్ధ సంస్కృత వ్యాకరణ పండితుడు పతంజలి, పాణిని రచించిన 'అష్టాధ్యాయి'కి వ్యాఖ్యాన గ్రంథమైన 'మహాభాష్యాన్ని' రచించాడు. శుంగుల పోషణలో సంస్కృత సాహిత్యం పునరుజ్జీవనం పొందింది. మనుస్మృతి శుంగుల కాలంలోనే గ్రంథస్తం చేయబడిందని విమర్శకుల అభిప్రాయం, మహాభారత, రామాయణాల మూలభాగాలు శుంగుల కాలంలోనే రూపొందాయని కొందరు పండితుల అభిప్రాయం. వాత్సాయనుని కామసూత్రం కూడ వీరిపాలనా కాలంలోనే రచించబడింది.

**13.2.5 వాస్తు శిల్పాలు :** శుంగుల కాలంలో వాస్తు, శిల్ప, చిత్ర లేఖనాలలో నూతన శైలి ఆవిర్భవించింది. మౌర్యుల కాలంలోని శిల్పకళ విదేశీ వాస్తు ప్రభావంతో రూపొందగా శుంగులకాంలంలో శిల్పకళ స్వదేశీయశైలితో అభివృద్ధి చెందింది. శుంగులు అందమైన పెద్ద పెద్ద రాజభవనాలను పాటలీపుత్రం, వైశాలి, మధుర, కౌశాంబి, హస్తినాపురం, తక్షశిల మొదలైన చోట్ల నిర్మించారు. అశోకుడు బార్హుత్‌వద్ద నిర్మించిన స్తూపంచుట్టూ నాలుగు ద్వారాలు కలిగిన శిల్ప సమన్వితమైన 2.13 మీటర్ల ఎత్తైన శిలాప్రాకారాన్ని బార్హుత్, సాంచి, బుద్ధగయలు శుంగుల కాలంనాటి వాస్తుశిల్పకళ కేంద్రాలు శుంగుల కాలంలోనే నిర్మించారు. ఈ ప్రాకారాలపై తలాఫలకాలైన, స్తూప వేది విహారాలలో 20 బుద్ధుని జాతక కథలు, బుద్ధుడిని దర్శించుటకు ప్రసేనజిత్తు, వెళ్తున్న దృశ్యం, అజాతశత్రువు బుద్ధుడివద్దకు వెళ్తున్న చారిత్రక దృశ్యాలు ఆరు, యక్షి యక్షిణీదేవతలు, నాగరాజు నాగశిల్పాలు, మానవ శిల్పాలు, జంతువుల శిల్పాలు, బౌద్ధమత ఆరాధనా వస్తువులైన, స్తూపం, ధర్మచక్రం, బోధివృక్షం, బుద్ధుని పాదాలు, త్రిరత్న చిహ్నం మొదలయిన శిల్పాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. శిల్ప కళారీతిలో తొలిసారిగా శుంగకాలపు శిల్పులు కథావివరణ శిల్పాలను (Narrative sculpture) ప్రవేశ పెట్టారు. ఈ శిల్ప ఫలకాలక్రింద శిల్పాల పేర్లు బ్రాహ్మీలిపిలో చెక్కారు.

సాంచీలోని బౌద్ధ నిర్మాణాలకు కూడ శుంగుల కాలంలో మరమ్మత్తులు చేపట్టటమేగాక మరికొన్ని నూతన నిర్మాణాలను, వాటికి అనుబంధంగా నిర్మించారు. అశోకుని కాలంలో ఇటుకలతో నిర్మించిన స్తూపానికి శుంగుల కాలంలో శిలాఫలకాలను అమర్చి స్తూపం ఎత్తును 16.5 మీటర్లకు, వ్యాసాన్ని 36 మీటర్లకు పెంచినందున ఈ స్తూపం రెండింతలు విస్తరించింది. స్తూపంపైన అండం, ఛత్రం, హర్మిక, వేదిక, సోపానాలను శుంగుల కాలంలోనే నిర్మించారు. వీటన్నింటికంటే స్తూపానికి ఏర్పాటు చేసిన అద్భుత శిల్పసమన్వితమైన శిలాతోరణాలు ప్రపంచ ప్రసిద్ధమైనవి.

బుద్ధగయలోను శుంగులకాలంనాటి శిల్పాలున్నాయి. భాజాలోని చైత్యగృహంకూడా శుంగులకాలానికి చెందినదే. శుంగులకాలంలో చిత్రాలను చరణచిత్రాలని వ్యవహరించేవారు. వస్త్రాలపై బుద్ధుని జీవితఘట్టాలు చిత్రించేవారు.

మొత్తం మీద మౌర్యుల వాస్తుశిల్ప కళారీతికి భిన్నమైన పద్ధతిని శుంగులు అనుసరించారు. మౌర్యుల కాలంలో వాస్తులో వారు ఎక్కువగా ఉపయోగించిన దారువు, ఇటుకలకు బదులు శుంగకాలపు శిల్పులు శిలను ఉపయోగించారు. మౌర్యయుగంలో మౌర్యచక్రవర్తుల పోషణలో వాస్తు శిల్ప కళ అభివృద్ధి చెందగా శుంగుల కాలంలో బౌద్ధ సంఘం, భూస్వాములు, ధనికులు, వ్యాపారులు, సామాన్యప్రజలచేత శిల్పకళ పోషణనందుకొంది. విదేశీప్రభావం వలన మౌర్య శిల్ప కళలో పరిణితి కనిపిస్తుండగా దేశీయ శిల్పరీతి ప్రారంభదశ కావడంచేత శుంగుల శిల్పంలో పరిపక్వత కనిపించదు.

**13.2.6 ముగింపు :** ఈవిధంగా శుంగులకాలంలో మత, సాహిత్య, వాస్తు, శిల్పకళల్లో వచ్చిన నూతన పోకడల వలన శుంగుల పాలనకు ప్రత్యేకమైన స్థానం భారతదేశచరిత్రలో దక్కినది. ఈరంగాలలో శుంగుల సాగించిన ఆదరణమూలంగా మౌర్యయుగానికి గుప్తయుగానికి మధ్య భారతీయ సంస్కృతికి వారధిగా శుంగయుగాన్ని చరిత్రకారులు వర్ణిస్తున్నారు.

## 13.3 కాణ్వ వంశం

బాణుని హర్షచరిత్ర అందిస్తున్న ఆధారాల ప్రకారం శుంగవంశరాజులలో చివరివాడైన దేవభూతిని అతని మంత్రి వాసుదేవుడు చంపి మగధలో రాజ్యాధికారం చేపట్టాడు. వాసుదేవుడు సింహాసనమధిష్టించడంతో మగధలో కాణ్వవంశపాలన ప్రారంభమైనది. వాసుదేవుని గోత్రనామమైన కాణ్వాయన పేరుమీదగా ఈ వంశానికి కాణ్వవంశమనే పేరువచ్చింది. కాణ్వవంశరాజులు నలుగురు 45 సంవత్సరాలు మగధరాజ్యాన్ని పరిపాలించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. వీరు క్రీ.పూ. 75 నుండి క్రీ. పూ. 30 వరకు పరిపాలించారు. కాణ్వుల గురించిన సమగ్రమైన చరిత్ర లభించడంలేదు. పురాణాలు పేర్కొన్న వివరాల ప్రకారం వాసుదేవుడు 9 సంవత్సరాలు, అతని తరువాత భూమిమిత్ర 14 సం॥లు, నారాయణ 12 సం॥లు, సుశర్మ 10 సంవత్సరాలు పరిపాలించినట్లు తెలుస్తున్నది. కాణ్వులందరు వైదిక

మతాన్ని అనుసరించారు. కాణ్వుల పాలనలో మగధరాజ్యవైభవం పూర్తిగా క్షీణించింది. వీరి పాలనాధికారం కేవలం పాటలీపుత్ర పరిసర ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యింది. కాణ్వవంశంలో చివరి రాజైన సుశర్మను చంపి శాతవాహన రాజైన సీముకుడు మగధను ఆక్రమించినట్లు పురాణాలు వర్ణిస్తున్నాయి.

## 13.4 విదేశీ రాజవంశాలు

మౌర్య సామ్రాజ్యం పతనమయిన తరువాత ఉత్తర భారతదేశంలో శుంగులు, దక్షిణభారతదేశాన్ని శాతవాహన వంశము పరిపాలిస్తున్న కాలంలో పంజాబ్, సింధు తదితర వాయవ్య భారత సరిహద్దు రాజ్యాలపై విదేశీ అనాగరక సంచార జాతులవారు దండయాత్రలుచేసి ఆరాజ్యాలను జయించి స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. ఈవిధముగా దండెత్తి వచ్చిన వారిలో మొదటి వారు ఇండో-బాక్ట్రియన్‌లు లేదా ఇండోగ్రీకులు, పురాణులు వీరినే యవనులని పేర్కోన్నాయి. బాక్ట్రియన్ గ్రీకుల తరువాత శకులు(సిధియనులు), పార్థియనులు (పవులు) దండెత్తి వచ్చారు. వీరి తరువాత చైనాప్రాంతమునుండి వచ్చిన వారు కుషాణులు. ఈ విదేశీజాతులవారు దాదాపు నాలుగు శతాబ్దాల కాలం వాయవ్య భారతదేశంలో సాగించిన పాలన ఫలితంగా విదేశీ సంస్కృతీ సంప్రదాయాలు కొన్ని భారత సమాజంలో ప్రవేశించినందున భారతీయ సంస్కృతి సుసంపన్నమయింది. అంతేకాకుండా వీరి పాలనలో చైనా, మధ్య ఆసియాలోని రాజ్యలతో సన్నిహిత సంబంధాలు ఏర్పడడం వలన భారతదేశ చరిత్ర ఆసియా చరిత్రలో అంతర్భాగమయింది.

**13.4.1 ఇండో - గ్రీకులు :** ఉత్తర ఆఫ్ఘనిస్తాన్‌లో హిందూకుష్ పర్వతాలకు ఆక్సస్ నదికి మధ్య ఉన్న ప్రాంతమే బాక్ట్రియా. ఈ ప్రాంతాన్ని పురాణాలు బాహ్లికదేశంగా వ్యవహరించాయి. అలెగ్జాండరు మరణం తరువాత సెల్యూకస్ నికెటార్ పశ్చిమాన మెడిటరేనియన్ సముద్రం నుండి తూర్పున బాక్ట్రియా, పార్థియాల వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేశాడు. ఫలితంగా బాక్ట్రియా సెల్యూకిడ్ సామ్రాజ్యంలో ఒక రాష్ట్రమై అక్కడ గ్రీకు పాలన ప్రారంభమైనది. రెండవ ఆంటియోకస్ పాలనలో బాక్ట్రియాలోని గ్రీకులు డియోడోటస్ నాయకత్వంలో క్రీ. పూ. 250 లో తిరుగుబాటు చేసి స్వాతంత్రాన్ని ప్రకటించుకొన్నారు. తరువాత రెండవ సెల్యూకస్, తరువాత అతని వారసుడు మూడవ ఆంటియోకస్‌లు బాక్ట్రియాను తిరిగి స్వాధీనం చేసుకొనుట చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రోమన్ల దండయాత్రలో మూడవ ఆంటియోకస్ ఘోరపరాజయం పొందటంతో బాక్ట్రియా స్వాతంత్ర్యానికి ఎటువంటి ఆటంకం లేకపోయింది.

**13.4.1.1 డియోడోటస్ :** రెండవ ఆంటియోకస్ రాజ్యంలో బాక్ట్రియాకు గవర్నరుగా జీవితాన్ని ప్రారంభించిన డియోడోటస్ క్రీ.పూ. 250లో తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యం ప్రకటించుకొని బాక్ట్రియాపైనే కాక పరిసర ప్రాంతాలపై కూడా తన రాజ్యాధికారాన్ని స్థాపించాడు. ఇతని రాజ్యం దాదాపుగా తూర్పున సోగ్దియా (Sogdia) పడమర మార్జియానా (Margiana) వరకు విస్తరించింది. మొదటి డియోడోటస్ మరణించిన తరువాత బాలుడైన అతని కుమారుడు రెండవ డియోడోటస్ కొంతకాలం రాజ్యమేలినాడు. ఆ తరువాత సేనాని యూథిడెమస్ రెండవ డియోడోటస్‌ను చంపి బాక్ట్రియా సింహాసనమాక్రమించాడు.

**13.4.1.2 యూథిడెమస్:** క్రీ.పూ. 208 లో మూడవ ఆంటియోకస్ బాక్ట్రియాను జయించుటకు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. దాదాపు రెండుసంవత్సరాలు యుద్ధంజరిగినా బాక్ట్రియా అతనికి స్వాధీనం కాలేదు. విసిగిపోయిన ఆంటియోకస్ యూథిడెమస్‌తో సంధిచేసుకొని తన కుమార్తెను యూథిడెమస్ కుమారుడైన డెమిత్రియస్‌కు ఇచ్చి వివాహం చేశాడు. ఈ సంధి జరిగిన తరువాత మూడవ ఆంటియోకస్ భారతదేశంపై దాడి చేశాడు. ఆసమయంలో గాంధార ప్రాంతాన్ని మౌర్య వంశానికి చెందిన సుభగసేనుడు పరిపాలిస్తున్నాడు. ఆంటియోకస్‌ను ఎదుర్కొనలేక సుభగసేనుడు అతనితో సంధిచేసుకొని ఏనుగులను కప్పంగా చెల్లించాడు. ఈ దండయాత్ర తరువాత బాక్ట్రియా పాలకుడైన యూథిడెమస్‌కు వాయవ్య భారతరాజ్యాల బలహీనతలు తెలిసివచ్చింది. అందువలన తన దృష్టి వాయవ్య భారతదేశంవైపు మరల్చాడు. సుభగసేనుడ్ని ఓడించి కాబూల్, కాందహార్‌లను ఆక్రమించాడు.

**13.4.1.3 డెమిత్రియస్ :** క్రీ.పూ. 180 లో యూథిడెమస్ మరణించిన తరవాత అతని కుమారుడు డెమిత్రియస్ బాక్ట్రియా పాలకుడైనాడు. డెమిత్రియస్ బాక్ట్రియన్ గ్రీకులలో సుప్రసిద్ధుడు. క్రీ.పూ 185 - 184 ప్రాంతంలో భారతదేశంపై దండెత్తాడు. డెమిత్రియస్ దండయాత్రను

పతంజలి 'మహాభాష్యం', గార్గి 'సంహిత' పేర్కొంటున్నాయి. ఈ దండయాత్రలో డెమిట్రిమస్ అయోధ్య, పాంచాల, సింధు, పంజాబ్ ప్రాంతాలను జయించాడు. ఆతరువాత పాటలీపుత్రంపై దండెత్తాడు. కాని పుష్యమిత్ర శుంగుడు డెమిట్రియస్‌ను ఓడించి తరిమివేశాడు. పుష్యమిత్రుని చేతిలో ఓడినప్పటికి డెమిట్రియస్ పంజాబ్, సింధు, సౌవీర ప్రాంతాలలో తన అధికారాన్ని స్థాపించాడు. భారతదేశంలో తాను జయించిన ప్రాంతానికి పంజాబ్‌లోని శాకలాను రాజధానిగా చేసుకొని దానికి తన తండ్రి జ్ఞాపకార్థం 'యూథిడెమియా' అని పేరు మార్చాడు. సౌవీరలోని ఒకనగరానికి 'దత్తమిత్ర' అని తన పేరును పెట్టాడు.

**13.4.1.4 యూక్రటైడిస్ తిరుగుబాటు :** డెమిట్రియస్ భారతదేశ దండయాత్రలలో ఉండగా బాక్ట్రియాలోని అతని సేనాని యూక్రటైడిస్ తిరుగుబాటు చేసి సింహాసనాన్ని ఆక్రమించారు. ఫలితంగా డెమిట్రియస్ బాక్ట్రియాను శాశ్వతంగా కోల్పోయి పంజాబ్‌లోనే స్థిరపడవలసి వచ్చింది. యూక్రటైడిస్ బాక్ట్రియాతో తృప్తిపడక దండెత్తి వచ్చి గాంధారను జయించి తక్షశిలను రాజధానిగ చేసుకున్నాడు. యూక్రటైడిస్ నాణేలు బాక్ట్రియా, కాబూల్, కపిస, గాంధారలలో లభించాయి. అయితే యూక్రటైడిస్ జీలం నదినిదాటి రాలేదు. అందువలన జీలం నదికి పడమరన యూక్రటైడిస్ రాజ్యం తూర్పున డెమిట్రియస్ రాజ్యము సింధు, పంజాబ్ ప్రాంతాలలో రెండు ఇండో-గ్రీకుల రాజ్యాల ఏర్పడ్డాయి.

**13.4.1.5 మీనాండర్ :** పార్థియనులు బాక్ట్రియారాజ్యాన్ని ఆక్రమించడంతో బాక్ట్రియన్ గ్రీకులు అధికారం ఆఫ్ఘనిస్తాన్, వాయువ్య భారతదేశానికి మాత్రమే పరిమితమయ్యింది. ఈ ప్రాంతాలలోని యూక్రటైడిస్ సంతతి డెమిట్రియస్ సంతతి నిరంతరం యుద్ధాలను కొనసాగించారు. నాణేలవలన డెమిట్రియస్, యూక్రటైడిస్ వారసులు మూప్ఫైమంది బాక్ట్రియన్ గ్రీకురాజులు రెండు వందల సంవత్సరాలు పరిపాలించినట్లు తెలుస్తున్నది. వీరందరిలో మినాండర్ సుప్రసిద్ధుడు. గ్రీకు, బౌద్ధ వాఙ్మయాలనుండి ఇతడి వివరాలు తెలుస్తున్నాయి. మినాండర్ కాబూల్ సమీపంలోని కలాసి గ్రామంలో జన్మించాడు. ఇతడు క్రీ. పూ. 160 నుండి 140 వరకు పరిపాలించాడు. ఇతని రాజధాని పంజాబ్‌లోని సాకలానగరం. స్ట్రాబోరచన ప్రకారం మినాండర్ అలెగ్జాండర్ కంటే ఎక్కువ రాజ్యాలను జయించినట్లు తెలుస్తున్నది. కథియావార్, బ్రోచ్, గంగా యమున మధ్యనున్న ప్రాంతాలను మినాండర్ జయించాడు. క్రీ. పూ. 148 ప్రాంతంలో ఇతడు పాటలీపుత్రంపై దండెత్తాడు. కాని మగధను పరిపాలిస్తున్న పుష్యమిత్రుని మనుమడైన వసుమిత్రుని చేతిలో పరాజయం పాలైనాడు. కాబూల్, సింధు, పంజాబ్, వాయువ్య సరిహద్దులు ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతాలు, కథియవార్‌లతో అతివిశాల సామ్రాజ్యాన్ని మినాండర్ పరిపాలించారు.

మినాండర్ నాణేలు కాబూల్‌నుండి ఘూజీపూర్ వరకు మధుర, బుందేల్‌ఖండ్ మధ్యప్రాంతాలలో లభించాయి. ఇతని నాణేలు లభించిన ప్రదేశాలు ఇతని సామ్రాజ్య విస్తృతిని సూచిస్తున్నాయి.

బౌద్ధ వాఙ్మయం మినాండర్‌ను 'మిళిందుడ'ని వ్యవహరిస్తున్నది. బౌద్ధ గ్రంధాలవలన మినాండర్ బౌద్ధమతాభిమాని అని తెలుస్తున్నది. ఇతని ఆస్థానంలో ఎంతోమంది బౌద్ధ పండితులు ఆదరణ పొందారు. వారిలో ప్రముఖుడు నాగసేనుడు. మినాండర్‌కు ఆచార్య నాగసేనునికి మధ్య బౌద్ధమత సిద్ధాంతాలపై జరిగిన చర్చ 'మిళిందపన్హా' అనే గ్రంధంగా రూపొంది తరువాత కాలములో బౌద్ధమత సిద్ధాంతానికి ప్రామాణిక గ్రంధంగా ఖ్యాతినిపొందింది.

**13.4.1.6 యూక్రటైడిస్ వారసులు :** మినాండర్ అనంతరం పరిపాలించిన యూథిడెమస్ వంశస్తుల వివరాలు తెలియటంలేదు. అయితే ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలోని యూక్రటైడిస్ వారసులలోని హెలియోక్లిస్, ఆంటియోల్కిడాన్ మొదలైనవారి వివరాలు తెలుస్తున్నాయి. హిలియోక్లిస్ పాలన చివరలో శకులు, పార్థియనులు బాక్ట్రియాను ఆక్రమించడంతో వారి అధికారం ఆఫ్ఘనిస్తాన్‌లోని కొన్ని ప్రాంతలకు మాత్రమే పరిమితమయ్యింది. వీరిలో ఆంటియోల్కడాన్ ప్రసిద్ధుడు. ఇతుడు మగధను పరిపాలిస్తున్న శుంగవంశరాజైన భాగవతుని ఆస్థానానికి తన రాయబారిగ హిలియోడోరస్ పంపాడు. హెలియోడోరస్ వాసుదేవుని భక్తుడు ఇతడు బిల్సా సమీపంలోని బెస్‌నగర్‌లోని దేవాలయంలో వాసుదేవుని మీద భక్తితో రెండు గరుడ ధ్వజస్తంభాలను ప్రతిష్టించి వాటిపై శాసనాలను చెక్కించాడు. ఈ శాసనాల వలన వాయవ్య భారతదేశంలో స్థిరపడిన ఇండో-గ్రీకులు వాసుదేవ భక్తిమార్గానికి మూలమైన వైష్ణవాన్ని స్వీకరించి హిందూ సమాజంలో విలీనం అవుతున్నట్లు తెలస్తున్నది.

## 13.5 శకులు

భారతదేశంలో శకుల అధికారాన్ని ప్రారంభించిన మొదటి శకరాజు మౌస్. ఇతడి నాణేలు స్వాట్‌లోయలోను, గాంధార ప్రాంతములోను ఎక్కువగా లభించాయి. ఈ నాణేలపై ఇతని పేరు ఖరోష్టిలిపిలో 'మోవగా'ను గ్రీకులిపిలో 'మౌస్'గాను వ్రాయబడింది. ఇతుడు క్రీ. పూ. 80 ప్రాంతాలలో పరిపాలించాడు. కొంతమంది చరిత్రకారులు ఇతని పాలనాకాలం క్రీ. పూ 20 నుండి క్రీ. శ. 22 వరకు అని అభిప్రాయ పడుతున్నారు. సిధియో-పార్థియన్ శకం 78 సం॥ నాటి తక్షశిల తామ్రశాసనం పేర్కొంటున్న 'మహారాజమోయ', మవుస్ ఒకరేనని చరిత్రకారుల అభిప్రాయం. ఇతడిదే మరొక ఖరోష్టీ శాసనం సాల్ట్ పర్వత ప్రాంతాలలోగల మైరావద్ద లభించింది. మవుస్ ఎన్నో రాగి, వెండి నాణేలను జారీచేశాడు. ఇతని 'మహారాజు మహాత్మ' అనే బిరుదు నాణేలపైన ఒకవైపున ఉన్నది. ఈ నాణేలపై ఒకవైపున రకరకాల గ్రీకుదేవతల ప్రతిమలు, కొన్నింటిపై శివుడు, మరికొన్నింటిపై బుద్ధుని ప్రతిమ ముద్రించబడ్డాయి. తక్షశిలలో లభించిన శాసనం ప్రకారం ఇతని పాలనా కాలంలో తక్షశిలలో బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు తెలుస్తున్నది.

మవుస్ తరువాత మొదటి అజస్ రాజైనాడు. ఇతడు తూర్పు పంజాబ్‌లోని హిప్పోస్ట్రాటస్ ( Hippostratos) రాజ్యాన్ని ఆక్రమించడం ద్వారా ఆ ప్రాంతంలోని గ్రీకుపాలనను అంతం చేశాడు. మొదట అజస్, అజిలిసెస్‌తో కలసి సంయుక్తంగా జారీచేసిన నాణేలు కొన్ని దొరికాయి. వీటిని బట్టి తరువాతి కాలంలో మొదట అజస్ అజలిసిస్‌తో కలిసి పాలన చేసినట్లు తెలుస్తున్నది. అజిలిసెస్ జారీచేసి ఒక నాణెంపై 'అభిషేక గజలక్ష్మి' ప్రతిమ కలదు. రెండవ అజస్ పాలనాకాలంలో భారతదేశ పశ్చిమ ప్రాంతంలోని శకుల ఆధీనంలోని ప్రాంతాలను పహ్లవులు ఆక్రమించారు.

మొదట పహ్లవుల దాడులవలన తరువాత కుషాణుల దండయాత్రవలన శకులు ఐదుశాఖలుగా విడిపోయి వారిలో ఒక శాఖ ఆఫ్ఘనిస్తాన్‌లో మిగిలిన నాలుగుశాఖలు భారతదేశంలోను స్థిరపడ్డారు. ఈ ఐదు శాఖల పాలకులు క్షాత్రపులని, మహాక్షాత్రపులని పిలువబడినారు.

**13.5.1 గాంధార క్షాత్రపులు :** లైక కుసులుక అనుశక రాజు చుక్షను పాలిస్తున్న క్షాత్రపుడని తక్షశిల తామ్రశాసనం వలన తెలుస్తున్నది. ఇతడు మవుస్ రాజ ప్రతినిధిగ ఉన్నట్లు ఈ శాసనం పేర్కొంటున్నది. ఇతని కాలానికే చెందినవి 68వ సంవత్సరంనాటి మన్‌షెహ్రా శాసనం. జెడాశాసనాలు, ఇతడు జారీచేసిన నాణేలు తక్షశిలలో లభించాయి. వీటిపై లైక కొజలో (Liaka Kozalao) అనే పేరు గ్రీకు భాషలోనున్నది. లైక కుసులుక తరువాత అతని కుమారుడు పటిక రాజైనాడు. కుజులువ పట్టికకు 'మహదానపతి,' 'జీవ (యవుగ)' అనే బిరుదులున్నాయి. శాసనాల వలన నాణేలవలన గ్రనహవ్యక క్షాతవుడు, తిరౌహరణక్షాత్రప, శివసేన జిహానిక, మొదలగు క్షాత్రపుల పేర్లు తెలుస్తున్నాయి.

**13.5.2 మధుర క్షాత్రపులు :** మధురలో బయల్పడిన సింహస్తంభకిరీట శాసనాలవలన మధురను పాలించిన శకక్షాత్రపుల వివరాలు తెలుస్తున్నాయి. వీటిలోని ప్రధానశాసనం మహాక్షాత్రప రాజులకు చెందింది. ఇతడు మోర బ్రాహ్మి శాసనాన్ని కూడ జారీచేశాడు. ఇతని నాణేలపై గ్రీకు భాషలో 'ఓబసి బౌస్లొస్టోరస్ రాజాబసిలై' అనే అతని బిరుదున్నది. ఈ నాణేలపై మరొకవైపున ఖరోష్టి లిపిలో అప్రతిహత చక్రసక్షత్రసన రాజావులస' అని ఉన్నది. ఇతనివే మరికొన్ని నాణేలపై 'మహాక్షాతపన రాజావులస' అనే ఖరోష్టి శాసన మాత్రమే ఉన్నవి కూడా లభించాయి.

రాజూల తరువాత అతని కుమారుడు సుదాస మధుర పాలకుడైనాడు. మధుర సింహకిరీట శాసనంలోను, జలిలో దొరికిన రెండు బ్రాహ్మి శాసనాలలో ఇతడు 'సామీ మహాక్షాత్రప సోమదాస' అని వర్ణించబడ్డాడు. మధురలోని కంకాళతిలలో లభించిన విక్రమశకం 72సం॥ నాటి శాసనంలో ఇతడు 'మహాక్షాత్రపశోదాస'గా పేర్కొనబడినాడు. శొదాస నాణేలపై లక్ష్మిప్రతిమ ఒకవైపు మరొకవైపు బ్రాహ్మిలిపి మాత్రమే ఉన్నవి. ఇతని పాలన మధుర పరిసరప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యింది. ఇతని తరువాత తోరనదాస, ఖరోష్ట, ఘతాక, హగాన, హగామష, శివఘోష, శివదత్త అనువారు మధురను పాలించారు. వీరి పేర్లను పరిశీలించినట్లయితే క్రమముగా శకక్షాత్రపులు

హిందూమత ప్రభావానికి లోనై హిందువుల పేర్లధరించి హిందూ కుటుంబాలతో వైవాహిక సంబంధాలు చేసుకొని హిందూ సమాజంలో కలిసిపోయినట్లు తెలుస్తుంది.

**13.5.3 మహారాష్ట్ర క్షాత్రపులు :** మహారాష్ట్ర క్షాత్రరాజ్యాన్ని స్థాపించినవారు క్షహరాటవంశస్తులు. భూమకుడు క్షహరాట వంశంలో మొదటివాడు. ఇతని నాణేలు గుజరాత్ తీర ప్రాంతంలోను, సౌరాష్ట్రలోను, మాళ్వ, అజ్మీర్‌లలో లభ్యమయ్యాయి. ఇతని నాణేలపై ఖరోష్టి, బ్రాహ్మీలిపులున్నాయి. ఇతని తరువాత రాజైన నహపాణుడు క్షహరాట వంశస్థుల్లో అగ్రగణ్యుడు. ఇతని గురించిన వివరాలు అతనినాణేల వలన శాసనాల వలన తెలుస్తున్నాయి. ఇతని నాణేలపై 'రాజన్' అనే బిరుదున్నది. ఇతడు శాతవాహనులను ఓడించి మహారాష్ట్ర ప్రాంతమంతా ఆక్రమించాడు. ఇతని అల్లుడూ, సైన్యాధిపతీ అయిన ఋషభదత్తుని శాసనాలవలన నహపాణుని రాజ్యంలో మహారాష్ట్రలో అధిక భాగము, ఉత్తరకొంకణం, కుకుర, తూర్పు మాళవ, పశ్చిమ మాళవ, అజ్మీర్ ప్రాంతాలుచేరి వున్నట్లు తెలుస్తున్నది. ఋషభదత్తుడు ప్రభాస, శూర్పారక, దశపురాది అనేక పుణ్య క్షేత్రాలను దర్శించి బ్రాహ్మణులకు, బౌద్ధులకు అనేక దానధర్మాలు చేశాడు. ఇతని భార్య దక్షమిత్ర. వీరి పేర్లనుబట్టి, వీరుచేసిన దానధర్మాల వలన క్రీస్తుశకం మొదటి శతాబ్దానికే శకులు హిందూమతం స్వీకరించి హిందూ సమాజంలో కలసిపోయారని స్పష్టమౌతున్నది. ఇతని తరువాత క్షహరాట వంశపాలకుల వివరాలు తెలియటం లేదు. గౌతమీపుత్ర శాతకర్ణి క్షహరాట వంశాన్ని నిరవశేషం గావించి వారి రాజ్యాన్ని ఆక్రమించినట్లు తెలుస్తున్నది.

**13.5.4 మాళవ క్షాత్రపులు :** గుజరాత్, సౌరాష్ట్ర ప్రాంతాలను శకులు ఆక్రమించిన తరువాత ఉజ్జయిని రాజధానిగా మాళవలో స్వతంత్ర క్షాత్రపరాజ్యం ఏర్పడింది. మాళవలో స్వతంత్రక్షాత్రప రాజ్యాన్ని స్థాపించిన వారు కార్దమక వంశస్తులు. ఈ వంశంలో మొదటివాడు యశమతిక. ఇతని కుమారుడు ఛస్తనుడు. ఇతడు క్రీ.శ. 78 నుండి 100 వరకు పరిపాలించాడు. కొందరు చరిత్రకారులు ఛస్తనుడు కనిష్కుని సామంతుడని భావిస్తున్నారు. ఇతడు తననాణేలపై గ్రీకు, ఖరోష్టి, బ్రాహ్మీలిపులను ఉపయోగించాడు. క్రీ.శ. 130 నాటి ఆందౌ తామ్ర శాసనం వలన చస్తనుడు చివరిపాలనా కాలంలో తన మనుమడైన రుద్రదామునితో కలిసి రాజ్యపాలన చేసినట్లు తెలుస్తున్నది. ఛస్తనుడు శాతవాహనరాజు పులోమావిని ఓడించి శాతవాహన సామ్రాజ్యంలోని, వాయవ్య, ఉత్తర ప్రాంతాలను ఆక్రమించాడు.

చస్తనుని తరువాత రాజైన రుద్రదాముడు కార్థమక వంశస్తులలో అగ్రగణ్యుడు. గిరినార్ శాసనం ద్వారా ఇతని చరిత్ర తెలుస్తున్నది రుద్రదాముడు శాతవాహనరాజు శాతకర్ణిని రెండు సార్లు ఓడించాడు. ఆ తరువాత తన కుమార్తె రుద్రదమనికను ఆతనికి ఇచ్చి వివాహం చేసాడు. ఇతడు అనూప, అనర్త, సౌరాష్ట్ర, స్వభ్ర, మరు, కచ్ఛ, సింధు, సౌవీర, కుకుర, అపరాంత, నిషాదరాజ్యాలను జయించారు. ఇతడు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పరిపాలించాడు. సౌరాష్ట్రంలో మౌర్యచంద్రగుప్తుడు నిర్మించిన సుదర్శన సరోవరాన్ని ప్రజలపై ఎటువంటి పన్నులు విధించక తన స్వంత ధనాన్ని ఖర్చుచేసి మరమత్తులు చేయించినట్లు గిరినార్ శాసనం పేర్కొంటున్నది.

~î¢î¥òx ` ¢" Œ¢î°H¥îr =^î°<£î¢î Q HI రుద్రసేన, సంఘదమన్, దమసేన్, యశోదమన్, విజయసేన, దమజదశ్రీIII రుద్రసేనII, విశ్వసింహ, భర్తృదమన్, విశ్వసేవ మొ॥ వారు క్రీ. శ 5వ శతాబ్దం వరకు ఉజ్జయినిని పాలించారు. కార్ధమకులలో చివరి రాజైన రుద్రసింహుడిని చంద్రగుప్త విక్రమాదిత్యుడు జయించడంతో కార్దమక వంశం అంతరించింది.

## 13.6 ఇండో-పార్థియన్లు లేదా పహ్లావులు:

సిరియా సామ్రాజ్యంలోని సామంత రాజ్యమైన పార్థియా క్రీ.పూ 248 నాటికి స్వాతంత్ర్య రాజ్యంగా ఏర్పడింది. అశోకుని తరువాత మౌర్య సామ్రాజ్య పతనాన్ని అవకాశంగా తీసుకొని బాక్ట్రియన్ గ్రీకులతోపాటు పార్థియన్లు కూడా వాయవ్య భారతదేశంపై దాడులు జరిపి క్రమేణ వాయవ్య భారతంలో రాజ్యాన్ని ఏర్పరచుకొన్నారు. పార్థియన్లనే పహ్లావులని కూడా వ్యవహరిస్తారు. ఇండో పార్థియన్ రాజులలో మొదటివాడు వోనోనీస్. ఇతడు ఎరియా, కాందహార్ (అరకోసియా), సియిస్తాన్ ప్రాంతాలను పరిపాలించాడు. ఇతని నాణేలు ఎక్కువగా కాందహార్, కాబూల్, ఘజనీలలో లభించాయి. ఇతని నాణేల పైనున్న గ్రీకు శాసనం 'బసిలియోస్ బసిలియన్

మోగ్లోవ్ వోనోనోయ్' అని ఖరోష్టిలిపిలో 'మహారాజాభ్రాత ధ్రమికసపలహోరస' లేదా శ్పలహోరపుత్రస ధ్రమియస్య స్పలగదమస' అని ఉన్నది. ఈ లఘుశాసనాలను బట్టి వోనోనీస్‌కు పరిపాలనలో 1. రాజుసోదరుడైన శ్పలహోర 2. శ్పలహోర పుత్రుడైన శ్పలగదమ అనేవారు సహాయపడినట్లు తెలుస్తున్నది. వోనోనీస్ తరువాత అతని సోదరుడైన శ్పలిరిసిస్ రాజయినాడు.

**13.6.1 గండోఫర్నీస్ :** పార్థియను రాజులలో అగ్రగణ్యుడు గండోఫర్నిస్. పెషావర్ జిల్లాలోని తఖై - ఇ - బాహి వద్ద లభించిన విక్రమశకం 103 వ సంవత్సరము నాటి శాసనంలో గండోఫర్నీస్ రాజ్యపాలనాకాలం 26వ సంవత్సరం పేర్కొనబడినందున ఇతడి పాలన క్రీ. శ. 19వ సంవత్సరంలో ప్రారంభమైట్లు తెలుస్తున్నది. గండోఫర్నిస్ శకులరాజధాని 'మిన్' నగరాన్ని, కాబూల్ ప్రాంతాన్ని జయించాడు. ఇతని పాలనాకాలంలోనే అపోస్టోలు సెయింట్ థామస్ గండోఫర్నీస్ ఆస్థానాన్ని దర్శించి రాజాదరణ పొందినట్లు, గండోఫర్నీస్ క్రైస్తవ మతాన్ని స్వీకరించినట్లు సిరియాదేశ క్రైస్తవ గ్రంథాలవలన తెలుసున్నది. ఇతని నాణేలు పంజాబ్, సింధు, కాందహార్, కాబూల్ ప్రాంతాలలో లభిస్తున్నాయి. ఇతడు కూడా తన పూర్వీకులవలే నాణేలపై గ్రీకు, ఖరోష్టిలిపులను ఉపయోగించాడు. గండోఫర్నీస్ తరువాత భారతదేశంలోని ఇండో-పార్థియన్ రాజ్యాన్ని కుషాణులు ఆక్రమించడంతో పార్థియన్ పాలన అంతమైనది.

## 13.7 కుషాణులు

భారతదేశ చరిత్రలో మౌర్యుల తరువాత ఉత్తర, వాయవ్యంలో విశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించినవారు కుషాణులు. వీరి చరిత్రను తెలుసుకొనుటకు తగినన్ని ఆధారాలు లేవు. తొలి కుషాణులైన కుజుల్ కాడ్‌ఫెసిస్, వీమాకాడ్‌ఫెసిస్‌లను గురించి తెలుసుకొనుటకు వారు జారీ చేసిన నాణేలు ఆధారాలు, నాణేలు కాకుండా బౌద్ధగ్రంథాలలో నాగార్జునుని 'మాధ్యమిక సూత్ర' అశ్వఘోషుని 'బుద్దచరిత్ర' కుషాణులయుగ విశేషాలను తెలుసుకొనుటకు కొంతవరకు ఉపయోగపడుతున్నాయి. కనిష్కుని శాసనాలు, నాణేలు అతని చరిత్రను, సామ్రాజ్యవ్యవస్థను తెలుసుకొనుటకు దోహదపడుతున్నాయి.

**13.7.1 జన్మస్థలం :** కుషాణులు సంచార జీవనం సాగించే 'యూచి' తెగకు చెందినవారని చైనా గ్రంథాలవలన తెలుస్తున్నది. యూచీ తెగ చైనాలోని కెన్-సు రాష్ట్రంలోని తుక-హువాంగ్ ప్రాంతంలో నివసించేవారు. క్రీ. పూ. 165 ప్రాంతంలో యూచీ తెగను హుణుట ఓడించి తరిమి వేయగా యూచీలు తమనివాస ప్రాంతం వదలి నైఋతిదిక్కుగా ప్రయాణించి ఉత్తర తక్లమకన్ ఎడారి మార్గంలో వెళ్తున్నప్పుడు వారికి ఇలి నదీ ప్రాంతంలోనికి వూ-సున్ తెగతో ఘర్షణ ఏర్పడింది. వూ-సున్ తెగను జయించిన తరువాత పశ్చిమదిశగా పురోగమించి ఇస్సిక్-కోల్ సరస్సును దాటి తమ నివాసానికి అనువైన ప్రదేశం కోసం అన్వేషించారు. ఈసమయంలోనే యూచీలోని చిన్నయూచీశాఖ దక్షిణ దిక్కుగా వెళ్ళి టిబెట్ సరిహద్దులలో స్థిరపడినారు. మిగిలిన ప్రధానయూచీతెగ సర్‌డేరియా నదీ తీరాన ఉన్న శకులను ఓడించి అక్కడ వారు తమ నివాసాన్ని ఏర్పరచుకొన్నారు. కొన్ని సంవత్సరాలు ఆ ప్రాంతంలో నివసించిన తరువాత హుణుల సహాయంతో వచ్చిన వూసున్ తెగనాయకుడు యూచీలను ఓడించి అక్కడి నుండి తరిమివేశాడు. ఈ ఓటమి ఫలితంగా యుచీలు సర్‌డేరియా ప్రాంతాన్ని వదలి ఆక్సస్ నదివైపు ప్రయాణించి బాక్ట్రియాలోని శకులను ఓడించి ఆక్సస్ నదికి ఉత్తర ప్రాంతానలో బోకారా ప్రాంతంలోని యాంషే రాజధానిగా స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. క్రీ. పూ. 125 ప్రాంతంలో చైనారాయబారి చాంగ్-కిన్ (Chang-kien) యూచి రాజధాని యాంషేను సందర్శించాడు.

ఆక్సస్ నదీతీరాన స్థిరనివాసం ఏర్పరచుకున్న యూచీ తెగ రాజ్యం ఐదు భాగాలుగా విభజించబడింది. ఈ ఐదు శాఖలలో ఒకటైన కుషాణులు మిగిలిన నాలుగు శాఖల రాజ్యాలను జయించారు. వీరినే ప్రాచీన భారత సాహిత్యం తొఖారియనులని వ్యవహరించింది.

**13.7.2 మొదటి కుజలకాడ్ ఫిసెస్ :** కుషాణ వంశంలో మొదటిరాజు మొదటి కుజలకాడ్‌ఫిసెస్. ఇతడు మిగిలిన నాలుగుయూచీ రాజ్యాలను జయించుటయే కాక కుషాణ రాజ్యాన్ని ఆక్సస్-సింధు నదుల మధ్య విస్తరింపచేసాడు. కాబూల్, కాందహార్‌లలోని పార్థియనులను జయించి తనరాజ్యాన్ని బాక్ట్రియా, ఆఫ్ఘనిస్తాన్, తూర్పుఇరాన్, వాయవ్య భారతదేశం వరకు వ్యాపింపచేసాడు. ఇతని

నాణేల వలన మొదటి కాడ్ ఫిసెస్ చివరి ఇండోగ్రీకు రాజు హెర్మయిస్ (Hermaeus) ను ఓడించి తక్షశిలను ఆక్రమించినట్లు తెలుస్తున్నది. ఇతని నాణేలు హిందుకుష్ పర్వత దక్షిణ ప్రాంతాలలో లభించాయి. కొన్ని నాణేలపై కాబూల్‌ను పాలించిన చివరి ఇండో-గ్రీకు పాలకుడు హెర్మయిస్ పేరు ఒకవైపు గ్రీకులిపిలోను, రెండవవైపు కుజులకాడఫిసెస్ బిరుదు ఖరోష్టి లిపిలోను ముద్రించబడింది. ఇతని నాణేల వలన కుజులకాడ్‌ఫిసెస్ బౌద్ధమతాన్ని స్వీకరించినట్లు తెలుస్తున్నది. ఈనాణేలపై సార్వభౌమత్వాన్ని సూచించే ఎటువంటి బిరుదులు లేవు. అందువలన ఇతడు ప్రారంభంలో కాబూల్ రాజు హెర్మయిస్‌కు సామంతుడిగా పాలన ప్రారంభించి ఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం. తరువాత కాలంలో స్వాతంత్ర్యం ప్రకటించి హెర్మియిస్‌ను జయించిన పిదప ఇతడు జారీచేసిన నాణేలపై 'ఖరోష్టిలో మహారాజస మహోతస కుషాణ కుయిల కాఫష', అని 'మహారాజస రాజాధిరాజస కుయిల కఫస' అనే సార్వభౌమ సూచకబిరుదులు ముద్రించాడు. ఇతడు క్రీ.శ 15నుండి 65 వరకు పరిపాలించాడు.

**13.7.3. వీమాకాడ్‌ఫిసెస్ :** మొదటి కుజలకాడ్‌ఫిసెస్ మరణించిన తరువాత అతని కుమారుడు రెండవ కాడ్‌ఫెసెస్ లేదా వీమా కాడ్‌పిసెస్ కుషాణ సింహాసనమధిష్టించాడు. భారతదేశంలో కుషాణుల సామ్రాజ్యాన్ని వ్యాపింపచేసినవాడు వీమాకాడ్‌ఫిసెస్. ఇతడు పంజాబ్, సింధు ప్రాంతాలను ఆక్రమించాడు. సామ్రాజ్య విస్తరణలో తండ్రి విధానాలను ఇతడు అనుసరించాడు. ఫలితంగా ఇతని కాలంలో కుషాణుల సామ్రాజ్యం పశ్చిమాన రోమ్ సామ్రాజ్య సరిహద్దుల వరకు, ఉత్తరాన చైనావరకు, దక్షణ-తూర్పు దిక్కులలో శాతవాహన సామ్రాజ్యం వరకు విస్తరించింది. ఇతడు బంగారు రాగినాణేలను జారీ చేశాడు. వీమా ప్రారంభించిన బంగారు నాణేల ముద్రణను తరువాతి కుషాణులేకాక గుప్తచక్రవర్తులు కూడా అనుసరించారు. రోమ్-భారతదేశాల మధ్యవ్యాపార సంబంధాల వలన కుషాణుల సామ్రాజ్యం ఆర్జించిన లాభాల ఫలితంగా వీమా విస్తారంగా బంగారు నాణేలను ముద్రించగలిగాడు. ఈ నాణేలపై గ్రీకులిపి ఒకవైపు, మరొకవైపున ఖరోష్టి లిపిలో మహారాజు, రాజాధిరాజు, సర్వలోకేశ్వర, మహేశ్వర, త్రతరస' (రక్షకుడు) అనే బిరుదులు, మరొక వైపున త్రిశూలం, పరుశువు ధరించిన శివుడి ప్రతిమ ఉన్నాయి. ఈ బిరుదులు, శివుని ప్రతిమ వలన వీమాశైవ మతాన్ని అనుసరించినట్లు తెలుస్తున్నది.

**13.7.4 కనిష్కుడు :** వీమాకాడ్‌ఫిసెస్ తరువాత కుషాణుల రాజ్యపాలన చేపట్టినవాడు కనిష్కుడు. ఇతడికి వీమాకాడ్‌ఫిసెస్‌లకు గల సంబంధం గురించి వివరాలు తెలియుటలేదు. అంతేకాక కనిష్కుడు పరిపాలించిన కాలాన్ని గురించి కూడ చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రస్తుతం అత్యధిక చరిత్రకారులు కనిష్కుడు క్రీ.శ. 78నుండి 102వరకు పరిపాలించాడని నిర్ణయిస్తున్నారు. ఇతని తొలిశాసనం ఉత్తరప్రదేశ్‌లో లభించింది. తరువాతి కాలంనాటి శాసనాలు పంజాబ్, భావల్పూలు, సింధు, మధుర, సాంచిలలో లభించాయి. బెంగాల్ బీహార్‌లలో కూడ ఇతని నాణేలు లభించాయి. ఇతనికి దేవపుత్ర, సీజర్ మొదలగు బిరుదులున్నట్లు ఇతని నాణేల వలన తెలుస్తున్నది.

**13.7.4.1 రాజ్యవిస్తరణ :** రాజతరంగిణి, కొన్ని బౌద్ధగ్రంధాలప్రకారం కనిష్కుడు కాశ్మీర్‌ను జయించి తన విజయానికి సూచనగా కాశ్మీర్‌లో తన పేరుపై కనష్కపురమనే నగరాన్ని నిర్మించాడు. మగధరాజ్యంపై దండెత్తి ఆరాజ్యంలోని అధికభాగాన్ని ఆక్రమించాడు. మగధనుండి ప్రఖ్యాత బౌద్ధ పండితుడు, కవి అయిన అశ్వఘోషుడిని తనతో తీసుకొని వచ్చినట్లు బౌద్ధగ్రంధాలు తెలియజేస్తున్నాయి.

కనిష్కుడు రాజ్యాధికారం చేపట్టిన సమయంలో ఉత్తర భారతదేశంలో శకక్షాత్రాపులు బలవంతులై ఉన్నారు. గంగా యమునా నదుల మధ్య ప్రాంతాలను జయించటంతో తృప్తిచెందని కనిష్కుడు పంజాబ్, మధురలోని శకక్షాత్రపులను ఓడించి. వారి రాజ్యాలను ఆక్రమించాడు. ఉజ్జయినీ పాలకుడైన ఛస్తనుని కూడా కనిష్కుడు ఓడించాడు. మాళవరాజ్యంలో కొంత ప్రాంతాన్ని కనిష్కునికి ఇవ్వడమేకాక శకులు కనిష్కుని సార్వభౌమత్వాన్ని అంగీకరించారు.

**13.7.4.2 చైనాపై దండయాత్ర :** వీమాకాడిఫిసెస్ చైనాచక్రవర్తికి చెల్లిస్తున్నకప్పం కనిష్కుడు నిలిపి తాను చైనాచక్రవర్తితో సమానుడనే విషయాన్ని చైనా చక్రవర్తికి తెలియపరచి చైనా రాకుమార్తెను వివాహము చేసుకొనుటకు 70000 సైనికులతో చైనాపై దండయాత్ర

జరిపాడు. కాని చైనాసేనాని పంచావో చేతిలో పరాజయం పాలైనాడు. ఈ ఓటమి తరువాత కనిష్కుడు చైనా చక్రవర్తికి కప్పం చెల్లించాడు. పంచావో కుమారుడు విజయం సాధించి కాషగర్, యార్కండ్, ఖోటాన్ ప్రాంతాలను ఆక్రమించాడు. ఈ విజయాల తరువాత కనిష్కుని సామ్రజ్యం ఉత్తరాన మధ్య ఆసియాలోని కాష్గర్, బొఖారా వరకు దక్షణాన మాళవ వరకు, పశ్చిమాన హెల్మండ్‌లోనుండి తూర్పున వారణాశి వరకు విస్తరించింది. తన సువిశాల సామ్రాజ్యపాలన సక్రమంగా నిర్వహించేందుకు కనిష్కుడు రాజధానిని పురుషపురానికి మార్చాడు. కనిష్కుని సామ్రాజ్యం రోమ్ సరిహద్దుల వరకు విస్తరించింది. రోమ్ చక్రవర్తి కనిష్కునితో స్నేహసంబంధాలుకి కొనసాగించాడు. చైనానుండి జరిగే వ్యాపారానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా సిల్క్‌రోడ్‌లో మూడు ప్రధాన కేంద్రలపై కనిష్కుడు అదుపు సాధించినందువలన వాయవ్య భారతదేశంలోని నగరాలు ఆనాడు ప్రముఖ వాణిజ్య కేంద్రాలుగా రూపొందాయి.

**13.7.4.3 బౌద్ధమతవ్యాప్తి :** కనిష్కుడు బౌద్ధమతాభిమని అశోకుని వలె కనిష్కుడు కూడ బౌద్ధమతవ్యాప్తికి అనేక విధాల కృషిచేశాడు. బౌద్ధవిద్వాంసుడైన పార్శ్వుని సలహాపై బౌద్ధ సంఘంలో విభేదాలను తొలగించి, బౌద్ధ సిద్ధాంత గ్రంధాలను సేకరించి, వాటికి వ్యాఖ్యానాలు తయారు చేయించడానికి కనిష్కుడు. కాశ్మీర్‌లోని కుందలవన విహారములో నాల్గవ బౌద్ధసంగీతిని ఏర్పాటు చేశాడు. ఈ సంగీతిలో సర్వాస్తివాదులనే బౌద్ధశాఖవారు అధిక సంఖ్యలలో పాల్గొన్నారు. ఈ సంగీతికి వసుమిత్రుడు అధ్యక్షుడు, అశ్వఘోషుడు ఉపాధ్యక్షుడు. ఈసంగీతి సందర్భంగా బౌద్ధసిద్ధాంత గ్రంధాలపై వ్యాఖ్యానాలు రచించి వాటిని రాగి రేకులపై వ్రాయించి శిలాపేటికలో ఉంచి ఒక స్థూపములో భద్రపరచారు. ఈ సంగీతిలోనే బౌద్ధమత తత్వముపై మహావిభాష శాస్త్రమనే విజ్ఞాన సర్వస్వాన్ని తయారుచేశారు. మహయాన బౌద్ధానికి కనిష్కుడు రాజాదరణ కల్పించాడు. బౌద్ధమత ప్రచారకులను దేశ విదేశాలకు బౌద్ధమత వ్యాప్తికై కనిష్కుడు పంపాడు. ఈ ఇధంగా కనిష్కుడు బౌద్ధమత ఆదరణకు, బౌద్ధమత వ్యాప్తికి చూపిన శ్రద్ధాసక్తుల కారణంగా బౌద్ధ వాఙ్మయం కనిష్కుడిని రెండవ అశోకుడని కీర్తిస్తున్నాయి.

కనిష్కుడు బౌద్ధమతాన్ని ఆదరించినప్పటికి ఇతర మతాలను ద్వేషించలేదు. ఇతడు తన నాణేలపై గ్రీకు, పారశీక, ఎలమైట్, సుమేరియన్, హిందూ దేవతల ప్రతిమలను ముద్రించడం అతని మతసహనాన్ని, సర్వమతాల ఆదరణను చాటుతున్నది. కనిష్కుడు తన పూర్వీకులవలె ఖరోష్టిలిపిని తన నాణేలపై ఉపయోగించలేదు. ఇతని నాణేం గ్రీకులిపిలపైన గల అతని బిరుదులు పారశీక భాషలోను ఉన్నాయి.

**13.7.4.4 సారస్వత పోషణ :** కనిష్కుడు విద్యాసారస్యతాలను పోషించాడు. ఇతని ఆస్థానంలో ఎంతోమంది భారతీయ, గ్రీకు విద్వాంసులు, కవులు, పండితులు ఆదరణ పొందారు. ఇతని ఆస్థానంలోని ప్రముఖ బౌద్ధకవులు, విద్వాంసులలో అశ్వఘోషుడు, నాగార్జునుడు, వసుమిత్రుడు, చరకుడు ముఖ్యులు. వీరందరిలో అశ్వఘోషుడు అనేక సంస్కృత గ్రంధాలు, నాటకాలను రచించి కీర్తిని సంపాదించుకొన్నాడు. ఇతుడు బుద్ధచరిత్ర, సౌందరనందము అనే కావ్యాలను, శారిపుత్ర ప్రకరణం అనే సంస్కృత నాటకాన్ని, అనేక విమర్శక గ్రంధాలను రచించాడు. మాధ్యమిక సిద్ధాంతాన్ని విశ్లేషించి మహాయాన బౌద్ధాన్ని ప్రచారం చేసిన ఆచార్యనాగార్జునుడుకూడ కనిష్కుని ఆస్థానంలోని వాడేనని ప్రసిద్ధి. ప్రముఖ ఆయుర్వేద వైద్యశాస్త్ర వేత్త అయిన చరకుడు కనిష్కుని ఆస్థాన వైద్యుడు. ఇతడు 'చదకసంహిత' అనే ఆయుర్వేద వైద్యశాస్త్ర గ్రంధాన్ని సంకలనం చేశాడు. ఆనాటి మత, సాహిత్య, వాస్తు, విజ్ఞాన తాత్విక రంగాలలో ప్రముఖ పాత్రవహించిన గ్రీకు ఇంజనీరు ఎజిలిసెస్ కూడ కనిష్కుని ఆస్థానంలో పోషించబడినాడు. మొత్తంమీద వీరందరి కృషివలన కనిష్కుని కాలంలో అపారమైన సారస్వత సృష్టి జరిగింది.

**13.7.4.5 కనిష్కుని నిర్మాణాలు :** బౌద్ధమత ఆదరణలో భాగంగా కనిష్కుడు ఎన్నో స్తూప, విహార, చైత్యాలను నిర్మించాడు. ఇతుడు కాశ్మీర్‌లోని శ్రీనగర్ సమీపంలో కనిష్కపురం అనే నగరాన్ని నిర్మించాడు. పురుషపురంలో బౌద్ధ బిక్షవుల కోసం ఒక విహారం నిర్మించి దానిలో తన పేరుమీదుగ కనిష్కచైత్యము కట్టించాడు. ఈ నగరంలోనే 600 అడుగు ఎత్తుగల స్తూపమును నిర్మించినట్లు చైనా గ్రంధాలు పేర్కొంటున్నాయి. కనిష్కుడు తాను నిర్మించిన ఈ కట్టడాలకు గ్రీకు శిల్పులను ఉపయోగించాడు. వీరిని ఉపయోగించడం వలన భారత గ్రీకు శిల్పకళా రీతుల సమ్మేళనం జరిగి ఫలితంగా గాంధార శిల్పమనే నూతన శిల్పశైలి ఆవిర్భవించింది. గాంధార శిల్పకళ ప్రభావం ఉత్తర భారతదేశంలో శిల్పకళపై క్రీ. శ. నాల్గవ శతాబ్దం వరకు అమిత ప్రభావాన్ని ప్రదర్శించింది.

**13.7.5 చివరి కుషాణులు :** కనిష్కుని తరువాత వాషిష్కుడు క్రీ. శ. 102 నుండి 106 వరకు పరిపాలించాడు. ఇతడిని రాజతరంగిణి జుష్కుడని వ్యవహరించగా మరికొన్ని ఆధారాలు వైజిష్కుడని పిలుస్తున్నవి. ఇతడు కాశ్మీర్‌లో శ్రీనగర్ సమీపంలో జుష్కపురమనే నగరాన్ని, జయసామిపురమనే పట్టణాన్ని నిర్మించాడు. వాషిష్కుని తరువాత హువిష్కుడు రాజయినాడు. ఇతడు ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతాన్ని తిరిగి ఆక్రమించాడు. ఇతడు కూడ కనిష్కునివలె బౌద్ధమతాన్ని ఆదరించాడు. 'మహారాజ' 'రాజాధిరాజ', 'దేవపుత్ర' అనే బిరుదులు ధరించాడు. మధురలో ఇతడు ఒక విహారాన్నినిర్మించి దానికి హువిష్కవిహారమని పేరుపెట్టాడు. హువిష్కుని మధ్యఆసియా రాజప్రతినిధి అయిన 'ఖరాసలెర' మధురలో అన్నదానం చేసే పుణ్యశాల నిర్వహణకు 1100 వెండి నాణేలను దానంగా ఇచ్చాడు. హువిష్కుని నాణేలనపై గ్రీకు, హిందూ దేవతల ప్రతిమలున్నాయి. హువిష్కుడు హుష్కపురమనే నగరాన్ని నిర్మించాడు. హువిష్కుడు కొంతకాలం రెండవ కనిష్కునితో కలిసి పాలించినట్లు రాజతరంగిణి పేర్కొంటున్నది. రెండవ కనిష్కుడు 'కైజర్' అనే బిరుదు ధరించాడు. హువిష్కుని తరువాత వాసుదేవుడు క్రీ. శ. 138 నుండి 176 వరకు పరిపాలించాడు. ఇతని పేరునుబట్టి కుషాణులు కూడా హిందూ మతాన్ని స్వీకరించి భారత సమాజములో కలిసిపోతున్నట్లు స్పష్టమౌతున్నది. ఇతని తరువాత మూడవ కనిష్కుడు, రెండవ వాసుదేవుడు పరిపాలించినట్లు వారి నాణేల వలన తెలుస్తున్నది. కాని వీరిని గురించిన ఇతర వివరాలు తెలియడంలేదు. రెండవ వాసుదేవుని తరువాత కుషాణుల రాజ్యం పూర్తిగా క్షీణించింది. ఇరాన్ ప్రాంతంలో ససానియన్లు, ఉత్తర భారతంలో నాగ-భరశివులు, యౌధేయులు, కుణిందులు, మాళవులు మొదలగు గణరాజ్యాలు స్వతంత్రించడంతో కుషాణ సామ్రాజ్యం పతనమయ్యింది. క్రీ.శ. నాల్గవ శతాబ్దం చివరి భాగంలోను 5వ శతాబ్దం ప్రథమార్ధంలోను కుషాణులు 'కీడార కుషాణు'లనే పేరుతో పంజాబ్, వాయవ్య ప్రాంతంలోను, కాశ్మీర్‌లో చిన్నచిన్నరాజ్యాలలో పారశీకులకు, ఇతర రాజ్యాలవారికి సామంతులుగా వున్నారు.

## 13.8 సారాంశము :

అశోకుని తరువాత వచ్చిన మౌర్యచక్రవర్తులు బలహీనలగుటచే శుంగ వంశం రాజ్యాధికారాన్ని చేపట్టినది. పుష్యమిత్ర శుంగుని పరిపాలనా కాలంలో వైదికమత పునరుద్ధరణ జరిగింది. ఆ తర్వాత కాణ్వాయన రాజులు కొదికాలం పరిపాలించారు. వీరి కాలంలోనే విదేశి దండయాత్రలు జరిగి యవనులు, (ఇండోగ్రీకులు) శకులు, కుషాణవంశ రాజులు గుప్తులు రాజ్యాధికారాన్ని స్వీకరించేవరకు పాలించారు. కుషాణ వంశంలో ముఖ్యడు కనిష్కుడు. ఇతని కాలంలో మరలా బౌద్ధమత వ్యాప్తి, వాస్తు, శిల్పము మెదలగునవి విశేష ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి.

## 13.9 మాదిరి ప్రశ్నలు

1. శుంగవంశం గూర్చి వ్రాయుము. ?
2. విదేశీ రాజవంశాల గూర్చి వ్రాయుము. ?
3. శకుల గూర్చి వ్రాయుము. ?
4. కనిష్కుడు గూర్చి వ్రాయుము. ?
5. కుషాణుల గూర్చి వ్రాయుము ?

## సంక్షిప్త ప్రశ్నలు :

1. కాణ్వవంశం గూర్చి వ్రాయుము. ?
2. ఇండోపార్థియన్ల గూర్చివ్రాయుము. ?
3. వాషిష్కుడు గూర్చి వ్రాయుము. ?

## పాఠం - 14

# శాతవాహనులు

### 14.0 లక్ష్యం :

మౌర్య సామ్రాజ్య పతనానంతరము దక్షిణ బారతావనిలో, దక్కను పీఠభూమిలో అతిపెద్ద సామ్రాజ్యన్ని నిర్మించినవారు శాతవాహనులు రమారమి 300 వందల సంవత్సరములు పాలించిన ఈ రాజవంశము దక్షిణ భారతదేశంలో పరిపాలన, సంస్కృతి, సాహిత్యము, వాస్తు కళారంగాలలో విశేష కృషిని సాగించింది. రాజ్యాన్ని విస్తరించి పలువిషయాలలో తరువాత వచ్చిన రాజ్య వంశాలకు ఆదర్శప్రాయంగా నిలించింది. ఈ విషయాలన్ని తెలియచేయటమే ఈ పాఠం లక్ష్యం.

### విషయక్రమం :


| | |
|---|---|
| **14.1** | శాతవాహనుల చరిత్ర ఆధారాలు |
| **14.2** | శాతవాహనుల పుట్టుపూర్వోత్తరాలు |
| **14.3** | రాజధాని |
| **14.4** | కులం |
| **14.5** | కాలం |
| **14.6** | రాజకీయ చరిత్ర - తొలి శాతవాహనులు |
| **14.7** | సామ్రాజ్య పతనం. |
| **14.8** | పరిపాలనా వ్యవస్థ - సంస్కృతి |
| **14.9** | సాంఘిక పరిస్థితులు |
| **14.10** | ఆర్థిక పరిస్థితులు |
| **14.11** | మత పరిస్థితులు |
| **14.12** | భాషా సాహిత్యము |
| **14.13** | వాస్తు శిల్పం |
| **14.14** | సారాంశం |


### 14.1 శాతవాహనుల చరిత్రకు ఆధారాలు

శాతవాహనుల చరిత్రను తెలుసుకోవడానికి చాలా ఆధారాలున్నాయి. ఉత్తరాన సాంచి నుండి దక్షిణాన బళ్ళారి వరకు, తూర్పున అమరావతి నుండి పశ్చిమాన కన్హేరి వరకు గల ప్రాంతాలలో వారు వేయించిన 26 శాసనాలు లభ్యమయ్యాయి. నానాఘాట్, కన్హేరి, నాసిక్,

కార్లె భాజా మొదలైన చోట్ల వారి శాసనాలు చెక్కివున్నాయి. వారి శాసనాలు ప్రాకృత భాషలో బ్రహ్మీ లిపిలో లభించాయి. ఖారివేలుని హంతిగుంఫా శాసనం, రుద్రదాముని జునాగడ్ శాసనం, మొదటి శాతకర్ణి, పులోమావి, శివశ్రీ శాతకర్ణుల చరిత్ర తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. శాతవాహనుల రాజులందరి నాణేలు లభించాయి. ఇటీవల కొండాపూర్, కోటిలింగాల, ధూళికట్టలలో లభించిన శాతవాహన, సిముఖ, మొదటి శాతకర్ణి నాణేలు శాతవాహనులు మొదట ఉత్తర తెలంగాణాలో తమ రాజ్యాన్ని స్థాపించారని రుజువు చేశాయి. ఇంకా, మత్స్య, వాయు విష్ణు, బ్రహ్మాండ పురాణాలు, గుణాఢ్యుని బృహత్కథ, హాలుని గాధసప్తశతి వాత్సాయనుని కామ సూత్రాలు, కుతూహలుని లీలావతి కావ్యం, మెగస్తనీస్ ఇండికా, పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సి, టాలెమి రచనలు శాతవాహనుల చరిత్రను అధ్యయనం చేయడానికి ఉపయోగపడుతున్నాయి.

## 14.2 శాతవాహనుల పుట్టుపూర్వోత్తరాలు :

శాతవాహనులు ఆంధ్రులని ఆంధ్రులు కారని పండితుల మధ్య భిన్నాభిప్రాయాలున్నవి. వారి శాసనాలలో వారు ఆంధ్రులమని చెప్పుకోలేదు. శాతవాహన కులజుమని చెప్పుకున్నారు. పురాణాలు వారిని ఆంధ్రులని వర్ణించాయి. అందువలన కొందరు వారు ఆంధ్రులనీ, మరికొందరు ఆంధ్రులు కారని వాదించారు. ఆంధ్రులు కాదని వాదించిన వారిలో విఎస్ సుక్తాంకర్, హెచ్ సి రాయచౌదరి, వి.వి. మిరాషి, శ్రీనివాస్ అయ్యంగార్ ముఖ్యులు. వారు ఆంధ్రులే అని వాదించే వారిలో వి.ఎ.స్మిత్, ఇ.జె. రాప్సన్, ఆర్.బి భండార్కర్, మారెమండ రామారావు, గొర్తి వెంకట్రావులు ముఖ్యులు.

**14.2.1 ఆంధ్రేతరులు :** ఆంధ్ర ప్రాంతం దక్కనులో తూర్పు వైపున ఉన్నది. శాతవాహనుల రాజ్యం పశ్చిమ దక్కనులో ఉన్నది. శాతవాహనుల తొలి రాజధాని మహరాష్ట్రంలోని పైథాన్. వారి తొలి శాసనాలైన నానేఘాట్, నాసిక్, కన్హేరి శాసనాలు మహరాష్ట్రంలో ఉన్నాయి. పులోమావి తరువాతనే వారికి చెందిన ఆధారాలు ఆంధ్రదేశంలో లభిస్తున్నాయి. ఏ శాసనంలోనూ వారు ఆంధ్రులమని చెప్పుకోలేదు. ఆంధ్రుల భాష తెలుగు. శాతవాహనుల భాష ప్రాకృతం. పురాణాలు వారిని ఆంధ్ర భృత్యులు అని పేర్కొన్నాయి. కనుక శాతవాహనులు ఆంధ్రులకు భృత్యులే గాని ఆంధ్రులు కారని సుక్తాకర్, శ్రీనివాస అయ్యంగార్, రాయచౌదరి, డా॥ మిరాషి మొదలైన వారు తీర్మానించారు.

**14.2.2 శాతవాహనులు ఆంధ్రులే :** స్మిత్, బార్నెట్, గొర్తి వెంకట్రావు పై సిద్ధాంతాన్ని ఖండించి వారు ఆంధ్రులే అని చెప్పారు. శాతవాహన రాజ్యంలో పశ్చిమదక్కనే గాక తూర్పుదక్కను కూడా చేరి వుంది. మౌర్య సామ్రాజ్య పతనానంతరం ఉత్తర దేశంపై జరిగిన విదేశీ దండయాత్రలను అరికట్టి దేశాన్ని కాపాడటానికి వారు మహారాష్ట్రలోని పైఠాన్‌కు రాజధానిని మార్చారని విదేశీ దాడుల ప్రభావం తగ్గగానే వారు మరలా ధరణికోటకు తమ రాజధానిని మార్చారని వీరు వాదించారు. ఇటీవల ఉత్తర తెలంగాణాలోని కొండాపూర్, దూళికట్ట, కోటిలింగాలలో తొలి శాతవాహనుల నాణేలు దొరికాయి. శాతవాహనుల మూలపురుషుడైన శాతవాహనుని నాణెం కొండాపూరులో లభించింది. ఇది వారి స్వస్థానం ఉత్తర తెలంగాణా అని స్పష్టంగా నిరూపించింది. శాతవాహనులు తమ శాసనాలను తెలుగులో రాయించలేదు. ప్రాకృతంలో వ్రాయించారు అనే వాదన కూడా నిలువ లేదు. సామ్రాజ్య భాషగా వారు ప్రాకృతాన్నే కొనసాగించారు. అయినా హాలుని గాధా సప్తశతిలో అనేక తెలుగు పదాలున్నాయి. వారి నాణేల మీద ప్రాకృతంతో బాటు దేశిభాషలో కూడ రాజుల పేర్లు రాయించారు. దేశిభాషే వారి మాతృభాష. ఆంధ్ర భృత్యు పరిపాలనలో మాతృభాష వాడాలనే నియమం ఏమీలేదు అని శర్మ అన్నారు. ఆంధ్ర భృత్యులు అనే పదాన్ని శాతావాహనులు ఆంధ్రులకు భ్రత్యులు అనే అర్ధంతో తీసుకోరాదు. ఆంధ్రులే భృత్యులు అనే అర్ధం తీసుకోవాలి. అంతకు ముందు వారు మౌర్యులకు సామంతులు కనుక వారిని పురణాలు ఆంధ్ర భృత్యులు అంటే సేవకులు అనే అర్ధంతో ఆ పదాన్ని ఉపయోగించి వుంటారు. పురాణాలలో పేర్కొన్న పేర్లు శాసనాలలో పేర్కొన్న పేర్లు సరిపోయాయి. వారు వేరువేరు వంశాలని భావిస్తే రెండు వంశాలలో అందరూ వరుసక్రమంలో ఒకే పేరు కలిగిన వారు ఒకే కాలంలో ఒకే ప్రాంతాన్ని పాలించడం అనేది సంభవం. కనుక శాతవాహనులు ఆంధ్రులే అని తీర్మానించారు.

## 14.3 రాజధాని :

శాతవాహనుల రాజధాని ప్రతిష్ఠానపురము, గౌతమీ పుత్ర శాతకర్ణి వాసిష్ఠ పుత్ర పులోమావి ధరణికోటను రాజధానిగా చేసుకున్నాడు. అతని తరువాత శాతవాహనులు శకుల చేతిలో ఓడి మహారాష్ట్ర ప్రాంతాన్ని పోగొట్టుకొని నందున ధరణికోటయే తుది రాజధాని అయినది. డా॥ స్మిత్ కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళం వారి రాజధాని అని భావించినాడు.

## 14.4 కులము :

శాతవాహనులు బ్రహ్మణ నాగజాతికి చెందిన వారని దుత్రింశ పుత్తాలికలో చెప్పబడినది. నాసిక్ శాసనములు గౌతమీపుత్ర శాతకర్ణి ఏక బ్రహ్మణుడని వర్ణించబడింది. కనుక వారు బ్రహ్మణ కులస్థులని భావిస్తారు.

## 14.5 కాలం :

శాతవాహనులు జన్మస్థానం వలె వారి కాలం గూడ స్పష్టంగా తెలియదు. అనేకులు అనేక సిద్ధాంతాలను ప్రతిపాదించారు. డా॥ గోపాలచారి వారు క్రీ.పూ. 230 నుండి 220 వరకు 460 సం॥లు 30 మంది రాజులు పాలించిరని చెప్పెను. క్రీ.పూ 220 - 211 లో వారి రాజ్యం ప్రారంభం అయినది అంచనా కట్టాడు. పురాణాలు శ్రీముఖుడు, సుశర్మను వధించి రాజ్యానికి వచ్చినాడని చెప్పినందున రాయచౌదరి వారు క్రీ.పూ 30 వ సం॥లో రాజ్యస్థాపన చేసినారని చెప్పెను. R.P చందు నాగానిక వేయించిన నానేఘాట్ శాసనం లిపి హెలియే డోరస్ బేస్ నగర్ శాసన లిపి తరువాతదిగా కనిపిస్తున్నదని చెప్పి అతడు క్రీ.పూ 100 - 75 మధ్య వారు రాజ్యస్థాపన చేసినారని అనెను. ఖారవేలుని శాసనంలో చెప్పిన తివససో అనుపదము నందుల తరువాత 300 సం॥లని అర్థం వస్తున్నదని రాయచౌదరి, R.D బెనర్జి అంగీకరించి వారి రాజ్యస్థాపన క్రీ.పూ 24 వ సం॥ అని చెప్పారు. కాని పలువురు గోపాలచారి, రాప్సన్‌లు ఇచ్చిన కాలం అనగా క్రీ.పూ 220 - 230 లు సరి అయినవని అంగీకరించినారు.

## 14.6 రాజకీయ చరిత్ర - తొలి శాతవాహనులు

శాతవాహనులు 30 మంది రాజులు 456 సం॥లు పాలించారు. వారి చరిత్రను తొలి శాతవాహనులు, మలి శాతవాహనుల కాలంగా విభజించారు. శ్రీముఖని నుండి గౌతమీ పుత్ర శాతకర్ణి వరకు తొలి శాతవాహనులని గౌతమీ పుత్ర శాతకర్ణి కాలం నుండి మలి శాతవాహనులని విభజించారు.

**14.6.1 శాతవాహనుడు :** పురాణాలు శ్రీముఖుడు శాతవాహనులకు మూలపురుషుడని రాజ్యస్థాపకుడని తెలుపుతున్నాయి. కాని జైనగ్రంధాలు, కథా సరిత్సాగరం శాతవాహన వంశానికి మూలపురుషుడు శాతవాహనుడని తెలుపుతున్నాయి. ఇటీవల కొండాపూరులో సాతవాహన అను పేరుగల నాణెం దొరికింది. కనుక జైనగ్రంధాలు, కథా సరిత్సాగరం చెప్పే విషయాలు వాస్తవం అని రుజువయ్యాయి. శాతావాహనుడు అశోక చక్రవర్తి సామంతుడై వుండవచ్చును. అతడు స్వతంత్ర ప్రభువు కాదు కనుక అతనిని రాజ్యస్థాపకునిగా పురాణాలు పేర్కొని వుండకపోవచ్చు.

**14.6.2 శ్రీముఖుడు క్రీ.పూ 220 - 197 :** శాతవాహనుని తరువాత అతని కుమారుడు శ్రీముఖుడు రాజయ్యాడు. అతడు అశోకచక్రవర్తి మరణానంతరం స్వాతంత్ర్యం ప్రకటించాడు శ్రీముఖుడు పరిసర రాజ్యాలను జయించి ప్రతిష్ఠాన పురాన్ని రాజధానిగా చేసుకున్నాడు. అతడు ప్రక్కన ఉన్న అంగకుల రథికుల రాజకుమారి నాగనికను తన కుమారుడు మొదటి శాతకర్ణితో వివాహం జరిపించి రథికుల సహకారాన్ని సంపాదించాడు. వారి సహకారంతో శాతవాహన రాజ్యం బలపడింది. అతడు జైనమతస్థుడుని జైనగ్రంధాలు తెల్పుతున్నాయి. అతడు 23 సం॥లు రాజ్యం చేశాడని పురాణాలు తెలుపుతున్నాయి.

**14.6.3 కృష్ణుడు (క్రీ.పూ. 197 - 178) :** శ్రీముఖుడు మరణించే నాటికి అతని కుమారుడు బాలుడై నందున అతని తమ్ముడు కృష్ణుడు రాజై 18 సంవత్సరాలు పాలించాడు. అతడు నాసిక్‌ను జయించాడు. అక్కడ అతను ఒక గుహను తొలిపించి శ్రమణులకు దానం చేశాడని అతని ఉద్యోగి మహామాత్రుడు శాసనం చెక్కించాడు. కృష్ణుని కాలం క్రీ.పూ 185 లో పుష్యమిత్రశృంగుడు చివరి మౌర్య చక్రవర్తి బృహద్రధుని సంహరించి శుంగవంశాన్ని స్థాపించాడు.

**14.6.4 మొదటి శాతకర్ణి క్రి.పూ 178 - 168 :** కృష్ణుని తరువాత మొదటి శాతకర్ణి రాజ్యానికి వచ్చి పది సంవత్సరాలు పాలించాడు. ఇతని చరిత్ర అతని భార్య నానేఘాట్‌లో వేయించిన శాసనం ద్వారా తెలుస్తోంది. భారవేలుని హాతింగుంఫా శాసనంలో కూడా ఇతని ప్రస్థావన ఉన్నది. అతడు తొలి శాతవాహనులలో గొప్పవాడు. అతడు అప్రతిహత వీరుడని, దక్షిణాపథపతి అని నానేఘాట్ శాసనం వర్ణిస్తోంది. అతడు పుష్యమిత్ర శుంగునికి ఖారవేలునికి సమకాలికుడు. నానేఘాట్ శాసనం అతడు పశ్చిమ, మాళ్వ. అనూప, నర్మద, లోమ, విదర్భలను జయించాడని తెలుపుతున్నది. శాతకర్ణి కాలంలో మధ్య, పశ్చిమ భారతదేశమేగాక దక్కను ప్రాంతంలోని అధిక భాగం శాతవాహనల వశం అయింది. భారవేలుడు తన హతిగుంఫా శిలాశాసనంలో శాతకర్ణిని లెక్కచేయకుండా అతని రాజ్యం గుండా సైన్యాలతో నడిచి మూషిక నగరాన్ని హడలు గొట్టానని చెప్పుకున్నాడు. శాతకర్ణి వైదిక మతాభిమాని అనేక యజ్ఞాలు చేశాడు. రెండు అశ్వమేధ యాగాలు, ఒక రాజసూయ యాగం ఇంకా అనేక క్రతువులు చేశాడు.

**14.6.5 రెండవ శాతకర్ణి క్రీ.పూ. 152 - 196 :** తొలి శాతవాహనులలో ఆరవ రాజైన రెండవ శాతకర్ణి మరో గొప్ప చక్రవర్తి అతడు 56 సం॥లు రాజ్యం చేశాడు. ఇతని కాలంలో శాతవాహన సామ్రాజ్యం దక్షిణాన బసవాస వరకు విస్తరించింది. మాళవపై దండెత్తి శకులను పారద్రోలి విదిషను ఆక్రమించాడు. సాంబలోని దక్షిణ ద్వారంపై శాసనం వ్రాయించాడు. అతని తరువాత లంబోదర, అపీలక, మేఘస్వాతి అనే వారు రాజ్యాం చేశారు. వారి కాలంలో శకులు శాతవాహన రాజ్యపు ఉత్తర భాగాలు ఆక్రమించారు. అపీలకుని నాణెం ఒకటి. చత్తీస్ గడ్‌లో దొరికింది.

**14.6.6 కుంతల శాతకర్ణి :** కుంతల శాతకర్ణి 13 వ రాజు. వాత్సాయనుని కామసూత్రాలు, కథా సరిత్సాగరం, రాజశేఖరుని కావ్య మీమాంస అతనిని పేర్కొంటున్నాయి. అతడు శకులను నిర్జించి రాజ్యాన్ని బలపరిచాడు. ఇతని ఆస్థానంలో శర్వవర్మ కాతంత్ర వ్యాకరణం వ్రాశాడు. గుణాఢ్యుడు బృహత్కథను పైశాచి భాషలో వ్రాశాడు. కాని రాజు నిరాదరణ చేశాడని దానిలో చాలా బాగాన్ని గుణాఢ్యుడు కాల్చివేశాడట. అందు మిగిలిన భాగం కథా సరిత్సాగరంగా వ్రాయబడింది.

**14.6.7 పులోమావి :** "పురాణాలు పులోమావిని 15 వ రాజుగా పేర్కొన్నాయి. శకులను పారద్రోలి మగధపై దండెత్తి కాణసుశర్మను వధించి పాటలీ పుత్రాన్ని ఆక్రమించాడు. శాతవాహనులు పది సంవత్సరాలు మగధను పులోమావి తరువాత శకులు మరలా శాతవాహన రాజ్య భాగాలు ఆక్రమించారు.

**14.6.8 హాలుడు :** హలుడు 17 వ రాజు ఇతడు శకులను నిరోధించాడు. స్వయంగా కవి. గాదా సప్తశతి అనే గ్రంధాన్ని ప్రాకృత భాషలో వ్రాశాడు. ఆ కావ్యం సమకాలీన సామాజిక పరిస్థితులకు అద్దం పట్టింది. ఇతని కాలం నుండి సంస్కృతం ప్రాచుర్యంలోనికి వచ్చింది. కుతూహలుడు లీలావతి అనే కావ్యాన్ని వ్రాశాడు. హలుని తరువాత శకుల దండయాత్ర జరిగి సామ్రాజ్యం క్షీణించింది.

**14.6.9 గౌతమి పుత్ర శాతకర్ణి :** అట్టి స్థితిలో గౌతమీ పుత్ర శాతకర్ణి రాజ్యానికి వచ్చాడు. గౌతమీ పుత్రుడు శివస్వాతి గౌతమీ బాలశ్రీల పుత్రుడు. శాతవాహనులలో ఇతడు అగ్రగణ్యుడు. అతడు రాజ్యానికి వచ్చేనాటికి పశ్చిమ భారతదేశంలో శకులు క్షాత్రపులు ఇష్టారాజ్యాంగా విజృంభించారు. వీరు హిందూమతాన్ని స్వీకరించి హిందూ సమాజంలో క్షత్రియులుగా చెలామణి అయినారు. అతడు తన 18 వ రాజ్య కాలంలో క్షాత్రపుల పై దండెత్తి నహపాణుని వధించి అనూప, అపరాంత, సౌరాష్ట్ర, కుకుర, అవంతి, ఉజ్జయిని ప్రాంతాలను ఆక్రమించాడు. ఈ ప్రాంతాలన్నీ నేటి గుజరాతు, రాజస్తాన్, మహారాష్ట్రంలో నున్నాయి. అతని తల్లి గౌతమీ బాలశ్రీ నాసిక్‌లో వేయించిన శాసనంలో

గౌతమీ పుత్రుని రాజ్యంలోని ప్రాంతాలు వర్ణించింది. ఆ వర్ణనల ప్రకారం గౌతమీ పుత్ర శాతకర్ణి సామ్రాజ్యం ఉత్తరాన రాజస్థానం నుండి దక్షిణాన కర్ణాటకలోని వైజయంతి తమిళనాడులోని కడలూరు వరకు విస్తరించింది. తూర్పున బంగాళాఖాతం, పడమట అరేబియా సముద్రం సరిహద్దులుగా ఉన్నాయి. అందువలన అతడు 'త్రి సముద్ర తోయ పీతవాహన' అనే బిరుదు ధరించాడు. గౌతమీ పుత్రుడు 24 సంవత్సరాలు రాజ్యం చేశాడు.

**14.6.10 వాశిష్ఠీ పుత్ర పులోమావి :** గౌతమీ పుత్ర శాతకర్ణి తరువాత అతని కుమారుడు పులోమావి రాజ్యానికి వచ్చాడు. అతని కాలంలో క్షాత్రప రుద్రాదాముడు శాతవాహన రాజ్యాంపై దండెత్తి గుజరాతు, మాళ్వా, మహరాష్ట్ర ప్రాంతాలను ఆక్రమించాడు. దానితో పులోమావి ధరణికోట చేరి దానిని తన రాజధానిగా చేసుకున్నాడు.

**14.6.11 వాశిష్ఠీ పుత్ర శివశాతకర్ణి :**"పులోమావి తరువాత అతని తమ్ముడు శివశ్రీ రాజ్యానికి వచ్చాడు. అతని శాసనం కన్హారిలో ఉన్నది. ఆ శాసనం అతను రుద్రదాముని అల్లుడని చెపుతోంది. అతని నాణేలు కృష్ణా గోదావరి జిల్లాలలో దొరికాయి.

**14.6.12 గౌతమీ పుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి :** "శాతవాహనులలో యజ్ఞశ్రీ శాతకర్ణి చిట్టచివరి గొప్ప చక్రవర్తి. అతడు పులోమావి కాలంలో క్షీణించిన శాతవాహన సామ్రాజ్యాన్ని పునరుద్ధరించాడు. అతని శాసనాలు నాసిక్, కన్హేరి, చిన గంజాంలలో దొరికాయి. రుద్రదాముని మరణానంతరం క్షాత్రపుల రాజ్యాంపై దండెత్తి కొంకణం చేరారు. సౌరాష్ట్ర, మాళవ ప్రాంతాలను జయించాడు. ఆపరాంత, నర్మదా లోయ పశ్చిమ భారతదేశంనుండి శకులను పారద్రోలాడు. ఆచార్య నాగార్జునుడు ఇతని సమకాలికుడు. అతనిని ఆదరించి నాగార్జున కొండ మీద నాగార్జుననకు పారావతమనే విహారాన్ని కట్టించి ఇచ్చాడు. యజ్ఞశ్రీ వైదిక మతాన్ని కూడా ఆదరించాడు. చిన గంజాంలో దొరికిన శాసనం ప్రకారం అతడు యజ్ఞం చేసినట్లు తెలుస్తోంది.

## 14.7 సామ్రాజ్య పతనం

యజ్ఞశ్రీ తరువాత విజయ శాతకర్ణి రాజ్యానికి వచ్చాడు. అతనికి చెందిన ఒక శాసనం విజయపురిలో బయల్పడింది. అతడు తన పేరుతో విజయపురిని నిర్మించాడు. ఇతని కాలంలో సామంతులు తిరుగుబాటు చేశారు. అతని తరువాత చండశ్రీ రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో సామంతులు స్వతంత్రం ప్రకటించారు. చండశ్రీ నామమాత్రపు చక్రవర్తిగా పది సం॥లు పాలించి మరణించాడు. అతని తరువాత మూడవ పులోమావి రాజ్యానికి వచ్చాడు. అతని కాలానికి చెందిన శాసనం ఒకటి బళ్ళారి జిల్లాలోని మ్యాకదోనిలో లభించింది. ఇతనిని పారద్రోలి ఇక్ష్వాకు శాంతిమూలుడు ధరణి కోటను ఆక్రమించాడు దానితో నాలుగన్నర శతాబ్దాలు వెలిగిన శాతవాహన సామ్రాజ్యం అంతరించింది.

## 14.8 పరిపాలనా వ్యవస్థ - సంస్కృతి

శాతవాహనులు గొప్ప సామ్రాజ్యన్ని స్థాపించుటయే గాకుండా పటిష్టమైన పరిపాలనా వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారు. వారు మౌర్యుల పరిపాలనా విధానాన్ని అనుసరించినప్పటికి కాలానుగుణంగా మార్పులు చేసుకుంటూ నూతన పద్ధతులను పాటించారు. ప్రజాశ్రేయస్సు కోసం ధర్మశాస్త్రాలు బోధించిన విధానంలోనే తమ పాలనను సాగించారు. రాజు సర్వాధికారి, రాచరికం వారసత్వం, పరిపాలనలో సహాయం చేయటానికి మంత్రిమండలి ఉండేది. మంత్రులలో విశ్వాస అమాత్యుడు ప్రముఖుడు, పరిపాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని ఆహారాలుగా విభజించారు. ఆ ఆహారాలను రట్ట అని కూడా పిలిచేవారు. గోవర్ధనాహార, మమలాహార, సోపారహార అనేవి శాసనాలలో కనిపిస్తున్నాయి. ఆహారాల అధిపతి అమాత్యుడు. ఆహారాలే గాక కొంత స్వయంపాలనాధికారం కలిగిన ప్రాంతాలు కొన్ని సామ్రాజ్యలలో ఉండేవి. వాటిని మహారధులు, మహాభోజకులు పాలించేవారు. వివిధ విధులను నిర్వహించటానికి వివిధ రకాల హోదా కలిగిన అధికారులుండేవారు. వారిలో మహాసేనాధిపతి, మహామంత్రి, భాండాగారికుడు, హేరణికుడు, లేఖకుడు, నభండనకారులు ముఖ్యమైనవారు. శాతవాహన కాలంలో విదేశీవర్తకం బాగా అభివృద్ధి చెందినందువల్ల బాగా పట్టణాల సంఖ్య పెరిగింది. రాజధాని ప్రతిష్టానపురం,

రెండవ రాజధాని దాన్యకటకం పెద్దనగరాలు. ఇంకా సోపార, నాసిక్, గోవర్ధన, విజయపురి లాంటి అనేక పట్టణాలు సామ్రాజ్యం నలుమాలల ఉండేవి. నగరాలలో నిగమసభలు నగర పరిపాలనను చూసేది. కులపెద్దలను గృహపతులని పిలిచేవారు. వారు నిగమ సభలలో సభ్యులుగా ఉండి పాలనా బాధ్యతలను చూసేవారు. పరిపాలనలో చిట్టచివరిది గ్రామం. గ్రామాధికారి గ్రాదుణి. రాజ్యానికి ప్రధాన ఆదాయం భూమిశిస్తు. పంటలో రాజు భాగాన్ని భోగ అని అనేవారు. దానికే ధేయమేయ అని మరియొక పేరుండేది. భూమిశిస్తు గాక వృత్తి పనివారి నుండి కరుకర్ అనే పన్నులు వసూలు చేసేవారు. వ్యాపార శ్రేణుల మీద సుంకాలు విధించేవారు. ఎగుమతి దిగుమతుల సరుకుల మీద కూడా పన్నులు వసూలు చేసేవారు.

## 14.9 సాంఘిక పరిస్థితులు

"శాతవాహన కాలంలో కుల వ్యవస్థ ప్రారంభమైంది. విదేశస్తులైన శకులు హిందూ సమాజంలో క్షత్రియులుగా గుర్తింపబడ్డారు. దక్షిణ దేశంలోని అనేక తెగలు వైదిక కుల వ్యవస్థలో ప్రవేశించాయి. అందువలన వర్ణసాంకర్యం జరిగింది. కనుక గౌతమీ పుత్ర శాతకర్ణి వర్ణసాంకర్యాన్ని ఆపటానికి ప్రయత్నించాడు. ఈ యుగంలో రాజులు యజ్ఞాలు చేశారు. బౌద్ధ, జైన మతాలు కుల వ్యవస్థను ఖండించి స్త్రీ పురుష, దేశ, విదేశ అనే భేదాలు లేకుండా తమ మతంలో చేర్చుకున్నారు. వారు కులవ్యవస్థ లేని సమాజాన్ని ప్రోత్సహించారు. ఆనాడు సమాజంలో అనేక వృత్తులు వుండేవి. వృత్తుల ప్రాతిపదికగా సమాజంలో వర్ణాలు ఏర్పడ్డాయి. శాతవాహనుల కాలంలో సమాజంలో ఉమ్మడి కుటుంబ సాంప్రదాయం వుండేది. కుటుంబ సభ్యులందరూ అన్యోన్యంగా కలిసి జీవించేవారు. తీర్థయాత్రలు చేసేవారు. కలిసి దానాలు చేసేవారు.

**14.9.1 స్త్రీ స్థానం :** "ఈ యుగంలో స్త్రీలకు గొప్ప గౌరవ మర్యాదలుండేవి. పురుషులు తమ తల్లుల పేర్లను తమ పేర్లతో కలిపి పెట్టుకునేవారు. గౌతమీ పుత్ర శాతకర్ణి, వాశిష్టి పుత్ర పులోమావి అందుకు ఉదాహరణలు. నాగనిక, గౌతమీ బాలశ్రీ వంటి స్త్రీలు పరిపాలనా వ్యవహారాలను నిర్వహించేరు. స్త్రీలకు ఆస్తిహక్కు వుండేది. స్వేచ్ఛ ఉండేది. స్త్రీలు తమ ఇష్టమైన మతాన్ని ఆచరించి మత సంస్థలకు దానం చేశారు. ఈ కాలంలో స్త్రీలు చాలామంది బౌద్ధమతాభిమానులు. బౌద్ధ విహారాలకు, చైత్యాలకు స్త్రీలు ఉదారంగా విరాళాలిచ్చారు. ఈ కాలంలో స్త్రీలు తమ భర్త పదవుల పేర్లను తమ పేర్లతో కలిపి పెట్టుకునేవారు. మహాసేనాపత్ని, మహారథిని, మహాభోజకి అనే పదాలు శాసనాలలో కనిపిస్తున్నాయి. శాతవాహనుల కాలంలో స్త్రీలు కేశాలంకరణకు, శరీర సౌందర్య పోషణకు ప్రాధాన్యత నిచ్చారు. అనేక ఆభరణాలు ధరించారు. ఆనాటి స్త్రీలు మదనోత్సవం, కౌముది యాగం లాంటి ఉత్సవాలలో పాల్గొనేవారు.

## 14.10 ఆర్థిక పరిస్థితులు

శాతవాహన కాలంలో ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. శాతవాహన రాజులు కూడా వ్యవసాయాభివృద్ధికి తగిన శ్రద్ధ తీసుకునేవారు. వ్యవసాయ ఆదాయం రాజ్యానికి ప్రధాన సంపదగా ఉండేది. శాతవాహన రాజులు భూమిని సర్వే చేయించారు. భూమిని సర్వేచేసిన అధికారిని రజ్జగాహక అని పిలిచేవారు. భూమిని చిన్న చిన్న కమతాలుగా విభజించారు. పంటలో ఆరవ వంతు శిస్తుగా వసూలు చేశారు.

శాతావాహనుల కాలంలో వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, వ్యాపారం విదేశీ వాణిజ్యం కూడా అభివృద్ధి చెందాయి. పులోమావి యజ్ఞశ్రీ నాణేల మీద చిత్రించిన నౌకా బొమ్మలు కృష్ణానదీ లోయలో లభించిన రోమన్ నాణేలు ఆనాడు విదేశీ వ్యాపారం జరుగుతున్నదని స్పష్టం చేస్తున్నాయి. పశ్చిమ తీరంలో బరుకచ్చ సోపార, కళ్యాణి మెదలైన ముఖ్య రేవు పట్టణాలు ఆంధ్ర దేశంలో మచిలీపట్నం, ఘంటసాల, కోడూరు ముఖ్యమైన రేవులు. తెలంగాణాలో కోటిలింగాల,పెదబంకూరు, ధూళికట్ట కొండాపూర్, విజయపురి, బట్టిప్రోలు, పశ్చిమ దక్కన్‌లో ప్రతిష్టానపురం, నాసిక్, గోవర్ధన, తగర, వైజయంతి మొదలైనవి ప్రముఖ వర్తక కేంద్రాలు. సామ్రాజ్యాంలోని అన్ని పట్టణాలు కలుపుతూ రహదారులుండేవి. దొంగల భయం వల్ల వర్తకులు గుంపులు గుంపులుగా కలసి పనిచేసేవారు. వర్తక శ్రేణిలు బ్యాంకర్లుగా పనిచేశాయి. ఆనాటి రేవుపట్టణాల నుండి నూలుదారం, పట్టువస్త్రాలు, సుగంధద్రవ్యాలు, ఆభరణాలు, పరిమళ ద్రవ్యాలు, ఏనుగు దంతాలు ఎగుమతి అయ్యేవి. అవి ప్రధానంగా రోమ్, పర్షియా దేశాలకు ఎగుమతి అయ్యేవి. విదేశాల నుండి మధ్యం, బంగారం, రాగి, వెండి, రోమన్ గాజు

దిగుమతి అయ్యేవి. భారతీయ వస్తువులు రోమ్ మార్కెట్లలో ధర కంటె వంద రెట్లు ఎక్కువ ధరకు అమ్ముడయ్యేవని ప్లిని వ్రాశాడు. విదేశీ వర్తకం వలన శాతవాహనుల కాలంలో దేశ ఆర్ధిక సౌష్టవం పెరిగింది. వర్తక వాణిజ్యాలు బాగా అభివృద్ధి చెందటం వలన ఇండియాలో వర్తక శ్రేణులు సంపన్నులైనారు. మొత్తం మీద శాతవాహన యుగంలో దేశ ఆర్ధిక స్థితి ఉచ్ఛదశలో వున్నది.

## 14.11 మత పరిస్థితులు

శాతవాహనుల కాలంలో ఉత్తర దేశం నుండి మొదటిసారిగా భాగవత మతం ప్రవేశించింది. వాసుదేవ, సంకర్షణుల ప్రస్తావన నానేఘాట్ శాసనంలో వున్నది. దక్షిణ ప్రాంతంలో శైవమతం ప్రబలంగా వున్నది. చిత్తూరు జిల్లాలోని గుడి మల్లంలో పెద్ద భారీ శివలింగం ప్రతిష్ఠించబడింది. మొదటి శాతకర్ణి వైదిక మతాభిమాని. అతడు రెండు అశ్వమేధయాగాలు, ఒక రాజసూయ యాగం ఇంకా ఆప్తో ర్యామ, అనారంభనీయ, అతిరాత్రాది క్రతువులను నిర్వహించాడు. రాణినాగనిక గొప్ప వైదిక ధర్మ నిష్టురాలు. వారు తమ కుమారునికి వేదిశ్రీ అని పేరు పెట్టుకున్నారు. నాగనిక శాసనంలో వాసుదేవ సంకర్షణలుతో పాటు ఇంద్ర, యమ, వరుణ, కుబేర మొదలైన దిక్పాలకుల పేర్లు కూడా ఉన్నాయి. గౌతమీ పుత్ర శాతకర్ణి వైదిక మతాన్ని అభిమానించి వర్ణ సాంకర్యాన్ని నిరోధించటానికి ప్రయత్నించాడు. యజ్ఞశ్రీ కూడా వైదిక మతాభిమాని. అతడు యజ్ఞం చేశాడు.

శాతవాహన రాజులందరూ వైదిక మతాభిమాను లైనప్పటికి ప్రజలలో బౌద్ధమతం ప్రబలంగా ఉన్నది. వణిజులు, స్త్రీలు బౌద్ధమతాన్ని ఆదరించి బౌద్ధ విహారాలకు అంతులేని దానాలు చేశారు. దక్కనులో అనేక గుహాలయాలు తొలిపించి బౌద్ధ బిక్షువులకు దానాలు చేశారు. పశ్చిమ కనుమలలో ఉన్న గుహాలయాలలో ఎక్కువ భాగం శాతవాహన కాలానికి చెందినవి. గౌతమీ బాలశ్రీ బౌద్ధ గుహకు దానం చేసింది. యజ్ఞశ్రీ శాతకర్ణి ఆచార్య నాగార్జుననుకు నాగార్జున కొండ మీద పారావత విహారాన్ని నిర్మించి ఇచ్చాడు. నాసిక్, కార్లే జున్నార్, ధరణికోట, జగ్గయ్య పేట, భట్టిప్రోలు, నాగార్జున కొండలలో గొప్ప బౌద్ధస్థూపాలు ఉండేవి. ఇవన్నీ శాతవాహనుల కాలంలో బౌద్ధమతం ఉచ్ఛదశలో ఉన్నట్లు తెలుపుతున్నాయి.

## 14.12 భాషా సాహిత్యాలు

శాతవాహనుల కాలంలో ప్రాకృతం రాజభాష శాతవాహనుల శాసనాలన్నీ ప్రాకృత భాషలోనే ఉన్నాయి. కుంతల శాతకర్ణి, హాలుని కాలం నుండి సంస్కృతం ప్రారంభమైంది. కాని శాసన భాషగా వాడలేదు. గుణాఢ్యుడు పైశాచిక బాషలో బృహత్కథను వ్రాశాడు. శర్వ వర్మ 'కాతంత్రమనే సంస్కృత వ్యాకరణాన్ని వ్రాశాడు. హాలుడు స్వయంగా కవి. గాథా సప్తశతిని వ్రాశాడు. కుతూహలుడు ప్రాకృతంలో 'లీలావతి' అనే కావ్యాన్ని వ్రాశాడు. ఆచార్య నాగార్జునుడు 'ప్రజ్ఞా పారమిత శాస్త్రం' మాధ్యమిక శాస్త్రం, సుహృల్లేఖ మొదలైన 24 గ్రంధాలు రచించాడు. శాతవాహనుల కాలంలో దేశి అనే స్థానిక భాష వున్నది. ఇటీవల దొరికిన శాతవాహనుల నాణేల మీద వున్న దేశి భాష తెలుగు భాషకు సన్నిహితంగా వున్నదని డి.సి. సర్కార్, కార్తికేయ శర్మ మొదలైన పురావస్తు శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు.

## 14.13 వాస్తు శిల్పం - కళలు

శాతవాహనుల కాలంలో వాస్తుశిల్పం కళలు బాగా అభివృద్ధి చెందాయి. ఆంధ్రులకు ప్రత్యేకమైన వాస్తు సాంప్రదాయం వున్నదని మెగస్తనీసు ఇండికాలో తెలిపారు. శాతవాహన కాలంలో దక్కనులో, ఆంధ్రదేశంలో అనేక స్థూపాలు, విహారాలు, చైత్యాలు నిర్మించబడ్డాయి. ఆంధ్రదేశంలో అమరావతి, నాగార్జున కొండ, భట్టిప్రోలు, జగ్గయ్యపేట ఘంటసాలలలో ఇటుకలతో స్థూపాలు నిర్మించి పాలరాతి ఫలకాలతో అలంకరించారు. సాంచీ, బార్హుత్ శిల్పరీతికి భిన్నమైన సాంప్రదాయాన్ని ఆంధ్ర శిల్పులు అనుసరించారు. శిల్పకళతో పాటు చిత్రలేఖనం కూడా అభివృద్ధి చెందింది. అజంతా గుహలలోని 9-10 గుహలలోని నల్ల యువరాణుల వర్ణచిత్రాలు శాతవాహన కాలం నాటికి చెందినవి. గుడిమల్లంలో ప్రతిష్ఠింపబడిన భారీ శివలింగం శాతవాహనుల కాలం నాటిది. కనుక వీరి కాలంలో హిందూ శిల్పకళ కూడా ప్రారంభమైనదని భావిస్తారు. అమరావతి శైలి శాతవాహనుల కాలంలో ప్రముఖంగా పేర్కొనవలసింది. అమరావతిలో భారతదేశంలో కెల్లా అతి పెద్దదైన

బౌద్దస్థూపం నిర్మింపబడింది. ఈ స్థూపం మీద బుద్దని జీవిత విశేషాలను తెలుపు శిలాఫలకాలను అమర్చారు. ఈ స్థూపానికి నాలుగు వైపులా వేదికలు పెంచి ఒక్కొక్క వేదిక మీద 5 ఆయక స్థంబాలు ప్రతిష్టించారు. ఈ ఆయక స్థంబాలు అమరావతి స్థూపం యొక్క ప్రత్యేకత. ఈ విధంగా శాతవాహనులు క్రీ.పూ 3 వ శతాబ్దం నుండి క్రి.శ 2 వ శతాబ్దం వరకు నాలుగున్నర శతాబ్దాల కాలం పాలించి ఆంధ్రదేశానికి గొప్ప వైభవాన్ని సంపాదించి పెట్టారు. వారి హయాంలో ఉత్తర దక్షిణ భేదాలు నశించి భారతదేశం మొత్తం ఏక సంస్కృతి అభివృద్ధి చెందటానికి దోహదం చేశారు.

## 14.14 సారాంశము :

దక్షిణ, దక్కను ప్రాంతాలను మౌర్య సామ్రాజ్య పతనానంతరం శాతవాహనులు రమారమి 300 సంవత్సరాలు పరిపాలించారు. వారి పుట్టుపూర్వోత్తరాలు, కులం, కాలం మొదలగు అంశాలపై చరిత్ర కారులకు ఏకాభిప్రాయం లేకపోయినా, వారి పరిపాలనా పద్దతులు,రాజకీయ సుస్తిరత, సాంఘిక, సామాజిక, మత విషయాలలో వారు చూపిన చొరవ, సమర్ధతలపై నిశ్చితమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. శాతవాహన రాజు లు వైదిక మత ధర్మాలను పాటించినా పరమత సహనాన్ని పాటించారు. బౌద్ధ మతం కూడా వీరి కాలంలో ఉచ్చదిశలో వుండటం ఒక చక్కని ఉదాహరణ.

## 14.15 మాదరి ప్రశ్నలు

1. శాతవాహన పుట్టుపూర్వోత్తరాల గూర్చి వివరింపుము ?
2. తొలి శాతవాహనుల రాజకీయ చరిత్ర గూర్చి వ్రాయుము ?
3. శాతవాహనుల కాలంలోని ఆర్థిక, సాంఘీక, మత పరిస్థితుల గూర్చి వ్రాయుము ?

## సంక్షిప్త ప్రశ్నలు

1. పరిపాలనా వ్యవస్థ, సంస్కృతి గురించి వ్రాయుము ?
2. శాతవాహనుల కాలంలో వాస్తు శిల్పం కళ అభివృద్ధిని గూర్చి వ్రాయుము ?

### SUGGESTED READINGS


1. Altekar. A.S : 'State and Government in Ancient India'; Delhi. 1984
2. Basham A.L : 'The wonder That was India
3. Bhandarkar R.G : 'Early History of the Deccan', Varanasi 1975
4. Dubrevill.J : 'Ancient History of Deccan', Pondicherry 1920
5. Gopalechari.K : 'Early History of Andhra Country Madra, 1976
6. Majumdar.R. (ed) : The Age of Imperial Unity, Bombay 1980
7. Majumdar R.C., H.C, Raychavdhuri & Kalikinkar Datta: 'An Advanced History of India', London 1960
8. Mukherji.R.K. : 'Ancient India as Described in Classical Literature', Patna, 1987
9. Mukherji.R.K. : 'Chandragupta Maurya and His Times', Delhi, 1960
10. Mukherji.R.K. : 'Ashoka', Delhi, 1962
11. Narain, A.K. : 'The Indo-Greeks', Oxford, 1962
12. Nilakanta Sastry.K.A. (ed) : 'The Age of Nandas and mauryas' Delhi, 1988

13. Ojha. K.C : 'The History of Foreign Rule in Anciuat India, Allahabad, 968

14. pargiter.F.E. : The purana Text of the Dynasties of the Kali Age (with Introduction and notes) Varanasi 1962

15. Puri.B.N. : (India Undes the Kushanas', Bombay 1965.

16. Rama Rao : Satavahana Commemorative volume, Guntur, 1950

17. Rapson.E.J. : Ancient India Calcatta. 1960 (Reprint)

18. Ray. Himanshu. P : 'Monestery and guild (Commerce Undet Satavananes), Delhi 1986

19. Ray. N.R. : 'Maurya and Sunga Art', Calcutta, 1945.

20. Sircar, D.C. : Some Problems Concerning the Kushenes', Dharwar

21. Sircar. D.C. : 'Inscriptions of Asoka', Delhi 1988

22. Smith.V.A. : 'History of India', Oxford 1924

23. Subrahmanyam.K.R. : 'Buddhist Remains in Andhra and the History of Andhra between 285 - 610 A.D. New Delhi, 1989

24. సుబ్రమణ్యం. రాయప్రోలు : అశోకుని ఎఱ్ఱగుడి శిలాశాసనములు, హైదరాబాద్ 1975

25. Thaper. Romilla : Ashoka and The Decline of Mouryas, London, 1961

26. Thapar Romilla : A History of India vol : I, New Delhi, 1966.

27. Woolner Alfred : Asoka : Text and Glossary, Delhi 1993

28. Yazdani. G. (ed) : Early History of Deccan.

ఖండిక - 4

పాఠం - 15

# గుప్తుల యుగం

## 15.0 లక్ష్యం :

గుప్త సామ్రాజ్య ఆవిర్భావము, తొలి రాజుల చరిత్ర గుప్తుల చరిత్రకు సంబంధిత ఆధారాలు వివరించడమే ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

**విషయ క్రమం**


15.1 పరిచయం

15.2 గుప్తయుగ చరిత్రకు ఆధారాలు

15.3 గుప్తుల పుట్టు పూర్వోత్తరాలు - రాజ్య స్థాపన

15.4 గుప్త రాజ్య స్థాపన

15.5 సారాంశము


## 15.1 పరిచయం

ప్రప్రథమంగా భారతదేశంలో మౌర్యవంశరాజులు సువిశాలమైన సామ్రాజ్యంను నిర్మించి దేశ సమైక్యతను చాలా వరకు సాధించారు. అయితే అశోకుని తరువాత అర్ధశతాబ్ది కాలంలోనే మౌర్యసామ్రాజ్యం పూర్తిగా నశించిపోయింది. మౌర్యసామ్రాజ్యం విచ్ఛిన్నమయిన తరువాత (క్రీ.పూ 200) గుప్తరాజులు విజృంభించే వరకు (క్రీ.శ 350) సుమారు 500 సంవత్సరాల కాలం ఉత్తరాపథాన్ని సమైక్యం చేసి సార్వభౌమాధికారాన్ని పునరుద్ధరించగలిగిన రాజవంశం ఉదయించలేదు. ఈ కాలంలో ఉత్తర భారతంలో శుంగులు, కాణ్వులు, కుషాణులు, పశ్చిమ భారతదేశంలో శాతవాహనులు, శకక్షాత్రపులు, వాకాటకులు దక్షిణ భారతదేశంలో ప్రాచీన చోళులు కేంద్రీకృత పరిపాలన వ్యవస్థను కొనసాగించడం ద్వారా సామ్రాజ్య నిర్మాణానికి ప్రయత్నించారు. కాని ఈ ప్రయత్నాలేమి మౌర్య సామ్రాజ్యంతో సరితూగలేదు.

క్రీ.శ 4వ శతాబ్దంలో పాటలీపుత్రం రాజధానిగా గుప్తరాజుల పాలన ఆరంభమైంది. గుప్తరాజులలో సముద్రగుప్తుని దండయాత్రల వలన రాజ్య విస్తీర్ణం జరిగినప్పటికీ మౌర్యసామ్రాజ్యంతో గుప్తసామ్రాజ్యం పోల్చ దగినది కాదు. మౌర్యులులాగా గుప్తులు బలమైన కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేయలేక పోయారు. అయినప్పటికి గుప్తులు సుమారు 200 సంవత్సరాలు ఉత్తర భారతంలో సారవంతమైన గంగా మైదానాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడమే గాక ముఖ్యమైన రహదారులు, ఆర్థిక వనరులు, ఖనిజవనరులు పై తమ ఆధిపత్యాన్ని నెలకొల్పి సామ్రాజ్య నిర్మాణానికి అవసరమైన ఆర్థిక వనరులు ఏర్పరచగలిగారు. సముద్రగుప్తుడు, రెండవ చంద్రగుప్తుడు, మొదటి కుమారగుప్తుడు, స్కంధగుప్తుడు సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసారు. వీరు వాస్తుకళ, సాహిత్య, వైజ్ఞానిక రంగాలలో చెప్పుకోదగిన ప్రగతి సాధించారు. ఉత్తర భారతదేశంలో ఈ కాలంలో ఒక ప్రత్యేకమైన విశిష్టసంస్కృతి ఏర్పడింది, ఈ కాలంలో రాజకీయ ఐక్యం లేకపోయినప్పటికీ ఆసేతు హిమాచలం ప్రశస్తమైన సాంస్కృతిక ఏకత్వం వెల్లివిరిసింది, ఈ కాలంలో భారతదేశాన్ని పరిపాలించిన భిన్న

రాజవంశాల (గుప్త, వాకాటక, శాలంకాయన, విష్ణుకుండి, కదంబ,పల్లవ) పాలనా విధానాలలో భిన్నత్వం కనిపించదు. అందరు **భక్తి** ప్రధానమైన పౌరాణిక మతాన్ని, వర్ణధర్మాన్ని, సంస్కృత విద్యలను పోషించారు. దేశమంతటా ఆలయ నిర్మాణం జరిగి వాస్తు విద్యలకు ప్రోత్సాహం లభించింది. భక్తిమతాల ద్వారా శకాది విదేశీ జాతుల వారు హిందూ సమాజంలో విలీనమయ్యారు. భరతవర్షం, భారతీయులు **అనే** భావాలు ఈ యుగం నుంచే బహుళ ప్రచారం**లోనికి వచ్చాయని** కొందరి పండితుల అభిమతం. ఇన్ని విధాల విశిష్టమైనందు వల్లనే గుప్తయుగాన్ని స్వర్ణయుగంగా వర్ణించడం పరిపాటి అయింది.

## 15.2 గుప్తయుగ చరిత్రకు ఆధారాలు

గుప్తరాజుల గురించి తెలిపే ఆధారాలు అనేకం. ఈ ఆధారాలను వాఙ్మయ ఆధారాలు, పురావస్తు **ఆధారాలు** అని రెండు విధాలుగా విభజింపవచ్చు. వాఙ్మయ ఆధారాలను మతపరమైన, మతేతర, స్వదేశీ, విదేశీ అని విభజింపవచ్చు.

### 15.2.1 మతపరమైన సాహిత్యం

మతపరమైన ఆధారాలలో ప్రధానంగా పేర్కొనవలసినవి పురాణాలు. పురాణాలు అత్యధికంగా గుప్తయుగంలో పూర్తి చేయబ**డినవి.** స్థూలంగా గుప్తుల వంశక్రమాన్ని, పాలనాకాలాన్ని గురించి మత్స్య, వాయు, విష్ణు పురాణాలలో ప్రస్తావించబడింది. వాయు పురాణంలో **గుప్తరాజ్య** పరిధిని గూర్చి కూడ చెప్పడం జరిగింది. ప్రయాగ, మగధ. సాకేత ప్రాంతాలతో కలిపి గంగా మైదానమంతయు గుప్తవంశ **ఆధీనంలో** వున్నట్లు వాయు పురాణంలో పేర్కొనబడినది. అయితే ఇందులో రాజు ప్రస్తావన లేదు.

కలియుగంలోని రాజుల గురించి కలియుగ రాజవృత్తాంతం అనే గ్రంథం చెపుతుంది. ఈ గ్రంథం గుప్తరాజుల పాలన గురించి సరియైన సమాచారం అందచేస్తుందని కొందరు చరిత్రకారుల అభిప్రాయం.

పాహియాన్ రచించిన **బౌద్ధరాజ్యాల** చరిత్ర అతని యాత్ర, అనుభవాలను తెలిపే గ్రంథం గుప్తుల కాలానికి చెందిన సాంఘిక మతాచారాలను, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను అవగాహన చేసుకోవడానికి బాగా ఉపకరిస్తుంది.

ఆర్యమంజుశ్రీ రచించిన మూలకల్పలో **గుప్తరాజుల** ప్రస్తావన అనేక శ్లోకాలలో ప్రస్తావించబడింది. అయితే ఇందులో వివిధ వంశాల రాజుల గురించి ప్రస్తావిస్తూ మధ్యమధ్యలో గుప్తరాజుల ప్రస్తావన తేవడం వలన కొంత గందరగోళానికి దారితీసింది.

చైనా యాత్రికుడైన హుయాన్‌త్సాంగ్ హర్షుని కాలంలో భారతదేశానికి వచ్చినప్పటికి, గుప్తరాజుల కాలంలో బౌద్ధమత ప్రాచుర్యం **గురించి** ప్రస్తావించాడు. మొదటి గుప్త రాజైన శ్రీగుప్తుడు చైనాకు చెందిన బౌద్ధ మతావతంబులకు నలంద బౌద్ధ విహారంలో నివశించడానికి కొన్ని గ్రామాలు దానం చేసినట్లు మరో చైనా యాత్రికుడైన **ఇత్సింగ్ తన** రచనలలో తెలియచేశాడు.బౌద్ధసన్యాసి యతివృషభుడు రచించిన తిలస్యపన్నాటి అనే గ్రంథంలో గుప్తుల కాలం నాటి బౌద్ధ మత పరిస్థితులు వివరించబడివుంది.

### 15.2.2 మతేతర సాహిత్యం:

కామందకుని నీతిసారం మొదటి చంద్రగుప్తుని కాలానికి చెందిన ఒక గొప్ప గ్రంథం. ఇందులో గుప్తుల నాటి రాజనీతి, పరిపాలనా వ్యవస్థ ప్రతిబింబిస్తున్నాయి. ధర్మశాస్త్రాలయిన కాత్యాయన, నారద, బృహస్పతి స్మృతులు వలన ఆ కాలపు న్యాయ విధానం, ప్రజల ధర్మాలు ఆస్తిహక్కులు సాంఘిక కట్టు బాట్లు మొదలైన అంశాలు విశదం కాగలవు. విశాఖదత్తుని దేవీ చంద్రగుప్తం ఒక రాజకీయ **నాటకం.** **శక వంశస్థుడైన** బసన చేతి**లో** గుప్తరాజు రామగుప్తుడి ఓటమిని ఈ గ్రంథం వివరిస్తుంది. రెండో చంద్రగుప్తుడు ఏ విధంగా శక **రాజును,** తన అన్న రామగుప్తుని హత్య చేసింది, అన్న భార్య ధృవాదేవిని వివాహమాడి రెండో చంద్రగుప్తుడు ఎలా చక్రవర్తి **అయింది ఈ నాటకం**

వివరిస్తుంది. అయితే ఈ నాటకం మొత్తంగా లభించకుండ అక్కడక్కడ ఖండికలు మాత్రమే లభ్యమయినాయి. అందువల్ల ఈ నాటకం చారిత్రకత గురించి ఏకాభిప్రాయం లేదు.

కాళిదాసు రచించిన అభిజ్ఞానశాకుంతలము, మేఘదూతము, రఘువంశము, మాళవికాగ్ని మిత్రము, ఋతు సంహారము, కుమారసంభవము మొదలగు అనేక కావ్యాలు కూడ గుప్తరాజుల నాటి పరిస్థితుల గురించి, ప్రభుత్వం గురించి విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి. కాళిదాసు రచనలు ప్రధానంగా ప్రేమ ప్రకృతి ఆరాధన, ఆనాటి మత విశ్వాసాల గురించి తెలియచేస్తున్నాయి. వాటిలో అక్కడక్కడ రాజకీయ, చారిత్రాత్మక అంశాలు కూడ ప్రస్తావించబడినవి. బ్రాహ్మణుడైన చారుదత్తుడు, రాజ నర్తకి అయిన వసంతసేనల మధ్య ప్రేమాయణం గురించి, నాటి అస్థిర రాజకీయ పరిస్థితులను గురించి మృచ్ఛకటికము అనే నాటకంలో శూద్రకుడు వివరించాడు, మొదటి చంద్రగుప్తుడు రాజ్యానికి వచ్చిన విధం, అతను సాధించిన ఘనకార్యాలు వజ్జీకుని కౌముదీ మహోత్సవము అనే నాటకం వివరిస్తుంది. అనంతర గుప్తరాజులకు వర్ధన వంశానికి గల సంబంధాల గురించి బాణుని హర్షచరిత్రలో పేర్కొనబడినది. వరాహమిహిరుని బృహత్‌సంహిత, అమరసింహుని అమరకోశం మొదలగు గ్రంధాలు కూడ గుప్తయుగ చరిత్ర రచనకు ఉపయుక్తంగా వున్నాయి.

### 15.2.3. పురావస్తు ఆధారాలు :

గుప్తయుగ చరిత్ర రచనకు పురావస్తు ఆధారాలు చాలా ముఖ్యమైనవి. వాఙ్మయ ఆధారాల కంటే పురావస్తు ఆధారాలే అత్యంత విశ్వాసయోగ్యాలు అని ఆచార్య నీలకంఠశాస్త్రి అభిప్రాయము. పురావస్తు ఆధారాలను నాణాలు, శాసనాలు, కట్టడాలు, ముద్రలుగా విభజింపవచ్చును.

### 15.2.3.1 శాసనాలు:

అలహాబాద్, ఎరాన్, మెహరౌలి, మధుర, ఉదయగిరి, సాంచి, భిల్సా , బితారి, జునాఘడ్, మాండసోర్ మొదలగుచోట్ల లభ్యమైన శాసనాలు గుప్తయుగ చరిత్రకు అమూల్యాలు, గుప్తయుగానికి సంబంధించి 42 శాసనాలు ఇంతవరకు లభ్యమైనవి. వీటిలో రాజులు వెలువరించినవే కాక అధికారసంబంధమైన ప్రత్యేక వ్యక్తులకు సంబంధించిన శాసనాలు కూడ కలవు. ఈ శాసనాలు గుప్తయుగ రాజకీయ మత , సామాజిక, సాంఘిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి.

శాసనాలు దొరికిన ప్రాంతాలను బట్టి ఆయా పరిపాలకుల అధికారము ఎంతవరకు విస్తరించి ఉండేదో గ్రహించవచ్చు. ఉదాహరణకు స్కంధగుప్తునికి సంబంధించిన జునాఘడ్ శాసనంలోని వివరాలు ప్రకారం అతని అధికారం సౌరాష్ట్రంలో కూడా విస్తరించిందని తెలుస్తుంది. శాసనాలు దొరికిన స్థలాన్ని బట్టి ఆయా వంశాల ఆవిర్భావ స్థానాలను గుర్తించవచ్చు. ముఖ్యముగా ప్రశస్తి శాసనాలను బట్టి వంశాల పుట్టు పూర్వోత్తరాలను నిర్ణయించవచ్చు. అయితే గుప్తుల జన్మస్థలం ఎక్కడో నిర్ధారించడము శాసనాల ద్వార సాధ్యంకాదు. కాని ఈ శాసనాల ద్వార గుప్తుల అధికారం మొదట ఎచట ప్రారంభమైందో కొంతవరకు తెలుసుకోవచ్చు. శాసనాలను సాధారణంగా ఆస్థాన కవుల చేత వ్రాయిస్తూ వుంటారు . అందువల్ల వాటిని చరిత్ర రచనకు వుపయోగించేటపుడు కడు జాగ్రత్త వహించాలి.

సముద్రగుప్తుని చరిత్రకు ముఖ్య ఆధారం హరిసేనుడు అశోక స్తంభశాసనంపై చెక్కిన అలహాబాద్ ప్రశస్తి. బ్రాహ్మీలిపి, సంస్కృత భాషలో వున్న ఈ శాసనంలో 33 పంక్తులున్నాయి. ఈ శాసనం గుప్తవంశవృక్షం- శ్రీగుప్తుడు, ఘటోత్కచుడు చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు మొదలగు నాలుగు తరాలను పేర్కొంటుంది. అంతేగాక గుప్తసింహాసనానికి సముద్రగుప్తుని ఎన్నిక విధానం గూర్చి అతని గుణగణాలు, వ్యక్తిత్వం విజయపరంపరలు ఈ శాసనంలో చెప్పబడింది. ఈ శాసనం ద్వారా నాటి భారత రాజకీయ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గుప్తచక్రవర్తులు పరమభాగవతులని వారి శాసనాలలో చెప్పుకున్నారు. సముద్రగుప్తుని ఎరాన్ శిలాశాసనం విష్ణు విగ్రహం గురించి చెపుతుంది. రెండో చంద్రగుప్తుని సామంతుడైన సనకానికా రాజు ఉదయగిరిలో ఒక గుహను తొలిపించి విష్ణువుకు అంకితం చేసినట్లు అచటి శాసనం

చెపుతుంది. వీటిని బట్టి నాడు వైష్ణవమతం బాగా ప్రాచుర్యంలో వుందని తెలుస్తుంది. మధురలో విలసిల్లిన శైవశాఖ చరిత్రను రెండవ చంద్రగుప్తుని మధుర స్తంభ శాసనం పేర్కొంటుంది. శాసనాల వలన ఆలయాల నిర్మాణ క్రమము, వాస్తు శిల్పశైలి అందులో వచ్చిన మార్పులు దేవాలయ నిర్మాణ కాలం మొదలగు విషయాలు తెలుసుకోవచ్చు. మందసోర్ శాసనంలో మొదటి కుమారగుప్తుని సామంతుడు సూర్య దేవునికి ఆలయం నిర్మించినట్లు వుంది. స్కంధగుప్తుని బితారి శాసనంలో గుప్తులపై హూణులు, పుష్యమిత్ర వంశస్థులు సాగించిన దాడుల గురించిన ప్రస్తావన వుంది. ఎరన్ రాతిస్తంభశాసనంలో రెండో చంద్రుగుప్తుని గురించి వివరముంది. మెహరౌలి ఇనుప స్తంభ శాసనంలో చంద్రరాజు వివరాలు కలవు.

ఇతర రాజ వంశాల వారు వేయించిన శాసనాలలో కూడ గుప్తుల ప్రస్తావన వుంది. కదంబ వంశానికి చెందిన కకుత్సవర్మన్ వేసిన శాసనం తన కమార్తెను గుప్త రాకుమారునికిచ్చి పెళ్ళి చేసినట్లు తెలియచేస్తుంది. వర్మన్ వంశరాజులు వేసిన శిలా శాసనాలను, బట్టి చంద్రగుప్త, కుమారగుప్త రాజుల పాలనాకాలంలో మాళ్వ ప్రాంతాన్ని మందసోర్ ప్రాంతాన్ని వర్మన్ వంశస్థులు స్వతంత్రంగా పాలిస్తున్నట్లు తెలియవస్తుంది. మొదటి కుమారగుప్తుడు వర్మన్ వంశ రాజులు వేసిన శిలాశాసనాలను కలిపి పరిశీలిస్తే వర్మన్ వంశరాజుల రాజ్యాన్ని గుప్తులు ఎపుడు స్వాధీనం చేసుకుంది తెలుస్తుంది. తోరమాణుడు, మిహిరకులుడు, వసుధర్మన్ వేసిన శిలాశాసనాలను బట్టి గుప్తవంశ పతనం అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రకూటుల తామ్రపత్రాలలో కూడ రెండొవ చంద్రగుప్తుని ప్రస్తావించడము జరిగింది. ప్రకటాదిత్యుని సారనాధ్ శాసనం. యశోధర్మని నలంద శాసనాలలో కూడ గుప్తులు గురించి పరోక్షంగా ప్రస్తావించడము జరిగింది.

### 15.2.3.2 నాణాలు :

గుప్త చక్రవర్తులు జారీ చేసిన బంగారు వెండి, రాగి, నాణాల వలన గుప్తరాజ్య పరిధి, విస్తరణ, గుప్తరాజుల వ్యక్తిత్వం, అభిరుచులు మతం, నాటి లిపి, ఆర్థిక పరిస్థితి, కాలక్రమము, లోహశాస్త్ర స్థాయి అవగతం అవుతాయి. గుప్తరాజులు మొదట కుషాణచక్రవర్తుల నాణాల పోలిన నాణేలు ముద్రించేవారు. తరువాతి దశలో గుప్తుల నాణాలు పూర్తి భారతీయతను సంతరించుకున్నాయి. రాజులు తమ పాలనాకాలంలో ప్రధానమైన సంఘటనకు గుర్తుగా కొత్త నాణాలను విడుదల చేసేవారు. ఇతర చారిత్రిక ఆధారాలు లేని కొన్ని ప్రధాన అంశాలను నాణాల ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రాచీన భారతదేశ నాణాల చరిత్రలో మొదటిసారిగా అధిక సంఖ్యలో బంగారు నాణాలను ముద్రించినది గుప్తుచక్రవర్తులే. ఈ నాణాలు ఆ కాలపు ఔన్నత్యానికి, కళాదృక్పధానికి ఆర్థిక సంపదకు తార్కాణాలు. గుప్తులు ముద్రించిన నాణాలలో ఒక వైపు వివిధ భంగిమలలో రాజుబొమ్మ, రెండొవవైపు దేవతబొమ్మ కలదు. గుప్త రాజ్య నిర్మాత మొదటి చంద్రగుపుడు వేయించిన బంగారు నాణాలపై ఒక వైపు తన బొమ్మతోపాటు కుమారదేవి బొమ్మను, రెండివ వైపు దేవితోపాటు లిచ్ఛావయః అనే ఆఖ్యవుంది. ఈ నాణాల వలన గుప్తసామ్రాజ్య సుస్థిరతలో, విస్తరణలో లిచ్ఛవులు వహించిన పాత్ర ద్యోతకమగుచున్నది. ఈ నాణాలు దొరికిన స్థలాలను బట్టి మొదటి చంద్రగుప్తుని సామ్రాజ్య విస్తీర్ణంను నిర్దేశించవచ్చును. రెండవ చంద్రగుప్తుని సింహముద్రిత నాణాలు అతని గుజరాత్ ఆక్రమణను సూచిస్తున్నాయి. నాణాలకు వాడిన లోహంలో నాణ్యతను బట్టి ఆర్థిక స్థితి చెప్పవచ్చు. స్కంధగుప్తుని తరువాత గుప్తులు ముద్రించిన బంగారు నాణాలలో 46% వరకు అపద్రవ్యం వుంది. ఇది నాటి ఆర్థిక దుస్థితికి నిదర్శనము. గుప్తుల నాణాలను బట్టి వారి ప్రధాన కులదైవం విష్ణువు అని చెప్పవచ్చును. గుప్తుల నాణాల మీద ఆఖ్యలు కూడ ఆకర్షణీయంగా వున్నాయి. కుమారగుప్తుని నాణాల మీద నెమలి చిత్రీకరించ బడింది. నాణానికి రెండోవవైపు లక్ష్మిదేవి బొమ్మ కనపడుతుంది. మొదటి కుమారగుప్తుని నాణాలను బట్టి అతని ఇష్టదైవం కార్తికేయుడు అని చెప్పవచ్చును. గుప్తుల నాణాల మీద వ్రాయబడిన కవిత్వంలో పూర్వీకుల పేర్లు వెలిశాయి. వీణవాయించే సముద్రగుప్తుని ప్రతిమగల బంగారు నాణాలు అతడి సంగీత పటిమను అభిరుచిని చాటుతున్నాయి, గుప్తుల నాణాలు రాజు సింహాన్ని చంపుతున్నట్లు లేదా పులిని చంపుతున్నట్లు లేదా ఏనుగుపై స్వారీచేస్తున్నట్లు ముద్రించబడ్డాయి. ఈ నాణాలు గుప్తురాజుల వినోదాలను తెలియజేస్తున్నవి. ఇవేగాక

నాణాలపై ముద్రించిన ప్రతిమలు, లాంఛనాలు, ఇతర చిహ్నాలు ఆయాకాలాల ప్రజల కళాభినిరతకి నిదర్శనాలు. నాణాలపై ముద్రించిన దైవ ప్రతిమలు ప్రతిమా లక్షణ శాస్త్రానికి ఉపకరిస్తాయి. అంతేగాక రాజులు ధరించే దుస్తులు, ఆభరణాలు, కిరీటాలు మొదలైనవి నాణాలపై ముద్రించిన రాజప్రతిమలను బట్టి గ్రహించవచ్చును.

### 15.2.3.3. కట్టడాలు, విగ్రహాలు, ముద్రలు :

గుప్తులు దేశములో పలుచోట్ల దేవాలయాలు నిర్మించారు. విగ్రహాలు చెక్కించి ప్రతిష్ఠించారు. అనేక చోట్ల చిత్రాలు గీయించారు. వీటి ద్వారా వారి కళాభిరుచినే గాక, ప్రజల మత విశ్వాసాలను, మతాచారాలను గురించి తెలుసుకోవచ్చు. గుప్తుల కాలంలో నిర్మించబడిన సారనాథ్‌లోని ధామేక్ స్థూపం గుప్తుల మత సహనానికి నిదర్శనం. గుప్తులు అజంతా, ఎల్లోరా, ఉదయగిరి, బాగ్‌లలో తొలిపించిన గుహాలయాలు గుహాలయ వాస్తు, చరిత్రకు తార్కాణాలు. గుప్తులు నిర్మించిన ఆలయాలు నేటికీ కొన్ని నిలిచివున్నాయి. వాటిలో దేవఘర్‌లోని దశావతార ఆలయం, భీటార్‌గావ్ దేవాలయం, తిగావాలోని విష్ణుఆలయం, భూమ్రాలోని శివాలయం, నాచన వద్ద గల పార్వతీ దేవాలయం, ఎరాన్‌లోని ఆలయం గుప్త వాస్తు కళా సంపదకు తార్కాణాలు. నాగర (రేఖా)శైలికి తొలి రూపం ఇచ్చింది గుప్తులే. ఈ కాలపు శిల్పశైలికి కేంద్రాలు మధుర, సారనాథ్ శిల్పకళలో గాంధార శిల్ప లక్షణాలు చాలా వరకు వెనుకబడి దేశీయమైన సాంప్రదాయాల ప్రభావం అధికమైంది. అందుచేత భారతీయ శిల్పానికి స్వతంత్ర వ్యక్తిత్వాన్ని, ప్రతిపత్తిని ఏర్పరచినది గుప్తులని తెలియచేయటానికి నాటి శిల్పాలే సాక్ష్యం. ఈ కాలపు శిల్పాలు అనేకం లభించాయి. వీటిలో ఉదయగిరి గుహాలోని శిల్పం ప్రత్యేకతను సంతరించుకొన్నది. రామాయణ, భాగవత గాధలను దశావతార ఆలయంలో చూడవచ్చు. గుప్తులు వైష్ణవానికి ఇచ్చిన ప్రాముఖ్యం ఈ శిల్పాల వల్ల గ్రహించవచ్చు. గుప్తుల నాటి వర్ణచిత్రాలు అజంతా గుహలలోని 16, 17, 19, సంఖ్యగల గుహలలో బాగ్ గుహలలో కలవు. వీటిలో అజంతాలోని 16 వ సంఖ్య గుహాలోని మరణశయ్యపై రాకుమార్తె చిత్రం అద్భుతమైనది. గుప్తులు సృష్టించిన శిల్పాలు చిత్రాలు దైవభక్తికీ, ఆధ్యాత్మిక ఉన్నతికి ప్రతీకలు. ముజఫర్ పూర్ జిల్లాలోని వైశాలి వద్ద లభించిన ముద్రలు ఆ కాలపు రాష్ట్రపాలన, శ్రేణుల కార్యకలాపాల గురించి అవగాహన చేసుకోనటానికి తోడ్పడతాయి.

## 15.3 గుప్తుల పుట్టుపూర్వోత్తరాలు, రాజ్య స్థాపన

భారతదేశ చరిత్రలో గుప్తుల పాలనాకాలం ఒక మహోజ్వల ఘట్టం. మౌర్య సామ్రాజ్య పతనానంతరం ఉత్తర భారతదేశంలో విశాల సామ్రాజ్యాన్ని స్థాపించి, రాజకీయ ఐక్యతను సాధించి, సమర్ధవంతమైన పాలనా వ్యవస్థను రూపొందించి, శాంతి సుస్థిరతలు నెలకొల్పి, మత సహనాన్ని పాటించి, సాహిత్య కళలను పోషించిన గుప్తులు ఘనులు. ఐతే అనేక ప్రాచీన రాజవంశాల లాగా గుప్త వంశం పుట్టుపూర్వోత్తరాలపై అందరికీ ఆమోదయోగ్యమైన అవగాహన ఏర్పడలేదు. విష్ణుపురాణం, కౌముదీ మహోత్సవము మొదలగు గ్రంధాలు, ఇత్సింగ్ రచనలు, శుంగ శాతవాహన గుప్తుల శాసనాలు, నాణాలు ద్వారా **గుప్తుల తొలిచరిత్ర** కొంతవరకు పునర్నిర్మించవచ్చు.

### 15.3.1. పుట్టుపూర్వోత్తరాలు :

భారతదేశ చరిత్రలో ఒక విశిష్టస్థానాన్ని సంపాదించుకొన్న గుప్తుల పుట్టుపూర్వోత్తరాల గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. గుప్తనామము లేదా ఇంటి పేరు ప్రాచీన భారత చరిత్రకు కొత్తకాదు. గుప్తుల ప్రస్తావన శుంగ శాతవాహన రాజుల శాసనాలలో వుంది. అయితే ఆ శాసనాలలోని గుప్తులకు సామ్రాజ్య నిర్మాతలైన ఈ గుప్తులకూ సంబంధం వుందా లేదా అనే విషయం స్పష్టముగా తేలలేదు. కానీ వీరి మధ్య సంబంధం వుందని హెచ్. సి. రాయచౌదరి అభిప్రాయపడ్డాడు.

గుప్తులు 'ధరణ' గోత్రీకులు. శుంగ వంశస్తుడైన అగ్నిమిత్రుని రాణి ధరణితో గుప్తులకు బంధుత్వము వుండవచ్చనీ అందువల్ల వారు బ్రాహ్మణ వంశస్థులని హెచ్.సి. రాయచౌదరి పేర్కొన్నాడు. వ్యాకరణవేత్త చంద్రగోమిన్ రచనలనాధారం చేసికొని గుప్తులు పంజాబ్‌లోని

'లిట్ తెగకు' చెందివుంటారని కె.సి.జయస్వాల్ అభిప్రాయపడ్డాడు. లిచ్ఛవీ రాజులతో గుప్తుల వివాహసంబంధాలు చేయడం వైశ్య సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. గుప్త ఘటోత్కచ అనే పదాలు విదేశీ పేర్లనీ గుప్తులు హిందూ రక్తానికి చెందిన వారు కాదనీ డాడ్‌వెల్ పండితుడు అభిప్రాయ పడ్డాడు.

శాసనాల ఆధారంగా గుప్తులు క్షత్రియులని పేర్కొనవచ్చు. పంజాబ్ తామ్ర శాసనాలలో ప్రస్తావించబడిన ఆరుగురు రాజుల ఇంటి పేర్లు గుప్త.ఈ తామ్ర శాసనంలో ఇంకా వారిని వంశోగుప్త అని పేర్కొనడం జరిగింది. ఈ రాజులు శైవులు. వీరు అర్జునుని వారసులమని పేర్కొన్నారు. అర్జునుడు క్షత్రియ వంశానికి చెందినవాడు. అందువల్ల గుప్తులు కూడా క్షత్రియులేనని ఎస్. చటోపాధ్యాయ అనే పండితుడు తన తొలి ఉత్తర భారత చరిత్ర గ్రంధములో పంజాబ్ తామ్ర శాసనాల ఆధారంగా పేర్కొన్నాడు.

### 15.3.2. జన్మస్థలం:

గుప్తుల కుల నిర్ణయములో ఏర్పడిన భిన్నాభిప్రాయాలతో బాటు వారి జన్మస్థానంపై కూడా భిన్నాభిప్రాయాలు వున్నాయి. గుప్తుల జన్మస్థలం బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా అనీ డి.సి. గంగూలీ అభిప్రాయపడగా, గుప్తులు బెంగాల్ వరేంద్రి ప్రాంతానికి చెందిన వారనీ యస్. చటోపాధ్యాయ, ఆర్.సి. మజుందార్ తెలియ చేశారు.

గుప్తుల జన్మస్థలం మగధ ప్రాంతమనీ కొందరు చరిత్రకారులు అభిప్రాయ పడినారు. గుప్త రాజులలో ప్రధముడైన శ్రీగుప్తుని చిలికిత మహారాజుగా ప్రస్తావిస్తూ చైనా బౌద్ధ యాత్రికుడు కొన్ని వ్యాఖ్యానాలు చేశాడు. దీనిని ఆధారంగా గుప్త రాజుల జన్మస్థలం మగధ అనీ ఈ చరిత్రకారులు నిర్ణయించారు. చిలికిత మహారాజు మిలికియోసి-కియో-పోనో అనే ప్రాంతాన్ని పాలిస్తున్నట్లు ఇత్సింగ్ పేర్కొన్నాడు. చిలికిత మహారాజు శ్రీ గుప్తుడేనని అంగీకరించినా మిలికియోసి-కియో-పోనో అనే ప్రాంతం శ్రీ గుప్తుని రాజ్యంలో భాగమని ఇంకా గుర్తించవలసి వుంది. గుప్తుల జన్మస్థలం మగధ ప్రాంతంలోనే పాటలీపుత్ర పరిసరాలలో వుండి వుంటుందని టంకశాస్త్ర నిపుణుడైన అలన్ భావించాడు. గుప్తుల పుట్టుపూర్వోత్తరాలు స్పష్టంగా లేవు. వారు తొలుత సంపన్నమైన భూస్వాములై వుండి క్రమముగా మగధ ప్రాంతములో రాజకీయ ఆధిక్యతను పొందివుండవచ్చు.

గుప్తులది రాచపుట్టుక కాదు అని రొమిలా థాపర్ పేర్కొన్నది. లిచ్ఛవీ ప్రభువులతో గుప్తులకున్న సంబంధం పై అభిప్రాయాన్ని బలపరుస్తున్నట్లు కొందరు చరిత్రకారులు భావించారు. వివాహ సంబంధాలను ఆధారంగా చేసికొని అభిజాత్యం నిర్ణయించడం పాలకుల విషయంలో సరికాదు. ఎందువల్లనంటే రాజకీయ అవసరాలు వారి జీవితంలో అన్నింటి కంటే ముఖ్యపాత్ర వహిస్తాయి.

పురావస్తు ఆధారాల సహాయములో గుప్తుల జన్మ స్థలం గురించి పరిశీలించినప్పుడు వారి జన్మస్థలం నేటి ఉత్తర ప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతమని తెలుస్తుంది. రాజుల తొలినాటి శాసనాలు, నాణాలు వారి జన్మస్థల ప్రాంతాలలో దొరుకుతాయన్నది పండితులందరు అంగీకరించిన విషయం. నేటి ఉత్తర ప్రదేశ్‌లోని ఉత్తర తూర్పు ప్రాంతములో పధ్నాలుగు స్థలాలలో గుప్తుల నాణాలు లభించాయి. బీహార్, బెంగాల్‌లలో రెండేసి ప్రాంతాలలో మాత్రమే లభ్యమయ్యాయి. బెంగాల్, బీహార్‌లలో దొరికిన నాణాలు చివరి గుప్తరాజులు ముద్రించినవి. ఇదే రీతిలో తొలి గుప్త రాజుల శాసనాలు కుడా లభించాయి. గుప్తరాజుల తొలి నూటయాభై సంవత్సరాల పాలనకు సంబంధించి పదిహేను శాసనాలు బెంగాల్, బీహార్, తూర్పు ఉత్తరప్రదేశ్‌లో లభ్యమయ్యాయి. ఇందులో ఎనిమిది శాసనాలు తూర్పు ఉత్తర ప్రదేశ్‌లోనే లభించాయి. మిగతా ఏడింటిలో రెండు మగధప్రాంతంలో, అయిదు బెంగాల్ ప్రాంతంలో లభించాయి. బెంగాల్ లో దొరికిన శాసనాలు మొదటి కుమారుగుప్తుని కాలానికి చెందినవి. మగధ ప్రాంతంలో దొరికిన గయ శాసనంలో ఉత్తర ప్రదేశ్ తూర్పు ప్రాంతానికి గుప్తరాజులకు వున్న అవినాభావ సంబంధం గురించి ప్రస్తావించబడి వుంది. అలహాబాద్ ప్రశస్తి కూడా ఈ విషయాన్నే నిర్ధారిస్తున్నది. అలహాబాద్ ప్రశస్తిలోని అంశాలను బట్టి, శాసనాలు దొరికిన ప్రాంతాలను బట్టి తొలి గుప్తరాజుల అధికార కేంద్రం తూర్పు ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ ప్రాంతమని, మగధ లేదా

బెంగాల్ కాదని **చాలా** మంది చరిత్రకారులు విశ్వసిస్తున్నారు. పురాణాలలో లభ్యమౌతున్న సాక్ష్యాధారాలు కూడా పురావస్తు ఆధారాల ద్వారా అందుబాటులోకి వచ్చిన సాక్ష్యాలతో ఏకీభవిస్తున్నాయి. వాయుపురాణములో కొన్ని చోట్ల చేసిన ప్రస్తావనలను బట్టి తొలి గుప్తరాజులు మగధ పశ్చిమ భాగంనుంచి ప్రయాగ వరకు పాలించారని చెప్పవచ్చు. ఉత్తర ప్రదేశ్ లోని ప్రయాగను కేంద్రముగా చేసికొని గుప్తప్రభువులు తమ రాజ్య విస్తరణకు కృషి చేశారని భావించడంలో తప్పు లేదు.

మరికొన్ని ఆధారాలు లభించేవరకు గుప్తుల పుట్టు పూర్వోత్తరాలు, జన్మస్థలం మొదలగు వాటి గురించి నిర్ద్వంద్వముగా నిర్ణయించటం సాధ్యం కాదు.

## 15.4. గుప్తరాజ్య స్థాపన :

క్రీ.శ. - మూడవ శతాబ్దం చివరిలో నాల్గవ శతాబ్దం ప్రారంభంలో భారతదేశంలో మహాసామ్రాజ్య ఏర్పాటుకు పరిస్థితులు అనుకులముగా వున్నాయి. ప్రధానంగా ఉత్తర భారత దేశంలో రాజకీయ పరిస్థితులు సామ్రాజ్య ఏర్పాటుకు అనుకూలముగా వున్నాయి. గుప్తులు రాజ్యాన్ని స్థాపించే నాటికి భారతదేశంలో బలమైన రాజ్యం ఒకటికూడా లేదు. దేశమంతా అనేక భాగ విభాగాలుగా విడిపోయింది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో రాజవంశం పాలిస్తుంది. వీటిలో కొన్నింటిలో రాచరికవ్యవస్థ వుంటే మరికొన్నిటిలో గణతంత్ర వ్యవస్థ వుంది. దేశంలో అధికభాగం విదేశీజాతుల ఆధీనంలో వుంది. సింధునదికి వాయవ్యమున వున్న ప్రాంతంలో సస్సానియన్లు, సింధు ప్రాంతంలో దేవపుత్రషాహీలు, పశ్చిమ పంజాబ్‌లో మద్రకులు, తూర్పు పంజాబ్ ప్రాంతంలో యౌధేయులు, యమునకు పశ్చిమప్రాంతంలో అర్జునాయనులు, రాజస్థాన్ ప్రాంతంలో మాళవులు, దిగువ సింధు గుజరాత్ ప్రాంతాలలో శకులు, మధుర, గ్వాలియర్, విదిశ ప్రాంతాలలో చిన్న చిన్న నాగరాజ్యాలు, నేపాల్‌లోయ వైశాలి ప్రాంతాలలో లిచ్ఛవులు, కామరూప. దావకం, సమతటం మొదలగు చోట్ల గణరాజ్యాలు కలవు. దక్షిణదేశంలో కూడ అనేక చిన్న రాజ్యాలు కలవు. ఇలాంటి పరిస్థితులు గుప్తసామ్రాజ్యం ఏర్పాటుకు అవకాశం కల్పించాయి.

### 15.4.1. శ్రీగుప్తుడు :

గుప్తవంశస్థాపకుడు శ్రీగుప్తుడు. ఇతడు క్రీ.శ 4 వ శతాబ్ది ఆరంభంలో పాలించి వుంటాడు. ఇతని అధికారం మగధ, బెంగాల్ ప్రాంతాలకు పరిమితమైంది. ఇతడు మహారాజా బిరుదాంకితుడు. బహుశా ఇతడు కుషాణ చక్రవర్తి వద్ద సామంతుడై వుంటాడు. అయితే ఇతడు ఏ కుషాణచక్రవర్తి దగ్గర సామంతుడు అన్న విషయం తెలియరాలేదు. ఇతడు చైనా యాత్రికుల కోసం ఒక ఆలయాన్ని నిర్మించి దాని ఖర్చుల నిమిత్తం 24 గ్రామాలు దానం చేసినట్టు చైనా యాత్రికుడు ఇత్సింగ్ వ్రాశాడు.

### 15.4.2. ఘటోత్కచ గుప్తుడు :

శ్రీగుప్తుని తరువాత అతని కుమారుడైన ఘటోత్కచుడు రాజ్యానికి వచ్చాడు. తండ్రివలే ఇతడు కూడ మహారాజా బిరుదాంకితుడు. అనగా ఇతడు కూడ సామంతరాజే. ఇతడు క్రీ.శ 319 వరకు పాలించాడు.

### 15.4.3. మొదటి చంద్రగుప్తుడు : (క్రీ.శ 319-335)

గుప్త వంశంలో తొలి స్వతంత్రపాలకుడు మొదటి చంద్రగుప్తుడు. ఇతడు ఘటోత్కచగుప్తుని తరువాత రాజ్యానికివచ్చాడు. ఇతడు మహారాజాధిరాజ అను బిరుదు ధరించాడు. ఈ బిరుదు అతని స్వతంత్రపాలనకు ప్రమాణము. ఇతడు లిచ్ఛవీ రాకుమారియైన కుమారదేవిని వివాహమాడినాడు. లిచ్ఛవులు వైశాలిని, నేపాల్‌లోయను పాలిస్తూ వున్న ఒక బలమైన గణతంత్రరాజ్యానికి చెందినవారు. లిచ్ఛవులతో

సంబంధము చంద్రగుప్తునికి గొప్పగా లాభించింది. ఈ వివాహం వలన లిచ్ఛవుల అండదండలే గాక వారి రాజ్యంలో కొంత భూభాగం కూడ చంద్రగుప్తునికి లభించాయి. దానితో చంద్రగుప్తుని బలం పెరిగింది. అంతేగాక ఆర్థిక పరిస్థితి మెరుగైంది. అందుకు నిదర్శనం అతడు వేయించిన బంగారు నాణాలే. ఈ నాణాలపైన ఒక వైపు తన బొమ్మతోపాటు తన రాణి కుమారదేవి బొమ్మను, రెండవైపు దేవి బొమ్మతో పాటు లిచ్ఛావయః అనే ఆఖ్య ముద్రించబడింది. ఈ రకపు నాణాలను బట్టి మొదటిచంద్రగుప్తుడు వివాహంవల్ల ఎంతగా లాభించాడో అర్థం చేసుకోవచ్చు. ఈ వివాహసంబంధం వల్ల తన రాణి బంధువులు గతంలో అధికారం చెలాయించిన ప్రాంతాలకు వారసుడు కావడమే గాకుండ మగధ పరిసర ప్రాంతాలలో ఉన్నతస్థానాన్ని పొందాడని స్మిత్ అంటాడు. చంద్రగుప్తుడు కౌశాంబి, కోసలరాజ్యాలను జయించి తన రాజ్యాన్ని మరింత విస్తరింపచేశాడు. చంద్రగుప్తుని రాజ్యంలో సాకేత, (అయోధ్య), ప్రయాగ, మగధ చేరి వున్నట్లు పురాణాలలో చెప్పబడినది. సముద్రగుప్తుని దిగ్విజయాలను బట్టి ఇతని రాజ్యం బీహర్, బెంగాల్ అయోధ్యలకు వ్యాపించినట్లు తెలుస్తుంది.

మొదటి చంద్రగుప్తుని రాజ్యం బెంగాల్‌లోని నాడియా నుండి ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యవరకు, నేపాల్‌లోని భాజపూర్ నుండి బీహార్‌లోని చక్రధరపూర్ వరకు వ్యాపించింది. చంద్రగుప్తుడు క్రీ.శ 320 లో గుప్తశకం ప్రారంభించినాడు. ఇతడు క్రీ.శ 335 వరకు పరిపాలించాడు.

## 15.5. సారాంశము :

గుప్తుల యుగం భారత దేశ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని స్థాపించింది. గుప్తుల చరిత్ర తెలిసికోవటానికి సాహిత్య ఆధారాలు, పురావస్తు ఆధారాలు విరివిగా లభిస్తున్నాయి. వారి పుట్టు పూర్వోత్తరాలు, జన్మస్థలి, రాజ్యస్థాపన మొదలైన అంశాలపై ఖచ్చితమైన అవగాహన చరిత్ర కారులలో కొరవడింది. ఐనను, గుప్తవంశ స్థాపన, రాజ్య విస్తరణలలో శ్రీ గుప్తుడు, ఘటోత్కచ గుప్తుడు, మొదటి చంద్ర గుప్తుడు చేసిన కృషి ఫలితంగానే ఒక మహోన్నతమైన సామ్రాజ్య నిర్మాణం జరిగింది.

## 15.6 మాదిరి ప్రశ్నలు :

1. గుప్త యుగ చరిత్రకు ఆధారాలు తెలుపుము?
2. గుప్తుల పుట్టు పూర్వోత్తరాలు - రాజ్య స్థాపన గూర్చి వ్రాయుము?

## సంక్షిప్త ప్రశ్నలు :

1. గుప్తయుగ చరిత్రకు సంబంధించి పురావస్తు ఆధారాల గూర్చి వ్రాయుము?
2. మొదటి చంద్ర గుప్తుని గూర్చి వ్రాయుము?

డా॥ వి.క. మోహన్

పాఠం - 16

# గుప్త సామ్రాజ్య విస్తరణ

**16.0 లక్ష్యం:-**

గుప్త సామ్రాజ్య విస్తరణలో సముద్రగుప్తుడు, రెండవచంద్రగుప్తుడు, కుమారగుప్తుడు, స్కందగుప్తుల పాత్రను వివరించడం ఈ పాఠం లక్ష్యం.

**విషయ క్రమం :**

- **16.1** సముద్ర గుప్తుడు
- **16.2** దండయాత్రలు
- **16.3** రెండవ చంద్ర గుప్తుడు
- **16.4** యుద్ధాలు
- **16.5** పరిపాలన
- **16.6** సాహిత్య పోషణ
- **16.7** పరమత సహనం
- **16.8** నాణాలు
- **16.9** ఫాహియాన్‌రాక
- **16.10** ఘనత
- **16.11** కుమార గుప్తుడు
- **16.12** స్కంధ గుప్తుడు
- **16.13** సారాంశము
- **16.14** మాదిరి ప్రశ్నలు

## 16.1 సముద్రగుప్తుడు : (క్రీ.శ. 335-380)

మొదటి చంద్రగుప్తునికి వారసునిగా అతని కుమారుడైన సముద్రగుప్తుడు క్రీ.శ 335 లో సింహాసనం అధిష్టించి 380 వరకు రాజ్యపాలన చేశాడు. ప్రాచీన భారతదేశ చరిత్రలో పేరుగాంచిన కొద్దిమంది చక్రవర్తులలో సముద్రగుప్తుడు ఒకడు. ఇతడు మిక్కిలి పరాక్రమవంతుడు. యుద్ధతంత్రములో ఆరితేరినవాడు. పరాజయం ఎరుగని వీరుడు. సైనిక విజయాలలో ప్రాచీన భారతచరిత్రలో ఇతనికి సాటి మరొకడు లేడు. ఇతడు పరిపాలనాదక్షుడు. వివిధ రకాల 100 యుద్ధాలలో తన సైనిక బలంతో సముద్రగుప్తుడు ప్రావీణ్యం సంపాదించాడని, యుద్ధాలలో పాల్గొనటం వలన శరీరంపై 100 గాయాల మచ్చలతో శోభిల్లేవాడని హరిసేనుడు పేర్కొన్నాడు. "సముద్రగుప్తుడు అనేక యుద్ధరంగాలందు విజేతయై వెలుగొంది, తన జైత్రయాత్రల ద్వార భారత దేశంలోని వివిధ ప్రాంతాలపై తన సార్వభౌమాదికారాన్ని నెలకొల్పిన దిట్ట" అని ఆర్.కె. ముఖర్జీ ప్రశంసించాడు.

### 16.1.1 ఆధారాలు :

సముద్రగుప్తుని గురించి తెలుసుకొనుటకు గల ఆధారాలు (1) హరిసేనుడు సంస్కృత భాషలో అలహాబాద్‌లోని అశోక శిలాస్తంభంపై కావ్యశైలిలో వ్రాసిన ప్రశస్తి. (2) ఎరాన్ శిలాశాసనం (3) సముద్ర గుప్తుని నాణాలు.

### 16.1.2. సింహాసనం అధిష్టించుట :

మొదటి చంద్రగుప్తునికి, కుమారదేవికి జన్మించినవాడు సముద్రగుప్తుడు. చంద్రగుప్తుడు ఇతనిని నిండు సభలో కౌగలించుకొని 'నీవు సమర్థుడవు. నీవు రాజ్యాన్ని పాలించు' అని అన్నాడనీ అందువల్ల ఇతడు పెద్దకుమారుడు కాకపోయినప్పటికి తండ్రి ఇతనిని వారసునిగా నిర్ణయించి సభాసదుల ఆమోదంతో రాజ్యాభిషిక్తుడిగా చేశాడని అలహాబాదు శిలా శాసనం తెలుపుతుంది. 'కచ' అనే పేరుతో కొన్ని నాణాలు లభించడం వల్ల అవి చంద్రగుప్తుని పెద్దకుమారుడివని, అతడు సముద్రగుప్తుని ప్రతిఘటించి, కొద్ది రోజులు రాజ్యాన్ని పాలించాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. నాణాలను క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట అలన్ అనే పండితుడు ఈ వాదాన్ని త్రోసిపుచ్చుతూ, సముద్రగుప్తుడు అనేది బిరుదనామమని, కచ అనేది అతని తొలి పేరు అని, అందువల్ల కచ, సముద్రగుప్త అనే పేర్లు రెండు ఒకే వ్యక్తికి చెందినవని అని నిర్ధారించాడు.

### 16.1.3 నాటి పరిస్థితులు:

కుషాణులు తరువాత భారతదేశం అనేక భాగ, విభాగాలుగా విడిపోయింది. ఈ విభాగాలలోని రాజవంశాలు భిన్న రాజ్యాంగ పద్ధతులను అవలంబిస్తున్నారు. మగధ ప్రాంతంలో ప్రముఖమైన లిచ్ఛవి రాజ్యముంది. రాజపుత్రస్థానంలో విదేశీ అధికారం కొనసాగుతున్నది. బెంగాల్ అనేక భాగాలుగా విడివడి వుంది. వింధ్య ప్రాంతంలో అనేక రాజవంశాలు కలవు. దక్షిణాన చోళులు, పాండ్యులు, పల్లవులు, చేర రాజులు పాలిస్తూవున్నారు. సముద్ర గుప్తుడు రాజ్యానికి వచ్చే నాటికి భారతదేశం పైన చెప్పబడినట్లుగా చిన్న చిన్న రాజ్యాలుగా విడబడివుంది. తన సైనిక బలంతో సముద్రగుప్తుడు దిగ్విజయయాత్రలు, దండయాత్రల ద్వారా ఉత్తర భారత దేశాన్ని ఏకం చేసాడు.

## 16.2 దండయాత్రలు:

సముద్రగుప్తుడు సామ్రాజ్యవాది. భారతదేశాన్నంతటిని జయించి చక్రవర్తి కావలెను అనే ఆశయంతో అతడు అనేక దిగ్విజయ యాత్రలు చేపట్టాడు. సముద్రగుప్తుని విజయ పరంపర అతని మంత్రియైన హరిసేనునిచే కూర్చబడిన అలహాబాద్ ప్రశస్తి లో వర్ణించబడింది. భారతదేశాన్ని రాజకీయంగ సమైక్యపరచి మహాపద్మనందుని వలే ఏకైక చక్రవర్తిగా పాలించాలన్న ధ్యేయమే సముద్రగుప్తుని దిగ్విజయాల అంతర్యమని హెచ్. సి. రాయచౌదరి పేర్కొన్నాడు. సముద్రగుప్తుడు సింహాసన మధిష్ఠించిన నాటినుండి దురాక్రమణ విధానాన్ని అనుసరించి చుట్టుప్రక్కల రాజ్యాలను కబళించి తన రాజ్యాన్ని విస్తరింపచేయడానికి పూనుకున్నాడని స్మిత్ అంటాడు. సముద్రగుప్తుడు సాధించిన సైనిక విజయాలను నాలుగు ప్రధాన భాగాలుగా విభజింపవచ్చును. అవి (1) మొదటి ఆర్యావర్త దండయాత్ర (2) దక్షిణ దేశ దిగ్విజయ యాత్ర (3) రెండో ఆర్యావర్త దండయాత్ర (4) అటవిక రాజ్యాల దండయాత్ర.

### 16.2.1 మొదటి ఆర్యావర్త దండయాత్ర:

మొట్టమొదట సముద్రగుప్తుడు ఆర్యావర్తములోని నాగరాజ్యాలపై దండెత్తాడు. అహిచ్ఛత్ర పురాధీశుడైన అచ్యుతనాగుని, మధుర పాలకుడైన నాగసేనుని, పద్మావతీ (గ్వాలియర్ ప్రాంతం) రాజ్యపాలకుడైన గణపతి నాగుని ఓడించి వారి రాజ్యాలను ఆక్రమించాడు. తరువాత శ్రావస్తి ప్రాంతాన్ని పాలిస్తున్న కోట వంశస్తులను ఓడించి వారి రాజ్యాన్ని కూడ తన రాజ్యంలో కలుపుకున్నాడు.

ఆర్యావర్తంలో సముద్రగుప్తుడు ప్రధానంగా జయించవలసిన ప్రాంతం గంగా మైదానం. ప్రయాగ ప్రాంతంలో ఆవిర్భవించిన గుప్తులకు సహజంగానే ఆగ్నేయంలో వున్న బెంగాల్, సముద్ర తీర ప్రాంతంపైన మొదట దృష్టి పడాలి. కాని సముద్రగుప్తుడు ఆగ్నేయం వైపు వెళ్ళకుండ

పశ్చిమ ప్రాంతం వైపు దాడి చేశాడు. ఆర్యావర్తంలో నాడు నాగజాతి రాజ్యాలు చాలా బలమైనవి. గుప్తుల రాజ్య విస్తరణకు నాగరాజ్యాలు ఒక అడ్డుగా నిలిచాయి. అందువల్ల మొదట గుప్తులు తమ రాజ్యవిస్తరణ కాంక్ష తీర్చుకోవడానకి మొదట నాగరాజ్యాలపై దృష్టి సారించవలసి వచ్చింది. భారశివ రాజ్యంలో భానాగుడు, వాకాటక రాజ్యంలో మొదటి ప్రవరశేనుడు మరణించడం అదునుగా తీసుకొని సముద్రగుప్తుడు దాడి చేసి నాగ రాజ్యాలు ఆక్రమించాడు.

### 16.2.2. దక్షిణ దేశ దిగ్విజయ యాత్ర:

నాగరాజ్యాలను ఆక్రమించిన పిమ్మట సముద్రగుప్తుడు దక్షిణ దిగ్విజయ యాత్రకు పూనుకున్నాడు. ఇది అతని దండయాత్రలలో అత్యంత విశిష్టమైనది. అలహాబాద్ ప్రశస్తి అతని సైనిక విజయాలను వివరంగా వర్ణిస్తుంది. సముద్రగుప్తునిచే ఓడింపబడిన 12 మంది రాజులు, వారి రాజ్యాలు దిగువ సూచించిన విధంగా వున్నాయి.

| రాజు | రాజ్యం | నేటిప్రదేశం |
|---|---|---|
| 1. మహేంద్రుడు | కోసల | మధ్యప్రదేశ్ లోని బిలాసపూర్, రాయపూర్, సంబల్ పూర్ జిల్లాలు |
| 2. వ్యాఘ్రరాజు | మహాకాంతార | ఆటవిక రాజ్యము, మధ్యప్రదేశ్‌లోని బస్తర్ జిల్లా |
| 3. మంతరాజు | కురాల | కులాట ప్రాంతము, మధ్యప్రదేశ్‌లోని చాంద్‌జిల్లా |
| 4. దమనుడు | ఎరండపల్లి | శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాలవలస |
| 5. స్వామిదత్తుడు | కోత్తూరు | విశాఖపట్నం జిల్లాలోని కొత్తూరు |
| 6. కుబేరుడు | దేవరాష్ట్రము | వైజాగ్ జిల్లాలోని ఎలమంచిలి ప్రాంతము |
| 7. మహేంద్రుడు | పిష్టపురము | తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురము |
| 8. హస్తివర్మన్ | వేంగి | పశ్చిమగోదావరి జిల్లాలోని పెదవేగి |
| 9. నీలరాజు | అవముక్త | వేంగి సమీపమున కలదు. |
| 10. ఉగ్రసేనుడు | పాలక | పాలక్కడ-నెల్లూరు జిల్లాలోని పులికాట్ |
| 11. విష్ణుగోపుడు | కంచి | కాంచీపురం, పల్లవుల రాజధాని |
| 12. ధనంజయుడు | కుశస్థలపురము | ఉత్తర ఆర్కాటు జిల్లాలోని కుట్టులూరు. |

### 16.2.3. దండయాత్ర మార్గం:

అలహాబాద్ ప్రశస్తిలోని దేవరాష్ట్రను మహారాష్ట్రతోను, ఎరండోల్‌తోను గుర్తించి సముద్రగుప్తుడు దక్షిణ దేశమునకు వెళ్ళినపుడు తూర్పు తీరమార్గమును, తిరిగి వచ్చునపుడు పశ్చిమ తీరమార్గమును అనుసరించినట్లు కొందరు చరిత్రకారులు అభిప్రాయపడినారు. కాని ఈ అభిప్రాయం సహేతుకంగా లేదు. ఎందువలననగా ఆ ప్రదేశాలు పశ్చిమ తీర ప్రాంతాల కంటే తూర్పు తీర ప్రాంతాలతోనే సక్రమంగా సరిపోవుచున్నవి. అంతేగాక నాడు వింధ్య పర్వత ప్రాంతంలో వాకాటకులు బలవంతులై పాలించుచున్నారు. వాకాటకుల ప్రసక్తి అలహాబాద్ ప్రశస్తిలో కానరాదు. అందువలన సముద్రగుప్తుడు తూర్పుతీరాన పురోగమించి, మరల తూర్పుతీరముననే తిరోగమించాడని చరిత్రకారుల అభిప్రాయము.

### 16.2.4. పరాజిత ప్రభువుల పట్ల అతని విధానం:-

సముద్రగుప్తుడు దక్షిణ దేశ దండయాత్రలో తాను జయించిన రాజ్యాలను తిరిగి ఆయా రాజ్యపాలకులకే ఇచ్చి, వారి నుంచి కప్పాలను స్వీకరించి, వారిని తన సామంతులుగా అంగీకరించి తృప్తి చెందాడు. సుదూర ప్రాంతాలను తన సామ్రాజ్యంలో చేర్చుకొని పాలించుట కష్టమని తలంచడం వలననే అతడు ఇట్లు చేశాడు. ఈ దండయాత్రలో అతడు 'గ్రహణం-మోక్షం-అనుగ్రహం' అను సూత్రాన్ని పాటించాడు.

### 16.2.5 రెండో ఆర్యావర్త దండయాత్ర:-

సముద్రగుప్తుడు దక్షిణ దిగ్విజయయాత్రలో వుండగ 9 మంది రాజులు ఉత్తరాన ఒక కూటమిగా ఏర్పడి గుప్త రాజ్యంపై దండెత్తి ప్రయాగ పరిసర ప్రాంతాలు ఆక్రమించారు. ఈ కూటమికి రుద్రదేవుడు నాయకత్వం వహించాడు. రుద్రదేవుడు వాకాటక రాజైన మొదటి రుద్రసేనుడని కొందరి చరిత్రకారుల అభిప్రాయం. పరిస్థితి చేయిదాటి పోక పూర్వమే సముద్రగుప్తుడు వేగంగా తన రాజ్యానికి తిరిగివచ్చి శత్రుకూటమిని 'కౌశాంబి' దగ్గర ఎదుర్కొని, ఓడించి, కూటమి నాయకుడైన రుద్ర దేవుని వధించాడు. విష్ణుపురాణంలో పేర్కొన్న నవనాగులు ఈ కూటమిలో చెప్పిన 9 మంది రాజులేనని రాప్సన్ అభిప్రాయం. ఈ విజయం వలన సముద్రగుప్తుని అధికారము ఉత్తరాపథంలో సుస్థిరమైంది. సముద్రగుప్తుడు ఆర్యావర్తంలో ఓడించి, వధించిన 9 మంది రాజుల పేర్లు అలహాబాద్ ప్రశస్తిలో కలవు. ఆ రాజుల పేర్లు :

1. అచ్యుత - అహిచ్ఛత్ర పురాధీశుడు
2. నాగసేన - మధుర పాలకుడు
3. గణపతి నాగ - పద్మావతి రాజ్యపాలకుడు
4. రుద్రదేవ - వింధ్యపర్వత ప్రాంతపాలకుడు
5. మటిల - ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంత అధిపతి.
6. నాగదత్త - మధ్యభారతంలోని నాగరాజు
7. చంద్రవర్మన్ - పశ్చిమ బెంగాల్‌లోని బంకూర ప్రాంతాధిపతి
8. నంది - మధ్య భారతంలోని నాగరాజు
9. బలవర్మన్ - మధ్య భారతంలోని నాగరాజు

### 16.2.6. అటవిక రాజ్యాలు:

ఆ తరువాత సముద్రగుప్తుడు 18 ఆటవిక రాజ్యాలను జయించినట్లు ఎరాన్ శాసనంలో చెప్పబడింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ నుంచి, మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ వరకు గల భూభాగంలో ఈ 18 ఆటవిక రాజ్యాలున్నట్లు శాసనంలో చెప్పబడింది. అయితే పరాజయం చెందిన ఆటవిక రాజులను సామంతులుగా అంగీకరించి, సముద్రగుప్తుడు వారి నుంచి కప్పాలను స్వీకరించి, వారి రాజ్యాలను వారికే అప్పగించాడు.

### 16.2.7 సరిహద్దు రాజ్యాలు:-

గుప్త సామ్రాజ్యపు సరిహద్దులలో వున్న ఐదు రాజ్యాలు తమ ఇష్టాను సారంగా సముద్రగుప్తునికి కప్పం చెల్లించి అతనికి విధేయులై అతని ఆజ్ఞలను పాటించేవారని అలహాబాద్ ప్రశస్తిలో చెప్పబడింది.

ఆ ఐదు రాజ్యాలు ఏమనగా:

(1) సమతట - తామ్రలిప్తికి తూర్పున వున్న ప్రదేశం

(2) దావక - అస్సాంలోని దబోక్ ప్రాంతం

(3) కామరూప - అస్సాంలోని గౌహతి ప్రాంతం

(4) నేపాల్ - ప్రస్తుత నేపాల్

(5) కర్త్రిపుర - హిమాలయాలను ఆనుకొని వున్న రోహిత్ ఖండ ప్రాంతం.

సముద్రగుప్తుడు తన సామ్రాజ్యం పటిష్టంగాను, భద్రంగాను వుండేందుకు, సరిహద్దులలో సామంత రాజులను ఏర్పరచుకున్నాడు. సరిహద్దులలో తాను ఓడించిన రాజుల పట్ల సముద్రగుప్తుడు అవలంభించిన ఉదార వైఖరి అతని రాజనీతికి తార్కాణము.

## 16.2.8 గణతంత్ర రాజ్యాలు:-

సరిహద్దు రాజ్యాలవలే 9 మంది గణతంత్ర రాజ్యాల రాజులు కూడ సముద్రగుప్తునికి కప్పం చెల్లించి అతని ఆజ్ఞను పాటించేవారని, అలహాబాద్ ప్రశస్తిలో పేర్కొనబడినది. ఆ 9 గణరాజ్యాల వారు:

1. అర్జునాయనులు- భరత్‌పూర్, ఆళ్వాల్ ప్రాంతం
2. యౌధేయులు - తూర్పు పంజాబ్ ప్రాంతం
3. మద్రకులు - రావి, చీనాబ్ నదుల మధ్య ప్రాంతం
4. మాళవులు - మాళ్వ ప్రాంతం
5. ఆభీరులు - పశ్చిమ రాజస్థాన్ ప్రాంతం
6. ప్రార్జనులు - మధ్యప్రదేశ్‌లోని భాగం
7. సనకనికులు - తూర్పు మాళ్వ ప్రాంతం
8. కాకలు - సాంచి ప్రాంతం
9. ఖరపరికలు - మధ్యభారత ప్రాంతం.

గణతంత్ర రాజ్యాలు, సరిహద్దు రాజ్యాలు స్వచ్ఛందంగ ఈ రాజ్యాలపై సైనిక విజయ యాత్రలు చేయవలసి వచ్చిందా అనువిషయము ప్రశస్తిలో పేర్కొనబడలేదు. మొదట్లో సముద్రగుప్తుడు ఈ రాజ్యాలతో స్నేహం చేసి వుంటాడు. నాగ రాజ్యాలకు, గణతంత్రరాజ్యాలకు మధ్య శతృత్వం వుండడమే అందుకు కారణం. ఆర్యావర్తంలో సముద్రగుప్తుడు తన స్థానాన్ని పదిలపరుచుకున్న తరువాత అప్పటి వరకు తన స్నేహితులుగా వున్న ఈ గణతంత్రరాజ్యాల వారిని తన సామంతుల స్థాయికి తీసుకువచ్చాడు.

## 16.2.9 విదేశీ రాజ్యాలు:-

సముద్రగుప్తుని విజయాలు, పేరు ప్రఖ్యాతలు విన్న విదేశీ రాజ్యాధిపతులు అతనితో స్నేహసంబంధాలు నెలకొల్పుకున్నారు. **అట్టివారిలో కాబుల్ లోయను పాలించు కుషాణ ప్రభువు, పశ్చిమ ఇండియాను పాలించు శకరాజులు,** సింహళరాజు, జావా, సుమత్రా ప్రభువుల

ముఖ్యులు. సింహళ ప్రభువు మేఘవర్ణుడు సముద్రగుప్తుని వద్దకు కానుకలతో రాయబారిని పంపి అతని అనుమతితో సింహళదేశ యాత్రికుల సౌకర్యార్థం బుద్ధగయలో ఒక విహారాన్ని నిర్మించాడు.

### 16.2.10 సమీక్ష :-

సముద్రగుప్తుని విజ్ఞత వల్ల గుప్త సామ్రాజ్యం చుట్టూ ఆయన మీద ఆధారపడినవారు, సామంతులు, స్నేహపూరిత రాజ్యాల వలయం ఏర్పడింది. సముద్రగుప్తుడు తన విదేశ విధానంలో గొప్ప రాజనీతిని ప్రదర్శించాడు. ఉత్తర భారతదేశంలో గంగా మైదాన ప్రాంతాన్ని ప్రత్యక్ష పాలనలోకి తెచ్చుకోవడం, తన రాజ్యం చుట్టూవున్న అటవిక రాజులు, వాయవ్య భారతదేశానికి చెందిన శకులు, కుషాణులతో సత్సంబంధాలు ఏర్పరచుకొనడం, ప్రత్యక్ష పాలనకు అవకాశం లేని దక్షిణదేశ రాజులను ఓడించిన తరువాత సామంతులుగా స్వీకరించడం, ఇతరదేశాలకు చెందిన రాజులతో దౌత్య సంబంధాలద్వార స్నేహం పెంపొందించుకోవడం సముద్రగుప్తుని రాజనీతి విశిష్టతలుగా పేర్కొనవచ్చు.

సముద్రగుప్తుని దండయాత్రలను పరిశీలిస్తే కౌశాంబి యుద్ధం తప్ప మిగిలినవన్ని అంతగా గణించదగినవి కాదు. ఉత్తరాన అతడు మొదట జయించిన రాజ్యాలు బలమైనవి కావు. అట్లాగే దక్షిణ దేశ దండయాత్రలు అతడు గెలుచుకున్న రాజులలో పల్లవులు తప్ప మిగతావారందరు అనామకులే. వారి రాజ్యాలు చాలా చిన్నవి. ఆటవిక రాజ్యాల మీద సముద్రగుప్తుని గెలుపు కూడ అటువంటిదే. సరిహద్దు రాజ్యాలు, గణతంత్రరాజ్యాలు లొంగివున్నాయి. అంటే వాటి అనైక్యత, సైనిక బలహీనత స్పష్టమవుతుంది. సముద్రగుప్తుడు చిన్న చిన్న రాజ్యాలను గెలుచుకున్నాడే తప్ప ఎక్కడ భారీ ఎత్తున యుద్ధం చేయలేదు. ఇతడు వాకాటకులతో ముఖాముఖి యుద్ధానికి దిగలేదు. కాశ్మీర్, సింధు, గుజరాత్‌లపై దండెత్తలేదు. అలహాబాద్ ప్రశస్తిలోని అతని విజయాలలోని వాస్తవమెంత, అతిశయోక్తి ఎంత అను అంశం మరికొన్ని ఆధారాలు లభించినపుడే విదితం కాగలదు. 'పశ్చిమ గణతంత్ర రాజ్యాలను కూలద్రోసి సముద్రగుప్తుడు భావికాలంలో గుప్తుల ఉనికికి ప్రమాదం తెచ్చిపెట్టాడని లేనట్లయితే ఆ గణరాజ్యాలు హూణుల దండయాత్రల సమయంలో రక్షణ కవచాలుగా వుండేవని' రోమిల్లా థాపర్ అభిప్రాయపడ్డారు.

సముద్ర గుప్తుడు సాధించిన దిగ్విజయాలను ఇతర ప్రగతిని దృష్టిలో వుంచుకొని, 'సముద్రగుప్తుడు సాటిలేని మేటివీరుడు పరిపాలనదక్షుడు' అనీ ఆర్.సి మజుందార్ కీర్తించాడు. అనేక రాజ్యాలను స్వల్పకాలంలో జయించుటవలన వి.ఎ స్మిత్ ఇతనిని ఇండియన్ నెపోలియన్ గా వర్ణించాడు. కాని నెపోలియన్ కంటే ఇతడు ఘనుడు. ఎందుకంటే నెపోలియన్ వలే ఇతడెప్పుడు పరాజితుడు కాలేదు.

### 16.2.11 అశ్వమేధ యాగం:-

తాను సాధించిన విజయ సూచికంగ సముద్రగుప్తుడు అశ్వమేధ యాగం చేశాడు. ప్రాచీన కాలంలో అశ్వమేధయాగం సార్వభౌమాధికార స్థాపనకు చిహ్నంగా వుండేది. ఈ సందర్భంగ అతడు యాగాశ్వప్రతిమతో బంగారు నాణాలు ముద్రించాడు. అలహాబాద్ స్తంభ శాసనంలో ఈ అశ్వమేధయాగ ప్రసక్తి లేకపోవడం గమనించ దగ్గ విషయం.

### 16.2.12 సామ్రాజ్య విస్తీర్ణం:-

పై విజయాలతో సముద్రగుప్తుని సామ్రాజ్యం ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణాన నర్మదవరకు, పడమర తూర్పు పంజాబ్, చంబల్ నదిలోయ నుండి తూర్పున బ్రహ్మపుత్ర వరకు విస్తరించింది.

### 16.2.13 ఘనత:-

స్మిత్ పేర్కొనట్లు సముద్రగుప్తుడు గొప్ప యోధుడు. మహా మేధావి. సమర్ధుడైన పాలకుడు. ఇతడు సాధించిన విజయాలు, పరాజయం చెందిన రాజులపట్ల ఇతను అనుసరించిన విధానం రాజ నీతికి తార్కాణం. సముద్రగుప్తుడు కవి. పండితుడు. కవిరాజ బిరుదాంకితుడు. రాజనీతిపరుడైన సముద్రగుప్తునిలోని పెక్కు లక్షణాలు శాంతియుత, సాహిత్య వ్యాసంగానికి బాగుగ సరిపోవునని ఎ.ఎస్ ఆల్టేకర్ అంటాడు.

సముద్రగుప్తుడు ప్రాజ్ఞుడైన ప్రభువు. వైష్ణవ మతాభిమాని అయినను పరమత సహనాన్ని పాటించాడు. బౌద్ధమత పండితుడైన వసుబంధువి ఆదరించాడు. బుద్ధగయలో బౌద్ధవిహారం నిర్మించుటకు సింహళ ప్రభువు మేఘవర్ణునికి అనుమతి ఇచ్చాడు.

సముద్రగుప్తుడు ఆరు రకాల బంగారు నాణాలు ముద్రించి చెలామణిలో వుంచాడు. వాటిలో విలుకాడు, గండ్రగొడ్డలి, వైణికుడు, పులి, ఆశ్వమేధ, కచ అను రకాలు వున్నాయి. ఈ నాణాలన్ని పరిశీలించిన తరువాత ఆర్.కె ముఖర్జి ఇలా అంటాడు. ఈ నాణాలు అతవి గుణగణాలను, పాలనదక్షుడిగా, విజేతగా, యోధునిగా, సమాజ శ్రేయోభిలాషిగా, కవిగా, సంగీతవిద్వాంసునిగా రాణించిన తీరును వివరిస్తున్నాయి. సముద్రగుప్తుడు సాధించిన సైనిక విజయాలెంత ఘనమైనవో అతని వ్యక్తిగత ప్రావీణ్యతలు కూడ అంతకంటే తక్కువ ప్రశంసనీయమైనవి కావు అని ఆర్.సి మజుందార్ అభిప్రాయపడ్డాడు. ప్రాచీన భారతదేశ చరిత్రలో ఒక నూతన యుగ కర్తగా, సముద్ర గుప్తుని పేరు సుస్థిరం అని బి.జి గోఖలే నుడివాడు.

## 16.3 రెండవ చంద్రగుప్తుడు. (క్రీ.శ. 380-414) :

గుప్త చక్రవర్తులలోనే గాక భారతదేశాన్ని పాలించిన చక్రవర్తులలో రెండవ చంద్రగుప్త విక్రమాదిత్యుడు ప్రముఖుడు. ఇతని కాలంలో గుప్త సామ్రాజ్యం మిక్కిలి విస్తరించింది. దేశంలో శాంతి నెలకొంది. సాహిత్యం, కళలు గొప్పగా అభివృద్ధి చెందినవి. దేశీయ, విదేశీయ వ్యాపారం అభివృద్ధిచెందింది. విదేశాలతో దౌత్య సంబంధాలు నెలకొల్పబడ్డాయి. అందువలనే గుప్తయుగాన్ని భారతదేశ చరిత్రలో స్వర్ణయుగంగా పేర్కొనడం జరిగింది. బహుశా భారతదేశం విక్రమాదిత్యుని కాలంలో పాలించబడినట్లు మరెప్పుడును పరిపాలింపబడలేదు అని స్మిత్ పండితుడు ప్రశంసించాడు.

### 16.3.1 ఆధారాలు:-

రెండవ చంద్రగుప్తుని చరిత్రకు పాహియాన్ రచనలు, విశాఖదత్తుని దేవిచంద్రగుప్తం నాటకం. మోహరౌలి ఇనుప స్తంభ శాసనం, మధుర, సాంచిలలో వున్న శిలాశాసనాలు, నాణాలు ముఖ్య ఆధారాలు.

### 16.3.2 సింహాసనమధిష్టించుట:-

విశాఖదత్తుని 'దేవిచంద్రగుప్తం', 'బాణుని హర్షచరితం', కావ్య మీమాంస మొదలైన సాహిత్య ఆధారాల వలన సముద్రగుప్తుని అనంతరం అతని కుమారుడు రామగుప్తుడు రాజ్యానికి వచ్చాడని తెలుస్తుంది. ఇతని కాలంలో గుప్తరాజ్యంపై శకుల దండ యాత్రలు తీవ్రమైనందున వారి బారి నుంచి రాజ్యాన్ని రక్షించుకోవడానికి రామగుప్తుడు శకరాజు సహాయం కోరినట్లు తన భార్య ధృవాదేవిని అప్పగించడానికి సిద్ధపడినట్లు తెలుస్తుంది. ఇందుకు అంగీకరించని అతని తమ్ముడైన చంద్రగుప్తుని సాహస చర్య వల్ల అసూయ చెంది రామగుప్తుడు తన తమ్ముని చంపటానికి కుట్రపన్నాడనీ. అది తెలుసుకున్న చంద్రగుప్తుడు రామగుప్తుణ్ణి చంపి రాజ్యానికి వచ్చాడనీ, ఆ తరువాత ధృవాదేవిని వివాహం చేసుకున్నాడని పై సాహిత్య ఆధారాలవలన తెలుస్తుంది. ఇటీవల రామగుప్తుని నాణాలు మాళ్వలో లభించడం వలన పై కథకు చారిత్రకత చేకూరింది. చంద్రగుప్తుని భార్య ధృవాదేవి అని నిరూపిస్తుకొన్ని శాసనాలు లభ్యం కావడం వల్ల కూడ పై కథనానికి చారిత్రికత, వాస్తవికత వున్నదని చెప్పవచ్చును. రెండో చంగ్రుప్తుడు పశ్చిమ భారతంలోని శకులతో నిరంతరం యుద్ధాలు చేయడం గమనించతగ్గ అంశము.

సముద్రగుప్త, దత్తాదేవీల కుమారుడైన చంద్రగుప్తునికి దేవగుప్త, దేవశ్రీ అనే పేర్లు కలవు. ఇతనికి పరమభాగవత, పరమభట్టారక అను బిరుదులు కలవు. ఇతని రాజ్యకాలం 33 సంవత్సరాలు. ఇతడు క్రీ.శ 380 లో సింహాసనమధిష్టించాడు. ఇతడు తన పాలనా కాలంలో పరాక్రమాన్నే గాక ఫలప్రదమైన దౌత్య నీతిని కూడ ప్రదర్శించాడు.

### 16.3.3 నాటి రాజకీయ పరిస్థితులు:-

రెండో చంద్రగుప్తుడు రాజ్యానికి వచ్చే నాటికి భారత రాజకీయ పరిస్థితి మరొకసారి క్షీణించింది. సముద్రగుప్తుడు సరిహద్దులలోగల రాజ్యాలన్నింటిని జయించి తన సార్వభౌమాధికారాన్ని నెలకొల్పినప్పటికి, సామంత రాజులు తిరుగుబాట్లు చేసి స్వతంత్రించడానికి ప్రయత్నం చేసినారు. అందువల్ల రెండో చంద్రగుప్తుడు సింహాసనమధిష్టించిన తరువాత అనేక యుద్దాలు చేయవలసి వచ్చింది. వైవాహిక సంబంధాల ద్వార తన అధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి కూడ ప్రయత్నించాడు.

### 16.3.4 వివాహ సంబంధాలు:

రెండో చంద్రగుప్తుని అధికార సుస్థిరతకు, విస్తరణకు, వివాహ సంబంధాలు, యుద్దాలు అను రెండు మార్గాలను అనుసరించాడు. వివాహ సంబంధాలు చంద్రగుప్తుని జీవితంలో చాలా కీలకమైన పాత్ర వహించాయి. గుప్తుల విదేశాంగ విధానంలో వైవాహిక సంబంధాలు ముఖ్య స్థానం అలంకరించెనని రాయచౌదరి పేర్కొంటాడు.

**16.3.4.1. వాకాటకులు:-** వింధ్యపర్వత ప్రాంతంలో వాకాటకులు బలవంతులై రాజ్యమేలుతున్నారు. మాళ్వ, సౌరాష్ట్ర ప్రాంతాలలో రాజ్యమేలుతున్న శత్రువులను, నిర్మూలించడానికి చంద్రగుప్తుడు తన కుమార్తె అయిన ప్రభావతిని వాకాటక రాజు రుద్రసేనుడికి ఇచ్చి పెళ్ళి చేశాడు. ఈ వివాహ సంబంధాలవలన చంద్రగుప్తుడు వాకాటకుల సైనిక సహాయం పొందగలిగాడు. అందువలననే చంద్రగుప్తుడు శకులను విజయవంతంగా నిర్మూలించగలిగాడు. అంతేగాక బలవంతులైన వాకాటకుల ప్రమాదం గుప్తరాజ్యానికి ఈ వివాహం వల్ల తప్పింది. మరియు రుద్రసేనుడి మరణానంతరం ప్రభావతిగుప్త వాకాటక రాజ్య పాలనా వ్యవహారాలను నిర్వహించింది. ఈ కాలంలో ఆ రాజ్యంలో గుప్తుల పలుకుబడి గొప్పగా వుంది.

**16.3.4.2. నాగవంశం:-** రెండచంద్రగుప్తుడు నాగవంశపు రాకుమారియైన కుబేర నాగను వివాహమాడినాడు. ఈ వివాహం వలన మధ్య భారతదేశంలో ఎంతో బలవంతులైన నాగరాజుల సహాయ సంపత్తులు చంద్రగుప్తునికి లభించాయి. దీనివలన గుప్తరాజ్యానికి సుస్థిరత లభించిందని చెప్పవచ్చు.

**16.3.4.3 కదంబ వంశస్థులు:-** కుంతల దేశాధీశడు, కదంబ వంశస్థుడు అయిన కకుత్సవర్మ కుమార్తెను చంద్రగుప్తుడు తన కుమారుడైన కుమారగుప్తునికిచ్చి పెళ్ళి చేశాడు. దీనివలన గుప్తుల ప్రభావం దక్షిణాదిన మైసూర్ వరకు విస్తరించుకోవడానికి అవకాశం కలిగింది. ఈ వివాహ బంధాలు గుప్తరాజుల అధికార దర్పాన్ని ప్రాభవాన్ని పెంపు చేశాయని చెప్పడంలో సందేహం లేదు.

## 16.4. యుద్దాలు:-

మొదటి చంద్రగుప్త, సముద్రగుప్తులు ప్రారంభించిన రాజ్య విస్తరణ విధానాన్ని రెండో చద్రగుప్తుడు కొనసాగించి పరిపూర్ణం చేశాడు.

### 16.4.1. శకులు:-

రెండో చంద్రగుప్తుని ప్రధాన శత్రువు మాళవ, సౌరాష్ట్ర ప్రాంతాలను పరిపాలిస్తున్న శకరాజు మూడవ రుద్రసింహుడు. చంద్రగుప్తుడు శక రాజ్యంపై దండెత్తి ఆరు సంవత్సరాల దీర్ఘకాలిక యుద్ధం తరువాత శకరాజును హతమార్చి మాళ్వ, సౌరాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలను ఆక్రమించాడు. దీనివలన 3 శతాబ్దాలుగా భారతదేశంలో పాతుకొని వున్న శక క్షాత్రవుల పాలన అంతమయింది. ఈ విజయానికి చిహ్నంగా చంద్రగుప్తుడు శకారి, సాహసాంక, విక్రమాదిత్య అనుబిరుదులు ధరించాడు. ఈ శక విజయం వలన గుప్త సామ్రాజ్యానికి నేరుగా వ్యాపార సంబంధాలేర్పడి ఆర్థిక అభివృద్ధికి దోహదం చేసింది. సారవంతమైన ప్రాంతాలు గుప్తుల ఆధీనంలోకి వచ్చాయి. పశ్చిమభారత రాజకీయ, ఆర్థిక ప్రాధాన్యత గుర్తించి చద్రగుప్తుడు తన రాజధానిని ఉజ్జయికి మార్పించాడు.

### 16.4.2. బెంగాల్ పై దండయాత్ర:-

బెంగాల్ పాలకులు గుప్తుల సార్వభౌమాధికారాన్ని ధిక్కరించి స్వతంత్రించగా చంద్రగుప్తుడు బెంగాలుపై దండెత్తి వారిని ఓడించి తన అధికారాన్ని పునఃస్థాపితం చేశాడు. ఈ విషయం మెహరౌలి వద్దగల చంద్రుని ఇనుపస్తంభ శాసనం వలన తెలుస్తుంది.

### 16.4.3. వాయవ్య దండయాత్ర:-

మెహరౌలి స్తంభ శాసనం ప్రకారం చంద్రరాజు పశ్చిమ సరిహద్దులపై దండయాత్ర సాగించి సప్త సింధూ శాఖలను దాటి బాహ్లికులను జయించాడు. వాహ్లిక దేశం హిందుకుష్ పర్వతాలకవతల గల బాక్ట్రియా. దీని పాలకులు కుషాణులు.

మెహరౌలి శాసనంలో పేర్కొనబడిన చంద్రుడను రాజు రెండో చంద్రగుప్తుడు కాదని, పైరెండు దండయాత్రలు రెండో చంద్రగుప్తుడు చేయులేదని కొందరి చరిత్రకారుల వాదం.

### 16.4.5. సమీక్ష:-

చంద్రగుప్తుని దండయాత్రలు గుప్త సామ్రాజ్యానికి రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను కలిగించాయి. మాళ్వ, సౌరాష్ట్ర, గుజరాత్ ఆక్రమణల వలన వర్తక వాణిజ్యాలు అభివృద్ధి చెంది రాజ్య ఆదాయం వృద్ధి చెందింది. కళాకారులు నివశిస్తున్న బ్రోచ్, సొపా, ఉజ్జయినీలు గుప్త సామ్రాజ్యంలో విలీనం కావడం వలన కళలు అభివృద్ధి చెందాయి. తన తండ్రిద్వారా సంక్రమించిన రాజ్యాన్ని రెండో చంద్రగుప్తుడు సామ్రాజ్యంగా మార్చాడని, ఇతడు మరణించు వరకు ఇతడే నిస్సందేహంగ భారతదేశంలో అత్యంత శక్తివంతమైన చక్రవర్తి అని ఆర్.డి బెనర్జీ పేర్కొన్నాడు.

### 16.4.5. సామ్రాజ్య విస్తీర్ణత:-

చంద్రగుప్త విక్రమాదిత్యుని కాలం నాటి గుప్తసామ్రాజ్యం ఉత్తరాన హిమాలయాలనుండి దక్షిణాన నర్మదానది వరకు, పశ్చిమాన గుజరాత్ నుండి తూర్పున బెంగాల్ వరకు విస్తరించింది.

### 16.5 పరిపాలన:-

భారతదేశం రెండవ చంద్రగుప్తుని పాలనలో ఇంతకు ముందు ఎన్నడు లేనంత సమర్థవంతంగా పరిపాలింపబడింది. అతని పాలనా దక్షతకు నాడు నెలకొన్న సుఖశాంతులే ప్రబల తార్కాణాలు. నాటి ప్రజలు శాంతియుత సహజీవనం గురించి, ఆర్థిక అభ్యుదయాన్ని గురించి, ఉదారపాలనను గురించి చైనా బౌద్ధయాత్రికుడైన పాహియాన్ వ్రాశాడు. అమరకర దేవుడు, వీరసేనుడు, శిఖరస్వామి లాంటి సమర్థవంతమైన మంత్రులు నాడు వున్నట్లు సాంచి, ఉదయగిరి శాసనాలు చెప్తున్నాయి. పాలన సౌలభ్యం కొరకు రాజ్యాన్ని భుక్తులుగా, విషయాలుగా, గ్రామాలుగా విభజించాడు.

### 16.6 సాహిత్య పోషణ:-

రెండోచంద్రగుప్తుని పాలనా కాలం గుప్తయుగంలో సంస్కృత భాషా వికాసానికి సువర్ణ అధ్యాయం. ఇతని ఆస్థానంలో నవరత్నాలు అని ప్రసిద్ధి చెందిన కవులు వున్నట్లు ప్రతీతి. వారిలో అగ్రగణ్యుడు కాళిదాసు. కాళిదాసు రచించిన మేఘసందేశం, కుమారసంభవం అను కావ్యాలు, అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం అను నాటకాలు జగత్ప్రసిద్ధాలు. అభిజ్ఞానశాకుంతలం ప్రపంచంలోని వంద ఉత్తమ గ్రంథాలలో ఒకటిగా కొనియాడబడుచున్నది. విశాఖదత్తుడు, శూద్రకుడు, అమరసింహుడు, విష్ణుశర్మ, వరాహమిహురుడు, ధన్వంతరి, మొదలగు కవులు, పండితులు, శాస్త్రకారులు చంద్రగుప్తుని ఆస్థానం లోనివారే.

## 16.7 పరమత సహనం:-

రెండవ చంద్రగుప్తుడు వైష్ణవ మతాభిమాని. అతనికి గల పరమ భట్టారక, పరమభాగవత బిరుదాలు, అతని వైష్ణవ మతాభిమానాన్ని సూచిస్తాయి. అయినప్పటికీ పరమత సహనాన్ని పాటించాడు. బౌద్ధమతస్థుడగు అమరకర దేవుడు అతని సేనాని, శైవమతాభిమానియగు వీరశేనుడు అతని మంత్రి.

## 16.8 నాణాలు:-

రెండొవ చంద్రగుప్తుడు 8 రకాల బంగారు నాణాలను ముద్రించి చెలామణిలో వుంచాడు. వాటిలో విలుకాడు, పాన్పు, ఛత్ర, సింహసంహార, అశ్వారూం మొదలగు రకాలు కలవు. ఇతడు ముద్రించిన కొన్ని నాణాలపై ఒక వైపు గరుక్మంతుడు సర్పాన్ని తింటున్నట్లుగా, ముద్రించబడివుండగా, రెండోవైపు సింహం బొమ్మతో పాటు సింహావిక్రమ అనే ఆఖ్య వుంది. గుజరాత్ విజయానికి చిహ్నంగా ఈ నాణాలు ముద్రించాడని చెప్పవచ్చును. గుప్తరాజులలో వెండినాణాలను ప్రవేశపెట్టింది కూడ రెండో చంద్రగుప్తుడే. ఇతని రాగి నాణాలు కూడ లభించాయి.

## 16.9 పాహియాన్ రాక :-

రెండో చంద్రగుప్తుని పాలనాకాలమున పాహియాన్ అను చైనా యాత్రికుడు గుప్త సామ్రాజ్యంలో పర్యటించి తాను చూసింది, విన్నది గ్రంధస్థం చేశాడు. పాహియాన్ రచన చంద్రగుప్తుని పాలన విశిష్టతను తెలుపుతుంది.

పాహియాన్ క్రీ.శ 399 మొదలు 411 వరకు భారత దేశంలో పెషావర్, మధుర, కనోజ్, శ్రావస్తి, వారణాసి, కపిలవస్తు, వైశాలి, పాటలీపుత్రం మొదలైన నగరాల్లో పర్యటించాడు. ఈ కాలంలో అతడు సంస్కృతం నేర్చుకుంటూ, బౌద్ధ గ్రంధాలను, బుద్ధుని అవశేషాలను సేకరించటంలో నిమగ్నుడైనాడు. పిమ్మట తామ్రలిప్తి నుంచి బయలుదేరి అతడు శ్రీలంకకు, జావా వెళ్ళాడు. అంత దీర్ఘకాలం అతడు చంద్రగుప్తుని సామ్రాజ్యంలో నివశిస్తూ, ఆ రాజు పేరును తన రచనల్లో ప్రస్తావించకనే తాను కనిన వినిన విశేషాలను పొందుపర్చాడు. అతడు 3 సంవత్సరాలు పాటలీపుత్రంలో వుండి సంస్కృతం నేర్చుకున్నాడు. పాటలీపుత్రంలోని అశోకుని ప్రాసాద శిధిలాలను చూసి పాహియాన్ విస్మయం చెందాడు."అశోకుడు నియమించిన దేవతల నిర్మాణాలవి" అని వ్రాశాడు. అక్కడ బౌద్ధ విద్యాలయాల్లో దేశ విదేశాల నుంచి వచ్చిన ఛాత్రులు విధ్యాభ్యాసం చేస్తున్నారట! ప్రజలు సచ్ఛీలురు. ప్రజోపయోగకర కార్యాలు చేయటంలోను, దాన ధర్మాలు చేయటంలోను, వారు పరస్పరం పోటీలు పడుతుంటారు. వైశ్యులు ఎన్నో వైద్యశాలలు ఏర్పాటు చేశారు. మహా నగరాల్లోను, రాచ బాటల మీదను పాంధులకై విశ్రాంతి శాలలు వున్నాయి. ప్రభుత్వానికి ప్రధానంగా ఆదాయం రాచభూముల నుంచి వస్తుంది. పంటలో 1 వ భాగం పన్నుగా వసూలు చేసేవారు. చండాలురు తప్ప ప్రజలంతా శాకాహారులు, అహింసా వాదులు. ప్రజలు బహు సంఖ్యలో వున్నారు. అయినా అందరు సుఖంగానే వున్నారు. శిక్షలు కఠినంగా లేవు. ఉరి శిక్షలు లేవు. అంగచ్ఛేదనం శిక్షాస్మృతిలో వుంది. రాజు అంగరక్షకులకు, సేవకులకు జీతాలు ఇచ్చేవాడు. పశ్చిమబెంగాల్‌లో బౌద్ధమతం వ్యాప్తిలో వున్నదని గంగ ఎగువభాగంలో మాత్రం బ్రాహ్మణ మతం వ్యాపించిందని, పాహియాన్ తన రచనలలో పేర్కొన్నాడు.

## 16.10. ఘనత :-

రెండవచంద్రగుప్తుడు తన తండ్రి విధానాన్ని అనుసరించి శకుల పాలనను అంతంచేసి ఉత్తరభారతదేశంలో రాజకీయ ఐక్యత సాధించాడు. ప్రజాక్షేమం దృష్టిలో వుంచుకొని రాజ్యపాలన చేశాడు. సుఖశాంతులు, నెలకొనుట వలన సాంస్కృతిక రంగంలో ప్రజలు పురోగతి సాధించేరు. రెండవ చంద్రగుప్తుడు భాషా పోషకుడు. అతని ఆస్థానంలో నవరత్నాలను పేరొందిన సంస్కృత కవులు వుండేవారు. తాను హిందూ మతస్థుడైనను బౌద్ధ జైన మతస్థులను ఆదరించిన సహనశీలి, ఉదారహృదయుడు, రాజనీతిజ్ఞుడు. అతని ధైర్యసాహసాలు, ఘనవిజయాలు, ఔదార్యం, సత్పరిపాలన, మొదలగువన్నియు ప్రజల హృదయాలలో విక్రమార్కునిగా స్థిరపరచాయి. ఇతడు పరమభాగవత,

సాహసాంక, శకారి మొదలగు బిరుదులు ధరించాడు. ఆర్.సి మజుందార్ మాటలలో రెండో చంద్రగుప్తుడు రాజకీయ ఔన్నత్యం, సాంస్కృతిక పునరుజ్జీవములకు ప్రతీకగా నిలిచి ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నాడు.

## 16.11 మొదటి కుమార గుప్తుడు- (క్రీ.శ. 415-455) :

రెండవ చంద్రగుప్తుని అనంతరం అతని కుమారుడు, కుమారగుప్తుడు సింహాసనమధిష్ఠించాడు. ఇతనికి మహేంద్రాదిత్య అను బిరుదు కలదు. ఇతడు తండ్రి అంతటి సమర్థుడు కాకపోయినను రాజ్యక్షీణతను అరికట్టి 40 సంవత్సరాలు పాలించాడు. కుమారగుప్తుని సుదీర్ఘమైన పాలనాకాలంలో శాసన ఆధారాలకు, నాణాలకు కొదవలేదు. కాని అతడు యుద్ధాలు చేసిన ఆధారం లభించలేదు. అయినా వారసత్వంగా వచ్చిన రాజ్యాన్ని సమర్థవంతంగా కాపాడాడని చెప్పవచ్చు.

కుమారగుప్తుని అవసాన దశలో పుష్యమిత్రులతో యుద్ధాలు జరిపినట్లు తెలుస్తుంది. నర్మదా నది తీర మేఖల ప్రాంతంలో బలోపేతమైన ప్రజలే పుష్యమిత్రులు. పుష్యమిత్రులు గుప్త సామ్రాజ్య ప్రాభవానికి తాత్కాలికంగా గ్రహణం పట్టించారు. అయితే యువరాజైన స్కంధగుప్తుడు పుష్యమిత్రులను ఓడించి, శాంతిని ఏర్పరచి, తండ్రి గౌరవాన్ని కాపాడినట్లు 'భిత్రి' శాసనం తెలుపుతుంది. ఈ యుద్ధాల వలన స్కంధగుప్తుని ఘనత తెలియవస్తుంది. ఈ విజయ చిహ్నంగ కుమారగుప్తుడు అశ్వమేధయాగం చేసి అందుకు గుర్తుగా బంగారు నాణాలను విడుదల చేసి మహేంద్రాదిత్య అను బిరుదు ధరించాడు.

ఇదే కాలంలోనే గుప్త రాజ్యంపై హుణుల దండయాత్ర ప్రారంభమైంది. హుణులు గుప్త సామ్రాజ్యంపై దాడులు చేసి రాజ్యాన్ని అతలాకుతలం చేసి దోచుకున్నారు. మరోసారి యువరాజు స్కంధగుప్తుడు హుణులను పారద్రోలి గుప్త సామ్రాజ్యాన్ని కాపాడినాడు. రోమన్ సామ్రాజ్యానికి పట్టిన దుర్గతి గుప్త సామ్రాజ్యానికి పట్టలేదు. ఇటువంటి క్లిష్ట సమయంలోనే వృద్ధుడైన కుమారగుప్తుడు మరణించాడు.

కుమారగుప్తుడు శైవ మతాభిమాని అయిననూ పరమత సహనం పాటించి బౌద్ధమతాన్ని ఆదరించాడు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన నలంద విశ్వవిద్యాలయ నిర్మాత కుమారగుప్తుడే. ఇతని రాజ్యంలో బౌద్ధ, శైవ, సూర్య. విష్ణు ఆరాధనలు జరిగేవి. కుమారగుప్తుడు 14 రకాల బంగారు నాణాలను విడుదల చేసి నాణాల చరిత్రలో తండ్రి, తాతలను మించిపోయాడు. ఇతని నాణాలమీద కార్తికేయుని బొమ్మ ఎక్కువగా కనిపిస్తుంది. ఈ రకపు నాణాలకు ఒక వైపు కార్తికేయుడు నెమలి వాహనంపై ఆశీనుడై వుండగా, రెండవ వైపు నెమలికి కుమార గుప్తుడు ఆహారం పెడుతున్నట్లు చిత్రీకరించబడింది. ఈ రకపు నాణాలను బట్టి కుమారగుప్తుని ఇష్టదైవం కార్తికేయుడు అని తెలుస్తుంది.

## 16.12 స్కంధగుప్తుడు క్రీ.శ. (455-467) :

కుమారగుప్తుని వారసునిగా, అతని కుమారుడైన స్కంధగుప్తుడు క్రీ.శ 455 లో రాజ్యానికి వచ్చాడు. ఇతడు సమర్థుడైన పాలకుడు. తన తండ్రి పాలనాకాలంలోనే స్కంధగుప్తుడు పుష్యమిత్రుల, హుణుల దాడుల నుంచి గుప్త సామ్రాజ్యాన్ని రక్షించాడు. స్కంధగుప్తుని పాలనాకాలంలో హుణులు మరొకసారి గుప్త సామ్రాజ్యంపై దాడి చేశారు. మధ్య ఆసియానుంచి దండెత్తి వచ్చిన ఈ సంచారజాతులను తరిమి కొట్టడానికి స్కంధగుప్తుడు తన శాయశక్తులా కృషి చేశాడు. జునాఘడ్ శాసనం వలన మ్లేచ్ఛులతో స్కంధగుప్తుడు యుద్ధం చేసినట్లు తెలుస్తుంది. హుణులనే ఈ శాసనంలో మ్లేచ్ఛులుగా చెప్పి వుండవచ్చు. హుణుల దాడులు తిరిగి జరగవచ్చునని స్కంధగుప్తుడు గుర్తించి పశ్చిమ వాయవ్య ప్రాంతాలలో సమర్థులైన రాజ ప్రతినిధులను నియమించి సరిహద్దుల రక్షణకు అపారంగా డబ్బు ఖర్చు చేశాడు. దీనివలన ఖజానా ఖాళీ అయినది. దీనితో స్కంధగుప్తుడు తాను ముద్రించిన నాణాల నాణ్యతను తగ్గించవలసి వచ్చింది. స్కంధగుప్తుడు చివరి దశలో ముద్రించిన బంగారు నాణాలలో అపద్రవ్యం 28% వరకు వుంది. ఎంత కట్టు దిట్టమైన చర్యలు చేపట్టినప్పటికి గుప్త సామ్రాజ్యం హుణుల దాడికి ఎదురు నిలువలేక పోయింది. హుణుల చేతులలో స్కంధగుప్తుడు పరాజయం చెందాడు. స్కంధగుప్తుని మరణానంతరం గుప్త సామ్రాజ్యం వేగంగా పతనమైంది.

జునాఘడ్ శాసనం ద్వార స్కంధగుప్తుడు విష్ణువును ఆరాధించినట్లు తెలుపుతుంది. స్కంధగుప్తుడు వైష్ణవ మతాభిమాని అయినా ఇతర మతాల పట్ల సహనాన్ని కొనసాగించాడు. స్కంధగుప్తుడు గుజరాత్‌లో మౌర్యుల కాలం నాటి సుదర్శన తటాకమునకు మరమత్తులు చేయించి వ్యవసాయ భూములకు నీటి సౌకర్యం కల్పించాడు.

కుమారగుప్తుని తరువాత స్కంధగుప్తుడు రాజైనట్లు ఆర్యమంజుశ్రీ మూలకల్ప అనే గ్రంథంలో చెప్పడం జరిగింది. అయితే కుమారగుప్తుని భితారి ముద్రలలో స్కంధగుప్తుని దాయాదియైన పురుగుప్తుడు కుమారగుప్తుని తరువాత సింహాసనమధిష్టించినట్లు వర్ణించబడింది. ఈ పరస్పర వర్ణనలను సమన్వయం చేస్తూ భండార్కర్ అను పండితుడు, ఈ రెండు పేర్లు ఒకే వ్యక్తివి అని చెప్పగా, కుమారగుప్తుని తరువాత పురుగుప్తుడు, స్కంధగుప్తుడు రాజ్యాన్ని పంచుకున్నారని ఆర్.జి. బసక్ పేర్కొన్నాడు.

స్కంధగుప్తుని పాలనాకాలంలో ఉత్తరహిందూ దేశమంతా గుప్తుల ఆధీనంలో వుంది. ఆసియా, ఐరోపా ఖండాలలో హూణులను ఓడించగలిగిన వీరుడు స్కంధగుప్తుడు ఒక్కడేనని కె.సి. జయస్వాల్ పండితుడు కీర్తించాడు. శ్రేష్టుడు, బుద్ధిమంతుడు, ధర్మవత్సలుడు అని స్కంధగుప్తుని గుణగణాల గురించి ఆర్యమంజుశ్రీ మూలకల్ప గ్రంథంలో వర్ణించబడింది. స్కంధగుప్తుడు దిగ్విజయుడు, ధర్మవిజయుడు అని ఆర్.కె.ముఖర్జీ శ్లాఘించాడు. సువిశాల సామ్రాజ్యాన్ని పాలించిన గుప్తచక్రవర్తులలో స్కంధగుప్తుడు చివరివాడు అనడంలో సందేహం లేదు.

## 16.13 సారాంశము :

గుప్త సామ్రాజ్య విస్తరణలో సముద్ర గుప్తుని పాత్ర నిరూపమానమైనది. అతడు ఉత్తర, దక్షణాపథాలపై చాలా యుద్ధాలు చేసి సామ్రాజ్యాన్ని నలుమూలలా విస్తరించాడు. రెండవ చంద్ర గుప్తునికాలంలో గుప్త సామ్రాజ్య విస్తరణలో యుద్ధాలు, వివాహ సంబంధాలు ప్రముఖ పాత్ర వహించాయి. కుమారగుప్తుడు, స్కంద గుప్తుల కాలంలో హూణులు దండయాత్రలు జరిపినా, సామంత రాజులు తిరుగుబాట్లు చేసినా, మొక్కవోని ధైర్యంతో వారు వాటినెదుర్కొని సామ్రాజ్యాన్ని స్థిరంగా ఉంచగలిగారు.

## 16.14. మాదిరి ప్రశ్నలు

1. సముద్ర గుప్తుని గూర్చి వ్రాయుము?
2. రెండవ చంద్రగుప్తుని గురించి వివరింపుము.
3. కుమార గుప్తుడు గురించి వ్రాయుము?
4. స్కంధ గుప్తుడు గురించి వ్రాయుము?

## సంక్షిప్త ప్రశ్నలు :

1. సముద్ర గుప్తుడు సాధించిన సైనిక విజయాలను గూర్చి వ్రాయుము?
2. సరిహద్దు రాజ్యాలు, గణతంత్ర రాజ్యాల గూర్చి వ్రాయుము?
3. సముద్ర గుప్తుడు సాధించిన ఘనతను తెలుపుము?
4. రెండో చంద్రగుప్తుడు సాధించిన ఘనతను తెలుపుము?

**డా॥ వి.కె. మోహన్**

పాఠం 17

# చివరి గుప్త రాజులు - పతనం

## 17.0 లక్ష్యం :

చివరి గుప్త రాజుల కాలానికి సంబంధించిన వివిధ విషయాలను చర్చించడం, హూణుల దండయాత్రలు, గుప్త రాజ్య పతనానికి గల కారణాలను విశ్లేషించడమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

**విషయ క్రమం**

17.1 చివరి గుప్త రాజులు

17.2 గుప్త సామ్రాజ్య పతనం - కారణాలు

17.3 హూణులు

17.4 సారాంశం

17.5. మాదిరి ప్రశ్నలు

## 17.1 చివరి గుప్తరాజులు :

స్కంధగుప్తుని తరువాత గుప్తుల చరిత్ర స్పష్టంగా లేదు. భితారి, నలంద ముద్రలలో అనేక రాజుల పేర్లు కన్పిస్తాయి. ప్రస్తుతం అందు బాటులోవున్న ఆధారాల ప్రకారం స్కంధగుప్తుని తరువాత వరుసగ పురుగుప్తుడు రెండవ కుమారగుప్తుడు, బుధగుప్తుడు, నరసింహగుప్తుడు, మూడవ కుమారగుప్తుడు, విష్ణుగుప్తుడు మొదలగువారు పాలించారు. వీరందరు బలహీనులు అసమర్థులు. దీన్ని అవకాశంగా తీసుకొని గుప్తరాజుల సామంతులు, తమ తమ ప్రాంతాలను స్వేచ్ఛారాజ్యాలుగా ప్రకటించుకున్నారు. దీనితో గుప్తరాజ్య పతనం పూర్తయింది.

నిరంతర హూణుల దాడుల వలన సామంతుల తిరుగుబాట్లు వలన, కేంద్రస్థానంలో చక్రవర్తి బలహీనుడు కావడంతో రాజ్య సరిహద్దులలో వంశపారంపర్య అధికారాలు చెలాయిస్తున్నవారు బలపడి రాజ్య విచ్ఛిన్నాన్ని మరింత శీఘ్రతరం చేశారు. కొంతమంది విధేయులైన సామంత రాజులు సామ్రాజ్య రక్షణ కోసం ప్రయత్నాలు చేసినప్పటికి, రాజవంశంలో పతన లక్షణాలు, విచ్ఛిన్నకర ధోరణులు ప్రబలడం వలన ఆ ప్రయత్నాలు ఫలించలేదు. అనంతర గుప్తయుగ చక్రవర్తులలో బుధగుప్తుడు (క్రీ.శ. 473-76) మాత్రమే కొంత వరకు గుప్తసామ్రాజ్యాన్ని కలిపివుంచి అధికారాన్ని చెలాయించగలిగాడు. ఇతను మరణించడంతో గుప్తసామ్రాజ్యం తునాతునకలైంది.

### 17.1.1. బుధగుప్తుడు (క్రీ.శ. 477-495) :

ఎరాన్, సారనాథ్, దామోదరపూర్‌లలో బుధగుప్తునికి సంబంధించిన శాసనాలు లభించాయి. ఇతడు క్రీ.శ 477 మొదలు 495 వరకు పాలించాడు. ఇతని పాలనలో కేంద్రప్రభుత్వం పటిష్టత సడలింది. సరిహద్దు ప్రాంతాలలోని సామంతులు కేంద్రాన్ని ధిక్కరించసాగారు. వల్లభిలో మైత్రకులు, ఉచ్చకల్పలో జయంత ప్రభువు, బుందేల్ ఖండ్‌లో పరివ్రాజక మహారాజు హస్తి, జయపూర్ ప్రాంతంలో లక్ష్మణ మహారాజు, నర్మదప్రాంతంలో సుబందు మొదలగువారు గుప్త చక్రవర్తి ఆజ్ఞలను పాటించడం మానివేశారు. బెంగాలులోని రాష్ట్రధికారులైన ఉపరికులు కొంత స్వతంత్రించి ఉపరిక మహారాజులు అనే బిరుదులు ధరించసాగారు. అంతరంగిక పరిస్థితి ఇట్లా వున్న కాలంలో హూణులు గుప్తరాజ్యం మీద మరోసారి దాడి చేసి కొంత నష్టాన్ని కలిగించారు. ఇదే అదునుగా సరసన వున్న వాకాటక రాజు నరేంద్రసేనుడు గుప్తరాజ్యం

మీద దండెత్తి మాళ్వ, మేఖల, కోసల ప్రాంతాలను ఆక్రమించాడు. పుష్యభూతి వంశానికి చెందిన వర్ధనులు స్థానేశ్వరాన్ని రాజధానిగా చేసుకొని తమ అధికారాన్ని క్రమక్రమంగా వృద్ధి చేసుకోసాగారు. క్రీ.శ 7వ శతాబ్ది నాటికి పుష్యభూతి వంశస్థులు మిగతా సామంత రాజులపై తమ అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు. క్రీ.శ 5 వ శతాబ్దం మొదలుకొని 7వ శతాబ్దం ప్రారంభం వరకు అనగా గుప్తరాజుల పతనం నుంచి హర్షుని నాయకత్వంలో పుష్యభూతి వంశస్థుల సామ్రాజ్యం ఏర్పడే వరకు ఉత్తర భారతదేశంలో అల్లకల్లోల అయోమయ పరిస్థితులు ఏర్పడ్డాయి. గుప్త రాజ్య పతనానంతరం ఏర్పడ్డ చిన్న,చిన్న సామంత రాజ్యాలు ఎవరి అధికారాన్ని అంగీకరించక తమలో తాము తీవ్రంగా కలహించుకోసాగారు.

ఇన్ని కష్ట , నష్టాలను ఎదుర్కొని కూడ బుధగుప్తుడు దీర్ఘకాలం పాలించడం విశేషం. అంతేగాక గుప్తులే చక్రవర్తులు అనే భావాన్ని ప్రజల స్మృతి పదం నుంచి చెదిరిపోకుండ అతడు దేశంలోని తిరుగుబాట్లను అణచి పాలించాడు.

### 17.1.2. నరసింహగుప్తుడు :

బుధగుప్తుని అనంతరం అతని సోదరుడైన నరసింహగుప్తుడు రాజైనాడు. ఇతడు క్రీ.శ 6 వ శతాబ్దం మొదట్లో పాలించాడు. ఇతడు మగధను పాలిస్తు వుండగా మాళ్వలో భానుగుప్తుడు, బెంగాల్‌లో వినయగుప్తుడు అధికారం చెలాయించారు. నరసింహగుప్తుని కాలంలోనే హూణులు తోరమానుని నాయకత్వంలో దండెత్తి వచ్చి పంజాబ్, ఉత్తరప్రదేశ్, సౌరాష్ట్ర, మాళ్వలను జయించారు. భానుగుప్తుడు హూణులను ఓడించి వారి పురోగతిని అరికట్టాడు. కాని హూణులు మిహిరకులుని నాయకత్వంలో మళ్ళీ దండెత్తిరాగా మాళ్వాధిపతి యశోధర్ముడు వారిని ఓడించాడు. కాని వారు మగధ మీదకి దండెత్తి వచ్చి నరసింహగుప్తుని ఓడించగా అతడు వారికి కప్పం గట్టాడని హుయాన్‌త్సాంగ్ రాశాడు. ఈ స్థితిలో గుప్తసామంతులు చక్రవర్తి అధికారాన్ని ధిక్కరించి స్వతంత్రంగా పాలించడం మొదలు పెట్టారు. నరసింహగుప్తుని అధికారము మగధ పరిసరాలకు, ఉత్తరబెంగాల్‌కు పరిమితమైనట్లు హుయాన్‌త్సాంగ్ రాశాడు.

### 17.1.3. కృష్ణగుప్తుడు :

ఆదిత్యసేనుడు వేయించిన అఫ్‌సాద్ శాసనాన్ని బట్టి క్రీ.శ 6, 7 శతాబ్దాలలో మగధను పాలించిన గుప్తరాజుల జాబితాను తెలుసుకోవచ్చు. వీరి రాజ్యం మగధ, దాని పరిసర ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది. వీరిలో కొందరు మాళ్వప్రాంతం కూడ పాలించారు.

కృష్ణగుప్తుడు క్రీ.శ 6వ శతాబ్దం మొదటి పాదంలో రాజ్యమేలినాడు. ఇతని గురించి కాని, ఇతని రాజ్యం గురించి కాని వివరాలేమి తెలియడంలేదు. ఇతని గురించి వున్న శిలాశాసనం చాలా క్లుప్తంగా వుంది. ఇతని కత్తి సింహంలాగా శత్రువుల గుండెలలోకి చొచ్చుకు పోయేదని ఆ శాసనం తెలియజేస్తుంది. మాళ్వరాజు యశోధర్మునితో ఇతడు యుద్ధం చేసివుండవచ్చు.

కృష్ణగుప్తుని వారసులుగా హర్షగుప్తుడు, మొదటి జీవితగుప్తుడు రాజ్యమేలారు. ఈ ఇద్దరు రాజులు శత్రువులపై నిరంతరం పోరాడి అధికారాన్ని కాపాడుకున్నట్లు తెలుస్తుంది. ఆ శత్రువులు బెంగాల్‌కు చెందిన గౌడరాజులు కావచ్చు.

### 17.1.4 మూడోకుమార గుప్తుడు :

మొదటి జీవితగుప్తుని వారసుడు మూడో కుమారగుప్తుడు. ఇతడు గౌడ రాజులతోను, ఆంధ్ర రాజులతోను, చాళుక్యులతోను పోరాడి విజయం సాధించాడు. కాని ఇష్ణావర్మ నాయకత్వంలోని మౌఖరీల నుండి కుమారగుప్తుడు గట్టిపోటి ఎదుర్కొన వలసివచ్చింది. ప్రథమంలో చివరి గుప్తులకు, మౌఖరీలకు మధ్య వైవాహిక సంబంధాలుండేవి. మౌఖరిరాజు మహారాజాధిరాజ బిరుదు ధరించడము గుప్తరాజులకు నచ్చలేదు. అందువలన ఇరుపక్షాలకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కుమారగుప్తుడు విజయం సాధించాడు. దీని తరువాత

గుప్తులకు, మౌఖరీలకు నిరంతరం యుద్ధాలు జరిగాయి. హర్షుడు అధికారంలోకి వచ్చే వరకు ఈ యుద్ధాలు కొనసాగుతునే వున్నాయి. మూడోకుమారగుప్తుని తరువాత దామోదరగుప్తుడు రాజ్యమేలినాడు.

### 17.1.5. మహాసేనగుప్తుడు :-

దామోదర గుప్తుని తరువాత అతని కుమారుడు మహాసేన గుప్తుడు అధికారానికి వచ్చాడు. ఇతడు స్థానేశ్వర రాజు ప్రభాకరవర్ధమనితో స్నేహసంబంధాలు ఏర్పరుచుకొని తన పరిస్థితిని మెరుగుపరుచుకున్నాడు. అందువలన మహాసేనుడికి మౌఖరిరాజులతో ఎటువంటి యుద్ధాలు జరుగలేదు. మహాసేన గుప్తుడు కామరూపరాజైన **సుస్థివర్మ**తో యుద్ధం చేసి విజయం సాధించాడు.

### 17.1.6. రెండో దేవగుప్తుడు :

మహాసేన గుప్తుని తరువాత రెండో దేవగుప్తుడు రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో పుష్యభూతి మౌఖరి రాజవంశాల మధ్య వైవాహిక సంబంధ మేర్పడింది. దీనితో భయపడిన దేవగుప్తుడు గౌడరాజైన శశాంకునితో స్నేహం చేశాడు. శశాంకుడు మౌఖరి రాజ్యంపై దాడి చేసినపుడు దేవగుప్తుడు కూడ అందులో పాల్గొన్నాడు. ఈ యుద్ధంలో మౌఖరిరాజు గృహవర్మ మరణించాడు. గృహవర్మ భార్య, పుష్యభూతి రాకుమారి బంధీ అయింది. అందవల్ల పుష్యభూతి రాజు రాజ్యవర్ధనుడు దేవగుప్తుని ఓడించాడు. కాని దేవగుప్తుని మిత్రుడైన శశాంకుని చేతులలో రాజ్యవర్ధనుడు పతనమయ్యాడు. రాజ్యవర్ధుడి తరువాత స్థానేశ్వర సింహాసన మధిష్టించిన హర్షవర్ధనుడు దండెత్తి వెళ్ళి దేవగుప్తుని ఓడించి అతని సోదరుడైన మాధవ గుప్తుని పాలకునిగా చేశాడు. మాధవగుప్తుడు హర్షవర్ధనునికి సామంతుడయ్యాడు.

## 17.2 గుప్తసామ్రాజ్య పతనం- కారణాలు

గుప్త చక్రవర్తులు షుమారు నూట యాభై సంవత్సరాల పాటు( క్రీ.శ 320-467) ఉత్తర భారతదేశానికి రాజకీయ ఐక్యతను, శాంతి సుస్థిరతలను ప్రసాదించి సర్వతోముఖాభి వృద్ధిని సాధించారు. మొదటి చంద్రగుప్త, సముద్రగుప్త, రెండవ చంద్రగుప్తుల కాలాలలో విస్తరించిన గుప్తసామ్రాజ్యం, కుమారగుప్తుని కాలమున అలజడులకులోనై స్కందగుప్తుని కాలమున విదేశీదండయాత్రలకు గురియై క్రమంగా క్షీణించింది. స్కంధగుప్తుడు వేయించిన భితారీ శాసనంలో తన ప్రధాన శత్రువులు పుష్యమిత్రులు, హూణులు అని పేర్కొన్నాడు. జునాఘడ్ శాసనంలో కూడా స్కందగుప్తుడు చేసిన యుద్ధాల ప్రస్తావన ఉంది. స్కందగుప్తుని అనంతరం రాజ్యమేలిన పురుగుప్తుడు, నరసింహగుప్తుడు, కుమారగుప్తుడు మొదలగువారు అసమర్థులు. వీరి అసమర్థత వలన గుప్తసామ్రాజ్యం క్రమ క్రమంగా క్షీణించి తుదకు క్రీ.శ. 6 వ శతాబ్దం మధ్య కాలానికి అంతరించింది. గుప్త సామ్రాజ్య పతనానికి అనేక ఆంతరంగిక, బాహ్యకారణాలు కలవు.

### 17.2.1 వారసత్వ యుద్ధాలు :

వారసత్వ యుద్ధాలు గుప్త సామ్రాజ్యాన్ని బలహీన పరచాయి. సాంప్రదాయబద్ధంగా వస్తున్న జ్యేష్టపుత్రుని వారసత్వ హక్కును కాదని, గుప్తచక్రవర్తులు తమ వారసులను నిర్ణయించే పద్ధతిని ప్రవేశపెట్టారు. దీనివల్ల సమర్థులు కనిష్టులైన కూడా రాజులై రాజ్యాన్ని పాలించారు. అయితే జ్యేష్ఠపుత్రులు తమకు ధర్మశాస్త్రబద్ధంగా రావాల్సిన రాజ్యం లభించలేదని కినిసి యుద్ధాలకు దిగడం జరిగింది. సహజంగా సాంప్రదాయాలను గౌరవించే ప్రజల సానుభూతి వీరికి లభించింది. దాని ఫలితం అంతర్యుద్ధాలు, అశాంతి, ప్రాణనష్టం, రాజ్యం బలహీనం కావడం మొదలగునవి. మొదటి చంద్రగుప్తుడు సముద్రగుప్తుని, సముద్రగుప్తుడు రెండోచంద్రగుప్తుని తన వారసులుగా ప్రకటించారు. ఈ విధానం వారసత్వ కలహాలకు దారితీసి గుప్తసామ్రాజ్యాన్ని బలహీనపరిచాయి.

### 17.2.2. పాలనాయంత్రాంగంలోని లోపాలు :

గుప్తుల పాలనా విధానం కేంద్రీకృతమైంది కాదు. చక్రవర్తితో బాటు సర్వాధికారాలు అనుభవిస్తూ స్వతంత్రంగా పాలించే రాజ్యాధిపతులు కొందరు గుప్తసామ్రాజ్యంలో కలరు. అటువంటి రాజ్యాధిపతులు నామమాత్రంగా గుప్తుల సార్వభౌమాధికారాన్ని అంగీకరించి, విధేయతను ప్రకటించేవారు. సామ్రాజ్య సరిహద్దులలోని గణరాజ్యాలు, కొన్ని సామంతరాజ్యాలు ఈ కోవకే చెందాయి. చక్రవర్తి సమర్థుడైనంత కాలం

ఈ రాజ్యాధిపతులు విధేయులుగా ఉండేవారు. చక్రవర్తులు బలహీనులయితే వీరు విజృంభించే వారు. దీన్ని దృష్టిలో ఉంచుకొనే రెండో చంద్రగుప్తుడు తన రాజధానిని తూర్పున ఉన్న పాటలీపుత్రం నుంచి పశ్చిమాన గల ఉజ్జయినీ నగరానికి మార్చాడు. మధ్య, పశ్చిమ భారతదేశంలో అటువంటి సామంతగణరాజ్యాలు ఎక్కువగా ఉండటం వల్ల వారెక్కడ తిరుగుబాటు చేస్తారోనని అటువంటి సమయంలో వారిమీద తగిన చర్య తీసుకోవడానికి అందుబాటులో ఉండటం శ్రేయస్కరమని భావించి రెండో చంద్రగుప్తుడు తన రాజధానిని మార్చాడు. ఆ తరువాతి కాలంలో రాజధానిని తిరిగి పాటలీపుత్రానికి మార్చాడు. బుధగుప్తుని కాలంలో జయపూర్ ప్రాంతంలో లక్ష్మణసేనుడు,నర్మద ప్రాంతంలో సుబంధుడు, స్వతంత్రులు గావడం, వాకాటకులు విజృంభించి మాళ్వ, మేఖల, కోసల భూభాగాలను ఆక్రమించడం జరిగాయి. గుప్తుల పాలనలో రాష్ట్రపాలకులైన ఉపరికులకు విశేష అధికారాలు ఉండేవి. ఇవి కూడా సామ్రాజ్య పతనానికి చాలా వరకు కారణమైనాయి. అదును చూసి వారు కూడా వెన్నుపోటు పొడిచారు. బెంగాల్‌లోని ఉపరికలు బుధగుప్తుని కాలంలో ఉపరిక మహారాజులని వ్యవహరించడం, వారి స్వతంత్ర ప్రతిపత్తిని, సామ్రాజ్యంలో తెగతెంపులు చేసుకొన్నదానికి చిహ్నంగా పేర్కొనవచ్చు.

### 17.2.3 సైనిక వ్యవస్థలో లోపం :

గుప్తుల కాలంలో బలమైన సిద్ధసైన్యమున్నట్లుగా శాసనాధారాలు గాని, సాహిత్యాధారాలుకానరావు. సముద్రగుప్తుడు ఇతర రాజ్యాలపై సాధించిన విజయాలకు అతని సామంతులు తోడ్పాటు ప్రధానమై ఉండవచ్చు. ఒకవేళ సముద్రగుప్తునికి బలమైన సిద్ధ సైన్యమున్నట్లైతే తరువాత వచ్చి రామగుప్తుడు శకులతో యుద్ధం చేయలేక తన రాణిని అప్పగించడానికి సిద్ధపడి ఉండడు. రెండో చంద్రగుప్తుడు తమ రాజ్యాన్ని కాపాడుకోవడానికి మారువేషంలో శకుల గుడారాన్ని ప్రవేశించి శకరాజును చంపవలసిన అవసరం ఉండదు. ఈ పరిస్థితులను పరిశీలిస్తే గుప్తరాజ్యం సైనికంగా ఎంత బలహీనమయిందో, వారు సామంతుల సహకారంపై ఆధారపడి ఉండటంవలన అనంతర గుప్తుల కాలంలో స్వతంత్రించిన సామంత ప్రభువుల వల్ల గుప్త రాజ్యం క్షీణించిందని చెప్పవచ్చు.

### 17.2.4 వారసుల బలహీనత :

రాచరిక విధానంలో సాధారణంగా పాలనా పటిష్టత రాజు సమర్థతపై ఆధారపడి ఉంటుంది. కాని ఒకే వంశానికి చెందిన రాజులందరు సమర్థులయిన వారసులనుటకు వీలులేదు. బలహీనులైన చక్రవర్తులు విశాల సామ్రాజ్యాలను రక్షించ జాలరు. స్కందగుప్తుని తరువాతి చక్రవర్తులందరు అసమర్థులు. వారు ఆంతరంగిక తిరుగుబాటుల నుండి విదేశీదాడుల నుండి సామ్రాజ్యాన్ని కాపాడి విచ్ఛిన్నతను అరికట్ట లేక పోయారు. వల్లభను పాలించే మైత్రకులు, గంగాతీరమందలి మౌఖరీలు, మాళ్వఅధిపతి యశోధర్ముడు, బెంగాల్‌లో గౌడులు స్వాతంత్ర్యం ప్రకటించారు. తత్ఫలితంగా గుప్తసామ్రాజ్యం క్షీణించింది.

### 17.2.5. సరిహద్దులలో రక్షణ దుర్భలమగుట :

గుప్తరాజులు తమవాయవ్య ప్రాంతాలపై అనుసరించిన విధానం లోపభూయిష్టంగా వుంది. ఈ ప్రాంతాలపై వీరు తమ సార్వభౌమాధికారాన్ని పూర్తిగా స్థిరపరచలేదు. అందువల్ల ఈ ప్రాంతాల నుంచి గుప్తసామ్రాజ్యానికి ఎప్పటికప్పుడు సమస్యలు ఎదురవుతూ ఉండేవి. ఈ విషయంలో మౌర్య చక్రవర్తులు ప్రదర్శించిన దూరదృష్టిని గుప్త చక్రవర్తులు ప్రదర్శించలేదు. కైబర్ కనుమల వద్ద గుప్తరాజులు గట్టి సైనిక నిఘా ఏర్పాటుచేసి ఉన్నట్లయితే హూణులతో కీలకమైన యుద్ధాలు మాళ్వా, మధ్య భారతదేశంలో కాకుండా సింధునది వెలుపల జరిగి ఉండేవి. హూణులు గుప్త రాజ్యంపై దాడిచేసేనాటికి గుప్తరాజ్యం నిర్వీర్యమైయింది. హూణులు వరుసగా చేసిన దాడులను గుప్తరాజులు ఆపలేక పోయారు. మూడోసారి హూణులుచేసిన దాడిలో గుప్తరాజ్యం అంతమయింది. హూణచక్రవర్తికి గుప్తరాజులు సామంతులై పోయారు.

### 17.2.6 బౌద్ధ మత ప్రభావం :

గుప్త చక్రవర్తులు మొదట్లో వైష్ణవ మతాభిమానులైనను, ఇతర మతాల పట్ల సహనం ప్రదర్శించారు. ఐతే చివరి దశలో గుప్త చక్రవర్తులు వైరాగ్యాన్ని ప్రోత్సహించే మత సిద్ధాంతాలను అవలంభించడం వల్ల రాజ్యంలో సైనిక సాంప్రదాయాలు క్రమముగా నశించాయి. సైనిక సాంప్రదాయాలను పునరుద్ధరించడానికి గుప్త చక్రవర్తులు ఎవరూ ప్రయత్నించలేదు. మొదటి కుమారగుప్తుడు తన చివరి రోజుల్లో బౌద్ధమతంపట్ల ఆసక్తి చూపాడు. దీనివల్ల గుప్త సామ్రాజ్యానికి ఏ విధమైన మేలు చేకూరలేదు. కుమారగుప్తునిపై బౌద్ధమత ప్రభావం ఎక్కువగా వున్నదని చెప్పడానికి ఈ కాలంలో నిర్మించబడిన బౌద్ధసంస్థలు నలంద విశ్వవిద్యాలయమే సాక్ష్యాలు. కుమార గుప్తుని తరువాత బుధగుప్తుడు నలందా విశ్వవిద్యాలయానికి దానాలిచ్చాడు. సామ్రాజ్యాన్ని కాపాడగలిగేది చక్రవర్తుల వ్యక్తిత్వమే. గుప్తరాజులు బౌద్ధమత ప్రభావములో పడటంవల్ల సైనిక శక్తి క్షీణించి సామంతులను అదుపులో వుంచే శక్తి గుప్తరాజులకు లేకుండా పోయింది.

### 17.2.7 భూస్వామ్య వ్యవస్థ ప్రభావం :-

సముద్రగుప్తుడు అనేక మంది చిన్న చిన్న రాజులను, తెగల నాయకులను ఓడించి, వారికి తిరిగి రాజ్యాన్ని అప్పగించడం వల్ల రాజ్యములో భూస్వామ్య సంబంధాలు బాగా పటిష్ఠమయ్యాయి. ఈ భూస్వాములు స్వతంత్రంగా రాజ్యపాలన చేసేవారు. చక్రవర్తులు బ్రాహ్మణులకు భూదానాలు చేయడం వల్ల బ్రాహ్మణులకు రాజకీయ ప్రాముఖ్యం ఎక్కువైంది. వీరికి శాంతి భద్రతలు, పరిపాలన వంటి కీలకరంగాలను అప్పగించడం జరిగింది. వీరు న్యాయాన్ని కూడా తమ చేతుల్లోకి తీసికొని స్వతంత్రముగా పాలించడం మొదలు పెట్టారు. బ్రాహ్మణులేగాక, సైనికరంగలో, పాలనారంగములో పనిచేసిన అధికారులు కూడా భూదానాలు పొంది వంశ పారంపర్య హక్కు సంపాదించుకొన్నారు. ఫలితంగా కేంద్ర రాజ్యాధికార ప్రాముఖ్యం తగ్గిపోయింది.

### 17.2.8 హూణుల దండయాత్రలు :

హూణులు మధ్య ఆసియాకు చెందిన అనాగరిక జాతీయులు. పరమ క్రూరులు. వీరి దండయాత్రలు గుప్తసామ్రాజ్యానికి గొడ్డలిపెట్టు అయినాయి. ఒక వైపు వారసులు సామ్రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొని స్వతంత్ర బావుటా ఎగుర వేస్తున్న తరుణంలో హూణుల దాడులు గుప్తరాజ్యం మీద ప్రవాహంలా వచ్చి పడ్డాయి. చక్రవర్తులు వీరితో ప్రాణాలకు తెగించి, పోరాడినారు. ఆపదలో చక్రవర్తులకు అండగా నిలవ వలసిన సామంత రాజులు స్వార్థం చేత స్వామిద్రోహులై స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నారు. హూణులు తోరమానుని నాయకత్వాన భారతదేశముపై దండెత్తి వచ్చి, గుప్త సామ్రాజ్యంలోని పశ్చిమ రాష్ట్రాలను దోచుకున్నారు. స్కంధగుప్తుడు అతి కష్టంమీద వీరి దాడులను అరికట్ట గలిగినాడు. కానీ క్రమముగా తోరమానుడు మాళ్వ ప్రాంతము వరకు గల గుప్తసామ్రాజ్య భాగాలను ఆక్రమించాడు. తోరమానుని తరువాత అతని కుమారుడు మిహిరకులుడు దండ యాత్రలు సాగించాడు. ఈ హూణుల దండయాత్రల వల్ల గుప్త సామ్రాజ్య ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం అయింది. సైన్యం బలహీన పడింది.

### 17.2.9 వాకాటకుల, పుష్యమిత్రుల దాడులు :

గుప్త సామ్రాజ్యానికి పొరుగున వున్న వాకాటకులు, పుష్యమిత్రులు గుప్త సామ్రాజ్యముపై దండెత్తి, దానిని బలహీనపరిచారు. నర్మదా నదితీర మేఖల ప్రాంతంలో నివశించే బలమైన ప్రజలే పుష్యమిత్రులు. కుమారగుప్తుని కాలంలో వీరు విజృంభించగా స్కంధగుప్తుడు వీరిని పారద్రోలాడు. స్కంధగుప్తుడు పుష్యమిత్రులను తన ప్రధాన శత్రువులుగా పేర్కొన్నాడు. వీరి దాడులు గుప్తరాజ్యాన్ని బలహీన పరిచాయి. గుప్తులతో వివాహ సంబంధాలున్ననూ వాకాటకులు విజృంభించి గుప్త సామ్రాజ్యనైరుతి ప్రాంతాలను ఆక్రమించారు.

### 17.2.10 ఇతర కారణాలు :

గుప్త యుగములో బానిసత్వ పద్ధతి ఏర్పడడం, కౌల్దారీ పద్ధతిలో దోపిడి ఎక్కువ కావడం, వెట్టి చాకిరీ, క్రొత్త సుంకాలు, పన్నులు, వాణిజ్యపతనం, పట్టణాలు క్షీణించడం మొదలగునవన్ని గుప్తరాజ్య పతనానికి కారణాలే.

ఈ విధముగా భారతదేశములో మహోన్నతమైన సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన గుప్తచక్రవర్తులు చరిత్ర నుంచి కనుమరుగైనారు.

## 17.3 హూణులు

హూణులు చైనా సరిహద్దులలోని మంగోలియా వాసులు. వీరు అనాగరికులు, పరమక్రూరులు. గ్రామాలను పట్టణాలను దోచుకొనుట ధ్వంసము చేయుట, ప్రజలను హింసించుట వారి స్వభావము. జనాభా పెరుగుదల, నిస్సారమైన భూములు, చైనారాజ్యాధికార విస్తరణ మొదలగు కారణాల వలన వారు స్వస్థలాన్ని వీడి ఆసియాలోని ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారు. వీరిలో ఒక శాఖవారు అట్టిలా నాయకత్వములో ఐరోపాపై విరుచుకుపడి సుప్రసిద్ధ రోమన్ సామ్రాజ్యాన్ని అంతం చేశారు. వీరిని నల్ల హూణులు అని అంటారు. మరియొక శాఖ శ్వేత హూణులు. వీరు కాబూల్ లోయలోని కుషాణ రాజ్యాన్ని కూలద్రోసి వాయవ్య మార్గము గుండా భారతదేశం ప్రవేశించారు.

### 17.3.1. తోరమానుడు :

శ్వేత హూణుల తొలి దండయాత్రలను గుప్త చక్రవర్తి స్కంధగుప్తుడు తరిమికొట్టాడు కానీ ఆ తరువాత హూణులు తోరమానుని నాయకత్వాన భారతదేశంలో ప్రవేశించి గుప్తసామ్రాజ్యంలోని పశ్చిమ రాష్ట్రాలను దోచుకొన్నారు. హూణుల దాడులను స్కంధగుప్తుడు అతి కష్టంమీద అరికట్ట గలిగాడు కానీ క్రమక్రమంగా తోరమానుడు గుప్త సామ్రాజ్య పశ్చిమ భాగాలను మాళ్వను ఆక్రమించాడు. ఈ దాడులను అరికట్టడములో చివరి గుప్త చక్రవర్తులు విఫలులైరి. తక్షశిల బౌద్ధ విశ్వవిద్యాలయాన్ని వాయవ్య భారతంలో వున్న అనేక బౌద్ధ ఆరామాలను హూణులు న సమము చేసింది ఈ కాలంలోనే.

### 17.3.2. మిహిరకులుడు :

తోరమానుని తరువాత ఆతని కుమారుడు మిహిరకులుడు తండ్రి విధానాన్ని కొనసాగించాడు. ఇతడు కూడా పరమ క్రూరుడు. ఇతడు సాకాల (సియాల్ కోట) రాజధానిగా చేసికొని దాడులు సాగించాడు. ఇతడు కూడా అనేక బౌద్ధస్థూపాలను ధ్వంసము చేశాడు. మిహిరకులుని క్రూరకృత్యాలు భరింపజాలక మాండసోర్ పాలకుడైన యశోధర్ముడు గుప్తచక్రవర్తి బాలాదిత్యుడు మొదలగు హిందూ రాజులు ఏకమై అతనిని ఓడించి పారద్రోలిరి. పరాజయము చెందిన మిహిరకులుడు కాశ్మీరుకు పారిపోయాడు. కాశ్మీర్‌లో తనకు ఆశ్రయమిచ్చిన రాజును వధించి మిహిరకులుడు కాశ్మీర్‌నే గాక గాంధారమును కూడా స్వాధీనము చేసుకొన్నాడు మిహిరకులుడు తరువాత హూణులు ప్రాబల్యం తగ్గిపోయింది. వీరిలో చాలా మంది హిందూమతము స్వీకరించి భారత సమాజములో విలీనం అయ్యారు.

హూణులు భారతదేశంలో సామ్రాజ్యమును స్థాపించలేకపోయినా, వారిదాడుల వల్ల గుప్తసామ్రాజ్యం చిన్నాభిన్నమై కూలిపోయింది. దానితో భారతదేశములో రాజకీయ సమైక్యత సుఖశాంతులు కరువయ్యాయి. హూణులు బౌద్ధ ఆరామాలను స్థూపాలను దోచుకొని ధ్వంసంచేశారు. బౌద్ధ భిక్షువులను వధించారు. బౌద్ధ శిల్పాలను ధ్వంసము చేసి సుప్రసిద్ధ తక్షశిల విశ్వవిద్యాలయములోని సారస్వత శాస్త్రగ్రంధాలను దహనము చేశారు. ఈ విధముగా ఉత్తర భారతదేశములో బౌద్ధ మతాన్ని క్షీణింప జేశారు. భారతదేశంలో స్థిరపడిన హూణులు కత్తిని చేతబట్టి కాలక్రమాన రాజపుత్రులని పిలవ బడినారు. హిందూ సమాజములో నూతన కులాలు ఆవిర్భవించాయి. హూణుల వలన సంఘములో నైతిక విలువలు దిగజారిపోయినవని హోవెల్ పండితుడు అభిప్రాయ పడినాడు.

## 17.4 సారాంశము :

చివరి గుప్తులు ముఖ్యంగా బుధగుప్తుని తర్వాత వచ్చిన రాజులు పూర్వపు రాజులవలే సమర్థత కలవారుకారు. అంతేకాక హూణుల దండయాత్రలు, సామంత రాజుల తిరుగుబాట్లు ఆర్థిక వ్యవస్థ క్షీణతవలన గుప్త సామ్రాజ్యం బలహీనపడి పతనమయింది. ఉత్తరావనిలో ఏక ఛత్రాధిపత్యంగా వెలిగిన గుప్త సామ్రాజ్య పతనానికి వారసుల బలహీనత, బౌద్ధ మత ప్రభావం కూడా చెప్పుకోదగ్గ కారణాలు. హూణులు తోరమామిడు, మిహిరకులుడు ఆధ్వర్యంలో భారత దేశంపై దండెత్తి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసారు.

## 17.5. మాదిరి ప్రశ్నలు

1. చివరి గుప్తరాజుల గురించి వివరింపుము?
2. గుప్త సామ్రాజ్య పతనానికిగల కారణాలను గూర్చి వ్రాయుము?

## సంక్షిప్త ప్రశ్నలు :

1. హూణుల గూర్చి వ్రాయుము?
2. మిహిరకులుడు గూర్చి వ్రాయుము?

డా॥ వి.కె. మోహన్

పాఠం - 18

# గుప్తుల పరిపాలన - సాంస్కృతిక ఆర్థిక పరిస్థితులు

## 18.0 లక్ష్యం:

భారతదేశ చరిత్రలో ఒక మహోజ్వల అధ్యాయాన్ని సృష్టించిన గుప్తుల పరిపాలనా విధానమును గురించి నాటి సాంఘిక ఆర్థిక, మతం, సాహిత్య సాంకేతిక విజ్ఞాన శాస్త్రాలు లలిత కళలు వివరించడమే ఈపాఠం ముఖ్యలక్ష్యం.

**విషయ క్రమం**


18.1. ఉపోద్ఘాతము

18.2. ఆధారాలు

18.3 కేంద్ర ప్రభుత్వం

18.4 రాజు

18.5 గుప్తుల నాటి సాంఘిక, ఆర్థిక మత పరిస్థితులు

18.6 గుప్తుల కాలంలో శాస్త్ర సాంస్కృతిక వికాసం

18.7 సారాంశం

18.8 మాదిరి ప్రశ్నలు


## 18.1. ఉపోద్ఘాతము :

మౌర్యసామ్రాజ్య పతనానంతరం గుప్తులు ఉత్తర దేశంలో సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి, రాజకీయ ఐక్యతను సాధించి, షుమారు ఒకటిన్నర శతాబ్దాల పాటు (క్రీ.శ. 320-467) శాంతి సుస్థిరతలు నెలకొల్పారు. గుప్తులు సామ్రాజ్యమును నిర్మించుటయే గాక, సమర్ధవంతమైన పటిష్ఠమైన వారి పాలనలో సామ్రాజ్యం సర్వతోముఖాభివృద్ధిని సాధించింది. వారి పరిపాలనా విధానానికి ప్రాచీన పాలనా వ్యవస్థలే పునాది. పాలనా విధానములో నూతన మార్పులు చేయకున్ననూ గుప్తులు మౌర్యుల పాలనా వ్యవస్థను కాలానుగుణమైన మార్పులతో పటిష్ఠముగా రూపొందించారు. గుప్త యుగములో ప్రభుత్వ స్వరూపము రెండు విధాలుగా వుండేది. అవి రాచరిక ప్రభుత్వము, గణతంత్రప్రభుత్వము. గుప్తుల ప్రభుత్వం రాచరిక విధానమైనది. కాని వారి సామంత రాజ్యాలయిన అర్జునాయనులు, యౌధేయులు, మద్రకులు, కాకలు, ఖరపరికలు, ప్రార్జునులు, మాళవులు, ఆభీరులు మొదలగు రాజ్యాలలో గణతంత్ర వ్యవస్థ వాడుకలో వుండేది. గుప్తులు రాజ్యస్థాపన చేసి దానిని సుస్థిర పరచుటయేగాక అందులో పటిష్ఠమైన పాలనా యంత్రాంగాన్ని ప్రవేశపెట్టారని ఎల్.డి. బార్నెట్ పేర్కొన్నాడు.

## 18.2. ఆధారాలు :

గుప్త చక్రవర్తులు దాదాపు ఉత్తర భారతదేశ మంతటినీ తమ ఆధిపత్యంలోకి తెచ్చుకొని రాజ్యమేలినారు. వీరి పరిపాలనా విధానాన్ని తెలుసుకోవడానికి ఆనాటి శాసనాలు ప్రధానముగా ఉపకరిస్తాయి. మజగవాన్, కరందండ, నలంద, సాంచి, షాపూర్, బసార్ మొదలగు చోట్ల లభించిన శాసనాల వల్ల గుప్తుల సైన్యాన్ని గురించి, సైనిక అధికారుల గురించి తెలుస్తుంది. దేవబరనార్ శాసనములో నాటి న్యాయపాలన గురించి ప్రస్తావించబడింది. చైనా బౌద్ధ యాత్రికుడైన పాహియాన్ రచనల ద్వారా కొన్ని పాలనా అంశాలు తెలుసుకోవచ్చు. గుప్తుల పాలనా

విధానానికి మరొక ప్రధానమైన ఆధారం 'కామందక నీతి సారము'. శాసనాలలోని అనేక అంశాలను కామందక నీతిసారము ధృవ పరుస్తుంది. గుప్తుల పాలనా విశేషాలు తెలుసుకొనుటకు నాణాలు, ముద్రలు కూడా ఉపయోగపడతాయి.

### 18.3. కేంద్ర ప్రభుత్వము :

కౌటిల్యుని అర్థశాస్త్రం మౌర్యుల రాజకీయ జీవనాన్ని, లౌకిక ధృక్పధముతో ప్రతిబింబింపచేసినట్లే గుప్తుల కాలం నాటి ధర్మశాస్త్రాల క్రోడీకరణ నాటి రాజ్య స్వభావాన్ని, పాలనావిధానాన్ని తెలుపుతున్నాయి. గుప్తరాజ్య ప్రభుత్వ స్థాపనలో కేంద్రీకృత రాజరిక పాలనా వ్యవస్థ కొనసాగి, సామంత రాజ్యాల విభాగాలలో భూస్వామ్య విధానం చోటుచేసికొన్నది. ప్రభు సేవకు ఫలితముగా చాలా వరకు భూమిని దానము చేయసాగారు. ఇంతవరకు మౌలిక సాంప్రదాయముగా వస్తున్న ధర్మశాస్త్రాలన్ని క్రోడీకరింపబడి లౌకిక ధర్మం రూపొందినది.

### 18.4. రాజు :

గుప్తులు వంశపారంపర్యమైన రాజరిక విధానాన్ని అనుసరించిరి. ఇందులో చక్రవర్తి రాజ్యానికి సర్వాధికారి. ఇతడు దైవాంశ సంభూతుడనే భావం ప్రజలలో వుండేది. రాచరికం వంశ పారంపర్యం. కానీ కొన్ని సందర్భాలలో పెద్ద కుమారుని కాదని రాజు తన సంతానములో సమర్థుడైన వానిని యువరాజుగా ప్రకటించే పద్ధతిని కూడా గుప్తరాజులు అనుసరించారు. మొదటి చంద్రగుప్తుడు సముద్రగుప్తుని, సముద్రగుప్తుడు రెండవ చంద్రగుప్తుని రాజులుగా చేయడమే ఇందుకు నిదర్శనం. రాజు ప్రథమ కర్తవ్యం ప్రజారక్షణ, ధర్మరక్షణ చేయుట. ప్రజలకు ఏ విధమైన బాధ లేకుండా రాజు శ్రద్ధ వహించాలని దండధారియై దోషులను తగు విధముగా నిష్పక్షపాతముగా శిక్షించాలని కామందక నీతిసారము తెలుపుతుంది. రాజు ప్రజలకు ఆదర్శప్రాయుడై వారి జీవనం సక్రమముగా సాగి పోయేందుకు పాటుపడాలి. లేనట్లైతే పతనం అనివార్యం. ఈ విషయానికి నీతిసారములో ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడము జరిగింది. ప్రభుత్వాధికారులు, దొంగలు, శత్రువులు, ఇష్టులు అనే నాలుగు వర్గాలతో బాటు ప్రభువు లోభ గుణము కూడా రాజుకు ప్రధాన శత్రువనీ కామందక నీతిసారములో వివరించబడింది. నాటి రాజులు పరమ భట్టారక, విక్రమాదిత్య, మహారాజాధిరాజ, సామ్రాట్, రాజాధిరాజు, పృధ్వీపాల, చక్రవర్తి, పరమేశ్వర అను బిరుదులు ధరించారు.

#### 18.4.1 మంత్రి పరిషత్ :

రాజ్యపాలనలో రాజుకు సహాయ పడడానికై మంత్రులుండేవారు. వీరి సంఖ్య చాలా తక్కువ. మంత్రి పరిషత్ ప్రస్తావన ఒకటి రెండు సందర్భాలలో వచ్చింది. కామందక నీతిసారములో మంత్రి పరిషత్ విధులు, సమావేశ కార్యక్రమ నిర్వహణ విధానం మొదలగు అంశాలు వివరించడం జరిగింది. రాజు మంత్రి పరిషత్ సమావేశాలకు అధ్యక్షత వహించాలని అందులో పేర్కొనబడింది. ఐతే మౌర్యుల కాలంలో లాగా, గుప్తుల పాలనలో స్థిరమైన, క్రమబద్ధమైన మంత్రిమండలి వున్నట్లు కన్పించదు. మంత్రుల సలహాలను రాజు గౌరవించేవాడు. మంత్రులను రాజే నియమించేవాడు. మంత్రి పదవులు వంశ పారంపర్యముగా వుండేది. మంత్రులు ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ శాఖలు నిర్వహించేవారు. ప్రధానమంత్రిని సచివ అనేవారు. సచివ మంత్రి అనేవారు ఉన్నత శ్రేణికి, అమాత్యులు అనేవారు తక్కువ శ్రేణికి చెందినవారు.

#### 18.4.2. ఉద్యోగ వర్గము :

గుప్తుల కాలం నాటికి ఉద్యోగ స్వామ్యం బలహీన పడింది. ప్రభు సేవకు ప్రతిఫలముగా ఉద్యోగులు భూములు పొందేవారు. ప్రధానఉద్యోగ వర్గమైన కుమారామాత్యులు వివిధ పదవీ బాధ్యతలు చేపట్టేవారు. వారినుంచే మంత్రి, సేనాధిపతి, మహాదండనాయక, సంధి విగ్రహక మొదలగు వారిని నియమించేవాడు. వీరందరినీ రాజే నియమించేవాడు. వీరు యుద్ధ కాలంలో సైన్యంలో, శాంతికాలములో పౌర బాధ్యతలను నిర్వహించేవారు. అలహాబాద్ ప్రశస్తి రచించిన హరిసేనుడు ఏక కాలంలో వివిధ బాధ్యతలు నిర్వహించాడని తెలుస్తుంది. ఉద్యోగ నియామకాలలో

వారసత్వ అధికారం చోటుచేసికొన్నది. అందువల్ల పాలనా యంత్రాంగముపై రాజు అదుపు తగ్గింది. ఉద్యోగ వర్గం రాజ్యంలోని గ్రామాల నగర పాలనలో జోక్యము చేసికోకుండా కేంద్రానికి వారధిగా పని చేసేవారు. నాటి ఉద్యోగ వర్గంలో ఈ క్రింద పేర్కొన్నవారు ముఖ్యులు

1. సంధి విగ్రహిక: యుద్ధం, శాంతి మొదలైన అంశాలు ఇతని ఆధీనములో వుంటాయి.
2. అక్షపటలాధికృత: ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్య పత్రాల సంరక్షకుడు.
3. మహాదండనాయక: ప్రధాన న్యాయాధిపతి. శాంతి భద్రతల నిర్వహణ, కొన్ని సందర్భాలలో సామంతుడుగా వుంటూ రాజుకు సైనిక సేవ చేసేవాడు
4. మహాబలాధికృత : సర్వ సైన్యాధిపతి
5. కుమారామాత్యులు : యువరాజులని రక్షణ భారాన్ని వహించిన మంత్రులని చెప్పడము జరిగింది. వివిధ రకాలైన ఉద్యోగాలలోని యువకులైన అధికారులు.
6. మహాప్రతీహారి: రాజాంత: పుర పర్యవేక్షకుడు
7. రణ భాండాగారిక: సైనిక భాండాగారాధిపతి
8. ఉపరిక లేదా గోప్త: రాష్ట్రాధి పతి
9. భటాశ్వ పతి : అశ్వదళాధిపతి
10. మహాపీలుపతి: గజ దళాధిపతి

### 18.4.3 సామంత ప్రభువులు :

రాజ్య విస్తీర్ణాన్ని బట్టి, పరిపాలనా సౌలభ్యం కోసం గుప్త రాజ్య విభాగాలను బలమైన సామంత ప్రభువుల స్వాధీనములో వుంచడం జరిగింది. వీరు గుప్త రాజ్యాధికారాన్ని పంచుకొన్నారని చెప్పవచ్చు. వారిలో పరివ్రాజకులు, ఉచ్చకల్ప అనే సామంత రాజులు కొంత స్వయం ప్రతిపత్తితో పాలించేవారు. కనోజ్‌ను పాలించిన మౌఖరులు, స్థానేశ్వరమును పాలించిన వర్ధనులు, వల్లభిని పాలించిన మైత్రికులు గుప్తుల సామంతులుగా వుండేవారు.

### 18.4.4. స్థానిక పాలన : భుక్తి :

పాలనా సౌలభ్యం కోసం గుప్త సామ్రాజ్యం రాష్ట్రాలుగా విభజింపబడింది. రాష్ట్రానికి భుక్తి రాజ్యం అని పేరు. వారి సామ్రాజ్యములో పుండ్రవర్ధన భుక్తి, తీరభుక్తి , అహిచ్ఛత్ర భుక్తి, సురాష్ట్ర మొదలగు రాష్ట్రాలు వున్నట్లుగా శాసనాలలోవున్నాయి. రాష్ట్రాధిపతిని ఉపరిక, భోగిక, భోగపతి, గోప్త ,రాజస్థానీయ అనే పేర్లతో వ్యవహరించారు. రాష్ట్రాధిపతులను చక్రవర్తి నియమించేవారు. రాకుమారులు, రాజబంధువులు, ప్రభుభక్తి, కలవారు ఈ పదవిలో నియమితులయ్యేవారు. సామంత రాజులుగా వున్నవారిని ఇతర రాష్ట్రాలకు అధిపతులుగా కూడా నియమించడం జరిగింది. మొదటి కుమార గుప్తుని సామంతుడు మాళ్వాధిపతియైన బిందువర్మ దశపుర పాలకుడుగా నియమితుడు కావడం ఇందుకు తార్కాణము. రాష్ట్రపాలనా కేంద్రాన్ని 'అధికరణం' అనేవారు. పాలనా వ్యవహారాల నిర్వహణలో ఉపరికునికి సహకరించడానికి ఉద్యోగులుండేవారు. వారిలో ముఖ్యులు కుమారామాత్య, బలాధికరణ, రణభాండాధికరణ దండపాశాధికరణ, వినయస్థితి స్థాపక మొదలగు వారు రాష్ట్రపాలనా వ్యవహారాలలో ఉపరికకు తగినంత స్వేచ్ఛ వుండేది. వీరు సాధారణంగా విధేయులై శక్తిమంతులై, బుద్ధిమంతులై వుండేవారు.

**18.4.5. విషయాలు :**

భుక్తులు (రాష్ట్రాలు) విషయాలుగా విభజితమైనాయి. కోటి విషయ, లాట విషయ, వలవ విషయ, అరికిన విషయ మొదలైన విషయాల గూర్చిన ప్రస్తావన శాసనాలలో కలదు. విషయానికి అధిపతి విషయపతి. అతని కేంద్రస్థానాన్ని 'అధికరణం' అనేవారు. విషయ పతిని ఉపరికుడు నియమించేవాడు. సాధారణంగా కుమారామాత్యులను విషయపతులుగా నియమించడం జరిగేది. పరిపాలనా విషయాలను నిర్వహించడానికి ఈ క్రింది ఉద్యోగులు విషయపతికి సహాయపడేవారు. వారు;

1. శౌల్కిక: రహదారి సుంకాల వసూళ్ల పర్యవేక్షకుడు.
2. గౌల్మిక: అడవులను పర్యవేక్షించేవాడు.
3. అగ్రహారిక: అగ్రహారాలను, మత సంస్థలను పర్యవేక్షించేవాడు.
4. ధ్రువాధికరణిక: రైతు నుంచి రాజుకు రావలసిన పన్నుల వసూళ్లను పర్యవేక్షించేవాడు.
5. భాండాగారాధికృత: ప్రభుత్వ ఖజానాధారుడు.
6. మహాక్షపటలిక: ప్రభుత్వ పత్రరచన, సంరక్షణ చేసేవాడు
7. దివిర: ప్రభుత్వ పత్రాలకు ప్రతులు వ్రాసేవాడు.
8. కర్త్రి లేదా శాశస్త్రి: ప్రభుత్వ పత్రాలను తయారు చేసేవాడు. విషయ పతికి సలహాదారుడు.

ఇందులో నలుగురు అనధికార సభ్యులు వుండేవారు వారు 1. నగర శ్రేష్ఠి (వర్తక సంఘాధ్యక్షుడు) 2. సార్థవాహ (వర్తక సంఘాల రక్షణ నాయకుడు) 3. ప్రథమ కులిక (పురాధ్యక్షుడు) 4. ప్రథమ కాయస్థ(ముఖ్య లేఖకుడు). ఆ నగర సభ సలహా సంప్రదింపులు, సహాయ సహకారాలు భూదానా ...యములో తప్పనిసరిగా అవసరమయ్యేది. భూదానాలు ఒక నిర్ణీత పద్ధతిలో జరిగేవి. దానము చేయదలచిన దాత తన భూమి వివరాలతో నిర్ణీత రుసుమును, పత్ర రక్షకులకు ఒక వినతి పత్రాన్ని సమర్పించేవారు. పత్రరక్షకుడు ఆ వినతి పత్రాన్ని పరిశీలనకై ఆ భూమి వున్న గ్రామానికి చెందిన నాలుగు వర్గాల వారికి పంపేవారు. ఆ నాలుగు వర్గాల వారు 1. గ్రామపెద్దలు 2. వాస్తవ్యులు 3. న్యాయాధిపతుల సంఘం 4. గ్రామాధికారులు ఈ నాలుగు వర్గాల వారు భూమిని తనిఖీ చేసి, దానికి సంబంధించిన నివేదికలను పత్రరక్షకులకు పంపేవారు. పత్ర రక్షకులు ఆ నివేదికల ఆదారముగా ఆ భూమికి సంబంధించిన న్యాయసంబంధమైన అంశాలను పరిశీలించి ఒక నివేదికను నగర సభలకు సమర్పిస్తారు. ఆ నగర సభ ఆ నివేదికలన్నింటినీ పరిశీలించిన మీదట సక్రమముగా వుంటే దానానికి తన ఆమోదాన్ని తెలుపుతుంది.

**18.4.6 నగర పాలన :**

నగర పాలనకు ప్రత్యేక యంత్రాంగము వుండేది. నగరాధ్యక్షుడు లేదా పురపాలకుడు నగరానికి అధిపతి. పరిపాలనా నిర్వహణలో ఒక పురపాలక సంఘం, కొందరు ఉద్యోగులు కూడా వుండేవారు. నగర శ్రేష్ఠి ప్రథమ కులిక, సార్థవాహ, ప్రథమ కాయస్థ అనేవారు సంఘ సభ్యులుగా వుండేవారు. ఈ కాలంలో నగర పాలనపై వ్యాపార సంఘాల ప్రాధాన్యత పెరిగింది.

**18.4.7 విధి :**

విషయాలను తిరిగి కొన్ని పాలనా విభాగాలుగా చేశారు. ఇటువంటి పాలనా విభాగానికి విధి అని పేరు. కొన్ని గ్రామాల సముదాయమే విధి. శృంగవీర విధి, దక్షిణాంశిక విధి, కుముదసిత్ర విధి, నందపూర్ విధి, అనే పేర్లు శాసనాలలో కన్పిసాయి. విధి పాలనాధికారిని 'ఆయుక్తక' అన్నారు. అతని కింద పుస్తపాలుడు, కాయస్థులు మొదలైన ఉద్యోగులు వుండేవారు. విధి మహత్తరులు, కుటింబినులు కలసి ఏర్పడ్డ ఒక అనధికార సంఘం అతనికి సహాయకారిగా వుండేది.

## 18.4.8. గ్రామము :

పాలనా వ్యవస్థకు పునాది గ్రామం, గ్రామికుడు గ్రామాధికారి. ఇతడు ప్రభుత్వ అధికారి. గ్రామములో శాంతి భద్రతలను పరిరక్షించడం ప్రభుత్వానికి రావలసిన సుంకాలను వసూలు చేయడం, గ్రామంలో జరిగిన నేరాల గురించి న్యాయాధిపతులకు నివేదించడం, రైతుల భూమి సరిహద్దులు నిర్ణయించి భూమి తగాదాలు తీర్చడం అతని ముఖ్యవిధులు. తలవాటక (తలారి) గోస్వామి (దూత), అక్షపటలాధికారిత (పత్ర సంరక్షకుడు), సీమ కర్మకార( సరిహద్దుల నిర్ణేత), న్యాయ కరణిక (సరిహద్దు తగవుల పరిష్కర్త), ధ్రువాధి కరణిక (పన్ను వసూలు చేసేవాడు), హట్టిక (సుంకాలు వసూలు చేసేవాడు) మొదలగు ఉద్యోగులు గ్రామికునికి సహాయపడేవారు. గ్రామాలలో అవసరమైన రోడ్లు నీరు, ఆరోగ్యం, విద్య మొదలగు ప్రజాహిత కార్యాలు కూడా వీరు నిర్వహించేవారు.

## 18.4.9 సైన్యము :

గుప్తుల కాలంలో బలమైన సిద్ధ సైన్యమున్నట్లుగా శాసనాధికారాలు గానీ గుప్తుల కాలం నాటి సాహిత్య ఆధారాలు కానీ తెలుపుట లేదు. సముద్రగుప్తుని విజయాలకు సామంతుల తోడ్పాటు ప్రధాన కారణమై వుండవచ్చు. సామంతుల సైనిక సహకారం మీద ఆధారపడినట్లు తెలుస్తుంది. గుప్తరాజులు కొంత మూలబలాన్ని పోషించగా సామంత రాజులు యుద్ధ సమయాలలో తమ సైన్యాలను పంపేవారు. గుప్తుల సైనిక విశేషాలు వారి శాసనాల ద్వారా, కామందక నీతిసారము ద్వారా తెలుస్తుంది.

గుప్తుల సైన్యములో గజదళం, అశ్వదళం, కాల్బలము వున్నాయి. వారు నౌకాదళాన్ని కూడా పోషించారు. చక్రవర్తులు యుద్ధాలలో స్వయముగా పాల్గొనేవారు. నాటి సైనికాధికారులలో మహాబలాధికృత, మహాబలాధ్యక్ష, మహాసేనాపతి మొదలగు వారు ముఖ్యులు గుప్తచక్రవర్తులకు సైన్యాన్ని సరఫరా చేసే సామంత రాజులకు మహాదండనాయక సర్వదండ నాయక అనే బిరుదులున్నట్లు తెలుస్తుంది. గజదళాధిపతిని మహాపీలుపతి అని, అశ్వదళాధికారిని భటాశ్వపతి అని వ్యవహరించేవారు, సైనిక వ్యవహారాలు, జీత భత్యాలు చూసే అధికారికి రణభాండాగారకుడు అని పేరు. యుద్ధ వ్యూహ రచన చేసే అధికారి మహాబలాధికృత, యుద్ధ భూమిలో సైన్యాన్ని నడిపేవాడు మహాసేనాధిపతి. అందువల్ల మహాసేనాధిపతి పదవికి చాలా ప్రాముఖ్యం ఇచ్చేవారు. మహాసేనాధిపతిగా నియమించబడేవ్యక్తి లక్షణాల గురించి కామందక నీతి సారములో పేర్కొనబడింది. మహాసేనాధిపతి స్వదేశీయుడు, కులీనుడై వుండాలి. ధైర్యస్థైర్యాలు బుద్ధిబలం భుజబలం కలిగి వుండాలి. సైనికుల మనస్తత్వం అర్థం చేసికొన గలవాడై వుండాలి. గూఢచారులు, కదలికలు శత్రువుల పన్నాగాలు గ్రహించగలవాడై వుండాలి. ఎంతటి క్లిష్ట పరిస్థితినైనా ఎదుర్కొని నిలవగలవాడై వుండాలని పై గ్రంధం తెలుపుతుంది.

యుద్ధాలలో గుప్తుల సైన్యంలో సాంప్రదాయమైన ఆయుధాలు అనగా విల్లంబులు, గండ్రగొడ్డలి, బల్లెము, ఈటె మొదలగువాటిని ఉపయోగించేవారు. సైనికులకు అవసరమైన ఆయుధాలను, తినుబండారాలను, గుడారాలను వేయడానికి పౌర ఉద్యోగులు కూడా వుండేవారు, చక్రవర్తుల, వారి సామంతుల ఆదాయాలలో అధిక భాగం సైన్య పోషణకే ఖర్చు చేసేవారు.

## 18.4.10 ఆదాయ వ్యయాలు :

గుప్తుల రాజ్యానికి ప్రధాన ఆదాయం భూమిశిస్తు. పంటలో ఆరవ భాగం భూమి శిస్తుగా నిర్ణయించి వసూలు చేశారు. భూ సారాన్ని బట్టి శిస్తు ఉండేది. ఇది ధన రూపంలోను ధాన్య రూపంలోనూ వసూలు చేయబడింది. దీనికితోడు ప్రభుత్వ భూములనుంచి కూడా ఆదాయం లభించేది. సామంత రాజులు చెల్లించే కప్పాలు, దిగ్విజయయాత్రలలో లభించే ధన కనక వస్తు వాహనాలు, ప్రజలు ఇచ్చే బహుమానాలు, ఇతర ఆదాయ మార్గాలు. ఎగుమతి దిగుమతి సుంకాల ద్వారా కూడా కొంత ఆదాయం లభించేది. భూముల, క్రయవిక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. గనుల నుంచి, అదనపు నీటి పారుదల సౌకర్యాలు కల్పించడం ద్వారా వసూలు చేసే అదనపు పన్నులు ఇతర ఆదాయమార్గాలు.

### 18.4.11 న్యాయపాలన :

గుప్తుల కాలంలో న్యాయవ్యవస్థ మెరుగుపడింది. ఈ కాలంలో నారద, యాజ్ఞవల్క్య, బృహస్పతి మున్నగు స్మృతులు తయారైనవి. సివిల్, క్రిమినల్ వివాదాలకు ప్రత్యేక చట్టాలు ఏర్పడినాయి. ఆస్తి తగాదాలు, పౌరసత్వ వివాదాలు, పౌర న్యాయచట్టంలో పొందుపరిచారు. వివిధ వర్గాలకు వేరు వేరుగా న్యాయసూత్రాలు ఏర్పరచి వాటిని రక్షించవలసిన బాధ్యత రాజుకి అప్పగించడం జరిగింది. దొంగతనం, వ్యభిచారం, క్రిమినల్ నేరాలుగా నమోదైనాయి. ఉన్నత న్యాయాధికారిగా పండితుల సహాయంతో రాజు అన్ని వివాదాలను పరిష్కరించేవాడు. వృత్తులకు సంబంధించిన వివాదాలను పరిష్కరించటానికి ఆయా వృత్తులకు సంబంధించిన శ్రేణులకే అప్పగించారు. మౌర్యులకాలం నాటి కఠిన పద్దతులను తొలగించి ఎక్కువగా జరిమానాలు విధించారు.

ఈ కాలంలో శాంతి భద్రతలు కాపాడే కార్యనిర్వాహకులు, తీర్పులిచ్చే న్యాయాధిపతులు ఒక్కరేకావడం గమనించతగ్గ అంశము. ఈ కాలంలో న్యాయస్థానాల సంఖ్య బాగా పెరిగిందని, శాసనాలలో కనిపించే అనేకమంది అధికారుల పేర్లనిబట్టి చెప్పవచ్చును. దేవబరనార్ శాసనంలో దండిక, చోరోద్ధర్నిక, దండపాళిక అనే అధికారుల ప్రస్తావన వుంది. దండిక అంటే దండించే వాడని అర్థం. ఇతడు న్యాయాధికారి లేక రక్షక అధికారి కావచ్చు. చోరోద్ధర్నిక అంటే దొంగలను నిర్మూలించే వాడని అర్థం. దండపాళిక అంటే అనుమానితులను బంధించి తీసుకువచ్చేవాడని అర్థం. బాల నేరస్తుల విచారణ కోసం ప్రత్యేక కోర్టులున్నట్లు తెలుస్తుంది.

గుప్తుల పాలనా వ్యవస్థలోని ఉద్యోగులు పై స్థాయి నుంచి క్రిందిస్థాయి వరకు తమ పాలనా విధులను సక్రమంగా నిర్వహించే వారని పాలెటోర్ అభిప్రాయపడినాడు.

### 18.4.12 ప్రభుత్వ స్వభావం :

మౌర్యుల ప్రభుత్వం వలే గుప్తుల ప్రభుత్వం కూడ వంశానుగత నిరపేక్ష రాచరికమే. కాని అప్పటి కఠిన శిక్షలుగాని, ఉద్యోగుల బెడద కాని గుప్తుల కాలమున లేదు. కేంద్రప్రభుత్వంలో కేంద్రీకృత అధికారం నెలకొల్పబడినా, స్థానిక పాలనలో ఉద్యోగేతర సిబ్బంది ప్రమేయం ఎక్కువగా వుండేది. ధర్మరక్షణార్థం వినయస్థితి స్థాపకులు అనే ఉద్యోగులుండేవారు. వీరు ధర్మశాలల, దేవాలయాల, విద్యాలయాల కార్యకలాపాలను పర్యవేక్షించేవారు. వీరు అశోకుని కాలం నాటి ధర్మమహామాత్రుల వంటివారు.

గుప్తుల పాలనను సామ్రాజ్యాధిపత్యంగా నియంతృత్వ ప్రభుత్వంగా కొందరు చరిత్రకారులు అభివర్ణిస్తారు. అయితే ఇది సరికాదు. గుప్తులపాలనను నిశితంగా పరిశీలిస్తే అది వికేంద్రీకృత పాలన అనే అర్థమవుతుంది. ఉద్యోగి వ్యవస్థ, వంశ పారంపర్యమైంది. భూదానాల వలన భూస్వామ్య లక్షణాలు ప్రవేశించాయి. గుప్తరాజ్యంలో ఎక్కువ భాగము సామంతుల ఆధీనంలో వుంది. వీరు చక్రవర్తికి ప్రతినిధులుగా స్వతంత్రంగా పాలించేవారు. స్థానిక పాలనా వ్యవస్థలో పాలన తీరులో వైవిధ్యం వుండేది. జిల్లా అధికారులు పదవులు కూడ వంశపారంపర్యంగ వచ్చేవి. అందువలన గుప్తులపాలన వికేంద్రీకృతమైన పాలన అనే పేర్కొనవచ్చు. అధికార వికేంద్రీకరణ చేసి స్థానిక పాలనా సంస్థల ద్వార పాలనలో ప్రజలకు అధికారం లోబడిందని ఎ.ఎస్. ఆల్టేకర్ అంటాడు.

## 18.5 గుప్తుల నాటి సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు :

మౌర్య సామ్రాజ్య పతనానంతరం ఆర్యావర్తంలో గుప్తులు సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి రాజకీయ ఐక్యతను సాగించి ఒకటిన్నర శతాబ్దాలపాటు (క్రీ.శ 320-467) శాంతి సుస్థిరతలు నెలకొల్పారు. వీరు మతసహనాన్ని పాటించి, సాహిత్యాన్ని, కళలను పోషించారు. సుభిక్షమైన, పరిపూర్ణమైన వీరి పాలనలో గుప్త సామ్రాజ్యం అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించింది. గుప్తులు విడుదల చేసిన అసంఖ్యాకమైన నాణాలను పరిశీలిస్తే నాటి ప్రభుత్వ ఆర్థిక సామర్థ్యం గ్రహించవచ్చు అయితే నాటి ఆర్థిక పరిస్థితులను జాగ్రత్తగ పరిశీలిస్తే సమాజంలోని ధనిక, పేద వర్గాల మధ్య అగాధమేర్పడినదనీ చెప్పవచ్చును. ఈ కాలంలో గుప్తులు కర్మకాండలకు తిరిగి ప్రాణం పోశారు. గుప్తరాజులలో

12

అధికులు వైష్ణవ మతాభిమానులు అయినా పరమత సహనం పాటించారు. ఈ కాలంలోనే బుద్ధుడు దశావతారాలలో ఒకడై, అతడు స్థాపించిన మతం తన ప్రత్యేకతను కోల్పోయింది.

### 18.5.1 ఆధారాలు :

గుప్తుల కాలం నాటి సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులను గురించి తెలుసుకోవడానికి చైనా యాత్రికుడైన పాహియాన్ రచనలు నాటి స్మృతి గ్రంథాలు, నాటకాలు, కావ్యాలు, నాణాలు, శిల్పచిత్రలేఖనాలు వుపయోగపడతాయి. ఇంకా బుద్ధదేవుడు వేయించిన పహాడ్‌పూర్ తామ్రశాసనం. సముద్రగుప్తుడు వేయించిన నలంద, గయశాసనాలు ఉక్కకల్ప, మహారాజులు వేసిన శాసనాలు, క్రీ.శ 441 నాటి ఖోహ్ శిలాశాసనం నాటి పరిస్థితులను తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.

### 18.5.2 సాంఘిక పరిస్థితులు :

రెండో చంద్రగుప్తుని కాలంలో భారతదేశంలో పర్యటించిన పాహియాన్ నాటి పరిస్థితులను ఈ క్రింది విధంగా వివరించాడు. ప్రజలు సుగుణవంతులు, స్థితిపరులు, పట్టణాలలో ప్రజల సంఖ్య అధికము. ప్రజలలో అధిక సంఖ్యాకులు శాకాహారులు, అహింసాపరులు. వారు మాంసం, ఉల్లి, వెల్లుల్లి మొదలగు వాటిని భుజించరు. మద్యాన్ని సేవించరు. వారి ఇండ్లలో పందులనుగాని, కోళ్ళనుగాని పెంచరు. అంటరానివారు అయన చండాలురు మాత్రమే మాంసాహారులు. వీరు వేటాడేవారు. ప్రజలు దురాశాపరులు గాదు. వారిలో నేరప్రవృత్తి తక్కువ. రహదారుల వెంబడి విశ్రాంతి గృహాలు వున్నాయి. దక్షిణ బీహార్‌లో ఎన్నో భాగ్యవంతమైన పట్టణాలు కలవు. సేవాదృక్పథం గల ప్రజలును పట్టణాలలో వైద్యశాలలను ధర్మ సత్రాలు నడుపుతారు. వికలాంగులు, వితంతువులు, అనాధలు, బాల బాలికలు, రోగులు మొదలైన వారికి ఈ ధర్మశాలలలో, వైద్యశాలలో ఆశ్రయం, చికిత్స లభిస్తాయి.

### 18.5.3 వర్ణవ్యవస్థ :

గుప్తులకాలం నాటి సమాజంలో వర్ణవ్యవస్థ బలపడింది. కర్మను బట్టి పుట్టుక వుంటుందని ప్రజలు విశ్వసించారు. వర్ణసాంకర్య నిరోధం రాజుల బాధ్యత అయింది. హిందూమతోద్ధరణతో వర్ణనిబంధనలు, కఠినతరమైనాయి. వర్ణధర్మాలు పాటించిన వారిని వెలివేసి శిక్షించేవారు. హిందూ ధర్మశాస్త్రమైన మనుధర్మశాస్త్రం ఈ కాలంలోనే క్రోడీకరింపబడింది. సమాజంలో బ్రాహ్మణుల ఆధిక్యత పెరిగింది. దానాల వలన, అగ్రహారాల వలన వారి ఆర్థిక పరిస్థితి బాగా మెరుగైంది. వేదపాండిత్యంతో, ఆర్థిక పుష్టితో వారు ప్రత్యేక హక్కులు సాధించుకున్నారు. క్షత్రియులు ఆయధోపజీవులు. వీరుకూడ ద్విజులుగా పరిగణింపబడినారు. క్షత్రియేతరులైన గుప్తులు బ్రాహ్మణులకు భారీగా భూదానాలు ఇచ్చి వారి మెప్పు పొంది సుక్షత్రియులుగా పరిగణింపబడినారు. గుప్తులకు పూర్వం విదేశీయులు అనేకులు భారతదేశం వచ్చి స్థిరపడుట వలన కులాల సంఖ్య పెరిగింది. హిందూ సమాజంలో చేరిన యవనులు, శకులు మొదలైన వారు పురాణాలలో, బృహత్ సంహితలో మ్లేచ్ఛులుగా పిలువబడినారు. పాలకవర్గానికి చెందిన హూణులు హీనక్షత్రియులుగా వ్యవహరింపబడినారు. వృత్తిని బట్టికూడ కులాలు ఏర్పడినాయి.

క్షత్రియేతరతులు రాజ్యాలు స్థాపించడం, ప్రభు వర్గంలో చేరడం, ప్రభుత్వంలో ఉన్నత ఉద్యోగాలు సంపాదించడం గమనించతగ్గ విషయం. అటువంటి వర్గాలలో బ్రాహ్మణుల నుంచి ఆటవిక జాతుల వరకు గలరు. అనువంశికంగ వస్తున్న వృత్తులను కొందరు త్యజించి వ్యాపారం, ప్రభుత్వ ఉద్యోగం లేదా ఇతర వృత్తులు అవలంబించారు. బ్రాహ్మణులు సైన్యంలో చేరడం, వ్యవసాయం చేయడం చూడవచ్చు. వైశ్యులు వ్యాపారం వలన, వర్తకం చేయడం వలన ధనికులుగా మారారు. వర్తకులు, ఇతర వృత్తులవారు సంఘటిత జీవన విధానం వలన రక్షణ పొందారు.

గుప్తుల కాలంలో బానిసత్వం, వెట్టిచాకిరి వుండేది. అంటరానితనం ఆచరణలో వుంది. చండాలుర బ్రతుకులు దుర్భరంగా వుండేవి. వారు పట్టణాలకు, గ్రామాలకు దూరంగా నివశించేవారు. వారు తమ రాకను తెలుపుతూ కర్రను భూమిపై తాడించేవారు. లేక చేగంట మోగించేవారు. ఆ ధ్వని విని కులీనులు వారి దృష్టిపథంలో పడకుండ తప్పుకొనేవారు. వారిని చూస్తేనే మైలపడి పోయినట్లుగా భావించి బ్రాహ్మణులు స్నానం చేసి, జపంచేసుకొని, శుద్ధికర్మలు నిర్వహించేవారట. స్వర్ణయుగ కర్తలుగా కీర్తించబడ్డ గుప్త రాజులు ఈ అమానుష సాంప్రదాయాన్ని చూస్తు మిన్నకుండటం గమనించతగ్గ అంశం. బానిసలు మూల్యం చెల్లించి బానిసత్వం నుంచి విముక్తి కావచ్చు. బానిసను వివాహమాడిన స్త్రీని కూడ బానిసగానే పరిగణించారు.

### 18.5.4. వృత్తులు :

ఈ కాలంలో సాధారణంగా కులాన్నిబట్టి వృత్తి వుండేది. వృత్తి మార్పిడి జరిగిన సందర్భాలు కూడ వున్నాయి. బ్రాహ్మణులు రాజ్యమేలుట, ఉద్యోగవర్గంలో చేరుట క్షత్రియులు పరిశ్రమలు నెలకొల్పుట, వ్యాపారం చేయుట, వైశ్యులు క్షత్రియవృత్తిని చేపట్టుట, నేతగాళ్ళు ఇతర ప్రాంతాలకు పోయి వేరు వృత్తులు స్వీకరించుట, శూద్రులు వ్యాపారం, వ్యవసాయం చేయుట మొదలగు ఉదాహరణలు ఈ కాలంలో కనిపిస్తాయి. ప్రతి వృత్తివారు ఒక సంఘంగా ఏర్పడినారు. ఈ వృత్తి సంఘాలు యువకులకు వారి, వారి వృత్తులలో శిక్షణా కేంద్రాలుగా ఉపయోగపడినాయి. ధనికులైన వర్తకులు తమ వంశప్రతిష్ట కోసం కొన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టినారు. ధనిక వర్గాల వారు పనివాళ్ళను, కళాకారులను ప్రోత్సహించారు. ఈ కారణంగా చేతి వృత్తులలో నైపుణ్యం పెరిగి ఉత్పత్తుల నాణ్యత కొంత అభివృద్ధి చెందింది.

### 18.5.5 కుటుంబ వ్యవస్థ :

కుటుంబం సమాజానికి ప్రాతిపదిక. నాడు కుటుంబాలు సమిష్టిగా వుండేవి. తండ్రి జీవిత కాలంలో కుటుంబ ఏర్పాటును స్మృతులు నిషేధించాయి. తండ్రి మరణానంతరం సోదరులు కూడ కలిసి జీవించినట్లు శాసన ఆధారాలు వున్నాయి. కుటుంబం పితృస్వామ్యంపై ఆధారపడినది. అనులోమ, ప్రతిలోమ వివాహాలు అరుదుగా జరిగేవి. పెద్దలే వివాహాలను జరిపేవారు. బహుభార్యత్వం వుంది. సతీసహగమనం నాడు కనిపించదు. అయితే క్రీ.శ 6 వ శతాబ్దం నుంచి సతీసహగమనం ఆచారంగా రూపొందింది. దేవాదాసీలకు సంఘంలో ఆదరణ వుంది.

### 18.5.6. స్త్రీల స్థానం :

గుప్తయుగంలో స్త్రీల ప్రాధాన్యత తగ్గింది. యుక్తవయసు రాగానే వివాహాలు జరిగేవి. బ్రాహ్మణ, క్షత్రియ స్త్రీలకు సాధారణ విద్యతో పాటు చిత్రలేఖనం, నృత్యం, సంగీతం నేర్పేవారు. ధనిక వర్గాలకు చెందిన స్త్రీలు రకరాకాల ఆభరణాలతో, అలంకరణలతో, చక్కని వస్త్రాలు ధరించి సుఖప్రదమైన జీవితం గడిపేవారు. కాని సామాన్య స్త్రీల పరిస్థితి ఇందుకు భిన్నంగా వుండేది. ప్రతి ధనిక కుటుంబములో దాస్య వృత్తి చేసే స్త్రీల సంఖ్య పెరిగింది.

### 18.5.7 వివాహాలు :

ఆనాడు సాధారణంగా సవర్ణవివాహాలు వాడుకలో వున్నప్పటికి వర్ణాంతర వివాహాలు జరిగేవి. ఎక్కువగా ఏకపత్నీవ్రతం వాడుకలో వుండేది. ఉన్నతవర్గాలలో బహుభార్యత్వం సర్వసాధారణం.

### 18.5.8 ఆహారం, దుస్తులు, అలంకరణలు :

నాటి ప్రజలలో ఎక్కువ మంది శాకాహారులని ఫాహియాన్ తన రచనలో పేర్కొన్నాడు. మద్య, మాంసాలను, ఉల్లి, వెల్లుల్లి మున్నగు వాటిని శూద్రులు, పంచములు ఎక్కువగా వాడినారు. పురుషులు అంగవస్త్రాలను, ధోవతిని, స్త్రీలు చీర, రవికెలను ధరించినారు. నూలు, సిల్కు బట్టలను వాడారు. స్త్రీ, పురుషులు ఇరువురు అనేక ఆభరణాలు ధరించారు. శరీర సౌందర్యానికి లేపనములు, పౌడర్లు వాడినారు. అజంతా చిత్రాలలోను, శిల్పాలలోను నాణాల మీద నాటి వస్త్రధారణ పద్ధతులు, అలంకరణలు కనిపిస్తాయి.

### 18.5.9 వినోదాలు :

చదరంగం, పాచికలాట, పొట్టేళ్ళ పందాలు, కోళ్ళు పందాలు, వేట, నృత్య సంగీతాలు, నాటకాలు ఆనాటి ప్రజల వినోదాలు.

### 18.5.10 బానిసత్వం :

ఈ యుగంలో బానిసత్వం వుంది. యుద్ధ ఖైదీలు, దివాలా తీసినవారు. పరాజిత జూదరులు, క్షామపీడితులు, బానిసలయ్యేవారు. కాని ఋణవిముక్తులై స్వేచ్ఛ పొందు అవకాశం కూడ వారికి గలదు.

గుప్తుల నాటి పరిస్థితులను జాగ్రత్తగా పరిశీలిస్తే నాటి సమాజంలోని ధనిక, పేదవర్గ మధ్య పెద్ద అగాధమేర్పడినదని అర్ధమవుతుంది. ముఖ్యమైన ఉత్పత్తి సాధనాలైన భూమి, పరిశ్రమలపై భూస్వామ్యుల వర్తకుల ప్రాధాన్యం పెరిగింది. సంఘంలో అట్టడగు వర్గాన్ని పంచములుగా, సంఘబాహ్యులుగా పరిగణించేవారు. సమాజంలో ధనిక వర్గాల జీవన విధానానికి సామాన్యుల జీవన విధానానికి వ్యత్యాసం కనపడుతుంది.

### 18.5.11 ఆర్ధిక పరిస్థితులు :

గుప్తరాజులు ముద్రించిన అసంఖ్యాకమైన బంగారు నాణాలను బట్టి ఆనాటి ఆర్థిక పరిస్థితి పటిష్టంగా వుందనీ భావించవచ్చును. క్రీ.శ 3 వ శతాబ్ది వరకు కొనసాగిన రోమ్ వర్తకం భారతదేశానికి లాభాలు తెచ్చిపెట్టినది. కాని హూణులు దండయాత్రలవలన మధ్యధరా సముద్రానికి చైనా పట్టుపురుగులు దొంగ రవాణా వలన, రోమ్ సామ్రాజ్య పతనం వలన, ఐరోపాతో భారతదేశానికి వ్యాపార సంబంధాలు తెగిపోయాయి. అందువలన గుప్తులు ఆగ్నేయ ఆసియాతో వున్న వర్తక సంబంధాల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందవలసి వచ్చింది. ఈ కాలంలో ఒకే ఉద్యోగి వివిధ బాధ్యతలు చేపట్టడం ద్వారా ప్రభుత్వ ఖర్చు తగ్గింది. గుప్తరాజులు వారి సామంతులు విరివిగా దేవాలయాలకు భూములను దానం చేయడం వలన వ్యవసాయ భూములు సిద్ధం చేసి ఉత్పత్తిని పెంచటానికి ప్రయత్నించడము వలన ఈ కాలంలో ప్రభుత్వానికి ఆర్థికంగా బలం చేకూరింది.

### 18.5.12 వ్యవసాయం :

గుప్తుల కాలంలో ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఈ కాలంలో భూమి యాజమాన్యంపై చరిత్రకారులలో భిన్న అభిప్రాయాలు కలవు. బుద్ధదేవుడు వేయించిన పహాడ్‌పూర్ తామ్రశాసనం ఆధారంగా రాజ్యంలోని భూమి అంతా ప్రభుత్వానిదేనని కొందరు వాదించారు. ఈ శాసనంలో భూదానాలు చేయడం ద్వార చక్రవర్తికి సిరిసంపదలు, ఆధ్యాత్మిక గౌరవం పెరిగాయని పేర్కొనబడింది. ఈ శాసనాన్ని బట్టి గుప్తుల కాలంలో భూమిపై రైతుకు హక్కు వున్నప్పటికి రాజుకు సిద్ధాంతపరంగ తిరుగులేని హక్కు వున్నట్లు భావించవచ్చు. ఈ కాలంలో భూమి సర్వే జరిగేదని శాసనాల వలన తెలుస్తుంది. వ్యక్తులకు చెందిన భూముల సరిహద్దులను జాగ్రత్తగా గుర్తించేవారు. రికార్డులు నిర్వహించేవారు. భూముల కొలతలు, స్థానిక, ప్రముఖుల సమక్షంలో జాగ్రత్తగా కొలిచి సరిహద్దు రాళ్ళు వేసేవారు. సరిహద్దులలో వుండే భూముల యజమానులు, వారి వృత్తులు భూముల విస్తీర్ణాన్ని కూడ రికార్డులలో జాగ్రత్తగా భద్రపరిచేవారు. జిల్లాలో జరిగే లావాదేవిలను పుస్తపాల అనే అధికారి రికార్డు చేసేవాడు. గ్రామ కరణాలు, గ్రామస్థాయిలో జరిగే భూముల లావాదేవిలను రికార్డు చేసేవారు. ఈ కాలానికి సంబంధించిన ఆధారాలలో పదిచోట్ల భూముల విక్రయం గురించిన ప్రస్తావన కనిపిస్తుంది.

గుప్తరాజులు, భూస్వామ్యులు, రాజోద్యోగులు, ధనికులు, ఆలయాలకు భూదానాలు చేసేవారు. అగ్రహారాలు అన్నపేరుతో చేసే గ్రామదానాలు బ్రాహ్మణులకు మాత్రమే పరిమితం. దీనిపై వారికి వంశపారం పర్య హక్కు వుండేది. వీరు ప్రభుత్వానికి ఏ రకమైన శిస్తులు చెల్లించనవసరం లేదు. దానగ్రహీతలు దానం స్వీకరించినందుకు బదులుగా మతపరమైన సేవలు చేయవలసి వచ్చేది. వర్ణాశ్రమ ధర్మాల అమలుకు కృషి చేయడం ప్రజలలో దైవభక్తిని రాజభక్తిని ప్రోత్సహించడం వీరి విధులు. దేవాలయాల పునర్నిర్మాణానికి పూజాకార్యక్రమాలకు, కవులకు, వ్యాపారులకు ఇతరులకు కూడ గ్రామదానాలు చేసేవారు. వీటిని అగ్రహార దానాలు అనేవారు. పాలన అధికారులు, సైనిక అధికారులు చేసిన గొప్ప కృషికి గుర్తింపుగా వారికి భూదానాలు ఇచ్చినట్లు 'భాగిక, భోగపతిక' వంటి ప్రభుత్వ అధికారుల పేర్లను బట్టి

భావించవచ్చు. ఇండోర్‌లో దొరికిన శాసనాన్ని బట్టి మధ్య భారతంలో దాన గ్రహీతలు భూమిని స్వయంగా తామేసాగు చేయవచ్చు. లేద ఇతరుల చేత చేయించవచ్చు. ఈ రకం భూదానాల వలన కౌల్దారీ పద్ధతికి బీజం పడింది. భారతదేశంలో కౌల్దారీ పద్ధతికి తొలి లిఖిత సాక్ష్యాధారం ఇదే. క్రీ.శ 5 వ శతాబ్దం తరువాత భూదాన గ్రహీతలకు రాజులు దొంగలను శిక్షించే హక్కును కూడ ఇచ్చారు. అలాగే సివిల్ కేసులను కూడ వీరు విచారించేవారు. ఆర్థిక పెత్తనంతో పాటు పాలనాసంబంధమైన అధికారాలు కూడా లభించడంతో వీరు రైతులను పీడించడం ప్రారంభించారు. రైతుల పరిస్థితి దిగజారినట్లు 6 వ శతాబ్దపు శాసనాలను బట్టి తెలుస్తుంది. కొన్ని ప్రాంతాలలో స్వతంత్రంగా జీవించే రైతులు బానసలుగా మారవలసి వచ్చింది. ఈ భూదానాల వలన చక్రవర్తుల అధికారం బలహీనమైంది.

ప్రభుత్వం వ్యవసాయ భూములకు నీటిపారుదల వసతులు కల్పించినట్లు స్కంధగుప్తుని కాలం నాటి సుదర్శన తటాక మరమత్తుల వలన విధితం అవుతుంది. పారశీక నీటిచక్రం ద్వార చెరువులనుండి, బావుల నుండి, పంట భూములకు నీటి వసతి కల్పించబడింది. రైతుల పరిస్థితి నాడు దుర్భరంగా వుండేదని చెప్పక తప్పదు. రైతులు, కౌలు చెల్లించకపోతే వారిని తొలగించి వేరే రైతులకు కౌలుకు ఇచ్చేవారు. దీనివలన రైతు పరిస్థితి అస్థిరమైంది. భూస్వామ్యులు, సైనికులు తమ సరకుల రవాణా నిమిత్తం గ్రామ ప్రజలను తమ సేవకై బలవంతంగా, ఉచితంగా ఉపయోగించుకున్నారు. గ్రామపాలన స్వతంత్రమైనదని చెప్పుకున్నప్పటికి రైతులను దోపిడికి గురిచేయడం జరిగింది. రైతులు గోధుములు, వరి ఎక్కువగా పండించేవారు. చెరకు, బార్లీ, పప్పు ధాన్యాలు, నూనెగింజలు, అల్లం, కూరగాయలు, పండ్లు మొదలగు పంటలుకూడ పండించేవారు. ఎంత పండించినా రైతులకు కష్టాలే మిగిలింది.

### 18.5.13. పరిశ్రమలు :

ఆనాటి పరిశ్రమలలో ప్రధానమైనది వస్త్రపరిశ్రమ. నూలు, ఊలు, పట్టువస్త్రాల ఉత్పత్తి విరివిగా జరిగేది. ఈ వస్త్రాలు దేశ అవసరాలకు మించి వుండడం వలన విదేశాలకు ఎగుమతి అయ్యేది. చేతి వృత్తులలో నేత, కమ్మరి, కుమ్మరి, చర్మకార, శిల్పం, దంతం పనులు ముఖ్యమైనవి. అన్ని వృత్తులలోని వారు తాము ఉత్పత్తి చేసే వస్తువుల నాణ్యత తగ్గిపోకుండ జాగ్రత్త తీసుకొనేవారు. ఆనాడు లోహపరిశ్రమ అభివృద్ధి దశలో వున్నది. రాగి, కంచు, ఇనుము మొదలగు లోహాలతో వివిధరకాల పరికరాలు తయారు చేసేవారు. నేటికి తుప్పుపట్టక ఆశ్చర్యాన్ని కలిగించే ఢిల్లీలో మెహరౌలి వద్ద వున్న ఇనుపస్తంభం ఈ కాలంలో పోత పోయపడినదే. ఈకాలంలో లోహంతో పెద్ద పెద్ద విగ్రహాలు పోత పోసేవారు. అంతేగాక వివిధ లోహాలతో అనేక రకాలైన నాణాలను ముద్రించారు.

### 18.5.14 వర్తక వ్యాపారాలు :

రోమ్ సామ్రాజ్యం పతనం, మధ్య ఆసియా ద్వారా బైజాంటియన్ సామ్రాజ్యం చైనాతో వ్యాపారాన్ని చేయడం వలన ఈ కాలంలో పశ్చిమ దేశాలతో భారత వ్యాపారం దెబ్బతిన్నది. అంతేగాక గ్రామాలలో అధిక భాగం స్వయంపోషకం కావడం వలన స్వదేశీ వ్యాపారం కూడ తగ్గినది. అయితే ఆగ్నేయ ఆసియాతో సుగంధ ద్రవ్యాల వ్యాపారం దేశంలోని వర్తక సంఘాలు లాభపడటానికి ఉపకరించాయి. ఆనాడు భారతదేశంలోని రేవు పట్టణాలలో ముఖ్యమైనవి తామ్రలిప్తి, కళ్యాణి, చౌల్, కాంబే, ముజిరిస్ మొదలగునవి. తామ్రలిప్తి నుంచి ఎక్కువ వ్యాపారం జరిగేది. వస్త్రాలు, నవరత్నాలు, సుగంధద్రవ్యాలు, నీలిమందు, ఔషధాలు, దంతం వస్తువులు ఎగుమతి చేసేవారు. వెండి, బంగారం, రాగి, తుత్తునాగం, మేలుజాతి గుర్రాలు దిగుమతి చేసుకొనేవారు. భారతదేశం నాడు చైనా, కంబోడియా, శ్రీలంక, ఇథియోపి పర్షియా, బాక్ట్రియా, రోమ్ మొదలగు దేశాలతో విదేశీ వ్యాపారం జరిపింది.

గుప్తుల కాలంలో పశ్చిమతీరంలో బరుకచ్చం, తూర్పు తీరంలో తామ్రలిప్తి ప్రధాన రేవు పట్టణాలు. ప్రాచీనకాలం నుంచి నదీ తీరాల ద్వారా సరుకులు రవాణా జరిగేది. బనారస్ నుంచి పశ్చిమాన సింధు రాష్ట్రం ద్వారా పశ్చిమదేశాలకు భూమార్గం ద్వార వర్తకం జరుగేది. ఉత్తరం నుంచి ఈశాన్య దిశగా, శ్రావస్థి నుండి ప్రతిష్టానం వరకు వర్తక మార్గం ఏర్పడింది. అలాగే శ్రావస్థి నుంచి కపిలవస్తు, వైశాలి, పాటలీపుత్రం, నలందాలను కలుపుతూ రాజగృహం దాక వర్తకమార్గం వుండేది. పంజాబ్ నుంచి మధ్య పశ్చిమ ఆసియావైపు వర్తకం సాగేది. ఈ నదులు, రహదారులు, గుప్తుల ఆర్థిక అభ్యుదయానికి తోడ్పడ్డాయి. ఈ మార్గాలలో గల బౌద్ధ ఆరామాలు, సంఘారామాలు వర్తకులకు

సహాయపడినాయి. పాహియాన్ ఈ మార్గాల ద్వార భారతదేశంలోని వివిధ ప్రాంతాలను దర్శించాడు. బౌద్ధ సాహిత్యంలో వర్తకమార్గాలు, వర్తకకేంద్రాల గురించిన సమాచారం లభ్యమవుతుంది. గుజరాత్, మాళ్వ, రాజస్థాన్ ప్రాంతాలలో జైనులు, వర్తకాన్ని ప్రోత్సహించడమే కాక స్వయంగ వర్తకం చేసారు. భారీ వర్తకానికి సాక్ష్యంగ ఈ కాలానికి చెందిన అజంతా చిత్రాలను పేర్కొనవచ్చును.

ఆగ్నేయ ఆసియా దేశాలతో కొనసాగిన వర్తకం కారణంగా భారతీయ సంస్కృతి ప్రభావం ఈ దేశాలపై ప్రసరించింది. విదేశీవర్తకం. స్వదేశి, విదేశి వ్యాపారం ద్వార ఈ కాలంలో ఎక్కువమొత్తంలో బంగారు, వెండి భారతదేశంలో కేంద్రీకృతమైనాయి. ముత్యాలు, పగడాలు, రత్నాలు వంటి విలువైనవి సముద్ర నావికుల ద్వారా తీరం చేరి దేశమంతటా విరివిగా వ్యాపించాయి. సరుకుల రవాణాలు, దారి దోపిడీలు సంభవించడం వలన వర్తకులు సమూహంగా ఏర్పడి ప్రయాణించేవారు.

### 18.5.15 శ్రేణులు :

వృత్తిపనివారు, వ్యాపారులు తమ ప్రయోజనాలను కాపాడుకొనుటకు శ్రేణులుగా లేక నిగమాలుగా లేక వృత్తి సంఘాలుగా ఏర్పడేవారు. సార్ధవాహుల, శ్రేణి, శ్రేష్ఠుల నిగమ, కులికుల నిగమ, నేతపనివారి శ్రేణి, నూనెగానుగుల వారిశ్రేణి మొదలగు వృత్తి సంఘాలున్నట్లు శాసనాల, ముద్రలు వలన తెలుస్తుంది. ఈ శ్రేణులు తమ నిర్మాణంలోను, నిర్వహణలోను స్వతంత్రంగా వుండేవి. తమకు అనుకూలమైన నియమ నిబంధనలు ఈ శ్రేణులు స్వయంగా రూపొందించుకునేవి. ప్రభుత్వంకూడ వాటిని గౌరవించేవి. ఈ వృత్తి సంఘాలవారు తమ, తమ వృత్తులలో యువకులకు తర్ఫీదునిచ్చేవారు. వస్తు ఉత్పత్తిలో నిమగ్నమై వాటి నాణ్యత దెబ్బ తినకుండ ఈ శ్రేణులు కాపాడేవి. ఈ శ్రేణులు లావాదేవిలలో నేటి బ్యాంకులు వలే పనిచేసేవి. శ్రేణి సభ్యులకు ఆర్థిక ఇబ్బందులు వచ్చినపుడు అప్పులిచ్చి ఆదుకునేవి. ఆ కాలంలో అప్పుతీసుకున్నవారి నుంచి ఎక్కువ మొత్తంలో వడ్డీ వసూలు చేసేవి. పొదుపు మొత్తాల సభ్యులకు నియమితమైన వడ్డీ కూడ చెల్లించేవి. నాటి బౌద్ధ సంఘాలు కూడ వర్తక వ్యాపారాలలో పాల్గొనడం గమనార్హం. ఈ శ్రేణులు బౌద్ధ సంఘాలు తమ లాభాలలో కొంత భాగాన్ని ప్రజోపయోగకర కార్యకలాపాలకు ఖర్చు చేసేవి.

### 18.5.16 నాణాలు :

గుప్తులు వర్తక వ్యాపారాలకై నాణాలు ముద్రించి చెలామణిలో వుంచారు. వీరు నాణాలు ప్రవేశపెట్టినప్పటికి రోజువారి లావాదేవిలలో వెండి, రాగి నాణాలు ఎక్కువగా వాడుకలోవున్నవి. బంగారు నాణాన్ని సువర్ణం లేదా దీనార అని వెండి నాణాన్ని రూపకం అని పిలిచేవారు. ఒక బంగారు నాణానికి 15 వెండి నాణాలు, గవ్వలు కూడ ధనంగా వాడబడినట్లు పాహియాన్ రచనల వలన తెలుస్తుంది. ఉన్నతవర్గాలకు చెందిన ప్రజలలో బంగారు, వెండినాణాలు ఎక్కువగా చెలామణి అయ్యేవి. రాగి నాణాలు, గవ్వలు క్రింది వర్గాలకి చెందిన ప్రజలు ఉపయోగించేవారు. గుప్తులు మొదట్లో ముద్రించిన బంగారు నాణాలలో 10% మాత్రమే అపద్రవ్యం వుండేది. హూణ దండయాత్రల వలన గుప్తుల ఆర్థిక వ్యవస్థ కొంతవరకు దెబ్బతింది. అందువలన స్కంధగుప్తుడు ముద్రించిన బంగారు నాణాలలో అపద్రవ్యం 46% వరకు పెరిగింటి. ఈ విధంగా నాణాలకు వాడిన లోహంలో నాణ్యత లోపించడం నాటి ఆర్థిక దుస్థితికి నిదర్శనం.

### 18.5.17 మత పరిస్థితులు :

మౌర్య అశోకుని ధర్మప్రచారం వలన బలపడిన లౌకిక సాంప్రదాయం మౌర్యుల పతనానంతరం శుంగ, కాణ్వ, శాతవాహనుల కాలంలో బలహీనపడి గుప్తులకాలం నాటికి బ్రాహ్మణమత ఆవిర్భవానికి తోడ్పడింది. జైన, బౌద్ధమతాలు రాజాదరణ కోల్పోయి వ్యాపార వర్గాలపైనే ఆధారపడ వలసి వచ్చింది.

### 18.5.18 హిందూ మతం :

నవహిందూ మత ఆవిర్భావంలో గుప్తయుగం ఒక ప్రధాన ఘట్టం. వైదికమతం ఆధునిక హిందూమతంగా పరిణమించింది. ఈ యుగంలోనే, గుప్త చక్రవర్తులు వైదికమతాభిమానులు. మొదటి చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు అశ్వమేధయాగాలు చేశారు. కాని క్రతువుల

పట్ల ప్రజలకు ఆదరణ తగ్గింది. భక్తి ప్రధానమైన పౌరాణిక మతంవైపు వారు ఆకర్షితులయ్యారు. వైదిక మతానికీ జైన, బౌద్ధ మతాల పోటి ఎక్కువైంది. అదియునుగాక విదేశీయులను చేర్చుకొనుటకు వైదిక మతంలో మార్పులు చేయవలసిన అవసరము ఏర్పడింది. అందువలన విష్ణు భక్తులైన గుప్త ప్రభువులు ఆదరణలో వైదికమతం నేటి హిందూ మతంగా రూపొందినది. వైదిక దేవతల స్థానంలో క్రొత్త దేవుళ్ళు దేవతలు వెలిశారు. త్రిమూర్తులుగా పరిగణింపబడిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, వారి భార్యలు సరస్వతి, లక్ష్మి, పార్వతులు, విఘ్నేశ్వరుడు, హనుమంతుడు, సూర్యుడు మున్నగు పెక్కు దేవతలను ప్రజలు ఆరాధించినారు. యవనులు, కుషాణులు, శకులు మున్నగు విదేశీయులు వైష్ణవం ద్వారా హిందూమతంలో చేరినారు.

### 18.5.19 వైష్ణవ మతం :

గుప్తుల కాలంలో వైష్ణవ మతం బాగా వ్యాప్తి చెందింది. గుప్తచక్రవర్తులు వైష్ణవ మతాభిమానులు కావడం వలన ఈ మతం బాగా వ్యాప్తి చెందింది. ఈ కాలపు పాలకులు పరమభాగవత, పరమవైష్ణవ వంటి బిరుదులు ధరించారు. రెండో చంద్రగుప్తుడు పరమభాగవత బిరుదాన్ని స్వీకరించాడు. సముద్రగుప్తుడు గరుడవాహనాన్ని రాజ చిహ్నంగా వాడడం వలన అతడు వైష్ణవుడు అన్న విషయం గ్రహించవచ్చు. ఈ కాలంలో దశావతారాలకు ఎక్కువ ప్రాముఖ్యం వచ్చింది. క్రీ.శ 4, 8 శతాబ్దాల మధ్య కాలంలో లభ్యమవుతున్న ఆధారాలను బట్టి విష్ణు అవతారాలలో ఏదో ఒక అవతారాన్ని ప్రజలు ఎక్కువగా పూజించినట్లు చెప్పవచ్చు. ఈ కాలంలో దశరథరాముని పూజ విశేషంగా జరిగింది. కాళిదాసు రచన అయిన రఘువంశంలో రాముని గురించి ప్రస్తావించాడు. రెండో చంద్రగుప్తుని కుమార్తె ప్రభావతి గుప్త భాగవత రామగిరి స్వామిని ఆరాధించింది. ఈ భాగవతుడు దశరథరాముడే. స్కంధగుప్తుని జునాఘడ్ శాసనం వామనరూప ప్రసక్తిగలదు. ఈ యుగంలోనే విష్ణువు అవతారంగా కృష్ణుని గుర్తించడం జరిగింది. అయితే ఈ యుగంలో ఎక్కువగా పూజలు అందుకుంది వరాహ అవతార రూపమే. ఉదయగిరి గుహాలయం వద్ద తొలచిన వరాహ విగ్రహం చూపరులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎరాన్‌లో కూడ వరాహ విగ్రహం కనిపిస్తుంది. విష్ణువు భార్య లక్ష్మి దేవిని కూడ ఈ కాలంలో పూజించారు. ఖోహ్ శిలాశాసనంలో ఆదిశక్తి పేర ఆలయం నిర్మించిన విషయం చెప్పబడి వుంది.

### 18.5.20 శైవ మతం :

గుప్త చక్రవర్తులలో అత్యధికులు వైష్ణవ మతావలంభులైనా వారు పరమత సహనం పాటించారు. ఈ కాలంలో శైవం కూడ వ్యాప్తి చెందింది. మొదటి కుమారగుప్తుడు శైవ మతాభిమాని. ఇతడు నెమలికి ఆహారం పెడుతున్నట్లు నాణాలు ముద్రించాడు. నెమలి స్కంధుని వాహనం. కుమారగుప్తుడు తన కుమారునికి స్కంధగుప్తుడు అని పేరు పెట్టుకున్నాడు. నవరత్నాలలో ఒకడైన కాళిదాసు శివభక్తుడు. ఇతడు తన కావ్యమైన కుమార సంభవంలో స్కంధుని జననాన్ని గురించి వివరించాడు. ఈ కాలంలో రచింపబడిన వాయు, మత్స్య పురాణాలలో శివభక్తిని ప్రోత్సహించడం కనిపిస్తుంది. విదేశాలనుంచి భారతదేశంపై దాడిచేసిన రాజులు శైవమతాన్ని అభిమానించారు. మిహిరకులుడు శివభక్తుడు. గౌడశశాంకుడు, మౌఖరి వంశస్థులు, మైత్రక వంశస్థులు శివుణ్ణి ఆరాధించారు. పుష్యభూతివంశస్థులలో కొందరు శైవమతస్థులు. గుప్తుల కాలంలో మొత్తం మీద వైష్ణవం కంటే శైవ మతానికి ప్రాబల్యం, ప్రాచుర్యం కొంత తక్కువగా వుంది.

### 18.5.21 బౌద్ధ, జైనమతాలు :

గుప్త రాజులు హిందూమతాన్ని ఆదరించినప్పటికి ఇతరమతాల పట్ల సహనాన్ని ప్రదర్శించారు. ఈ కాలంలో అనేక స్థూప, విహారాలు వెలిశాయి. సారనాథ్ లోని ధామెఖ్ స్థూపం, ఒరిస్సాలోని రత్నగిరి వద్ద గల బౌద్ధ స్థూపం, సింధ్‌లోని మిర్పూర్ ఖాన్ వద్దగల స్థూపం ఈ కాలపు ప్రధాన బౌద్ధ నిర్మాణాలు. మధుర, కుశినగరం, కౌశాంబి, సారనాథ్‌లు నాటి ముఖ్య బౌద్ధ కేంద్రాలు. వల్లభి, ఉదయగిరి, మధుర, పుండ్ర వర్ధనలు నాటి ముఖ్య జైనకేంద్రాలు. ఈ కాలంలోనే వల్లభిలో ఒక జైన మహాసభ జరిగింది. సముద్రగుప్తుడు బౌద్ధమతస్థుడైన

వసుభంధుని ఆదరించాడు. బౌద్ధుడైన అమరకరదేవుని రెండో చంద్రగుప్తుడు తన సేనానిగా నియమించాడు. కుమారగుప్తుడు నలంద, బౌద్ధ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. బౌద్ధులు, జైనులు, హిందువులు సహజీవనం చేస్తున్నారని పాహియన్ రాశాడు. ఈ కాలంలోనే బౌద్ధమతం క్రమంగా హిందూమతంలో లీనం కావడం కూడ ప్రారంభమైంది. బుద్ధుడిని దశావతారాలలో ఒకనిగా పేర్కొనడం ఇందుకు నిదర్శనం.

## 18.6 గుప్తుల కాలంలో శాస్త్ర సాంస్కృతిక వికాసం

గుప్తుల కాలాన్ని బార్నెట్ పండితుడు గ్రీసులోని పెరిక్లిస్ యుగంతోను, స్మిత్ పండితుడు ఇంగ్లండ్‌లోని ఎలిజబెత్ యుగంతోను పోలుస్తారు. ఈ కాలంలో ఉత్తమ తరగతికి చెందిన సంస్కృత సాహిత్యం, ఇతర వైజ్ఞానిక శాఖలకు చెందిన సాహిత్యం, లలితకళలు వృద్ధి చెందినాయి. ఈ అభ్యుదయానికి, ఔన్నత్యానికి వెనుక వున్న ఎన్నో శతాబ్దాల కృషి ఒక ముఖ్య కారణం. గుప్త చక్రవర్తులు సాధించిన రాజకీయ ఐక్యత వల్ల, ఆర్థిక వికాసం వల్ల, ప్రజలలో కలిగిన ఆత్మవిశ్వాసం, భవిష్యత్ లో నమ్మకం ఇందుకు మరొక ముఖ్య కారణం. గుప్త చక్రవర్తులు స్వయంగా విద్యలలోను, సంస్కృతిలోను అభిమానం వున్నవారు. సారస్వతంలోను, కళలలోను గుప్తులకుగల ఆసక్తివల్ల అపారమైన సంస్కృత సారస్వత సృష్టి జరిగి మనోహరశిల్పం తయారైంది. వాస్తవానికి ఈ మహోద్యమానికి ప్రారంభము శుంగ, శాతవాహన యుగంలోనే జరిగింది. వైదేశిక, సంస్కృతి సాంప్రదాయాలను జీర్ణం చేసుకొని హైందవ సంస్కృతి గుప్తయుగం నాటికి క్రొత్త భావాలతో, చైతన్యంతో విజృంభించిందన్న స్మిత్ మాటలలో కొంత సత్యం లేకపోలేదు. అందుచేత గుప్తయుగంలో కనిపించేది సాంస్కృతిక పునరుజ్జీవనం కాక సాంస్కృతిక వికాసమేననడం సముచితం.

### 18.6.1. విద్య :

గుప్తుల కాలంలో నూతన చైతన్యం పొందిన హైందవ మతం సంస్కృతాన్ని ప్రోత్సహించింది. ముఖ్యంగా బ్రాహ్మణులలోను, మహాయాన బౌద్ధులలోను సంస్కృతం బాగా వ్యాప్తమైంది. గుప్త చక్రవర్తులు సంస్కృత భాషను పోషించారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యవర్గాలకు చెందిన ఉపనయన సంస్కరణల ద్వార విద్యాభ్యాసం చేసేవారు. ఈ కాలంలో ఎక్కువగా బౌద్ధమత సంస్థలు విద్యాకేంద్రంగా పనిచేసేవి. ఇవేగాక బ్రాహ్మణులు తమ గృహాలలో విద్యార్థులకు విద్యను బోధించేవారు. బ్రాహ్మణుల ఆశ్రమాలలో కూడ విద్యాభ్యాసం కొనసాగేది. కౌటిల్యుడు, కాళిదాసు వివరించిన విద్యావిధానంలోకాని, విద్యా విషయాలలో కాని గుప్తుల కాలం నాటికి పెద్దగా మార్పులేదు. గుప్తుల కాలంలోని శాసనాలలో విద్యా విషయాలను వివరించటం జరిగింది. విద్య అంటే వేదాలు, పురాణాలు, మీ మాంస, న్యాయ ధర్మశాస్త్రాలను అనుసరించి సరియైన జ్ఞానం పొందడం. అప్పటి విద్యాబోధనలో అష్టాధ్యాయి, మహాభారతం చేర్చడం జరిగింది. రాకుమారులకు సైనిక విద్యతో పాటు చంధస్సు, గణితం, జ్యోతిష్యం, నాట్య, సంగీతాలు మొదలగు విషయాలపై విద్యాభ్యాసం వుండేది. నాడు విద్యా విషయాలేవి వ్రాత రూపంలో వుండేవి కావు. విద్యా కేంద్రాలలో ఉపాధ్యాయులు చెప్పగా శిష్యులు వినడం, జ్ఞాపకం చేసుకోవడం, చెప్పిన విషయాన్ని చర్చించడం ద్వార విషయగ్రహణం చేసేవారని పాహియాన్ వ్రాశాడు. గుప్తులనాటి శాసనాలు అధికభాగం సంస్కృత, పాకృతాలలో వున్నాయి. స్త్రీ విద్యకు నాడు తగిన ప్రోత్సాహం లభించలేదు. ఆనాడు బౌద్ధ విద్యా కేంద్రాలు అధిక సంఖ్యలో వున్నప్పటికి అవి క్షీణదశను చేరుకున్నట్లు పాహియాన్ పేర్కొన్నాడు. ఆనాటి విద్యాకేంద్రాలలో తక్షశిల ప్రఖ్యాతి చెందింది. 5 వ శతాబ్దంలో నలంద, వల్లభిలలోని విద్యాకేంద్రాలు పేరు సంపాదించాయి. పాటలీపుత్రం, ఉజ్జయిని, మధుర, అయోధ్య, బనారస్, నాసిక్, కరాచీలలో కూడ హిందూ, బౌద్ధ విద్యా కేంద్రాలు వుండేవి. విద్యాకేంద్రాలకు రాజులు ధనికులు, వర్తకశ్రేణులు దానాలు చేసేవారు.

### 18.6.2. సాహిత్యం :

గుప్తుల కాలంలో సాహిత్యకృషి ఒక్కసారిగా పెల్లుబికినది. హిందూమత పునరుజ్జీవనం వలన సంస్కృత భాషకు ఎనలేని ప్రోత్సాహం లభించింది. సంస్కృత సాహిత్యాలు ఈ యుగంలో పరాకాష్టను అందుకున్నాయి.

గుప్తరాజులందరు సాహిత్య ప్రియులు. వారి పాలనలో సంస్కృతం రాజ భాషగా ఆదరణ పొందినందువల్ల నాటికవిత్వం కూడ సంస్కృతంలోనే రచించబడింది. రాజాంతఃపురాలలోను కులీనుల గృహాలలోను కవి, పండిత గోష్ఠులలోను సాంకేతిక విజ్ఞాన, వైద్య మతగ్రంధాల రచనలలోను సంస్కృత భాషనే వాడేవారు. ఈ కాలానికి చెందిన ప్రముఖ కవిపండితులలో ముఖ్యులు హరిశేనుడు వీరశేనశాబ, కాళిదాసు, శూద్రకుడు, సుభందు, అసంగుడు, దిజ్ఞాగుడు, అమరసింహుడు, కామందకుడు మొదలగువారు. అలహాబాద్ ప్రశస్త రచయిత హరిశేనుడు. అందులోని సంస్కృత భాషా పటిమ, కవితాసరళి, హరిశేనుని పాండిత్యానికి నిదర్శనం.

గుప్తరాజులు సాహిత్యాన్ని ఉదారంగా పోషించారు. భారత సాహిత్యంలో ఉన్నతస్థానంలో వున్న పెక్కుమంది కవులు గుప్తులు కొలువులో వున్నావారే. సముద్రగుప్తుడు స్వయంగా కవి. కవిరాజ బిరుదాంకితుడు. ఇతని ఆస్థానంలోని హరిశేనుడు ప్రముఖ కవి. సంస్కృత సాహిత్యచరిత్రలో రెండో చంద్రగుప్తునికి ప్రత్యేక స్థానముంది. నవరత్నాలుగా ప్రసిద్దులైన సంస్కృతకవులు ఇతని ఆస్థానంలోని వారు. ఈ నవరత్నాలు గురించి నిర్ధారణగా చెప్పలేము.

సంస్కృత కవి శిరోమణి కాళిదాసు. ఇతడు అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం, అనే నాటకాలను రఘువంశం, మేఘసందేశం, కుమారసంభవం, ఋతుసంహారం అను కావ్యాలను రచించాడు. అభిజ్ఞాన శాకుంతలం ఉత్తమమైన నాటకంగా ప్రపంచఖ్యాతిని ఆర్జించింది. కాళిదాసు నిస్సందేహంగా భారతీయ కవితా శైలిలో నిష్ణాతుడని, గుప్తుల కాలంలో జ్వాజ్వల్యమానమై సంస్కృత సాహిత్యానంతా ప్రకాశవంతం చేసిన తేజోమూర్తి అని డా॥ దేవస్థలి కీర్తించాడు. శూద్రకుడు, విశాఖదత్తుడు మొదలగువారి నాటకాలు గుప్తులనాటి జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయి. శూద్రకుడు మృచ్ఛకటికం అనే నాటకాన్ని రచించాడు. విశాఖదత్తుడు ముద్రారాక్షసం, దేవిచంద్రగుప్తంవంటి గొప్ప రాజకీయ నాటకాలను రచించాడు.

గుప్తులకాలంలో సంస్కృత వ్యాకరణం కూడ అభివృద్ధి చెందింది. అమరసింహుడు ఈ కాలంలో అమరకోశాన్ని వ్రాశాడు. బౌద్ధ వ్యాకరణవేత్త చంగ్రోమయ చంద్రవ్యాకరణం అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించాడు. కామందకుని నీతిసారము, విష్ణుశర్మ పంచతంత్రం, సుభందుని వాసవదత్త, అసంగుని యోగాచారం, దిజ్ఞాగుని ప్రయాణసీముచ్ఛయము ఈకాలం నాటి గొప్ప గ్రంథాలు.

ఈ కాలంలో స్మృతి సాహిత్య ఆవిర్భావం చివరిదశలోవుంది. కామందకుని నీతిసారం, నారద స్మృతి, బృహస్పతి స్మృతి ఈ కాలంలో తుది రూపాన్ని సంతరించుకున్నాయి.

భారతీయులందరికి గొప్పగ్రంథాలైన మహాభారత, రామాయణ, ఇతిహాసాలు కూడ ఈ యుగంలోనే తుది నిర్దిష్ట రూపాన్ని సంతరించుకొని వుండవచ్చు. ఈ గ్రంథాలకు చారిత్రిక, సాహిత్య ప్రాముఖ్యముంది. అనేకరకాల విజ్ఞానాలకు గనులుగా ఈ రెండు గ్రంథాలను పేర్కొనవచ్చును.

పురాణాలు కూడ ఈ కాలంలో రచింపబడ్డవి. పురాణాలలో హిందూ తాత్వికచింతన. అంతర్లీనంగా చూపుతూ ముఖ్యముగా దుష్టశిక్షణ, శిష్టరక్షణకై మంచి, చెడుల మధ్య జరిగిన పోరాటాలను వివరించారు. వాటిలో అంతిమ జయం సత్యానికే అన్న నిరూపణే గమనించతగ్గది. ఈ పురాణాలను బ్రాహ్మణులు సంకలనం చేసారు. యుగాల పుట్టు పూర్వోత్తరాలను, రాజవంశాల పుట్టుపూర్వోత్తరాలను ఇందులో పొందుపరిచారు. ఆ విధంగా బ్రాహ్మణులు చరిత్రకు తమదైన శైలిలో వివరణ ఇచ్చారు.

ఈ కాలంలో మహాయాన బౌద్ధం ఎక్కువ ప్రచారంలో వుంది. మాధ్యమిక తత్త్వ సాంప్రదాయాన్ని అనుసరించి ఆర్య దేవుడు, ఆర్యఅసంగుడు రచనలు చేసాయి, తర్కశాస్త్రంపై మొదట రచన చేసినవాడు వసుభందుడు. వసుభందుని శిష్యుడు దిజ్ఞాగుడు అభిధర్మకోశం, త్రినశిక అనే గ్రంథాలను రచించాడు. ఈ కాలంలోనే జాతకకథలు క్రోడీకరించడం జరిగింది. బుద్ధుని జీవితచరిత్ర, మహావస్తు, లలితవిస్తరము రచనలు చేసారు. మహాయానశాఖ విజ్ఞాన వాదంపై వ్రాసిన లంకావతారసూత్రం క్రీ.శ 5 వ శతాబ్దంలో గుణభద్రుడు అనువదించాడు. శీల,

సమాధి, ప్రజ్ఞ, నిర్వాణ మొదలైన సూత్రాలను వివరించే విషుద్దియాగ అనే గ్రంథాన్ని బుద్ధఘోషుడు క్రోడీకరించాడు. త్రిపీతకాలపై అతని వాఖ్యానాలు ఆగ్నేయాసియాలో, సిలోన్ ప్రచారం పొందినవి. వసుభందుడు తన రచనలలో సాంఖ్య సిద్ధాంతాన్ని విమర్శించాడు. అతని గాధాసంగ్రహం, అభిదమ్మకోశం, హీనయాన సర్వాస్తి వాద బౌద్ధశాఖలకు చెందినవి.

ఈ కాలంలో జైనులు కూడ సంస్కృతాన్నే వాడారు. హిందూ ఇతిహాసాలకు, పురాణాలకు జైనరూపాలు వెలువడినాయి. రామాయణాన్ని, జైనమతానికి అనుగుణంగా విమలుడు రచించాడు. జైన, తర్కశాస్త్రానికి పటిష్టమైన పునాదులు వేసిన న్యాయవర్త సమ్మతి తర్క సూత్ర అను రెండు గ్రంథాలు రచించాడు.

ఈ కాలంలో ప్రాకృతం సామాన్య ప్రజల భాషగా వుండేది. బౌద్ధులు జైనులు మతప్రచారం ఈ భాషలోనే చేశారు. ఈ కాలంలో ప్రాకృత భాష అనేక రూపాలను సంతరించుకుంది. మధుర దాని పరిసర ప్రాంతాలలో శూరసేని భాషగా, బుందేల్‌ఖండ్ ప్రాంతంలో అర్ధమగధి భాషగా, బీహార్‌లో మాగధి భాషగా, బీహార్ ప్రాంతంలో మహరాష్ట్ర భాషగా ప్రాకృత భాషా పరిణామం చెందింది.

ఈ కాలంలో ప్రాచీన వ్రాతపద్ధతులు కూడ బాగా అభివృద్ధి చెందాయి. భూర్జపత్రాలు, తాళపత్రాలు, వస్త్రాలు, చర్మం, కలప, రాయి, మట్టిఫలకాలు మొదలైన వాటిని వ్రాతసాధనాలుగా ఉపయోగించారు. బ్రహ్మిలిపి ఈ కాలంలో బాగా అభివృద్ధి చెందింది.

### 18.6.3. సాంకేతిక, విజ్ఞానశాస్త్రాలు :

శాస్త్ర, సాంకేతిక రంగాలలో 8 వ శతాబ్దం వరకే చెప్పుకోదగిన రచనలు వెలుగులోకి వచ్చాయి. బీజగణితం, గణితం, ఖగోళశాస్త్రం, ఈ కాలంలో బాగా అభివృద్ధి చెందాయి. ఈ శాస్త్రాల బోధన కూడ విస్తారంగా జరిగేది. గ్రీకుల నుంచి మొదట్లో భారతదేశం చేరిన ముఖ్యాంశాలు ఈ గణితశాస్త్రాలకు చెందినవి. ఇవి చాలా త్వరగ అభివృద్ధి చెంది శాస్త్రస్థాయికి చేరుకున్నాయి. ఇందకు హైందవ మతం దాని అవసరాలు ఎక్కువ కారణమైనాయి. క్రతువులు వాటికి సంబంధించిన వేదికల నిర్మాణం, ఖగోళ, గణిత శాస్త్రాల అభివృద్ధికి కారణాలైనాయి.

### 18.6.4 శాస్త్ర పరిణితి :

గుప్తుల కాలంలో గణితశాస్త్రం, ఖగోళశాస్త్రం, రసాయనశాస్త్రం, వైద్యశాస్త్రం బాగా పురోగమించాయి. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు నాటి సుప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞులు. సున్నా వాడకం, దశాంశ పద్ధతిని కనుగొనడం ఈ కాలములోనే జరిగింది. సూర్య సిద్ధాంతమనే గ్రంథంలో ఆర్యభట్టు సూర్యగ్రహణాలు, చంద్రగ్రహణాలు ఏర్పడటానికి గల కారణాలను చర్చించాడు. తాను రూపొందించిన సిద్ధాంతాలు ద్వార భూమి పరిణామాన్ని ఆనాడే ఆర్యభట్టు అంచనా వేశాడు. ఇది ఆధునిక కాలపు అంచనాలకు దాదాపు సరిపోయింది. భూభ్రమణాన్ని గురించి మొదట ప్రపంచానికి చాటి చెప్పినవాడు ఆర్యభట్టే. ఇతడు ఆర్యభట్టీయం అనే గ్రంధాన్ని వ్రాశాడు. ఇందులో సామాన్యగణితం, బీజగణితం, క్షేత్రగణితం, త్రికోణమితి సిద్ధాంతాల వివరణ వుంది. చుట్టుకొలతకు, వ్యాసానికి గల సంబంధాన్ని కనుగొని రెండు విలువలు స్థిరీకరించింది కూడ ఇతడే. స్థానబేధం వలన సున్నా విలువ ఎట్లు మారుతుందో వివరించి దశాంశ పద్ధతికి నాంది పలికినది ఇతడే.

వరాహమిహిరుడు రచించిన బృహత్ సంహితలో ఖగోళం, భూగోళం, వృక్షశాస్త్రాలకు సంబంధించిన విజ్ఞానం ఎంతో వుంది. ఇతడు పంచసిద్ధాంతిక, బృహత్ జాతక అనుగ్రంథాలను కూడ రచించాడు.

ఈ కాలపు ఖగోళ శాస్త్రజ్ఞులు రోదసిలో తిరిగే అనేక వస్తువులకు సహజకాంతి లేదని, అవి కాంతి వక్రీకరణ వలనే ప్రకాశిస్తున్నదని గుర్తించారు. నాటి మరో ప్రముఖ గణితశాస్త్రవేత్త, ఖగోళశాస్త్రజ్ఞుడైన బ్రహ్మగుప్తుడు వస్తువులను ఆకర్షించే లక్షణం భూమికి వుండడం వలన ప్రకృతి సహజ సిద్ధాంతం ద్వార ఎగరవేసిన వస్తువులు భూమిపై పడుతున్నాయని చెప్పాడు. అంతేగాకుండ ఈ కాలపు వైశేషిక జ్ఞాన మార్గం అణుసిద్ధాంతాన్ని పేర్కొన్నది.

**18.6.5 రసాయన శాస్త్రం :**

ఔషధాల తయారీలో లోహాలను వినియోగించడం, పాదరసం, ఇనుము, వాడకం గురించి వరాహమిహిరుడు ఇతర పండితులు ప్రస్తావించడం వలన రసాయనశాస్త్రం కూడ ఈ కాలం నాటికి గొప్పగా అభివృద్ధి చెందినదని భావించాలి. ఈ కాలంలో రచింపబడిన నవనీతికం అనే వైద్య గ్రంథంలో మందుల తయారీ పద్ధతులు, మోతాదు మొదలైన అంశాలను చర్చించారు. ఈ కాలంలోనే ద్రావకాలను మంచినీటిని పరిశుద్ధం చేసేందుకు వడగట్టడం, క్రిమినాశన పద్ధతులను అభివృద్ధి చేశారు.

**18.6.6 వైద్యశాస్త్రం :**

వైద్య, విజ్ఞాన రంగంలోను శస్త్ర, చికిత్సలు చేయడంలోను పేరుగాంచిన శుశ్రుతుడు ఈ కాలం వాడే. ఇతడు శుశ్రుత సంహితను రచించాడు. అష్టాంగ సంగ్రహం అను గ్రంథాన్ని రచించి వైద్యశాస్త్రాన్ని, పురోగమింపచేసిన వాగ్భటుడు, చరకసంహితం వ్రాసిన చరకుడు, హస్త్యాయుర్వేద గ్రంథం ద్వార పశువైద్యాన్ని అభివృద్ధి చేసిన పాలకాస్యపుడు ఈ యుగం వారే. నాడీమండలాన్ని గురించి, ఎన్నో ఔషధాలను గురించి వారికి పూర్తిగా తెలుసు. ఎ.యల్ భాషం అను పండితుడు భారత వైద్యవిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని గురించి ఈ క్రింది విధంగా కొనియాడాడు. "ఎముకలను సరియైన స్థానంలో వుంచే నైపుణ్యం శిఖరాగ్రం చేరుకుంది. ఈ కాలంలో మరెక్కడ లేనంతగా ప్లాస్టిక్ సర్జరి అభివృద్ధి చెందింది. ముక్కు, చెవులు, పెదవులు సరిచేయటంలో ప్రాచీన భారతీయ శస్త్రవైద్యులు మంచి నేర్పరులు.

**18.6.7. సాంకేతిక పరిజ్ఞానం**

ఢిల్లీలోని మెహరౌలి వద్దగల ఇనుపస్తంభం, గుప్తులు ముద్రించిన బంగారు, వెండినాణాలు, లోహాలతో రూపొందిన దేవతామూర్తులు, సారనాథ్ లో నిర్మించబడిన ధామేక్ స్థూపం, దేవఘడ్ మొదలగు చోట్ల గల దేవాలయాలు గుప్తుల నాటి సాంకేతిక విజ్ఞానాభివృద్ధికి నిదర్శనాలు.

**18.6.8 వాస్తుకళ :**

గుప్తులకాలంలో వాస్తుకళ ఒక క్రొత్తరూపు సంతరించుకుంది. విదేశీలక్షణాలను విదిలించుకొని సాంప్రదాయతను ప్రధానంగా భారతీయతను సంతరించుకొని క్రమంగా వృద్ధి చెందింది. గుప్త చక్రవర్తులు నాటి మతావసరాల దృష్ట్యా వాస్తుకళ మీద ప్రత్యేకమైన శ్రద్ధ చూపి పెక్కు దేవాలయాలను నిర్మించారు. అలాగే గుప్తులు పరమత సహనం పాటించడంవల్ల ఈకాలంలో బౌద్ధ మతస్థులు కూడా స్థూపాల నిర్మాణం కొనసాగించారు. కాలానుగుణంగా వచ్చే మార్పులవల్ల గుప్తులనాటి కట్టడాలు వినాశనానికి గురిఅయ్యాయి.

**18.6.9 గుహాలయాలు :**

గుప్తులనాటి బౌద్ధుల వాస్తు, చిత్ర కళల ప్రతిభ అజంతా, ఎల్లోరా గుహలలో చూడవచ్చు. క్రీ.శ. 5-7 శతాబ్దాల మధ్యకాలంలో అజంతాలో అనేక చైత్యశాలలు, విహారాలు నిర్మించబడ్డాయి. వీటిలో 19 వ సంఖ్య గల చైత్యశాల. 16, 17 సంఖ్యగల విహారాలు పేర్కొదగినవి. ఈ గుహాలయాలు అనేక రూపాలలో గతకాలపు గుహాలయాలనే పోలి వున్నాయి. అయితే ఈ గుహాలయాల ద్వారాల అలంకరణలోను, స్తంభాల రూపకల్పనలోను గుహాలయ లోపల చేసిన అలంకరణలోను ఈ కాలపు ప్రత్యేకత కనిపిస్తుంది. ఎల్లోరాలో వున్న గుహలలో ముఖ్యమైది విశ్వకర్మ చైత్యశాల. ఇందులో ధర్మచక్రప్రవర్తన ముద్రలో గంభీరంగా వున్న బుద్ధుని విగ్రహం కలదు.

మధ్యప్రదేశ్‌లో బాగ్‌లోని గుహలు ఈ కాలం నాటివే. ఇచట 8 విహారాలుకలవు. ఇవి అజంతానే పోలివున్నప్పటికి లోపలిభాగంలో విగ్రహానికి బదులు చైత్యముంటుంది. ఈ విహారాలకు మూడు వైపుల గది వుండి మధ్యలో హాలు వుంటుంది. ఉదయగిరి గుహలు కూడా ఈ కాలం నాటివే. ఇచటగల గుహలయాలయాలన్నింటిలో 5 వ గుహ ప్రఖ్యాతి వహించింది. ఇందులో వరాహ విష్ణు బృహత్ స్వరూపం కలదు.

## 18.6.10 దేవాలయాలు :

గుప్తులు నిర్మించిన ఆలయాలలో నేటికి నిలిచివున్నవి ఝాన్సీ సమీపంలో గల దేవఘర్‌లోని దశావతార ఆలయం, కాన్పూర్ జిల్లాలో గల భీతర్ గాత దేవాలయం, జబల్‌పూర్ జిల్లాలో తిగావా వద్ద గల విష్ణు ఆలయం, సత్న జిల్లాలో భూమ్ర వద్ద గల శివాలయం, పన్నా జిల్లా నాచన వద్ద గల పార్వతీ ఆలయం, సాంచి సారనాథ్‌లలోని బౌద్ధ ఆలయాలు.

గుప్తుల తొలి ఆలయాలు రాతితో నిర్మించగా మలి ఆలయాలు రాయి, ఇటుకతో నిర్మించబడినవి. తొలి ఆలయాలలో ఒకచతురస్రాకార గర్భగృహం, దాని ముందు స్తంభాల మండపం వుండి, ఆలయంపై కప్పు సమతలంగా వుంటుంది. గుప్తుల మలి ఆలయాలకు గర్భగృహం, ప్రదక్షిణా పథం గర్భగృహం పైన శిఖరం వుంటాయి. ఆలయాల స్తంభాల పైభాగం పూర్ణ కుంభాకారంలోను, సింహద్వారానికి ఇరువైపుల గంగా యమున శిల్పాలుంటాయి. దక్షిణ భారతదేశంలో పల్లవులు ద్రావిడ శైలికి రూపకల్పన చేయగా ఉత్తర భారతదేశంలో నాగర శైలికి గుప్తులు నిర్దిష్టమైన రూపమిచ్చారు.

గుప్తులకాలపు దేవాలయ నిర్మాణాలలో ఉన్నత దశకు చేరుకున్నవి దేవఘర్‌లోని దశావతార ఆలయం భీతర్‌గావ్ ఆలయం. దశావతార ఆలయం 1 1/2 మీ. ఎత్తుగల అధిష్ఠానంపై నిర్మించబడింది. ఈ ఆలయానికి నాలుగు మూలలలో నాలుగు ఆలయ నమూనాలున్నవి. ఆలయంపైన శిఖరం వుంది. ఇది ఉత్తర భారత రేఖాశైలి తొలి దశకు చెందింది. గర్భగృహ కుడ్యాలపై నరనారాయణ, అనంతసాయి, విష్ణు శిల్పాలు కలవు. భీతర్‌గావ్ ఆలయం ఇటుకలతో నిర్మించబడింది. గర్భగృహం, అంతరాళం, ముఖమండపం కలిగి వున్న ఈ ఆలయం ప్రతిమానికేతనాలతో కుడ్యస్తంభాలతో శిల్పాలతో అలంకృతమై వుంది. అతిసామాన్యంగా, నిరాడంబరంగా ప్రారంభమైన గుప్త వాస్తు కళ రాను రాను అనేక మార్పులకు లోనై నాగరశైలి రీతికి శ్రీకారం చుట్టింది. భారతదేశ వాస్తుచరిత్రలో గుప్తులకాలంలో నూతన శకం ఆరంభమైందని S.K. సరస్వతీ కొనియాడారు.

## 18.6.11. శిల్పకళ :

గుప్తుల శిల్పకళ క్రీ.శ 4 వ శతాబ్దం చివరిభాగంలో ఆవిర్భవించింది. మధుర, సారనాథ్ నాటి ముఖ్యశిల్ప కళాకేంద్రాలు. ఈ కాలంలో శిల్పకళపై విదేశీ గాంధార లక్షణాలు చాలా వరకు వెనుకబడి దేశీయమైన బార్హుత్ సంప్రదాయల ప్రభావం అధికమైంది. అందుచే నాటి భారతీయ శిల్పానికి స్వతంత్ర వ్యక్తిత్వం ఏర్పడినదని విమర్శకుల అభిప్రాయం. ఈ వ్యక్తిత్వమే సారనాథ్ బౌద్ధ శిల్పంలోను, హిందూశిల్పంలోను కనిపిస్తుంది. గుప్తులశిల్పం భారతీయమైందని ప్రతి అంశంలోను సాంప్రదాయమైందని, అది మధురశైలి నుంచి ఉద్భవించిందని గ్రీకు లేదా మరే ఇతర ప్రభావం దానిలో లేదని ఆర్.సి మజుందార్ పేర్కొంటాడు.

గుప్తులనాటి శిల్పాలలో కేవలం మానవ ఆకృతికే ప్రాధాన్యత ఇచ్చారు. ధ్యానం, దీక్ష, మత దృక్పధం ఈ శిల్పాలలో కనిపిస్తుంది. ఆధ్యాత్మిక దృష్టికి ప్రాధాన్యం ఇవ్వబడింది. ఆత్మభావాన్ని శిల్పంలో స్పష్టంగా చిత్రించారు. భారత సాంప్రదాయ పరంపరలో పుష్పించి సువాసనలు గుప్పించే ఒక అందమైన పుష్పంగా గుప్తుల శిల్ప కళను ఎ.కె.కుమారస్వామి వర్ణించాడు.

## 18.6.12. హిందూ విగ్రహాలు :

గుప్తులనాటి హిందుశిల్పాలకు సాక్ష్యాలు ఉదయగిరి గుహలోని వరాహశిల్పం, ఎరాన్‌లోని వరాహ విగ్రహం, ఖోహ్‌లోని ఏకముఖలింగం, భూమ్రలోని గణేశ, ఏకముఖ లింగాలు, బ్రహ్మ, యమ, కుబేర, కార్తికేయ, సూర్య, ఇంద్ర మొదలగు ప్రతిమలు. దేవఘడ్‌లో విష్ణు, శివ, రామ కృష్ణ ప్రతిమలు మొదలగునవి. వీటిలో ఉదయగిరి గుహలోని వరాహశిల్పం అద్భుతమైంది. సముద్రంలో మునిగిపోతున్న భూదేవిని అవలీలగా పైకి ఎత్తుతున్న వరాహమూర్తి విగ్రహంలో ప్రపంచంలో వుండే సమస్తశక్తులు మూర్తీభవించినట్లు చిత్రించబడింది. విగ్రహానికి ఇరువైపుల దేవతలు, రాక్షసుల బొమ్మలు చిత్రించబడింది. దశావతార ఆలయంలోని రామాయణ, భాగవతగాథలు చక్కగా

చిత్రించబడివున్నాయి. ఈ శిల్పాలు హైందవశిల్పాలలో అత్యుత్తమైనవి అని అగర్‌వాలా పండితుడు పేర్కొన్నాడు. దేవఘర్ ఆలయంలో యోగ ముద్రలోని శివుని విగ్రహం భారతీయ కళలో పరాకాష్టగా స్మిత్ వర్ణించాడు.

### 18.6.13 బౌద్ధశిల్పం :

గుప్తచక్రవర్తులు హిందూ మతాభిమానులు అయినప్పటికి పరమతసహనం పాటించారు. అందువల్ల ఈ కాలంలో హిందూ విగ్రహాలతో పాటు బౌద్ధవిగ్రహాలు కూడా రూపొందాయి. మధురలో తయారైన బౌద్ధవిగ్రహాలు పెద్దవిగా వుండి గుండ్రటి అవయవాలు కలిగి వున్నవి. సారనాథ్‌లో అధిక సంఖ్యలో ఉత్తమ తరగతికి చెందిన బౌద్ధ విగ్రహాలు రూపొందాయి. మనోగతభావాలు ముఖంమీద ప్రస్ఫుటమయ్యేటట్లు చిత్రికరించడంలో సారనాథ్ శిల్పులు నేర్పరులు. సన్ననిదేహం, మృదువైన అవయవాలు, అర్ధ నిమీలిత నేత్రాలు, శరీరాన్ని అంటిపెట్టుకున్న దుస్తులు సారనాథ్ బౌద్ధప్రతిమల లక్షణాలు.

గుప్తశిల్పకళ నాటి నైతిక విలువలకు, మత జీవితవిధానానికి ప్రతీక అని చెప్పవచ్చు. దేహసౌందర్యాన్ని దుస్తులమాటున భద్రపరిచి ఆధ్యాత్మిక భావాలను ముఖంలో ప్రస్ఫుటం చేయడంలో ఈ విషయం స్పష్టమవుతుంది. ఈ కాలంలో భారతదేశం నేర్చుకొనే స్థానంలో లేదు. ఆసియాకంతటికి నేర్పేస్థితిలో వుందని హావెల్ పండితుడు పేర్కొన్నాడు.

### 18.6.14 మృణ్మయశిల్పాలు :

గుప్తులకాలంలో మృణ్మయ శిల్పాలుకూడ ముఖ్యమైనవి. విష్ణు, కార్తికేయ, సూర్య, దుర్గ, కుబేర, నాగ మొదలగు మృణ్మయ విగ్రహాలు లభించాయి. అహిచ్ఛత్రం, రాజగిరి, హస్తినాపురం మొదలగుచోట్ల లభించిన అవశేషాలను బట్టి ఈ కాలంలో బంకమట్టితో శిల్పాలు తయారుచేసే వారి నైపుణ్యం గ్రహించవచ్చు. ఈ కాలపు ఎర్రటి మృణ్మయపాత్రలు ప్రత్యేకంగా గమనించతగ్గవి.

### 18.6.15 చిత్రలేఖనం :

గుప్తచక్రవర్తులు, ధనికులు, కళాభిమానులు చిత్రకళాభివృద్ధికి దోహదం చేసారు. ప్రభుత్వం చిత్రశాలలను స్థాపించి చిత్రలేఖనాన్ని పోషించింది. చిత్రశాలల గురించి కాళిదాసు తన రచనలలో ప్రస్తావించాడు. రాజుల కవసరమైన చిత్రాలు గీయడానికి ప్రభుత్వ చిత్రకారులుండేవారు.

అజంతాలోని 16, 17, 19 సంఖ్యగల గుహలలో గల వర్ణ చిత్రాలు, బాగ్‌లోని వర్ణచిత్రాలు ఈకాలానికి సంబంధించినవి. బుద్ధుడు, బోధిసత్వుల వివిధచారిత్రిక జాతకకథలు, జీవన సరళి సుఖదుఃఖాలు, ప్రేమ, ఆదరం, కోపం మొదలగు మానవ లక్షణాలతో కూడుకున్నవి. వృక్షాలు, జంతువులు, పుష్పాలు, లతలు, యక్షులు, గంధర్వులు, అప్సరసలు మొదలగు కథావస్తువులను తీసుకొని అజంతాలో చిత్రించారు. అజంతా గుహలలోని 16 వ సంఖ్యగల గుహలోని మరణశయ్యపై రాకుమార్తె చిత్రం అందరి మన్ననలు పొందగలిగినది.

బాగ్ చిత్రాలలో అజంతా చిత్రాలకంటే ఎక్కువగా బౌద్ధమత ప్రభావం కనిపిస్తుంది. ఇచట స్త్రీల చిత్రాలు అజంతా కంటే గొప్పగా చిత్రీకరించబడ్డాయి. బుద్ధుని జాతకకథలకు సంబంధించిన చిత్రాలు, జంతువుల చిత్రాలు చక్కని రంగుల కలయికలతో జీవము ఉట్టిపడేటట్లు చిత్రించబడినవి.

స్థిర సాంప్రదాయబద్ధమై, సజీవ, వైవిధ్య రూపకల్పనలతో, మనోహర, వర్ణాకృతులతో అజంత చిత్రాలు రూపొందించబడ్డాయిని గ్రిఫితు పండితుడు ప్రశంసించాడు. భంగిమలను చిత్రించడంలో అజంత కళాకారులకు అసమాన కౌశలం వుంది అని హెర్రింగ్ హోమ్ పేర్కొన్నాడు.

వర్ణచిత్రాలలోని సాంకేతిక అంశానికి వస్తే నాటి చిత్రకారులు తాము చిత్రాలు వేసే వేదికలను చాలా తేలికగా రూపొందించుకున్నారు. ఈ చిత్ర సాంప్రదాయం భారతదేశంలోనే కాక మధ్యఆసియా, చైనా, కొరియా, జపాన్ మొదలగు దేశాలలో కూడ అమలుజరిగింది.

**18.6.16. నృత్యసంగీతాలు :**

సముద్రగుప్తుడు వీణమీటుతున్నట్లు నాణాలు ముద్రించి చెలామణిలో వుంచాడు. దీనిని బట్టి అతడు సంగీత ప్రియుడు అని చెప్పవచ్చు. ఆనాడు నృత్యసంగీతాలు నేర్పడానికి ప్రత్యేకంగా సంగీతశాలలు, నృత్యశాలలుండేవని తెలుస్తుంది. దేవదాసీలు, నాట్యసంగీతాలలో మంచి ప్రావీణ్యం పొందేవారు. రాజనర్తకులు, రాజగాయకులుండేవారు. ఈ కాలపు శిల్ప చిత్రలేఖనాలకు సంబంధించిన అనేక నాట్యభంగిమలు సంగీతవాద్యకారులు చిత్రాలు, భూమ్రలోని శివాలయంలో, అజంతాలోని 17వ విహారంలో కలవు. కాళిదాసు రచనలలో సంగీత నృత్యాల ప్రస్తావన కలదు. ఈ కాలంలో నాటకరంగానికి కూడ ప్రాశస్త్యముండేది. అభిజ్ఞానశాకుంతలం, మాళవికాగ్నిమిత్రం, మృచ్ఛకటికం మొదలగు నాటకాలను ప్రదర్శించేవారు.

**18.6.17 లోహకారకళ :**

గుప్తులపాలనలో లోహాలను కరిగించి పోత పోసే పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందింది. వెండి, బంగారు, రాగి, ఉక్కు, మొదలగు లోహాలనుపయోగించి అనేక వస్తువులు తయారుచేసారు. వెండి, బంగారాలతో నాణాలు, పాత్రలు, గ్లాసులు, ఆభరణాలు చేసేవారు. కంచుతో దేవతాప్రతిమలను తయారుచేసేవారు. నలందాలోని బుద్ధుని తామ్రవిగ్రహం 8.1 అడుగుల ఎత్తు. ఈ విగ్రహాన్ని తాను చూసినట్లు హుయాన్‌త్సాంగ్ వ్రాశాడు. సుల్తాన్ గంజిలోని తామ్రబుద్ధ విగ్రహం ఎత్తు $7^{1/2}$ అడుగులు. ఢిల్లీలో మెహరౌలి దగ్గర వున్న చంద్రుని ఇనుపస్తంభం 23 అడుగుల 8 అంగుళాల ఎత్తు. ఒక అడుగు నాలుగు అంగుళాల వ్యాసం కలిగి 6 టన్నుల బరువుంది. ఇది నాటి నుండి ఎండకు ఎండి, వానకు తడిసి వాతావరణంలోని అన్ని వైపరీత్యాలను తట్టుకొని నేటికికూడ చెక్కుచెదరకుండ వుంది.

**18.6.18 నాణాలు :**

గుప్తచక్రవర్తులు బంగారు, వెండి రాగిలోహాలతో అనేకరకాలైన నాణాలను ముద్రించారు. వీరు ముద్రించిన బంగారునాణాలు నాటి ఔన్నత్యానికి, ఆర్థిక సంపదకు, కళాదృక్పదానికి తార్కాణాలు. మొదట్లో గుప్తరాజులు కుషాణుల నాణాలను అనుకరించినా ఆ తరువాత భారత సాంప్రదాయాన్ని అనుసరించారు. వీరు ముద్రించిన నాణాలలో ఒకవైపు రాజు బొమ్మ, వివిధభంగిమలలో, రెండోవైపు లక్ష్మీగాని, దుర్గగాని, సరస్వతిప్రతిమగాని వుంటుంది. మొదటి చంద్రగుప్తుడు ముద్రించిన బంగారునాణాలపై ఒక వైపు తనబొమ్మతో పాటు కుమారదేవి బొమ్మ, రెండోవైపు దేవి బొమ్మతోపాటు లిచ్ఛవుల పేరు కలదు. సముద్రగుప్తుడు 6 రకాల బంగారు నాణాలను ముద్రించినాడు. వాటిలో ఒకటి అశ్వమేధ వర్గానికి చెందిన నాణాలు. రెండో చంగ్రుప్తుడు 8 రకాల బంగారు నాణాలు ముద్రించాడు. వీటిలో సింహపు బొమ్మగల నాణాలు గుజరాత్ ఆక్రమణకు చిహ్నంగా ముద్రించబడినవి. కుమారగుప్తుడు ముద్రించిన నాణాలపై నెమలి, కార్తికేయుని బొమ్మకనిపిస్తుంది. గుప్తులు ముద్రించిన నాణాలమీద ఆఖ్యలు కూడ ఆకర్షణీయంగానే వున్నాయి. వీటిలో కవిత్వం కూడ చోటు చేసుకుంది. క్రీ.శ 5 వ శతాబ్దం తరువాత గుప్తుల నాణాలు పరిమాణంలోను, ప్రమాణంలోను క్షీణత కనిపిస్తుంది.

గుప్తులు రాజకీయంగా దేశసమైక్యతకు ప్రయత్నించినా ఆ ప్రయత్నం ఫలించలేదు. గుప్తులు బ్రాహ్మణమతాన్ని ఆదరించినా పరమతసహనం పాటించారు. ఈ కాలంలో భక్తి ఉద్యమానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. సారస్వతం ఆదరించబడింది. విజ్ఞానశాస్త్ర పరిశోధనలు జరిగి అనేక క్రొత్త విషయాలు కనుగొన్నారు. దేవాలయ నిర్మాణం పెద్ద ఎత్తున జరిగింది. వాస్తుశిల్ప చిత్రలేఖనాలు, నృత్యసంగీతాలు మూడు పువ్వులు, ఆరుకాయలై విరాజిల్లాయి. సామాజిక, ఆర్థిక పరిస్థితులు సంతృప్తికరంగా లేకున్నా శిల్పకళలు, సాహిత్య, శాస్త్ర రంగాలలో గుప్తయుగంలో అద్భుతమైన ప్రగతి కనిపిస్తుంది. కాబట్టి కళలు, సాహిత్య శాస్త్రరంగాలలో గుప్తులకాలాన్ని నిస్సందేహంగా స్వర్ణయుగమని చెప్పవచ్చు.

## 18.7 సారాంశము

గుప్తుల పరిపాలనను స్వర్ణయుగం అని చైనా యాత్రికుడైన పాహిమాన్ రచనలవల్ల తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వ పరిపాలన, రాష్ట్రపాలన, నగరపాలన, సైనికపాలన, న్యాయపాలన, నాణేలు ముద్రించుట ఇవి ఇప్పటికి ఆదర్శంగా ఉన్నవి. వీరి కాలంలో గణితం, ఖగోళం బాగా అభివృద్ధి చెందినాయి. లలిత కళలు, చిత్రలేఖనం, శిల్పం వినోదాలకు బాగా ప్రాముఖ్యతనిచ్చారు. ఇప్పటికి గుప్తుల పాలన చరిత్రలో ఒక సువర్ణ స్థానం సంపాదించుకొంది.

## 18.8. మాదిరి ప్రశ్నలు

1. గుప్తుల నాటి సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితుల గురించి తెలుపుము?
2. గుప్తుల కాలంలో శాస్త్ర సంస్కృతిక వికాసం గురించి వివరించుము?

**సంక్షిప్త ప్రశ్నలు**

1. గుప్త చక్రవర్తుల పరిపాలనా విధానాన్ని తెలిపే ఆధారాలను గూర్చి వ్రాయుము?
2. గుప్త కాలంలోని మత పరిస్థితుల గూర్చి తెలుపుము?
3. గుప్తుల కాలంలోని న్యాయ వ్యవస్థ గురించి తెలుపుము?
4. గుప్త కాలం నాటి ఉద్యోగ వర్గాల గూర్చి తెలుపుము?
5. విషయానికి అధిపతి ఎవరు? అతనికి ఎవరు సహాయపడేవారు?

డా॥ వి.కె. మోహన్

పాఠం - 19

# దక్షిణాదిలో శాతవాహనులనంతరం రాజవంశాలు

## 19.0 లక్ష్యం:

శాతవాహన సామ్రాజ్యం అంతరించిన తర్వాత చాళుక్య రాజ్యమేర్పడే వరకు దక్షిణ భారత దేశంలో సంభవించిన రాజకీయ పరిణామాలను తెలిసికోవటం, స్థానిక రాజవంశాలు తమ అధికార విస్తరణతో సామ్రాజ్య వ్యవస్థను నెలకొల్పటానికి చేసిన ప్రయత్నాలు, పోరాటాలు ఫలితాలు వివరించడం ఈ పాఠం లక్ష్యం

**విషయ క్రమం**


19.1. ఉపోద్ఘాతము

19.2. ఇక్ష్వాకులు

19.3 ఆనంద గోత్రులు

19.4 బృహత్పలాయనులు

19.5 శాలంకాయనులు

19.6 విష్ణు కుండినులు

19.7 ప్రాచీన పల్లవులు

19.8 సారాంశం

19.9 మాదిరి ప్రశ్నలు


## 19.1. ఉపోద్ఘాతము :

శాతవాహన సామ్రాజ్య పతనానంతరం చాళుక్య రాజ్య స్థాపన వరకు దక్కనులో, దక్షణ దేశములో రాజకీయ ఐక్యత కొరవడింది. శాతవాహనుల అనంతరం వారి సామంతులు స్వాతంత్ర్యం ప్రకటించుకొని వేరు వేరు ప్రాంతాలలో వేరు వేరు రాజ్యాలను స్థాపించుకున్నారు. అవి ఏమన : 1. ఇక్ష్వాకులు, 2. ఆనందగోత్రులు, 3. బృహత్పలాయనులు, 4. శాలంకాయనులు, 5. విష్ణు కుండినులు, 6. ప్రాచీన పల్లవులు 7. కదంబులు మొదలగువారు.

## 19.2. ఇక్ష్వాకులు

శాతవాహన సామ్రాజ్య పతనానంతరం క్రీ.శ. 3వ శతాబ్దంలో ఆంధ్ర దేశంలో కృష్ణానది తీరాన ఇక్ష్వాకులు విజయపురిని రాజధానిగా చేసుకొని స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించారు. వీరిని శ్రీపర్వతీయులని, ఆంధ్ర బృత్యులని కూడా పిలిచారు. వీరు ఒక శతాబ్దం పాటు ఆంధ్ర, పరిసర ప్రాంతాలను పాలించారు.

**19.2.1. ఆధారాలు :**

వీరి చరిత్రను తెలుపు ముఖ్య ఆధారాలేమన 1. రెంటాల, కేశనపల్లి వద్దనున్న శాంతముల శాసనాలు. 2. నాగార్జున కొండ వద్దనున్న శాంతిశ్రీ; కొడబవి శ్రీ మొ॥ వారి శాసనాలు 3. వీరపురుష దత్తుని నాగార్జునకొండ శాసనం. 4. ఎహువల శాంతమూలుని శాసనం 5. వీర పురుష దత్తుని కాలం నాటి జగ్గయ్యపేట శాసనం.

**19.2.2. వాసిష్టి పుత్ర శాంతిమూలుడు**

ఇక్ష్వాకు వంశానికి మూల పురుషుడు శాంతిమూలుడు. ఇతడు క్రీ.శ. 225 చివరి శాతవాహన చక్రవర్తి 3వ పులి మానవుని అధికారాన్ని అంతం చేసి విజయపురిలో స్వతంత్ర ఇక్ష్వాకు రాజ్యాన్ని స్థాపించాడు. తదుపరి గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కడప, కర్నూలు, నల్లగొండ ప్రాంతాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. ఉజ్జయినీ శక్తులతోను బనవాస చూటు నాగులతోను వివాహ సంబంధాలు ఏర్పరచుకొని సామ్రాజ్యాన్ని సుస్థిరం చేశాడు. ఇతడు శైవుడు. మహ సేనుని భక్తుడు. ఇతడు అశ్వమేధయాగాలు, హిరణ్య దానాలు సహస్రకోటి గోదానాలు చేసినట్లు శాసనాలలో పేర్కొన్నాడు. ఇతడు 20 సం॥లు పాలించాడు. ఇతని కాలంలో ఇతని చెల్లెలు శాంతిసిరి నాగార్జున కొండలోని మహచైత్యం నిర్మించింది. ఇతడు ఆంధ్రదేశంలో హైందవ మతాన్ని పునరుద్ధరించిన మొదటిరాజు.

**19.2.3 వీరపురుషదత్తుడు :**

శాంతి మూలుని తరువాత అతని కుమారుడు వీర పురుష దత్తుడు రాజ్యానికి వచ్చి 20 సం॥రాలు ఏలాడు. ఇతని కాలంలో ఇక్ష్వాకు సామ్రాజ్యం అత్యున్నత దశనందుకున్నది. ఇతడు కొత్త రాజ్యాలను జయించలేదు. కాని ఇతని కాలంలో నాగార్జున కొండ గొప్ప విద్యా కేంద్రంగా విలసిల్లింది. ఇతని కుమార్తె వేదిశ్రీని బనవాసను ఏలుచున్న చూటునాగుకి ఇచ్చి పెళ్ళిచేసాడు.

**19.2.4. ఎహువుల శాంతిమూలుడు :**

ఇతడు వీరపురుష దత్తుని తరువాత రాజ్యానికి వచ్చి 25 సం॥లు పాలించాడు. ఇతడు అభీరులతోను, కాలచూరులతోను స్నేహం చేసాడు. పల్లవరాజు అయిన మహారాజు సింహవర్మను ఉజ్జయిని, వనవాస రాజుల సహాయంతో ఓడించి రాజ్యాన్ని కాపాడాడు. దక్షిణ దేశంలో హిందూ దేవాలయాన్ని కట్టించిన మొట్టమొదటి రాజు ఇతడే. ఇతడు నాగార్జున కొండలో పుష్ప చంద్రస్వామి అను శివాలయాన్ని నిర్మించి ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించాడు. ఇతని సేనాని కార్తికేయుని దేవాలయాన్ని కట్టించాడు. ఇంకా విష్ణుమూర్తికి, నవగ్రహాలకు కూడా ఆలయాలు ఇతని కాలంలోనే నిర్మింపబడినవి. అంతేగాక ఇతడు బౌద్ధమతాన్ని కూడా ఆదరించాడు.

**19.2.5. రుద్ర పురుష దత్తుడు :**

ఎహువులుని తరువాత అతని కుమారుడు రుద్ర పురుష దత్తుడు రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో వారి సామంతులు అగు పల్లవులు, ఆనందులు, బృహత్పలాయనులు విజృంభించారు. చివరలో పల్లవరాజు అయిన వీరకూర్చి వర్మ ఇక్ష్వాకు రాజ్యంపై దండెత్తి విజయపురిని ఆక్రమించాడు. అంతటితో ఇక్ష్వాకు రాజ్యం అంతరించింది.

**19.2.7. సామ్రాజ్య పరిస్థితులు :**

ఇక్ష్వాకులు శాతవాహనుల పరిపాలనా విధానాన్ని అనుసరించారు. రాజు ప్రజారంజకుడు, ధర్మబుద్ధుడు. రాజుకు సలహాలిచ్చుటకు
13 మంత్రి మండలి కలదు. రాజ్యాన్ని రాష్ట్రాలుగా, భుక్తులుగా, విభజించారు. గూఢాచారి వ్యవస్థ కలదు. సంఘంలో కుల వ్యవస్థ ఉన్నది. వీరి కాలంలో దేశం సిరిసంపదలతో తులతూగింది. రోమ్ మొదలగు విదేశాలతో వర్తక వ్యాపారం జరిగింది.

**19.2.8. మతము - శిల్ప కళ :**

ఇక్ష్వాకులు పాలించిన 100 సం॥ల కాలంలో దక్షిణ దేశంలో వైదికమతం, మహాయాన బౌద్ధ మతం తమ రూపురేఖలు దిద్దుకున్నవి. నాగార్జున కొండలో థేరవాద మహా సాంఘిక శాఖలు అనేకం ఉన్నట్లు శాసనాలవలన తెలుస్తున్నది. మహా చైత్యం పునర్నిమించబడింది. వేదిశ్రీ, శాంతిశ్రీలు అనేక బౌద్ధ స్థూపాలు నిర్మించారు. జగ్గయ్యపేట, భట్టిప్రోలు, చినగంజాం, రామిరెడ్డి పల్లిలలో ఎన్నో స్థూపాలు నిర్మింపబడి బౌద్ధ కేంద్రాలయినవి. అదే కాలంలో వైదిక మతం అభివృద్ధి చెందినది. స్థూపాలతోపాటు హిందూ దేవాలయాలు నిర్మింపబడినవి. హారతి, మహాసేన, అష్టభుజనారాయణ, కార్తికేయ దేవాలయాలు కట్టించారు. శిల్పాలతో పాటు చిత్రకళ కూడా అభివృద్ధి చెందింది. ఈ విధంగా శ్రీ పర్వతం బౌద్ధ, వైష్ణవ, శైవ మతాలకు కూడలి అయింది. ఈ విధంగా ఇక్ష్వాకు వంశం దక్షిణ దేశపు సాంస్కృతిక వికాసంలో ఒక మైలు రాయిగా నిలిచింది.

## 19.3 ఆనంద గోత్ర రాజులు

ఇక్ష్వాకుల అనంతరం గుంటూరు జిల్లాను స్వాధీనం చేసుకుని స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన వారు ఆనంద గోత్రులు. వీరి వంశానికి ఆనందరుషి మూలపురుషుడని చెప్పారు. వీరి రాజధాని కంధరాపురము. ఇది నేటి చేజెర్ల. గోరంట్ల, మట్టిపాడు శాసనాలు, చేజర్లలో శిలా శాసనాలు వీరి చరిత్రను తెలియజేయుచున్నవి. ఈ వంశానికి మూల పురుషుడు కందరరాజు. అతడే రాజ్య స్థాపకుడు, దామోదర వర్మ, అత్తివర్మ, రెండవ కందరాజు ఈ వంశంలోని మిగిలిన ప్రభువులు. ఇక్ష్వాకుల పతనానంతరం చూటనాగులను అంతం చేసి బసవాసలో స్వతంత్ర రాజ్య స్థాపన చేసిన ప్రాచీన పల్లవులు వీరిపై దండెత్తి ఓడించి తమ సామంతులుగా చేసుకున్నారు. రెండవ కందరరాజు పల్లవ సామంతునిగా ఉన్నట్లు ఒక శాసనం వలన తెలియుచున్నది. రెండవ పులకేశి దండయాత్ర వరకు (క్రీ.శ. 623 వరకు) ఆనందులు పల్లవ సామంతులుగా ఈ ప్రాంతాన్ని పాలించారు. వీరు బౌద్ధ మతాన్ని ఆదరించారు.

## 19.4. బృహత్పలాయనులు :

ఇక్ష్వాకుల పతనానంతరం గుంటూరు మండలాన్ని ఆనందులు ఆక్రమించగా మైసోలియా/మసులా ప్రాంతాన్ని అనగా కృష్ణ మండల ప్రాంతాన్ని బృహత్పలాయనులు ఆక్రమించారు. ఈ వంశ చరిత్రకు **జయవర్మ** మహారాజు వేయించిన కొండముది తామ్ర శాసనం ఒక్కటే ఆధారం. ఈ శాసనాన్ని బట్టి అతడు కృష్ణా జిల్లాలోని గూడూరు (ఆహారం) ప్రాంతాన్ని పాలించినట్లు తెలుస్తున్నది. ఇతని రాజధాని కోడూరు. ఇతడు శివ భక్తుడు మహేశ్వరుని ఆరాధించేవాడు. ఇతడు పల్లవ శివస్కంధవర్మ మరణించిన తరువాత కృష్ణా మండలంలో స్వతంత్రుడైనట్లు కనిపిస్తున్నది. ఇతడు క్రీ.శ. 4వ శతాబ్దం మొదటి పాదంలో పాలించి ఉండవచ్చు అని చరిత్రకారుల అంచనా. ఇతని తరువాత బృహత్పలాయనుల చరిత్ర మనకు తెలియదు.

## 19.5. శాలంకాయనులు (క్రీ.శ. 300-450) :

శాతవాహనుల పతనం తరువాత ఇక్ష్వాకుల చివరి కాలంలో వేంగిలో స్వతంత్ర రాజ్యం స్థాపించినవారు శాలంకాయనులు వీరు శాలంకాయన గోత్రవంశస్తులైన బ్రాహ్మణ కులస్తులు. వీరి రాజధాని ఏలూరు జిల్లాలో వేంగి వీరు చిత్తరథస్వామి (సూర్యుని) భక్తులు. వీరి శాసనాలు "8" వరకు లభించినవి. ఈ శాసనాలవల్ల 5, 6 తరాల శాలంకాయన రాజులు క్రీ.శ. 300 నుండి 450 వరకు రాజ్యం చేసినట్లు తెలియుచున్నది. ఈ వంశాన్ని స్థాపించినవాడు విజయదేవవర్మ. ఈ వంశంలో గొప్పవాడు నంది వర్మ ఇతడు బృహత్పలాయనులను ఓడించి కృష్ణా మండలాన్ని ఆనంద గోత్రికులను ఓడించి గుంటూరు మండలాన్ని ఆక్రమించి 4వ శతాబ్దంలో శాలంకాయన రాజ్యాన్ని విస్తరించాడు. అతడు ధర్మ ప్రథముడని పేరుపొందాడు. ఇతని కుమారుడు హస్తివర్మ శాలంకాయనులలో అగ్రగణ్యుడు.

### 19.5.1. హస్తివర్మ

హస్తి వర్మ సముద్ర గుప్తుని సమకాలికుడు. అతడు దక్షిణదేశంపై దండెత్తినపుడు హస్తివర్మ వేంగిని పాలిస్తున్నట్లు అతనినతడు ఓడించినట్లు సముద్ర గుప్తుని అలహాబాద్ శాసనం వలన తెలుస్తుంది. శాలంకాయనుల వేంగి నుండి కళింగవరకు తమ సామ్రాజ్యం విస్తరించుకొని పాలించారు. అమరావతి కూడా వారి రాజ్యంలో చేరివున్నది. వీరు సూర్య భక్తులైనను శైవ వైష్ణవ మతాలను ఆదరించారు. పరమ భట్టారక, పరమ మహేశ్వర బిరుదులు ధరించారు. హస్తివర్మ అనంతరం వీరిరాజ్యం క్షీణించినది. క్రీ.శ. 450 ప్రాంతంలో వారిని పదభ్రష్టులనుగావించి విష్ణుకుండినులు వేంగిదేశ ప్రాంతాన్ని మాతరులు కళింగను స్వాధీనం చేసుకున్నారు. ఈ కాలంలో ప్రాకృత భాష మరుగునపడి సంస్కృతం రాజభాష అయింది. వీరి కాలంలో వేంగి గొప్ప విద్యా కేంద్రంగా విలసిల్లినది.

## 19.6 విష్ణుకుండినులు

శాతవాహన-చాళుక్య యుగాల మధ్యకాలంలో (క్రీ.శ.225-615) ఆంధ్రదేశాన్ని పాలించిన రాజవంశాలలో సుప్రసిద్ధులు విష్ణుకుండినులు. వీరు సుమారొక శతాబ్దంపాటు కృష్ణా-నర్మదా నదుల మధ్య గల దక్షిణాపథాన్నంతటిని తమ ఆధీనంలోకి తెచ్చుకుని రాజకీయ, సాంస్కృతిక సమైక్యతను చేకూర్చారు. ఈ వంశంలో మొత్తం 9 మంది రాజులున్నారు.

### 19.6.1 ఆధారాలు :

విష్ణుకుండినుల చరిత్రకు అమూల్యమైన ఆధారాలు వారు వేయించిన శాసనాలే. వీరివి ఇంతవరకు తొమ్మిది తామ్ర శాసనాలు, ఒక శిలాశాసనం దొరికాయి. అవి-ఎ) గోవిందవర్మ తుమ్మలగూడెం శాసనం బి) మాధవవర్మ ఈపూరు సి) ఖానాపూడి డి) పొలమూరు శాసనాలు ఇ) వేల్పూరు శిలాశాసనం ఎఫ్) రెండోమాధవవర్మ ఈపూరు శాసనం జి) ఇంద్రవర్మ రామతీర్థ శాసనం, హెచ్) విక్రమేంద్రభట్టారకవర్మ తుండి ఐ) చిక్కుళ్ళ జె) తుమ్మలగూడెం లేక ఇంద్రపాల నగర శాసనాలు. ఈ శాసనాలన్నీ సంస్కృతంలో ఉన్నాయి.

### 19.6.2 రాజకీయచరిత్ర : ఇంద్రవర్మ, మాధవవర్మలు ;

శ్రీపర్వత - వినుకొండ ప్రాంతంలో పల్లవుల అధికారాన్ని తుదముట్టించి స్వతంత్ర విష్ణుకుండిన రాజ్యం స్థాపించిన వారు ఇంద్రవర్మ, మాధవవర్మలని భావించవలసి వస్తుంది. ఈ భావనకు ఆధారం మొదటితుమ్మలగూడెం శాసనమే. మాధవవర్మకే 'విక్రమహేంద్ర' అనే బిరుదు ఉన్నట్లు పొలమూరు శాసనం ద్వారా తెలుస్తున్నది. గుంటూరు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఆనంధులు విజృంభించినందువల్ల, విష్ణుకుండినులు తమ దృష్టిని ఉత్తర తెలంగాణా వైపు కేంద్రీకరించి రాజ్యవిస్తరణకు పూనుకున్నారు. నాడు తెలంగాణాలో అధికభాగం వాకాటకుల ఏలుబడిలో ఉండేది. ప్రవరసేనుని (క్రీ.శ. 275-335) అనంతరం వాకాటక సామ్రాజ్యం రెండుగా చీలిపోయి పరస్పర కలహాలతో బలహీనం కాగా విష్ణుకుండినులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తెలంగాణా ప్రాంతాలను ఆక్రమించుకోగలిగారు.

### 19.6.3 గోవిందవర్మ (క్రీ.శ. 425 - 465) :

సుప్రసిద్ధులైన విష్ణుకుండిన రాజులలో ప్రథముడు గోవిందవర్మ. ఇతడు గొప్ప యుద్ధవీరుడే గాక మంచి రాజనీతిజ్ఞుడు కూడా. తనను గురించి "స్వనయభుజ బలోత్సాహ ప్రభానురాగావాప్త స్వరాజ్యేన" అని వర్ణించుకున్నాడు. తీరాంధ్రలో గణపాశపురం రాకుమార్తెను (మూలరాజుకుమార్తెను) వివాహమాడి వారి సాయంతో శాలంకాయనులను అంతం చేసి వేంగి నాక్రమించాడు. పల్లవులను సైతం తరిమివేసి దక్షిణంగా గండ్లకమ్మ వరకు విష్ణుకుండిన రాజ్యాన్ని విస్తరింపజేశాడు.

గోవిందవర్మ బౌద్ధమతాభిమానే కాకుండా వైష్ణవ భక్తుడు కూడా. అతని పట్టమహిషి, అయిన పరమ (భట్టారికా) మహాదేవి బౌద్ధమతాభిమాని. ఆమె రాజధాని నగరమైన శక్రపురం (వేల్పూరు)లో ఒక బౌద్ధ విహారం నిర్మిం జేయగా, దాని నిర్వహణ నిమిత్తం గోవిందవర్మ పెర్కొపర అనే గ్రామాన్ని దానం చేశాడు.

### 19.6.4 రెండోమాధవవర్మ (క్రీ.శ.465-515) :

గోవిందవర్మ తర్వాత సింహాసనాన్ని అధిరోహించిన, ఆయన పుత్రుడు రెండోమాధవవర్మ విష్ణుకుండిన రాజ్యాన్ని పాలించిన వారిలో ప్రముఖరాజుగా పేరొందాడు. ఇతనికే 'జనాశ్రయుడనే' బిరుదు ఉంది.

ఇతడు దిగ్విజయ యాత్రలు చేసి విష్ణుకుండిన రాజ్యాన్ని విస్తరింప జేశాడు.ఇతడు -

ఎ) వాకాటక రాజైన పృథ్వీసేనుని ఓడించి, అతని కుమార్తెను వివాహమాడి, విష్ణుకుండిన రాజ్యాన్ని నర్మదానది వరకు విస్తరింపజేశాడు. ప్రాచీన రాజవంశమైన వాకాటకులతో వైవాహిక సంబంధం నెరపడంతో విష్ణుకుండిసుల గౌరవప్రతిష్ఠలు ఇనుమడించాయి.

బి) గుణపాశపురం పాలకుడైన ప్రభాకరుని సాయంతో రెండో మాధవవర్మ కళింగను సైతం ఆక్రమించాడు. ఈ దండయాత్ర తర్వాత తన రాజధానిని వేంగి సమీపంలోని దెందులూరు పురానికి మార్చాడు. వేల్పూరు విష్ణుకుండినుల వంశశాఖకు కేంద్రమైంది.

సి) రెండో మాధవవర్మ ఉత్తర దిగ్విజయయాత్రలో నిమగ్నుడై ఉండగా పల్లవ రెండో సింహవర్మ కృష్ణానది వరకు ఆక్రమించాడు. అందుచేత రెండో మాధవవర్మ తన 33వ రాజ్య సంవత్సరంలో పల్లవులపై దండెత్తి యుద్ధంలో పల్లవుల నోడించి తిరిగి గుండ్లకమ్మ వరకు తన అధికారాన్ని గుర్తించేటట్లు చేశాడు. చిరకాలంగా కొనసాగుతున్న పల్లవ-విష్ణుకుండిన సంఘర్షణ నరికట్టే ఉద్దేశ్యంతో వేల్పూరు (అమరపురి) రాజధానిగా తన పెద్ద కుమారుడు దేవవర్మను రాజప్రతినిధిగా నియమించాడు.

రెండో మాధవవర్మ సువర్ణ, పౌండరీక, వాజపేయ, యుధ్య,షోడశి, రాజసూయ,ప్రధిరాజ్య,ప్రాజపత్య క్రతువులే కాక, 11 అశ్వమేధయాగాలు, వేలాది క్రతువులు,(అగ్నిష్టోమాలు) చేసి, క్రతు సహస్రయాజి అనే బిరుదు ధరించి తాను పరమేష్టి (బ్రహ్మ) సమానుడని చెప్పుకున్నాడు. అతడు నరమేధం కూడా చేశాడని చెబుతారు. రెండో మాధవవర్మ పరిపాలనా దురంధరడు గొప్ప పండితుడు 'జనాశ్రయ ఛందోవిచ్ఛిత్తి' అనే ఛందో గ్రంధాన్ని అతడు రచించినట్లు తెలుస్తున్నది.

### 19.6.5. విక్రమేంద్రభట్టారకుడు (క్రీ.శ.515-525) :

రెండో మాధవవర్మ తర్వాత వాకాటక మహాదేవి వలన కలిగిన అతని కుమారుడు విక్రమేంద్రవర్మ సింహాసన మధిష్టించాడు. విక్రమేంద్రవర్మ 10 సంవత్సరాలు మాత్రమే పాలించాడు. **ఇతణ్ణి విష్ణుకుండి** వాకాటక వంశ ద్వయాలంకారజన్మ(విష్ణుకుండి, వాకాటక వంశాలు రెండిటికీ అలంకార ప్రాయంగా జన్మించిన వాడు), పరమ సౌగతుడు (బౌద్ధుడు), మహాకవి అని ఇతని కుమారులు, మనుమలు వేయించిన శాసనాలు వర్ణిస్తున్నాయి. ఇతని మంచితనాన్ని బలహీనతగా తీసుకొని వేల్పూరులో దేవవర్మ కుమారుడు మాధవవర్మ స్వతంత్రం ప్రకటించుకున్నాడు. మాధవవర్మ ఆనందులను తుదముట్టించి 'త్రికూట మలయాధిప' బిరుదు ధరించాడు.

### 19.6.6 ఇంద్రవర్మ (క్రీ.శ. 525-555) :

విక్రమేంద్రవర్మ భట్టారకుని అనంతరం అతని కుమారుడైన ఇంద్రవర్మ రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో విష్ణుకుండిన రాజ్యం పై శత్రువుల, దాడి ఎక్కువైంది. ఇతని దాయాదులు సైతం ఇతణ్ణి ఎదిరించినట్లు తెలుస్తున్నది. ఆ దాడులు-

ఎ) ఇంద్రవర్మ దాయాది అయిన వేల్పూరు మాధవవర్మ విష్ణుకుండిన సింహాసనాన్ని ఆశించి చాళుక్య మొదటి పులకేశి సాయంతో ఇంద్రవర్మను ప్రతిఘటించగా, అపుడు ఇంద్రవర్మ మాధవవర్మను యుద్ధంలో నిర్జించి వేల్పూరు రాజ్యాన్ని' చక్రవర్తి క్షేత్రంలో' కలుపుకున్నట్లు తెలుస్తున్నది.

బి) మాధవవర్మ, పులకేశిలతో - ఇంద్రవర్మ యుద్ధంలో నిమగ్నుడై ఉండగా కళింగ సామంతులంతా ఒక కూటమిగా ఏర్పడి ఇంద్రవర్మను ప్రతిఘటించినట్లు ప్రధ్వీమూలుని గోదావరి శాసనం చెబుతోంది. అప్పుడు ఇంద్రవర్మ వారిని యుద్ధంలో ఓడించినట్లు అతని శాసనం వలన తెలుస్తున్నది.

**19.6.7 రెండో విక్రమేంద్రభట్టారకుడు (క్రీ.శ.5225-555) :**

విష్ణుకుండినులలో చివరివాడు రెండో విక్రమేంద్రుడు. ఇతడు తన తండ్రి మరణానంతరం చిన్న వయస్సులోనే సింహాసనం ఎక్కినట్లు తెలుస్తున్నది. ఇతని కాలం నుంచి రాజ్యం శత్రుపరివేష్టితమైంది. పల్లవ సింహవర్మ విష్ణుకుండిన రాజ్యంపై దండెత్తగా, రెండో విక్రమేంద్రుడు అతణ్ణి ఓడించి తరిమి వేసినట్లు తెలుస్తున్నది. యుద్ధంలో విజయం సాధించిన విక్రమేంద్రుడు వేల్పూరులోని పరమభట్టారికా మహాదేవి బౌద్ధ విహారానికి దానధర్మాలు చేశాడు. రెండో విక్రమేంద్రుడు పల్లవులతో పోరాడుతున్న సమయంలోనే పిష్టపురంలో రణదుర్జయ పృధ్వీమల్లుడనే సామంతుడు స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. యుద్ధం నుంచి తిరిగి వచ్చిన వెంటనే రెండో విక్రమేంద్రుడు పృధ్వీమల్లుని అణచివేయడానికి అతనిపై దండెత్తాడు. కాని యుద్ధంలో ఓడిపోయి చనిపోయాడు. దీనితో విష్ణుకుండిన రాజ్యం అదృశ్యమైంది.

**19.6.8 పాలనా వ్యవస్థ:**

శాతవాహనుల పాలనా విధానమే ఈ యుగంలో కొద్ది మార్పులతో కొనసాగింది. రాజు సర్వాధికారి అయినప్పటికీ ధర్మబద్ధుడు, ప్రజారంజకుడు. పాలనలో రాజుకు సలహాఇచ్చి సహాయపడడానికి మంత్రి పరిషత్ ఉండేది. రాజులలో బలవంతులైన వారు అశ్వమేధ, రాజసూయ యాగాలు చేసేవారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాజ్యం విషయాలు లేక రాష్ట్రాలుగా, భుక్తులుగా, గ్రామాలుగా విభజించబడ్డాయి. అధికార పురుషులు, మహత్తరులు అనేవారు విషయాధిపతులు భూమి శిస్తుతో పాటు అనేక ఇతర పన్నుల ద్వారా కూడా ప్రభుత్వం ఆదాయం సమకూర్చుకునేది. వృత్తిపన్నులు విధించేవారు. సైన్యంలో గజబలానికి ప్రాముఖ్యం ఇచ్చేవారు.

**19.6.9 సాంఘిక పరిస్థితులు :**

సంఘంలో వర్ణవ్యవస్థ ఇంకా ఘనీభవించలేదు. వేదకాలం నాడు ప్రారంభమైన ఆటవిక, వైదేశిక జాతుల సంస్కృతీకరణ ఈ యుగంలో కూడా కొనసాగింది. సంఘంలో బ్రాహ్మణులకు అత్యంత గౌరవస్థానం ఉంది. ఆనాటి అగ్రహారాలు విజ్ఞాన కేంద్రాలుగా ఉండి దేశమంతటా విజ్ఞాన వీచికలు వెదజల్లాయి. బ్రహ్మదేయాలు, అగ్రహారాలు రాజ్యమంతటా విస్తరించాయి.

స్త్రీలు సమాజంలో ప్రముఖపాత్ర వహించారు. గోవిందవర్మ పట్టపురాణి అయిన పరమభట్టారికా మహాదేవి శక్రపురంలో బౌద్ధభిక్షువుల కోసం విశాలమైన విహారాన్ని కట్టించి, ధూప దీప నైవేద్యాలకయ్యే ఖర్చు నిమిత్తం పెణ్కపర అనే గ్రామాన్ని తన భర్తతో దానం చేయించింది.

స్త్రీ పురుషులిరువురు ఆభరణాలు ధరించేవారు. కీసరగుట్ట, ఏలేశ్వరంలలో జరిపిన తవ్వకాలలో వివిధ పరిమాణాల్లో లభ్యమైన టెర్రకోట కర్ణాభరణాలే అందుకు నిదర్శనం. విలువైన రాళ్ళతో తయారు చేసిన పూసలు కూడా ఇక్కడి తవ్వకాల్లో లభ్యమయ్యాయి. ఆనాటి స్త్రీల కేశసౌందర్యం, తలకట్టు పద్ధతులు కీసరగుట్ట తవ్వకాల్లో లభ్యమైన చిన్న శిలా విగ్రహం సూచిస్తుంది.

**19.6.10 ఆర్థిక పరిస్థితులు:**

బ్రహ్మదేయం, దేవభోగం పేర్లతో బ్రాహ్మణులకు అగ్రహారాలు, దేవాలయాలకు భూములు నాటి రాజులు విరివిగా ఇచ్చేవారు. ఆ విధంగా వ్యవసాయానికి అనువైన భూమి బ్రాహ్మణులకు, దేవాలయాలకు దఖలు పడసాగింది. అంతవరకు వేర్వేరు వృత్తులు చేసే వారందరూ ఈ బ్రాహ్మణాగ్రహారాలలో వ్యవసాయదారులుగా స్థిరపడి, తమ దృష్టిని భూమిపై కేంద్రీకరించారు. వీరే శూద్రులు లేదా నాలుగో వర్ణం వారు. ఆ భూ గ్రామదానాలు అష్టాదశ పరిహారయుక్తంగా జరిగేవి. అంటే ఈ దానాలలో 18 తరహాల పన్నులు, మామూళ్ళు మొదలైనవి మినహాయించేవారు. భూమిని కౌలుకు తీసుకున్న వ్యక్తి అగ్రహారకునికి సగం పంట ఇవ్వాలని ఉంది.

రాజ్యంలోని పంటపొలం యావత్తూ రాజుది కాదు. 'రాజక్షేత్రం' మాత్రమే రాజుది. మిగిలింది అంతా సమిష్టిగా గ్రామాలకుగాని లేదా వ్యక్తులకు గాని చెంది ఉండేది. రాజక్షేత్రం వెలుపల భూమిని దానంచేయవలసినప్పుడు రాజు ఆ భూమిని కొనుగోలు చేసి దానం చేసేవాడు.

వాణిజ్యం : ఇక్ష్వాకు యుగాంతం నుంచి రోమన్ సామ్రాజ్యం క్షీణించడంతో రోమ్‌తో దక్షిణదేశ వాణిజ్యం కూడా క్షీణించింది. దేశంలో బలమైన కేంద్రాధికారం లేక చిన్నచిన్న రాజ్యాలేర్పడి తరచూ యుద్ధాలు జరుగుతూ ఉండడం వల్ల వర్తక శ్రేణులకు, చేతివృత్తుల

వారికి తగిన ప్రోత్సాహం లభించలేదు. ఈ విధంగా క్షీణించిన వ్యాపారకేంద్రాల నుండి, వ్యవసాయం బాగా సాగుతున్న ప్రాంతాలకు ప్రజలు వలసపోసాగారు. ఈ నూతన గ్రామీణ జీవితంలో స్థానికావసరాలకు అత్యవసరమైన చేతివృత్తులు మాత్రమే కొనసాగాయి. వీరు ముద్రించిన రాగి నాణాలపైన ఒక వైపు సింహం,శంఖం, వృషభలాంఛనాలు, మరొక వైపున దీపపు స్తంభం, కుంభం మొదలైన చిహ్నాలుంటాయి. వీరు రాగిలోనూ, రాగిపూతపూసిన ఇనుపలోహంలోను నాణాలను ముద్రించారు. దీని వల్ల నాటిదేశ ఆర్థిక దుస్థితి స్పష్టమవుతున్నది. వాణిజ్యం క్షీణించడంతో ప్రాచీన వర్తక మార్గాలు పాడుపడ్డాయి. శాతవాహనుల కాలం నాటి కోటలు జీర్ణించి, శిధిలం కాసాగాయి. దీంతో నగరజీవనం అంతరించి, గ్రామీణ జీవన విధానం ప్రాముఖ్యత సంతరించుకున్నదని చెప్పొచ్చు.

**మత పరిస్థితులు** : విష్ణుకుండినులు వైదికమతాభిమానులు. వైదిక మతోద్ధరణే రాజధర్మమని వీరు భావించారు. విక్రమేంద్ర, గోవింద, మాధవ, ఇంద్రభట్టారక మొదలైన పేర్లు వారు వైదిక మతాభిమానులని చెప్పకనే చెబుతున్నాయి. వీరిలో చాలా మందికి 'పరమమహేశ్వర', పరమభాగవత మొదలైన బిరుదులున్నాయి. మరోవైపు వారు బౌద్ధ సంస్థలకు దానధర్మాలు విరివిగా చేశారు.

మాధవవర్మ అశ్వమేధ వాజపేయం, సర్వమేధం, పురుషమేధం, పౌండరీకం మొదలైన అనేక క్రతువులు చేసినప్పటికీ కర్మ, భక్తిమార్గాలు పురోగమించడమేగాక, భాగవత ధోరణితో కూడిన వైదికమతం హిందూమతంగా మారింది. విష్ణువు అవతారాలలో ముఖ్యంగా నరసింహ, త్రివిక్రమ, రామ, కృష్ణ అవతారాలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. శ్రీ పర్వతస్వామి విష్ణుమూర్తి నవమ అవతారమని భావించడం జరిగింది.

విష్ణుకుండినులు అనేక శైవ, వైష్ణవాలయాలను కట్టించారు. వీటిలో ప్రముఖమైనది ఉండవల్లిలోని అనంత పద్మనాభుని గుహాలయం, వేల్పూరు బౌద్ధులకు, హిందువులకు కూడా గొప్ప పుణ్యక్షేత్రమైంది. ఇక్కడ భూత గ్రహకస్వామి (యముడు)కి కూడా ఆలయం ఉండేది. మాధవవర్మ ఇక్కడనే గణపతి ప్రతిష్ఠ చేశాడు. ఏలేశ్వరం వద్ద ఏలేశ్వరస్వామి ఆలయం సమీపంలో 'దేవకుల' అనే మొక్కుబడి మందిరాలు వెలుగు చూశాయి. ఈ మందిరాలలో చిన్నచిన్న బాణలింగాలు ప్రతిష్ఠింపబడ్డాయి.

బ్రాహ్మణ మతోద్ధరణ ఫలితంగా బౌద్ధం క్షీణించింది గాని అంతర్ధానం కాలేదు. మహాయాన బౌద్ధం ప్రాబల్యం వల్ల బుద్ధుని విగ్రహాలు నెలకొల్పి ఆరాధించడం ప్రారంభించారు.

### 19.6.12 భాషా సారస్వతాలు :

విష్ణుకుండినులు సంస్కృత భాషకు పట్టం కట్టారు. నాటి రాజులు విద్యాభిమానులు, స్వయంగా విద్వాంసులు, మహాకవులు వ్యాకరణ చందోశాస్త్రకోవిదులు ఉన్నారు. వీరిలో విక్రమేంద్రభట్టారకుడు మహాకవి. అయితే దురదృష్టవశాత్తు ఇతడు రచించిన కావ్యాలేమీ లభించలేదు. మాధవవర్మ "జనాశ్రయఛందో విచ్ఛిత్తి" అనే సంస్కృత గ్రంధం రచించాడు. బ్రహ్మదేయాలు లేక అగ్రహారాలు సాంప్రదాయ సంస్కృతీ కేంద్రాలుగా, వైదిక విద్యాకేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. బ్రాహ్మణులు ఉపనిషత్తులు, వేదాంగాలు, ధర్మశాస్త్రాలు, ఆగమాలు, పురాణాలు, ఇతిహాసాలు, దర్శనాలు ముఖ్యంగా న్యాయ, యోగ దర్శనాలలో ప్రావీణ్యం పొంది, బోధించేవారు. అగ్రహారాలకు ఉపాంగాలుగా ఘటికలుండేవి. ఘటికలంటే సంస్కృత విద్యాకేంద్రాలు. వీటిలో 14 విద్యలను బోధించేవారు. అధ్యయనం అంటే శ్రవణం (వినడం),మననం (పునశ్చరణ) ధారణ (జ్ఞాపకం). శాస్త్రాలు లిఖిత రూపంలో ఉండేవి కాదు.

### 19.6.13 వాస్తుశిల్ప కళలు :

విష్ణుకుండినులు అనేక దేవాలయాలను నిర్మించారు. వీరు నిర్మించిన గుహాలయాలు ఉండవల్లి, విజయవాడ (మొగల్రాజపురం, ఇంద్రకీలాద్రి) లలో ఉన్నాయి. అయితే ఈ గుహలు తొలుత బౌద్ధులవని తర్వాత కాలంలో హిందూ దేవాలయాలుగా మార్చారని చరిత్రకారుల అభిప్రాయం.

ఏలేశ్వరంలో లభ్యమైన ఆకుపచ్చ సున్నపురాయితో మలచబడిన అందమైన విష్ణువు శిల్పం విష్ణుకుండినుల శిల్పకళకు మచ్చుతునక. ఎడం చేతిలో శంఖం, కుడిచేతిలో శక్తిని ధరించినట్లు చెక్కిన ఈ శిల్పం అమరావతి శిల్పాలను తలపింప చేస్తుంది. ఇక్కడ చిన్న శైవాలయాలలోని గూళ్ళలో శివుని అర్ధనారీశ్వరునిగా, హరిహరునిగా, ఉమామహేశ్వరునిగా మలచబడిన శిల్పాలు కనపడతాయి. విష్ణుకుండినుల కాలానికి చెందిన మరొక అపురూప శిల్పం'నారసింహ' విగ్రహం ఇది గుంటూరు జిల్లా పిడుగురాళ్ళకు సమీపంలోని కొండమోటు గ్రామంలో లభ్యమైంది. దీర్ఘచతురస్రాకారపు రాతి ఫలకం మీద నిలుచున్న భంగిమలో ఆరు శిల్పాలు చెక్కబడ్డాయి. మూడోది మధ్యది అయిన శిల్పం సింహపుతల, మనిషి శరీరం గల నరసింహస్వామిది. ఎడమ నుంచి మొదటిది ప్రద్యుమ్నుడుగాను, ఆ తర్వాతది విష్ణువుగాను, నాల్గవది వాసుదేవ లేక కృష్ణుడుగాను, అయిదు, ఆరు విగ్రహాలు వరసగా సంకర్షణ, అనిరుద్ధులవిగా గుర్తింపబడ్డాయి. వాసుదేవ, సంకర్షణ,ప్రద్యుమ్న, అనిరుద్ధ, నరసింహ'పంచవీరులు'గా ఈ కాలంలో పూజింపబడేవారని స్పష్టమవుతుంది. ఈ పంచవీరఫలకం క్రీ.శ. 4-5 శతాబ్దాల నాటిది. నాగార్జునకొండ కళా సంప్రదాయం యొక్క కొనసాగింపు ఈ శిల్పంలో వ్యక్తమవుతుంది.

విష్ణుకుండినుల కాలంలో వినాయకుడు ప్రత్యేకంగా పూజలు అందుకున్నట్లు తెలుస్తున్నది. పెద్దవేగి త్రవ్వకాలలో ఒక అరుదైన వినాయకుని మట్టిబొమ్మ లభ్యమైంది. రెండు చేతులున్న ఈ దంతముఖస్వామి, ముఖం, నడుము, కాళ్ళు, చేతులు, చెవులు గజరాజును పోలి ఉన్నాయి. అర్ధపర్యంకాసనంలో కూర్చొని ఉన్న ఈ గణనాధునికి యజ్ఞోపవీతం లేదు. వస్త్రమేఖల, శిరఃపాలంపై వస్త్రఖండం మినహా ఇంకెలాంటి అలంకరణలు లేవు. మట్టితో చేసింది కనుక తాత్కాలికంగా పూజ కోసం చేసింది అయి ఉంటుంది. పైగా కూర్చున్నతీరు, వెనుకభాగం, పిరుదులు కూడా గజాన్ని పోలి ఉన్నాయి. మాధవవర్మ దంతముఖస్వామి ప్రతిమను ప్రతిష్ఠించినట్లు వేల్పూరు శాసనం వల్ల తెలుస్తున్నది. క్రీ.శ.5వ శతాబ్ది నాటి వినాయకుని దేవాలయం చేజర్లలో ఇప్పటికీ ఉంది.

విష్ణుకుండిన రాజులు సృష్టించిన గుహావస్తువు, శిల్పకళ తర్వాత వచ్చిన రాజులకు మార్గదర్శాలై పల్లవులు వీటిని అనుసరించి మహాబలిపురం మొదలైన చోట్ల అనేక శిల్ప కళాఖండాలను సృష్టించారు.

## 19.7 ప్రాచీన పల్లవులు

శాతవాహన సామ్రాజ్యం దక్షిణ భాగంలో బలవంతులైన ప్రాచీన పల్లవులు శాతవాహన అనంతర రాజవంశాలలో సుప్రసిద్ధులు. దక్షిణ భారతదేశ చరిత్రలో శాతవాహన సామ్రాజ్యం తర్వాత అత్యంత విస్తీర్ణం కలిగిన ప్రధమ సామ్రాజ్యం పల్లవులదే. పల్లవ రాజులు గాఢ బ్రాహ్మణ మతాభిమానులు.

### 19.7.1 ఆధారాలు :

ప్రాచీన పల్లవుల లేక ఆంధ్రపల్లవుల చరిత్రకు వారు వేయించిన శాసనాలే ఆధారం. ఇంతవరకు పల్లవులవి 20 శాసనాలు లభించాయి. వీటిలో నాల్గు ప్రాకృతంలోను మిగిలినవి సంస్కృతంలోను ఉన్నాయి.

శాసనాల్లోని లిపి, భాష ననుసరించి, ప్రాకృత శాసనాలు క్రీ.శ. 4వ శతాబ్దికి, సంస్కృత శాసనాలు 5వ శతాబ్ది ఆరంభం నుండి తర్వాతి కాలానికి చెందినవని డి.సి.సర్కార్ నిర్ణయించారు. పల్లవుల ప్రాకృత శాసనాల లిపి ఇక్ష్వాకుల శాసనాల లిపితో పోల్చదగింది.

### 19.7.2 ప్రాకృత శాసనాలు :

1) సింహవర్మ మంచికల్లు శిలా శాసనం,

2) యువమహారాజా శివస్కందవర్మ మైదవోలు శాసనం

3) మహారాజాధిరాజ శివస్కంధవర్మ హిరహడగళ్ళి శాసనం

4) శ్రీ విజయస్కందవర్మ కోడలు, యువమహారాజు బుద్ధవర్మ భార్య, బుద్ధ్యంకరుని తల్లి చారుదేవి బ్రిటిష్ మ్యూజియం శాసనం.

### 19.7.3 సంస్కృత శాసనాలు :

1) విజయస్కందవర్మ మొదటి ఒంగోడు శాసనం 2) సింహవర్మ వేసంత 3) శక్రపట్టణం శాసనాలు 4)యువమహారాజ విష్ణుగోపుని నెడుంగరాయ 5) ఉరువపల్లి శాసనాలు 6) రెండో సింహవర్మ రెండో ఒంగోడు 7) పికిర 8) మంగడూరు, 9) విళవట్టి శాసనాలు, 10) విజయ విష్ణుగోపుని చుర శాసనం 11) నందివర్మ ఉదయేందిరం శాసనం 12) కుమార విష్ణువు చందలూరుశాసనం 13) దర్శిశాసనఖండం 14) వాయలూరు స్తంభశాసనం, 15) వేలూరు పాళెయం శాసనం 16) కుమార విష్ణువు బొబ్బేపల్లి శాసనం పల్లవ చరిత్రకు ఆధారాలు.

పల్లవుల చరిత్రకు ఇన్ని శాసనాలు ఆధారాలుగా ఉన్నప్పటికీ వారి జన్మస్థలం లేక వంశోత్పత్తి, వంశవృక్షం, కాలం మొదలైన విషయాలను నిర్ణయించడంలో అనేక సమస్యల నెదుర్కొనవలసి వస్తుంది. అందుకు కారణం-శాసనాల్లో శకము ఉదహరించక పోవడం, వంశవృక్షం సంపూర్ణంగా లభించక పోవడం మొదలైనవి.

### 19.7.4. రాజకీయ చరిత్ర :

**19.7.4.1. సింహవర్మ(క్రీ.శ.280-310) :** మంచికల్లు శాసనంలోని సింహవర్మ ప్రాచీన పల్లవుల మూలపురుషుడు. దర్శి, వాయలూరు మొదలైన సంస్కృత శాసనాలు పల్లవ వంశకర్తగా పేర్కొంటున్న వీరకూర్చవర్మ ఇతడూ ఒక్కరేనని పండితుల అభిప్రాయం. ఇతనికే 'బప్పభట్టారకుడు' అనే బిరుదు కూడా ఉంది. సింహవర్మ బహుశా కర్మరాష్ట్రాన్ని (నరసరావుపేట,గుంటూరు, సత్తెనపల్లి, వినుకొండ, పల్నాడు ప్రాంతాలు) ఇక్ష్వాకులకు సామంతునిగా పాలిస్తూ అవకాశం చేజిక్కించుకుని వారిని తుదముట్టించి, విజయపురిని పరశురామ ప్రీతి గావించినట్లు కనిపిస్తుంది. అనంతరం తొండైమండలం నేలే నాగుల రాకుమార్తెను వివాహమాడి వారి మద్దతుతో కంచి రాజధానిగా స్వతంత్ర పల్లవ రాజ్యాన్ని స్థాపించాడు. కంచిలో రాజ్యస్థాపన జరిగిన తర్వాత సింహవర్మ తన కుమారుడైన యువరాజు శివస్కంధవర్మను ఆంధ్రా పథంపై తన రాజప్రతినిధిగా నియమించాడు. ఈ విధంగా క్రీ.శ.300 ప్రాంతంలో పల్లవులు బలవంతులై స్వతంత్ర రాజ్యం స్థాపించారు.

**19.7.4.2. మొదటి శివస్కంధవర్మ (క్రీ.శ.310-355) :** మంచికల్లు శాసనంలోని శివస్కంధవర్మ తప్ప మిగిలిన ప్రాకృత శాసనాలలోని శివస్కందవర్మ లందరూ ఒక్కరేనని భావింపబడుతోంది. సింహవర్మ కుమారుడైన మొదటి శివస్కంధవర్మ కాలం నాటికి చుటునాగులు అంతరించిపోగా కర్ణాటక ప్రాంతాలను ఆక్రమించాడు. శివస్కంధవర్మ రాజ్యం సువిశాలమై అందులో ఆంధ్రాపథ, శాతవాహనిరట్ట(బళ్ళారి, రాయలసీమ జిల్లాలు), తొండైమండలం, కుంతల ప్రాంతాలు చేరి ఉన్నాయి. అగ్నిష్టోమ, అశ్వమేధ, వాజపేయాలు జరిపి పల్లవ సార్వభౌమత్వం ప్రకటించాడు,'ధర్మమహారాజాధిరాజ' బిరుదు ధరించాడు. ఇతని కుమారుడు బుద్ధవర్మ. శివస్కంధవర్మ కాలంలో ఆంధ్రాపథాన్ని యువమహారాజు బుద్ధవర్మ పాలించాడు. శివస్కంధవర్మ చివరి రోజుల్లో కర్ణాటక నుంచి పల్లవులను పారద్రోలి కదంబవంశస్థుడైన మయూరశర్మ స్వతంత్ర రాజ్యం స్థాపించినట్లు తాలగుండ శాసనం వల్ల తెలుస్తున్నది. మయూరశర్మను ఎదుర్కొనే సందర్భంలోనే బహుశా శివస్కంధవర్మ మరణించి ఉండవచ్చు.

తర్వాత శివస్కంధవర్మ వారసులలో ఒకరైన విష్ణుగోపుడు సముద్రగుప్తుని చేతిలో ఓడిపోయినట్లు అలహాబాదు ప్రశస్తి పేర్కొంటున్నది. సముద్రగుప్తుని దండయాత్రల వల్ల ఏర్పడిన రాజకీయ సంక్షోభాన్ని అవకాశంగా తీసుకుని ఉత్తరాంధ్రలోని కర్మరాష్ట్రంలో ఆనందగోత్రజులు

స్వతంత్రం ప్రకటించుకున్నారు. వీరి రాజధాని కందరాపురం (కంతేరు) తమిళనాడులో తంజావూరు ప్రాంతంలో చోళులు విజృంభించారు. ఇటువంటి కల్లోల పర్థితులలో సమర్థుడైన రాజు సింహాసనం పై ఉండడం అవసరం. అందుచేత విష్ణుగోపుడు రాజ్యాన్ని త్యజించి సమర్థుడైన కుమార విష్ణువును సింహాసనంపై నిలిపాడు. విష్ణుగోపుడు నిస్సంతుగా మరణించి ఉండవచ్చు. కనుకనే పల్లవ శాసనాల్లో అతని ప్రసక్తి కనిపించదు.

కుమారవిష్ణువు ప్రతిభాశాలి. కదంబులతో సమాధానపడి, రాజ్యంలో చెలరేగిన ఇతర తిరుగుబాట్లను అణచి పల్లవ ప్రతిష్ఠను పునరుద్ధరించి అశ్వమేధయాగం చేశాడని మొదటి ఒంగోడు శాసనం తెలుపుతుంది. ఇతడు అనేక యజ్ఞాలు చేసి బ్రాహ్మణులకు భూరి దక్షిణ లిచ్చి వైదిక మతాన్ని పోషించాడు.

కుమారవిష్ణువు పుత్రుడైన విజయస్కంధవర్మ మహాశక్తివంతుడు. ఆనందుల నోడించి తిరిగి కర్మరాష్ట్రంలో పల్లవుల ఆధిత్యాన్ని నెలకొల్పాడు. ఇతడు విజయతాంబ్రప నుంచి దాన శాసనం జారీ చేశాడు. ప్రజాపాలనదక్ష, పంచమలోకపాలక, సర్వశాస్త్రార్థ, నిర్ణయతత్వజ్ఞ అనే బిరుదులు ధరించాడు. ఈ బిరుదులు అతని ధర్మనిరతిని సూచిస్తున్నాయి.

**19.4.7.3. రెండో సింహవర్మ (క్రీ.శ.436-480) :** ప్రాచీన పల్లవులలో ప్రముఖ రాజుగా పేరొందినవాడు విజయస్కందవర్మ కుమారుడు రెండో సింహవర్మ. లోక విభాగం అనే జైన గ్రంధం, పెనుకొండశాసనం పేర్కొంటున్న సింహవర్మ ఇతడే. ఇతడు తన పాలనా కాలం 41 వ సంవత్సరంలో శక్ర పట్టణంశాసనాన్ని వేయించాడు. దీనిని బట్టి ఇతని పాలనా కాలం నిర్ణయించగలిగాము. ఇతడు ఉత్తర, పశ్చిమ దిగ్విజయ యాత్రలు జరిపాడని చెప్పడానికి ఇతని వేసంత, శక్రపట్టణం శాసనాలే నిదర్శనం. ఇతడు సింహాసన మధిష్టించిన వెంటనే కర్మ రాష్ట్రం వరకు దాడి జరిపి విష్ణుకుండిన గోవిందవర్మ ఆక్రమించిన పల్లవ భూభాగాలను తిరిగి స్వాధీన పర్చుకున్నాడు. విష్ణుకుండినుల దక్షిణ విస్తరణ అరికట్టే ఉద్దేశ్యంతో సామ్రాజ్యపు ఉత్తరభాగాల్లో తన తమ్ముడు యువరాజైన విష్ణుగోపుని రాజప్రతినిధిగా నియమించాడు.

అనంతరం పశ్చిమాంధ్ర ప్రాంతాలలో బాణుల విజృంభణనరికట్టే ఆశయంతో గాంగ-కదంబ సంఘర్షణలో జోక్యం చేసుకుని గాంగ అయ్యవర్మను (హరివర్మ) రాజుగా చేశాడు. సింహవర్మ ధర్మచింతన గల ప్రభువు, రాజర్షిగుణసర్వసన్దోహుడు. 'ధర్మమహారాజు' బిరుదాంకితుడు. పరమభాగవతుడు.

సింహవర్మ తర్వాత రాజ్యానికి వచ్చిన స్కంధవర్మ సైతం కర్ణాటక రాజకీయాల్లో జోక్యం చేసుకొని మాధవవర్మను గాంగరాజ్య పాలకునిగా చేసి, సహాయ సహకారాలందించాడు.

**19.7.4.4. నందివర్మ:** నందివర్మ సింహాసనమధిష్టించడంతో పల్లవరాజ్యానికి చెడ్డరోజులు దాపురించాయి. తెలుగు, తమిళదేశాలలో త్రిలోచన పల్లవుడని ప్రఖ్యాతుడైన మహారాజు నందివర్మేనని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. త్రిలోచన పల్లవునికి కాడువెట్టి అనే బిరుదు ఉంది. దీనికి అడవులను ఛేదించిన వాడని అర్థం. అడవులను కొట్టివేసి, చదును చేసి వ్యవసాయ భూములుగా అభివృద్ధి చేయడం వలన ఇతనికి ఆ బిరుదు వచ్చింది. నందివర్మ రేనాటిచోడుల పై దండెత్తి యుద్ధంలో ఓడించి కప్పం పుచ్చుకున్నాడు. కదంబ రాజ్య పాలకులైన మృగేశ్వరవర్మ (475-90), రవివర్మ (497-537) మొదలైనవారు పల్లవ రాజులను యుద్ధంలో ఓడించి తరిమి వేసినట్టు చెప్పుకున్నారు. వీరు నందివర్మకు సమకాలికులైనందు వల్ల వీరు ఓడించినది నందివర్మనేనని తెలుస్తున్నది. ఈ పరాజయాలతో కాంచీపురం అలజడి పాలుకాగా, బహుశా శత్రువులు కాంచీపురాన్ని ఆక్రమించారు. ఇటువంటి క్లిష్టపరిస్థితులలో కుమార విష్ణువు తన కుమారుడైన బుద్ధవర్మ సహాయంతో కంచిని తిరిగి ఆక్రమించి అక్కడ పల్లవ వంశాన్ని పునరుద్ధరించాడు. బుద్ధవర్మను 'చోళసైన్యాలకు బడబాగ్ని' అని వేలూర్‌పాళెయం శాసనం చెబుతున్నందు వల్ల కాంచీపురిని ఆక్రమించిన శత్రురాజులు రేనాటి చోడులని భావించవచ్చు. ఇతడు కదంబులను, రేనాటి

చోడులను మరల ఓడించి తన సామంతులుగా చేసుకున్నాడు. కుమార విష్ణువు తాను సాధించిన విజయానికి చిహ్నంగా అశ్వమేధయాగం నిర్వహించాడు. కుమార విష్ణువు తర్వాత అతని కుమారుడు బుద్ధవర్మ తదనంతరం మూడో కుమార విష్ణువు కాంచీపుర రాజ్యపాలన చేశారు. ఇతని తర్వాత అంటే క్రీ.శ. 550 ప్రాంతంలో ప్రాచీన పల్లవ శాఖ చరిత్ర నుంచి అంతర్ధానమైంది.

**19.7.4.5 పాలక్కడ పల్లవ శాఖ:** పాలక్కడ నుంచి పాలించిన పల్లవులు కాంచీపురం పల్లవ వంశశాఖలోని వారే. పల్లవ సింహవర్మ తన రాజ్యంలోని ఆంధ్రప్రాంతాలను ప్రత్యేక రాష్ట్రంగా చేసి, తన తమ్ముడైన యువరాజు విష్ణుగోపుని తన రాజ ప్రతినిధిగా పాలించమని నియమించాడు. ఈ రాజ్యంలో చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో అధిక భాగం చేరి ఉన్నాయి. వీరి శాసనాలు ఎక్కువగా పాలక్కడ నుంచి ఇచ్చినందున అదే వారి రాజధాని అని భావిస్తున్నారు. ఉరువపల్లి, నెడుంగరాయ, విళవట్టి మొదలైన శాసనాలన్నీ పాలక్కడ నుంచి వేసినవే. నేటి నెల్లూరు జిల్లాలో పులికాట్ (ప్రళయ కావేరి)నే పాలక్కడగా గుర్తిస్తున్నారు.

యువమహారాజు విష్ణుగోపుని కుమారుడైన సింహవర్మ పాలక్కడ రాజధానిగా స్వతంత్రంగా పాలించినట్లు కనిపిస్తున్నది. సింహవర్మ వేంగో రాష్ట్రంలో దానధర్మాలు చేసినట్లు ఇతని మంగడూరు శాసనాన్ని బట్టి తెలుస్తున్నది. సింహవర్మ మరణానంతరం అతని కుమారుడు విజయవిష్ణుగోపుడు పాలక్కడ రాజ్యాన్ని పాలించాడు. చందలూరి శాసనంలో పేర్కొన్న మూడో కుమారవిష్ణువుతో కంచి ప్రధానశాఖ అంతరించగా పాలక్కడ శాఖీయుడైన విజయవిష్ణుగోపుని కుమారుడు సింహవర్మ క్రీ.శ. 550 ప్రాంతంలో కాంచీపురం సింహాసనం అధిష్టించి మహాపల్లవులకు మూలపురుషుడు కావడమే కాకుండా, పల్లవుల అధికార వైభవాలను పునరుద్ధరించాడు. ఇతని సంతతి వారే మహాపల్లవులు లేక బృహత్ పల్లవులుగా ప్రసిద్ధి చెందారు.

## 19.8. సారాంశం

**శాతవాహనులు :** శాతవాహనులలో గొప్పవాడు వాసిష్టపుత్ర శాతకర్ణి. గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కడప, కర్నూలు మొదలైన ప్రాంతాలను తన ఆధీనంలోకి తెచ్చుకొన్నాడు. ఇవేకాక ఇంకా కొన్ని ప్రాంతాలు తన అధీనంలోకి తెచ్చుకొన్నాడు. ఇతని తరువాత వీర పురుష దత్తుడు, ఎహువుల శాంతనడు కొంతమంది పరిపాలించారు. వీరి పరిపాలనలో రాజకీయ, సామాజిక, ఆర్థిక సైనికపాలనలో వీరు బాగా కృషిచేసారు. వీరు తమ ముందర రాజులకు మార్గదర్శకం అయినారని చెప్పుకోవచ్చు.

**విష్ణు కుండినులు :** శాతవాహన - చాళుక్య మధ్య యుగంలో పరిపాలించినవారు విష్ణు కుండినులు వీరు కృష్ణ - నర్మద మధ్యగల దక్షిణాపదాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని రాజకీయ, సాంస్కృతిక వైభవాన్ని చేకూర్చినారు. వీరి వంశం మొత్తం 9 మంది రాజులు వీరి పాలనకు గోవిందవర్మ తుమ్మల గూడెం శాసనం ఆధారం. వీరిలో గోవిందవర్మ, రెండో మాధవవర్మ, ఇంద్రవర్మ మొ.గు వారు గొప్పవారు. వీరి పాలన శాతవాహనుల పాలనావిధానం వలే ఉంటుంది.

**ప్రాచీన పల్లవులు :** పల్లవుల చరిత్ర గురించి తెలుసుకోవటానికి ఆధారాలు వీరు వేయించిన శాసనాలే. వీరిలో ప్రసిద్ధులు : గోవిందవర్మ, రెండవ మాధవవర్మ సుప్రసిద్ధులు. వీరు ఎక్కువ పరిపాలన విధానానికి ప్రాధాన్యత ఇచ్చినారు. రాజు ధర్మబుద్ధుడు. రాజుకి సలహా ఇవ్వటానికి మంత్రిపరిషత్తును ఏర్పాటుచేసారు. పాలన సౌలభ్యం కోసం రాష్ట్రాలు, భుక్తులు, గ్రామాలుగా విభజించారు. వీరి కాలంలో సాంఘీక, ఆర్థిక పరిస్థితి బాగుండేది. భాషా సారస్వతానికి ప్రాధాన్యత నిచ్చారు. వాస్తు శిల్పకళలుబాగా అభివృద్ధిచెందినాయి.

**ఉపయుక్త గ్రంథాలు**


1. Gopalachari, K. : Early History of the Andhra country (2nd Edition) Madras,1976
2. Rama Rao, M. : Studies in the Early History of Andhra Desa, Madras, 1974

3. Sankaranarayanan.S. : Vishnukundins and their times, Delhi,1980

4. Venkata Ramanayya,N.: The vishnukundins, Madras, 1975.

5. హనుమంతరావు, B.S.I. : ఆంధ్రుల చరిత్ర, గుంటూరు, 1982.

## 19.9 మాదిరి ప్రశ్నలు :

1. ఇక్ష్వాకుల గూర్చి వ్రాయుము?
2. విష్ణు కుండినులు గురించి వివరంగా తెలుపుము?
3. ప్రాచీన పల్లవుల గురించి వ్రాయుము?

**సంక్షిప్త ప్రశ్నలు :**

1. ఆనందగోత్రులు గురించి తెలుపుము?
2. శాలంకాయనులు గూర్చి తెలుపుము?
3. బృహత్పలాయనులు గూర్చి వ్రాయుము
4. విష్ణు కుండినులు నాటి సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితుల గురించి తెలుపుము?
5. ప్రాచీన పల్లవుల రాజకీయ చరిత్ర గురించి వ్రాయుము?

పాఠం - 20

# పల్లవులు

## 20.0 లక్ష్యం:

శాతవాహన చక్రవర్తుల కాలం తర్వాత దక్కనులో, దక్షిణ భారత దేశంలో విభిన్న రాజ్యాలు వివిధ ప్రాంతాలలో వర్ధిల్లాయి. వాటిలో ఉద్భవించిన తొలి పల్లవుల రాజవంశం కొంత కాలం మరుగున పడినా తర్వాత కాలంలో బ్రహత్పల్లవులు, నవీన పల్లవులనే నామధేయాలతో ఒక గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించారు. వారికి సంబంధించిన రాజకీయ ఆర్థిక, సాహిత్య కళారంగాల స్వరూపాన్ని వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ క్రమం**


20.1. ఉపోద్ఘాతము

20.2. మహేంద్రవర్మ

20.3 కడపటి పల్లవులు

20.4 పరిపాలన

20.5 సాంఘీక పరిస్థితులు

20.6 ఆర్థిక పరిస్థితులు

20.7 మతము

20.8 సాహిత్యం - సంస్కృతి

20.9 పల్లవుల కళాసేవ

20.10 సారాంశము

21.11 మాదిరి ప్రశ్నలు


## 20.1 ఉపోద్ఘాతము

తొలి పల్లవుల తర్వాత వచ్చిన పల్లవ రాజులకు బృహత్పల్లవులు, మహాపల్లవులు, నవీన పల్లవులనే నామ ధేయాలు కలవు. వీరు సుమారు 300 సం॥ పాటు (క్రీ.శ. 575-803) దక్షిణ భారతంలో విశాల సామ్రాజ్యాన్ని నిర్మించి, భారత సంస్కృతికి ముఖ్యంగా శిల్పకళకు ఎనలేని సేవ చేశారు. వీరి మూల పురుషుడు "సింహవిష్ణువు" ఇతనికి పూర్వపు పల్లవురాజులకు గల సంబంధము తెలియదు. క్రీ.శ. 6 వ శతాబ్దపు చివరి భాగంలో ఇతడు కంచికి రాజైనాడు. ఇతడు నాడు తమిళదేశంలో అలజడులకు కారకులైన కలభ్రులను అణచి చోళ పాండ్యులను ఓడించి పల్లవరాజ్యాన్ని, కావేరీ నది వరకు విస్తరించాడు. సింహళ ప్రభువు కూడా ఇతని ఆజ్ఞలను పాటించాడు. ఇతనికి ఆవనీసింహ అను బిరుదు ఉన్నది. ఇతని రాకతో పల్లవ చరిత్ర మరల వెలుగులోనికి వచ్చింది.

## 20.2 మహేంద్ర వర్మ (600-630) :

సింహవిష్ణువు తరువాత అతని కుమారుడు మొదటి మహేంద్ర వర్మ రాజ్యానికి వచ్చి 30 సం॥ లు పాలించాడు. ఇతడు గొప్ప వీరుడు, కవి, పండితుడు. ఇతని కాలంలో పల్లవ రాజ్యము అత్యున్నత దశను చేరుకున్నది. పాండ్యులతో పోరాడి కావేరి నది పరివాహక ప్రాంతంలోని సారవంతమైన డెల్టా భూములను ఆక్రమించాడు. ఉత్తరాన కృష్ణానది వరకు తన రాజ్యాన్ని విస్తరింపజేశాడు. ఇతడు మొదటజైనుడు. కాని అప్పర్ అను శైవ మహర్షి బోధనవల్ల శైవుడిగా మారాడు. కవులను పోషించుటయేకాక తాను స్వయంగా మత్త విలాస ప్రహసనం అను నాటకాన్ని రచించాడు. ఇతనికి గుణభారుడు, చిత్రకారపులి, విచిత్ర చిత్తుడు అను బిరుదులు కలవు. ఇతడు శిల్పకళకు చేసిన సేవ అమోఘము. గుహలను తొలిపించి ఆలయాలను నిర్మించు పద్ధతిని ఇతడు తమిళదేశంలో ప్రారంభించాడు. ఇతని చివరి కాలంలో రెండవ పులకేసి పల్లవ రాజ్యంపై దండెత్తి "పుల్లలూరు" వద్ద జరిగిన యుద్ధంలో ఇతన్ని వధించి పల్లవ రాజ్యంలోని ఉత్తర ప్రాంతాన్ని ఆక్రమించాడు. దండికి పూర్వుడైన "దామోదరుడు" ఇతని ఆస్థాన కవి.

**20.2.1. మొదటి నరసింహవర్మ (630-668) :** మహేంద్రవర్మ మరణానంతరం అతని కుమారుడగు నరసింహవర్మ సింహాసనానికొచ్చాడు. ఇతడు రాజ్యానికి వచ్చి విచ్ఛిన్నమైన పల్లవరాజ్యాన్ని పునరుద్ధరించడానికి పూనుకున్నాడు. చేర, చోళ, పాండ్య కలభ్రులనోడించి పల్లవ అధికారాన్ని పునరుద్ధరించాడు. పులకేశి రెండవ పర్యాయం పల్లవ రాజ్యంపై దండెత్తగా, అతన్నోడించి వెన్నంటి తరిమాడు. చాళుక్యరాజ్యంలో ప్రవేశించి "మణిమంగళ" యుద్ధంలో పులకేశిని వధించి "వాతాపి" ని తగులబెట్టి తన తండ్రి పగతీర్చి "వాతాపికొండ" అను బిరుదు వహించాడు. తన విజయాన్ని వాతాపిలోని మల్లికార్జున దేవాలయం వెనుక శిలపై చెక్కించాడు. ఈ యుద్ధం ఫలితంగా పులకేశి ఆక్రమించిన ఉత్తర ప్రాంతాలు మరల పల్లవుల స్వాధీనమైనవి. ఈ యుద్ధంలో అతనికి సహాయపడిన "మారవర్మ" అనునతనికి సహాయంగా నరసింహవర్మ సింహళంపై దండెత్తి జయించి మారవర్మను సింహళరాజుగా చేసి తనకు సామంతుడిగా చేసుకున్నాడు. ఈ విజయంతో పల్లవ సామ్రాజ్యాన్ని సింహళం నుండి కృష్ణానది వరకు విస్తరింపచేసి "మహామల్ల" అను బిరుదు వహించాడు.

నరసింహవర్మ వీరుడే కాక గొప్ప కళాపోషకుడు, సాహితీ పోషకుడు కూడా. కిరతార్జునీయము వ్రాసిన "భారవి" ఇతని ఆస్థానకవి శిల్పకళకు నరసింహవర్మ ఎనలేని సేవ చేశాడు. మహాబలిపురంలోని పంచపాండవుల ఏకశిలారథాలను తొలిపించినవాడితడే. ఇవే తరువాత దేవాలయ కట్టడాలకు మార్గదర్శకములైనవి. "మామల్లపురము" అను మాటకు భ్రష్టరూపమే మహాబలిపురము. ఇది నరసింహవర్మ తనకుగల "మహామల్ల" అను బిరుదునకు చిహ్నంగా కట్టించినాడు. ఇతని కాలంలో చైనా యాత్రికుడగు హుయాన్‌త్సాంగ్ కంచిని దర్శించి కంచి అతి వైభవంగా యున్నదని అచట 100 బౌద్ధారామాలు 10,000 మంది బౌద్ధబిక్షువులు వున్నారని, 80 బౌద్ధేతర నిర్మాణాలున్నాయని, కంచి గొప్ప విద్యాకేంద్రమని, నలంద విశ్వవిద్యాలయములోని ఆచార్యుడైన ధర్మపాలుడు కంచివాసుడని, కంచి అనేక పండ్లతోటలతో కనులపండుగగా వున్నదని వ్రాశాడు. నరసింహవర్మ కాలంనుండే పల్లవ చాళుక్య సంఘర్షణ ప్రారంభమైనది. ఇతని చివరి కాలంలో పులకేశి కుమారుడైన మొదటి విక్రమాదిత్యుడు ఇతనిపై దండెత్తి ఇతన్ని ఓడించి పల్లవ రాజకుమార్తెను వివాహమాడెనని ప్రతీతి.

**20.2.2. రెండవ మహేంద్ర వర్మ (క్రీ.శ. 668-670) :** నరసింహవర్మ తరువాత అతని కుమారుడైన రెండవ మహేంద్రవర్మ రాజైనాడు. అతని తరువాత అతని కుమారుడు పరమేశ్వర వర్మ పాలించాడు. వీరి కాలంలో చాళుక్య విక్రమాదిత్యుడు పల్లవ రాజ్యంపై దండెత్తి, తిరుచునాపల్లి, ఉరయూరు వరకు చొచ్చుకొని వచ్చి కొల్లగొట్టినాడు. మొదట ఓడిపోయినప్పటికి చివరిలో పరమేశ్వరవర్మ పెరువళనల్లూర్ వద్ద చాళుక్యులను ఓడించి తరిమినాడు. చాళుక్య రాజ్యంపై కూడ దాడి చేసినాడు.

**20.2.3. రెండవ నరసింహవర్మ (700-728) :** పరమేశ్వరవర్మ అనంతరం అతని కుమారుడు రెండవ నరసింహవర్మ రాజైనాడు. ఇతనికి రాజసింహుడు అనిపేరు కూడా కలదు. ఇతని కాలంలో పల్లవ సామ్రాజ్యం యుద్ధాలు లేకుండా శాంతి అనుభవించింది కనుక సాహిత్య శిల్పకళలో అభివృద్ధి చెందాయి. "దశకుమార" చరిత్రను వ్రాసిన "దండి" ఇతని ఆస్థానకవి. రాజసింహుడు శైవమతస్థుడు. మహాబలిపురంలోని సముద్రతీర దేవాలయము, కంచిలోని కైలాసనాథాలయాన్ని నిర్మించాడు. రెండవ నరసింహవర్మ తరువాత అతని

కుమారుడు రెండవ పరమేశ్వర వర్మ రాజ్యానికి వచ్చాడు. అతని కాలంలో చాళుక్య రెండవ విక్రమాదిత్యుడు దండెత్తి అతన్ని ఓడించి పల్లవ రాజ్యాన్ని దోచుకొన్నాడు. అతడు వెనుదిరిగిన తరువాత ఈ దండయాత్రలో చాళుక్యులకు సహాయపడిన పశ్చిమ గాంగులను దండించుటకు వారిపై దండెత్తి "విళందీ" యుద్ధంలో మరణించాడు. అంతటితో సింహ విష్ణువు వంశం అంతరించింది.

## 20.3 కడపటి పల్లవులు :

రెండవ పరమేశ్వరవర్మ మరణానంతరం పల్లవుల్లో వారసత్వయుద్ధము మొదలైంది. ఈ సమయంలో కంచి ఘటికలోని విద్వాంసులు, పండితులైన బ్రాహ్మణులు, పల్లవ వంశానికి చెందిన నందివర్మను రాజుగా చేశారు. ఇతని వంశస్తులు 733వ నుండి 898 వరకు సుమారు 165 సం॥లు రాజ్యం చేసారు. వీరినే కడపటి పల్లవులంటారు.

**20.3.1. నందివర్మ (క్రీ.శ. 733-794) :** నందివర్మ రాజ్యానికి వచ్చి తన అధికారాన్ని స్థిరపర్చుకున్నాడు. కాని ఇతని కాలంలో పల్లవరాజ్యం అనేక దండయాత్రలకు గురి అయినది. చాళుక్య విక్రమాదిత్యుడు, అతని కుమారుడు కీర్తివర్మ కంచిపై దండెత్తి కొల్లగొట్టినారు. ఇది అదనుగా చూచి సామంతులైన పాండ్యులు పల్లవాధికారాన్ని ధిక్కరించారు. అటువంటి క్లిష్టపరిస్థితులలో దంతిదుర్గుడు చాళుక్యులను కూలద్రోసి రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు. కాని చాళుక్య విరోధులైన పల్లవులతో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకొనుటే తనకు మంచిదని దంతి దుర్గుడు భావించి తన కుమార్తెయగు రేవతిని నందివర్మకిచ్చి వివాహం చేసి పల్లవులను తనకు బంధువులుగా మార్చుకున్నాడు. దానితో నందివర్మ కుదుటపడ్డాడు. నందివర్మ వైష్ణవుడు, ఇతడు కంచిలోని వైకుంఠపెరుమాళ్ దేవాలయాన్ని కట్టించాడు. ఇతనికి "పల్లవమల్ల" అని బిరుదు కలదు.

**20.3.2. దంతివర్మ రాజ్య పతనము :** నందివర్మ తరువాత అతని కుమారుడు దంతివర్మ రాజైనాడు. ఇతని కాలంనుండి పల్లవ రాజ్యం క్షీణించసాగింది. ఇతని కాలంలో బంధుత్వాన్ని కూడ మరచి రాష్ట్రకూటులు పల్లవ రాజ్యంపై దాడులు చేసారు. రాష్ట్రకూట మూడవ గోవిందుడు 804 లో పల్లవ రాజ్యంపై దండెత్తి కాంచీపురాన్ని దోచుకున్నాడు. దానితో పల్లవ సామ్రాజ్యం బలహీనమైనది. ఈ బలహీనతను గ్రహించి పల్లవ సామంతులైన పాండ్యులు విజృంభించారు. పాండ్య వరగుణుడు స్వతంత్ర వైఖరిని అవలంబించి, అనేక ప్రాంతాలను ఆక్రమించాడు. పల్లవరాజ్యంలోని దక్షిణ ప్రాంతాలను పాండ్యులు ఆక్రమించారు. దంతివర్మ తరువాత రాజ్యానికొచ్చిన తెలుగు చోడరాజు శ్రీకాంత్ కూడ పల్లవ రాజ్యంపై దండెత్తుట వలన పల్లవ రాజ్యం బాగా బలహీనపడినది.

**20.3.3. మూడవ నందివర్మ :** (846-66) దంతివర్మ తరువాత అతని కుమారుడు మూడవ నందివర్మ రాజ్యానికి వచ్చి, పల్లవ సామంతులను కూడగట్టుకొని పాండ్యులపై దండెత్తి వారి నోడించాడు. అతని తరువాత రాజైన అతని కుమారుడు నృపతుంగవర్మ కూడ పాండ్యులను ఓడించాడు. కాని ఈ పాండ్య పల్లవ సంఘర్షణ వల్ల పల్లవ రాజ్యము దెబ్బతిన్నది. అంతవరకు విధేయులుగా ఉన్న చోళులు కూడ బలవంతులై సమయం కొరకు ఎదురుచూడసాగారు. నృపతుంగవర్మ కుమారుడైన అపరాజిత వర్మ రాజ్యానికి రాగానే పాండ్యులు మరల విజృంభించగా సామంతుడైన చోళ ఆదిత్యుని, పశ్చిమ గాంగులను కూడగట్టుకొని అపరాజితుడు పాండ్యులను క్రీ.శ. 880 లో జరిగిన శ్రీ పురాంబియం యుద్ధములో ఓడించాడు. దానితో పాండ్యుల విజృంభణ ఆగిపోయింది. కాని అప్పటికే బలపడిన ఆదిత్య చోళునికి స్వతంత్రము ప్రకటించాలనే కోరిక కలిగింది. అప్పటికే పాండ్యులు అణచబడినందున తను ఎదురు తిరిగినట్లయితే అపరాజిత పల్లవునికి సహాయపడేవారు. ఎవరూలేరని ఆదిత్యచోళునికి ఆత్మవిశ్వాసం కల్గింది. దానితో అతడు కంచిపై దండెత్తాడు. అపరాజితుడు ఆదిత్యచోళునితో పోరుతూ మరణించాడు. కంచి, తోండైమండలము చోళుల స్వాధీనమైనది. పల్లవ సామ్రాజ్యం అస్తమించినది. ఆ తరువాత కొందరు పల్లవ రాకుమారులు చోళ సామ్రాజ్యంలో సామంతులుగా ఉన్నట్లు శాసనాల వల్ల తెలియుచున్నది.

## 20.4 పరిపాలన :

రాజు సర్వాధికారి కాని ధర్మబద్ధుడు. పల్లవ రాజులు ధర్మమహారాజాధిరాజు, పంచమ లోకపాలక అను బిరుదులు ధరించారు. మహేంద్రవర్మకు విచిత్రచిత్తుడు, చిత్రకారపులి అని, నరసింహ వర్మకు మామల్లుడు అని రాజసింహునికి వీరభక్త అని బిరుదులు వున్నవి.

పల్లవరాజులు మంత్రిమండలి, యువరాజుల సహాయంతో రాజ్యం చేశారు. ప్రధానమంత్రిని బ్రహ్మర్షి రాజా అని పిలిచారు. పల్లవులు రాజ్యాన్ని రాష్ట్రాలు, భుక్తులు, గ్రామాలుగా విభజించారు. సామ్రాజ్యంలో ఎక్కువ భాగం సామంతుల పరిపాలనలో ఉండేది. రాజే ప్రధానన్యాయమూర్తి. పట్టణాలలో అధికరణాలు, కరణాలు అనే న్యాయస్థానాలున్నట్లు మత్త విలాస ప్రహసనం ప్రస్తావించింది. గ్రామాలలో గ్రామ పంచాయితీలు తీర్పు చెప్పేవి. శిక్షలు కఠినంగా వుండేవి. గ్రామాలలో గ్రామ సభలుండేవి అందు రైతులు సభ్యులుగా ఉండేవారు. గ్రామసభలను ఊర్ అని, బ్రాహ్మణులు సభ్యులుగా వున్న గ్రామాలను **పభ అని వర్తకుల** సభను నకరం అని పిలిచేవారు. కుల సంఘాలు కూడా ఉండేవి. గ్రామసభలు భోజక అను ఉద్యోగి సలహాతో **నడిచేవి.** నేరస్తులను శిక్షించటానికి ధర్మాసనాలు అను పేరుగల న్యాయసభలుండేవి. పల్లవులకు భూమి శిస్తు ముఖ్య ఆదాయం. 18 రకాల పన్నులున్నట్లు శాసనాల వలన తెలియుచున్నది. సామాన్య రైతులు భూస్వాములకు పురువశోన్ అనే పన్ను చెల్లించేవారు. ఇంకా ఇలంపూడ్యి (కల్లుపై పన్ను) ఇడైపూడ్సి (పశువులపై పన్ను) బ్రహ్మణరాసకాణం ( పురోహితులపై పన్ను) కలాస్తక్కణం (పెండ్లి సుంకం) కుశక్కోణం (కుమ్మరులపై పన్ను) తట్టుకొమ్మల మొదలైన పన్నులు శాసనాలలో పేర్కొన్నారు. గ్రామాలలో ప్రధాన వృత్తి వ్యవసాయం. పల్లవులు అనేక తటాకాలు, కాలువలు నిర్మించారు. మహేంద్ర తటాకం, చిత్రమేఖ తటాకం, వైదిమేఖ తటాకం, కనకవల్ల తటాకం పరమేశ్వర తటాకం, కావేరి పాక్కం తటాకం మొదలైన తటాకాల పేర్లు శాసనాలలో కనిపిస్తున్నాయి.

## 20.5 సాంఘిక పరిస్థితులు :

వైదిక మతంతోబాటు కులవ్యవస్థ అభివృద్ధి చెందింది. పురనానూర్ అనే గ్రంథమువల్ల వణం, పరియన్, కదంబన్, తుడియం అనే నాలుగు వర్ణాలున్నట్లు తెలియుచున్నది. త్రిలోచన పల్లవుడు గంగాతీరంనుండి బృహచ్చరణులను బ్రహ్మణులను రప్పించినట్లు తెలియుచున్నది. కనుక కులాల మధ్య వర్ణ విభేదాలు అంతగా లేవు. నాయనార్, ఆళ్వారులలో చాలామంది తక్కువ కులస్థులు, వీరి బోధనలను అందరూ పాటించారు. అంతేగాక కులాల వృత్తిలో గూడా మార్పులున్నాయి. పల్లవులు, కదంబులు, బ్రహ్మణులైనప్పటికి క్షత్రియధర్మాన్ని పాటించి వర్మ అని పేరు పెట్టుకున్నారు. కమ్మరి, కంసాలి, కల్లుగీసే వారు మొ॥ ఉపకులాలు ఉండేవి. బ్రహ్మచర్యం, గృహస్థవాన, ప్రస్థం, సన్యాసం అనే నాలుగు ఆశ్రమ ధర్మాలు పాటించేవారు.

వరి ప్రధాన ఆహారం, పాలు, పరమాన్నం, పెరుగన్నం, ఎక్కువగా వాడేవారు. తాంబూలం వేసుకునేవారు. శ్రీమంతులు పట్టువస్త్రాలు, సామాన్యులు నూలు వస్త్రాలు ధరించేవారు. స్త్రీ పురుషులిరువురూ ఆభరణాలు ధరించేవారు.

## 20.6 ఆర్థిక పరిస్థితులు - విదేశ వ్యాపారము పరిశ్రమలు :

పల్లవ రాజ్యం ఆర్థికంగా మంచి ఉచ్చదశననుభవించినది. విదేశ వ్యాపారము పరిశ్రమలు మంచి ఉన్నత స్థితిలో నుండెడివి. కుటీర పరిశ్రమలకు కూడా శ్రేణులుండెడివి. నానాదేశి మణి గ్రామం అనే పేర వర్తక సంఘాలు ఉన్నట్లు తెలియుచున్నవి. ఈ సంఘాలు విదేశ వ్యాపారం చేయుచుండగా గ్రామ సంఘశ్రేణులు పరిశ్రమలను నిర్వహించేవి. ఈ యుగంలో కూడా చైనా, ఆగ్నేయాసియా రాజ్యాలతో నౌకా వాణిజ్యం జరిగినది. పట్టుబట్టలు, ముత్యాలు, కెంపులు నాటి ముఖ్య ఎగుమతులు. రాజ సింహుడు చైనాకు రాయబారులను కూడా పంపినాడట. ఆగ్నేయాసియా రాజ్యాలలో దక్షిణ దేశ వర్తకులు స్థాపించిన వలసల వల్ల అచట భారతీయ సంస్కృతి విస్తరించినది.

**20.6.1 రేవులు :** మహాబలిపురం, నాగపట్టణం నాటి ముఖ్య రేవు పట్టణములు. ఈ రేవుల గుండా విదేశ వ్యాపారం జరుగుచుండెడిది.

## 20.7 మతము :

పల్లవులు వైదిక మతాన్ని ఆదరించినారు. శివస్కందవర్మ కుమార విష్ణువంటి ప్రాచీన పల్లవ రాజులు యజ్ఞయాగాదులు క్రతువులు చేసినారు. అంతేగాక కలియుగంలో భ్రష్టమగుచున్న వైదిక ధర్మాన్ని పునరుద్ధరించడానికి పూనుకున్నామని (కలియుగ ధర్మోద్ధరణ

నిత్యసన్నద్దులు) చెప్పుకున్నారు. అప్పార్, సంబందర్, అరుమంగ్రై, తోండరప్పొడి మొ॥ నాయనార్లు ఆళ్వార్లు వల్ల, బలి, హింస పద్ధతులు తగ్గి భక్తిపూరితమైన శైవ, వైష్ణవ మతాలు తమిళ దేశంలో బహుళ వ్యాప్తి నొందినవి. రాజసింహుడు వైష్ణవుడయినప్పటికి ఎక్కువమంది పల్లవ రాజులు శైవులు, వీరి లాంఛనం వృషభము ఖట్వాంగము (త్రిశూలం). నాటి శైవంలో కాలాముఖ, పాశుపత, కాపాలిక అనే మూడు శాఖలుండేవి. కనక దుర్గకు నరబలులు కూడా ఇస్తున్నట్లు మహాబలిపురం శిల్పాలలో చెక్కివున్నది. అట్టిబలులను ప్రాణహింసను మహేంద్ర వర్మ తన మత్త విలాస ప్రహసనంలో పరిహసించాడు. ఇంకా సప్త మాతృకల పూజ, జ్యేష్ఠాదేవి పూజలు వాడుకలోనున్నవి. శ్రీరంగం తిరుపతి మొ॥ క్షేత్రాలు నాడు గొప్ప పేరు గాంచినవి.

**20.7.1 జైన, బౌద్ధమతాలు :** పల్లవ యుగ ప్రారంభములో జైన, భౌద్ధ మతాలు మంచి ఉచ్ఛస్థితిలో ఉండి తమిళ సాహిత్యాభివృద్ధికి తోడ్పడినవి. మొదటి మహేంద్రవర్మ అప్పార్‌లిద్దరూ మొదటి జైనులు క్రీ.శ 641 లో కంచిని దర్శించిన హ్యుయాన్ త్సాంగ్ అచట నూరు బౌద్ధరామాలున్నట్లు, జైనులు కూడా ఎక్కువగానే ఉన్నట్లు వ్రాసినాడు. సంబందార్, తిరుమంగై అళ్వారులు, భౌద్ధులనోడించి హిందువులుగా మార్చారు.

## 20.8 సాహిత్యం - సంస్కృతి :

పల్లవుల కాలంలో వేదమతంతోపాటు వేద విద్యలు కూడా అభివృద్ధి చెందినవి. కంచినాటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విద్యాకేంద్రము సంస్కృతము నాటి రాజభాష, వారి శాసనాలన్ని సంస్కృతంలోనే వున్నవి. విద్యాభివృద్ధికి ఘటికలను స్థాపించారు. విదేశాలనుండి విద్యార్థులు వచ్చి చదువుకునేవారు. ఆ ఘటికలలో వేదాలు, శిక్ష, వ్యాకరణము, నిరుక్త, చందస్సు కల్పము, జ్యోతిష్యము, తర్క మీమాంసలు, ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం శిల్పవేదం, దండనీతి, అర్థశాస్త్రాలు, ధర్మశాస్త్రాలు పురాణాలు బోధించేవారు. దండి, భారవి పల్లవుల ఆస్థాన కవులు. దిఙ్నాగుడు, ధర్మపాలుడు కంచివారు, మహేంద్రవర్మ స్వయంగా కవి. అతడు మత్తవిలాస ప్రహసనము భగవదజ్జుకం అనే రెండు ప్రహసనాలు వ్రాశాడు. భారవి కిరాతార్జునీయం, శిశుపాలవధ వ్రాయగ దండి దశకుమార చరిత్ర, కావ్యాదర్శమును వ్రాసినాడు.

నాటి తమిళ సాహిత్యంలో ప్రసిద్ది చెందిన కవి తిరువాళ్వార్ ఇతడు రచించిన "కురల్" అనే గ్రంథం తమిళ సాహిత్యంలోనే మహా విజ్ఞాన దాయకమైన ఉత్తమోత్తమ గ్రంథము.

**20.8.1 భక్తి ఉద్యమ కారులు :** తమిళ సాహిత్యం అభివృద్ది చెందడానికి కారణం ఈ కాలంలో విస్తరించిన నాయనార్లు, ఆళ్వారుల ప్రాబల్యమే. వీరు తమిళంలో భక్తిగీతాలు వ్రాశారు.

**20.8.2 నాయనారులు :** సంభందార్, అప్పార్, సుందరమూర్తి, తిరువన ఉక్కరసర్ అనే కవులు వ్రాసిన గేయాలను తేవారమ్ అని అంటారు. మాణిక్య వాచకర్ రచించిన తిరువాచకం గూడా గొప్ప వేదాంత గ్రంధము. మామూలర్ అను కవి "తిరు మందిరం" అను శైవ పురాణాన్ని వ్రాశాడు. వీరేగాక "బట్టి సత్తార్, కారైకాల్, అమ్మియార్, కాదవర్ కోమ్ అనేవారు కూడా శివభక్తి సాహిత్యాన్ని వ్రాశారు.

**20.8.3 ఆళ్వారులు :** ఆళ్వారుల పాటలన్ని "నాయిలర్ ప్రబందం" అనే పేరుతో "నాదముని" అనే కవి క్రోడీకరించినాడు. ఇందు 4000 భక్తిగీతాలున్నవి. మహేంద్రవర్మ సమకాలీనుడైన "తిరుమలశాయి" "నామ్మగత్తిరువంది, అరుచ్ఛలద విరుత్తం" అను గీత గ్రంథాలను వ్రాశాడు.

## 20.9 పల్లవుల కళాసేవ :

అన్నిటికన్నా చెప్పుకోవలసినది దక్షిణ దేశపు శిల్పకళకు పల్లవులు చేసిన సేవ, విలువ కట్టలేనిది. దాక్షిణాత్య శిల్పకళ అంటేనే పల్లవులు అని చరిత్రకారులు అంటారు. ముఖ్యంగా డా॥ స్మిత్, దక్షిణ ప్రాంత దేశపు వాస్తుకళ పల్లవులతోనే ప్రారంభం అయినదని

వ్యాఖ్యానించాడు. భారతీయ శిల్ప రీతులలో పల్లవ సాంప్రదాయం మనోహరమైనదిగా ప్రసిద్ధి చెందినది. పల్లవులు ప్రారంభించిన ద్రావిడ శిల్పకళ మహోన్నత రీతులలో జగత్ ప్రసిద్ధి చెందినది. కనుక దక్షిణ దేశపు హిందూ శిల్పకళకు పల్లవులే మూలపురుషులు. వీరే హిందూ దేవాలయాల నిర్మాణాన్ని ప్రారంభించారు. వారి కాలంలో దేవాలయ నిర్మాణానికి సంబంధించిన అన్ని వాస్తు లక్షణాలు అనగా గర్భగృహం, మండపం, గోపురం, ప్రాకారం మొదలైనవి నిర్దిష్టమైన రూపాన్ని సంతరించుకున్నవి.

**20.9.1 గుహాలయాలు :** మొదటి మహేంద్ర వర్మ వళ్ళెం, దళవనూరు, పల్లవరం, మహాబలిపురం మొదలైన చోట్ల కొండలలో గుహాలయాలను తొలిపించాడు. వీటిలో వరాహదుర్గ, త్రిమూర్తి గుహలు, ముఖ్యమైనవి. మొదటి నరసింహ వర్మ మహాబలిపురంలోని మహిషాసురమర్దిని, ధర్మరాజు, శివుడు, త్రిమూర్తి, దుర్గ వరాహమూర్తులకు దాదాపు 10 గుహాలయాలను తొలిపించాడు. ఈ గుహాలయాలన్నీ అష్టముఖస్థంబాలతో ద్వార పాలక శిల్పాలతో మనోహరంగా ఉంటాయి. మరియు నరసింహవర్మ మహాబలిపురంలో ఏకశిలా రథాలను నిర్మించి వాటిని పంచపాండవులకు, గణేషునకు కౌరవులకు అంకితం చేశాడు.

**20.9.2. దేవాలయాలు :** రెండవ నరసింహవర్మ మహాబలిపురంలో సముద్రతీరాన శివవిష్ణువులిద్దరికి ఒక దేవాలయాన్ని నిర్మించినాడు. దీనినే తీర దేవాలయం అని అంటారు. హిందూ వాస్తుకళకు రూపాంతరం తీర దేవాలయం అయితే దానికి పూర్తి రూపు రేఖలు దిద్దినది కంచిలోని కైలాస నాథాలయం. దీనిని నిర్మించినవాడు రాజసింహుడు నందివర్మ అపరాజిత వర్మలు కంచిలోని వరదరాజు స్వామి దేవాలయం, వైకుంఠ పెరుమాళ్ళు ఆలయాలను కట్టించారు. పల్లవులు కంచిలో అనేక దేవాలయాలు నిర్మించారు. వాటిలో కంచికామాక్షి దేవాలయం సుబ్రమణ్యేశ్వర ఆలయం, ఆది వరాహపు ఆలయం, ముక్తేశ్వర, మాతంగేశ్వర, ఏకేశ్వర, ఐరావతేపుర ఆలయాలు ముఖ్యమైనవి.

**20.9.3. శిల్పం :** పల్లవుల దేవాలయ నిర్మాణంతోపాటు సుందరమైన విగ్రహాలు తయారు చేయించి చక్కని శిల్పకళను గూడా గంగావతరణం లేక అభివృద్ధి చేశారు. పల్లవుల శిల్పాలన్నింటిలోకి ప్రసిద్ధి చెందినది మహాబలిపురంలోని హిందూ వాస్తుకళకు రూపాంతరం తీర దేవాలయం అయితే దానికి పూర్తి రూపు రేఖలు దిద్దినది అర్జునుని తపస్సు శిల్పం. ఇంకా మహాబలిపురంలో గుహాలయాల్లో మలచిన మహిషాసురమర్దిని దుర్గ వరాహమూర్తి, గజ వాహనావతారం, గోవర్ధన గిరిధారి, విష్ణువు, శివుడు, మొదలైన విగ్రహాలు మనోహరంగా చెక్కబడినవి.

**20.9.4 చిత్రలేఖనం :** చిత్రకళను కూడా పల్లవులు చక్కగా వృద్ధి చేశారు. అజంతా ఎల్లోరా వర్ణ చిత్రాల మార్గంలోనే పల్లవుల చిత్రకళ కూడా సాగిపోయింది. మొదటి మహేంద్రవర్మకు చిత్ర లేఖనంలో చక్కని ప్రవేశమున్నది. అతడు దక్షిణ చిత్రం అనే గ్రంథాన్ని రచించి 'చిత్రకారప్రతి' అనే బిరుదును పొందాడు. మామల్లపురంలో ఆదివరాహగుహలో మామందూరు గుహలలో వీరి కాలంనాటి రంగుల చిత్రాలున్నాయి. కంచిలోని కైలాస నాథ వైకుంఠ పెరుమాళ్ దేవాలయాలలోను వర్ణచిత్రాలు, పానమలైలోని తలిగేశ్వరుని ఆలయంలో నాట్యం చేయు శివుడు ఆ నాట్యాన్ని తిలకించే పార్వతి మనోహరంగా చిత్రించబడినవి. ఇవన్నీ పల్లవ చిత్రకళా కౌశల్యాన్ని నిరూపించుచున్నవి.

**20.9.5 విదేశాలకు వ్యాప్తి :** ఇట్టి మహోన్నత లక్షణాలుగల పల్లవ శిల్పకళ హిందూశైలి అచిరకాలంలోనే ఆగ్నేయాసియాలోని మలయా, ఇండోనేషియా, కంబోడియా మొ॥ విదేశాలలోనికి వ్యాప్తి చెందినది. కంబోడియాలోని అంగకుర్ వాట్ జావా ద్వీపములోని బొరాబదూర్ పల్లవ వాస్తుశిల్పకళ ఆనవాళ్ళుకన్పడును. కనుకనే డా॥ స్మిత్ పెర్సిబ్రెన్, గ్రూసే, నీలకంఠ శాస్త్రులు, పల్లవ శిల్పకళను ఘనంగా శ్లాఘించారు.

## 20.10. సారాంశము

నవీన పల్లవులలో మహేంద్రవర్మ, మొదట నరసింహవర్మ, రెండవ మహేంద్రవర్మ సుప్రసిద్ధులు వీరికాలంలో పల్లవులు సువిశాల సామ్రాజ్యం స్థాపించగలిగారు. కాని దంతి వర్మకాలం నుండి పల్లవ రాజ్యపతనం అయినది. వీరి పాలనలో రాజ్యాన్ని నగరాలు, గ్రామాలుగా విభజించారు. రాజు సర్వాధికారి. సలహా ఇవ్వటానికి మంత్రి పరిషత్ ఉండేది. ఆదాయం కోసం 18 రకాల పన్నులు వసూలు చేసేవారు. విదేశీ వ్యాపారం సంబంధాలు ఉండేవి. అన్ని మతాల వారిని ఆదరించారు. కవులను, పండితులను పోషించారు శిల్పకళకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినారు అని స్మిత్ రచనలలో తెలుస్తుంది.

## 20.11 మాదిరి ప్రశ్నలు

1. కడపటి పల్లవుల గూర్చి వ్రాయుము?
2. పల్లవుల పరిపాలనా విధానం, సాంఘీక, ఆర్థిక పరిస్థితుల గూర్చి తెలుపుము?
3. పల్లవుల కళాసేవను తెలుపుము?

**సంక్షిప్త ప్రశ్నలు :**

1. భక్తి ఉద్యమ కారుల గూర్చి వ్రాయుము?
2. మొదటి నరసింహ వర్మ గూర్చి వ్రాయుము?
3. రెండవ మహేంద్రవర్మ గురించి తెలుపుము?
4. రెండవ నరసింహవర్మ గురించి వ్రాయుము?

**డా॥ యమ్. హనుమంతరావు**

ఖండిక - 5

పాఠం - 21

# పుష్యభూతి వంశము - హర్షవర్ధనుడు

## 2.1 లక్ష్యం

పుష్యభూతి వంశ స్థాపన, హర్షుని చరిత్ర, అతని దండయాత్రలు, భౌద్ధమత వ్యాప్తి, పరిపాలనా పద్ధతులు మొదలగు విషయాలు వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం


21.1 ఉపోద్ఘాతము

21.2 స్థానేశ్వర రాజ్యం - పుష్యభూతి వంశం

21.3 ప్రభాకర వర్ధనుడు

21.4 రాజ్యవర్ధనుడు

21.5 హర్షవర్ధనుడు

21.6 సారాంశం

21.7 మాదిరి ప్రశ్నలు


## 21.1 ఉపోద్ఘాతము:

గుప్త సామ్రాజ్య పతనానంతరం ఉత్తరదేశం రాజకీయ ఐక్యతను కోల్పోయింది. వారి సామంతులు ఎక్కడి వారక్కడే స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటు చేసుకొన్నారు. రాజస్థానంలో ఘార్జరులు, కచ్చేలోమరి యొక ఘూర్జర వంశం, గుజరాత్‌లో మైత్రకులు, మాళవలో యశోవర్మన్, మగధలో అనంతర గుప్తులు, కనోజ్‌లో మౌఖరులు స్వతంత్ర రాజ్యాలేర్పాటు చేసుకొన్నారు. బెంగాలులో గోప చంద్రుడు, ధర్మాదిత్యుడు, సమాచార దేవుడు అను రాజులు స్వతంత్ర రాజ్యం స్థాపించారు. వారి తరువాత శశాంకుడు బెంగాలు రాజయ్యాడు. ఈ విధంగా వివిధ స్వతంత్ర రాజ్యాలు తలయెత్తి హర్షుడు వచ్చేవరకు ఉత్తర భారత దేశం రాజకీయ ఐక్యతకు నోచుకోలేదు.

## 21.2 స్థానేశ్వర రాజ్యం - పుష్యభూతి వంశం :-

గుప్త సామ్రాజ్య పతనానంతరం స్థానేశ్వర రాజ్యాన్ని పుష్యభూతి వంశస్తులు పాలించారు. ఈ వంశానికి మూలపురుషుడు పుష్యభూతి గనుక దానికి పుష్యభూతి వంశం అనిపేరు వచ్చిందని బాణుడు హర్ష చరిత్రలో వ్రాశాడు. ఈ వంశస్తులు మొదట కన్యాకుబ్జాన్ని పాలించిన మౌఖరి వంశస్తులకు సామంతులు. వీరి రాజ్యం పంజాబు తూర్పు ప్రాంతంలో సరస్వతి నది ఒడ్డున ఉన్న చిన్న రాజ్యం. దానికి రాజధాని స్థానేశ్వరం కనుక దానికి స్థానేశ్వర రాజ్యం అని పేరు వచ్చింది.

## 21.3 ప్రభాకర వర్ధనుడు

ఈ వంశంలో మూడవ వాడైన ఆదిత్యవర్ధనుడు మాళ్వను పాలించు మలిగుప్తరాజవంశానికి చెందిన మహేశ్వరగుప్తుని సోదరి మహాసేనగుప్తను వివాహమాడాడు. అప్పటినుండి ఈ వంశానికి రాజకీయ ప్రాముఖ్యత ఏర్పడింది. ఆ దంపతుల కుమారుడు ప్రభాకర

వర్ధనుడు. ఇతడే నిజమైన పుష్యభూతి రాజ్యస్థాపకుడు. ఇతడు గొప్ప పరాక్రమ వంతుడు. అతడే ఈ వంశంలో మొట్ట మొదటి స్వతంత్ర ప్రతిపత్తి గల్గిన స్వతంత్ర రాజు. అతని భార్య యశోమతీదేవి. ఇతని కాలంలో హూణుల దండయాత్రల వల్ల దేశం అల్లకల్లోల మగుచున్నది కనుక అతడు హూణులపై దండెత్తి అనేక పర్యాయాలు ఓడించి వారిని తరిమాడు కనుక అతనికి హూణుల లేడికి సింహం వంటివాడని భాణుని హర్షచరిత్రలో కీర్తింపబడ్డాడు. అతనికి రాజ్యవర్ధనుడు, హర్షవర్ధనుడు, కృష్ణుడు అనుముగ్గురు కుమారులు. రాజ్యశ్రీ అను కుమార్తె గలదు. ఇతడు తన కుమార్తె రాజశ్రీని కనోజ్‌నేలు గృహవర్మకు ఇచ్చి వివాహం చేశాడు. ఇతని చివరి కాలంలో అనగా 7వ శతాబ్దం తొలి సం॥లలో హూణులు ఇతని రాజ్యంపై దండెత్తగా తన పెద్దకుమారుడు రాజ్యవర్ధనుడు పెద్ద సైన్యంతో వారిపై దండెత్తాడు. అతనికి తోడుగా హర్షుడు అశ్వదళంతో బయలుదేరాడు. కాని మార్గం మధ్యలోతండ్రి జబ్బున పడ్డాడని తెలిసి వెనుకకు వచ్చాడు. రాజ్యవర్ధనుడు యుద్ధం కొనసాగించి హూణులను ఓడించి తిరిగి వచ్చునప్పటికే తండ్రి ప్రభాకరవర్ధనుడు మరణించాడు.

## 21.4 రాజ్యవర్ధనుడు క్రీ.శ. 605 :-

ప్రభాకరవర్ధనుని వారసునిగా రాజ్యవర్ధనుడు క్రీ.శ 605 లో పట్టాభిషేకం చేసుకున్నాడు. ప్రభాకరవర్ధనుడు మాళవగుప్తులకు శత్రువులైన మౌఖరి వంశానికి చెందిన గృహవర్మకు తన కుమార్తె రాజ్యశ్రీని వివాహం చేసినందుకు మాళవ దేవగుప్తుడు స్థానేశ్వర పుష్యభూతి వంశంపై విరోధం పెంచుకున్నాడు. ప్రభాకర వర్ధనుడు మరణించిన సమయంలో అనుకూలంగా వుంటుందని దేవగుప్తుడు శశాంకుని కలుపుకొని కనోజ్‌పై దండెత్తి గృహవర్మను సంహరించి రాజ్యశ్రీని చెరపట్టి మాళవకు తీసుకొనిపోయాడు. ఆ వార్త తెలియగానే రాజ్యవర్ధనుడు మాళవపై దండెత్తి దేవగుప్తుని ఓడించాడు. శశాంకుడు సంధి షరతులు మాట్లాడటానికని రాజ్యవర్ధనుని ఆహ్వానించి మాయోపాయంతో రాజ్యవర్ధనుని సంహరించాడు. ఆ విధంగా రాజ్యవర్ధనుని జీవితం ముగిసింది. ఆ వార్త తెలియగానే స్థానేశ్వరంలో హర్షుడు 16 సం॥ల వయసులో తనకు యిష్టం లేకపోయినా క్రీ.శ 606 లో రాజ్యభారం స్వీకరించాడు.

## 21.5 హర్షవర్ధనుడు-క్రీ.శ. 606-647

ప్రాచీన భారతదేశ చక్రవర్తులలో హర్షుడు చివరివాడు. అతనితో భారతదేశ చరిత్రలో ప్రాచీన యుగం ముగిసిందని చరిత్రకారులు భావిస్తారు. హర్షుడు గొప్పవిజేత. గుప్త సామ్రాజ్యపతనం తరువాత అనేక దిగ్విజయాల ద్వారా ఉత్తర దేశాన్నంతటిని జయించి గొప్పసామ్రాజ్యాన్ని సాధించి చివరిసారిగా ఉత్తరదేశానికి రాజకీయ ఐక్యతను సాధించాడు. ఇతడు గొప్ప సామ్రాజ్య నిర్మాతయేగాక గొప్పకవి. పండిత పోషకుడు, కళాపోషకుడు, గొప్ప దానశీలి. చరిత్రలో హర్షుని వంటి దానశీలి లేడని కీర్తి పొందాడు. బౌద్ధమతానికి సేవచేశాడు. భారత చక్రవర్తులలో బౌద్ధమతాన్ని ఆదరించిన చివరి చక్రవర్తి గూడా ఇతడే. ఉదార పరిపాలకుడు. ప్రజల క్షేమం కొరకు అహర్నిశలు కృషి చేశాడు. ప్రజా రంజకంగా పాలించిన గొప్ప పరిపాలకుడు అతడు అశోకుడు, సముద్ర గుప్తునితో పోల్చదగిన వాడని చరిత్రకారులు శ్లాఘించారు. హర్షుని చరిత్ర తెలుసుకోడానికి చాలా ఆధారాలున్నాయి.

### 21.5.1 హర్షుని చరిత్రకు ఆధారాలు

క్రీ.శ. 5 వ శతాబ్దం నుండి 8 వ శతాబ్దం వరకు ఉత్తర భారతదేశ చరిత్రను సంధి యుగం అని చెప్పవచ్చును. ఈ యుగం నాటి చరిత్ర తెలుసుకోడానికి అనేక శాసనాలు లభ్యమవుతున్నాయి. ఈ శాసనాల ఆధారంతో ఆనాటి సాంఘిక ఆర్థిక పరిస్థితులు తెలుసుకోవడానికి వీలగుచున్నది. హర్షుని కాలానికి చెందిన బన్సిఖేరా, మధుబన్ శాసనాలు హర్షుని రాజ్య ఆరంభ కాలం నాటి పరిస్థితులు తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. హర్షుని సమకాలీన రాజుల శాసనాలు గూడా ఆ కాలం నాటి రాజకీయ పరిస్థితులను తెల్పుచున్నాయి. శాసనాలే గాక హర్షుడు విడుదల చేసిన అనేక నాణేలు గూడా లభించాయి. వీటిలో వెండి నాణేలు ఎక్కువగా వున్నాయి. ఆ నాణేల మీద ఒక వైపు గుర్రపు స్వారీ చేస్తున్న రౌతు దానిక్రింద హర్షదేవ్ అనే ఆఖ్య రెండవ వైపున దేవి విగ్రహం ముద్రించివున్నాయి. ఈ నాణేలు గుప్తుని నాణేలను పోలివున్నాయి. హర్షుని నాణేలే గాక సమకాలీన రాజుల నాణేలు గూడా లభించాయి.

శాసనాలు, నాణేలేగాక ఈ కాలం నాటి అనేక కావ్యాలు, సాహిత్యగ్రంధాలు, ధర్మశాస్త్రాలు ఆనాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, పరిస్థితులను తెలుసుకోడానికి ఉపయోగపడుతున్నాయి. యాజ్ఞవల్క్య స్మృతి ఆధారంగా వెలువడిన మరికొన్ని గ్రంధాలు గూడా ఉపయోగపడుతున్నాయి. వాటిలో కామందకుని నీతి శాస్త్రం, వాత్స్యాయన దేవళాస్మృతులు ముఖ్యమైనవి. వాటిద్వారా ఆనాటి దండ నీతి పరిపాలనా వ్యవస్థలను తెలుసుకొవచ్చును. దండి వ్రాసిన దశకుమార చరిత్ర, హర్షుడు వ్రాసిన నాగానందం, రత్నావళి, ప్రియదర్శిక బాణుడు వ్రాసిన కాదంబరి, హర్షుని చరిత్రను వ్యక్తంగా తెలపకపోయినా నాటిసాంఘిక ఆర్ధిక పరిస్థతులను వివరిస్తున్నాయి. బాణుడు వ్రాసిన హర్షచరిత్ర హర్షుని బాల్యం అతడు తన చెల్లెలు రాజ్యశ్రీని కాపాడిన విషయాన్ని ఇతివృత్తంగా తీసుకొని నాటక ప్రక్రియలో వ్రాయబడింది. ఈ గ్రంధంలో మొత్తం 8 అధ్యాయాలున్నాయి. అది హర్షుని కాలంనాటి రాజకీయ మతసాంఘిక ఆర్ధిక పరిస్దితులను తెలుపుతుంది. హర్షుని జీవిత చరిత్రకు ప్రధాన ఆధారం హ్యుయాన్ సాంగ్ వ్రాసిన సి,యు. కి గ్రంధం. ఈ గ్రంథం హర్షుని చరిత్ర విజయాలు అతడు చేసిన దానాలు, తెల్పుటయేగాక ఆ కాలం నాటి మొత్తం దేశపు రాజకీయ, సాంఘిక, మత, ఆర్థిక సాంస్కృతిక అంశాలను తెలుపుతుంది. హ్యుయాన్‌సాంగ్ క్రీ.శ. 630 నుండి 644 వరకు దాదాపు 14 సం॥లు దేశంలో వున్నాడు. తాను తెలుసుకున్న విషయాలన్ని సి.యు.కిలో వ్రాశాడు. అతని గ్రంధాన్ని రికార్డ్ ఆఫ్ కంట్రీస్ అని అంటారు. అతని రచనలు ఆ కాలం నాటి చరిత్రకు చాలా ప్రామాణికం అని అందరూ అంగీకరిస్తారు. హర్షుడు విడుదలచేసిన బన్సీఖేరా శాసనం క్రీ.శ. 628 లో వేయించబడింది, ఈ శాసనంలో ఒక ప్రత్యేకతవున్నది. ఈ శాసనంలో హర్షుని సంతకం వున్నది, ఈ శాసనం వలన హర్షుడు శాసన రచయిత అని గూడా స్పష్టపడుచున్నది. క్రీ.శ. 631 లో విడుదల చేయబడిన మధుబన్ శాసనం నాల్గుతరాల హర్షవర్ధనుని వంశవృక్షం గూర్చి తెలుపుతుంది. సోనేపేట్ శాసనం హర్షునుని గుణ గణాల గురించి తెల్పుచున్నది. చాళుక్య రాజైన రెండవ పులకేసి ఐహోలు శాసనం హర్షుని దక్షిణ దేశ దండయాత్రను, అతని ఓటమిని తెల్పుచున్నది.

### 21.5.2. హర్షవర్ధనుని బాల్యం:-

హర్షవర్ధనుడు పుష్యభూతివంశస్తుడు.ప్రభాకరవర్దనుడు. యశోమతిదేవి దంపతుల కుమారుడు. అతడు క్రీ.శ. 590 లో జన్మించాడు. ప్రభాకరవర్దనుడు అతని పెద్దకుమారుడు రాజ్యవర్ధనునితో పాటు హర్షవర్ధనునికీ చిన్నతనం నుండే అన్ని రాజోచిత విద్యలు నేర్పాడు. హర్షుడు చిన్నతనంనుండే గొప్ప జిజ్ఞాసి. అతడు సర్వశాస్త్రాలు చదివాడు. తరువాత గొప్ప కవిగా రూపోందాడు. చిన్నతనం నుండే గొప్ప ఉదారుడని అన్ని విద్యలు అభ్యసించాడని బాణుడు హర్షచరిత్రలో వ్రాశాడు. ప్రభాకరవర్ధనుని చివరికాలంలో హూణులు వారి రాజ్యంపై దండెత్తారు. వారిని ఎదుర్కోటానికి ప్రభాకరవర్ధనుడు తన కుమారులను సైన్యాలతో పంపాడు. ముందు రాజ్యవర్ధనుడు పెద్ద సైన్యంతో తరలి వెళ్ళాడు. రాజ్యవర్ధనుడు యుద్దం సాగించి హూణులను ఓడించి తిరిగొచ్చాడు. రాజ్యవర్ధనుడు రాకముందే ప్రభాకరవర్ధనుడు మరణించాడు. హూణులను జయించి వచ్చిన రాజ్యవర్ధనుడు క్రీ.శ 605లో పట్టాభిషేకం చేసుకున్నాడు.అదే సమయంలోనే మాళవను ఏలుచున్న దేవగుప్తుడు కన్యాకుబ్జంపై దండెత్తి గృహవర్మను వధించి రాజశ్రీని చెరపట్టాడు. అప్పుడే సింహాసనాన్ని అధిష్టించిన రాజ్యవర్ధనుడు ఆ వార్త విని చెల్లెలిను రక్షించుకోవడానికి మాళవపై దండెత్తాడు. మాళవ సైన్యాలను సులభంగానే ఓడించాడు. కాని దేవగుప్తుని మిత్రుడు గౌడ రాజయిన శశాంకుడు, దేవగుప్తునికి సహాయంగా వచ్చి రాజ్యవర్ధనుని పరాక్రమం చూసి యుద్ధంతో లాభం లేదనుకొని గ్రహించి సంధి పేరుతో తన గుడారానికి రాజ్యవర్ధనుని రప్పించుకుని కుతంత్రముతో వధించాడు.

### 21.5.3. హర్షుని పట్టాభిషేకము:

అట్టి పరిస్థితుల్లో హర్షుడు తన 16వ ఏట క్రీ.శ 606. లో సింహాసనంను అధిష్టించాడు. రాజ్యమునకు రాగానే అనేక కర్తవ్యాలు నెత్తిన పడ్డాయి. 1.తన సోదరి రాజశ్రీని రక్షించుకొనుట 2. తన సోదరి రాజ్యమైన కనూజ్‌ను రక్షించుట 3. తన అన్నను వధించిన శశాంకుని పై తన బావ అయిన గృహవర్మను వధించి రాజశ్రీని బంధించిన దేవగుప్తుని పైన పగ సాధించుట. ఇవి తన తక్షణ కర్తవ్యాలు అయ్యెను. కనుక అతడు తక్షణమే తన సేనలతో మాళవపై దండెత్తాడు. కాని రాజశ్రీ చెరనుండి తప్పించుకుని వింధ్యారణ్యములకు పారిపోయినదని తెలిసి

వెంటనే వింధ్యలోప్రవేశించి, చితిపై ఆత్మాహుతి చేసుకోబోతున్న చెల్లిని రక్షించుకున్నాడు, తరువాత తన శత్రువులను దెబ్బతీయుటకు శశాంకుని శత్రువైన కామరూప రాజు భాస్కర వర్మతో సంధి చేసుకుని, దేవగుప్తుని సోదరుడైన మాధవగుప్తుని రాజుగా చేసేదనని, తన వైపుకు త్రిప్పుకుని, యుద్ధ ప్రయత్నం చేసాడు.దానితో శశాంక, దేవగుప్తులు కన్యాకుబ్జం రాజ్యంనుండి వెడలిపోయారు. అందువలన కన్యాకుబ్జ మంత్రులు హర్షుని సింహాసనం అధిష్టించవలసినదిగా కోరగా హర్షుడు కన్యాకుబ్జంనకు రాజధానిని మార్చుకుని, శీలాధిత్యుడు అని బిరుదుతో పట్టాభిషిక్తుడయ్యాడు. నాటి నుండి చరిత్రలో కన్యాకుబ్జమునకు రాజకీయ ప్రాముఖ్యత కలిగింది. చైనా గ్రంధాలు కన్యాకుబ్జమును హర్షుడు అతని చెల్లెలు రాజశ్రీ కలసి పాలించారని తెలుపుతున్నాయి.

### 21.5.4. దండయాత్ర:

హర్షుడు తన అధికారం స్థిరపరుచుకున్న తరువాత శత్రువులను పారద్రోలునంత వరకు విశ్రాంతి తీసుకోనని ప్రతిజ్ఞ చేసి గొప్పసేనను సమకూర్చుకుని 6 సం॥లు ఎడతెగని యుద్ధ చేసాడని 'బాణుడు' హర్షచరిత్రలో వర్ణించాడు. హర్షుడు దిగ్విజయ యాత్రలు చేసి 5 ప్రాంతాలను జయించాడని హ్యుయాన్‌త్సాంగ్ రాసాడు. కాని ఈ 6 సం॥లలో ఏ దేశాలపైదండెత్తి, ఏ రాజులను ఓడించాడు? శశాంక, దేవగుప్తులను సాధించాడా?, మొదలయిన వివరాలను బాణుడు కాని, హ్యుయాన్‌త్సాంగ్ వ్రాయలేదు. అందువలన ఇతని విజయములను గురించి చరిత్రకారులలో సందేహాలు ఏర్పడ్డాయి. అయినను ఇతడు కొన్ని ప్రాంతాలను జయించినట్లుగా భావించేవారు. 1.ఇతడు మాళవ పై దండెత్తి దేవగుప్తుని ఓడించి. అతని తమ్ముడయిన మాధవగుప్తుని రాజుగా చేసి తన సామంతునిగా చేసుకున్నాడని కొందరు అంగీకరించారు. 2. గుజరాత్ పై దండెత్తి నాటి వల్లభిరాజు అయిన ధృవసేనుని ఓడించి గుజరాత్‌పై తన సార్వభౌమత్వాన్ని నెలకొల్పాడని అనేకమంది చరిత్రకారులు భావించారు. కాని ఈ యుద్ధంలో హర్షుడు ఓడిపోయి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేసుకుని సంధి చేకున్నాడని ఆర్.సి. మజుందార్ గారు వాదించారు. 3. శశాంకునితో యుద్ధము చేసినట్లు ఎక్కడా కనిపించదు. శశాంకుని గంజాం శాసనము ప్రకారం అతడు క్రీ.శ. 619 వరకు బీహారు, బెంగాలు, ఒరిస్సా ప్రాంతాలను మహారాజాధిరాజు అన్న బిరుదుతో పాలించినట్లు తెలుస్తున్నది. హ్యుయాన్‌త్సాంగ్ తాను బుద్ధగయను దర్శించడానికి ఒక సం॥ ముందు అచటి బోధి వృక్షాన్ని శశాంకుడు నరికించాడని వ్రాసాడు. కనుక ఇతడు శశాంకుని మరణాంతరం మాత్రమే బీహారు. బెంగాల్, ఒరిస్సాలను జయించాడని ఆర్.సి. మజుందార్ వాదించారు. ఒరిస్సాలోని కాంగోజ్ ప్రాంతమును ఇతడు జయించినట్లు మాత్రం ఆధారాలున్నవి. కాంగోడను క్రీ.శ. 642లో జయించాడు. జయించిన తరువాత అచట అతడు ఎన్నో దానాలు చేసి శాసనాలు విడుదల చేసాడు. 4. హర్షుడు సింధుపై దండెత్తి జయించాడని బాణుని హర్షచరిత్ర వివరిస్తున్నది. కాని సింధు స్వతంత్ర్య రాజ్యము అని హ్యుయాన్‌త్సాంగ్ వ్రాసాడు. 5. ఇతడు నేపాల్, కాశ్మీర్‌లను జయించినట్లు డా॥స్మిత్ భావించాడు. కాని ఎంత వరకు నిజమో తెలియదు. సిల్ వైనిలెవి ఈ కాలంలో నేపాల్ హర్షుని రాజ్యంలో లేదని టిబెట్ ఆధిపత్యం క్రింద ఉన్నదని చెప్పాడు. విజయాలు ఏమయినప్పటికి అతడు అనేక దండయాత్రలు చేసాడు.

### 21.5.4.1 దక్షిణ దేశ దండయాత్ర :

ఉత్తర దేశంలో ఇతని సామ్రాజ్యం విస్తరించుకున్న తరువాత దక్షిణ దేశాన్ని జయించ వలెనని పెద్ద సేనతో దక్షిణాదిపై దండెత్తాడు. కాని నాడు దక్షిణ దేశాన్ని ఏలుచున్న చాళుక్యరాజు అయిన రెండవ పులకేశి ఇతనిని నర్మదానది వద్ద ఓడించి తరిమాడు. ఈ యుద్ధంలో భయ విహ్వాలుడై హర్షుడు తన సేనలతో కనోజ్‌కు పారిపోయాడని ఐహోలు శాసనం లో వివరించబడినది. ఈ యుద్ధం క్రీ.శ. 630-634 సం॥ల మధ్య జరిగి ఉండవచ్చని పలువురి చరిత్రకారుల అభిప్రాయం. నీలకంఠశాస్త్రి ఈ యుద్ధం క్రీ.శ. 612లో జరిగినదని భావించాడు.

### 21.5.4.2. సామ్రాజ్య విస్తరణ :

ఇట్టి అనుమానాస్పద విజయములతో హర్షుని సామ్రాజ్యం ఎంత వరకు విస్తరించిందో చెప్పుట కష్టము. ఇతని సామ్రాజ్యములో పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్, ఒరిస్సా, మాళ్వ, గుజరాత్, బుందేల్‌ఖండ్ లు లేవని ఇతని రాజ్యము యమునానది దాటి దక్షిణానికి

విస్తరించలేదని డా॥ ఆర్.సి. మజుందార్ అభిప్రాయపడ్డారు. కాని ఇతర చరిత్రకారులు అతడు ఉత్తరదేశమంతా జయించాడని అతని రాజ్యం ఉత్తరాన హిమాలయాలనుండి దక్షిణాన నర్మదానది వరకు విస్తరించిందని భావించారు. నర్మదానది వరకు అతని సామ్రాజ్యం విస్తరించకపోతే దక్షిణదేశంపై దండెత్తడం సాధ్యం కాదని వివరించారు. అంతేగాక పులకేసి ఐహోలు శాసనంలో హర్షుని సకలోత్తర దేశాధిపతి అని పేర్కొనబడింది. హర్షుడు తాను చేసిన యుద్ధాలకంటే చేసిన దాన ధర్మాల వలన పాండిత్య ప్రతిభ వలన ఎక్కువ కీర్తి ప్రతిష్టలు పొందాడు.

### 21.5.5 హర్షుని బౌద్ధ మత సేవ :

హర్షుడు మొదటిలో శైవ మతారాధకుడు. సూర్యుని కూడా ఆరాధించెడివాడు. బెన్స్‌ఖేడ్, మధుబన్ శాసనాలలో హర్షుడు పరమ మహేశ్వరునిగా వర్ణింపబడినాడు. కాని తరువాత అతడు బౌద్ధ మతాన్ని ఆదరించి అనేక విధములుగా బౌద్ధమత సేవ చేసాడు, బౌద్ధమతం స్వీకరించిన తరువాత అతడు బౌద్ధ ఆచార్యులను పిలిపించి తాత్విక చర్చలు జరిపేవాడని హ్యుయాన్‌త్సాంగ్ వ్రాశాడు. హర్షుడు బౌద్ధ మతమును పుచ్చుకున్న తరువాత తన రాజ్యంలో జంతువధను నిషేధించాడు. తాను మాంసాహారాన్ని వదిలివేసాడు. ప్రజలను మాంసాహారము వదిలివేయమని కోరాడు కాశ్మీరు రాజు వద్దనుండి బుద్ధుని ధాతువును సంపాదించి ఒక స్థూపమును కట్టించాడు. ఇంకా ఎన్నో బౌద్ధ విహారాలను, స్థూపములను అనేక ప్రాంతములలో నిర్మించాడు, పాత వాటికి మరమ్మత్తులు చేయించాడు.

### 21.5.5.1 కనోజ్ సభ :

హ్యుయాన్‌త్సాంగ్ రాకను పురస్కరించుకుని, బౌద్ధమత చర్చలు జరపటానికి అతడు క్రీ.శ. 643లో కనోజ్ లో హ్యుయాన్‌త్సాంగు అధ్యక్షతలో ఒక పెద్ద బౌద్ధ మహాసభను జరిపాడు. ఈ సభకు 3వేల మంది సన్యాసులు, 3వేల మహాయాన ,హీనయానులు, 1000 మంది నలందా పండితులు, బౌద్ధ పండితులతో పాటు అనేకమంది రాజులు కూడా హాజరయినారు. ఈ సభా కార్యకలాపాలు 23 రోజులు జరిగాయి ఈ సందర్భంలో గంగానది ఒడ్డున నూరు అడుగుల గోపురం కట్టించి, రత్నాలతో పొదగబడిన నిలువెత్తు బుద్ధుని బంగారు విగ్రహం ప్రతిష్టించాడు. దానితో పాటు 36 అడుగుల ఉత్సవ విగ్రహంను కూడా తయారు చేయించి, రోజుకు 20 మంది రాజులు,3000 ఏనుగులతో ఊరేగింపు జరిపాడు. ఈ విధంగా బౌద్ధ మత సేవ చేసాడు. ఈ సభ వలన బౌద్ధమత ప్రాశస్త్యం ప్రపంచానికి మరియొకసారి వెల్లడయింది. బౌద్ధ మతమునకు సేవ చేసినప్పటికి, అతడు ఇతర మతములను చిన్నచూపు చూడక, జైనులకు, బ్రాహ్మణులకు ధాన ధర్మములు చేసి ఆదరించాడు. తాను బుద్ధునితో పాటు శివుని, సూర్యుని కూడా ఆరాధించాడు.

### 21.5.5.2 ప్రయాగ సభలు-దానశీలత

హర్షుడు గొప్ప దానకర్ణుడుగా ప్రసిద్ధి చెందాడు. ఇతడు ప్రయాగలో ప్రతి 5సం॥లకు ఒకసారి మోక్ష పరిషత్తును జరిపి తన రాజ్య ఖజానాలో ఉన్న ధనాన్ని అంతటిని దానం చేసేవాడట. ఈ పరిషత్తులో మొదట సూర్య, శివ, బౌద్ధ విగ్రహాలను పూజించిన తరువాత తన దుస్తులతో సహా సర్వం దానం చేసేవాడట. ఇటువంటి పరిషత్తులు హర్షుని కాలంలో ఆరు జరిగినట్లు, తాను చివరి సభను చూసినట్లు హ్యుయాన్‌త్సాంగ్ తన గ్రంధంలో వ్రాశాడు. అతడు ఎన్నో వైద్యశాలలు. అన్నదానసత్రాలు, వసతి గృహాలు, చలివేంద్రాలు నిర్మించాడని హ్యుయాన్‌త్సాంగ్ వ్రాశాడు. బాణుడు హర్షుని వ్యక్తిత్వాన్ని, గుణశీలాలను, దాన గుణాన్ని హర్షచరిత్రలో వర్ణించాడు. హర్షుడు, రాజ్యవర్ధనుడు ఇద్దరు ఎంతో అన్యోన్యంగా వుండేవారని హర్షుడు మొదటి నుండి దానశీలి అని తాను జైత్రయాత్రకు వెళ్ళేముందు 100 గ్రామాలకు వెయ్యి నాగళ్ళు బహూకరించారని, బ్రాహ్మణులకు గూడా దానాలు చేసి జైత్రయాత్ర ప్రారంభించాడని బాణుడు వ్రాశాడు.

### 21.5.6. హర్షుని సాహిత్యసేవ :

హర్షుడు దానకర్ణుడే కాక గొప్పకవి. సాహిత్యపోషకుడు. తాను స్వయంగా "నాగానందము" రత్నావళి" ప్రియదర్శక అని మూడు సంస్కృత నాటకములు రచించాడు. ఈ మూడు నాటకాలలో మూడు ప్రత్యేకతలు ఉన్నాయి. అతడు వ్రాసిన నాగానందములో వాచకానికి

సంగీతాన్ని మేళవింపచేశాడు. రత్నావళి నాటకంలోని మొదటి, చివరి పద్యాలలో వర్షాలు సకాలంలో పడేటట్లు చేసి పంటలను బాగా పండించి ప్రజలకు శుభాలు చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తాడు. బాణుడు వ్రాసిన "కాదంబరి" సంస్కృతి సాహిత్యాని కేకుమటం. ప్రపంచంలోని భావాలన్ని "కాదంబరి"లో కలవు అని బాణుడు సగర్వంగా చాటాడు. ఇతడు వ్రాసిన హర్షచరిత్ర భారతదేశ సాహిత్యంలో ప్రప్రధమంగా వ్రాయబడిన రాజుల చరిత్ర. ఇంకా సుభాషితాలు వ్రాసిన భర్తృహరి, సూర్యశతకం రచించిన మయూరుడు, దివాకరుడు, జయసేనుడు, మాతంగుడు, ఇతని ఆస్థాన కవులు, హర్షుడు తన ఆదాయంలో 1/4 వంతు పండితులకు ఖర్చు చేసేవాడు. బన్స్‌ఖేడ్ మధుబన్ శాసనాలలోని పద్యాలను హర్షుడే వ్రాశాడంటారు. అతడు గొప్పకవి. నాటక రచయితే కాక గొప్ప వైయాకరుణుడుగా పేరు తెచ్చుకున్నాడు.

### 21.5.7 నలందా విశ్వ విద్యాలయము :

బౌద్ధ వేదాంతాన్ని ప్రచారం చేయడానికిగాను కాశీ విశ్వవిద్యాలయమునకు పోటీగా బౌద్ధులు నలందలో ఒక విశ్వవిద్యాలయమును స్థాపించారు. హర్షుడు ఆ విశ్వవిద్యాలయమునకు నూరు గ్రామాలను దానంచేసి పోషించాడు. అందువలన బౌద్ధమత విద్య దేశం నలుమూలలకూ విస్తరించుటకు తోడ్పడినవాడయ్యాడు. హర్షుని కాలంలో నలంద విశ్వవిద్యాలయం ప్రపంచ ప్రఖ్యాతి చెందినది. నలంద అనగా (న-అలం-ద) ఇచ్చుటలో అంతులేకుండా విద్యాదానం చేయునది అని అర్థం. హర్షుని కాలంలో వచ్చిన హ్యుయాన్‌త్సాంగ్ ఈ విద్యాలయాన్ని దర్శించి అచట మూడు సం॥లు విద్యాభ్యాసం చేసి బౌద్ధ న్యాయశాస్త్రాన్ని పరిశీలించి దాని గురించి వివరంగా వ్రాశారు. అతడు అచటనున్న కాలంలో అచట విశేషాలను తన సి.యూ.కి. గ్రంధంలో పొందుపరచాడు. అవి ఏమన ఆనాడు నలంద మహాయాన శాఖకు చెందిన విద్యాలయంగా వుండేది. అచట 10 వేల మంది విద్యార్థులు 15 వందలమంది అధ్యాపకులు వున్నారు. వారిలో ధర్మపాలుడు, ఆర్యదేవుడు, దిఙ్నాగుడు, వసుబంధుడు, భద్రుడు ప్రపంచప్రఖ్యాతి గాంచిన ఆచార్యులు వారి వద్ద విద్యనభ్యసించటానికి మంగోలియా, చైనా, బర్మా, సింహళం మొదలగు అనేక దేశాల నుండి విద్యార్థులు వచ్చేవారు. అంతేగాక విదేశ రాజులు నలంద విద్యాలయ పోషణకు దానాలిచ్చెడివారు. అట్టి వారిలో సుమిత్రా దీవిని ఏలు రాజైన బలపుత్రదేవుడు ఒకడు. అతడు నలందలోని ఒక కళాశాలను నిర్మించాడు. నలందలో ఆరువిహారాలు, ఒక సంఘారామం, అనేక కొలనులు, వాని చుట్టూ పూదోటలతో ఎంతో రమణీయంగా వుండేవని హ్యుయన్‌త్సాంగ్ వ్రాశాడు. అనేక కళాశాల భవనాలు గోపురాలతో చాలా విశాలంగా వుండేవట. 9 అంతస్థుల భవనం అచట వున్నదని హ్యుయన్‌త్సాంగ్ వ్రాశాడు. ఇంకా అనేక కళాశాలలు అచట వుండేవని వ్రాశాడు. అంతేగాక నలందలో అనేక వేల గ్రంధాలతో ఒక పెద్ద గ్రంధాలయం వుండేదట. ఆ గ్రంధాలయానికి ధర్మాంగజ అని పేరుండేదట. అది మూడు పెద్ద భవనాలతో వుండేదని గూడా వ్రాశాడు. నలందలో ఒక ఘటికాయంత్రం వుండేదని దానిని చూసి ఆశ్చర్యపోయానని వ్రాశాడు. ఆనాడు నలంద విశ్వవిద్యాలయానికి శీల భద్రుడు అను పండితుడు ఆచార్యుడుగా వున్నాడని హ్యుయన్‌త్సాంగ్ పేర్కొన్నాడు. అచట విద్యార్థుల క్రమశిక్షణను హ్యుయన్‌త్సాంగ్ ప్రశంసించాడు.

### 21.5.8 చైనాతో దౌత్య సంబంధములు :

హ్యుయాన్‌త్సాంగ్ రాక వల్లనే చైనాతో హర్షునకు దౌత్య సంబంధములు ఏర్పడినవి. ఉభయులు రాయబారాలు పంపుకున్నారు. బౌద్ధ మత ఆదరణ వలననే చైనాతో స్నేహసంబంధాలు ఏర్పడ్డాయి. నాటి చైనా చక్రవర్తి 'లైత్సంగ్' హర్షుని ఆస్థానానికి మూడు రాయబారాలు పంపాడు. ఇతడు వాంగ్ వంశస్థుడు. హర్షుడు తన రాయబార వర్గాన్ని విలువైన కానుకలతో, బోధి వృక్షపు శాఖను చైనాకు పంపాడు. చైనా నుండి వచ్చిన రాయబార సభ్యులను హర్షుడు ఘనంగా ఆహ్వానించాడని చైనా వ్రాతలు తెల్పుచున్నాయి. హర్షుడు జీవించి ఉండగా రెండు రాయబారాలు వచ్చాయి. మూడవ రాయబార వర్గం క్రీ.శ. 648లో వాంగ్‌త్సాంగ్ నాయకత్వంలో వచ్చింది. అప్పటికే హర్షుడు మరణించాడు.

### 21.5.9. హర్షుని పరిపాలనా వ్యవస్థ :

రాజ్యంలో రాజు సర్వాధికారి. రాచరికం వారసత్వం. స్థానిక సమస్యలు వచ్చిన యెడల అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకోని ఆజ్ఞలు జారీచేసేవాడని, రాజ్యంలోని అన్ని విషయాల మీద హర్షునికి పూర్తి అవగాహన వున్నదని, అవసరమైతే స్థానిక సమస్యల పరిష్కారానికి

ప్రత్యేక అధికార్లను పంపేవాడని హ్యూయన్‌త్సాంగ్ వ్రాశాడు. పరిపాలనాంశాలన్నింటిని స్వయంగా పరిశీలించేవాడని అన్ని విషయాలలో మంచి జాగ్రత్తలు తీసుకొనేవాడని రోజూ ఒక భాగాన్ని ప్రభుత్వ పాలనను, మిగిలిన రెండు భాగాలను ప్రజాసంక్షేమం కొరకు వినియోగించే వాడని మత ధర్మాలను చేయడంలో చాలా చురుకుగా వ్యవహరించేవాడని కొంత సమయాన్ని పండితగోష్ఠులకు వినియోగించేవాడని హర్షుని దినచర్యను గూడా హ్యూయన్‌త్సాంగ్ వ్రాశాడు. అట్లే హర్షుడు యుద్ధాలలో స్వయంగా పాల్గొనేవాడని యుద్ధాలలోను నిజజీవితంలో గూడా హర్షుడు గొప్ప ధైర్యసాహసాలు ప్రదర్శించేవాడని హ్యూయన్‌త్సాంగ్ వ్రాశాడు. బాణుడు గూడా హర్షుని ఉదారత్వాన్ని, దానశీలాన్ని గురించాడు. చిన్నతనంలో హర్షుడు అన్ని రాజోచితవిద్యలు నేర్చుకున్నాడని ధర్మశాస్త్రాలు అభ్యసించి పరిపాలనా విధానాలలో శిక్షణ పొందాడని బాణుడు వ్రాశాడు.

### 21.5.9.1 మంత్రి పరిషత్తు :

పరిపాలనలో సహాయపడటానికి మంత్రి పరిషత్తు ఉన్నది. ఇందులో మంత్రులు, సచివులు, అమాత్యులు ఉన్నట్లు శాసనాలు తెల్పుచున్నాయి. మంత్రి పరిషత్తులో 8 నుండి 20 వరకు సభ్యులుండేవారు. ఈ మంత్రి పరిషత్తులో చాతుర్వర్ణాలకు చెందిన మంత్రులు నియమించబడ్డారని తెలియుచున్నది. మంత్రి పరిషత్తుకు చాలా **అధికారాలు** ఉండేవి. గృహవర్మ మరణించిన తరువాత కనోజ్ సింహాసనాన్ని అధిష్టించమని కనోజ్ మంత్రి పరిషత్తు హర్షుని ఆహ్వానించిందని హ్యూయాన్‌త్సాంగ్ తన సి.యు.కి. గ్రంధంలో వ్రాసాడు. అనగా క్లిష్ట సమయాలలో రాజుని నియామకం చేసే అధికారం కూడా మంత్రి పరిషత్తుకు ఉన్నదని తెలుస్తున్నది. మంత్రి పరిషత్తుకు కీలక నిర్ణయాలు తీసుకునే అధికారం ఉన్నది. రాజుకు సలహాలను ఇస్తుంది. రాజువారి సలహాలను కాదనలేడు. మంత్రి పరిషత్ అధ్యక్షుని **బండిన్ అని** అనేవారు.

### 21.5.9.2. శాఖలు- శాఖాధ్యక్షులు :

పరిపాలన సక్రమంగా జరగటానికి హర్షుడు ప్రభుత్వ శాఖలను ఏర్పాటు చేసి వాటి నిర్వహణకు ప్రతి శాఖకు ఒక అధ్యక్షునిగా నియమించాడు.. శాసనాలను, నాటి సాహిత్యంలో అనేక మంది అధికారుల పేర్లు పేర్కొనబడ్డాయి. మహాసంధి విగ్రహాధికృత-అతడు యుద్ధ వ్యవహారాలు చూసే అధికారి, మహాబలాధికృత-అతడు సైన్యాధిపతి అని, అతనిని సైన్యాధ్యక్షుడు అని కూడా వ్యవహరించేవారు. భాండాగారాధికృత-అతడు కోశాధికారి, రాజాస్థానీయ - అతడు విదేశ వ్యవహారాల శాఖాధిపతి, కూటక-అతడు న్యాయశాఖాధిపతి, మహాప్రతిహార-రాజాంతఃపుర పర్యవేక్షణ శాఖాధిపతి మొదలయిన ఉన్నతద్యోగుల పేర్లు శాసనాలలో, సాహిత్యంలో పేర్కొనబడ్డాయి. వారందరికి ప్రత్యేక కార్యాలయాలు ఉండేవి. ఒక్కొక్కరిది ఒక్కశాఖ. అట్లే సైన్యంలో కూడా ప్రత్యేక శాఖలు ఉండేవి. గజదళం, అశ్వదళం, పదాతిదళంలకు వేరువేరు శాఖలుండేవి. పౌర ఉద్యోగులకు కూడా సైనికశిక్షణ ఇచ్చేవారు. మొత్తం 50 రకాల ఉద్యోగుల పేర్లు శాసనాల ద్వారా తెలియుచున్నది. ఈ శాఖాధ్యక్షులు తమతమ శాఖలకు, రాజుకు మధ్య వారధిగా పనిచేసేవారు. రాష్ట్రాలతోను, విషయాలతోను ఉత్తర, ప్రత్యుత్తరాలు జరపడానికి, రాజాజ్ఞలు అచట అమలుచేయడానికి కూడా రాజు ఈ శాఖాధ్యక్షుల ద్వారా అమలు జరిపేవాడు. అందువలన ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో ఈ శాఖాధ్యక్షులు కీలకపాత్రను నిర్వహించారు. ఈ శాఖలతో పాటు రాజుకు గూఢచారి దళం కూడా ఉండేది.

### 21.5.10. రాష్ట్రపాలన :

పరిపాలనా సౌలభ్యం కొరకు హర్షుడు సామ్రాజ్యాన్ని దేశాలుగా, దేశాలను భుక్తులుగా, భుక్తులను విషయాలుగా, విషయాలను గ్రామాలుగా విభజించాడు. దేశం అనేది రాష్ట్రంగా భావించవచ్చును. దేశాలకు రాజకుటుంబీకులను, రాజకుమారులను అధిపతులుగా నియమించేవారు. భుక్తులకు అధిపతులు ఉపారికులు, వారికి భోగపతులు అని కూడా పేరున్నది. విషయాల అధికారులను విషయపతులు అని **అనేవారు**, **విషయపతి** ముఖ్య పట్టణానికి **అధిష్ఠానం** అని పేరు ఉన్నది. ప్రతి ముఖ్య పట్టణానికి అధిష్ఠాన అనే పురపాలక సంఘం ఉండేది. ఈ

పురపాలక సంఘంలో సుమారు 20 మంది సభ్యులు ఉండేవారు. సభ్యులను విషయ మహత్తులు అని అనేవారు. వారి అధ్యక్షుని పురోగు అనేవారు. ఈ పురపాలక సంఘంలో నగరశ్రేష్టి, సార్ధవాహకులు కూడా సభ్యులుగా ఉండేవారు. సార్ధవాహకులు అంటే వణిజులు. ప్రతి కేంద్రంలో న్యాయస్థానం కూడా ఉండేది. అక్కడికక్కడే తీర్పులు ఉండేవి. న్యాయస్థానాన్ని న్యాయధికరణ, ధర్మధికరణ, ధర్మశాసనాధికరణ అని పిలచేవారు.

వీరేకాక ఆయుక్తా, ప్రతిపాలక అనే స్థానిక ఉద్యోగుల పేర్లు హర్షచరిత్రలో పేర్కోనబడ్డాయి. వారి విధులు స్పష్టంగా తెలియదు. ప్రభుత్వ ఉద్యోగులందరికి జీతాలు ఇవ్వలేదు. పెద్ద, ఉన్నత ఉద్యోగులకు జాగీరులు, చిన్న ఉద్యోగులకు చిన్నచిన్న కమతాలు, భూములు ఇవ్వబడినవి.

### 21.5.11 గ్రామ పరిపాలన :

గ్రామపరిపాలనకు గ్రామసభ వుండేది. ఈ పద్ధతి గుప్తుల కాలం నుండి కొనసాగుచున్నది. గ్రామసభను గ్రామ జనపీఠం అని గూడా వ్యవహరించేవారు. గ్రామ వ్యవహరాలు చూడటానికి పంచమండల అనే కమిటీని ఎన్నుకొనేవారు. ఇది గ్రామపెద్దల సభ. ఈ సబకు ధర్మబుద్ధి మంచి వ్యక్తిత్వం కల్గిన పెద్ద వయసు వారిని ఎన్నుకొనేవారు. గ్రామసభ చేసిన నిర్ణయాలను అమలు జరిపేవారు. గ్రామంలోని చెరువులను మరమ్మత్తులు చేసి నీటిపారుదల సౌకర్యాలు కల్గించడం, దేవాలయాలను నిర్వహించడం గ్రామ సంతలను పర్యవేక్షించడం, పొలాలకు సంబంధించిన వ్యవహారాలు చూడటం, అడవులు, పచ్చికబైళ్ళు మంచి చెడ్డలు చూడటం వీరి విధులు. గ్రామసభ గాక గ్రామణి అను ప్రభుత్వఅధికారి గూడా ప్రతిగ్రామంలో వుంటాడు. అతడు పన్నులు వసూలు చేస్తాడు.

### 21.5.12. న్యాయ పరిపాలన :

న్యాయ వ్యవహారాలలో రాజు సర్వోన్నత న్యాయాధీశుడు. ధర్మశాస్త్రాల ప్రకారం న్యాయనిర్ణయం చేసి తీర్పులు చెప్పేవారు. ఆ కాలంలో ప్రతి కులానికి కొన్ని ప్రత్యేయక నిబంధనలు ఉండేవి. వివిధ వృత్తులకు సంబంధించిన న్యాయ సూత్రాలు ఉండేవి. వాటన్నింటిని దృష్టిలో పెట్టుకుని న్యాయ నిర్ణయం చేసేవారు. ఆనాడు న్యాయస్థానాలకు అధకరణ, ధర్మధికరణ అని పేర్లు ఉండేవి. న్యాయాధికారులను ప్రాడి విహక్కులు అని పిలచేవారు. న్యాయాధ్యక్షుని ధర్మాధ్యక్ష అని వ్యవహరించేవారు. నాయ్యస్థానాలలో జరిగే విచారణా విధానాన్ని వ్యవహరం అని అనేవారు. వ్యవహారానికి ధర్మ, వ్యవహార, చరిత్ర, రాజశాసనం అనే నాలుగు ప్రధాన అంగాలుండేవి. న్యాయ వ్యవహారంలో వాది, ప్రతివాది, నేరనిరూపణ, న్యాయ నిర్ణయం అని నాలుగు విషయాలు ఉండేవి. హర్షుని కాలంలో శాంతిభద్రత సమ్యస అధికంగా ఉండేది. కనుక నేరాలకు కఠిన శిక్షలు విధించేవారు. మరణశిక్ష, అంగవిచ్ఛేదం వంటి కఠిన శిక్షలుండేవి. మిగిలిన నేరాలకు అపరాధరుసుం విధించేవారు. జరిమానాల ద్వారా కూడా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది.

### 21.5.13. పన్నులు

హర్షుని కాలంలో భూమిశిస్తు ప్రధాన ఆదాయం అదేకాక 18 రకాల పన్నులు వసూలు చేయబడ్డాయి. భాగ, బలి, హిరణ్యా మొ॥నవి ముఖ్యపన్నులు. భుమిశిస్తు 1/6వ వంతు వసూలు చేశారు. ఇవిగాక న్యాయస్థానాల నుండి 10 రకాల అపరాధరుసుం ప్రభుత్వానికి ఆదాయాలుగా వచ్చేవి. ఇవిగాక గానుగలు పచ్చిక బీళ్ళ మీద, పశువుల మీద గూడా పన్నులు విధించి వసూలు చేశారు. వ్యాపార సుంకాలు వసూలు చేశారు. సంతల మీద గూడా సుంకాలు వచ్చేవి. హర్షునికాలంలో ప్రభుత్వ ఆదాయాన్ని ఖర్చుపెట్టిన విధానాన్ని హ్యుయన్‌త్సాంగ్ వ్రాశాడు. హర్షుడుతన భూములను నాల్గుభాగాలుగా విభజించాడని, వాటిపై వచ్చే ఆదాయాన్ని నాల్గువిధాలుగా ఖర్చు చేసేవాడని హ్యుయాన్‌త్సాంగ్ వ్రాశాడు. 1. మొదటి భాగం రాజకుటుంబపు ఖర్చు. 2. రెండవవ భాగం ప్రభుత్వ ఉద్యోగులకు సైన్యానికి ఖర్చు పెట్టేవాడు. 3 మూడవభాగం సాహిత్య

పోషణకు పండితుల సత్కార్యానికి ఖర్చుచేసేవాడు. 4 దానధర్మాలకు ప్రజాసంక్షేమం కొరకు ఖర్చుపెట్టేవాడని వ్రాశాడు. మొత్తం మీద హర్షుని కాలంలో కొద్దిపాటి మార్పులతో గుప్తుల కాలంనాటి పరిపాలనా వ్యవస్థ సాంఘిక జీవనం తాత్వికచింతన కొనసాగింది.

## 21.5.14. సైన్యం :

హర్షుని సైన్యంలో పదాతిదళం, గజదళం, అశ్వదళం అను మూడు దళాలుండేవి. హర్షుడు సామ్రాజ్యాన్ని విస్తరించక ముందు 5వేల ఏనుగులు, 2వేల గుర్రాలు, 50 వేల పదాతిదళం వుండేదట. సామ్రాజ్యం పెరిగిన తరువాత లక్షకాల్బలం, 60 వేల గజదళం 50వేల అశ్వదళంగా పెంచాడు. అంతపెద్ద సైన్యం గుప్తులకు గూడా వుండేది కాదట. ఈ సైన్యంలో సామంతుల సైన్యంగూడా కలసి వుండవచ్చని భావించారు. బహిరంగ ప్రకటన ద్వారా హర్షుడు శక్తివంతులను, శౌర్యవంతులను సైన్యంలో నియామకం చేసేవాడని హ్యుయన్‌త్సాంగ్ వ్రాశాడు. హర్షునికి నౌకాబలం గూడా వుండేదని కొందరంటారు. సైన్యం అనేక విభాగాలుగా వుండేది. బలాధికృత, మహబలాధికృత అనే సైన్యాధికారుల పర్యవేక్షణలో సైనిక విభాగాలుండేవి. శాంతి సమయాలలో సైనికాధికారులు పౌరసభలకు హజరయ్యేవారు.

## 21.5.15. హర్షుని పరిపాలనలో లోపాలు :

హర్షుని పరిపాలనలో కొన్ని లోపాలు గూడావున్నాయి. అతడు తన తర్వాత సమర్థుడైన వారసుని తయారుచేయలేదు. అందువల్ల అతని మరణం తరువాత ఉత్తరదేశం అరాచకత్వం పాలైంది. హర్షుడు అన్ని విషయాలలో విశేష ప్రతిభను కనపరచాడు. కాని వర్తక వ్యాపారాలను ప్రోత్సహించలేదు. ముఖ్యంగా విదేశీ వాణిజ్యాన్ని అశ్రద్ధ చేశాడు. అందువలన హర్షుని తరువాత భారతదేశపు ఆర్థిక వ్యవస్థలో భూస్వామ్య లక్షణాలు బలపడ్డాయి. శశాంకుని జయించలేక పోవడం, రెండవ పులకేసి చేతిలో ఓడిపోవడం, హర్షుని కీర్తికిమచ్చలుగా మిగిలాయి. హర్షునికాలంలో దేశంలో శాంతిభద్రతలు గూడా పటిష్టంగాలేవు. దోపిడీ దొంగల బాధ అధికంగానే వుండేదని నాటి రచనలు తెల్పుచున్నాయి. హ్యుయన్‌త్సాంగ్ గూడా ఒకసారి దారిదోపిడీ దొంగల బారిన పడ్డాడట.

## 21.5.16. ఘనత :

హర్షుని పాలనలో కొన్ని లోపాలున్నప్పటికి భారతదేశ చరిత్రలో అతనికి విశిష్టస్థానం వున్నది. భారత దేశపు చివరి చక్రవర్తిగా అతనికి గుర్తింపు వచ్చింది. అతని కాలంలో హిందూసంస్కృతి బాగా అభివృద్ధి చెందింది. కనుక అతనిని చివరి గొప్ప హిందూ చక్రవర్తిగా భావిస్తారు. అతడు విద్యావ్యాప్తికి హిందూ ధర్మం కొరకు పాటుపడిన వ్యక్తి. గొప్ప సామ్రాజ్యనిర్మాత కవి, పండితుడు, సాహిత్య పోషకుడు. అన్నిటికి మించి గొప్పదానశీలుడు. కనుక సముద్రగుప్తుని శక్తి సామర్థ్యాలు అశోకుని లక్షణాలు హర్షునిలో మూర్తీభవించినవని రాధాకుముద్ ముఖర్జీ అన్నాడు.

## 21.5.17 మరణం :

హర్షుడు క్రీ.శ.647 లో మరణించాడు. అతనికి కుమారులు లేనందున అతని మరణానంతరం అతని మంత్రి అర్జునుడు అనువాడు కనోజ్ సింహాసనం ఎక్కాడు. ఈ సమయంలో చైనా చక్రవర్తి హర్షుని ఆస్థానానికి మూడవ రాయబార వర్గాన్ని వాంగ్‌త్సాంగ్ నాయకత్వం 648 లో పంపాడు. వీరిని అలోనషన్ (A-LO-NA-SHUN) అనగా అర్జునుడు అవమానించాడు. అందుకు కోపించి వారి నాయకుడు వాంగ్‌త్సాంగ్ అర్జునిని ఓడించి చైనాకు బందీగా తీసుకుపోయాడు. అర్జునునికి అరుణాశ్వుడని కూడా పేరున్నది. మరి కొందరు అర్జునుని వారు బంధించి తీసుకొనివెళ్ళలేదు. రాయబార సభ్యులు అతికష్టం మీద తప్పించుకొని టిబెట్ చేరారని అంటారు. హర్షుడు 41 సంవత్సరాలు పాలించాడు. అతని మరణానంతరం ఉత్తర భారతదేశం మరల రాజకీయ ఐక్యతను పోగొట్టుకొని అస్థిర పరిస్థితులేర్పడ్డాయి.

## 21.6. సారాంశము :

పుష్యభూతి వంశము గుప్తుల పతనానంతరం ఉత్తర భారత చరిత్రలో విశిష్టమైన స్థానాన్ని సంపాదించింది. హర్షుడు వివిధ యుద్ధాలు చేసి సామ్రాజ్యాన్ని విస్తరించి సుస్థిర పరచుటయేకాక అతను బౌద్ధమతానికి విశేషమైన సేవచేసి బౌద్ధమత పునరుద్ధరణకు ఎంతగానో కృషి చేశాడు.

## 21.7. మాదిరి ప్రశ్నలు :

1. హర్షవర్ధనుడి గురించి వివరంగా వ్రాయుము?

## సంక్షిప్త ప్రశ్నలు :

1. స్థానేశ్వర రాజ్యానికి, పుష్యభూతి వంశం అనే పేరు రావడానికి గల కారణం.
2. ప్రభాక వర్థనుడి గూర్చి వ్రాయుము?
3. రాజ్యవర్ధనుడి గూర్చి వ్రాయుము?
4. హర్షవర్థనుడి గూర్చి వ్రాయుము?
5. నలందా విశ్వవిద్యాలయం గూర్చి తెలుపుము?

**డా॥ ఎం. హనుమంతరావు**

పాఠం - 22

# ఉత్తర భారత రాజవంశాలు

## 22.0 లక్ష్యం

హర్షుని మరణానంతరం మరియొకసారి భారతదేశం విచ్ఛిన్నమైంది. వివిధ రకములైన రాజపుత్ర రాజవంశాలు ఉత్తర భారత దేశంలో రాజ్యం చేశాయి. వాటిని గూర్చి వివరించడమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

## విషయ క్రమం


22.1 ఉపోద్ఘాతము

22.2 రాజపుత్ర వంశాలు

22.3 సారాంశం

22.4 మాదిరి ప్రశ్నలు


## 22.1. ఉపోద్ఘాతం :

హర్షుని మరణాంతరము దేశంలో మరల అరాచక పరిస్థితులు ఏర్పడినవి. ఈ అరాచక పరిస్థితుల్లో రాజపుత్రులు (అనువారు) ఉత్తరదేశం అంతటా వ్యాపించి చిన్నచిన్న రాజ్యాలు స్థాపించుకుని 12వ శతాబ్దం వరకు అనగా క్రీ.శ 7-12 శతాబ్దాల మధ్య 6శతాబ్దాల కాలము (ముస్లిం దండయాత్రల వరకు) వారు ఉత్తర దేశాన్ని పాలించారు. అందువలన ఈ యుగానికి రాజపుత్ర యుగము అని పేరు వచ్చింది. ఈ యుగంలో దేశాన్ని ఏలిన రాజపుత్ర వంశాలు దాదాపు 36 వరకు గలవు.

రాజపుత్రులు యుద్ధప్రియులు, స్వాతంత్రప్రియులే కాక ధైర్యసాహసాలకు, దేశభక్తికి, విధేయతకు, ఆత్మాభిమానముకు, అతిధిసత్కారానికి, ధర్మనిరతికి, త్యాగశీలానికి మారుపేరుగా ప్రసిద్ధిచెందారు. స్త్రీలను గౌరవించడంలోను, వారి మానమర్యాదలను కాపాడటంలోను వారికి సాటి ప్రపంచంలో ఎవరూలేరు. విదేశీ దండయాత్రలను ఎదుర్కోవడంలో ఎటువంటి పరిస్థితు ఎదురయినా ఎటువంటి త్యాగాలకు అయినా వెనుదీయరు. యుద్ధాలలో ప్రాణభయం అన్నది ఎరుగరు. శత్రువుకు వెన్నుచూపుట అంటే ఎంతో అవమానంగా భావించేవారు. మరణాన్నే (వీరస్వర్గం) కోరుకుంటారు. కాని శరణు అన్న శత్రువు ఎట్టివాడయినా క్షమించి వదిలిపెట్టేవారు. వీరు ముస్లింలను ఎదిరించి హిందూ సంస్కృతి పరిరక్షణకు తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన మహావీరులు. అంతేగాక గుప్తహర్ష యుగాల మధ్య ఉన్న హిందూసంస్కృతికి మెరుగులుదిద్దారు. ఒక్కమాటలో చెప్పాలంటే వారు నిష్కళంక జీవితానికి, అచంచల దేశభక్తికి అప్రతిహిత శౌర్యపరాక్రమాలకు మారుపేరుగా విశ్వవిఖ్యాతి చెందారు. రాజపుత్రుల చరిత్ర రచించిన 'కల్నల్ టాడ్' మానవ చరిత్రలో మానవత్వంపై అనాగరికంగా జరిగిన అకృతత్యాలకు కృంగిపోయినప్పటికి తిరిగా ద్విగుణీకృత ఉత్సాహంతో ఆపదలను పరీక్షలుగా స్వీకరించి తమ పూర్వపు సాంప్రదాయాలను, నాగరికతలను నిలుపుకున్న నిరుపమాన జాతి రాజపుత్ర జాతి ఒక్కటే అని ప్రశంసించాడు.

## 22.2 రాజపుత్రవంశాలు :

రాజపుత్రయుగము (647-1206) లో ఉత్తర దేశంలోని ఆర్యావర్తనాన్ని ఏలిన ముఖ్యమైన రాజవంశాలు 1. ఘూర్జర, ప్రతీహారులు- కనుజ్ 2. పరమారులు -మాళ్వా 3. ఛందేలులు -బుందేల్‌ఖండ్ 4. చాళుక్యులు (లేక) సోలంకీలు - గుజరాత్ 5. కాలచూరులు - ఛేది దేశము 6. చౌహానులు - అజ్మరు, ఢిల్లీ 7. గహద్వాలులు, ఇతర వంశాలు. రాజపుత్రజాతికి చెందిన ఇతర వంశాలు ఆర్యావర్తనము చుట్టూ ఉన్న బెంగాలు, కాశ్మీరు, పంజాబులను పాలించినవి. వానిలో ఈ క్రింది వంశాలు మొదలైనవి. 1. పాలవంశము, సేనవంశము - బెంగాలు 2. కర్కోటక, ఉత్పల, లోహర వంశాలు -కాశ్మీరు 3. షాహి వంశము - పంజాబు, గాంధార.

**22.2.1. ఘూర్జర ప్రతీహారులు - (క్రీ.శ. 725-1022) :**

రాజపుత్రులలో మొదట ప్రబలులై, సామ్రాజ్యాన్ని స్థాపించి, అరబ్బుల దండయాత్రలను అరికట్టి, దేశానికి రాజకీయ ఐక్యతను ప్రసాదించి, ఉత్తరదేశాన్ని రెండు శతాబ్దాలపాటు వైభవముగా ఏలిన వారు ఘూర్జర ప్రతీహారులు మొదటి నివాసము గుజరాత్ కనుక దానికి వారి వల్ల 'ఘూర్జర' దేశమని పేరువచ్చి, తరువాత అదే గుజరాత్‌గా మారింది. వీరు మధ్య ఆసియా నివాసులైన ఘూర్జర సంతతికి చెందిన వారని చరిత్రకారులు భావించారు. కాని వారు తాము లక్ష్మణుని సంతతి వారమని, లక్ష్మణుడు తన అన్న శ్రీరామచంద్రునికి ప్రతిహారునిగా అనగా ద్వారపాలకునిగా ఉన్నాడు. కావున తమ వంశానికి ప్రతిహార వంశమని పేరు వచ్చినదని తమ శాసనాలలో చెప్పుకున్నారు. కాని వారి వంశానికి మూలపురుషుడు హరిసేనుడు అనే బ్రాహ్మణుడని కొన్ని ఆధారాల వల్ల తెలుస్తున్నది. అంతేగాక ప్రతిహారులలో మొదటి రాజు రాష్ట్రకూటులచే ఓడించబడి, ద్వారపాలకునిగా (ప్రతీహారునిగా) నిలుపబడ్డాడట. కనుక ఆ వంశము వారికి ప్రతీహారులు అని పేరు వచ్చినదని కొందరి ఊహ. వారు మొదట రాజస్థాన్ లోని జోధ్‌పూర్ ప్రాంతంలో రాజ్యాన్ని స్థాపించుకున్నారు. వారి రాజధాని 'భేన్‌మల్' ప్రతీహార రాజ్య స్థాపకుడు మొదటి నాగభట్టు. ఇతడు సింధును ఏలు అరబ్బులను ఓడించాడు. ఇతని రాజ్యం బరుకచ్ఛము వరకు విస్తరించింది. ఇతని కుమారుడైన వత్సరాజు (783-815) ప్రతీహార రాజ్యాన్ని మధ్య దేశానికి విస్తరించి, పాలరాజగు ధర్మపాలుని ఓడించి కనోజ్‌ను ఆక్రమించాడు. కాని రాష్ట్రకూట ధృవుడు ఉత్తర దేశంపై దండెత్తి ఇతనిని ఓడించి తరిమాడు. అందువల్ల మరల ధర్మపాలుడు కనోజ్ ను ఆక్రమించి 'చక్రాయుధుని' కనోజ్ రాజుగా చేసి తన సామంతునిగా చేసుకున్నాడు. వత్సరాజు తరువాత రాజ్యానికి వచ్చిన అతని కుమారుడైన రెండవ నాగభట్టు ప్రతీహారులలో సర్వ సమర్థుడు. తండ్రి తలపెట్టిన కనోజ్ ఆక్రమణ కార్యక్రమాన్ని ఇతడు పూర్తి చేశాడు. అతడు చక్రాయుధుని, ధర్మపాలుని ఓడించి, కనోజ్ ను ఆక్రమించి, దానిని ప్రతీహార సామ్రాజ్యానికి రాజధానిగా చేసాడు. కాని తండ్రి కాలములో వలనే ఇతని కాలంలోనూ రాష్ట్ర కూట మూడవ గోవిందుడు ఉత్తర దేశంపై దండెత్తి ఇతనిని ఓడించాడు కాని అతడు కనోజ్ ను కోల్పోలేదు. అతని తరువాత అతని కుమారుడు రామభద్రుడు, తరువాత మిహిరభోజుడు రాజ్యానికి వచ్చాడు.

**22.2.1.1. మిహిర భోజుడు (836-885):-** ప్రతీహారులలో మిహిర భోజుడు సుప్రసిద్ధుడు. ఇతని కాలంలో ఉత్తర దేశము అంతయు ప్రతీహారుల అధికారం క్రిందకి వచ్చింది. ఇతడు బెంగాల్ రాజు అయిన దేవపాలుని ఓడించాడు. తన రాజ్యంపై దండెత్తి వచ్చిన రాష్ట్రకూట రెండవ కృష్ణుని ఓడించి తరిమాడు. ఈ విజయాల వల్ల ఇతని కాలంలో ప్రతీహార సామ్రాజ్యము ఉత్తరాన హిమాలయాల నుండి, దక్షిణాన నర్మదా నది వరకు, పశ్చిమాన కర్నాల్ నుండి, తూర్పున బీహారులోని మాంఘీర్ వరకు విస్తరించింది. ఇతని కాలమున సుల్‌మాన్ అను అరబ్బీ యాత్రికుడు కనోజ్‌ను దర్శించి, అది సిరి సంపదలతో తులతూగుతున్నదని, నాటి రాజ్యాలలో కెల్లా శక్తివంతమయినదని, కాని నాటి రాజు ముస్లిం మతానికి బద్ధ విరోధి అని వ్రాసాడు. మిహిరభోజుడు కుమారుడు మహేంద్రపాలుడు (893-907) పాల వంశస్తులను ఓడించి ప్రతీహార సామ్రాజ్యాన్ని బెంగాల్ వరకు విస్తరించాడు. ఉత్తర భారత దేశానికి పూర్తిగా రాజకీయ ఐక్యత సిద్ధించింది. కాని అతని తరువాత సామ్రాజ్య పతనం ప్రారంభమైంది. రాష్ట్ర కూట మూడవ గోవిందుడు దండెత్తి కనోజ్ నుండి ప్రయాగ వరకు దోచుకుని అమిత నష్టం కలిగించాడు. తరువాత కూడా రాష్ట్ర కూట దండయాత్రలు కొనసాగడంతో సామ్రాజ్యము బలహీనమై, ప్రతీహార సామంతులగు చాళుక్యులు, పరమారులు, చందేలులు, చౌహానులు స్వతంత్రులగుటతో క్షీణించింది. 1019 లో గజనీ మహమ్మద్ కనోజ్ పై దండెత్తి కొల్లగొట్టాడు. నాటి రాజు అయిన రాజ్యపాల ప్రతీహారుడు అతనితో పోరాడకుండా నగరం వదిలి పారిపోయాడు. అందుకు కోపించి రాజ్యపాలుని సామంతుడైన చందేల విద్యాధరుడు అతనిని చంపి, అతని కుమారుడైన 'త్రిలోచన పాలుని' రాజుగా చేసాడు. త్రిలోచన పాలుడు ప్రతీహారులలో చివరివాడు. అతనితో ప్రతీహార వంశము అంతరించింది. కనోజ్ ను గహద్వాలులు ఆక్రమించారు.

**22.2.1.2. ప్రతీహార యుగ ప్రాముఖ్యత:-** హర్ష సామ్రాజ్యం తరువాత ఉత్తర దేశంలో గొప్ప సామ్రాజ్యం స్థాపించి, రాజకీయ ఐక్యతను సాధించిన వారు ప్రతీహారులు. వారు రెండు శతాబ్దాలు ఏలి, ముస్లింల నుండి దేశాన్ని రక్షించి, హిందూ సంస్కృతికి గొప్పసేవ చేసారు. వారిదే చివరి హిందూ సామ్రాజ్యము. వారు పరిపాలనలో గుప్తులను అనుసరించారు.

### 22.2.2 గహద్వాలులు (1085-1193) :

ప్రతీహారుల తరువాత కనోజ్ ను ఆక్రమించిన వారు గహద్వాలులు. వారు ప్రతీహారుల సామంతులు. వారు తాము రాఠోర్ వంశస్తులమని చెప్పుకున్నారు. వీరు ఒక శతాబ్దకాలం కనోజ్ ను ఏలుచూ, మధ్య దేశాన్ని ముస్లిం దండయాత్రల నుండి కాపాడారు. ముస్లింలను ఎదిరించుటకు అవసరమయిన ఆర్థిక వనరులను సేకరించుటకు వారు, తమ ప్రజల నుండి 'తురక దండ' అనే పన్నును వసూలు చేసారు. గహద్వాల వంశానికి మూలపురుషుడు చంద్ర దేవుడు (1085-1100). ఇతడు కనోజ్ లో రాజ్యస్థాపన చేసాడు. అతని కుమారుడు మండపాలుడు. అతడు 1100 నుండి 1114 వరకు కనోజ్ రాజ్యాన్ని పాలించాడు. తరువాత అతని కుమారుడు అగు గోవింద చంద్రుడు (1114-1155) మగధ, మాళ్వాలను ఆక్రమించాడు. అతని తరువాత జయచంద్రుడు రాజ్యానికి వచ్చాడు.

**22.2.2.1 జయచంద్రుడు (1153-93):-** ఇతడు పృధ్వీరాజుకు సమకాలికుడు. పృధ్వీ రాజు ఇతని రాజ్యం పై దండెత్తి ఇతనిని ఓడించాడు. అందువల్ల గహద్వాల, చౌహాను రాజ్యాల మధ్య విరోధము ఏర్పడింది. అట్లే తూర్పు వైపున ఇతడు బెంగాలును ఏలు 'లక్ష్మణసేనుని' తో పోరాడవలసివచ్చింది. ఇతనికి 'సంయుక్త' అను కుమార్తె కలదు. ఆమె పృధ్వీరాజును ప్రేమించింది. కాని విరోధి అయినందున జయచంద్రుడు పృధ్వీరాజును ఆమె స్వయంవరానికి పిలువలేదు. కాని సంయుక్త తనను ప్రేమించుచున్నదని తెలుసుకొనిన పృధ్వీరాజు మారువేషంలో వచ్చి సంయుక్తను తీసుకు వెళ్ళి ఆమెను వివాహమాడాడు. అది అవమానంగా భావించి జయచంద్రుడు, ఘోరీ మహమ్మద్‌ను ఆహ్వానించి పృధ్వీ రాజుపై పగతీర్చుకున్నాడని ఒక కధ ప్రచారంలో ఉన్నది. కాని అది ఎంతవరకు సత్యమో తెలియదు. కాని పృధ్వీ రాజు రాజ్యాన్ని ఆక్రమించిన తరువాత ఘోరీ మహమ్మద్, అతని సేనాని కుతుబుద్దీన్ 1193లో జయచంద్రునిపై దండెత్తి అతనిని చాంద్‌వార్ యుద్ధంలో ఓడించి కనోజ్‌ను ఆక్రమించారు. దానితో గహద్వాలుల వంశము అంతరించినది. కాని జయచంద్రునకు హరిశ్చంద్రుడు అను కుమారుడు ఉన్నట్లు అతడు 1202 వరకు జీవించి ఉన్నట్లు తెలియుచున్నది. అతడు ఘోరి మహమ్మద్‌కు సామంతుడిగా 1202 వరకు పాలించాడని కొందరంటారు.

### 22.2.3. పరమారులు (950-1055-1296) :

మ్లేచ్ఛుల నుండి హిందూధర్మాన్ని కాపాడేందుకు ఒక వీరుని కొరకు బ్రాహ్మణులు యజ్ఞము చేయగా అగ్నినుండి ఒక వీరుడు ఉద్భవించాడట. అతడే పరమారుడు అని, అతని వంశమే పరమార వంశమని ఒక ఇతిహాసము కలదు. కాని వారు రాష్ట్రకూటలలో ఒక శాఖవారని చరిత్రకారుల అభిప్రాయము. పరమార రాజ్యస్థాపకుడు, 'ఉపేంద్రుడు'. ఇతడు ప్రతీహారులకు సామంతునిగా మాళ్వాను పాలించాడు. ఇతని రాజధాని 'ధారానగరము' ప్రతీహార సామ్రాజ్యం క్షీణించు సమయంలో, పరమారులు 950 సం॥లో స్వాతంత్ర్యం ప్రకటించి సుమారు, మూడు శతాబ్దాలు మాళ్వను పాలించారు.

**22.2.3.1 ముంజరాజు :** పరమారులలో సుప్రసిద్ధుడు, మంజరాజు. ఇతడు చౌహానులను, కాలచూరులను ఓడించి పరమారరాజ్యాన్ని అతివైభవస్థితికి తెచ్చాడు. రాజస్థాన్ లోని 'ఆబూ' పర్వతం వరకు పరమార రాజ్యం విస్తరించింది. రాష్ట్రకూటులను కూలద్రోసి చాళుక్య రాజ్యాన్ని పునఃప్రతిష్ట చేసిన రెండవ తైలపుడు మాళవ పై దండెత్తగా, ముంజరాజు అతనిని ఓడించి దక్షిణదేశాన్ని కూడ జయించవలెనని దక్కనుపై దండెత్తాడు. కాని రెండవతైలపుడు ఇతనిని ఓడించి బంధించగా జైలులోని ఇతడు మరణించాడు. ముంజరాజు వీరుడేగాక సాహిత్య పోషకుడు. పద్మగుప్త, ధనిక, హలాయుధ, ధనుంజయ అను కవులను ఇతడు పోషించాడు. ఇతడు అనేక దేవాలయాలను నిర్మించుటే గాక ధారానగర ప్రాంతంలో ఒక తటాకాన్ని త్రవ్వించాడు. దానికి ముంజేశ్వర తటాకం అని పేరు.

**22.2.3.2. భోజుడు : (1010-1055) :** ముంజరాజు తరువాత అతని అన్న కుమారుడు అయిన 'భోజుడు' రాజ్యానికి వచ్చాడు. పరమారుల చరిత్రలో ఇతని కాలము సువర్ణ అధ్యాయము. ఇతడు గొప్పవీరుడు కాదు. రాజ్యవిస్తరణ చేయలేదు. కాని సంస్కృత భాషకు ఇతడు చేసిన సేవ భారత చక్రవర్తులలో మరెవ్వరూ చేయలేదు. అందువల్ల ఇతనికి అట్టి అఖండకీర్తి అభించింది. ఇతడు స్వయంగా కవి. వేదాంత, ఆయుర్వేద, వాస్తు శాస్త్రాలకు సంబంధించిన సుమారు 20 గ్రంథాలను రచించాడు. దానిలో చంపూరామాయణం, యుక్తి కల్పతరువు,

సరస్వతీ కంఠాభరణము, శృంగార ప్రకాశము, రాజమార్తాండము, తత్వప్రకాశము. 'సమరాంగణ సూత్రధార' అను వాస్తు శాస్త్రము ముఖ్యమైనది. ఇతడు సంస్కృతములో శ్లోకాలు చెప్పిన వారికి అక్షరలక్షలు ఇచ్చేవాడని ప్రతీతి. ఇతడు ధారానగరంలో 'సరస్వతీసదనము' అను విద్యాపీఠాన్ని, భోజశాల అను సంస్కృత కళాశాలను కట్టించాడు. ఇంకా, అందమైన భోజపూర్ సరస్సు ను నిర్మించాడు. దాని వైశాల్యం 250 చదరపు మైళ్ళు. ఇంకా అతడు అనేక దేవాలయాలను కట్టించాడు. ఇతని ఆస్థానంలో ధనపాల, శోభన, శంతన, విజ్ఞానేశ్వరుడు, ప్రభాచంద్రసూరి అను కవులు ఉన్నారు. 1055 లో ఇతని రాజ్యంపై కాలచూరులు, గుజరాత్‌ను ఏలు సోలంకీలు దండెత్తి, భోజుని ఓడించి మాళ్వాను ఆక్రమించారు. భోజుడు యుద్ధ సమయంలో అనారోగ్యంతో మరణించాడు. భోజుడు క్రీ.శ.1010 నుండి 1055 వరకు షుమారు 45 సం॥ పాలించాడు. ఇతని తరువాత పరమార వంశస్తులు మరల మాళ్వను స్వాధీనపరచుకుని, అల్లాఉద్దీన్ ఖిల్జీకాలము వరకు పాలించారు. అల్లా ఉద్దీన్‌ఖిల్జీ మాళ్వను ఆక్రమించడంతో పరమార వంశము అంతరించింది.

### 22.2.4. ఛందేలులు : క్రీ.శ 950-1309 :

రాజపుత్ర వంశాలలో ప్రతీహారుల తరువాత చెప్పుకోదగిన బలవంతులు ఛందేలులు. వీరు 'ఖజురహో'ను రాజధానిగా చేసుకుని 'బుందేల్‌ఖండ్'ను 3 శతాబ్దాల పాటు పాలించారు. ఈ వంశానికి మూలపురుషుడు 'జయశక్తి'. ఇతని పేరువల్లనే బుందేల్‌ఖండ్‌కు 'జేజకభక్తి' అను పేరు వచ్చింది. జయశక్తి ప్రతీహారుల సామంతునిగా రాజ్యస్థాపన చేసెను. క్రీ.శ 950 ప్రాంతంలో చందేలులో స్వంతంత్రాన్ని ప్రకటించినవాడు యశవర్మ. ఇతడు కలింజరును ఆక్రమించి 'మహోబా' నగరాన్ని తన రాజధానిగా చేసుకున్నాడు. ఇతని కుమారుడు 'ధంగ' ఈ వంశములో గొప్పవాడు. అతడే రాజధానిని 'ఖజురహో' కు మార్పించాడు. ఇతని కాలంలో ఛందేల రాజ్యం నలుదిక్కులకు వ్యాపించి బలిష్టమైనది. ఇతడు బెంగాలు సేనవంశస్తులతో యుద్ధాలు చేశాడు. ఛేదిరాజుకర్ణుని ఓడించి తరిమాడు. ధంగకాలంలో వీరిరాజ్యం ఉత్తరాన యమునానది నుండి, దక్షిణాన నర్మదానది వరకు, తూర్పున బెనారస్ నుండి పశ్చిమాన సాంచి వరకు విస్తరించింది. ఈ రాజ్యంలోని కలింజర్, గ్వాలియర్ కోటలు శత్రు దుర్భేద్యాలని ప్రసిద్ధి పొందినవి. ఇతని కాలంలోనే గజనీమహమ్మద్ దండయాత్రలు ప్రారంభమయినవి. గజనీకి వ్యతిరేకముగా షాహివంశ ఆనందపాలుడు ఏర్పరిచిన కూటమిలో ఇతడు కూడా చేరాడు. కాని అందు పరాజయము కలిగింది. అతడు క్రీ.శ.1002 వరకు పాలించాడు. ధంగ తరువాత అతని కుమారుడు గుండరాజు రాజ్యానికి వచ్చి 1020 వరకు పాలించాడు. కీర్తివర్మ కాలంలో ఛేదిరాజు కర్ణుడు వీరి రాజ్యంపై దండెత్తాడు. కీర్తివర్మ అతనిని ఓడించి తరిమాడు.

**22.2.4.1. విద్యాధరుడు : క్రీ.శ. 1020 :** ఇతనికాలంలోగజనీమహమ్మద్ కనోజ్‌పై దండెత్తగా, ప్రతీహార రాజ్యపాలుడు నగరం వదలి పారి పోయాడు. రాజపుత్రుడై ఉండి పిరికిపందవలె అతడు పారిపోయాడని కోపించి, ఇతడు కనోజ్‌పై దండెత్తి రాజ్యపాలుని వధించాడు. రాజ్యపాలుని తన సామంతునిగా భావించిన గజనీమహమ్మద్ ఇది అవమానంగా భావించి 1020 లో కలంజరుపై దండెత్తినాడు. అంతవరకు అమిత ధైర్యముతో ఉన్న విద్యాధరుడు గజనీసైన్యాలను చూచి భయపడి, ఒక రాత్రి అతని గుడారములోనికి వెళ్ళి శరణన్నాడు. అంతట కానుకులు పొంది వెనుదిరిగి పోయిన గజనీ గ్వాలియర్‌ను కూడా ఓడించాడు. కాని కొందరు చరిత్రకారులు విద్యాధరుడిని గజనీ మహమ్మద్ ఓడించలేక పోయాడని, కలింజర్, గ్వాలియర్ కోటలను వశపరచుకొనలేకపోయాడని భావిస్తారు. కాని అది వాస్తవంకాదు. విద్యాధరుడు శరణన్నా తరువాతనే గజనీ వెనక్కి మరలాడు. విద్యాధరుని అనంతర కాలంలో పరమారులు, కాలచూరులు, చౌహానులు, బుందేల్ ఖండ్‌పై దండయాత్రలు సాగించారు. చౌహాను పృధ్వీరాజు, కాలచూరికర్ణదేవుడు, అనేకసార్లు బుందేల్‌ఖండ్‌పై దండెత్తారు. సోలంకీలు సాంచీ ప్రాంతాన్ని ఆక్రమించడంతో రాజ్యం బలహీనమైనది. తరువాత చౌహానులను అంతం చేసి ఢిల్లీలో ముస్లిం సామ్రాజ్యాన్ని స్థాపించిన తురుష్కులు బుందేల్‌ఖండ్ పై దాడులు ప్రారంభించారు. 1202 లో కుతుబుద్దీన్ సేనాని కలంజర్ ను జయించాడు. కాని రాజ్యాన్ని కలుపుకోలేదు. కనుక మరియొక శతాబ్దం పాటు చందేలులు బుందేల్‌ఖండును పాలించగలిగారు.

చివరకు క్రీ.శ. 1309 లో అల్లాఉద్దీన్ ఛందేలులను ఓడించి బుందేల్‌ఖండ్‌ను ఆక్రమించాడు. అంతటితో ఛందేల వంశము అంతరించినది. ఛందేలులు హిందూ శిల్పకళకు గొప్ప సేవచేసారు. వారు నిర్మించిన ఖజురహో దేవాలయములు నేడు ప్రపంచ ప్రసిద్ధి పొందినవి. వారిశిల్పకళ శృంగార శిల్పానికి పెట్టినది పేరు.

### 22.2.5. సోలంకీలు : క్రీ.శ. 945-1200 :

ప్రతీహార సామంతులుగా గుజరాత్‌ను ఏలినవారే చాళుక్యులు లేక సోలంకీలు. వీరు దక్షిణ భారతంలో ప్రఖ్యాతిగాంచిన చాళుక్యులలో ఒక శాఖవారు. 'సోలంకీ' అను పదము 'చాళుక్య' అను పదానికి భ్రష్ట రూపమని పండితుల అభిప్రాయము. వారి రాజధాని 'అన్హిల్‌వాడ'. ఈ రాజ్యము తరుచు పరమార, చౌహాను, ముస్లిం దాడులకు గురి అవుతుండేది. సోలంకీ రాజ్య స్థాపకుడు మూలరాజు.

**22.2.5.1. భీముడు : 1022-64 :** ఇతని తరువాత రాజ్యానికి వచ్చిన భీముని కాలంలో గజనీమహమ్మద్ గుజరాత్‌పై దండెత్తి, అన్హిల్‌వాడను కొల్లగొట్టి క్రీ.శ. 1025 లో ప్రఖ్యాత సోమనాథ్ దేవాలయాన్ని ధ్వంసం చేసాడు. భీముడు గజనీ రాకను విని తన రాజధానిని వదలి పెట్టి కచ్‌కు పారిపోయాడు. గజనీ వెళ్ళిన తరువాత తిరిగి వచ్చి విజృంభించి ఆబూ, మాళ్వ, భిన్‌మల్, ప్రాంతాలను జయించి రాజ్యాన్ని విస్తరింపచేసాడు. భీముని కుమారుడు అగు కర్ణుడు బిల్హణుని పోషించాడు.

**22.2.5.2. జయసింహుడు : 1094-1143 :** కర్ణుని కుమారుడు అగు జయసింహుని కాలంలో సోలంకీ రాజ్యము నలుదిక్కులకు విస్తరించి, మంచి ఉచ్ఛస్థితికి వచ్చినది. ఇతని రాజ్యములో గుజరాత్, కచ్, మాళ్వా, భిన్‌మల్, కథియవార్, దక్షిణ రాజస్థాన్ చేరి ఉండేవి. జైనపండితుడు అగు హేమచంద్రుడు ఇతని ఆస్థానమువాడే. ఇతడు సింహసంవత్సరమనే శకాన్ని ప్రారంభించాడని ప్రతీతి. ఇతని తరువాత గొప్పవాడు రెండవ భీముడు. ఇతని రాజ్యంపై 1185 వ సం॥లో ఘోరీమహమ్మద్ దండెత్తగా అతనిని ఓడించి తరిమినాడు. భీముని తరువాత సోలంకీ రాజకుమారుల మధ్య సింహాసనానికి అంతర్యుద్ధాలు జరగడంతో రాజ్యం క్షీణించింది. యాదవులు, ముస్లింలు గుజరాత్ పై దండయాత్రలు అధికంకావడంతో సోలంకీ వంశవృక్షం క్షీణించింది. దానిని ఆసరాగా తీసుకుని వారి సామంతులైన వాఘేల వంశస్తుడయిన 'అర్జునుడు' క్రీ.శ.1274 లో సోలంకీలను కూలద్రోసి గుజరాత్‌ను ఆక్రమించాడు. అర్జునుడు (1274-96) గొప్పవీరుడు. ఇతడు క్షీణించిపోతున్న గుజరాత్ రాజ్యాన్ని నిలబెట్టడానికి తన శక్తివంచన లేకుండా పాటుబడ్డాడు. అతని కుమారుడయిన కర్ణదేవుని కాలంలో అల్లాఉద్దీన్ దండెత్తి అతని భార్య అగు కమలాదేవిని పట్టుకుపోయాడు. గుజరాత్‌లో సగభాగాన్ని ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపినాడు. మిగిలిన సగభాగాన్ని తరువాత మహ్మద్-బిన్-తుగ్లక్ ఆక్రమించడంతో వాఘేల వంశము అంతరించినది.

### 22.2.6. కాలచూర్యులు (845-1212) :

కాలచూరులు చేది వంశస్థులు. వీరికి 'హైహయులు' అని కూడా పేరు కలదు. వీరు తాము కార్తవీర్యార్జుని సంతతివారుము అని చెప్పుకున్నారు. కాలచూరులు, బుందేల్‌ఖండ్‌కు దిగువన గల 'డాహాల' దేశాన్ని ఏలారు. దీనికే చేది దేశము అని పేరు. దీనినే గుప్తచాళుక్య కాలంలో 'దక్షిణ కోసల' అని పిలిచారు. వీరి రాజధాని త్రిపుర. ఈ రాజ్యం నర్మద, గోదావరి నదుల మధ్యన వున్నది. ఇతడు 845 నుండి 880 వరకు పాలించాడు. అతని తరువాత కాలచూరులు 9, 10 శతాబ్దాలలో రాష్ట్రకూట, చాళుక్య సోలంకీయాలలో జోక్యం చేసుకుని వారిచేతిలో ఓడిపోయారు. గాంగేయ దేవుడు (1019-41) కోక్కల్లులలో సుప్రసిద్ధుడు. అతడు గొప్ప విజేత. ఇతడు కర్ణాటకము నుండి కాశ్మీరు వరకు జయించి, 'విక్రమాదిత్య', 'త్రికళింగాధిపతి' అనుబిరుదులు వహించాడు. అతని కుమారుడు అగు కర్ణదేవుడు తండ్రిని మించిన వీరుడు. అతడు శతాధిక వీరునిగా ప్రసిద్ధి చెందెను. కాని అతడు చందేల రాజ్యంపై దండెత్తగా చందేలరాజు కీర్తి వర్మ అతనిని ఓడించి తరిమాడు. అతని కుమారుడు అగు యశఃకర్ణదేవుడు (1072-1120) ఉత్తర దేశాన్నంతటినీ జయించి ఏకసామ్రాజ్యం చేయవలెనని ప్రయత్నించాడు. కాని కనోజ్‌ను ఏలు గహద్వాలులు అతని ప్రయత్నాన్ని వమ్ము చేసారు. అతని అధికారం బెంగాలు నుండి గుజరాత్‌వరకు గంగానది నుండి నర్మదా నది వరకు విస్తరించినది.

అతని కాలంలోనే వారణాసి, ప్రయాగలను గహద్వాలులు ఆక్రమించుకున్నారు. అతని తరువాత చందేల, గహద్వాలల దాడుల వలన వీరి రాజ్యము క్షీణించింది. ఆఖరి కాలచూరుడు అగు విజయసింహుని చందేలరాజు అగు త్రైలోక్యమల్లుడు క్రీ.శ. 1212 లో ఓడించి, చేది దేశాన్ని ఆక్రమించడంతో కాలచూరి వంశము అంతరించింది.

**22.2.7. పాలవంశము (750-1138) :**

ఆర్యావర్తాన్ని రాజపుత్రవంశాలు పాలించిన కాలంలో బెంగాలును పాలవంశస్థులు పరిపాలించారు. కాని వీరు రాజపుత్రులు కారు. వీరు బెంగాల్‌లో రాజ్యం స్థాపించి బౌద్ధ మతాన్ని ఆదరించారు. వీరు కనోజ్ ను ఏలిన ప్రతీహారులతో పోటీపడి ఉత్తరదేశ సార్వభౌమత్వాన్ని సాధించవలెనని ప్రయత్నించారు. కాని ప్రతీహారుల, రాష్ట్రకూటుల దండయాత్రవలన వారి దానిని సాధించలేకపోయారు. పాలవంశ స్థాపకుడు 'గోపాలుడు'. గౌడశశాంకుని మరణానంతరం ఒక శతాబ్దంపాటు బెంగాలు చరిత్ర స్పష్టంగా తెలియుటలేదు. ఆనాడు బెంగాల్‌లో అరాచక పరిస్థితులు ఏర్పడగా ప్రజలు ఈ వంశానికి చెందిన గోపాలుని రాజుగా ఎన్నుకొన్నారట. వాస్తవానికి వారి వంశమేదో తెలియదు. ఈ వంశస్థుల అందరి పేర్లలోను 'పాల' అను శబ్దము ఉన్నందున వారికి పాలవంశము అని చరిత్రకారులు పేరు పెట్టారు. ఈ వంశస్థులు ఉత్తరాపథ సార్వభౌమత్వానికి ప్రతీహారులతో పోటీపడి బెంగాలుకు ఎన్నడూ కలగని గౌరవ ప్రతిష్టలను చరిత్రలో కలిగించారు. గోపాలుడు క్రీ.శ. 750 నుండి 770 వరకు పాలించాడు.

**22.2.7.1 ధర్మపాలుడు (770-810) :** గోపాలుని కుమారుడు అగు ధర్మపాలుడు ఈ వంశములో గొప్పవాడు. అతడు కనోజ్‌ను జయించి 'ఇంద్రాయుధుడు' అను వానిని తన సామంతునిగా చేసుకొన్నాడు. కాని ప్రతీహార వత్సరాజు, రాష్ట్రకూట ధృవుడు ఇతనిని ఓడించారు. కాని రాష్ట్రకూటుల చేతిలో ఓడినందువల్ల వత్సరాజు వెనుతిరిగిపోగా ఇతడు మరలా కనోజ్‌ను జయించి 'చక్రాయుధుడు' అను వానిని కనోజ్ రాజుగ చేసి తన సామాంతునిగా చేసుకొనెను. ఈ విజయం వలన ఇతని రాజ్యము బెంగాలు నుండి కాశ్మీరు వరకు విస్తరించింది. అంతేగాక తూర్పున కామరూప రాజ్యాన్ని కూడా జయించి తన రాజ్యాన్ని బ్రహ్మపుత్ర వరకు విస్తరించాడు. కాని తరువాత ఇతనిని నాగభట్టు ఓడించి కనోజ్‌ను ఆక్రమించి తన రాజధానిగా చేసుకున్నాడు. ధర్మపాలుడు మొత్తం 40 సం॥లు పాలించాడు. 770 నుండి 811 వరకు పాలించాడు.

**22.2.7.2 దేవపాలుడు (810-850) :** ధర్మపాలుని కుమారుడయిన దేవపాలుడు ఒరిస్సాను జయించి, అస్సామును పూర్తిగా జయించాడు. కాని రాష్ట్రకూట మూడవ గోవిందుడు ఇతనిని ఓడించాడు. కాని ఇతడు రాజ్యం కోల్పోలేదు. ఇతని తరువాత ప్రతీహారుల దండయాత్రవల్ల పాలవంశము కొంతవరకు తలవాల్చింది. ఇతడు 810 నుండి 850 వరకు పాలించాడు.

**22.2.7.3 మహీపాలుడు (1010-1030) :** తరువాత క్రీ.శ.1010 వ సం॥లో రాజ్యానికి వచ్చిన మహీపాలుడు పాలవంశస్థుల ప్రతిభను పునరుద్ధరించాడు. ఇతడు గజనీమహమ్మద్ కు సమకాలికుడు. కాన నాటి చోళ చక్రవర్తి అగు రాజేంద్రచోళుడు బెంగాల్‌పై దండెత్తి ఇతనిని ఓడించాడు. చోళదండయాత్ర వెనుకకు మరలగానే ఇతడు పడమరగల మగధను, దక్షిణమున గల 'తీరభుక్తి' ని ఆక్రమించాడు. ఇతని తరువాత పాలవంశము క్షీణించినది. వారి రాజ్యము పై కాలచూరులు, కళింగగాంగులు దండెత్తారు. అంతేకాక కాంభోజ, కైవర్త మొదలుగు అనాగరిక జాతుల వారు వారి రాజ్యంపై పడినారు. ఈ అల్లకల్లోల పరిస్థితులలో కామరూప దేశము స్వతంత్రమైనది. మగధను కనోజ్‌ను ఏలు గహద్వాలులు ఆక్రమించారు. 'తీరభుక్తి' ని 'అనంతవర్మచోడగంగు' ఆక్రమించాడు. ఈ పరిస్థితులలో వారి సామంతులైన 'సేన' వంశస్థులు వారిని కూలద్రోసి, 1138 లో పాలరాజ్యాన్ని అపహరించారు. అంతటితో పాలవంశము అంతరించినది. చివరిపాలరాజైన మదనపాలుడిని సేనరాజైన విజయసేనుడు ఓడించడంతో పాలరాజ్యం అంతరించింది. పాలవంశస్థులు విక్రమశిల, ఉద్దంతపుర, జగద్దల మొదలగు విశ్వవిద్యాలయాలను స్థాపించారు. వీరి ఆదరణలో తాంత్రిక బౌద్ధమతము బీహారు, బెంగాలులలో బహుళ ప్రచారంలో ఉండేది. పాలరాజులు మొత్తం 17 మంది నాల్గు శతాబ్దాలపాటు బెంగాలునేలారు.

**22.2.7.4 పాలవంశస్తుల సాంస్కృతిక సేవ :** పాలవంశస్తులు సుమారు నాలుగు వందల సం॥లు బీహారు, బెంగాలులను పాలించి ఉత్తరదేశంలో సార్వభౌములు కావాలని ప్రయత్నించారు. అది ఫలించకపోయినప్పటికి వీరు బెంగాలు సంస్కృతికి గొప్ప సేవ చేసారు. పాలవంశస్థులు బౌద్ధమతస్థులు రాజపుత్రయుగంలో హిందూమతం సర్వతోముఖాభివృద్ధి చెందుచుండగా పాలవంశస్థులు అదే కాలంలో బౌద్ధమతాన్ని స్వీకరించారు. దాని అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారు. వారు బెంగాలులో బౌద్ధమతాన్ని పునరుద్ధరించి దానిని వ్యాప్తిచేయడానికి

పూనుకున్నారు. వారి ఆదరణలో తాంత్రిక లేక వజ్రయాన బౌద్ధమతం బహుళ ప్రచారం పొందినది. ధర్మపాలుడు నలందాకు నమూనాగా విక్రమశిల విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. ఈ విశ్వవిద్యాలయానికి అతిశదీపంకరుడు అధ్యక్షుడుగా ఉండేవాడు. ఇతడు వజ్రయానం మీద రెండువందల గ్రంధాలు వ్రాసాడు. తరువాత ఇతడు టిబెట్టు చేరి అచట జీవితాంతం ప్రచారం చేసాడు. నలందా కూడా పూర్వపు వైభవానికి వచ్చింది. దేవపాలుని కాలంలో సువర్ణ ద్వీపాన్ని పాలించు శైలేంద్రరాజు ఏలు పుత్రదేవుడు అతని అనుమతితో నలందలో ఒక విహారాన్ని కట్టించాడు. ఆ విహారానికి దేవపాలుడు 5 గ్రామాలు దానం చేసాడు. ఇంకా ఉద్దంతపుర, జగద్దల విశ్వవిద్యాలయాలు కూడా వీరి కాలంలోనే స్థాపించబడినవి. వారు నేపాల్, టిబెట్ దేశాల నుండి అనేక బౌద్ధ గ్రంధాలను కూడా సేకరించారు. నలందా విశ్వవిద్యాలయానికి విదేశ విద్యార్థులు వచ్చి చదువుకునేవారు. పాలరాజులు శిల్పకళను పోషించారు. వారు సమకాలిక వాస్తు శిల్ప సాంప్రదాయాలను అనుసరించి అనేక బౌద్ధవిహారాలు పునర్నిర్మించారు. వారి శిల్పాలలో సహజత్వము జీవకళ ఉట్టిపడుతూ బెంగాలుకు కీర్తి తెచ్చినవి. మలయా, జావ, సుమిత్రదవులను పాలంబ శైలేంద్రవంశము పాలరాజులతో దౌత్యసంబంధాలు నెరపారు. పాలరాజులను పరిపాలనను వారి సైనికశక్తిని యుద్ధనైపుణ్యాన్ని అరబ్ యాత్రికుడైన సులేమాన్ తన గ్రంధంలో వివరించాడు. 8 వ శతాబ్దంలో ధర్మపాలుడు స్థాపించిన విక్రమశిల విశ్వవిద్యాలయాన్ని క్రీ.శ 1203 లో భక్తియార్ ఖిల్జి ధ్వంసం చేశాడు.

**22.2.8. సేనవంశము (1138-1199) :** పాలవంశాన్ని అంతమొందించి బెంగాలును ఆక్రమించిన వారు సేన వంశస్థులు. వీరు తాము కర్ణాటక క్షత్రియులమని చెప్పుకున్నారు. కనుక వారు ఏవో కారణాల వలన కర్నాటకం నుండి బెంగాల్ కు వచ్చి స్థిరపడ్డారని చరిత్రకారుల అభిప్రాయము. సేనవంశస్థాపకుడు విజయసేనుడు. ఇతని రాజధాని 'నాడియా' ఇతడు స్థానిక రాజవంశాలతో వివాహసంబంధాలను ఏర్పరచుకుని బలపడ్డాడు. బౌద్ధమతాన్ని అభిమానించినందువల్ల పాలవంశస్థులు ప్రజలకు దూరము అయినట్లు కనిపిస్తున్నది. దానిని అవకాశంగా తీసుకుని విజయసేనుడు, బ్రాహ్మణ మతస్థులను కూడగట్టుకుని సేనరాజ్యమును స్థాపించాడని అనేకులు భావిస్తున్నారు.

**22.2.8.1 బల్లాలసేనుడు :** విజయసేనుని కుమారుడు బల్లాలసేనుడు మిధిలను జయించెను. బెంగాలు, బీహారులలో బౌద్ధాన్ని తొలగించి హిందూ సంఘాలను పునరుద్దరించాడు. ఇతని కాలంలో బీహారు, బెంగాల్‌లలో హిందూ సాంప్రదాయం ప్రకారం సాంఘిక వ్యవస్థ ఏర్పడినది. ముఖర్జీ, ఛటర్జీ, బెనర్జీలు, బ్రాహ్మణ కులంలోను, ఘోష్, బోస్ మిత్ర, కుటుంబాల వారు కాయస్థ కులంలోను, సంఘంలో అధికులుగా నిర్ణయించబడ్డారు. బలాల్ల సేనుడు స్వయముగా కవియేగాక, అనేక మందిని కవి పండితులను పోషించాడు. సేన వంశములో చివరివాడు బలాల్ల సేనుని కుమారుడయిన లక్ష్మణసేనుడు. ఇతని కాలంలో బెంగాల్ రాజ్యం విస్తరించి, ఉచ్ఛస్థితిని అందుకున్నది. ఇతడు పూరి, కాశీలను జయించి అలహాబాద్ వరకు వచ్చి అచట విజయస్థంభమును నాటాడు. ఇతడు సాహిత్యాభిమాని అయి 'పంచరత్నాలను' పండితులను పోషించాడు. వారిలో 'ధోయి' అను కవి, గీతగోవిందాన్ని రచించిన జయదేవుడు ప్రసిద్దులు. లక్ష్మణసేనుడు కొత్తశకాన్ని స్థాపించాడు. అది నేటికీ మిధిల ప్రాంతంలో వాడుకలో ఉన్నది. ఇతని కాలంలో ఘోరీ మహమ్మద్ సేనాని అగు భక్తియార్ ఖిల్జీ 1199 లో బెంగాల్ లో ప్రవేశించగా, లక్ష్మణసేనుడు పారిపోయెను, దానితో బెంగాల్ ముస్లింల వశం కావడంతో బెంగాల్‌లో హిందూ రాజ్యము అస్తమించింది.

## 22.2.9 చౌహానులు (క్రీ.శ 956-1192) :

ప్రతీహారులకు సామంతులుగా రాజస్థాన్‌లోని అజ్మీరు ప్రాంతాన్ని పాలించినవారు చౌహానులు. ఆ ప్రాంతానికి 'సపాదలక్షమండలము' అని పేరు కలదు. దానికి రాజధాని 'శకంబరి' అను పట్టణము. చౌహానులకు మూలపురుషుడు "సింహరాజు" (క్రీ.శ.956). అతడు మహారాజాధిరాజ అను బిరుదు వహించి, ప్రతీహారులను ధిక్కరించి స్వతంత్రుడైనాడు. అతని తరువాత అజయరాజు, విశాలదేవుల కాలంలో చౌహాను రాజ్యము ఢిల్లీ వరకు విస్తరించింది. అజయరాజు 'అజయపురాన్ని' (అజ్మీరు) నిర్మించి రాజధానిగా చేసుకున్నాడు. విశాలదేవుడు (1153-64) ఢిల్లీని ఏలు తోమరులను ఓడించి ఢిల్లీని తన రాజ్యంలో కలుపుకున్నాడు. ఇతడు గొప్పకవి. హరకేళి అను నాటకమును రచించాడు. ఇంకా అనేకమంది కవులను పోషించాడు. విద్యాభివృద్దికి అజ్మీరులో ఒక కళాశాలను నిర్మించాడు. ఇతని ఆస్థానకవి అయిన సోమదేవుడు ఇతని గౌరవార్ధం లలితవిగ్రహరాజ నాటకమును రచించాడు.

**22.2.9.1. పృథ్వీరాజు (1179-1192) :** చౌహానులలో సుప్రసిద్ధుడు, చివరివాడయిన మూడవ పృథ్వీరాజు. గజనీ కాలమునుండి రాజపుత్రులు ముస్లిముల ముందు నిలువలేక, కొల్లగొట్టబడి పారిపోగా, తరువాత రాజపుత్రులందరినీ ఏకం చేసి ఒక్కసారి అయినా ఘోరీ మహమ్మద్ ముందు నిలచి ఓడించి తరిమిన ఘనత పృథ్వీరాజు కే దక్కింది. కనుకనే ఇతడు చౌహాను వంశంలోనే గాక భారత చరిత్రలోనే ఒక ప్రత్యేక స్థానమును సంపాదించుకున్నాడు. ఇతడు తన రాజధానిని అజ్మీరు నుండి ఢిల్లీకి మార్చాడు. ఇతడు 1179లో రాజ్యానికి వచ్చాడు. అజ్మీరును పాలించిన చౌహాను వంశంలో చివరివాడు. ఢిల్లీని పాలించిన చివరి హిందూ రాజు కూడా అతడే. ఇతడు మహావీరుడు. ఇతని కాలంలో చౌహానుల ప్రతిభ తారాపధాన్ని అంటింది. ఇతని జీవితాన్ని ఇతని ఆస్థాన్ పండితుడు 'ఛాంద్‌బర్దాయ్ పృథ్వీరాజ్ రాసో' అను గ్రంథ రూపంలో వ్రాశాడు. పృథ్వీరాజు విజయములను గురించి మరియొక సంస్కృత గ్రంథము కూడా వివరిస్తుంది. ఇతని ధైర్యసాహసాలను, యుద్ధ ప్రావీణ్యాన్ని కథలుగా, గాధలుగా ఉత్తరదేశమంతా ప్రచారంలో ఉన్నాయి. ఇతడు రాజ్యానికి రాగానే గుజరాత్ ను ఏలు సోలంకీలతోను, బుందేల్‌ఖండ్‌ను ఏలు ఛందేలులతోను, కనోజ్ ను ఏలు గహద్వాలులతోను అనేక యుద్ధాలు చేసి విజయం పొందాడు. ఇందువల్ల మహావీరుడిగా ఇతని కీర్తిప్రతిష్టలు నాడు నలుమూలలకు విస్తరించినాయి. ముఖ్యముగా ఛందేల రాజు పరమార్దిపై సాధించిన విజయంవలన ఇతనిని మహావీరునిగా ఉత్తరాపధం అంతా కీర్తించింది.

**జయ చంద్రునితో విరోధము :** ఇతని కీర్తి ప్రతిష్టలు విని కనోజ్ రాజు అయిన జయచంద్రుని కుమార్తె సంయుక్త ఇతనిని ప్రేమించింది. కానీ కనోజ్ రాజ్యములో ఇతడు కొంతభాగమును ఆక్రమించినందున, జయచంద్రుడు ఇతనిని విరోధిగా చూసేవాడు. అందువలన తన కుమార్తె సంయుక్త స్వయంవరమునకు పృథ్వీరాజును ఆహ్వానించలేదు. కానీ సంయుక్త తనను ప్రేమించినదని తెలుసుకుని స్వయంవర వేళకు వచ్చి పృథ్వీరాజు సంయుక్తను తీసుకొనిపోయి, ఆమెను వివాహమాడెను. ఈ సంఘటన జయచంద్రుని విరోధానికి అగ్నిపై ఆజ్యము పోసినట్లు అయినది. అందువల్ల ఇతడు పృథ్వీరాజుపై దండెత్తమని ఘోరీమహమ్మద్ ను ఆహ్వానించాడని చెప్పెదరు. కానీ ఈ కథకు చారిత్రక ఆధారము లేదు.

**ఘోరీమహమ్మద్ తో తరాయిన్ యుద్ధము : మొదటి తరాయిన్ యుద్ధము :** నాడు ఘోరీ మహమ్మద్ ఇండియాను జయించవలెనని ఉవ్విళ్లూరుతూ పంజాబును ఏలు గజనీ వంశస్తులను ఓడించి, తరువాత పంజాబును జయించి, స్ట్లెజ్ నది దాటి పృథ్వీరాజ్ రాజ్యములో అడుగు పెట్టి అతనికి చెందిన సరిహంద్ కోటను ఆక్రమించెను. దీనితో ఘోరీమహ్మద్ తో పృథ్వీరాజుకు యుద్ధము తప్పనిసరి అయినది. కనుక పృథ్వీరాజు సైన్యముతో 1191 లో 'తరాయిను' వద్ద ఘోరీని ఎదుర్కొని అతనిని ఘోరముగా ఓడించి తరిమాడు. దీనినే మొదటి తరాయిను యుద్ధము అని అందురు.

**రెండవ తరాయిను యుద్ధము :** ఈ యుద్ధములో జరిగిన పరాజయమును మరువలేక ఎలాగయినా పృథ్వీరాజును ఓడించవలెనని పట్టుదలతో మరుసటి సం॥ 1192 లో ఘోరీ గొప్ప సైన్యమును సమకూర్చుకుని మరలా దండెత్తెను. కాని పృథ్వీరాజు తనకు మొదటి తరాయిన్ యుద్ధములో కలిగిన విజయమునకు అమిత సంతోషంతో అంతఃపురభోగాలలో తేలియాడుచూ, అన్నింటినీ మరచాడు. ఘోరీ దండయాత్రను విని హుటాహుటిన (తను సమకూర్చుకోగలిగిన) సైన్యముతో బయలుదేరి యుద్ధభూమికి చేరాడు. యుద్ధభూమిలో పృథ్వీరాజును ఘోరీమహ్మద్‌ను ఎదుర్కొని వీరోచితముగా పోరాడినాడు. కానీ ఓడి బందీగా చిక్కాడు. ఘోరీమహ్మద్ వెంటనే అతని కళ్ళు పీకించి, వధించాడు. పృథ్వీరాజు మరణానంతరం చౌహాను వంశము అంతరించి వారి రాజ్యము ముస్లిముల సామ్రాజ్యమునకు తొలి స్థావరము అయింది.

**రెండవ తరాయిను యుద్ధ ప్రాముఖ్యత :** 1192 లో జరిగిన యుద్ధములో భారతదేశ చరిత్రలో హిందూ యుగము అంతరించి ముస్లిం యుగము ప్రారంభము అయినది. కనుకనే భారతదేశ చరిత్రలో ఈ యుద్ధము అధిక ప్రాముఖ్యతను వహించింది. చౌహాను రాజ్యాన్ని తమ స్థావరంగా చేసుకుని ముస్లింలు మిగిలిన హిందుస్థానాన్ని సులభంగా జయించారు.

పృథ్వీరాజు గొప్పవీరుడే అయినను నాటి రాజకీయ అవసరములను గుర్తించక తోటి రాజపుత్రులను కూడగట్టుకొనక ఒంటరిగా ఘోరీని ఎదురించినందున రాజ్యమును పోగొట్టుకుని ఇండియాలో ముస్లింలకు స్థానము ఇచ్చాడని కొందరు విమర్శించెదరు. కానీ కొందరు భారతీయులు ఎప్పుడూ విదేశదాడులలో ఐక్యత చూపలేదు. అని, అందువల్ల పృథ్వీరాజును విమర్శింపనవసరం లేదు అని, అతడు తాను చేయవలసినదంతా చేసాడని భావించారు. ఏది ఏమయినప్పటికి అతడు తన శక్తి సామర్ధ్యాలను సాటి రాజపుత్రులపై చూపి వారిన

నొప్పించకుండా, వారిన సమైక్యపరచి ముస్లింలను ఎదిరించి ఉన్నట్లయితే అతడే తప్పక విజయం సాధించేవాడు. అంతేగాక దేశరక్షకుడైన తొలి వీరునిగా గొప్ప స్థానమును పొందగలిగి ఉండేవాడు. కానీ అతడు నాటి రాజకీయ అవసరాలను గుర్తించక తన పొరుగు రాజులను నొప్పించాడని చెప్పవచ్చు. ముఖ్యముగా జయచంద్రునికి అవమానము కలిగేలా ప్రవర్తించాడు. పృథ్వీరాజు ఘోరీ మహమ్మద్‌తో పోరాడి నశించినచో, తాను బలవంతుడై ఉత్తరదేశానికి ఆధిపత్యము వహించవచ్చునని జయచంద్రుడు ఈ యుద్ధములో తటస్థం వహించాడు, అని కొందరి అభిప్రాయము. మొత్తము మీద ముస్లింలతో పోరి వారిని కొంతకాలము నిగ్రహించినందువలన చరిత్రలో పృథ్వీరాజుకు గౌరవస్థానము ఇవ్వబడినది. అతడు తన శక్తియుక్తులను తన తోటి రాజపుత్రుల సమైక్యత కొరకు ఉపయోగించినట్లయితే చరిత్రలో అతని పేరు గొప్ప దేశభక్తునిగా సువర్ణాక్షరాలతో లిఖించబడి ఉండేది. మొత్తంమీద పృథ్వీరాజు మరణముతో హిందూ యుగము అంతరించి మహమ్మదీయ యుగము ప్రారంభమైనది.

**రాజపుత్రులు ఓటమికి కారణాలు :** విశేష సిరిసంపదలు అశేష జనసంఖ్య గల్గివున్న దేశానికి అధిపతులైవుండి ధైర్యసాహసాలకు మారు పేరుగా, ప్రాణభయం ఎరుగని యుద్ధవీరులుగా పేరుపొందిన రాజపుత్రులు తమ దేశంలో ప్రవేశించిన కొద్దిమంది తురుష్కుల చేతిలో ఓడిపోయి రాజ్యాలు పోగొట్టుకొన్నారు. నాగరికంగా దివ్యంగా భారతదేశం వెలిగేరోజులలో ఆర్థికవనురులులేని ముస్లింలు అతికొద్దిమంది వచ్చి అత్యధిక సంఖ్యాకులైన హిందువులను వారి జన్మభూమిలో సులభంగా ఓడించి, దేశాన్ని కొల్లగొట్టి, రాజపుత్రుల రాజ్యాలను ఆక్రమించి 7 శతాబ్దాలపాటు వైభవంగా ఈ దేశాన్ని పాలించడం అత్యంత ఆశ్చర్యకరమైన విషయం. విచారిస్తే అందుకు అనేకకారణాలు కన్పిస్తాయి. రాజపుత్రుల ఓటమికి కారణాలను సమకాలీన చరిత్ర కారులెవరు వివరించలేదు. అందువలన ఆనాటి వాస్తవకారణాలను తెలుసుకోవడానికి వీలుకాలేదు. అందువలన ఆధునిక చరిత్రకారులైన హసన్ నిజామి, మిన్హాజ్ సిరాజ్, అబ్దుల్ హర్ష్ వంటి చరిత్రకారుల రచనలు కొంతవరకు ఉపయోగపడుతున్నాయి. బ్రిటీషు చరిత్రకారులైన ఎల్ఫిన్‌స్టన్, లేన్‌పూల్, వి.ఎ.స్మిత్ ఫణిక్కర్, ఆర్.సి. ముజుందార్, కె.యస్.లాల్, ఎ.యల్. శ్రీవాత్సవ మొ॥న ఆధునిక చరిత్రకారులు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ చరిత్రకారుల అభిప్రాయలలో కొన్ని ఊహగానాలు మరికొన్ని వాస్తవ కారణాలు కలసివున్నాయి.

## 22.3. సారాంశం :

రాజ పుత్ర వీరులలో మిహీరభోజుడు, భోజుడు, జయచంద్రుడు, ముంజరాజు, విద్యాధరుడు, పృధ్వీరాజు మొదలైనవారు గొప్ప వీరులు సుప్రసిద్ధులు. వీరి కాలం సువిశాల సామ్రాజ్య నిర్మాణంకాక, కళలు అనేవి బాగా ప్రాచుర్యములోకి వచ్చాయి. భోజుడు కవి పండితుడు. సరస్వతీ సదనం అను విద్యాపీఠం, సంస్కృత కళాశాల కట్టించాడు.

## 22.4. మాదిరి ప్రశ్నలు

1. ఘూర్జర ప్రతీవాదుల గూర్చి వ్రాయుము?
2. పాల వంశము గూర్చి వ్రాయుము?

## సంక్షిప్త ప్రశ్నలు :

1. రాజ పుత్ర వంశాల గూర్చి వ్రాయుము?
2. గహద్వాలులు గురించి తెలుపుము?
3. పరమారుల వంశాన్ని గూర్చి వ్రాయుము?
4. చందేలుల వంశాన్ని గూర్చి వ్రాయుము?
5. సోలంకీల వంశాన్ని గూర్చి వ్రాయుము?
6. కాలచూరులు గురించి వ్రాయుము?

డా॥ ఎం. హనుమంతరావు

## పాఠం - 23

# దక్షిణ భారతదేశ రాజవంశాలు

**23.0 లక్ష్యం :**

దక్షిణ భారతదేశ చరిత్రలో 6 వ శతాబ్దము నుండి 12వ శతాబ్ద కాలంలో చాళుక్య, చోళ, రాష్ట్ర కూటులు ప్రముఖ స్థానం ఆక్రమించారు. వారి రాజకీయ, సామాజిక, సాంఘిక, మత పరమైన విషయాలు, పరిపాలనా పద్ధతులు, వాస్తు కళలు, సాహిత్యానికి చేసిన కృషిని వివరించడమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

**విషయక్రమం :**


23.1 ఉపోద్ఘాతం

23.2 చాళుక్యుల రాజ్యస్థాపన

23.2.1 మొదటి పులకేశి ఇతర రాజులు

23.3 రెండవ పులకేశి

23.3.1 దిగ్విజయ యాత్రలు

23.3.2 కడపటి చాళుక్యులు

23.3.3 సామ్రాజ్య పతన కారణాలు

23.3.4 చాళుక్యుల పరిపాలనా విధానం - సంస్కృతి

23.4 రాష్ట్రకూటులు

23.4.1 రాష్ట్రకూట రాజులు

23.4.2 రాష్ట్రకూటుల పతనం

23.4.3 రాష్ట్రకూటుల పాలనా వ్యవస్థ

23.4.4 సాంఘీక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు

23.5 చోళులు

23.5.1 సైనిక విజయాలు

23.5.2 రాజేంద్ర చోళుని వారసులు

23.5.3 చోళుల పరిపాలనా - సంస్కృతి

23.5.4 రాష్ట్రపాలన

23.5.5 గ్రామపాలన - స్థానిక పాలన

23.5.6 న్యాయపాలన

23.5.7 చోళులనాటి సాంఘీక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితి

23.6 సారాంశం

## 23.1 ఉపోద్ఘాతం :

దక్షిణ భారతదేశంలో శాతవాహనులు తరువాత దక్షిణదేశ ప్రాంతాన్ని సుమారు 7 శతాబ్దాల సుదీర్ఘకాలం పాలించిన వారు చాళుక్యులు. బాదామిని రాజధానిగా చేసుకొని చాళుక్య రాజ్యం స్థాపించిన ఈ వంశం అనేక శాఖలుగా విస్తరించింది. రాష్ట్రకూటుల విజృంభణవల్ల ప్రధానశాఖ కొన్నాళ్ళు మరుగున పడినా ఈ వంశంలో నుండి విస్తరించిన తూర్పు చాళుక్యులు వేంగిని రాజధానిగా చేసుకొని 4 1/2 శతాబ్దాలపాటు పాలించి చివరిదశలో చోళులకు వారసులై తమిళ దేశాన్ని ఒక శతాబ్దం పాటు పాలించారు. ప్రధాన శాఖలోనుండి చీలిన మరియొక శాఖ గుజరాతుకు వాట దేశంలో విస్తరించిలాటి దేశంలో ఖిల్జీ వంశస్తుల కాలందాకా పాలించింది. ఈ విధంగా 7 శతాబ్దాలు పాటు దక్షిణ, ఉత్తర పశ్చిమ ప్రాంతాలను చాళుక్యులు పరిపాలించారు. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ ఆంధ్ర దేశాలలో చాళుక్యులు నిర్మించిన దేవాలయాలు శిల్పకళలకు వారు చేసిన కృషిని చాటుచున్నవి. నాటి తెలుగు, కన్నడ, మరాటీ, గుజరాతీ మొదలగు ప్రాంతీయ భాషలు వీరి కాలంలోనే అభివృద్ధి చెందాయి. ఈ విధంగా రాజకీయ ఐక్యతను సాధించి మత సాహిత్య శిల్పకళలకు తుదిరూపాన్ని కల్గించి దక్షిణదేశ చరిత్రలో చాళుక్యులు గణనీయ పాత్రను నిర్వహించారు.

## 23.2 చాళుక్యుల రాజ్యస్థాపన :

చాళుక్య వంశానికి మూలపురుషుడు జయసింహుడు అతని కుమారుడు రణరాగుడు. వీరిద్దరు బనవాసిని పాలించిన కదంబులకు సామంతులు. చాళుక్య శాసనాలన్నీ తమ వంశానికి మూలపురుషుడు జయసింహుడు అని పేర్కొంటున్నాయి. అతని రాజధాని బాదామి. అతడు క్రీ.శ. 485 - 510 మధ్య పాలించి ఉండవచ్చును. అతని తరువాత అతని కుమారుడు రణరాగుడు క్రీ.శ. 510 నుండి 535 వరకు పాలించాడు. మొదటి ఈ ఇద్దరికాలంలో చాళుక్య రాజ్యం నేటి కర్నాటక రాష్ట్రంలోని బీజపూరు జిల్లాకు పరిమితమైవుండేది.

**23.2.1 మొదటిపులకేశి క్రీ.శ. 535 - 566 :-** ఇతర రాజులు స్వతంత్ర చాళుక్య రాజ్య స్థాపన చేసినవాడు రణరాగుని కుమారుడైన మొదటి పులకేశి. తన ప్రభువులైన కదంబులను ధిక్కరించి వాతాపి నాక్రమించి స్వతంత్ర్యం ప్రకటించాడు, తన రాజ్యవిస్తరణ కొరకు అతడు అనేక యుద్ధాలుచేసి తన విజయ సూచికంగా అశ్వమేధయాగం చేశాడని ఐహోలు శాసనం తెల్పుచున్నది. అతని విజయాలు, దండయాత్రలు, బాదామిలో నిర్మించిన కోట గూర్చిన విషయాలు క్రీ.శ. 543 లో విడుదల చేసిన బాదామివద్ద లభించిన శాసనం తెల్పుచున్నది. పులకేశికి సత్యాశ్రయ, చాళుక్యవల్లభ, చాళుక్యవల్లభేశ్వర, రణవిక్రమ అని బిరుదులున్నట్లు చాళుక్య శాసనాలు తెల్పుచున్నాయి పులకేశి విజయాల వలన చాళుక్య రాజ్యం బీజపూరు ప్రాంతం నుండి మహారాష్ట్రలోనికి విస్తరించింది.

**కీర్తివర్మ (క్రీ.శ. 566 - 598) :-** మొదటి పులకేశి తరువాత అతని కుమారుడైన మొదటి కీర్తివర్మ సింహాసనాన్ని అధిష్టించాడు. అతడు చాళుక్య రాజ్యాన్ని సుమారు మూడు దశాబ్దాలు సమర్ధవంతంగా పరిపాలించాడు. బాదామిలో తన 12 వ పాలనా సం॥లో కీర్తివర్మ వేయించిన శాసనం అతని విజయాలను పరిపాలనా దక్షతను కీర్తించినది. అతడు రాజధాని వాతాపి నగరంలో అనేక రాజప్రాసాదాలు, దేవాలయాలు నిర్మించి ఆ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దాడు. కీర్తివర్మ సోదరుడు అయిన మంగళేశుని మహాకూట శిలాశాసనం కీర్తివర్మ అంగ, కళింగ, మగధలపై దండయాత్రలు చేసి వాటిని జయించినట్లు పేర్కొంటున్నది. చాళుక్య అధికారాన్ని దక్షిణ ప్రాంతానికి విస్తరించడానికి అతడు కదంబులను ఓడించి ఉత్తర కొంకణ, కెనర ప్రాంతాలను, జయించాడు. కీర్తివర్మ చేసిన యుద్ధాలు, సాధించిన విజయాల వలన బీజపూర్ జిల్లా ప్రాంతానికే పరిమితం అయిన చాళుక్య అధికారం వివిధ ప్రాంతాలకు విస్తరించి, విశాల చాళుక్య సామ్రాజ్యంగా రూపొందింది.

**మంగళేశుడు - అంతర్యుద్ధం- క్రీ.శ. 597 - 609 :-** కీర్తివర్మ మరణించే నాటికి అతని కుమారుడు రెండవ పులకేశి చిన్నవాడు అయినందున, కీర్తివర్మ సోదరుడు మంగళేశుడు సింహాసనం అధిష్టించాడు. మంగళేశుడు కూడా సోదరునివలె సమర్ధుడు. అతడు అనేక దండయాత్రలు జరిపి చాళుక్య సామ్రాజ్యాన్ని ఇంకా విస్తరించాడు. అతని ఆధ్వర్యంలో చాళుక్య సైన్యాలు తూర్పు, పశ్చిమ సముద్రాల

వరకు దండయాత్రలు జరిపాయి. పశ్చిమతీరాన ఉన్న రేవతి ద్వీపాన్ని జయించాడు కాలచూరులను ఓడించాడు. మంగళేశునికి 'పరమ భాగవత' అను బిరుదు ఉన్నది. మంగళేశుడు తన తరువాత చాళుక్య సింహాసనాన్ని తన వారసులకు దక్కాలని ప్రయత్నించాడు అందువలన రెండవ పులకేశికి మంగళేశుడికి మధ్య వారసత్వ యుద్ధం జరిగింది. ఆ వారసత్య యుద్ధంలో రెండవ పులకేసి మంగళుని వధించి చాళుక్య సింహాసనాన్ని క్రీ.శ 609లో అధిష్టించినట్లు ఐహోలు శాసనం వివరిస్తున్నది.

**23.2.3 రెండవ పులకేశి క్రీ.శ. 609 - 642 :-** రెండవ పులకేశి బాదామి చాళుక్య వంశంలోనేగాక దక్షిణ భారతదేశ చరిత్రలోనే అగ్రగణ్యుడు, అతడు మహావీరుడు, అనేక దిగ్విజయ యాత్రలు చేసి అనేక రాజవంశాలను ఓడించి మహారాష్ట్ర, మాళవ, కళింగ, ఆంధ్ర కర్ణాటకాలను జయించి చాళుక్య సామ్రాజ్యాన్ని నలుదిక్కులకు విస్తరించాడు. ఈ విజయ పరంపరలో చాళుక్యుల కీర్తి ప్రతిష్టలు మిన్నుముట్టాయి. ఇతని విజయాలను అతని సేనాని, కవి రవికీర్తి వేయించిన ఐహోలు శాసనం తెలియచేస్తుంది.

**23.2.3.1 దిగ్విజయ యాత్రలు :-** పులకేశి రాజ్యానికి రాగానే అంతర్యుద్ధ కాలంలో తిరుగుబాటు చేసి స్వతంత్రులైన చాళుక్య సామంతులు అప్పాయిక, గోవిందులను ఓడించాడు. తన అధికారాన్ని స్థిరపరచుకొని దిగ్విజయానికి పూనుకొన్నాడు. మొదట ఇతడు తన రాజ్యానికి దక్షిణాన వున్న మైసూర్ గాంగులను, బనవాసి కదంబులను, మలబారు ప్రాంతంలోని అలూపులను ఓడించాడు. తరువాత కొంకణ దేశాన్ని ఏలుతున్నా మౌర్యులను ఓడించి మధ్య భారత్‌లోని లాట, మాళవ, ఘూర్జర దేశాలపై దండెత్తాడు. అక్కడినుండి బయలుదేరి దక్షిణ కోసల, కళింగదేశాలను ఆక్రమించి ఆంధ్రదేశంపై దండెత్తాడు. మొదట పిష్ట పురాన్ని జయించి వేంగిలో ప్రవేశించాడు. కొల్లూరు యుద్ధంలో విష్ణుకుండిన రాజైన మూడవ మాధవవర్మను ఓడించి వేంగినాక్రమించి తన సోదరుడైన కుబ్జ విష్ణువర్ధనుని రాజప్రతినిధిగా నియమించాడు. కొల్లూరు యుద్ధం 624 లో జరిగిందని భావిస్తారు. తరువాత పుల్లలూరు వద్ద పల్లవరాజు మహేంద్రవర్మని ఓడించి పల్లవ రాజ్యంలోని ఉత్తర ప్రాంతాన్ని తన సామ్రాజ్యంలో కలుపుకొన్నాడు. కావేరీనదిని దాటి చేర, చోళ పాండ్యులతో రాజ్యాలపై దండెత్తగా వారు పోరాడకుండా లొంగి కప్పాన్ని సమర్పించి మైత్రి చేసుకున్నాడు. ఈ విజయ పరంపరల వలన పులకేశి మహారాష్ట్ర కర్ణాటక ఆంధ్రరాష్ట్రాలకు సార్వ భౌముడయ్యాడు. గౌతమి పుత్రశాతకర్ణి తరువాత దక్షిణ దేశాన్నంతటినీ ఏకంచేసి మహాసామ్రాజ్యాన్ని నిర్మించినవాడు పులకేశి ఒక్కడే.

**హర్షుని ఓడించుట :-** పులకేశి సమకాలీనుడైన హర్షచక్రవర్తి తన ఉత్తరదేశ విజయయాత్ర అనంతరం దక్షిణదేశంపై దండెత్తాడు. పులకేశి అతనిని నర్మదానదిపై ఓడించాడని కనోజ్ వరకు తరిమికొట్టాడని ఐహోలు శాసనం తెలియచేస్తుంది. ఈ యుద్ధం క్రీ.శ 612 లో జరిగిందని కొందరు 632 లో జరిగిందని మరికొందరు భావించారు. ఈ యుద్ధం పులకేశి జీవిత చరిత్రలోనే గాక చాళుక్యవంశ చరిత్రలో ఒక ప్రముఖ ఘట్టంగా పేర్కొనబడింది. ఈ విజయం తరువాత పులకేశి పరమేశ్వర అను బిరుదు ధరించాడు.

**సామ్రాజ్య విస్తరణ :-** ఈ విజయాల వల్ల పులకేశి సామ్రాజ్యం ఉత్తరాన నర్మదానది నుంచి దక్షిణాన నీలగిరి పర్వతాలు వరకు, తూర్పున బంగాళాఖాతము మొదలుకుని పశ్చిమాన అరేబియా సముద్రం వరకు విస్తరించింది. ఇంతటి విశాల సామ్రాజ్యాన్ని పాలించిన దక్షిణ రాజు మరెవ్వరూ లేరు.

**పర్షియా రాయబారి :-** పులకేశి కీర్తి ప్రతిష్టలు విదేశాల్లోకి పాకాయి. పర్షియా చక్రవర్తి రెండో ఖుస్రూ ఇతని కీర్తి ప్రతిష్టలను విని స్నేహాన్ని కోరి కానుకలను - ఒక రాయబారిని ఆస్థానానికి పంపాడని అక్కడి చరిత్రకారుడు తబరీ రచనలు చెబుతున్నాయి. ఈ రాయబారి పులకేశి దర్బారును దర్శించినట్లు అజంతా గుహల్లో వర్ణచిత్రం ఉంది.

**హుయాన్‌త్సాంగ్ :-** ఈ కాలంలో భారతదేశం వచ్చిన చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ క్రీ.శ. 640 - 641 లో పులకేశి రాజ్యాన్ని దర్శించి అక్కడ పరిస్థితులను వ్రాసాడు. చాళుక్యరాజ్యం సువిశాలమైనదని సిరిసంపదలతో తులతూగుతున్నదని, పులకేశికి గొప్ప సైన్యం ఉందని వ్రాసాడు. ప్రజలు యుద్ధప్రియులని, కష్టజీవులని, వ్రాశాడు.

**మరణం :-** సువిశాల సామ్రాజ్యం నిర్మించి, దిగంతాలకు కీర్తిని వ్యాపింపచేసుకున్న పులకేశి జీవితం చివరి దశలో విషాదాంతంగా ముగిసింది. పులకేశి చివరి కాలంలో పల్లవ రాజైన నరసింహవర్మ తన తండ్రి మహేంద్రవర్మను పులకేశి పుల్లలూరు యుద్ధంలో చంపినందుకు ప్రతీకారంగా క్రీ.శ 642 లో అతనిపై దండెత్తాడు. "మణిమంగళ" యుద్ధంలో పులకేశిని ఓడించి సంహరించినట్లు, వాతాపి పట్టణాన్ని దగ్ధం చేయించినట్లు మల్లిఖార్జునుని దేవాలయంలోని శిలపై చెక్కించాడు. తన విజయానికి చిహ్నంగా నరసింహవర్మ వాతాపికొండ బిరుదు ధరించాడు. ఇతని దండయాత్ర చాళుక్య రాజ్యాన్ని చావుదెబ్బ తీసింది. నరసింహవర్మ దాడివలన జరిగిన నష్టంనుండి చాళుక్య రాజ్యం కోలుకోవటానికి 12 సం॥ల కాలం పట్టింది.

**23.3.2 మొదటి విక్రమా దిత్యుడు (క్రీ.శ. 642 - 680) :-** పులకేశి మరణానంతరం అతని కుమారుడగు మొదటి విక్రమాదిత్యుడు తండ్రిని చంపినవానిపై పగ సాధించుటకు పల్లవ రాజ్యంపై దండెత్తినాడు. పల్లవరాజును ఓడించి అతని కుమార్తెను వివాహమాడాడు. చివరిలో పల్లవచక్రవర్తి యగు పరమేశ్వరవర్మ పెరువళనల్లూర్ యుద్ధంలో ఇతనిని ఓడించాడు. విక్రమాదిత్యుడు తన తమ్ముడు జయసింహవర్మ మరాటా రాష్ట్రంలో చాళుక్య ప్రతినిధిగా నిలిచాడు. అతని వంశస్తులు తరువాత స్వతంత్రులయ్యారు. వారే గుజరాత్‌ను పాలించారు. సోలంకీలనే పేరుతో 13 వ శతాబ్దం వరకు పాలించాడు.

**వినయాదిత్యుడు క్రీ.శ. 680 - 696 :-** విక్రమాదిత్యుని తరువాత అతని కుమారుడు వినయాదిత్యుడు క్రీ.శ. 680 లోరాజ్యానికి వచ్చి 696 వరకు పాలించాడు. ఇతని కాలంలో అలంపూర్ దేవాలయాల నిర్మాణం జరిగింది. ఆ దేవాలయాల వద్ద వినయాదిత్యుని శాసనం వున్నది.

**విజయాదిత్యుడు :-** వినయాదిత్యుని తరువాత అతని కుమారుడు విజయాదిత్యుడు క్రీ.శ. 696 లోరాజ్యానికి వచ్చి 733 వరకు 37 సం॥లు పాలించాడు.

**రెండవ విక్రమాదిత్యుడు.** క్రీ.శ. 733 - 747 :- విజయాదిత్యుని తరువాత అతని కుమారుడు రెండవ విక్రమాదిత్యుడు 733 - 747 వరకు పాలించి అరబ్బుల దండయాత్రలను అరికట్టాడు. ఇందుకు లాట రాజైన జయసింహవర్మ కుమారుడైన పులకేశి ఎంతగానో తోడ్పడ్డాడు. అతనికి అవనీ జనాశ్రయ అనే బిరుదులిచ్చాడు. తరువాత పల్లవరాజ్యంపై దండెత్తి నందివర్మను ఓడించి కాంచీపురాన్ని కొల్లగొట్టి తన విజయ విశేషాలను కైలాసనాథ దేవాలయ స్థంభంపై చెక్కించారు. తరువాత చేర, చోళ, పాండ్య, కలభ్రులను ఓడించి కన్యాకుమారి వరకు చాళుక్య అధికారాన్ని విస్తరించాడు. అతని విజయాలకు సంకేతంగా అతని పట్టపురాణి బాదామి సమీపంలోని పట్టడకల్‌లో దేవాలయాన్ని నిర్మించింది. చాళుక్యుల కీర్తిప్రతిష్టలు, ప్రతిభ పూర్వస్థితికి వచ్చాయి. తొలి చాళుక్యలలో ఇతడు చివరిగొప్పవాడు. కాని అతడు సాధించిన విజయాలు ఎక్కువకాలం నిలువలేదు.

**రెండో కీర్తివర్మ 747 - 757 :-** తరువాత అతని కుమారుడు రెండవ కీర్తివర్మ రాజై 747 - 757 వరకు పాలించాడు. ఇతని కాలంలో పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతంలో చాళుక్య అధికారం క్షీణించింది. దానినాసరాగా తీసుకొని అతని సామంతుడైన దంతిదుర్గుడు కొల్హాపూర్ ప్రాంతంలో స్వతంత్రం ప్రకటించుకొన్నాడు. కీర్తివర్మ అతనిని అదుపులోనికి తీసుకురాలేక పోయాడు. క్రమేపి దంతిదుర్గుడు బలపడ్డాడు. చాళుక్య అధికారం క్షీణించిందని తెల్పే అనేక శాసనాలు మహారాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో లభించాయి. వాటిలో ముఖ్యమైనవి ఎవియూర్ శిలాఫలక శాసనం, దిమిరాజ్ ఫలకములు. దంతిదుర్గుని తరువాత రాజ్యానికి వచ్చిన మొదటి కృష్ణుడు కీర్తివర్మను పూర్తిగా ఓడించి పారదోలాడు. దానితో చాళుక్య సామ్రాజ్యం అస్తమించింది. చాళుక్య సామ్రాజ్య భాగాలన్ని రాష్ట్రకూటుల వంశం అయి రాష్ట్రకూట రాజ్యం సామ్రాజ్యంగా మారింది.

**సామ్రాజ్య పతన కారణాలు :-** పులకేశి మరణానంతరం పల్లవులకు, చాళుక్యులకు కలహం ఏర్పడి ఒక శతాబ్దం పాటు నిరంతర పోరాటాలు సాగాయి. ఇదేకాలంలో చాళుక్యులు అరబ్బులను ఎదిరించవలసి వచ్చింది. ఈ పోరాటాలు సామ్రాజ్యాన్ని బలహీనపరచి ధనాగారాన్ని ఖాళీచేశాయి. నిరంతర యుద్ధాల వల్ల సైనికబలం క్షీణించింది. ఈ పరిస్థితుల్లో చాళుక్య సామంతులు స్వాతంత్ర్యాన్ని

ప్రకటించారు. చివరి చాళుక్య రాజైన కీర్తివర్మ అసమర్థుడైనందున వారిని అణచలేకపోయాడు. రాష్ట్రకూట దంతిదుర్గుడు **744 లో** విజృంభించి చాళుక్య రాజ్యాన్ని ఆక్రమించడంతో బాదామి చాళుక్య సామ్రాజ్యం అంతరించింది.

**23.3.4 చాళుక్యుల పరిపాలనా విధానం - సంస్కృతి :** చాళుక్యుల కాలంలో కొద్ది మార్పులతో శాతవాహనుల పరిపాలన కొనసాగింది రాజు సర్వాధికారి. రాచరికం వారసత్వం. రాజుసర్వాధికారి అయినప్పటికి ప్రజారంజకుడు. ప్రాచీనకాలం నుంచి ఆనవాయితీగా సాంప్రదాయంగా వస్తున్న అధికారాలను కొనసాగించి, ధర్మశాస్త్ర నియమాల ప్రకారం పాలించాడు. ధర్మశాస్త్ర నియమాలు రాజ్యం అంతటా సక్రమంగా అమలు జరిపారు. చాళుక్య చక్రవర్తులు శ్రీపృధ్వీవల్లభ, సత్యాశ్రయ, పరమ మహేశ్వర అను బిరుదులు ధరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని రాష్ట్రాలుగా, రాష్ట్రాలను విషయాలుగా విభజించారు. రాష్ట్రపతి అని - విషయాధికారిని, విషయపతి, మహత్తరుడు అని అనేవారు. రాజ్యంలోని ఉన్నత ఉద్యోగాలలోను, రాష్ట్ర విషయ పాలకులుగా రాజకుటుంబానికి చెందినవారిని నియమించారు. గ్రామ స్థాయి పరిపాలనలో గ్రామపెద్దల సభకు పాలనాధికారాన్ని కల్పించినప్పటికి గ్రామంలోని ప్రభుత్వాధికారుల ప్రమేయం ఎక్కువగా ఉండేది. చాళుక్య పాలనలో ఉద్యోగులకు జీతాలుకు బదులు జాగీరులు, మాన్యాలిచ్చారు. నగరపాలనలో వర్తక సంఘాలు, వర్తక శ్రేణులు ప్రముఖపాత్ర నిర్వహించేవి. సామంత రాజ్యాలలోని ప్రభువులు చక్రవర్తికి నామమాత్రంగా విధేయులై కప్పాలు చెల్లించే వారు. వారిరాజ్యంలో వారికి సర్వహక్కులుండేవి.

**భూమిశిస్తు :-** చాళుక్యుల పరిపాలనలో భూమిశిస్తు ముఖ్యమైన ఆదాయం. అనేక నూతన ప్రాంతాలు సాగులోకి తెచ్చి వ్యవసాయరంగంగాన్ని బాగా అభివృద్ధి చేసేరు. భూమి మీద వ్యవసాయదారులకు సర్వాధికారాలున్నాయి. వ్యవసాయదారులు తమపంటలో 6 వ వంతు శిస్తును రాజు చెల్లించేవారు. ప్రభుత్వం భూమిశిస్తుతో పాటు ఇతర చేతి వృతులు, వాణిజ్యవర్తక వర్గాల నుంచి కూడా ఆదాయం లభించేది. ఇంటిపన్ను గూడా వసూలు చేసేవారు. నిరంతరం జరిగే యుద్ధాల కారణంగా ఆనాడు చాళుక్యులు చాలావరకు తమ ఆదాయాన్ని సైనిక పోషణకు ఖర్చు చేసేవారు. హ్యుయాన్‌త్సాంగ్, చక్రవర్తి తన ఆదాయాన్ని నాల్గుభాగాలుగా విభజించేవాడని వ్రాశాడు. మొదటిది ప్రభుత్వ నిర్వహణకు, సైనిక పోషణకు, రెండవది ప్రభుత్వోద్యోగుల వేతనాలకు, మూడవది కవి పండితులకు, కళాకారులకు, నాల్గవది దానధర్మాలకు ఖర్చుపెట్టేవాడని పేర్కొన్నాడు. ఆనాటి గ్రామీణ వ్యవస్థ స్వయం సంపూర్ణ ఆర్థిక వ్యవస్థ, రాజ కుటుంబీకుల కొరకు, శ్రీమంతుల కొరకు, విదేశీ వ్యాపారం కొరకు కొన్ని విలాసవస్తువులు ఉత్పత్తి చేసినప్పటికి ఆ వస్తువుల వలన వర్తక వాణిజ్యాలు పెద్దగా అభివృద్ధి చెందలేదు.

**సాంఘిక వ్యవస్థ :-** పశ్చిమ చాళుక్యుల కాలంలో సామాజిక వ్యవస్థలో పెద్దగా మార్పులు లేవు. సాంప్రదాయక చాతుర్వర్ణీకుల వ్యవస్థ కొనసాగింది. బ్రాహ్మణులు అగ్రస్థానంలో వున్నారు. సమాజంలో గొప్ప గౌరవమర్యాదలు పొందుతున్నారు. వైశ్యులు వర్తక వ్యాపారాలు కొనసాగిస్తుండేవారు. శూద్రులు వ్యవసాయం, ఇతర వృత్తులు, శారీరకంగా శ్రమపడే పనులను నిర్వహించారు. రాజ్యపాలన, సైనిక వృతిని చేపట్టిన వారిని హిందూ సమాజంలో క్షత్రియులుగా పరిగణించడం తరతరాలుగా వచ్చే సాంప్రదాయం. శూద్రులైనా సరే పాలనాధికారం చేపట్టిన తరువాత వారు క్షత్రియులుగా ప్రకటించుకుంటారు. అంతేగాక వారు తమవంశాన్ని ఏ పురాణకాలంనాటి ఎవరో ఒక ప్రముఖుని సంతతివారమని గూడా ప్రకటించుకొనేవారు. చాలామంది తాము సూర్య, చంద్ర, బ్రహ్మ, మను వంశస్థులమని ప్రకటించుకున్నారు. వారిని సాంప్రదాయబద్ధమైన క్షత్రియులుగా ప్రకటించటానికి కొన్ని క్రతువులు గూడా వున్నాయి. వారి మన్ననలను పొందటానికి బ్రాహ్మణులు ఆ క్రతువులను నిర్వహించి వారిని సుక్షత్రియులుగా ప్రకటించేవారు. ఆ విధంగా సామాజిక మార్పిడి జరగటమనేది ఈ యుగంలో ఆచరణలోవున్నది. అట్లే వృత్తులను బట్టి గూడా కులాన్ని నిర్ణయించేవారు. తమను క్షత్రియులుగా ప్రకటించినందుకు వారు బ్రాహ్మణులకు బహుమతులు ధనం, భూములను బహుకరించేవారు. చాళుక్యుల కాలంలో బ్రాహ్మణులకు దేవాలయాలకు మాన్యాలు, అగ్రహారాలు విరివిగా దానాలు చేసేవారు. రాజులేగాక సామాన్య ప్రజలుగూడా తమ శక్తికొలది దేవాలయాలకు దానాలు చేసేవారు. ఈ విధంగా దానాలు చేయడం శాతవాహనుల కాలంలో ప్రారంభమైంది. ఆ తరువాత దేశాన్ని పాలించిన అన్ని రాజవంశాలు ఈ విధానాలను కొనసాగించాయి. రెండవ పులకేశి కాలంలో చాళుక్య రాజ్యాన్ని దర్శించిన హ్యుయాన్ త్సాంగ్ ఆనాటి సామాజిక పరిస్థితులను ప్రజల జీవన విధానాలను తన గ్రంథంలో వివరించాడు. చాళుక్యరాజ్యంలో పంటలు విస్తారంగా పండేవని

ప్రజలు బాగా కష్టపడి పని చేసేవారని నిరాడంబరంగా జీవించేవారని వ్రాశాడు. ఆనాడు ప్రజలు ఎంతో నిజాయితీ కలవారని సహాయం చేసినవారికి కృతజ్ఞత చూపేవారని మోసం చేసినవారిని వంచనకు పాల్పడినవారిని ప్రాణాలుతీసి పగతీర్చుకొనేవారని గూడా హ్యుయాన్‌త్సాంగ్ వర్ణించాడు.

**మత పరిస్థితులు :-** ఉత్తర భారతదేశంలో గుప్తుల కాలంలో విశిష్టతను సంతరించుకున్న హైందవ మత పునరుజ్జీవన ఉద్యమం చాళుక్యుల కాలంలో దక్షిణదేశంలో బాగా అభివృద్ధిచెందింది. చాళుక్య రాజులు తమను పరమ భాగవత, పృధ్వీ వల్లభేశ్వర అని వర్ణించుకున్నారు. ఇవి వారికి ఉన్న వైదిక మతానురక్తిని తెల్పుచున్నవి. మొదటి పులకేశి క్రీ.శ. 543 నాటి బాదామి శాసనంలో చాళుక్య వల్లభేశ్వరుడిగా పేర్కొనబడి అశ్వమేధ యాగాన్ని నిర్వహించాడు. తర్వాతి కాలంలో రాజులకు బదులు బ్రాహ్మణులు యజ్ఞాలు చేసేవారు. అందుకు కావలసిన ధనాన్ని వారికి రాజులు ఇచ్చేవారు. రాజులేకాక ప్రజలు కూడా దేవాలయాలకు, బ్రాహ్మణులకు దానాలు చేయడం పుణ్యప్రదంగా భావించారు. చాళుక్య రాజులు శైవ, వైష్ణవ రెండు మతాలను ఆదరించి రెండు రకాల దేవాలయాలను నిర్మించారు. పట్టడ్‌కల్‌లో హరిహర దేవాలయాలు నిర్మించబడినవి. పట్టడ్‌కల్ బాదామిలో అనేక త్రిమూర్తి ఆలయాలు నిర్మించబడ్డాయి. చాళుక్య రాజు వైదికమతాన్ని ఆదరించినా, వారు పరమత సహనాన్ని పాటించారు. జైన, బౌద్ధ దేవాలయాల నిర్మాణానికి కూడా ధనసహాయం చేశారు. రెండవ పులకేసి ఐహోల్ శాసనం లేఖకుడు రవికీర్తి జైన మతస్తుడు. అతడు ఐహోల్‌లో జైన దేవాలయాన్ని నిర్మించాడు. జైన ఆచార్యుడు అయిన ఉదయ దేవుని విక్రమాదిత్యుడు ఆదరించాడు. వారి ఆదరణ వలన జైనమతం దక్షిణ, మహారాష్ట్ర, ఆంధ్ర, కర్ణాటక దేశాలలో బహుళ వ్యాప్తి చెందింది. పశ్చిమ చాళుక్య యుగంలో ప్రాకృత భాష ప్రాముఖ్యతను కోల్పోయి, సంస్కృత భాష రాజభాష అయింది. ప్రాకృతం జనసామాన్య భాషగా సంస్కృతం కవి పండితుల ఉన్నత వర్గాల అభిమాన భాషగా వుండేది. ఆ భాషలోనే అనేక సాహిత్య రచనలు వెలువడ్డాయి. రెండవ పులకేశి ఆస్థానంలో వున్న రవికీర్తి ప్రఖ్యాత సంస్కృత పండితుడు రెండవ పులకేశి సామంతుడైన గంగాదుర్వినీతుడు 'శబ్దావతార' అనే వ్యాకరణాన్ని వ్రాశాడు. అంతేగాక అతడు భారవి వ్రాసిన కిరాతార్జునీయానికి గూడా వ్యాఖ్యానం వ్రాశాడు. సంస్కృతంతో పాటు దేశీయభాషలకు గూడా ప్రోత్సాహం లభించింది. ఆంధ్ర, కన్నడ భాషలు ఈ కాలంలోనే తమ రూపును సంతరించుకున్నవి. ఆ భాషలకు చెందిన పదాలు, పద్యాలు వారి శాసనాలలో కన్పిస్తున్నాయి.

**దేవాలయాలు - శిల్పకళలు :-** దక్కన్‌లో హిందూ శిల్పకళకు పునాది వేసినవారు చాళుక్యులు. వారి దేవాలయాలలో ఉత్తర, దక్షిణ భారతదేశ శిల్ప కళ లక్షణాలు ఉన్నప్పటికి అవి మేళవింపబడి ఒక విశిష్టమైన శైలిగా రూపొందింది. అందువల్ల వారి వాస్తు శిల్పకళకు పెర్గూసన్ చాళుక్య శైలి అని పేరుపెట్టాడు. చాళుక్యుల వాస్తు శైలికి రాజధాని అయిన బాదామి దాని పరిసరప్రాంతాలలో వారు నిర్మించిన అనేక గుహాలయాలు, దేవాలయాలు నిదర్శనం. ఒక్క ఐహోలు ప్రాంతంలోనే దాదాపు 70 దేవాలయాలు నిర్మింపబడ్డాయి. చాళుక్య శిల్పకళా లక్షణాలు వారు పట్టడ్‌కల్‌లో నిర్మించిన దేవాలయాల సముదాయంలో విశేషంగా కన్పడుతున్నాయి అచట వారు 10 దేవాలయాలు నిర్మించారు. వాటిలో పాపనాధ దేవాలయం, విరూపాక్ష దేవాలయం విశిష్టమైనది. ముఖ్యంగా విరూపాక్ష దేవాలయం వారికాలం నాటి వాస్తుశాస్త్రానికి ప్రబల తార్కాణం. ఈ విరూపాక్ష ఆలయాన్ని రెండవ విక్రమాదిత్యుని పట్టపురాణి అయిన మహాదేవి తన భర్త విజయాలకు చిహ్నంగా పట్టడకల్‌లో ఈ అధ్భుతమైన దేవాలయాన్ని నిర్మించింది. దేవాలయాలు మతకేంద్రాలే గాక గొప్ప విద్యాకేంద్రాలయ్యాయి. అచట మతవిద్యలతో పాటు సంగీత నాట్య కళలు గూడా పోషింపబడుతుండేవి. పండితులు వేదాంతులు అచట ఎల్లపుడు చర్చలు జరుపుచుండేవారు. అనాధలకు అన్నదానం అచటనే జరుగుతుండేది. దక్షిణ భారతదేశ చరిత్రలో పశ్చిమ చాళుక్యులు పాలనను ఒక మహోన్నత యుగంగా వ్యవహరించవచ్చు. సుదీర్ఘపాలనలో వారు ఈప్రాంతంలో రాజకీయ ఐక్యతను సాధించి దక్షిణా పధంపై విదేశీ దండయాత్రను సమర్ధవంతంగా అరికట్టాడు. తొలి ముస్లిం దండయాత్రికులైన అరబ్బులు 712 లో సింధు ప్రాంతంలో తమ అధికారాన్ని స్థాపించుకొని ఇతర ప్రాంతాలకు విస్తరించడానికి ప్రయత్నాలు చేశారు. వారిని చాళుక్యులు సమర్ధవంతంగా నిరోధించారు. చాళుక్యరాజులు నిరంతరం యుద్ధాలలో మునిగివున్నప్పటికి దక్షిణాపధాన్ని అన్నిరంగాలలో అభివృద్ధిచేశారు. దేవాలయనిర్మాణం, శిల్పకళలు, చిత్రలేఖనం వివిధ లలిత కళలను పోషించారు. భారతజాతికి విశిష్ట లక్షణమైన మత సామరస్యం, మత సహనాన్ని సంధికాలం అనవచ్చు. వీరికాలంలో ప్రాచీన భారతీయ యుగం లక్షణాలు మారిపోయి మధ్య యుగ లక్షణాలు ప్రవేశించాయి. అనగా ఆర్థిక రాజకీయ మార్పులకు నాందిగా పాత వ్యవస్థ స్థానంలో నూతన వ్యవస్థకు అంకురార్పణ జరిగింది.

## 23.4 రాష్ట్రకూటులు

ఉత్తరదేశ రాజవంశాలను ఓడించి హిమాలయాల వరకు ఎదురు లేకుండా నడచిన ఏకైక రాజవంశం రాష్ట్రకూట వంశం. అందువల్ల దక్షిణ దేశాన్ని ఏలిన అన్నివంశాల్లోను మేటియని రాష్ట్రకూట వంశం కీర్తి వహించింది. రాష్ట్రకూటుల బాదామి చాళుక్యుల కాలంలో వారి సామంతులుగా మహారాష్ట్ర ప్రాంతాన్ని పాలించారు. రాష్ట్రకూటుల శాసనాలతో తాము లట్టలూరు పురాధీశులమని చెప్పుకొన్నారు. ఇది బీదరు జిల్లాలోని లాటూరని కనుక వారు కన్నడ దేశస్తులని ఆల్టేకర్ భావించాడు. మొత్తం మీద రాష్ట్రకూటులు అశోకుని కాలంనాటి మహారధికుల సంతానమని తరువాత వారు చాళుక్యులకు సామంతులుగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి వారిని కూలద్రోసి రాజ్యస్థాపన చేశారని భావించారు.

**23.4.1 దంతి దుర్గుడు క్రీ.శ 753 - 756 :** **రాష్ట్రకూట రాజ్య**స్థాపకుడు దంతిదుర్గుడు. దంతిదుర్గుడు రెండో విక్రమాదిత్యుడికి సామంతుడు. క్రీ.వ 747 లో రెండో విక్రమాదిత్యుడు మరణించాడు. తరువాత రెండవ కీర్తివర్మ రాజ్యానికి వచ్చాడు. అతడు కంచిపై దండెత్తాడు. అతడు కంచి దండయాత్రలో నందివర్మపై విజయం సాధించినప్పటికే నిరంతర పల్లవ చాళుక్య సంఘర్షణల వలన చాళుక్యరాజ్యం క్షీణదశకు చేరింది. చాళుక్యరాజ్య స్థితి తమకు అనుకూలంగా వున్నాయని దంతిదుర్గుడు స్వతంత్రవైఖరి నవలంబించి తన రాజ్య విస్తరణకు పూనుకున్నాడు. మొదట మాళవనేలు ఘూర్జరులపై దండెత్తి వారిని ఓడించి మాళవను ఆక్రమించాడు. తరువాత మధ్యప్రదేశ్‌లోని మహాకోసలను తన ఆధిపత్యం క్రిందికి తెచ్చాడు. తిరుగు ప్రయాణంలో కొంతమంది కళింగ స్థానిక పాలకులను ఓడించాడు. ఈ విధంగా 750 నాటికి దంతిదుర్గుడు దక్షిణ మధ్య గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్ ప్రాంతాలకు అధిపతి అయ్యాడు.

బాదామి చాళుక్యరాజు రెండో కీర్తివర్మ దంతిదుర్గుడిని నిర్లక్ష్యం చేయటం మంచిది కాదని దంతిదుర్గునిపై దండెత్తాడు. ఉభయ సైన్యాలు ఖాందేష్ ప్రాంతంలో తలపడగా దంతిదుర్గుడు విజయాన్ని సాధించి నాసిక్, పూనా, సతారా, కొల్హాపూర్ జిల్లాలను ఆక్రమించాడు. దీనితో అతడు మహారాష్ట్ర కంతటికి అధిపతి అయి 753 లో స్వతంత్రం ప్రకటించాడు. వెంటనే సార్వభౌమత్వానికి చిహ్నాలైన మహారాజాధిరాజ, పరమ మహేశ్వర, పరమ భట్టారక బిరుదులను ధరించాడు. తరువాత దంతిదుర్గుడు కంచిపై దండెత్తి నందివర్మను సునాయాసంగా ఓడించాడు. కాని నందివర్మకు తన కుమార్తె రేవతీదేవినిచ్చి వివాహం చేశాడు. ఇతడు క్రీ.శ 756 లో మరణించాడు.

**మొదటి కృష్ణుడు (756 - 775) :** దంతిదుర్గునికి కుమారులు లేనందువలన అతని పినతండ్రి కృష్ణుడు రాజ్యానికి వచ్చాడు. పతనమైపోతున్న బాదామి చాళుక్య అధికారాన్ని పునరుద్ధరించటానికి ప్రయత్నించిన రెండవ కీర్తివర్మను ఓడించి తరిమి చాళుక్య వంశాన్ని పూర్తిగా నాశనం చేశాడు. ఇతని కాలంలోనే వేంగిచాళుక్యులకు, రాష్ట్రకూటులకు మధ్య వైరం ప్రారంభమైంది. తరువాత మైసూరుపై దండెత్తి గాంగవంశ శ్రీ పురుషుని ఓడించాడు. దక్షిణంగా రాష్ట్రకూట రాజ్యాన్ని విస్తరించాడు. కృష్ణుడు గొప్ప యోధుడేకాక గొప్ప కళాపోషకుడుకూడా. అతడు ప్రఖ్యాతిపొందిన ఎల్లోరాలోని కైలాసనాధాలయాన్ని నిర్మించాడు. అది అద్భుత కళా ఖండం.

**ధ్రువుడు (780 - 792)** మొదటి కృష్ణుని తరువాత అతని పెద్ద కుమారుడు గోవిందుడు రాజ్యాధిపత్యం వహించాడు. అతడు అసమర్ధుడైనందున అతనిని పదభ్రష్టుణ్ణి చేసి అతని తమ్ముడు ధృవుడు రాజ్యానికి వచ్చాడు. ధృవుడు రాష్ట్రకూటులలో అగ్రగణ్యుడు. పశ్చిమ గాంగవాడి రాజ్యంపై దండెత్తి శ్రీపురుషుని కుమారుడైన శివమారుణ్ణి ఓడించి కారాగారంలో బందీగా వుంచి తన పుత్రుడైన స్తంభుణ్ణి గాంగ రాజ్యపాలకుడిగా నియమించాడు. దీనితో రాష్ట్రకూట రాజ్య దక్షిణ సరిహద్దు కావేరి నది పర్యంతం వ్యాపించింది. తర్వాత పల్లవులపై దండెత్తి వారినోడించి సామంతులుగా చేసుకొన్నాడు. తరువాత ధృవుడు వేంగి చాళుక్య రాజ్యంపై దండయాత్ర చేశాడు. నాల్గో విష్ణువర్ధనుడు ఇతని ధాటికి తట్టుకోలేక తనకుమార్తె అయిన శీలమహాదేవిని ధృవునికిచ్చి వివాహం చేసి అల్లునిగా చేసుకొన్నాడు. ఈ విజయాల తరువాత ధృవుడు ఉత్తర దేశంపై దండయాత్ర చేసి మాళవను, జయించి కనోజ్‌ను కొల్లగొట్టి ప్రతిహారుల చిహ్నమైన గంగా, యమునా తోరణాన్ని, పాల వంశస్తుల చిహ్నాలైన శ్వేతపత్రాలను కొల్లగొట్టిన అపార ధనరాసులతో క్రీ.శ 790 లో రాజధానికి మరలివచ్చారు. ధ్రువరాజుకు నిరుపమ కలివల్లభ, శ్రీవల్లభ, ధారావర్ష అను బిరుదులున్నాయి. గంగా, కావేరి నదుల మధ్య

ఇతని అధికారం తిరుగులేకుండా వర్ధిల్లింది. ధ్రువుని కాలంలో రాష్ట్రకూటుల సార్వభౌమత్వాన్ని ఎదిరించగల శక్తి దేశంలో ఏదీ లేదని ఆల్టేకర్ పండితుడు వర్ణించాడు.

**మూడో గోవిందుడు: క్రీ.శ 792 - 814 :** ధ్రువుడు తన మూడవ కుమారుడైన గోవిందుని తన వారసునిగా నియమించాడు. అతడు సింహాసనాన్ని అధిష్టించిన వెంటనే అతని అన్న స్తంభుడు న్యాయంగా తనకు సింహాసనంపై హక్కు ఉందని ప్రకటించి గోవిందుని కూలద్రోయడానికి గాంగ, వల్లభ, వేంగి మొదలైన 12 మంది రాజులను కూడగట్టి, ఒక కూటమిని ఏర్పరచి తమ్మునిపై తిరుగుబాటు చేసాడు. గోవిందుడు అన్నకు సహాయంగా వచ్చిన 12 మంది రాజుల కూటమిని ఓడించి, తన సింహాసనాన్ని రక్షించుకున్నాడు. దక్షిణ దేశ సైనిక విజయాల తరువాత అతడు తన తండ్రివలె ఉత్తర దేశంపై రాష్ట్రకూట సార్వభౌమాధికారాన్ని స్థాపించాలని ఉత్తర దేశం మీద దండయాత్రకు పూనుకున్నాడు. బుందేల్ ఖండ్ వద్ద గోవిందుడు ప్రతీహారరాజు నాగభట్టుని ఓడించాడు. మహా బలవంతుడైన గోవిందునితో వైరం మంచిది కాదనుకున్న కనోజ్ రాజైన చక్రాయుధుడు పూర్తిగా లొంగిపోయాడు.

వేంగి రాజయిన నాలుగో విష్ణువర్ధనుడు క్రీ.శ. 799 లో మరణించగా రాజ్యానికి వచ్చిన రెండో విజయాదిత్యుడు రాష్ట్రకూట సార్వభౌమత్వాన్ని సవాలు చేసాడు. దానితో అతణ్ణి మూడో గోవిందుడు ఓడించి, అతని తమ్ముడైన భీమసలుకుని వేంగిరాజుగా చేసాడు. గోవిందుడు ఉత్తర దండయాత్రలో ఉన్నపుడే పల్లవ, పాండ్య, కేరళ, గాంగ మొ॥ దక్షిణదేశ రాజులు గోవిందునికి వ్యతిరేకంగా ఒక కూటమిని ఏర్పరిచారు. ఈ విషయం తెలిసిన మూడో గోవిందుడు వారిపై దాడిచేసి రాజకూటమిని క్రీ.శ 802 లో ఓడించాడు. తరువాత గోవిందుడు కంచిని ఆక్రమించాడు. రాష్ట్రకూటుల కంచి ఆక్రమణ గురించి విన్న సింహళ (సిలోన్) రాజు భయకంపితుడై గోవిందునికి కానుకలు పంపాడు.

**అమోఘవర్షుడు (కీ.శ 813 - 880) :** మూడో గోవిందుని తరువాత అతని ఏకైక కుమారుడు అమోఘవర్షుడు రాజయ్యాడు. కాని అతడు చిన్న వాడయినందున అతని పినతండ్రి కుమారుడైన కర్కరాజు సంరక్షకుడిగా రాజ్యభారాన్ని చేపట్టాడు. అదే మంచి అవకాశంగా భావించిన సామంత రాజులందరూ స్వతంత్రులవడానికి తిరుగుబాటు చేసారు. అమోఘవర్షుని ధిక్కరించిన వారిలో ముఖ్యులు తూర్పు చాళుక్యులు. రెండో విజయాదిత్యుడు భీమసలుకుని రాజ్యం నుండి తరిమివేసి వేంగి సింహాసనాన్ని ఆక్రమించాడు. రెండో విజయాదిత్యుని బల పరాక్రమాలను గుర్తించిన అమోఘవర్షుడు తన సోదరిని వేంగి యువరాజైన నాల్గవ విష్ణువర్ధనునికి ఇచ్చి వివాహం చేసి బంధుత్వాన్ని ఏర్పర్చుకున్నాడు.

అమోఘవర్షుడు యుద్ధాల్లో మునిగి ఉండటం వల్ల ఉత్తరాన కనోజ్‌లో మిహిరభోజుడు, దక్షిణాన గాంగవాడి రాజునీతిమార్గుడు స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. గాంగవాడి రాజుని ఓడించి రాజనీతిజ్ఞతతో అమోఘవర్షుడు దాన్ని తిరిగి గాంగరాజుకి ఇచ్చివేసి, అతని కుమారుడు బూతుగకి తన కూతురును ఇచ్చి వివాహం చేసి ఉభయ వంశాల మధ్య బంధుత్వాన్ని ఏర్పరచాడు.

అమోఘవర్షుడు గొప్పకవి. అతడు కన్నడ భాషలో కవిరాజమార్గం అనేకావ్యం రచించాడు. అమోఘవర్షుడు "మాన్యఖేడ" (మాల్కేడ్) నగరాన్ని నిర్మించి దాన్ని తన రాజధానిగా చేసుకొన్నాడు. అరబ్బు యాత్రికుడైన సులేమాన్ నాటి ప్రపంచంలోని ప్రముఖ చక్రవర్తులలో అమోఘవర్షుడు ఒకడని ప్రశంసించాడు. అమోఘవర్షుడు జైనమతాభిమాని.

**రెండో కృష్ణుడు క్రీ.శ 880 - 915 :** అమోఘవర్షుని మరణానంతరం అతని కుమారుడు రెండవ కృష్ణుడు రాజ్యానికి వచ్చాడు. అతని కాలం నుండి రాష్ట్రకూట రాజ్యపతనం ప్రారంభమైంది. ప్రతీహార, కళింగ, గాంగ, మగధదేశ రాజులతో ఎడతెగని యుద్ధాలు చేయవలసి వచ్చింది. ఘూర్జర ప్రతీహార రాజైన మిహిభోజుడు కొంత రాష్ట్రకూట రాజ్యాన్ని ఆక్రమించాడు. తూర్పుచాళుక్య రాజైన గుణగ విజయాదిత్యుడు తన పూర్వీకులు అనుభవించిన అవమానాలకు ప్రతీకారంగా రాష్ట్రకూట రాజ్యం పై దండెత్తి కిరణపుర, అచలపుర, చక్రకూట పురాలను దగ్ధం చేశాడు.

**మూడవ ఇంద్రుడు క్రీ.శ. 915 - 927 :** రెండవ కృష్ణుని తరువాత రాజ్యానికి వచ్చిన తమ మూడో ఇంద్రుడు పూర్వీకులు పోగొట్టుకున్న రాజ్య భూభాగాలను పునరాక్రమించటానికి కృషి చేశాడు. ప్రతీహార, వేంగి రాజ్యాలలో కొంత ప్రాంతాన్ని ఆక్రమించాడు. ఆ తరువాత వచ్చిన మూడో అమోఘవర్షుడు (927-939) అపారమైన దైవభక్తి కల్గిన వాడైనప్పటికి అతడు పరిపాలనపట్ల అంతశ్రద్ధ వహించలేదు.

**మూడవ కృష్ణుడు (939-67) :** మూడవ అమోఘవర్షుని తరువాత అతని కుమారుడు మూడవ కృష్ణుడు రాజ్యానికి వచ్చి రాష్ట్రకూట సామ్రాజ్య వైభవాన్ని పునరుద్ధరించాడు. అతడు రాష్ట్రకూట వంశంలో చివరి గొప్పవాడు. యోధుడైన మూడవ కృష్ణుడు మొదట చోళులపై ప్రతీకారం తీసుకోదలచి తన బావమరది గంగవాడి రాజైన రెండో బూతుగి సహాయంతో చాళుక్య రాజ్యం పైదాడిచేశాడు. "తక్కోలం" వద్ద జరిగిన యుద్ధంలో చోళరాజు యువరాజు రాజాదిత్యుడు మరణించాడు. పరాంతకుడు ఓడిపోయాడు. తరువాత పాండ్య కేరళ రాజ్యాలను దోచుకొని రామేశ్వరం వద్ద విజయ స్థంభం నాటి సింహళంపైన తన అధికారాన్ని నెలకొల్పాడు. తరువాత వేంగిపై దండెత్తి తనకు ఇష్టుడైన బాడపుని వేంగిరాజుగా చేశాడు. తరువాత ఉత్తరదేశం పై దండెత్తి పరమారులను తరిమికొట్టి ఉజ్జయినిని కొల్లగొట్టాడు.

**23.4.2 రాష్ట్రకూటుల పతనం :** మూడోకృష్ణుడు రాష్ట్రకూట రాజ్యానికి పోసిన జీవం ఎంతోకాలం నిలువలేదు. మూడోకృష్ణుని తర్వాత అతని తమ్ముడు ఖోట్టిగ రాజయ్యాడు. మాళవరాజు హర్షసీయకుడు ఖోట్టిగను ఓడించి మాన్యఖేటాన్ని క్రీ.శ. 972 లో విధ్వంసం చేశాడు. రాష్ట్రకూట సామ్రాజ్యానికి కల్గిన తీరని అవమానానికి కుంగిపోయి ఖోట్టిగ 972 లో మరణించాడు. తర్వాత రెండో కర్కరాజు 972 లో రాజ్యానికి వచ్చాడు. అతడు అసమర్ధుడు. అదే అదునుగా తీసుకొని తాండవాడిని పాలించే సామంతరాజైన చాళుక్య రెండవ తైలపుడు కర్కరాజును ఓడించి పారద్రోలాడు. రాష్ట్రకూట రాజధాని మాల్‌ఖేడును ఆక్రమించి పశ్చిమ చాళుక్య అధికారాన్ని ప్రతిష్టించాడు. కర్కరాజు తైలపుని ఎదిరించటానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదు. మూడవ కృష్ణుని మనుమడు నాల్గవ ఇంద్రుడు రాష్ట్రకూట అధికారాన్ని పునః ప్రతిష్ట చేయటానికి ప్రయత్నించాడు. కాని అతనిని తైలపుడు అణచివేశాడు. దానితో 225 సం॥ పాలించిన రాష్టకూట సామ్రాజ్యం అంతరించిపోయింది.

**23.4.3 రాష్ట్రకూటుల పరిపాలనా వ్యవస్థ :** రాష్ట్రకూటులు బాదామి చాళుక్యుల పరిపాలన వ్యవస్థను కొనసాగించి ధర్మబద్ధంగా పాలించారు. ఎడతెగని యుద్ధాలతో మునిగి తేలినా ప్రజాక్షేమాన్ని విడనాడ లేదు. పరిపాలన వ్యవస్థలో ప్రజలకు, ప్రజాభిప్రాయానికి విలువనిచ్చారు. రాష్ట్రకూట రాజులు మహారాజాధిరాజ, పరమ భట్టారక, ధారావర్ష, విక్రమావ లోక అనే బిరుదులు ధరించారు. రాజు సర్వాధికారి. రాజరికం వారసత్వం. అయితే అన్ని వేళల్లో జేష్ట కుమారుడు రాజ్యానికి రాలేదు. సమర్ధులైతే చిన్నకుమారులు కూడా రాజ్యాధికారాన్ని చేపట్టారు. వారసత్వ సంప్రదాయాన్ని పాటించనందున సోదరుల మధ్య వారసత్వ యుద్ధాలు జరిగాయి. పరిపాలనలో యువరాజు రాజుకు సహాయ పడేవాడు. రాజు సర్వసైన్యాధ్యక్షుడు. యుద్ధాలలో స్వయంగా సైన్యాన్ని నడిపేవాడు.

**మంత్రి పరిషత్తు :** పరిపాలనలో సహాయపడటానికి రాష్ట్రకూట రాజులకు మంత్రి పరిషత్తు ఉండేది. ప్రధానమంత్రి, ఆర్ధిక మంత్రి, కోశాధికారి, సైన్యాధిపతి, న్యాయాధిపతి, పురోహితుడు మంత్రి మండలిలో సభ్యులు. మంత్రి పరిషత్ సభ్యులను రాజు నియమిస్తాడు. ఆనాటి పరిపాలన శాఖలుగా విభజితమై ఉండేది.

**రాష్ట్రపాలన :** పరిపాలనా సౌలభ్యంకోసం సామ్రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించారు. సామ్రాజ్యాలలో కొంత భాగం సామంతుల అధికారంలోను, కొంత భాగం రాష్ట్రకూట ప్రభువుల ప్రత్యక్ష పాలనలో ఉండేది. వారి ప్రత్యక్ష పాలనలో ఉన్న ప్రాంతాన్ని రాష్ట్రాలు, విషయాలు, భోగాలు, గ్రామాలుగా విభజించారు. రాష్ట్రాధిపతిని రట్టగుడ అనేవారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను నిర్వహించడం, భూమిని సర్వే చేయించడం, శిస్తు వసూలు చేయడం ఇతర రకాల పన్నులు వసూలు చేయడం రాష్ట్రపతి విధులు. విషయాలపై

అధిపతికి విషయపతి, భోగాలపై అధిపతికి భోగపతి అని పేర్లు. గ్రామాలలో గ్రామ పరిపాలన గ్రామపెద్ద గ్రామ లేఖకుడు నిర్వహించేవాడు. శాంతి భద్రతలను కాపాడటం, శిస్తు వసూలు చేయడం వారి విధులు. గ్రామ రక్షణ చేయడానికి గ్రామపెద్ద ఆధ్వర్యంతో రక్షకదళం ఉండేది.

**భూమిశిస్తు విధానం - ఇతర పన్నులు :** రాజ్యానికి భూమిశిస్తు ప్రధాన ఆదాయం. భూమి పంటలో నాల్గవ వంతు శిస్తు వసూలు చేసేవారు. భూమి శిస్తును భోగాకార లేక ఉద్రంగ అని వ్యవహరించారు. శిస్తును పంట రాగానే వసూలు చేసేవారు. దేవాలయాలకు, బ్రహ్మణులకు దానాలు చేసిన భూముల మీద కొద్ది మొత్తాలను పన్నులుగా వసూలు చేశారు. పండ్ల తోటలకు ప్రత్యేక పన్నులు విధించేవారు. అనావృష్టి కాలంలో పన్నులను మినహాయించేవారు. వ్యాపారులపై వ్యాపార సుంకాలు ఉండేవి. అడవులు, గనులపై ప్రత్యేక పన్నులు విధించి వసూలు చేశారు.

**సైనిక వ్యవస్థ :** రాష్ట్రకూట సామ్రాజ్య నిర్మాతలు కావడంతో వారు పెద్ద సైన్యాన్ని పోషించారు. రాష్ట్రకూటులకు అయిదున్నర లక్షల సైన్యం ఉండేది. రాష్ట్రకూటులు సిద్ధసైన్యం, సామంతుల సైన్యం పేర రెండురకాలు పోషించారు. రాష్ట్రకూటులు అన్ని వర్గాలను తమ సైన్యంలో చేర్చుకున్నారు. బ్రాహ్మణులు జైనులు కూడా సైన్యాధిపతులుగా చేరారు. సేనాధిపతులు బంకేయ, శ్రీవిజయ జైన మతస్థులు.

**23.4.4 సాంఘిక పరిస్థితులు :** రాష్ట్రకూటుల కాలంలో కూడా సాంప్రదాయకంగా వచ్చే వర్ణాశ్రమ ధర్మాలతో కూడిన కులవ్యవస్థ కొనసాగింది. సమాజంలో బ్రాహ్మణులకు ప్రథమ స్థానం ఉన్నది. బ్రాహ్మణులకు పన్నుల మినహాయింపు ఉండేది. శూద్రులు రాజసేవలో సైనికులు, సేనాధిపతులు, మండలీకులుగా ఉద్యోగాలు సంపాదించారు. సతి ఆచారం పెద్దగా లేదు.

**ఆర్థిక పరిస్థితులు :** వ్యవసాయం ప్రధాన వృత్తి. నీటి వనరులు కూడా తక్కువగానే ఉన్నాయి. వరి, జొన్న, ప్రత్తి ప్రధాన పంటలు. రాజ్యంలో అడవులు ఎక్కువగా ఉండేవి. చందనం, టేకు, కలప వల్ల కొంత ఆదాయం వచ్చేది. పరిశ్రమలు, వ్యాపారం, వాణిజ్యాల వలన అధిక ఆదాయం వచ్చేది. గుజరాత్, బేరారు, తెలంగాణాలలో వస్త్ర పరిశ్రమలు ఉండేవి. పశ్చిమ తీరంలో అనేక రేవు పట్టణాలుండేవి. ఆ రేవుల గుండా వస్త్రాలు విదేశాలకు ఎగుమతి అయ్యేవి. ఈ కాలంలో అరబ్బులు భారత దేశంలో వ్యాపారం సాగించారు.

**మత పరిస్థితులు :** రాష్ట్రకూటుల కాలంలో హిందూ మతం ప్రధానమైంది. తరువాత స్థానం జైనమతానిది. బౌద్ధమతం క్షీణదశలో ఉంది. రాష్ట్రకూటులు జైన మతాభిమానులు. అమోఘవర్షుడు, నాలుగో ఇంద్రుడు, మూడోకృష్ణుడు జైన దేవాలయాలకు, జైన బసదులకు విరివిగా దానాలు చేశారు. వారి సామంతులైన గాంగవాడి రాజులు కూడా జైన మతాన్ని పోషించారు. వీరి వంశంలో కొందరు. వైదిక మతాన్ని అభిమానించారు. హిందూ దేవతలైన శివుడు, పార్వతి, విష్ణువు, లక్ష్మీ, సూర్యులను ఆరాధించారు. ఈ కాలంలో పండరి పాండురంగ క్షేత్రంగా అభివృద్ధి చెందింది. ఈ యుగంలోనే కుమారిలభట్టు, శంకరాచార్యులు తమ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. అందువలన బౌద్ధమతం క్షీణించడంతో హిందూమతం దినదిన ప్రవర్ధమానమైంది. దేవాలయంలో ఉత్సవాలు జరిగేవి. దేవదాసి వ్యవస్థ అభివృద్ధి చెందింది. దేవాలయాలకు అనుబంధంగా మఠాలు, విద్యా సంస్థలు ఉండేవి.

**భాష విద్య సారస్వతాలు :** రాష్ట్రకూటుల కాలంలో విద్య సాహిత్యాలు అభివృద్ధి చెందాయి. అమోఘవర్షుడు గొప్ప పండితుడు. రాష్ట్రకూటులు సంస్కృత, కన్నడ భాషలను పోషించారు. సంస్కృత పండితులకు అగ్రహారాలిచ్చారు. అగ్రహారాలు సంస్కృత భాషలకు, సంస్కృత విద్యలకు కేంద్రాలయ్యాయి. కర్ణాటక ప్రాంతంలోని సెల్‌లగలోని త్రయీపురుష దేవాలయం లోనికి అనుబంధంగా ఉన్న విద్యాసంస్థకు 27 వసతి గృహాలు ఉన్నాయని శాసనాలు చెబుతున్నాయి. ఆనాడు సంస్కృతం రాజభాష. అమోఘవర్షుని ఆస్థానంలో అనేక మంది జైన కవులుండేవారు. జనసేనుడు, పార్శ్వాభ్యుదయం అనే గ్రంధాన్ని రచించాడు. ఆ గ్రంధంలో జైన పార్శ్వనాధుడు జీవితాన్ని మేఘ సందేశంలోని శ్లోకాలతో పోల్చాడట. అతడే జైనుల ఆది పురాణాన్ని వ్రాశాడు. వీరాచార్యుడు గణిత సారాన్ని వ్రాశాడు.

మూడోకృష్ణుని ఆస్థానంలో కన్నడ కవిత్రయంలో రెండోవాడైన పొన్న, శాంతి పురాణాన్ని వ్రాశాడు. రాష్ట్రకూటుల సామంతులైన వేములవాడ చాళుక్యుల ఆస్థానంలో కన్నడ కవిత్రయంలోని పంపకవి నివశించి ఆది పురాణం, విక్రమార్జున విజయం అనే గ్రంధాలు రచించాడు. రాజశేఖరుడు వీరి ఆస్థాన కవి. ఇంకా అనేక మంది ప్రాకృత కవులను రాష్ట్రకూటులు పోషించారు.

**వాస్తు శిల్ప కళలు :** రాష్ట్రకూటులు పశ్చిమ చాళుక్యుల శిల్ప సంప్రదాయాలను అనుసరించి శిల్పకళను అభివృద్ధి చేశారు. పశ్చిమ చాళుక్యులు ప్రారంభించిన శైలికి పూర్తి రూపాన్ని సంతరించారు. రాష్ట్రకూటులు అనేక దేవాలయాలు నిర్మించారు. వారు నిర్మించిన దేవాలయాల్లో ఎల్లోరాలోని కైలాసనాధ ఏకశిలాలయం, ఎలిఫెంటాలోని త్రిమూర్తి గుహాలయం చెప్పుకోదగినవి. వారి ఏక శిలా వాస్తు నిర్మాణాలు భారతీయ శిల్ప కళారంగానికి మకుటమైన రూపాలని కీర్తింపబడ్డాయి.

## 23.5 చోళులు

రాజకీయ చరిత్ర : చోళులకు మూలపురుషుడు విజయాలయుడు. ఇతడు పల్లవ సామంతుడు. ఉరయూరును రాజధానిగా పాలించాడు. పల్లవులకు సామంతుడుగా వున్న విజయాలయుడు క్రీ.శ. 850 ప్రాంతంలో పాండ్యసామంతుడైన "ముత్తరయార్" ను ఓడించి తంజావూరును ఆక్రమించాడు. విజయాలయుని తరువాత అతని కుమారుడు ఆదిత్య చోళుడు రాజ్యానికి వచ్చాడు.

**ఆదిత్యచోళుడు (870 - 908) :** స్వతంత్ర చోళరాజ్యాన్ని స్థాపించినవాడు ఆదిత్యచోళుడు. ఇతడు చివరి పల్లవరాజైన అపరాజితపల్లవుని సామంతుడు. క్రీ.శ. 869 లో పల్లవరాజైన మూడో నందివర్మ మరణించాడు. అతని మరణానంతరం తరువాత పాండ్య వరగుణవర్మ కూటమిని కుంభకోణం సమీపంలోని "శ్రీపురాంబియమ్" యుద్ధంలో ఓడించి ఆదిత్య చోళుడు అపరాజితవర్మను సింహాసనంపై ప్రతిష్టించాడు. అందుకు ప్రతిఫలంగా తంజావూరు దాని పరిసర ప్రాంతాలను పొందాడు. పల్లవరాజ్యం బలహీనమవటాన్ని గమనించి ఆదిత్య చోళుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించి తన ప్రభువు అపరాజితుడిని ఓడించి కంచిని, తొండైమండలాన్ని ఆక్రమించాడు. గాంగుల రాజు పృధ్వీపతిని ఓడించి అతనిని సామంతునిగా చేసుకొన్నాడు. తరువాత పాండ్యరాజు వీరనారాయణుని ఓడించి, సేలం కోయంబత్తూరులను ఆక్రమించాడు. చేరరాజైన స్థాణురవి కుమార్తెను తన కుమారుడైన పరాంతకునితో వివాహం జరిపించి చేర వంశంతో బంధుత్వం కలుపుకున్నాడు. ఈ విధంగా ఆదిత్య చోళుడు రాజ్యాన్ని విస్తరింపచేసాడు.

**మొదటి పరాంతకుడు (క్రీ.శ. 908 - 955) :** ఆదిత్య చోళుడి తరువాత అతని కుమారుడు పరాంతకుడు రాజ్యానికి వచ్చి చోళ సార్వభౌమత్వాన్ని మరింతగా విస్తరింపచేశాడు. అతడు షుమారు **48** సం॥ లు **రాజ్యం** చేశాడు. అతడు గొప్ప విజేత. రాష్ట్ర కూట రెండో కృష్ణుని ఓడించి తరిమాడు. తరువాత పాండ్యరాజ్యంపై దండెత్తి పాండ్యరాజు రాజసింహుని ఓడించి మధురను కొల్లగొట్టి మధురైకొండ అను బిరుదు ధరించాడు. క్రీ.శ. 940 వరకు పరాంతకునికి విధేయుడుగా వున్న గాంగ పృధ్వీపతి మరణించాడు. అతని తరువాత రాజ్యానికి వచ్చిన రెండవ బుతుగి రాష్ట్రకూటులతో వివాహసంబంధాలు కలుపుకొని వారికి సన్నిహితుడయ్యాడు. అంతకు ముందు పరాంతకుని చేతిలో ఓడిపోయిన బాణ, వైదుంబులు గూడా మూడవకృష్ణునితో కలసిపోయారు. గాంగ, బాణ, వైదుంబుల సహకారంతో మూడవ కృష్ణుడు చోళరాజ్యంపై దండెత్తాడు. వారిని ఎదర్కోటానికి పరాంతకుడు తన కుమారుడైన రాజాదిత్యుడిని పెద్దసైన్యంతో పంపాడు. ఉభయసైన్యాలకు క్రీ.శ. **949** లో తక్కోళం అనే ప్రదేశంలో జరిగిన యుద్ధంలో చోళసైన్యాలు ఘోరంగా ఓడిపోయాయి.

**ఒకటవ పరాంతకుని తరువాత పరిస్థితి :** మొదటి పరాంతకుని తరువాత షుమారు **30 సం॥లు** అనగా క్రీ.శ. 955 నుండి 985 వరకు చోళసామ్రాజ్యం బలహీనమై అస్తవ్యస్థ పరిస్థితులను ఎదుర్కొన్నది. పరాంతకుని తరువాత అతని కుమారుడు గండరాధిత్యుడు క్రీ.శ. 955 లో రాజ్యానికి వచ్చి 957 వరకు రెండు సం॥లు పాలించాడు. అతని తరువాత అతని తమ్ముడు హరింజయ 957 లో

రాజ్యానికి వచ్చి కొద్దికాలం పాలించిన తరువాత అతని కుమారుడు రెండవ పరాంతకుడు 957 లో రాజ్యానికి వచ్చాడు. రెండవ పరాంతకుని కాలంలో అతని కుమారుడు రెండవ ఆదిత్యుడు కొన్ని విజయాలు సాధించి అస్తవ్యస్తంగా వున్న చోళరాజ్యాన్ని మరలా పునర్నిర్మించాడు. రెండవ పరాంతకుని చివరికాలంలో సింహాసనం కొరకు జరిగిన వారసత్వ కలహాలలో పరాంతకుని సోదరుడైన ఉత్తమ చోళుడు యువరాజైన రెండవ ఆదిత్యుని వధించి అన్నపై తిరుగుబాటు చేసి తనను తాను రాజుగా ప్రకటించుకున్నాడు. అంతేగాక తన కుమారుడైన అరుమిలివర్మను తన వారసునిగా ప్రకటించాడు. పరాంతకుడు క్రీ.శ. 963 లో మరణించాడు. అతని మరణానంతరం ఉత్తమ చోళుడు పట్టాభిషేకం చేసుకున్నాడు.

ఉత్తమ చోళునికాలంలో రాష్ట్రకూట సామ్రాజ్యంలో అంతఃకలహాలు ఏర్పడ్డాయి. దానినవకాశంగా తీసుకొని ఉత్తమ చోళుడు రాష్ట్రకూటులను ఓడించి తొండైమండలాన్ని ఆక్రమించాడు. క్రీ.శ. 985 లో ఉత్తమచోళుడు మరణించాడు. అతని మరణానంతరం అతని కుమారుడు మొదటి రాజరాజు క్రీ.శ. 985 లో రాజ్యనికి వచ్చి క్రీ.శ. 1014 వరకు పాలించాడు.

**మొదటి రాజరాజు క్రీ.శ. 985 - 1014 :** చోళులలో రాజరాజు అగ్రగణ్యుడు. అతని రాకతో చోళ చరిత్రలో మహోజ్జ్వలయుగం ప్రారంభమైంది. అతని దిగ్విజయాలు తంజావూరు బృహదీశ్వర ఆలయ గోడలపై చెక్కి వున్నది. అతని పాలనలో చోళ సామ్రాజ్యం దక్షిణదేశంలో మహాశక్తివంతంగా రూపొందింది.

రాజరాజచోళుడు తాను జయించిన సామ్రాజ్యంలో క్రమబద్ధమైన పరిపాలనను ఏర్పాటు చేశాడు. అజరామరమైన కీర్తిని కలిగించిన అతి గొప్పదైన బృహదీశ్వరాలయాన్ని నిర్మించాడు. అతనికాలంలో చోళసామ్రాజ్యం అన్ని విధాల ఉచ్ఛదశనందుకున్నది.

**23.5.1 సైనిక విజయాలు :** అతడు రాజ్యానికి రాగానే గొప్ప నౌకా దళాన్ని కూర్చుకొని చేరరాజ్యంపై దండెత్తి విలినం వద్ద భాస్కరవర్మను ఓడించి కూర్గు, క్విలన్‌లను ఆక్రమించాడు. తరువాత పాండ్యులపై దండెత్తి కందళూర్ వద్ద అదంరాభుజంగుని ఓడించి మధురను, పశ్చిమ గాంగులపై దండెత్తి కుడుమలైను జయించాడు. తరువాత తన నౌకాదళంతో 5 వ మహేంద్రుని ఓడించి ఉత్తర సింహళాన్ని జయించి దానికి ముమ్మడి చోళమండలమని పేరుపెట్టారు.

**వేంగి సార్వభౌమత్వం :** వేంగిరాజైన దానార్ణవుని కుమారులు శక్తివర్మ, విమలాదిత్యులు తనను ఆశ్రయించగా క్రీ.శ. 999 లో వేంగిపై దండెత్తి జటాచోళ భీముని వధించి శక్తి వర్మను రాజుగా చేసి విమలాదిత్యునకు తన కుమార్తె కుందవాంబను ఇచ్చి వివాహం చేసి వేంగిరాజ్యంతో బంధుత్వం కలుపుకున్నాడు. ఈ బంధాన్ని వ్యతిరేకించిన కళ్యాణిచాళుక్య రాజైన సత్యాశ్రయుడు క్రీ.శ. 1006 లో వేంగిపై దండెత్తాడు. వేంగికి సహాయంగా రాజరాజు ఒక సైన్యాన్ని పంపి మరియొక సైన్యాన్ని తన కుమారుడు రాజేంద్రుని నాయకత్వంలో కళ్యాణిచాళుక్య రాజ్యంపై దండయాత్రకు పంపాడు. రాజేంద్ర చోళుడు క్రీ.శ. 1007 లో, దోనూర్, బనవాసి, రాయచూరు, దోఆబ్‌ను ఆక్రమించి మాన్యఖేటంపై దాడిచేశాడు. అదే సమయంలో మరియొక చోళ సైనిక విభాగం కొల్లిపాకను ఆక్రమించింది. దానితో సత్యాశ్రయుడు తన రాజ్యాన్ని రక్షించుకోడానికి వేంగిరాజ్యం నుండి సైదొలగి తన రాజ్యానికి వెళ్ళిపోయాడు. ఈ విజయాలతో రాజరాజు దక్షిణ దేశంలో తిరుగులేని సార్వభౌముడిగా గుర్తింపు పొందాడు. రాజరాజు చివరి కాలంలో మాల్దీవులపై దండెత్తి వాటిని తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. రాజరాజు కాలంలో చోళసామ్రాజ్యం ఉత్తరాన కళింగ నుండి దక్షిణాన సింహళం వరకు విస్తరించింది. అతని విజయాలను, ఉన్నత పరిపాలనను, కళాసేవను అధ్యయనం చేసిన చరిత్రకారులు రాజరాజును గొప్పగా అభివర్ణించారు.

**మొదటి రాజేంద్ర చోళుడు క్రీ.శ. 1014 - 1044 :** రాజరాజు తరువాత అతని కుమారుడు రాజేంద్ర చోళుడు సింహాసనమధిష్ఠించాడు. అతడు తండ్రిని మించినవాడు. అతడు రాజ్యానికి రాగానే పాండ్య, చేరులను ఓడించి వారిపై తిరుగులేని ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. సింహళంపై దండెత్తి దానిని పూర్తిగా జయించి తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. ఆ రాజ్యంపై క్రీ.శ. 1018 లో తన కుమారుని రాజప్రతినిధిగ నియమించాడు. వేంగిలో రాజరాజ నరేంద్రుని అతని సవతి తమ్ముడు పదభ్రష్టుని చేయగా వేంగిపై దండెత్తి విజయాదిత్యుని ఓడించి రాజరాజ నరేంద్రుని క్రీ.శ. 1022 లో వేంగిరాజుగా రాజమహేంద్రవరం సింహాసనంపై ప్రతిష్ఠించి

మేనల్లునికి తన కుమార్తె అమ్మంగదేవినిచ్చి వివాహం చేశాడు. దానితో వేంగిపై చోళుల అధికారం పునఃప్రతిష్ఠింపబడింది. తరువాత కళ్యాణిచాళుక్యలపై దండెత్తి కృష్ణా, తుంగభద్ర, నదుల మధ్య ప్రాంతాన్ని జయించాడు.

**బెంగాలు దండయాత్ర :** దక్షిణ విజయాలు ముగిసిన తరువాత 1032 లో బస్తరు, కళింగ రాజ్యాలను 1033 లో బెంగాలును జయించాడు. ఆ విజయ చిహ్నంగా గంగైకొండ చోళపురాన్ని నిర్మించి దానిని తన రాజధానిగా చేసుకున్నాడు. తాను గంగైకొండ చోళుడను బిరుదు ధరించాడు.

**శైలేంద్ర సామ్రాజ్య దండయాత్ర :** రాజేంద్రుని విజయాలన్నింటిలో మేటి అతడు నిర్వహించిన ఆగ్నేయాసియా దండయాత్ర. అతడు గొప్ప నౌకాబలంతో మలయా, జావా, సుమిత్ర దీవులపై దండయాత్ర చేశాడు. ఈ దండయాత్రలో సంగ్రామ విజయోత్తుంగుని ఓడించి అతని రాజధాని కేదారాన్ని ఆక్రమించి కేదారం కొండ అను బిరుదు వహించాడు. ఈ విధంగా రాజేంద్ర చోళుడు అనేక దిగ్విజయ యాత్రలు చేసి భారతదేశ చరిత్రలో గొప్ప విజేతగా ప్రసిద్ధి చెందాడు. ముఖ్యంగా కేదారం బెంగాలు విజయ యాత్రలు అతని జీవితంలో మైలురాళ్ళు. రాజేంద్ర చోళుని చివరి కాలంలో చాళుక్య రాజు సోమేశ్వరుడు చోళరాజ్యంపై దాడి చేశాడు. చోళసైన్యాలు అతనిని పూండివద్ద ఎదుర్కొని ఓడించాయి. ఈ విజయాలతో రాజేంద్రుని కాలంలో చోళ సామ్రాజ్యం చాలా విశాలంగా విస్తరించింది. ఉత్తరాన బెంగాలు నుండి దక్షిణాన సింహళం వరకు తూర్పున తూర్పుదీవుల నుండి పడమర కేరళ వరకు విస్తరించింది. సింహళం చోళ సామ్రాజ్యలో చేరిపోవడంతో బంగాళఖాతం, హిందూమహాసముద్రం, అరేబియా సముద్రాలపై అతని అధిపత్యం ఏర్పడి త్రిసముద్రాధిపతి అని కీర్తి పొందాడు. తండ్రి సంపాదించిన ప్రాంతాలలో దేనిని కోల్పోకుండా తాను జయించిన దీవులతో సహా అన్నింటిపై తన అధికారాన్ని తన జీవితాంతం వరకు నిల్పుకున్నాడు. రాజేంద్రుడు గొప్ప కళ, విద్యాపోషకుడు, విద్యాభివృద్ధికి కృషి చేశాడు. విద్యాసంస్థలకు దానాలు చేశాడు. తన రాజధాని గంగైకొండ చోళపురాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాడు.

**23.5.2 రాజేంద్రుని వారసులు క్రీ.శ. 1044 - 1070 :** రాజేంద్రచోళుని తరువాత అతని కుమారులు రాజాధిరాజు, (క్రీ.శ. 1044 - 1052) రాజేంద్రుడు (క్రీ.శ. 1052 - 1064) వీర రాజేంద్రుడు (క్రీ.శ.1064 - 1070) ముగ్గురు వరుసగా 1070 వరకు పాలించారు. వారు ముగ్గురు తండ్రి తాతలవలె వీరులు. వారి కాలంలో గూడ వేంగిపై ఆధిపత్యం కొరకు కళ్యాణి చాళుక్యులతో తీవ్రమైన పోరు జరిగింది. వారు ముగ్గురు కళ్యాణి చాళుక్యులను ఓడించి వేంగిపై తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నారు.

**అధిరాజేంద్రుడు క్రీ.శ. 1070 :** వీర రాజేంద్రుని మరణం తరువాత అతని కుమారుడు అధిరాజేంద్రుడు చోళ సింహాసనం అధిష్ఠించాడు. కాని చోళరాజ్యంలో అంతర్యుద్ధం వచ్చి సింహాసనం ఎక్కిన కొద్ది కాలంలోనే (క్రీ.శ. 1070లో) అంతర్యుద్ధంలో అధిరాజేంద్రుడు మరణించాడు. అతని మరణానంతరం విజయాల చోళ వంశం అంతం అయిపోయింది.

**చోళ చాళుక్యులు (క్రీ.శ. 1070 - 1280) :** అధిరాజేంద్రుని మరణానంతరం చోళ సింహాసనానికి వేంగిరాజు రాజరాజ నరేంద్రుని కుమారుడు రాజేంద్రుడు కళ్యాణి రాజు ఆరవ విక్రమాదిత్యుడు పోటీపడినారు. ప్రజలు రాజేంద్రుని సమర్థించినందువ ఆతడు కుళోత్తుంగ చోళుడనుపేరుతో క్రీ.శ. 1070 లో తంజావూరులో సింహాసనమధిష్ఠించాడు. ఆ విధంగా చివరకు చోళరాజ్యం తూర్పు చాళుక్యుల పరమై చోళచాళుక్య సామ్రాజ్యం అవతరించింది.

**కుళోత్తుంగ చోళుడు క్రీ.శ. 1070 - 1118 :** కుళోత్తుంగ చోళుడు దాదాపు 48 సంవత్సరాల సుదీర్ఘకాలం పాలించాడు. అతను పరాక్రమవంతుడు చోళ చాళుక్య సామ్రాజ్యాన్ని రక్షించుకొనటానికి చాలా యుద్ధాలు చేసి రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు అణచి వేసాడు. క్రీ.శ. 1072 లో కళ్యాణి రాజైన ఆరవ విక్రమాదిత్యుని ఓడించాడు. క్రీ.శ. 1073 లో తిరుగుబాటు చేసిన సింహళరాజు విజయ బాహుని, పాండ్యులను, చేరరాజులను అణచివేశాడు. 1075 లో వేంగిని స్వాధీనపరచుకొని తన కుమారులను రాజప్రతినిధులుగా నియమించాడు. ఈ విధంగా కులోత్తుంగుడు తన జీవితమంతా పోరాటాలు చేసి విజయాలు సాధించాడు. అతని విజయాలను

జయగొండార్ అనుకవి కళింగ పరణి అనే కావ్యంగా వ్రాశాడు. విదేశాలతో మంచి దౌత్య సంబంధాలు ఏర్పరచుకున్నాడు. రాజ్యంలో పటిష్టమైన పరిపాలనను ఏర్పాటు చేశాడు.

**విక్రమ చోళుడు క్రీ.శ. 1118 - 1133 :** కుళోత్తుంగుడు 1118 లో వేంగిలో రాజప్రతినిధిగాఉన్న విక్రమచోళుని పిలిపించుకొని అధికారం అప్పగించాడు. విక్రమచోళుడు వేంగిని వదలి పెట్టి వెళ్ళగా చాళుక్య ఆరవ విక్రమాదిత్యుడు వేంగినాక్రమించాడు. 1133 వరకు వేంగి కళ్యాణి చాళుక్య అధిపత్యంలో వుండిపోయింది. అదే అదనుగా భావించి గాంగవాడి, కోలారులలో తిరుగుబాట్లు జరిగాయి. వాటిని అణచివేశాడు. క్రీ.శ. 1128 లో చిదంబరంలో నటరాజ ఆలయాన్ని నిర్మించిడానికి అపారంగ ధనసహాయం చేశాడు. ప్రజాభిమానం పొందాడు. ఇతనికి అకలంక, త్యాగ సముద్ర అను బిరుదులున్నాయి.

**రెండవ కుళోత్తుంగుడు క్రీ.శ. 1133 - 1150 :** విక్రమచోళుని తరువాత అతని కుమారుడు రెండవ కుళోత్తుంగ చోళుడు రాజ్యానికి వచ్చాడు. అతని కాలంలో 1138 లో వెలనాటి చోళులు గోదావరి యుద్ధంలో కళ్యాణి చాళుక్యులను ఓడించి తరిమి వేంగిని వారి కబంధహస్తాలనుండి మరలించారు. వేంగి తిరిగి చోళ అధికారం క్రిందికి వచ్చింది. కాని వెలనాటి చోళులు, చోళులకు నామమాత్రంగా లోబడి వేంగిని స్వతంత్రంగా పాలించారు. రెండవ కుళోత్తుంగుడు మరే యుద్ధాలు చేయలేదు. అతని కాలం ప్రశాంతంగా సాగింది. అతడు క్రీ.శ. 1150 వరకు పాలించాడు. ఆ తర్వాతిరాజు రెండవ రాజాధిరాజు (1173 - 1178) రాజ్యానికి వచ్చే నాటికి పాండ్యులలో అంతఃకలహాలు ప్రారంభమైనాయి. అది అదనుగా రాజాధిరాజు కులశేఖర పాండ్యుని రాజుగా చేసేడుగాని అప్పటి రాజకీయ పరిస్థితులలో కులశేఖరుడు సింహళరాజుతో కలసి చోళులపై తిరుగుబాటు చేశాడు. మూడవ కుళోత్తుంగుడు (1178 - 1218) పతనావస్థలో వున్న చోళ సామ్రాజ్యాన్ని పునరుద్దరించడానికి కృషి చేసేడుగాని సరియైన ఫలితాలు రాలేదు. అతని తర్వాత చోళ సింహాసనం అధిష్టించిన మూడవ రాజాధిరాజు (1218 -1256) తర్వాత వచ్చిన మూడవ రాజేంద్రుని (1256 - 1267) కాలంలో చోళసామ్రాజ్యం పతనావస్థకు చేరుకొంది. ఆ తర్వాతి పరిణామాలలో చోళ సామ్రాజ్యం పతనావస్తకు చేరుకొంది. ఆ తర్వాత పరిణామాలలో చోళ సామ్రాజ్యం కాకతీయులు, హోయసాల రాజుల మధ్య రెండుముక్కలుగా విడదీయబడి సంపూర్ణంగా పతనమైపోయింది.

**23.5.3 చోళ పరిపాలన - సంస్కృతి :** చోళులు గొప్ప సామ్రాజ్య నిర్మాతలేగాక గొప్ప పరిపాలన దక్షులుకూడా. వారు ప్రపంచానికే ఆదర్శప్రాయమైన పరిపాలనా వ్యవస్థను రూపొందించారు. అది ప్రాచీన యుగంలో మౌర్య పరిపాలన వ్యవస్థ, భారతదేశ రాజవంశాలకు ఏ విధంగా ఆదర్శప్రాయమైనదో ఆ విధంగా మధ్య యుగంలో చోళుల పరిపాలనా విధానంకూడా దక్షిణ దేశ రాజ వంశాలకు మార్గదర్శకమైంది. ముఖ్యంగా వారి గ్రామ పరిపాలన యావద్భారత దేశ చరిత్రలో గొప్ప ప్రశంసమ పొందింది. చోళ పాలనకు ముఖ్య ఆధారాలు వారి శాసనాలు వారి కాలం నాటి సాహిత్యం.

**కేంద్ర ప్రభుత్వం, రాజు :** చోళ చక్రవర్తి సర్వాధికారి. కాని ధర్మ బుద్దుడు ప్రజారంజకుడు. చక్రవర్తి సైన్యాధ్యక్షునిగా కూడ వ్యవహరించే వాడు. రాజరికము వంశ పారంపర్యం. చిన్న కుమారులను రాష్ట్ర పాలకులుగా నియమించే వారు. పెద్ద కుమారుడు ఉత్తరాధికారి.

**మంత్రి మండలి :** పరిపాలనలో చోళ చక్రవర్తికి సహాయపడేందుకు ఉడనాకుట్టమ్ అనే ఉద్యోగ మండలి ఉండేది. ఇందు అయిదుగురు సభ్యులుండేవారు. వారిని దేశంలోని సచ్ఛీలులైన ప్రజలనుంచి నియమించే వారు. పరిపాలనా వ్యవహారాలలోని ప్రతి విషయం ఈ మండలిలో చర్చించి నిర్ణయించి రాజాజ్ఞలు తయారు చేసే వారు. ఆ తాఖీదు మీద రాజు సంతకంతో పాటు ఉడనాకుట్టమ్‌లోని అయిదుగురు సభ్యులు సంతకాలు చేస్తేనే రాజాజ్ఞగా చలామణి అయ్యేది. ప్రజా ప్రతినిధులకు చోళ రాజులు ఎంతటి ప్రాముఖ్యాన్నిచ్చారో ఈ నిబంధన వలన తెలిసికోవచ్చు. ఈ విధంగా తయారైన రాజాజ్ఞలను ఓరైనాయగన్ అనే ఉద్యోగి అమలు పరచేవారు. వివిధ శాఖలకు వివిధ ఉద్యోగులకు ప్రత్యేకంగా అధ్యక్షుల్ని నియమించారు. ఉన్నత ఉద్యోగులను పెరుందరం, చిన్న ఉద్యోగులను పిరుతరం అని రెండు శ్రేణులుగా పిలిచే వారు. అందరిని కలిపి పిరుమగళ్ అని సంబోధించేవారు.

**రెవెన్యూ :** భూమి శిస్తు రాజ్యానికి ప్రధాన ఆదాయం. భూమిని సర్వే చేయించి 1/6 వంతు పన్నుగా నిర్ణయించారు. కొన్ని సందర్భాల్లో 1/3 వంతు పన్ను వసూలు చేసేవారు. భూమిని కౌలుకు తీసుకునే ఆచారం ఉంది. ప్రజల భూములు పోను మిగిలిన భూములన్నీ రాజుకే చెందుతాయి. వ్యవసాయాభివృద్ధికై నీటి పారుదల సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

**ఇతర ఆదాయ మార్గాలు :** భూమి శిస్తు కాకుండా వృత్తి పన్ను, వ్యాపార సుంకాలు, అడవి సంపదపై పన్ను వసూలు చేసేవారు. తరైయిర్ (మగ్గం పన్ను) శెక్కరై, తట్టార్, పాట్టం (స్వర్ణకారుని పన్ను), విళుక్కనీర్ పట్టం (నీటి తీరువా పన్ను), అంగడి పట్టం (సంతల మీద పన్ను) శిట్టి రాయ్ పట్టం (వ్యాపారుల మీద పన్ను) తదితర పన్నులు కూడా అమలులో వున్నాయి. కరువు కాటకాలు వచ్చినపుడు పన్ను రాయతీలు అమలులో వుండేవి.

**సైనిక పరిపాలన :** చోళులు గొప్ప సైన్యాన్ని పోషించారు. లక్ష ఏబదివేల పదాతిదళం, 60 వేలు అశ్వక దళంతో పాటు గజ బలం, గొప్ప నౌకా బలాన్ని వారు పోషించారు. వీరి సైన్యం పటాలాలుగా విభజితమై ఉండేది. శాసనాల్లో 70 విభాగాలున్నట్లు వ్రాసి ఉంది. పటాలాలను ముస్రుకాయ్, మహాసేవాయ్ అని పిలిచేవారు.

**నౌకా బలం :** చోళులు గొప్ప నౌకా బలాన్ని పోషించారు. రాజ రాజు నౌకా బలంలో సింహళాన్ని జయించాడు. రాజేంద్ర చోళుడు, మలయా, సుమిత్ర, జావా, దీవులపై దండెత్తి శైలేంద్ర సామ్రాజ్యాన్ని జయించడం ద్వారా కేదారం గొండ అనే బిరుదు పొందాడు. అండమాన్ నికోబార్ దీవులు కూడా అతని ఆధిపత్యంలోకి వచ్చాయి. బంగాళాఖాతానికి చోళ తటాకం అని పేరు ఉండేది.

**సైనిక శిక్షణ :** చోళులు యుద్ధ నైపుణ్యానికి క్రమశిక్షణకు అమిత ప్రాధాన్యం ఇచ్చారు. సైనిక పటాలాలు నివశించు ప్రదేశాన్ని **కడగం (కంటోన్మెంటు)** లేదా పదయవీడు అని పిలిచేవారు.

**పదాతి** దళంలో భోజ శాలులైన వారిని నైక్కలూరు అని బల్లాలతో పోరే వారిని శంగుడి దారులు అని పిలిచేవారు. రాజు **అంగ రక్షకులను** వేలయకారలనే వారు. వీరు ప్రాణాలొడ్డి రాజును రక్షించే వారు.

**23.5.4 రాష్ట్ర పాలన :** పరిపాలన సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని మండలాలు, కొట్టాలు, నాడులు, కుర్రాలుగా , విభజించారు. మండలాలకు అధిపతులు సామంత రాజులు. రాజ కుమారులను **పాలకులుగా** పంపేవారు. రాజ రాజు కాలంలో ఎనిమిది మండలాలుండేవి. ఒక కుర్రంలో 50 గ్రామాలు ఉండేవి.

**23.5.5 గ్రామ పాలన - స్థానిక పాలన :** చోళుల స్థానిక పాలన పలువురి ప్రశంశలనందుకున్నది. ముఖ్యంగా గ్రామ పాలనను విదేశీ చరిత్రకారులు ఘనంగా శ్లాఘించారు. పట్టణాల్లో పల్లెలలో, ప్రజా సంఘాలకు స్థానిక పాలనను అప్పగించే వారు. చోళుల పాలనలో గ్రామ పాలన అతి విశిష్టమైంది. గ్రామ సభలకు సంపూర్ణాధికారాలను ఇచ్చారు. గ్రామ సభలు నేరస్థులకు ఉరి శిక్షలు విధించే అధికారం యివ్వబడింది. పాలనా విశేషాలు ఉత్తర మేరూరు శాసనంలో సంపూర్ణంగా ప్రస్తావించబడింది. పలువురి ప్రశంసలనందుకున్న ఈ గ్రామ పరిపాలన చోళుల మేధా శక్తికి, పరిపాలన ఔన్నత్యానికి నిదర్శనం.

**స్థానిక స్వపరిపాలన :** మండల, పట్టణ, గ్రామ ప్రాంతాల పరిపాలనను స్థానిక పాలన అంటారు. పట్టణాల్లోను పల్లెల్లోను ప్రజా సభలుండేవి. నగర సత్తార్ నగర ప్రజాసభ అధిపతి. సభల పాలన వ్యవహారాలను చూడటమే కాకుండా న్యాయ నిర్ణయాలు గూడా చేస్తుంది. జ్యూరీ పద్ధతి కూడా ఉందని కృష్ణ స్వామి అయ్యంగారు అభిప్రాయపడ్డారు.

**గ్రామ పాలన :** చోళుల పాలనలో అతి విశిష్టమైనది గ్రామ పాలన గ్రామ సభలలో జరిగేది. ఈ గ్రామ సభలు నేటి మన పంచాయితీ వ్యవస్థ కన్నా ఎన్నో రెట్లు మెరుగైనవి. గ్రామ పాలనను నిర్వహించడానికి గ్రామ సభ, గ్రామ సంఘాలు అని రెండు సంఘాలుండేవి. **గ్రామ సంఘాల్లో** గ్రామ ప్రజలందరూ సభ్యులు. గ్రామ సభల్లో గ్రామ పాలకులు సభ్యులు.

**గ్రామ సభ :** గ్రామాన్ని పాలించేది గ్రామ సభ. ఈ సభలు ప్రతి గ్రామంలో అచటి పరిస్థితులను బట్టి స్వల్ప మార్పులతో ఉండేవి. **చోళ** సామ్రాజ్యంలో మూడు రకాలైన గ్రామ సభలున్నట్లు నీలకంఠ శాస్త్రి చెప్పారు. అవి

**1. ఊర్ :** ఇది గ్రామాల్లో ఉంటుంది, రైతులు ఇందులో ముఖ్య సభ్యులు.

**2. నగసత్తార్ :** ఇది పట్టణాల్లో ఉంటుంది. ఇందులో వర్తకులు ముఖ్య సభ్యులు.

**3. సభ :** ఇది అగ్రహారాల్లో ఉంటుంది. ఇందులో బ్రాహ్మణులు ముఖ్యులు. గ్రామ సభలు దేవాలయాల్లో గాని, గ్రామ మధ్య స్థలంలో గాని, కచేరీల్లో గాని జరిగేవి.

**గ్రామ సంఘాలు :** గ్రామాన్నంతటిని కుడుంబులు లేక **వార్డులుగా** విభజించి సభ్యులను ఎన్నుకుంటారు. ఈ సభ్యులు గ్రామ సంఘలుగా (వారియమ్) ఏర్పడి గ్రామ సభకు పాలనలో సహాయపడేది.

**అర్హతలు :** గ్రామ సంఘాలలో సభ్యులుగా ఎన్నిక అయ్యేందుకు కొన్ని నిబంధనలు, అర్హతలు ఏర్పరిచారు. 1. సభ్యుడు 35 - 70 సంవత్సరాల మధ్య వయస్కుడై ఉండాలి. 2. అతనికి గ్రామంలో 1 3/4 ఎకరాల భూమి, ఇల్లు ఉండాలి. 3. చదువు రావాలి. ధర్మ శాస్త్రం తెలిసి ఉండాలి. 4. సత్యవంతుడై ఉండాలి.

**అనర్హతలు :** 1. అంతకు ముందు మూడు సంవత్సరాలు వరుసగా గ్రామ సభలో సభ్యుడై ఉండరాదు. 2. గ్రామ ఆర్థిక వ్యవహారాల్లో అతనిపై ఎలాంటి ఆరోపణలు ఉండకూడదు. 3. దొంగతనం చేసి ఉండకూడదు. 4. పంచ మహాపాతకాలంలో దేనిని **అతడు** చేసి ఉండ కూడదు. 5. ఆస్తిని అక్రమంగా సంపాదించి ఉండరాదు.

**ఎన్నిక లేక కుడువోలై :** ఈ యోగ్యతలు గల వారందరిని (కుడువోలై) చీటీపై వ్రాసి ఒక కుండలో ఉంచుతారు. గ్రామ సభకు **ఎంత**మంది సభ్యులు కావలెనో అన్ని చీటీలను బాలురతో కుండలోనుంచి తీయిస్తారు. తీసిన చీటీలలో పేర్లున్నవారు, గ్రామ **సభకు** ఎన్నికవుతారు.

**సభ్యుల సంఖ్య :** ఒక్కొక్క గ్రామంలో ఒక్కో విధంగా సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సభ్యులను ఆరు సంఘాలుగా ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో తక్కువ సంఖ్య ఉంది, ఊర్‌లోని సభ్యులను వారియా పేరు మక్కత్ సభ పెరుగూరు అని అనేవారు.

**గ్రామ సంఘాల విధులు :** అలా ఎన్నికైల సభ్యులు వారి వారి సామర్థ్యాలను అనుసరించి సంఘాలుగా ఏర్పడతారు. ఈ సంఘాలను వారియం అంటారు. ఒక్కొక్క సంఘం ఒక్కొక్క శాఖను నిర్వహిస్తుంది.

**శాఖలు :** 1. సంవత్సర వారియం. ఇందులో **అనుభవ జ్ఞానం** గలిగిన గ్రామ వృద్ధులు సభ్యులుగా ఉండేవారు, ఈ సంఘం గ్రామ సమిష్టి వ్యవహారాలను చూసేది. 2. తొట్టి వారియమ్, **తోటలు** పెంపకం. 3. పరియా వారియమ్, చెరువులు, మంచినీటి బావుల పర్యవేక్షణ 4. పొన్ వారియా, బంగారు నాణేలు తనిఖీ **చేయడం**. 5. పంచ వారియమ్, దేవాలయాల నిర్వహణ 6. ఉదాసిన వారియమ్, నేర విచారణలను నిర్వహిస్తుంది. ఈ సంఘాల కాలపరిమితి ఒక సం॥ మాత్రమే. వారిలో ఏ లోపం కన్పించినా ఎప్పుడైనా వారిని తొలగించ వచ్చును. దాంతో ప్రతి సభ్యుడు నిస్వార్థ పరుడై ప్రజాసేవ చేసేవారు. ఇది మౌర్యుల నగర పాలన నమూనాలో ఉంది. మౌర్యులు కూడా **చోళులు** ఇచ్చినన్ని అధికారాలను తమ నగర పాలక సంస్థలకు ఇవ్వలేదు.

**గ్రామ సభ అధికారాలు :** గ్రామానికి సంబంధించి అన్ని విషయాల్లో గ్రామ సభలకు పూర్తి అధికారాలు ఉండేవి. పన్ను వసూలు **చేయటం**, పన్ను చెల్లించని వారి ఆస్తిని జప్తు చేయటం, కరువు కాలాల్లో పన్నులు తగ్గించటం, నేర విచారణ చేసి **శిక్షలు చెప్పటం**, గ్రామాభివృద్ధికి పాటు పడటం తది తర బాధ్యతలు, అధికారాలు ఉండేవి.

**రెవెన్యూ అధికారాలు :** గ్రామంలోని అన్ని భూములపై గ్రామ సభలకు అధికారం ఉండేది. పంట దిగుబడిని బట్టి భూమి శిస్తు విధించడం, శిస్తు వసూలు చేయటం, బంజరు, భూములను కాపాడటం, రాజోద్యోగులకు సహాయపడటం, భూమి తగాదాలు తీర్చటం, నీటి వనరులను ఏర్పాటు చేయటం, చెరువులు మరమ్మత్తులు చేసి కాపాడటం తదితర అనేక అధికారాలు ఉండేవి.

**సంక్షేమ బాధ్యత :** గ్రామ ప్రజల సంక్షేమ బాధ్యతను కూడా ఈ సభలు వహించేవి. విద్య, ఆరోగ్య ఏర్పాట్లు చూడటం, ప్రజలకు రక్షణ కలిగించడం, శాంతి భద్రతలు కాపాడటం, తదితరాలను గూడా గ్రామ సభలు చూసేవి.

**న్యాయ విధులు :** గ్రామ సభకు అనేక న్యాయ విధులు ఉన్నాయి. నేరాలు జరుగకుండా చూడటం, నేరస్థులను ముందే కనిపెట్టి నేరాన్ని నిరోధించడం, నేరం జరిగితే వారిని సంప్రదాయాలు, ఆచారాలు, పత్రాలు, సాక్షుల సహాయంతో నిష్పక్షపాతంగా తీర్పులు చెప్పడం, నేరాలకు తగిన శిక్షలు విధించడం గ్రామ సభల కర్తవ్యం. దొంగతనం, పత్రాలు మార్చడం (ఫోర్జరీ), నేరాలను గూర్చి ఉత్తర మేరూర్ శాసనం ప్రస్తావిస్తుంది.

**ఉరిశిక్ష అధికారం :** శిక్షలు విధించడంలో పరిమితి లేదు. ఉరిశిక్ష కూడా విధించే అధికారం గ్రామ సభ్యులకు ఉంది. ప్రపంచంలో యే యుగంలో ఏ దేశంలోను గ్రామాలకు ఇవ్వని అసాధారణ స్వయం పాలిత అధికారాన్ని చోళ చక్రవర్తులు గ్రామ సభలకు ఇచ్చి తమ గొప్పతనాన్ని చాటుకున్నారు. ఇది చోళుల ప్రత్యేకత. ఇన్ని అధికారాలున్నా వారు దానిని ఉపయోగించనవసరం లేకపోయేది. ప్రజలు నీతి సంపన్నులు కావడమే అందుకు కారణం. నేరాలు చాలా తక్కువ. జ్యూరీ పద్దతి కూడా ఉందని కృష్ణస్వామి అయ్యంగారు భావించారు. ప్రమాదవశాత్తు ఎవరి మరణానికైనా కారణమైతే వారికి స్వర్గలోక ప్రాప్తి కలగడానికి దేవాలయంలో దీపారాధన చేసే ఆచారం ఉంది. ఈ విధంగా చోళుల కాలంలో గ్రామాలు స్వయం పాలనాధికారం కలిగి అద్భుతంగా వెలుగొందాయి.

చోళుల కాలంలో గ్రామాల్లో ఇలాంటి పటిష్టమైన వ్యవస్థ ఉన్నందున ప్రజల పాలనా వ్యవహారమంతా ఆయాగ్రామాల్లోని గ్రామసభలే చూస్తున్నందున సామ్రాజ్యంలో మరే పాలనా వ్యవస్థ అవసరమే లేకపోయింది. సామ్రాజ్య రక్షణ ఆదాయాలు చూసుకోవడం మినహ చక్రవర్తులకు మండలాధిపతులకు మరే పరిపాలనా బాధ్యతలు లేకపోయాయి.

**23.5.6 న్యాయ పాలన :** చక్రవర్తి సర్వ న్యాయాధ్యక్షుడు. అయితే మండలాల్లో మండల సభ, నాడులలో నాట్టార్, నగర పట్టణ గ్రామ సభలు న్యాయ విచారణ చేసి శిక్షలు విధించేవి. ఇందులో అన్ని కులాల వారు సభ్యులుగా ఉండేవారు. తీర్పు చెప్పిన వారిని న్యాయత్తర్‌లని పిలిచేవారు. వ్యక్తుల అభియోగాలు, సమాధానాలు జాగ్రత్తగా విని తీర్పులు చెప్పేవారు. పత్రాలున్నా వాటిని ప్రమాణాలుగా తీసుకునే వారు న్యాయ అధికారాన్నీ సభ్యులకే అప్పచెప్పినందున చోళ చక్రవర్తులకు న్యాయ విధులకు హాజరు కావలసిన సందర్భాలు చాలా తక్కువగా ఉండేవి.

**23.5.7 చోళుల నాటి సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు :** చోళులు దక్షిణ దేశ చరిత్రలో గొప్ప సామ్రాజ్య నిర్మాతలుగా, పరిపాలనా దక్షులుగానే గాకుండా సాంస్కృతిక రంగంలోనూ అపూర్వ ఖ్యాతి గడించారు.

**సాంఘిక పరిస్థితులు :** సంఘంలో కులవ్యవస్థ ఉంది. స్త్రీకి సముచిత స్థానం లేదు. సతీసహగమనం, బానిసత్వం, దేవదాసితనం లాంటి దురాచారాలున్నాయి.

**ఆర్థిక పరిస్థితులు :** చోళ సామ్రాట్టులు అత్యంత ఆర్థిక సౌభాగ్యాన్ని అనుభవించారు. చెరువులు నిర్మించి వ్యవసాయాభివృద్ధికి పాటు పడ్డారు. పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. చైనా, జావా, సుమిత్రా అరేబియా తదితర దేశాలతో విరివిగా వాణిజ్యం సాగింది. వర్తక సంఘాలు విదేశీ వాణిజ్యం వల్ల ధనవంతులయ్యారు.

**మతము :** చోళులు శైవ మతాభిమానులు వీరి కాలంలో శైవ మతంలో, కాపాలిక, కాలాముఖ, పాశుపత అను శాఖలు ఏర్పడ్డాయి. ఈ కాలంలోనే రామానుజాచార్యుడు విశిష్టా ద్వైవతాన్ని బోధించి విష్ణు భక్తిని ప్రచారం చేశాడు. ఇతనిని కుళోత్తుంగుడు విరోధించగా హోయసాల రాజ్యం వెళ్ళిపోయాడు. ఇంకా నాయనారులు, అళ్వారులు, శైవ, వైష్ణవ, భక్తిని ప్రచారం చేశారు. ఈ కాలంలో శ్రీరంగం, కాళహస్తి, చిదంబరం, తిరుపతి, మొదలైనవి గొప్ప పుణ్య క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి.

విద్య : చోళులు విద్యావ్యాప్తికి మంచి కృషి చేశారు. విద్యాలయాల్లో వేదపారాయణం ముఖ్యమైనది. సామవేద పారాయణం చేసేవారికి చోళ రాజులు బంగారు నాణేలు కానుకలుగా ఇచ్చేవారు. కంచి విద్యా పీఠంలో నాలుగు వేదాలు, కల్ప సూత్రాలు వ్యాకరణం చదువుకునే 270 మంది విద్యార్థులకు, పూర్వ ఉత్తర మీమాంసలు చదువుకునే 70 మంది విద్యార్థులకు రాజేంద్ర చోళుడు ధన సహాయం చేసినట్లు ఒక శాసనంలో తెలుపబడింది. తంజాపూరు జిల్లాలోని తిరుపదుతురై కళాశాలలో వైద్య విద్య కూడా నేర్పేవారు. చరక సంహిత, వాగ్భటుడు రచించిన అష్టాంగ హృదయ సంహితలు చదివేవారట. 1025 నాటి దక్షిణ ఆర్కాటు జిల్లాలోని ఎన్నాయిరం, పుదుచ్చేరి దగ్గరలోని త్రిభువని, చెంగల్ పట్టు జిల్లాలోని తిరుమక్కుడల్ వైద్యశాల నాటి ముఖ్య విద్యాలయాలు.

**తమిళ సాహిత్యం స్వర్ణ యుగం :** సంగమ యుగం తరువాత చోళుల కాలం తమిళ సాహిత్యానికి స్వర్ణ యుగమని చెప్పవచ్చును. ఈ కాలంలో అనేక తమిళ గ్రంథాలు వెలుగు చూశాయి. రామాయణ, మహా భారతాలు తమిళంలోనికి తర్జుమా చేయబడ్డాయి.

**తిరుతక్కదేవర్ :** పదో శతాబ్దానికి చెందిన జైన బిక్షువు. ఇతడు జీవక చింతామణి అనే తమిళ కావ్యాన్ని శృంగార భరితంగా వ్రాశాడు. ఇది గొప్ప అలంకార గ్రంధంగా తమిళ పంచ కావ్యాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది.

**తమిళ కవిత్రయం :** చోళ కాలంలో తమిళ కవిత్రయం అనే పేరు 1. కంబన్ 2. బట్టు కూటన్ 3. పుహళేంది అను ముగ్గురు కవులకు వచ్చింది.

కంబన్ తమిళ కవులందరిలోకి సుప్రసిద్దుడు. అతడు కుళోత్తుంగ చోళుని సమకాలికుడు. ఇతడు తమిళంలో వ్రాసిన రామాయణం వల్ల ఇతనికి కవి చక్రవర్తి అని బిరుదు వచ్చింది. శడకోపర్ అంతా లేని తైలుపత్తు అని మరి రెండు గ్రంథాలు కూడా ఇతడు వ్రాశాడు.

బట్టు కుట్టాన్ పరణిక ఉలావ్ అను యుద్ధగేయాలు వ్రాశాడు. కంబ రామాయణంలో ఉత్తర కాండను ఇతడు వ్రాశాడని కొందరు భావిస్తారు.

పుహళేంది కవిత్వం వీనుల విందుగా ఉంటుంది. ఇతడు నళదేంబ అంటే నలదమయంతుల కథను తమిళంలో కావ్యంగా వ్రాశాడు. కలంబకం అని మరొక గ్రంథాన్ని అల్ల తిరసాని పనలక్కోడి పాటల గ్రంధాలను వ్రాశాడు.

**మణి ప్రవాళ పద్ధతి :** కొందరు కవులు తమిళ సంస్కృతాలను కలిపి కావ్యాలను వ్రాశారు. దీనిని మణి ప్రవాళము అంటారు. సంజియార్, పెరియా వాచ్చాన్, పిళ్ళై వారి రచనలు ఇలాంటివే. ఇందులో కృత్రిమ శబ్దాల డాంబికం తప్ప మరేమి లేదు అందువల్ల ప్రాచుర్యం పొందలేదు.

**వీర కావ్యాలు :** ఈ కాలంలో వీర కావ్యాలు రాసే ఆచారం వచ్చింది. కుళోత్తుంగ చోళుని ఆస్థాన కవి, జయంగోండార్ కుళోత్తుంగుని కళింగ దండయాత్రను కళింగాత్తుపరణి అనే కావ్యంగా వ్రాశాడు. తరువాత బట్టి కూత్తూర్ విక్రమ చోళుని విజయాలను పరణి అనే కావ్యంగా వ్రాశాడు. **ఇతడే పిళ్ళైత్తమిళ్** పేర రెండో కుళోత్తుంగని బాల్య చరిత్ర రచించాడు. ఉళా అనే కావ్యాలు కూడా వ్రాశాడు.

**ఛందస్సు అలంకార గ్రంథాలు :** 10 వ శతాబ్దానికి చెందిన జైన కవి అమిత సాగరుడు యాప్పరుంగలలమ్ అనే చందో గ్రంధాన్ని రచించాడు. చంద్ర అలంకారమనే మరొక అలంకార గ్రంథం కూడా ఈ యుగం నాటిదే.

**వ్యాఖ్యాన గ్రంథాలు :** చోళుల కాలం నాటి మరొక విశేషం ప్రాచీన తమిళ శిలప్పదికారమ్‌కు ఆడియార్కు వల్లర్ పల్లవ యుగం నాటి కురల్ కావ్యానికి పరిమేళగర్ వ్యాఖ్యానాలు వ్రాశారు. అలాగే తొల్కాప్పియం అనే మరొక గ్రంధానికి ఇళం పురాణార్ అను కవి వ్యాఖ్యానాలు వ్రాశాడు.

**సంస్కృత సాహిత్యం - శైవ గ్రంథాలు :** శైవ పండితులు సంస్కృతంలో కూడా గ్రంథాలు వెలువరించారు. ఉమాపతి శరతుకాశం అను గ్రంథాన్ని, అరుత్ నంబి శివజ్ఞాన సిద్ధాంతం రచించాడు.

**ఇతర సంస్కృత గ్రంథాలు :** ఈ యుగంలో శైవ కవులే గాక ఇంకా కొందరు సంస్కృతంలో కావ్యాలు వ్రాశారు. మొదటి పరాంతకుని కాలంలో కేశవ స్వామి నానార్ధనవసంక్షేపం నిఘంటువును తయారు చేశాడు.

రామానుజాచార్యుడు బ్రహ్మ సూత్రాలకు సంస్కృతంలో శ్రీ బాష్యం వ్రాశాడు. వెంకట మాధవుడు ఋగ్వేద భాష్యం వ్రాశాడు. చోళులు అనేక విద్యా సంస్థలను పోషించి వేద విద్యలకు ప్రాచుర్యం కల్పించారు. ఆనాటి ముఖ్య వేద విద్యా సంస్థలలో ప్రముఖమైనది వెన్నయిరం.

**చోళుల శిల్పకళ :** చోళులు గొప్ప భవన నిర్మాతలు. వారు అనేక శివాలయాలను నిర్మించారు. పెద్ద ప్రాకారాలు, గోపురాలు వీరి శిల్ప వాస్తు లక్షణాలు. దేవాలయాల్లో దేవుళ్ళకు వారి పేర్లు పెట్టడం, దేవాలయాలలో దేవతా విగ్రహాలతో పాటు రాజు వారి పట్టపు రాణుల విగ్రహాలు ప్రతిష్ఠించడం చోళుల ప్రత్యేకత.

**తొలి దేవాలయాలు :** వీరి దేవాలయాలన్నీ పల్లవులు ప్రారంభించిన ద్రావిడ శైలిలోనే ఉండేవి. మొదట చోళుల కాలంలో దేవాలయాలు పరిమాణంలో చిన్నవి. నర్తమలైలోని విజయాలయ చోళేశ్వరాలయం, తిరుచునాపల్లి జిల్లాలోని శ్రీనివాస వల్లూరిలోని కొరంగనాధాలయాలను, పరాంత చోళుడు నిర్మించాడు.

చోళ శిల్పకళా వైభవాన్ని చాటేవి తంజావూరులోని బృహదీశ్వర ఆలయం (పెరియకోవిల్) గంగై కొండ చోళపురం దేవాలయం. ఈ రెండు దేవాలయాలు నేటికిని చోళుల దర్పాన్ని ప్రదర్శిస్తున్నాయి. తంజావూరులోని బృహదీశ్వరాలయం పరిమాణంలో చాలా పెద్దది. ఇది భారతీయ వాస్తువుకు మకుటం అని పెర్సిబ్రౌన్ కీర్తించాడు. రెండోది గంగై కొండ చోళపురంలో రాజేంద్ర చోళుడు నిర్మించిన ఆలయం అది పరిమాణంలో చిన్నదైనా విశేష శిల్ప సంపదలో అతి సుందరంగా నిర్మితమైంది. ఇంకా త్రిభునేశ్వర ఆలయం, బరావతేశ్వర ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం ముఖ్యమైనవి.

**శిల్పాలు :** ఈ దేవాలయాల్లో అతి సుందరమైన విగ్రహాలు మలిచారు. శివలింగాలు, రాజ రాజేశ్వరి విగ్రహం అద్భుతంగా చెక్కారు. సౌందర్యానికి భావి విశిష్టతకు నటరాజ విగ్రహం మారు పేరు. దేవాయాల మీద, గోడల మీద, ప్రదక్షిణ మార్గంలోని గోడల మీద, శివుని జీవిత ఘట్టాలు కుడ్య చిత్రాలుగా చిత్రించారు. వాటిలో శివుడు అసురులతో యుద్ధం చేస్తున్నట్లు చిత్రించిన చిత్రం గంభీర్యంగా ఉంది.

## 23.6 రాష్ట్రకూటులు :

చాళుక్యులకు సామంతులుగా ఉండి వారి తరువాత దంతదుర్గుడు రాష్ట్రకూట సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఇతని కాలంలో వీరి సామ్రాజ్యం విస్తరించినది. తరువాత మొదటి కృష్ణుడు, ధృవుడు మూడవ గోవిందుడు అమోఘవర్షుడు వీరు సామ్రాజ్యాన్ని బాగా పరిపాలించారు. రాజుకు మహారాజ రాజ, విక్రములోక అనే బిరుదు కలవు. రాజుకు మంత్రి పరిషత్ పాలనలో సహాయపడేవారు పాలనా సౌలభ్యం కోసం రాష్ట్రాలను విషయాలు, భుక్కులు, గ్రామాలుగా విభజించారు. భూమిశిస్తు ముఖ్యమైన పన్ను అనావృష్టి

కాలంలో మినహాయించేవారు ఆర్థికపరిస్థితి మెరుగుగా ఉండేది. మత సామరస్యంతో పరిపాలించారు. వీరి కాలంలో భాషా సారస్వతం అభివృద్ది చెందినది. అమోఘవర్షుడు కవి, పండితుడు. రాజశేఖరుడు కవులను పోషించేవారు. వాస్తు శిల్పకళ అభివృద్ది చెందినది.

## 23.7 చోళులు :

చోళుల పరిపాలనలో కేంద్రప్రభుత్వం, రాజు సర్వాధికారి. రాజుకు సహాయంగా మంత్రిమండలి సహాయం చేసేది. వీరి కాలంలో రెవిన్యూ విధానంలో భూమిశిస్తు ముఖ్యఆదాయం. ఇదికాక, వ్యాపారంపై, అడవి సంపదపై మగ్గంపై పన్నులు విధించేవారు. చోళులు చతురంగ బలాలు పోషించారు 60 వేల అశ్వదళం, లక్షాపదివేల పదాతిదళం, నౌకాబలంలను పోషించారు. సైనికులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినారు. పాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని కొట్టాలు, నాడులు, కుర్రాలుగా, మండలాలుగా విభజించారు. గ్రామసభలు అనేవి ఏర్పాటుచేసేవారు. ఈ సభలలో ఉర్, నగసత్తార్, సభ అని శాఖలు కలవు. వీటిని అర్హతను బట్టి నియమించారు. గ్రామ సంఘాలు అనేవి ఏర్పాటు చేసారు. న్యాయం అనేది నాలుగు పాదాలపై నడిచేది. ఉరిశిక్ష అనేది అమలులో ఉండేది. వీరి యుగం తమిళ సాంగిత్య స్వర్ణయుగంగా పిలువబడింది. కావ్యాలు, చంధస్సు, అలంకార గ్రంధాలు, ముఖ్యమైన రచనలు వీరి కళకు తర్కాణం వీరు కట్టించిన దేవాలయాలు. ఈవిధంగా వీరు పరిపాలించారు.

## 23.8 సారాంశం :

చాళుక్యులలో జయసింహుడు మూలపురుషుడు. వీరిలో సుప్రసిద్దులు, పులకేశి, కీర్తివర్మ, రెండవ పులకేశి గొప్పవారు. రెండవ పులకేశి కాలంలో చాళుక్య సామ్రాజ్యం బాగా అభివృద్ది చెందినది. చాళుక్యుల పరిపాలన గుప్తుల తరువాత స్వర్ణయుగం అని చెప్పుకోవచ్చు. వీరు కూడా గుప్తులవలె పాలనా సౌలభ్యం కొరకు రాజ్యాన్ని రాష్ట్రాలుగా, నగరాలుగా, గ్రామాలుగా విభజించారు. వీరి ముఖ్య ఆదాయం భూమిశిస్తు. వ్యవసాయరంగాన్ని బాగా అభివృద్దిచేశారు. సాంఘిక వ్యవస్థలో కులమత విబేధాలు లేక ప్రజలు శాంతిగా జీవించేవారు. హుయాగ్‌సాంగ్ ఆనాటి సాంఘిక పరిస్థితుల గురించి తన గ్రంథము (షండికా)లో వ్రాసినాడు. వీరు దేవాలయాలు కట్టించారు. శిల్పములు చెక్కించినారు. వీరి శిల్పకళకు విరూపాక్ష దేవాలయం తార్కాణం.

## 23.9 మాదిరి ప్రశ్నలు :

1. గ్రామపాలన, స్థానిక పాలన గురించి విస్తృతంగా వ్రాయుము ?
2. చోళులనాటి సాంఘీక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల గూర్చి వ్రాయుము ?
3. చాళుక్యుల రాజ్యస్థాపన, చాళుక్యుల రాజుల గూర్చి వ్రాయుము ?
4. చాళుక్యుల పరిపాలనా విధానం, సంస్కృతి గురించి వ్రాయుము ?
5. రాష్ట్రకూటుల రాజుల గూర్చి వ్రాయుము ? వారి పతనానికి గల కారణాలు తెలుపుము ?
6. చోళ రాజుల మరియు సైనిక దండయాత్రలు, విజయాలు గూర్చి వ్రాయుము ?
7. చోళుల పరిపాలనా, సంస్కృతి గురించి వ్రాయుము ?

## సంక్షిప్త ప్రశ్నలు

1. పులకేశుల దిగ్విజయ యాత్రలను గూర్చి వివరింపుము ?
2. కడపటి చాళుక్యుల గూర్చి వ్రాయుము ?

3. చాళుక్యుల సామ్రాజ్య పతనానికి గల కారణాలు తెలుపుము ?

4. రాష్ట్రకూటుల పాలనా వ్యవస్థ గురించి మరియు సాంఘీక, ఆర్థిక, మత పరిస్థితుల గురించి వ్రాయుము ?

5. రాజేంద్రచోళుని వారసుల గూర్చి వ్రాయుము ?

## SUGGESTED READINGS


| | | | |
|---|---|---|---|
| 1. | Benerji.R.D. | : | 'The Age of the Imperial Guptas', Bombay 1933 |
| 2. | Bhandarkar.R.G. | : | 'Early History of the Deccan', Varanasi, 1975 |
| 3. | Dubrevil. J.G | : | 'Ancient History of Deccan', Pandicherry, 1939 |
| 4. | Gopalachari.K | : | 'Early History of Andhra Country,' Madras 1976 |
| 5. | Gopalan.R | : | History of the Pallavas., Madras. 1928 |
| 6. | Heras. H | : | Studies in Pallava History, Madras 1933 |
| 7. | Krishna Rao. B.V. | : | Early Dynasties of Andhra Desa . Madras 1942 |
| 8. | Majumdar. R.C (ed) | : | 'The Classical Age', Bombay 1954. |
| 9. | Majumdar R.C. & A.S. Alteker | : | The Vakataka - Gupta Age, Delhi, 1986 |
| 10. | Majumdar.R.C., Roy Chaudhri & A.K. Datta | : | 'An Advanced History of India', London, 1960. |
| 11. | Mukherji.R.K. | : | 'The Gupta Empire', Bombay 1959. |
| 12. | Nilakanta Sastry.K.A. | : | A History of South India. |
| 13. | Ojha. K.C. | : | 'The History of Foreign Rule in Ancient India'. Allahabad. 1960 |
| 14. | Sircar. D.C | : | 'Successiors of Satavahanas in the Lower Deccan' Calcutta. 1939 |
| 15. | Subrahmanyam. K.R. | : | 'Buddhist Remains in Andhra & The History of Andhra between 285 - 610 A.D., New Delhi, 1989. |
| 16. | Thaper. Rumilla | : | History of India. Vol. I, New Delhi 1966. |
| 17. | Yazdani. G (ed) | : | The Early History of the Deccan. Oxford. |


డా॥ యమ్. హనుమంతరావు

### పాఠం - 24

# మహమ్మదీయ దండయాత్రలు - ఫలితములు

## 24.1 లక్ష్యం:

ఈ అధ్యాయం చదవడం ద్వారా రాజపుత్రయుగంలో జరిగిన ముస్లింల తొలి దాడుల గురించి తెలుసుకోవడం జరుగుతుంది. భారతదేశంలో అడుగుపెట్టిన మొదటి ముస్లింలైన అరబ్బులు సింధుని జయించిన విధానం, తరువాత 11 వ శతాబ్దంలో జరిగిన గజనీమహమూద్ దండయాత్రలు, తరువాత 11 వ శతాబ్దం చివర ఘోరీ మహమ్మద్ ఉత్తర భారతదేశాన్ని జయించి భారతదేశంలో ముస్లిం రాజ్యాన్ని స్థాపించిన విధానం తెలుసుకోవడం జరుగుతుంది.

## విషయక్రమం


24.1 ఉపోద్ఘాతం

24.2 అరబ్బుల సింధు ఆక్రమణ - ఆనాటి భారతదేశ పరిస్థితులు

24.3 సింధు ఆక్రమణ

24.4 గజనీమహమ్మద్

24.5 ఘోరీ మహమ్మద్ దండయాత్రలు

24.6 గజని, ఘోరీ మహమ్మద్ పోలిక

24.7 ఘోరీమహమ్మద్ చేతిలో హిందువులు ఓడిపోటానికి కారణాలు

24.8 సారాంశము


## 24.1. ఉపోద్ఘాతం :

7వ శతాబ్ది ప్రథమ భాగంలో ఇస్లాం మతాన్ని స్థాపించడంతో మధ్యయుగ ప్రపంచ చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభంఅయినది. ఇస్లాం మతాన్ని స్థాపించిన వ్యక్తి మహమ్మద్ ప్రవక్త. అతడు క్రీ.శ 570 లో అరేబియాలో జన్మించాడు. అతడు అనుకోకుండా ఆధ్యాత్మిక అనుభూతి పొంది నూతన సిద్ధాంతాలతో ఇస్లాం మతాన్ని స్థాపించాడు. ఇస్లాం మత పవిత్రగ్రంథమైన ఖురాన్, మహమ్మద్ ప్రవక్త సిద్ధాంతాలను వివరిస్తుంది. మహమ్మద్ తన నూతన సిద్ధాంతాలతో అరబ్బులను సమైక్య పరచి, ఇస్లాం మతాన్ని వ్యాప్తి చేయడం ప్రతి ముస్లిం కర్తవ్యమని బోధించాడు. మహమ్మద్ ప్రవక్త బోధన చేత ప్రభావితులయిన అతని శిష్యులు ఇస్లాం మత వ్యాప్తికి కృషిచేసారు. ఖలీఫాల కాలంలో ఇస్లాం మతం అరేబియా సరిహద్దులు దాటి సిరియా, పాలస్తీనా, మెసపటోమియా, పర్షియా ప్రాంతాలకు విస్తరించింది. తరువాత అరబ్బుల దృష్టి భారతదేశంపై పడినది. భారతదేశంలో తమ మతాన్ని వ్యాప్తి చేయాలని విగ్రహారాధనను అంతం చేయాలని, భారతదేశపు సిరిసంపదలను కొల్లగొట్టాలని భావించారు. ఆ నేపథ్యంలో సిరియా, ఈజిప్టు, పర్షియాలను జయించిన తదుపరి అరబ్బు సామ్రాజ్యాన్ని స్థాపించి మత విస్తరణలో భాగంగా భారతదేశంపై దండెత్తి 8 వ శతాబ్దంలో సింధు, ముల్తానులను ఆక్రమించారు.

## 24.2 అరబ్బుల సింధు ఆక్రమణ - ఆనాటి భారతదేశ పరిస్థితులు :

హర్షవర్ధనుడు క్రీ.శ 647 లో మరణించాడు. అతని మరణానంతరం ఉత్తరభారతదేశం రాజకీయ ఐక్యతను కోల్పోయి చిన్నచిన్న రాజ్యాలు ఏర్పడి అంతఃకలహాలలో మునిగి ఉన్నాయి. కనోజ్, మాళ్వ, కాశ్మీరు, సింధు, బెంగాలు, నేపాల్, అస్సాంలు చెప్పుకోదగిన రాజ్యాలు. 8 వ శతాబ్ది ప్రారంభంలో కనోజ్‌ను యశోవర్మ అనురాజు పాలిస్తుండేవాడు. అతని దండయాత్రల వలన కనోజ్ మరలా ఉన్నతస్థాయిని అందుకున్నది. రాజస్థాన్‌లో ప్రతీహారులు పాలించుచున్నారు. కాశ్మీరును కర్కోటక వంశానికి చెందిన చండాపీడుడు పాలిస్తున్నాడు. హర్షుని మరణానంతరం బెంగాలులో అరాచక పరిస్థితులు ఏర్పడ్డాయి. తరువాత పాలవంశం అధికారం లోనికి వచ్చింది. మాళ్వాలోకూడా అరాచక పరిస్థితులు నెలకొని ఉన్నాయి. నేపాలు స్వతంత్రం ప్రకటించుకున్నది. హర్షుని కాలంలో అస్సాంను పాలించిన భాస్కర్ వర్మను శిలాస్థంబుడు ఓడించాడు. అచట అతని వంశస్థులు పాలిస్తున్నారు. సింధును దహీర్ పాలించుచున్నాడు. దక్షిణభారతదేశంలో పల్లవ చాళుక్యులకు భీకర యుద్ధాలు జరుగుతున్నాయి. అట్టిపరిస్థితులలో అరబ్బులు సింధుపై దండెత్తారు.

### 24.2.1 భారతదేశంపై దండెత్తడానికి కారణాలు :

1. అరబ్ సామ్రాజ్యాన్ని విస్తరింపవలెననెడి కోరిక
2. తమ మతమయిన ఇస్లాంను ఇండియాలో వ్యాప్తిచేసి విగ్రహారాధనను అంతం చేయవలెనను ఆశయం
3. భారతదేశం అనాదినుండి సిరిసంపదలకు నిలయం. కనుక ఇచ్చటి ధనధాన్యాలను కొల్లగొట్టవలెననే సంకల్పం.

**24.2.2 తొలిప్రయత్నాలు :** ఈ ఆశయాలతో అరబ్బులు ఇండియాను జయింపవలెనని 7వ శతాబ్దం లోనే ప్రయత్నించారు. క్రీ.శ 636 లో మూడవ ఖలీఫా ఉమర్ (633-44) భారతదేశం పై నౌకాదాడులు చేశారు. బొంబాయి సమీపంలోని ధానాపై నౌకాదాడి చేశారు. కాని ఆ కాలంలో దక్కనును శక్తివంతుడైన రెండవ పులకేసి పాలిస్తున్నాడు. కనుక చాళుక్యులు వారిని తరిమి కొట్టారు. తరువాత క్రీ.శ.643 లో బ్రోచ్ (గుజరాత్) దేబల్ (సింధు) లపై దాడిచేశారు. అవిగూడా విఫలమైనవి. క్రీ.శ.663 లో సింధుపై మరొకదాడి చేసి మరలా విఫలులయ్యారు. కాని 700 సం॥ నాటికి బెలూచిస్థానాన్ని ఆఫ్ఘనిస్థాన్‌లను ఆక్రమించగల్గారు. ఆఫ్ఘనిస్తాన్, బెలూచిస్థానాలను జయించిన తరువాత వారు సింధును జయించే ప్రయత్నాలు ఆరంభించారు.

**24.2.3 సింధు ఆక్రమణకు ముఖ్యకారణం :** సింధు ప్రజలు జాట్‌రాజపుత్ర తెగకు చెందినవారు. 8 వ శతాబ్దం మొదటి భాగంలో సింధును దహీర్ అను బ్రాహ్మణ రాజు పాలించుచుండేవాడు. అతనికాలంలో ఖలీఫాకు కానుకగా పంపడానికి కొందరు స్త్రీలు, మరికొన్ని బహుమతులతో ఒకనౌక క్రీ.శ. 711 లో సింహళంనుండి పర్షియాకు వెళ్ళుచుండెను. ఈ నౌకను సింధు నౌకరేవైన దేబల్‌వద్ద ఓడ దొంగలు దోచుకొనిరి. ఆ వార్తవిని ఖలీఫాకు సామంతుడు పర్షియాపాలకుడైన హజాజ్ సింధును పాలించు దహీర్‌కు అవి దోచుకున్నవారిని దండించి వానిని పంపమని కబురుపంపాడు. కాని ఆ దొంగలపై తనకు ఆధిపత్యం లేదని దహీర్ ప్రత్యుత్తరమిచ్చాడు. అందులకు కోపించి హజాజ్, ఖలీఫా అనుమతిపై సింధు దేశం పైకి సైన్యాలను పంపాడు.

**24.2.4 దండయాత్రకాలం నాటి సింధు పరిస్థితి :** దహీర్ అసమర్థుడు. అతనికి తన ప్రజలపైనకాని, ఉద్యోగులపైన కాని అదుపులేదు. దూరదృష్టిగాని, పరమతసహనం అతనికి లేదు. పైగా అతడు బౌద్ధులను హింసించుచుండేవాడు. అందువలన వారు అతనికి విరోధులయినారు. ఈ పరిస్థితులలో సామంతులు స్వతంత్ర వైఖరిని అవలంబించి యుండిరి. సింధు, బౌద్ధదేశమైనందున తగిన ఆర్థిక స్థోమత, సమర్ధవంతమైన సైన్యం లేదు. ప్రజలకు దహీర్‌పై భయభక్తులు లేవు.

**24.2.5 దండయాత్రలు :** ఈ పరిస్థితులలో హజాజ్ క్రీ.శ 711 లో ఇబైదిదుల్లా, బుడైల్, అనువారల నాయకత్వంలో రెండుసార్లు సింధు పైకి సైన్యాలను పంపాడు. కాని వారిని దహీర్ ఓడించాడు. ఈయుద్ధాలలో ఆ సేనాధిపతులు మరణించారు.

**24.2.6. ఖాసిం దండయాత్ర - 712 :** కనుక హజాజ్ మూడవసారి ఎట్లయిన దహీరును ఓడించవలెనని పట్టుదలతో తన అల్లుడు మహమ్మద్ ఖాసింను సింధుపైకి పంపాడు. ఈ దండయాత్ర కాలంనాటికి ఇతనికి 17సం॥ల వయస్సు మాత్రమే ఉండెను. ఆనాటికే అతడు గొప్ప సేనానిగా పేరు గాంచాడు. అతడు సమర్థవంతంగా సైన్యాన్ని నడిపి సింధు, ముల్తానులను సులభంగా ఆక్రమించాడు.

## 24.3 సింధు ఆక్రమణ :

ఖాశిం, మక్రాన్, బెలూచిస్థాన్ ల గుండా దండెత్తి దేబాల్ చేరాడు. కొందరు జాట్‌లు, మేడులు సహాయంతో ఖాశిం సులభంగా దేబాల్ ని ఆక్రమించాడు. తరువాత నేరున్, సెవ్వాన్, సీసా మొ॥ పట్టణాలను కొల్లగొట్టి శిరిస్థానం ఆక్రమించి ముందుకు సాగాడు. దహీర్ ఆ స్థానంలో పనిచేయు ఉద్యోగుల సహాయంతో ఖాశిం సింధునదిని దాటి రేవాకోటను ముట్టడించాడు. అది తెలిసి దహీర్ స్వయంగా 50 వేల సైన్యంతో బ్రాహ్మణాబాద్ నుండి బయలుదేరి వచ్చి క్రీ.శ. 712 లో ఖాశింను ఎదుర్కొని వీరోచితంగా పోరాడి యుద్ధభూమిలో మరణించాడు. దహీర్ కుమారుడు జయసింగు బ్రాహ్మణాబాదు పారిపోయాడు. అందువలన తరువాత ఖాశిం బ్రాహ్మణాబాద్ పై దాడిచేసి దానిని కూడ స్వాధీనం చేసుకున్నాడు. తరువాత సింధు రాజధాని ఆలోర్‌ను ఖాశిం ముట్టడించాడు. అది దహీర్ రెండవ కుమారుడు పుగి రక్షణలో వున్నది. అతడు ఖాశిం సైన్యాలను ఎదుర్కొని ఓడిపోయాడు. దానితో సింధు పూర్తిగా ఖాశిం వశమైంది. ఆ తరువాత అతడు ముల్తాన్‌ను జయించడానికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని ప్రదేశాలను ఆక్రమించాడు. ముల్తాన్ చేరాడు. ముల్తాన్‌ను జయించాడు. అచట అతనికి అపారధనరాసులు దొరికినవి అందువల్ల ముల్తాను నగరాన్ని అరబ్బు రచయితలు బంగారు నగరము అని వర్ణించారు.

**24.3.1 ఖాశింతరువాత పరిణామాలు :** ఖాశిం తరువాత వచ్చిన జునాయిడ్ కాశ్మీరు, కనోజ్‌లపై దండెత్తగా కాశ్మీరురాజా లలితాదిత్యముక్తాపీడుడు, కనోజ్‌రాజా యశోవర్మ వారిని ఓడించి తరిమారు. అంతటితో అరబ్బులు తమ దండయాత్రలను కట్టిపెట్టి సింధు, ముల్తానులతో తృప్తిపడ్డారు. కాని 750 సం॥లో అరేబియాలో ఉమర్ వంశస్తులను తొలగించి అబ్బాస్ వంశస్థులు ఖలీఫా పదవిని పొంది తమ రాజధానిని డమాస్కస్ నుండి బాగ్దాద్‌కు మార్చుకున్నారు. వారు సింధు, ముల్తానులను అశ్రద్ధ చేసినందున ఇచ్చట పాలించు గవర్నర్లు క్రీ.శ.781 లో స్వతంత్రులై సింధులోని మనుసారా ప్రాంతంలో ఒకరు, ముల్తానులో మరియొకరు రెండు స్వతంత్ర రాజ్యాలను ఏర్పరచుకున్నారు. ఈ రెండు రాజ్యాలు 11 వ శతాబ్దంలో గజనీమహమూద్ దండయాత్రల వరకు కొనసాగినవి.

### 24.3.2 సింధును ముస్లింలు జయించుటకు గల కారణాలు :

1. దహీర్ అసమర్థత : దహీర్ అసమర్దుడు అతని దుష్పరిపాలనవల్ల ఉద్యోగులు అదుపు తప్పారు. ప్రజలు అవిధేయులయ్యారు. సామంతులు స్వతంత్రులయ్యారు. అతని పరమత ద్వేషం బౌద్ధలను విరోధులుగా మార్చినది. అతనికి దూరదృష్టి లేదు. దేబాల్ నేరూన్‌లను ఖాశిం ఆక్రమించినప్పుడు అచటి రాజులకు సహాయం చేయకుండా మిన్నకున్నాడు.

2. ఆర్థిక దుస్థితి : సింధు ఎడారిప్రాంతం, ఆర్థిక వనరులు లేవు కనుక పటిష్టమైన సైన్యాన్ని దహీర్ పోషింపలేకపోయాడు.

3. సాంఘిక అనైక్యత : దేశం కులవ్యవస్థ ప్రజలలో ఐక్యతను లోపింపచేసింది. ముఖ్యంగా హిందూ బౌద్ధులకు సఖ్యత లేదు.

4. సింధు భౌగోళిక స్థితి : సింధుకు మిగిలిన దేశానికి మధ్యపెద్ద ఎడారి వున్నది. కనుక మిగిలిన దేశంతో సింధుకు రాజకీయసంబంధాలు లేవు కనుక ఎవరూ సహాయానికి రాలేదు. ఇచ్చటి పరిస్థితులు ఎవ్వరూ పట్టించుకొనలేదు.

5. అరబ్బుల మత ఆశయం : అరబ్బులు భారతదేశంలోని కాఫీర్లను అంతం చేసి తమ మతాన్ని వ్యాప్తి చేయవలెను అను ఆవేశంతో పోరి విజయం చెందారు. కాని హిందువులకు అట్టి ఆవేశంలేదు.

7. అరబ్బుల సైన్యం : అరబ్బులకు మంచి క్రమశిక్షణ కలిగిన సైన్యం, పేరుమోసిన గుర్రపుదళం గలదు. కనుక వారు సులభంగా సింధును ఆక్రమించారు. మొత్తంమీద మహమ్మదీయులు సింధు విజయాన్ని ఇస్లాం చరిత్రలో గొప్ప సంఘటన అని పేర్కొన్నప్పటికి చరిత్రకారులు దానియందు తేలిక భావాన్ని చూపారు.

**24.3.3. అరబ్బులు భారతదేశాన్ని జయించలేకపోవడానికి కారణాలు :** అరబ్బులు ఇండియా మొత్తాన్ని జయించలేకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. 1. అరబ్బులు సరిఅయిన మార్గాన భారతదేశంలో ప్రవేశించలేదు. వారు ఆక్రమించిన సింధు ప్రాంతానికి, దేశానికి మధ్య థార్‌ఎడారి అడ్డుగా ఉన్నది. కనుక అటువైపునుండి దేశాన్ని జయించడం అసాధ్యం. 2. థార్ ఎడారిని అధిగమించి రాగలిగినా కనోజ్‌ను ఏలిన యశోవర్మ, కాశ్మీరును ఏలిన లలితాదిత్య ముక్తాపీడుడు వారిని ఓడించి తరిమినారు. దానితో వారికి మిగిలిన భారతదేశపు రాజ్యాలను జయించలేమని భయం కలిగినది. తరువాత వారు అట్టి ప్రయత్నాలు చేసినా రాజస్థానంలో రాజ్యం స్థాపించిన బప్పరావల్, కనోజ్‌లో సామ్రాజ్యం స్థాపించిన ప్రతీహారులు, దక్షిణదేశాన్ని పాలించిన రాష్ట్రకూటులు వారిని నిరోధించారు. అనగా ఆనాడు అరబ్బులకన్నా హిందూ రాజ్యాలు చాలా బలంగా ఉన్నాయి. 3. ఖాశిం తరువాత వచ్చిన అరబ్బు నాయకులు అసమర్థులు. 4. తరువాత అరబ్బులలో షియా సున్ని అని బేధాలు ఏర్పడి వారి మధ్య సామరస్యం తగ్గి అరబ్బులు బలహీనులయ్యారు. 5. 9 వ శతాబ్దంలో ఖలీఫాల శక్తి క్షీణించి వారు సింధులోని అరబ్బులకు ఎటువంటి సహాయం చేయలేదు. అంతేగాక వారు అసలు సింధునే వదలుకున్నారు. 6. కనుక సింధు, ముల్తాను గవర్నర్లు స్వతంత్రం ప్రకటించి వానిని స్వాధీనం చేసుకుని, మతవిస్తరణకు స్వస్తి చెప్పి తమకు దక్కిన రాజ్యాలతో తృప్తి పడ్డారు. తాము మతవ్యాప్తికి ప్రయత్నిస్తే బలంగా ఉన్న హిందూ రాజుల చేతిలో ఓడిపోయి తమ రాజ్యాలను కోల్పోవలసి వస్తుందని గ్రహించారు. దానితో వారు భారత దేశంలోని ఇతర రాజ్యాలపై దండెత్తే మాట తలపెట్టలేదు.

**24.3.4 సింధు ఆక్రమణ ఫలితాలు :** అరబ్బులు సింధును ఆక్రమించి 300 సం॥లు పాలించినప్పటికీ వారు భారతదేశంలో ఎట్టి రాజకీయ, సాంఘిక, మతసంస్కృతీ పరిణామాలను తీసుకుని రాలేకపోయారు. వారు ఎక్కువ ప్రాంతాన్ని జయింపలేకపోయారు. తమ మతాన్ని విస్తరించలేకపోయారు. భారతీయ సంఘ వ్యవస్థలో ఎట్టి మార్పునూ తేలేకపోయారు. అందువలన అరబ్బులదండయాత్రఎటువంటి సత్ఫలితాలు ఇవ్వని ఘనవిజయం అని లేన్‌పూల్ అను చరిత్రకారుడు వ్యాఖ్యానించాడు. అట్లే సింధు, ముల్తాన్‌లను తప్ప అరబ్బులు భారతదేశంలో మరే ఇతర ప్రాంతాలను జయించలేకపోయారని ఉల్సీహేగ్ అన్నాడు. అరబ్బుల విజయం భారతదేశపు రాజకీయ చరిత్రపై జీవన విధానంపై కూడా ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు. భారతీయులు ఇస్లాం కన్నా తమ మతం, సంస్కృతి గొప్పవని భావించారు. కాకపోతే హిందువులు ఆర్థికంగా నష్టపడ్డారు. హిందువుల భూములను అరబ్బులు ఆక్రమించారు. హిందువులు రాజకీయ పదవులు పోగొట్టుకున్నారు. ఉన్నత ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. దర్బారులలో వారికి పెద్ద పదవులు ఇవ్వలేదు. హిందువులు సాధారణ రైతులుగా, కూలీలుగా జీవించవలసి వచ్చింది. అరబ్బులు భారతదేశంలో ఎట్టి మార్పులు తీసుకురాలేకపోయినా వారి దండయాత్ర ఆ తరువాత తురుష్కులకు మార్గదర్శకమయ్యాయి.

**అరబ్బులపై హిందూ ప్రభావం :** అరబ్బులు హిందువులపై ఎటువంటి ప్రభావం చూపలేకపోయారు. పైగా హిందూ మత ప్రభావమే అరబ్బులపై ప్రసరించింది. అరబ్బులు సాంస్కృతీపరంగా భారతీయుల కంటె చాలా వెనుకపడి ఉన్నారు. ఆ విషయాన్ని అరబ్బులు గ్రహించి భారతీయ విజ్ఞానాన్ని అధ్యయనం చేసారు. అరబ్బు ఖగోళశాస్త్రవేత్త ఆలుమషార్ కాశీలో 10 సంవత్సరాలు ఉండి హిందూ విజ్ఞాన విద్యను అభ్యసించాడు. అరబ్బులు హిందువుల నుండి పరిపాలనా విధానాలను కూడా నేర్చుకున్నారు. బ్రహ్మగుప్తుని, ఖగోళశాస్త్రమయిన బ్రహ్మసిద్ధాంతం, ఆయుర్వేద శాస్త్రగ్రంథమైన చరకసంహిత, నీతిశాస్త్ర గ్రంథమైన పంచతంత్రం మొదలయిన భారతీయ విజ్ఞాన గ్రంధాలను అరబ్బీ భాషలోనికి తర్జుమా చేయించారు. ఖలీఫా హరున్ ఆలీ రషీద్ (క్రీ.శ. 766-808 మధ్య కాలంలో అనేక మంది భారతీయ శిల్పులు, తాత్వికులు, పండితులు, ఖగోళ శాస్త్రవేత్తలు, వైద్య శిఖామణులు బాగ్దాద్‌కు వెళ్ళి గౌరవాలు పొందారు. మంకా, సల్హా ఇద్దరు భారతీయ వైద్యులు హరున్ ఆల్ రషీద్ ఆస్థానంలో ఉండేవారు. హిందూ వేదాంత దర్శనాల పరిచయంతో ముస్లిం మత విశ్వాసాలలో మార్పులు వచ్చాయి. దాని ఫలితంగా మహమ్మదీయులలో సూఫీ సిద్దాంతం పుట్టినది. సూఫీ వాదులు హిందువుల వలె కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు.

కాని అరబ్బులలో ఉన్న సమతాభావం, తమ మతంపై వారికి ఉన్న ప్రగాఢ విశ్వాసం. ఐకమత్యం, యుద్ధ నిర్వహణ మొదలైన మంచి విషయాలను భారతీయులు నేర్చుకోలేదు. భారతీయ సంస్కృతిలో ఉన్న గొప్పదనాన్ని గ్రహించిన తరువాత అరబ్బులు హిందువులను బాధించడం మానుకుని హిందువులు, బౌద్ధులపై జిజియా పన్నుని మాత్రం విధించి వారికి మత స్వేచ్ఛ ఇచ్చారు. హిందువులకు కొలువులో ఉద్యోగాలు కూడా ఇచ్చారు.

**వ్యాపార సంబంధాలు** : అరబ్బుల రాకవలన భారతదేశానికి అరబ్బు దేశాలతో మంచి వర్తక సంబంధాలు ఏర్పడ్డాయి. వారు ఇండియా వస్తువులను వారి దేశాలకు ఎగుమతి చేయుటమేగాక చాళుక్య, రాష్ట్రకూటులతో వ్యాపార సంబంధాలు పెంచుకున్నారు. పోర్చుగీసు వారు వచ్చేవరకు అరబ్బులే ప్రముఖ వ్యాపారులు. ఈ విధంగా అరబ్బులు మన దేశ చారిత్రిక సంస్కృతికి ఎట్టి సేవ చేయలేక పోయినను, మన సంస్కృతి, విదేశాలకు విస్తరింపచేసి విదేశాలతో వ్యాపార సంబంధాలను పెంచగలిగారు.

**పరిపాలన** : సింధులో అరబ్బులు ముస్లిం పరిపాలనను ప్రవేశపెట్టిరి. దేశాన్ని ఇక్తాలుగా (జిల్లాలు) విభజించిరి. ఇక్తాపై అధికారి ఇక్తాటూరు సైనికుల జీతాలకు బదులు జాగీరులను ఇచ్చారు. ముస్లిం మతాధికారులు జాగీరులు పొందారు. 2/5 నుండి 1/4 వంతు వరకు భూమిశిస్తు వసూలు చేసారు. హిందువులపై జిజియా అనే నూతన పన్నును విధించి వసూలు చేసారు. న్యాయపాలనలో ఖురాన్ పద్ధతులను ప్రవేశపెట్టిరి. న్యాయవేత్తలుగా ఖాజీలను నియమించిరి. శిక్షలు కఠినంగా ఉండేవి. హిందువులు దొంగతనం చేస్తే కుటుంబాన్ని అంతటినీ చంపివేసేవారు. ఇస్లాంను అంగీకరించని వారిని వధించారు. ఇస్లాం మతాన్ని హిందూ ప్రజలపై రుద్దటానికి ప్రయత్నించారు. మొదట హిందూ దేవాలయాలను నాశనం చేసారు. కాని ప్రజలు ఎదురు తిరగడంతో హిందువులు తమ దేవతను పూజించుకోవచ్చు అని అనుమతి ఇచ్చారు.

## గజని మహమూద్ దండయాత్రలు :

**ఉపోద్ఘాతం** : అరబ్బులు తరువాత భారతదేశంపై దండెత్తిన వారు ఆఫ్ఘనిస్తాన్‌ను ఏలిన తురుష్కులు. బాగ్దాద్ ఖలీఫాల చివరి కాలంలో వారి సామ్రాజ్యం విచ్ఛిన్నమైనది. దానిని ఆసరాగా తీసుకుని ఆఫ్ఘనిస్తాన్‌లో ఖలీఫాల సామంతుడయిన అలప్తజన్ క్రీ.శ 962 లో స్వతంత్రం ప్రకటించి తన రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. అతడు భారతదేశంపై దండెత్తాడు. తరువాత గజనీ మహమూద్ దండెత్తాడు. వీరు తురుష్క జాతీయులు.

**తురుష్కులు భారతదేశంపై దండెత్తినపుడు భారతదేశ పరిస్థితులు** : 10 వ శతాబ్దం చివరలో కూడ భారతదేశం రాజకీయ ఐక్యతను నోచుకోలేదు. ఉత్తర భారత దేశంలో పేరుకు ప్రతీహార సామ్రాజ్యం ఉన్నా, అది బలంగా లేదు. దాని సామంతులు స్వతంత్రం ప్రకటించారు. వారిని అదుపుచేయగల ప్రతీహార చక్రవర్తి లేడు. అందువలన బుందేల్‌ఖండ్ చందేలులు, మాళ్వాలో, పరమారులు స్వతంత్ర వైఖరిని అవలంబించారు. గజనిమహమూద్ కాలంనాడు కనోజ్ లో రాజ్యపాలుడు ప్రతీహార సామ్రాజ్య చక్రవర్తిగా రాజ్యము చేస్తున్నాడు. బుందేల్‌ఖండ్ లో ధంగ, విద్యాధరులు గజని మహమూద్ సమకాలికులు. ఢిల్లీలో తోమరులు పాలించుచున్నారు. వారికి రాజపుత్ర రాజ్యాలతో తత్సంబంధాలు లేవు. రాజస్థాన్‌లోని చౌహానులనే మరియొక వంశం పాలించుచున్నది. గుజరాతును సోలంకీలు పాలిస్తున్నారు. కాలచూరులు ఛందేలులతోను, పరమారులతో పోరాటాలు చేస్తున్నారు. బెంగాలును పాల వంశస్తులు పాలించేవారు. ఈ కాలం నాటికి మహీపాలుడు పాలకుడు. అతని రాజ్యంపై చోళ చక్రవర్తి రాజేంద్రచోళుడు దండెత్తి చాలా నష్టపరిచాడు. ముల్తాన్‌ను ఫతేదావుద్ అను సర్దారుడు పాలిస్తున్నాడు. సింధును అరబ్బులు పాలించుచున్నారు. పంజాబును దైవపుత్రషాహీ వంశం పాలిస్తున్నది. దీని పాలకుడు జయపాలుడు. దక్షిణ దేశంలో కళ్యాణి చాళుక్యులు, చోళులు గొప్ప సామ్రాజ్యాలు నిర్మించారు. వారు ఒకరితో ఒకరు పోరాడుకుంటూ ఉన్నారు. చోళ చక్రవర్తిగా రాజేంద్ర చోళుడు కళ్యాణి చోళ చక్రవర్తిగా సోమేశ్వరుడు పాలించుచున్నారు. ఈవిధంగా భారతదేశం చిన్నచిన్న రాజ్యాలుగా విడగొట్టబడి అంతఃకలహాలతో నిండివుంది.

**అలప్తజన్ - క్రీ. శ. 962-963** : భారతదేశంపై దండెత్తిన తురుష్కులలో మొదటివాడు అలప్తజన్. అతడు పర్షియా పాలించిన సమనీడ్ రాజు కొలువులో ఉన్నతోద్యోగి. అతడు బానిసగా జీవితం ప్రారంభించి తన యజమానిని మెప్పించి క్రీ. శ. 956 లో ఖోరాసన్ గవర్నర్ గా

నియమితుడయ్యాడు. ఆ విధంగా అతని రాజకీయ **జీవితం ప్రారంభం** అయింది. అతని యజమాని అబ్దుల్ మాలిక్ క్రీ. శ. 962 లో **మరణించాడు**. అతని మరణం తరువాత స్వతంత్రం ప్రకటించి గజనీని రాజధానిగా చేసుకొని పాలించాడు. అతడు భారతదేశం పై **దండెత్తి** కొద్ది ప్రాంతాన్ని ఆక్రమించాడు.

**సభక్తజిన్ - క్రీ.శ. 977-97 :** అలప్తజన్ మరణించిన తరువాత అధికారం కొరకు సంఘర్షణ జరిగింది. అందు సభక్తజిన్ విజయం సాధించి క్రీ. శ. 977 లో గజని పాలకుడయ్యాడు. సభక్తజన్ కూడా మొదట బానిసగానే **జీవితం** ప్రారంభించాడు. అతని శక్తి సామర్థ్యాలు, తెలివి తేటలను గ్రహించి అలప్తజన్ సభక్తజన్‌కు తన కుమార్తెను ఇచ్చి వివాహం చేసాడు. అంతేగాక అతనికి 'మీర్ ఉల్ అమాని' అనే బిరుదును కూడా ఇచ్చాడు. సభక్తజన్ పరిపాలకుడయిన తరువాత రాజ్య విస్తరణకు పూనుకున్నాడు. అంతేగాక తను మత వ్యాప్తికి, ధనసంపాదనకు, నడుం కట్టాడు. కనుక విగ్రహారాధనను అంతంచేయవలెనని భారతదేశంపై **దండెత్తాడు**. అతని రాజ్యానికి సరిహద్దులో పంజాబును పాలించు హిందూషాహి రాజ్యం ఉన్నది. దాని రాజు జయపాలుడు. సభక్తజన్ క్రీ.శ. 986-87 లో జయపాలుని రాజ్యంపై దండెత్తాడు. ఆ యుద్ధంలో జయపాలుడు సభక్తజన్‌ని నిలువరించగలిగాడు. ఉభయులు సంధిచేసుకుని యుద్ధ విరమణ చేసారు. కాని తరువాత జయపాలుడు సంధి షరతులను ఉల్లంఘించాడని సభక్తజన్ మరలా జయపాలుని రాజ్యంపై దండెత్తాడు. జయపాలుడు ఢిల్లీ, ఆజ్మీరు, కనోజ్ పాలకుల సహాయం అర్థించాడు. వారి సహాయంతో సభక్తజన్‌తో పోరాడాడు కాని ఓడిపోయాడు. దానితో సభక్తజన్ లంఘాన్, పెషావర్ ప్రాంతాలను ఆక్రమించాడు. సభక్తజన్ కాలంలో గజని రాజ్యం బలపడింది. అతడు క్రీ.శ. 997లో మరణించాడు. అతడు మరణ సమయంలో తన పెద్ద కుమారుడు ఇస్మాయిల్ ని తన వారసునిగా ప్రకటించాడు. కాని చిన్న కుమారుడు మహమూద్ అతనిని తొలగించి సింహాసనానికి వచ్చాడు.

## 24.4 గజని మహమూద్ - క్రీ.శ. 997 -1030 :

గజని మహమూద్ క్రీ.శ. 971 లో జన్మించాడు. అతడు చిన్నతనం **నుండే యుద్ధాలలో** పాల్గొని అనుభవాన్ని సంపాదించి **గొప్ప వీరుడు అయ్యాడు. తండ్రి** మరణించిన తరువాత అతని సోదరుడు ఇస్మాయిల్ రాజు అయ్యాడు. కాని గజని అతనితో 998 లో అంతర **యుద్ధానికి దిగి సోదరుని ఓడించి**, తరిమి గజని సింహాసనమును అధిష్టించాడు. అతడు కాస్పియన్ సముద్ర ప్రాంతం నుండి మక్రాన్, **బెలూచిస్థాన్ వరకు జయించాడు**. ప్రతి సంవత్సరం భారతదేశంపై దండెత్తి విగ్రహారాధనను **నాశనం చేయుటకు, దేశాన్ని కొల్లగొట్టి** ధనసంపాదన **చేయాలనే ఆశయాలతో** భారతదేశంపై 17 సార్లు దండయాత్రలు చేసాడు.

**24.4.1 మహమూద్ దండయాత్ర కాలంలో దేశపరిస్థితి :** పంజాబును హిందూషాహి వంశస్థులు **పాలించు**చున్నారు. సింధు, ముల్తానులను అరబ్బులు ఏలుచున్నారు. కాశ్మీరును లోహర వంశస్థుడైన సంగ్రామ రాజు **పాలించు**చున్నాడు. కనోజ్‌ను ప్రతీహార రాజ్యపాలుడు ఏలుచున్నాడు. బుందేల్ ఖండ్‌ను ఛందేల విద్యాధరుడు, బెంగాల్‌ను పాలను **వంశమహీ**పాలుడు, మాళ్వాను పరమార భోజుడు, గుజరాత్‌ను సోలంకి భీముడు పాలించుచున్నారు. వారిలో ఐక్యత లేక ఎవరికివారుగా **ఉండిరి**. ప్రతీహార సామ్రాజ్యం క్షీణించియున్నది. దక్షిణదేశంలో కళ్యాణి చాణుక్యులు, చోళులు ప్రతిభావంతులుగా ఉండిరి. రాజ రాజు, రాజేంద్ర **చోళులు** మహమ్మద్‌నకు సమకాలికులుగా ఏలిరి. ఇట్టి పరిస్థితిలో మహమూద్ క్రీ.శ. 1000-1027 మద్యకాలంలో 17 పర్యాయాలు దండెత్తి దేశాన్ని కొల్లగొట్టి తాను ఎత్తుకపోగల్గినన్ని ధనరాసులను చేసుకొని వెళ్ళాడు.

**దండయాత్రలు :** 1. మొదటి దండయాత్రలో క్రీ.శ. 1000 లో జరిగింది. **అతడు** కైబర్ కనుమ ప్రాంతాలను, కొన్ని కోటలను, సరిహద్దు గ్రామాలను ఆక్రమించాడు. 2. రెండవ దాడిలో పంజాబునేలు **హిందూ షాహి రాజు** జయపాలుని ఓడించి అతని రాజధాని ఉదయభాండపురాన్ని (పెషావరును) ఆక్రమించి జయపాలుని బంధించాడు. **ఆ అవమానం భరించలేక అతడు తన** కుమారుడు ఆనంద పాలుని రాజుగా **చేసి చితిలో** దూకి ఆత్మాహుతి చేసుకున్నాడు. 3. మూడవ **దండయాత్రలో సింధుని దాటి 1003 లో** భాటియా రాజ్యంపై దండెత్తి బిజియరాయ్‌ని **ఓడించి** అపార ధనరాసులను దోచుకున్నాడు. అనేక **మందిని బలవంతంగా** ముస్లింలుగా మార్చాడు. 4. నాల్గవ దండయాత్రలో **ముల్తానుపై** దండెత్తి దానిని పాలించు ఫతేదౌడ్‌ను ఓడించాడు. ఈ **సమయంలో ఫతేదౌడ్‌కు సహాయం**గా వచ్చిన ఆనందపాలుని కూడా ఓడించి **అతని**

మనుమడు అయిన సుఖపాలుని ముస్లింగా మార్చి నవాబ్‌షా అను పేరుతో ముల్తాన్ రాజుగా చేసాడు. 5. సుల్తాన్ వెనుదిరగగానే సుఖపాలుడు మతం మార్చుకొని స్వాతంత్రం ప్రకటించగా ఐదవసారి ముల్తాన్‌పై రెండవ దండయాత్ర చేసాడు. ఈ దండయాత్రలో సుఖపాలుని ఓడించి ముల్తానును ఆక్రమించాడు. 6. ఆనందపాలుడు ఫతేదౌద్‌కు సహాయం చేసాడని క్రీ.శ. 1008 లో షాహి రాజ్యంపై దండెత్తాడు. ఆనందపాలుడు ఉత్తరదేశం లోని ఉజ్జయిని, గ్వాలియర్, కనోజ్, ఢిల్లీ, అజ్మీరు మొ॥ అనేక రాజపుత్రరాజుల సహాయంతో గొప్ప సైన్యాన్ని సమీకరించాడు. ఉభయసైన్యాలు ఉండ్ లేక రోహింద్ అనుచోట పోరాటం జరిపాయి. కాని హిందూ సైన్యంలో క్రమశిక్షణ లేనందున బహునాయకత్వం వల్ల సరిగా పోరాడలేదు. చెల్లాచెదురుగా ఉన్న రాజపుత్ర సైన్యాన్ని మహమూద్ సులభంగా ఓడించి పంజాబును ఆక్రమించాడు. ఆనందపాలుడు తన కుమారుడు త్రిలోచన పాలునితో నందనాహ అనుచోటికి వెళ్ళిపోయారు. అచటనే ఆనందపాలుడు మరణించాడు. త్రిలోచనపాలుడు శేషించిన షాహిరాజ్యానికి రాజుఅయ్యాడు. 7వ దాడిలో క్రీ.శ. 1009 లో నారాయణపురాన్ని కొల్లగొట్టాడు. 8 వ దండయాత్రలో క్రీ.శ, 1010ల నో నందనాహనం పై దండెత్తి త్రిలోచనపాలుని ఓడించాడు. నందనాహనంను స్వాధీనం చేసుకున్నాడు.

**9 వ దండయాత్ర** : మహమూద్ వెళ్ళిపోయిన తరువాత త్రిలోచన పాలుడు తిరిగి నందనాహ చేరుకున్నాడు. హిందూస్థానంలోని హిందూ రాజుల సహాయం అర్థించాడు. కాశ్మీరు రాజు సంగ్రామ సింహుని సహాయం పొందాడు. దానితో మహమూద్ మరలా త్రిలోచనపాలునిపై దండెత్తి త్రిలోచనపాలుని ఓడించి వధించాడు. త్రిలోచనపాలునికి భీమపాలుడు అని ఒక కుమారుడు ఉన్నాడు. అతడు నందనాహలో క్రీ.శ 1026 వరకు నామమాత్రంగా రాజ్యం చేసి మరణించాడు. అతని మరణంతో హిందూషాహీ రాజ్యం అంతమయినది.

**10 వ దండయాత్ర : 1014** : మహమూద్ తన 10 వ దండయాత్రలో స్థానేశ్వరంపై దండెత్తి స్థానేశ్వర రాజుని ఓడించి ధనరాసులను దోచుకున్నాడు. తరువాత కాశ్మీరుపై దాడి చేసాడు. కాశ్మీర రాజు సంగ్రామ రాజు త్రిలోచనపాలునికి సహాయం చేసాడు. అందువల్ల కాశ్మీరు రాజును దండించడానికి మహమూద్ కాశ్మీరుపై దండెత్తాడు. కాని కాశ్మీరు వాతావరణం వలన అతని అశ్వదళం ఏమీ చేయలేకపోయినది. మొదటి దండయాత్ర విఫలం అయింది.

**11 వ దండయాత్ర** : 11 వ దాడి నగరకోట మీద దాడిచేసాడు. నగరకోటపై దండెత్తి కొల్లగొట్టాడట, అచట మహమూద్‌కు 700 మణుగుల బంగారం, 70 లక్షల బంగారు దీనారాలు, 200 మణుగుల రత్నాలు దొరికాయట.

**12 వ దండయాత్ర కనోజ్ ముట్టడి:** 1018 లో మహమూద్ బయలుదేరి మధుర, బులంధషహర్ లపై దాడిచేసి కనోజ్ పై దండెత్తాడు. బులంధషహర్ రాజు అయిన హరిదత్తుడు గజనీతో పోరాడి ఓడిపోయాడు. అతనిని మహమూద్ ముస్లింగా మార్చాడు. అతనితో పాటు 10 వేల మంది ఇస్లాం మతాన్ని స్వీకరించారు. అతని వద్ద నుండి కానుకలు స్వీకరించి అతని రాజ్యం అతనికే వదిలివేసాడు. తరువాత ప్రక్కన ఉన్న మహవన్ రాజ్యంపై దాడిచేసాడు. మహవన్ రాజు అయిన కులాచంద్ గజనిని గట్టిగానే ప్రతిఘటించాడు. కాని ఓడిపోయాడు. అయితే గజనీకి లొంగిపోవడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకున్నాడు.

**మథురపై దాడి** : తరువాత మహమూద్ హిందువులకు పుణ్యక్షేత్రమయిన మధురానగరంపై దాడి చేసాడు. మధురానగరం హిందువులకు ఆరాధ్యదైవం అయిన శ్రీకృష్ణుని జన్మస్థానం. అచట అనేక దేవాలయాలు ఉన్నాయి. అచట ఉన్న ఒక దేవాలయాన్ని చూసి గజని ఆస్థాన పండితుడు ఉల్బి అద్భుతంగా వర్ణించాడు. ఆ దేవాలయాన్ని పాలుకు లక్ష దీనారాలు ఖర్చుపెట్టి వేలమంది పనివారిని నియమించినా 200 సం॥లకు దాని నిర్మాణం పూర్తిచేయడం అనుమానమేనని వర్ణించాడు. అటువంటి అద్భుతదేవాలయాన్ని గజనిమహమూద్ ధ్వంసంచేసి, అక్కడి మణులను, బంగారాన్ని దోచుకున్నాడు. ఆ దేవాలయాన్ని కాక మధురానగరంలోని అనేక దేవాలయాలను ధ్వంసం చేసి దోచుకున్నాడు. తరువాత మహమూద్ బృందావనంపై దాడిచేసాడు. అచట కోటలను, దేవాలయాలను దోచుకుని విశేష ధనరాసులను ప్రోగుచేసుకున్నాడు.

**కనోజ్ పై దాడి 1019** : తరువాత 1019 జనవరిలో మహమూద్ కనోజ్ పై దాడి చేసాడు. హర్షుని కాలంనుండి కనోజ్ ఉత్తర భారతదేశంలో గొప్ప నగరం. సామ్రాజ్యపు రాజధాని. అచట వేలాది దేవాలయాలు, అందమైన రాజప్రసాదాలు, ఇతర భవనాలతో, సుందర తటాకాలతో,

17

వైభవంగా వెలుగుతుండేది. ఈ కాలంలో కనోజ్‌ను ప్రతీహార రాజు అయిన రాజ్యపాలుడు పాలించుచుండేవాడు. మహమూద్ తన నగరంపై దాడికి వస్తున్నాడని నగరం వదిలిపెట్టి పారిపోయాడు. గజని యుద్ధం లేకుండా నగరప్రవేశం చేసి ఇష్టారాజ్యంగా దోపిడీ చేసి తిరుగు ప్రయాణంలో మంజ్, శర్వా కోటలపై దాడి చేసి మొత్తంగా 30 లక్షల బంగారు నాణాలు, 55,000 మంది బానిసలను, 250 ఏనుగులను తీసుకుని గజని వెళ్ళిపోయాడు.

**13 వ దండయాత్ర - ఛందేల రాజ్యంపై దండయాత్ర :** గజని మహమూద్ కనోజ్‌పై దండెత్తినపుడు ప్రతీహారరాజు రాజ్యపాలుడు యుద్ధం చేయకుండా పారిపోయినందుకు అతని సామంతుడయిన ఛందేల రాజు విద్యాధరునికి కోపం వచ్చింది. రాజపుత్రుడై ఉండి పారిపోయినవాడు. సామ్రాజ్య పాలనకు తగినవాడుకాదని భావించి విద్యాధరుడు కనోజ్‌పై దండెత్తి రాజ్యపాలుని వధించి అతని కుమారుడు త్రిలోచనపాలుని రాజుగా చేసాడు. ఈ విషయం తెలిసిన గజని మహమూద్ కు పట్టరాని ఆగ్రహం కలిగినది. కనోజ్ రాజు రాజ్యపాలుని గజని మహమూద్ సామంతునిగా భావించుచున్నాడు. తన సామంతుని చంపిన విద్యాధరునికి తగిన బుద్ధిచెప్పవలెనని 1019 లో గజనినుండి బయలుదేరి ఛందేల రాజధాని కలంజర్ పై దండెత్తాడు. కోటను ముట్టడించాడు. అంతవరకు ధైర్యంగా ఉన్న విద్యాధరుడు గజని సైన్యాలను చూసిన తరువాత ధైర్యం కోల్పోయి మహమూద్ ను దర్శించి కానుకలు సమర్పించి సంధి చేసుకున్నాడు.

**గ్వాలియర్ కోట ముట్టడి :** కలింజరు నుండి తిరిగి వెళ్తూ మహమూద్ గ్వాలియర్ రాజును ఓడించి కానుకలు పొంది వెళ్ళిపోయాడు.

**14 వ దండయాత్ర - కాశ్మీరుపై దాడి : క్రీ.శ. 1021 :** క్రీ.శ.1015 లో కాశ్మీరుపై చేసిన దాడి విఫలం అయింది. కనుక కాశ్మీరు రాజును ఎట్లయినా ఓడించాలని 1021 లో కాశ్మీరు పై దండెత్తాడు. కాని ఈ దాడి కూడా విఫలం అయింది కాశ్మీరు వాతావరణంలో అతి శక్తివంతమైన తన గుర్రపు దళం నిరుపయోగమైనది. కాశ్మీరు రాజు సంగ్రామ రాజు గజనీ సైన్యాన్ని నిరోధించి తన రాజ్యాన్ని కాపాడుకున్నాడు. రెండవ దాడి కూడా విఫలం కావడంతో కాశ్మీరును జయించే ఆలోచనను వదిలివేసాడు. గజని విఫలం అయిన సంఘటన కాశ్మీరు ఒక్కటే.

**15 వ దండయాత్ర :** 15 వ దండయాత్రలో మహమూద్ స్థానేశ్వరంపై దండెత్తి అచట రాజును ఓడించి ధనరాసులను తీసుకుని వెళ్ళిపోయాడు.

**16 వ దండయాత్ర - సోమనాథ్ ముట్టడి : క్రీ.శ. 1025 :** మహమూద్ దాడులు అన్నింటిలోకి సోమనాథ్ ముట్టడి ప్రసిద్ధి చెందిన దండయాత్ర ఈ దాడి 1025 లో జరిగింది. మహమూద్ అనేక విజయ యాత్రలలో అనేక దేవాలయాలను దోచుకుని విగ్రహాలను ముక్కలు చేసాడు. మహమూద్ క్రీ.శ.1025 లో సోమనాథ్‌పై దండెత్తాడు. ఆనాడు సోమమనాథ దేవాలయం అతిభాగ్యవంతమైనది. 10 వేల గ్రామాలుఈనాములుగా వుండి అంతులేని ఆదాయం వచ్చేదట. అనేకరత్నాలు, మణులు, ఉండేవట. 500 మంది దేవదాసీలు, 200 మంది గీత వాద్యకారులు, వేయిమంది పూజారులతో ఈ దేవాలయం అతివైభవంగా వుండేది. ప్రజలకు ఈ స్వామిపై అమిత భయభక్తులుండేవి. కాని ఈ దేవుడు మహమూద్ ముందు శక్తిహీనుడయ్యాడు. మహమూద్ దాడి విని గుజరాత్ రాజు సోలంకి భీమదేవుడు తన రాజధాని అన్హిల్‌వాడ వదిలి పారిపోయాడు. మహమూద్ పట్టణాన్ని కొల్లగొట్టి సోమనాథ్ చేరాడు. అచట 5 వేల మంది హిందువులు దేవాలయాన్ని రక్షించడానికి పూనుకొనగా వారిని వధించి గుడిలో ప్రవేశించి పూజారులను వధించి సోమనాథుని ముక్కలుముక్కలుగా చేసి దేవాలయాన్ని కొల్లగొట్టినాడు. అచట అతనికి లభించిన ధనరాసులు 17 ఒంటెలపై తీసుకొని వెళ్ళాడు. అచ్చట దేవతావిగ్రహాలను తీసుకొని వెళ్ళి తన రాజధానిలో తన మసీదు మెట్లు కట్టించుకున్నాడు. కాని ఇతని తిరుగు ప్రయాణంలో సింధులో నివసించు జాటులు తమదేవుని నాశనం చేసినందుకు ఇతని సైనికులకు ఆహారం, నీరు లభించకుండా చేసి, అనేక ఇబ్బందులు పెట్టారు.

**17 వ దండయాత్రల-జాటులపై 1027 :** అందువలన జాటులను దండించుటకు చివరిసారి 17వ దండయాత్రచేసి 1027లో వారిని ఓడించి తిరిగి వెళ్ళాడు. ఆ తరువాత 1030 లో మరణించాడు. ఈ విధంగా ఇతడు ఇండియాపై దాడులు జరిపి దేవాలయాలు నాశనం చేసి ధనాన్ని దోచుకుని నానా భీభత్సం చేశాడు.

**24.4.2 మహమూద్ విజయాలకు కారణాలు :** మహమూద్ 17 సార్లు దండెత్తినా అపజయం అనేది ఎరుగడు. అందుకు అనేక కారణాలు కలవు అవి.

1. రాజపుత్రుల అనైక్యత : ప్రతీహార సామ్రాజ్యం క్షీణించినందున అనేక స్వతంత్ర రాజ్యాలేర్పడి ఎవరికి వారుగా వున్నారు. వారినందరిని కూడగట్టి మహమూద్ ను ఎదిరించగల నాయకుడెవ్వడు లేకపోయెను. ఆనందపాలుడు కొంతవరకు ప్రయత్నించినా అతని శక్తి అందుకు చాలలేదు. ముందువాడు ఓడిపోతున్నప్పుడు తరువాత తమ వంతు వచ్చును అను జ్ఞానం లేకుండా వారు వ్యవహరించారు.

2. దేశీయరాజులకు పటిష్టమైన సైన్యం లేదు. ముఖ్యంగా మంచి గుఱ్ఱపు దళం లేకపోయింది. మహమూద్‌కు మంచిగుఱ్ఱపు దళం వున్నది. ఆ రోజులలో అతని గుఱ్ఱపుదళం యుద్ధరంగంలో ప్రవేశించి చండప్రచండంగా దూసుకొని పోయేదట. వానిముందుకు పోవడానికి ఏనుగులకు గూడా సాధ్యం కాలేదట. ఆ గుఱ్ఱపు దళం పేరు చెబితేనే స్వదేశీ సైనికులకు హడలుగా వుండేదట. మహమూద్ గొప్పవీరుడు. సైనికానుభవం కల్గినవాడు. తనసైన్యాన్ని చక్కగా నడపగల సమర్థుడు. మహమూద్ సైన్యం అనేక మధ్యాసియా యుద్ధాలలో పాల్గొని వున్నందున గొప్ప వ్యూహరచన అనుభవం గల్గి భారతసైన్యాన్ని అవలీలగా ఓడించింది. కనుక మహమూద్ ఇండియాలో అపజయంలేకుండా 17 సార్లు కొల్లగొట్టగల్గాడు.

**గజనీమహమూద్ దండయాత్రలప్రభావం :** గజనీమహమూద్ భారతదేశంపై 17 దండయాత్రలు చేసినప్పటికి భారతదేశాన్ని జయించి భారతదేశంలో సామ్రాజ్యాన్ని స్థాపించాలని కోరికలేదు. అతడు భారతదేశాన్ని కేవలం తన ధనాగారంగా చూశాడు. ఎప్పుడు అవసరమైతే అపుడు దండెత్తి ధనరాశులను దోచుకపోడమే తన లక్ష్యంగా పెట్టుకున్నాడు. దానితోపాటు ముస్లిం ప్రపంచంలో గొప్పగా భావింపబడే విగ్రహ విధ్వంసుడిగా పేరు తెచ్చుకోవాలని భావించాడు. అనగా తన గొప్పదనాన్ని చాటటానికి మాత్రమే విగ్రహాలను, దేవాలయాలను ధ్వంసం చేశాడు. అతడు భారతదేశంలో దోచుకున్న ధనంతో గొప్పసైన్యాన్ని పోషించి మధ్య ఆసియా యుద్ధాలలో అపూర్వ విజయాలు సాధించి అటువైపు తన సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. భారతదేశం నుండి మేలైన ఏనుగులను, ఉత్తమ అశ్వాలను, నేర్పరులైన మావటీలను పోయివాన్ని పెంచుకొని మధ్యాసియా విజయాలు సాధించాడు. అంతేగాక భారతదేశపు ధనంతో సైనిక విజయాలు సాధించడమేగాక అతడు గజనీ నగరాన్ని సుందరనగరంగా తీర్చిదిద్దాడు. పెద్దపెద్ద భవనాలు మసీదులను నిర్మించాడు. భారతదేశంనుండి మంచి నైపుణ్యం గల్గిన వృత్తి కళాకారులను తీసుకొని పోయి గజని నగరంలో అనేక సందరభవనాలను నిర్మించాడు. అందువలన అతడు గొప్ప కళాపోషకుడుగా పేరు పొందాడు. అంతేగాక భారతదేశపు ధనంతో తన ఖజానాను నింపి తన రాజ్యాన్ని తన వారసుల పరిస్థితిని బలపరచాడు. పంజాబు ముల్తానులు ఆక్రమించి భారతదేశంలో ముస్లిం రాజ్యస్థాపనకు నాంది పల్కాడు. సింధునది ప్రాంతం ముస్లిం చేతిలో ఉన్నందువలన భవిష్యత్తులో భారతదేశంలో ముస్లిం సామ్రాజ్యం స్థాపించడానికి వీలు కలిగినది. సింధు, పంజాబు ప్రాంతాలు వారి చేతులలో ఉన్నందువలన అనేకమంది ముస్లిం పండితులు, కవులు, ముస్లిం మత ప్రచారకులు, యాత్రికులు, ముస్లిం వ్యాపారులు భారతదేశంలోనికి ప్రవేశించారు. వారిలో కొందరు ఇండియాలో స్థిరపడి తమ మతాన్ని వ్యాప్తి చేసారు. కొంతమంది హిందువులను ముస్లింలుగా మార్చారు. మహమ్మద్ ఘోరీ దండయాత్ర సమయంలో ఇచట స్థిరపడిన ముస్లింలు వారికి సహాయపడ్డారు. ఉత్తరదేశంలో అనేక పట్టణాలు నాశనం అయ్యాయి. దేవాలయాలు ధ్వంసం అయ్యాయి. పట్టణాలు దోపిడీకి గురిఅయ్యాయి. అనంతంగా భారతదేశపు ధనరాసులు, మణులు, రత్నాలు, బంగారం బయటకు వెళ్ళిపోయాయి. అందువలన భారతదేశపు ఆర్థిక పరిస్థితి దిగజారినది. గజని సైనిక దాడుల వలన రాజపుత్రుల సైన్యాలు నిర్వీర్యం అయ్యాయి. భారతదేశపు సైనిక శక్తి నశించింది. యుద్ధాలలో అనేకమంది, భారతీయులు మరణించారు. కొందరు ముస్లింలుగా మార్చబడ్డారు. దండయాత్రల కాలంలో భారతప్రజలు అనేక కష్టనష్టాలకు గురిఅయ్యారు. మహమూద్ భారతదేశపు కళాకారులను, వృత్తిపనివారిని బంధించి బానిసలుగా చేసి గజనీకి తీసుకు వెళ్ళి వారిచే వెట్టిచాకిరీ చేయించుకుని తన నగరాన్ని సుందరనగరంగా తీర్చిదిద్దుకున్నాడు. మహమూద్ దాడుల వలన భారతదేశంలో ఇస్లాం మతవ్యాప్తి బాగా జరిగింది. భారతీయ సమాజంలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. గజనీ దాడులు ఘోరీ దాడులకు రంగాన్ని సిద్ధం చేసాయి.

**24.4.3 మహమూద్ దండయాత్రా ఫలితాలు :** మహమూద్ దండయాత్ర వలన పంజాబులో హిందూషాహీ రాజ్యం, సింధు, ముల్తానులలో అరబ్బుల పాలన, కనోజ్‌లో ప్రతీహార వంశం అంతరించి పంజాబు, ముల్తానులు ఆఫ్ఘగన్ రాజ్యంలో భాగాలైనవి. దేశంలో అనేక పట్టణాలు కొల్లగొట్టబడి కళావిహీనంగా అయినవి. దేశంలోని అంతులేని సంపద బయటకు వెళ్ళిపోయింది. ఇండియాలో తాను కొల్లగొట్టిన ధనాన్ని, వస్తువులను అతడు గజనీలోప్రదర్శన శాలను ఏర్పాటు చేసాడట. ఇతని దాడులు రాజపుత్ర రాజ్యాల సైనిక శక్తిని నిర్వీర్యం చేసి వారిని బలహీనులుగా చేసాయి. పంజాబు వరకు అనేక కోటలను ధ్వంసం చేసినందున, భవిష్యత్తులో ముస్లిం దాడులకు సులభమార్గం ఏర్పడింది. అనేక దేవాలయాలు ధ్వంసం చేయబడినందున హిందూశిల్పసంపదకు తీరని నష్టం కలిగినది. భారతదేశంలోని రాజపుత్రరాజ్యాలు తమ శక్తిని కోల్పోయినవి. అందువల్ల భవిష్యత్తులో ఘోరీ కాలంలో ముస్లిం రాజ్యస్థాపనకు మార్గం సుగమం చేసాడు. (ముస్లింలు అంటే హిందువులు భయభ్రాంతులు అగునట్లు ముద్రవేసాడు. ఆ ముద్రే తరువాత ముస్లిం విజయాలకు కారణమైంది.) ఇన్ని జరిగినా గజని ధాడుల నుండి రాజపుత్రులు గుణపాఠం నేర్చుకోలేదు. తమసైన్యాన్ని తీర్చిదిద్దుకోలేదు. తమ అంతఃకలహాలను వదులుకోలేదు. ఐక్యతకు కృషి చేయలేదు. కనుకనే ఆ తరువాత ఘోరీ మహమ్మద్ భారతదేశాన్ని జయించగలిగాడు.

**24.4.4 కళాపోషణ :** మహమూద్ గొప్ప కళాభిమాని, సాహిత్య కళాపోషకుడు. ఫిరదౌసి, అల్బెరూని, ఉట్బీ, ఫరూకి, బైహకి ఇతని ఆస్థానంలో పండితులు. వారిలో ఫిరదౌసి మహమూద్ విజయాలను 'షానామా' అను గ్రంథముగా వ్రాసాడు. ఇతడు పర్షియా భాషకు హోమర్ వంటివాడు. ఆ గ్రంధం మహమూద్ జీవితాన్ని గురించి, అతని విజయాలను గురించి తెలుపుతుంది. వీరిలో అల్‌బెరూని గొప్ప చరిత్రకారుడు. మహమూద్ గజనిలో ఒక విశ్వవిద్యాలయాన్ని ఇంకా అనేక విద్యాసంస్థలు నెలకొల్పి విద్యాసేవ చేసాడు. గజనీలో గొప్ప కళాశాలను నిర్మించాడు. ఒక వస్తుప్రదర్శనశాలను నెలకొల్పి తాను ఇండియానుండి తెచ్చిన వస్తువులను ప్రదర్శించాడు. అతడు విదేశ విద్వాంసులను, కళాకారులను రప్పించి కళలను పోషించాడు. గజని నగరాన్ని అతిసుందరంగా తీర్చిదిద్దాడు. నెపోలియన్ తాను జయించిన దేశాలతో కళాఖండాలను తస్కరించగా మహమ్మద్ కళాకారులనే తీసుకుపోయాడని లేన్‌పూల్ వ్యాఖ్యానించాడు. గజనిలో అనేక సత్రాలు, మసీదులు నిర్మించాడు. ఆ కాలంలో గజని పట్టణం ఇస్లాం సంస్కృతికి కేంద్రస్థానం అయింది. మధ్యాసియాలో గొప్ప సుందరనగరంగా పేరుపొందింది.

**ఘనత :** మహమూద్ గొప్ప వీరుడు. సామ్రాజ్య నిర్మాత. నాటి ప్రపంచంలో తిరుగులేనివాడు. ఇతడు ముస్లింలకు అవతార పురుషుడు కాని హిందువులకు దోపిడి దొంగ, కాలయముడు అని ఈశ్వర్‌ప్రసాద్ చెప్పాడు. అతడు గొప్ప పరిపాలనాదక్షుడిగా కూడా పేరుపొందాడు. భారతదేశంలో ఇస్లాం మతాన్ని వ్యాపించిన ఘనత అతనిదే. అతని దండయాత్రల వలననే భారతదేశంలో సుస్థిరమయిన ముస్లిం రాజ్యస్థాపనకు అవకాశం ఏర్పడింది. గజని మహమూద్ సుల్తాన్ అనే బిరుదు ధరించాడు. సుల్తాన్ అనే బిరుదు ధరించిన మొదటి ముస్లిం రాజు అతనే.

**గజని రాజ్యపతనం :** మహమూద్ మరణానంతరం గజని రాజ్యంలో చాలా వారసత్వ యుద్ధాలు జరిగాయి. అందువలన గజని రాజ్యం బలహీనమయినది. దానిని ఆసరాగా తీసుకుని ఘోరీ వంశానికి చెందిన మొయిజుద్దీన్ మహమ్మద్ బన్‌సమ్ గజని సుల్తానులలో చివరివాడయిన ఖుస్రూమాలిక్ ను వధించి గజని రాజ్యాన్ని అంతం చేసాడు. గజని మహమ్మద్ తరువాత 150 సంవత్సరాలకు గజని రాజ్యం అంతం అయినది. ఈ షిహాబుద్దీన్ చరిత్రలో ఘోరీ మహమ్మద్ గా ప్రసిద్ది చెందాడు. భారతదేశంలో ముస్లిం రాజ్యాన్ని స్థాపించిన ఘనుడు ఇతడే.

## 24.5 ఘోరీమహమ్మద్ దండయాత్రలు మహమ్మదీయ రాజ్యస్థాపన :

**24.5.1 ఉపోద్ఘాతం :** ఆఫ్ఘనిస్థానంలో గజనీ, హీరాట్‌ల మధ్య ఘోరీపట్టణం వుండేది. ఈ రాజ్యాన్ని గజని మహమ్మద్ జయించాడు. ఆనాటినుండి ఘోరీరాజ్యం గజనీ సామ్రాజ్యంలో భాగంగా వుండేది. ఘోరీని పాలించినందువలన దాని పాలకులకు ఘోరీ వంశస్తులని పేరువచ్చింది. వారు తురుష్కులు కాదు. ఆఫ్గనులు గాని పర్షియనులు గాని అయివుంటారని చరిత్రకారులు భావించారు. గజనీ మహమ్మద్

**మరణానంతరం** 12 వ శతాబ్దంలో గజనీవంశ సామ్రాజ్యం క్షీణించింది. ఆ సమయంలో ఘోరీరాజ్యం విజృంభించింది. **ఘోరీవంశంలో సుప్రసిద్ధుడైన** మొదటి రాజు సైఫ్-ఉద్దీన్. అతడు గజనీని తన స్వాధీనంలోనికి తెచ్చుకున్నాడు. అతని తరువాత రాజ్యానికి వచ్చిన అల్లావుద్దీన్ **హుస్సేన్** గజనీని ఆక్రమించి దానిని తగులబెట్టి జహన్‌సోజ్ అను బిరుదు ధరించాడు. అతని తరువాత అతని పెద్దకుమారుడు ఘియాజుద్దీన్ **మహమ్మద్** రాజయి తన తమ్ముడు షహబుద్దీన్ మహమ్మద్‌ను క్రీ.శ. 1173 లో గజనీ పాలకుడుగా నియమించాడు. చిన్నవాడైన షహబుద్దీన్ అన్న అభిమానాన్ని సంపాదించాడు. అన్న తరువాత అతడు సింహాసనమధిష్టించాడు. అతడే చరిత్రలో ఘోరీమహమ్మద్ గా ప్రసిద్ధి చెందాడు. అతడు గజనీమహమూద్ వలెగాక ఇండియాలో ముస్లింల సామ్రాజ్యాన్ని స్థాపించవలెనని పట్టుదలగలవాడు. అందువల్ల ఇతడు గజనీవలె ఇండియాపై దండెత్తి చివరకు ముస్లిం రాజ్యస్థాపనచేశాడు. మహమ్మద్‌బిన్ ఖాశిం సింధు, ముల్తానులను మాత్రమే జయించాడు. గజనీమహమూద్ పంజాబును మాత్రమే ఆక్రమించాడు. కాని ఘోరీమహమ్మద్ మొత్తం హిందూస్థానాన్ని జయించి భారతదేశంలో ముస్లిం సామ్రాజ్యన్ని స్థాపించి చరిత్రలో గొప్ప స్థానాన్ని సంపాదించాడు.

**24.5.2 మహమ్మద్ ఆశయాలు :** ఘోరీమహమ్మద్ గజనిమహమ్మద్ వలె గాక భారతదేశంలో ముస్లిం సామ్రాజ్యాన్ని స్థాపించవలెనని ధృఢమైన ఆశయం కలవాడు. ఒక ముస్లిం రాజుగా హిందువులను జయించి ముస్లిం మతాన్ని భారతదేశంలో వ్యాప్తిచేసి కీర్తి సంపాదించాలని భావించాడు. మధ్యయుగంలో వ్యక్తుల గొప్పదనం యుద్ధాలు చేయడం మీద సైనికవిజయాలు సాధించడం మీదవుండేది. కనుక సైనిక విజయాలు సాధించి గొప్ప విజేతగా గూడా పేరు సంపాదించాలని భావించాడు. తారాచంద్ అనే చరిత్రకారుడు ఘోరీమహమ్మద్ మతం వలన ప్రేరేపింపబడలేదని ఆనాటి ఇస్లాం ప్రపంచంలోని రాజకీయ పరిస్థితులను ఘోరీమహమ్మద్‌ను భారతదేశ దండయాత్రలకు పురికొల్పాయని అన్నాడు. లాహోరును పాలించే గజనీ వంశస్తులు తిరిగి గజనీ రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తారని ఘోరి వూహించాడు. కనకవారి రాజ్యాన్ని అంతం చేయవలసిన అవసరం వున్నది. లేనియెడల తమ రాజ్యానికి భద్రత లేదని భావించి వారి ఆధీనంలోవున్న పంజాబునాక్రమించవలెనని తీర్మానించుకున్నాడు. అట్లే ముల్తానును పాలించే షియాలవలన గూడా తన రాజ్యానికి ప్రమాదం వున్నదని **భావించాడు.** కనుక తన రాజ్య భద్రత కొరకు పంజాబు ముల్తానును జయించాలని భావించాడు. దానితోపాటు భారతదేశంలో ముస్లిం **రాజ్యాన్ని** స్థాపించాలని ముస్లిం మతాన్ని వ్యాప్తి చేయాలని గూడా తీర్మానించుకున్నాడు. అంతకుముందు అరబ్బులు, తురుష్కులు భారతదేశంలో ముస్లిం సామ్రాజ్యాన్ని స్థాపించడానికి చేసిన కృషి సక్రమంగా లేదని గ్రహించాడు. కనుక శాశ్వత ప్రాతిపదిక మీద భారతదేశంలో ముస్లిం అధికారాన్ని నెలకొల్పాలని భావించాడు. అందువలన ముస్లిం ప్రపంచంలో తనకు అమితమైన కీర్తి ప్రతిష్టలు వస్తాయని ఆశించాడు. అంతేగాక ధనరాసులు లభిస్తాయని భావించాడు. ఆ ధనరాసులతో తాను పెద్ద సైన్యాన్ని సమీకరించి మధ్యాసియాలో గూడా తన సామ్రాజ్యాన్ని విస్తరించవచ్చని భావించాడు. కనుక భారతదేశాన్ని జయించడానికి ధృఢనిశ్చయుడై, క్రమబద్ధమైన ప్రణాళికను రూపొందించుకున్నాడు.

**దండయాత్ర నాటి ఇండియా పరిస్థితి :** పంజాబు గజనీ వంశస్థుల అధికారం క్రిందవున్నది. ఢిల్లీ, అజ్మీరులను, చౌహాన్ వంశస్థుడైన పృథ్వీరాజ్ ఏలుచుండెను. ఇతడు అందరిలోను బలవంతుడు. కనోజ్ ను గహద్వాల వంశస్థుడైన రెండవ భీముడు ఏలుచున్నాడు. బెంగాలును సేనవంశస్థుడైన లక్ష్మణసేనుడు పాలించుచున్నాడు. వారిలో పృథ్వీరాజు, సోలంకీభీముడు, కనోజ్ జయచంద్రుడు ప్రముఖులు. కాని వారిమధ్య సఖ్యతలేదు. పృథ్వీరాజుకు జయచంద్రునికి విరోధం వున్నది. ఆ కారణమువలన జయచంద్రుడు ఘోరీకి సహాయం చేశాడు. వారి అనైక్యతను ఆధారంగా తీసుకొని ఘోరీమహమ్మద్ అందరినీ ఓడించి వారి రాజ్యాలను ఆక్రమించాడు.

**దండయాత్రలు :** క్రీ.శ 1175 లో మొదటిగా సారిగా దండెత్తి ముల్తానును ఏలు కర్మాథియన్ వంశస్తులను ఓడించి ముల్తానును ఆక్రమించాడు. **తరువాత** క్రీ.శ. 1176లో ఉచ్‌ని జయించి దిగువసింధుపై తన అధికారాన్ని నెలకొల్పుకున్నాడు.

**గుజరాత్ దండయాత్ర :** సింధు విజయంతో ఇతడు ఉత్సాహం చెంది ప్రక్కనున్న గుజరాత్ పై 1178 లో దండెత్తాడు. అపుడు **గుజరాత్‌ను** ఏలు సోలంకీభీముడు ఇతనిని చిత్తుగా ఓడించి తరిమాడు. ఈ అపజయంతో అటువైపునుండి **ఇండియాలోనికి** జొరపడవలెనన్న **కోరిక** విరమించుకున్నాడు. మరలా గుజరాత్ పై దండెత్తాడానికి సాహసింపలేకపోయాడు.

**పంజాబునాక్రమించుట క్రీ.శ 1180-1186 :** కనుక ఇండియాను జయించాలంటే పంజాబును జయించడం తప్పనిసరి అని భావించి పంజాబునుండి ఇండియాను జయించాలని నిశ్చయించుకున్నాడు. పంజాబులోని గజనీవంశస్తులు తమ రాజధాని గజనీని ఆక్రమించినందుకు ఘోరి వంశస్తులతో యుద్ధాలు చేస్తుండేవారు. కనుక పంజాబులో గజనీ వంశస్తులను అంతం చేస్తే తన రాజ్యానికి రక్షణమేర్పడటమేగాక హిందూస్థానాన్ని జయించాలనే తన కోరిక గూడా తీరుతుందని భావించి గజని వంశస్తులతో యుద్ధాలకు దిగాడు. మొదట 1180 లో తన రాజ్యపు సరిహద్దులోవున్న పెషావరుపై దండెత్తి దానిని ఆక్రమించాడు. తరువాత 1185 లో పంజాబ్‌పై దండెత్తి సియాల్‌కోటను ఆక్రమించాడు. తరువాత 1186 లో లాహోరు పై దండెత్తి గజనీ వంశంలో చివరివాడైన ఖుస్రూని ఓడించి ఖైదుచేశాడు. కొంతకాలం తరువాత అతనిని వధించాడు. అతని మరణంతో గజనివంశం అంతరించింది. ఈ విధంగా మూడుయుద్ధాల ద్వారా పంజాబులోని గజనీ రాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించి తన రాజ్యంలో కలుపుకున్నాడు. గజని రాజ్యమైన పంజాబు, ముల్తాను రాజ్యాలు తన రాజ్యంలో చేరడంతో ఘోరి రాజ్యం సట్లేజ్ నది వరకు విస్తరించింది. సట్లేజ్ నదికి తూర్పువైపు చౌహన్ రాజ్యం వున్నది. చౌహన్ రాజ్యాన్ని ఆనాడు గొప్పవీరుడైన పృథ్వీరాజ్ పరిపాలిస్తున్నాడు.

**పృథ్వీరాజుతో యుద్ధం - సర్‌హింద్ ఆక్రమణ :** గజనీ రాజ్యాన్ని జయించిన ఉత్సాహంతో మహమ్మద్ సరిహద్దులోని చౌహన్ రాజ్యాన్ని గూడా జయించాలని నిశ్చయించుకున్నాడు. క్రీ.శ. 1191 లో సట్లేజ్ నదిని దాటి చౌహన్ రాజ్యానికి చెందిన సర్‌హింద్ కోటను ఆక్రమించాడు.

**మొదటి తారాయిన్ యుద్ధం -1191 :** సర్‌హింద్ కోటను ఆక్రమించగానే పృథ్వీరాజు తన కోటను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి సేనలతో తరలివచ్చాడు. ఈ యుద్ధానికి పృథ్వీరాజు రెండులక్షల అశ్వదళం, మూడువేల గజదళంతో వచ్చాడని ఫెరిష్టా వ్రాశాడు. ఉభయసైన్యాలు స్థానేశ్వరానికి 14 మైళ్ళ దూరంలో వున్న తరాయిన్ అనే ప్రదేశంలో తారసిల్లాయి. అచట 1191 లో వారిద్దరికి ఘోర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో పృథ్వీరాజు ఘోరీమహమ్మద్ సేనలను చిత్తుగా ఓడించాడు. మహమ్మద్ గాయపడ్డాడు. ఓటమితో తీవ్ర అవమానంతో ఘోరి శేషించిన తన సైన్యంతో గజనిని వెళ్ళిపోయాడు. పృథ్వీరాజు సర్‌హింద్‌ని తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఈ యుద్ధాన్నే మొదటి తారియిన్ యుద్ధం అని అంటారు.

**రెండవ తరాయిన్ యుద్ధం క్రీ.శ. 1192 :** మొదటి తరాయిన్ యుద్ధంలో తీవ్రఅవమానం పాలైన ఘోరీమహమ్మద్ కు తన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవలెనని పట్టుదల పెరిగింది. కనుక అతడు ఆ మరు సం॥ 1,20,000 సైన్యంతో 1192 లో రెండవ సారి చౌహన్ రాజ్యం పై దండెత్తాడు. ఈ లోపల హిందూస్థానంలో కొన్ని సంఘటనలు జరిగాయి. పృథ్వీరాజు తన సరిహద్దు రాజైన జయచంద్రుని కుమార్తెను సంయుక్తను తీసుకువచ్చి వివాహం ఆడాడు. అది అవమానంగా భావించిన జయచంద్రుడు ఘోరీమహమ్మద్ ని ఆహ్వానించాడని అంటారు. దానితో ధైర్యం తెచ్చుకొని వెంటనే మహమ్మద్ రెండవసారి యుద్ధానికి వచ్చాడని ప్రతీతి. గుజరాతుపై దండెత్తి చాళుక్యభీముని చేతిలో ఓడిపోయిన తరువాత మహమ్మద్ అటువైపు కన్నెత్తి చూడలేదు. పృథ్వీరాజ్ చేతిలో ఓడిపోయిన తరువాత వెంటనే మరు సం॥మే ఘోరి పృథ్వీరాజ్‌తో రెండవ యుద్ధానికి వచ్చాడంటే జయచంద్రుని ఆహ్వానం వున్నదేమోనని భావించివలసి వస్తున్నది. వాస్తవమేమైనప్పటికి మహమ్మద్ 1192 లో రెండవసారి పృథ్వీరాజ్‌పైకి దండయాత్ర చేశాడు. ఉభయసైన్యాలు మరల తరాయిన్ వద్ద తారసిల్లాయి. ఈసారి ఘోరీమహమ్మద్ విజయం సాధించాడు. ఓడిపోయిన పృథ్వీరాజు యుద్ధభూమిలో ముస్లిం సైన్యాలకు పట్టుబడ్డాడు. వెంటనే వారు పృథ్వీరాజును వధించారు. రాజపుత్ర సైన్యాలు చెదురయ్యాయి. చౌహన్ రాజ్యం ఘోరీమహమ్మద్ వశం అయింది. యుద్ధానంతరం ఘోరి మహమ్మద్ పృథ్వీరాజ్ కుమారుడైన గోవిందరాజును అజ్మీరు పాలకునిగా నియమించి ప్రతి సం॥ కప్పం చెల్లించేవిధంగా ఒప్పందం చేసుకున్నాడు. తన బానిస అయిన కుతుబుద్దీన్ ఐబక్‌ని స్థానేశ్వరంలో తన ప్రతినిధిగా నియమించి తాను గజని వెళ్లిపోయాడు.

**రెండవ తరాయిన్ యుద్ధ ప్రాముఖ్యత :** ఈ యుద్ధం భారతదేశ చరిత్ర గతిని మార్చింది. ఇండియాలో ముస్లిం రాజ్యం ఏర్పడి క్రమేపి దేశీయవంశాలను అంతం చేసి దేశాన్ని ముస్లింల అధికారం క్రిందికి పోవడానికి ఈ యుద్ధం నాంది పలికింది. అంతేగాక అప్పటినుండి ఢిల్లీ దేశం రాజకీయాలకు కేంద్రమై నేటివరకు కొనసాగుచున్నది. కనుక స్మిత్, ఈశ్వరప్రసాద్‌లు ఈ యుద్ధానికి దేశచరిత్రలో అతిప్రాముఖ్యము

ఉన్నదని చెప్పారు. స్మిత్ ఈ యుద్ధంలో హిందువుల శక్తి నశించి అంతిమవిజయం ముస్లింలదేనని తేలిపోయినదని అన్నాడు. ఈ చారిత్రాత్మక యుద్ధమే తరువాత ఇండియాలో ముస్లిం విజయాలు అన్నింటికీ నాంది పలికింది. ఢిల్లీలో ముస్లిం అధికారం స్థాపించబడటంతో రాజపుత్రులకు సర్వరంగముల యందు పరాజయాలు సంభవించి వారి రాజ్యాలను కూలద్రోయగల్గటమేగాక ప్రజలను భయభ్రాంతులను చేసింది.

**కుతుబుద్దీన్ దండయాత్రలు :** కుతుబుద్దీన్ స్థానేశ్వరాన్ని రాజధానిగా చేసుకొని రాజ్యవిస్తరణకు పూనుకున్నారు. ఘోరీమహమ్మద్ వెనుదిరగగానే చౌహాను రాజ్యంలో పృథ్వీరాజు తమ్ముడు హరిరాజు తిరుగుబాటు చేశాడు. కనుక కుతుబుద్దీన్ దండెత్తి హరిరాజును పృథ్వీరాజు కుమారుడు గోవింద రాజుని పారద్రోలి ఢిల్లీ, అజ్మీరులను ఆక్రమించి ఢిల్లీని తన రాజధానిగా చేసుకున్నాడు. ఇతిహాసకాలంలో ప్రసిద్ధి చెందిన హస్తినాపుర సమీపంలోనే వున్నది. ఢిల్లీ అటు ఆఫ్ఘనిస్తాన్ స్థానానికి సింధుకు ఇటు గంగా మైదానానికి మధ్య ముఖద్వారం వలె ఉన్నది. కనుక దాని అనుకూల స్థితిని గమనించి కుతుబుద్దీను స్థానేశ్వరం నుండి ఢిల్లీకి తన రాజధానిని మార్చుకున్నాడు.

**కనోజ్ ఆక్రమణ - 1194 :** తరువాత కుతుబుద్దీన్ ఐబక్ కనోజ్ పై దాడి చేయసంకల్పించి తనప్రభువుకు కబురంపాడు. ఘోరీమహమ్మద్ 1194 మరలా భారతదేశం వచ్చాడు. హిందూ స్థానంలో పృథ్వీరాజ్ రాజ్యం తరువాత జయచంద్రుని కనోజ్ రాజ్యం చాలా బలమైనది. జయచంద్రుడు తన కుమార్తెను పృథ్వీరాజు బలవంతంగా తీసుకువెళ్ళి వివాహం చేసుకున్నందుకు మండిపడి మొదటి తరాయిన్ యుద్ధంలో పృథ్వీరాజుకు సహాయం చేయలేదు. పైగా అతడే ఘోరీమహమ్మద్ ని ఆహ్వానించాడని అంటారు. రెండవ తరాయిన్ యుద్ధంలో పృథ్వీరాజు మరణించినందుకు అతడు ఆనందించాడు. అయితే తరువాత తనవంతు వస్తుందని వూహించలేదు. కనోజ్ బలమైన రాజ్యం కనుక అది స్వతంత్రంగా వుండటానికి ఘోరి అంగీకరించలేదు. దానిని అంతం చేయకపోతే ఎప్పుడైనా తన రాజ్యానికి ముప్పుతప్పదని ఘోరి భావించి 1194 లో ఐబక్‌తో కలసి కనోజ్ పై దండెత్తాడు. జయచంద్రుడు వీరోచితంగా పోరాడాడు. కాని ఓడిపోయాడు. వెంటనే అతనిని బంధించి వధించారు. (యుద్ధంలో వేలాది మంది హిందువులు మరణించారు.) కనోజ్ రాజ్యం ఘోరీమహమ్మద్ వశం అయింది. ఘోరి సామ్రాజ్యం బీహారు వరకు విస్తరించింది. పుణ్యక్షేత్రమైన కాశి ఘోరి రాజ్యంలో భాగం అయిపోయింది. ఘోరి రాజ్యానికి బెంగాలు సేనరాజ్యం సరిహద్దు అయింది. కనోజ్ రాజ్యం స్వాధీనం కాగానే వందలాది దేవాలయాలను ధ్వంసం చేసి మసీదులు నిర్మించబడ్డాయి. అనేక ధనరాశులు వారికి చిక్కాయి. పట్టణాన్ని దోచుకొని ధనరాశులను తన రాజధాని గజనికి తరలించుకొనిపోయాడు.

**తరువాత దండయాత్రలు - 1195 - 96 :** తరువాత ఘోరీమహమ్మద్ క్రీ.శ 1195 లో తిరిగివచ్చి బయాన, గ్వాలియర్‌లపై దండయాత్రలు చేసి విజయాలు సాధించాడు. తరువాత మిగిలిన హిందూ స్థానాన్ని జయించమని ఐబక్‌ను ఆజ్ఞాపించి 1196 లో వెళ్ళిపోయారు.

**కుతుబుద్దీన్ ఐబక్ విజయాలు 1196-1205 :** ఆ తరువాత కుతుబుద్దీన్ ఐబక్ 1196 నుండి 1205 వరకు దండయాత్రలు చేసి అనేక విజయాలు సాధించాడు. ఐబక్ చౌహాను, తోరమానులు చేసిన తిరుగుబాటులను అణచివేశాడు. వారు పాలించిన హన్సి, బరన్, మీరట్‌లను ఆక్రమించాడు. తరువాత కోయిల్, ఆల్ఘుర్ ప్రాంతాలను జయించాడు. తరువాత బలమైన రాజ్యాలయిన బుందేల్‌ఖండ్, గుజరాతులపై దండెత్తాడు. మహోబా, కలంజర్‌లను కొల్లగొట్టాడు. చందేలులు, సోలంకీలు హడలిపోయారు. అంతకుముందు 20 సం॥ల క్రితం సోలంకిభీముని చేతిలో ఘోరీసైన్యాలు ఓడి పారిపోయారు. ఈకాలం నాటికి గుజరాతును కూడా కుతుబుద్దీన్ ఐబక్ కొల్లగొట్టగలిగాడు.

**ఇక్తియార్ ఉద్దీన్ ఖిల్జి ఆక్రమణలు :** కుతుబుద్దీన్ ఇక్తియార్ ఉద్దీన్ ఖిల్జి అను మరియొక సేనానిని తూర్పుప్రాంతాలు జయించమని పంపాడు. అతడు బీహారునాక్రమించి నలంద, విక్రమశిల, ఉద్దంతపురి, బౌద్ధవిశ్వవిద్యాలయాలను దోచుకొని వాటిని ధ్వంసం చేసి వేలకొలది బౌద్ధులను సంహరించాడు. ఆ తరువాత ఇక్తియార్ బెంగాల్‌ను ఆక్రమించాడు. ఆ తరువాత ఇక్తియార్ టిబెట్టు జయించవలెనని 1206 లో బయలుదేరి హిమాలయాలలో మరణించాడు.

**ఘోరీమరణం :** ఈ విధంగా 1205 నాటికి బెంగాల్ వరకు మహమ్మద్ వశం అయినది. కాని మధ్యాసియా యుద్ధాలలో ఘోరీమహమ్మద్ కు ఓటమి కలుగగా ఇండియాలో తిరుగుబాట్లు లేచాయి. ముఖ్యంగా జీలం, చీనాబ్ నదుల మధ్య నివశించు ఖఖోరా జాతివారు తిరుగుబాటు

చేశారు. ఆ తిరుగుబాటును అణచుటకు అతడు క్రీ.శ. 1205 లో వచ్చాడు. ఢిల్లీనుండి కుతుబుద్దీన్ ఐబక్ సైన్యంతో వచ్చాడు. వారిద్దరూ ఖఖోరాలను ఓడించి వారి అణచివేశారు. కొందరిని వధించారు కొందరిని బానిసలుగా చేశారు. వారిని అణచిన తరువాత ఘోరీ మహమ్మద్ క్రీ.శ. 1206 లో తన రాజధానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఓడి కసిపెంచుకున్న ఖఖోరా జాతివారు కొందరు షియా ముస్లింలను కలుపుకొని మార్గమధ్యంలో ఘోరీ మహమ్మద్‌పై దాడిచేసి అతనిని హత్య చేశారు. ఘోరీశవాన్ని గజనీకి తీసుకపోయి సమాధిచేశారు. ఆ విధంగా ఘోరీమహమ్మద్ జీవితం ముగిసింది. అతని మరణానంతరం ఇండియాలోని అతని సామ్రాజ్యభాగాలకు కుతుబుద్దీన్ అధిపతై స్వతంత్రం ప్రకటించి బానిసవంశాన్ని స్థాపించాడు. సింధు, ముల్తాను ప్రాంతాలలో అతనిచే నియమింపబడిన కుబాచా ఆ ప్రాంతాలను స్వంతం చేసుకున్నాడు. గజనీలో తాజుద్దీన్ ఇల్‌డజ్ స్వంతరాజ్యం ఏర్పాటు చేసుకున్నాడు. దానితో ఘోరీమహమ్మద్ సామ్రాజ్యం అతని మరణానంతరం మూడు ముక్కలైంది.

**24.5.6 ఘోరీ ఘనత :** ఘోరీ మహమ్మద్ గజనీ వంటి వీరుడు కాకపోయినను, అతనివలె ఇండియాలో రాజవంశాలన్నిటిని ఓడించి, ముస్లిం రాజ్యస్థాపన చేసినందున భారతదేశ చరిత్రలో గజనీకన్నా ఘోరీకే ప్రముఖస్థానం కలిగింది. అందువల్ల శ్రీ వాత్సవ, గజనీ కన్నా ఘోరీ మహమ్మద్ గొప్ప అని చెప్పాడు. ఘోరీ మహమూద్ గజనీ వలెనే సామ్రాజ్య స్థాపకుడేగాక సాహిత్యాభిమాని. ఫక్రుద్దీన్ రజి, నిజామి, ఉరూజ్ అను పండితులను పోషించాడు. ఏమయినా గజనీ మహమూద్‌లోని విశిష్ట గుణాలు, పరాక్రమం ఇతనికి లేవు. కనుక గజనీమహమూద్‌కే ఎక్కువ ఘనత ఏర్పడింది. కానీ ఘోరీమహమ్మద్ లో కార్యసాధన, రాజకీయ దక్షత, నిర్మాణాత్మక దృక్పధం ఎక్కువ. గనుక ఇండియాలో ముస్లిం రాజ్యాన్ని స్థాపించిన ఘనతను దక్కించుకున్నాడు.

**గజనీ, ఘోరీమహమ్మద్‌ల పోలిక :**

ఆశయాలు వేరు : భారతదేశాన్ని జయించవలెనని గజనీకి కోరికలేదు. పంజాబును తన దోపిడీలకు అనుకూలంగా ఉంటుందని మాత్రమే కలుపుకున్నాడు. కనుక గజనీ మహమూద్ ఇండియాకు సంబంధించినంతవరకు దోపిడీదారుడేకాని ఘోరీమహమ్మద్ ఇండియాలో రాజ్యస్థాపన చేయవలెనని సంకల్పం కలవాడు. అందువల్ల ఘోరీ రాజ్యం స్థాపించగా, గజనీదేశాన్ని కొల్లగొట్టి అశేష ధనరాసులను తీసుకువెళ్ళాడు.

దృక్పధం : గజనీమహమూద్ మతదృక్పధం కన్నా రాజకీయదృక్పధం ఎక్కువ కలవాడు అందువల్ల అతడు మధ్యాసియాలో గొప్ప సామ్రాజ్యాన్ని స్థాపించగలిగాడు. ఘోరీమహమ్మద్ రాజకీయ సామ్రాజ్యాని కన్నా మతసామ్రాజ్యానికే ఎక్కువ విలువ ఇచ్చాడు.

మతాభిమానం : వ్యక్తిగతంగా గజనీమహమూద్ తన మతంపై అమిత అభిమానం కలవాడు. కాని ఘోరీమహమ్మద్ ముస్లిం రాజ్యాన్ని స్థాపించినా వ్యక్తిగతంగా గజనీమహమూద్‌కున్నంత మతాభిమానం ఘోరీకి లేదు.

వీరత్వం : గజనీమహమూద్ గొప్ప యుద్ధవీరుడు. అపజయం ఎట్టిదో ఎరుగడు. గజనీతో పోల్చిన ఘోరీమహమ్మద్ వీరుడేకాదు. అతడు అనేక యుద్ధాలలో ఓడిపోయాడు. అతడు సాధించిన విజయాలలో చాలాభాగం అతని సేనాధిపతులు సాధించినవే. కనుక నాటి ప్రపంచంలో గజనీ అగ్రగణ్యుడు గా ప్రసిద్ధి చెందగా ఘోరీమహమ్మద్ ఒక మామూలు ముస్లింరాజుగా మాత్రమే గుర్తించబడినాడు.

సాహిత్య కళాపోషణాభిరుచి : గజనీ గొప్ప సాహిత్య కళాపోషకుడు. ఘోరీమహమ్మద్ కూడా కవులను పోషించాడు. కాని గజనీమహమూద్ లో ఉన్నంత ప్రగాఢ విద్యాసాహిత్య కళాభిమానం ఘోరీమహమ్మద్ లో కనిపించవు.

**24.6.1 వ్యక్తిత్వాలు :** గజనీమహమూద్ గొప్ప వీరుడైనప్పటికీ అతను అనేక రాజ్యాలను జయించాడేకాని ఆ ప్రాంతాల ప్రజలు, వారి స్థితిగతులు, పరిపాలన యందు శ్రద్ధతీసుకోలేదు. అంతేగాక వాటిని శాశ్వత విజయాలను చేయవలెనని తలంచలేదు. అనగా రాజకీయ, నిర్మాణాత్మక దూర దృష్టి కనిపించదు. (అనగా అలగ్జాండర్ వలె జయించాడే కాని ఆ దేశపరిపాలన ప్రజల స్థితిగతుల బాధ్యత తనది కాదన్నట్లు ప్రవర్తించాడు.) కాని ఘోరీమహమ్మద్ జయించిన ప్రాంతాలను స్థిరపరుచుకోవడానికి, అవి శాశ్వతంగా తన ఆధీనంలో ఉండునట్లు

చేసుకోవడానికి ప్రయత్నించి తన రాజకీయ దూరదృష్టితో పరిపాలనను ఏర్పరిచి నిర్మాణాత్మక పద్ధతిని ప్రదర్శించాడు. కనుక రాజకీయ దూరదృష్టితో గజనీకన్నా ఘోరీయే మిన్న అని శ్రీవాత్సవ అన్నాడు. కనుకనే గజనీ విజయాలు అనిశ్చితం కాగా ఘోరీ విజయాలు శాశ్వతమై 1857వరకు భారతదేశంలో ముస్లిం పాలన కొనసాగింది. యేమైనప్పటికి మహమ్మద్‌ఘోరి తన ఆశయాలను కార్యరూపంలో సాధించాడు. అతడు స్థాపించిన ముస్లిం రాజ్యం క్రమేపి బలపడి యావద్భారతదేశంలోనికి విస్తరించింది. ఘోరి గొప్ప విజేతగా నిలచాడు. తన దండయాత్రలద్వారా మధ్యాసియా, ఇండియాలో ముస్లిం సామ్రాజ్యానికి గట్టి పునాదిని వేశాడు. అట్లే మధ్యాసియలోగూడ తన సామ్రాజ్యాన్ని విస్తరించి గజనిమహమూద్ కన్నా విశాల సామ్రాజ్యానికి అధిపతి అయ్యాడు.

## 26.7 ఘోరిమహమ్మద్ చేతిలో హిందువులు ఓడిపోవడానికి కారణాలు

రాజపుత్రులు ధైర్యసాహసాలకు పెట్టింది పేరు. కాని వారు సులభంగా ఘోరిమహమ్మద్ చేతిలో ఓడిపోయారు. అందుకు చాలా కారణాలున్నాయి. హబిబుల్లా అను పండితుడు రాజపుత్రులు వ్యక్తిగత పోరాటాలలో తురుష్కులను మించినవారు అయినప్పటికి వారు ఓడిపోయారు అని అన్నాడు.

**రాజపుత్రుల అనైక్యత :** ముస్లింల విజయానికి ముఖ్యంగా రాజపుత్రులలో ఐక్యత లోపించడం ముఖ్యకారణమని చెప్పవచ్చును. ఆ కాలంలో ఉత్తర హిందూస్థానం చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయివున్నవి. వేరువేరు ప్రాంతాలలో వేరువేరు రాజవంశాలు పాలిస్తుండేవి. వారు తమలోతాము పరస్పర యుద్ధాలలో మునిగివున్నారు. ఒకరిపై ఒకరికి అసూయద్వేషాలుండేవి. జాతీయభావం అంటే ఏమిటి వారికి తెలియదు. కనీసం తామంతా ఒకమతానికి చెందిన వారమని తమ మతానికి ప్రమాదం వచ్చింది, కనుక ఐక్యతతో శత్రువుని ఎదిరించాలనే భావం గూడ వారికి లేదు. అంతఃకలహాలు మానుకొని ఉమ్మడిగా శత్రువుని ఎదిరించాలనే ఆలోచన వారికి రాలేదు. అందువలన ఒంటరిగా ఎదిరించి ఒకరి తరువాత ఒకరు ఓడిపోయారు.

**సైనిక లోపాలు :** ఇక రెండవకారణం రాజపుత్ర సైన్యంలోని లోపాలు. రాజపుత్రసైన్యం చాలా లోప భూయిష్టంగా వున్నది. మంచి ఆయుధాలు లేవు. రాజపుత్రులు ప్రధానంగా ఖడ్గాలతో పోరాడేవారు. ఏనుగులపై ఎక్కువగా ఆధారపడేవారు. పర్వతాకారంలో వుండే ఏనుగులు త్వరగా ముందుకు సాగేవికావు. ఒకొక్కసారి భయపడి ఏనుగులు వెనుకకు తిరిగి తమసైనికులనేత్రొక్కుకుంటూ పారిపోయేవి. ముస్లిం సైన్యాలు ధనుర్విద్యలో ప్రవీణులు.

**యుద్ధవిధానం :** రాజపుత్రులు యుద్ధాన్ని ఒక వీరోచిత క్రీడగా భావించేవారు. యుద్ధంలో తమ శౌర్యాన్నీ, ధైర్యసాహసాలను ప్రదర్శించడానికి ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చేవారు. యుద్ధంలో ఓడిపోతామనుకుంటే పారిపోయి మరలా సైన్యాలను కూర్చుకొని వచ్చి విజయం సాధించాలని భావించేవారు కాదు. అది పిరికి చర్యగా భావించేవారు. అందువలన ఓటమి సమయంలో వీరోచితంగా పోరాడి మరణించేవారు. దానితో వారి రాజ్యాలు సులభంగా ఘోరికి వశం అయ్యేవి. పృథ్వీరాజు, జయచంద్రుడు ఎవరూ పారిపోలేదు. యుద్ధభూమిలో మరణించారు. యుద్ధభూమిలో మరణిస్తే వీరస్వర్గం లభిస్తుందని నమ్మి మరణించేవారు. ఘోరీమహమ్మద్ సోలంకిభీముని చేతిలో ఒకసారి, పృథ్వీరాజు చేతిలో ఒకసారి, మధ్యాసియాలో అనేకసార్లు ఓడిపోయాడు. కాని ఆత్మహత్య చేసుకోలేదు. ఓటమి అవమానంగా భావించలేదు. మరలా సైన్యాలను కూర్చుకొని పోరాడి విజయాలు సాధించాడు. రాజపుత్రులు తమ పైకి వస్తేనే యుద్ధాలు చేద్దామని భావించేవారు కాదు. తామేముందు దాడులు చేసేవారు. యుద్ధంలో పారిపోవడం అవమానమని భావించే వారు. ఏదో రకంగా గెలవడం ముఖ్యం అని భావించేవారు. పైగా ఘోరి సైన్యం మధ్యాసియా యుద్ధాలలో ఆరితేరింది. రాజపుత్రులకు బయట యుద్ధ వ్యూహాలు తెలియవు. కనుక ఈశ్వరప్రసాద్ హిందూ ముస్లింల మధ్య జరిగిన యుద్ధాలు భిన్నమైన సామాజిక విధానాలకు చెందినవని అన్నాడు. హిందువులలో కులవ్యవస్థ వున్నది. క్షత్రియులు తప్ప మరెవ్వరు యుద్ధం చేయరు. సైన్యం ఓడిపోతే రాజ్యం సులభంగా స్వాధీనం అవుతుంది. ప్రజాప్రతిఘటన వుండదు. ముస్లింలు అట్లు కాదు. వారి సమాజంలో ప్రతి ఒక్కరు యుద్ధం చేస్తారు.

**మతావేశం :** హిందువులలో మతావేశం లేదు. తమ మతాన్ని వ్యాప్తిచేయలనే కోరిక లేదు. ముస్లింలు ఇతరులను ముస్లింలుగా మార్చడం పవిత్రకార్యంగా భావిస్తారు. అందువలన వారు జీహాద్ ప్రకటిస్తారు. కాని హిందువులకు జీహాద్ వంటి లక్ష్యాలు, ఉత్సాహాలు లేవు. పైగా హిందువులు తురుష్కులు గూడ అంతకుముందు దేశంలో ప్రవేశించిన కుషాణులు, శకులు, హూణుల వంటి వారని భావించారు. పంజాబును మాత్రం ఆక్రమించి దానితో తృప్తిపడతారని అనుకొన్నారు. అచటినుండి ముందుకు వచ్చి హిందూరాజ్యాలను జయిస్తారని భావించలేదు. ముస్లింల లక్ష్యాన్ని వారి ఆలోచనా సరళిని హిందువులు సరిగా అంచనా వేయలేదు. మత వ్యాప్తి ఒక పవిత్రకార్యంగా భావించి భారతదేశ ధనరాశులను దోచుకోవాలని ధృఢసంకల్పంతో వచ్చిన తురుష్కులముందు ఎట్టి లక్ష్యాలు లేని రాజపుత్రులు సులభంగా ఓడిపోయారు. లక్ష్యం వున్నవాడు లక్ష్యం కొరకు జీవిస్తాడు. లక్ష్యం మనిషిని శక్తివంతునిగా చేస్తుంది. లక్ష్యం లేని వాని జీవితం శక్తిహీనం.

**ముస్లిం సేనాధిపతుల దక్షత :** ముస్లిం సేనాపధిపతులు గొప్ప దక్షతగల్గినవారు. కుతుబుద్దీన్, ఐబక్, ఇక్తియార్ ఖిల్జీలు గొప్ప సాహసం గల్గినవారు. వారు వారి ప్రభువును విశ్వాసంతో కొల్చి సుల్తాన్ దేశంలో లేకపోయినా దండయాత్రలు జరిపి రాజ్యాన్ని విస్తరించారు. అట్టి సేనాధిపతులు రాజపుత్ర రాజులకు లేరు. బానిసత్వం కూడా ముస్లింల విజయాలకు కారణమైంది. ముస్లింలు తమ బానిసలకు సైనిక శిక్షణ ఇచ్చి యుద్ధాలలో ఉపయోగించుకుంటారు. యుద్ధాలలో విజయాలు సాధిస్తే తమ బానిసత్వాలు పోతాయని, స్థానిక పాలకులుగా ఉన్నత ఉద్యోగాలు వస్తాయని బానిసలు ప్రాణాలకు తెగించి పోరాడేవారు. పృథ్వీరాజా- జయచంద్రుల కలహాలు ముస్లింలకు ఉపయోగపడ్డాయి. ఘోరి దండెత్తిన సమయంలో హిందూస్థానంలో అతిబలవంతులు ఘోరిని ఓడించి తరిమివేయగల్గిన పృథ్వీరాజా జయచంద్రుల మధ్య అంతఃకలహాలు ఘోరిమహమ్మద్ కు ఉపయోగపడ్డాయి. వారిద్దరు ఒకటిగా వుండి ఘోరిని ఎదిరించినట్లయితే హిందూస్థాన్ ను జయించడం ఘోరికి సాధ్యంకాకపోయేది. రాజపుత్రుల పరస్పర ద్వేషాలు, అసూయద్వేషాలు, అనైక్యత ఘోరిమహమ్మద్ కు కలసివచ్చాయి. గజనిమహమూద్ సోమనాధ దేవాలయాన్ని ధ్వసంం చేసిన 168 సంవత్సరాలకు తరాయిన్ యుద్ధం జరిగింది. ఈ మధ్య కాలంలో హిందువులు చరిత్ర గుణపాఠాన్ని నేర్చుకొలేదు. వారు గజని భీభత్సలను తలచుకొని ఐక్యతగా వుంటే రాజపుత్రులు ఓడిపోయేవారుకాదు. దేశరాజకీయాలను వారు సక్రమంగా అర్థం చేసుకోలేదు. ఎవరికివారు ఒంటరిగా పోరాడి ఘోరిమహమ్మద్ దండయాత్రలకు ఆహుతి అయిపోయారు. ఘోరిమహమ్మద్ మరణం తరువాత 1206 లో కుతుబుద్దీన్ ఢిల్లీ సుల్తానేట్ ను స్థాపించాడు.

## 24.8 సారాంశం :

మహమ్మదీయ దండయాత్ర కాలం నాటికి భారతదేశంలోని రాజ్యాలలో రాజులకు సమైక్యత అనేది లేదు. సైనిక బలం లేదు. ఒకరిని ఒకరు కలహించుకొనసాగిరి. విలాసవంతముగా ఉండటానికి అలవాటుపడినారు. మహమ్మదీయ రాజులలో ఘోరీ, గజని, కుతుబుద్దీన్ వీరు సుప్రసిద్దులు. వీరి కాలంలో ఎంతో సంపదను మహమ్మదీయులు దోచుకొన్నారు. గజనీ మహమ్మద్ భారతదేశంపై 18 సార్లు దండయాత్రలు చేసి సంపదను కొల్లగొట్టడం కాక భారతదేశంలో దేవాలయాలను కొల్లగొట్టాడు. రాజపుత్రుల పాలన అనేది అంతమై మహమ్మదీయుల పాలనకు నాంది పలికింది.

## 24.9 మాదరి ప్రశ్నలు

1. సింధుపై దండయాత్రలు, సింధు ఆక్రమణలు గూర్చి వ్రాయుము ?

2. గజనీ మహమ్మద్ చరిత్ర గురించి పూర్తిగా వ్రాయుము ?

3. ఘోరి మహమ్మద్ గురించి వ్రాయుము ?

4. ఘోరి మహమ్మద్ చేతిలో హిందువులు ఓడిపోవటానికి గల కారణాలు తెలుపుము ?

5. కుతుబుద్దీన్ దండయాత్రలు, విజయాలను తెలుపుము ?

## సంక్షిప్త ప్రశ్నలు

1. అరబ్బులు సింధుపై దండెత్తిన నాటికి భారతదేశ పరిస్థితులను తెలుపుతూ, భారతదేశంపై దండెత్తటానికి కారణాలు వ్రాయుము?
2. సింధు ఆక్రమణకు గల ముఖ్య కారణం ?
3. సింధుని ముస్లింలు జయించుటకు గల కారణాలు తెలుపుతూ భారతదేశాన్ని అరబ్బులు జయించలేకపోవుటకు గల కారణాలు వ్రాయుము ?
4. సింధు ఆక్రమణ ఫలితాలను తెలుపుము ?
5. తరాయిన్ యుద్ధం గూర్చి, ప్రాముఖ్యతను గూర్చి తెలుపుము ?
6. గజనీ, ఘోరీ మహమ్మద్‌ల పోలిక, వ్యక్తిత్వాలు తెలుపుము ?
7. ఘోరి ఘనతను తెలుపుము ?

## SUGGESTED READING


1. Altekar.A.S. : 'The Rastrakutas and their times', Poona 1967
2. Devahuti.D. : 'Harsha : A political Study', Delhi, 1983.
3. Ghosh. A : 'Nalanda', Delhi 1971
4. Habibullah. A.B.M : The Foundations of Muslim Rule
5. Haig, Wolseley (ed) : The Cambridge History of India. Vol III
6. Ishwari prasad : 'Short History of Muslim Rule in India'.
7. Nilakanta Sastry. K.A : The Colas, Madras 1984
8. Majumdar. R.C (ed) : 'The Classical Age', Bombay.
9. Majumdar R.C (ed) : 'The Age of Imperial Kanauj, 1964 Bombay.
10. Majumdar, R.C (ed) : 'The struggle for Empire, Bombay.
11. Sankalia. H.D : 'The University of Nalanda', Madras 1934
12. Sharma. L.P : The Sultanate of Delhi, New Delhi 1988
13. Tripathi. R.S : Hisoty of Kanauj, Banaras 1937
14. Yazdani. G : the early History of the Deccan, Oxford.


డా॥ యమ్. హనుమంతరావు